بيان معاني القرآن الكريم باللغة التلغو

# బయానున్ మ'ఆని
# అల్ ఖుర్ఆన్ అల్ కరీమ్
## తెలుగు భావార్థము వివరణ

డాక్టర్ అబ్దుర్-రహీమ్ బిన్ ముహమ్మద్ మౌలానా

موسوعة القرآن الكريم
QuranEnc.com

బయానున్ మ'ఆని

# అల్ ఖుర్ఆన్ అల్ కరీమ్

తెలుగు భావార్ధము వివరణ

డాక్టర్ అబ్దుర్-రహీమ్ బిన్ ముహమ్మద్ మౌలానా

QuranEnc.com

ⓒ جمعية خدمة المحتوى الإسلامي باللغات، ١٤٤٥ هـ

جمعية خدمة المحتوى الإسلامي
بيان معاني القرآن - تلغو (بدون نص عربي) . / جمعية خدمة
المحتوى الإسلامي
- ط١. . - الرياض، ١٤٤٥ هـ
٩١٧ ص ؛ .. سم

رقم الإيداع : ١٤٤٥/٢٤٦٠٢
ردمك : ٩٧٨-٦٠٣-٨٤٥٢-٢٢-٦

**الطبعة الأولى ١٤٤٦ هـ**
**للتحقق من التحديثات**

20-02-2024 (V1.0.6)
للتواصل: info@quranenc.com

**نحو توفير تفاسـير وتراجم موثوقة لمعاني القرآن بلغات العالم**

جمعية الربوة

المحتـوى الإسلامـي

# ముందుమాట

అల్ ఖుర్ఆన్ అల్ కరీమ్ సకల లోకాల ప్రభువు మరియు సృష్టికర్త అయిన అల్లాహ్ వాక్కు. మానవాళికి వారి సృష్టి ఉద్దేశ్యాన్ని అందజేసేందుకు; ఇహలోకంలోనూ, పరలోకంలోనూ వారికి సుఖసంతోషాలు ప్రసాదించే సన్మార్గం వైపు మార్గదర్శకత్వం చేసేందుకు; మరణానంతరం ఎదుర్కోబోయే శాశ్వతమైన దుఃఖం నుండి వారు విముక్తి పొందేందుకు; అల్లాహ్ దానిని తన అంతిమ ప్రవక్త మరియు సందేశహరుడైన ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై అవతరింపజేసినాడు. ఇది దైవగ్రంథాల పరంపరలో చిట్టచివరిది, పూర్వ దైవగ్రంథాలలో ఇంకా మిగిలి ఉన్న సత్యాన్ని ధృవీకరిస్తున్నది మరియు వాటిలోని (ఈ సమాజానికి ఉపయోగపడే) దైవాదేశాలను పునః ప్రకటిస్తున్నది.

పవిత్ర ఖుర్ఆన్ ఒక అమోఘమైన సంకేతం మరియు (ప్రళయ దినం వరకు నిలిచి ఉండే) ఒక శాశ్వత మహిమ మరియు అద్భుతం. ఇది అల్లాహ్ యొక్క అంతిమ సందేశహరుడైన ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క ప్రవక్తత్వానికి ఒక దృఢమైన నిదర్శనం. అల్లాహ్ మానవాళిని మరియు జిన్నాతులను ఇలాంటి దానిని (ఖుర్ఆన్ వంటి దానిని తయారు చేసి) తీసుకు రమ్మని సవాలు చేశాడు - దానిలోని కనీసం ఒక అధ్యాయాన్ని పోలిన దానినైనా సరే. అయినప్పటికీ, వారు అలా చేయలేక పోయారు.

1400 ఏళ్ళ క్రితం అవతరించినప్పటి నుండి నేటి వరకు,

ఖుర్ఆన్ వచనాలను వక్రీకరించే మరియు మార్పులు చేర్పులు చేసేవారి హస్తం దానిని చేరుకోలేకపోయింది. అది అవతరించిన అరబీ భాషలో సురక్షితంగా భద్రపరచబడి ఉన్నది. ఎందుకంటే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అంతిమఘడియ వరకు దాని సంరక్షణను నిర్ధారించి ఉన్నాడు.

పవిత్ర ఖుర్ఆన్ గ్రంథం ఇస్లాం ధర్మం యొక్క ప్రధాన మూలాధారం. అది అన్ని సమయాలలో మరియు అన్ని ప్రదేశాలలో మానవ జీవితాన్ని నియంత్రించే, శాసించే మరియు పరిపాలించే దైవిక చట్టం. ఇది సకల లోకాల సృష్టికర్త అయిన అల్లాహ్ ను మాత్రమే ఆరాధించమని పిలుపునిస్తుంది. మానవుడు తన ప్రభువు గురించి మరియు తన అసలు ధర్మాన్ని గురించి తెలుసుకోవలసిన ఆవశ్యకత ఏమిటో చూపిస్తున్నది. విశ్వసృష్టి ఆరంభం, మానవసృష్టి యొక్క దశల గురించి, ఇంకా భూత భవిష్యత్తుల గురించి తెలుపుతుంది; పూర్వ ప్రవక్తల (అలైహిమ్ అస్సలాం) గాథల గురించి, అల్లాహ్ వారికి ఎలా సహాయం చేసాడో మరియు వారి శత్రువులను ఎలా నాశనం చేసాడో తెలుపుతున్నది; ఇంకా ఆరాధనల మరియు లావాదేవీల నియమ నిబంధనల గురించి తెలుపుతుంది; ప్రశంసనీయమైన నైతిక విలువల వైపు పిలుపునిస్తుంది; ఖండించదగిన చెడు అలవాట్లు, దుర్గుణాలకు వ్యతిరేకంగా హెచ్చరిస్తుంది; ఇంకా విశ్వాసుల శాశ్వత నిలయం స్వర్గమని, పాపం చేసే ప్రజల మరియు అవిశ్వాసుల శాశ్వత నిలయం నరకమని తెలియజేస్తుంది; ఇంకా పరలోకం లోని విధివ్రాత గురించిన వివరాలు కలిగి ఉన్నది.

ఈ మహా దివ్యగ్రంథం యొక్క ప్రాముఖ్యత కారణంగా, అల్లాహ్ దీనిని అరబీభాషలో పంపినాడు మరియు దానిని

మానవాళికి అందజేయమని ఆదేశించాడు;

**ప్రియమైన పాఠకులారా!**

దాని అవగాహనను సులభతరం చేసేందుకు మరియు దానితో గట్టి సంబంధం ఏర్పరుచుకునేందుకు వీలుగా, మీ భాషలో దాని భావార్థం యొక్క అనువాదాన్ని మీకు అందించడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నది. ఏదేమైనా అనువాదం ఎంత ఖచ్చితమైనది అయినప్పటికీ, అది మానవ శక్తికి మించిన పనే. పవిత్ర ఖుర్ఆన్ లో ప్రస్తావించబడిన అద్భుత వచనాల గొప్ప అర్థాలను ప్రదర్శించేంత స్థాయికి చేరుకోజాలదు. అందువలన దానిని చక్కగా అర్థం చేసుకునేందుకు, మీరు అరబీ భాష నేర్చుకోవాలని గట్టిగా సిఫారసు చేస్తున్నాము.

**ప్రవక్తలపై శాంతి కురుయుగాక మరియు సకల ప్రశంసలు, కృతజ్ఞతలు కేవలం సర్వలోకాల ప్రభువైన అల్లాహ్ కే శోభిస్తాయి.**

పవిత్ర ఖుర్ఆన్ ఎన్సైక్లోపీడియా వెబ్సైట్

**(www.quranenc.com)**

లోని ప్రతి ఆయతు ముందు ఒక నోట్స్ విండో ఉన్నది. ఆ నోట్స్ విండో ద్వారా, ఈ అనువాదాన్ని ఇంకా అభివృద్ధి చేయడానికి మీ సూచనలు మరియు వ్యాఖ్యలను స్వీకరించడానికి మేము సంతోషంగా ఎదురు చూస్తున్నాము. మీరు మాతో

**సంప్రదించాలనుకుంటే,**

**తప్పక మాకు ఇమెయిల్ చేయండి**

**info@quranenc.com**

# సూచిక


| # | సూరహ్ పేరు | పేజీ |
|---|---|---|
| 1 | అల్-ఫాతిహ్ | 9 |
| 2 | అల్-బఖరహ్ | 13 |
| 3 | ఆలె ఇమ్రాన్ | 134 |
| 4 | అన్-నిసా | 197 |
| 5 | అల్-మాఇదహ్ | 266 |
| 6 | అల్-అన్ఆమ్ | 315 |
| 7 | అల్-అరాఫ్ | 368 |
| 8 | అల్-అన్ఫాల్ | 427 |
| 9 | అత్-తౌబహ్ | 449 |
| 10 | యూనుస్ | 497 |
| 11 | హూద్ | 527 |
| 12 | యూసుఫ్ | 561 |
| 13 | అర్-రఅద్ | 590 |
| 14 | ఇబ్రాహీమ్ | 608 |
| 15 | అల్-హిజ్ర్ | 623 |
| 16 | అన్-నహల్ | 640 |
| 17 | అల్-ఇస్రా | 676 |
| 18 | అల్-కహఫ్ | 709 |
| 19 | మర్యమ్ | 737 |
| 20 | తా హా | 757 |
| 21 | అల్-అంబియా | 785 |
| 22 | అల్-హజ్ | 811 |
| 23 | అల్-మూమినూన్ | 835 |
| 24 | అన్-నూర్ | 856 |
| 25 | అల్-ఫుర్'ఖాన్ | 878 |
| 26 | అష్-షుఅరా | 897 |
| 27 | అన్-నమల్ | 926 |
| 28 | అల్-ఖసస్ | 948 |
| 29 | అల్-అంకబూత్ | 974 |
| 30 | అర్-రోమ్ | 994 |
| 31 | లుఖ్మాన్ | 1009 |
| 32 | అస్-సజ్'దహ్ | 1018 |
| 33 | అల్-అహ్'జాబ్ | 1025 |
| 34 | సబా | 1051 |
| 35 | ఫాతిర్ | 1067 |
| 36 | యా-సీన్ | 1081 |
| 37 | అస్-సాఫ్ఫాత్ | 1095 |
| 38 | సాద్ | 1118 |
| 39 | అజ్-జుమర్ | 1133 |
| 40 | గాఫిర్ | 1153 |
| 41 | ఫుశ్'శిలత్ | 1174 |
| 42 | అష్-షూరహ్ | 1188 |
| 43 | అల్-జుఖ్'రుఫ్ | 1205 |
| 44 | అద్-దుఖ్'ఖాన్ | 1221 |
| 45 | అల్-జాథియహ్ | 1229 |
| 46 | అల్-అహ్'ఖాఫ్ | 1237 |
| 47 | ముహమ్మద్ | 1249 |
| 48 | అల్-ఫతహ్ | 1260 |
| 49 | అల-హుజురాత్ | 1271 |
| 50 | ఖాఫ్ | 1277 |
| 51 | అద్-దారియాత్ | 1285 |
| 52 | అత్'తూర్ | 1294 |
| 53 | అన్-నజమ్ | 1301 |
| 54 | అల్-ఖమర్ | 1311 |
| 55 | అర్-రహ్మాన్ | 1319 |

| # | సూరహ్ పేరు | పేజీ |
|---|---|---|
| 56 | అల్-వాఖియహ్ | 1329 |
| 57 | అల్-హదీద్ | 1339 |
| 58 | అల్-ముజాదిలహ్ | 1352 |
| 59 | అల్-హష్ర్ | 1361 |
| 60 | అల్-ముమ్తహినహ్ | 1371 |
| 61 | అస్-సఫ్ | 1379 |
| 62 | అల్-జుముఅహ్ | 1384 |
| 63 | అల్-మునాఫిఖూన్ | 1387 |
| 64 | అత్-తగాబూన్ | 1391 |
| 65 | అత్-తలాఖ్ | 1396 |
| 66 | అత్-తహ్రీమ్ | 1401 |
| 67 | అల్-ముల్క్ | 1407 |
| 68 | అల్-కలమ్ | 1413 |
| 69 | అల్-హాఖ్ఖహ్ | 1421 |
| 70 | అల్-మఆరిజ్ | 1427 |
| 71 | నూహ్ | 1433 |
| 72 | అల్-జిన్ | 1438 |
| 73 | అల్-ముజ్జమ్మిల్ | 1445 |
| 74 | అల్-ముద్దథ్థిర్ | 1449 |
| 75 | అల్-ఖియామహ్ | 1455 |
| 76 | అల్-ఇన్సాన్ | 1459 |
| 77 | అల్-ముర్సలాత్ | 1465 |
| 78 | అన్-నబఅ | 1470 |
| 79 | అన్-నాజియాత్ | 1475 |
| 80 | అబస | 1480 |
| 81 | అత్-తక్వీర్ | 1484 |
| 82 | అల్-ఇన్ఫితార్ | 1488 |
| 83 | అల్-ముతఫ్ఫిఫీన్ | 1490 |
| 84 | అల్-ఇంషిఖాఖ్ | 1495 |

| # | సూరహ్ పేరు | పేజీ |
|---|---|---|
| 85 | అల్-బురుజ్ | 1498 |
| 86 | అత్-తారిఖ్ | 1501 |
| 87 | అల్-ఆలా | 1503 |
| 88 | అల్-గాషియహ్ | 1505 |
| 89 | అల్-ఫజ్ర్ | 1507 |
| 90 | అల్-బలద్ | 1511 |
| 91 | అష్-షమ్స్ | 1514 |
| 92 | అల్-లైల్ | 1516 |
| 93 | అద్-దుహా | 1518 |
| 94 | అష్-షరహ్ | 1520 |
| 95 | అత్-తీన్ | 1522 |
| 96 | అల్-అలఖ్ | 1524 |
| 97 | అల్-ఖద్ర్ | 1527 |
| 98 | అల్-బయ్యినహ్ | 1529 |
| 99 | అల్-జల్'జలహ్ | 1531 |
| 100 | అల్-ఆదియాత్ | 1533 |
| 101 | అల్-ఖారిఅహ్ | 1535 |
| 102 | అత్-తకాసుర్ | 1537 |
| 103 | అల్-అస్ర్ | 1539 |
| 104 | అల్-హుమజహ్ | 1540 |
| 105 | అల్-ఫీల్ | 1542 |
| 106 | ఖురైష్ | 1543 |
| 107 | అల్-మాఊన్ | 1544 |
| 108 | అల్-కౌథర్ | 1546 |
| 109 | అల్-కాఫిరూన్ | 1547 |
| 110 | అన్-నస్ర్ | 1548 |
| 111 | అల్-మసద్ | 1549 |
| 112 | అల్-ఇఖ్లాస్ | 1550 |
| 113 | అల్-ఫలఖ్ | 1551 |
| 114 | అన్-నాస్ | 1552 |

# 1. అల్-ఫాతిహా్ [*]

1. అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్[1] పేరుతో[2].

---

[*] [అల్ ఫాతిహా్ – ఆరంభము]

[1] అల్లాహ్ సుబ్'హానవతా'ఆలా (సు.తా.): అనేది సర్వసృష్టికర్త, మహోన్నతుడు, సర్వపోషకుడు అయిన విశ్వప్రభువు యొక్క పేరు. ఈ పేరుతో ఆయనను తప్ప మరెవ్వరినీ పిలువరాదు. దీనికి సరి సమానమైన పదం వేరే భాషలలో లేదు, ఫార్సీ భాషలోని 'ఖుదా అనే పదం తప్ప. ఇది ఒక ప్రత్యేకమైన విశేషపదం. ఈ పదానికి బహువచనం గానీ, స్త్రీలింగం గానీ లేవు. అల్లాహ్ (సు.తా.) యొక్క స్పష్టమైన నిర్వచనం కొరకు చూడండి, సూరహ్ అల్-ఇ'ఖ్లాస్ (112).

[2] చాలా మంది వ్యాఖ్యాతల అభిప్రాయంలో, ఈ ఆయత్, సూరహ్ అల్ ఫాతి'హా్ యొక్క భాగం. సూరహ్ అన్'నమ్ల్ (27:30) లో ఇది ఒక ఆయత్ రూపంలో కూడా ఉంది. ప్రతి మంచి పనికి ముందు బిస్మిల్లా హిర్'హ్'మా నిర్ర'హీమ్, చదవాలి. ఉదా: భోజనానికి ముందు, వ'దూ చేసేటప్పుడు. ఖుర్ఆన్ పఠించటం ప్రారంభించేటప్పుడు బిస్మిల్లా హిర్ర'హ్ మా నిర్ర'హీమ్ కు ముందు అ'ఊజు' బిల్లాహి మినష్షయ్'తా నిర్రజీమ్ - శపించ(బహిష్కరించ)బడిన షైతాన్ నుండి రక్షించబడటానికి నేను అల్లాహ్ (సు.తా.) శరణు వేడుకుంటున్నాను - తప్పక చదవాలి. (చూడండి అల్లాహుతా'ఆలా ఆదేశం, 16:98). దివ్యఖుర్ఆన్ మానవులకు మార్గదర్శిని మరియు హృదయాలకు స్వస్థతనిచ్చేది. షై'తాన్ మార్గభ్రష్టత్వానికి మరియు దురాచారాలకు ప్రోత్సహిస్తాడు. కావున శపించ(బహిష్కరించ)బడిన షై'తాన్ మరియు అతడి అనుచర మూకలు రేకెత్తించే కలతల నుండి కాపాడుకోవటానికి అల్లాహుతా'ఆలా శరణు వేడుకోవాలి. ఈ ఇస్తి'ఆజ'హ్ దివ్యఖుర్ఆన్ యొక్క భాగం కాదనటంలో ఇస్లామీయ శాస్త్రవేత్తలు అందరూ ఏకీభవిస్తున్నారు. కాబట్టి ఇది దివ్యఖుర్ఆన్ లో వ్రాయబడలేదు.

**2.** సర్వలోకాలకు ప్రభువైన[3] అల్లాహ్ మాత్రమే సమస్త స్తోత్రాలకు అర్హుడు[4].

**3.** అనంత కరుణామయుడు, అపార కరుణా ప్రదాత[5].

**4.** తీర్పుదినానికి[6] స్వామి[7].

---

[3] రబ్బున్: ప్రభువు, అనే పదానికి తెలుగులో సరితూగే పదం లేదు. దీనికి సర్వలోకాల ఏకైక ప్రభువు, వాటి సృష్టికర్త, పోషకుడు, సంరక్షకుడు, యజమాని, సర్వవర ప్రదాత అనే అర్థాలున్నాయి. చాలా వరకు తెలుగు అనువాదాలలో వాడినట్లు ఈ అనువాదంలో కూడా ప్రభువు అనే పదమే వాడబడింది.

[4] 'హదీస్'లో వచ్చింది: లా ఇలాహ ఇల్లల్లాహ్ - అల్లాహ్ (సు.తా.) తప్ప మరొక ఆరాధ్యదేవుడు లేడు. అతి ఉత్తమమైన జిక్ర్ (Meditation) జ్ఞాపిక, స్మరణ, ధ్యానం మరియు అల్'హమ్దులిల్లాహ్-సమస్తస్తోత్రాలకుఅర్హుడుఅల్లాహుతా'ఆలా మాత్రమే, అతి ఉత్తమమైన దు'ఆ'- ప్రార్థన (తిర్మిజీ', నసాయీ' మొదలైనవారు)

[5] అర్-ర'హ్మాన్: అనంత కరుణామయుడు, అంటే ఇహలోకంలో భేదభావాలు లేకుండా అందరికీ ఎల్లప్పుడూ కరుణను పంచేవాడు. అర్-ర'హీమ్: అంటే పరలోకంలో కేవలం ఆయనను విశ్వసించిన వారికే కరుణాప్రదాత, అని కొందరు వ్యాఖ్యానించారు. ఇవి అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లు.

[6] యౌముద్దీన్: తీర్పుదినం, అంటే పునరుత్థాన దినం. ఆ దినపు యజమాని కేవలం ఆ ఒకే ఒక్క ఆరాధ్య దేవుడు అల్లాహ్ (సు.తా.) మాత్రమే. ఆ రోజు ప్రతివానికి, తన కర్మలకు తగిన ప్రతిఫలం ఇవ్వ బడుతుంది. ఎవ్వరికీ ఏ విధమైన అన్యాయం జరుగదు. ఆ రోజు, అల్లాహుతా'ఆలా అనుమతించిన వాడు తప్ప మరెవ్వరికీ మాట్లాడే హక్కు ఉండదు. వారు దైవదూతలు గానీ లేక ప్రవక్త ('అలైహిమ్ స.) లు గానీ కావచ్చు. వారు అల్లాహ్(సు.తా.) అనుమతించిన వారికొరకు మాత్రమే సిఫారసు చేస్తారు.

[7] మాలిక్: Master, Owner, ప్రతిదాని నిజ స్వామి, యజమాని, కర్త, పెద్ద, నాయకుడు అనే అర్థాలున్నాయి. చూడండి, 20:114 వ్యాఖ్యానం 2.

5. మేము నిన్నే ఆరాధిస్తున్నాము మరియు నీ సహాయాన్నే అర్థిస్తున్నాము[8].

6. మాకు ఋజుమార్గం[9] వైపునకు

[8] 'ఇబాదతున్: ఆరాధన, అంటే ఒకరి ప్రసన్నత కొరకు అత్యంత వినయ విధేయత, నమ్రత, మరియు భీతిని ప్రదర్శించటం. ఇది కేవలం అల్లాహ్ (సు.తా.) కొరకు మాత్రమే తగినది. మానవుడు కేవలం ఆ ఒకే ఒక్క ఆరాధ్య దైవం అయిన అల్లాహుతా'ఆలాను మాత్రమే ఆరాధించాలి. మరియు ప్రతి విషయం, ప్రతి కార్యంలో కేవలం ఆయన సహాయాన్నే అర్థించాలి. తౌ'హీద్: మూడు విధాలు - (1)తౌ'హీద్ అర్-రుబూబియ్యహ్: ఏకైక ప్రభువు అల్లాహ్ (సు.తా.) అని విశ్వసించటం. సర్వాన్ని సృష్టించినవాడు, దాని అధిపతి, సర్వ వ్యవహారాలను నడిపించేవాడు మరియు పోషకుడు కేవలం ఆ ఏకైక ప్రభువు అయిన అల్లాహుతా'ఆలా మాత్రమే అని, విశ్వసించడం. కాని బహుదైవారాధకులు (ముష్రికులు) దీనిని నమ్మి కూడా ఆయనకు సాటి కల్పిస్తున్నారు. ఎంత తప్పుడు మార్గంలో పడి ఉన్నారు వారు! చూడండి, 10:31, 39:38, 23:84-89. (2)తౌ'హీద్ అల్-'ఉలూహియ్యహ్: ప్రతి విధమైన ఆరాధనకు అర్హుడు కేవలం అల్లాహ్ (సు.తా.) మాత్రమే. ఆరాధన అంటే అల్లాహుతా'ఆలా ప్రీతి లేక భయం కొరకు చేసే ప్రతి కార్యం. కావున, నమా'జ్, ఉపవాసం, 'జకాత్ మొదలైనవి, ఆ గొప్ప శక్తి (అల్లాహుతా'ఆలా) ప్రీతి కొరకే చేయటం. ఆరాధనలన్నింటికీ అర్హుడు, కేవలం అల్లాహ్ (సు.తా.) అని విశ్వసించటం. (3)తౌహీద్ అల్-అస్మా'వస్సిఫాత్: అల్లాహుతా'ఆలా పేర్లు మరియు గుణవిశేషాలను ఏ విధమైన మార్పు చేయకుండా విశ్వసించడం. అల్లాహుతా'ఆలా తప్ప ఇతరులను ఈ గుణవిశేషాలతో సంబోధించరాదు. అల్లాహ్ (సు.తా.) మరియు ఆయన ప్రవక్త ('స'అస) వివరించిన పేర్లు మరియు గుణవిశేషాలతో తప్ప ఇతర పేర్లతో ఆయనను సంబోధించరాదు.

[9] ఋజుమార్గం అంటే, అంతులేని సర్వసుఖసంతోషాలు గల శాశ్వత స్వర్గాన్ని పొందే మార్గం. దానిని పొందటానికి మానవుడు తన ఆరాధనను కేవలం అల్లాహ్ (సు.తా.) కే ప్రత్యేకించుకొని, సత్కార్యాలు చేయాలి. అల్లాహుతా'ఆలాను తప్ప మరెవ్వరినీ ఆరాధ్యదైవాలుగా చేసుకోరాదు.

మార్గదర్శకత్వం చేయి.

7. నీవు అనుగ్రహించిన[10] వారి మార్గం మాత్రమే (చూపు).
నీ ఆగ్రహానికి[11] గురి అయిన వారి (మార్గం కానీ) లేక మార్గభ్రష్టులైన వారి (మార్గం కానీ) కాదు.

---

[10] అల్లాహ్ (సు.తా.) అనుగ్రహించిన వారి మార్గం అంటే దైవప్రవక్తల, వారిని అనుసరించిన సత్పురుషుల మరియు పుణ్యపురుషుల మార్గం. వారు సన్మార్గం పొంది, దానిపైననే నడిచారు. అదే అల్లాహుతా'ఆలాకు విధేయులవటం (ఇస్లాం). అదే స్వర్గానికి అర్హులు చేసే మార్గం. అల్లాహ్ (సు.తా.) ఆదేశం: "మరియు ఎవరు అల్లాహుతా'ఆలాకు మరియు ప్రవక్తకు విధేయులై ఉంటారో, అలాంటివారు అల్లాహ్ (సు.తా.) అనుగ్రహం పొందిన ప్రవక్తలతోనూ, సత్యవంతులతోనూ, అల్లాహుతా'ఆలా ధర్మం కొరకు ప్రాణాలు కోల్పోయిన అమర వీరు(షహీద్)లతోనూ, సద్వర్తనులతోనూ చేరి ఉంటారు. మరియు అలాంటి వారి సాంగత్యం ఎంతో మేలైనది." (4:69)

[11] మ'గ్దూబి 'అలైహిమ్: అల్లాహ్ (సు.తా.) ఆగ్రహానికి గురైనవారు అంటే - యూదులు. ఎందుకంటే వారు బుద్ధిపూర్వకంగా సన్మార్గాన్ని త్యజించారు. దివ్యసూచనలను మార్చారు. 'ఉ'జైర్ ('అ.స.)ను, అల్లాహు తా'ఆలా కుమారుడు అన్నారు. తమ విద్వాంసుల (అ'హ్బారు) లకు ధర్మసమ్మతం ('హలాల్) మరియు నిషిద్ధం ('హరామ్) చేసే హక్కు ఉందన్నారు. 'దాల్లీన్: మార్గభ్రష్టులైనవారు - అంటే క్రైస్తవులు. ఎందుకంటే వారు 'ఈసా మసీ'హ్ (ఏసూ క్రీస్తు 'అ.స.)ను అల్లాహ్ (సు.తా.) కుమారుడు అని కొందరు మరియు ముగ్గురు ఆరాధ్యదైవా(Trinity)లలో ఒకరు అని మరికొందరు అన్నారు, (ఫ'త్హ్ అల్-ఖదీర్). ఆమీన్1: ఓ అల్లాహ్ (సు.తా.)! మా దు'ఆ (ప్రార్థన)ను అంగీకరించు. సూరహ్ అల్ ఫాతి'హ్ తరువాత ఆమీన్ అనటాన్ని దైవప్రవక్త ('స'అస) ఎంతో ప్రాధాన్యత నిచ్చారు మరియు ఎంతో ఉత్తమమైనదని అన్నారు. దీనిని ముందు నిలిచి నమా'జ్ చేయించేవాడు (ఇమామ్) మరియు ఇమామ్ వెనుక నమా'జ్ చేసేవారు (ముఖ్త'దీలు) అందరూ అనాలి. పెద్ద స్వరంతో చదివే నమా'జ్ లలో పెద్ద స్వరంతో అనాలి (ఇబ్నె-మాజా, ఇబ్నె-కసీ'ర్).

# 2. అల్-బఖరహ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. అలిఫ్-లామ్-మీమ్[1]
2. ఇది (ఈ ఖుర్ఆన్) ఒక దివ్య గ్రంథం; ఇందులో ఏ మాత్రం సందేహం లేదు. దైవభీతి[2] గలవారికి ఇది మార్గదర్శకత్వము.
3. (వారికి) ఎవరైతే అగోచర యథార్థాన్ని[3] విశ్వసిస్తారో, నమాజ్ ను స్థాపిస్తారో[4] మరియు

---

[*] [అల్-బఖరహ్ - ఆవు]

[1] సూరహ్ (అధ్యాయం) ప్రారంభంలో ప్రస్తావించబడిన ఈ విడి విడి అక్షరాలు ఖున్ఆన్ యొక్క అద్భుత స్వభావాన్ని సూచిస్తున్నాయి. ఇది బహుదైవారాధకుల ముందు పెట్టబడిన ఒక గొప్ప సవాలు, మరియు అరబ్బుల భాషలో ఈ అక్షరాలు ఉన్నప్పటికీ వారు ఈ విడి విడి అక్షరాలు ఇలా ప్రస్తావించబడటాన్ని వ్యతిరేకించ లేకపోయారు. అరబ్బులు ఆనాటి ప్రజలలో అత్యంత వాగ్ధాటి కలిగి ఉన్నప్పటికీ, వారు వీటికి సమానమైన దానిని తీసుకు రాలేకపోయారు. ఇది ఖుర్ఆన్ అల్లాహ్ నుండి అవతరించబడిన ఒక దివ్యావతరణ అని నిరూపిస్తున్నది.

[2] అల్-ముత్తఖీను: దైవభీతి గలవారు, అంటే అల్లాహ్ (సు.తా.) యందు భయభక్తులు కలిగి ఆయన (సు.తా.) ఆదేశాలను అనుసరించేవారు.

[3] 'గైబున్: అగోచర యథార్థం, అంటే మానవ ఇంద్రియాలకు మరియు జ్ఞానానికి గోప్యంగా ఉన్న సత్యాలు. అంటే అల్లాహ్ (సు.తా.)ను, దైవదూత('అ.స.)లను, పునరుత్థానదినాన్ని, స్వర్గనరకాలను మొదలైన వాటిని విశ్వసించటం.

[4] నమాజ్' స్థాపించడం అంటే, ప్రతిదినము ఐదుసార్లు నిర్ణీత సమయాలలో అల్లాహ్ (సు.తా.), దైవప్రవక్త ము'హమ్మద్ ('స'అస) కు నేర్పిన విధంగా నమాజ్' చేయడం. ('స'హీ'హ్ బు'ఖారీ, పు1, 'హదీస్' నం. 702, 703, 704, 723, 786, 787).

మేము ప్రసాదించిన జీవనోపాధి నుండి (మా మార్గంలో) ఖర్చు చేస్తారో[5];

4. మరియు ఎవరైతే (ఓ ముహమ్మద్!) నీపై అవతరింప జేయబడిన దానిని (ఈ ఖుర్ఆన్ ను)[6] మరియు నీకు పూర్వం అవతరింప జేయబడిన వాటినీ (దివ్య గ్రంథాలను) విశ్వసిస్తారో మరియు పరలోక జీవితాన్ని దృఢంగా నమ్ముతారో!

5. అలాంటి వారే తమ ప్రభువు (చూపిన) సన్మార్గంలో ఉన్నవారు మరియు అలాంటి వారే సాఫల్యం పొందేవారు

6. నిశ్చయంగా, సత్యతిరస్కారులను (ఓ ముహమ్మద్!)

---

[5] 'జకాతున్: అంటే ఒక సంవత్సరం వరకు జమ ఉన్న ధనసంపత్తుల నుండి ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేక శాతం విధిగా ఇవ్వవలసిన దానం. ఇది ఇస్లాం ధర్మంలోని ఐదు విధులలో ఒకటి. 'జకాత్, ముస్లిం సమాజపు ఆర్థిక పరిస్థితి మెరుగుపరచటానికి, సమాజంలో ఎవ్వరు కూడా నిరాధారం లేకుండా ఉండటానికి నియమించబడిన, ఒక ఉత్తమమైన ధార్మిక మరియు సాంఘిక నియమం, ('స'హీ'హ్ బు'ఖారీ, పు.2, అధ్యాయం-24).

[6] అబ్దుల్లాహ్ ఇబ్నె-'ఉమర్ (ర'ది.'అ.) కథనం, మహాప్రవక్త ('స'అస) ప్రవచనం: "ఇస్లాం ఈ ఐదు ప్రధాన సిద్ధాంతాలపై ఆధారపడి ఉంది. అవి: '1. అల్లాహ్ (సు.తా.) తప్ప మరొక ఆరాధ్య దైవం లేడు మరియు ము'హమ్మద్ ('స'అస), అల్లాహుతా'ఆలా యొక్క ప్రవక్త అనే దృఢవిశ్వాసం ప్రకటించటం, 2. రోజుకు ఐదుసార్లు విధిగా నమాజ్' చేయటం, 3. విధిదానం ('జకాత్) చెల్లించటం, 4. రమ'దాన్ నెలలో ఉపవాసముండటం, 5. శారీరక మరియు ఆర్థిక స్తోమత ఉంటే జీవితంలో ఒకసారి 'హజ్ చేయటం.' " ('స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం-1, 'హదీస్' నెం.7).

నీవు హెచ్చరించినా, హెచ్చరించక పోయినా ఒకటే, వారు విశ్వసించేవారు కారు.

7. అల్లాహ్ వారి హృదయాల మీద మరియు వారి చెవుల మీద ముద్ర వేశాడు[7]. మరియు వారి కన్నుల మీద తెర పడి ఉన్నది. మరియు వారి కొరకు ఘోరమైన శిక్ష ఉంది.

8. మరియు ప్రజలలో కొందరు: "మేము అల్లాహ్ నూ మరియు అంతిమ దినాన్నీ విశ్వసించాము." అని, అనే వారున్నారు. కానీ (వాస్తవానికి) వారు విశ్వసించేవారు కారు.

9. వారు, తాము అల్లాహ్ నూ మరియు విశ్వసించిన వారినీ మోసగిస్తున్నారని (అనుకుంటున్నారు); కానీ వారు తమను తాము తప్ప మరెవ్వరినీ మోసగించటం లేదు, కాని వారది గ్రహించటం లేదు!

10. వారి హృదయాలలో రోగముంది[8]. కాబట్టి అల్లాహ్ వారి రోగాన్ని మరింత అధికం చేశాడు మరియు వారు అసత్యం పలుకుతూ ఉండటం వలన వారికి బాధాకరమైన శిక్ష ఉంది.

11. మరియు: "భువిలో కల్లోలం[9] రేకెత్తించకండి." అని వారితో అన్నప్పుడు; వారు: "మేము

---

[7] ఇది సత్యతిరస్కారానికి ఫలితంగా, అల్లాహుతా'ఆలా బలవంతంగా ఎవరిని కూడా తప్పుదారిలో వేయడు, (చూడండి, 2:26 వ్యాఖ్యానం 1)

[8] అంటే సత్యాన్ని నమ్మలేకపోవటం మరియు దుర్బుద్ధి.

[9] ఫసాద్: అంటే కల్లోలం, సంక్షోభం, ఉపద్రవం, అశాంతి, కలహాలు అనే అర్థాలున్నాయి.

సంస్కర్తలము మాత్రమే!" అని అంటారు.

12. జాగ్రత్త! నిశ్చయంగా, (భువిలో) కల్లోలం రేకెత్తిస్తున్నవారు వీరే, కాని వారది గ్రహించటం లేదు.

13. మరియు: "ఇతర జనులు విశ్వసించినట్లు మీరూ విశ్వసించండి." అని, వారితో అన్నప్పుడు, వారు: "మూర్ఖులు విశ్వసించినట్లు మేమూ విశ్వసించాలా?" అని జవాబిస్తారు. జాగ్రత్త! వాస్తవానికి వారే మూర్ఖులు, కాని వారికది తెలియదు.

14. మరియు విశ్వాసులను కలిసినపుడు, వారు: "మేము విశ్వసించాము." అని అంటారు. కానీ, తమ షైతానుల (దుష్టనాయకుల) దగ్గర ఏకాంతంలో ఉన్నప్పుడు వారు: "నిశ్చయంగా మేము మీతోనే ఉన్నాము. కేవలం(వారి) ఎగతాళి చేస్తున్నాము" అని అంటారు.

15. అల్లాహ్ వారి ఎగతాళి చేస్తున్నాడు మరియు వారి తలబిరుసుతనాన్ని హెచ్చిస్తున్నాడు, (అందులో వారు) అంధులై తిరుగుతున్నారు;

16. ఇలాంటి వారే, సన్మార్గానికి బదులుగా దుర్మార్గాన్ని కొనుక్కున్న వారు; కాని వారి బేరం వారికి లాభదాయకం కాలేదు మరియు వారికి మార్గదర్శకత్వమూ దొరకలేదు.

17. వారి ఉపమానం[10] ఇలా ఉంది: ఒక అగ్నిని

[10] మస'లున్: అంటే ఉపమానం, పోలిక, సాదృశ్యం, దృష్టాంతం అనే అర్థాలున్నాయి.

వెలిగించగా, అది పరిసరాలను ప్రకాశింప జేసిన తర్వాత అల్లాహ్ వారి వెలుగును తీసుకుని వారిని అంధకారంలో విడిచి పెట్టడం వల్ల, వారు ఏమీ చూడలేక పోతారు[11].

**18.** (వారు) చెవిటివారు, మూగవారు, గ్రుడ్డివారు, ఇక వారు (ఋజుమార్గానికి) మరలి రాలేరు.

**19.** లేక (మరొక ఉపమానం): ఆకాశం నుండి ఘోరంగా వర్షం కురుస్తున్నది; చిమ్మ చీకట్లలో ఉరుములు, మెరుపులు మెరుస్తున్నాయి. ఆ ఉరుముల భీకర ధ్వని విని, మృత్యుభయం చేత వారు తమ వ్రేళ్ళను చెవులలో దూర్చుకుంటున్నారు. మరియు అల్లాహ్ సత్య తిరస్కారులను అన్ని వైపుల నుండి ఆవరించి ఉన్నాడు[12] .

---

[11] అబ్దుల్లాహ్ బిన్-మస్'ఊద్ (ర'ది. 'అ.) కథనం (ఫ'త్హ్ అల్-ఖదీర్): మహాప్రవక్త ('స'అస), మదీనాకు వచ్చిన తరువాత విశ్వసించిన వారిలో కొందరు కాపట్యానికి లోనవుతారు. అంటే వారు ఇస్లాం వెలుగును పొందిన తరువాత దానిని విడిచి మరల అంధకారంలో చిక్కుకు పోతారు. ఆ విషయం ఈ విధంగా బోధించబడింది. ఒక వ్యక్తి రాత్రిలో ఎడారిలో మంట వెలిగించి కాపుకుంటాడు. అది వారి పరిసరాలను వెలిగిస్తుంది. కాని ఆ అగ్ని ఆరి పోగానే వారు మళ్ళీ అంధకారంలో చిక్కు కుంటారు. ఏమీ చూడలేకపోతారు. అదేవిధంగా బాహ్యంగా మాత్రమే ఇస్లాం స్వీకరించిన వారి హృదయాలు అంధకారంలో ఉండి పోతాయి. వారు ఇస్లాం వెలుగును పొందిన తరువాత కూడా అంధకారంలోనే ఉండి పోతారు.

[12] ముహీతున్: One Who Econpasseth, Encloseth, Surroundeth. సర్వాన్ని పరివేష్టించి ఆవరించి, చుట్టుముట్టి ఉన్నవాడు, ఆయన జ్ఞానపరిధికి శక్తికి వెలుపల ఏదీ లేదు. చూడండి, 85:20.

**20.** ఆ మెరుపు వారి దృష్టిని ఇంచు మించు ఎగుర వేసుకు పోయినట్లుంటుంది. ప్రతిసారి అది మెరిసినప్పుడు, వారు ముందుకు నడుస్తారు మరియు వారిపై చీకటి క్రమ్ము కొనగానే వారు ఆగి పోతారు. మరియు అల్లాహ్ కోరితే వారి వినికిడినీ మరియు వారి చూపునూ తొలగించే వాడు[13]. నిశ్చయంగా, అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు[14].

**21.** ఓ మానవులారా! మిమ్మల్ని మరియు మీకు పూర్వం వారిని సృష్టించిన మీ ప్రభువు (అల్లాహ్) నే ఆరాధించండి, తద్వారా మీరు భక్తిపరులు కావచ్చు[15]!

**22.** ఆయన (అల్లాహ్) యే మీ కొరకు భూమిని పరుపుగాను మరియు ఆకాశాన్ని కప్పు గాను చేశాడు. మరియు ఆకాశం నుండి వర్షాన్ని కురిపించి, తద్వారా మీకు జీవనోపాధిగా ఫలాలను (పంటలను) ఉత్పత్తి చేశాడు! కావున ఇది

---

[13] అల్లాహుతా 'ఆలా తలుచుకుంటే ఎప్పుడైనా తాను ప్రసాదించే అనుగ్రహాలను ఆపుకోవచ్చు! కావున మానవులు ఎల్లప్పుడు అల్లాహుతా 'ఆలా యందే భయభక్తులు కలిగి వుండి, ఆయన శిక్షకూ, ప్రతీకారానికీ భయపడుతూ ఉండాలి.

[14] అలా కుల్లి షయ్'ఇ'న్ ఖదీర్: ఈ వాక్యాన్ని కొందరు: "అన్నింటిపై అధికారం (ఆధిపత్యం) గలవాడు" అని కూడా అనువదించారు.

[15] ల'అల్లకుమ్ తత్తఖూన్: దీనికి ము'హమ్మద్ జూనాగఢి గారు ఇలా తాత్పర్యమిచ్చారు: "తద్వారా మిమ్మల్ని మీరు కాపాడుకోవచ్చు."

తెలుసుకొని కూడా, మీరు ఇతరులను అల్లాహ్ కు సాటిగా నిలబెట్టకండి[16].

**23.** మరియు మేము మా దాసుని (ముహమ్మద్) పై అవతరింపజేసిన దానిని (ఈ ఖుర్ఆన్ ను) గురించి, మీకు సందేహముంటే; దాని వంటి ఒక్క సూరహ్ నైనా మీరు (రచించి) తీసుకురండి[17]. మరియు అల్లాహ్ తప్ప మీకు ఉన్న సహాయకులను అందరినీ పిలుచుకోండి; మీరు సత్యవంతులే అయితే (ఇది చేసి చూపండి).

**24.** కానీ, ఒకవేళ మీరు అలా చేయలేక పోతే - నిశ్చయంగా, మీరు అలా చేయలేరు - మానవులు మరియు రాళ్ళు ఇంధనమయ్యే ఆ నరకాగ్నికి

---

[16] మిమ్మల్ని మరియు సర్వసృష్టిని సృష్టించినవాడు అల్లాహ్ (సు.తా.) యే! మీకు జీవనోపాధిని సమకూర్చేవాడు కూడా ఆయనయే. అలాంటప్పుడు ఆయనను వదలి మీరు ఇతరులను ఎందుకు ఆరాధిస్తున్నారు? ఇతరులను ఆయనకు భాగస్వాములుగా ఎందుకు నిలబెడుతున్నారు? మీరు ఆయన శిక్ష నుండి తప్పించు కోవాలనుకుంటే! కేవలం ఆయననే ఆరాధించండి, ('స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం-6, 'హ. నం. 4)

[17] ఈ విధమైన ఒక్క సూరహ్ నైనా రచించి తెమ్మనే ప్రశ్న రెండు చోట్లలో ఇక్కడ మరియు 10:38 లలో ఉంది. 11:13 లో పది సూరాహ్ లు రచించి తెమ్మనీ మరియు 17:88, 52:34 లలో ఇట్టి గ్రంథాన్ని రచించి తెమ్మనీ ఉంది. ఈ దివ్యఖుర్ఆన్ అల్లాహుతా 'ఆలా దగ్గరి నుండి అవతరింప జేయబడింది, కాబట్టి ఎవ్వరు కూడా ఇంత వరకు ఈ ఛాలెంజీని ఎదుర్కోలేక పోయారు.

భయపడండి[18]. అది సత్యతిరస్కారుల కొరకే తయారు చేయబడింది.

25. మరియు విశ్వసించి, సత్కార్యాలు చేసే వారి కొరకు నిశ్చయంగా క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలు ఉంటాయనే శుభవార్తను వినిపించు, ప్రతిసారి వారికి తినటానికి ఫలాలు ఒసంగబడినపుడల్లా, వారు: "ఇవి ఇంతకు ముందు మాకు ఇవ్వబడినవే!" అని అంటారు. ఎందుకంటే వారికి ఇవ్వబడేవి వాటి పోలిక గలవే. అక్కడ వారికి నిర్మల సహవాసులు (అజ్వాజ్) ఉంటారు. మరియు వారందులో శాశ్వతంగా ఉంటారు.

26. నిశ్చయంగా, అల్లాహ్ దోమ లేక దాని కంటే చిన్నదాని దృష్టాంతం ఇవ్వటానికి సంకోచించడు. కావున విశ్వసించిన వారు, ఇది తమ ప్రభువు తరఫు నుండి వచ్చిన సత్యమే అని గ్రహిస్తారు. కాని సత్యతిరస్కారులు, వాటిని విని: "ఈ ఉపమానాలద్వారా అల్లాహ్ చెప్పదలుచుకున్నది ఏమిటి?" అని ప్రశ్నిస్తారు. ఈ విధంగా ఆయన ఎంతో మందిని మార్గభ్రష్టత్వంలో పడవేస్తాడు. మరియు ఎంతో మందికి సన్మార్గం కూడా

[18] ఇబ్నె 'అబ్బాస్ (ర'ది. 'అ.) కథనం: "మీరు మరియు మీరు ఆరాధించే రాళ్ళ దేవతలు నరకాగ్నికి ఇంధనం అవుతారు." చూడండి, 21:98.

చూపుతాడు.మరియుఆయనకేవలందుష్టులనే[19] మార్గభ్రష్టత్వంలో పడవేస్తాడు.

27. ఎవరైతే అల్లాహ్ తో స్థిరమైన ఒడంబడిక[20] చేసుకున్న పిదప దానిని భంగ పరుస్తారో మరియు అల్లాహ్ స్థిరపరచమని ఆజ్ఞాపించిన దానిని త్రెంచుతారో మరియు భువిలో కల్లోలం

---

[19] ఫాసిఖున్: అంటే దైవవిధేయతా హద్దులను అతిక్రమించిన వాడు (అవిధేయుడు), మార్గభ్రష్టుడు, దుష్టుడు, దుర్జనుడు, భక్తి లేనివాడు అనే అర్థాలున్నాయి. "ఎవడు ఏ వైపునకు పోదలచుకుంటాడో మేము అతనిని ఆ వైపునకే మరల్చుతాము." చూడండి, 4:115. అల్లాహ్ (సు.తా.) మానవులకు మరియు జిన్నాతులకు మంచి చెడులను తెలుసుకునే విచక్షణా శక్తీ, బుద్ధీ ఇచ్చాడు. కాబట్టి, వారికి పరలోక జీవితంలో, వారి కర్మల ప్రకారం, స్వర్గ / నరకాలు ఉన్నాయి. అల్లాహుతా' ఆలా ప్రవక్తల మరియు దివ్యగ్రంథాల ద్వారా వారికి సత్యాసత్యాలను, మంచి / చెడులను బోధించాడు. వాటిని అనుసరించటం వల్ల పొందే పరలోక ప్రతిఫలాలను (స్వర్గ/నరకాలను) కూడా విశదం చేశాడు. కావున వారిని మంచి/చెడు మార్గాలను అనుసరించటానికి బలవంతం చేయడు. వారిని వారి మార్గాలలో వదిలి పెడతాడు. అల్లాహ్ (సు.తా.) కు జరిగిపోయింది, జరుగుతున్నది మరియు ముందు జరగబోయేది అంతా తెలుసు కాబట్టి ఎవరు నరకవాసులు కానున్నారో మరియు ఎవరు స్వర్గవాసులు కానున్నారో కూడా తెలుసు. ఇదంతా గ్రంథంలో వ్రాయబడి ఉంది. కాబట్టి ఇక్కడ ఈ విధంగా పేర్కొనబడింది. అల్లాహ్ (సు.తా.) ఎవరిని కూడా బలవంతంగా నరకంలోకి త్రోయడు. వారి కర్మలే, వారిని దానికి అర్హులుగా చేస్తాయి. ఇలాంటి వాక్యం ఖుర్ఆన్ లో అనేక సార్లు వచ్చింది. ప్రతి చోటా దీని తాత్పర్యం ఇదే.

[20] అహ్ దుల్లాహి: అంటే ఆదమ్ ('అ.స.) ను సృష్టించే సమయంలో సమస్త మానవజాతి నుంచి అల్లాహుతా 'ఆలా తీసుకున్న ప్రమాణం. అది ఏమిటంటే: అల్లాహ్ (సు.తా.) దాస్యమే చేయాలనీ, ఆయనకే విధేయులై ఉండాలనీ మరియు కేవలం ఆయననే ఆరాధించాలనీ.

రేకెత్తిస్తారో! ఇలాంటివారే, వాస్తవంగా నష్టపడేవారు.

**28.** మీరు అల్లాహ్ పట్ల తిరస్కార వైఖరిని ఎలా అవలంబించగలరు? మరియు వాస్తవానికి ఆయనే నిర్జీవులుగా[21] ఉన్న మిమ్మల్ని సజీవులుగా చేశాడు కదా! తరువాత మీ ప్రాణాన్ని తీసి, తిరిగి మిమ్మల్ని సజీవులుగా చేసేది కూడా ఆయనే; చివరకు మీరంతా ఆయన వద్దకే మరలింపబడతారు.

**29.** ఆయనే భూమిలో నున్న సమస్తాన్నీ మీ కొరకు సృష్టించాడు; తరువాత తన దృష్టిని ఆకాశాల వైపునకు మరల్చి వాటిని సప్తాకాశాలుగా ఏర్పరిచాడు. మరియు ఆయనే ప్రతి విషయానికి సంబంధించిన జ్ఞానం గలవాడు.

**30.** మరియు (జ్ఞాపకం చేసుకో!) నీ ప్రభువు దేవదూతలతో: "వాస్తవంగా నేను భూమిలో ఒక ఉత్తరాధికారిని (ఖలీఫాను)[22] సృష్టించబోతున్నాను!" అని చెప్పినపుడు, వారు: "ఏమీ? నీవు భూమిలో కల్లోలం రేకెత్తించే వానిని మరియు నెత్తురు చిందించే

---

[21] అంటే మీరు ఏమీ లేకున్నపుడు మొదటిసారి సృష్టించబడ్డారు. ఆ తరువాత మీకు ఇవ్వబడిన గడువు పూర్తి అయిన తరువాత మీరు మరణింపజేయబడి, పునరుత్థాన దినమున మళ్ళీ సజీవులుగా లేపబడతారు. అది మీ రెండవ జీవితం. దానికి అంతముండదు. అందు మీకు, మీరు భూలోకంలో చేసిన కర్మలకు తగిన ప్రతిఫలమివ్వబడుతుంది.

[22] ఖలీఫా: అంటే భూమిలో తరతరాలుగా వచ్చే జనపదం, ఉత్తరాధికారి. చూడండి, 6:165, 27:62, 35:39. మానవుడు భూమిలో అల్లాహ్ (సు.తా.) యొక్క ప్రతినిధి అనటం సరైనది కాదు.

వానిని నియమించ బోతున్నావా? మేము నీ స్తోత్రం చేస్తూ, నీ పవిత్రతను కొనియాడుతూనే ఉన్నాము కదా!" అని విన్నవించు కున్నారు. దానికి ఆయన: "నిశ్చయంగా, మీకు తెలియనిది నాకు తెలుసు!" అని అన్నాడు.

**31.** మరియు ఆయన (అల్లాహ్) ఆదమ్ కు సకల వస్తువుల పేర్లను నేర్పాడు[23], ఆ పిదప వాటిని దేవదూతల ఎదుట ఉంచి: "మీరు సత్యవంతులే అయితే, వీటి పేర్లను నాకు తెలుపండి." అని అన్నాడు.

**32.** వారు (దేవదూతలు): "నీవు సర్వలోపాలకు అతీతుడవు[24], నీవు తెలిపినదే తప్ప మాకు మరేమీ తెలియదు. నిశ్చయంగా, నీవే సర్వజ్ఞుడవు[25], మహావివేకవంతుడవు[26]."

---

[23] చూడండి, ('స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం-6, 'హ.నం. 3).

[24] సుబ్'హానున్: Extolled be his absolute perfection. Hallowed, Exalted, Glirified, సర్వలోపాలకు అతీతుడు, పరిశుద్ధుడు, పరమ పవిత్రుడు, పానవుడు, ప్రశంసనీయుడు, శ్లాఘింప, పొగడ, స్తుతింప దగిన వాడు. చూడండి, 2:116, 12:108, 59:23.

[25] అల్-'అలీము: The All -knowing, The Omniscient. సర్వజ్ఞుడు, జ్ఞానసంపన్నుడు, సర్వం ఎరిగిన వాడు, జ్ఞానం గల, నేర్పు గల, తన దాసుల ప్రతిమాటనూ, ప్రతి పనినీ, భావాన్నీ, అభిప్రాయాన్నీ, ప్రత్యక్షంగా ఎరిగినవాడు. ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి. చూడండి, 2:127.

[26] అల్ హకీము: All-Wise, possessing Knowledge or Science, The Omniscient, మహా వివేకవంతుడు, వివేచనాపరుడు. ఈ పేరు దివ్యఖుర్ఆన్ కొరకు కూడా వాడబడుతుంది. అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి. చూడండి, 59:24.

అని అన్నారు
**33.** ఆయన (అల్లాహ్): "ఓ ఆదమ్! వీటి (ఈ వస్తువుల) పేర్లను వీరికి తెలుపు." అని అన్నాడు. ఎప్పుడైతే అతను (ఆదమ్) ఆ వస్తువుల పేర్లను వారికి తెలిపాడో; ఆయన అన్నాడు: "నిశ్చయంగా, నేను మాత్రమే భూమ్యాకాశాల అగోచరవిషయాలను ఎరుగుదునని మీతో చెప్ప లేదా? మరియు మీరు ఏది బహిర్గతం చేస్తారో మరియు ఏది దాస్తారో కూడా నాకు బాగా తెలుసు!"
**34.** మరియు (జ్ఞాపకం చేసుకోండి) మేము దేవదూతలతో: "మీరందరూ ఆదమ్ ముందు సాష్టాంగం (సజ్దా) చేయండి." అని ఆదేశించినపుడు, ఒక ఇబ్లీస్[27] తప్ప మిగతా వారంతా సాష్టాంగం (సజ్దా) చేశారు[28];

---

[27] ఇబ్లీస్: అంటే, He Despaired, ఆశ వదులుకొన్న, నిరాశ చెందిన వాడు. ఇది షైతాన్ పేరు. అతడు జిన్నాతులలోని వాడు. షైతాన్: He was, or became, distant or remote (from the mercy of Allah) అంటే, అల్లాహ్ (సు.తా.), సానుభూతి, లేక దయ నుండి దూరమై పోయిన వాడు, Rebellious, తిరగబడిన, అవిధేయుడైన, ఎదురు తిరిగిన వాడు, అధికారాన్ని ప్రతిఘటించిన వాడు.

[28] సజ్దా: నుదుటితో సహా ఎనిమిది అంగాలను భూమికి ఆనించటం (సాష్టాంగం చేయటం). దీనిలో నుదురు, ముక్కు, రెండు అరచేతులు, రెండు మోకాళ్ళు మరియు రెండు కాళ్ళ వ్రేళ్ళు భూమికి తగులుతూ ఉండాలి. ఇది కేవలం అల్లాహుతా'లా కొరకే ప్రత్యేకించబడింది. ఇక్కడ దైవదూతలు అల్లాహ్ (సు.తా.) ఆదేశాన్ని శిరసావహించటానికే ఆదమ్ ('అస) కు సజ్దా చేశారు. ము'హమ్మద్ ('స'అస) షరీయత్ లో, మానవుడు గౌరవార్థం కూడా ఎవ్వరికీ సజ్దా చేయగూడదు.

అతడు నిరాకరించాడు మరియు దురహంకారానికి గురయ్యాడు మరియు సత్యతిరస్కారులలోని వాడయ్యాడు.

**35.** మరియు మేము (ఆదమ్ తో) అన్నాము: "ఓ ఆదమ్! నీవూ మరియు నీ భార్యా, ఈ స్వర్గంలో నివసించండి మరియు మీరిద్దరూ మీకు ఇష్టమైనది యథేచ్ఛగా తినండి, కానీ ఈ చెట్టు[29] దరిదాపులకు పోకండి, అలా చేస్తే మీరిద్దరూ దుర్మార్గులలో[30] చేరిన వారవుతారు!"

**36.** ఆ పిదప షైతాన్ వారిద్దరినీ దాని (స్వర్గం) నుండి తప్పించి, వారిద్దరినీ వారున్న స్థితి నుండి బయటికి తీశాడు. మరియు మేము (అల్లాహ్) అన్నాము: "మీరంతా ఇక్కడి నుండి దిగిపోండి; మీరు ఒకరికొకరు విరోధులవుతారు[31]. ఒక నియమిత కాలం వరకు మీరు భూమిలో ఉండి, అక్కడే జీవితం గడప వలసి ఉంటుంది."

**37.** తరువాత ఆదమ్, తన ప్రభువు నుండి కొన్ని

---

[29] ఆ చెట్టు ఏ రకమైనదో ఖుర్ఆన్ మరియు 'హదీస్'లలో పేర్కొనబడలేదు. కాబట్టి దానిని గురించి అనుమానాల పాలు కాగూడదు. ఇంకా చూడండి, 20:120.

[30] "జుల్'మున్: Wrong doing, Injustice, Oppression. ఈ పదానికి దుర్మార్గం, అన్యాయం, అధర్మం, అక్రమం, దోషం, అపచారం మొదలైన అర్థాలు ఉన్నాయి.

[31] అంటే ఆదమ్ ('అ.స.) మరియు షై'తాన్ కావచ్చు; లేక మానవులు పరస్పరం (ఒకరికొకరు) విరోధులవుతారని అర్థం కావచ్చు!

మాటలు గ్రహించి[32], (పశ్చాత్తాప పడి క్షమాభిక్ష కోరాడు) మరియు ఆయన (అల్లాహ్) అతని పశ్చాత్తాపాన్ని అంగీకరించాడు. నిశ్చయంగా, ఆయనే పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడు, అపార కరుణా ప్రదాత.

**38.** మేము (అల్లాహ్) ఇలా అన్నాము: "మీరంతా ఇక్కడి నుండి దిగిపోండి." ఇక నా తరఫు నుండి మీకు మార్గదర్శకత్వం తప్పక వస్తూ ఉంటుంది. అప్పుడు ఎవరైతే నా మార్గదర్శకత్వాన్ని అనుసరిస్తారో వారికి ఎలాంటి భయమూ ఉండదు మరియు వారు దుఃఖపడరు కూడా!

**39.** కానీ, ఎవరైతే (మార్గదర్శకత్వాన్ని) తిరస్కరిస్తారో మరియు మా సూచన(ఆయత్) లను అసత్యాలని తిరస్కరిస్తారో, అలాంటి వారు నరకాగ్ని వాసులవుతారు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు.

**40.** ఓ ఇస్రాయీల్ సంతతివారలారా[33]! నేను మీకు చేసిన ఉపకారాన్ని జ్ఞాపకం చేసుకోండి మరియు మీరు నాతో చేసిన వాగ్దానాన్ని నెరవేర్చండి,

---

[32] ఆదమ్ ('అ.స.) చేసిన దు'ఆ కొరకు చూడండి, 7:23.

[33] ఇస్రాయీ'ల్: హీబ్రూ భాష పదం. 'అరబ్బీలో దీని అర్థం 'అబ్దుల్లాహ్ (అల్లాహ్ దాసుడు). ఇది య'అఖూబ్ ('అ.స.) యొక్క బిరుదు. అతనికి 12 మంది కుమారులు. వారితో 12 తెగలుగా యూదుల సంతతి పెరిగింది. వారిని బనీ ఇస్రాయీ'ల్ (ఇస్రాయీ'ల్ సంతతివారు) అని అంటారు. వారిలో చాలా మంది ప్రవక్తలు వచ్చారు.

నేనూ మీతో చేసిన వాగ్దానాన్ని నెరవేర్చుతాను. మరియు మీరు నాకు మాత్రమే భయపడండి!

**41.** మరియు మీ వద్దనున్న వాటిని (తౌరాత్ / ఇంజీల్ లను) ధృవీకరిస్తూ నేను అవతరింప జేసిన దానిని (ఈ ఖుర్ఆన్ ను) విశ్వసించండి. మరియు దీనిని తిరస్కరించే వారిలో మీరు మొట్టమొదటి వారు కాకండి. మరియు అల్పలాభాలకు నా సూచన (ఆయత్)లను[34] అమ్మకండి. కేవలం నా యందే భయభక్తులు కలిగి ఉండండి.

**42.** మరియు సత్యాన్ని అసత్యంతో కలిపి తారుమారు చేయకండి మరియు మీకు తెలిసి ఉండి కూడా సత్యాన్ని దాచకండి[35].

**43.** మరియు నమాజ్ ను స్థాపించండి మరియు విధిదానం (జకాత్) ఇవ్వండి మరియు (నా

---

[34] ఆయత్: Sign అంటే సూచన, సూక్తి, చిహ్నం, సంకేతం. కొన్ని చోట్లలో అద్భుత సూచన, అద్భుత సంకేతం, అద్భుత నిదర్శనం అనే అర్థాలు వస్తాయి. ఈ అనువాదంలో చాలా వరకు సూచన అనే పదమే వాడబడింది. వీటిని వాక్యాలనటం సరికాదు. ఇవి అల్లాహుతా 'ఆలా సూచనలు. ఆ ఖుర్ఆన్ లోని ఆయతుల సంఖ్య కూఫీ 'ఉలమాలు అనుసరించిన ఇమామ్ అ'ష్షాతబీ యొక్క నా" జిమతు'జ్జుహ్రా లో వ్రాసినట్లు ఉంది. అంటే అబీ-'అబ్దుర్రహ్మాన్ 'అబ్దుల్లాహ్ ఇబ్నె 'హబీబ్ అస్సులమీ' అనుసరించిన, అలీ ఇబ్నె అబీ-'తాలిబ్ (ర'ది.'అ) విధానం. దీని ప్రకారం ఈ ఖుర్ఆన్ లోని ఆయతుల సంఖ్య 6236.

[35] చూడండి, ఖుర్ఆన్, 2:76, 101. ఇంకా చూడండి: 'అల్లాహ్ (సు.తా.), మీ సహోదరులలో నుండి ఒక ప్రవక్తను తెస్తాడు. అప్పుడు మీరు అతనిని అనుసరించాలి.' అని పూర్వగ్రంథాలలో వ్రాయబడిన సత్యానికి, బైబిల్, ద్వితీయోపదేశ కాండము - (Deuteronomy) 18:15, 18.

సాన్నిధ్యంలో వినమ్రులై) వంగే[36] (రుకూఉ చేసే) వారితో పాటు మీరూ (వినమ్రులై) వంగండి (రుకూఉ చేయండి).

44. ఏమీ? మీరు ఇతరులనైతే నీతిపరులవమని ఆజ్ఞాపిస్తున్నారు, కాని, స్వయంగా మీరే దానిని అవలంబించడం మరచి పోతున్నారెందుకు?[37] మరియు మీరయితే గ్రంథాన్ని చదువు తున్నారు కదా! అయితే మీరెందుకు మీ బుద్ధిని ఉపయోగించరు?

45. మరియు సహనం మరియు నమాజ్ ద్వారా (అల్లాహ్) సహాయాన్ని అర్థించండి. నిశ్చయంగా అది(అల్లాహ్'కు)వినమ్రులైన వారికి తప్ప, ఇతరులకు ఎంతో కష్టతరమైనది

46. అలాంటి వారు తాము తమ ప్రభువును నిశ్చయంగా, కలుసు కోవలసి ఉందనీ మరియు ఆయన వైపునకే మరలి పోవలసి ఉందనీ నమ్ముతారు[38].

47. ఓ ఇస్రాయీల్ సంతతివారలారా! నేను మీకు చేసిన మహోపకారాన్ని జ్ఞాపకం చేసుకోండి మరియు నేను నిశ్చయంగా, మిమ్మల్ని (మీ కాలంలో) సర్వలోకాల వారి కంటే అధికంగా

---

[36] రుకూ'ఉ: అంటే నమాజ్ లో అరచేతులను మోకాళ్ళపై పెట్టి వంగడం.

[37] స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 9, 'హ.నం. 218.

[38] "జన్న: అంటే Imagined, thought, భావించాడు, ఊహించాడు, అనే అర్థాలు ఉన్నాయి. కాని కొన్నిసార్లు, believed, sure నమ్మాడు, విశ్వసించాడు అనే అర్థాలు వస్తాయి.

ఆదరించాను!

48. మరియు ఆ (తీర్పు) దినమునకు భయపడండి, అప్పుడు ఒక వ్యక్తి మరొక వ్యక్తికి ఏ విధంగానూ ఉపయోగపడలేడు; మరియు అతని నుండి ఎట్టి సిఫారసూ అంగీకరించ బడదు మరియు ఎలాంటి పరిహారం కూడా తీసుకోబడదు మరియు వారికెలాంటి సహాయం కూడా చేయబడదు.

49. మరియు ఫిర్ఔన్ జాతివారి (బానిసత్వం) నుండి మేము మీకు విముక్తి కలిగించిన సందర్భాన్ని (జ్ఞాపకం చేసుకోండి). వారు మిమ్మల్ని ఘోర హింసకు గురి చేస్తూ ఉండేవారు; మీ కుమారులను వధించి, మీ స్త్రీలను సజీవులుగా విడిచి పెట్టేవారు మరియు ఇందులో మీ ప్రభువు తరఫు నుండి మీకు గొప్ప పరీక్ష ఉండెను.

50. మరియు మేము మీ కొరకు సముద్రాన్ని చీల్చి మిమ్మల్ని రక్షించినప్పుడు మీరు చూస్తూ ఉండగానే ఫిర్ఔన్ జాతివారిని ముంచివేసిన సంఘటనను(గుర్తుకు తెచ్చుకోండి)[39] .

51. ఇంకా (జ్ఞాపకం చేసుకోండి), మేము మూసాను నలభై రాత్రుల వాగ్దానం చేసి (పిలిచి నపుడు) మీరు అతను లేక పోవడం చూసి ఆవుదూడను (ఆరాధ్యదైవంగా) చేసుకున్నారు[40]. మరియు మీరు దుర్మార్గులయ్యారు.

52. అయినప్పటికీ మీరు కృతజ్ఞులవుతారేమోనని

---

[39] చూడండి, 20:77-78 మరియు 26:63-66.
[40] చూడండి, 7:142-148, 20:85.

మేము మిమ్మల్ని మన్నించాము[41].
53. మరియు (జ్ఞాపకం చేసుకోండి) ! మీరు సన్మార్గులవుతారేమోనని మేము మూసాకు గ్రంథాన్ని మరియు (సత్యా-సత్యాలను వేరే చేసే)[42] గీటురాయిని ప్రసాదించాము.
54. మరియు (జ్ఞాపకం చేసుకోండి)! మూసా తన జాతివారితో ఇలా అన్న విషయాన్ని: "ఓ నా జాతి ప్రజలారా! నిశ్చయంగా, ఆవుదూడను (ఆరాధ్యదైవంగా) చేసుకొని మీకు మీరే అన్యాయం చేసుకున్నారు. కనుక పశ్చాత్తాపంతో క్షమాభిక్ష కొరకు మీ నిర్మాతను[43] (సృష్టికర్తను) వేడుకోండి. మీలోని వారిని (ఘోరపాతకులను) సంహరించండి. ఇదే మీ కొరకు - మీ సృష్టికర్త దృష్టిలో - శ్రేష్ఠమైనది." ఆ తరువాత ఆయన (అల్లాహ్) మీ పశ్చాత్తాపాన్ని అంగీకరించాడు. నిశ్చయంగా ఆయనే పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడు. అపార కరుణాప్రదాత
55. మరియు అప్పుడు మీరు అతనితో (మూసాతో) అన్న మాటలు (జ్ఞప్తికి తెచ్చుకోండి): "ఓ మూసా! మేము అల్లాహ్ ను ప్రత్యక్షంగా చూడనంత వరకు

---

[41] అఫువ్వు (అల్-'అఫువ్వు): Pardoning, Effacing, Erasing, Obliterating, Very Forgiving. మన్నించే, రద్దు చేసే, క్షమించేవాడు. చూడండి 4:149. ఇది అల్లాహ్(సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి.

[42] చూడండి, 8:29, 8:41.

[43] అల్ బారిఉ': The Maker, నిర్మాత, ఎట్టి పోలిక, సామ్యం లేకుండా ప్రతి దానిని సృజించే వాడు. లేమి నుండి ఉనికిలోకి తెచ్చే వాడు. ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి.

నిన్ను ఏ మాత్రం విశ్వసించము!" అదే సమయంలో మీరు చూస్తూ ఉండగానే ఒక భయంకరమైన పిడుగు మీపై విరుచుకు పడింది (మీరు చనిపోయారు).

**56.** ఆ పిమ్మట, మీరు కృతజ్ఞులై ఉంటారేమోనని - మీరు చచ్చిన తరువాత మిమ్మల్ని తిరిగి బ్రతికించాము.

**57.** మరియు మేము మీపై మేఘాల ఛాయను కల్పించాము మరియు మన్ మరియు సల్వాలను మీ కొరకు ఆహారంగా దించాము[44]. "మేము మీకు ప్రసాదించిన శుద్ధమయిన వస్తువులను తినండి." అని అన్నాము. (కాని వారు మా ఆజ్ఞలను ఉల్లంఘించారు), అయినా వారు మాకు అపకారమేమీ చేయలేదు, పైగా వారు తమకు తామే అపకారం చేసుకున్నారు.

**58.** మరియు మేము మీతో: "ఈ నగరం (జేరుసలం) లో ప్రవేశించండి మరియు అక్కడున్న వస్తువులను మీ ఇష్టానుసారంగా కావలసినంత తినండి మరియు నగర ద్వారంలోకి వినమ్రులై తలవంచుతూ: 'మమ్మల్ని క్షమించు (హిత్తతున్),' అంటూ ప్రవేశించండి; మేము మీ పాపాలను క్షమిస్తాము. మరియు మేము సజ్జనులను అత్యధికంగా కరుణిస్తాము." అని చెప్పిన

---

[44] సహీహ్ బు'ఖారీ, పుస్తకం-6, 'హ.నం. 5, మన్న - ఒక రకమైన జిగురు మిఠాయి (తీపిగల పదార్థము). సల్వా - ఒక రకమైన పక్షి. (ఫ'త్హ అల్ ఖదీర్).

మాటలను (జ్ఞప్తికి తెచ్చుకోండి)!

59. కాని దుర్మార్గులైన వారు, వారికి చెప్పిన మాటను మరొక మాటతో మార్చారు[45]. కనుక, మేము దుర్మార్గం చేసిన వారిపై, వారి దౌష్ట్యాలకు ఫలితంగా, ఆకాశం నుండి ఆపదను దింపాము[46].

60. మరియు (జ్ఞాపకం చేసుకోండి)! మూసా తన ప్రజలకు నీటి కొరకు ప్రార్థించినప్పుడు, మేము: "నీవు ఆ బండను నీ కర్రతో కొట్టు!" అని ఆదేశించాము. అప్పుడు దాని నుండి పన్నెండు ఊటలు ప్రవహించసాగాయి. ప్రతి తెగవారు తమ నీరు త్రాగే స్థలాన్ని కనుగొన్నారు. (అప్పుడు వారితో అన్నాము): "అల్లాహ్ మీకు ప్రసాదించిన ఆహారాన్ని తినండి త్రాగండి కానీ, భూమిలో కల్లోలం రేపుతూ దౌర్జన్యపరులుగా తిరగకండి!"

61. మరియు అప్పుడు మీరు: "ఓ మూసా! మేము ఒకే రకమైన ఆహారం తింటూ ఉండ లేము. కావున భూమిలో ఉత్పత్తి అయ్యే ఆకు కూరలు, దోసకాయలు (కూరగాయలు), వెల్లుల్లి (గోధుమలు), ఉల్లిగడ్డలు, పప్పు దినుసులు మొదలైనవి మా కొరకు పండించమని నీ ప్రభువును ప్రార్థించు." అని అన్నారు. దానికతను: "ఏమీ? శ్రేష్ఠమైన దానికి

---

[45] వారు 'హి'త్తతున్ అనే మాటకు బదులుగా - 'హబ్బ ఫీ ష'అరతిన్ - అని అన్నారు. ( 'స'హీ'హ్ బు'ఖారీ మరియు 'స'హీ'హ్ ముస్లిం).

[46] స'హీ'హ్ ముస్లిం, 'హ.నం. 2218, ఆ శిక్ష ఒక భయంకరమైన ప్లేగు రోగం.

బదులుగా అల్పమైన దానిని కోరుకుంటున్నారా? (అలాగయితే) మీరు ఏదైనా నగరానికి తిరిగిపొండి. నిశ్చయంగా, అక్కడ మీకు, మీరు కోరేదంతా దొరుకుతుంది!" అని అన్నాడు. మరియు వారు, తీవ్ర అవమానం మరియు దారిద్ర్యానికి గురయ్యారు. మరియు వారు అల్లాహ్ ఆగ్రహానికి గురయ్యారు. అదంతా వాస్తవానికి వారు అల్లాహ్ సూచన (ఆయతు) లను తిరస్కరించిన దాని మరియు ప్రవక్తలను అన్యాయంగా చంపిన దాని ఫలితం[47]. ఇదంతా వారు చేసిన ఆజ్ఞోల్లంఘున మరియు హద్దులు మీరి ప్రవర్తించిన దాని పర్యవసానం.

62. నిశ్చయంగా, విశ్వసించిన వారు (ముస్లింలు) కానీ, (ఇస్లాంకు పూర్వపు) యూదులు కానీ, క్రైస్తవులు కానీ, సాబీయూలు[48] కానీ (ఎవరైనా సరే) ! అల్లాహ్ ను, అంతిమ దినాన్ని విశ్వసించి,

---

[47] బైబిల్ లో మత్తయి సువార్త- (Mathew), 23:34, 35, 37; లూకా - (Luke), 11:51; I థెస్సలోనికయులు - (I Thessalonians), 2:15లు 'జకరియ్యా మరియు ఇతర ప్రవక్త('అ.స.)లను చంపిన సంఘుటనకు సాక్ష్యమిస్తున్నాయి.

[48] సాబీయీ'న్: ఒక గతించిన సమాజం. వారు ము'సల్('ఇరాఖ్) లో నివసించేవారు."అల్లాహ్ (సు.తా.) తప్ప మరొక ఆరాధ్యుడు లేడు."అని నమ్మేవారు. వారు 'జబూర్ గ్రంథాన్ని చదివేవారని కొందరి అభిప్రాయం. వారు యూదులు గానీ, క్రైస్తవులు గానీ కారు. తరువాత వారి ధర్మంలో కూడా మార్పులు వచ్చాయి. వారు దైవదూతలను మరియు నక్షత్రాలను ఆరాధించసాగారు. వారు తరువాత ఏ ధర్మాన్ని కూడా అనుసరించకుండా ఉండసాగారు. వారు నాస్తికులు (Atheists) అయ్యారని కొందరి అభిప్రాయం.

సత్కార్యాలు చేసే వారికి, వారి ప్రభువు వద్ద మంచి ప్రతిఫలం ఉంటుంది మరియు వారికి ఎలాంటి భయమూ ఉండదు మరియు వారు దుఃఖపడరు కూడా[49]!

**63.** మరియు (ఓ ఇస్రాయీల్ సంతతి వారలారా!) మేము తూర్ పర్వతాన్ని ఎత్తి మీపై నిలిపి, మీ చేత చేయించిన గట్టి వాగ్దానాన్ని (జ్ఞప్తికి తెచ్చుకోండి)! అప్పుడు మేము: "మీకు ప్రసాదిస్తున్న దానిని (గ్రంథాన్ని) దృఢంగా పట్టుకోండి, అందులో ఉన్నదంతా జ్ఞాపకం ఉంచుకోండి, బహుశా మీరు భయభక్తులు గలవారు కావచ్చు!" అని అన్నాము.

**64.** ఆ పిదప కూడా మీరు వెనుదిరిగి పోయారు. అయినప్పటికీ అల్లాహ్ యొక్క అనుగ్రహం మరియు ఆయన కరుణ మీపై లేకుంటే, మీరు నష్టానికి గురైనవారిలో చేరేవారు.

---

[49] చూడండి 5:69. ఇక్కడ యూదులు, క్రైస్తవులు మరియు 'సాబీయులు, అంటే తమ గ్రంథాలలో ఎట్టి మార్పులు చేయక, వాటి అవతరింప జేయబడిన నిజరూపంలో వాటిని అనుసరించిన వారని అర్థం. మహాప్రవక్త ('స'అస) ప్రవచనం: "ఎవరి చేతిలోనయితే నా ప్రాణం ఉందో ఆ పరమ పవిత్రుని సాక్షి, నా ఈ సమాజంలో నా మాట విన్న వ్యక్తి, వాడు యూదుడు గానీ, క్రైస్తవుడు గానీ నన్ను (నా ధర్మాన్ని) విశ్వసించకపోతే! అతడు నరకవాసి అవుతాడు." (స'హీ'హ్ ముస్లిం). అంటే ము'హమ్మద్ ('స.అస) తరువాత, ఇస్లాం తప్ప మరొక ధర్మాన్ని అల్లాహ్ (సు.తా.) సమ్మతించడు. ఇక్కడ మరొక విషయం స్పష్టమయ్యేది ఏమిటంటే 'స'హీ'హ్ 'హదీసు'లను విడిచి ఖుర్ఆన్ ను సరిగ్గా అర్థం చేసుకోవటం అసాధ్యం, ('తబరీ, పు-1, పేజీ - 323). చూడండి. 3:19, 3:85.

**65.** మరియు శనివారం (సబ్త్) శాసనం ఉల్లంఘించిన మీ వారి గాథ మీకు బాగా తెలుసు[50]. మేము వారిని: "నీచులైన కోతులు కండి!" అన్ని అన్నాము.

**66.** ఈ విధంగా మేము దానిని (వారి ముగింపును) ఆ కాలం వారికీ మరియు భావితరాల వారికీ ఒక గుణపాఠంగానూ, దైవభీతి గలవారికి ఒక హితోపదేశంగానూ చేశాము.

**67.** మరియు (జ్ఞాపకం చేసుకోండి) మూసా తన జాతి వారితో: "అల్లాహ్ మిమ్మల్ని: 'ఒక ఆవును బలి ఇవ్వండి'[51]! అని ఆజ్ఞాపిస్తున్నాడు." అని అన్నప్పుడు వారు: "ఏమీ? నీవు మాతో పరహాసమాడుతున్నావా?" అని పలికారు. (అప్పుడు మూసా) అన్నాడు: "నేను అవివేకులతో కలిసి పోకుండా ఉండాలని, నేను అల్లాహ్ శరణు వేడుకుంటున్నాను."

---

[50] యూదులకు శనివారం (సబ్ త్) రోజున చేపలు పట్టటం నిషేధించబడింది. వారు ఆ శాసనాన్ని ఉల్లంఘించటం వలన: 'నీచులైన కోతులు కండి.' అని శపించ బడ్డారు. చూడండి, 5:60, 7:166.

[51] ఇస్రాయీ'ల్ సంతతి వారిలో ఒక ధనవంతుడు - ఒకే ఒక్క వారసునిగా ఉన్న - అతని సోదరుని కుమారుణ్ణి హత్య చేసి, శవాన్ని ఇతరుని ఇంటి ముందు వేస్తాడు. ఉదయం ఆ యిద్దరి మధ్య వాదులాట జరుగుతుంది. పరిష్కారానికి వారు మూసా ('అ.స.) దగ్గరికి వస్తారు. అతను వారిని ఒక ఆవును బలి ఇచ్చి దాని మాంసపు ముక్కతో ఆ మృతుని శరీరాన్ని కొడితే, అతడు తన హతుణ్ణి చూపిస్తాడంటారు. ఎంతో వాదులాడిన తరువాత వారు ఈ విధంగా చేస్తారు. ఆ మృతుడు లేచి హతుణ్ణి చూపించి తిరిగి మరణిస్తాడు (ఫ'త్హ అల్-ఖదీర్).

68. వారు: "అది ఎలాంటిదై ఉండాలో మాకు స్పష్టంగా తెలుపమని నీ ప్రభువును ప్రార్థించు!" అని అన్నారు. (మూసా) అన్నాడు: "'నిశ్చయంగా, ఆ ఆవు ముసలిది గానీ లేగదూడ గానీ కాకుండా, మధ్య వయస్సు గలదై ఉండాలి.' అని ఆయనంటున్నాడు. కనుక ఆజ్ఞాపించిన విధంగా చేయండి."

69. వారు: "దాని రంగు ఎలా ఉండాలో మాకు తెలుపమని నీ ప్రభువును వేడుకో!" అని అన్నారు. (దానికి అతను) అన్నాడు: "'అది మెరిసే పసుపు వన్నె కలిగి, చూసేవారికి మనోహరంగా కనిపించాలి.' అని ఆయన ఆజ్ఞ!"

70. వారు ఇలా అన్నారు: "అసలు ఏ విధమైన ఆవు కావాలో నీవు నీ ప్రభువును అడిగి మాకు స్పష్టంగా తెలుపు; దానిని నిర్ణయించడంలో మాకు సందేహం కలిగింది మరియు నిశ్చయంగా, అల్లాహ్ కోరితే మేము తప్పక అలాంటి ఆవును కనుగొంటాము (మార్గదర్శకత్వం పొందుతాం)."

71. అతను (మూసా) అన్నాడు: "ఆయన (అల్లాహ్) అంటున్నాడు: 'ఆ గోవు భూమిని దున్నటానికి గానీ, పొలాలకు నీళ్ళు తోడటానికి గానీ ఉపయోగించబడకుండా, ఆరోగ్యంగా ఎలాంటి లోపాలు లేకుండా ఉండాలి.' అని!" అప్పుడు వారన్నారు: "ఇప్పుడు నీవు సత్యం తెచ్చావు." తరువాత వారు దానిని బలి (జిబ్హ్) చేశారు,

లేకపోతే వారు అలా చేసేవారని అనిపించలేదు[52].

72. మరియు (జ్ఞాపకం చేసుకోండి), మీరు ఒక వ్యక్తిని చంపి ఆ నిందను ఒకరిపై నొకరు మోపుకోసాగారు. కాని మీరు దాస్తున్న దానిని అల్లాహ్ బయట పెట్టాడు[53].

73. కనుక మేము: "దానిని (ఆ శవాన్ని), ఆ ఆవు (మాంసపు) ఒక ముక్కతో కొట్టండి, (అతడు సజీవుడవుతాడు)." అని ఆజ్ఞాపించాము. ఈవిధంగా అల్లాహ్ మృతులను బ్రతికించి, తన సూచనలను మీకు చూపుతున్నాడు, బహుశా మీరు అర్థం చేసుకుంటారేమోనని!

74. కానీ దీని తరువాత కూడా మీ హృదయాలు కఠినమై పోయాయి, అవి రాళ్ళ మాదిరిగా! కాదు, వాటి కంటే కూడా కఠినంగా అయిపోయాయి. ఎందుకంటే వాస్తవానికి రాళ్ళలో కొన్ని బ్రద్దలైనప్పుడు వాటి నుండి సెలయేళ్ళు ప్రవహిస్తాయి. మరియు నిశ్చయంగా, వాటిలో

---

[52] వారికి మొదట ఒక ఆవును బలి చేయమని మాత్రమే ఆజ్ఞ ఇవ్వబడింది. కాబట్టి వారు ఏదో ఒక ఆవును బలి చేసి ఉంటే, అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞ నెరవేరేది. కానీ వారలా చేయక వివిధ రకాల ప్రశ్నలడగ సాగారు. కావున అల్లాహుతా'ఆలా వారి సమస్యలను పెంచాడు. దానితో వారికి ఆవును కనుగొనటంలో కష్టం కలిగింది. కావున ధర్మవిషయాలలో కఠిన విధానాన్ని అనుసరించటం నిషేధించబడింది.

[53] పైన పేర్కొన్న ఆవు బలి ఈ వ్యక్తి మరణం వల్లనే సంభవించింది. దీని భావం ఏమిటంటే, మంచీ, చెడూ ఏ కార్యమైనా అది బయట పడక తప్పదు. కావున ప్రతి ఒక్కడు ఎల్లప్పుడు మంచి కార్యాలే చేయాలి. చేసిన చెడు బయటబడితే అవమానం తప్పదు.

కొన్ని చీలిపోయి వాటి నుండి నీళ్ళు బయటికి వస్తాయి[54]. మరియు వాస్తవానికి వాటిలో మరికొన్ని అల్లాహ్ భయం వల్ల పడిపోతాయి. మరియు అల్లాహ్ మీ కర్మల పట్ల నిర్లక్ష్యంగా లేడు.

**75.** (ఓ విశ్వాసులారా!) వారు (యూదులు) మీ సందేశాన్ని విశ్వసిస్తారని ఆశిస్తున్నారా ఏమిటి? మరియు వాస్తవానికి వారిలో ఒక వర్గం వారు (ధర్మవేత్తలు) అల్లాహ్ ప్రవచనం (తౌరాత్) విని, అర్థం చేసుకొని కూడా, బుద్ధిపూర్వకంగా దానిని తారుమారు చేసేవారు కదా?

**76.** మరియు వారు (యూదులు) విశ్వాసులను కలిసినప్పుడు: "మేము విశ్వసించాము!" అని అంటారు. కాని వారు ఏకాంతంలో (తమ తెగవారితో) ఒకరినొకరు కలుసుకున్నప్పుడు: "ఏమీ? అల్లాహ్ మీకు తెలిపింది వారికి (ముస్లింలకు) తెలుపుతారా[55]! దానితో వారు (ముస్లింలు) మీ ప్రభువు ముందు మీతో వాదులాడటానికి! మీరిది అర్థం చేసుకోలేరా ఏమిటి?" అని అంటారు.

---

[54] చూడండి, 57:16 మరియు 17:44.

[55] అబ్దుల్లాహ్ బిన్- 'అమ్ర్ బిన్ అల్-'అసాస్ (ర.ది.'అ.), కథనం ఆధారంగా - 'అతా బిన్-యాసిర్ (ర'ది. 'అ.) వివరించిన - వారి గ్రంథం (తౌరాత్)లో రాబోయే ప్రవక్త ము'హమ్మద్ ('స 'అస) ను గురించి ఇవ్వబడిన లక్షణాల వివరాలకు చూడండి, ('స. బు'ఖారీ, పుస్తకం-3, 'హ.నం. 335) ఇంకా చూడండి, 2:42, 101.

77. ఏమీ? వారికి తెలియదా? వారు (యూదులు) దాచేది మరియు వెలిబుచ్చేది, అంతా అల్లాహ్ కు బాగా తెలుసని?

78. మరియు వారిలో(యూదులలో) కొందరు నిరక్షరాస్యులున్నారు, వారికి గ్రంథజ్ఞానం లేదు, వారు కేవలం మూఢవిశ్వాసాలను (నమ్ముతూ), ఊహలపై మాత్రమే ఆధారపడి ఉన్నారు.

79. కావున ఎవరైతే తమ చేతులారా ఒక పుస్తకాన్ని వ్రాసి - దాని వల్ల తుచ్ఛమూల్యం పొందే నిమిత్తం - "ఇది అల్లాహ్ తరఫు నుండి వచ్చింది." అని (ప్రజలకు) చెబుతారో, వారికి వినాశముంది. వారి చేతులు వ్రాసినందుకు వారికి వినాశముంది మరియు వారు సంపాదించిన దానికి కూడా వారికి వినాశముంది!

80. మరియు వారు (యూదులు) అంటారు: "మాకు నరకాగ్ని శిక్ష పడినా, అది కొన్ని రోజుల కొరకు మాత్రమే!" (ఓ ముహమ్మద్!) నీవు వారి నడుగు: "ఏమీ? మీరు అల్లాహ్ నుండి వాగ్దానం పొందారా? ఎందుకంటే, అల్లాహ్ తన వాగ్దానాన్ని ఎన్నడూ భంగం చేయడు. లేదా మీకు తెలియని విషయాన్ని మీరు అల్లాహ్ కు అంటగడుతున్నారా?"

81. వాస్తవానికి, ఎవరు పాపం అర్జించారో మరియు తమ పాపం తమను చుట్టుముట్టి ఉన్నదో, అలాంటి వారు నరకవాసులు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు.

82. మరియు ఎవరైతే విశ్వసించి సత్కార్యాలు చేస్తారో,

అలాంటి వారు స్వర్గవాసులు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు.

**83.** మరియు మేము ఇస్రాయీలు సంతతి వారి నుండి ఇలా తీసుకున్న వాగ్దానం (జ్ఞప్తికి తెచ్చుకోండి): "మీరు అల్లాహ్ ను తప్ప మరెవ్వరినీ ఆరాధించకూడదు. మరియు తల్లిదండ్రులను, బంధువులను, అనాథులను, యాచించని పేదవారిని[56] ఆదరించాలి. మరియు ప్రజలను సహృదయంతో పలకరించాలి, నమాజ్ ను స్థాపించాలి మరియు జకాత్ ఇవ్వాని." అటు పిమ్మట మీలో కొందరు తప్ప, మిగతా వారంతా (తమ వాగ్దానం నుండి) తిరిగి పోయారు. మీరంతా విముఖులైపోయే వారే!

**84.** మరియు మేము మీ నుండి తీసుకున్న మరొక వాగ్దానాన్ని (జ్ఞాపకం చేసుకోండి); మీరు మీ (తోటివారి) రక్తాన్ని చిందించగూడదని మరియు మీ వారిని, వారి ఇండ్ల నుండి పారద్రోల గూడదని! అప్పుడు మీరు దానికి ఒప్పుకున్నారు మరియు దానికి స్వయంగా మీరే సాక్షులు.

**85.** ఆ తరువాత మీరో ఒకరినొకరు చంపుకునే వారు. మరియు మీరు మీలోని ఒక వర్గం వారిని వారి ఇండ్ల నుండి తరిమేవారు. మరియు వారికి అన్యాయం చేయటంలోనూ మరియు వారిపై

---

[56] మిస్కీన్: నిత్యావసరాలకు తగినంత ఆదాయం లేకున్నా యాచించని పేదవాడు. ఫఖీర్: ఆదాయం లేనందుకు విధి లేక యాచించే నిరుపేదలు.

దౌర్జన్యం చేయటంలోనూ, (వారి విరోధులకు) తోడ్పడేవారు. మరియు వారు (శత్రువుల చేతిలో) ఖైదీలై మీ వద్దకు వచ్చినపుడు మీరు వారిని విమోచనాధనం ఇచ్చి విడిపించేవారు. మరియు (వాస్తవానికి) వారిని తరమటం మీకు నిషిద్ధం చేయబడింది. ఏమీ? మీరు గ్రంథంలోని కొన్ని విషయాలను విశ్వసించి, మరి కొన్నింటిని తిరస్కరిస్తారా?[57] మీలో ఇలా చేసే వారికి, ఇహలోక జీవితంలో అవమానమూ మరియు పునరుత్థాన దినమున మిమ్మల్ని కఠిన శిక్షకు గురి చేయటం తప్ప మరెలాంటి ప్రతిఫలం ఉంటుంది? మరియు అల్లాహ్ మీ కర్మల విషయంలో నిర్లక్షంగా లేడు.

**86.** ఇలాంటి వారే పరలోకానికి బదులుగా ఇహలోక జీవితాన్ని కొనేవారు! కావున వీరికి పడే శిక్ష తగ్గించబడదు మరియు వీరికి ఎలాంటి

---

[57] ఇస్లాంకు ముందు మదీనాలో ముష్రిక్ అన్సార్లలో రెండు తెగలుండేవి: 1) 'ఔస్, 2) 'ఖ'జ్ రజ్ మరియు యూదులలో మూడు: 1) బనూ-ఖైనుఖా'అ 2) బనూ-న'దీర్ 3) బనూ-ఖురై"జహ్. 1. బనూ - ఖురై"జహ్-'ఔస్ వారి సమర్ధీకు('హలీఫ్) లు. 2. బనూ-ఖైనుఖా'అ మరియు బనూ-న'దీర్-'ఖ'జ్ రజ్ వారి సమర్ధీకు('హలీఫ్) లు. వీరి మధ్య శత్రుత్వం వల్ల యుద్ధాలు జరిగినపుడు వీరు (యూదులు) తమ జాతి సోదరులైన యూదులను చంపేవారు. వారిని, వారి ఇండ్ల నుండి వెడల గొట్టేవారు. మరియు వారి సంపదలను దోచుకునేవారు. కాని వారు యుద్ధఖైదీలే, వీరి సమర్ధీకు('హలీఫ్)ల దగ్గరికి వచ్చి నప్పుడు, విమోచన ధనం ఇచ్చి వారిని విడిపించుకునే వారు. ఈ విధంగా వారు తమ గ్రంథంలోని కొన్ని చట్టాలను పాటించేవారు. మరి కొన్నింటిని ఉల్లంఘించేవారు.

సహాయమూ లభించదు.

**87.** మరియు వాస్తవంగా మేము మూసాకు గ్రంథాన్ని (తౌరాత్ ను) ప్రసాదించాము మరియు అతని తర్వాత వరుసగా ప్రవక్తలను పంపాము. మరియు మర్యమ్ కుమారుడైన ఈసాకు (ఏసుకు) స్పష్టమైన సూచనలను ఇచ్చాము[58] మరియు పరిశుద్ధాత్మ (రూహుల్ ఖుదుస్) తో అతనిని బలపరిచాము[59]. ఏమీ? మీ మనోవాంఛలకు ప్రతికూలంగా ఉన్న దాన్ని తీసుకుని ఏ ప్రవక్త అయినా మీ వద్దకు వస్తే, మీరు వారి పట్ల దురహంకారంతో ప్రవర్తించలేదా? వారిలో కొందరిని మీరు అసత్యవాదులన్నారు, మరి కొందరిని చంపారు[60].

**88.** మరియు వారు: "మా హృదయాలు మూయబడి ఉన్నాయి." అని అంటారు. అలా కాదు (అది నిజం కాదు)! వారి సత్యతిరస్కారం వలన అల్లాహ్

[58] ఈసా ('అ.స.)కు అల్లాహుతా'ఆలా ప్రసాదించిన అద్భుత సూచనలు: చచ్చిన వారిని బ్రతికించటం, కుష్ఠురోగులను బాగుచేయటం మరియు పుట్టుగ్రుడ్డి వారికి చూపునివ్వటం మొదలైనవి. చూడండి, 3:49.

[59] పరిశుద్ధాత్మ అంటే జిబ్రీల్ ('అ.స.), (ఫ'త్హ అల్ - బయాన్, ఇబ్నె-కసీ'ర్ - బు'ఖారీ, ముస్లిం, (జిబ్రీల్ 'అ.స.) సమర్థన కొరకు అల్లాహ్ (సు.తా.) ను ప్రార్థించారు.

[60] ఈసా ('అ.స.)ను అబద్ధీకుడన్నారు. 'జకరియ్యా మరియు య'హ్యా ('అలైహిమ్ స.)లను చంపారు, (ము'హమ్మద్ జూనాగఢి). ఇంకా చూడండి, 2:61, వ్యాఖ్యానం 1.

వారిని శపించాడు (బహిష్కరించాడు)[61] ఎందుకంటే వారు విశ్వసించేది చాలా తక్కువ.

**89.** 8మరియు ఇప్పుడు వారి వద్ద నున్న దానిని (తౌరాత్ ను) ధృవీకరించే గ్రంథం (ఈ ఖుర్ఆన్) అల్లాహ్ తరఫు నుండి వారి వద్దకు వచ్చింది. మరియు దీనికి ముందు వారు సత్యతిరస్కారులపై విజయం కొరకు ప్రార్థించే వారు. ఇప్పుడు సత్యమని గుర్తించబడినది (ఈ గ్రంథం) వచ్చినా, వారు దానిని తిరస్కరించారు. కాబట్టి, సత్యతిరస్కారులపై అల్లాహ్ అభిశాపం (బహిష్కారం) అవతరిస్తుంది.

**90.** అల్లాహ్ అవతరింపజేసిన సందేశాన్ని (ఖుర్ఆన్ ను) తిరస్కరించి, వారు ఎంత నీచమైన మూల్యానికి తమను తాము అమ్ముకున్నారు! అది (వారి తిరస్కారం) అల్లాహ్! తన దాసులలో, తాను కోరిన వారిపై, తన అనుగ్రహం (ఖుర్ఆన్/ ప్రవక్తృత్వం) అవతరింపజేశాడనే కక్ష వల్లనే! కనుక వారు (అల్లాహ్) క్రోధం మీద మరింత క్రోధానికి గురయ్యారు. మరియు ఇలాంటి సత్యతిరస్కారులకు అవమానకరమైన శిక్ష ఉంది.

**91.** మరియు వారితో (యూదులతో): "అల్లాహ్ అవతరింపజేసిన దానిని (ఈ ఖుర్ఆన్ ను)

---

[61] ల'అనతున్: Wrath, Banishment, Rejection, Deprivation అంటే అల్లాహ్(సు.తా.) అనుగ్రహాల నుండి బహిష్కరించ, శపించ, నిషేధించ, త్రోసివేయ, దూషించ బడటం, మరియు అభిశాపం అనే అర్థాలున్నాయి.

విశ్వసించండి." అని అన్నప్పుడు, వారు: "మా (ఇస్రాయీల్) వారిపై అవతరింప జేయబడిన దానిని (తౌరాత్ ను) మాత్రమే మేము విశ్వసిస్తాము."అని అంటారు. మరియు దాని తరువాత వచ్చినది (ఈ ఖుర్ఆన్) సత్యమైనప్పటికీ మరియు వారి వద్దనున్న దానిని (తౌరాత్ ను) ధృవపరుస్తున్నప్పటికీ, దీనిని (ఈ ఖుర్ఆన్ ను) తిరస్కరిస్తున్నారు. (ఓ ముహమ్మద్) వారిని అడుగు: "మీరు (మీ వద్దనున్న గ్రంథాన్ని) విశ్వసించేవారే అయితే ఇంతకు పూర్వం వచ్చిన అల్లాహ్ ప్రవక్తలను ఎందుకు హత్య చేస్తూ వచ్చారు?[62]"

92. మరియు వాస్తవానికి మూసా స్పష్టమైన సూచనలను తీసుకొని మీ వద్దకు వచ్చాడు, తరువాత అతను పోగానే, మీరు ఆవుదూడ (విగ్రహాన్ని) ఆరాధ్యదైవంగా చేసుకున్నారు మరియు మీరు ఎంత దుర్మార్గులు!

93. మరియు మేము 'తూర్ పర్వతాన్ని ఎత్తి మీపై నిలిపి మీ నుంచి తీసుకున్న ప్రమాణాన్ని (జ్ఞాపకం చేసుకోండి): "మేము మీకు చేస్తున్న వాటిని (ఉపదేశాలను) స్థిరంగా పాటించండి మరియు జాగ్రత్తగా వినండి." అని చెప్పాము. వారు: "మేము విన్నాము కానీ అతిక్రమిస్తున్నాము." అని అన్నారు, వారి సత్యతిరస్కారం వలన వారి హృదయాలలో ఆవుదూడ ప్రేమ నిండి పోయింది.

---

[62] చూడండి, 2:61 మరియు 2:87.

వారితో అను: "మీరు విశ్వాసులే అయితే! ఈ చెడు చేష్టలను చేయమని మిమ్మల్ని ఆదేశించే మీ ఈ విశ్వాసం చాలా చెడ్డది."

**94.** వారితో ఇలా అను: "ఒకవేళ అల్లాహ్ వద్దనున్న పరలోక నివాసం మానవులందరికీ కాక కేవలం, మీకు మాత్రమే ప్రత్యేకించబడి ఉంటే[63], మీరు మీ ఈ అభిప్రాయంలో సత్యవంతులే అయితే, మీరు మరణాన్ని కోరండి!"

**95.** కాని వారు ఎన్నటికీ దానిని (మరణాన్ని) కోరరు. ఎందుకంటే, వారు తమ చేతులారా చేసి పంపినవి (తమ కర్మలు) వారికి బాగా తెలుసు. ఈ దుర్మార్గుల విషయం అల్లాహ్ కు బాగా తెలుసు.

**96.** మరియు నిశ్చయంగా, జీవితం పట్ల సర్వజనుల కంటే ఎక్కువ వ్యామోహం వారి (యూదుల)లోనే ఉందనే విషయం నీవు గ్రహిస్తావు. ఈ విషయంలో వారు ముష్రికులను కూడా మించి పోయారు. వారిలో ప్రతి ఒక్కడూ వేయి సంవత్సరాలు బ్రతకాలని కోరుతుంటాడు. కానీ దీర్ఘాయుర్దాయం వారిని శిక్ష నుండి తప్పించలేదు. మరియు వారు చేసేదంతా అల్లాహ్ చూస్తున్నాడు[64].

**97.** (ఓ ప్రవక్తా!) వారితో ఇలా అను: "జిబ్రీల్ పట్ల విరోధమున్న ప్రతివాడూ ఈ యథార్థాన్ని గ్రహించాలి. అల్లాహ్ ఆజ్ఞతోనే అతను ఈ

---

[63] చూడండి, 2:111.

[64] అల్-బ'సీరు: The All - Seeing. సర్వదృష్టికర్త, అంతా చూడ, గమనించ గలవాడు. ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి.

ఖుర్ఆన్ ను నీ హృదయంపై అవతరింపజేశాడు. పూర్వం వచ్చిన అన్ని దివ్యగ్రంథాలను ఇది ధృవీకరిస్తున్నది మరియు విశ్వసించే వారికి ఇది సన్మార్గం చూపుతున్నది మరియు శుభవార్తను ఇస్తున్నది[65].

98. "అల్లాహ్ కు ఆయన దూతలకు, ఆయన ప్రవక్తలకు, జిబ్రీల్ కు మరియు మీకాయీల్ కు ఎవరు శత్రువులో, నిశ్చయంగా అలాంటి సత్యతిరస్కారులకు అల్లాహ్ శత్రువు[66]."

99. మరియు వాస్తవంగా, మేము నీపై స్పష్టమైన సూచనలు (ఆయత్) అవతరింపజేశాము. మరియు అవిధేయులుతప్ప మరెవ్వరూ వాటిని తిరస్కరించరు.

100. ఏమీ? వారు ఒడంబడిక చేసినపుడల్లా, వారిలో ఒక వర్గం వారు దానిని త్రోసి పుచ్చటం జరగలేదా?

---

[65] కొందరు యూదమతాచారులు మహాప్రవక్త ('స'అస) దగ్గరికి వచ్చి అన్నారు: "మీరు మా కొన్ని ప్రశ్నలకు సరైన జవాబులు ఇస్తే మేము ఇస్లాం స్వీకరిస్తాము. ఎందుకంటే ఒక ప్రవక్త తప్ప మరొకరు వీటికి జవాబివ్వలేరు." మహాప్రవక్త ('స'అస) వారి ప్రశ్నలన్నింటికీ జవాబిచ్చారు. వారు ఇలా అన్నారు: "మీ వద్దకు వ'హీ ఎవరు తెస్తారు?" అతను జవాబిచ్చారు: "జిబ్రీల్ ('అ.స.) వారన్నారు: "జిబ్రీల్ ('అ.స.) మా శత్రువు, అతనే మా పై యుద్ధాలను మరియు శిక్షలను అవతరింప జేశాడు, కాబట్టి మేము మిమ్మల్ని ప్రవక్తగా నమ్మము." అని అంటూ వెళ్ళిపోయారు, (ఇబ్నె-కసీ'ర్ మరియు ఫత్హ్ అల్ ఖదీర్, ర.'అలైహిమ్).

[66] యూదులు అంటారు: "మీకాయీ'ల్ ('అ.స.) మాస్నేహితుడు." అల్లాహ్ (సు.తా.) అంటాడు: "వీరంతా నాకు ప్రియమైన నా దాసులు. కావున ఏ వ్యక్తి అయినా వీరిలో ఏ ఒక్కరికీ శత్రువైనా వాడు నాకూ శత్రువే!"

వాస్తవానికి వారిలో చాలా మంది విశ్వసించని వారున్నారు.

**101.** మరియు వారి దగ్గర పూర్వం నుంచే ఉన్న దానిని (దివ్యగ్రంథాన్ని) ధృవపరుస్తూ ఒక ప్రవక్త (ముహమ్మద్) అల్లాహ్ తరఫు నుండి వారి వద్దకు వచ్చినప్పుడు, గ్రంథ ప్రజలలోని ఒక వర్గం వారు దానిని గురించి ఏమీ తెలియని వారిగా, అల్లాహ్ గ్రంథాన్ని తమ వీపుల వెనుకకు త్రోసి వేశారు[67].

**102.** మరియు వారు సులైమాన్ రాజ్య కాలమున, షైతానులు పఠించే దానిని (జాల విద్యను) అనుసరించారు. సులైమాన్ సత్యతిరస్కారి కాలేదు; కానీ నిశ్చయంగా, షైతానులు సత్యాన్ని తిరస్కరించారు. వారు బాబీలోన్ నగరమందు, హారూత్ మారూత్, అనే ఇద్దరు దేవదూతల ద్వారా తేబడిన జాలవిద్యను ప్రజలకు నేర్పుచుండిరి. ఎవరికైనా ఆ విద్యను నేర్పేటప్పుడు, వారిద్దరు (దేవదూతలు) ఇలా చెప్పే వారు: "నిశ్చయంగా మేము (మానవులకు) ఒక పరీక్ష! కాబట్టి మీరు (ఈ జాలవిద్యను నేర్చుకొని) సత్యతిరస్కారులు కాకండి." అయినప్పటికీ వారు (ప్రజలు), భార్యా-భర్తలకు ఎడబాటు కలిగించేది (జాలవిద్య) వారిద్దరి దగ్గర నేర్చుకునేవారు. మరియు అల్లాహ్ అనుమతి

---

[67] యూదుల దివ్యగ్రంథం ('తౌరాత్)లో: "అరేబీయాలో ఒక ప్రవక్త వస్తాడు, మీరు అతనిని అనుసరించాలి." అని, ప్రస్తావన ఉన్నా, వారు లెక్క చేయకుండా దానిని ('తౌరాత్ ను) తమ వీపుల వెనుకకు త్రోసి వేశారు. చూడండి, 2:42, 76.

లేనిదే, దాని ద్వారా ఎవరికీ ఏ మాత్రం హాని కలిగించలేరు. మరియు వారు నేర్చుకునేది, వారికి నష్టం కలిగించేదే, కాని లాభం కలిగించేది ఎంత మాత్రం కాదు. మరియు వాస్తవానికి దానిని (జాలవిద్యను) స్వీకరించేవానికి పరలోక సౌఖ్యాలలో ఏ మాత్రమూ భాగం లేదని వారికి బాగా తెలుసు. మరియు వారు ఎంత తుచ్ఛమైన సొమ్ముకు బదులుగా తమను తాము అమ్ముకున్నారు! ఇది వారికి తెలిస్తే ఎంత బాగుండేది!

**103.** మరియు వారు విశ్వసించి, దైవభీతి కలిగి ఉండినట్లయితే! నిశ్చయంగా, అల్లాహ్ తరఫు నుండి వారికి ఎంతో శ్రేష్ఠమైన ప్రతిఫలం లభించి ఉండేది. దీనిని వారు గ్రహిస్తే ఎంత బాగుండేది!

**104.** ఓ విశ్వాసులారా, (మీరు ప్రవక్తతో మాట్లాడేటప్పుడు) రా'ఇనా! అని అనకండి. ఉన్''జుర్నా! అని (గౌరవంతో) అనండి[68] మరియు (అతని మాటలను) శ్రద్ధతో వినండి. మరియు సత్యతిరస్కారులకు బాధాకరమైన శిక్ష గలదు.

---

[68] రా'ఇనా: అంటే, Be careful; Listen to us, we lsiten to you. ఆగండి! మా మాట వినండి, మేము మీ మాట వింటాము, అని అర్థం. కాని యూదులు ఈ పదాన్ని తమ నాలుకలను త్రిప్పి, హీబ్రూ భాషలో, 'రా'ఈనా'-మా పశువుల కాపరి లేక మూర్ఖుడు అనే అర్థం ఇచ్చే దురుద్దేశంతో పలికి తమ కక్ష తీర్చుకునేవారు. కాబట్టి విశ్వాసులతో: మీరు 'ఉన్ జుర్ నా' అంటే 'మమ్మల్ని అర్థం చేసుకో నివ్వండి.' అని గౌరవంతో, అనమని ఆజ్ఞ ఇవ్వబడుతోంది. ఇదే విధంగా యూదులు 'అస్సలాము అలైకుమ్' (మీకు శాంతి కలుగు గాక!) అనే మాటను నాలుకలు త్రిప్పి 'అస్సాము అలైకుమ్' (మీకు చావు వచ్చు గాక!) అనే అర్థంలో వాడేవారు. ఇంకా చూడండి, ఖు. 4:46.

**105.** సత్యతిరస్కారులైన గ్రంథప్రజలకు గానీ మరియు బహుదైవారాధకులకు (ముష్రికులకు) గానీ, మీ ప్రభువు నుండి మీకు ఏదైనా మేలు అవతరించడం ఎంత మాత్రం ఇష్టం లేదు. కానీ అల్లాహ్ తాను కోరిన వారినే తన కరుణకు ప్రత్యేకించు కుంటాడు. మరియు అల్లాహ్ అనుగ్రహించటంలో సర్వోత్తముడు[69].

**106.** మేము మా ప్రవచనాలలో (ఆయాత్ లలో) ఒక దానిని రద్దు చేసినా లేక మరపింప జేసినా దాని స్థానంలో దాని కంటే శ్రేష్ఠమైన దానిని లేక కనీసం దానితో సమానమైన దానిని తీసుకువస్తాము. ఏమీ? నిశ్చయంగా, అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడని నీకు తెలియదా?

**107.** ఏమీ?వాస్తవానికి,భూమ్యాకాశాలసామ్రాజ్యాధిపత్యం కేవలం అల్లాహ్ కే చెందుతుందని, నీకు తెలియదా? మరియు అల్లాహ్ తప్ప మిమ్మల్ని రక్షించేవాడు[70] గానీ, సహాయం చేసేవాడు గానీ మరెవ్వడూ లేడు!

**108.** ఏమీ? పూర్వం (యూదులచే) మూసా ప్రశ్నించబడినట్లు, మీరు కూడా మీ ప్రవక్త (ముహమ్మద్)ను ప్రశ్నించగోరుతున్నారా?

---

[69] అల్-'అ"జీము: అంటే అల్-కబీరు. The Greatest of All, The Supreme, The Incomparably Great. సర్వోత్తముడు,మహాత్ముడు,పరమశ్రేష్ఠుడు,సర్వోత్కృష్టుడు. ఇది అల్లాహ్(సు.తా.) అత్యుత్తమపేర్లలో ఒకటి

[70] అల్-వలియ్యు: అంటే అస్-సయ్యిద్, Patron, Protector, Owner, Defender, Friend, సంరక్షకుడు, ఆరాధ్యుడు, స్నేహితుడు, సహాయకుడు, రక్షించువాడు, స్వామి, అండగా నిలుచువాడు. ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి. చూడండి, 6:14.

మరియు ఎవడైతే, సత్యతిరస్కారాన్ని, విశ్వాసానికి బదులుగా స్వీకరిస్తాడో! నిశ్చయంగా, వాడే సరైన మార్గం నుండి తప్పిపోయిన వాడు.

**109.** గ్రంథప్రజలలోని పలువురు - వారి మనస్సులలో ఉన్న అసూయ వల్ల - సత్యం వారికి సుస్పష్టం అయినప్పటికీ, మీరు విశ్వసించిన తరువాత, మిమ్మల్ని ఏదో ఒక విధంగా, దాని (విశ్వాస మార్గం) నుండి మరల్చి మళ్ళీ సత్యతిరస్కారం వైపునకు తీసుకు పోదామని కోరుతుంటారు. అయితే (వారి పట్ల) అల్లాహ్ తన ఆదేశం ఇచ్చేవరకు, మీరు (వారిని) మన్నించండి, ఉపేక్షించండి. నిశ్చయంగా, అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు.

**110.** మరియు నమాజ్ స్థాపించండి[71]. విధిదానం (జకాత్) ఇవ్వండి. మీరు ముందుగా చేసి పంపిన మంచి కార్యాలను మీరు అల్లాహ్ దగ్గర పొందుతారు. నిశ్చయంగా, అల్లాహ్ మీరు చేసేదంతా చూస్తున్నాడు.

**111.** మరియు వారు: "యూదుడు లేదా క్రైస్తవుడు తప్ప, మరెవ్వడూ స్వర్గంలో ప్రవేశించ లేడు!" అని అంటారు. ఇవి వారి అభిలాషలు మాత్రమే. వారిని ఇలా అడుగు: "మీరు సత్యవంతులే అయితే దానికి మీ నిదర్శనాలు చూపండి!"

**112.** వాస్తవానికి ఎవడైతే అల్లాహ్ కు విధేయుడై (ఇస్లాం

[71] అంటే నమా'జ్ లను వాటి సమయాలలో, సరిగ్గా దినానికి ఐదు సార్లు, పురుషులు జమా'అత్ తో మరియు స్త్రీలు ఇండ్లలో పాటించాలి, అని అర్థం.

స్వీకరించి) తన ముఖాన్ని (తనను తాను) అల్లాహ్ కు అంకితం చేసుకుని, సజ్జనుడై ఉంటాడో! దానికి అతడు తన ప్రభువు వద్ద మంచి ప్రతిఫలం పొందుతాడు[72]. మరియు వారికి ఎలాంటి భయమూ ఉండదు మరియు వారు దుఃఖపడరు కూడా!

113. మరియు యూదులు: "క్రైస్తవుల వద్ద (సత్యధర్మమనేది) ఏదీ లేదు." అని అంటారు. మరియు క్రైస్తవులు: "యూదుల వద్ద (సత్యధర్మమనేది) ఏదీ లేదు." అని అంటారు. మరియు వారందరూ చదివేదు దివ్యగ్రంథమే. ఇలాగే (దివ్యగ్రంథ) జ్ఞానం లేనివారు (బహుదైవారాధకులు) కూడా ఇదే విధంగా పలుకుతుంటారు. కావున వారందరిలో ఉన్న అభిప్రాయభేదాలను గురించి, అల్లాహ్ పునరుత్థాన దినమున వారి మధ్య తీర్పు చేస్తాడు.

114. మరియు అల్లాహ్ మస్జిద్ లలో ఆయన నామస్మరణం నిషేధించి వాటిని నాశనం చేయటానికి పాటు పడే వారి కంటే ఎక్కువ దుర్మార్గులెవరు? అలాంటి వారు వాటిలో (మస్జిద్ లలో) ప్రవేశించటానికి అర్హులు కారు; వారు (ఒకవేళ ప్రవేశించినా) భయపడుతూ ప్రవేశించాలి. వారికి ఇహలోకంలో పరాభవం ఉంటుంది మరియు

[72] "అస్లమ వహ్ హహు లిల్లాహ్." అంటే, కేవలం అల్లాహ్ (సు.తా.) ప్రసన్నత కొరకే ఏదైనా చేయాలి. "వహువ ముహ్ సినున్:" అంటే ఏ పనైనా హృదయపూర్వకంగా, మహా ప్రవక్త ('స'అస) ఆదేశాల ప్రకారం చేయాలి. చేసిన కార్యాలకు మంచి ప్రతిఫలం పొందటానికి, ఈ రెండు విషయాలను దృష్టిలో ఉంచుకోవటం ఎంతో అవసరం. (ఇబ్నె-కసీ'ర్).

పరలోకంలో ఘోర శిక్ష ఉంటుంది.

**115.** మరియు తూర్పు పడమరలు అల్లాహ్ కే చెందినవి. కావున మీరు (మీ ముఖాలను) ఏ దిక్కుకు త్రిప్పినా మీకు అల్లాహ్ సముఖమే లభిస్తుంది. నిశ్చయంగా, అల్లాహ్, సర్వవ్యాప్తి[73], సర్వజ్ఞుడు.

**116.** మరియు వారు: "అల్లాహ్ ఒక కుమారుణ్ణి కలిగి ఉన్నాడు (కన్నాడు)." అని అంటారు. ఆయన సర్వలోపాలకు అతీతుడు[74]. వాస్తవానికి భూమ్యాకాశాలలో ఉన్నవన్నీ ఆయనకు చెందినవే. అవన్నీ ఆయనకు విధేయులై ఉన్నాయి[75].

**117.** ఆయనే ఆకాశాలనూ మరియు భూమినీ ఏ

---

[73] అల్-వాసి'ఉ: The All-Embracing, Infinite, Pervading, Bountiful, Comprehending all, Having ample Power or ability. Has full knowledge of all things, All-Sufficient, సర్వవ్యాప్తి, సర్వోపగతుడు, విస్తారుడు, అంతం లేనివాడు, అపారుడు, అత్యంత ఉదారుడు, సంపలోసంగు వాడు, అల్లాహ్ జ్ఞానం ప్రతి దానిని ఆవరించు (ఇముడ్చు)కొని ఉంది. దివ్యఖుర్ఆన్ లో, వాసి'ఉన్ 'అలీమున్ అనే పదాలు ఇంకా 6 చోట్లలో వచ్చాయి. అవి: 2:247, 261, 268, 3:73, 5:54, 24:32. ఈ రెండూ అల్లాహుతా'ఆలా అత్యుత్తమ పేర్లు. ఇంకా చూడండి, వాసి'ఉన్ కొరకు, 4:130, 7:156, 53:32.

[74] సుబ్ హాన: సర్వలోపాలకు అతీతుడు, పరిశుద్ధుడు, పరమ పవిత్రుడు, చూడండి, 2:32

[75] ఇబ్నె - 'అబ్బాస్ (ర'.ది.'అ.) కథనం. ('స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 6, 'హదీస్' నం. 9).

నమూనాలేకుండాఆరంభించిన (సృష్టించిన)[76]
వాడు. మరియు ఆయన ఏదైనా చేయాలని
నిర్ణయించుకున్నప్పుడు దానిని కేవలం:
"అయిపో!" అని ఆజ్ఞాపిస్తాడు. అంతే అది
అయిపోతుంది[77].

**118.** మరియు అజ్ఞానులు: "అల్లాహ్ మాతో ఎందుకు మాట్లాడడు? లేక మా వద్దకు ఏదైనా సూచన (ఆయత్) ఎందుకు రాదు? అని అడుగుతారు. వారికి పూర్వం వారు కూడా ఇదే విధంగా అడిగేవారు[78]. వారందరి మనస్తత్వాలు (హృదయాలు) ఒకే విధమైనవి. వాస్తవానికి, దృఢనమ్మకం ఉన్న వారికి మేము మా సూచన (ఆయత్) లను స్పష్టపరుస్తాము.

**119.** నిశ్చయంగా, మేము నిన్ను (ఓ ముహమ్మద్) సత్యాన్ని ప్రసాదించి, శుభవార్త నిచ్చేవానిగా మరియు హెచ్చరిక చేసే వానిగా పంపాము. మరియు భగ-భగ మండే నరకాగ్నికి గురి అయ్యే

---

[76] బదీ'ఉ (అల్-బదీ'ఉ): Innovator. ఏ నమూనా లేకుండా ఆరంభించిన వాడు (ఆరంభకుడు), ప్రారంభకుడు, మొదటిసారి క్రొత్తగా సృష్టించినవాడు. ప్రభవింపబజేసేవాడు. ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి. చూడండి, 6:101.

[77] అల్లాహుతా'ఆలా ఏదైనా చేయదలచుకుంటే దానిని కేవలం: 'అయిపో!' అని ఆజ్ఞాపిస్తాడు. అంతే అది అయిపోతుంది. అలాంటప్పుడు ఆయనకు సంతానం కనే అవసరం ఎందుకుంటుంది. ఈ విధమైన వాక్యం 'కున్ ఫ యకూన్' ఖుర్ఆన్ లో 8 సార్లు వచ్చింది. చూడండి, 3:47, 59, 6:73, 16:40, 19:35, 36:82, 40:68.

[78] చూడండి, 17:90-93.

వారిని గురించి నీవు ప్రశ్నించబడవు[79].

**120.** మరియు యూదులైనా, క్రైస్తవులైనా నీవు వారి మతమును అనుసరించే వరకూ, వారు నీతో సంపన్నులు కారు. నీవు: "నిశ్చయంగా, అల్లాహ్ చూపిన మార్గమే సన్మార్గం." అని చెప్పు. మరియు నీకు జ్ఞానం లభించిన తరువాత కూడా, నీవు వారి కోరికలను అనుసరిస్తే, అల్లాహ్ (శిక్ష) నుండి నిన్ను రక్షించేవాడు గానీ, సహాయపడేవాడు గానీ ఎవ్వడూ ఉండడు.

**121.** మేము దివ్య గ్రంథాన్ని ప్రసాదించినవారు (యూదులు మరియు క్రైస్తవులు), దానిని (తమ గ్రంథాన్ని) కర్తవ్యంతో పఠించ వలసిన విధంగా పఠిస్తే, అలాంటి వారు దీనిని (ఈ ఖుర్ఆన్ ను) విశ్వసిస్తారు. మరియు దీనిని (ఈ ఖుర్ఆన్ ను) తిరస్కరించేవారే నష్టపడువారు[80].

**122.** ఓ ఇస్రాయీల్ సంతతి వారలారా! నేను మీకు ప్రసాదించిన అనుగ్రహాన్ని జ్ఞాపకం చేసుకోండి మరియు నిశ్చయంగా, నేను మిమ్మల్ని (మీ

---

[79] చూడండి, 3:85

[80] ఇక్కడ పూర్వగ్రంథప్రజలు, అంటే యూదులు మరియు క్రైస్తవులలోని కొందరు సత్పురుషుల విషయం తెలుపబడింది. ఉదా: 'అబ్దుల్లాహ్ బిన్-సల్లామ్, సల్మాన్ ఫార్సీ(ర'ది.'అన్హుమ్) ల వంటివారు. వారు తమ గ్రంథాలలో పేర్కొనబడిన రాబోయే ప్రవక్త ము'హమ్మద్ ('స'అస) మే అన్న సత్యాన్ని గ్రహించి, విశ్వసించి సత్యధర్మమైన ఇస్లామ్ ను స్వీకరించారు. ఏ ధర్మాన్నైతే దైవప్రవక్తలు ఆదమ్, నూ'హ్, ఇబ్రాహీమ్, మూసా మరియు 'ఈసా మొదలైనవారు ('అలైహిమ్. స.) ఆచరించి, బోధించారో!

కాలంలోని) సర్వ లోకాల వారి కంటే ఎక్కువగా ఆదరించాను.

**123.** మరియు ఆ (పునరుత్థాన) దినాన్ని గురించి భయభీతి కలిగి ఉండండి, ఆనాడు ఏ వ్యక్తి కూడా మరొక వ్యక్తికి ఏ మాత్రమూ ఉపయోగపడలేడు. మరియు ఎవడి నుండీ ఎలాంటి పరిహారం స్వీకరించబడదు. మరియు ఎవడికీ సిఫారసూ లాభదాయకం కాజాలదు మరియు వారికెలాంటి సహాయమూ లభించదు.

**124.** మరియు ఇబ్రాహీమ్ ను అతని ప్రభువు (కొన్ని) ఉత్తరువులిచ్చి పరీక్షించిన విషయాన్ని (జ్ఞాపకం చేసుకోండి). వాటి అన్నింటిలో అతను నెగ్గాడు. అప్పుడు ఆయన (అల్లాహ్): "నిశ్చయంగా, నేను నిన్ను మానవ జాతికి నాయకునిగా చేస్తున్నాను." అని అన్నాడు. (దానికి ఇబ్రాహీమ్): "మరి నా సంతతి వారు?" అని అడిగాడు[81]. (దానికి అల్లాహ్): "నా వాగ్దానం దుర్మార్గులైన వారికి వర్తించదు." అని

---

[81] అల్లాహ్(సు.తా) ఇబ్రాహీమ్('అ.స) యొక్క ఈవిన్నపాన్ని పూర్తిచేశాడు.ఇది 29:27లో పేర్కొన బడింది

జవాబిచ్చాడు[82].

**125.** మరియు ఈ (కఅబహ్) గృహాన్ని మేము మానవులను తరచుగా సందర్శించే కేంద్రం (పుణ్యస్థలం)గా మరియు శాంతి నిలయంగా చేసి[83], ఇబ్రాహీమ్ నిలబడిన చోటును మీరు నమాజ్‌చేసేస్థలంగాచేసుకోండన్న[84]విషయాన్ని (జ్ఞాపకం చేసుకోండి). మరియు మేము ఇబ్రాహీమ్

---

[82] "నా వాగ్దానం దుర్మార్గులైన వారికి వర్తించదు." అల్లాహ్ (సు. తా.) యొక్క ఈ ప్రవచనం ఎంతో ఆలోచింపదగినది. ఇక్కడ ఆయన విశదపరచింది ఏమిటంటే : ఒక మంచి సత్పురుషుని లేక ప్రవక్త సంతతికి చెందినంత మాత్రానా - వారు అవిశ్వాసులై, సత్కార్యాలు చేయని వారైతే - వారి వంశకీర్తి, వారి పెద్దల ప్రవక్తృత్వం వారికి ఏ విధంగానూ పనికిరాదు. ప్రతి ఒక్కడూ తన స్వంత విశ్వాసం మరియు సత్కార్యాల ఆధారంగానే ప్రతిఫలం పొందుతాడు. మహా ప్రవక్త ('స'అస) 'హదీస్' ఇలా ఉంది : "ఏ వ్యక్తి వ్యవహారాలైతే అతనిని వెనుక విడిచాయో, అలాంటి వ్యక్తి పుట్టు పూర్వోత్తరాలు, వంశ ప్రతిష్ఠలు అతనిని ఏ మాత్రం ముందుకు తేలేవు." ('స'హీ'హ్ ముస్లిం).

[83] మసా'బతల్లిన్నాస్ : అంటే, ప్రజల కొరకు పుణ్యస్థలం. దీని మరొక అర్థం, మాటిమాటికీ సందర్శించే కేంద్రం. ఎందుకంటే ఒకసారి అల్లాహ్ (సు.తా.) గృహాన్ని సందర్శించినవాడు, మళ్ళీ మళ్ళీ దానిని దర్శించాలని కోరుతూ ఉంటాడు. దీని మరొక మహత్త్వమేమిటంటే, ఇది శాంతి కేంద్రం. అంటే ఇక్కడ ఏ శత్రువు భయం ఉండదు. అందుకే అజ్ఞాన కాలంలో కూడా ముష్రిక్ లు 'హరమ్ సరిహద్దులలో తమ శత్రువులతో పోరాడటం గానీ, హత్యలు గానీ చేసేవారు కాదు.

[84] మఖామె ఇబ్రాహీమ్: అంటే ఇబ్రాహీమ్ ('అ.స.) నిలబడిన రాయి. అతను దానిపైన నిలబడి క'అబహ్ గృహాన్ని నిర్మించారు. అది 'హరమ్ లో క'అబహ్ కు దగ్గరగా ఉంది. 'తవాఫ్ పూర్తి చేసిన వారు ప్రతి ఒక్కరూ, దాని దగ్గరలో రెండు రకా'అతులు నమా'జ్ చేస్తారు.

మరియు ఇస్మా'యీల్ లకు: "నా ఈ గృహాన్ని ప్రదక్షిణ చేసేవారి కొరకూ, ఏకాంత ధ్యానం (ఏతికాఫ్) పాటించేవారి కొరకూ, వంగే (రుకూఉ చేసే) వారి కొరకూ మరియు సజ్దాలు చేసే వారి కొరకూపరిశుద్ధంగాఉంచండి."అనినిర్దేశించాము.

126. మరియు (జ్ఞాపకం చేసుకోండి) ఇబ్రాహీమ్: "ఓ నా ప్రభూ! ఈ నగరాన్ని (మక్కాను) శాంతియుతమైన నగరంగా చేసి, ఇందు నివసించేవారిలో అల్లాహ్ ను మరియు అంతిమ దినాన్ని విశ్వసించేవారికి అన్ని రకాల ఫలాలను జీవనోపాధిగా నొసంగు." అని ప్రార్థించినప్పుడు, (అల్లాహ్): "మరియు ఎవడు సత్యతిరస్కారి అవుతాడో అతనికి నేను ఆనందించ టానికి కొంతకాలం విడిచి పెడ్తాను. తరువాత అతనిని నరకాగ్నిలోకి బలవంతంగా త్రోసి వేస్తాను. అది ఎంత దుర్భరమైన గమ్యస్థానం!" అని అన్నాడు.

127. మరియు (జ్ఞాపకం చేసుకోండి) ఇబ్రాహీమ్ మరియు ఇస్మా'యీల్ ఈ గృహపు (క'అబహ్) పునాదులను ఎత్తేటపుడు (ఈవిధంగా ప్రార్థించారు):"ఓ మా ప్రభూ!మా ఈ సేవను స్వీకరించు.
నిశ్చయంగా, నీవు మాత్రమే సర్వం వినేవాడవు[85],

[85] అస్-సమీ'ఉ: The All-Hearing. Who hears every thing. సర్వం వినేవాడు, సర్వశ్రవణ సమర్థుడు. అస్-సమీ'ఉన్ - 'అలీము, ఈ ద్వంద పదం ఖుర్ఆన్ లో ఎన్నో సార్లు వచ్చింది. 29 సార్లు. ఇవి అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లు.

సర్వజ్ఞుడవు[86]."

**128.** "ఓ మా ప్రభూ! మమ్మల్ని నీకు విధేయులుగా (ముస్లింలుగా) చేయి మరియు మా సంతతి నుండి ఒక సంఘాన్ని నీకు విధేయులుగా (ముస్లింలుగా) ఉండునట్లు చేయి. మరియు మాకు, మా ఆరాధనారీతులను (మనాసిక్ లను) తెలుపు మరియు మా పశ్చాత్తాపాన్ని అంగీకరించు. నిశ్చయంగా, నీవే పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడవు, అపార కరుణా ప్రదాతవు."

**129.** "ఓ మా ప్రభూ! వీరిలో నుండి నీ సందేశాలను చదివి వినిపించుటకునూ, నీ గ్రంథాన్ని నేర్పుటకునూ, దివ్యజ్ఞానాన్ని బోధించుటకునూ మరియు వారిని పరిశుద్ధులుగా మార్చుటకునూ ఒక సందేశహరుణ్ణి పంపు[87].
నిశ్చయంగా, నీవే సర్వశక్తిమంతుడవు[88], మహా వివేకవంతుడవు."

**130.** మరియు ఇబ్రాహీమ్ మతం నుండి

---

[86] అల్-'అలీము: The All Knowing, సర్వజ్ఞుడు, చూడండి, 2:32.

[87] ఇది ఇబ్రాహీమ్ మరియు ఇస్మా'యీల్ ('అలైహిమ్. స.)ల యొక్క చివరి దు'ఆ. అల్లాహ్ (సు.తా.) దీనిని స్వీకరించి ఇస్మాయీ'ల్ ('అ.స.) సంతతి నుండి ము'హమ్మద్ ('స'అస) ను సందేశహరునిగా పంపాడు. కావున ము'హమ్మద్ ('స'అస) అన్నారు: 'నేను నా తండ్రి ఇబ్రాహీమ్ ('అ.స.) యొక్క దు'ఆను, 'ఈసా ('అ.స.) యొక్క శుభవార్తను మరియు నా తల్లి యొక్క కలను.' (ఫ'త్హ రబ్బాని).

[88] అల్-'అజీ'జ్: సర్వశక్తిసంపన్నుడు, సర్వశక్తిమంతుడు, ఆయన అధికారం సర్వాన్ని పరివేష్ఠించి ఉన్నది, గౌరవానికి మూలాధారి. The Almighty

విముఖుడయ్యేవాడెవడు, తనను తాను అవివేకిగా చేసుకొనువాడు తప్ప? వాస్తవానికి మేము అతనిని (ఇబ్రాహీమ్'ను) ఈ లోకంలో ఎన్ను కున్నాము. మరియు నిశ్చయంగా, అతను పరలోకంలో సద్వర్తనులతో పాటు ఉంటాడు.

131. అతని ప్రభువు అతనితో: "(మాకు) విధేయుడవుగా (ముస్లింగా) ఉండు." అని అన్నప్పుడు అతను: "నేను సర్వలోకాల ప్రభువునకు విధేయుడను (ముస్లింను) అయి పోయాను." అని జవాబిచ్చాడు.

132. మరియు ఇబ్రాహీమ్ తన సంతానాన్ని దీనిలోనే (ఈ ఇస్లాం మార్గంలోనే) నడవండని బోధించాడు. మరియు యఅఖూబ్ కూడా (తన సంతానంతో అన్నాడు): "నా బిడ్డలారా! నిశ్చయంగా, అల్లాహ్ మీ కొరకు ఈ ధర్మాన్నే నియమించి ఉన్నాడు. కావున మీరు అల్లాహ్ కు విధేయులు (ముస్లింలు) కాకుండా మరణించకండి!"[89].

133. ఏమీ? యఅఖూబ్ కు మరణం సమీపించినప్పుడు,

[89] ఇబ్రాహీమ్ మరియు య'అఖూబ్ ('అలైహిమ్ స.) కూడా తమ సంతానాన్ని అనుసరించమని బోధించిన ధర్మం ఇస్లామ్ మాత్రమే. ఈ ఇస్లాం ధర్మం అంటే అల్లాహ్ (సు.తా.) కు మాత్రమే దాస్యం చేయటం (విధేయులుగా ఉండటం). ఇదే ఆదమ్ ('అ.స.) నుండి చిట్టచివరి ప్రవక్త ము'హమ్మద్ ('స'అస) వరకూ ప్రవక్తలందరూ బోధించిన ధర్మం. (చూడండి, 3:19)

మీరు అక్కడ ఉన్నారా?[90]" అప్పుడతను తన కుమారులతో: "నా తరువాత మీరు ఎవరిని ఆరాధిస్తారు?" అని అడిగి నప్పుడు. వారన్నారు: "నీ ఆరాధ్యదైవం మరియు నీ పూర్వీకులగు ఇబ్రాహీమ్, ఇస్మాయీల్ మరియు ఇస్హాఖ్ ల ఆరాధ్యదైవమైన ఆ ఏకైక[91] దేవుణ్ణి (అల్లాహ్ నే) మేము ఆరాధిస్తాము మరియు మేము ఆయనకే విధేయులమై (ముస్లింలమై) ఉంటాము."

**134.** అది ఒక గతించిన సమాజం. దాని కర్మల ఫలితం దానికి మరియు మీ కర్మలది మీకు. మరియు వారు చేస్తూ ఉండిన కర్మలను గురించి మీరు ప్రశ్నించబడరు.

**135.** మరియు వారంటారు: "మీరు యూదులుగా లేదా క్రైస్తవులుగా ఉంటేనే మీకు మార్గదర్శకత్వం లభిస్తుంది!" వారితో అను:"వాస్తవానికి, మేము (అనుసరించేది) ఇబ్రాహీమ్ మతం, ఏకదైవ సిద్ధాంతం (హనీఫా) మరియు అతను బహు-దైవారాధకుడు కాడు[92]."

---

[90] ఇక్కడ యూదులు ప్రశ్నింపబడుతున్నారు: "య'అఖూబ్ ('అ.స.) మరణించినప్పుడు మీరైతే అక్కడ లేరు కదా! అలాంటప్పుడు మీకెలా తెలుసు, అతను తన కుమారులకు బోధించిన ధర్మమేమిటో?" అతనే గాక ప్రతి ప్రవక్త బోధించిన ధర్మం ఇస్లాం మాత్రమే. ('స'హీ'హ్ బు'ఖారీ).

[91] అల్-వా'హిద్: The One, The Sole. అద్వితీయుడు, ఒకే ఒక్కడు. ఏకైకుడు ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి. చూడండి, 2:163, 12:39. అహదున్: The Unique and Alone, ఏకైకుడు, ఒకే ఒక్కడు. చూడండి, 112:1, 4.

[92] చూడండి, 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 5, 'హదీస్' నం. 169.

136. (ఓ ముస్లింలారా!) మీరు ఇలా అనండి: "మేము అల్లాహ్ ను మరియు ఆయన మా కొరకు అవతరింపజేసిన సందేశాలను మరియు ఇబ్రాహీమ్, ఇస్మాయీల్, ఇస్ హాఖ్, యఅఖూబ్ మరియు అతని సంతతి వారికి ఇవ్వబడిన వాటినీ మరియు మూసా, 'ఈసా మరియు ఇతర ప్రవక్తలందరికీ వారి ప్రభువు తరఫు నుండి ఇవ్వబడిన వాటినీ (సందేశాలను) విశ్వసిస్తాము. వారిలో ఏ ఒక్కరి పట్లా మేము భేదభావం చూపము. మేము ఆయనకు విధేయులం (ముస్లింలం) అయ్యాము."

137. వారు కూడా మీరు విశ్వసించినట్లు విశ్వసిస్తే, వారు సన్మార్గం పొందిన వారవుతారు. ఒకవేళ వారు తిరిగిపోతే, విరోధం వహించిన వారవుతారు. (వారి నుండి రక్షించటానికి) మీకు అల్లాహ్ చాలు. ఆయనే సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

138. (వారితో ఇలా అను): "(మీరు) అల్లాహ్ రంగును (ధర్మాన్ని) స్వీకరించండి. మరియు అల్లాహ్ కంటే మంచి రంగు (ధర్మం) ఎవరిది? మరియు మేము

ఆయనను మాత్రమే ఆరాధించేవారము[93]."

139. (ఓ ముహమ్మద్!) వారితో అను: "ఏమీ? అల్లాహ్ విషయంలో మీరు మాతో వాదిస్తారా? (వాస్తవానికి) ఆయన మా ప్రభువు మరియు మీ ప్రభువు కూడాను. మా కర్మలు మాకు మరియు మీ కర్మలు మీకు. మరియు మేము ఆయనకు మాత్రమే మనఃపూర్వకంగా విధేయుల మయ్యాము."

140. లేక మీరు: "నిశ్చయంగా ఇబ్రాహీమ్, ఇస్మాయీల్, ఇస్ హాఖ్, యఅఖూబ్ మరియు వారి సంతతి వారంతా యూదులు మరియు క్రైస్తవులు." అని అంటారా? ఇంకా ఇలా అను: "ఏమీ మీకు బాగా తెలుసా? లేక అల్లాహ్ కు (బాగా తెలుసా)? అల్లాహ్ వద్ద నుండి తన వద్దకు వచ్చిన సాక్ష్యాన్ని దాచే వాని కంటే ఎక్కువ దుర్మార్గుడెవడు? మరియు మీ కర్మల నుండి, అల్లాహ్ నిర్లక్ష్యంగా

---

[93] దీని మరొక తాత్పర్యం ఇలా ఉంది: 'అల్లాహ్ రంగును (ధర్మాన్ని) ఎంచుకోండి. మరియు అల్లాహ్ రంగు (ధర్మం) కంటే ఉత్తమమైన రంగు (ధర్మం) ఎవరిది? మరియు మేము ఆయనను మాత్రమే ఆరాధించే వారము.' క్రైస్తవులు ఒక పసుపురంగు చేసి ఉంచుతారు. బిడ్డ పుట్టినా లేక ఎవడైనా క్రైస్తవ మతం అవలంబించినా! వారు, అతనిని ఆ రంగులో ముంచి: 'పవిత్రమైన క్రైస్తవుడయ్యాడు.' అని అంటారు. దీనిని బాప్టిసం (Baptism) అంటారు. ఈ ఆచారాన్ని ఖండిస్తూ: అల్లాహ్ (సు. తా.) రంగు (ధర్మం) అంటే ఇస్లాం ధర్మమే, అంటే అల్లాహ్ (సు. తా.) కు విధేయులై కేవలం ఆయననే ఆరాధించడం. ఇదే ప్రవక్తలందరూ బోధించిన ధర్మం, అని విశదపరచబడింది.

లేదు!"

**141.** "ఇప్పుడు ఆ సంఘం గతించి పోయింది. అది చేసింది దానికి మరియు మీరు చేసింది మీకు. వారు చేస్తూ ఉండిన కర్మలను గురించి మీరు ప్రశ్నించబడరు[94]."

**142.** ప్రజలలోని కొందరు మూఢజనులు ఇలా అంటారు: "వీరిని (ముస్లింలను) ఇంత వరకు వీరు అనుసరిస్తూ వచ్చిన, ఖిబ్లా నుండి త్రిప్పింది ఏమిటి?[95]" వారితో ఇలా అను: "తూర్పు మరియు పడమరలు అల్లాహ్ కే చెందినవి. ఆయన తాను కోరిన వారికి ఋజుమార్గం వైపునకు మార్గదర్శకత్వం చేస్తాడు."

**143.** మరియు మీరు ప్రజలకు సాక్షులుగా ఉండటానికి మరియు సందేశహరుడు (ముహమ్మద్) మీకు

---

[94] చూడండి, 35:18 మరియు 53:39.

[95] మ'హా ప్రవక్త ('స'అస) మదీనాకు వలస పోయిన తరువాత 16, 17 నెలలు బైతుల్ మఖ్దిస్ వైపునకు ముఖం చేసి నమాజ్' చేసేవారు. కాని అతని కోరిక క'అబహ్ (మక్కా) వైపుకు మాత్రమే ముఖం చేసి నమాజ్' చేయాలని ఉండేది. ఇదే ఇబ్రాహీమ్ ('అ.స.) యొక్క ఖిబ్లా కూడాను. మహా ప్రవక్త ('స'అస) దీనికై ఎన్నో సార్లు అల్లాహ్ (సు.తా.)ను ప్రార్థించారు. చివరకు అల్లాహుతా'ఆలా ఖిబ్లాను మార్చమని మహాప్రవక్త ('స'అస)కు ఆజ్ఞ ఇచ్చాడు. అప్పుడు అవిశ్వాసులు ఈ విధంగా అన్నారు.

సాక్షిగా ఉండటానికి[96] మేము, మిమ్మల్ని ఒక మధ్యస్థ (ఉత్తమ మరియు న్యాయశీలమైన) సమాజంగా చేశాము. మరియు ఎవరు సందేశహరుణ్ణి అనుసరిస్తారో మరియు ఎవరు తమ మడమల మీద వెనుదిరిగి పోతారో అనేది పరిశీలించ డానికి నీవు పూర్వం అనుసరించే ఖిబ్లా (బైతుల్ మఖ్దిస్) ను ఖిబ్లాగా చేసి ఉన్నాము. మరియు ఇది వాస్తవానికి అల్లాహ్ మార్గదర్శకత్వం చూపిన వారికి తప్ప, ఇతరులకు భారమైనది. మరియు అల్లాహ్ మీ విశ్వాసాన్ని (బైతుల్ మఖ్దిస్ వైపునకు చేసిన నమాజులను) ఎన్నడూ వృథా చేయడు[97]." నిశ్చయంగా, అల్లాహ్ ప్రజల పట్ల కనికరుడు, అపార కరుణా ప్రదాత.

**144.** (ఓ ప్రవక్తా!) వాస్తవానికి మేము, నీవు పలుమార్లు నీ ముఖాన్ని ఆకాశం వైపునకు

---

[96] చూడండి, 22:78 మరియు 'స. బు'ఖారీ, పుస్తకం - 6, 'హదీస్' నం. 14. మధ్యస్థ సమాజం అంటే, ఇస్లాంకు ముందున్న మతస్థులలో కొందరు ఆత్మశుద్ధిని వదలి దేహాన్నే పోషించుకుంటూ పశుప్రాయులై ఉండేవారు. వారు యూదులు మొదలైన వారు. మరి కొందరు దేహాన్ని హింసించు కుంటూ అనేక బాధలు పడి, సంసారాన్ని వదలి అడవులలో నివసిస్తూ ఆత్మశుద్ధిని గురించి కృషి చేసేవారు. ఈ రెండు మార్గాలకు మధ్య ఇహ-పరాలను, దేహాన్ని-ఆత్మశుద్ధిని అనుసరించేవారు శ్రేష్ఠులు. ఇదే ఇస్లాం బోధన, ఉత్తమమైన మధ్యస్థ మార్గము.

[97] ఇక్కడ దీని అర్థం: ఇంత వరకు ము'హమ్మద్ ('స'అస) మరియు అతని అనుచరులు (ర'ది.'అన్హుమ్) బైతుల్ మఖ్దిస్ వైపునకు ముఖం చేసి, చేసిన నమాజులు వ్యర్థం కావు. వాటి ప్రతిఫలం పూర్తిగా ఇవ్వబడుతుంది.

ఎత్తడం చూశాము. కావున మేము నిన్ను, నీవు కోరిన ఖిబ్లా వైపునకు త్రిప్పు తున్నాము. కావున నీవు మస్జిద్ అల్ హరామ్ వైపునకు నీ ముఖాన్ని త్రిప్పుకో! ఇకపై మీరంతా ఎక్కడ ఉన్నా సరే (నమాజు చేసేటప్పుడు), మీ ముఖాలను ఆ వైపునకే త్రిప్పు కోండి. మరియు నిశ్చయంగా, గ్రంథం గలవారికి ఇది తమ ప్రభువు తరఫు నుండి వచ్చిన సత్యమని బాగా తెలుసు[98]. మరియు అల్లాహ్ వారి కర్మల గురించి నిర్లక్ష్యంగా లేడు.

**145.** మరియు నీవు గ్రంథప్రజలకు ఎన్ని సూచనలు (ఆయాత్) చూపినా, వారు నీ ఖిబ్లాను అనుసరించరు[99]. మరియు వారిలో ఒక వర్గం వారు, మరొక వర్గం వారి ఖిబ్లాను అనుసరించరు. మరియు నీవు ఈ జ్ఞానం పొందిన తరువాత కూడా వారి మనోవాంఛలను అనుసరిస్తే! నిశ్చయంగా, నీవు దుర్మార్గులలో చేరిన వాడవుతావు.

**146.** మేము గ్రంథాన్ని ప్రసాదించిన వారు తమ కుమారులను ఏ విధంగా గుర్తిస్తారో ఇతనిని (ముహమ్మద్ ను) కూడా ఆ విధంగా గుర్తిస్తారు.

---

[98] పూర్వ గ్రంథాలలో మక్కాలోని కాబాయే చివరి ప్రవక్త యొక్క ఖిబ్లా కాగలదని పేర్కొనబడింది. వారికిది తెలిసి కూడా అసూయ వల్ల వారిలా ముస్లింలతో వాదులాడారు.

[99] యూదుల ఖిబ్లా బైతుల్ మఖ్దిస్ కు పడమర దిక్కులో ఉన్న 'బండ' మరియు క్రైస్తవుల ఖిబ్లా బైతుల్ మఖ్దిస్ కు తూర్పు దిక్కులో ఉంది. చూడండి, 2:115, 142, 177.

మరియు వాస్తవానికి వారిలోని ఒక వర్గం వారు తెలిసి కూడా సత్యాన్ని దాస్తున్నారు[100].

**147.** (నిస్సందేహంగా!) ఇది నీ ప్రభువు తరఫు నుండి వచ్చిన సత్యం. కావున నీవు సందేహించేవారిలో ఏ మాత్రం చేరకు!

**148.** మరియు ప్రతి ఒక (సంఘం) ఒక దిశ వైపునకు ముఖం త్రిప్పుతుంది[101]. కావున మీరు మంచిపనులు చేయటానికి త్వరపడండి. మీరెక్కడున్నా సరే, అల్లాహ్ మీ అందరినీ (తీర్పు దినం నాడు తన సన్నిధిలోకి) రప్పిస్తాడు. నిశ్చయంగా! అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు

**149.** మరియు నీవు ఎక్కడికి బయలు దేరినా సరే! నీ ముఖాన్ని (నమాజ్ లో) మస్జిద్ అల్ హరామ్ వైపునకే త్రిప్పుకో. మరియు నిశ్చయంగా, ఇది నీ ప్రభువు తరఫు నుండి వచ్చిన సత్యం. మరియు అల్లాహ్ మీ కర్మల పట్ల నిర్లక్ష్యంగా లేడు.

**150.** మరియు నీవు ఎక్కడికి బయలుదేరినా సరే! నీ ముఖాన్ని (నమాజ్ లో) మస్జిద్ అల్ హరామ్వైపునకే త్రిప్పుకో. మరియు మీరెక్కడున్నా సరే, మీ ముఖాలను దాని వైపునకే త్రిప్పుకోండి. దీని

---

[100] మక్కాలోని క'అబహ్, ఇబ్రాహీమ్ ('అ.స.) యొక్క ఖిబ్లాగా ఉండేది. చూడండి, ఖు. 61:6.

[101] చూడండి, 5:48. అల్లాహుతా'ఆలా మానవులకు మంచిచెడులను సూచించి, వాటి వ్యత్యాసాన్ని చూపి, వాటి ఫలితాలను కూడా స్పష్టం చేశాడు. కావున ప్రతివాడు తాను ఎన్నుకున్న మార్గానికి బాధ్యత వహించి తగిన ఫలితాన్ని అనుభవిస్తాడు. వారికి ఎలాంటి అన్యాయం జరగదు.

వల్ల మీకు వ్యతిరేకంగా వాదించటానికి ప్రజలకు అవకాశం దొరుకదు. కాని వారిలో దుర్మార్గులైన వారు (ఎలాంటి పరిస్థితులలోనూ ఊరుకోరు). అందుకని వారికి భయపడకండి. నాకే భయపడండి! మరియు ఈ విధంగా నేను మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేయటానికి, మరియు బహుశా, ఈ విధంగానైనా మీరు మార్గదర్శకత్వం పొందవచ్చు!

**151.** ఈ విధంగా మేము మీ వారిలో నుండియే మా సూచనలను మీ ఎదుట వినిపించటానికి మరియు మిమ్మల్ని సంస్కరించటానికి మరియు మీకు గ్రంథాన్ని మరియు వివేకాన్ని బోధించటానికి మరియు మీకు తెలియని విషయాలు నేర్పటానికి - ఒక ప్రవక్త (ముహమ్మద్) ను మీ వద్దకు పంపాము.

**152.** కావున మీరు నన్నే స్మరించండి, నేను కూడా మిమ్మల్ని జ్ఞాపకం ఉంచుకుంటాను. మరియు నాకు కృతజ్ఞులై ఉండండి మరియు నాకు కృతఘ్నులు కాకండి[102].

**153.** ఓ విశ్వాసులారా! సహనం మరియు నమాజ్ ద్వారా సహాయం అర్థించండి. నిశ్చయంగా, అల్లాహ్ సహనం గలవారితో ఉంటాడు[103].

---

[102] చూడండి, ఖు. 14:7 'స. బు'ఖారీ, పుస్తకం - 8, 'హదీస్' నం. 415; పుస్తకం - 9, 'హదీస్' నం. 502.

[103] మంచి విశ్వాసి సంతోషం కలిగినపుడు అల్లాహుతా'ఆలాకు కృతజ్ఞుడై ఉంటాడు మరియు బాధలో ఉన్నప్పుడు సహనం వహిస్తాడు. ('స'హీ'హ్ ముస్లిం, 'హ.నం. 2999).

154. మరియు అల్లాహ్ మార్గంలో చంపబడిన వారిని 'మృతులు' అనకండి[104]! వాస్తవానికి వారు సజీవులు. కాని మీరది గ్రహించజాలరు.

155. మరియు నిశ్చయంగా మేము, మిమ్మల్ని భయప్రమాదాలకు, ఆకలి బాధలకు, ధన ప్రాణ ఫల (ఆదాయాల) నష్టానికి గురిచేసి పరీక్షిస్తాము. మరియు (ఇలాంటి పరిస్థితులలో) మనఃస్థైర్యంతో ఉండేవారికి శుభవార్తనివ్వు.

156. ఎవరైతే విపత్కరమైన పరిస్థితి ఏర్పడినప్పుడు: "నిశ్చయంగా మేము అల్లాహ్ కే చెందినవారము! మరియు మేము ఆయన వైపునకే మరలిపోతాము!" అని అంటారో!

157. అలాంటి వారికి వారి ప్రభువు నుండి అనుగ్రహాలు[105] మరియు కరణ ఉంటాయి. మరియు వారే సన్మార్గం పొందినవారు[106].

158. నిశ్చయంగా, 'సఫా మరియు మర్వాలు అల్లాహ్

---

[104] అల్లాహ్ (సు.తా.) మార్గంలో జిహాద్ (ధర్మపోరాటం) చేసి చంపబడిన వారు మృతులు కారు. వారు అల్లాహ్ (సు.తా.) సన్నిధిలో సజీవులుగా ఉంటారు. చూడండి, 3:169.

[105] సలవాతున్: అంటే blessings, benedictions, అనుగ్రహాలు, ఆశీర్వాదాలు, దీవెనలు, వరాలు మరియు శుభాకాంక్షలు అనే అర్థాలున్నాయి.

[106] నష్టం కలిగినపుడు: 'ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజి'ఊన్.' మరియు, 'అల్లాహుమ్మ అజుర్నీ ఫీ ము'సీబతీ, వ అ'ఖ్ లిఫ్ లీ ఖైరమ్మిన్ హా.' చదవాలి, ('స.ముస్లిం, 'హదీస్' నం. 918).

చూపిన చిహ్నాలు[107]. కావున ఎవడు (కఅబహ్)
గృహానికి 'హజ్జ్ లేక 'ఉమ్రా కొరకు పోతాడో[108],

[107] సఫా-మర్వాలు మక్కాలో క'అబహ్ కు కొంతదూరంలో ఉన్న చిన్న గుట్టలు. 'హజ్ లేక 'ఉమ్రా చేసే వారు క'అబహ్ చుట్టు ఏడు ప్రదక్షిణలు ('తవాఫ్) చేసిన తరువాత 'సఫా-మర్వా గుట్టల మధ్య ఏడు సార్లు పచార్లు (స'యీ) చేయాలి. ఇది తప్పకుండా చేయాలి (వాజిబ్). ఇబ్రాహీమ్ ('అ.స.) భార్య - ఇస్మా'యీల్ ('అ.స) యొక్క తల్లి-అయిన సయ్యిదా హాజర్, ఇస్మా'యీల్ ('అ.స.) ను కాబా దగ్గర పరుండ బెట్టి, నీటి కొరకు ఈ రెండు గుట్టల మధ్య పరుగెత్తుతూ, తన కుమారుణ్ణి ఈ గుట్టలెక్కి చూసేది. అదే కార్యాన్ని అల్లాహ్ (సు.తా.) ముస్లింలకు 'హజ్ లేక 'ఉమ్రా చేసేటప్పుడు, ఆచరించమని ఆజ్ఞాపించాడు.ఇవే కాకుండా 'హజ్ చేసే వారి కొరకు ఇతర ఆచారాలు అంటే బలి (ఖుర్బానీ) ఇవ్వటం, మీనాలోని మూడు జమరాతుల మీద ప్రతిదానిపై ఏడేసి గులక రాళ్ళు రువ్వటం, మొదలైనవి ఉన్నాయి. సయ్యిదా హాజర్ యొక్క ప్రార్థనను అంగీకరించి అల్లాహ్ (సు.తా.) ఇస్మా'యీల్ (అ.స.) కాళ్ళ దగ్గర 'జమ్ 'జమ్ నీటి బుగ్గను పుట్టించాడు. అందులో ఈనాటి వరకు నీళ్ళు పుష్కలంగా ఉన్నాయి. బైతుల్లాహ్ ను సందర్శించే వారు ఈ నీటిని త్రాగి, అల్లాహుతా'ఆలాకు కృతజ్ఞతలు తెలియ జేస్తారు. ఇంకా అక్కడ తమ కోరికల పూర్తికై, పాపవిమోచనకై, ఉత్తమ ప్రతిఫలాలకై అల్లాహ్ (సు. తా.)ను ప్రార్థిస్తారు.

[108] హజ్ అంటే జుల్-'హజ్ నెలలో 8-13 తేదీల వరకు క'అబహ్, మీనా, 'అరఫాత్ మరియు ము'జ్దలిఫాలను సందర్శించటం. 'ఉమ్రా అంటే ఈ తేదీలలో కాక ఇతర కాలంలో ఎప్పుడైనా క;అబహ్ ను దర్శించటం. చూడండి' 14:37). 'ఉమ్రా చేయదలుచుకున్న వారు: 'హరమ్ సరిహద్దుల బయటి నుండి (మీఖాత్ బయట ఉండేవారు మీఖాత్ నుండి) 'ఉమ్రా దీక్ష (నియ్యత్)తో, ఇ'హ్రామ్ ధరించి, క'అబహ్ చుట్టు ఏడు ప్రదక్షిణలు చేసి, తరువాత 'సఫా-మర్వాల మధ్య ఏడు సార్లు పచార్లు చేసి, ఆ తరువాత శిరోముండనం చేయించుకొని, ఇ'హ్రామ్ విడుస్తారు. మీఖాత్ మరియు 'హరమ్ సరిహద్దులను మహా ప్రవక్త ('స'అస) సూచించారు.

అతడు ఈ రెంటి మధ్య పచార్లు (స'యీ) చేస్తే, అతనికి ఎట్టి దోషం లేదు. మరియు ఎవడైనా స్వేచ్ఛాపూర్వకంగా
మంచికార్యం చేస్తే! నిశ్చయంగా, అల్లాహ్ కృతజ్ఞతలను ఆమోదించేవాడు[109], సర్వజ్ఞుడు.

**159.** నిశ్చయంగా, ఎవరైతే మేము అవతరింప జేసిన స్పష్టమైన బోధనలను, మార్గదర్శకత్వాలను - ప్రజల కొరకు దివ్యగ్రంథాలలో స్పష్టపరచిన పిదప కూడా - దాచుతారో! వారిని అల్లాహ్ తప్పక శపిస్తాడు (బహిష్కరిస్తాడు). మరియు శపించ గలవారు కూడా వారిని శపిస్తారు[110].

**160.** కాని ఎవరైతే పశ్చాత్తాప పడతారో మరియు తమ నడవడికను సంస్కరించుకుంటారో మరియు సత్యాన్ని వెల్లడిస్తారో, అలాంటి వారి పశ్చాత్తాపాన్ని నేను అంగీకరిస్తాను. మరియు నేను మాత్రమే

---

[109] షాకిరున్ (అష్-షకూరు): One who approves or Rewards or Forgives much or largely. అంటే కృతజ్ఞతలను ఆమోదించే, అంగీకరించే, ఆదరించే, విలువనిచ్చే వాడు. తన దాసుల మంచి కార్యాలకు అమితంగా ప్రతిఫలమిచ్చేవాడు. All-Appreciative, యోగ్యతను గుర్తించే, పరిగణించే వాడు. అష్-షుకూర్ కు చూడండి, 4:147. ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి.

[110] ఇబ్నె 'అబ్బాస్ ('ర.ది.'అ.) కథనం: ఈ ఆయతులో - తౌరాత్ గ్రంథంలో దైవ ప్రవక్త ('స'అస) గురించి వచ్చిన స్పష్టమైన సూచనలను - యూదులు మరియు క్రైస్తవులు దాచిన విషయం గురించి చెప్పబడింది. (అబూ-దావూద్, మరియు సునన్ తిర్మిజీ', 'హదీస్' నం. 651.

పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడను[111], అపార కరుణా ప్రదాతను.

**161.** నిశ్చయంగా ఎవరైతే సత్యతిరస్కారులై, ఆ తిరస్కారంలోనే మృతి చెందుతారో, అలాంటి వారిపై అల్లాహ్ యొక్క శాపం (బహిష్కారం) ఉంటుంది మరియు దేవదూతల మరియు సర్వ మానవుల యొక్క శాపముంటుంది.

**162.** అందులో (ఆ శాపగ్రస్త స్థితిలోనే నరకంలో) వారు శాశ్వతంగా ఉంటారు. వారి శిక్షను తగ్గించటం కానీ మరియు వారికి మళ్ళీ వ్యవధి ఇవ్వటం కానీ జరుగదు.

**163.** మరియు మీ ఆరాధ్యదైవ కేవలం ఆ అద్వితీయుడు[112] (అల్లాహ్) మాత్రమే. ఆయన తప్ప! మరొక ఆరాధ్యదేవుడు లేడు, అనంత కరుణా మయుడు, అపార కరుణా ప్రదాత.

**164.** నిశ్చయంగా, భూమ్యాకాశాల సృష్టిలోనూ, రేయింబవళ్ళ మార్పులోనూ, ప్రజలకు ఉపయోగకరమైన వాటిని తీసుకొని, సముద్రంలో పయనించే ఓడలలోనూ మరియు అల్లాహ్ ఆకాశం నుండి వర్షాన్ని కురిపించి దాని ద్వారా నిర్జీవమైన భూమికి ప్రాణం పోసి, అందులో వివిధ

[111] అత్-తవ్వాబు: Oft-Returning. తన దాసుని పశ్చాత్తాపాన్ని అంగీకరించే, స్వీకరించే, కటాక్షించే, మన్నించే వాడు. ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి.

[112] అల్-వాహిద్: The One, The Sole. అద్వితీయుడు, ఒకే ఒక్కడు. చూడండి 2:133, 12:39.

రకాల జీవరాసులను వర్ధిల్లజేయటంలోనూ; మరియు వాయువులు మరియు మేఘాలు, భూమ్యాకాశాల మధ్య నియమబద్ధంగా చేసే సంచారాల మార్పులలోనూ బుద్ధిమంతులకు ఎన్నో సంకేతాలనున్నాయి[113].

165. అయినా ఈ మానవులలో కొందరు ఇతరులను, అల్లాహ్ కు సాటి కల్పించుకుని, అల్లాహ్ ను ప్రేమించవలసిన విధంగా వారిని ప్రేమిస్తారు. కాని విశ్వాసులు అందరికంటే అత్యధికంగా అల్లాహ్ నే ప్రేమిస్తారు. మరియు ఈ దుర్మార్గం చేస్తున్న వారు ప్రత్యక్షంగా చూడగలిగితే! ఆ శిక్షను చూసినప్పుడు, వారు నిశ్చయంగా, సర్వశక్తి కేవలం అల్లాహ్ కే చెందుతుంది మరియు నిశ్చయంగా, అల్లాహ్ చాలా కఠినంగా

[113] ఈ ఆయతులో అల్లాహ్ (సు.తా.) సృష్టించి, నడిపిస్తున్న ప్రకృతి నియమాలను గురించి వివరించడ మైనది. 1) భూమ్యాకాశాల సృష్టి, 2) రాత్రింబవళ్ళు ఒకదాని తరువాత ఒకటి రావటం మరియు వాటి కాలాలలో హెచ్చు తగ్గులు, 3) సముద్రాలలో నావలు ఎంతో భారాన్ని తీసుకొని పయనించటం, 4) వర్షం కురిసి జీవం లేని భూమికి జీవమివ్వటం, 5) వివిధ రకాల జీవరాసుల సృష్టి, 6) చల్లని, వెచ్చని వివిధ దిక్కుల నుండి వీచే గాలి, 7) అల్లాహుతా'ఆలా తాను కోరిన చోట వర్షం కురిపించటానికి, తనకు నియమబద్ధులుగా సృష్టించిన మేఘాలు; వీటన్నింటిలో బుద్ధిమంతులకు ఎన్నో సూచనలున్నాయి. ఈ కార్యాలలో ఆయనకు మరెవ్వరూ భాగస్వాములు లేరనేది కూడా వ్యక్తమౌతోంది. ఎందుకంటే ఎవరైనా ఆయనకు భాగస్వాములుంటే ఈ సృష్టిలో అల్లకల్లోలం చెలరేగి ఉండేది.

శిక్షించేవాడు, (అని తెలుసుకునే వారు)[114].

**166.** అప్పుడు (ఆరోజు) వారు (ఆ సాటిగా కల్పించబడిన వారు) తమను అనుసరించిన వారితో తమకు ఎలాంటి సంబంధం లేదంటారు. మరియు వారంతా తమ శిక్షను చూసుకుంటారు. మరియు వారి మధ్య ఉన్న సంబంధాలన్నీ తెగిపోతాయి.

**167.** మరియు ఆ అనుసరించిన వారు అంటారు: "మాకు ప్రపంచ జీవితంలోకి మళ్ళీ తిరిగిపోయే అవకాశం లభిస్తే - వీరు ఈ రోజు మమ్మల్ని త్యజించినట్లు - మేము కూడా వీరిని త్యజిస్తాము!" ఈ విధంగా(ప్రపంచంలో) వారు చేసిన కర్మలను అల్లాహ్ వారికి చూపించి నప్పుడు, అది వారికి ఎంతో బాధాకరంగా ఉంటుంది. కాని వారు నరకాగ్ని నుండి ఏ విధంగానూ బయటపడలేరు.

**168.** ఓ ప్రజలారా! భూమిలోనున్న ధర్మసమ్మతమైన పరిశుద్ధమైన వాటినే తినండి. మరియు షైతాన్ అడుగుజాడలను అనుసరించకండి. నిశ్చయంగా, అతడు మీకు బహిరంగ శత్రువు.

**169.** నిశ్చయంగా, అతడు (షైతాన్) మిమ్మల్ని దుష్కార్యాలు మరియు అశ్లీలమైన పనులు చేయటానికి మరియు అల్లాహ్ ను గురించి మీకు

---

[114] చూడండి, 39:45, 29:65, 17:67 మరియు 'స.బు'ఖారీ, పుస్తకం - 6, 'హదీస్' నం. 24.

తెలియని మాటలు పలుకటానికి ప్రేరేపిస్తుంటాడు.

**170.** మరియు వారితో: "అల్లాహ్ అవతరింపజేసిన వాటిని (ఆదేశాలను) అనుసరించండి!" అని అన్నప్పుడు, వారు: "అలా కాదు, మేము మా తండ్రితాతలు అవలంబిస్తూ వచ్చిన పద్ధతినే అనుసరిస్తాము." అని సమాధానమిస్తారు. ఏమీ? వారి తండ్రితాతలు ఎలాంటి జ్ఞానం లేని వారైనప్పటికీ మరియు సన్మార్గం పొందని వారు అయినప్పటికినీ, (వీరు, వారినే అనుసరిస్తారా)?

**171.** మరియు సత్యతిరస్కారుల ఉపమానం, వాటి (ఆ పశువుల) వలే ఉంది; అవి అతడి (కాపరి) అరుపులు వింటాయే (కానీ ఏమీ అర్థం చేసుకోలేవు), అరుపులు మరియు కేకలు వినడం తప్ప. వారు చెవిటివారు, మూగవారు మరియు గ్రుడ్డివారు, కాబట్టి వారు ఏమీ అర్థం చేసుకోలేరు[115]!

**172.** ఓ విశ్వాసులారా! మీరు నిజంగానే కేవలం ఆయన (అల్లాహ్) నే ఆరాధించేవారు అయితే; మేము మీకు జీవనోపాధిగా ఇచ్చిన పరిశుద్ధమైన (ధర్మసమ్మతమైన) వస్తువులనే తినండి మరియు అల్లాహ్ కు కృతజ్ఞతలు తెలుపండి.[116]

---

[115] అంటే ఈ సత్యతిరస్కారులు, సత్యధర్మం యొక్క పిలుపు విన్నా దానిని అర్థం చేసుకోలేక పోతున్నారు. ఏవిధంగానైతే పశువులు - వాటి కాపరి యొక్క కేకలు అర్థం చేసుకోలేవో!

[116] స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 1, 'హదీస్' నం. 49

**173.** నిశ్చయంగా, ఆయన మీ కొరకు చచ్చిన జంతువు, రక్తం, పందిమాంసం మరియు అల్లాహ్ తప్ప ఇతరుల కొరకు జిబహ్ చేయబడిన దానిని (తినటాన్ని) నిషేధించి ఉన్నాడు[117]. కాని ఎవరైనా గత్యంతరంలేక, దుర్నీతితో కాకుండా, హద్దు మీరకుండా (తిన్నట్లైతే) అట్టి వానిపై ఎలాంటి దోషం లేదు![118] నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు[119], అపార కరుణాప్రదాత.

**174.** నిశ్చయంగా, ఎవరైతే అల్లాహ్ గ్రంథంలో అవతరింపజేసిన సందేశాలను దాచి, దానికి

---

[117] ఈ 'హరాం చేయబడిన విషయాలు ఇంకా మూడు చోట్లలో పేర్కొనబడ్డాయి చూ 5:3, 6:145, 16:115.

[118] ఈ నాలుగు గాక 'హదీస్'లో 'హరామ్ గా పేర్కొనబడినవి ఇవి: 1) గోళ్ళతో వేటాడి చంపే మృగాలు, 2) తమ గోళ్ళతో వేటాడే పక్షులు, 3) గాడిద, కుక్క మొదలైనవి. ఇంకా వివరాలకు చూడండి 5:3. 'హదీస్'లో మరణించిన చేప 'హలాల్ గా పరిగణింపబడింది. అల్లాహుతా'ఆలా తప్ప, ఇతరులను సంతృప్తి పరచడానికి వారి పేరున ఒక పశువును జి'బ్'హ్ చేయటం - జి'బ్'హ్ చేసేటప్పుడు అల్లాహ్ (సు.తా.) పేరు తీసుకున్నా - వారి సంకల్పం (నియ్యత్) అల్లాహ్ (సు.తా.) కాక, ప్రత్యేకమైన వేరే ఇతరుణ్ణి సంతోషింపజేయటానికైతే, అలాంటి దానిని తినటం కూడా 'హరామ్. అంతేగాక అల్లాహ్ యేతరులకు అర్పించబడినది (నజ'ర్, నియా'జ్, చఢావా చేసింది) ఏదైనా తినటం కూడా 'హరామ్. ('స'హీ'హ్ అల్ - జామె, అస్స'గీర్ వ జ్యాదతహు, అల్ బానీ పుస్తకం - 2 పేజీ - 1024.

[119] అల్'గఫూరు: Oft-Forgiving, Most Forgiving, క్షమాశీలుడు, పాపాలను ఎక్కువగా క్షమించే వాడు. అల్-'గప్ఫారు: క్షమించేవాడు, చూడండి 20:82. అల్-'గప్ఫారు మరియు అల్-'గఫూరు అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లు. అల్-'గాఫిర్: క్షమాగుణ పరిపూర్ణుడు, చూడండి, 40:3.

బదులుగా అల్పలాభం పొందుతారో, అలాంటి వారు తమ కడుపులను కేవలం అగ్నితో నింపు కుంటున్నారు మరియు అల్లాహ్ పునరుత్థాన దినమున వారితో మాట్లాడడు మరియు వారిని శుద్ధపరచడు మరియు వారికి బాధాకరమైన శిక్ష ఉంటుంది.

**175.** ఇలాంటివారే సన్మార్గానికి బదులుగా దుర్మార్గాన్ని మరియు క్షమాపణకు బదులుగా శిక్షను ఎన్నుకున్నవారు. ఎంత సహనముంది వీరికి, నరకాగ్ని శిక్షను భరించటానికి!

**176.** ఇదంతా ఎందుకంటే! నిశ్చయంగా, అల్లాహ్ ఈ గ్రంథాన్ని సత్యంతో అవతరింప జేశాడు. మరియు నిశ్చయంగా, ఈ గ్రంథం (ఖుర్ఆన్) గురించి భిన్నాభిప్రాయాలు గల వారు ఘోర అంతఃకలహంలో ఉన్నారు![120]

**177.** వినయవిధేయత (ధర్మనిష్ఠాపరత్వం)[121] అంటే మీరు మీ ముఖాలను తూర్పు దిక్కునకో లేక

---

[120] వంకర అక్షరాలలో ఉన్నదాని తాత్పర్యం ఈ విధంగా కూడా ఉంది: 'తమ విరోధంలో సత్యం నుండి చాలా దూరం వెళ్ళిపోయారు.'

[121] అల్ బిర్రు: piety, to act well, virtue, అంటే ధర్మ ఆచరణ, ధర్మనిష్ఠాపరత్వం, దైవభక్తి, నీతిపరత్వం, పుణ్యం అనే అర్థాలున్నాయి.

పడమర దిక్కునకో చేయటం కాదు[122]; కాని వినయవిధేయత (ధర్మనిష్ఠా పరత్వం) అంటే అల్లాహ్ ను, అంతిమదినాన్ని, దేవదూతలను, ప్రతి దివ్యగ్రంథాన్ని మరియు ప్రవక్తలను హృదయపూర్వకంగా విశ్వసించడం; మరియు ధనంపై ప్రేమ కలిగి ఉండి కూడా దానిని బంధువుల కొరకు అనాథుల కొరకు, యాచించని పేదల కొరకు[123], బాటసారుల కొరకు, యాచకుల కొరకు మరియు బానిసలను[124] విడిపించడానికి వ్యయపరచడం మరియు నమాజును స్థాపించడం, జకాత్ ఇవ్వడం మరియు వాగ్దానం చేసినప్పుడు తమ వాగ్దానాన్ని పూర్తి చేయడం. మరియు దురవస్థలో మరియు అపత్కాలాలలో మరియు

[122] చూడండి, అల్ బఖర 2:145 వ్యాఖ్యానం 2. దీని ఉద్దేశ్యం ఏమిటంటే, అల్లాహ్ (సు.తా.) ఆదేశాన్ని శిరసావహించి, విశ్వాసులందరూ, వారు ప్రపంచంలో ఎక్కడున్నా, ఎల్లప్పుడూ ఒకే ఒక్క ఖిబ్లా (క'అబహ్) అయిన మక్కా ముకర్రమా వైపునకు మాత్రమే అభిముకులై నమాజ్ చేయాలి.

[123] మసాకీన్, మిస్కీన్ (ఏ.వ.): అంటే, ఆదాయం ఉన్నా అది వారి నిత్యావసరాలకు సరి పోనివారు. ఇలాంటి వారు తమ ఆత్మాభిమానం వల్ల యాచించటానికి ఇష్ట పడరు. ఫుఖరా - అంటే ఏమీ ఆదాయం లేక గత్యంతరం లేక భిక్షమడిగే వారు.

[124] ఖుర్ఆన్ అవతరింపజేయబడే కాలంలో బానిసత్వం, బానిసలను కొనటం, అమ్మటం ఎంతో ఎక్కువగా ఉండేది. ఇస్లాం ధర్మం యొక్క ముఖ్యలక్ష్యాలలో ఒకటి ఇలాంటి బానిసత్వాన్ని రూపుమాపటం. కేవలం ధర్మయుద్ధఖైదీలను మాత్రమే ఇస్లాం చట్టం ప్రకారం బానిసలుగా ఉంచుకోవచ్చు. చూడండి, 8:67 ఖుర్ఆన్ లో బానిసలను విడిపించటం పుణ్యకార్యమని ఎన్నోచోట్లలో పేర్కొనబడింది. చూడండి, 4:92, 5:89, 58:3.

యుద్ధ సమయాలలో స్థైర్యం కలిగి ఉండటం. ఇలాంటి వారే సత్యవంతులు మరియు ఇలాంటి వారే దైవభీతి గలవారు.

**178.** ఓ విశ్వాసులారా! హత్య విషయంలో మీ కొరకు న్యాయ ప్రతీకారం (ఖిసాస్) నిర్ణయించ బడింది. ఆ హత్య చేసినవాడు స్వేచ్ఛగలవాడైతే ఆ స్వేచ్ఛాపరుణ్ణి, బానిస అయితే ఆ బానిసను, స్త్రీ అయితే ఆ స్త్రీని (వధించాలి)[125]. ఒకవేళ హతుని సోదరులు (కుటుంబీకులు) హంతకుణ్ణి కనికరించదలిస్తే, ధర్మయుక్తంగా రక్తశుల్క నిర్ణయం జరగాలి[126]. హంతకుడు రక్త ధనాన్ని, ఉత్తమరీతిలో అతనికి చెల్లించాలి. ఇది మీ ప్రభువు తరఫు నుండి మీకు లభించే సౌకర్యం, కారుణ్యం. దీని తర్వాత కూడా ఈ హద్దును అతిక్రమించేవానికి బాధాకరమైన శిక్ష ఉంటుంది.

**179.** ఓ బుద్ధిమంతులారా! న్యాయ ప్రతీకారం (ఖిసాస్) లో మీకు ప్రాణ రక్షణ ఉంది. దీని వల్ల మీరు

---

[125] ఇది ఇస్లాంకు ముందు అరబ్బులలో ఉన్న దురాచారాన్ని ఖండిస్తోంది. వారు ఒక మగ హంతకునికి బదులుగా అతని కుటుంబంలో అనేకమంది మగవారిని,ఒక స్త్రీ హంతకురాలికి బదులుగా ఆమె కుటుంబం లోని పురుషుణ్ణి లేక ఒక బానిస హంతకునికి బదులుగా ఒక స్వతంత్ర పురుషుణ్ణి హత్య చేసేవారు.

[126] చూడండి, 55:60.

దైవభీతి గలవారు అవుతారు[127].

**180.** మీలో ఎవరికైనా మరణకాలం సమీపించినప్పుడు అతడు ఆస్తిపాస్తులు గలవాడైతే అతడు తన తల్లిదండ్రుల కొరకు మరియు సమీపబంధువుల కొరకు ధర్మసమ్మతమైన మరణశాసనం (వీలునామా) వ్రాయాలి[128]. ఇది దైవభీతి గలవారి విద్యుక్త ధర్మం.

**181.** ఇకదానిని (వీలునామాను) విన్నవారు, తరువాత ఒకవేళ దానిని మార్చితే, దాని పాపమంతా

---

[127] హత్య చేయగోరే వానికి మొదటి నుండే వాడు కూడా మరణశిక్షకు గురి అయ్యే శాసనముందని తెలిస్తే! వాడు ఎన్నడూ హత్యకు పూనుకోడు. ఈ విధమైన న్యాయప్రతీకారం వల్ల రాజ్యంలో శాంతి సుఖాలు వర్ధిల్లుతాయి. ఉదా: ఇప్పుడు స'ఊదీ 'అరేబియాలో ఉన్న స్థితి.

[128] ఆస్తుల పంపక విషయానికై చూడండి, 4:11-12, ఈ ఆయత్ వాటి కంటే ముందు అవతరించబడింది. వీలునామా కేవలం 1/3 భాగపు ఆస్తి కొరకు మాత్రమే చేయవచ్చు. 2/3 భాగపు ఆస్తి మృతుని ప్రథమ శ్రేణి బంధువుల (వారసుల) హక్కు. ఆస్తికి హక్కుదారులైన ప్రథమశ్రేణి బంధువులు (వారసులు) వీలునామాకు హక్కుదారులు కారు. ఈ 1/3 భాగం ఆస్తిపరుడు తన వీలునామాలో ఆస్తికి హక్కు దారులు కానటువంటి దూరబంధువులకు, స్నేహితులకు లేక ధర్మ కార్యాలకు ఇవ్వవచ్చు. 1/3 భాగం కంటే ఎక్కువ భాగానికి వీలునామా వ్రాయటం ధర్మసమ్మతం కాదు. ('స.బు'ఖారీ, కితాబుల్ ఫరాయ'ద్, బాబ్ మీరాస్' అల్-బనాత్). ఆస్తి తక్కువ ఉంటే - కేవలం పేరు ప్రతిష్ఠల కొరకు - హక్కుదారులను పేదరీకంలో వదలి, ధర్మకార్యాలకు లేక హక్కులేని వారి కొరకు - 1/3 భాగానికి కూడా - వీలునామా వ్రాయటం సమ్మతించదగినది కాదు. ఒక విశ్వాసి - ఒక విశ్వాసి, ఉభయులూ ఒకరికొకరు వారసులు కాలేరు. కాని వీలునామా (వ'సియ్యత్) ద్వారా వారికి ధన సహాయం చేయవచ్చు.

నిశ్చయంగా, ఆ మార్చిన వారి పైననే ఉంటుంది. నిశ్చయంగా, అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు[129].

**182.** కాని వీలునామా చేసిన వ్యక్తి పక్షపాతమో, లేదా అన్యాయమో చేశాడనే భయం ఎవనికైనా ఉంటే అతడు ఈ వ్యవహారంతో సంబంధమున్న వారందరి మధ్య రాజీ కుదిరిస్తే అందులో ఎలాంటి దోషం లేదు. నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

**183.** ఓ విశ్వాసులారా! ఉపవాసం మీకు విధిగా నిర్ణయించబడింది[130], ఏ విధంగానైతే మీ పూర్వీకులకు విధిగా నిర్ణయించబడి ఉండెనో బహుశా మీరు దైవభీతిపరులై ఉంటారని!

**184.** ఇది (ఈ ఉపవాసం) నిర్ణయించబడిన రోజులకు మాత్రమే. కానీ, మీలో ఎవరైనా వ్యాధిగ్రస్తులై ఉంటే, లేక ప్రయాణంలో ఉంటే, వేరే దినాలలో (ఆ ఉపవాసాలు) పూర్తి చేయాలి. కాని దానిని పూర్తి చేయటం దుర్భరమైన వారు పరిహారంగా, ఒక

---

[129] సమీ'ఉన్-అలీమున్: సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు. చూడండి, 2:127.

[130] అ'స్-'సౌమ్: ఉపవాసం అంటే మానుకోవటం. ప్రాతఃకాలం నుండి సూర్యాస్తమయం వరకు ఏమీ తినకుండా, త్రాగకుండా మరియు భార్యలతో రతిక్రీడలు జరగకుండా ఉండటమే గాక, తమ పంచేంద్రియాలను, చూపులను, నాలుకను, చెవులను, ఆలోచనలను మరియు చేష్టలను మొదలైన వాటిని కూడా అదుపులో ఉంచుకొని చెడుకు దూరంగా ఉండటం.

పేదవానికి భోజనం పెట్టాలి[131]. కాని ఎవరైనా సహృదయంతో ఇంకా ఎక్కువ మేలు చేయదలిస్తే, అది అతని మేలుకే! కాని మీరు తెలుసుకో గలిగితే ఉపవాసం ఉండటమే, మీకు ఎంతో ఉత్తమమైనది.

185. రమదాన్ నెల! అందులో దివ్య ఖుర్ఆన్ మానవులకు మార్గదర్శకత్వంగా, అవతరింప జేయబడింది![132] మరియు అందులో సన్మార్గం చూపే మరియు సత్యాసత్యాలను వేర్పరచే, స్పష్టమైన ఉపదేశాలున్నాయి. కావున మీలో ఆ

[131] అతివృద్ధులు, దీర్ఘవ్యాధితో పీడితులైనవారు, గర్భవతులైన స్త్రీలు, బిడ్డలకు పాలిచ్చే స్త్రీలు మొదలైన వారు, ఉపవాసముండటం వారికి అతి కష్టతరమైతే, పరిహారంగా ప్రతిరోజు ఒక పేదవానికి భోజనం పెట్టాలి. కాని గర్భవతులైన స్త్రీలు , పిల్లలకు పాలిచ్చే స్త్రీలు మరియు కొద్దికాలానికి మాత్రమే వ్యాధి గ్రస్థులైన వారు మాత్రం విడిచిన ఉపవాసాలను తరువాత పూర్తి చేసుకోవాలి.

[132] ఖుర్ఆన్, లైలతుల్ ఖద్ర్ లో లౌ'హెమ'హ్ఫూ"జ్ నుండి ఈ ప్రపంచపు ఆకాశం మీద దింపబడింది. అక్కడ బైతుల్ - ఇ'జ్జత్ లో పెట్టబడింది. అక్కడి నుంచి 23 సంవత్సరాలలో క్రమక్రమంగా అవసరాన్ని బట్టి మహాప్రవక్త ము'హమ్మద్ ('స'అస)పై అవతరింపజేయబడింది, (ఇబ్నె-కసీ'ర్). మొట్టమొదటి వ'హీ 'హిరా గుహలో రమ'దాన్ నెలలో అవతరింపజేయబడింది. మరియు దైవప్రవక్త ('స'అస), తమ మరణానికి ముందు రమ'దాన్ నెలలోనే ఖుర్ఆన్ ను జిబ్రీల్ ('అ.స.) సమక్షంలో, రెండుసార్లు పూర్తిగా చదివి వినిపించారు. మరియు దైవప్రవక్త ('స'అస), అదే రమ'దాన్ నెలలో 23, 25, 27 రాత్రులలో, స'హాబీలకు తరావీ'హ్ నమా'జ్ (ఖియామ్ అల్లైల్) కూడా జమా'అతో చేయించారు. ('స.తిర్మిజీ', 'స. ఇబ్నె-మాజా, అల్బానీ ప్రమాణీకం). ఆ తరావీ'హ్ నమా'జ్ ఎనిమిది రకాతులు, వి'తర్ తో పాటు పదకొండు రకాతులు, అవి జాబిర్ (ర'ది.'అ.) మరియు సయ్యిదా 'ఆయిషహ్ (ర.'అన్హా)ల ఉల్లేఖన (రివాయతు)లు ఉన్నాయి. ('స. బు'ఖారీ).

నెలను పొందిన వ్యక్తి ఆ నెలంతా (విధిగా) ఉపవాసముండాలి. కాని వ్యాధిగ్రస్తుడైన వాడు లేక ప్రయాణంలో ఉన్నవాడు, (ఆ ఉపవాసాలను) వేరే దినాలలో పూర్తి చేయాలి. అల్లాహ్ మీకు సౌలభ్యం చేయగోరుతున్నాడే కానీ, మిమ్మల్ని కష్టపెట్టదలచు కోలేదు. ఇది మీరు ఉపవాస దినాల సంఖ్యను పూర్తిచేయగలగటానికి మరియు మీకు సన్మార్గం చూపినందుకు, మీరు అల్లాహ్ మహనీయతను (ఘనతను) కొనియాడటానికి మరియు మీరు కృతజ్ఞతలు తెలుపుకోవటానికి!

**186.** మరియు నా దాసులు, నన్ను గురించి నిన్ను అడిగితే: "నేను (వారికి) అతి సమీపంలోనే ఉన్నాను. పిలిచేవాడు నన్ను పిలిచినప్పుడు నేను అతని పిలుపు విని, జవాబిస్తాను[133]. కాబట్టి వారు సరైన మార్గం పొందటానికి, నా ఆజ్ఞను అనుసరించాలి మరియు నా యందు విశ్వాసం కలిగి ఉంటాలి." అని, చెప్పు[134].

**187.** ఉపవాసపు రాత్రులందు మీకు మీ భార్యలతో రతిక్రీడ (రఫస్) ధర్మసమ్మతం చేయబడింది. వారు మీ వస్త్రాలు, మీరు వారి వస్త్రాలు. వాస్తవానికి మీరు రహస్యంగా ఆత్మద్రోహానికి పాల్పడుతున్నారనే విషయం అల్లాహ్ కు తెలుసు. కావున ఆయన మీ

---

[133] ఉపవాసం విరమించే వేళలో చేసే ప్రార్థన (దు'ఆ) అంగీకరించబడుతుంది. (ముస్నద్ అ'హ్మద్, తిర్మిజీ', నసాయీ', ఇబ్నె-మాజా - ఇబ్నె-కసీ'ర్ వ్యాఖ్యానం).

[134] చూడండి, 'స. బు'ఖారీ, పుస్తకం - 8, 'హదీస్' నం. 509.

పశ్చాత్తాపాన్ని స్వీకరించాడు మరియు మిమ్మల్ని మన్నించాడు. ఇక నుండి మీరు మీ భార్యలతో సంభోగం (బాషిర్) చేయండి మరియు అల్లాహ్ మీ కొరకు వ్రాసిన దానిని కోరండి. మరియు ఉదయకాలపు తెల్లరేఖలు రాత్రి నల్లచారల నుండి స్పష్టపడే వరకు, మీరు తినండి, త్రాగండి. ఆ తరువాత చీకటి పడే వరకూ మీ ఉపవాసాన్ని పూర్తి చెయ్యండి. కాని మస్జిదులలో ఏతెకాఫ్ పాటించేటప్పుడు, మీరు మీ స్త్రీలతో సంభోగించకండి[135]. ఇవి అల్లాహ్ ఏర్పరచిన హద్దులు, కావున ఉల్లంఘించే (ఉద్దేశంతో) వీటిని సమీపించకండి. ఈ విధంగా అల్లాహ్ తన ఆజ్ఞను ప్రజలకు స్పష్టం చేస్తున్నాడు. బహుశా వారు భయభక్తులు కలిగి ఉంటారని!

**188.** మరియు మీరు ఒకరి సొమ్మును మరొకరు అన్యాయంగా కబళించకండి మరియు బుద్ధిపూర్వకంగా, అక్రమమైన రీతిలో, ఇతరుల ఆస్తిలో కొంతభాగం తినే దురుద్దేశంతో, న్యాయాధికారులకు లంచాలు ఇవ్వకండి.

**189.** (ఓ ప్రవక్తా!) వారు నిన్ను మారే చంద్రుని (రూపాలను) గురించి అడుగుతున్నారు. నీవు వారితో ఇలా అను: "అవి ప్రజలకు కాలగణనను

---

[135] చూడండి, 7:189. ఏ'తెకాఫ్: అంటే మస్జిద్ లో అల్లాహ్ (సు.తా.) ను ధ్యానిస్తూ ఏకాంతంగా గడపటం. ఏ'తెకాఫ్ పాటించేవారు స్త్రీలతో సంభోగించరాదు. కాలకృత్యాలకు తప్ప, మస్జిద్ విడిచి బయటికి పోరాదు. తోటివారితో అనవరమైన మాట్లలో పడరాదు.

మరియు హజ్జ్ దినాలను తెలియ జేస్తాయి."
మీరు మీ ఇళ్ళలోకి వాటి వెనుక భాగం నుండి ప్రవేశించడం ఋజువర్తన (బిర్ర్) కాదు, దైవభీతి కలిగి ఉండటమే ఋజువర్తన (బిర్ర్). కనుక మీరు ఇండ్లలో వాటి ద్వారాల నుండియే ప్రవేశించండి. మరియు మీరు సాఫల్యం పొందటానికి అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి.

**190.** మరియు మీతో, పోరాడే వారితో, మీరు అల్లాహ్ మార్గంలో పోరాడండి. కాని హద్దులను అతిక్రమించకండి. నిశ్చయంగా, అల్లాహ్ హద్దులను అతిక్రమించేవారిని ప్రేమించడు[136].

**191.** వారు, మీకు ఎక్కడ ఎదురైతే అక్కడనే వారిని చంపండి. మరియు వారు మిమ్మల్ని ఎచ్చటి నుండి తరిమి వేశారో, మీరు కూడా వారిని అచ్చటి నుండి తరిమి వేయండి. మరియు సత్యధర్మానికి

---

[136] ఈ ఆయత్ లో జిహాద్: ధర్మపోరాటం, అంటే ఎవరైతే మీతో పోరాడుతారో, అలాంటి వారితో మీరు పోరాడండని అనుమతి ఇవ్వబడింది. చూడండి 22:39. ఆ ఆయత్ జిహాద్ ను గురించి మొదటి సారిగా అవతరింపబడిందని చాలా మంది 'హదీస్' వేత్తలు వ్రాశారు, ('తబరీ, ఇబ్నె-కసీ'ర్). హద్దులను అతిక్రమించకూడదు అంటే, స్త్రీల, పిల్లల, వృద్ధుల హత్య చేయకూడదు. ఎవరైతే మీతో పోరాడుతారో, వారినే వధించాలి. ఇదే విధంగాపంట పొలాలను, చెట్లుచేమలను, పశువులను, అనవసరంగా పాడు చేయరాదు. జిహాద్ గురించి 4:91, 60:8 మరియు 'స. బు'ఖారీ, పుస్తకం - 4, 'హదీస్' నం. 4 చూడండి.

అడ్డుగా నిలవటం (ఫిత్నా)[137], చంపటం కంటే ఘోరమైనది. మస్జిద్ అల్ హరామ్ వద్ద వారు మీతో యుద్ధం చేయనంత వరకు మీరు వారితో అక్కడ యుద్ధం చేయకండి[138]. ఒకవేళ వారే మీతో (ఆ పవిత్ర స్థలంలో) యుద్ధం చేస్తే వారిని వధించండి. ఇదే సత్యతిరస్కారులకు తగిన శిక్ష.

**192.** కానీ, వారు (యుద్ధం చేయటం) మానుకుంటే (మీరు కూడా మానుకోండి). ఎందుకంటే నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణాప్రదాత.

**193.** మరియు ఫిత్నా[139] ముగిసిపోయే వరకు మరియు అల్లాహ్ ధర్మం మాత్రమే స్థాపించబడే వరకు మీరు వారితో యుద్ధం చేస్తూ ఉండండి. ఒకవేళ వారు మానుకుంటే, దుర్మార్గులతో తప్ప ఇతరులతో పోరాడకండి[140].

---

[137] ఇక్కడ ఫిత్నా - అంటే సత్యతిరస్కారం, షిర్క్, సత్యధర్మానికి అడ్డుగా నిలవటం. సత్యాన్ని స్వీకరించిన వారిని హింసా, దౌర్జన్యాలకు గురి చేయడం. చూడండి, 'స. బు'ఖారీ, పుస్తకం - 2, 'హదీస్' నం. 797. ఫిత్నతున్: యొక్క ఇతర అర్థాలు పీడన, ఉపద్రవం, పరీక్ష, ప్రేరేపించటం, కలతలు రేకెత్తించటం, శోధన, పురికొల్పటం మరియు దుష్కృత్యం మొదలైనవి ఉన్నాయి.

[138] మస్జిద్ అల్ - 'హరామ్ సరిహద్దులలో యుద్ధం చేయటం నిషేధించబడింది. అది శాంతినిలయం, కాని ఎవరైనా దానిని లెక్క చేయక మీపై దాడి చేసి మిమ్మల్ని చంపగోరితే, అలాంటి వారితో మీరు అక్కడ యుద్ధం చేసి వారిని చంపవచ్చు!

[139] చూడండి, 2:191 వ్యాఖ్యానం 2.

[140] చూడండి, 'స. బు'ఖారీ, పుస్తకం - 1, 'హదీస్' నం. 24.

**194.** నిషిద్ధ మాసానికి బదులు నిషిద్ధ మాసమే మరియు నిషిద్ధ స్థలాలలో న్యాయ ప్రతీకారం (ఖిసాస్) తీసుకోవచ్చు[141]. కాబట్టి మీపై ఎవరైనా దాడి చేస్తే, మీరు కూడా వారిపై అదే విధంగా దాడి చేయండి. మరియు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి. మరియు నిశ్చయంగా, అల్లాహ్ భయభక్తులు గలవారికి తోడుగా ఉంటాడని తెలుసుకోండి.

**195.** మరియు అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టండి. మరియు మీ చేతులారా మిమ్మల్ని మీరు వినాశంలో పడవేసుకోకండి; మేలు చేయండి. నిశ్చయంగా అల్లాహ్ మేలు చేసేవారిని ప్రేమిస్తాడు

**196.** మరియు అల్లాహ్ (ప్రసన్నత) కొరకు హజ్జ్

---

[141] నిషిద్ధ మాసాలు: జు'ల్ - ఖాఇదహ్, జు'ల్ హిజ్జహ్, ము'హర్రం మరియు రజబ్ (హిజ్రీ శకపు 11, 12, 1, 7 మాసాలు). ఈ మాసాలలో యుద్ధం చేయటం ఇస్లాంకు పూర్వం నుండి కూడా అరేబియా వాసులలో నిషేధించబడి ఉండింది. చూడండి, 2:217. ఈ నిషేధాలను వారూ గౌరవించాలి. ఎదుటి వారు వాటిని గౌరవించని పక్షంలో వారితో పోరాడి ప్రతీకారం తీర్చుకోవచ్చు.

మరియు ఉమ్రా పూర్తి చేయండి[142]. మీకు అక్కడ చేరటానికి (వాటిని పూర్తి చేయటానికి) ఆటంకం కలిగినట్లైతే, మీరు ఇవ్వదలుచుకున్న బలి (ఖుర్బానీ) ఇవ్వండి[143]. బలి జంతువు దాని గమ్యస్థానానికి చేరనంత వరకు మీరు శిరోముండనం చేసుకోకండి[144]. కానీ, మీలో

---

[142] ఉమ్రా: 'హజ్ సమయంలో కాకుండా వేరే దినాలలో కూడా 'ఉమ్రా చేయవచ్చు. 'ఉమ్రా చేయగోరే వారు 'హరమ్ సరిహద్దుల నుండి, (మీఖాత్ సరిహద్దుల బయట నుండి వచ్చే వారు మీఖాత్ నుండి) ఇ'హ్రామ్ ధరించి, (అంటే పురుషులు, ఒక తెల్లని లుంగీ కట్టుకొని మరొక తెల్లని దుప్పటిని శరీరంపై కప్పుకోవటం. స్త్రీలకు, వారు ధరించిన బట్టలే ఇ'హ్రామ్; మగవారివలే వారికి ప్రత్యేకమైన ఇ'హ్రామ్ దుస్తులు లేవు) 'హరమ్ కు వచ్చి, క'అబహ్ చుట్టు ఏడు ప్రదక్షిణలు ('తవాఫ్) చేసి, రెండు రకాతులు నమాజ్' చేసి, తరువాత 'సఫా, మర్వాల మధ్య ఏడుసార్లు పచార్లు (స'యీ) చేసి, ఆ తరువాత (స్త్రీలు) తల వెంట్రుకలను కొంత మట్టుకు కత్తిరించుకోవాలి. పురుషులు శిరోముండనం చేయించుకొని లేక తల వెంట్రుకలను కొంత మట్టుకు కత్తిరించుకొని ఇ'హ్రామ్ విడిచి పెట్టాలి. మీఖాత్ మరియు 'హరమ్ సరిహద్దులను మహా ప్రవక్త ('స'అస) సూచించారు.

[143] దైవప్రవక్త('స'అస) 6వ హిజ్రీలో 'ఉమ్రా కొరకు వచ్చినప్పుడు 'హుదైబియహ్ దగ్గరగా ఆగారు. అప్పుడు మక్కాలోని ముష్రిక్ ఖురైషులతో సంధి చేసుకున్నారు. 'హుదైబియహ్ లోనే తమ బలి (ఖుర్బానీ) చేసి తమ శిరోముండనాలు చేయించుకొని ఇ'హ్రాం వదిలారు. తరువాత 7వ హిజ్రీలో వచ్చి 'ఉమ్రా చేశారు.

[144] శాంతి సమయాలలో 'హజ్ యొక్క అన్ని మనాసిక్ లు పూర్తి చేయనంత వరకు శిరోముండనం చేయించుకోగూడదు అంటే, ఇ'హ్రామ్ విడువగూడదు.

ఎవడైనా వ్యాధిగ్రస్తుడై ఉంటే లేదా అతని తలకు బాధ ఉంటే (శిరోముండనం చేసుకొని) దాని పరిహారంగా (మూడు రోజులు) ఉపవాసం ఉండాలి. లేదా దానధర్మాలు చేయాలి (ఆరుగురు నిరుపేదలకు భోజనం పెట్టాలి), లేదా బలి ఇవ్వాలి. కాని శాంతి భద్రతలు ఉన్న సమయాలలో ఎవడైనా హజ్జె తమత్తు[145] చేయదలుచుకుంటే, అతడు తన శక్తిమేరకు బలి[146] ఇవ్వాలి. కాని ఎవడైతే ఖుర్బానీ ఇవ్వలేడో, హజ్జ్ కాలంలో మూడు దినాలు మరియు (ఇంటికి) తిరిగి వచ్చిన

[145] తమత్తు' - అంటే 'హజ్ కాలంలో 'ఉమ్రా కొరకు ఇ'హ్రామ్ ధరించి 'ఉమ్రా చేసి శిరోముండనం చేసి, ఇ'హ్రామ్ విడవాలి. మరల 8వ జి'ల్-'హిజ్ రోజున 'హజ్ కొరకు ఇ'హ్రామ్ ధరించాలి. దీనికి బలి ఇవ్వ వలసి ఉంటుంది. బలి ఇవ్వలేని వారు 10 రోజులు ('హజ్ కాలంలో 3 రోజులు 'హజ్ తరువాత 7 రోజులు), ఉపవాసాలుండాలి. 'హజ్ 3 రకాలుగా చేయవచ్చు: అవి 1) ఇఫ్రాద్: అంటే 'హజ్ సంకల్పంతో ఇ'హ్రాం ధరించి కేవలం 'హజ్ మాత్రమే చేయటం. దీనికి బలి అవసరం లేదు. ఇది 'హరమ్ ప్రాంతంలో నివసించే వారు చేసే 'హజ్, 2) తమత్తు : పైన వివరించిన విధానం. 'హజ్జె తమత్తు'కు బలి (ఖుర్బానీ) ఇవ్వటం వాజిబ్. 3) ఖిరన్ : ఒకే ఇ'హ్రామ్ తో 'ఉమ్రా మరియు 'హజ్ నెరవేర్చటం. 'ఉమ్రా చేసిన తరువాత తలవెంట్రుకలు కత్తిరించుకోకుండా 'హజ్ వరకు ఇ'హ్రాంలోనే ఉండి 'హజ్ విదులు నెరవేర్చిన పిదప ఇ'హ్రామ్ విడవటం. 'హజ్జె ఖిరన్ కు కూడా బలి (ఖుర్బానీ) ఇవ్వటం వాజిబ్.

[146] హద్ యున్, బలి (ఖుర్బానీ): ఒక వ్యక్తి ఒక మేక లేక గొర్రె; లేక ఏడుగురు కలిసి ఒక ఆవు, ఎద్దు, లేక ఒంటె బలి చేయవచ్చు.

పిమ్మట ఏడు దినాలు ఉపవాసం ఉండాలి. ఈ విధంగా మొత్తం పది దినాలు ఉపవాసాలు ఉండాలి. ఇది మస్జిద్ అల్ హరామ్ దగ్గర నివసించని వారికి మాత్రమే. మరియు అల్లాహ్ యెడల భయభక్తులు కలిగి ఉండండి. మరియు నిశ్చయంగా, అల్లాహ్ శిక్ష విధించటంలో చాలా కఠినుడు, అని తెలుసుకోండి.

**197.** హజ్జ్ నియమిత నెలలోనే జరుగుతుంది. ఈ నిర్ణీత మాసాలలో హజ్జ్ చేయటానికి సంకల్పించిన వ్యక్తి హజ్జ్ (ఇహ్రామ్)లో వున్న సమయంలో (భార్యతో) రతిక్రీడ (రఫస్)కు, దుష్టకార్యాలకు మరియు కలహాలకు దూరంగా ఉండాలి. మీరు చేసే మంచిపనులన్నీ అల్లాహ్ కు తెలుసు. (హజ్జ్ యాత్రకు) కావలసిన వస్తు సామాగ్రిని తీసుకు వెళ్ళండి. దైవభీతియే నిశ్చయంగా అన్నిటికంటే ఉత్తమమైన సామగ్రి. కనుక ఓ బుద్ధిమంతులారా! కేవలం నా యందే భయభక్తులు కలిగి ఉండండి.

**198.** (హజ్జ్ యాత్రలో) మీరు మీ ప్రభువు అనుగ్రహాలు అన్వేషిస్తే[147] అందులో దోషం లేదు.

---

[147] అనుగ్రహాలు అంటే 'హిజ్ యాత్రలో వ్యాపారం మొదలైనవి చేయటం ధర్మసమ్మతమే.

అరఫాత్[148] నుండి బయలు దేరిన తరువాత మష్అరిల్‌హరామ్(ముజ్'దలిఫా)[149] వద్ద(ఆగి) అల్లాహ్ ను స్మరించండి మరియు ఆయన మీకు బోధించిన విధంగా ఆయనను స్మరించండి, వాస్తవానికి మీరు పూర్వం మార్గభ్రష్టులుగా ఉండేవారు.

**199.** తరువాత ప్రజలంతా ఎక్కడి నుండి వెళ్తారో అక్కడి నుండి మీరూ వెళ్ళండి. అల్లాహ్ తో క్షమాభిక్ష వేడుకోండి. నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు అపార కరుణా ప్రదాత.

---

[148] 'అరఫాత్:మక్కా నుండి దాదాపు 12కి.మీ.దూరంలో 'హరమ్ సరిహద్దులకు బయటనున్న ఒక మైదానం అందులో ఒక చిన్నకొండ ఉంది దాని పేరు జబలె-ర'హ్మా. దైవప్రవక్త ('స'అస) 'హజ్ చేసినప్పుడు దాని దగ్గర నుంచొని 'హజ్ ఉపన్యాసం (ఖు'త్బా) ఇచ్చారు. 'హజ్ చేయాలని సంకల్పించిన వారు జు'ల్-'హిజ్జహ్ 9వ తేదీన మధ్యాహ్నం నుండి 10వ తేదీ ఫజ్ర్ అ'జాన్ సమయం వరకు 'హజ్ నియ్యత్ తో ఇ'హ్రాం ధరించి కొంత సమయం ఈ మైదానంలో గడపడం మరియు అల్లాహ్ (సు.తా.) ను ప్రార్థించడం విధి. 'హదీస్' ప్రకారం 'అరఫాత్ లో ఆగడమే 'హజ్. 'అరఫాత్ మైదానం 'హరం సరిహద్దుల బయట ఉంది.

[149] మస్జిద్ మష్అరిల్ - 'హరామ్ ము'జ్దలిఫాలో ఉంది. జు'ల్ - 'హిజ్జహ్ 9వ తేదీన 'హాజీలు 'అరఫాత్ మైదానంలో కొంతకాలం గడిపిన తరువాత ఇక్కడకు చేరుకొని, మ'గ్రిబ్ మరియు 'ఇషా నమాజ్' లు కలిపి చేయడం మస్నూన్. వారు రాత్రి ఇక్కడ గడిపి, 10వ తేదీ ఫజ్ర్ నమా'జ్ తరువాత మీనాకు చేరుకుంటారు. ఇక్కడి నుండి జమరాత్ లపై విసరటానికి, చిన్న చిన్న కంకర రాళ్ళు ఏరుకుంటారు. ము'జ్దలిఫా 'హరమ్ సరిహద్దులలోనే ఉంది.

**200.** ఇక మీ (హజ్జ్) విధులను[150] పూర్తి చేసిన తరువాత, మీరు మీ తండ్రితాతలను (పూర్వం) స్మరించే విధంగా, ఇంకా దాని కంటే అధికంగా అల్లాహ్ ను స్మరించండి. కాని వారిలో కొందరు: "ఓ మా ప్రభూ! మాకు ఈ లోకంలో (అన్నీ) ప్రసాదించు!" అని ప్రార్థిస్తారు. అలాంటి వారికి పరలోకంలో ఎలాంటి భాగం ఉండదు.

**201.** వారిలో మరికొందరు: "ఓ మా ప్రభూ! మాకు ఇహలోకంలో మంచిని మరియు పరలోకం లో కూడా మంచిని ప్రసాదించు మరియు మమ్మల్ని నరకాగ్ని నుండి కాపాడు!" అని ప్రార్థిస్తారు

**202.** అలాంటి వారు తమ సంపాదనకు అనుగుణంగా (ఉభయ లోకాలలో) తమ వాటాను పొందుతారు. మరియు అల్లాహ్ లెక్క తీసుకోవటంలో అతి శీఘ్రుడు.

---

[150] మిగిలిన 'హజ్ విధులు 10,11,12 మరియు 13 జిల్ 'హజ్ లో తేదీలలో పూర్తి చేయాలి. ఈ రోజులలో ఇ'హ్రామ్ లేకుండానే మక్కాకు పోయి తవాఫె 'జియారహ్ మరియు స'యీ అల్ - 'హజ్ పూర్తి చేసు కోవాలి. ఈ మూడు రోజులు మీనాలోనే ఉండి, అల్లాహ్ (సు.తా.) ను ప్రార్థించాలి. 10వ తేదీన సూర్యోదయం తరువాత కేవలం చివరి (జమరతుల్-'అఖబహ్)పై-ఏదైతే మక్కా వైపుకు ఉందో 7 చిన్నచిన్న కంకర రాళ్ళు రువ్వాలి. 11 మరియు 12 తేదీలలో "జుహ్ర్ నమా'జ్ తరువాత మూడు జమరాత్ ల పైననూ ఒక్కొక్క దానిపై 7 చొప్పున కంకర రాళ్ళు రువ్వాలి. జమరాత్:అంటే ఇస్మా'ఈల్ ('అ.స.)ను అతని తండ్రి ఇబ్రాహీమ్('అ.స.), అల్లాహుతా'ఆలా ఆజ్ఞతో జి'బ్హ్ చేయటానికి తీసుకొని పోయేటప్పుడు, షై'తాన్ వారిని, అల్లాహుతా'ఆలా ఆజ్ఞను ఉల్లంఘించటానికి, ప్రేరేపించిన మూడు చోట్లలో నియమించిన గుర్తులు.

**203.** మరియు నియమిత రోజులలో అల్లాహ్ ను స్మరించండి[151]. ఎవడైనా త్వరగా రెండు రోజులలోనే వెళ్ళిపోయినా, అతనిపై ఎలాంటి దోషం లేదు. మరెవడైనా నిదానించి (పదమూడవ తేదీ వరకు) నిలిచి పోయినా, అతనిపై ఎలాంటి దోషం లేదు[152], వాడికి, ఎవడైతే దైవభీతి కలిగి ఉంటాడో! మరియు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి. మరియు నిశ్చయంగా మీరంతా ఆయన సన్నిధిలో హాజరు చేయబడుతారనేది తెలుసుకోండి.

**204.** మరియు ప్రజలలో నుండి ఒక వ్యక్తి మాటలు ఇహలోక జీవితంలో నీకు సంతోషం కలుగజేయవచ్చు; మరియు తన సంకల్పశుద్ధిని తెలుపడానికి అతడు అల్లాహ్ ను సాక్షిగా నిలబెట్టవచ్చు! కాని, వాస్తవానికి అతడు

---

[151] తష్రీక్ దినాలలో అంటే జు'ల్-'హిజ్జహ్ 11,12,13 తేదీలలో ఫ'ర్ద్ నమా'జ్ ల తరువాత తక్బీర్ చదవాలి: "అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్, లా ఇలాహ ఇల్లల్లాహ్, వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వ లిల్లాహిల్ హమ్ద్." కంకర రాళ్ళు విసురునపుడు ప్రతి కంకరరాయి విసిరిన తర్వాత ఈ తక్బీర్ చదవటం సున్నత్. (నీల్ అల్ అవ్ తార్ పుస్తకం - 5, పేజీ – 86).

[152] మూడు జమరాతులపై 11 మరియు 12 జు'ల్ - 'హిజ్జహ్ తేదీలలో కంకర రాళ్ళను రువ్వాలి. 12వ తేదీన మ'గ్రిబ్ కు ముందు మీనా విడువ లేక పోతే, 13వ తేదీన కూడా "జుహ్ర్ నమా'జ్ తరువాత మూడు జమరాతులపై కంకరరాళ్ళను విసిరి మీనాను విడవాలి.

ఘోరమైన జగడాలమారి కావచ్చు![153]

205. మరియు (ఓ ముహమ్మద్) అతడు (నీ వద్ద నుండి) తిరిగిపోయి లోకంలో కల్లోలం రేకెత్తించటానికి, పంటపొలాలను మరియు పశువులను నాశనం చేయటానికి పాటుపడ వచ్చు. మరియు అల్లాహ్ కల్లోల్లాన్ని ఏ మాత్రం ప్రేమించడు.

206. మరియు: "అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండు." అని అతనితో అన్నప్పుడు, అహంభావం అతనిని మరింత పాపానికే ప్రేరేపిస్తుంది. కావున నరకమే అలాంటి వానికి తగిన స్థలం. మరియు అది ఎంత చెడ్డ విరామ స్థలం!

207. మరియు మానవులలోనే, అల్లాహ్ సంతోషం పొందటానికి తన పూర్తి జీవితాన్ని అంకితం చేసేవాడూ ఉన్నాడు. మరియు అల్లాహ్ తన దాసుల యెడల చాల కనికరుడు[154].

208. ఓ విశ్వాసులారా! అల్లాహ్ విధేయతలో (ఇస్లాంలో) సంపూర్ణంగా ప్రవేశించండి. మరియు షైతాను అడుగు జాడలను అనుసరించకండి. నిశ్చయంగా, అతడు మీకు బహిరంగ శత్రువు!

209. మీ వద్దకు స్పష్టమైన హితోపదేశాలు వచ్చిన పిదప కూడా, మీరు తప్పటడుగు వేస్తే! నిశ్చయంగా,

---

[153] స. బు'ఖారీ, పుస్తకం - 3, 'హదీస్' నం. 637. ఇలాంటి వారి ఉదాహరణకు చూడండి, 2:8-12.

[154] అర్-రవూ'ఫు: = అర-ర'హీము, Compassionate, Kind, Merciful. చాల కనికరుడు. ఇవి రెండూ అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లు.

అల్లాహ్ సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు అని తెలుసుకోండి.

**210.** ఏమీ? అల్లాహ్ స్వయంగా దేవదూతలతో పాటు, మేఘాల ఛాయలలో ప్రత్యక్షం కావాలని వారు నిరీక్షిస్తున్నారా? కానీ, అప్పటికే ప్రతి విషయపు తీర్పు జరిగి ఉంటుంది. మరియు సమస్త విషయాలు (తీర్పు కొరకు) అల్లాహ్ దగ్గరికే మరలింపబడతాయి!

**211.** మేము ఎన్ని స్పష్టమైన సూచన (ఆయత్) లను వారికి చూపించామో ఇస్రాయీల్ సంతతి వారిని అడగండి![155] మరియు ఎవడు అల్లాహ్ యొక్క అనుగ్రహాలను పొందిన తరువాత, వాటిని తారుమారు చేస్తాడో! నిశ్చయంగా, అల్లాహ్ అలాంటి వారిని శిక్షించటంలో ఎంతో కఠినుడు.

**212.** సత్యతిరస్కారులకు ఇహలోక జీవితం మనోహరమైనదిగా చేయబడింది. కావున వారు విశ్వాసులతో పరిహాసాలాడుతుంటారు. కానీ, పునరుత్థాన దినమున, దైవభీతి గలవారే వారి కంటే ఉన్నత స్థానంలో ఉంటారు. మరియు అల్లాహ్

[155] ఈ సూచనలు ఉదాహరణకు: కర్ర, మాంత్రికులను ఓడించింది, సముద్రంలో త్రోవ చేసింది, బండ నుండి 12 ఊటలను ప్రవహింపజేసింది, మేఘాల ఛాయలు ఏర్పరచింది, మన్న మరియు 'సల్వాలను దింపింది మొదలైనవి. ఇవన్నీ అల్లాహుతా'ఆలా మహిమను మరియు దైవప్రవక్త నిజాయితీలను తెలుపుతున్నాయి. అయినా సత్యతిరస్కారులు విశ్వసించలేదు.

తాను కోరిన వారికి లెక్కలేనంత జీవనోపాధిని ప్రసాదిస్తాడు.

**213.** పూర్వం, మానవులంతా ఒకే ఒక సమాజంగా ఉండేవారు[156]. అప్పుడు అల్లాహ్ వారికి శుభవార్తలు ఇవ్వటానికి మరియు హెచ్చరికలు చేయటానికి ప్రవక్తలను పంపాడు. మరియు మానవులలో ఏర్పడిన భేదాలను పరిష్కరించటానికి, ఆయన గ్రంథాన్ని సత్యంతో వారి ద్వారా అవతరింపజేశాడు మరియు అది (దివ్యగ్రంథం) ఇవ్వబడిన వారు, స్పష్టమైన హితోపదేశాలు పొందిన తరువాత కూడా, పరస్పర ద్వేషాల వల్ల భేదాభిప్రాయాలు పుట్టించు కున్నారు. కాని అల్లాహ్ తన ఆజ్ఞతో, విశ్వాసులకు వారు వివాదాలాడుతున్న విషయంలో సత్యమార్గాన్ని చూపాడు మరియు అల్లాహ్ తాను కోరినవారికి ఋజుమార్గం వైపుకు మార్గదర్శకత్వం చేస్తాడు

**214.** ఏమీ? మీరు (సులభంగా) స్వర్గంలో ప్రవేశించగలమనిభావిస్తున్నారా? మీపూర్వీకులు సహించినటువంటి (కష్టాలు) మీరూ సహించనిదే!

---

[156] అంటే తౌహీద్: ఏకదైవ సిద్ధాంతంపై ఉండటం. ఆదమ్ ('అ.స.) నుండి నూ'హ్ ('అ.స.) వరకు ప్రజలంతా ఏకదైవ సిద్ధాంతంపై, తమ ప్రవక్తలను అనుసరిస్తూ వచ్చారు. నూ'హ్ ('అ.స.) కాలంలో షై'తాన్ కలతలు రేకెత్తించటం వలన వారి మధ్య భేదాభిప్రాయాలు వచ్చాయి. సత్యతిరస్కారం మరియు షిర్క్ వ్యాపించాయి. ఆ తరువాత అల్లాహ్ (సు.తా.) ప్రవక్తలను దివ్యగ్రంథాలతో - వారి భేదాభిప్రాయాలను దూరం చేయటానికి - పంపాడు (ఇబ్నె - కసీ'ర్).

వారిపై దురవస్థ, రోగబాధలు విరుచుకు పడ్డాయి మరియు వారు కుదిపివేయబడ్డారు, చివరకు అప్పటి సందేశహరుడు మరియు విశ్వాసులైన అతని సహచరులు: "అల్లాహ్ సహాయం ఇంకా ఎప్పుడొస్తుంది?" అని వాపోయారు. అదిగో నిశ్చయంగా అల్లాహ్ సహాయం సమీపంలోనే ఉంది![157]

**215.** (ఓ ముహమ్మద్!) వారు (ప్రజలు) నిన్ను అడుగుతున్నారు: "మేము ఏమి ఖర్చు చేయాలి?" అని. వారితో అను: "మీరు మంచిది ఏది ఖర్చు చేసినా సరే, అది మీ తల్లిదండ్రుల, బంధువుల, అనాథుల, యాచించని పేదల (మసాకీన్) మరియు బాటసారుల కొరకు ఖర్చు చేయాలి. మరియు మీరు ఏ మంచిపని చేసినా అది అల్లాహ్ కు తప్పక తెలుస్తుంది[158]."

**216.** మీకు అసహ్యాకరమైనా! (ధర్మ) యుద్ధం చేయటం మీకు విధిగా నిర్ణయించబడింది[159]. మరియు మీకు నచ్చని విషయమే మీకు మేలైనది కావచ్చు

---

[157] విశ్వాసులకు అల్లాహ్ (సు.తా.) సహాయం తప్పక లభిస్తుంది.

[158] ఈ ఖర్చు, నఫిల్ 'సదఖాత్ గురించి ఉంది. విధిగా ఇవ్వవలసిన 'జకాత్ కాదు. ఎందుకంటే, తల్లిదండ్రులకు 'జకాత్ చెల్లదు. వారిని పోషించటం కుమారుల బాధ్యత. మైమూన్ బిన్ మహ్రాన్ అన్నారు: 'గమనించవలసిన విషయం ఏమిటంటే ఈ ఖర్చు చేయటంలో, ఇంట్లో పెట్టే డ్రాయింగ్స్ గానీ, లేక సంగీత సాధనాలు గానీ, లేక ఇంటి అలంకరణకు వేసే పర్దాలు గానీ లేవు.' అంటే ఇలాంటి వస్తువుల మీద ఖర్చు చేయటం అవాంఛనీయమైన వ్యర్థపు ఖర్చే.

[159] చూడండి, 2:190-193, 22:39.

మరియు మీకు నచ్చే విషయమే మీకు హానికరమైనది కావచ్చు! మరియు అల్లాహ్ కు అంతా తెలుసు, కాని మీకు ఏమీ తెలియదు.

**217.** వారు నిషిద్ధ మాసాలలో యుద్ధం చేయటాన్ని గురించి నిన్ను అడుగుతున్నారు[160]. వారితో ఇలా అను: "వాటిలో యుద్ధం చేయటం మహా అపరాధం. కాని (ప్రజలను) అల్లాహ్ మార్గాన్ని అవలంబించటం నుండి అవరోధాలు కలిగించటం మరియు ఆయన (అల్లాహ్)ను తిరస్కరించటం మరియు (ప్రజలను) మస్జిద్ అల్ హరామ్ ను దర్శించకుండా ఆటంక పరచడం మరియు అక్కడి వారిని దాని నుండి వెడల గొట్టడం అల్లాహ్ దృష్టిలో అంతకంటే మహా అపరాధం. పీడన (ఫిత్నా), రక్తపాతం కంటే ఘోరమైనది[161]. వారికి సాధ్యమే అయితే మిమ్మల్ని మీ ధర్మం నుండి మళ్ళించ గలిగే వరకూ వారు మీతో యుద్ధం చేయడం మానరు. మరియు మీలో ఎవరైనా మతభ్రష్టులై

---

[160] నిషిద్ధ మాసాలు హిజ్రీ శకపు 1,7,11 మరియు 12వ నెలలు, వివరాలకు చూడండి, 2:194 మరియు దాని వ్యాఖ్యానం 1. పైన పేర్కొన్న నిషిద్ధ మాసాలలో యుద్ధం చేయటం ఇస్లాంకు ముందు కూడా అరేబియాలో నిషిద్ధంగా ఉండేది. ఈ ఆయత్ అవతరణను గురించి ఇలా ఉంది: ఒక 'స'హాబీల దళం రజబ్ నెలలో ఒక సత్య తిరస్కారిని చంపి మరికొందరిని ఖైదీలుగా తీసుకుంటారు. అప్పుడు ఆ 'స'హాబీలకు రజబ్ నెల ప్రారంభమైనది తెలియదు. అప్పుడు సత్యతిరస్కారులు: "ఈ ముస్లింలు నిషిద్ధ మాసాలను కూడా లెక్కచేయడం లేదు" అని నిందిస్తారు. ఆ సందర్భంలో ఈ ఆయత్ అవతరింప జేయబడింది.

[161] చూడండి, 2:191 వ్యాఖ్యానం 2.

సత్యతిరస్కారులుగా మరణిస్తే, అలాంటి వారి మంచిపనులన్నీ ఇహపరలోకాలలో రెండింటిలోనూ వృథా అవుతాయి. మరియు అలాంటి వారు నరకాగ్ని వాసులవుతారు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు."

**218.** నిశ్చయంగా, విశ్వసించిన వారు మరియు (అల్లాహ్ మార్గంలో తమ జన్మభూమిని విడిచి) వలస పోయేవారు మరియు అల్లాహ్ మార్గంలో ధర్మపోరాటం చేసేవారు; ఇలాంటి వారే! అల్లాహ్ కారుణ్యం ఆశించటానికి అర్హులు. మరియు అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

**219.** (ఓ ప్రవక్తా!) వారు, మద్యపానాన్ని మరియు జూదాన్ని గురించి నిన్ను ప్రశ్నిస్తున్నారు[162] నీవు ఈ విధంగా సమాధానమివ్వు: "ఈ రెంటింటిలోనూ ఎంతో హాని (పాపం) ఉంది. వాటిలో ప్రజలకు కొన్ని లాభాలు కూడా ఉన్నాయి, కాని వాటి హాని (పాపం) వాటి లాభాల కంటే ఎంతో అధికమైనది." మరియు వారిలా అడుగుతున్నారు: "మేము (అల్లాహ్ మార్గంలో) ఏమి ఖర్చు పెట్టాలి?" నీవు ఇలా సమాధానమివ్వు: "మీ (నిత్యావసరాలకు

[162] చూడండి, 4:43, 5:90-91. 'స. బు'ఖారీ, పుస్తకం - 6, 'హదీస్' నం. 383, 'స. బు'ఖారీ, పుస్తకం - 7, 'హదీస్' నం. 481, 483, 484.

పోగా) మిగిలేది[163]." మీరు ఆలోచించటానికి, అల్లాహ్ ఈ విధంగా తన సూచన (ఆయత్)లను మీకు విశదీకరిస్తున్నాడు-

220. ఇహలోకంలోనూ మరియు పరలోకంలోనూ - మరియు అనాథలను గురించి వారు నిన్ను అడుగుతున్నారు. నీవు ఇలా సమాధానమివ్వు: "వారి సంక్షేమానికి తోడ్పడటమే మేలైనది." మరియు మీరు వారితో కలిసి మెలిసి[164] ఉంటే (తప్పులేదు), వారు మీ సోదరులే! మరియు చెరచేవాడెవడో, సవరించేవాడెవడో అల్లాహ్ కు బాగా తెలుసు మరియు అల్లాహ్ కోరితే మిమ్మల్ని కష్టపెట్టి ఉండేవాడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు

221. మరియు ముష్రిక్ స్త్రీలు, విశ్వసించనంత వరకు, మీరు వారిని వివాహమాడకండి, ముష్రిక్ స్త్రీ మీకు ఎంత నచ్చినా, ఆమె కంటే విశ్వాసురాలైన ఒక బానిస స్త్రీ ఎంతో

[163] అంటే తమ పోషణలో ఉన్న వారి అవసరాలను పూర్తి చేసిన తరువాత. ఉన్నదంతా ఖర్చు పెట్టి, తరువాత అవసరం పడితే ఇతరుల ముందు చేయి చాపవలసిన పరిస్థితి కూడా తెచ్చుకోరాదు.

[164] తు'ఖాలి'తూహుమ్: వారితో కలసి మెలసి ఉండండి. అంటే ఆదాయాలు మరియు ఖర్చులలో, వ్యాపారంలో మొదలైన వాటిలో కలిసి మెలిసి ఉంటే, ఫర్వాలేదు, కాని వారి సంపదలను కబళించు కోవటానికి ప్రయత్నించరాదు. వారి మేలును మీ మేలుగా పరిగణించాలి.

మేలైనది[165]. మరియు ముష్రిక్ పురుషులు విశ్వసించనంత వరకు మీ స్త్రీలతో వారి వివాహం చేయించకండి. మరియు ముష్రిక్ పురుషుడు మీకు ఎంత నచ్చినా, అతడి కంటే విశ్వాసి అయిన ఒక బానిస ఎంతో మేలైనవాడు. ఇలాంటి వారు(ముష్రికీన్) మిమ్మల్ని అగ్ని వైపునకు ఆహ్వానిస్తున్నారు. కాని అల్లాహ్! తన అనుమతితో, మిమ్మల్ని స్వర్గం వైపునకు మరియు క్షమాభిక్ష పొందటానికి పిలుస్తున్నాడు. మరియు ఈ విధంగా ఆయన తన సూచనలను ప్రజలకు - బహుశా వారు గుణపాఠం నేర్చుకుంటారని - స్పష్టంగా తెలుపు తున్నాడు.

222. మరియు వారు నిన్ను స్త్రీల ఋతుకాలం గురించి అడుగుతున్నారు. నీవు వారికి ఇలా తెలుపు: "అదొక అపరిశుద్ధ (హానికరమైన) స్థితి. కనుక ఋతుకాలంలో స్త్రీలతో (సంభోగానికి) దూరంగా

---

[165] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: "స్త్రీని వివాహమాడటానికి నాలుగు విషయాలను గమనించాలి. అవి: 1) ఆస్తిపాస్తులు, 2) పుట్టుపూర్వోత్తరాలు, వంశం 3) అందం, ఆకర్షణీయత మరియు 4) ధర్మపరాయణత." మీరు ధర్మపరాణురాలైన స్త్రీనే ఎంచుకోండి. ('స. బు'ఖారీ, కితాబ్ అన్నికా'హ్, 'స. ముస్లిం, కితాబ్ అర్ర'దా'అ)

ఉండండి[166]. వారు పరిశుద్ధులు కానంత వరకు వారి వద్దకు పోకండి. వారు పరిశుద్ధులు అయిన తరువాత అల్లాహ్ ఆదేశించిన చోటు నుండి మీరు వారి వద్దకు పోవచ్చు[167]" నిశ్చయంగా, అల్లాహ్ పశ్చాత్తాప పడేవారిని ప్రేమిస్తాడు మరియు పరిశుద్ధులుగా ఉండేవారిని ప్రేమిస్తాడు.

**223.** మీ భార్యలు మీకు పంటపొలాల వంటి వారు, కావున మీ పొలాలకు మీరు కోరిన విధంగా పోవచ్చు[168]. మరియు మీ స్వయం కొరకు (సత్కార్యాలు) చేసి పంపండి (మీకు మంచి సంతానం కొరకు ప్రార్థించండి). మరియు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి. మరియు

---

[166] స్త్రీల ఋతుకాలం: ప్రతి చంద్ర మాసంలో 4-5 రోజుల వరకు రక్తం ప్రసరించే కాలం. యూదులు మరియు ఇతర జాతుల వారు ఋతుకాలంలో స్త్రీలను వేరే గదులలో దూరంగా ఉంచేవారు. వారిని వంటింటిలోకి కూడా పోనిచ్చేవారు కాదు. కావున ఈ విషయం గురించి, 'స'హాబీలు ప్రవక్త ('స'అస) గారిని ప్రశ్నించగా, ఈ ఆయత్ అవతరింపజేయబడింది. ఇందులో స్త్రీలతో ఋతుకాలంలో సంభోగం మాత్రమే నిషేధించ బడింది. వారు వంట చేయటం, ఒకే గదిలో భర్తతో కలిసి ఒకే మంచంపై పరుండటం నిషేధించ బడలేదు.

[167] అల్లాహ్ (సు.తా.) ఆదేశించిన చోటు నుండి అంటే సంతానం పుట్టే చోటు నుండి మాత్రమే. ఇతర ఏ చోట్ల నుండి కూడా కాదు. దీనితో విశదమయ్యేది ఏమిటంటే, భార్యతో కూడా మలమార్గం ద్వారా సంభోగం చేయటం నిషిద్ధం ('హరాం).

[168] ఇక్కడ పంటపొలం అంటే సంతానం ఇచ్చేవారు. ఏ విధంగానైతే పొలం నుండి ఫలం లభిస్తుందో అదే విధంగా స్త్రీల నుండి సంతతి ఫలిస్తుంది. ఇక్కడ కూడా మీరు కోరిన పద్ధతిలో పంటపొలంలోకి మాత్రమే పొండి, కాని ఇతర చోట్ల నుండి పోకండి అంటే స్త్రీ మర్మాంగం నుండే సంభోగం చేయండి. ఇతర మార్గాల ద్వారా చేయకండి అని భావం. (ఇబ్నె-కసీ'ర్).

మీరు నిశ్చయంగా ఆయనను కలుసుకోవలసి ఉందని తెలుసుకోండి. మరియు విశ్వాసులకు శుభవార్తలను వినిపించు.

**224.** మరియు మీరు అల్లాహ్ (పేరుతో) చేసే ప్రమాణాలు మిమ్మల్ని సన్మార్గం నుండి, దైవభీతి నుండి మరియు ప్రజలలో శాంతి స్థాపించటం నుండి ఆటంకపరిచేవిగా

కానివ్వకండి[169]. మరియు అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

**225.** మీరు అనాలోచితంగా చేసే ప్రమాణాలను గురించి అల్లాహ్ మిమ్మల్ని పట్టుకోడు. కాని మీరు హృదయపూర్వకంగా చేసే ప్రమాణాలను గురించి ఆయన తప్పకుండా మిమ్మల్ని పట్టుకుంటాడు. మరియు అల్లాహ్ క్షమాశీలుడు, సహనశీలుడు[170].

**226.** ఎవరైతే తమ భార్యలతో (సంభోగించము, అని) ప్రమాణం చేస్తారో, వారికి నాలుగు నెలల వ్యవధి

---

[169] మీరు కోపంలో ఉన్నప్పుడు కూడా ఫలానా వ్యక్తికి ఉపకారం చేయనని అల్లాహుతా'ఆలా పేరుతో ప్రమాణం చేయకండి. దీని కఫ్ఫారా 5:89లో విశదీకరించబడింది. చూడండి, 'స. బు'ఖారీ, పుస్తకం - 8, 'హదీస్' నం. 621.

[170] హలీమున్: The Fore-Bearing, Clement. సహనశీలుడు, ఓర్పు గలవాడు, సౌమ్యుడు, విశాలహృదయుడు, శిక్షించటంలో తొందరపడనివాడు. అల్ - 'హలీము, అర్ - రషీదు. ఇవి అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లు. చూడండి, 11:87.

ఉంది[171]. కాని వారు తమ దాంపత్య జీవితాన్ని మళ్ళీ ప్రారంభిస్తే! నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణాప్రదాత.

**227.** కాని వారు విడాకులకే నిర్ణయించుకుంటే! నిశ్చయంగా, అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

**228.** మరియు విడాకులివ్వబడిన స్త్రీలు మూడు ఋతువుల వరకు (మరొకతనితో పెండ్లి చేసుకోకుండా) వేచి ఉండాలి[172]. మరియు వారు అల్లాహ్ యందు మరియు అంతిమ దినము నందు విశ్వాసమున్న వారే అయితే, అల్లాహ్ వారి గర్భాలలో సృష్టించిన దానిని దాచటం వారికి ధర్మసమ్మతం కాదు[173]. మరియు వారి భర్తలు

---

[171] ఈలా: అంటే శపథం. ఏ వ్యక్తి అయినా తన భార్యతో ఇన్ని నెలలు కలువనని శపథం చేసి ఆ గడువు పూర్తి కాక ముందే ఆమెతో కలిస్తే కఫ్ఫారా చేయాలి. ఒకవేళ ఆ గడువు 4 నెలల కంటే ఎక్కువ ఉంటే - అతడు ఆమెను 4 నెలల కంటే ఎక్కువ కాలం ప్రేలాడ నివ్వలేడు కావున - నాలుగు నెలల తరువాత ఆమెతో ఆదరంగా దాంపత్య జీవితం సాగించాలి. లేదా ఆదరంగా సాగనంపాలి. (ఇబ్నె - కసీ'ర్).

[172] ఈ శాసనం గర్భవతి అయిన స్త్రీకి వర్తించదు. వారి వేచి యుండే సమయం ('ఇద్దత్) కాన్పు వరకు ఉంటుంది. మరియు నికా'హ్ తరువాత సంభోగం కాని స్త్రీకి కూడా వర్తించదు. ఆమెకు 'ఇద్దత్ గడువు ఉండదు. మరియు ఋతుస్రావం ప్రారంభం కాని స్త్రీ మరియు ఋతుస్రావం ఆగిన స్త్రీకి కూడా వర్తించదు. వారి గడువు మూడు మాసాలు, (ఇబ్నె-కసీ'ర్). చూడండి, 65:1-7. ఇతర స్త్రీలు భర్త మరణించిన తరువాత నాలుగు మాసాల పది రోజులు వేచి ఉండాలి. (2:234)

[173] ఇక్కడ గర్భం మరియు ఋతుస్రావం రెండింటిని కూడా దాచ వద్దని అర్థం.

దాంపత్య సంబంధాలను సరిదిద్దు కోవటానికి సిద్ధంగా ఉంటే! ఈ నిరీక్షణ కాలంలో వారిని తమ భార్యలుగా తిరిగి స్వీకరించే హక్కు వారికి ఉంది. మరియు వారికి (స్త్రీలకు) వారి (భర్తల)పై ధర్మసమ్మతమైన హక్కులు న్నాయి. ఏ విధంగానైతే వారికి (భర్తలకు) వారిపై ఉన్నాయో. కాని పురుషులకు స్త్రీలపై (కర్తవ్య) ఆధిక్యత ఉంది[174]. మరియు అల్లాహ్ సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు.

**229.** విడాకులు రెండు సార్లే! ఆ తర్వాత (భార్యను) సహృదయంతో తమ వద్ద ఉండనివ్వాలి, లేదా ఆమెను మంచితనంతో సాగనంపాలి[175]. మరియు సాగనంపేటప్పుడు మీరు వారికిచ్చిన వాటి నుండి ఏమైనా తిరిగి తీసుకోవడం ధర్మసమ్మతంకాదు. అల్లాహ్ విధించిన హద్దులకు కట్టుబడి ఉండలేము అనే భయం ఆ ఇద్దరికీ ఉంటే తప్ప! కాని అల్లాహ్ విధించిన హద్దులకు కట్టుబడి

---

[174] మగవారికి ఉన్న ఆధిక్యత, వారి శారీరక బలం, వారికున్న జిహాద్ అనుమతి, వారసత్వంలో ఆధిక్యత మరియు భార్యాపిల్లలను మరియు కుటుంబం వారిని పోషించే బాధ్యత మొదలైనవి.

[175] భర్త తన భార్యను 'ఇద్దత్ గడువులోపల కేవలం రెండుసార్లు మాత్రమే తిరిగి స్వీకరించవచ్చు. అంటే మొదటిసారి ఇచ్చిన విడాకుల తరువాత మరియు రెండవసారి ఇచ్చిన విడాకుల తరువాత. మూడవసారి విడాకులిచ్చిన తరువాత 'ఇద్దత్ గడువులోపల భార్యను తిరిగి స్వీకరించే అనుమతి లేదు. 'అ'త్తలాఖు మర్రతాన్' దీని అర్థం ఏమిటంటే ఒకేసారి మూడు విడాకులు పూర్తికావు. అంటే ఒకే సమయంలో 'తలాఖ్ అని ఎన్నిసార్లు పలికినా అది ఒకే 'తలాఖ్ గా పరిగణించబడాలి.

ఉండలేమనే భయం ఆ దంపతులకు ఉంటే స్త్రీ పరిహారమిచ్చి (విడాకులు / ఖులా తీసుకంటే) అందులో వారికి ఎలాంటి దోషం లేదు[176]. ఇవి అల్లాహ్ విధించిన హద్దులు, కావున వీటిని అతిక్రమించకండి. మరియు ఎవరైతే అల్లాహ్ విధించిన హద్దులను అతిక్రమిస్తారో, అలాంటి వారే దుర్మార్గులు[177].

**230.** ఒకవేళ అతడు (మూడవసారి) విడాకులిస్తే, ఆ తర్వాత ఆ స్త్రీ అతనికి ధర్మసమ్మతం కాదు, ఆమె వివాహం వేరే పురుషునితో జరిగితే తప్ప! ఒకవేళ అతడు (రెండవ భర్త) ఆమెకు విడాకులిస్తే! అప్పుడు ఉభయులూ (మొదటి భర్త, ఈ స్త్రీ) తాము అల్లాహ్ హద్దులకు లోబడి ఉండగలమని భావిస్తే వారు పునర్వివాహం చేసుకోవటంలో దోషం లేదు మరియు ఇవి అల్లాహ్ నియమించిన హద్దులు. వీటిని ఆయన గ్రహించే వారికి స్పష్టపరుస్తున్నాడు.

**231.** మరియు మీరు స్త్రీలకు విడాకులిచ్చినప్పుడు, వారి కొరకు నిర్ణయించబడిన గడువు (ఇద్దత్) సమీపిస్తే వారిని సహృదయంతో మీ వద్ద

---

[176] స్త్రీ విడాకులు కోరితే, సమంజసమైన కారణం చూపి, పరిహారమిచ్చి లేక మహ్ర్ వాపసు ఇచ్చి, ఖుల'అ తీసుకోవచ్చు. న్యాయస్థానం ఈ విషయంలో ఆమెకు తోడ్పడుతుంది. పురుషుడు అంగీకరించని పక్షంలో న్యాయాధికారి స్త్రీ చూపిన కారణాలతో ఏకీభవిస్తే, వారి వివాహబంధాన్ని రద్దు చేయవచ్చు (అబూ - దావూద్, తిర్మిజీ', నసాయీ' - ఫ'త్హ అల్ - ఖదీర్).

[177] స. బు'ఖారీ, పుస్తకం - 7, 'హదీస్' నం. 197.

ఉంచుకోండి, లేదా సహృదయంతో విడిచి పెట్టండి. కేవలం వారికి బాధ కలిగించే మరియు పీడించే ఉద్దేశ్యంతో వారిని ఉంచు కోకండి మరియు ఆ విధంగా చేసేవాడు వాస్తవానికి తనకు తానే అన్యాయం చేసుకున్నట్లు. మరియు అల్లాహ్ ఆదేశాలను (ఆయాత్ లను) పరిహాసంగా తీసుకోకండి. మరియు అల్లాహ్ మీకు చేసిన అనుగ్రహాన్ని మరియు మీపై అవతరింపజేసిన గ్రంథాన్ని మరియు వివేకాన్ని జ్ఞాపకం చేసుకోండి. ఆయన (అల్లాహ్) మీకు ఈ విధంగా బోధిస్తున్నాడు. మరియు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి మరియు నిశ్చయంగా, అల్లాహ్ కు ప్రతి విషయం గురించి బాగా తెలుసని తెలుసుకోండి.

**232.** మరియు మీరు మీ స్త్రీలకు (మొదటి సారి లేక రెండవసారి) విడాకులిస్తే, వారు తమ నిరీక్షణా వ్యవధిని (ఇద్దత్ ను) పూర్తి చేసిన తరువాత, తమ (మొదటి) భర్తలను ధర్మసమ్మతంగా పరస్పర అంగీకారంతో వివాహం చేసుకోదలిస్తే, మీరు వారిని ఆటంకపరచ కండి. మీలో ఎవరికి అల్లాహ్ యందు మరియు అంతిమ దినము నందు విశ్వాసముందో, వారికి ఈ బోధన చేయబడుతోంది. ఇది మీకు నిష్కళంకమైనది మరియు నిర్మలమైనది. మరియు అల్లాహ్ కు అంతా తెలుసు, కాని మీకు ఏమీ తెలియదు.

**233.** (విడాకుల తరువాత) పూర్తి రెండు సంవత్సరాల పాల గడువు పూర్తి చేయవలెనని (తల్లిదండ్రులు) కోరినట్లయితే, తల్లులు తమ పిల్లలకు పాలివ్వాలి. బిడ్డ తండ్రిపై, వారికి తగు రీతిగా భోజనం మరియు వస్త్రాలిచ్చి పోషించవలసిన బాధ్యత ఉంటుంది. శక్తికి మించిన భారం ఏ వ్యక్తిపై కూడా మోపబడదు. తల్లి తన బిడ్డ వలన కష్టాలకు గురి కాకూడదు. మరియు తండ్రి కూడా తన బిడ్డ వలన (కష్టాలకు గురి కాకూడదు). మరియు (పాలిచ్చే తల్లిని పోషించే బాధ్యత తండ్రిపై ఉన్నట్లు తండ్రి చనిపోతే) అతని వారసులపై కూడా ఉంటుంది. మరియు (తల్లిదండ్రులు) ఇరువురు సంప్రదించుకొని పరస్పర అంగీకారంతో (రెండు సంవత్సరాలు పూర్తికాక ముందే) బిడ్డ చేత పాలు విడిపిస్తే, వారిరువురికి ఎలాంటి దోషం లేదు. మరియు మీరు మీ బిడ్డలకు వేరే స్త్రీ ద్వారా పాలు ఇప్పించే ఏర్పాటు చేయదలిస్తే, మీపై ఎలాంటి దోషం లేదు. కాని మీరు ఆమెకు (తల్లికి) ఇవ్వ వలసింది ధర్మసమ్మతంగా చెల్లించాలి. అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి. మరియు మీరు చేసేదంతా నిశ్చయంగా, అల్లాహ్ చూస్తున్నాడని తెలుసుకోండి.

**234.** మరియు మీలో ఎవరైనా మరణించి, భార్యలను వదలిపోయినట్లైతే (అలాంటి విధవలు) నాలుగు నెలల పది రోజులు (రెండవ పెండ్లి చేసుకోకుండా)

వేచి ఉండాలి[178]. వారి గడువు పూర్తి అయిన తరువాత వారు తమకు ఉచితమైనది, ధర్మసమ్మతంగా చేసుకుంటే మీపై దోషం లేదు. మరియు మీరు చేసేదంతా అల్లాహ్ బాగా ఎరుగును.

**235.** మరియు మీరు (వితంతువు లేక మూడు విడాకులు పొందిన స్త్రీలతో) వివాహం చేసుకోవాలనే సంకల్పాన్ని (వారి నిరీక్షణా కాలంలో) పరోక్షంగా తెలిపినా లేక దానిని మీ మనస్సులలో గోప్యంగా ఉంచినా మీపై దోషం లేదు. మీరు వారితో (వివాహమాడటం గురించి) ఆలోచిస్తున్నారని అల్లాహ్ కు తెలుసు, కానీ వారితో రహస్యంగా ఎలాంటి ఒప్పందం చేసు కోకండి. అయితే మీరేదైనా మాట్లాడదలచుకుంటే, ధర్మసమ్మతమైన రీతిలో మాట్లాడుకోండి. మరియు నిరీక్షణా వ్యవధి పూర్తయ్యేంత వరకు వివాహం చేసుకోకండి. నిశ్చయంగా మీ మనస్సులలో ఉన్నదంతా అల్లాహ్ కు తెలుసని తెలుసుకొని, ఆయనకు భయపడండి. మరియు నిశ్చయంగా అల్లాహ్ క్షమాశీలుడు, సహనశీలుడు (శాంత స్వభావుడు) అని తెలుసుకోండి.

**236.** మీరు మీ స్త్రీలను ముట్టుకోక ముందే, లేక వారి మహ్ర్ నిర్ణయం కాక పూర్వమే, వారికి విడాకులిస్తే,

---

[178] ఈ 'ఇద్దత్ గడువు ప్రతి స్తీకి వర్తిస్తుంది. సంభోగం కాని స్త్రీ అయినా లేక ముసలిది అయినా సరే! కాని గర్భవతి అయిన స్త్రీ మాత్రం కాన్పు వరకు వేచి ఉండాలి, (65:4). ఈ గడువు కాలంలో వారు తమ మృత భర్త ఇంటిలోనే ఉండాలి. (ఇబ్నె - కసీ'ర్).

అది పాపం కాదు. మరియు వారికి కొంత పారితోషికంగా తప్పకుండా ఇవ్వండి. మరియు ధనవంతుడు తన శక్తి మేరకు, పేదవాడు తన స్థితిని బట్టి ధర్మసమ్మతమైన విధంగా పారితోషికం ఇవ్వాలి. ఇది సజ్జనులైన వారి విద్యుక్తధర్మం.

**237.** మరియు మీరు తాకక పూర్వమే మీ స్త్రీలకు విడాకులిస్తే మరియు వాస్తవానికి అప్పటికే వారి కన్యాశుల్కం (మహ్ర్) నిర్ణయించబడి ఉంటే, సగం మహ్ర్ చెల్లించండి, కానీ స్త్రీ క్షమించి విడిచి పెడ్తే, లేదా వివాహ సంబంధ అధికారం ఎవరి చేతిలో ఉందో అతడు (భర్త) గానీ క్షమించి విడిచిపెట్టగోరితే తప్ప![179] మరియు క్షమించటమే దైవభీతికి సన్నిహితమైనది. మరియు మీరు పరస్పర వ్యవహారాలలో ఔదార్యం చూపటం మరచిపోవద్దు. నిశ్చయంగా అల్లాహ్ మీరు చేసేదంతా చూస్తున్నాడు.

**238.** మీరు మీ నమాజ్ లను కాపాడుకోండి మరియు ముఖ్యంగా మధ్య నమాజ్ ను[180] మరియు అల్లాహ్ సన్నిధానంలో వినయవిధేయతలతో నిలబడండి.

---

[179] అంటే భర్త, ఎందుకంటే వివాహబంధాన్ని త్రెంచటం అతని అధికారంలో ఉంది. కావున అతడు స్త్రీకి మహ్ర్ చెల్లించి ఉంటే, ఆమెను తాకక పూర్వమే విడాకులిస్తే అందులో నుండి ధర్మసమ్మతంగా సగం తీసుకోవచ్చు, లేదా పూర్తిగా విడిచి పెట్టవచ్చు.

[180] అంటే అ'స్ర్ నమా'జ్, దైవప్రవక్త ('స'అస) కందక యుద్ధ దినమున 'అ'స్ర్ నమా'జ్ ను మధ్య నమా'జ్ గా పేర్కొన్నారు. 'స. బు'ఖారీ, పుస్తకం - 1, 'హదీస్' నం. 527, 528.

**239.** మీరు ప్రమాద స్థితిలో ఉన్నప్పుడు నడుస్తూ గానీ, స్వారీ చేస్తూ గానీ, నమాజ్ చేయ వచ్చు[181]. కాని మీకు శాంతిభద్రతలు లభించినప్పుడు, ఆయన మీకు నేర్పినట్లు అల్లాహ్ ను స్మరించండి. ఎందుకంటే ఈ పద్ధతి ఇంతకు పూర్వం మీకు తెలియదు.

**240.** మరియు మీలో మరణించిన వారు భార్యలను వదలిపోతే, వారు తమ భార్యలకు ఒక సంవత్సరపు భరణపు ఖర్చులు ఇవ్వాలనీ, వారిని ఇంటి నుండి వెడలగొట్ట వద్దనీ వీలునామా వ్రాయాలి[182]. కానీ వారు తమంతటతామే వెళ్ళిపోయి, తమ విషయంలో ధర్మసమ్మతంగా ఏమి చేసినా మీపై పాపం లేదు మరియు అల్లాహ్ సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు.

**241.** మరియు విడాకులివ్వబడిన స్త్రీలకు ధర్మ ప్రకారంగా భరణపు ఖర్చులు ఇవ్వాలి. ఇది దైవభీతి గలవారి విధి.

**242.** ఈ విధంగా అల్లాహ్ తన ఆజ్ఞలను (ఆయత్ లను) మీకు స్పష్టంగా తెలుపు తున్నాడు. బహుశా మీరు అర్థం చేసుకుంటారని.

**243.** ఏమీ? మృత్యుభయంతో, వేల సంఖ్యలో ప్రజలు తమ ఇండ్లను వదలి పోయింది నీకు తెలియదా?

[181] చూడండి, 'స. బు'ఖారీ, పుస్తకం - 5, 'హదీస్' నం. 451. అంటే శత్రుభయం ఉంటే.

[182] భర్త మరణిస్తే 'ఇద్దత్ గడువు 4 నెలల 10 రోజులు. చూడండి, 4:12వ ఆయతులో భర్త ఆస్తిలో భార్యకు విధిగా భాగం నిర్ణయించబడి ఉంది. కాబట్టి వీలునామా వ్రాసే అవసరం లేదు.

అప్పుడు అల్లాహ్ వారితో: "మరణించండి!" అని అన్నాడు కాని తరువాత వారిని బ్రతికించాడు[183]. నిశ్చయంగా, అల్లాహ్ మానవుల పట్ల అత్యంత అనుగ్రహం గలవాడు, కాని చాలా మంది కృతఘ్నతలు చూపరు.

**244.** మరియు మీరు అల్లాహ్ మార్గంలో యుద్ధం చేయండి మరియు నిశ్చయంగా, అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు, అని తెలుసుకోండి.

**245.** అల్లాహ్ కు మంచి ఋణం ఇచ్చేవాడు, మీలో ఎవడు?[184] ఎందుకంటే ఆయన దానిని ఎన్నో రెట్లు అధికం చేసి తిరిగి ఇస్తాడు. అల్లాహ్ మాత్రమే (సంపదలను) తగ్గించేవాడూ మరియు హెచ్చించేవాడూనూ మరియు మీరంతా ఆయన వైపునకే మరలిపోవలసి ఉంది.

**246.** ఏమీ? మూసా (నిర్యాణం) తరువాత ఇస్రాయీలు సంతతి నాయకులు, తమ ఒక ప్రవక్తతో: "నీవు మా కొరకు ఒక రాజును నియమించు, మేము అల్లాహ్ మార్గంలో యుద్ధం (జిహాద్) చేస్తాము."

---

[183] ఇది ఒక ప్రాచీన సమాజపు కథ, దీనిని గురించి ఏ 'హదీస్' లేదు. కొందరు దీనిని ఇస్రాయీ'ల్ సంతతి వారిలోని ఒక ప్రవక్త కాలపు కథ కావచ్చని అంటారు. బహుశా హిజ్కీల్ ('అ.స.) కాలపు విషయమై ఉండవచ్చు.

[184] అంటే అల్లాహ్ (సు.తా.) మార్గంలో మరియు జిహాద్ కొరకు ధనాన్ని ఖర్చు చేయడం.

అని పలికిన సంగతి నీకు తెలియదా?[185] దానికి అతను: "ఒకవేళ యుద్ధం చేయమని ఆదేశిస్తే, మీరు యుద్ధం చేయటానికి నిరాకరించరు కదా? అని అన్నాడు. దానికి వారు: "మేము మరియు మా సంతానం, మా ఇండ్ల నుండి గెంటివేయ బడ్డాము కదా! అలాంటప్పుడు మేము అల్లాహ్ మార్గంలో ఎందుకు యుద్ధం చేయము?" అని జవాబిచ్చారు. కాని యుద్ధం చేయండని ఆజ్ఞాపించగానే, వారిలో కొందరు తప్ప, అందరూ వెన్నుచూపారు. మరియు అల్లాహ్ కు ఈ దుర్మార్గులను గురించి బాగా తెలుసు.

**247.** మరియు వారి ప్రవక్త (సామ్యూల్) వారితో: "నిశ్చయంగా, అల్లాహ్ మీ కొరకు 'తాలూత్ ను (సౌల్ ను) రాజుగా నియమించాడు." అని అన్నాడు. దానికి వారు అన్నారు: "మాపై రాజ్యం చేసే హక్కు అతనికి ఎలా సంక్రమిస్తుంది? వాస్తవానికి, రాజ్యం చేసే హక్కు, అతని కంటే ఎక్కువ, మాకే ఉంది. మరియు అతను అత్యధిక ధనసంపత్తులున్న వాడునూ కాడు." (దానికి వారి ప్రవక్త) అన్నాడు: "నిశ్చయంగా, అల్లాహ్ మీలో అతనిని ఎన్నుకొని అతనికి బుద్ధిబలాన్నీ,

---

[185] ఇక్కడ ప్రవక్త ఉండగా; బనీ ఇస్రాయీ'ల్ వారు, తమ ప్రవక్త సామ్యూల్ (అ.స.)తో: "మాకొక రాజును నియమించు"అని అడగటం అల్లాహుతా'ఆలాకు అంగీకారమైనదే కాబట్టి ఖుర్ఆన్'లో పేర్కొనబడింది. కాని అట్టి రాజు దైవభీతి గలవాడు, న్యాయవంతుడు అయితే, అది ధర్మసమ్మతమే కాక వాంఛనీయం కూడాను. చూడండి, 5:20

శారీరక బలాన్నీ సమృద్ధిగా ప్రసాదించాడు. మరియు అల్లాహ్ తాను కోరిన వారికి తన రాజ్యాన్ని ప్రసాదిస్తాడు. మరియు అల్లాహ్ సర్వవ్యాప్తి[186], సర్వజ్ఞుడు."

**248.** మరియు వారితో వారి ప్రవక్త (సామ్యూల్) ఇలా అన్నాడు: "నిశ్చయంగా, అతని ఆధిపత్యానికి లక్షణం ఏమిటంటే, అతని ప్రభుత్వకాలంలో ఆ పెట్టె (తాబూత్) మీకు తిరిగి లభిస్తుంది. అందులో మీకు మీ ప్రభువు తరఫు నుండి, మనశ్శాంతి లభిస్తుంది. మరియు అందులో మూసా సంతతి మరియు హారూన్ సంతతి వారు వదలి వెళ్ళిన పవిత్ర అవశేషాలు, దేవదూతల ద్వారా మీకు లభిస్తాయి. మీరు విశ్వసించిన వారే అయితే! నిశ్చయంగా, ఇందులో మీకు ఒక గొప్ప సూచన ఉంది."

**249.** ఆ పిదప 'తాలూత్ (సౌల్) తన సైన్యంతో బయలు దేరుతూ అన్నాడు: "నిశ్చయంగా, అల్లాహ్ ఒక నది[187] ద్వారా మిమ్మల్ని పరీక్షించబోతున్నాడు. దాని నుండి నీరు త్రాగిన వాడు నా వాడు కాడు. మరియు నది నీటిని రుచి చూడని వాడు నిశ్చయంగా నా వాడు, కాని చేతితో గుక్కెడు త్రాగితే పర్వాలేదు." అయితే వారిలో కొందరు తప్ప అందరూ దాని నుండి (కడుపు నిండా నీరు)

---

[186] చూడండి, 2:115 వ్యాఖ్యానం 1.
[187] ఈ నది జోర్డాన్ మరియు ఫలస్తీన్ ల మధ్య ఉంది.

త్రాగారు. అతను మరియు అతని వెంట విశ్వాసులు ఆ నదిని దాటిన తరువాత వారన్నారు: "జాలూత్ తో మరియు అతని సైన్యంతో పోరాడే శక్తి ఈరోజు మాలో లేదు." (కానీ ఒక రోజున) అల్లాహ్ ను కలవడం తప్పదని భావించిన వారన్నారు: "అల్లాహ్ అనుమతితో, ఒక చిన్న వర్గం ఒక పెద్ద వర్గాన్ని జయించటం ఎన్నో సార్లు జరిగింది. మరియు అల్లాహ్ స్థైర్యం గలవారితోనే ఉంటాడు."

**250.** జాలూత్ (గోలియత్) మరియు అతని సైన్యాన్ని ఎదుర్కొనటానికి బయలు దేరి, వారు: "ఓ మా ప్రభూ! మాకు (ధైర్య)స్థైర్యాలను ప్రసాదించు, మా పాదాలను స్థిరంగా నిలపు. మరియు సత్యతిరస్కారులకు విరుద్ధంగా (పోరాడటానికి) మాకు సహాయపడు." అని ప్రార్థించారు.

**251.** ఆ తరువాత వారు, అల్లాహ్ అనుమతితో వారిని (సత్యతిరస్కారులను) ఓడించారు. మరియు దావూద్, జాలూత్ ను సంహరించాడు[188] మరియు అల్లాహ్ అతనికి (దావూద్ కు) రాజ్యాధికారం మరియు జ్ఞానం ప్రసాదించి, తాను కోరిన విషయాలను అతనికి బోధించాడు. ఈ విధంగా అల్లాహ్ ప్రజలను, ఒకరి నుండి మరొకరిని కాపాడకుంటే, భూమిలో కల్లోలం వ్యాపించి

---

[188] దావూద్ ('అ.స.) 'తాలూత్ సైన్యంలో ఒక సిపాయి. అతను జాలూత్ ను సంహరించారు.

ఉండేది. కానీ అల్లాహ్ సమస్త లోకాల మీద ఎంతో అనుగ్రహం గలవాడు[189]."

**252.** ఇవన్నీ అల్లాహ్ సందేశాలు, వాటిని మేము యథాతథంగా నీకు వినిపిస్తున్నాము. మరియు (ఓ ముహమ్మద్!) నిశ్చయంగా, నీవు (మా) సందేశహరులలో ఒకడవు[190].

**253.** ఆ సందేశహరులు! మేము వారిలో కొందరికి మరికొందరిపై ఆధిక్యత నిచ్చాము[191]. వారిలోకొందరితోఅల్లాహ్(నేరుగా)మాట్లాడాడు[192]. మరికొందరిని (గౌరవనీయమైన) ఉన్నత స్థానాలకు ఎత్తాడు. మరియు మర్యమ్ కుమారుడు ఈసా (ఏసు)కు మేము స్పష్టమైన సూచనలు ప్రసాదించి, అతనిని పరిశుద్ధాత్మ (జిబ్రీల్) సహాయంతో బలపరిచాము. మరియు - అల్లాహ్ తలుచుకుంటే - ఈ ప్రవక్తల తరువాత వచ్చిన ప్రజలు, వారికి స్పష్టమైన సూచనలు వచ్చిన తరువాత కూడా

---

[189] ఇందులో అల్లాహ్ (సు.తా.) యొక్క ఒక సంప్రదాయం (సున్నత్) ఉన్నది. ఆయన మానవులలోని ఒక వర్గం ద్వారా, అధికారం మరియు దుర్మార్గం మీద ఉన్న, మరొక వర్గాన్ని అంతమొందిస్తాడు. చూడండి, 22:38-40.

[190] చూడండి, 'స.బు'ఖారీ, పుస్తకం-1, 'హదీస్' నం. 331; 'స. బు'ఖారీ, పుస్తకం - 4, 'హదీస్' నం. 735.

[191] చూడండి, 17:55.

[192] మూసా ('అ.స.) తో అల్లాహ్ (సు.తా.) మాట్లాడిన దానికి చూడండి, 4:164. 'ఈసా ('అ.స.) సూచనల కొరకు చూడండి, 3:46, 49.

పరస్పరం కలహించుకునేవారు కాదు. కానీ, వారు పరస్పర విభేదాలకు లోనయ్యారు. కావున వారిలో కొందరు విశ్వాసులయ్యారు మరికొందరు సత్యతిరస్కారులు అయ్యారు. మరియు అల్లాహ్ తలుచుకుంటే వారు పరస్పరం కలహించు కునేవారు కాదు, కాని అల్లాహ్ తాను కోరిందే చేస్తాడు[193].

**254.** ఓ విశ్వాసులారా! ఏ బేరం గానీ, స్నేహం గానీ, సిఫారసు గానీ పనికిరాని దినం రాకముందే[194], మేము మీకు ప్రసాదించిన జీవనోపాధి నుండి (మా మార్గంలో) ఖర్చు పెట్టండి. మరియు సత్యతిరస్కారులు, వారే! దుర్మార్గులు.

**255.** అల్లాహ్! ఆయన తప్ప మరొక ఆరాధ్య దేవుడు

---

[193] ఈ విధమైన ఆయత్ ఖుర్ఆన్ లో ఎన్నో సార్లు వచ్చింది. అల్లాహ్ (సు.తా.)కు తాను అవతరింప జేసిన ధర్మంలో భేదాభిప్రాయాలు కల్పించటం ఏ మాత్రం నచ్చదు. ప్రజలంతా ఆయన అవతరింపజేసిన ధర్మాన్నే అనుసరించి నరకాగ్ని నుండి రక్షించబడాలనే అల్లాహుతా'ఆలా కోరిక. కావున ఆయన ప్రవక్తలను మానవుల నుండి ఎన్నుకొని వారిపై దివ్యగ్రంథాలను అవతరింపజేస్తాడు మరియు ము'హమ్మద్ ('స' అస) ను చివరి ప్రవక్తగా ఎన్నుకున్నాడు. అతని తరువాత ఖలీఫాలు మరియు ధర్మశాస్త్రవేత్తలు, ద'వఅహ్ తో అల్లాహ్ (సు.తా.) ధర్మం (ఇస్లాం) ను వ్యాపింపజేస్తున్నారు.

[194] చూడండి, 21:28.

లేడు[195]. ఆయన సజీవుడు[196], విశ్వవ్యవస్థకు ఆధార భూతుడు[197]. ఆయనకు కునుకు రాదు మరియు నిదుర రాదు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయనకు చెందినదే. ఆయన సమ్ముఖంలో - ఆయన అనుజ్ఞ లేకుండా - సిఫారసుచేయగలవాడెవడు? వారి ముందున్నదీ మరియు వారి వెనుక నున్నదీ అన్నీ ఆయనకు బాగా తెలుసు[198]. మరియు ఆయన కోరితే తప్ప, ఆయన జ్ఞానవిశేషాలలో ఏ విషయమునూ

---

[195] ఈ ఆయత్ ఆయతుల్ - కుర్సీ అనబడుతుంది. 'హదీస్' లలో దీని యొక్క ఎన్నో శుభాలు పేర్కొనబడ్డాయి. దీనిని రాత్రి నిద్రపోవటానికి ముందు చదువటం వలన రాత్రంతా షై'తాన్ నుండి రక్షణ దొరుకుతుంది. ప్రతి నమా'జ్ తర్వాత కూడా చదివితే ఎన్నో పుణ్యాలు ఉన్నాయి. ఇందులో అల్లాహుతా'ఆలా యొక్క ఏకత్వం మరియు ఆయన మహిమలు చెప్పబడ్డాయి.

[196] అల్ - 'హయ్యు: The Ever-Living. సజీవుడు, నిత్యుడు, నిత్యజీవుడు.

[197] అల్ - ఖయ్యూమ్: By whom all things subsist. విశ్వవ్యవస్థకు ఆధారభూతుడు, శాశ్వితుడు.

[198] తఫ్సీర్ అల్ - ముయస్సర్ లో దీని తాత్పర్యం ఈ విధంగా ఇవ్వబడింది: "వారికి ముందు సంభవించ నున్నది మరియు ఇంతకు ముందు సంభవించిందీ అన్నీ అల్లాహ్ (సు.తా.) కు బాగా తెలుసు." దీని మరొక తాత్పర్యం ఇలా ఉంది : "వారికి ముందు (పరలోకంలో) సంభవించనున్నదీ మరియు వెనక (ఇహలోకంలో) సంభవించిందీ, అన్నీ అల్లాహుతా'ఆలా కు బాగా తెలుసు."

వారు గ్రహించజాలరు. ఆయన కుర్సీ[199] ఆకాశాలనూ మరియు భూమినీ పరివేష్ఠించి ఉన్నది. వాటి సంరక్షణ ఆయనకు ఏమాత్రం అలసట కలిగించదు మరియు ఆయన మహోన్నతుడు[200] సర్వోత్తముడు

256. ధర్మం విషయంలో బలవంతం లేదు[201]. వాస్తవానికి సన్మార్గం (రుష్ద్) దుర్మార్గం నుండి సుస్పష్టం చేయబడింది. కావున కల్పితదైవాన్ని

---

[199] కుర్సీ: కొందరు వ్యాఖ్యాతలు దీనిని, పాదాలు పెట్టే చోటన్నారు. కొందరు జ్ఞానం, మరికొందరు విశ్వ సామ్రాజ్యాధిపత్యం, మరికొందరు సింహాసనం ('అర్ష్) అన్నారు. కాని అల్లాహ్ (సు.తా.) యొక్క 'సిఫాత్ లను దివ్యఖుర్ఆన్ మరియు 'స'హీ'హ్ 'హదీస్' లలో బోధించినట్లుగా, వాటికి ఏ విధమైన తాత్పర్యాలు ఇవ్వకుండా వాటిని విశ్వసించాలి. అంటే ఇది ఒక కుర్సీ, 'అర్ష్ కాదు, మరొకటి. అది ఎలా ఉంటుంది, దానిపై అల్లాహుతా'ఆలా ఎలా కూర్చుంటాడు మేము వివరించలేము, ఎందుకంటే ఆ వాస్తవం మనకు తెలియదు.

[200] అల్ - 'అలియ్యు : The Most High, He above whom is nothing. మహోన్నతుడు, అత్యున్నతుడు. చూడండి, 6:100. ఇంకా చూడండి, అల్ - ముత'ఆలి, 13:9, సర్వోన్నతుడు, ఇవి అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లు. ఇంకా చూడండి, అల్ - అ'అలా, 87:1.

[201] ఇస్లాం ధర్మం స్వీకరించమని ఎవ్వరినీ బలవంతం చేయరాదు. ఎందుకంటే అల్లాహ్ (సు.తా.) మంచీ-చెడూ, అనే రెండు మార్గాలను చూపి, వాటిని అనుసరించటం వల్ల లభించే ప్రతిఫలాలను కూడా స్పష్టపరచాడు. కాని అల్లాహ్ (సు.తా.) మార్గాన్ని అనుసరిస్తూ దానిని ఇతరులకు బోధించటాన్ని విరోధించే వారి, అత్యాచారాన్ని నిర్మూలించటానికి ధర్మపోరాటం (జిహాద్) చేయాలి. ఎందుకంటే ప్రతి వ్యక్తికి తనకు ఇష్టమైన ధర్మాన్ని అనుసరించే స్వాతంత్ర్యం ఉంది.

(తాగూత్ ను)[202] తిరస్కరించి, అల్లాహ్ ను విశ్వసించిన వాడు, సుస్థిరమైన, ఎన్నటికీ విడిపోని ఆధారాన్ని పట్టుకున్నట్లే. మరియు అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

**257.** అల్లాహ్ విశ్వసించిన వారి సంరక్షకుడు, ఆయన వారిని చీకటి నుండి తీసి వెలుగులోకి తెస్తాడు. మరియు సత్యాన్ని తిరస్కరించినవారి రక్షకులు కల్పితదైవాలు (తాగూత్); అవి వారిని వెలుగు నుండి తీసి చీకటిలోనికి తీసుకొని పోతాయి. అలాంటి వారు నరకాగ్ని వాసులు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు.

**258.** ఏమీ? అల్లాహ్ (తన అనుగ్రహంతో) సామ్రాజ్యం ఇచ్చిన తరువాత, ఇబ్రాహీమ్ తో అతని ప్రభువు (అల్లాహ్) ను గురించి వాదించిన వ్యక్తి (నమ్రూద్) విషయం నీకు తెలియదా? ఇబ్రాహీమ్: "జీవన్మరణాలు ఎవరి ఆధీనంలో ఉన్నాయో! ఆయనే నా ప్రభువు." అని అన్నప్పుడు, అతడు: "చావుబ్రతుకులు రెండూ నా ఆధీనంలోనే ఉన్నాయి." అని అన్నాడు. అప్పుడు ఇబ్రాహీమ్: "సరే! అల్లాహ్ సూర్యుణ్ణి తూర్పు నుండి ఉదయింపజేస్తాడు; అయితే నీవు (సూర్యుణ్ణి) పడమర నుండి

---

[202] తాగూత్ కు ఎన్నో అర్థాలున్నాయి. ముఖ్యంగా అల్లాహుతా'ఆలాకు బదులుగా ఆరాధించే ప్రతి వస్తువు, అంటే షై'తాన్, విగ్రహం, రాయి సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, దైవదూతలు, మానవులు, జిన్నాతులు, గోరీలు, సాధు సన్యాసులు, సత్పురుషులు, మొదలైనవి.

ఉదయింపజెయ్యి." అని అన్నాడు. దానితో ఆ సత్యతిరస్కారి చికాకు పడ్డాడు. మరియు అల్లాహ్ దుర్మార్గం అవలంబించిన ప్రజలకు సన్మార్గం చూపడు.

**259.** లేక! ఒక వ్యక్తి[203] ఇండ్ల కప్పులన్నీ కూలిపోయి, పాడుపడిన (తలక్రిందులై బోర్లా పడిన) నగరం మీదుగా పోతూ: "వాస్తవానికి! నశించిపోయిన ఈ నగరానికి అల్లాహ్ తిరిగి ఏ విధంగా జీవం పోయగలడు?" అని అన్నాడు. అప్పుడు అల్లాహ్ అతనిని మరణింపజేసి నూరు సంవత్సరాల తరువాత తిరిగి బ్రతికింపజేసి: "ఈ స్థితిలో నీవు ఎంత కాలముంటివి?" అని అడిగాడు. అతడు: "ఒక దినమో, లేక ఒక దినములో కొంత భాగమో!" అని అన్నాడు. దానికి ఆయన: "కాదు, నీవు ఇక్కడ ఈ (మరణించిన) స్థితిలో, నూరు సంవత్సరాలు ఉంటివి. ఇక నీ అన్నపానీయాల వైపు చూడు, వాటిలో ఏ మార్పూ లేదు. ఇంకా నీవు నా గాడిదను కూడా చూడు! మేము ప్రజల కొరకు నిన్ను దృష్టాంతంగా చేయదలిచాము. ఇక ఆ (గాడిద) ఎముకలను చూడు, ఏ విధంగా వాటిని ఉద్ధరించి తిరిగి వాటిపై మాంసం కప్పుతామో!" అని అన్నాడు. ఇవి అతనికి స్పష్టంగా తెలిసిన తరువాత అతడు: "నిశ్చయంగా, అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడని నాకు (ఇప్పుడు)

---

[203] ఈ వ్యక్తి 'ఉజైర్ ('అ.స.) అని కొందరు స'హాబీల మరియు తాబయీన్ ల అభిప్రాయం. నిజం అల్లాహ్ (సు.తా.) కే తెలుసు.

తెలిసింది!" అని అన్నాడు.

**260.** మరియు (జ్ఞాపకం చేసుకోండి) ఇబ్రాహీమ్: "ఓ నా ప్రభూ! నీవు మృతులను ఎలా సజీవులుగా చేస్తావో నాకు చూపు!" అని అన్నప్పుడు, (అల్లాహ్) అన్నాడు: "ఏమీ? నీకు విశ్వాసం లేదా?" దానికి (ఇబ్రాహీమ్): "ఉంది, కానీ నా మనస్సు తృప్తి కొరకు అడుగు తున్నాను!" అని అన్నాడు. అపుడు (అల్లాహ్): "నాలుగు పక్షులను తీసుకో, వాటిని బాగా మచ్చిక చేసుకో! తరువాత (వాటిని కోసి) ఒక్కొక్కదాని ఒక్కొక్క భాగాన్ని, ఒక్కొక్క కొండపై పెట్టిరా, మళ్ళీ వాటిని రమ్మని పిలువు, అవి నీ వద్దకు ఎగురుకుంటూ వస్తాయి. కాబట్టి నిశ్చయంగా, అల్లాహ్ సర్వశక్తిమంతుడు, మహావివేకవంతుడు అని తెలుసుకో!"అని అన్నాడు

**261.** అల్లాహ్ మార్గంలో తమ ధనాన్ని ఖర్చు చేసేవారి ఉపమానం: ఆ విత్తనం వలే ఉంటుంది, దేని నుండి అయితే ఏడు వెన్నులు పుట్టి ప్రతి వెన్నులో నూరేసి గింజలు ఉంటాయో! మరియు అల్లాహ్ తాను కోరిన వారికి హెచ్చుగా నొసంగుతాడు. మరియు అల్లాహ్ సర్వవ్యాప్తి, సర్వజ్ఞుడు.

**262.** ఎవరైతే, అల్లాహ్ మార్గంలో తమ ధనాన్ని వ్యయం చేసి, ఆ తరువాత తాము చేసిన ఉపకారాన్ని చెప్పుకుంటూ మరియు వారిని బాధిస్తూ ఉండరో, అలాంటి వారి ప్రతిఫలం,

వారి ప్రభువు వద్ద ఉంది[204]. మరియు వారికి ఎలాంటి భయమూ ఉండదు మరియు వారు దుఃఖపడరు కూడా!

**263.** మనస్సును గాయపరిచే దానం కంటే, మృదుభాషణ మరియు క్షమాగుణం ఎంతో మేలైనవి.[205] మరియు అల్లాహ్ స్వయం సమృద్ధుడు,[206] సహనశీలుడు.

**264.** ఓ విశ్వాసులారా! (కేవలం) పరులకు చూపటానికి, తన ధనం ఖర్చు చేస్తూ అల్లాహ్ ను, అంతిమదినాన్ని విశ్వసించని వాని మాదిరిగా! మీరూ చేసిన మేలును చెప్పుకొని (ఉపకారం పొందిన వారిని) కష్టపెట్టి, మీ దానధర్మాలను వ్యర్థ పరచుకోకండి. ఇలాంటి వాని పోలిక మట్టి కప్పుకున్న ఒక నున్నని బండపై భారీ వర్షం కురిసి (మట్టి కొట్టుకు పోగా) అది ఉత్తగా మిగిలి

---

[204] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం:"పునరుత్థాన దినమున అల్లాహ్ (సు.తా.) మూడు రకాల వ్యక్తుల తో మాట్లాడడు. వారిలో ఒకడు, తాను చేసిన మేలును మాటిమాటికి చెప్పుకునేవాడు" ('స. ముస్లిం)

[205] మహాప్రవక్త ('స'అస) ప్రవచనం: "అల్ కలిమతు తయ్యిబ్ సదఖా!" మంచి మాట పలుకటం కూడా దానమే. ('స. ముస్లిం, కితాబ్ అ'జ్ 'జకాత్).

[206] గనియ్యున్ (అల్-'గనియ్యు): Self-Sufficient, Free from Want. స్వయంసమృద్ధుడు, నిరపేక్షాపరుడు, సర్వసంపన్నుడు. 6:133. అల్ - ముగ్ ని: (సేకరించబడిన పదం) భాగ్యదాత, ఇవి అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లు.

పోయినట్లుగా ఉంటుంది[207]. ఇలాంటి వారు తాము సంపాదించిన దాని నుండి ఏమీ చేయలేరు. మరియు అల్లాహ్ సత్యతిరస్కారులకు సన్మార్గం చూపడు.

**265.** మరియు అల్లాహ్ ప్రీతి పొందే ఉద్దేశంతో మరియు ఆత్మ స్థిరత్వంతో ధనాన్ని ఖర్చు చేసేవారి పోలిక: మెట్టభూమిపై నున్న ఒక తోట వలె ఉంటుంది. దానిపై భారీ వర్షం కురిసినపుడు అది రెండింతల ఫలము నిస్తుంది. భారీ వర్షం కాక చినుకులు (కురిసినా దానికి చాలు). మరియు అల్లాహ్, మీరు చేసేదంతా చూస్తున్నాడు.

**266.** ఏమీ? మీలో ఎవరికైనా ఖర్జురపు మరియు ద్రాక్ష వనాలుండి, వాటి క్రింది నుండి సెలయేళ్ళు ప్రవహిస్తూ, సర్వవిధాల ఫలాలు లభిస్తూ వుండి, అతనికి ముసలితనం వచ్చి, బలహీనులైన పిల్లలున్న సంకట సమయంలో, ఆ తోట మంటలు గల సుడిగాలి వీచి కాలిపోటం, ఎవరికైనా సమ్మతమేనా? మీరు ఆలోచించటానికి, ఈ విధంగా అల్లాహ్ తన సూచనలను (ఆయత్

[207] దీని అర్థం: ఒకడు బండ మీద ఉన్న మట్టిలో విత్తనం నాటిన తరువాత పెద్ద వర్షం కురిసి ఆ మట్టి అంతా కొట్టుకొని పోతే, ఆ విత్తనం ఏ విధంగా ఫలించగలదు? అదే విధంగా దానధర్మాలు చేసేవారు తాము చేసిన మేలు పదే పదే చెప్పి, ఉపకారం పొందిన వ్యక్తిని బాధ పెడితే వారి కెట్టి ప్రతిఫలం దొరుకదు.

లను) మీకు విశదీకరిస్తున్నాడు[208].

**267.** ఓ విశ్వాసులారా! మీరు సంపాదించిన దాని నుండి మరియు మేము మీ కొరకు భూమి నుండి ఉత్పత్తి చేసిన వాటి నుండి, మేలైన వాటినే (అల్లాహ్ మార్గంలో) ఖర్చు పెట్టండి. ఏ వస్తువులనైతే మీరు కండ్లు మూసుకునే గానీ తీసుకోరో, అలాంటి చెడ్డ వస్తువులను (ఇతరులపై) ఖర్చు చేయటానికి ఉద్దేశించకండి. మరియు అల్లాహ్ స్వయం సమృద్ధుడు, ప్రశంసనీయుడని[209] తెలుసుకోండి.

**268.** షైతాన్ దారిద్ర్య ప్రమాదం చూపి (భయపెట్టి), మిమ్మల్ని నీచకార్యాలు చేయటానికి ప్రేరేపిస్తుంటాడు. కాని అల్లాహ్ తన వైపు నుండి మిమ్మల్ని క్షమిస్తానని, అనుగ్రహిస్తానని వాగ్దానం చేస్తున్నాడు. మరియు అల్లాహ్ సర్వవ్యాప్తి[210], సర్వజ్ఞుడు.

---

[208] ఇబ్నె - 'అబ్బాస్ మరియు 'ఉమర్ (ర'ది.'అన్హుమ్) ల కథనం: "ఇది ఆ వ్యక్తి ఉదాహరణ, ఎవడైతే తన జీవితమంతా మంచికార్యాలు చేసి చివరి రోజులలో షై'తాన్ వలలో చిక్కుకొని అల్లాహ్ (సు.తా.)కు అవిధేయుడై పోతాడో! అలాంటి వాడు చేసిన పుణ్యకార్యాలన్నీ వ్యర్థమై పోతాయి." ('స. 'బుఖారీ, కితాబ్ అల్ తఫ్సీర్).

[209] హమీదున్ (అల్-'హమీదు): చూడండి, 14:1 Praiseworthy, He who is Praised, in every case. ప్రశంసనీయుడు, ప్రశంసార్హుడు, సర్వస్తోత్రాలకు అర్హుడు. ఇది అల్లాహ్(సు.తా.) అత్యుత్తమపేర్లలో ఒకటి

[210] వాసి'ఉన్: సర్వవ్యాప్తి, సర్వోపగతుడు, సర్వం తెలిసినవాడు, అపారుడు, ఉదారుడు. విస్తారుడు. చూడండి, 2:115.

**269.** ఆయన తాను కోరిన వారికి వివేకాన్ని ప్రసాదిస్తాడు[211]. మరియు వివేకం పొందిన వాడు, వాస్తవంగా సర్వసంపదలను పొందిన వాడే! కాని బుద్ధిమంతులు తప్ప వేరేవారు దీనిని గ్రహించలేరు.

**270.** మరియు మీరు (ఇతరులపై) ఏమి ఖర్చుచేసినా, లేక ఏ మొక్కుబడి చేసుకున్నా, నిశ్చయంగా అల్లాహ్ కు అంతా తెలుస్తుంది[212]. మరియు దుర్మార్గులకు సహాయం చేసేవారు ఎవ్వరూ ఉండరు.

**271.** మీరు బహిరంగంగా దానాలు చేయటం మంచిదే! కాని, గుప్తంగా నిరుపేదలకు ఇస్తే! అది మీకు అంతకంటే మేలైనది. మరియు ఆయన మీ ఎన్నో

---

[211] హిక్మతున్: అంటే, వివేకం, తెలివి, జ్ఞానం, సూక్ష్మబుద్ధి, నేర్పు, ప్రపంచజ్ఞానం మొదలైనవి అని అర్థం. ఇక్కడ ఖుర్ఆన్ ను మరియు దైవప్రవక్త ('స'అస) సంప్రదాయాలను అర్థం చేసుకొని, వాటి ప్రకారం నడచుకోవటం అని అర్థం. ఇద్దరు వ్యక్తులతో ఈర్ష్య పడవచ్చు. 1) అల్లాహ్ (సు.తా.) ధనం ప్రసాదించగా, అతడు దానిని అల్లాహుతా'ఆలా మార్గంలో ఖర్చు చేసేవాడు. 2) అల్లాహ్ (సు.తా.) వివేకం ప్రసాదించగా, అతడు దానితో న్యాయమైన తీర్పు చేసేవాడు మరియు ఇతరులకు దానిని బోధించేవాడు, ('స. బు'ఖారీ, కితాబ్ అల్ 'ఇల్మ్ వల్ 'హిక్మహ్).

[212] ఏదైనా మంచి పనికి పూనుకొని అది పూర్తి అయితే నేను అల్లాహ్ (సు.తా.) మార్గంలో ఇంత ఖర్చు చేస్తాను, లేక సత్కార్యం చేస్తాను, అని మొక్కుబడి చేసుకుంటే! దానిని పూర్తి చేయాలి. అల్లాహ్ (సు.తా.) పేరట చేసే మొక్కుబడి కూడా, నమా'జ్ మరియు ఉపవాసం మాదిరిగా అల్లాహ్ (సు.తా.) ఆరాధనయే. కాబట్టి అల్లాహ్ (సు.తా.) తప్ప ఇతరుల పేరట మొక్కుబడి చేయటం షిర్క్ అంటే అల్లాహ్ (సు.తా.) క్షమించని మహాపాపం.

పాపాలను (దీనివల్ల) రద్దు చేస్తాడు. మరియు మీరు చేసేదంతా అల్లాహ్ కు బాగా తెలుసు.

**272.** (ఓ ప్రవక్తా!) వారిని సన్మార్గాన్ని అవలంబించేటట్లు చేయటం నీ బాధ్యత కాదు. కాని, అల్లాహ్ తాను కోరిన వారికి సన్మార్గం చూపుతాడు. మరియు మీరు మంచిమార్గంలో ఖర్చు చేసేది మా (మేలు) కొరకే. మీరు ఖర్చు చేసేది అల్లాహ్ ప్రీతిని పొందటానికే అయి ఉండాలి. మీరు మంచి మార్గంలో ఏమి ఖర్చు చేసినా, దాని ఫలితం మీకు పూర్తిగా లభిస్తుంది మరియు మీకు ఎలాంటి అన్యాయం జరుగదు.

**273.** అల్లాహ్ మార్గంలో నిమగ్నులైన కారణంగా (తమ జీవనోపాధి కొరకు) భూమిలో తిరిగే అవకాశం లేకలేమికిగురిఅయ్యేపేదవారు (ధనసహాయానికి అర్హులు). ఎరుగని మనిషి వారి అడగక పోవటాన్ని చూసి, వారు ధనవంతులని భావించవచ్చు! (కాని) వారి ముఖ చిహ్నాలు చూసి నీవు వారిని గుర్తించగలవు. వారు ప్రజలను పట్టుబట్టి అడిగేవారు కారు. మరియు మీరు మంచి కొరకు ఏమి ఖర్చుచేసినా అది అల్లాహ్ కు తప్పక తెలుస్తుంది.

**274.** ఎవరైతే తమ సంపదను (అల్లాహ్ మార్గంలో) రేయింబవళ్ళు బహిరంగంగానూ మరియు రహస్యంగానూ ఖర్చు చేస్తారో, వారు తమ

ప్రతిఫలాన్ని తమ ప్రభువు వద్ద పొందుతారు. మరియు వారికి ఎలాంటి భయమూ ఉండదు మరియు వారు దుఃఖపడరు కూడా![213]

**275.** ఎవరైతే వడ్డీ తింటారో![214] వారి స్థితి (పునరుత్థాన దినమున) షైతాన్ తాకడం వల్ల భ్రమపరచబడిన వ్యక్తి స్థితి వలె ఉంటుంది. ఇది ఎందుకంటే! వారు: "వ్యాపారం కూడా వడ్డీ లాంటిదే!" అని చెప్పడం. కాని అల్లాహ్ వ్యాపారాన్ని ధర్మ సమ్మతం (హలాల్) చేశాడు మరియు వడ్డీని నిషిద్ధం (హరామ్) చేశాడు. కనుక తన ప్రభువు చేసిన ఈ హితబోధ అందిన వ్యక్తి ముమ్మందు వడ్డీ తినటం త్యజిస్తే, అతడు పూర్వం తిన్నదేదో తిన్నాడు. అతడి వ్యవహారమంతా అల్లాహ్ కే చెందుతుంది.(ఈఆదేశంతరువాతఈదుర్వ్యవహారానికి) పాల్పడేవారు నరకవాసులవుతారు. అక్కడ వారు శాశ్వతంగా ఉంటారు.

**276.** అల్లాహ్ వడ్డీ (ఆదాయాన్ని) నశింపజేస్తాడు మరియు దానధర్మాలు (చేసేవారికి) వృద్ధినొసంగుతాడు. మరియు సత్యతిరస్కారుడు (కృతఘ్నుడు), పాపిష్టుడు అయిన వ్యక్తిని అల్లాహ్ ప్రేమించడు.

---

[213] చూడండి, 'స. బు'ఖారీ, పుస్తకం - 2, 'హదీస్' నం. 504.

[214] రిబా': వడ్డీ, అంటే ఎక్కువ తీసుకోవటం. ఒకనికి అప్పు ఇచ్చి, స్వంత ఉపయోగానికైనా సరే లేక వ్యాపారానికైనా సరే - ఇచ్చిన దాని కంటే ఎక్కువ తీసుకోవటమే - వడ్డీ. అది 'హరామ్. అది డబ్బు అయినా సరే, లేక ఏ వస్తువు అయినా సరే. చూడండి, 30:39.

**277.** నిశ్చయంగా, విశ్వసించి సత్కార్యాలు చేసే వారికీ మరియు నమాజ్ స్థాపించే వారికీ, జకాత్ ఇచ్చేవారికీ తమ ప్రభువు వద్ద తగిన ప్రతిఫలం లభిస్తుంది మరియు వారికి ఎలాంటి భయమూ ఉండదు మరియు వారు దుఃఖపడరు కూడా!

**278.** ఓ విశ్వాసులారా! అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి మరియు మీరు (నిజంగా) విశ్వాసులే అయితే, మీకు రావలసిన వడ్డీని విడిచి పెట్టండి[215].

**279.** కాని, ఒకవేళ మీరు అలా చేయకపోతే! అల్లాహ్ మరియు ఆయన సందేశహరుని తరఫు నుండి యుద్ధ ప్రకటన ఉందని తెలుసుకోండి[216]. కాని మీరు పశ్చాత్తాపపడితే (వడ్డీ వదులుకుంటే), మీ అసలు సొమ్ము మీకు లభిస్తుంది. మీరు (ఇతరులకు) అన్యాయం చేయకండి మరియు మీకూ అన్యాయం జరుగదు.

**280.** మరియు (మీ బాకీదారుడు ఆర్థిక) ఇబ్బందులలో ఉంటే, అతని పరిస్థితి, కుదిరే వరకూ గడువునివ్వండి. ఒకవేళ మీరు దానమని వదిలిపెడితే అది మీకు ఎంతో మేలైనది, ఇది మీకు తెలిస్తే (ఎంత బాగుండేది)![217]

---

[215] స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం-3, 'హదీస్' నం.299 మరియు 'స. బు'ఖారీ పుస్తకం - 7, 'హ. నం. 845.

[216] స. బు'ఖారీ, పుస్తకం-3, 'హదీస్' నం. 506 మరియు 'స. బు'ఖారీ, పుస్తకం - 9, 'హదీస్' నం. 171.

[217] స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 4, 'హదీస్' నం. 687.

**281.** మరియు మీరు తిరిగి అల్లాహ్ సమక్షానికి చేరుకోబోయే ఆ దినానికి భయపడండి. అప్పుడు ప్రతి వ్యక్తికి తన కర్మల ప్రతిఫలం ఇవ్వబడుతుంది. వారి కెలాంటి అన్యాయం జరుగదు[218].

**282.** ఓ విశ్వాసులారా! మీరు పరస్పరం ఒక నిర్ణీతకాలం కొరకు అప్పు తీసుకున్నప్పుడు, దానిని వ్రాసిపెట్టుకోండి[219]. మరియు మీలో పత్రం వ్రాసేవాడు, న్యాయంగా వ్రాయాలి. మరియు వ్రాసేవాడు నిరాకరించకుండా, అల్లాహ్ నేర్పినట్లు వ్రాయాలి. ఋణగ్రహీత అల్లాహ్ కు భయపడి నిర్ణీత షరతులను తగ్గించకుండా, చెప్పి వ్రాయించాలి. ఋణగ్రహీత అల్పజ్ఞాని లేక సామర్థ్యం లేనివాడు లేకబలహీనుడుమరియుతానుచెప్పివ్రాయించలేని వాడైతే, అతని సంరక్షకుడు న్యాయంగా వ్రాయించాలి. మరియు మీలో ఇద్దరు మగవారిని సాక్ష్యమివ్వటానికి

---

[218] ఇబ్నె 'అబ్బాస్ (ర'ది.'అ.) కథనం: 'ఇది దైవప్రవక్త ము'హమ్మద్ ('స'అస) పై అవతరింపజేయ బడిన చివరి ఆయత్ ('స. బు'ఖారీ మరియు ఫ'త్హ అల్ - బారీ).

[219] ఈ ఆయత్ ఖుర్ఆన్ లోని అన్ని ఆయత్ ల కంటే పెద్దది. దీనిని ఆయతె దైన్ అంటారు. అప్పు ఇచ్చి పుచ్చుకోవడం ఎంతో ముఖ్య విషయం. 'హదీస్'లలో : వడ్డీ దొరకదని అప్పు ఇవ్వడం మానుకో కూడదని మరియు అప్పు ఇచ్చే వానికి ఎంతో పుణ్యముందని పేర్కొనబడింది. కాని, ఇచ్చేవానికి అతని సొమ్ము తిరిగి రాగలదనే నమ్మకం కూడా ఉండాలి. దానికి మూడు విషయాలు సూచించబడ్డాయి. 1) దాని గడువు నిర్ణయించుకోవాలి. 2) దానిని వ్రాయించుకోవాలి. 3) ఇద్దరు ముస్లిం పురుషులు లేక ఒక ముస్లిం పురుషుడు మరియు ఇద్దరు ముస్లిం స్త్రీలను సాక్షులుగా పెట్టుకోవాలి.

సాక్షులుగా ఉంచుకోండి. ఇద్దరు పురుషులు దొరకని పక్షమున ఒక పురుషుడు మరియు మీకు సమ్మత మైన ఇద్దరు స్త్రీలను సాక్షులుగా తీసుకోండి. (ఎందుకంటే) వారిలో ఒకామె మరచిపోతే, రెండవ స్త్రీ ఆమెకు జ్ఞాపకం చేయించవచ్చు. మరియు పిలువబడినప్పుడు సాక్షులు, సాక్ష్యమివ్వటానికి నిరాకరించకూడదు. మరియు వ్యవహారం చిన్నదైనా పెద్దదైనా దానిని గడువు నిర్ణయంతో పాటు వ్రాసిపెట్టటానికి అశ్రద్ధ చూపకూడదు. అల్లాహ్ దృష్టిలో ఇది న్యాయ సమ్మతమైనది మరియు స్థిరమైన సాక్ష్యంగా తోడ్పడుతుంది మరియు ఏ విధమైన సందేహాలకు అవకాశం లేకుండా చేస్తుంది. కాని, మీరు అప్పటికప్పుడు ఇచ్చి పుచ్చుకునే (సాధారణ) లావాదేవీలు చేస్తున్నపుడు వ్రాయకున్నా దోషం లేదు. కాని, వ్యాపార వ్యవహారాలు నిర్ణయించేటప్పుడు సాక్షులను పెట్టుకోండి. కాని వ్రాసేవానికి గానీ, సాక్షులకు గానీ ఏ విధమైన హాని జరుగకూడదు. ఒకవేళ అలా జరిగితే! నిశ్చయంగా, అది మీకు పాపం. మరియు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి. మరియు ఇది అల్లాహ్ మీకు నేర్పుతున్నాడు. మరియు అల్లాహ్ కు ప్రతిదాని జ్ఞానం ఉంది.

283. మరియు మీరు ప్రయాణంలో ఉన్నప్పుడు, (పత్రం) వ్రాసేవాడు దొరకని పక్షంలో సొమ్మును

కుదువ పెట్టుకోవచ్చు[220]. మీకు ఒకరిపై ఒకరికి నమ్మకం ఉంటే నమ్మకంగా ఇచ్చిన దానిని (అప్పును) తిరిగి అతడు వాపసు చేయాలి. మరియు తన ప్రభువైన అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండాలి. మరియు మీరు సాక్ష్యాన్ని (ఎన్నడూ) దాచకండి. మరియు (సాక్ష్యాన్ని) దాచేవాని హృదయం పాపభరితమైనది. మరియు మీరు చేసేదంతా అల్లాహ్ కు బాగా తెలుసు.

**284.** ఆకాశాలలో మరియు భూమిలో ఉన్నదంతా అల్లాహ్ దే! మీరు మీ మనస్సులలో ఉన్నది, వెలుబుచ్చినా లేక దాచినా అల్లాహ్ మీ నుంచి

---

[220] తాకట్టు యొక్క ఉద్దేశం, కేవలం అప్పు ఇచ్చేవాడి సొమ్ము తిరిగి అతనికి దొరుకుతుందనే యథార్థానికే! అతనికి తాకట్టు పెట్టుకొన్న వస్తువును ఉపయోగించుకునే హక్కు లేదు. అది వడ్డీ అవుతుంది. కాని తాకట్టు పెట్టుకున్న వస్తువుపై ఆదాయం వస్తే దాని నుండి దాని ఖర్చు తీసి మిగిలింది దాని యజమానికి ఇవ్వాలి. చూడండి, 'స. బు'ఖారీ పుస్తకం - 3, 'హ. నం. 685.

దాని లెక్క తీసుకుంటాడు[221]. మరియు ఆయన తాను కోరిన వానిని క్షమిస్తాడు మరియు తాను కోరిన వానిని శిక్షిస్తాడు. మరియు అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు.

**285.** ఈ ప్రవక్త తన ప్రభువు తరఫు నుండి, తనపై అవతరింపజేయబడినదానినివిశ్వసించాడు[222] మరియు (అదే విధంగా) విశ్వాసులు కూడా (విశ్వసించారు). వారంతా అల్లాహ్ ను, ఆయన దూతలను, ఆయన గ్రంథాలను

---

[221] ఆ ఆయత్ అవతరింపజేయబడినపుడు స'హాబీలు దైవప్రవక్త ('స'అస) దగ్గర హాజరై ఇలా విన్నవించుకున్నారు: "ఓ ప్రవక్తా('స'అస)! నమా'జ్, ఉపవాసం, 'జకాత్ మరియు జిహాద్ మా శక్తికి మించినవి కావు. కాని మనస్సులో పుట్టే ఆలోచనలపై మాకు అదుపు లేదు కదా! అయినా అల్లాహుతా'ఆలా వాటి లెక్క తీసుకుంటానని అంటున్నాడు కదా!" అప్పుడు దైవప్రవక్త ('స'అస) ఇలా సెలవిచ్చారు: "మీరిప్పుడు కేవలం విన్నాము మరియు విధేయుల మయ్యాము" అని మాత్రమే అనండి. అప్పుడు అల్లాహ్ (సు.తా.) ఈ ఆయత్ అవతరిపజేశాడు: "అల్లాహ్ ఏ ప్రాణిపైననూ దాని శక్తికి మించిన భారం వేయడు." (ఇబ్నె - కసీ'ర్, ఫ'త్హుల్ ఖదీర్). దీనిని గురించి ఇంకా ఈ 'హదీస్' కూడా ఉంది: "అల్లాహుతా'ఆలా నా ఉమ్మత్ వారి మనస్సులలో వచ్చిన విషయాలను క్షమిస్తాడు. కాని నాలుకతో పలికిన దానిని మరియు అమలు పరచిన దానిని లెక్కలోకి తీసుకుంటాడు." (బు'ఖారీ, ముస్లిం).

[222] ఈ చివరి రెండు ఆయత్ లు ఎంతో ఘనత గలవి. దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: ఎవరైనా రాత్రి ఈ రెండు ఆయత్ లను చదివితే చాలు. ('స. బు'ఖారీ, పుస్తకం - 5, 'హదీస్' నం. 345). అంటే అల్లాహ్ (సు.తా.) అతనిని రక్షిస్తాడు. మరొక 'హదీస్' లో మేరాజ్ రాత్రిలో దైవప్రవక్త ('స'అస) కు దొరికిన మూడు విషయాలలో ఒకటి, ఈ రెండు ఆయతులు. ('స. ముస్లిం).

మరియు ఆయన ప్రవక్తలను విశ్వసించారు. వారంటారు:"మేము ఆయన ప్రవక్తల మధ్య ఎలాంటి భేదభావాలను చూపము. మరియు మేము (ఆదేశం) విన్నాము మరియు దానిని శిరసావహించాము, నీ క్షమాభిక్షను అర్థిస్తున్నాము, ఓ మా ప్రభూ! మా గమ్యస్థానం నీ వైపుకే ఉంది."

286. "అల్లాహ్, ఏ ప్రాణి పైననూ దాని శక్తికి మించిన భారం వేయడు. తాను సంపాదించిన దానికి (పుణ్య) ఫలితం దానికి లభిస్తుంది మరియు తాను చేసిన దుష్కర్మల శిక్ష అది అనుభవిస్తుంది. ఓ మా ప్రభూ! మేము మరచినా లేక తప్పు చేసినా మమ్మల్ని పట్టకు! ఓ మా ప్రభూ! పూర్వం వారిపై మోపినట్టి భారం మాపై మోపకు. ఓ మా ప్రభూ! మేము సహించలేని భారం మాపై వేయకు. మమ్మల్ని మన్నించు, మమ్మల్ని క్షమించు మరియు మమ్మల్ని కరుణించు. నీవే మా సంరక్షకుడవు, కావున సత్యతిరస్కారులకు విరుద్ధంగా మాకు విజయము (సహాయము) నొసంగు."

# 3. ఆలె ఇమ్రాన్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. అలిఫ్-లామ్-మీమ్[1].
2. అల్లాహ్! ఆయన తప్ప మరొక ఆరాధ్య దేవుడు లేడు. ఆయన సజీవుడు (నిత్యుడు), విశ్వవ్యవస్థకు ఆధారభూతుడు[2].
3. ఆయన, సత్యమైన ఈ దివ్యగ్రంథాన్ని (ఓ ముహమ్మద్!) నీపై అవతరింప జేశాడు. ఇది పూర్వం అవతరింపజేయబడిన గ్రంథాలలో నుండి (మిగిలి వున్న సత్యాన్ని) ధృవ పరుస్తోంది[3] మరియు ఆయనే తౌరాత్ ను

---

[*] [ఆలె ఇమ్రాన్ – ఇమ్రాన్ కుటుంబము]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

[2] చూడండి, 2:255.

[3] చూడండి, 5:46, 48, 61:6.

మరియు ఇంజీలును[4] అవతరింపజేశాడు.

4. దీనికి ముందు ప్రజలకు సన్మార్గం చూపటానికి, మరియు (సత్యాసత్యాలను విశదీకరించే) ఈ గీటురాయిని కూడా అవతరింపజేశాడు[5]. నిశ్చయంగా, ఎవరైతే అల్లాహ్ ఆజ్ఞను తిరస్కరిస్తారో వారికి కఠినశిక్ష ఉంటుంది. మరియు అల్లాహ్ సర్వ శక్తిమంతుడు, ప్రతీకారం తీర్చుకోగలవాడు.

5. నిశ్చయంగా భూమిలోగానీ మరియు ఆకాశాలలోగానీ, అల్లాహ్'కు గోప్యంగా ఉన్నది ఏదీ లేదు.

6. ఆయన తన ఇష్టానుసారంగా మిమ్మల్ని (మాతృ)

---

[4] ఇక్కడ (ఖుర్ఆన్'లో) పేర్కొనబడిన ఇంజీల్ మరియు తౌరాత్ గ్రంథాలు అంటే 'ఈసా ('అ.స.) మరియు మూసా('అ.స.)లపై అవతరింపజేయబడిన దివ్యగ్రంథాలు అని అర్థం. ఆ అసలు దివ్య గ్రంథాలు ఇప్పుడు ప్రపంచంలో లేవు. ఇప్పుడు ప్రపంచంలో ఉన్న అత్యంత ప్రాచీన బైబిల్ గ్రంథాలు, గ్రీక్ భాషలో ఉన్న బ్రిటీష్ మ్యూజియంలోని Codex Sinaiticus, Codex Alexandrinus మరియు రోమ్ లోని వాటికాన్ లైబ్రరీలో ఉన్న Codex Vaticanus ఇవి 'ఈసా ('అ.స) పైకి సజీవులుగా ఎత్తుకోబడిన దాదాపు నాలుగు వందల సంవత్సరాల తరువాత, గ్రీక్ భాషలో వ్రాయబడ్డాయి. మూసా మరియు 'ఈసా ('అలైహిమ్.స.) లపై అవతరింపజేయబడిన తౌరాత్ మరియు ఇంజీల్ గ్రంథాల బాష గ్రీకు కాదు. వారి మతాచారులు / విద్వాంసులు, వాటిలో ఇంతవరకు ఎన్నో సార్లు, ఎన్నో మార్పులు చేస్తూ వచ్చారు. ఈ రోజు వాడుకలో ఉన్న బైబిల్ లలో, ఆ ప్రవక్తల కొన్ని ప్రవచనాలు మరియు అసలు దివ్య ఆవిష్కృతులైన కొన్ని అంశాలు-వారి మతాచారులు/ విద్వాంసులు వ్రాసిన రూపంలో ఉన్నాయి. కాబట్టి దివ్యఖుర్ఆన్ సూచించేది ఆ ప్రవక్తలపై అవతరింపజేయబడిన ప్రవచనాలను మాత్రమే కానీ ఈ రోజు వాడుకలో ఉన్న బైబిల్ (Revised) Authorized Kind James Version ను కాదు. చూడండి, 4:136, 5:47.

[5] చూడండి, 2:53.

గర్భాలలో తీర్చి దిద్దుతాడు[6]. ఆయన తప్ప మరొక ఆరాధ్య దేవుడు లేడు. ఆయన సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు.

7. ఆయన (అల్లాహ్) యే నీపై (ఓ ముహమ్మద్!) ఈ గ్రంథాన్ని (ఖుర్ఆన్'ను) అవతరింప జేశాడు, ఇందులో కొన్ని స్పష్టమైన అర్థమిచ్చే ఆయతులు (ముహ్'కమాత్) ఉన్నాయి. అవి ఈ గ్రంథానికి మూలాలు. మరికొన్ని అస్పష్టమైనవి (ముతషాబిహాత్) ఉన్నాయి[7]. కావున తమ హృదయాలలో వక్రత ఉన్నవారు, సంక్షోభాన్ని రేకెత్తించటానికి మరియు గూఢార్థాలను అపేక్షించి ఎల్లప్పుడూ అస్పష్టమైన

---

[6] ము'సవ్విరు (అల్ - ము'సవ్విరు): The Fashioner. రూపమిచ్చేవాడు. తాను కోరిన విధంగా తన సృష్టి రూపాన్ని తీర్చి దిద్దేవాడు. చూడండి, 59:24. ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి.

[7] ముహ్ కమాతున్: అంటే, అల్లాహుతా'ఆలా ఆజ్ఞలను, ఆయన నిషేధించిన వాటిని, 'హలాల్ చేసిన వాటిని, కథలను మొదలైన స్పష్టంగా తెలియజేసే ఆయతులు. ఈ ఆయతుల భావం స్పష్టంగా ఉంటుంది. ఇవి దివ్యగ్రంథ పునాదులు. వీటిని ఉమ్ముల్-కితాబ్ అని అంటారు. ఏ ఆయతుల అర్థంలో సంశయానికి తావు ఉంటుందో వాటిని ముతషాబిహాతున్ అంటారు. ఏ విషయాలైతే మానవ ఇంద్రియాలకు అతీతంగా ఉన్నాయో వాటిని వివరించటానికి, వాటికి దగ్గరగా పోలికవున్న, గోచర విషయాలకు మానవభాషలో లభించే పదాలు ఉపయోగించబడిన ఆయతులు. ఉదా: స్వర్గం, నరకం మొదలైనవి. కావున మానవుడు ముతషాబిహాత్ లను చదివేటప్పుడు వాటిని ము'హ కమాత్ ల వెలుగులో అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాలి. ఎందుకంటే ఖుర్ఆన్ వాటిని ఉమ్ముల్ కితాబ్ - గ్రంథమూలాలు, అన్నది.

వాటి వెంటబడతారు. వాటి అసలు అర్థం అల్లాహ్
కు తప్ప మరెవ్వరికీ తెలియదు. కానీ, పరిపక్వ
జ్ఞానం గలవారు: "మేము దీనిని విశ్వసించాము,
ప్రతి ఒక్కటీ మా ప్రభువు వద్ద నుండి వచ్చినదే!"
అని అంటారు. జ్ఞానవంతులు తప్ప ఇతరులు
వీటిని గ్రహించలేరు.

8. (వారు ఇలా అంటారు): "ఓ మా ప్రభూ! మాకు సన్మార్గం చూపిన తరువాత మా హృదయాలను వక్రమార్గం వైపునకు పోనివ్వకు. మరియు మాపై నీ కారుణ్యాన్ని ప్రసాదించు. నిశ్చయంగా, నీవే సర్వప్రదుడవు[8].

9. "ఓ మా ప్రభూ! నిశ్చయంగా నీవే మానవులందరినీ నిస్సందేహంగా రాబోయే ఆ దినాన సమావేశపరచేవాడవు[9]. నిశ్చయంగా అల్లాహ్ తన వాగ్దానాన్ని భంగం చేయడు."

10. నిశ్చయంగా, సత్యతిరస్కారులైన వారికి వారి ధనం గానీ, వారి సంతానం గానీ, అల్లాహ్ కు ప్రతికూలంగా ఏ మాత్రం పనికిరావు. మరియు ఇలాంటి వారే నరకాగ్నికి ఇంధనమయ్యేవారు.

11. వారి ముగింపు ఫిర్ఔను జాతి మరియు వారికి

---

[8] అల్ - వహ్హాబ్: Bestower. సర్వవర ప్రదాత, సర్వప్రదుడు. పరమదాత, ఉదారంగా దానం చేసేవాడు. ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి. ఇంకా చూడండి, 38:35, 38:9.

[9] జామి'ఉ (అల్-జామి'ఉ) : The collector of the created beings for the Day of Reckoning. సమావేశపరచేవాడు, ప్రోగుచేసేవాడు, కూడబెట్టేవాడు. పై రెండు అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లు. ఇంకా చూడండి, 4:140, 77:38.

ముందున్న వారి వలే ఉంటుంది. వారు మా సూచనలను (ఆజ్ఞలను) తిరస్కరించారు, కాబట్టి అల్లాహ్ వారి పాపాల ఫలితంగా, వారిని పట్టుకున్నాడు. మరియు అల్లాహ్ శిక్ష విధించటంలో చాలా కఠినుడు.

12. (ఓ ప్రవక్తా!) సత్యాన్ని తిరస్కరించిన వారితో అను: "మీరు త్వరలోనే లొంగదీయబడి నరకంలో జమ చేయబడతారు. మరియు అది అతి చెడ్డ విరామ స్థలము!"

13. వాస్తవానికి (బద్ర్ యుద్ధ రంగంలో) మార్కొనిన ఆ రెండు వర్గాలలో మీకు ఒక సూచన ఉంది. ఒక వర్గం అల్లాహ్ మార్గంలో పోరాడేది మరియు రెండవది సత్యతిరస్కారులది. వారు (విశ్వాసులు) వారిని (సత్యతిరస్కారులను) రెట్టింపు సంఖ్యలో ఉన్నట్లు తమ కళ్ళారా చూశారు మరియు అల్లాహ్ తాను కోరిన వారిని తన సహాయంతో (విజయంతో) బలపరుస్తాడు. నిశ్చయంగా, దూరదృష్టి గలవారికి ఇందులో ఒక గుణపాఠముంది[10].

14. స్త్రీలు, సంతానం మరియు కూర్చిపెట్టిన వెండి-

---

[10] చూడండి, 8:44. ఇది 2వ హిజ్రీ శకంలో రమ'దాన్ నెలలో జరిగిన బద్ర్ యుద్ధ విషయం. ఆ యుద్ధంలో ముస్లింలు దాదాపు 313 మంది ఉన్నారు. మరియు మక్కా ముష్రికులు వేయి మంది ఉన్నారు. ఇది ముస్లింల మరియు ముష్రిక్ ఖురైషుల మధ్య జరిగిన మొదటి యుద్ధం. ఖురైషులు ఎంతో యుద్ధ సామగ్రి తీసుకొని వచ్చారు. ముస్లింలు పోరాటకు సిద్ధపడి రాకపోయినప్పటికీ, వారికి అల్లాహ్ (సు.తా.) సహాయం లభించి, గెలుపొందారు.

బంగారు రాసులు, మేలు జాతి గుర్రాలు, పశువులు, పొలాలు మొదలైన మనోహరమైన వస్తువుల ప్రేమ ప్రజలకు ఆకర్షణీయంగా చేయబడింది[11]. ఇదంతా ఇహలోక జీవనభోగం. కానీ అసలైన గమ్యస్థానం అల్లాహ్ వద్దనే ఉంది.

15. ఇలా చెప్పు: "ఏమీ? వాటి కంటే ఉత్తమమైన వాటిని నేను మీకు తెలుపనా? దైవభీతి గలవారికి, వారి ప్రభువు వద్ద స్వర్గవనాలుంటాయి. వాటి క్రింద సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి, అక్కడ వారు శాశ్వతంగా ఉంటారు మరియు వారికి అక్కడ పవిత్ర సహవాసులు (అజ్వాజ్) ఉంటారు మరియు వారికి అల్లాహ్ ప్రసన్నత లభిస్తుంది." మరియు అల్లాహ్ తన దాసులను కనిపెట్టుకొని ఉంటాడు.

16. ఎవరైతే : "ఓ మా ప్రభూ! మేము నిశ్చయంగా విశ్వసించాము, కావున మా తప్పులను క్షమించు మరియు నరకాగ్ని నుండి మమ్మల్ని తప్పించు." అని పలుకుతారో!

17. (అలాంటి వారే!) సహనశీలురు, సత్యవంతులు మరియు వినయ విధేయతలు గల వారు, దానపరులు మరియు వేకువ జామున[12] తమ పాపాలకు క్షమాపణ వేడుకునేవారు.

---

[11] చూడండి, 18:7.
[12] చూడండి, 51:18.

**18.** నిశ్చయంగా, ఆయన తప్ప మరొక ఆరాధ్యనీయుడు లేడని, అల్లాహ్, దేవదూతలు మరియు జ్ఞానవంతులు సాక్ష్యమిచ్చారు; ఆయనే న్యాయపరిరక్షకుడు[13]. ఆయన తప్ప మరొక ఆరాధ్యనీయుడు లేడు! ఆయన సర్వ శక్తిమంతుడు, మహా వివేకవంతుడు.

**19.** నిశ్చయంగా, అల్లాహ్ కు సమ్మతమైన ధర్మం కేవలం అల్లాహ్ కు విధేయులవటం (ఇస్లాం) మాత్రమే[14]. కాని పూర్వ గ్రంథప్రజలు పరస్పర ఈర్ష్యతో, వారికి జ్ఞానం లభించిన తరువాతనే భేదాభిప్రాయాలకు లోనయ్యారు. మరియు ఎవరైతే అల్లాహ్ సూచనలను తిరస్కరిస్తారో! వారు నిశ్చయంగా, అల్లాహ్ లెక్కతీసుకోవటంలో అతిశీఘ్రుడు (అని తెలుసుకోవాలి).

**20.** (ఓ ప్రవక్తా!) వారు నీతో వివాదమాడితే ఇట్లను: "నేనూ మరియు నా అనుచరులు అల్లాహ్ ప్రీతి పొందటానికి ఆయనకు సంపూర్ణంగా విధేయులం (ముస్లిములం) అయ్యాము." మరియు గ్రంథప్రజలతో మరియు నిరక్షరాస్యులతో (చదువురాని అరబ్బులతో): "ఏమీ? మీరు కూడా విధేయులయ్యారా?" అని అడుగు. వారు విధేయులైతే సన్మార్గం పొందిన వారవుతారు. కాని

---

[13] ఖాయిమన్ బిల్ ఖి'స్త్: Maintains His creation in Justice. న్యాయపరిరక్షకుడు, అల్ - ముఖ్సి'త్: (సేకరించబడిన పదం) The Equitable, Justly. నిష్పక్షపాతుడు, న్యాయవంతుడు. ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి.

[14] చూడండి, 3:85 మరియు 7:158, 25:1.

ఒకవేళ వారు వెనుదిరిగితే, నీ బాధ్యత కేవలం సందేశాన్ని అందజేయటం మాత్రమే! మరియు అల్లాహ్ తన దాసులను కనిపెట్టుకొని ఉంటాడు[15].

**21.** నిశ్చయంగా, అల్లాహ్ ఆదేశాలను (ఆయాత్ లను) తిరస్కరించే వారికి మరియు ఆయన ప్రవక్తలను అన్యాయంగా చంపే వారికి మరియు న్యాయసమ్మతంగా వ్యవహరించమని బోధించే ప్రజలను చంపే వారికి, బాధాకరమైన శిక్ష ఉందని తెలియజెయ్యి.

**22.** అలాంటి వారి కర్మలు ఇహలోకమందును మరియు పరలోకమందును వృథా అవుతాయి. మరియు వారికి సహాయకులు ఎవ్వరూ ఉండరు.

**23.** ఏమీ? గ్రంథంలోని కొంతభాగం పొందిన వారి పరిస్థితి ఎలా ఉందో నీవు గమనించలేదా? వారి మధ్య తీర్పు చేయటానికి, అల్లాహ్ గ్రంథం వైపునకు రండి అని, వారిని ఆహ్వానించి నపుడు, వారిలోని ఒక వర్గం వారు విముఖులై, వెనుదిరిగి పోతారు.

**24.** వారు అలా చేయటానికి కారణం వారు: "నరకాగ్ని కొన్ని దినాలు మాత్రమే మమ్మల్ని తాకుతుంది." అనటం. మరియు వారు కల్పించుకున్న అపోహాయే వారిని తమ ధర్మ విషయంలో మోసపుచ్చింది[16].

**25.** నిస్సందేహంగా, రాబోయే ఆ (పునరుత్థాన) దినమున, మేము వారిని సమావేశ పరచినపుడు,

---

[15] చూడండి, 2:96, 3:85.
[16] చూడండి, 2:80.

వారి స్థితి ఎలా ఉంటుందో (ఆలోచించారా?) మరియు ప్రతి జీవికి తాను చేసిన కర్మల ఫలితం పూర్తిగా నొసంగబడుతుంది. మరియు వారికెలాంటి అన్యాయం జరుగదు.

**26.** ఇలా అను: "ఓ అల్లాహ్, విశ్వసామ్రాజ్యాధిపతి![17] నీవు ఇష్టపడిన వారికి రాజ్యాధికారాన్ని ప్రసాదిస్తావు మరియు నీవు కోరిన వారిని రాజ్యాధికారం నుండి తొలగిస్తావు మరియు నీవు ఇష్టపడినవారికి గౌరవాన్ని (శక్తిని) ప్రసాదిస్తావు మరియు నీవు కోరినవారిని పరాభవం పాలు చేస్తావు. నీ చేతిలోనే[18] మేలున్నది. నిశ్చయంగా, నీవు ప్రతిదీ చేయగల సమర్థుడవు.

**27.** "నీవు రాత్రిని పగటిలోకి ప్రవేశింపజేస్తావు మరియు పగటిని రాత్రిలోకి ప్రవేశింప జేస్తావు. మరియు నీవు సజీవులను నిర్జీవుల నుండి తీస్తావు మరియు నిర్జీవులను సజీవుల నుండి తీస్తావు. మరియు నీవు కోరిన వారికి లెక్కలేనంత జీవనోపాధిని ప్రసాదిస్తావు."

**28.** విశ్వాసులు - తమ తోటి విశ్వాసులను విడిచి - సత్యతిరస్కారులను స్నేహితులుగా చేసుకోరాదు. అలా చేసేవారికి అల్లాహ్ తో ఏ విధమైన సంబంధం

---

[17] మాలిక్ అల్ - ముల్క్: Sovereign of the Universe, విశ్వసామ్రాట్టు, విశ్వసామ్రాజ్యాధిపతి. ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి. చూడండి, 20:114 వ్యాఖ్యానం 2.

[18] చూడండి, 3:73.

లేదు. కాని, వారి దౌర్జన్యానికి భీతిపరులైతే తప్ప! అల్లాహ్ (ఆయనకే భీతిపరులై ఉండమని) మిమ్మల్ని స్వయంగా హెచ్చరిస్తున్నాడు[19]. మరియు అల్లాహ్ వైపుకే మీ మరలింపు ఉంది.

29. వారితో ఇలా అను: "మీరు మీ హృదయాలలో ఉన్నది దాచినా వెలిబుచ్చినా, అది అల్లాహ్ కు తెలుస్తుంది. మరియు భూమ్యాకాశాలలో ఉన్నదంతా ఆయనకు తెలుసు. మరియు అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు."

30. ఆ రోజు ప్రతి ప్రాణి తాను చేసిన మంచిని మరియు తాను చేసిన చెడును ప్రత్యక్షంగా చూసుకున్నప్పుడు తనకు మరియు దానికి మధ్య దూరం ఉంటే, ఎంత బాగుండేదని ఆశిస్తుంది. మరియు అల్లాహ్ (తనకే భీతిపరులై ఉండమని) మిమ్మల్ని స్వయంగా హెచ్చరిస్తున్నాడు. మరియు అల్లాహ్ తన దాసుల ఎడల ఎంతో కనికరుడు.

31. (ఓ ప్రవక్తా!) ఇలా అను: "మీకు (నిజంగా) అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే మీరు నన్ను అనుసరించండి. (అప్పుడు) అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు మరియు మీ పాపాలను క్షమిస్తాడు. మరియు

---

[19] 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 9 'హదీస్' నం. 500. ఇంకా చూడండి 2:257, 54:139. అల్లాహ్ (సు.తా.) విశ్వాసుల ఆప్తస్నేహితుడు. ఈ ఆయత్ యొక్క ఉద్దేశం, వారితో స్నేహభావంతో కలిసిమెలసి ఉండ గూడదని కాదు. ఎవరైతే మీతో మంచిగా ఉంటారో వారితో సహృదయంతో మెలుగుతూ వారితో ఇచ్చి పుచ్చు కోవడాలు, వ్యాపారాలు కూడా చేయవచ్చు.

అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణాప్రదాత."

32. (ఇంకా) ఇలా అను: "అల్లాహ్ కు మరియు సందేశహరునికి విధేయులై ఉండండి." వారు కాదంటే! నిశ్చయంగా, అల్లాహ్ సత్యతిరస్కారులను ప్రేమించడు, (అని తెలుసుకోవాలి)[20].

33. నిశ్చయంగా అల్లాహ్, ఆదమ్ ను నూహ్ ను ఇబ్రాహీమ్ సంతతి వారిని మరియు ఇమ్రాన్ సంతతివారిని (ఆయా కాలపు) సర్వలోకాల (ప్రజలపై) ప్రాధాన్యతనిచ్చి ఎన్నుకున్నాడు[21].

34. వారంతా ఒకే పరంపరకు చెందినవారు. మరియు అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

35. ఇమ్రాన్ భార్య ప్రార్థించింది (జ్ఞాపకం చేసుకోండి): "ఓ నా ప్రభూ! నిశ్చయంగా, నేను నా గర్భము నందున్న శిశువును నీ సేవకు అంకితం[22] చేయటానికి మొక్కుకున్నాను, కావున నా నుండి దీనిని తప్పక స్వీకరించు. నిశ్చయంగా నీవే సర్వం వినేవాడవు, సర్వజ్ఞుడవు."

---

[20] పై ఆయత్ లో మరియు ఈ ఆయత్ లో అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞాపాలనతో బాటు ము'హమ్మద్ ('స'అస) ను అనుసరించటం వల్లనే మోక్షం దొరుకుతుందని వ్యక్తపరచబడింది. దీనిని తిరస్కరించే వారిని అల్లాహుతా'ఆలా ఎన్నడూ ప్రేమించడు. చూడండి, 3:85.

[21] ప్రవక్తల సంతతిలో ఇద్దరు 'ఇమ్రాన్ లు పేర్కొనబడ్డారు: 1) మూసా మరియు హారూన్ ('అలైహిమ్ స.) ల తండ్రి 'ఇమ్రాన్ మరియు 2) మర్యమ్ తండ్రి 'ఇమ్రాన్. ఇక్కడ పేర్కొనబడ్డ 'ఇమ్రాన్ గారు, మర్యమ్ ('అ.స.) తండ్రి అని వ్యాఖ్యాతల అభిప్రాయం. (ఖు'ర్తుబీ, ఇబ్నె - కసీ'ర్).

[22] ము'హర్రరన్: అంటే నీ ఆలయసేవకు అంకితం చేస్తున్నాను అని అర్థం.

**36.** తరువాత ఆమె ఆడశిశువు(మర్యమ్) ను ప్రసవించినప్పుడు, ఆమె ఇలా విన్నవించు కున్నది: "ఓ నా ప్రభూ! నేను ఆడశిశువును ప్రసవించాను"- ఆమె ప్రసవించినదేమిటో అల్లాహ్ కు బాగా తెలుసు మరియు బాలుడు బాలిక వంటి వాడు కాడు - "మరియు నేను ఈమెకు మర్యమ్ అని పేరు పెట్టాను[23]. మరియు నేను ఈమెను మరియు ఈమె సంతానాన్ని శపించ బడిన (బహిష్కరించబడిన) షైతాన్ నుండి రక్షించటానికి, నీ శరణు వేడుకుంటున్నాను![24]"

**37.** ఆ తరువాత ఆ బాలికను, ఆమె ప్రభువు ఆదరంతో స్వీకరించి, ఆమెను ఒక మంచి స్త్రీగా పెంచాడు మరియు ఆమెను 'జకరియ్యా సంరక్షణలో

---

[23] 'హాఫి"జ్ ఇబ్నె ఖయ్యిమ్, ఎన్నో హదీసులను పరిశీలించి క్రొత్తగా పుట్టిన బిడ్డ పేరు మొదటిరోజు, లేక మూడవ రోజు లేక ఏడవ రోజు పెట్టటం మంచిదని అన్నారు.

[24] క్రొత్తగా పుట్టిన ప్రతి బిడ్డను షైతాన్ తాకుతాడు దానితో ఆ బిడ్డ ఏడుస్తోంది. కాని అల్లాహ్ (సు.తా.) ఈ షైతాన్ తాకటం నుండి మర్యమ్ మరియు 'ఈసా ('అ.స.) లను ఇద్దరినీ రక్షించాడు. ('స. బు'ఖారీ, కితాబ్ అత్ తఫ్సీర్; ముస్లిం, కితాబ్ అల్ ఫ'దాయిల్).

ఉంచాడు[25]. జకరియ్యా ఆమె గదికి పోయినప్పుడల్లా, ఆమె వద్ద (ఏవో కొన్ని) భోజన పదార్థాలను చూసి, ఆమెను ఇలా అడిగేవాడు: "ఓ మర్యమ్, ఇది నీ వద్దకు ఎక్కడి నుండి వచ్చింది?" ఆమె ఇలా జవాబిచ్చేది: "ఇది అల్లాహ్ వద్ద నుండి వచ్చింది." నిశ్చయంగా, అల్లాహ్ తాను కోరిన వారికి లెక్క లేనంత జీవనోపాధిని ప్రసాదిస్తాడు.

**38.** అప్పుడు జకరియ్యా తన ప్రభువును ప్రార్థించాడు. అతను ఇలా విన్నవించుకున్నాడు: "ఓ నా ప్రభూ! నీ కనికరంతో నాకు కూడా ఒక మంచి సంతానాన్ని ప్రసాదించు. నిశ్చయంగా నీవే ప్రార్థనలను వినేవాడవు."

**39.** తరువాత అతను (జకరియ్యా) తన గదిలో నిలబడి నమాజ్ చేస్తున్నప్పుడు దేవదూతలు: "నిశ్చయంగా, అల్లాహ్ నీకు యహ్యా యొక్క శుభవార్తను ఇస్తున్నాడు. అతను, అల్లాహ్

---

[25] 'జకరియ్యా ('అ.స.) మర్యమ్ తల్లి సోదరి అయిన ఎలిసబెత్ భర్త. వారి తండ్రి పేరు హారూన్. కావున ఆమె (మర్యమ్) ను హారూన్ సోదరి అని ఖుర్ఆన్ (19:28)లో పేర్కొనబడింది. మర్యమ్ మరియు య'హ్యా ('అలైహిమ్ స.లు) ఇద్దరూ అక్కా చెల్లెళ్ళ బిడ్డలు అని కొందరు వ్యాఖ్యాతలు అంటారు. చూడండి, 19:8 వ్యాఖ్యానం 2. మర్యమ్ ('అ.స.) తండ్రి పేరు 'ఇమ్రాన్, మూసా మరియు హారూన్ ('అలైహిమ్ స.)ల తండ్రి పేరు కూడా 'ఇమ్రాన్ (Amran). హారూన్ ('అ.స.) సంతతిలో చాలా మంది మత గురువులు (Priests) వచ్చారు. చూడండి, 19:28 వ్యాఖ్యానం 1.

వాక్కును ధృవ పరుస్తాడు[26]. అతను మంచి నాయకుడు మరియు మనోనిగ్రహం గల ప్రవక్త అయి సద్వర్తనులలో చేరిన వాడవుతాడు." అని వినిపించారు.

**40.** అతను (జకరియ్యా) ఇలా అన్నాడు: "ఓ నా ప్రభూ! నాకు కుమారుడు ఎలా కలుగు తాడు, నాకు ముసలితనం వచ్చింది మరియు నా భార్యనేమో గొడ్రాలు!" ఆయన అన్నాడు: "అలాగే జరుగుతుంది. అల్లాహ్ తాను కోరిందిచేస్తాడు[27]."

**41.** అతను (జకరియ్యా) ఇలా మనవి చేసుకున్నాడు: "ఓ నా ప్రభూ! నా కొరకు ఏదైనా సూచన నియమించు." ఆయన జవాబిచ్చాడు: "నీకు సూచన ఏమిటంటే, నీవు మూడు రోజుల వరకు సైగలతో తప్ప ప్రజలతో మాట్లాడలేవు. నీవు ఎక్కువగా నీ ప్రభువును స్మరించు. మరియు సాయంకాలము నందును మరియు ఉదయము నందును ఆయన పవిత్రతను కొనియాడు."

**42.** మరియు దేవదూతలు: "ఓ మర్యమ్! నిశ్చయంగా, అల్లాహ్ నిన్ను ఎన్నుకున్నాడు. మరియు నిన్ను పరిశుద్ధ పరిచాడు. మరియు (నీ కాలపు)

---

[26] అల్లాహ్ (సు.తా.) వాక్కును ధృవపరుస్తాడు - అంటే 'ఈసా (అ.స.) ను, ప్రవక్త అని మరియు అతనిపై ఇంజీల్ అవతరింపజేయబడిందని ధృవపరుస్తాడు అని అర్థం. య'హ్యా 'అ.స. (John), 'ఈసా ('అ.స.) కంటే పెద్దవారు. వీరిద్దరు ఒకరినొకరు బలపరచుకున్నారు.

[27] య'హ్యా ('అ.స.), 'ఈసా ('అ.స.) కంటే పెద్దవారని ఈ ఆయత్ వల్ల స్పష్టమౌతోంది. 'ఈసా ('అ.స.) ప్రస్తావన ముందు వస్తుంది.

సర్వలోకాలలో నిస్త్రీలలో నిన్ను ఎన్నుకున్నాడు." అని అన్న విషయం (జ్ఞాపకం చేసుకోండి).

**43.** (వారింకా ఇలా అన్నారు): "ఓ మర్యమ్! నీవు నీ ప్రభువుకు విధేయురాలుగా ఉండు. (ఆయన సాన్నిధ్యంలో) సాష్టాంగం (సజ్దా) చెయ్యి. మరియు వంగే (రుకూఉ చేసే)[28] వారితో కలిసి వంగు (రుకూఉ చెయ్యి)."

**44.** (ఓ ప్రవక్తా!) ఇవన్నీ అగోచరమైన వార్తలు. వాటిని మేము నీకు దివ్యజ్ఞానం (వహీ) ద్వారా తెలుపుతున్నాము. మర్యమ్ సంరక్షకుడు ఎవరు కావాలని వారు (ఆలయ సేవకులు) తమ కలములను విసిరినపుడు, నీవు వారి దగ్గర లేవు మరియు వారు వాదించుకున్నపుడు కూడా నీవు వారి దగ్గర లేవు[29].

**45.** దేవదూతలు ఇలా అన్నది (జ్ఞాపకం చేసుకోండి): "ఓ మర్యమ్! నిశ్చయంగా, అల్లాహ్! నీకు తన వాక్కును గురించి శుభవార్తను ఇస్తున్నాడు[30].

---

[28] చూడండి, 2:43 వ్యాఖ్యానం 2.

[29] ము'హమ్మద్ ('స'అస)కు అగోచర జ్ఞానం లేదు, అని ఈ ఆయత్ ద్వారా స్పష్టంగా తెలుస్తుంది. ఏ ప్రవక్తకు కూడా అల్లాహ్ (సు.తా.) అన్ని విషయాల అగోచర జ్ఞానం ఇవ్వలేదు. అల్లాహుతా'ఆలా తెలపాలనుకున్నంత మట్టుకే వారికి తెలిపాడు.

[30] ఈ ఆయత్ లో కలిమతుల్లాహ్, అల్లాహ్ (సు.తా.) వాక్కు అని 'ఈసా ('అ.స.) సంబోధించబడ్డారు. అంటే అతను తండ్రి లేకుండా కేవలం అల్లాహుతా'ఆలా వాక్కు ద్వారా: "అయిపో" అని అనగానే, (తన తల్లి - మర్యమ్ గర్భంలో) అయిపోయారు; ఏ విధంగానైతే ఆదమ్ ('అ.స.) ను అల్లాహ్ (సు.తా.) తల్లి - దండ్రి లేనిదే మరియు 'హవ్వాను తల్లి లేనిదే సృష్టించాడో! చూడండి, 3:59.

అతని పేరు: "మసీహ్ ఈసా ఇబ్నె మర్యమ్. అతను ఇహలోకంలోనూ మరియు పరలోకంలోనూ గౌరవనీయుడై వాడై మరియు (అల్లాహ్) సామీప్యం పొందినవారిలో ఒకడై ఉంటాడు.

46. "మరియు అతను ప్రజలతో ఉయ్యాలలో ఉండగానే మాట్లాడుతాడు మరియు పెద్దవాడైన తరువాత కూడా (మాట్లాడుతాడు) మరియు సత్పురుషులలో ఒకడై ఉంటాడు[31]."

47. ఆమె (మర్యమ్) ఇలా అన్నది: "ఓ నా ప్రభూ! నాకు కుమారుడు ఎలా కలుగుతాడు? ఏ పురుషుడు కూడా నన్ను ముట్టలేదే?" ఆయన ఇలా సమాధాన మిచ్చాడు: "అల్లాహ్ తాను కోరింది ఇదే విధంగా సృష్టిస్తాడు. ఆయన ఒక పని చేయాలని నిర్ణయించినపుడు కేవలం దానిని: 'అయిపో!' అని అంటాడు, అంతే అది అయిపోతుంది."

48. మరియు ఆయన (అల్లాహ్) అతనికి గ్రంథాన్ని మరియు వివేకాన్ని మరియు తౌరాతును మరియు ఇంజీలును నేర్పుతాడు.

49. మరియు అతనిని ఇస్రాయీల్ సంతతి వారి వైపుకు సందేశహరునిగా పంపుతాడు. (అతను ఇలా అంటాడు): "నిశ్చయంగా, నేను మీ ప్రభువు తరఫు నుండి మీ వద్దకు సూచన (ఆయత్) తీసుకొని వచ్చాను. నిశ్చయంగా, నేను మీ కొరకు

[31] చూడండి, 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 4, 'హదీస్' నం. 645.

మట్టితో పక్షి ఆకారంలో ఒక బొమ్మను తయారుచేసి దానిలో శ్వాసను ఊదుతాను! అప్పుడది అల్లాహ్ ఆజ్ఞతో పక్షి అవుతుంది మరియు నేను అల్లాహ్ ఆజ్ఞతో పుట్టుగ్రుడ్డిని[32], కుష్ఠురోగిని బాగు చేస్తాను మరియు మృతుణ్ణి బ్రతికిస్తాను. మరియు మీరు తినేది, ఇండ్లలో కూడబెట్టేది మీకు తెలుపుతాను. మీరు విశ్వాసులే అయితే! నిశ్చయంగా, ఇందులో మీకు ఒక గొప్ప సూచన (ఆయత్) ఉంది.

50. "మరియు నేను, ప్రస్తుతం తౌరాత్ లో (మిగిలి ఉన్న సత్యాన్ని) ధృవపరచటానికి మరియు పూర్వం మీకు నిషేధించబడిన (హరామ్ చేయబడిన) కొన్ని వస్తువులను ధర్మసమ్మతం (హలాల్) చేయటానికి (వచ్చాను)[33]. మరియు నేను మీ ప్రభువు తరఫు నుండి మీ వద్దకు అద్భుత సూచనలు (ఆయాత్) తీసుకొని వచ్చాను, కావున మీరు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి మరియు నన్ను అనుసరించండి!

51. "నిశ్చయంగా, అల్లాహ్ నా ప్రభువు మరియు మీ

---

[32] ఇక్కడ "అల్లాహ్ ఆజ్ఞతో" అని రెండుసార్లు పలకడంతో, 'ఈసా ('అ.స.) తనకు స్వయంగా ఏ విధమైన దివ్యశక్తులు లేవనీ మరియు అతను ఏది చేసినా అల్లాహుతా'ఆలా ఆజ్ఞతో మాత్రమే చేశారనీ, స్పష్టమవుతోంది.

[33] ఇవి అల్లాహ్ (సు.తా.) శిక్షగా ఇస్రాయీ'లు సంతతి వారికి 'హరామ్ చేసినవి కావచ్చు. లేక వారి మతగురువులు 'హరామ్ చేసినవి కావచ్చు.

ప్రభువు కూడాను, కావున మీరు ఆయననే ఆరాధించండి. ఇదే ఋజుమార్గము."

52. ఈసా వారిలో సత్యతిరస్కారాన్ని కనుగొని ఇలా ప్రశ్నించాడు: "అల్లాహ్ మార్గంలో నాకు సహాయకులుగా ఎవరు ఉంటారు?" (అప్పుడతని) శిష్యులు[34] ఇలా జవాబిచ్చారు: "మేము నీకు అల్లాహ్ మార్గంలో సహాయకులముగా ఉంటాము. మేము అల్లాహ్ ను విశ్వసించాము మరియు మేము అల్లాహ్ కు విధేయులము (ముస్లింలము) అయ్యామని, నీవు మాకు సాక్షిగా ఉండు.

53. "ఓ మా ప్రభూ! నీవు అవతరింప జేసిన సందేశాన్ని మేము విశ్వసించాము మరియు మేము ఈ సందేశహరుణ్ణి అనుసరించాము. కావున మమ్మల్ని సాక్షులలో వ్రాసుకో!"

54. మరియు వారు (ఇస్రాయీల్ సంతతిలోని అవిశ్వాసులు, ఈసా కు విరుద్ధంగా) కుట్రలు చేశారు. మరియు అల్లాహ్ (వారి కుట్రలకు విరుద్ధంగా) పన్నాగాలు పన్నాడు. ఎత్తులు వేయటంలో అల్లాహ్ అత్యుత్తముడు!

55. (జ్ఞాపకం చేసుకోండి) అప్పుడు అల్లాహ్ ఇలా అన్నాడు: "ఓ ఈసా! నేను నిన్ను తీసుకుంటాను మరియు నిన్ను నా వైపునకు ఎత్తుకుంటాను మరియు సత్యతిరస్కారుల నుండి నిన్ను శుద్ధపరుస్తాను మరియు నిన్ను అనుసరించిన

---

[34] 'హవారియ్యూన్: 'హవారి యొక్క బహువచనం. అంటే సహాయకులు అని అర్థం. ('స. బు'ఖారీ).

వారిని, పునరుత్థాన దినం వరకు సత్యతిరస్కారులకు పైచేయిగా ఉండేటట్లు చేస్తాను[35]. చివరకు మీరంతా నా వద్దకే మరలి రావలసి ఉంది. అప్పుడు నేను మీ మధ్య తలెత్తిన విభేదాలను గురించి తీర్పు చేస్తాను.

**56.** "ఇక సత్యతిరస్కారులకు ఇహలోకంలో మరియు పరలోకంలోనూ కఠినమైన శిక్ష విధిస్తాను. మరియు వారికి సహాయం చేసేవారు ఎవ్వరూ ఉండరు."

**57.** మరియు విశ్వసించి సత్కార్యాలు చేసే వారికి (అల్లాహ్) పరిపూర్ణ ప్రతిఫలం ప్రసాదిస్తాడు. మరియు అల్లాహ్ దుర్మార్గులు అంటే ఇష్టపడడు.

**58.** (ఓ ముహమ్మద్!) మేము నీకు ఈ సూచనలను (ఆయాత్ లను) వినిపిస్తున్నాము. మరియు ఇవి వివేకంతో నిండిన ఉపదేశాలు.

**59.** నిశ్చయంగా, అల్లాహ్ దృష్టిలో ఈసా ఉపమానం, ఆదమ్ ఉపమానం వంటిదే. ఆయన (ఆదమ్ ను) మట్టితో సృజించి: "అయిపో!" అని అన్నాడు. అంతే అతను అయిపోయాడు[36].

**60.** ఈ సత్యం నీ ప్రభువు తరఫు నుండి వచ్చింది, కావున నీవు శంకించేవారిలో చేరిన వాడవు కావద్దు.

**61.** ఈ జ్ఞానం నీకు అందిన తర్వాత కూడా ఎవడైనా

---

[35] చూడండి, 4:159 మరియు 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 4, 'హదీస్' నం. 657 మరియు 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 4, అధ్యాయం - 21.

[36] ఆదం ('అ.స.) మట్టితో సృష్టించబడ్డారు. చూడండి, 18:37, 22:5, 30:20, 35:11, 40:67.

నీతో అతనిని (ఈసాను) గురించి వివాదానికి దిగితే, ఇలా అను: "రండి! మేము మరియు మీరు కలిసి, మా కుమారులను మరియు మీ కుమారులను; మా స్త్రీలను మరియు మీ స్త్రీలను పిలుచుకొని, అందరమూ కలిసి: 'అసత్యం పలికే వారిపై అల్లాహ్ శాపం (బహిష్కారం) పడుగాక!' అని హృదయపూర్వకంగా ప్రార్థిద్దాము[37]."

**62.** నిశ్చయంగా, ఇదే (ఈసాను గురించిన) సత్యగాథ. మరియు అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యనీయుడు లేడు. మరియు నిశ్చయంగా, అల్లాహ్ మాత్రమే సర్వశక్తిమంతుడు,
మహావివేకవంతుడు.

**63.** ఒకవేళ వారు వెనుదిరిగితే! నిశ్చయంగా, అల్లాహ్ కు కల్లలోలం రేకెత్తించే వారిని గురించి బాగా తెలుసు.

**64.** ఇలా అను: " ఓ గ్రంథ ప్రజలారా! మాకూ మరియు మీకూ మధ్య ఉమ్మడిగా ఉన్న ధర్మ విషయం (ఉత్తరువు) వైపునకు రండి, అది ఏమిటంటే:

---

[37] ఇది 9వ హిజ్రీ విషయం. నజ్రాన్ నుండి క్రైస్తవ బృందం ఒకటి దైవప్రవక్త ('స'అస) తో కలవటానికి మదీనాకు వస్తుంది. వారికి 'ఈసా (అ.స.) గురించి ఉన్న మూఢ విశ్వాసాలను గురించి వాదవివాదాలు జరిగిన తరువాత, దైవప్రవక్త ('స'అస) శపథం (ముబాహలహ్) కొరకు సిద్ధపడ్డారు. ముబాహలహ్ అంటే, తమ తమ కుమారులను మరియు స్త్రీలను ఒకచోట చేర్చి: "ఎవరు అసత్యం పలుకుతున్నారో వారు అల్లాహ్ (సు.తా.) శాపానికి పాత్రులై నశించిపోవు గాక!" అని అల్లాహుతా'ఆలా పేరుతో శపథం చేయటం. శపథం చేయటానికి భయపడి, ఆ క్రైస్తవ నాయకులు జి'జ్ యా ఇవ్వటానికి అంగీకరిస్తారు.

'మనం అల్లాహ్ తప్ప మరెవ్వరినీ ఆరాధించరాదు, ఆయనకు భాగస్వాములను ఎవ్వరినీ నిలబెట్టరాదు మరియు అల్లాహ్ తప్ప, మనవారిలో నుండి ఎవ్వరినీ ప్రభువులుగా చేసుకోరాదు[38]." వారు (సమ్మతించక) తిరిగి పోతే: "మేము నిశ్చయంగా అల్లాహ్ కు విధేయులము (ముస్లింలము), దీనికి మీరు సాక్షులుగా ఉండండి." అని పలుకు[39].

**65.** ఓ గ్రంథ ప్రజలారా! ఇబ్రాహీమ్ (ధర్మాన్ని) గురించి మీరు ఎందుకు వాదులాడు తున్నారు? తౌరాతు మరియు ఇంజీల్ లు అతని తరువాతనే అవతరించాయి కదా! ఇది మీరు అర్థం చేసుకోలేరా?

**66.** అవును, మీరే వారు! తెలిసివున్న విషయాలను గురించి వాదులాడినవారు. అయితే మీకేమీ తెలియని విషయాలను గురించి ఎందుకు వాదులాడుతున్నారు? మరియు అల్లాహ్ కు అంతా తెలుసు, కానీ మీకు ఏమీ తెలియదు.

**67.** ఇబ్రాహీమ్ యూదుడూ కాడు మరియు క్రైస్తవుడూ కాడు! కాని అతను ఏకదైవ సిద్ధాంతంపై ఉన్నవాడు (హనీఫ్), అల్లాహ్ కు విధేయుడు (ముస్లిం) మరియు అతడు ఏ మాత్రం (అల్లాహ్ కు) సాటి

---

[38] యూదులు 'ఉజైర్ ('అ.స.)ను అల్లాహ్ (సు.తా.) కుమారుడని మరియు క్రైస్తవులు 'ఈసా ('అ.స.) ను అల్లాహుతా'ఆలా కుమారుడని అంటారు. ఇలాంటి వాదాలతో ప్రవక్తలను అల్లాహ్ (సు.తా.)కు భాగస్వాములుగా చేస్తున్నారు. చూడండి, 9:30-31.

[39] చూడండి, 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 6, 'హదీస్' నం. 75.

కల్పించేవాడు (ముష్రిక్) కాడు[40].

**68.** నిశ్చయంగా, ఇబ్రాహీమ్ తో దగ్గరి సంబంధం గల వారంటే, అతనిని అనుసరించే వారు మరియు ఈ ప్రవక్త (ముహమ్మద్) మరియు (ఇతనిని) విశ్వసించిన వారు. మరియు అల్లాహ్ యే విశ్వాసుల సంరక్షకుడు[41].

**69.** గ్రంథ ప్రజలలోని ఒక వర్గం వారు, మిమ్మల్ని మార్గభ్రష్టులు చేయాలని కోరుతున్నారు. కాని వారు తమను తాము తప్ప మరెవ్వరినీ మార్గభ్రష్టులు చేయటం లేదు, కాని వారది గ్రహించటం లేదు.

**70.** "ఓ గ్రంథ ప్రజలారా! మీరు అల్లాహ్ సూచనలను (ఆయాత్ లను) ఎందుకు తిరస్కరిస్తున్నారు? మరియు వాటికి మీరే సాక్షులుగా ఉన్నారు కదా!"

**71.** "ఓ గ్రంథ ప్రజలారా! తెలిసి ఉండి కూడా మీరు సత్యాన్ని అసత్యంతో ఎందుకు కప్పి పుచ్చుతున్నారు? మరియు మీకు తెలిసి ఉండి కూడా సత్యాన్ని ఎందుకు దాస్తున్నారు?[42]"

**72.** మరియు గ్రంథ ప్రజలలోని కొందరు (పరస్పరం ఇలా చెప్పుకుంటారు): "(ఈ ప్రవక్తను) విశ్వసించిన వారిపై (ముస్లింలపై) అవతరింపజేయబడిన దానిని ఉదయం విశ్వసించండి మరియు

---

[40] చూడండి, 2:135.
[41] చూడండి, 16:123.
[42] చూడండి, 2:42.

సాయంత్రం తిరస్కరించండి. (ఇలా చేస్తే) బహుశా, వారు కూడా (తమ విశ్వాసం నుండి) తిరిగి పోతారేమో!"

73. మరియు (పరస్పరం ఇలా చెప్పుకుంటారు): "మీ ధర్మాన్ని అనుసరించే వారిని తప్ప మరెవ్వరినీ నమ్మకండి." (ఓ ప్రవక్తా!) నీవు వారితో అను: "నిశ్చయంగా, అల్లాహ్ మార్గదర్శకత్వమే సరైన మార్గదర్శకత్వం." (వారు ఇంకా ఇలా అంటారు): "మీకు ఇవ్వబడి నటు వంటిది ఇంకెవరికైనా ఇవ్వబడుతుందని, లేక వారు మీ ప్రభువు సమక్షంలో మీతో వాదిస్తారని, (నమ్మకండి)." వారితో అను: "నిశ్చయంగా, అనుగ్రహం అల్లాహ్ చేతిలోనే ఉంది; ఆయన దానిని తాను కోరిన వారికి ప్రసాదిస్తాడు. మరియు అల్లాహ్ సర్వవ్యాప్తి, సర్వజ్ఞుడు[43]."

74. ఆయన తాను కోరిన వారిని తన కారుణ్యం కొరకు ప్రత్యేకించుకుంటాడు. మరియు అల్లాహ్ దాతృత్వంలో, సర్వోత్తముడు.

75. మరియు గ్రంథ ప్రజలలో ఎలాంటి వాడున్నాడంటే:

---

[43] ఈ వాక్యపు తాత్పర్యం ఈ విధంగా కూడా ఉంది: "ఆయన మీకు (ఒకప్పుడు) ఇచ్చినట్టి దానిని (దివ్యజ్ఞానాన్ని) మరొకనికి కూడా ఇచ్చారని (భయపడుతున్నారా?) లేదా వారు మీ ప్రభువు సమక్షంలో మీతో వాదిస్తారని (భయపడుతున్నారా?)" వారితో అను: "నిశ్చయంగా, అనుగ్రహం అల్లాహ్ చేతిలోనే ఉంది; ఆయన దానిని తాను కోరిన వారికి ప్రసాదిస్తాడు. మరియు అల్లాహ్ సర్వవ్యాప్తి, సర్వజ్ఞుడు."

నీవు అతనికి ధనరాసులు ఇచ్చినా అతడు వాటిని నమ్మకంగా నీకు తిరిగి అప్పగిస్తాడు. మరొకడు వారిలో ఎలాంటి వాడంటే: నీవతన్ని నమ్మి ఒక్క దీనారు ఇచ్చినా అతడు దానిని - నీవతని వెంట బడితేనే కానీ - నీకు తిరిగి ఇవ్వడు. ఇలాంటి వారు ఏమంటారంటే: "నిరక్ష్యరాస్యుల (యూదులు కాని వారి) పట్ల ఎలా వ్యవహరించినా మాపై ఎలాంటి దోషం లేదు." మరియు వారు తెలిసి ఉండి కూడా అల్లాహ్ ను గురించి అబద్ధాలాడుతున్నారు.[44]

**76.** వాస్తవానికి, ఎవడు తన ఒప్పందాన్ని పూర్తి చేసి దైవభీతి కలిగి ఉంటాడో; అలాంటి దైవభీతి గలవారిని నిశ్చయంగా, అల్లాహ్ ప్రేమిస్తాడు.

**77.** నిశ్చయంగా, ఎవరైతే తాము అల్లాహ్ తో చేసిన ఒప్పందాన్ని మరియు తమ ప్రమాణాలను స్వల్పలాభాలకు అమ్ముకుంటారో, అలాంటి వారికి పరలోక జీవితంలో ఎలాంటి భాగం ఉండదు మరియు పునరుత్థాన దినమున అల్లాహ్ వారితో మాట్లాడడు మరియు వారి వైపు కూడా చూడడు మరియు వారిని పరిశుద్ధులుగా చేయడు మరియు వారికి బాధాకరమైన శిక్ష ఉంటుంది

**78.** మరియు మీరు అది గ్రంథంలోనిదని భావించాలని,

---

[44] ఉమ్మియ్యూన్: నిరక్షరాస్యులు, అవివేకులు. అంటే 'అరబ్బులు. "యూదులు కాని వారంతా నిరక్షరాస్యులు, అవివేకులు, కావున వారి పట్ల ఎలా వ్యవహరించినా పాపం కాదు." అని యూదులు అంటారు. అల్లాహ్ (సు.తా.) వారి ఈ వాదాన్ని ఖండిస్తున్నాడు.

వాస్తవానికి వారిలో కొందరు తమ నాలుకలను త్రిప్పి గ్రంథాన్ని చదువుతారు, కాని (నిజానికి) అది గ్రంథం లోనిది కాదు; మరియు వారు: "అది అల్లాహ్ దగ్గర నుండి వచ్చింది." అని అంటారు, కాని అది (నిజానికి) అల్లాహ్ దగ్గర నుండి వచ్చింది కాదు, మరియు వారు తెలిసి కూడా అల్లాహ్ పై అబద్ధాలు పలుకుతున్నారు.

**79.** ఏ మానవునికైనా అల్లాహ్ అతనికి గ్రంథాన్ని, వివేకాన్ని మరియు ప్రవక్త పదవిని ప్రసాదించిన తర్వాత అతడు ప్రజలతో: "మీరు అల్లాహ్ కు బదులుగా నన్ను ప్రార్థించండి." అని అనటం తగినది కాదు,[45] కాని వారితో: "మీరు ఇతరులకు బోధించే మరియు మీరు చదివే గ్రంథాల అనుసారంగా ధర్మవేత్తలు (రబ్బానియ్యూన్) కండి." అని అనటం (భావింపదగినది);

**80.** మరియు మీరు దేవదూతలనో, లేదా ప్రవక్తలనో ప్రభువులుగా చేసుకోండని అతను మిమ్మల్ని ఎన్నడూ ఆజ్ఞాపించడు. అయితే! అలాంటప్పుడు మీరు అల్లాహ్ కు విధేయులు (ముస్లింలు) అయిన తరువాత మిమ్మల్ని సత్యతిరస్కారులు

---

[45] ఇక్కడ 'ఈసా ('అ.స.) ను గురించి చెప్పబడింది.

కమ్మని ఆదేశించగలడా?[46]

81. మరియు అల్లాహ్ ప్రవక్తల నుండి తీసుకున్న గట్టి ప్రమాణాన్ని[47] (జ్ఞాపకం చేసుకోండి): "నేను మీకు ఒక గ్రంథాన్ని మరియు వివేకాన్ని ప్రసాదించిన తరువాత, ఒక సందేశహరుడు (ముహమ్మద్) వచ్చి (మీ గ్రంథాలలో నుండి మిగిలివున్న) సత్యాన్ని ధృవపరిస్తే మీరు అతని (ధర్మాన్ని) విశ్వసించి, అతనికి సహాయం చేయవలసి ఉంటుంది." అని చెప్పి ఇలా ప్రశ్నించాడు: "ఏమీ? మీరు దీనికి అంగీకరిస్తారా? మరియు నా ఈ ప్రమాణాన్ని స్వీకరిస్తారా?" వారన్నారు: "మేము అంగీకరిస్తాము." అప్పుడు ఆయన అన్నాడు: "అయితే, మీరు దీనికి సాక్షులుగా ఉండండి. మరియు నేను కూడా మీతోపాటు సాక్షిగా ఉంటాను.

82. ఇకపై ఎవరు తమ వాగ్దానం నుండి మరలుతారో,

---

[46] సయ్యిద్ నా 'ఉమర్ (ర'ది.'అ.) కథనం నేను దైవప్రవక్త ('స.'అస)ను, ఇలా అంటూ ఉండగా విన్నాను: "క్రైస్తవులు మర్యమ్ కుమారుడు 'ఈసా ('అ.స.)ను పొగిడినట్లు, మీరు నన్ను పొగడకండి. నేను కేవలం అల్లాహ్ (సు.తా.) దాసుణ్ణి, కావున నన్ను అల్లాహుతా'ఆలా దాసుడు మరియు ఆయన సందేశహరుడు." అని మాత్రమే అనండి. ('స. బు'ఖారీ, పుస్తకం - 4, 'హ. నం. 654).

[47] దీని అర్థమేమిటంటే, ప్రతి ప్రవక్త తన తరువాత వచ్చిన సందేశహరుణ్ణి అనుసరించాలి. ఒకవేళ వారిద్దరూ ఒకేసారి సజీవులై ఉన్నా సరే! ఉదాహరణకు యహ్యా('అ.స.) తన తరువాత వచ్చిన 'ఈసా ('అ.స.)ను అనుసరించారు. ప్రవక్తలు ప్రమాణం చేశారంటే వారిని అనుసరించే ప్రజలు కూడా తమ ప్రవక్తల ప్రమాణాన్ని శిరసావహించాలి.

వారే దుష్టులు (ఫాసిఖూన్).

**83.** ఏమీ? వీరు అల్లాహ్ ధర్మం కాక వేరే ధర్మాన్ని అవలంబించగోరుతున్నారా? మరియు భూమ్యాకాశాలలో ఉన్నవన్నీ ఇష్టం ఉన్నా, ఇష్టం లేకున్నా ఆయనకే విధేయులై (ముస్లింలై) ఉన్నాయి! మరియు ఆయన వైపునకే అందరూ మరలింపబడతారు[48].

**84.** (ఓ ప్రవక్తా!) ఇలా అను: "మేము అల్లాహ్ ను విశ్వసించాము; మరియు మాపై అవతరింపజేయబడిన దానిని మరియు ఇబ్రాహీమ్, ఇస్మాయీల్, ఇస్ హాఖ్, యఅఖూబ్ లపై మరియు అతని సంతానంపై అవతరింపజేయబడినవాటినికూడా (విశ్వసించాము). ఇంకా మూసా, ఈసా మరియు ఇతర ప్రవక్తలపై వారి ప్రభువు తరఫు నుండి (అవతరింప జేయబడిన వాటిని) కూడా విశ్వసించాము. మేము వారి మధ్య ఎలాంటి విచక్షణ చేయము. మరియు మేము ఆయనకే విధేయులమై (ముస్లింలమై) ఉన్నాము."

**85.** మరియు ఎవడైనా అల్లాహ్ కు విధేయత (ఇస్లాం) తప్ప ఇతర ధర్మాన్ని అవలంబించ గోరితే అది ఏ మాత్రమూ స్వీకరించబడదు మరియు అతడు పరలోకంలో నష్టపడేవారిలో చేరుతాడు[49]

**86.** అల్లాహ్ వారికి ఎలా సన్మార్గం చూపగలడు? ఏ జాతివారైతే, విశ్వాసం పొందిన తరువాత - మరియు

---

[48] చూడండి, 13:15.

[49] చూ. 'స. ముస్లిం, పుస్తకం - 1, అధ్యాయం - 240, 'స. బు'ఖారీ, పుస్తకం - 1, 'హ.నం. 47, 50, 87.

నిశ్చయంగా సందేశహరుడు సత్యవంతుడే, అని సాక్ష్యమిచ్చిన తరువాత మరియు వారి వద్దకు స్పష్టమైన సూచనలు వచ్చిన తరువాత కూడా - సత్యతిరస్కారం అవలంబించారో! మరియు అల్లాహ్ దుర్మార్గులైన వారికి సన్మార్గం చూపడు.

**87.** అలాంటి వారి శిక్ష: నిశ్చయంగా అల్లాహ్ మరియు దేవదూతల మరియు సర్వమానవుల శాపం వారిపై పడటమే!

**88.** అందులో (నరకంలో) వారు శాశ్వతంగా ఉంటారు. వారి శిక్ష ఏ మాత్రం తగ్గించబడదు మరియు వారికి వ్యవధి కూడా ఇవ్వబడదు.

**89.** కానీ, ఇక మీదట ఎవరైతే పశ్చాత్తాప పడి, తమ నడవడికను సరిదిద్దుకుంటారో! అలాంటి వారి యెడల నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణాప్రదాత[50].

**90.** (అయితే) నిశ్చయంగా, విశ్వసించిన తరువాత ఎవరు సత్యతిరస్కార పైఖరిని అవలంబిస్తారో మరియు తమ సత్యతిరస్కార పైఖరిని పెంచుకుంటారో, వారి పశ్చాత్తాపం ఏ మాత్రం అంగీకరించ బడదు మరియు అలాంటి వారే

---

[50] అన్సార్ లలో నుండి ఒకడు ఇస్లాం స్వీకరించిన తరువాత 'ముర్తద్' అంటే ఇస్లాంను విడిచి పెట్టి, మళ్ళీ ముష్రిక్ అవుతాడు. కాని అతి త్వరలోనే అతనికి తన తప్పు అర్థమవుతుంది. అతడు ఇతరుల ద్వారా దైవప్రవక్త ('స'అస) దగ్గరికి: "ఏమీ? నా పశ్చాత్తాపం అంగీకరించబడునా?" అనే విన్నపం పంపిస్తాడు. అప్పుడు ఈ ఆయత్ లు అవతరింపజేయబడ్డాయి.

మార్గభ్రష్టులైన వారు[51].

91. నిశ్చయంగా, ఎవరైతే సత్యతిరస్కారులై, ఆ సత్యతిరస్కార స్థితిలోనే మృతి చెందుతారో! వారు భూగోళమంత బంగారం పాపపరిహారంగా ఇవ్వదలిచినా అది అంగీకరించబడదు. అలాంటి వారికి బాధాకరమైన శిక్ష ఉంటుంది. మరియు వారికి సహాయం చేసేవారు ఎవ్వరూ ఉండరు[52].

92. మీకు అత్యంత ప్రీతికరమైన దానిని మీరు (అల్లాహ్ మార్గంలో) ఖర్చు పెట్టనంత వరకు మీరు పుణ్యాత్ములు (ధర్మనిష్ఠాపరులు) కాలేరు[53]. మరియు మీరు ఏమి ఖర్చుపెట్టినా అది అల్లాహ్ కు తప్పక తెలుస్తుంది.

93. ఆహార పదార్థాలన్నీ ఇస్రాయీల్ సంతతివారికి ధర్మసమ్మతమైనవిగానే ఉండేవి. కాని, తౌరాత్ అవతరణకు పూర్వం ఇస్రాయీల్ (యఅఖూబ్)

---

[51] ఇక్కడ పశ్చాత్తాపం, మరణ సమయం ఆసన్నమైనప్పుడు చేసే పశ్చాత్తాపం, అని అర్థం. ఎందుకంటే అల్లాహ్ (సు.తా.) తన దాసుల పశ్చాత్తాపాన్ని అంగీకరిస్తానని దివ్యఖుర్ఆన్ లో ఎన్నోసార్లు అన్నాడు. ఉదాహరణకు 42:25, 9:104. కాని జీవితమంతా పాపాలు చేసి, మరణ సమయం ఆసన్నమైనప్పుడు పశ్చాత్తాప పడితే వారి పశ్చాత్తాపాన్ని అంగీకరించనని 4:18లో వ్యక్తం చేశాడు.

[52] చూడండి, 'స. బు'ఖారీ, పుస్తకం - 8, 'హదీస్' నం. 546. ఇంకా చూడండి, 2:123, 14:31.

[53] ఏ వస్తువు దానం చేసినా పుణ్యం దొరుకుతుంది. కాని తనకు నచ్చిన వస్తువులలో నుండి దానం చేస్తే దానికి ఎంతో గొప్ప పుణ్యం లభిస్తుంది. దానానికి పేదవారైన దగ్గరి బంధువులు ఎవరినైతే పోషించడం విధి కాదో వారు ఎక్కువ హక్కుదారులు. ఇంకా చూడండి, 2:177.

తనకు తాను కొన్ని వస్తువులను నిషేధించుకున్నాడు. వారితో ఇట్లను: "మీరు సత్యవంతులే అయితే, తౌరాత్ ను తీసుకొని రండి మరియు దానిని చదవండి[54]."

**94.** కావున దీని తర్వాత కూడా ఎవడైనా అబద్ధాన్ని కల్పించి దానిని అల్లాహ్ కు ఆపాదిస్తే, అలాంటి వారు, వారే దుర్మార్గులు.

**95.** ఇలా అను: "అల్లాహ్ సత్యం పలికాడు. కనుక మీరు ఏకదైవసిద్ధాంతం (సత్యధర్మం) అయిన ఇబ్రాహీమ్ ధర్మాన్నే అనుసరించండి. మరియు అతను అల్లాహ్ కు సాటి కల్పించేవాడు (ముష్రిక్) కాడు."

**96.** నిశ్చయంగా, మానవజాతి కొరకు మొట్టమొదట నియమించబడిన (ఆరాధనా) గృహం బక్కాలో (మక్కాలో) ఉన్నదే, శుభాలతో నిండినది సమస్త

---

[54] ఇబ్రాహీమ్ ('అ.స.) ధర్మంలో ఒంటె మాంసం మరియు దాని పాలు 'హరాం కావు. కాని ఇస్రాయీ'ల్ (య'అఖూబ్'అ.స.) తానే స్వయంగా వీటిని 'హరాం చేసుకున్నాడు. తౌరాత్ మూసా ('అ.స.)పై అవతరింప జేయబడింది. అది య'అఖూబ్ ('అ.స.) గతించిన ఎన్నో సంవత్సరాల తర్వాత అవతరింపజేయబడింది. కావున ఇక్కడ అల్లాహ్ (సు.తా.) ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాడు. మరియు తౌరాత్ లో 'హరాం చేయబడిన వస్తువులు, యూదులు చేసిన దుర్మార్గాలకు ఫలితంగా 'హరాం చేయబడ్డాయి. అవి ఇబ్రాహీం ('అ.స.) కాలంలో 'హరాం చేయబడలేదు. చూడండి, 4:160 మరియు 6:146, (అయ్ సర్ అత్ - తఫాసీర్).

లోకాల ప్రజలకు మార్గదర్శకత్వాన్ని ప్రసాదించేది[55].
97. అందులో స్పష్టమైన సంకేతాలు ఉన్నాయి. ఇబ్రాహీమ్ నిలిచిన స్థలం ఉంది. మరియు దానిలో ప్రవేశించినవాడు అభయం (రక్షణ) పొందుతాడు[56]. మరియు అక్కడికి పోవటానికి, శక్తిగలవారికి ఆ గృహయాత్ర (హిజ్జుల్ బైత్) అల్లాహ్ (ప్రసన్నత) కొరకు చేయటం, విధిగా చేయబడింది[57]. ఎవరు దీనిని తిరస్కరిస్తారో! వారు నిశ్చయంగా, అల్లాహ్ సమస్త లోకాల వారి అవసరం లేని స్వయం సమృద్ధుడు (అని తెలుసుకోవాలి).
98. ఇలా అను: "ఓ గ్రంథప్రజలారా! మీరు అల్లాహ్ సందేశాలను ఎందుకు తిరస్కరిస్తున్నారు?

---

[55] చూడండి, 2:125. మక్కాలోని క'అబహ్ పవిత్ర గృహాన్ని ఇబ్రాహీమ్ ('అ.స.) - ఇస్మాయీ'ల్ ('అ.స.) సహాయంతో - అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞానుసారంగా నిర్మించారు. ఇది జెరూసలంలోని - సులైమాన్ ('అ.స.) నిర్మించిన - బైతుల్ మ'ఖ్దిస్ (పవిత్ర గృహం) కంటే ఎంతో ప్రాచీనమైన ఆరాధనా గృహం. కావున ము'హమ్మద్ ('స.అస) - అల్లాహుతా'ఆలా ఆజ్ఞతో - నమా'జ్ చేసేటప్పుడు తమ ముఖాన్ని క'అబహ్ ('హరమ్) వైపునకు చేయగోరారు. ఇది మానవజాతి కొరకు నిర్మించబడిన మొట్టమొదటి ఆరాధనాలయం

[56] 'హరమ్ సరిహద్దులలో యుద్ధం, హత్య, వేటాడటం మరియు చెట్లను కోయటం కూడా నిషేధించ బడ్డాయి. ('స'హీ'హ్ బు'ఖారీ మరియు 'స'హీ'హ్ ముస్లిం).

[57] ముస్లింలకు ఎవరైతే ఆరోగ్యవంతులై ఉండి 'హజ్ చేయటానికి కావలసిన ఖర్చులు భరించగలిగి వుండి, శాంతియుతంగా ఎలాంటి ధన, ప్రాణ హాని లేకుండా 'హజ్ కు పోగలరో, వారి కొరకు వారి జీవితంలో ఒక్కసారి 'హజ్ యాత్రకు పోవటం విధిగా చేయబడింది, (ఇబ్నె - కసీ'ర్). చూడండి, 'స. బు'ఖారీ, పుస్తకం - 2, అధ్యాయం - 1; 'స.ముస్లిం పుస్తకం - 1, అధ్యాయం - 52.

మరియు మీరు చేసే కర్మలన్నింటికీ అల్లాహ్ సాక్షిగా[58] ఉన్నాడు!"

**99.** ఇంకా ఇలా అను: "ఓ గ్రంథ ప్రజలారా! మీరు దానికి (సత్యమార్గానికి) సాక్ష్యులుగా ఉండి కూడా అది వక్రమార్గమని చూపదలచి, విశ్వసించిన వారిని అల్లాహ్ మార్గంపై నడవకుండా ఎందుకు ఆటంకపరుస్తున్నారు?[59] మరియు అల్లాహ్ మీ కర్మల పట్ల నిర్లక్ష్యంగా లేడు."

**100.** ఓ విశ్వసించిన ప్రజలారా! మీరు గ్రంథ ప్రజల (కొందరి) మాటలు విని వారిని అనుసరిస్తే! వారు మిమ్మల్ని, విశ్వసించిన తరువాత కూడా సత్యతిరస్కారులుగా మార్చి వేస్తారు.

**101.** మరియు అల్లాహ్ సందేశాలు మీకు చదివి వినిపించబడుతూ ఉన్నప్పుడు మరియు ఆయన సందేశహరుడు మీలో ఉన్నప్పుడు; మీరు ఎలా సత్యతిరస్కారులు కాగలరు? మరియు మీలో ఎవడు స్థిరంగా అల్లాహ్ ను ఆశ్రయిస్తాడో, అతడు నిశ్చయంగా, ఋజుమార్గం వైపునకు మార్గదర్శకత్వం పొందినవాడే!

**102.** ఓ విశ్వసించిన ప్రజలారా! మీరు కర్తవ్యపాలనగా అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి. మరియు మీరు అల్లాహ్ కు విధేయులుగా

---

[58] షహీదున్ (అష్-షహీదు): All-Witness, The Omniscient. He from whose knowledge nothing is hidden. సర్వసాక్షి, అన్నీ ఎరిగిన, తన జ్ఞానంతో ప్రతిచోట ఉండేవాడు. చూడండి, 5:117, 58:6.

[59] చూడండి, 2:42.

(ముస్లింలుగా) ఉన్న స్థితిలో తప్ప మరణించకండి!
103. మీరందరూ కలసి అల్లాహ్ త్రాడు (ఖుర్ఆన్)ను గట్టిగా పట్టుకోండి. మరియు విభేదాలలో పడకండి[60]. అల్లాహ్ మీ యెడల చూపిన అనుగ్రహాలను జ్ఞాపకం చేసుకోండి; మీరు ఒకరికొకరు శత్రువులుగా ఉండేవారు, ఆయన మీ హృదయాలను కలిపాడు. ఆయన అనుగ్రహం వల్లనే మీరు పరస్పరం సోదరులయ్యారు. మరియు మీరు అగ్నిగుండం ఒడ్డున నిలబడినప్పుడు ఆయన మిమ్మల్ని దాని నుండి రక్షించాడు. ఈ విధంగా అల్లాహ్ తన సూచనలను మీకు స్పష్టం చేస్తున్నాడు. బహుశా మీరు మార్గదర్శకత్వం పొందుతారని!
104. మీలో ఒక వర్గం, (ప్రజలను) మంచి మార్గం వైపునకు పిలిచేదిగా, ధర్మాన్ని (మంచిని) ఆదేశించేదిగా (బోధించేదిగా) మరియు అధర్మాన్ని (చెడును) నిషేధించేదిగా (నిరోధించేదిగా) ఉండాలి[61]. మరియు అలాంటి వారు, వారే

[60] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: "యూదులు 71 తెగులుగా, క్రైస్తవులు 72 తెగలుగా విభజింపబడ్డారు. కాని నా సమాజం వారు 73 తెగలుగా విభజింపబడతారు. వారిలో ఒక్క తెగ తప్ప అందరూ నరకంలో పడవేయబడతారు. ఆ ఒక్క తెగ ఎవరంటే, ఏ విధానంపై నేను మరియు నా 'స'హాబా (ర'ది.'అన్హుమ్) ఉన్నామో దానిని అనుసరించేవారు. అంటే ఖుర్ఆన్ మరియు దైవప్రవక్త ('స.'అస) యొక్క సున్నత్ పై అమలు చేసేవారు." (తిర్మిజీ', ఇబ్నె - మాజా, అబూ - దావూద్).

[61] ఇటువంటి వాక్యానికి చూడండి, 3:110, 114, 9:71, 112 మరియు 22:41.

సాఫల్యం పొందేవారు.

**105.** స్పష్టమైన ఉపదేశాలను పొందిన తరువాత కూడా ఎవరైతే, (వేర్వేరు తెగలుగా) చీలి పోయారో మరియు విభేదాలకు గురి అయ్యారో, వారి మాదిరిగా మీరూ కావద్దు[62]. మరియు అలాంటి వారికి ఘోరశిక్ష ఉంటుంది.

**106.** ఆ (తీర్పు) దినమున కొందరి ముఖాలు (సంతోషంతో) ప్రకాశిస్తూ ఉంటాయి. మరికొందరి ముఖాలు (దుఃఖంతో) నల్లబడి ఉంటాయి. ఇక ఎవరి ముఖాలు నల్లబడి ఉంటాయో వారితో: "మీరు విశ్వసించిన తరువాత సత్యతిరస్కారులు అయ్యారు కదా? కాబట్టి మీరు సత్యాన్ని తిరస్కరించినందుకు ఈ శిక్షను అనుభవించండి." (అని అనబడుతుంది).

**107.** ఇక ఎవరి ముఖాలు ప్రకాశిస్తూ ఉంటాయో వారు అల్లాహ్ కారుణ్యంలో (స్వర్గంలో) ఉంటారు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు.

**108.** (ఓ ప్రవక్తా!) ఇవి అల్లాహ్ సూక్తులు (ఆయాత్) మేము వాటిని యథాతథంగా నీకు వినిపిస్తున్నాము. మరియు అల్లాహ్ సర్వలోకాల వారికి అన్యాయం చేయగోరడు.

**109.** మరియు ఆకాశాలలో ఉన్నదంతా మరియు భూమిలో ఉన్నదంతా అల్లాహ్ కే చెందు తుంది. మరియు వ్యవహారాలన్నీ (తీర్పు కొరకు) అల్లాహ్

---

[62] యూదులు మరియు క్రైస్తవుల మాదిరిగా చూడండి, 6:159.

వైపునకే మరలింపబడతాయి.

**110.** మీరే (విశ్వాసులే) మానవజాతి (హితం) కొరకు నిలబెట్టబడిన ఉత్తమ సమాజం వారు. మీరు ధర్మాన్ని ఆదేశించే (బోధించే) వారు మరియు అధర్మాన్ని నిషేధించే (నిరోధించే) వారు మరియు మీరుఅల్లాహ్‌యందువిశ్వాసంకలిగిఉన్నవారు[63]. మరియు ఒకవేళ గ్రంథప్రజలు విశ్వసిస్తే, వారికే మేలై ఉండేది. వారిలో కొందరు విశ్వాసులు కూడా ఉన్నారు[64]. కాని అత్యధికులు అవిధేయులే (ఫాసిఖూన్).

**111.** వారు మిమ్మల్ని కొంత వరకు బాధించటం తప్ప, మీకు ఏ విధమైన హాని కలిగించజాలరు. మరియు వారు మీతో యుద్ధం చేసినట్లయితే, మీకు వీపు చూపించి పారిపోతారు. తరువాత వారికెలాంటి సహాయం లభించదు.

**112.** వారు ఎక్కడున్నా, అవమానానికే గురి చేయబడతారు, అల్లాహ్ శరణులోనో లేక మానవుల అభయంలోనో ఉంటేనే తప్ప; వారు అల్లాహ్ ఆగ్రహానికి గురి అయ్యారు మరియు వారు అధోగతికి చేరారు. ఇది వారు అల్లాహ్ సూచనలను తిరస్కరించినందుకు మరియు అన్యాయంగా

---

[63] అబూహురైరా కథనం:"మీరే (సత్యధర్మమైన ఇస్లాంను మరియు దైవప్రవక్త ('స'అస) సున్నతులను అనుసరించే వారే), ఉత్తమమైన మానవసమాజానికి చెందినవారు." ('స. బు'ఖారీ పుస్తకం - 6, 'హదీస్' నం. 80).

[64] 'అబ్దుల్లాహ్ బిన్ - సల్లాం (ర'ది. 'అ.) వంటి వారు.

మరియు హద్దులు మీరి ప్రవర్తించిన దాని పర్యవసానం[65].

**113.** వారందరూ ఒకే రకమైన వారు కారు. గ్రంథ ప్రజలలో కొందరు సరైన మార్గంలో ఉన్న వారున్నారు; వారు రాత్రివేళలందు అల్లాహ్ సూక్తులను (ఆయాత్ లను) పఠిస్తూ ఉంటారు మరియు సాష్టాంగం (సజ్దా) చేస్తూ ఉంటారు.

**114.** వారు అల్లాహ్ ను మరియు అంతిమ దినాన్ని విశ్వసిస్తారు మరియు ధర్మాన్ని ఆదేశిస్తారు (బోధిస్తారు) మరియు అధర్మాన్ని నిషేధిస్తారు (నిరోధిస్తారు) మరియు మంచి పనులు చేయటంలో పోటీ పడతారు మరియు ఇలాంటి వారే సత్పురుషులలోని వారు.

**115.** మరియు వారు ఏ మంచిపని చేసినా అది వృథా చేయబడదు.

మరియు దైవభీతి గలవారెవరో అల్లాహ్ కు బాగా తెలుసు[66].

**116.** నిశ్చయంగా, సత్యతిరస్కారానికి పాల్పబడిన వారికి, వారి సంపద గానీ, వారి సంతానం గానీ, అల్లాహ్ ముందు ఏమీ పనికి రావు. మరియు అలాంటివారు నరకాగ్ని వాసులే. అందు వారు శాశ్వతంగా ఉంటారు.

**117.** వారు ఈ ఇహలోక జీవితంలో చేస్తున్న ధన

---

[65] ఇది యూదులను గురించి చెప్పబడింది.

[66] చూడండి, 3:199.

వ్యయాన్ని, తమకు తాము అన్యాయం చేసుకున్న వారి పొలాలపై వీచి వాటిని సమూలంగా నాశనం చేసే, మంచు గాలితో పోల్చవచ్చు. మరియు అల్లాహ్ వారి కెలాంటి అన్యాయం చేయలేదు. కానీ వారే తమకు తాము అన్యాయం చేసుకున్నారు[67].

**118.** ఓ విశ్వాసులారా! మీరు మీ వారిని (విశ్వాసులను) తప్ప ఇతరులను మీ సన్నిహిత స్నేహితులుగా చేసుకోకండి. వారు మీకు హాని కలిగించే ఏ అవకాశాన్నైనా ఉపయోగించు కోవటానికి వెనుకాడరు. వారు మిమ్మల్ని ఇబ్బందిలో చూడగోరుతున్నారు. మరియు వారి ఈర్ష్య వారి నోళ్ళ నుండి బయటపడుతున్నది. కాని వారి హృదయాలలో దాచుకున్నది దాని కంటే తీవ్రమైనది. వాస్తవానికి మేము ఈ సూచనలను మీకు స్పష్టం చేశాము. మీరు అర్థం చేసుకోగలిగితే (ఎంత బాగుండేది)![68]

**119.** అవును! మీరైతే వారిని ప్రేమిస్తున్నారు. కాని వారు మిమ్మల్ని ప్రేమించటం లేదు. మరియు

---

[67] సత్యతిరస్కారుల దానధర్మాలు గానీ, పుణ్యకార్యాలు గానీ వారికి పరలోక జీవితంలో ఏ విధంగాను పనికి రావు ఎందుకంటే విశ్వాసం లేని దానాలు ఫలించవు. మోక్షానికి మూలం విశ్వాసమే. చూ, 3:85.

[68] చూడండి, 60:8-9 ఎవరైతే మీ ధర్మం కారణంగా మిమ్మల్ని విరోధించక మీకు హాని చేయక, మిమ్మల్ని మీ ఇండ్ల నుండి వెళ్ళగొట్టరో, అట్టివారితో మీరు కరుణతో న్యాయంతో వ్యవహరించండి. కాని ఎవరైతే మీ ధర్మం కారణంగా మీతో పోరాడి మిమ్మల్ని మీ ఇండ్ల నుండి వెళ్ళగొడతారో, అలాంటి వారు మీ స్నేహితులు కారు, వారితో ధర్మయుద్ధం (జిహాద్) చేయండి.

మీరు దివ్యగ్రంథాలన్నింటినీ విశ్వసిస్తున్నారు. వారు మీతో కలసినపుడు: "మేము విశ్వసించాము." అని అంటారు. కాని వేరుగా ఉన్నప్పుడు, మీ ఎడల ఉన్న క్రోదావేశం వల్ల తమ వ్రేళ్ళను కొరుక్కుంటారు. వారితో: "మీ క్రోధావేశంలో మీరే మాడి చావండి. నిశ్చయంగా, హృదయాలలో దాగి ఉన్నదంతా అల్లాహ్ కు బాగా తెలుసు." అని అను.

120. మీకేదైనా మేలు కలిగితే వారికది దుఃఖం కలిగిస్తుంది మరియు మీకేదైనా కీడు కలిగితే వారికది సంతోషం కలిగిస్తుంది. మరియు మీరు సహనం వహించి దైవభీతి కలిగి ఉంటే, వారి కుట్ర మీకెలాంటి నష్టం కలిగించ జాలదు. నిశ్చయంగా, అల్లాహ్ వారు చేసే దానినంతా పరివేష్టించి ఉన్నాడు.

121. మరియు (ఓ ప్రవక్తా! ఆ దినాన్ని జ్ఞాపకం చేసుకో) నీవు వేకుజామున నీ ఇంటి నుండి బయలుదేరి (ఉహుద్ క్షేత్రంలో) విశ్వాసులను వారి వారి యుద్ధ స్థానాలలో నియమించటానికి వెళ్ళావు. మరియు

అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు[69].

**122.** అప్పుడు మీలోని రెండు వర్గాల వారు పిరికితనం

---

[69] ఈ ఆయత్ ఉహుద్ యుద్ధం గురించి తెలియజేస్తుందని ధర్మవేత్తల అభిప్రాయం. అది 3వ హిజ్రీ, షవ్వాల్ నెలలో జరిగింది. 2వ హిజ్రీ రమ'దాన్ నెలలో జరిగిన బద్ర్ యుద్ధంలో మక్కా ముష్రికుల సంఖ్య దాదాపు 1000 ఉండెను. వారి వద్ద మంచి యుద్ధసామగ్రి ఉండెను. ముస్లింలు కేవలం 313మంది మాత్రమే ఉన్నప్పటికీ, వారి వద్ద సరియైన యుద్ధసామగ్రి లేకపోయినప్పటికీ అల్లాహుతా'ఆలా సహా'యంతో వారు ముష్రికులను ఓడించి వారిలో 70మందిని సంహరించి, 70మందిని బందీలుగా చేసుకుంటారు. దాని ప్రతీకారం తీర్చుకునేందుకు మక్కా ఖురైషీయులు 3వ హిజ్రీ షవ్వాల్ నెలలో దాదాపు 3000మంది యుద్ధ వీరులతో మదీనాకు 3 మైళ్ళ దూరంలో ఉన్న ఉహుద్ పర్వతం వద్దకు చేరుకుంటారు. దైవప్రవక్త (స'అస) ఇది తెలుసుకొని తమ సహా'బీలతో సంప్రదిస్తారు. దైవప్రవక్త (స'అస) ఉద్దేశం, మరికొందరు నాయకుల ఉద్దేశం, మదీనా నగరం లోపలనే ఉండి యుద్ధం చేయాలని. కపటవిశ్వాసుల నాయకుడు, 'అబ్దుల్లాహ్ బిన్ - ఉబై కూడా అదే కోరుతాడు. కాని అనేకమంది ముస్లింలు మదీనా నుండి బయటికిపోయి పోరాడాలని కోరుతారు. దైవప్రవక్త (స'అస) వారి కోరికపై యుద్ధసామగ్రి ధరించి తన ఇంటి నుండి బయటికి వస్తారు. ఈవిధంగా దాదాపు 1000మంది ముస్లింలతో యుద్ధానికి సిద్ధమై ఉహుద్ వైపునకు పోతూ ఉండగా కపట విశ్వాసుల నాయకుడు 'అబ్దుల్లాహ్ బిన్ ఉబై - తన మాటను గౌరవించలేదనే సాకుతో - తన 300 మంది అనుచరులతో యుద్ధంలో పాల్గొనకుండా, వెనుదిరిగి పోతాడు. 700 మంది విశ్వాసులు మాత్రమే దైవప్రవక్త (స'అస) తో పాటు ఉహుద్ కు చేరుతారు. అక్కడ 50 మంది బాణాలను బాగా ప్రయోగించగలిగే, విలుకాండ్రను ఒక చిన్న కొండమీద ఉంచి మీరు ఎట్టి పరిస్థితిలోను మీ చోటు విడిచి యుద్ధమైదానంలోకి రావద్దని ఆజ్ఞాపిస్తారు. యుద్ధం ప్రారంభమై ముస్లింలు విజయం పొందుతారు. ముష్రికులు పారిపో సాగుతారు. అది చూసి ఆ విలుకాండ్రు విజయ ధనం దోచుకోవటానికి తమ స్థానాలను విడచి కొండ దిగి వస్తారు. అది చూసి (అప్పుడు ముష్రిక్ గా ఉన్న) 'ఖాలిద్ బిన్ వలీద్ ఒక బృందాన్ని తీసుకొని వెనుక నుండి ముస్లింలపై దాడి చేస్తాడు. ఆకస్మాత్తుగా సంభవించిన ఈ పరిణామంతో ముస్లింలు కలవరపడతారు, ఎంతో మంది తమ ప్రాణాలను కోల్పోతారు. మరియు దైవప్రవక్త (స'అస) కూడా గాయపడి, క్రింద పడి పోతారు. దానితో ఆయన మరణించారని తలచి ముస్లింలు అటూ ఇటూ పారిపో సాగుతారు. కాని 'ఉమర్ మరియు తల్హా (ర'ది.'అన్హుమ్ లు) ఇక దైవప్రవక్తయే లేకుంటే మనము బ్రతికి ప్రయోజనమేమిటని ప్రేరేపించటం వల్ల ముస్లింలు తిరిగి ఐకమత్యంతో పోరాడుతారు. దానితో ఖురైషీలు వెనుదిరిగి పారిపోతారు.

చూపబోయారు; మరియు అల్లాహ్ వారికి సంరక్షకుడుగా ఉన్నాడు[70] మరియు విశ్వసించినవారు అల్లాహ్ యందే నమ్మకం ఉంచుకోవాలి.

**123.** బద్ర్ (యుద్ధం) నందు మీరు బలహీనులుగా ఉన్నప్పుడు అల్లాహ్ మీకు సహాయం (మిమ్మల్ని విజేతలుగా) చేశాడు. కాబట్టి మీరు కృతజ్ఞతాపరులై అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి!

**124.** (ఓ ప్రవక్తా!) నీవు విశ్వాసులతో : "ఏమీ? మీ ప్రభువు, ఆకాశం నుండి మూడు వేల దేవదూతలను దింపి మీకు సహాయం చేస్తున్నది చాలదా?" అని అడిగిన సందర్భాన్ని (జ్ఞాపకం చేసుకోండి!)

**125.** అవును! ఒకవేళ మీరు సహనం వహించి దైవభీతి కలిగి వుంటే, శత్రువు వచ్చి ఆకస్మాత్తుగా మీపై పడినా, మీ ప్రభువు ఐదువేల ప్రత్యేక చిహ్నాలు గల దేవదూతలను పంపి మీకు సహాయం చేయవచ్చు![71]

**126.** అల్లాహ్ మీకు ఈ విషయాన్ని తెలిపింది మీకు శుభవార్త ఇవ్వటానికి మరియు మీ హృదయాలకు తృప్తి కలుగ జేయటానికి మాత్రమే. మరియు

---

[70] ఈ రెండు తెగల వారు 'ఔస్ మరియు 'ఖజ్ రజ్ అనే అన్సార్ తెగలకు చెందిన, బనూ 'హారిసా' మరియు బనూ సల్మా వర్గాలకు చెందిన వారు. కాని అల్లాహ్ (సు.తా.) అనుగ్రహం వలన వారి హృదయాలు దృఢపడతాయి.

[71] చూడండి, 8:9-10.

సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడైన అల్లాహ్ తప్ప, ఇతరుల నుండి సహాయం (విజయం) రాజాలదు కదా!

127. ఆయన ఇదంతా సత్యతిరస్కారంపై నడిచేవారిని కొందరిని నశింపజేయటానికి, లేదా వారు ఘోర పరాజయం పొంది ఆశాభంగంతో వెనుదిరిగి పోవటానికి (చేశాడు).

128. (ఓ ప్రవక్తా!)ఈ విషయమునందు నీ కెలాంటి అధికారం లేదు[72]. ఆయన (అల్లాహ్) వారిని క్షమించవచ్చు, లేదా వారిని శిక్షించవచ్చు. ఎందుకంటే నిశ్చయంగా, వారు దుర్మార్గులు.

129. మరియు ఆకాశాలలో ఉన్నదంతా మరియు భూమిలో ఉన్నదంతా అల్లాహ్ కే చెందుతుంది. ఆయన తాను కోరిన వారిని క్షమిస్తాడు మరియు తాను కోరిన వారిని శిక్షిస్తాడు. మరియు అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణాప్రదాత.

130. ఓ విశ్వాసులారా! ఇబ్బడిముబ్బడిగా పెరిగే ఈ వడ్డీని తినకండి. మరియు మీరు సాఫల్యం పొందటానికి అల్లాహ్ యందు భయభక్తులు

[72] అంటే ఈ సత్యతిరస్కారులను విశ్వాసం వైపునకు మరల్చటం గానీ, లేక వారి విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవటం గానీ కేవలం అల్లాహుతా'ఆలా అధికారంలోనే ఉంది.

కలిగి ఉండండి[73].

131. మరియు సత్యతిరస్కారుల కొరకు సిద్ధం చేయబడిన నరకాగ్నికి భీతిపరులై ఉండండి.

132. మరియు మీరు కరుణింపబడటానికి అల్లాహ్ కు మరియు సందేశహరునికి విధేయులై ఉండండి[74].

133. మరియు మీ ప్రభువు క్షమాభిక్ష కొరకు మరియు స్వర్గవాసం కొరకు ఒకరితోనొకరు పోటీ పడండి; అది భూమ్యాకాశాలంత విశాలమైనది; అది దైవభీతిగలవారికై సిద్ధ పరచపడింది.

134. (వారి కొరకు) ఎవరైతే కలిమిలోనూ మరియు లేమిలోనూ (అల్లాహ్ మార్గంలో) ఖర్చు చేస్తారో మరియు తమ కోపాన్ని నిగ్రహించుకుంటారో మరియు ప్రజలను క్షమిస్తారో! అల్లాహ్ సజ్జనులను ప్రేమిస్తాడు[75].

135. మరియు వారు, ఎవరైతే, అశ్లీల పనులు చేసినా,

---

[73] చూడండి, 2:278, అబూహురైరా (ర'ది.'అ.) కథనం, దైవప్రవక్త ('స'అస) ఇలా సెలవిచ్చారు: "ఏడు మహా పాపాల నుండి దూరంగా ఉండండి." స'హాబా (ర'ది.'అన్హుమ్) అడిగారు : "ఓ ప్రవక్తా ('స'అస)! అవి ఏమిటి?" దైవప్రక్త ('స'అస) ఇలా సమాధానమిచ్చారు : "అవి 1) ఆరాధనలలో అల్లాహ్ (సు. తా.) కు భాగస్వాములను కల్పించటం, 2) మంత్ర తంత్రాలు చేయటం, 3) అల్లాహుతా'ఆలా నిషేధించిన ప్రాణిని అన్యాయంగా చంపటం, 4) వడ్డీ తినటం, 5) అనాథుల ఆస్తిని కబళించటం, 6) యుద్ధరంగంలో పిరికితనంతో శత్రువుకు వెన్ను చూపి పారిపోవటం, 7) పతివ్రత స్త్రీలపై నిందలు మోపటం." ('స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 4, 'హదీస్' నం. 28).

[74] చూడండి, 3:85.

[75] 'స. బు'ఖారీ, పుస్తకం-4, 'హదీస్' నం. 141 మరియు 'స. బు'ఖారీ, పుస్తకం - 8, 'హదీస్' నం. 135.

లేదా తమకు తాము అన్యాయం చేసుకున్నా, అల్లాహ్ ను స్మరించి తమ పాపాలకు క్షమాపణ వేడుకుంటారో! మరియు అల్లాహ్ తప్ప, పాపాలను క్షమించ గలవారు ఇతరులు ఎవరున్నారు? మరియు వారు తాము చేసిన (తప్పులను), బుద్ధిపూర్వకంగా మూర్ఖపు పట్టుతో మళ్ళీ చేయరు![76]

**136.** ఇలాంటి వారి ప్రతిఫలం, వారి ప్రభువు నుండి క్షమాభిక్ష మరియు క్రింద సెలయేళ్ళు ప్రవహించే స్వర్గవనాలు. వారక్కడ శాశ్వతంగా ఉంటారు. సత్కార్యాలు చేసేవారికి ఎంత శ్రేష్ఠమైన ప్రతిఫలం ఉంది!

**137.** మీకు పూర్వం ఇలాంటి ఎన్నో సంప్రదాయాలు (తరాలు) గడిచి పోయాయి. సత్యాన్ని తిరస్కరించిన వారి గతి ఏమయిందో మీరు భూమిలో సంచారం చేసి చూడండి.

**138.** ఇది (ఈ ఖుర్ఆన్) ప్రజల కొరకు ఒక స్పష్టమైన వ్యాఖ్యానం మరియు దైవభీతి గల వారికి మార్గదర్శకత్వం మరియు హితోపదేశం.

**139.** కాబట్టి మీరు బలహీనత కనబరచకండి మరియు దుఃఖపడకండి మరియు మీరు విశ్వాసులే అయితే, మీరే తప్పక ప్రాబల్యం పొందుతారు.

**140.** ఒకవేళ ఇప్పుడు మీరు గాయపడితే, వాస్తవానికి ఆ జాతివారు (మీ విరోధులు) కూడా ఇదే విధంగా

---

[76] చూడండి, 42:25.

గాయపడ్డారు[77]. మరియు మేము ఇలాంటి దినాలను ప్రజల మధ్య త్రిప్పుతూ ఉంటాము. మరియు అల్లాహ్, మీలో నిజమైన విశ్వాసులెవ్వరో చూడటానికి మరియు (సత్యస్థాపనకు) తమ ప్రాణాలను త్యాగం చేయగల వారిని ఎన్నుకోవటానికి ఇలా చేస్తూ ఉంటాడు. మరియు అల్లాహ్ దుర్మార్గులను ప్రేమించడు.

**141.** మరియు అల్లాహ్ విశ్వాసులను పరిశుద్ధులుగా[78] చేయటానికీ మరియు సత్యతిరస్కారులను అణచివేయటానికీ (ఈ విధంగా చేస్తాడు).

**142.** ఏమీ? మీలో ఆయన మార్గంలో ప్రాణాలు తెగించి పోరాడేవారు (ధర్మయోధులు) ఎవరో, అల్లాహ్ చూడక ముందే మరియు సహనం చూపేవారు ఎవరో చూడకముందే, మీరు స్వర్గంలో ప్రవేశించ గలరని భావిస్తున్నారా?[79]

**143.** మరియు వాస్తవానికి మీరు (అల్లాహ్ మార్గంలో మరణించాలని కోరుచుంటిరి![80] అది, మీరు దానిని ప్రత్యక్షంగా చూడక ముందటి విషయం;

---

[77] ఇది ఉ'హుద్ యుద్ధాన్ని సూచిస్తుంది.

[78] లియుమ'హ్హి'స: ఈ పదానికి మూడు అర్థాలున్నాయి. 1) to test, పరీక్షించుకటకు, 2) to purify, పరిశుద్ధపరచుటకు, 3) to get rid off, రద్దు చేయుటకు లేక తీసివేయుటకు. (తఫ్సీర్ అల్ - ఖుర్తుబీ).

[79] చూడండి, 2:214 మరియు 29:2.

[80] మీరు మీ శత్రువులతో పోరాడటానికి ఆశించకండి. అల్లాహ్ (సు.తా.) శరణుకోరండి. కాని పరిస్థితుల వల్ల యుద్ధం ఆవశ్యకమైతే ధైర్యస్థైర్యాలతో పోరాడండి. స్వర్గం కత్తుల ఛాయలో ఉందని తెలుసుకోండి. ('స'హీ'హైన్, ఇబ్నె - కసీ'ర్).

కాని, మీరు దానిని ఎదురు చూస్తుండగానే, వాస్తవానికి ఇప్పుడు అది మీ ముందుకు వచ్చేసింది.

**144.** మరియు ముహమ్మద్[81] కేవలం ఒక సందేశహరుడు మాత్రమే! వాస్తవానికి అతనికి పూర్వంఅనేకసందేశహరులుగడిచిపోయారు[82]. ఏమీ? ఒకవేళ అతను మరణిస్తే, లేక హత్యచేయబడితే, మీరు వెనుకంజ వేసి మరలిపోతారా? మరియు వెనుకంజ వేసి మరలి పోయేవాడు అల్లాహ్ కు ఏ మాత్రం నష్టం కలిగించలేడు. మరియు కృతజ్ఞతాపరులైన వారికి అల్లాహ్ తగిన ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు.

---

[81] ము'హమ్మద్ ('స'అస) పేరు ఖుర్ఆన్ లో 4 సార్లు వచ్చింది. ఇంకా చూడండి, 33:40, 47:2 మరియు 48:29. అ'హ్మద్ ('స 'అస) అని 61:6లో వచ్చింది.

[82] ఉ'హుద్ యుద్ధంలో ము'హమ్మద్ ('స'అస) మరణించారనే వార్త వ్యాపించగానే ముస్లింలు ధైర్యాన్ని కోల్పోయి, యుద్ధరంగం నుండి వెనుకంజ వేయసాగుతారు. అప్పుడు ఈ ఆయత్ అవతరింపజేయ బడింది. ఇంతకు ముందు కూడా సందేశహరులు హత్య చేయబడ్డారు. మరి దైవప్రవక్త ('స'అస) హత్య చేయబడితే మీరెందుకు వెనుకంజ వేయాలి? మీరు కూడా ధైర్యంతో, శత్రువులతో పోరాడి మరణిస్తే, స్వర్గానికి అర్హులవుతారు, విజయం పొందితే విజయధనానికి. కాని వెనుకంజ వేసి, మరణిస్తే, నరకం పాలవుతారు. లేదా యుద్ధఖైదీలై, బానిసలై మీ ఆత్మాభిమానాన్ని కోల్పోతారు. ఒక 'హదీస్': ము'హమ్మద్ ('స'అస) మరణించిన రోజు అబూబక్ర్ (ర'ది.'అ.) ఇలా అన్నారు: "ఎవరైతే ము'హమ్మద్ ('స'అస) ను ఆరాధిస్తారో, వారు ము'హమ్మద్ ('స'అస) గతించిపోయారని తెలుసుకోవాలి. కాని ఎవరైతే కేవలం అల్లాహ్(సు.తా.) ఆరాధిస్తారో, ఆయన నిత్యుడు, సజీవుడు అని తెలుసుకోవాలి" ('స. బు'ఖారీ)

145. అల్లాహ్ అనుమతి లేనిదే, ఏ ప్రాణి కూడా మరణించజాలదు, దానికి ఒక నియమిత కాలం వ్రాయబడి ఉంది. మరియు ఎవడైతే ఈ ప్రపంచ సుఖాన్ని కోరుకుంటాడో, మేము అతనికది నొసంగుతాము మరియు ఎవడు పరలోక సుఖాన్ని కోరుకుంటాడో అతనికది నొసంగుతాము. మరియు మేము కృతజ్ఞులైన వారికి తగిన ప్రతిఫలాన్ని ప్రసాదించగలము.

146. మరియు ఎందరో ప్రవక్తలు మరియు వారితో కలిసి ఎంతోమంది ధర్మవేత్తలు/దైవభక్తులు (రిబ్బీయ్యూన్) ధర్మయుద్ధాలు చేశారు, అల్లాహ్ మార్గంలో ఎదురైన కష్టాలకు వారు ధైర్యం విడువ లేదు మరియు బలహీనత కనబరచలేదు మరియు వారికి (శత్రువులకు) లోబడనూ లేదు. మరియు అల్లాహ్ ఆపదలలో సహనం వహించే వారిని ప్రేమిస్తాడు.

147. మరియు వారి ప్రార్థన కేవలం: "ఓ మా ప్రభూ! మా పాపాలను, మా వ్యవహారాలలో మేము మితిమీరి పోయిన వాటిని క్షమించు మరియు మా పాదాలకు స్థైర్యాన్ని ప్రసాదించు మరియు సత్యతిరస్కారులకు ప్రతికూలంగా మాకు విజయాన్ని ప్రసాదించు." అని పలకటం మాత్రమే!

148. కావున అల్లాహ్ వారికి ఇహలోకంలో తగిన ఫలితాన్ని మరియు పరలోకంలో ఉత్తమ ప్రతిఫలాన్ని ప్రసాదించాడు. మరియు అల్లాహ్

సజ్జనులను ప్రేమిస్తాడు.
149. ఓ విశ్వాసులారా! మీరు సత్యతిరస్కారుల సలహాలను పాటిస్తే, వారు మిమ్మల్ని వెనుకకు (అవిశ్వాసం వైపునకు) మరలిస్తారు. అప్పుడు మీరే నష్టపడిన వారవుతారు.
150. వాస్తవానికి! అల్లాహ్ యే మీ సంరక్షకుడు మరియు ఆయనే అత్యుత్తమ సహాయకుడు.
151. ఆయనఏవిధమైనప్రమాణంఅవతరింపజేయనిదే, అల్లాహ్ కు సాటి కల్పించినందుకు, మేము సత్యతిరస్కారుల హృదయాలలో ఘోర భయాన్ని కల్పిస్తాము. వారి ఆశ్రయం నరకాగ్నియే! అది దుర్మార్గులకు లభించే, అతి చెడ్డ నివాసం.
152. మరియు వాస్తవానికి అల్లాహ్ మీకు చేసిన తన వాగ్దానాన్ని సత్యపరచాడు. ఎప్పుడైతే మీరు ఆయన అనుమతితో, వారిని (సత్యతిరస్కారులను) చంపుతూ ఉన్నారో![83] తరువాత మీరు పిరికితనాన్ని ప్రదర్శించి, మీ కర్తవ్య విషయంలో పరస్పర విభేదాలకు గురి అయ్యి - ఆయన (అల్లాహ్) మీకు, మీరు వ్యామోహపడుతున్న దానిని చూపగానే - (మీ నాయకుని) ఆజ్ఞను ఉల్లంఘించారు[84]. (ఎందుకంటే) మీలో కొందరు ఇహలోకాన్ని కోరేవారున్నారు మరియు మీలో కొందరు పరలోకాన్ని కోరేవారున్నారు. తరువాత

[83] ఇది విశ్వాసులకు మొదట లభించిన విజయం.
[84] ఇది ఉ'హుద్ యుద్ధంలో గుట్ట మీద ఉంచబడిన 50 మంది విలుకాండ్ర విషయం.

మిమ్మల్ని పరీక్షించటానికి ఆయన (అల్లాహ్) మీరు మీవిరోధులను ఓడించకుండా చేశాడు[85] మరియు వాస్తవానికి ఇపుడు ఆయన మిమ్మలన్ని క్షమించాడు మరియు అల్లాహ్ విశ్వాసుల పట్ల ఎంతో అనుగ్రహుడు.

**153.** (జ్ఞాపకం చేసుకోండి!) ఎప్పుడయితే మీరు పారిపోతూ ఉన్నారో మరియు వెనుకకు కూడా తిరిగి ఎవరినీ చూడకుండా ఉన్నారో మరియు ప్రవక్త మీ వెనుక నుండి, మిమ్మల్ని పిలుస్తూ ఉన్నాడో! అప్పుడు (మీ ఈ వైఖరికి) ప్రతిఫలంగా (అల్లాహ్) మీకు దుఃఖం మీద దుఃఖం కలుగజేసాడు; మీరు ఏదైనా పోగొట్టుకున్నా, లేదా మీకు ఏదైనా ఆపద కలిగినా మీరు చింతించకుండా ఉండేందుకు. మరియు మీ కర్మలన్నింటినీ అల్లాహ్ బాగా ఎరుగును.

**154.** అప్పుడు ఈ దుఃఖం తరువాత ఆయన (అల్లాహ్) మీపై శాంతి భద్రతలను అవతరింప జేశాడు; దాని వల్ల మీలో కొందరికి కునుకుపాటు ఆవరించింది. కాని మరి కొందరు - కేవలం స్వంత ప్రాణాలకు ప్రాముఖ్యత నిచ్చేవారు, అల్లాహ్ ను గురించి పామరుల వంటి తప్పుడు ఊహలు చేసేవారు - ఇలా అన్నారు: "ఏమీ? ఈ వ్యవహారంలో మాకు ఏమైనా భాగముందా?" వారితో ఇలా అను: "నిశ్చయంగా,సమస్తవ్యవహారాలపైసర్వాధికారం

[85] శబ్దార్థప్రకారం: మీ విరోధుల యెదుట మిమ్మల్ని పారిపోయేటట్లు చేశాడు.

అల్లాహ్ దే!" వారు తమ హృదయాలలో దాచుకున్న దానిని నీకు వ్యక్తం చేయటం లేదు. వారు ఇంకా ఇలా అంటారు: "మాకు అధికారమే ఉండి వుంటే, మేము ఇక్కడ చంపబడి ఉండేవారము కాదు." వారికి ఇలా జవాబివ్వు: "ఒకవేళ మీరు మీ ఇళ్ళలోనే ఉండి వున్నప్పటికీ, మరణం వ్రాయ బడి ఉన్నవారు స్వయంగా తమ వధ్య స్థానాలకు తరలి వచ్చేవారు." మరియు అల్లాహ్ మీ గుండెలలో దాగి వున్న దానిని పరీక్షించటానికి మరియు మీ హృదయాలను పరిశుద్ధ పరచ టానికి ఇలా చేశాడు మరియు హృదయాలలో (దాగి) ఉన్నదంతా అల్లాహ్ కు బాగా తెలుసు.

**155.** రెండు సైన్యాలు (ఉహుద్ యుద్ధానికి) తలబడిన దినమున, వాస్తవానికి మీలో వెన్ను చూపిన వారిని - వారు చేసుకున్న వాటికి (కర్మలకు) ఫలితంగా - షైతాను వారి పాదాలను జార్చాడు. అయినా, వాస్తవానికి అల్లాహ్ వారిని క్షమించాడు. నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, సహనశీలుడు.

**156.** ఓ విశ్వాసులారా! మీరు సత్యతిరస్కారుల మాదిరిగా ప్రవర్తించకండి; వారు తమ సోదరులు ఎప్పుడైనా ప్రయాణంలో ఉంటే, లేదా యుద్ధంలో ఉంటే, (అక్కడ వారు ఏదైనా ప్రమాదానికి గురి అయితే) వారిని గురించి ఇలా అనేవారు: "ఒకవేళ వారు మాతోపాటు ఉండి వుంటే చనిపోయేవారు కాదు మరియు చంపబడేవారునూ కాదు!"

వాటిని (ఈ విధమైన మాటలను) అల్లాహ్ వారి హృదయ ఆవేదనకు కారణాలుగా చేస్తాడు. మరియు అల్లాహ్ యే జీవనమిచ్చేవాడు మరియు మరణమిచ్చేవాడు మరియు మీరు చేస్తున్నదంతా అల్లాహ్ చూస్తున్నాడు.[86]

**157.** మరియు మీరు అల్లాహ్ మార్గంలో చంపబడినా లేదా మరణించినా మీకు లభించే అల్లాహ్ క్షమాభిక్ష మరియు కారుణ్యం, నిశ్చయంగా మీరు కూడ బెట్టే వాటి అన్నిటి కంటే ఎంతో ఉత్తమమైనవి.

**158.** మరియు మీరు మరణించినా లేదా చంపబడినా, మీరందరూ అల్లాహ్ సమక్షంలో సమావేశపరచ బడతారు.

**159.** (ఓ ప్రవక్తా!) అల్లాహ్ యొక్క అపార కారుణ్యం వల్లనే నీవు వారి పట్ల మృదు హృదయుడవయ్యావు. నీవే గనక క్రూరుడవు, కఠిన హృదయుడవు అయి వుంటే, వారందరూ నీ చుట్టుప్రక్కల నుండి దూరంగా పారిపోయేవారు. కావున నీవు వారిని మన్నించు, వారి క్షమాపణ కొరకు (అల్లాహ్ ను) ప్రార్థించు మరియు వ్యవహారాలలో వారిని సంప్రదించు[87]. ఆ పిదప నీవు కార్యానికి సిద్ధమైనపుడు అల్లాహ్ పై ఆధారపడు. నిశ్చయంగా,

---

[86] చూడండి, 4:78.

[87] మీరు మీ వ్యవహారాలలో మీ తోటివారితో, మీ బంధువులతో, స్నేహితులతో సంప్రదింపులు చేయండి. కాని చివరకు నిర్ణయం తీసుకునేటప్పుడు అల్లాహ్ (సు.తా.) పై ఆదారపడండి. మీకు మంచిది అనిపించిన నిర్ణయం తీసుకోండి.

అల్లాహ్ తనపై ఆధారపడే వారిని ప్రేమిస్తాడు.

160. ఒకవేళ మీకు అల్లాహ్ సహాయమే ఉంటే, మరెవ్వరూ మీపై ఆధిక్యాన్ని పొందజాలరు. మరియు ఆయనే మిమ్మల్ని త్యజిస్తే, ఆయన తప్ప మీకు సహాయం చేయగల వాడెవడు? మరియు విశ్వాసులు కేవలం అల్లాహ్ పైననే నమ్మకం ఉంచుకుంటారు!

161. మరియు ఏ ప్రవక్త కూడా విజయధనం (బూటీ) కొరకు నమ్మక ద్రోహానికి పాల్పడడు. మరియు నమ్మకద్రోహానికి పాల్పడినవాడు పునరుత్థాన దినమున తన నమ్మక ద్రోహంతో పాటు హాజరవుతాడు. అప్పుడు ప్రతి ప్రాణికి తాను అర్జించిన దానికి పూర్తి ప్రతిఫలం ఇవ్వబడుతుంది మరియు వారికెలాంటి అన్యాయం జరుగదు[88].

162. ఏమీ?అల్లాహ్ అభీష్టం ప్రకారం నడిచే వ్యక్తి, అల్లాహ్ ఆగ్రహానికి గురయ్యేవాడితో సమాను డవుతాడా? మరియు నరకమే వాని ఆశ్రయము

---

[88] ఉ'హుద్ యుద్ధం రోజు దైవప్రవక్త ('స'అస) విలుకాండ్రను: ఎట్టి పరిస్థితిలో కూడా వారు తమ స్థలాలను వదలరాదని, ఆదేశిస్తారు. కాని వారు యుద్ధబూటీ వ్యామోహంలో తమ స్థానాలను వదలి యుద్ధబూటీ ప్రోగు చేయటానికి వెళ్ళారు. కార్యాన్నే ఖండిస్తూ, అల్లాహ్ (సు.తా.) అన్నాడు: "ఏ ప్రవక్త కూడా తన తోటి వారికి అన్యాయం చేయడు." కాబట్టి వారు తమ ప్రవక్తయందు విశ్వాసముంచుకొని, బూటీలోని తమ హక్కు తమకు తప్పక దొరుకుతుందని, తమ చోట్లలో స్థిరంగా ఉండటమే వారి కర్తవ్యము. ఈ ఆయత్ ప్రతి వ్యవహారానికి వర్తిస్తుంది.

మరియు అది అతి చెడ్డ గమ్యస్థానం![89]

**163.** అల్లాహ్ దృష్టిలో వారు వేర్వేరు స్థానాలలో ఉన్నారు. మరియు వారు చేసేదంతా అల్లాహ్ చూస్తున్నాడు.

**164.** వాస్తవానికి అల్లాహ్ విశ్వాసులకు మహోపకారం చేశాడు; వారి నుండియే వారి మధ్య ఒక ప్రవక్త (ముహమ్మద్) ను లేపాడు; అతను, ఆయన (అల్లాహ్) సందేశాలను (ఆయాత్ లను) వారికి వినిపిస్తున్నాడు[90]. మరియు వారి జీవితాలను సంస్కరించి పావనం చేస్తున్నాడు; మరియు వారికి గ్రంథాన్ని మరియు వివేకాన్ని బోధిస్తున్నాడు[91]; మరియు వాస్తవానికి వారు ఇంతకు ముందు స్పష్టంగా మార్గభ్రష్టత్వంలో పడి వున్నారు.

**165.** ఏమయింది? మీకొక చిన్న ఆపదే కదా కలిగింది! వాస్తవానికి మీరు, వారికి (మీ శత్రువులను బద్ర్ లో) ఇంతకు రెట్టింపు ఆపద కలిగించారు కదా![92] అయితే ఇప్పుడు: "ఇది ఎక్కడి నుంచి వచ్చిందీ?"

---

[89] చూడండి, 2:79 మరియు 3:78.

[90] చూడండి, 12:109, 25:20 మరియు 41:6.

[91] ఇక్కడ ప్రవక్త('అలైహిమ్'స.)ల మూడు ముఖ్యలక్ష్యాలు వివరించబడ్డాయి: 1) ఆయత్'లను చదువటం మరియు వినిపించటం, 2) త'జ్ కియా: అంటే మానవుల కర్మలను, విశ్వాసాలను ('అఖాయద్ లను) మరియు నడవడిక ('అఖ్ లాఖ్)లను సరిదిద్దటం మరియు 3) గ్రంథాన్ని మరియు వివేకాన్ని బోధించటం.

[92] ఉ'హుద్ లో 70 మంది ముస్లింలు మరణించారు, కానీ బద్ర్ లో 70 మంది ముష్రికులు మరణించారు, మరియు 70 మంది బందీలయ్యారు కదా!

అని అంటున్నారా? వారితో ఇలా అను: "ఇది మీరుస్వయంగాతెచ్చుకున్నదే!"[93] నిశ్చయంగా అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు.

166. మరియు (ఉహుద్ యుద్ధరంగంలో) రెండు సైన్యాలు ఎదుర్కొన్నప్పుడు, మీకు కలిగిన కష్టం, అల్లాహ్ అనుమతితోనే కలిగింది మరియు అది నిజమైన విశ్వాసులెవరో తెలుసుకోవటానికి

167. మరియు కపటవిశ్వాసులు ఎవరో తెలుసుకోవటానికి మరియు వారితో (కపట విశ్వాసులతో): "రండి అల్లాహ్ మార్గంలో యుద్ధం చేయండి లేదా కనీసం మిమ్మల్ని మీరు రక్షించుకోండి![94]" అని అన్నప్పుడు వారు: "ఒకవేళ మాకు యుద్ధం జరుగుతుందని తెలిసివుంటే మేము తప్పకుండా మీతోపాటు వచ్చి ఉండేవారం." అని జవాబిచ్చారు. ఆరోజు వారు విశ్వాసాని కంటే అవిశ్వాసానికి దగ్గరగా ఉన్నారు[95]. మరియు వారు తమ హృదయాలలో లేని మాటలను తమ నోళ్ళతో పలుకుతూ ఉన్నారు. మరియు వారు దాస్తున్నది అల్లాహ్ కు బాగా తెలుసు.

---

[93] అంటే దైవప్రవక్త ('స'అస) యొక్క ఆజ్ఞను పాలించక 'స'హాబా (ర'ది.'అన్హుమ్)లు బూటీ కొరకు గుట్టపై నుండి తమ స్థానాలు వదలిపోయినందుకు ఈ ఆపదకు గురి అయ్యారు.

[94] చూడండి, 2:190-194.

[95] వారు 'అబ్దుల్లాహ్ ఇబ్నె ఉబయ్ తోటివారైన దాదాపు 300మంది మునాఫిఖులు. వారు ఉ'హుద్ యుద్ధానికి సిద్ధపడిన తర్వాత శత్రువులు 3000మంది ఉన్నారని తెలుసుకొని భయపడి వెనుదిరిగిపోతారు

**168.** అలాంటి వారు తమ ఇండ్లలో కూర్చొని ఉండి (చంపబడిన) తమ సోదరులను గురించి ఇలా అన్నారు: "వారు గనక మా మాట విని ఉంటే చంపబడి ఉండేవారు కాదు!" నీవు వారితో: "మీరు సత్యవంతులే అయితే, మీకు మరణం రాకుండా మిమ్మల్ని మీరు తప్పించు కోండి!" అని చెప్పు.

**169.** మరియు అల్లాహ్ మార్గంలో చంపబడిన వారిని మృతులుగా భావించకండి. వాస్తవానికి వారు సజీవులై, తమ ప్రభువు వద్ద జీవనోపాధి పొందుతున్నారు[96].

**170.** అల్లాహ్ తన అనుగ్రహంతో ప్రసాదించిన దానితో (ప్రాణత్యాగంతో) వారు సంతోషంతో ఉప్పొంగిపోతారు[97]. మరియు వారిని కలువక, వెనుక (బ్రతికి) ఉన్నవారి కొరకు (ఇవ్వబడిన శుభవార్తతో) వారు సంతోషపడుతూ ఉంటారు. ఎందుకంటే వారికి ఎలాంటి భయమూ ఉండదు మరియు వారు దుఃఖపడరు కూడా!

**171.** వారు అల్లాహ్ అనుగ్రహానికి, దాతృత్వానికి సంతోషపడుతూ ఉంటారు. మరియు నిశ్చయంగా, అల్లాహ్ విశ్వాసుల ప్రతిఫలాన్ని వ్యర్థం కానివ్వడు.

---

[96] చూడండి, 2:154.

[97] మరణించిన ఏ ప్రాణి కూడా అల్లాహ్ (సు.తా.) దగ్గర మంచి చోటు దొరికిన తరువాత భూలోకానికి తిరిగి రావటానికి ఇష్టపడడు. కానీ షహీద్ (అల్లాహుతా'ఆలా మార్గంలో చంపబడినవాడు) భూలోకానికి తిరిగి రావటానికి ఇష్టపడతాడు. ఎందుకంటే అతడు షహాదత్ యొక్క గొప్ప ప్రతిఫలాన్ని చూసి ఉంటాడు. (ముస్నద్ అ'హ్మద్ - 3/126, 'స. ముస్లిం). కాని అది అసంభవం.

**172.** ఎవరైతే గాయపడిన తరువాత కూడా అల్లాహ్ మరియు సందేశహరుని (ఆజ్ఞలను) పాటించారో[98]; వారిలో ఎవరైతే, సత్కార్యాలు చేశారో, మరియు దైవభీతి కలిగి ఉన్నారో, వారికి గొప్ప ప్రతిఫలం ఉంది.

**173.** వారితో (విశ్వాసులతో) ప్రజలు: "వాస్తవానికి, మీకు వ్యతిరేకంగా పెద్ద జన సమూహాలు కూర్చబడి ఉన్నాయి, కావున మీరు వారికి భయపడండి." అని అన్నప్పుడు, వారి విశ్వాసం మరింత అధికమే అయింది. మరియు వారు: "మాకు అల్లాహ్ యే చాలు మరియు ఆయనే సర్వోత్తమమైన కార్యసాధకుడు[99]." అని అన్నారు[100].

---

[98] మక్కా ముష్రికులు ఉ'హుద్ యుద్ధరంగం నుండి వెనుదిరిగి కొంతదూరం పోయిన తరువాత: "మేము భీతిపరులైన ముస్లిములను, పూర్తిగా అణచకుండానే తిరిగి వచ్చి తప్పు చేశాము. 300 మైళ్ళ నుండి వచ్చి కూడా యుద్ధఖైదీలను గానీ, విజయధనం గానీ, పొందకుండా తిరిగి పోతున్నాము. కావున తిరిగి మదీనా పై దాడి చేద్దామని సమాలోచనలు చేస్తారు. కాని వారికి ధైర్యం చాలదు. దైవప్రవక్త ('స'అస) కూడా పారి పోయే శత్రువును వెంబడించి నశింపజేయాలని, 70 మంది వీరులను తీసుకొని - వారు గాయపడి ఉన్నా తయారయ్యి - వారిని వెంబడిస్తారు. వారు మదీనా నుండి 8 మైళ్ళ దూరంలో ఉన్న 'హమ్రా' అల్ అసద్ అనే ప్రాంతం వరకు పోతారు. శత్రువులను పొందక, వారిక మరలిరారని నిశ్చితులైన తరువాత తిరిగి వస్తారు.

[99] అల్-వకీలు: అంటే Trustee, Overseer, Guardian, Disposer of affairs, కార్యకర్త, సంరక్షకుడు, కార్యనిర్వాహకుడు, కార్యసాధకుడు, సాక్షి, బాధ్యుడు, ధర్మకర్త, మొదలైన అర్థాలున్నాయి. ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి. చూడండి, 4:109, 6:102, 11:12, 17:2.

[100] చూడండి, 'స. బు'ఖారీ, పు. 6, 'హదీస్' నం. 86, 87.

**174.** ఈ విధంగా వారు అల్లాహ్ ఉపకారాలు మరియు అనుగ్రహాలతో (యుద్ధరంగం నుండి) తిరిగి వచ్చారు, వారికెలాంటి హాని కలుగలేదు మరియు వారు అల్లాహ్ అభీష్టాన్నీ అనుసరించారు. మరియు అల్లాహ్ ఎంతో అనుగ్రహుడు, సర్వోత్తముడు.

**175.** నిశ్చయంగా, షైతానే తన మిత్రుల గురించి మీలో భయం పుట్టిస్తాడు. కావున మీరు వారికి భయపడకండి మరియు మీరు విశ్వాసులే అయితే, కేవలం నాకే(అల్లాహ్ కే) భయపడండి

**176.** మరియు సత్యతిరస్కారం కొరకు పోటీ చేసేవారు నిన్ను ఖేదానికి గురి చేయనివ్వరాదు. నిశ్చయంగా, వారు అల్లాహ్ కు ఎలాంటి నష్టం కలిగించలేరు. పరలోక సుఖంలో అల్లాహ్ వారికెలాంటి భాగం ఇవ్వదలచుకోలేదు. మరియు వారికి ఘోరమైన శిక్ష ఉంటుంది.

**177.** నిశ్చయంగా, విశ్వాసానికి బదులుగా సత్యతిరస్కారాన్ని కొనేవారు అల్లాహ్ కు ఎలాంటి నష్టం కలిగించలేరు. మరియు వారికి బాధాకరమైన శిక్ష ఉంటుంది.

**178.** మరియు వాస్తవానికి మేము ఇస్తున్న ఈ వ్యవధిని సత్యతిరస్కారులు తమకు మేలైనదిగా భావించకూడదు. మరియు వాస్తవానికి, మేము ఇస్తున్న ఈ వ్యవధి వారి పాపాలు అధికమవటానికే![101] మరియు వారికి అవమానకరమైన శిక్ష ఉంటుంది.

---

[101] చూడండి, 23:55, 56.

**179.** అల్లాహ్ విశ్వాసులను, మీరు (సత్యతిరస్కారులు) ఇప్పుడు ఉన్న స్థితిలో, ఏ మాత్రమూ ఉండనివ్వడు. చివరకు ఆయన దుష్టులను సత్పురుషుల నుండి తప్పకుండా వేరు చేస్తాడు. మరియు అగోచర విషయాలను మీకు తెలపడం అల్లాహ్ విధానం కాదు, కాని అల్లాహ్ తన ప్రవక్తలలో నుండి తాను కోరిన వారిని ఎన్నుకుంటాడు[102]. కావున మీరు అల్లాహ్ ను మరియు ఆయన ప్రవక్తలను విశ్వసించండి మరియు ఒకవేళ మీరు విశ్వసించి, దైవభీతి గలిగి ఉంటే, మీకు గొప్ప ప్రతిఫలం ఉంటుంది.

**180.** అల్లాహ్ తన అనుగ్రహంతో ప్రసాదించిన దానిలో లోభం వహించేవారు, తమకది (లోభమే) మేలైనదని భావించరాదు, వాస్తవానికి అది వారి కొరకు ఎంతో హానికరమైనది. వారు తమ లోభత్వంతో కూడబెట్టినదంతా, తీర్పుదినమున వారి మెడల చుట్టు కట్టబడుతుంది[103]. మరియు భూమ్యాకాశాల వారసత్వం అల్లాహ్ కే చెందుతుంది. మరియు మీరు చేస్తున్నదంతా అల్లాహ్ ఎరుగును.

**181.** "నిశ్చయంగా, అల్లాహ్ పేదవాడు మరియు మేము ధనవంతులము[104]." అని చెప్పేవారి మాటలను వాస్తవంగా అల్లాహ్ విన్నాడు. వారు పలుకుతున్నది

---

[102] చూడండి, 9:26, 27, 101.

[103] చూడండి, 'స. బు'ఖారీ, 'హ. నం. 4565.

[104] చూడండి, 2:245.

మరియు అన్యాయంగా ప్రవక్తలను వధించినది మేము వ్రాసిపెడుతున్నాము. మరియు (పునరుత్థాన దినమున) వారితో మేమను ఇలా అంటాము: "దహించే అగ్ని శిక్షను రుచి చూడండి!"

**182.** ఇది మీ చేతులారా మీరు చేసి పంపుకున్న కర్మల ఫలితం. నిశ్చయంగా, అల్లాహ్ తన దాసులకు ఎలాంటి అన్యాయం చేసేవాడు కాడు!

**183.** "అగ్ని (ఆకాశం నుండి దిగి వచ్చి) బలి (ఖుర్బానీ) ని మా సమక్షంలో తినేంత వరకు మేము ఎవరినీ ప్రవక్తగా స్వీకరించగూడదని అల్లాహ్ మాతో వాగ్దానం తీసుకున్నాడు" అని పలికే వారితో (యూదులతో) ఇలా అను: "వాస్తవానికి నాకు పూర్వం మీ వద్దకు చాలామంది ప్రవక్తలు స్పష్టమైన ఎన్నో నిదర్శనాలను తీసుకువచ్చారు; మరియు మీరు ప్రస్తావించే ఈ నిదర్శనాన్ని కూడా! మీరు సత్యవంతులే అయితే, మీరు వారిని ఎందుకు హత్య చేశారు?[105]"

**184.** (ఓ ప్రవక్తా!) ఒకవేళ వారు నిన్ను అసత్యవాదుడవని తిరస్కరిస్తే, నీవు (ఆశ్చర్య పడకు); వాస్తవానికి నీకు ముందు ప్రత్యక్ష నిదర్శనాలను, సహీఫాలను (జబూర్ లను) మరియు జ్యోతిని ప్రసాదించే గ్రంథాన్ని తీసుకు వచ్చిన చాలా మంది ప్రవక్తలు కూడా అసత్యవాదులని తిరస్కరించబడ్డారు.

**185.** ప్రతి ప్రాణి చావును చవి చూస్తుంది. మరియు నిశ్చయంగా, తీర్పుదినమున మీ కర్మల

---

[105] చూడండి, 2:61.

ఫలితం మీకు పూర్తిగా ఇవ్వబడుతుంది. కావున ఎవడు నరకాగ్ని నుండి తప్పించబడి స్వర్గంలో ప్రవేశపెట్టబడతాడో! వాస్తవానికి వాడే సఫలీకృతుడు. మరియు ఇహలోక జీవితం కేవలం మోసపుచ్చే సుఖానుభవం మాత్రమే!

**186.** నిశ్చయంగా మీరు, మీ ధన ప్రాణాలతో పరీక్షింపబడతారు; మరియు నిశ్చయంగా, మీకు పూర్వం గ్రంథం ప్రసాదించబడిన వారి నుండి మరియు అల్లాహ్ కు భాగస్వాములు (సాటి) కల్పించినవారి నుండి, మీరు అనేక వేదన కలిగించే మాటలు వింటుంటారు. కానీ, ఒకవేళ మీరు ఓర్పు వహించి, దైవభీతి కలిగి ఉంటే! నిశ్చయంగా అది ఎంతో సాహసంతో కూడిన కార్యం[106].

**187.** మరియు అల్లాహ్ గ్రంథ ప్రజలతో: "దీనిని (దైవప్రవక్త ముహమ్మద్ రానున్నాడు అనే సత్యాన్ని ) ప్రజలకు తెలియ జేయండి మరియు దానిని దాచకండి." అని చేయించిన ప్రమాణాన్ని , (జ్ఞాపకం చేసుకోండి). కాని వారు దానిని తమ వీపుల వెనుక పడవేసి దానికి బదులుగా స్వల్ప మూల్యాన్ని పొందారు, వారి ఈ వ్యాపారం ఎంత నీచమైనది!

**188.** ఎవరైతే తాము చేసిన పనికి సంతోషపడుతూ, తాము చేయని పనికి ప్రశంసలు లభిస్తాయని

---

[106] చూడండి, 2:155 మరియు 'స. బు'ఖారీ - కితాబ్ అత్ - తఫ్సీర్.

కోరుతారో, వారు శిక్ష నుండి తప్పించుకోగలరని నీవు భావించకు. మరియు వారికి బాధాకరమైన శిక్ష ఉంటుంది.

**189.** మరియు భూమ్యాకాశాల సామ్రాజ్యాధిపత్యం కేవలం అల్లాహ్ కే చెందినది. మరియు అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు.

**190.** నిశ్చయంగా, భూమ్యాకాశాల సృష్టిలో మరియు రేయింబవళ్ళ అనుక్రమం (ఒకదాని తరువాత ఒకటి రావడం మరియు వాటి హెచ్చుతగ్గుల)లో, బుద్ధిమంతుల కొరకు ఎన్నో సూచనలు (ఆయాత్) ఉన్నాయి;

**191.** ఎవరైతే నిలుచున్నా, కూర్చున్నా, పరుండినా, అన్ని వేళలా అల్లాహ్ ను స్మరిస్తారో, భూమ్యాకాశాల నిర్మాణాన్ని గురించి ఆలోచిస్తారో! (వారు ఇలా ప్రార్థిస్తారు): "ఓ మా ప్రభూ! నీవు దీనిని (ఈ విశ్వాన్ని) వ్యర్థంగా సృష్టించలేదు, నీవు సర్వలోపాలకు అతీతువు, మమ్మల్ని నరకాగ్ని శిక్ష నుండి కాపాడు[107].

**192.** "ఓ మా ప్రభూ! నీవు ఎవడిని నరకాగ్నిలో పడవేస్తావో వాస్తవంగా వానిని నీవు అవమానపరిచావు. మరియు దుర్మార్గులకు సహాయకులు ఎవ్వరూ ఉండరు."

**193.** "ఓ మా ప్రభూ! నిశ్చయంగా, మేము: 'మీ

[107] చూడండి, 10:5

ప్రభువును విశ్వసించండి.' అని విశ్వాసం వైపుకు పిలిచే అతని (ముహమ్మద్) యొక్క పిలుపు విని విశ్వసించాము. ఓ మా ప్రభూ! మా పాపాలను క్షమించు మరియు మాలో ఉన్న చెడులను మా నుండి తొలగించు మరియు పుణ్యాత్ములతో (ధర్మనిష్ఠాపరులతో) మిమ్మల్ని మరణింపజెయ్యి!"

**194.** "ఓ మా ప్రభూ! మరియు నీ ప్రవక్తల ద్వారా నీవు మాకు చేసిన వాగ్దానాలను పూర్తి చేయి మరియు తీర్పు దినమున మమ్మల్ని అవమాన పరచకు. నిశ్చయంగా, నీవు నీ వాగ్దానాలను భంగం చేయవు."

**195.** అప్పుడు సమాధానంగా వారి ప్రభువు, వారితో ఇలా అంటాడు: "మీలో పురుషులు గానీ, స్త్రీలు గానీ చేసిన కర్మలను నేను వ్యర్థం కానివ్వను. మీరందరూ ఒకరికొకరు (సమానులు)[108]. కనుక నా కొరకు, తమ దేశాన్ని విడిచి పెట్టి వలస పోయినవారు, తమ గృహాల నుండి తరిమి వేయబడి (నిరాశ్రయులై, దేశదిమ్మరులై), నా మార్గంలో పలుకష్టాలు పడినవారు మరియు నా కొరకు పోరాడినవారు మరియు చంపబడినవారు;

---

[108] అంటే కర్మలకు ఫలితాలిచ్చే విషయంలో స్త్రీ పురుషుల మధ్య ఎలాంటి భేదభావం ఉండదు. ప్రతి ఒక్కరికి వారి కర్మలకు తగిన ప్రతిఫలమివ్వబడుతుంది. ఎవ్వరికీ రవ్వంత అన్యాయం కూడా జరుగదు.

నిశ్చయంగా, ఇలాంటి వారందరి చెడులను వారి నుండి తుడిచి వేస్తాను. మరియు నిశ్చయంగా, వారిని క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాను; ఇది అల్లాహ్ వద్ద వారికి లభించే ప్రతిఫలం. మరియు అల్లాహ్! ఆయన వద్దనే ఉత్తమ ప్రతిఫలం ఉంది."

**196.** (ఓ ప్రవక్తా!)దేశాలలో సత్యతిరస్కారుల సంచారం నిన్ను మోసంలో పడవేయకూడదు![109]

**197.** ఇది వారికి కొద్దిపాటి సుఖం మాత్రమే! తరువాత వారి ఆశ్రయం నరకమే. మరియు అది అతి అధ్వాన్నమైన నివాస స్థలము.

**198.** కాని ఎవరైతే తమ ప్రభువు నందు భయభక్తులు కలిగి ఉంటారో, వారికి క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలుంటాయి. అందులో వారు అల్లాహ్ ఆతిథ్యం పొందుతూ శాశ్వతంగా ఉంటారు. మరియు పుణ్యాత్ములకు(ధర్మనిష్ఠాపరులకు) అల్లాహ్ దగ్గర ఉన్నదే ఎంతో శ్రేష్ఠమైనది!

**199.** మరియు నిశ్చయంగా, గ్రంథ ప్రజలలో, కొందరు అల్లాహ్ ను విశ్వసిస్తారు. మరియు వారు మీకు అవతరింపజేయబడిన దానిని మరియు వారికి అవతరింపజేయబడిన దానిని (సందేశాన్ని) విశ్వసించి, అల్లాహ్ కు వినమ్రులై, అల్లాహ్

---

[109] చూడండి, 40:4, 10:69 మరియు 31:24.

సూక్తులను స్వల్పమైన మూల్యానికి అమ్ముకోరు[110]. అలాంటి వారికి వారి ప్రభువు వద్ద ప్రతిఫలం ఉంది. నిశ్చయంగా, అల్లాహ్ లెక్క తీసుకోవటంలో అతి శీఘ్రుడు.

**200.** ఓ విశ్వాసులారా! సహనం వహించండి, మరియు (మిథ్యావాదుల ముందు స్థైర్యాన్ని చూపండి. మరియు (మాటువేసి ఉండవలసిన చోట) స్థిరంగా ఉండండి. మరియు అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగి ఉండండి, అప్పుడే మీరు సాఫల్యం పొందగలరని ఆశించవచ్చు![111]

---

[110] ఈ ఆయత్ లో దైవప్రవక్త ము'హమ్మద్ ('స'అస) ను విశ్వసించిన పూర్వగ్రంథ ప్రజలను గురించి చెప్పబడింది. ఉదా: 'అబ్దుల్లాహ్ బిన్ సల్లామ్, మరియు సల్మాన్ పార్సీ మొదలైనవారు. (ర'ది.'అన్హుమ్). వారిలో దాదాపు 10 మంది మాత్రమే యూదులు, కాని క్రైస్తవులు అధిక సంఖ్యలో ఉండిరి. (ఇబ్నె - కసీ'ర్).

[111] ఈ ఆయత్ తాత్పర్యం ఈ విధంగా కూడా చేయబడింది: "ఓ విశ్వాసులారా, (మీ శత్రువుల కంటే ఎక్కువ) సహనం వహించండి మరియు సాహసం చూపించండి మరియు యుద్ధరంగంలో దృఢచిత్తులై (మీ సరిహద్దులను కాపాడుతూ) ఉండండి. మరియు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి, అప్పుడే మీరు సాఫల్యం పొందగలరని ఆశించవచ్చు!" ఆ ఆయత్ తాత్పర్యం ము'హమ్మద్ జునాగఢి (ర'హ్మ) గారు, ఈ విధంగా కూడా చేశారు: "ఓ విశ్వాసులారా! మీ పాదాలను తడబడనివ్వకండి మరియు ఒకరికొకరు సహాయపడండి. జిహాద్ కొరకు సిద్ధంగా ఉండండి మరియు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి, అప్పుడే మీరు సాఫల్యం పొందగలరని ఆశించవచ్చు!"

# 4. అన్-నిసా [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఓ మానవులారా! మీ ప్రభువు పట్ల భయభక్తులు కలిగి ఉండండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి (ఆదమ్) నుండి సృష్టించాడు మరియు ఆయనే దాని (ఆ ప్రాణి) నుండి దాని జంట (హవ్వా) ను సృష్టించాడు మరియు వారిద్దరి నుండి అనేక పురుషులను మరియు స్త్రీలను వ్యాపింపజేశాడు. మరియు ఆ అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి, ఎవరి ద్వారానైతే (పేరుతోనైతే) మీరు మీ పరస్పర (హక్కులను) కోరుతారో; మరియు మీ బంధుత్వాలను గౌరవించండి (త్రెంచకండి)[1]. నిశ్చయంగా, అల్లాహ్ మిమ్మల్ని సదా కనిపెట్టుకొని[2] ఉన్నాడు.

2. మరియు అనాథుల ఆస్తిపాస్తులను వారికి తిరిగి

---

[*] [అన్-నిసా అంటే స్త్రీలు]

[1] అల్ - అర్'హాము, ర'హిమున్ యొక్క బహువచనం: అంటే గర్భకోశం. దాని నుండియే బంధుత్వాలు ఏర్పడుతాయి. కాబట్టి: "బంధుత్వాలను గౌరవించండి (త్రెంచకండి) మరియు వారి (బంధువుల) హక్కులను చెల్లించండి." అని ఎన్నో హదీసులు ఉన్నాయి.

[2] రఖీబున్ (అర్-రఖీబు) : చూడండి, 5:117. The Watcher, Observer, Guardian, Keeper from whom nothing is hidden.పరిశీలకుడు,కనిపెట్టుకునిఉండేవాడు.గమనించేవాడు. ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి.

ఇవ్వండి. మరియు (మీ) చెడ్డ వస్తువులను (వారి) మంచి వస్తువులతో మార్చకండి. మరియు వారి ఆస్తులను మీ ఆస్తులతో కలిపి తిని వేయకండి. నిశ్చయంగా, ఇది గొప్పనేరం (పాపం).

**3.** మరియు అనాథ బాలికలకు న్యాయం చేయలేమనే భయం మీకు ఉంటే, మీకు నచ్చిన (ఇతర) స్త్రీలను ఇద్దరిని గానీ, ముగ్గురిని గానీ, నలుగురిని గానీ వివాహం చేసుకోండి. అయితే వారితో న్యాయంగా వ్యవహరించలేమనే భయం మీకు ఉంటే, ఒకామెను మాత్రమే;[3] లేదా మీ స్వాధీనంలో నున్న వారిని (బానిస స్త్రీలను దాంపత్యంలోకి) తీసుకోండి.[4] ఒకే

---

[3] ఇక్కడ స్పష్టంగా చెప్పబడింది: "మీరు వారి (స్త్రీల) మధ్య న్యాయం చేయలేమనే భయం ఉంటే ఒకామెను మాత్రమే వివాహమాడండి." అని. నలుగురి కంటే ఎక్కువ వివాహమాడ కండని మరియు అంత కంటే ఎక్కువ భార్యలను ఏక కాలంలో ఉంచుకోరాదని, దివ్యఖుర్ఆన్ తప్ప, ఇతర ఏ మత గ్రంథంలో కూడా వ్రాయబడ లేదు. అందుకే పూర్వకాలంలో చాలా మంది భార్యలు ఉండటం అన్ని ధర్మాల వారి ఆచారమై ఉండెను. ఇంకా ముందు దివ్యఖుర్ఆన్ లో ఇలా చెప్పబడింది: "మీరు ఎంత ప్రయత్నం చేసినా వారి (భార్యల) మధ్య న్యాయం చేయటం చాలా కష్టం అట్టి సమయంలో ఒకామెను పూర్తిగా ఉపేక్షించకండి." (చూడండి 4:129). ఈ విధంగా ఖుర్ఆన్ లో స్త్రీలకు ఇవ్వబడినంత గౌరవం, రక్షణ, హక్కులు ఇతర మత గ్రంథాలలో పేర్కొనబడ లేదు. బానిసత్వాన్ని, బానిసత్వ వ్యాపారాన్ని నిర్మూలిస్తూ, కేవలం యుద్ధఖైదీలను తప్ప ఇతరులను బానిసలుగా ఉంచగూడదని కూడా ఖుర్ఆన్ 1400 సంవత్సరాల ముందు ఆదేశించింది. ముస్లింలు అయిన బానిస స్త్రీలతో వివాహమాడటాన్ని కూడా ప్రోత్సహించింది. చూడండి, 1400 సంవత్సరాల ముందు ఇస్లాంలో మానవహక్కులు (Human Rights) మరియు స్త్రీల హక్కులు ఏ విధంగా రక్షింపబడ్డాయో!

[4] చూడండి, 24:32.

వైపునకు మొగ్గకుండా (అన్యాయవర్తన నుండి దూరంగా ఉండటానికి) ఇదే సముచితమైన మార్గం.

4. మరియు స్త్రీలకు వారి స్త్రీ శుల్కం (మహర్) సహృదయంతో ఇవ్వండి. కాని వారు తమంతట తామే సంతోషంగా కొంత భాగాన్ని మీకు విడిచి పెడితే, దానిని సంతోషంగా స్వేచ్ఛగా అనుభవించండి (తినండి).

5. మరియు అల్లాహ్ మీకు నిర్వహించటానికి అప్పగించిన ఆస్తులను, అవివేకులుగా ఉన్నప్పుడు (అనాథులకు) అప్పగించకండి[5]. దాని నుండి వారికి అన్నవస్త్రాలు ఇస్తూ ఉండండి. మరియు వారితో వాత్సల్యంతో మాట్లాడండి.

6. మరియు వివాహయోగ్యమైన వయస్సు వచ్చే వరకూ మీరు అనాథులను పరీక్షించండి, ఇక వారిలో మీకు యోగ్యత కనిపించినప్పుడు, వారి ఆస్తులను వారికి అప్పగించండి. మరియు వారు పెరిగి పెద్దవారు అవుతారనే తలంపుతో దానిని (వారి ఆస్తిని) త్వరపడి అపరిమితంగా తినకండి. మరియు అతడు (సంరక్షకుడు) సంపన్నుడైతే, వారి సొమ్ముకు దూరంగా ఉండాలి. కాని అతడు పేదవాడైతే, దానినుండి ధర్మసమ్మతంగా తినాలి. ఇక వారి ఆస్తిని వారికి అప్పగించేటప్పుడు దానికి సాక్షులను పెట్టుకోండి. మరియు లెక్క

[5] చూడండి, 'స. బు'ఖారీ, పు - 3, 'హ. నం. 591.

తీసుకోవటానికి[6] అల్లాహ్ చాలు!

7. పురుషులకు వారి తల్లిదండ్రులు మరియు దగ్గరి బంధువులు విడిచిపోయిన దానిలో (ఆస్తిలో) భాగం ఉంది మరియు స్త్రీలకు కూడా వారి తల్లిదండ్రులు మరియు దగ్గరి బంధువులు విడిచిపోయిన దానిలో భాగం ఉంది[7]; అది తక్కువైనా సరే, లేదా ఎక్కువైనా సరే. అది (అల్లాహ్) విధిగా నియమించిన భాగం.

8. మరియు (ఆస్తి) పంపకం జరిగేటప్పుడు ఇతర బంధువులు గానీ, అనాథలు గానీ, పేదవారు గానీ

[6] అల్-'హసీబు : Reckoner, Taker of Accounts, Sufficer, or giver of what is sufficient. లెక్క తీసుకునే, పరిగణించే వాడు. అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి. చూడండి, 4:86.

[7] ముందు వస్తుంది. స్త్రీలకు, పురుషులకు దొరికే భాగంలో సగం ఆస్తి దొరుకుతుందని. దీనికి కారణం స్త్రీలపై ఎవ్వరినీ పెంచే బాధ్యత లేదు. ఆమె పోషణ, రక్షణ బాధ్యత ఆమె తండ్రి, భర్త, సోదరుని లేక కుమారునిపై ఉంది. చివరకు వీరంతా ఎవ్వరూ లేనపుడు ఇస్లామీయ ప్రభుత్వంపై ఉంటుంది. కాబట్టి ఖుర్ఆన్ చేసిన ఈ పంపకంలో స్త్రీలకు ఎలాంటి అన్యాయం జరుగలేదు. మరొకవిషయమేమిటంటే, దగ్గరి బంధువులు అంటే ప్రథమ శ్రేణికి చెందిన బంధువులు 1.సంతానం, 2.తల్లిదండ్రులు, 3.భర్త లేక భార్యలు

ఉంటే దాని నుండి వారికి కూడా కొంత ఇవ్వండి[8]. మరియు వారితో వాత్సల్యంగా మాట్లాడండి.

9. మరియు (పంపకం చేసేటప్పుడు, పంపకం చేసేవారు), ఒకవేళ తామే తమ పిల్లలను నిస్సహాయులుగా విడిచిపోతే, ఏవిధంగా వారిని గురించి భయపడతారో, అదేవిధంగా భయ పడాలి. వారు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండి, యుక్తమైన మాటలనే పలకాలి.

10. నిశ్చయంగా, అన్యాయంగా అనాథల ఆస్తులను, తినేవారు వాస్తవానికి తమ పొట్టలను అగ్నితో నింపుకుంటున్నారు. మరియు వారు సమీపంలోనే భగభగమండే నరకాగ్నిలో కాల్చబడతారు.

11. మీ సంతాన వారసత్వాన్ని గురించి అల్లాహ్ మీకు ఈ విధంగా ఆదేశిస్తున్నాడు: ఒక పురుషుని (భాగం) ఇద్దరు స్త్రీల భాగాలకు సమానంగా

---

[8] ఇక్కడ ఇతర బంధువులు అంటే వాసత్వానికి హక్కుదారులు కానివారు. వారికి కూడా కొంత ఇవ్వాలి ఆస్తిపరుడు తలుచుకుంటే, తన జీవితకాలంలో, తన ఆస్తిలో మూడో భాగం, వీలు ద్వారా అతని ఆస్తికి హక్కుదారులు కాని, ఇతర బంధువులకు గానీ, పేదలకు గానీ, పుణ్యకార్యాలకు గానీ ఇవ్వవచ్చు. మూడోభాగం కంటే, ఎక్కువ వీలు ద్వారా ఇచ్చే హక్కు ఆస్తిపరునికి లేదు. ఆస్తికి హక్కుదారులైన వారికి ఆస్తి ఇవ్వకూడదని వీలు వ్రాసే అధికారం కూడా అతనికి షరీయత్ లో లేదు. మూడవ భాగం ఆస్తి చాలా తక్కువ ఉంటే, ఇతరులకు ఇచ్చే అవసరం లేదు. తన ఆస్తిని పేరు కొరకు ఇతరులకు పంచి, హక్కు దారులైన తన దగ్గరి బంధువులను, పేదరికంలో ముంచటం తగినది కాదు. (ఫత్హ అల్ ఖదీర్).

ఉండాలి[9]. ఒకవేళ ఇద్దరు లేక అంత కంటే ఎక్కువ స్త్రీ(సంతానం మాత్రమే) ఉంటే, వారికి విడిచిన ఆస్తిలో మూడింట రెండు భాగాలు ఉంటాయి. మరియు ఒకవేళ ఒకే ఆడపిల్ల ఉంటే అర్ధభాగానికి ఆమె హక్కుదారురాలు[10]. మరియు (మృతుడు) సంతానం కలవాడైతే, అతని తల్లిదండ్రులలో ప్రతి ఒక్కరికీ విడిచిన ఆస్తిలో ఆరోభాగం లభిస్తుంది. ఒకవేళ అతనికి సంతానం లేకుంటే అతని తల్లిదండ్రులు మాత్రమే వారసులుగా ఉంటే, అప్పుడు తల్లికి మూడోభాగం. మృతునికి సోదరసోదరీ మణులు ఉంటే, తల్లికి ఆరో భాగం. (ఈ పంపకమంతా) మృతుని అప్పులు తీర్చి, అతని వీలునామాపై అమలు జరిపిన తరువాతనే జరగాలి. మీ తల్లిదండ్రులు మరియు మీ సంతానంలో ప్రయోజనం రీత్యా మీకు ఎవరు

---

[9] చిన్నవారైనా పెద్దవారైనా సంతానం అంతా వారసత్వానికి హక్కుదారులు. గర్భంలో ఉన్న సంతానం కూడా వారసత్వానికి హక్కుదారులు. అవిశ్వాసులైన సంతానం వారసత్వానికి హక్కుదారులు కారు. ఆడ మగ సంతానం ఉన్న పక్షంలో తల్లిదండ్రులకు ప్రతి ఒక్కరికి 1/6. మిగతా 2/3 సంతానం కొరకు. భార్య లేక భర్త టే వారి హక్కు వారికిచ్చిన తరువాత మిగతాది సంతానం కొరకు.

[10] ఒకవేళ ఒకే ఒక్క కుమారుడు ఉంటే, మొత్తం ఆస్తికి వారసుడు అవుతాడు. ఇతర వారసులు, అంటే తల్లి, తండ్రి, భార్య లేక భర్త ఉంటే, వారి హక్కు వారికిచ్చిన తరువాత మిగతా ఆస్తికి అతడు హక్కుదారుడు. మృతునికి ఒకే కుమార్తె ఉంటే, ఆమెకు 1/2 ఆస్తి, తల్లికి 1/6, తండ్రికి 2/6.

ఎక్కువ సన్నిహితులో, మీకు తెలియదు. ఇది అల్లాహ్ నియమించిన విధానం. నిశ్చయంగా, అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేకవంతుడు.

12. మరియు మీ భార్యలకు సంతానం లేని పక్షంలో[11], వారు విడిచిపోయిన దానిలో మీకు అర్ధ భాగం. కాని ఒకవేళ వారికి సంతానం ఉంటే, వారు విడిచిపోయిన దానిలో నాలుగోభాగం మీది. (ఇదంతా)వారు వ్రాసిపోయిన వీలునామాపై అమలు జరిపి,వారి అప్పులు తీర్చిన తరువాత[12] మరియు మీకు సంతానం లేని పక్షంలో మీరు విడిచిపోయిన దానిలో వారికి (మీ భార్యలకు) నాలుగోభాగం. కాని ఒకవేళ మీకు సంతానం ఉంటే, మీరు విడిచిన దానిలో వారికి ఎనిమిదో భాగం[13]. ఇదంతా మీరు వ్రాసిన వీలునామాపై అమలు జరిగి మీ అప్పులు తీర్చిన తరువాత.

---

[11] మృతుని కొడుకు(లు) చనిపోయిన పక్షంలో, కొడుకు(ల)-సంతానం (మనుమళ్ళు, మనుమరాళ్ళు) వారసులుగా పరిగణించబడాలి. (ఇజ్మా'అ, ఇబ్నె-కసీ'ర్ మరియు ఫత్హ్'అల్ ఖదీర్).

[12] మొదట అప్పులు తీర్చి, తరువాత వీలునామాపై అమలు పరచాలి. ఆ తరువాత మిగిలిన ఆస్తిని వారసులలో పంచాలి. వీలునామా మూడవ వంతు కంటే ఎక్కువ ఆస్తికి చేయగూడదు. ('స.బు'ఖారీ మరియు 'స.ముస్లిం).

[13] భార్య ఒక్కతే ఉన్నా! లేక ఒకరి కంటే ఎక్కువ మంది భార్యలు ఉన్నా, సంతానం ఉంటే, వారంతా కలిసి ఎనిమదవ భాగానికి భాగస్వాములు. సంతానం లేకుంటే నాలుగవ భాగానికి. ఈ ఎనిమిదో భాగాన్ని లేక నాలుగవ భాగాన్ని భార్యలందరికీ సమానంగా పంచాలి. (ఇజ్మా'అ, ఫత్హ్' అల్ ఖదీర్).

మరియు ఒకవేళ మరణించిన పురుషుడు లేక స్త్రీ కలాల అయి (తండ్రి, కొడుకు లేక మనమడు లేకుండా) ఒక సోదరుడు మరియు ఒక సోదరి మాత్రమే ఉంటే, వారిలో ప్రతి ఒక్కరికీ ఆరోభాగం. కాని ఒకవేళ వారు (సోదరసోదరీమణులు) ఇద్దరి కంటే ఎక్కువ ఉంటే, వారంతా మూడో భాగానికి వారసులవుతారు[14]. ఇదంతా మృతుడు వ్రాసిన వీలునామాపై అమలు జరిగి అప్పులు తీర్చిన తరువాత. ఎవ్వరికీ నష్టం కలుగజేయకుండా జరగాలి[15]. ఇది అల్లాహ్ నుండి వచ్చిన ఆదేశం మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు సహనశీలుడు (శాంతస్వభావుడు).

13. ఇవి అల్లాహ్ (విధించిన) హద్దులు. ఎవరైతే

---

[14] ఇక్కడ ఇజ్మా'అ (ధర్మవేత్తల ఏకాభిప్రాయం) ఏమిటంటే, ఈ పంపకం కేవలం అర్ధ సోదరసోదరీమణులు అంటే, కేవలం తల్లి తరఫున నుండి మృతునికి బంధువులైన అర్ధ సోదరసోదరీమణులకు - అంటే, ఒకే తల్లి వేర్వేరు తండ్రులున్న వారికి - వర్తిస్తుంది. ఇక సొంత సోదరసోదరీమణులు మరియు సవతి సోదరసోదరీ మణులకు వర్తించే ఆజ్ఞ ఇదే సూరహ్ లో చివరి ఆయత్ 4:176లో ఉంది. అంటే అక్కడ సోదరుని భాగం ఇద్దరు సోదరీమణుల భాగానికి సమానంగా ఉండాలి. తండ్రి బ్రతికి ఉంటే మృతుని సోదరసోదరీలు అతని ఆస్తికి హక్కుదారులు కారు. మరో విశేషం ఏమిటంటే, అర్ధ సోదరసోదరీమణులు నస్ల్ కారు (అంటే ఒకే తల్లి, కానీ వేర్వేరు తండ్రులున్న వారు). కాబట్టి వారికి ఆడమగ అందరికీ సమాన భాగం ఇవ్వబడుతోంది. వివరాలకు ధర్మవేత్తలను సంప్రదించండి.

[15] ఒకవేళ మృతుడు తన భార్యకు మహ్ర్ చెల్లించకుండానే మరణిస్తే, ఆ మహ్ర్ కూడా అప్పుగా భావించి చెల్లించాలి. భార్య, ఆస్తి హక్కు ఈ మహ్ర్, చెల్లించిన తర్వాతనే ఉంటుంది.

అల్లాహ్ కు మరియు ఆయన ప్రవక్తకు విధేయులై ఉంటారో, వారిని ఆయన క్రింద సెలయేళ్ళు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింప జేస్తాడు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు. మరియు ఇదే గొప్ప సాఫల్యం (విజయం).

14. మరియు ఎవడైతే, అల్లాహ్ కు మరియు ఆయన ప్రవక్తకు అవిధేయుడై, ఆయన నియమాలను ఉల్లంఘిస్తాడో! అలాంటి వాడు నరకాగ్నిలోకి త్రోయబడతాడు అందులో అతడు శాశ్వతంగా ఉంటాడు. మరియు అతడికి అవమానకరమైన శిక్ష ఉంటుంది.

15. మరియు మీ స్త్రీలలో ఎవరైనా వ్యభిచారానికి పాల్పబడితే, వారికి వ్యతిరేకంగా, మీలో నుండి నలుగురి సాక్ష్యం తీసుకోండి. వారు(నలుగురు) సాక్ష్యమిస్తే, వారు మరణించే వరకైనా లేదా వారి కొరకు అల్లాహ్ ఏదైనా మార్గం చూపించే వరకైనా, వారిని ఇండ్లలో నిర్బంధించండి[16].

16. మరియు మీలో ఏ ఇద్దరూ (స్త్రీలుగానీ, పురుషులు గానీ) దీనికి (వ్యభిచారానికి) పాల్పడితే వారిద్దరినీ శిక్షించండి. వారు పశ్చాత్తాపపడి తమ ప్రవర్తనను

[16] ఇది ము'హమ్మద్ ('స'అస), ప్రవక్తగా ఎన్నుకోబడిన మొదటి రోజులలో ఇవ్వబడిన అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞ. ఆ తరువాత సూరహ్ అన్నూర్ (24:2)లో, అల్లాహుతా'ఆలా తన ఆదేశాన్ని వివరంగా అవతరింపజేశాడు. ఇంకా చూడండి, 4:25.

సవరించుకుంటే వారిని విడిచి పెట్టండి. నిశ్చయంగా, అల్లాహ్'యే పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడు, అపార కరుణా ప్రదాత[17].

**17.** నిశ్చయంగా పశ్చాత్తాపాన్ని అంగీకరించటం అల్లాహ్ కే చెందినది. ఎవరైతే అజ్ఞానంవల్ల పాపం చేసి, వెనువెంటనే పశ్చాత్తాపపడతారో! అలాంటి వారి పశ్చాత్తాపాన్ని అల్లాహ్ స్వీకరిస్తాడు. మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, మహావివేచనాపరుడు.

**18.** మరియు వారిలో ఒకడు, మరణం ఆసన్నమయ్యే వరకూ పాపకార్యాలు చేస్తూ వుండి: "ఇప్పుడు నేను పశ్చాత్తాప పడుతున్నాను!" అని అంటే అలాంటి వారి పశ్చాత్తాపం మరియు మరణించే వరకు సత్యతిరస్కారులుగా ఉన్నవారి (పశ్చాత్తాపం) స్వీకరించబడవు[18]. అలాంటి వారి కొరకు మేము బాధాకరమైన శిక్షను సిద్ధపరచి ఉంచాము.

**19.** ఓ విశ్వాసులారా! మీరు బలవంతంగా స్త్రీలకు వారసులు కావటం మీకు ధర్మసమ్మతం కాదు మరియు మీరు వారికిచ్చినదాని (మహ్ర్) నుండి కొంత తీసుకోవటానికి వారిని ఇబ్బంది లో పెట్టకండి, వారు నిస్సందేహంగా వ్యభిచారానికి

---

[17] ఇది వ్యభిచార నేరానికి సంబంధించిన తొలి ఆదేశం. చూడండి 24:2 మరియు 4:25. స్త్రీ-పురుషుల లైంగిక సంబంధాలే కాక, స్త్రీ-స్త్రీ, లేక పురుష-పురుష లైంగిక సంబంధాలు కూడా శిక్షింపదగినవే!

[18] దీని అర్థం ఏమిటంటే, మరణ సమయం ఆసన్నమైనప్పుడు చేసే పశ్చాత్తాపం మరియు అవిశ్వాసుని విశ్వాసం అంగీకరించబడవు. చూడండి, 3:90-91.

పాల్పడితే తప్పు[19]. మరియు మీరు వారితో గౌరవంతో సహవాసం చేయండి. ఒకవేళ మీకు వారు నచ్చకపోతే! బహుశా మీకు ఒక విషయం నచ్చకపోవచ్చు, కాని అందులోనే అల్లాహ్ ఎంతో మేలు ఉంచి ఉండవచ్చు!

20. మరియు ఒకవేళ మీరు ఒక భార్యను విడనాడి వేరొకామెను పెండ్లి చేసుకోవాలని సంకల్పించుకుంటే! మరియు మీరు ఆమెకు ఒక పెద్ద ధనరాశిని ఇచ్చి ఉన్నా సరే, దాని నుండి ఏ మాత్రం తిరిగి తీసుకోకండి. ఏమీ? ఆమెపై అపనింద మోపి, ఘోరపాపానికి పాల్పడి, దాన్ని తిరిగి తీసుకుంటారా?

21. మరియు మీరు పరస్పరం దాంపత్య సుఖం అనుభవించిన తరువాత, వారు మీ నుండి గట్టి వాగ్దానం తీసుకున్న తరువాత, మీరు దానిని (మహ్ర్ ను) ఎలా తిరిగి తీసుకోగలరు?

22. మీ తండ్రులు వివాహమాడిన స్త్రీలను మీరు వివాహమాడకండి. ఇంతకు పూర్వం జరిగిందేదో జరిగిపోయింది. నిశ్చయంగా, ఇది అసభ్యకరమైనది (సిగ్గుమాలినది), జుగుప్సాకరమైనది మరియు చెడుమార్గము.

---

[19] చూడండి, 2:229.

# 23. మీకు ఈ స్త్రీలు నిషేధింపబడ్డారు[20].

[20] ఏ స్త్రీలతో వివాహం నిషిద్ధం (హరామ్) ఉందో, వారి వివరాలు ఈ విధంగా ఉన్నాయి: అందులో ఏడుగురు రక్తసంబంధీకులు (నసబ్), ఏడుగురు పాలసంబంధీకులు (రదా'అ), మరియు నలుగురు వివాహ సంబంధీకులు. వీరే గాక, ఒక స్త్రీ మరియు ఆమె తండ్రి సోదరిని లేక ఆమె తల్లి సోదరిని ఒకేసారి నికాహ్ లో ఉంచుకోరాదు. 1) రక్తసంబంధీకులు - 7: తల్లులు, కుమార్తెలు, సోదరీమణులు, తండ్రి సోదరీమణులు, తల్లి సోదరీమణులు, సోదరుల కుమార్తెలు మరియు సోదరీమణుల కుమార్తెలు. 2) పాల సంబంధీకులు - 7: పాలు త్రాగిన తల్లులు, పాల కుమార్తెలు, తోటి పాలు త్రాగిన సోదరీమణులు, పాల తండ్రి సోదరీమణులు, పాల తల్లి సోదరీమణులు, పాల సోదరుల కుమార్తెలు, పాల సోదరీమణుల కుమార్తెలు. 3) వివాహ సంబంధీకులు - 4: భార్య తల్లి, సహవాసం చేసిన భార్య మునుపటి భర్తల కుమార్తెలు (రబాయిబ్), మునుపటి భర్తల కుమారుల భార్యలు మరియు ఇద్దరు సోదరీమణులను ఒకేసారి వివాహబంధంలో తీసుకోవటం. ఇంతేగాక తండ్రి భార్యలు. 'హదీస్' ప్రకారం భార్య వివాహబంధంలో ఉన్నంత వరకు ఆమె తండ్రి సోదరీమణులు, ఆమె తల్లి సోదరీమణులు. సోదరుల కుమార్తెలు మరియు సోదరీమణుల కుమార్తెలు. i) మొదటి విభాగపు వివరాలు / రక్తసంబంధీకుల నిషేధాలు: (1) తల్లులు అంటే: తల్లులే గాక తల్లుల తల్లులు (అమ్మమ్మలు), తల్లి నాయనమ్మలు మరియు తండ్రి తల్లులు, తాత తల్లులు, ముత్తాత తల్లులు మరియు వారి పూర్వీకులు. (2) కుమార్తెలు అంటే: కుమార్తెలే గాక, కుమారుల కుమార్తెలు, కుమార్తెల కుమార్తెలు మరియు వారి (కుమారుల కుమార్తెల) కుమార్తెల కుమార్తెలు మరియు వారి సంతానపు సంతానం కూడా. వ్యభిచారం ('జినా) వల్ల (వివాహబంధం లేకుండా) పుట్టిన ఆడపిల్ల "కూతురు" అని ఇమామ్ షాఫయి (రహ్మ.) తప్ప, ఇతర ముగ్గురు ఇమాములూ (ర.'అలైహిమ్) అంగీకరించారు కాబట్టి ఆమెతో వివాహం హరాం అన్నారు. "అతనికి - ఆమె షర'ఈ కూతురు కాదు కాబట్టి ఆస్తికి వారసురాలు కాజాలదు," అని ఇమామ్ షాఫ'ఈ (రహ్మ.) అంటారు. (ఇబ్నె-కసీర్). (3) సోదరీ మణులు అంటే: 1. సొంత (ఒకే తండ్రి-తల్లి), 2. సవతి (ఒకే తండ్రి), 3 అర్ధ (ఒకే తల్లి) నుండి గానీ కావచ్చు. (4) తండ్రి సోదరీమణులు: తండ్రి యొక్క స్త్రీ సంబంధీకులు అంటే, తండ్రి తండ్రి (తాత), మరియు తల్లి తండ్రు(తాత)ల యొక్క మూడు రకాల సోదరీమణులు కూడా అన్న మాట. మూడు రకాలు అంటే - సొంత (ఒకే తండ్రి-తల్లి), సవతి (ఒకే తండ్రి) లేక అర్ధ (ఒకే తల్లి). (5) తల్లి సోదరీమణులు: తల్లి యొక్క స్త్రీ సంబంధీకులు అంటే ఆమె తల్లి తల్లి, ఆమె తండ్రి తల్లి మరియు వారి మూడు రకాల సోదరీమణులు అన్న మాట. (6) సోదరుల కుమార్తెలలో - కూడా మూడు రకాల సోదరుల కుమార్తెలున్నారు. (7) సోదరీమణుల కుమార్తెలలో - కూడా మూడు రకాల సోదరీమణుల కుమార్తెలున్నారు. ii) రెండవ విభాగపు వివరాలు / పాల సంబంధీకుల నిషేధాలు: *పాలతల్లి - అంటే రెండు సంవత్సరాల వయస్సు లోపల నీవు పాలు త్రాగిన స్త్రీ. * పాల సోదరి - అంటే ఆ స్త్రీ, ఎవరికైతే నీ స్వంత తల్లి, లేక పాల తల్లి, పాలు త్రాపిందో - పాలు త్రాపింది నీతో పాటు గానీ, మీకు ముందు గానీ, లేక తరువాత గానీ కావచ్చు! లేక ఏ స్త్రీ యొక్క స్వంత లేక పాల తల్లి నీకు పాలిచ్చిందో, అది ఒకే సమయంలో కానీ లేక వేరే సమయాలలో గానీ కావచ్చు! * పాలు త్రాగటం వలన కూడా రక్త సంబంధీకులలో ఏ ఏ సంబంధీకులు హరామ్ అవుతారో అలాంటి వారంతా హరాం. వివరాలు ఈ విధంగా ఉన్నాయి: తల్లి యొక్క సొంత మరియు పాలు త్రాగిన పిల్లలందరూ పాలు త్రాగిన వాడి యొక్క సోదరసోదరీలు. ఆమె భర్త వాడి తండ్రిలాంటి వాడు, ఆమె భర్త సోదరీమణులు, ఆమె చెల్లెళ్ళు, ఆమె భర్త సోదరులు మొదలైన వారందరితో వాడి సంబంధం - వివాహ విషయంలో - రక్త సంబంధీకులతో మాదిరిగానే పరిగణించాలి. *కానీ పాలు త్రాగిన శిశువు యొక్క రక్త సంబంధీకులైన సోదరసోదరీమణులు, పాలు త్రాపిన తల్లి రక్త సంబంధీకులకు - ఆ శిశువుకు పాలు త్రాపినందు వల్ల - హరాం కారు. iii) మూడవ విభాగపు వివరాలు (వివాహ సంబంధీకులు): భార్య తల్లి, భార్య అమ్మమ్మ, భార్య నాయనమ్మ, ఒక స్త్రీతో నికాహ్ చేసుకొని, సంభోగించకుండా విడాకులిచ్చినా కూడా ఆమె తల్లితో వివాహం నిషిద్ధం. కాని ఒక స్త్రీతో వావాహం చేసుకొని, ఆమెతో సంభోగం చేయక ముందే విడాకులిస్తే, ఆమె కుమార్తెతో నికాహ్ చేసుకోవడం ధర్మసమ్మతమే, (ఫత్హ' అల్ ఖదీర్). ఇంకా వివరాలకు చూడండి, ఫత్హ' అల్ ఖదీర్, లేదా షరీ'అత్ వేత్తలను సంప్రదించండి.

మీ తల్లులు, మీ కుమార్తెలు, మీ సోదరీమణులు, మీ మేనత్తలు, మీ తల్లి సోదరీమణులు (పినతల్లులు), మీ సోదరుల కుమార్తెలు, మీ సోదరీమణుల కుమార్తెలు, మీకు పాలిచ్చిన తల్లులు (దాదులు), మీతో పాటు పాలు త్రాగిన సోదరీమణులు, మీ భార్యల తల్లులు; మీ సంరక్షణలో ఉన్న మీ భార్యల కుమార్తెలు - ఏ భార్యలతోనైతే మీరు సంభోగించారో- కాని మీరు వారితో సంభోగించక ముందు (వారికి విడాకులిచ్చి వారి కూతుళ్ళను పెండ్లాడితే) తప్పులేదు; మీ వెన్ను నుండి పుట్టిన మీ కుమారుల భార్యలు మరియు ఏకకాలం లో అక్కాచెల్లెళ్ళను ఇద్దరినీ చేర్చటం (భార్యలుగా చేసుకోవటం నిషిద్ధం); కాని ఇంతకు పూర్వం జరిగిందేదో జరిగి పోయింది. నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణాప్రదాత.

24. మరియు ఇతరుల వివాహబంధంలో ఉన్న స్త్రీలు - (ధర్మయుద్ధంలో) మీ చేతికి చిక్కిన బానిస స్త్రీలు తప్ప- (మీరు వివాహమాడటానికి నిషేధించబడ్డారు). ఇది అల్లాహ్ మీకు విధించిన అనుశాసనం. మరియు వీరు తప్ప మిగతా స్త్రీలంతా మీకు వివాహమాడటానికి ధర్మసమ్మతం చేయబడ్డారు. మీరు వారికి తగిన స్త్రీశుల్కం (మహ్ర్) ఇచ్చి వ్యభిచారంగా కాకుండా వివాహబంధంలో తీసుకోవటానికి కోరవచ్చు. కావున మీరు దాంపత్య సుఖాన్ని అనుభవించాలనుకున్న వారికి, వారి స్త్రీశుల్కం (మహ్ర్) విధిగా చెల్లించండి.

కాని స్త్రీ శుల్కం (మహ్ర్) ఒప్పందం జరిగిన తరువాత పరస్పర అంగీకారంతో మీ మధ్య ఏమైనా రాజీ కుదిరితే, అందులో దోషం లేదు. నిశ్చయంగా, అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేకవంతుడు.

**25.** మరియు మీలో ఎవరికైనా స్వతంత్రులైన ముస్లిం స్త్రీలను, వివాహం చేసుకునే స్తోమత లేకుంటే, అప్పుడు మీ స్వాధీనంలో ఉన్న ముస్లింలైనటువంటి బానిస స్త్రీలను వివాహ మాడవచ్చు. మరియు అల్లాహ్ కు మీ విశ్వాసం గురించి తెలుసు. మీరంతా ఒకే ఒక వర్గానికి చెందిన వారు[21]. (ఒకరికొకరు సంబంధించిన వారు), అందువల్ల వారి సంరక్షకుల అనుమతితో వారితో వివాహం చేసుకొని, ధర్మప్రకారంగా వారి స్త్రీశుల్కం (మహ్ర్) ఇవ్వండి. ఇది వారిని వివాహబంధంలో సురక్షితంగా ఉంచటానికి, స్వేచ్ఛా కామక్రీడలకు దిగకుండా ఉంచటానికి మరియు దొంగచాటు సంబంధాలు ఏర్పరచుకోకుండా ఉంచటానికి (ఆదేశించ బడింది). వారు (ఆ బానిస స్త్రీలు) వివాహ బంధంలో రక్షణ పొందిన తరువాత కూడా వ్యభిచారానికి పాల్పడితే, స్వతంత్రులైన స్త్రీలకు విధించే శిక్షలోని సగం శిక్ష వారికి విధించండి[22]. ఇది మీలో పాపభీతి గలవారికి వర్తిస్తుంది. ఒకవేళ మీరు నిగ్రహం పాటిస్తే అది మీకే మంచిది. మరియు అల్లాహ్ క్షమాశీలుడు. అపార కరుణాప్రదాత.

---

[21] చూడండి, 3:195.
[22] అంటే, 50 కొరడా దెబ్బలు.

26. అల్లాహ్ మీకు (ధర్మ-అధర్మాలను) స్పష్టం చేయాలనీ మరియు మీ కంటే పూర్వం ఉన్న (సత్పురుషుల)మార్గం వైపునకు మీకు మార్గదర్శకత్వం చేయాలనీ మరియు మీ పశ్చాత్తాపాన్ని అంగీకరించాలనీ కోరుతున్నాడు మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేకవంతుడు.

27. మరియు అల్లాహ్ మీ పశ్చాత్తాపాన్ని అంగీకరించగోరుతున్నాడు. కాని తమ మనోవాంఛలను అనుసరిస్తున్నవారు, మీరు(సన్మార్గం నుండి) చాలా దూరంగా వైదొలగాలని కోరుతున్నారు

28. అల్లాహ్ మీ భారాన్ని తగ్గించగోరు తున్నాడు. మరియు (ఎందుకంటే) మానవుడు బలహీనుడిగా సృష్టించబడ్డాడు.

29. ఓ విశ్వాసులారా! మీరు ఒకరి సొమ్ము నొకరు అన్యాయంగా తినకండి, పరస్పర అంగీకారంతో చేసే వ్యాపారం వల్ల వచ్చేది (లాభం) తప్ప[23]. మరియు మీరు ఒకరినొకరు చంపు కోకండి[24]. నిశ్చయంగా, అల్లాహ్ మీ యెడల అపార కరుణాప్రదాత.

30. మరియు ఎవడు ద్వేషంతో మరియు దుర్మార్గంతో అలా చేస్తాడో, వానిని మేము నరకాగ్నిలో పడవేస్తాము. మరియు అది అల్లాహ్ కు ఎంతో సులభం.

31. ఒకవేళ మీకు నిషేధించబడి నటువంటి మహాపాపాలకు

---

[23] నిషిద్ధ (హరాం) వస్తువుల వ్యాపారం కూడా నిషిద్ధమే.
[24] ఇందులో ఆత్మహత్య కూడా ఉంది. అది మహాపాపం.

మీరు దూరంగా ఉంటే, మేము మీ చిన్నచిన్న దోషాలను మన్నించి, మిమ్మల్ని గౌరవస్థానాల్లోకి ప్రవేశింపజేస్తాము[25].

32. మరియు అల్లాహ్ మీలో కొందరికి మరికొందరిపై ఇచ్చిన ఘనతను మీరు ఆశించకండి. పురుషులకు తాము సంపాదించిన దానికి తగినట్లుగా ఫలితం ఉంటుంది. మరియు స్త్రీలకు తాము సంపాదించిన దానికి తగినట్లుగా ఫలితం ఉంటుంది. మరియు అల్లాహ్ అనుగ్రహం కొరకు ప్రార్థిస్తూ ఉండండి. నిశ్చయంగా, అల్లాహ్ కు ప్రతిదాని పరిజ్ఞానం ఉంది.

33. మరియు తల్లిదండ్రులు మరియు దగ్గరి బంధువులు, వదలి పోయిన ప్రతి వ్యక్తి (ఆస్తి) కి మేము వారసులను నియమించి ఉన్నాము. మరియు మీరు ఎవరితో ప్రమాణ పూర్వక ఒప్పందాలను చేసుకొని ఉన్నారో! వారి భాగాన్ని వారికి ఇచ్చి వేయండి. నిశ్చయంగా, అల్లాహ్ ప్రతిదానికి సాక్షిగా ఉంటాడు[26].

---

[25] అబూ హురైరా (ర'ది.'అ.) కథనం, దైవప్రవక్త ('స'అస) అన్నారు : "ఏడు మహా పాపాల నుండి దూరంగా ఉండండి. అవి : 1) ఆరాధనలో అల్లాహ్ (సు.తా.)కు సాటి కల్పించటం, 2) మంత్రజాలం పాటించటం, 3) ఎవరినైనా హత్య చేయటం (న్యాయానికి తప్ప), 4) వడ్డీ తినటం 5) అనాథుల ఆస్తిని కబళించటం, 6) యుద్ధరంగం నుండి వెన్ను చూపి పారిపోవటం మరియు 7) పతివ్రత స్త్రీలపై అపనింద మోపటం." ('స. బు'ఖారీ, పుస్తకం - 8, 'హదీస్' నం. 840).

[26] చూడండి, 'స.బు'ఖారీ పుస్తకం - 3, 'హదీస్' నం. 489.

**34.** పురుషులు స్త్రీలపై నిర్వాహకులు (ఖవ్వామూన్)[27], ఎందుకంటే అల్లాహ్ కొందరికి మరికొందరిపై ఘనత నిచ్చాడు మరియు వారు (పురుషులు) తమ సంపదలో నుండి వారిపై (స్త్రీలపై) ఖర్చు చేస్తారు. కావున సుగుణవంతులైన స్త్రీలు విధేయవతులై ఉండి, భర్తలు (దగ్గర) లేనప్పుడు, అల్లాహ్ కాపాడమని ఆజ్ఞాపించిన దానిని (శీలమును) కాపాడుకుంటారు. కానీ అవిధేయత చూపుతారని మీకు భయముంటే, వారికి (మొదట) నచ్చ జెప్పండి, (తరువాత) పడకలో వేరుగా ఉంచండి, (ఆ తరువాత కూడా వారు విధేయులు కాకపోతే) వారిని (మెల్లగా) కొట్టండి[28]. కాని వారు మీకు విధేయులై ఉంటే! వారిని నిందించటానికి మార్గం వెతకకండి. నిశ్చయంగా, అల్లాహ్ మహోన్నతుడు,

---

[27] ఖవ్వామూన్: ఖామా నుండి అంటే నిలబడు, ఆధారమిచ్చేవారు, బాధ్యులు, అధికారులు, పోషకులు, రక్షకులు, నిర్వాహకులు, వ్యవహారకర్తలు అనే అర్థాలున్నాయి. ఇస్లాంలో స్త్రీల బాధ్యత ప్రతిదశలో పురుషులపై ఉంది. బాల్యం నుండి వివాహమయ్యే వరకు, తండ్రిపై, తరువాత భర్తపై, భర్త లేకుంటే సోదరుని పై లేక కుమారునిపై, చివరకు దగ్గరి బంధువులు ఎవ్వరూ లేకుంటే, ఇస్లామీయ ప్రభుత్వంపై ఉంటుంది.

[28] ఎన్నో 'స'హీ'హ్ హదీస్'ల ప్రకారం, ఒకవేళ స్త్రీ అశ్లీలానికి పాల్పడితేనే, అది కూడా ఆమెకు ఎక్కువ బాధ కలిగించకుండా మెల్లగా మాత్రమే కొట్టాలని బోధింపబడింది. ('సహీసిత్తా, అ'హ్మద్, ఇబ్నె-'హిబ్బాన్, 'హాకిం, 'అబ్దుల్లాహ్ ఇబ్నె 'అబ్బాస్ ర'ది.'అ. కథనం; బైహఖి, ఉమ్మె-కుల్ సూ'మ్ ర.'అన్హా కథనం).

మహనీయుడు[29].

**35.** మరియు వారిద్దరి (భార్యాభర్తల) మధ్య సంబంధాలు తెగి పోతాయనే భయం మీకు కలిగితే అతని (భర్త) బంధువుల నుండి ఒక మధ్యవర్తిని మరియు ఆమె (భార్య) బంధువుల నుండి ఒక మధ్యవర్తిని నియమించండి. వారిద్దరూ సంధి చేసుకోగోరితే అల్లాహ్ వారి మధ్య ఐకమత్యం చేకూర్చవచ్చు! నిశ్చయంగా, అల్లాహ్ సర్వజ్ఞుడు, సర్వం తెలిసినవాడు.

**36.** మరియు మీరు అల్లాహ్ నే ఆరాధించండి మరియు ఎవ్వరినీ ఆయనకు భాగస్వాములుగా సాటి కల్పించకండి. మరియు తల్లిదండ్రులతో, దగ్గరి బంధువులతో అనాథులతో, నిరుపేదలతో, బంధువులైన పొరుగువారితో, అపరిచితులైన పొరుగువారితో[30], ప్రక్కనున్న మిత్రులతో, బాటసారులతో మరియు మీ ఆధీనంలో ఉన్న బానిసలతో అందరితోనూ ఉదార స్వభావంతో

---

[29] కబీరున్ (అల్ - కబీర్): = అల్ 'అ"జీము, The Greatest, The most Magnified, మహానీయుడు, మహాత్వం, ప్రభావం గలవాడు, సర్వాధికుడు. చూడండి, 22:62, 31:30, 34:23, 40:12. అల్ - ముతకబ్బిరు: The Incomparably Great, గొప్పవాడు, గొప్పదనానికి సరోవరం, 59:23. ఇవి అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లు.

[30] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: "అల్లాహ్ (సు.తా.) మరియు అంతిమ దినాన్ని విశ్వసించేవాడు, తన పొరుగువాడికి మేలు చేయాలి." ('స'హీ'హ్ బు'ఖారీ, 'స. ముస్లిం).

వ్యవహరించండి[31]. నిశ్చయంగా అల్లాహ్ గర్వితుణ్ణి, బడాయీలు చెప్పుకునేవాణ్ణి ప్రేమించడు[32]

37. ఎవరైతే తాము లోభులై, ఇతరులకు లోభం నేర్పుతారో వారినీ మరియు అల్లాహ్ తన అనుగ్రహంతో ఇచ్చిన దానిని దాచి పెట్టే వారినీ (అల్లాహ్ ప్రేమించడు)[33]. మరియు మేము సత్యతిరస్కారుల కొరకు అవమానకరమైన శిక్షను సిద్ధపరచి ఉంచాము.

38. మరియు వారికి, ఎవరైతే ప్రజలకు చూపటానికి తమ సంపదను ఖర్చుపెడతారో మరియు అల్లాహ్ ను మరియు అంతిమ దినాన్ని విశ్వసించరో! మరియు ఎవడైతే షైతాన్ ను తన స్నేహితునిగా (ఖరీనున్ గా) చేసుకుంటాడో![34] అతడు ఎంత నీచమైన స్నేహితుడు.

39. మరియు వారు ఒకవేళ అల్లాహ్ ను మరియు అంతిమ దినాన్ని విశ్వసించి అల్లాహ్ వారికి ప్రసాదించిన జీవనోపాధి నుండి ఇతరులపై ఖర్చుచేసి ఉంటే వారికే మయ్యేది? మరియు అల్లాహ్ కు, వారిని గురించి బాగా తెలుసు.

40. నిశ్చయంగా, అల్లాహ్ ఎవరికీ రవ్వంత

---

[31] బానిసలను విడిపించటం ఎంతో ఉత్తమమైన కార్యం చూడండి, 9:60 మరియు 2:177.

[32] చూడండి, 'స'హీ'హ్ ముస్లిం కితాబుల్ ఈమాన్, బాబె త'హ్రీమ్, 'హదీస్' నం. 91.

[33] 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 2, 'హదీస్' నం. 522.

[34] చూడండి, 2:268 మరియు 41:25.

(పరమాణువంత) అన్యాయం కూడా చేయడు[35]. ఒక సత్కార్యముంటే ఆయన దానిని రెండింతలు చేస్తాడు; మరియు తన తరఫు నుండి గొప్ప ప్రతిఫలాన్ని కూడా ప్రసాదిస్తాడు.

**41.** మేము (ప్రతిఫలదినమున) ప్రతి సమాజం నుండి ఒక సాక్షిని తెచ్చి మరియు (ఓ ప్రవక్తా!) నిన్ను వీరికి సాక్షిగా నిలబెట్టినప్పుడు ఎలా ఉంటుంది?

**42.** ఆ (ప్రతిఫల) దినమున, ప్రవక్త మాటను తిరస్కరించి, అతనికి అవిధేయత చూపిన వారంతా; తాము భూమిలో పూడ్చబడితే ఎంత బాగుండేదని కోరుతారు! కానీ, వారు అల్లాహ్ ముందు ఏ విషయాన్నీ దాచలేరు[36].

**43.** ఓ విశ్వాసులారా! మీరు మత్తులో ఉంటే[37], మీరు పలికేది గ్రహించనంత వరకు మరియు మీకు ఇంద్రియ స్ఖలనం (జునుబున్) అయి ఉంటే - స్నానం చేయనంత వరకు - నమాజ్ సమీపానికి వెళ్ళకండి; కాని నడుస్తూ (మస్జిద్) నుండి దాట వలసి వస్తే తప్ప[38]. కాని ఒకవేళ మీరు రోగపీడితులై ఉంటే లేదా ప్రయాణంలో ఉంటే లేక మలమూత్రవిసర్జన చేసి ఉంటే లేక స్త్రీలతో

---

[35] చూడండి, 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 6, 'హదీస్' నం. 105.
[36] చూడండి, 3:85.
[37] ఇది మద్యపానానికి సంబంధించిన రెండవ ఆజ్ఞ. మొదటి ఆజ్ఞ 2:219లో వచ్చింది. ఈ ఆజ్ఞ వచ్చి నప్పుడు, ఇంకా మద్యపానాన్ని హరాం చేసిన ఆయతు (5:90) అవతరించబడలేదు.
[38] అంటే మస్జిద్ నుండి దాటిపోతే ఎలాంటి పాపం లేదు. (ఇబ్నె-కసీ'ర్). ప్రయాణీకులను గురించిన ఆజ్ఞ ముందు వస్తోంది.

సంభోగం చేసి ఉంటే - మీకు నీళ్ళు దొరక్కపోతే - పరిశుద్ధమైన మట్టిని చేతులతో స్పర్శించి, ఆ చేతులతో మీ ముఖాలను మరియు మీ చేతులను, తుడుచుకోండి (తయమ్మమ్ చేయండి)[39]. నిశ్చయంగా అల్లాహ్ తప్పులను మన్నించేవాడు, క్షమించేవాడు.

**44.** ఏమీ? గ్రంథజ్ఞానంలో కొంతభాగం ఇవ్వబడిన వారిని గురించి నీకు తెలియదా (చూడలేదా)? వారు మార్గభ్రష్టత్వాన్ని కొనుక్కుంటున్నారు మరియు మీరు కూడా సన్మార్గం నుండి తప్పి పోవాలని కోరుతున్నారు.

**45.** మరియు అల్లాహ్ మీ శత్రువులను బాగా ఎరుగును. కావున మీ రక్షకుడుగా అల్లాహ్ యే చాలు మరియు మీకు సహాయకుడుగా కూడా అల్లాహ్ యే చాలు!

**46.** యూదులలో కొందరు పదాలను వాటి సందర్భాల నుండి తారుమారు చేసి అంటారు: "మేము (నీ మాటలను) విన్నాము మరియు ఉల్లంఘించాము (సమి'అనా వ 'అ'సయ్ నా)." అనీ; మరియు: "విను! నీ మాట వినకబోవు గాక! (వస్ మ 'అ

---

[39] తయమ్మమ్ విధానం: ఒకసారి మీ అరచేతులతో పరిశుద్ధ భూమి (మట్టి)ని తాకండి. వాటితో ముఖాన్ని తుడుచుకోండి, తరువాత మీ రెండు చేతుల వెనుక భాగాలను మణికట్ల వరకు తుడుచుకోండి. (ముస్నద్ అ'హ్మద్ పుస్తకం - 4, పేజీ - 263. ఇంకా చూడండి, 5:6).

'గైర మస్ మ'ఇన్)[40]." అనీ; మరియు (ఓ ముహమ్మద్!) నీవు మా మాట విను (రా'ఇనా)[41] అనీ తమ నాలుకలను మెలి త్రిప్పి సత్యధర్మాన్ని ఎగతాళి చేసే ఉద్దేశ్యంతో అంటారు. కాని అలా కాకుండా: "విన్నాము, విధేయులమయ్యాము (సమి'అనా వఅ'త'అనా)" అనీ; మరియు: "మమ్మల్ని విను మరియు మా దిక్కుచూడు/ మాకు వ్యవధినివ్వు (వస్ మ'అ వన్'జుర్ నా)" అనీ, అని ఉంటే వారికే మేలై ఉండేది మరియు ఉత్తమమైన పద్ధతిగా ఉండేది. కాని వారి సత్యతిరస్కార వైఖరి వల్ల అల్లాహ్ వారిని శపించాడు (బహిష్కరించాడు). కావున వారిలో కొందరు మాత్రమే విశ్వసించేవారు ఉన్నారు.

**47.** ఓ గ్రంథ ప్రజలారా! మీ వద్ద ఉన్న గ్రంథాన్ని ధృవపరుస్తూ, మేము అవతరింపజేసిన దానిని (ఈ ఖుర్ఆన్'ను) విశ్వసించండి, మేము మీ ముఖాలను వికృతం చేసి వాటిని వెనక్కి త్రిప్పక ముందే (నాశనం చేయక ముందే) లేక మేము

---

[40] యూదులు దైవప్రవక్త ('స'అస)ను వినినప్పుడు, ఎగతాళి చేస్తూ ఇలా అనేవారు: సమి'అనా వ 'అ'సయ్ నా. "మేము నీ మాటను విన్నాము." అని బిగ్గరగా అని తరువాత ముఖం త్రిప్పుకొని గాని, లేక మెల్లగా గాని కొన్నిసార్లు ఎగతాళిగా గానీ అతని ('స'అస) ముఖం మీద కూడా "ఉల్లంఘించాము," అని అనేవారు. అదే విధంగా: వస్ మ'అ 'గైర మస్ మ'ఇన్ అంటే "విను! నీ మాట వినకుండాబోవు గాక!" లేక "నీ మాట అంగీకరించబడక పోవు గాక!" అని శపించేవారు. ఇంకా చూడండి, 2:93.

[41] రా'ఇనా: కొరకు చూడండి 2:104.

సబ్త్' వారిని శపించినట్లుగా (బహిష్కరించినట్లుగా) మిమ్మల్ని కూడా శపించక (బహిష్కరించక) ముందే (దీనిని విశ్వసించండి)[42] . ఎందుకంటే! అల్లాహ్ ఆజ్ఞ తప్పకుండా నిర్వహించబడుతుంది.

**48.** నిశ్చయంగా అల్లాహ్ తనకు భాగస్వామిని (సాటి) కల్పించటాన్ని ఏమాత్రమూ క్షమించడు[43] మరియు అది తప్ప దేనిని (ఏ పాపాన్ని ) అయినా, ఆయన తాను కోరిన వారిని క్షమిస్తాడు. మరియు అల్లాహ్ కు భాగస్వాములను కల్పించినవాడే, వాస్తవానికి మహాపాపం చేసిన వాడు!

**49.** ఏమీ? తమను తాము పవిత్రులమని చెప్పుకునేవారిని (యూదులు మరియు క్రైస్తవులను) గురించి నీకు తెలియదా (చూడలేదా)?[44] వాస్తవానికి, అల్లాహ్ తాను కోరిన వారికి మాత్రమే పవిత్రతను ప్రసాదిస్తాడు[45] మరియు వారికి ఖర్జూర బీజపు చీలికలోని పొర అంత అన్యాయం కూడా చేయబడదు.[46]

---

[42] చూడండి, 2:65, 7:163 - 166. ఇంకా చూడండి, 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 1, అధ్యాయం - 240.

[43] అల్లాహ్ (సు.తా.)కు సాటి (భాగస్వాములను) కల్పించటం మహా దుర్మార్గం మరియు క్షమించరాని పాపం. కావున ఇది ఎంత మాత్రం క్షమించబడదు. ముష్రికులకు స్వర్గం నిషేధించబడింది. ఇంకా చూడండి, 31:13. నిశ్చయంగా, బహుదైవారాధన (షిర్క్) గొప్ప దుర్మార్గం, ('స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 4, 'హదీస్' నం. 551).

[44] చూడండి, 9:31.

[45] చూడండి, 53:32.

[46] ఫతీల: ఖర్జూర బీజపు చీలికలోని పొర. సన్నని దారమంత లేక రవ్వంత అని అర్థం.

50. చూడండి! వారు అల్లాహ్ ను గురించి ఏ విధమైన అబద్ధాన్ని కల్పిస్తున్నారో? మరియు స్పష్టమైన పాపం, అని చెప్పటానికి ఇది చాలు.

51. ఏమీ? గ్రంథజ్ఞానంలో కొంతభాగం ఇవ్వబడిన వారిని గురించి నీకు తెలియదా? వారు జిబ్త్[47] మరియు తాగూత్[48] లలో విశ్వాసముంచుతున్నారు. వారు సత్యతిరస్కారులను గురించి: "విశ్వాసుల కంటే, వీరే సరైన మార్గంలో ఉన్నారు." అని అంటారు.

52. ఇలాంటి వారే, అల్లాహ్ శాపానికి (బహిష్కారానికి) గురి అయిన వారు. మరియు అల్లాహ్ శపించిన వాడికి సహాయపడేవాడిని ఎవ్వడినీ నీవు పొందలేవు.

53. లేదా వారికి రాజ్యపాలనలో భాగం ఉందా? ఒకవేళ ఉండి ఉంటే, వారు ప్రజలకు ఖర్జూరబీజపు చీలిక[49] అంత భాగం కూడా ఇచ్చేవారు కాదు.

54. లేదా! అల్లాహ్ తన అనుగ్రహంతో ప్రజలకు ప్రసాదించిన (సౌభాగ్యాన్ని) చూసి వారు ఈర్ష్య పడుతున్నారా? వాస్తవానికి (ఇంతకు ముందు) మేము ఇబ్రాహీమ్ కుటుంబం వారికి, గ్రంథాన్ని

[47] జిబ్త్: అంటే అసలు అర్థం అసత్యమైనది, ఆధారం లేనిది, నిరుపయోగమైనది. ఇస్లాం పరిభాషలో మంత్ర తంత్రాలు, జ్యోతిషం, భూతవైద్యం, శకునాలు, ముహూర్తాలు మరియు ఊహాపోహాలకు సంబంధించిన అన్ని విషయాలను జిబ్త్ తో పోల్చవచ్చు.

[48] 'తా'గూత్: చూడండి,2:256 వ్యాఖ్యానం3. 'తా'గూత్ అంటే షై'తాన్ అని కూడా అర్థం ఎందుకంటే కల్పిత దైవాలను ఆరాధించటం షై'తాన్'ను అనుసరించటమే. కావున షై'తాన్ కూడా 'తా'గూత్'లలో చేరుతాడు.

[49] నఖీరా: ఖర్జూర బీజపు చీలిక.

మరియు వివేకాన్ని ప్రసాదించాం మరియు వారికి గొప్ప సామ్రాజ్యాన్ని కూడా ప్రదానం చేశాము

**55.** కాని వారిలో కొందరు అతనిని (ప్రవక్తను) విశ్వసించిన వారు ఉన్నారు, మరికొందరు అతని నుండి విముఖులైన వారూ ఉన్నారు. మరియు వారికి దహించే నరకాగ్నియే చాలు![50]

**56.** నిశ్చయంగా, ఎవరు మా సూచనలను తిరస్కరించారో! వారినిమేముముమ్ముందునరకాగ్నిలోపడవేస్తాము. ప్రతిసారీ వారి చర్మాలు కాలిపోయి నపుడల్లా వాటికి బదులుగా - వారు బాధను బాగా రుచి చూడటానికి - వేరే చర్మాలతో మార్చుతాము. నిశ్చయంగా, అల్లాహ్ సర్వశక్తిమంతుడు మహావివేచనాపరుడు.

**57.** మరియు ఎవరైతే విశ్వసించి సత్కార్యాలు చేస్తారో, వారిని మేము క్రింద కాలువలు ప్రవహించే వనాలలో ప్రవేశింపజేస్తాము; వారందులో, శాశ్వతంగా కలకాలం ఉంటారు. అందు వారికి పవిత్ర సహవాసులు (అజ్వాజ్) ఉంటారు. మరియు మేము వారిని దట్టమైన నీడలలో ప్రవేశింపజేస్తాము.[51]

**58.** పూచీలను (అమానాత్ లను) తప్పక వాటికి అర్హులైన వారికి అప్పగించండనీ మరియు ప్రజల మధ్య తీర్పు చేసేటప్పుడు న్యాయంగా తీర్పు చేయండనీ, అల్లాహ్ మిమ్మల్ని ఆజ్ఞాపిస్తున్నాడు. నిశ్చయంగా, అల్లాహ్ ఎంత ఉత్తమమైన హితబోధ

---

[50] చూడండి, 3:85.
[51] చూడండి, 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 4, 'హదీస్' నం. 474.

చేస్తున్నాడు! నిశ్చయంగా, అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వం చూసేవాడు.

59. ఓ విశ్వాసులారా! మీరు అల్లాహ్ కు విధేయులై ఉండండి; మరియు ఆయన సందేశహరునికి విధేయులై ఉండండి మరియు మీలో అధికారం అప్పగించబడిన వారికి కూడా! మీ మధ్య ఏ విషయంలోనైనా అభిప్రాయ భేదం కలిగితే - మీరు అల్లాహ్ ను అంతిమ దినాన్ని విశ్వసించే వారే అయితే - ఆ విషయాన్ని అల్లాహ్ కు మరియు ప్రవక్తకు నివేదించండి[52]. ఇదే సరైన పద్ధతి మరియు ఫలితాన్ని బట్టి కూడా ఉత్తమమైనది.

60. (ఓ ప్రవక్తా!) ఏమీ? నీ వద్దకు పంపబడిన దానిని మరియు నీ కంటే పూర్వం పంపబడిన దానిని మేము విశ్వసించామని పలికే వారిని (కపట విశ్వాసులను) నీవు ఎరుగవా (చూడలేదా)? తిరస్కరించండని ఆదేశింపబడినా, వారు తమ (వ్యవహారాల) పరిష్కారాలకు తాగూత్[53] వద్దకే పోవాలని కోరుతూ ఉంటారు. మరియు షైతాన్ వారిని, త్రోవ తప్పించి, దుర్మార్గంలో అతి దూరంగా తీసుకొని పోవాలని కోరుతుంటాడు.

61. మరియు వారితో: "అల్లాహ్ అవతరింపజేసిన వాటి (ఆదేశాల) వైపునకు మరియు ప్రవక్త వైపునకు రండి." అని చెప్పినపుడు, నీవు ఆ

[52] అంటే ఖుర్ఆన్ మరియు ప్రవక్త సంప్రదాయా (సున్నత్)లు చూడండి, 4:65, 7:54, 12:40, 4:80.

[53] 'తా'గూత్ కు చూడండి, 2:256 వ్యాఖ్యానం 3.

కపట విశ్వాసులను విముఖులై (నీ వైపునకు రాకుండా) తొలిగి పోవటాన్ని చూస్తావు!

**62.** అయితే వారు తమ చేతులారా చేసుకున్న (దుష్కార్యాల) ఫలితంగా వారికి బాధ కలిగి నపుడు, వారు నీ దగ్గరకు వచ్చి అల్లాహ్ పేర ప్రమాణాలు చేస్తూ: "మేము మేలు చేయాలనీ మరియు ఐకమత్యం చేకూర్చాలనీ మాత్రమే ప్రయత్నించాము." అని అంటారు[54].

**63.** అలాంటి వారినీ (కపట విశ్వాసులనూ) ! వారి హృదయాలలో ఉన్నదీ అల్లాహ్ ఎరుగును, కావున వారి నుండి ముఖం త్రిప్పుకో, వారికి ఉపదేశం చెయ్యి మరియు వారిని గురించి వారి హృదయాలు ప్రభావితమయ్యే మాట పలుకు.

**64.** మరియు మేము ఏ ప్రవక్తను పంపినా - అల్లాహ్ అనుజ్ఞతో - (ప్రజలు) అతనిని అనుసరించాలనే పంపాము. మరియు ఒకవేళ వారు తమకు తాము అన్యాయం చేసుకున్నప్పుడు, నీ వద్దకు వచ్చి వారు అల్లాహ్ యొక్క క్షమాభిక్ష కోరినప్పుడు - ప్రవక్త కూడా వారికై అల్లాహ్ యొక్క క్షమాభిక్ష కొరకు వేడుకున్నప్పుడు - వారు అల్లాహ్ ను నిశ్చయంగా, క్షమించేవాడు గానూ మరియు కరుణాప్రదాతగానూ పొందుతారు.

**65.** అలా కాదు, నీ ప్రభువు సాక్షిగా! వారు తమ పరస్పర విభేదాల విషయంలో నిన్ను న్యాయనిర్ణేతగా స్వీకరించనంత వరకు మరియు

---

[54] చూడండి, 2:10-11.

(ఓ ప్రవక్తా!) నీవు ఏ నిర్ణయం చేసినా దానిని గురించి వారి మనస్సులలో ఏ మాత్రం సంకోచం లేకుండా దానికి (యథాతథంగా) శిరసా వహించనంతవరకు, వారు (నిజమైన) విశ్వాసులు కాలేరు![55]

66. మరియు ఒకవేళ వాస్తవానికి మేము వారిని: "మీ ప్రాణాల బలి ఇవ్వండి లేదా మీ ఇల్లూ వాకిళ్ళను విడిచి వెళ్ళండి!" అని ఆజ్ఞాపించి (విధిగా చేసి) ఉంటే, వారిలో కొందరు మాత్రమే అలా చేసి ఉండేవారు. ఒకవేళ వారికి ఉపదేశించినట్లు వారు చేసి ఉంటే, నిశ్చయంగా, అది వారికే శ్రేయస్కరమైనదిగా మరియు వారి (విశ్వాసాన్ని) దృఢపరిచేదిగా ఉండేది.

67. మరియు అప్పుడు వారికి మేము, మా వైపు నుండి గొప్ప ప్రతిఫలం ఇచ్చి ఉండేవారం.

68. మరియు మేము వారికి ఋజుమార్గం వైపునకు మార్గదర్శకత్వం చేసి ఉండేవారం.

69. మరియు ఎవరు అల్లాహ్ కు మరియు ప్రవక్తకు విధేయులై ఉంటారో, అలాంటి వారు అల్లాహ్ అనుగ్రహం

---

[55] 'జుబైర్ (ర'ది.'అ.) దైవప్రవక్త ('స'అస) యొక్క తండ్రి సోదరీమణి (మేనత్త) కుమారులు. అతను ఒకసారి చేనుకు నీరు ప్రవహించే కాలువ గురించి ఒక విశ్వాసితో పోట్లాడుతారు. వారిద్దరూ దైవప్రవక్త ('స'అస) దగ్గరకు తీర్పు కోసం వస్తారు. అతను న్యాయంగా 'జుబైర్ (ర'ది.'అ.) పక్షాన తీర్పు చేయగా, ఆ రెండో వ్యక్తి అంగీకరించడు. పైగా అతడు: 'జుబైర్ (ర'ది.'అ.) మీ బంధువు కాబట్టి, అతని పక్షాన తీర్పు చేశారు, అని అంటాడు. ఆ సందర్భంలో ఈ ఆయత్ అవతరింపజేయబడింది. 'స, బు'ఖారీ, సూరహ్ అన్-నిసాఅ' (4), వ్యాఖ్యానం.

పొందిన ప్రవక్తలతోనూ సత్యవంతులతోనూ, (అల్లాహ్) ధర్మం కొరకు ప్రాణాలు కోల్పోయిన అమర వీరుల (షహీదుల) తోనూ, సద్వర్తనులతోనూ చేరి ఉంటారు. మరియు అలాంటి వారి సాంగత్యం ఎంతో మేలైనది![56]

70. అల్లాహ్ నుండి లభించే అనుగ్రహం ఇలాంటిదే. మరియు (యథార్థం) తెలుసుకోవటానికి అల్లాహ్ చాలు.

71. ఓ విశ్వాసులారా! మీరు (అన్ని విధాలుగా యుద్ధానికిసిద్ధమై)తగినజాగ్రత్తలువహించండి![57] మీరు (యుద్ధానికి) జట్లుగానో లేదా అందరూ కలిసియో బయలు దేరండి.

72. మరియు వాస్తవానికి మీలో వెనుక ఉండి పోయేవాడు ఉన్నాడు. ఒకవేళ మీకు ఏమైనా ఆపద వస్తే అప్పుడు వాడు: "వాస్తవానికి అల్లాహ్ నన్ను అనుగ్రహించాడు, అందుకే నేను కూడా వారితో పాటు లేను!" అని అంటాడు.

73. మరియు ఒకవేళ మీకు అల్లాహ్ తరఫు నుండి అనుగ్రహమే లభిస్తే![58] మీకూ అతనికి మధ్య ఏ

---

[56] మానవుడు ఎవరినైతే ప్రేమిస్తాడో వారితో బాటు ఉంటాడు. ('స. బు'ఖారీ, కితాబుల్ ఆదాబ్, బాబ్ 97, ముస్లిం 'హదీస్' నెం. 1640). మరొక 'హదీస్'లో ఇలా ఉంది: "అత్యధికంగా నఫిల్ నమా'జ్ లు చేయటం వల్ల స్వర్గంలో దైవప్రవక్త ('స'అస) సాంగత్యం లభిస్తుంది." ('స.ముస్లిం కితాబ్ అ'స్సలాహ్, బాబ్ ఫ'ద్ల్ అస్సుజూద్, 'హదీస్' నం. 488).

[57] 'హి'జ్ రకుమ్: అంటే మీ రక్షణ కొరకు మీ ఆయుధాలతో యుద్ధానికి సన్నద్ధులై ఉండండి.

[58] అంటే యుద్ధంలో మీకు విజయం మరియు విజయధనం లభిస్తే!

విధమైన అనురాగబంధమే లేనట్లుగా: "అయ్యో! నేను కూడా వారితో పాటు ఉండి ఉంటే నాకు కూడా గొప్ప విజయ ఫలితం లభించి ఉండేది కదా!" అని తప్పక అంటాడు.

**74.** కావున ఇహలోక జీవితాన్ని పరలోక జీవిత (సుఖానికి) బదులుగా అమ్మినవారు (విశ్వాసులు) అల్లాహ్ మార్గంలో పోరాడాలి మరియు అల్లాహ్ మార్గంలో పోరాడినవాడు చంప బడినా లేదా విజేయుడైనా మేము తప్పకుండా అతనికి గొప్ప ప్రతిఫలాన్ని ప్రసాదించగలం.

**75.** మరియు మీకేమయింది, మీరెందుకు అల్లాహ్ మార్గంలో మరియు నిస్సహాయులై అణచి వేయబడిన పురుషుల, స్త్రీల మరియు పిల్లల కొరకు, పోరాడటం లేదు?[59] వారు: "మా ప్రభూ! దౌర్జన్యపరులైన ఈ నగరవాసుల నుండి మాకు విమోచనం కలిగించు. నీ వద్ద నుండి మా కొరకు ఒక సంరక్షకుణ్ణి నియమించు. మరియు నీ వద్ద నుండి మా కొరకు ఒక సహాయకుణ్ణి ఏర్పాటు చేయి!" అని వేడుకుంటున్నారు.

**76.** విశ్వసించినవారు, అల్లాహ్ మార్గంలో పోరాడుతారు.

---

[59] ఇక్కడ దైవప్రవక్త ('స'అస) మదీనాకు వలస పోయిన తరువాత చాలా మంది యువకులు కూడా వలస పోయారు. వృద్ధులు, స్త్రీలు మరియు పిల్లలు అక్కడే ఉండి పోయారు. మక్కా ముష్రిక్ ఖురైషులు వారిపై అన్యాయాలు, దౌర్జన్యాలు చేయసాగారు. అప్పుడు వారు (ముస్లింలు) పై విధంగా వేడుకొన్నారు. ఇట్టి పరిస్థితులలో ముస్లింలపై జిహాద్ అత్యవసర మవుతుంది.

మరియు సత్యతిరస్కారులు తాగూత్ మార్గంలో పోరాడుతారు[60]; కావున మీరు (ఓ విశ్వాసులారా!) షైతాను అనుచరులకు విరుద్ధంగా పోరాడండి. నిశ్చయంగా, షైతాను కుట్ర బలహీనమైనదే!

**77.** "మీ చేతులను ఆపుకోండి, నమాజ్ ను స్థాపించండి, విధిదానం (జకాత్) ఇవ్వండి." అని చెప్పబడిన వారిని నీవు చూడలేదా? యుద్ధం చేయమని వారిని ఆదేశించినప్పుడు, వారిలో కొందరు అల్లాహ్ కు భయపడవలసిన విధంగా మానవులకు భయపడు తున్నారు. కాదు! అంతకంటే ఎక్కువగానే భయపడుతున్నారు. వారు: "ఓ మా ప్రభూ! యుద్ధం చేయమని ఈ ఆజ్ఞను మా కొరకు ఎందుకు విధించావు? మాకు ఇంకా కొంత వ్యవధి ఎందుకివ్వలేదు?[61] అని అంటారు. వారితో ఇలా అను: "ఇహలోక సుఖం తుచ్ఛమైనది మరియు దైవభీతి గల వారికి పరలోక సుఖమే ఉత్తమమైనది. మరియు మీకు

---

[60] 'తా'గూత్: అంటే షై'తాన్. చూడండి, 2:256 వ్యాఖ్యానం 3.

[61] ఇస్లాం ఆరంభ దినాలలో మొట్టమొదట, మక్కా ముస్లింలకు సహనం వహించండి, నమా'జ్ చేయండి మరియు 'జకాత్ ఇవ్వండి, అని ఆదేశాలు ఇవ్వబడ్డాయి. ఎందుకంటే అప్పుడు వారి ఆర్థిక మరియు భౌతిక పరిస్థితులు జిహాద్ కు అనుకూలంగా లేకుండెను. అయినా వారు, జిహాద్ కొరకు తొందర పెట్టే వారు. కాని ఇప్పుడు మదీనా మునవ్వరాకు వచ్చిన తరువాత వారి పరిస్థితులు మెరుగైన తరువాత వారిని జిహాద్ చేయమని ఆజ్ఞాపిస్తే వారెందుకు వెనుకంజ వేస్తున్నారని ఈ ఆయత్ ప్రశ్నిస్తున్నది.

ఖర్జూర బీజపు చీలికలోని పొర (ఫతీల) అంత
అన్యాయం కూడా జరుగదు.

78. "మీరు ఎక్కడున్నా సరే! మీకు చావు వచ్చి తీరుతుంది మరియు మీరు గొప్ప కోట బురుజులలో ఉన్నా చావు రాక తప్పదు." (అని పలుకు). మరియు వారికి ఏమైనా మేలు కలిగితే: "ఇది అల్లాహ్ తరఫు నుండి వచ్చింది." అని అంటారు. కాని వారికేదైనా కీడు గలిగితే: "(ఓ ముహమ్మద్!) ఇది నీ వల్ల జరిగింది." అని అంటారు. వారితో అను: "అంతా అల్లాహ్ తరఫు నుండే (వస్తుంది)!" ఈ జనులకు ఏమయింది? వారు ఏ విషయాన్ని కూడా ఎందుకు అర్థం చేసుకోలేక పోతున్నారు?

79. (ఓ మానవుడా!) నీకు ఏ మేలు జరిగినా అది అల్లాహ్ అనుగ్రహం వల్లనే[62] మరియు నీకు ఏ కీడు జరిగినా అది నీ స్వంత (కర్మల) ఫలితమే![63] మరియు (ఓ ముహమ్మద్!) మేము నిన్ను మానవులకు సందేశహరునిగా చేసి పంపాము మరియు దీనికి అల్లాహ్ సాక్ష్యమే చాలు.

---

[62] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: "స్వర్గంలోకి ప్రవేశించే ప్రతి వ్యక్తి కూడా అల్లాహ్ (సు.తా.) కారుణ్యం వల్లనే ప్రవేశిస్తాడు. (కేవలం తన కర్మల వల్ల కాదు)." అప్పుడు 'స'హాబా (ర'ది.'అన్హుమ్)లు అన్నారు: "ఓ ప్రవక్తా ('స'అస)! మీరు కూడానా?" అతను జవాబిచ్చారు: "అవును, అల్లాహుతా'ఆలా యొక్క కారుణ్యం నాపై లేకుంటే నేను కూడా స్వర్గంలో ప్రవేశించలేను." ('స. బు'ఖారీ).

[63] చూడండి, 42:30.

80. ఎవడు ప్రవక్తకు విధేయత చూపుతాడో వాస్తవంగా అతడు అల్లాహ్ కు విధేయత చూపినట్లే[64]. మరియు కాదని వెనుదిరిగిపోతే వారిని అదుపులో ఉంచటానికి (కావలివానిగా) మేము నిన్ను పంపలేదు.

81. మరియు వారు (నీ సమక్షంలో): "మేము విధేయులమయ్యాము." అని పలుకుతారు. కాని నీ వద్ద నుండి వెళ్ళిపోయిన తరువాత వారిలో కొందరు రాత్రివేళలో నీవు చెప్పిన దానికి విరుద్ధంగా సంప్రదింపులు జరుపుతారు. మరియు వారి రహస్య సంప్రదింపులన్నీ అల్లాహ్ వ్రాస్తున్నాడు. కనుక నీవు వారి నుండి ముఖము త్రిప్పుకో మరియు అల్లాహ్ పై ఆధారపడి ఉండు. మరియు కార్యసాధకుడిగా అల్లాహ్ చాలు!

82. ఏమీ? వారు ఖుర్ఆన్ ను గురించి ఆలోచించరా? ఒకవేళ ఇది అల్లాహ్ తరఫు నుండి గాక ఇతరుల తరఫు నుండి వచ్చి వుంటే, అందులో ఎన్నో పరస్పర విరుద్ధమైన విషయాలను చూసేవారు

[64] చూడండి, 'స. బు'ఖారీ పుస్తకం - 9, 'హదీస్' నం. 251, 384.

కదా![65]

**83.** మరియు వారు (ప్రజల గురించి) ఏదైనా శాంతివార్త గానీ లేదా భయవార్త గానీ విని నప్పుడు దానిని వ్యాపింపజేస్తారు. అలా చేయకుండా వారు దానిని సందేశహరునికో లేదా వారిలో నిర్ణయాధికారం గల వారికో తెలియజేసి ఉంటే! దానిని విచారించగలవారు వారి నుండి దానిని విని అర్థం చేసుకునేవారు మరియు ఒకవేళ మీపై అల్లాహ్ అనుగ్రహం, ఆయన కారుణ్యమే లేకుంటే మీలో కొందరు తప్ప మిగతా

[65] ఖుర్ఆన్ 23 సంవత్సరాలలో అవతరింపజేయబడింది. అయినా అందులో ఏ విధమైన పరస్పర విరుద్ధమైన విషయాలు లేవు. ఇదే దాని దివ్యావతరణకు సాక్ష్యం. ఇంకా ఇందులో చెప్పబడిన పూర్వ కాల చరిత్రలు కేవలం అగోచర జ్ఞానసంపన్నుడు('అల్లాముల్'గుయూబ్)అయినఅల్లాహ్(సు. తా.) యే తెలుప గలడు. మరియు ఇందులో దాదాపు వేయి వైజ్ఞానశాస్త్రానికి(Science) చెందిన విషయాలు 1400 సంవత్సరాల ముందు చెప్పబడ్డాయి. వాటిలో కొన్ని ఇప్పుడిప్పుడే ఆవిష్కరించబడ్డాయి. ఉదాహరణకు: భూమ్యాకాశాల సృష్టి ఒక పెద్ద ప్రేలుడుతో సంభవించింది. ప్రతి జీవరాశి నీటితో సృష్టించబడింది, మానవుడు మట్టితో, అంటే మట్టిలో ఉన్న మూలపదార్థా(Elements)లతో సృష్టించ బడినాడు, సూర్యచంద్రుల సంచారం, రాత్రింబవళ్ళ మార్పులు మొదలైనవి. ఇంకా ఎన్నో ఇంత వరకు ఆవిష్కరించబడలేదు. వీటన్నింటినీ గురించి ఆలోచిస్తే, తెలివిగలవారు 'ఈ విషయాలు 1400 సంవత్సరాలకు పూర్వం మానవునికి తెలియవు, కాబట్టి ఇవి అగోచర జ్ఞానం గల ఏకైక ప్రభువు, సర్వశక్తిశాలి, సర్వసృష్టికి మూలాధారి, మాత్రమే తెలుపగలడని' తెలుసుకుంటారు. అంటే ఈ విషయాలన్నీ వ్రాయబడిన, ఈ ఖుర్ఆన్ మానవుని చేతిపని కాజాలదు, అది కేవలం దివ్య ఆవిష్కృతియే అని నమ్ముతారు.

వారందరూ షైతాన్'ను అనుసరించి ఉండేవారు.

**84.** కావున నీవు అల్లాహ్ మార్గంలో యుద్ధం చెయ్యి. నీవు నీ మట్టుకే బాధ్యుడవు. మరియు విశ్వాసులను (యుద్ధానికి) ప్రోత్సహించు. అల్లాహ్ సత్యతిరస్కారుల శక్తిని అణచ వచ్చు! మరియు అల్లాహ్ అంతులేని శక్తిగలవాడు మరియు శిక్షించటంలో చాలా కఠినుడు!

**85.** మంచి విషయం కొరకు సిఫారసు చేసేవానికి అందులో భాగం లభిస్తుంది. మరియు చెడు విషయం కొరకు సిఫారసు చేసేవాడు దానికి బాధ్యత వహిస్తాడు. మరియు అల్లాహ్ ప్రతి దానిపై అధికారం గలవాడు[66].

**86.** మరియు మీకు ఎవరైనా సలాం చేస్తే, దానికి మీరు అంతకంటే ఉత్తమమైన రీతిలో ప్రతి సలాం చెయ్యండి లేదా కనీసం అవే పదాలు తిరిగి పలకండి (అదేవిధంగానైనా చెయ్యండి)[67]. నిశ్చయంగా, అల్లాహ్ ప్రతి దానిని

---

[66] ముఖీతున్(అల్ ముఖీతు):అల్-'హాఫి"జ్=కాపాడు, కావలి ఉండు, ఆధారం, శరణం, రక్షణ ఇచ్చేవాడు, విశ్వాధికారి, Protector, Watcher, Preserver, Observer, Controller, All-Witness, అదుపులో ఉంచు, అణచు, క్రమబద్ధం చేయు, అధికారం గల, కనిపెట్టుకొని ఉండు, గమనించు, ప్రతిదానిపై తన దృష్టిని ఉంచి వున్నవాడు, పరిశీలకుడు అనే అర్థాలున్నాయి. ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి. (ఇది సేకరించబడిన పదం) ఇక్కడ ఒకేసారి వచ్చింది.

[67] చూడండి, 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 8, 'హదీస్' నం. 246.

పరిగణించగలవాడు[68].

**87.** అల్లాహ్! ఆయన తప్ప వేరే ఆరాధ్యుడు లేడు. ఆయన మిమ్మల్ని అందరినీ పునరుత్థాన దినమున సమావేశ పరుస్తాడు. అది (రావటంలో) ఏ మాత్రం సందేహం లేదు. మరియు అల్లాహ్ వాక్కు కంటే మరెవరి (వాక్కు) సత్యమైనది?

**88.** (ఓ విశ్వాసులారా!) మీకేమయింది, కపట విశ్వాసుల విషయంలో మీరు రెండు వర్గాలుగా చీలిపోయారు[69]. అల్లాహ్ వారి కర్మల ఫలితంగా, వారిని వారి పూర్వ (అవిశ్వాస) స్థితికి మరలించాడు. ఏమీ? అల్లాహ్ మార్గభ్రష్టులుగా చేసిన వారికి మీరు సన్మార్గం చూపదలచారా? వాస్తవానికి, అల్లాహ్ మార్గభ్రష్టత్వంలో పడవేసిన

---

[68] అల్-'హసీబు: Reckoner, Taker of Accounts, Sufficer, or giver of what is sufficient. లెక్కతీసుకునే, పరిగణించే వాడు. చూడండి, 4:6.

[69] ఇక్కడ ఉ'హుద్ యుద్ధానికి బయలుదేరి కొంతదూరం పోయిన తరువాత వెనుదిరిగి పోయిన 300 మంది కపటవిశ్వాసుల విషయం చెప్పబడింది. వారి నాయకుడు 'అబ్దుల్లాహ్ బిన్ ఉబై.

వానికి నీవు (ఋజు) మార్గం చూపలేవు[70].

**89.** మరియు వారు సత్యతిరస్కారులైనట్లే మీరు కూడా సత్యతిరస్కారులై, వారితో సమానులై పోవాలని వారు కోరుతున్నారు. కావున అల్లాహ్ మార్గంలో వారు వలస పోనంత వరకు (హిజ్రత్ చేయనంత వరకు), వారిలో ఎవ్వరినీ మీరు స్నేహితులుగా చేసుకోకండి. ఒకవేళ వారు వెను దిరిగితే, మీరు వారిని ఎక్కడ దొరికితే అక్కడే పట్టుకొని వధించండి. మరియు వారిలో ఎవ్వరినీ మీ స్నేహితులుగా, సహాయకులుగా చేసుకోకండి.

**90.** కాని, మీరు ఎవరితోనైతే ఒడంబడిక చేసుకొని ఉన్నారో, అలాంటి వారితో కలసి పోయిన వారు గానీ లేదా ఎవరైతే తమ హృదయాలలో మీతో గానీ లేక తమ జాతివారితో గానీ యుద్ధం చేయటానికి సంకటపడుతూ మీవద్దకు వస్తారో అలాంటి వారిని గానీ, (మీరు వధించకండి). మరియు ఒకవేళ అల్లాహ్ కోరితే వారికి మీపై ఆధిక్యత ఇచ్చి ఉండేవాడు మరియు వారు మీతో

---

[70] ఎవరైతే తమ సత్యతిరస్కారం మరియు ముఢనమ్మకం వలన మార్గభ్రష్టత్వంలో పడిపోయారో మరియు అల్లాహుతా'ఆలా ప్రసాదించిన వివేకాన్ని ఉపయోగించుకొని, సత్యాన్ని సన్మార్గాన్ని, అనుస రించగోరారో! అలాంటి వారినే అల్లాహ్ (సు.తా.) మార్గభ్రష్టత్వంలో పడనిస్తాడు. ఎందుకంటే, అల్లాహుతా' ఆలాకు గడచిందీ మరియు ముందు జరగబోయేదీ, అంతా తెలుసు. అల్లాహ్ (సు.తా.) ఎవ్వరినీ బలవంతంగా మార్గభ్రష్టత్వంలో పడవేయడు. అలాంటి వారికి ఎవ్వరూ సన్మార్గం చూపలేరు. ఈ విధమైన ఆయత్ ఖుర్ఆన్ లో ఎన్నోసార్లు వచ్చింది. వ్యాఖ్యాతలందరూ దీనికి ఇదే విధంగా తాత్పర్యమిచ్చారు.

యుద్ధం చేసి ఉండేవారు. కావున వారు మీ నుండి మరలిపోతే మీతో యుద్ధం చేయక, మీతో సంధి చేసుకోవటానికి అంగీకరిస్తే (వారిపై దాడి చేయటానికి) అల్లాహ్ మీకు దారి చూపలేదు.

91. మరొక రకమైన వారిని మీరు చూస్తారు; వారు మీ నుండి శాంతి పొందాలని మరియు తమ జాతివారితో కూడా శాంతి పొందాలని కోరుతుంటారు. కాని సమయం దొరికినప్పుడల్లా వారు (తమ మాట నుండి) మరలి పోయి ఉపద్రవానికి పూనుకుంటారు. అలాంటి వారు మీతో (పోరాడటం) మానుకోకపోతే, మీతో సంధి చేసుకోవటానికి అంగీకరించక పోతే, తమ చేతులను (మీతో యుద్ధం చేయటం నుండి) ఆపుకోకపోతే! వారెక్కడ దొరికితే అక్కడ పట్టుకోండి మరియు సంహరించండి మరియు ఇలా ప్రవర్తించటానికి మేము మీకు స్పష్టమైన అధికారం ఇస్తున్నాము.

92. మరియు - పొరపాటుగా తప్ప - ఒక విశ్వాసి మరొక విశ్వాసిని చంపటం తగనిపని (నిషిద్ధం). మరియు ఒక విశ్వాసిని పొరపాటుగా చంపినవాడు (దానికి పరిహారంగా) అతడు ఒక విశ్వాసి బానిసకు విముక్తి కలిగించాలి మరియు హతుని కుటుంబీకులకు (వారసులకు) రక్తపరిహారం (దియత్) కూడా చెల్లించాలి. వారు క్షమిస్తే అది

వారికి దానం (సదఖ)[71] అవుతుంది! కాని ఒకవేళ వధింపబడినవాడు విశ్వాసి అయి, మీ శత్రువులలో చేరినవాడై ఉంటే, ఒక విశ్వాస బానిసకు విముక్తి కలిగించాలి. ఒకవేళ (వధింపబడినవాడు) - మీరు ఒడంబడిక చేసుకొని వున్న జనులకు చెందినవాడైతే - రక్తపరిహారం అతని కుటుంబీకులకు (వారసులకు) ఇవ్వాలి. మరియు ఒక విశ్వాస (ముస్లిం) బానిసకు విముక్తి కలిగించాలి. (బానిసకు విముక్తి కలిగించే) శక్తిలేనివాడు, వరుసగా రెండు నెలలు ఉపవాసాలు ఉండాలి. అల్లాహ్ ముందు పశ్చాత్తాపపడటానికి (ఇదే సరైన పద్ధతి). అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేచనాపరుడు.

**93.** మరియు ఎవడైతే ఒక విశ్వాసిని బుద్ధిపూర్వకంగా చంపుతాడో అతని ప్రతీకారం నరకమే! అందులో అతడు శాశ్వతంగా ఉంటాడు[72] మరియు అతనిపై అల్లాహ్ ఆగ్రహం మరియు శాపం (బహిష్కారం) ఉంటుంది మరియు ఆయన (అల్లాహ్) అతని కొరకు ఘోరమైన శిక్షను సిద్ధపరిచాడు.

**94.** ఓ విశ్వాసులారా! మీరు అల్లాహ్ మార్గంలో

---

[71] రక్తపరిహారపు పరిమాణం దైవప్రవక్త ('స'అస) కాలంలో, 100 ఒంటెలుగా నిర్ణయించడం జరిగింది. ఇది పొరపాటుగా జరిగిన హత్యకు మాత్రమే వర్తిస్తుంది.

[72] హత్య మూడు రకాలు: 1) ఖత్లె - 'అమద్: అంటే బుద్ధిపూర్వకంగా హత్య చేయడం. దాని శిక్ష ఇక్కడ చెప్పబడింది. ఇహలోకంలో మరణశాసనం, మరియు పరలోకంలో నరకం. 2) ఖత్లె - 'ఖ'తా: పొరపాటు వల్ల, అనుకోని విధంగా జరిగిన హత్య. దీని విషయం ఇంతకు ముందు 92 ఆయత్ లో వచ్చింది. 3) ఖత్లె - షుబ్హ్ 'అమద్: దీని వివరాలు 'హదీస్' లలో పేర్కొనబడ్డాయి.

(జిహాద్ కు) బయలుదేరినప్పుడు వివేచనతో వ్యవహరించండి. (శాంతిని ఆశించి మీ వైపునకు) సలాం చేస్తూ వచ్చేవానిని - ప్రాపంచిక ప్రయోజనాలను పొందగోరి-"నీవు విశ్వాసివి(ముస్లింవు) కావు[73]" అని (త్వరపడి) అనకండి. అల్లాహ్ దగ్గర మీ కొరకు విజయధనాలు అత్యధికంగా ఉన్నాయి. దీనికి పూర్వం మీరు కూడా ఇదే స్థితిలో ఉండేవారు కదా! ఆ తరువాత అల్లాహ్ మిమ్మల్ని అనుగ్రహించాడు, కావున సముచితమైన పరిశీలన చేయండి. నిశ్చయంగా, అల్లాహ్! మీరు చేసేదంతా బాగా ఎరుగును.

**95.** ఎలాంటి కారణం లేకుండా, ఇంటి వద్ద కూర్చుండిపోయే విశ్వాసులు మరియు అల్లాహ్ మార్గంలో తమ ధనాన్ని మరియు తమ ప్రాణాన్ని వినియోగించి ధర్మయుద్ధం (జిహాద్) చేసే విశ్వాసులతో సరిసమానులు కాజాలరు. తమ ధనాన్ని, ప్రాణాన్ని వినియోగించి ధర్మయుద్ధం (జిహాద్) చేసేవారి స్థానాన్ని అల్లాహ్! ఇంట్లో కూర్చుండి పోయే వారి స్థానం కంటే, ఉన్నతం చేశాడు. మరియు అల్లాహ్ ప్రతి ఒక్కరికి ఉత్తమ

---

[73] ఒకసారి కొందరు 'స'హాబీలు జిహాద్ కొరకు పోతుంటారు. దారిలో ఒక పశువుల కాపరి వారిని చూసి సలామ్ చేస్తాడు. వారు అతడు విశ్వాసికాడు, కేవలం తన ప్రాణాలను కాపాడుకోవటానికే - తాను ముస్లిం నని తెలుపటానికి - సలాం చేశాడని భావించి, అతనిని చంపి, అతని పశువులను, మాలె 'గనీమత్ గా దైవప్రవక్త('స'అస) దగ్గరికి తెస్తారు. అప్పుడు ఈ ఆయత్ అవతరింపజేయబడింది. ('స. బు'ఖారీ, తిర్మిజీ')

ఫలితపు వాగ్దానం చేశాడు. కానీ అల్లాహ్ ధర్మయుద్ధం (జిహాద్) చేసిన వారికి ఇంట్లో కూర్చున్న వారి కంటే ఎంతో గొప్ప ప్రతిఫలమిచ్చి, ఆధిక్యత నిచ్చాడు.

**96.** వారి కొరకు, ఆయన తరఫు నుండి ఉన్నత స్థానాలు, క్షమాభిక్ష మరియు కారుణ్యాలు కూడా ఉంటాయి. మరియు అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

**97.** నిశ్చయంగా, తమకు తాము (తమ ఆత్మలకు) అన్యాయం చేసుకుంటూ ఉండే వారి ప్రాణాలను తీసే దేవదూతలు వారితో: "మీరు ఏ స్థితిలో ఉండేవారు?" అని అడిగితే, వారు: "మేము భూమిలో బలహీనులముగా, నిస్సహాయులముగా ఉండేవారము!" అని జవాబిస్తారు. దానికి (దేవదూతలు): "ఏమీ? మీరు వలస పోవటానికి అల్లాహ్ భూమి విశాలంగా లేకుండెనా?" అని అడుగుతారు. ఇలాంటి వారి శరణం నరకమే. మరియు అది ఎంత చెడ్డ గమ్యస్థానం![74]

**98.** కాని, నిజంగానే నిస్సహాయులై, వలస పోవటానికి ఏ సాధనా సంపత్తీ, ఎలాంటి మార్గం లేని పురుషులు, స్త్రీలు మరియు పిల్లలు తప్ప!

**99.** కావున ఇటు వంటి వారిని, అల్లాహ్ మన్నించవచ్చు! ఎందుకంటే, అల్లాహ్ మన్నించే వాడు, క్షమాశీలుడు.

**100.** మరియు అల్లాహ్ మార్గంలో వలస పోయేవాడు

---

[74] చూడండి, 3:141.

భూమిలో కావలసినంత స్థలాన్ని, సౌకర్యాలను పొందుతాడు. మరియు ఎవడు తన ఇంటిని వదలి అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త కొరకు, వలస పోవటానికి బయలుదేరిన తరువాత, అతనికి చావు వస్తే! నిశ్చయంగా, అతని ప్రతిఫలం అల్లాహ్ వద్ద స్థిరంగా ఉంటుంది. ఎందుకంటే, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

101. మరియు మీరు భూమిలో ప్రయాణం చేసేటపుడు నమాజులను సంక్షిప్తం (ఖస్ర్) చేస్తే, అది పాపం కాదు[75]. (అంతే గాక) సత్యతిరస్కారులు మిమ్మల్ని వేధిస్తారు అనే భయం మీకు కలిగినపుడు కూడా! ఎందుకంటే సత్యతిరస్కారులు నిశ్చయంగా మీకు బహిరంగ శత్రువులు.

102. మరియు నీవు (ఓ ప్రవక్తా!) వారి (ముస్లింల) మధ్య ఉండి (పోరాటం జరుగుతూ ఉండగా) నమాజ్ చేయించటానికి వారితో నిలబడితే, వారిలోని ఒక వర్గం నీతో పాటు నిలబడాలి. మరియు వారు అస్త్రధారులై ఉండాలి. వారు తమ సజ్దాను పూర్తి చేసుకొని వెనక్కి వెళ్ళి పోవాలి. అప్పుడు ఇంకా నమాజ్ చేయని రెండో వర్గం వచ్చి నీతో పాటు నమాజ్ చేయాలి. వారు కూడా జాగరూకులై ఉండి, తమ ఆయుధాలను ధరించి

---

[75] ఖ'స్ర్: సంక్షిప్తం, అంటే "జుహ్ర్ లో రెండు, 'అస్ర్ లో రెండు మరియు 'ఇషాలో రెండు రకాతులు మాత్రమే విధి (ఫ'ర్ద్) నమా'జ్ లు చేయాలి. ఫజ్ర్ మరియు మ'గ్రిబ్ నమా'జ్ లలో సంక్షిప్తం (ఖ'స్ర్) లేదు. ప్రయాణంలో సున్నత్ నమా'జ్ లు విడిచి పెట్టవచ్చు. వి'త్ర్ పూర్తి చేయాలి.

ఉండాలి. ఎందుకంటే, మీరు మీ ఆయుధాల పట్ల, మరియు మీ సామగ్రి పట్ల, ఏ కొద్ది అజాగ్రత్త వహించినా మీపై ఒక్కసారిగా విరుచుకు పడాలని సత్యతిరస్కారులు కాచుకొని ఉంటారు. అయితే, వర్షం వల్ల మీకు ఇబ్బందిగా ఉంటే! లేదా మీరు అస్వస్థులైతే, మీరు మీ ఆయుధాలను దించి పెట్టడం పాపం కాదు. అయినా మీ జాగ్రత్తలో మీరు ఉండాలి. నిశ్చయంగా, అల్లాహ్ సత్యతిరస్కారుల కొరకు అవమానకరమైన శిక్షను సిద్ధ పరచి ఉంచాడు[76].

**103.** ఇక నమాజ్ ను పూర్తి చేసిన తరువాత నిలుచున్నా, కూర్చున్నా, పరుండినా అల్లాహ్ ను స్మరిస్తూ ఉండండి. కాని శాంతిభద్రతలు నెలకొన్న తరువాత నమాజ్ ను స్థాపించండి. నిశ్చయంగా, నమాజ్ విశ్వాసులకు నియమిత సమయాలలో పాటించడానికి విధిగా నియమించబడింది.

**104.** మరియు శత్రువులను వెంబడించటంలో బలహీనతను ప్రదర్శించకండి. ఒకవేళ మీరు బాధపడుతున్నట్లయితే, నిశ్చయంగా వారు కూడా - మీరు బాధపడుతున్నట్లే – బాధపడు తున్నారు. మరియు మీరు అల్లాహ్ నుండి వారు ఆశించలేని దానిని ఆశిస్తున్నారు. మరియు వాస్తవానికి, అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేచనాపరుడు.

**105.** (ఓ ముహమ్మద్!) నిశ్చయంగా, మేము ఈ గ్రంథాన్ని (ఖుర్ఆన్ ను), సత్యంతో, నీపై

---

[76] చూడండి, 2:239.

అవతరింపజేసాము - అల్లాహ్ నీకు తెలిపిన ప్రకారం - నీవు ప్రజల మధ్య తీర్పు చేయటానికి. మరియు నీవు విశ్వాసఘాతకుల పక్షమున వాదించేవాడవు కావద్దు.

**106.** మరియు అల్లాహ్ ను క్షమాభిక్ష కోరకు ప్రార్థించు. నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత[77].

**107.** మరియు ఆత్మద్రోహం చేసుకునే వారి పక్షమున నీవు వాదించకు. నిశ్చయంగా, అల్లాహ్ విశ్వాసఘాతకుణ్ణి, పాపిని ప్రేమించడు.

**108.** వారు (తమ దుష్కర్మలను) మానవుల నుండి దాచగలరు, కాని అల్లాహ్ నుండి దాచలేరు. ఎందుకంటే ఆయన (అల్లాహ్) కు సమ్మతం లేని విషయాలను గురించి వారు రాత్రులలో రహస్య సమాలోచనలను చేసేటపుడు కూడా ఆయన వారితో ఉంటాడు. మరియు వారి సకల చర్యలను అల్లాహ్ పరివేష్టించి ఉన్నాడు.

**109.** అవును, మీరే! వారి (ఈ అపరాధుల) పక్షమున ఇహలోక జీవితంలోనైతే వాదించారు. అయితే! తీర్పుదినమున వారి పక్షమున అల్లాహ్ తో ఎవడు వాదించగలడు? లేదా వారికి ఎవడు రక్షకుడు

---

[77] అబూ హురైరా (ర'ది.'అ) కథనం: "నేను దైవప్రవక్త ('స'అస) ను, ఇలా అనగా విన్నాను: 'అల్లాహ్ సాక్షిగా! నేను ప్రతిరోజు 70 సార్ల కంటే ఎక్కువ అల్లాహ్ (సు.తా.) ను క్షమాభిక్ష వేడుకుంటాను మరియు అల్లాహుతా'ఆలా వైపునకు పశ్చాత్తాపంతో మరలుతాను.'" ('స'హీ'హ్ బు'ఖారీ, పు.-8, 'హ.నం. 329).

కాగలడు?

**110.** మరియు పాపం చేసినవాడు, లేదా తనకు తాను అన్యాయం చేసుకున్నవాడు[78], తరువాత అల్లాహ్ ను క్షమాభిక్షకై వేడుకుంటే అలాంటివాడు, అల్లాహ్ ను క్షమాశీలుడుగా, అపార కరుణా ప్రదాతగా పొందగలడు!

**111.** కాని ఎవడైనా పాపాన్ని అర్జిస్తే, దాని (ఫలితం) అతడే స్వయంగా భరిస్తాడు. మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేచనాపరుడు.

**112.** మరియు ఎవడు అపరాధం గానీ, లేదా పాపం గానీ చేసి, తరువాత దానిని ఒక అమాయకునిపై మోపుతాడో! వాస్తవానికి, అలాంటి వాడు తీవ్రమైన అపనిందను మరియు ఘోర పాపాన్ని తన మీద మోపుకున్నవాడే!

**113.** మరియు (ఓ ప్రవక్తా!) అల్లాహ్ అనుగ్రహం మరియు ఆయన కారుణ్యమే నీపై లేకుంటే, వారిలోని ఒక వర్గం వారు నిన్ను మార్గభ్రష్టత్వానికి గురి చేయగోరారు. కాని వారు తమను తాము తప్ప మరెవ్వరినీ మార్గభ్రష్టులుగా చేయలేరు. మరియు వారు నీ కెలాంటి హానీ చేయలేరు. మరియు అల్లాహ్ నీ పై ఈ గ్రంథాన్ని మరియు వివేకాన్ని అవతరింపజేశాడు. మరియు నీకు తెలియని విషయాలను నీకు నేర్పాడు[79]. మరియు నీ పై ఉన్న అల్లాహ్ అనుగ్రహం చాలా

---

[78] చూడండి, 17:15.

[79] చూడండి, 42:52 మరియు 28:86.

గొప్పది.

**114.** వారు చేసే రహస్య సమావేశాలలో చాలా మట్టుకు ఏ మేలు లేదు. కాని ఎవరైనా దానధర్మాలు చేయటానికి, సత్కార్యాలు (మ'అరూఫ్) చేయటానికి లేదా ప్రజల మధ్య సంధి చేకూర్చటానికి (సమాలోచనలు) చేస్తే తప్పు! ఎవడు అల్లాహ్ ప్రీతి కొరకు ఇలాంటి పనులు చేస్తాడో, అతనికి మేము గొప్ప ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాము.

**115.** మరియు తనకు సన్మార్గం స్పష్టంగా తెలిసిన పిదప కూడా, ఎవడు ప్రవక్తకు వ్యతిరేకంగా పోయి విశ్వాసుల మార్గం గాక వేరే మార్గాన్ని అనుసరిస్తాడో! అతడు అవలంబించిన త్రోవ వైపునకే, అతనిని మరల్చుతాము మరియు వానిని నరకంలో కాల్చుతాము. మరియు అది ఎంత చెడ్డ గమ్యస్థానం[80].

**116.** నిశ్చయంగా, అల్లాహ్ తనకు సాటి కల్పించటాన్ని (షిర్క్ ను) ఏమాత్రం క్షమించడు, కాని ఆయన దానిని విడిచి (ఇతర ఏ పాపాన్నైనా) తాను కోరిన వానికి క్షమిస్తాడు! అల్లాహ్ తో భాగస్వాములను కల్పించేవాడు, వాస్తవానికి మార్గభ్రష్టుడై, మార్గభ్రష్టత్వంలో చాలా దూరం పోయినట్లే!

**117.** ఆయన (అల్లాహ్) ను వదలి, వారు స్త్రీ (దేవత)

[80] చూడండి, 3:85.

లను ప్రార్థిస్తున్నారు[81]. మరియు వారు కేవలం తిరుగుబాటుదారుడైన షైతాన్ నే ప్రార్థిస్తున్నారు[82].

**118.** అల్లాహ్ అతన్ని శపించాడు(బహిష్కరించాడు) మరియు అతడు (షైతాన్) ఇలా అన్నాడు "నేను నిశ్చయంగా, నీ దాసులలో నుండి ఒక నియమిత భాగాన్ని తీసుకుంటాను."

**119.** "మరియు నిశ్చయంగా, నేను వారిని మార్గభ్రష్టులుగా చేస్తాను; మరియు వారికి తప్పక తప్పుడు ఆశలు కలిగిస్తాను; మరియు నేను వారిని ఆజ్ఞాపిస్తాను; దాని ప్రకారం వారు తప్పక పశువుల చెవులను చీల్చుతారు; మరియు నేను వారిని ఆజ్ఞాపిస్తాను; దాని ప్రకారం వారు తప్పక అల్లాహ్ సృష్టిలో

---

[81] స్త్రీ దేవతలు అంటే, ఇక్కడ ముష్రిక్ ఖురైషులు పూజించే స్త్రీ విగ్రహాలు ఉదా: " 'లాత్, 'ఉ'జ్జా, మనాత్ మరియు నా'ఇ'ల" మొదలైనవి. లేక దైవదూతలు ఎందుకంటే వారు దైవదూతలను అల్లాహ్ (సు.తా.) యొక్క కుమార్తెలగా భావించి, వారి ఆరాధన చేసేవారు.

[82] పైన పేర్కొన్న వాటి ఆరాధన కేవలం షై'తాన్ ఆరాధనయే. ఎందుకంటే షై'తానే మానవుణ్ణి అల్లాహ్ (సు.తా.) మార్గం నుండి మళ్ళించి బూటక దైవాలను ఆరాధించటాన్ని ప్రోత్సహిస్తాడు.

మార్పులు చేస్తారు[83]. మరియు ఎవడు అల్లాహ్ కు బదులుగా షైతాన్ ను తన రక్షకునిగా చేసుకుంటాడో! వాస్తవానికి వాడే స్పష్టమైన నష్టానికి గురి అయిన వాడు!

**120.** అతడు (షైతాన్) వారికి వాగ్దానం చేస్తాడు మరియు వారిలో విపరీత కోరికలను రేపుతాడు. కాని, షైతాన్ వారికి చేసే వాగ్దానాలు మోసపుచ్చేవి మాత్రమే.

**121.** అలాంటి వారి ఆశ్రయం నరకమే; మరియు వారికి దాని నుండి తప్పించుకునే మార్గమే ఉండదు.

**122.** మరియు ఎవరైతే విశ్వసించి సత్కార్యాలు చేస్తారో! మేము వారిని క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాము; అందులో వారు శాశ్వతంగా కలకాల ముంటారు అల్లాహ్ వాగ్దానం సత్యమైనది. మరియు పలుకులలో అల్లాహ్ కంటే ఎక్కువ సత్యవంతుడెవడు?

**123.** మీ కోరికల ప్రకారంగా గానీ, లేదా గ్రంథ ప్రజల

---

[83] ఇక్కడ అల్లాహ్ (సు.తా.) సృష్టిలో మార్పులు అంటే; పశువుల చెవులను ప్రత్యేక దైవాల పేర, ప్రత్యేక రకంగా కోసి విడవడమే కాక మానవులు కూడా అందాన్ని హెచ్చించటానికి పచ్చబొట్టు వేయించుకోవటం, మరియు కనుబొమ్మల వెంట్రుకలు కత్తిరించుకోవటం, ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోవటం మరియు ట్యూబెక్టమీ మరియు వాసెక్టమీ చేయించుకొని అల్లాహుతా'ఆలా సృష్టిలో మార్పులు తెచ్చుటకు ప్రయత్నించడం కూడాను. దైవప్రవక్త (స'అస) సంప్రదాయం వల్ల తెలిసిందేమిటంటే పశువులకు ఖస్సీ చేయటం ధర్మసమ్మతమే. ఎందుకంటే దైవప్రవక్త ('స'అస) ఖస్సీ చేసిన పశువుల బలి (ఖుర్బానీ) చేశారు.

కోరికల ప్రకారంగా గానీ (మోక్షం) లేదు! పాపం చేసిన వానికి దానికి తగిన శిక్ష ఇవ్వబడుతుంది; మరియు వాడు, అల్లాహ్ తప్ప మరొక రక్షకుడిని గానీ, సహాయకుడిని గానీ పొందలేడు!

**124.** మరియు సత్కార్యాలు చేసేవాడు పురుషుడైనా, లేక స్త్రీ అయినా, ఆ వ్యక్తి విశ్వాసి అయి ఉంటే, అలాంటి వారు స్వర్గంలో ప్రవేశిస్తారు మరియు వారికి ఖర్జూర బీజపు చీలిక (నఖీరా) అంత అన్యాయం కూడా జరుగదు.

**125.** మరియు తన ముఖాన్ని (తనను తాను) అల్లాహ్ కు సమర్పించుకొని (ముస్లిం అయి), సజ్జనుడై, ఇబ్రాహీమ్ అనుసరించిన, ఏకదైవ సిద్ధాంతాన్ని (సత్యధర్మాన్ని) అనుసరించే వాని కంటే ఉత్తముడైన విశ్వాసి (ధార్మికుడు) ఎవడు?[84] మరియు అల్లాహ్ ! ఇబ్రాహీమ్ ను తన స్నేహితునిగా చేసుకున్నాడు.

**126.** మరియు ఆకాశాలలో ఉన్నదంతా మరియు భూమిలో ఉన్నదంతా అల్లాహ్ కు చెందినదే. మరియు వాస్తవానికి అల్లాహ్ ప్రతి దానిని పరివేష్టించి ఉన్నాడు.

**127.** మరియు వారు నిన్ను స్త్రీల వ్యవహారంలో గల ధార్మిక తీర్పు (ఫత్వా)ను గురించి అడుగు తున్నారు. వారితో ఇలా అను: "అల్లాహ్ వారిని (స్త్రీలను) గురించి ధార్మిక తీర్పు ఇస్తున్నాడు: 'అనాథ స్త్రీలను, వారి కొరకు నిర్ణయించబడిన

[84] చూడండి, 2:135.

హక్కు (మహ్ర్) ను మీరు వారికివ్వక, వారిని పెండ్లాడ గోరుతున్న విషయాన్ని గురించీ మరియు బలహీనులైన బిడ్డలను గురించీ మరియు అనాథ పిల్లల విషయంలోనూ న్యాయంగా వ్యవహరించాలని, ఈ గ్రంథంలో మీకు తెలుపబడు తోంది[85].' మరియు మీరు ఏ మంచిపని చేసినా అది అల్లాహ్ కు తప్పకుండా తెలుస్తుంది."

**128.** మరియు ఒకవేళ స్త్రీ తన భర్త, అనాదరణతో ప్రవర్తిస్తాడేమోనని, లేదా విముఖుడవు తాడేమోనని, భయపడితే! వారిద్దరూ తమ మధ్య రాజీ చేసుకుంటే! వారిపై ఎలాంటి దోషం లేదు. రాజీ పడటం ఎంతో ఉత్తమమైనది. మరియు మానవుల మనస్సులలో పేరాస ఇమిడి వున్నది. మీరు సజ్జనులై దైవభీతి కలిగి ఉండండి! ఎందుకంటే! నిశ్చయంగా, అల్లాహ్ మీ కర్మలన్నింటినీ బాగా ఎరుగును.

**129.** మరియు మీరు ఎంత కోరినా, మీ భార్యల మధ్య పూర్తి న్యాయం చేయటం మీ చేతకాని పని. కనుక ఒకభార్యవైపునకుఎక్కువగామొగ్గి,మరొకామెను డోలాయమాన స్థితిలో వదలకండి. మీరు మీ ప్రవర్తనను సరి జేసుకొని దైవభీతి కలిగి ఉండండి! ఎందుకంటే
నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

---

[85] చూడండి, 4:3.

130. కాని ఒకవేళ వారు (దంపతులు) విడిపోతే! అల్లాహ్ తన దాతృత్వంతో వారిలో ప్రతి ఒక్కరినీ స్వయం సమృద్ధులుగా చేయవచ్చు! మరియు అల్లాహ్! సర్వవ్యాప్తి (సర్వోపగతుడు) మహా వివేచనాపరుడు.

131. మరియు ఆకాశాలలో ఉన్నదంతా మరియు భూమిలో ఉన్నదంతా అల్లాహ్ కు చెందినదే. మరియు వాస్తవానికి మేము అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండమని, పూర్వం గ్రంథం ఇచ్చిన వారికీ మరియు మీకూ ఆజ్ఞాపించాము. మరియు ఒకవేళ మీరు తిరస్కరిస్తే భూమ్యాకాశాలలో ఉన్నదంతా నిశ్చయంగా, అల్లాహ్ కే చెందినది. మరియు అల్లాహ్ స్వయం సమృద్ధుడు, సర్వస్తోత్రాలకు అర్హుడు.

132. మరియు ఆకాశాలలోనూ మరియు భూమిలోనూ ఉన్నదంతా అల్లాహ్ కే చెందుతుంది. మరియు కార్యసాధకుడిగా అల్లాహ్ చాలు!

133. ఓ మానవులారా! ఆయన కోరితే, మిమ్మల్ని అంతం చేసి ఇతరులను తేగలడు. మరియు వాస్తవానికి, అల్లాహ్ ఇలా చేయగల సమర్థుడు[86].

134. ఎవడు ఇహలోక ఫలితాన్ని కోరుతాడో, (వానికదే దొరుకుతుంది). కాని (కేవలం) అల్లాహ్ వద్దనే ఇహలోక మరియు పరలోక ఫలితాలున్నాయి. మరియు అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వం చూసేవాడు.

---

[86] చూడండి, 47:38.

135. ఓ విశ్వాసులారా! మీరు న్యాయం కొరకు స్థిరంగా నిలబడి, అల్లాహ్ కొరకే సాక్ష్యమివ్వండి. మరియు మీ సాక్ష్యం మీకు గానీ, మీ తల్లిదండ్రులకు గానీ, మీ బంధువులకు గానీ, విరుద్ధంగా ఉన్నా సరే. వాడు ధనవంతుడైనా లేక పేదవాడైనా సరే! (మీ కంటే ఎక్కువ) అల్లాహ్ వారిద్దరి మేలు కోరేవాడు. కావున మీరు మీ మనోవాంఛలను అనుసరిస్తే న్యాయం చేయకపోవచ్చు[87]. మీరు మీ సాక్ష్యాన్ని వక్రీకరించినా, లేక దానిని నిరాకరించినా! నిశ్చయంగా, మీరు చేసేదంతా అల్లాహ్ బాగా ఎరుగును.

136. ఓ విశ్వాసులారా! అల్లాహ్ ను, ఆయన సందేశహరుణ్ణి, ఆయన తన సందేశహరునిపై (ముహమ్మద్ పై) అవతరింప జేసిన గ్రంథాన్ని మరియు ఆయన ఇంతకు పూర్వం అవతరింప

[87] చూడండి, 5:8.

జేసిన గ్రంథాలన్నింటినీ విశ్వసించండి[88]. అల్లాహ్‌ను, ఆయన దూతలను, ఆయన గ్రంథాలను, ఆయన ప్రవక్తలను, అంతిమదినాన్ని తిరస్కరించినవాడు, వాస్తవానికి మార్గభ్రష్టుడై, మార్గభ్రష్టత్వంలో చాలా దూరం పోయినట్లే!

137. నిశ్చయంగా, ఎవరైతే విశ్వసించిన తరువాత తిరస్కరించి, మళ్ళీ విశ్వసించి, ఆ తరువాత తిరస్కరించి; ఆ తిరస్కారంలోనే పురోగమిస్తారో! అలాంటి వారిని అల్లాహ్ ఎన్నటికీ క్షమించడు. మరియు వారికి సన్మార్గం వైపునకు దారి చూపడు!

138. కపట విశ్వాసులకు, నిశ్చయంగా! బాధాకరమైన శిక్ష ఉందని తెలుపు.

---

[88] ఇంతకు పూర్వం అవతరింపజేయబడిన దివ్యగ్రంథాలను విశ్వసించడం అంటే, అల్లాహ్ (సు.తా.) తరఫు నుండి అవతరింపజేయబడిన, తౌరాత్ మరియు ఇంజీల్ మొదలైన దివ్య గ్రంథాలలో మిగిలి ఉన్న సత్యాలను అన్నమాట. అంటే అల్లాహుతా'ఆలా తరఫు నుండి అవతరింపజేయబడి ఉన్న విషయాలను విశ్వసించడం. ఈ రోజు కేవలం ఈ దివ్యఖుర్ఆన్ తప్ప ఏ ఇతర దివ్యగ్రంథం కూడా అవతరింపజేయబడిన నిజరూపంలో లేదు. ఎందుకంటే ఆ మతపు ధర్మవేత్తలు కాలక్రమేణా వాటిలో ఎన్నో హెచ్చుతగ్గులు చేస్తూ వచ్చారు. ఉదారహణకు ఇప్పుడు వాడుకలో నున్న బైబిల్ లో ఎన్నో సార్లు మార్పులు చేశారు. ఇప్పుడు వాడుకలో ఉన్న ఆధునిక బైబిల్‌లో చివరి మార్పు 1977 క్రీ.శ.లో చేశారు. ఇది (Revised) Authorized KJV అనబడుతుంది. ఇక్కడ సంబోధన, ఇప్పుడు వాడుకలో ఉన్న ఆ దివ్యగ్రంథాలలో ఉన్న సత్యాలను మాత్రమే సూచిస్తునంది. చూడండి, 3:3

**139.** ఎవరైతే విశ్వాసులను వదలి సత్యతిరస్కారులను తమ స్నేహితులుగా చేసు కుంటున్నారో! అలాంటి వారు, వారి (అవిశ్వాసుల) నుండి, గౌరవాన్ని పొందగోరు తున్నారా? కానీ నిశ్చయంగా, గౌరవమంతా కేవలం అల్లాహ్ కే చెందినది[89].

**140.** మరియు వాస్తవానికి, (అల్లాహ్) మీ కొరకు ఈ గ్రంథంలో (ఈ విధమైన ఆజ్ఞ) అవతరింప జేశాడు: "ఒకవేళ మీరు అల్లాహ్ సూక్తులను గురించి తిరస్కారాన్ని మరియు పరిహాసాన్ని వింటే! అలా చేసేవారు, (ఆ సంభాషణ వదలి) ఇతర సంభాషణ ప్రారంభించనంత వరకు మీరు వారితో కలిసి కూర్చోకండి!" అలా చేస్తే నిశ్చయంగా, మీరు కూడా వారి లాంటి వారే! నిశ్చయంగా, అల్లాహ్ కపటవిశ్వాసులను మరియు సత్యతిరస్కారులను అందరినీ నరకంలో జమ చేస్తాడు.

**141.** వారు (కపట విశ్వాసులు) మీ విషయంలో నిరీక్షిస్తున్నారు. ఒకవేళ మీకు అల్లాహ్ తరఫు నుండి విజయం లభిస్తే! వారు (మీతో) అంటారు: "ఏమీ? మేము మీతో కలిసి లేమా?" కాని ఒకవేళ సత్యతిరస్కారులదే పైచేయి అయితే (వారితో) అంటారు: "ఏమీ? మీతో గెలిచే శక్తి మాకు లేక పోయిందా? అయినా మేము మిమ్మల్ని విశ్వాసుల నుండి కాపాడ లేదా?" కాని అల్లాహ్

[89] చూడండి, 35:10 మరియు 63:8.

పునరుత్థాన దినమున మీ మధ్య తీర్పు చేస్తాడు. మరియు అల్లాహ్! ఎన్నటికీ సత్యతిరస్కారులకు విశ్వాసులపై (విజయం పొందే) మార్గం చూపడు[90].

**142.** నిశ్చయంగా, ఈ కపట విశ్వాసులు అల్లాహ్ ను మోసగించగోరుతున్నారు. కాని ఆయనే వారిని మోసంలో పడవేశాడు[91]. మరియు ఒకవేళ వారు నమాజ్ కొరకు నిలిచినా శ్రద్ధాహీనులై కేవలం ప్రజలకు చూపటానికే నిలుస్తారు[92]. మరియు వారు అల్లాహ్ ను స్మరించేది చాల తక్కువ!

**143.** వారు (విశ్వాస-అవిశ్వాసాల) మధ్య ఊగిసలాడుతున్నారు. వారు పూర్తిగా ఇటు విశ్వాసులు) కాకుండా, పూర్తిగా అటు (సత్యతిరస్కారులు) కాకుండా ఉన్నారు. మరియు ఎవడినైతే అల్లాహ్ మార్గభ్రష్టత్వంలో పడవేస్తాడో అలాంటి వాడికి నీవు (సరైన)

---

[90] చూడండి, 42:30.
[91] చూడండి, 57:12-15.
[92] కపటవిశ్వాసులకు 'ఇషా మరియు ఫజ్ర్ నమా'జ్ లు చేయటం చాలా కఠినంగా ఉంటుంది. ('స'హీ'హ్'బు'ఖారీ) వారు ఇతరులకు చూపటానికి మరియు ముస్లింలను తమను గురించి అంధకారం (అయోమయం)లో ఉంచటానికే నమా'జ్ చేస్తారు. వారు చేసే నమా'జ్ లలో భయభక్తులు ఉండవు.

మార్గం చూపలేవు[93].

**144.** ఓ విశ్వాసులారా! మీరు విశ్వాసులను వదలి సత్యతిరస్కారులను, మీ స్నేహితులుగా చేసు కోకండి. ఏమీ? మీరు, మీకే వ్యతిరేకంగా, అల్లాహ్ కు స్పష్టమైన ప్రమాణం ఇవ్వదలచు కున్నారా?

**145.** నిశ్చయంగా కపట విశ్వాసులు నరకంలో, అట్టడుగు అంతస్తులో పడి ఉంటారు[94]. మరియు వారికి సహాయం చేయగల వాడిని ఎవ్వడినీ నీవు పొందజాలవు.

**146.** కాని ఎవరైతే, పశ్చాత్తాప పడి, తమను తాము సంస్కరించుకొని, అల్లాహ్ ను గట్టిగా నమ్ముకొని తమ ధర్మాన్ని (భక్తిని) కేవలం అల్లాహ్ కొరకే ప్రత్యేకించు కుంటారో, అలాంటి వారే విశ్వాసులతో

---

[93] ఎవరైతే బుద్ధిపూర్వకంగా మార్గభ్రష్టత్వాన్ని, కుఫ్ర్ మరియు షిర్క్ ను ఎన్నుకుంటారో! వారికి అల్లాహ్ (సు.తా.) సన్మార్గం వైపుకు మార్గదర్శకత్వం చేయడు. ఎందుకంటే అల్లాహుతా'ఆలా మానవులకు మరియు జిన్నాతులకు విచక్షణా బుద్ధినిచ్చాడు. ప్రవక్తల ద్వారా మరియు దివ్యగ్రంథాల ద్వారా వారి వద్దకు మార్గదర్శకత్వాన్ని పంపాడు. అయినా వారు తమ తలబిరుసుతనంతో షైతాన్ వలలో పడి పోయి, షైతాన్ అడుగుజాడలలో నడుస్తున్నారు. అల్లాహ్ (సు.తా.)కు జరిగిపోయింది, జరగనున్నది అంతా తెలుసు. అల్లాహుతా'ఆలా ఆలిముల్'గైబ్. దుష్టులు సన్మార్గం వైపునకు రారని అల్లాహ్ (సు.తా.) కు తెలుసు కాబట్టి, వారిని మార్గభ్రష్టత్వంలో పడి ఉండనిస్తాడే కానీ, వారిని బలవంతంగా మార్గభ్రష్టత్వంలోకి త్రోయడు.

[94] నరకంలో అన్నిటి కంటే క్రింది అంతస్తు అల్-హావియహ్ అనబడుతుంది.

కలిసి మెలిసి ఉంటారు[95]. మరియు త్వరలోనే అల్లాహ్ విశ్వాసులందరికీ గొప్ప ప్రతిఫలాన్ని ప్రసాదించగలడు.

**147.** మీరు కృతజ్ఞులై, విశ్వాసులై ఉంటే అల్లాహ్ మిమ్మల్ని నిష్కారణంగా ఎందుకు శిక్షిస్తాడు? మరియు అల్లాహ్ కృతజ్ఞతలను ఆమోదించేవాడు[96], సర్వజ్ఞుడు.

**148.** అన్యాయానికి గురి అయిన వాడు తప్ప! చెడును బహిరంగంగా పలుకటాన్ని అల్లాహ్ ఇష్టపడడు[97]. మరియు అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

**149.** మీరు మేలును బహిరంగంగా చెప్పినా లేక దానిని దాచినా![98] లేక చెడును క్షమించినా! నిశ్చయంగా, అల్లాహ్ మన్నించే వాడు[99], సర్వ

---

[95] మరియు ఏ కపటవిశ్వాసి అయితే పశ్చాత్తాపపడి తనను తాను సవరించుకొని అల్లాహ్ (సు.తా.) నే గట్టిగా విశ్వసించి తన భక్తిని కేవలం అల్లాహ్ (సు.తా.) కే ప్రత్యేకించుకుంటాడో అట్టివాడు స్వర్గంలో విశ్వాసులతో ఉంటాడు.

[96] షాకిరిన్ (అష్-షకూర్): Approving or Rewarding or Forgiving much or largely. అంటే కృతజ్ఞతలను ఆమోదించే, అంగీకరించే, ఆదరించే, విలువనిచ్చే వాడు. తన దాసుల మంచి కార్యాలకు అమితంగా ప్రతిఫలమిచ్చేవాడు. All-Appreciative, యోగ్యతను గుర్తించేవాడు. చూడండి, 2:158.

[97] మీరు మానవులలో ఏదైనా చెడును చూస్తే దానిని ఇతరులకు ప్రకటించకండి. కాని ఏకాంతంలో వారిని బోధించటానికి ప్రయత్నించండి.

[98] ఒకడు చేసిన చెడు లేక కీడుకు - తనకు జరిగిన దానికి - సరిసమానంగా ప్రతీకారం తీసుకోవటానికి షరీయత్ లో అనుమతి ఉంది. కానీ తనకు జరిగిన చెడు లేక కీడును క్షమించటం ఎక్కువగా ఆమోదించబడింది. ('స. ముస్లిం, 'హ. నం. 4587). చూడండి, 42:40.

[99] అఫువ్వన్ (అల్-అఫువ్వు): Pardoning, మన్నించే, క్షమించేవాడు. చూడండి, 2:52 వ్యాఖ్యానం 1.

సమర్థుడు.

**150.** నిశ్చయంగా, అల్లాహ్ ను మరియు ఆయన ప్రవక్తలను తిరస్కరించే వారూ మరియు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తల మధ్య భేదభావం చూపగోరేవారూ (అంటే అల్లాహ్ ను విశ్వసించి, ప్రవక్తలను తిరస్కరించేవారూ) మరియు: "మేము కొందరు ప్రవక్తలను విశ్వసిస్తాం, మరి కొందరిని తిరస్కరిస్తాము." అని అనే వారూ మరియు (విశ్వాస - అవిశ్వాసాలకు) మధ్య మార్గాన్ని కల్పించ గోరేవారూ -

**151.** ఇలాంటి వారే - నిస్సందేహంగా సత్యతిరస్కారులు మరియు సత్యతిరస్కారుల కొరకు మేము అవమానకరమైన శిక్షను సిద్ధపరచి ఉంచాము.

**152.** మరియు అల్లాహ్ ను మరియు ఆయన ప్రవక్తలందరినీ విశ్వసిస్తూ, వారి (ప్రవక్తల) మధ్య భేదభావాలు చూపని వారికి ఆయన (అల్లాహ్) వారి ప్రతిఫలాన్ని తప్పక ప్రసాదించ గలడు. మరియు అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

**153.** (ఓ ప్రవక్తా!) గ్రంథ ప్రజలు నిన్ను ఆకాశం నుండి వారిపై ఒక గ్రంథాన్ని అవతరింప జేయమని, అడుగుతున్నారని (ఆశ్చర్య పడకు). వాస్తవానికి వారు మూసాను ఇంతకంటే దారుణమైన దానిని కోరుతూ: "అల్లాహ్ ను మాకు ప్రత్యక్ష్యంగా చూపించు!" అని అడిగారు. అప్పుడు వారి దుర్మార్గానికి ఫలితంగా వారిపై పిడుగు విరుచుకు

పడింది[100]. స్పష్టమైన సూచనలు లభించిన తరువాతనే వారు ఆవుదూడను (ఆరాధ్యదైవంగా) చేసుకున్నారు. అయినా దానికి మేము వారిని క్షమించాము. మరియు మూసాకు మేము స్పష్టమైన అధికార మిచ్చాము.

**154.** మరియు మేము వారిపై తూర్ పర్వతాన్ని ఎత్తి ప్రమాణం తీసుకున్నాము. మేము వారితో: "సాష్టాంగపడుతూ (వంగుతూ) ద్వారంలో ప్రవేశించండి." అని అన్నాము[101]. మరియు: "శనివారపు (సబ్త్) శాసనాన్ని ఉల్లంఘించకండి." అని కూడా వారితో అన్నాము. మరియు మేము వారితో దృఢమైన ప్రమాణం కూడా తీసుకున్నాము[102].

**155.** కాని వారు తాము చేసిన ప్రమాణాలను భంగం చేయటం వలన మరియు అల్లాహ్ సూక్తులను తిరస్కరించటం వలన మరియు ప్రవక్తలను అన్యాయంగా చంపటం వలన! మరియు: "మా హృదయాలు పొరలతో కప్పబడి ఉన్నాయి[103]." అని అనటం వలన (మేము వారిని శిక్షించాము). అంతే కాదు, వారి సత్య తిరస్కారం వలన అల్లాహ్ వారి హృదయాలపై ముద్ర వేసి ఉన్నాడు; కాబట్టి వారు విశ్వసించినా కొంత మాత్రమే!

---

[100] చూడండి, 2:55.
[101] చూడండి, 2:58-59.
[102] చూడండి, 'స'హీ'హ్ బు.'ఖారీ, పుస్తకం - 4, 'హదీస్' నం. 615.
[103] చూడండి, 2:88.

**156.** మరియు వారి సత్యతిరస్కారం వలన మరియు వారు మర్యమ్ పై మోపిన మహా అపనింద వలన[104];

**157.** మరియు వారు: "నిశ్చయంగా, మేము అల్లాహ్ యొక్క సందేశహరుడు, మర్యమ్ కుమారుడైన, ఈసా మసీహ్ ను (ఏసు క్రీస్తును) చంపాము." అని అన్నందుకు[105]. మరియు వారు అతనిని చంపనూ లేదు మరియు శిలువపై ఎక్కించనూ లేదు, కాని, వారు భ్రమకు గురి చేయబడ్డారు[106]. నిశ్చయంగా, ఈ విషయాన్ని గురించి అభిప్రాయభేదం ఉన్నవారు దీనిని గురించి సంశయగ్రస్తులై ఉన్నారు. ఈ విషయం గురించి వారికి నిశ్చిత జ్ఞానం లేదు. వారు కేవలం ఊహనే అనుసరిస్తున్నారు. నిశ్చయంగా, వారు అతనిని చంపలేదు.

**158.** వాస్తవానికి, అల్లాహ్ అతనిని (ఈసాను) తన

---

[104] అంటే యూసుఫ్ నజ్జార్ అనే వ్యక్తితో ఆమె (మర్యమ్) సంబంధముందని యూదులు మోపిన అపనింద.

[105] చూడండి, 3:55.

[106] అంటే 'ఈసా మసీ'హ్ (ఏసు) వలే కనిపించిన మరొక వ్యక్తిని సిలువపై ఎక్కించారు. (నోబుల్ ఖుర్ఆన్)

వైపునకు ఎత్తుకున్నాడు[107] మరియు అల్లాహ్ సర్వశక్తి సంపన్నుడు, మహా వివేకవంతుడు.

**159.** మరియు గ్రంథ ప్రజల్లో ఎవడు కూడా అతనిని (ఈసాను), అతని మరణానికి పూర్వం[108] (అతను, అల్లాహ్ యొక్క సందేశహరుడు

---

[107] చూడండి 3:55 అల్లాహ్ (సు.తా.) 'ఈసా ('అ.స.) ను సజీవునిగా, అతని శరీరంతో సహా, పైకిలేపు కున్నాడు పునరుత్థాన దినానికి దగ్గరి రోజులలో, 'ఈసా ('అ.స.) దమిష్క్ (Damascus)లో తూర్పు దిక్కు మనారహ్ దగ్గర ఫజ్ర్ నమా'జ్ అఖామత్ సమయంలో ఆకాశం నుండి భూమిపైకి పంపబడుతారు. ఆతను పందిని చంపుతారు సిలువను విరిచేస్తారు జి'జ్'యా తొలగిస్తారు ప్రజలందరూ ముస్లిం లౌతారు. దజ్జాల్'ను అతనే సంహరిస్తారు. యఅ'జూజ్ మఅ'జూజ్'లు కూడా అతని ప్రార్థన వలననే చంప బడతారు ఈ పై విషయాలన్నీ ప్రముఖ 'హదీస్' ఉల్లేఖకులు చెప్పినవే. వారిలో అబూ హురైరా, 'అబ్దుల్లాహ్ బిన్-మస్'ఊద్, 'ఉస్మాన్ బిన్-అబీ అల్-'ఆస్, అబూ ఉమామ, నవ్వాస్ బిన్-సమ్'ఆన్ మరియు అబ్దుల్లాహ్ బిన్ - 'ఉమ్ రూ బిన్ అల్ 'ఆస్, (ర.'ది.'అన్హుమ్)మొదలైనవారున్నారు.వీటినిలిఖించినవారిలో బు'ఖారీ, ముస్లిం మరియు ఇతర ఎంతో మంది 'హదీస్' వేత్తలు ఉన్నారు. (ఇబ్నె - కసీ'ర్).

[108] ఇక్కడ 'ఈసా ('అ.స.) యొక్క మరణం అంటే, అతను మరల భూమి మీదికి పునరుత్థాన దినానికి దగ్గరి రోజులలో పంపబడి, పైన వివరించిన విషయాలన్నీ జరిగి, అతని సహజ మరణానికి మిందు, అని అర్థం. (ము'హమ్మద్ జూనాగఢీ). దీని మరొక తాత్పర్యంలో: "ఆ యూదుని లేక క్రైస్తవుని మరణ సమయంలో అంటే, ఆత్మ (ప్రాణం) తీసే దైవదూత వచ్చినప్పుడు అతడు (ఆ యూదుడు లేక క్రైస్తవుడు): 'ఈసా ('అ.స.), అల్లాహ్ (సు.తా.) యొక్క దాసుడు మరియు ఆయన సందేశహరుడు అని విశ్వసిస్తాడు. కానీ ఆ విశ్వాసం అతనికి ప్రయోజనకరం కాజాలదు." అని, వ్యాక్యానించారు.

మరియు ఒక మానవుడని), విశ్వసించకుండా ఉండడు. మరియు పునరుత్థాన దినమున అతను (ఈసా) వారిపై సాక్షిగా ఉంటాడు.[109]

**160.** యూదులకు వారు చేసిన ఘోర దుర్మార్గాలకు ఫలితంగానూ మరియు వారు, అనేకులను అల్లాహ్ మార్గంపై నడువకుండా ఆటంక పరుస్తూ ఉన్నందు వలననూ, మేము ధర్మసమ్మతమైన అనేక పరిశుద్ధ వస్తువులను వారికి నిషేధించాము[110];

**161.** మరియు వాస్తవానికి, వారికి నిషేధింపబడినా; వారు వడ్డీ తీసుకోవటం వలననూ మరియు వారు అధర్మంగా ఇతరుల సొమ్మును తినటం వలననూ, మరియు వారిలో అవిశ్వాసులైన వారి కొరకు మేము బాధాకరమైన శిక్షను సిద్ధ పరచి ఉంచాము.

**162.** కాని వారిలో పరిపూర్ణమైన జ్ఞానం గలవారు మరియు విశ్వాసులైనవారు[111], నీపై అవతరింపజేయబడిన దానిని మరియు నీకు పూర్వం అవతరింపజేయబడిన వాటిని విశ్వసిస్తారు. వారు నమాజ్ విధిగా సలుపుతారు, విధిదానం (జకాత్) చెల్లిస్తారు

---

[109] ఈ సాక్ష్యం 'ఈసా ('అ.స.) ను, అల్లాహ్ (సు.తా.) సజీవునిగా తన వైపునకు లేపుకొనక ముందటి విషయాల గురించి ఉంటుంది. చూడండి, 5:117 (ము'హమ్మద్ జూనాగఢి).

[110] చూడండి, 6:146 మరియు 3:93

[111] ఇక్కడ సూచించబడినవారు 'అబ్దుల్లాహ్ బిన్-సల్లామ్ మరియు ఇతర యూదులు(ర'ది. 'అన్హుమ్), ఎవరైతే ఇస్లాం స్వీకరించారో!

మరియు అల్లాహ్ యందు మరియు అంతిమ దినము నందు విశ్వాసం కలిగి ఉంటారు; ఇలాంటి వారికి మేము గొప్ప ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాము.

**163.** (ఓ ప్రవక్తా!) నిశ్చయంగా, మేము నూహ్ కు మరియు అతని తర్వాత వచ్చిన ప్రవక్తలకు సందేశం (వహీ) పంపినట్లు, నీకు కూడా సందేశం పంపాము. మరియు మేము ఇబ్రాహీమ్, ఇస్మాయీల్, ఇస్ హాఖ్, యఅఖూబ్ లకు మరియు అతని సంతతి వారికి మరియు ఈసా, అయ్యూబ్, యూనుస్, హారూన్ మరియు సులైమాన్'లకు కూడా దివ్యజ్ఞానం(వహీ) పంపాము[112] మరియు మేము దావూద్ కు జబూర్[113] గ్రంథాన్ని ప్రసాదించాము.

**164.** మరియు వాస్తవంగా, మేము పంపిన ప్రవక్తలలో కొందరి గాథలను నీకు తెలిపాము మరియు ఇతర

---

[112] ఇబ్నె 'అబ్బాస్ (ర'ది.'అ.) కథనం: "కొందరు (యూదులు) మూసా ('అ.స.) తరువాత ఎవరిపై కూడా దివ్యజ్ఞానం (వ'హీ) అవతరింపజేయబడలేదు."అనిఅన్నారు.దానికిసమాధానంగా ఈ ఆయత్ అవతరింపజేయబడింది. (ఇబ్నె-కసీ'ర్).

[113] 'జబూర్ (కీర్తనలు / Psalms): దావూద్ ('అ.స.)కు ఇవ్వబడిన గ్రంథం.

ప్రవక్తలను గురించి మేము నీకు తెలుపలేదు[114]. మరియు అల్లాహ్ మూసాతో నేరుగా మాట్లాడాడు.

**165.** (మేము) ప్రవక్తలను శుభవార్తలు ఇచ్చేవారిగా మరియు హెచ్చరికలు చేసే వారిగా పంపాము[115]. ప్రవక్తల(ఆగమనం) తరువాత అల్లాహ్'కు ప్రతికూలంగా వాదించటానికి ప్రజలకు ఏ సాకూ మిగలకూడదని![116] మరియు అల్లాహ్ సర్వశక్తిమంతుడు, మహా వివేచనాపరుడు.

**166.** కాని (ఓ ప్రవక్తా!) అల్లాహ్ నీపై అవతరింపజేసిన దానికి (ఖుర్ఆన్ కు) సాక్ష్యమిస్తున్నాడు. ఆయన దానిని తన జ్ఞానంతో అవతరింపజేశాడు. మరియు దేవదూతలు కూడా దీనికి సాక్ష్యమిస్తున్నారు.

---

[114] ఖుర్ఆన్ లో పేర్కొనబడిన ప్రవక్తలు కేవలం 25 మంది మాత్రమే: వారు 1) ఆదమ్, 2) ఇద్రీస్, 3) నూ'హ్, 4) హూద్, 5) 'సాలి'హ్, 6) ఇబ్రాహీమ్, 7) లూ'త్, 8) ఇస్మా'ఈల్, 9) ఇస్'హాఖ్, 10) య'అఖూబ్, 11) యూసుఫ్, 12) అయూబ్, 13) యూనుస్, 14) షు'ఐబ్, 15) మూసా, 16) హారూన్, 17) ఇల్యాస్, 18) అల్-యస'అ, 19) జు'ల్-కిఫ్ల్, 20) దావూద్, 21) సులైమాన్, 22) జ'కరియ్యా, 23) య'హ్యా, 24) 'ఈసా 25) ము'హమ్మద్ 'సలవాతుల్లాహి వసలాముహు 'అలైహి వ'అలైహిమ్ అజ్మ'ఈన్. ఇక మొత్తం ఎంత మంది ప్రవక్తలు వచ్చారో అల్లాహుతా'ఆలాకే తెలుసు. ము'హమ్మద్ ('స'అస) తరువాత మాత్రం ఏ ప్రవక్త రాడు. ఎవడైనా తాను ప్రవక్తనని ప్రకటించుకున్నా, అతడూ, అతనిని అనుసరించేవారూ మరియు అలాంటి వానిని ప్రవక్త అని నమ్మేవారూ అందరూ అసత్యవాదులే! అలాంటి వారు ముస్లింలు కారు. ఉదా: బహాయీలు, మీర్జాయీలు, ఖాదియానీలు మొదలైనవారు.

[115] విశ్వాసులకు స్వర్గపు శుభవార్త నివ్వటానికి మరియు అవిశ్వాసులకు నరకాన్ని గురించి హెచ్చరించటానికి.

[116] చూడండి, 20:134.

మరియు ఉత్తమ సాక్షిగా అల్లాహ్ యే చాలు.

**167.** నిశ్చయంగా, ఎవరైతే సత్యతిరస్కారులై, ఇతరులను అల్లాహ్ మార్గం వైపుకు రాకుండా నిరోధిస్తున్నారో వాస్తవానికి వారు మార్గభ్రష్టులై, మార్గభ్రష్టత్వంలో చాలా దూరం వెళ్ళిపోయారు!

**168.** నిశ్చయంగా ఎవరైతే సత్య తిరస్కారులై, అక్రమానికి పాల్పడతారో, వారిని అల్లాహ్ ఏ మాత్రమూ క్షమించడూ మరియు వారికి ఋజుమార్గం వైపునకు మార్గదర్శకత్వమూ చేయడు.

**169.** వారికి కేవలం నరక మార్గం మాత్రమే చూపుతాడు. అందులో వారు శాశ్వతంగా కలకాలం ఉంటారు. మరియు ఇది అల్లాహ్ కు ఎంతో సులభం.

**170.** ఓ మానవులారా! వాస్తవంగా మీ ప్రభువు తరఫు నుండి, సత్యాన్ని తీసుకొని మీ వద్దకు ఈ సందేశహరుడు వచ్చి వున్నాడు, కావున అతని మీద విశ్వాసం కలిగి ఉండండి, ఇదే మీకు మేలైనది. మరియు మీరు గనక తిరస్కరిస్తే! నిశ్చయంగా భూమ్యాకాశాలలో ఉన్నదంతా అల్లాహ్ కే చెందినదని తెలుసుకోండి[117]. మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేచనా పరుడు.

**171.** ఓ గ్రంథప్రజలారా! మీరు మీ ధర్మ విషయంలో

---

[117] చూడండి, 14:8.

హద్దుమీరి ప్రవర్తించకండి[118]. మరియు అల్లాహ్ ను గురించి సత్యం తప్ప వేరే మాట పలుకకండి. నిశ్చయంగా, మర్యమ్ కుమారుడైన ఈసా మసీహ్ (ఏసు క్రీస్తు), అల్లాహ్ యొక్క సందేశహరుడు మరియు ఆయన (అల్లాహ్) మర్యమ్ వైపునకు పంపిన, ఆయన (అల్లాహ్) యొక్క ఆజ్ఞ (కలిమ)[119] మరియు ఆయన (అల్లాహ్) తరఫు నుండి వచ్చిన ఒక ఆత్మ (రూహ్). కావున మీరు అల్లాహ్ ను మరియు ఆయన ప్రవక్తలను విశ్వసించండి. మరియు (ఆరాధ్య దైవాలు): "ముగ్గురు!" అని అనకండి[120]. అది మానుకోండి, మీకే మేలైనది! నిశ్చయంగా, అల్లాహ్ ఒక్కడే ఆరాధ్య దైవం. ఆయనకు కొడుకు ఉన్నాడనే విషయానికి ఆయన అతీతుడు. ఆకాశాలలో ఉన్నదంతా

---

[118] 'గులువ్వున్: అంటే అతిగా ప్రవర్తించటం. అంటే ఇక్కడ క్రైస్తవులు 'ఈసా ('అ.స.)కు మరియు అతని తల్లికి అంట గట్టిన స్థానం. వారు ఆ ఇద్దరికి దైవత్వపు స్థానం అంట గట్టి వారిని ఆరాధించసాగారు. చూడండి, 9:31.

[119] కలిమతుల్లాహ్: అల్లాహ్ (సు.తా.) యొక్క మాట, పదం, సంకేతం, ఉత్తరువు లేక ఆజ్ఞ. అంటే అల్లాహుతా'ఆలా ఏదైనా చేయదలుచుకుంటే దానిని: "అయిపో" (కున్)! అని ఆజ్ఞాపిస్తాడు, అంతే అది అయిపోతుంది (ఫ యకూన్). చూడండి, 3:45.

[120] క్రైస్తవులలో కొందరు 'ఈసా ('అ.స.) స్వయంగా దేవుడే అంటారు. మరికొందరు అతనిని దేవుని కుమారుడు అని అంటారు. ఇంకా కొందరు ముగ్గురు దైవాలున్నారంటారు. ఆ ముగ్గురు అల్లాహ్ (సు.తా.), జిబ్రీల్ మరియు 'ఈసా ('అలైహిమ్ స.) అని అంటారు. ఇది మానుకొనండని అల్లాహుతా'ఆలా ఆజ్ఞాపిస్తున్నాడు.

మరియు భూమిలో ఉన్నదంతా ఆయనకే చెందుతుంది. మరియు కార్యకర్తగా అల్లాహ్ మాత్రమే చాలు.

**172.** తాను, అల్లాహ్ కు దాసుడననే విషయాన్ని మసీహ్ (క్రీస్తు) ఎన్నడూ ఉపేక్షించలేదు. మరియు ఆయనకు (అల్లాహ్ కు) సన్నిహితంగా ఉండే దేవదూతలు కూడాను. మరియు ఎవరు ఆయన (అల్లాహ్) దాస్యాన్ని ఉపేక్షించి, గర్వం ప్రదర్శిస్తారో వారందరినీ ఆయన తన ముందు సమావేశపరుస్తాడు.

**173.** కానీ, ఎవరైతే విశ్వసించి సత్కార్యాలు చేస్తారో, వారికి ఆయన వారి ప్రతిఫలాన్ని పూర్తిగా ప్రసాదిస్తాడు మరియు తన అనుగ్రహంతో మరింత అధికంగా ఇస్తాడు. ఇక ఆయనను నిరాకరించి, గర్వం వహించేవారికి బాధాకరమైన శిక్ష విధిస్తాడు[121]; మరియు వారు తమ కొరకు- అల్లాహ్ తప్ప ఇతర రక్షించేవాడిని గానీ, సహాయపడేవాడిని గానీ పొందలేరు

**174.** ఓ మానవులారా! మీ ప్రభువు నుండి మీకు స్పష్టమైన నిదర్శనం వచ్చింది. మరియు మేము మీపై స్పష్టమైన జ్యోతిని (ఈ ఖుర్ఆన్ ను) అవతరింపజేశాము.

**175.** కావున ఎవరు అల్లాహ్ ను విశ్వసించి, ఆయననే దృఢంగా నమ్ముకుంటారో, వారిని ఆయన తన

[121] చూడండి, 40:60.

కారుణ్యానికి మరియు అనుగ్రహానికి పాత్రులుగా చేసుకొని తన వద్దకు చేరే ఋజుమార్గం వైపునకు మార్గదర్శకత్వం చేస్తాడు.

**176.** వారు నిన్ను, (కలాలను) గురించి ధార్మిక శాసనం (ఫత్వా) అడుగుతున్నారు. అల్లాహ్ మీకు, కలాలను[122] గురించి, ఈ విధంగా ధార్మిక శాసనం ఇస్తున్నాడని చెప్పు: "ఒక పురుషుడు మరణించి, అతనికి సంతానం లేకుండా ఒక సోదరి[123] మాత్రమే ఉంటే, అతడు విడిచిన ఆస్తిలో ఆమెకు సగం వాటా లభిస్తుంది. పిల్లలు లేక చనిపోయిన సోదరి మొత్తం ఆస్తికి, అతడు

[122] కలాల అంటే సూటీ (రక్త)సంబంధీకులు లేని మృతుడు అంటే తండ్రి గానీ, కుమారుడు గానీ లేని మృతుడు. కొడుకు లేని పక్షంలో కొడుకు కొడుకు(లు) సూటి వారసులుగా పరిగణించబడతారు. (ఇజ్మా'అ, ఇబ్నె-కసీ'ర్). కుమారుడు ఒక్కడే ఉన్నా పూర్తి ఆస్తికి వారసుడు. మరియు తండ్రి ఒక్కడే ఉన్నా అతను కూడా పూర్తి ఆస్తికి వారసుడు. అప్పుడు మృతుని సోదరసోదరీమణులకు హక్కు ఉండదు. కాని భార్య లేక భర్త మరియు తల్లి ఉంటే వారి భాగం వారికి ఇచ్చిన తరువాత. కుమార్తె మరియు సోదరీ ఉంటే, కుమార్తెకు సగం, సోదరికి సగం. సోదరుడు ఒక్కడే ఉంటే అతడు తన సోదరి పూర్తి ఆస్తికి వారసుడౌతాడు. కాని మృతురాలు భర్త ఉంటే అతని భాగం ఇచ్చి మిగతా ఆస్తికి సోదరుడు వారసుడౌతాడు.

[123] సోదరీ అంటే ఇక్కడ సొంత అనగా, తల్లి-తండ్రి ఇరువురి నుండి, లేక కేవలం తండ్రి నుండి గానీ ఉంటే ఆమెకు అతను వదిలిన ఆస్తిలో సగం భాగం ఉంటుంది. ఇంకా చూడండి, 4:12, అక్కడ ఇజ్మా'అ, అభిప్రాయం ఏమిటంటే అక్కడ కేవలం తల్లి వైపు నుండి (అర్ధ) సోదర సోదరీమణుల విషయం చెప్పబడింది. ఎక్కువ వివరాల కొరకు ధర్మవేత్త(ఫుఖహా)లను సంప్రదించండి.

(ఆమె నిజ సోదరుడు) వారసుడవుతాడు. అతనికి (మృతునికి) ఇద్దరు సోదరీమణులు ఉంటే, వారిద్దరికీ అతడు వదలిన ఆస్తిలో మూడింట రెండు వంతుల భాగం లభిస్తుంది. ఒకవేళ సోదర సోదరీమణులు (అనేకులుంటే) ప్రతి పురుషునికి ఇద్దరు స్త్రీల భాగానికి సమానంగా వాటా లభిస్తుంది. మీరు దారి తప్పకుండా ఉండటానికి అల్లాహ్ మీకు అంతా స్పష్టంగా తెలుపుతున్నాడు. మరియు అల్లాహ్ కు ప్రతి విషయం గురించి బాగా తెలుసు.

# 5. అల్-మాఇదహ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఓ విశ్వాసులారా! ఒప్పందాలను పాటించండి[1]. మీ కొరకు పచ్చిన మేసే చతుష్పాద పశువులన్నీ[2] (తినటానికి) ధర్మసమ్మతం (హలాల్) చేయబడ్డాయి; మీకు తెలుపబడిన పశువులు తప్ప! మీరు ఇహ్రామ్ స్థితిలో ఉన్నప్పుడు వేటాడటం మీకు ధర్మసమ్మతం కాదు[3]. నిశ్చయంగా, అల్లాహ్ తాను కోరింది శాసిస్తాడు.

2. ఓ విశ్వాసులారా! అల్లాహ్ (నియమించిన)

[*] [అల్-మాఇదహ్ – భోజనంతో నిండిన విస్తరి]

[1] 'అఖ్ద్: 'ఉఖూద్ (బ.వ.) అంటే ముడి అని అర్థం. ఇవి ధర్మాచారణలో మూడు రకాలు: 1) అల్లాహ్ - మానవుల మధ్య, 2) మానవుడు - తన ఆత్మతో, 3) మానవుడు - తన తోటివారితో చేసేవి. (రా'గిబ్).

[2] బహీమ: అంటే మేసే పశువు. అన్'ఆమున్: అంటే ఒంటెలు, ఆవులు, ఎడ్లు, గొర్రెలు, మేకల వంటి సాధు జంతువులు. చూడండి, 6:124. ఇవే కాక అడవి పశువులు, ఉదా: అడవి ఆవులు, జింకలు మొదలైనవి. ఇవి గడ్డి, చెట్లు తినేవి. వేటాడి ఇతర జంతువులను తననివి. జా'-నాబిన్: అంటే కోరపళ్ళు గల క్రూరమృగాలు మాంసాహారులైనవి. ఉదా: కుక్క, పులి. జు'-మి'ఖ్లబిన్: అంటే, గోళ్ళు గల వేటాడే పక్షులు. ఏవైతే తమ వేట జంతువును తమ గోళ్ళతో పట్టుకుంటాయో, ఉదా: డేగ.

[3] ఇ'హ్రామ్ స్థితిలో వేటాడే నిషిద్ధాలను గురించి చూడండి, 5:94-96.

చిహ్నాలను[4] మరియు నిషిద్ధ మాసాన్ని[5] ఉల్లంఘించకండి. మరియు బలి పశువులకు మరియు మెడలలో పట్టీ ఉన్న పశువులకు (హాని చేయకండి)[6]. మరియు తమ ప్రభువు అనుగ్రహాన్ని మరియు ప్రీతిని కోరుతూ పవిత్ర గృహానికి (కఅబహ్ కు) పోయే వారిని (ఆటంక పరచకండి). కానీ ఇహ్రామ్ స్థితి ముగిసిన తరువాత మీరు వేటాడవచ్చు. మిమ్మల్ని పవిత్ర మస్జిద్ (మస్జిద్ అల్ హరామ్) ను సందర్శించకుండా నిరోధించిన వారి పట్ల గల విరోధం వలన వారితో హద్దులు మీరి ప్రవర్తించ కండి. మరియు పుణ్యకార్యాలు మరియు దైవభీతి విషయాలలో, ఒకరికొకరు తోడ్పడండి. మరియు పాపకార్యాలలో గానీ, దౌర్జన్యాలలో గానీ తోడ్పడకండి. అల్లాహ్ యందు భయభక్తులు

---

[4] ష'ఆయి'రల్లాహ్: అల్లాహ్ చిహ్నాలు. అంటే పవిత్రమైనవని సూచించిన నిదర్శనాలు, సంకేతాలు, ప్రత్యేక ధర్మవిధులను నిర్వహించటానికి చూపబడిన స్థానాలు. ఉదా: క'అబహ్, 'సఫా-మర్వాలు, మరియు ధర్మ ఆచారాలు, 'తవాఫ్, స'యీ మొదలైనవి.

[5] నిషిద్ధ మాసాలు: రజబ్, జు'ల్ - ఖాయిదహ్, జు'ల్-'హిజ్జహ్ మరియు ము'హర్రమ్ ('అరబ్బీ 7, 11, 12 మరియు 1వ నెలలు) ఈ మాసాలలో యుద్ధం చేయటం నిషిద్ధం.

[6] 1) హద్'యున్: అంటే 'హాజీ, 'హజ్ కొరకు, 'హరంలో బలి (ఖుర్బానీ) చేయటానికి తెచ్చే పశువు. 2) ఖలాయి దతున్': 'హరమ్ కు తీసుకుని పోవుటకు నిశ్చయించి, వాటి మెడలలో పట్టీలు వేసిన పశువు. 3) ఫిద్'యతున్: ధర్మ ఆచారంలో అయిన తప్పులకు పరిహారంగా ఇచ్చే బలి (ఖుర్బానీ). దీని మాంసం పూర్తిగా పేదవారిలో పంచాలి.

కలిగి ఉండండి. నిశ్చయంగా, అల్లాహ్ శిక్ష విధించటంలో చాల కఠినుడు.

3. (సహజంగా) మరణించింది, రక్తం, పందిమాంసం మరియు అల్లాహ్ తప్ప ఇతరుల కొరకు (ఇతరుల పేరుతో) వధింపబడినది (జిబహ్ చేయబడినది), గొంతు పిసికి ఊపిరాడక, దెబ్బ తగిలి, ఎత్తు నుండి పడి, కొమ్ము తగిలి మరియు క్రూరమృగం నోట పడి చచ్చిన (పశువు / పక్షి) అన్నీ, మీకు తినటానికి నిషిద్ధం (హరామ్) చేయబడ్డాయి. కాని (క్రూరమృగం నోట పడిన దానిని) చావక ముందే మీరు జిబహ్ చేసినట్లయితే అది నిషిద్ధం కాదు. మరియు బలిపీఠం మీద వధించబడినది[7], మరియు బాణాల ద్వారా శకునం చూడటం నిషేధింప బడ్డాయి. ఇవన్నీ ఘోరపాపాలు (ఫిస్ ఖున్). ఈనాడు సత్యతిరస్కారులు, మీ ధర్మం గురించి పూర్తిగా ఆశలు వదులు కున్నారు. కనుక మీరు వారికి భయపడకండి, నాకే భయపడండి. ఈనాడు నేను మీ ధర్మాన్ని మీ కొరకు పరిపూర్ణం చేసి, మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను. మరియు మీ కొరకు అల్లాహ్ కు విధేయులుగా

---

[7] ను'సుబున్: అంటే ముష్రికులు తమ దేవతలకు, దైవదూతలకు, జిన్నాతులకు లేక తమ పూర్వీకులైన పుణ్యపురుషులకు, మొదలైన వారి కొరకు బలి ఇవ్వటానికి నియమించిన ప్రత్యేక ఆస్థానాలు. వాటిపై అల్లాహ్ (సు.తా.) పేరుతో కూడా బలి చేసినా అది 'హరాం. అక్కడ బలి చేయబడిన పశు మాంసాన్ని తినటం కూడా 'హరాం (నిషిద్ధం).

ఉండటాన్నే (ఇస్లాంనే) ధర్మంగా సమ్మతించాను[8] ఎవడైనా ఆకలికి ఓర్చుకోలేక, పాపానికి పూనుకోక[9], (నిషిద్ధమైన వస్తువులను తిన్నట్లయితే)! నిశ్చయంగా అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

**4.** వారు (ప్రజలు) తమ కొరకు ఏది ధర్మ సమ్మతం (హలాల్) అని నిన్ను అడుగు తున్నారు. నీవు ఇలా అను: "పరిశుద్ధ వస్తువులన్నీ మీ కొరకు ధర్మసమ్మతం (హలాల్) చేయబడ్డాయి. మరియు మీకు అల్లాహ్ నేర్పిన విధంగా మీరు వేట శిక్షణ ఇచ్చిన జంతువులు[10] మీ కొరకు పట్టినవి కూడా! కావున అవి మీ కొరకు పట్టుకున్న వాటిని మీరు తినండి కాని దానిపై అల్లాహ్ పేరును ఉచ్ఛరించండి[11]. అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి. నిశ్చయంగా, అల్లాహ్ లెక్క

---

[8] ఈ భాగం 10వ హిజ్రీలో 9వ జి'ల్-హాజ్ రోజు, 'హజ్ సమయంలో, 'అరఫాత్ మైదానంలో అవతరింప జేయబడింది. దైవప్రవక్త ('స'అస) అంతి కాలానికి దాదాపు 82 రోజులకు ముందు. దీని తరువాత న్యాయానికి సంబంధించిన ఏ ఆయత్ కూడా అవతరింపజేయబడలేదు.

[9] చూడండి, 2:173.

[10] వేట నేర్పి, వేటాడటానికి ఉపయోగపడే జంతువులు పక్షులు మొదలైనవి ఉదా: కుక్క, చిరుతపులి, డేగ మొదలైనవి.

[11] ఇక్కడ రెండు షరతులున్నాయి: 1) వేట జంతువును విడుచునప్పుడు బిస్మిల్లా హిర్ర'హ్మా నిర్ర'హీమ్, అనాలి. 2) ఆ వేట జంతువు పట్టిన దానిని తన యజమాని కొరకు వదలాలి, దానిని అది తినగూడదు. అట్టి జంతువు పట్టిన దానిని చంపినా తన యజమాని వచ్చేవరకు దానిని తినగూడదు. అట్టి జంతువు చనిపోయినా, అది 'హలాల్. వేటలో యజమాని విడిచిన వేట జంతువు తప్ప. మరొక జంతువు పాల్గొనరాదు. ఇదే ఆజ్ఞ బాణానికి కూడా వర్తిస్తుంది. ('స'హీ'హ్ బు'ఖారీ, ముస్లిం).

తీసుకోవటంలో అతి శీఘ్రుడు."

5. ఈనాడు మీ కొరకు పరిశుద్ధమైన వస్తువులన్నీ ధర్మసమ్మతం (హలాల్) చేయబడ్డాయి. మరియు గ్రంథప్రజల ఆహారం[12] మీకు ధర్మసమ్మతమైనది మరియు మీ ఆహారం వారికి ధర్మ సమ్మతమైనది. మరియు సుశీలురు అయిన విశ్వాస (ముస్లిం) స్త్రీలు గానీ మరియు సుశీలురు అయిన పూర్వ గ్రంథప్రజల స్త్రీలు గానీ[13], మీరు వారికి వారి మహ్ర్ చెల్లించి, న్యాయబద్ధంగా వారితో వివాహ

---

[12] గ్రంథప్రజల ఆహారం అంటే, ఏదైతే అల్లాహ్ పేరుతో జి'బ్'హ్ చేయబడి రక్తం ప్రవహింపజేయబడిందో అదే. కాని మొదట మత్తు చేయబడి తరువాత గొంతు కోయబడినది కాదు. ఏ ఆహారపదార్థాలైతే ఇస్లాం ధర్మశాసనం ప్రకారం హరాం చేయబడ్డాయో వాటిని విడిచి.

[13] పూర్వగ్రంథ ప్రజల స్త్రీల విషయం: వారు ఆధునిక భావాల వారై, ఇప్పుడు పశ్చిమ దేశాలలో, నడుస్తున్న సాంఘిక విచారాలను సమర్థించేవారైతే గ్రంథ ప్రజలతో వివాహం ధర్మసమ్మతమైనా వారి నడకలు 'హరాం అయితే, అట్టి స్త్రీలతో వివాహం చేసుకోవటం ఏ విధంగా ధర్మసమ్మతం కాగలదో ఆలోచించవలసిన విషయం. ప్రస్తుత కాలంలో చాలామంది గ్రంథప్రజలు వారి ధర్మం క్రైస్తవ ధర్మం గానీ, యూద ధర్మం గానీ, వారు దాని నుండి చాలా దూరంలో ఉన్నారు. కావున మీరు ఏ స్త్రీతోనైనా వివాహ మాడదలచుకున్నపుడు ఆమె సుశీలవతి అయి ఉండి, విచ్ఛలవిడిగా తిరిగే స్త్రీ కాకుండా ఉండటం ఎంతో ముఖ్యం. ఇంకా మీరు మీ స్త్రీలకు గ్రంథ ప్రజలతో పెండ్లి చేయించకండి. ఎందుకంటే మీరు ముస్లింలు దైవప్రవక్తలను అందరినీ నమ్ముతారు. ఆదరిస్తారరు. కాని వారు, ఉదా., యూదులు, 'ఈసా ('అ.స.) ను మరియు ము'హమ్మద్ ('స'అస)ను దైవప్రవక్తని నమ్మరు. కాబట్టి ఒక ముస్లిం స్త్రీ యూదుణ్ణి లేక క్రైస్తవుణ్ణి పెండ్లి చేసుకుంటే, ఆమె వారింట్లో ము'హమ్మద్ ('స'అస) పట్ల దూషణలు ఎలా వినగలదు?

జీవితం గడపండి. కాని వారితో స్వేచ్ఛా కామక్రీడలు గానీ, లేదా దొంగచాటు సంబంధాలు గానీ ఉంచుకోకండి. ఎవడు విశ్వాస మార్గాన్ని తిరస్కరిస్తాడో అతడి కర్మలు వ్యర్థమవుతాయి. మరియు అతడు పరలోకంలో నష్టం పొందేవారిలో చేరుతాడు.

6. ఓ విశ్వాసులారా! మీరు నమాజ్ కు లేచి నపుడు, మీ ముఖాలను, మరియు మీ చేతులను మోచేతుల వరకు కడుక్కోండి. మరియు మీ తలలను (తడి చేతులతో) తుడుచుకోండి. మరియు మీ కాళ్ళను చీలమండల వరకు కడుక్కోండి[14]. మరియు మీకు ఇంద్రియ స్ఖలనం (జునుబ్) అయి ఉంటే, స్నానం (గుస్ల్) చేయండి. మరియు మీరు అస్వస్థులై ఉన్నా, లేక ప్రయాణంలో ఉన్నా, లేక మీలో ఎవరైనా కాలకృత్యాలు తీర్చుకొని ఉన్నా, లేక మీరు స్త్రీలతో కలిసి (సంభోగం చేసి) ఉన్నా, అప్పుడు మీకు నీరు లభించని పక్షంలో పరిశుభ్రమైన మట్టితో తయమ్ముమ్ చేయండి. అంటే మీ ముఖాలను మరియు మీ చేతులను, దానితో (పరిశుద్ధమైన మట్టిపై స్పర్శించిన చేతులతో) రుద్దుకోండి[15]. మిమ్మల్ని కష్టపెట్టాలనేది అల్లాహ్ అభిమతం కాదు. మీరు కృతజ్ఞులు కావాలని ఆయన, మిమ్మల్ని శుద్ధపరచి మీపై తన అనుగ్రహాన్ని

[14] చూడండి, 'స. బు'ఖారీ, పు - 1, 'హ. నం. 138.
[15] చూడండి, 4:43.

పూర్తి చేయగోరుతున్నాడు.

7. మరియు మీకు అల్లాహ్ చేసిన అనుగ్రహాన్ని మరియు ఆయన మీ నుండి తీసుకున్న దృఢమైన ప్రమాణాన్ని జ్ఞాపకం చేసుకోండి. అప్పుడు మీరు: "మేము విన్నాము మరియు విధేయుల మయ్యాము." అని అన్నారు. మరియు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి. నిశ్చయంగా, హృదయాలలో ఉన్నదంతా అల్లాహ్ కు బాగా తెలుసు.

8. ఓ విశ్వాసులారా! మీరు అల్లాహ్ కొరకు న్యాయంగా సాక్ష్యమివ్వటానికి స్థిరంగా నిలబడండి[16]. ఇతరుల పట్ల మీకున్న ద్వేషానికిలోనై, మీరు న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చేయండి, అది దైవభక్తికి సమీపమైనది. మరియు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి. నిశ్చయంగా, మీరు చేసేదంతా అల్లాహ్ ఎరుగును.

9. మరియు విశ్వసించి సత్కార్యాలు చేసే వారికి క్షమాపణ మరియు గొప్ప ప్రతిఫలం ఉన్నాయని అల్లాహ్ వాగ్దానం చేశాడు.

10. మరియు ఎవరైతే సత్యతిరస్కారానికి పాల్పడి, మా సూచనలను అబద్ధాలని తిరస్కరిస్తారో! అలాంటి వారు భగభగ మండే నరకాగ్ని వాసులవుతారు.

11. ఓ విశ్వాసులారా! ఒక జాతి వారు (మీకు హాని చేయ సంకల్పించి) తమ చేతులను మీ వైపునకు

[16] చూడండి, 4:135.

చాచినపుడు, అల్లాహ్ వారి చేతులను మీ నుండి తొలగించి మీకు చేసిన అనుగ్రహాన్ని జ్ఞప్తికి తెచ్చుకోండి. అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి. మరియు విశ్వాసులు అల్లాహ్ పైననే నమ్మక ముంచుకుంటారు.

**12.** మరియు వాస్తవానికి అల్లాహ్ ఇస్రాయీలు సంతతి వారి నుండి దృఢమైన ప్రమాణాన్ని తీసుకున్నాడు. మరియు మేము వారిలో నుండి పన్నెండు మందిని (కనాన్ కు) పోవటానికి నాయకులుగా నియమించాము[17]. మరియు అల్లాహ్ వారితో ఇలా అన్నాడు: "ఒకవేళ మీరు నమాజ్ స్థిరంగా సలుపుతూ, విధి దానం (జకాత్) చెల్లిస్తూ మరియు నా ప్రవక్తలను విశ్వసించి వారికి తోడ్పడుతూ, అల్లాహ్ కు మంచి ఋణాన్ని ఇస్తూ వుంటే! నిశ్చయంగా, నేను మీకు తోడుగా ఉంటాను. మరియు నిశ్చయంగా, నేను మీ నుండి మీ పాపాలను తొలగిస్తాను మరియు నిశ్చయంగా మిమ్మల్ని క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాను. కానీ, దీని తరువాత మీలో ఎవడు సత్యతిరస్కార వైఖరిని అవలంబిస్తాడో! అతడు వాస్తవంగా, సరైన మార్గం నుండి తప్పి పోయినవాడే!"

**13.** ఆ పిదప వారు తాము చేసిన ఒడంబడికను భంగం చేసినందుకు, మేము వారిని శపించాము (బహిష్కరించాము) మరియు వారి హృదయాలను

[17] చూడండి, 5:20-26.

కఠినం చేశాము. వారు పదాలను తారుమారు చేసి వాటి అర్థాన్ని, సందర్భాన్ని పూర్తిగా మార్చి వేసేవారు[18]. వారికి ఇవ్వబడిన బోధనలలో అధిక భాగాన్ని మరచిపోయారు. అనుదినం వారిలో ఏ కొందరో తప్ప, పలువురు చేసే ద్రోహాన్ని గురించి నీకు తెలుస్తూనే ఉంది. కనుక వారిని మన్నించు మరియు వారి చేష్టలను ఉపేక్షించు. నిశ్చయంగా అల్లాహ్ సజ్జనులను ప్రేమిస్తాడు.

14. "మేము క్రైస్తవులము." అని అనే వారి నుంచి కూడా మేము దృఢమైన ప్రమాణం తీసుకున్నాము; కాని వారు తమకు ఇవ్వబడిన బోధనలలో అధిక భాగాన్ని మరచి పోయారు; కావున తీర్పుదినం వరకు వారి మధ్య విరోధాన్ని మరియు ద్వేషాన్ని కల్గించాము. మరియు త్వరలోనే అల్లాహ్ వారు చేస్తూ వచ్చిన కర్మలను గురించి వారికి తెలియజేస్తాడు.

15. ఓ గ్రంథప్రజలారా! వాస్తవంగా మా ప్రవక్త (ముహమ్మద్) మీ వద్దకు వచ్చి వున్నాడు; మీరు కప్పి పుచ్చుతూ ఉన్న గ్రంథం (బైబిల్) లోని ఎన్నో విషయాలను అతను మీకు బహిర్గతం చేస్తున్నాడు; మరియు ఎన్నో విషయాలను ఉపేక్షిస్తున్నాడు. వాస్తవంగా మీ కొరకు అల్లాహ్ తరఫు నుండి ఒక జ్యోతి మరియు ఒక స్పష్టమైన

---

[18] చూడండి, 4:46.

గ్రంథం (ఈ ఖుర్ఆన్) వచ్చి వున్నది[19].

16. దాని ద్వారా అల్లాహ్! తన ప్రీతిని పొందగోరే వారికి శాంతి పథాలను చూపుతాడు మరియు తన ఆజ్ఞతో వారిని అంధకారం నుండి వెలుగులోకి తెచ్చి వారికి ఋజుమార్గం వైపునకు మార్గదర్శకత్వం చేస్తాడు.

17. "నిశ్చయంగా, మర్యమ్ కుమారుడైన మసీహ్ (క్రీస్తు) యే అల్లాహ్!" అని అనే వారు నిస్సందేహంగా! సత్య తిరస్కారులు. (ఓ ప్రవక్తా!) వారితో ఇలా అను: "అల్లాహ్ గనక మర్యమ్ కుమారుడైన మసీహ్ (క్రీస్తు) ను అతని తల్లిని మరియు భూమిపై ఉన్న వారందరినీ, నాశనం చేయగోరితే, ఆయనను ఆపగల శక్తి ఎవరికి ఉంది? మరియు ఆకాశాలలోను, భూమిలోను మరియు వాటి మధ్య ఉన్న సమస్తం మీద ఆధిపత్యం అల్లాహ్ దే. ఆయన తాను కోరినది సృష్టిస్తాడు. మరియు అల్లాహ్ ప్రతిదీ చేయ గల సమర్థుడు[20]."

18. మరియు యూదులు మరియు క్రైస్తవులు ఇలా అంటారు: "మేము అల్లాహ్ సంతానం మరియు

---

[19] నూరున్ వ కితాబుమ్ముబీన్: ఇక్కడ ఈ రెండు పదాలు దివ్యఖుర్ఆన్ ను సంబోధిస్తున్నాయి, అనే విషయం తరువాత వచ్చే 16వ ఆయత్ నుండి విషదమవుతోంది.

[20] చూడండి, 4:171.

ఆయనకు ప్రియమైన వారము[21]." (వారితో) ఇలా అను: "అయితే, ఆయన మీ పాపాలకు మిమ్మల్ని ఎందుకు శిక్షిస్తున్నాడు? అలా కాదు, మీరు కూడ ఆయన పుట్టించిన మానవులలో ఒకరు మాత్రమే! ఆయన తాను కోరిన వారిని క్షమిస్తాడు మరియు తాను కోరిన వారిని శిక్షిస్తాడు మరియు ఆకాశాలలో, భూమిలో మరియు వాటి మధ్య ఉన్న సమస్తం మీద సామ్రాజ్యాధిపత్యం అల్లాహ్ దే మరియు ఆయన వైపునకే (అందరికీ) మరలి పోవలసి ఉంది."

19. ఓ గ్రంథప్రజలారా! ప్రవక్తలు రావటం,ఆగిపోయిన కొంతకాలం తరువాత,మీకు అంతా స్పష్టం గా తెలుపటానికి, వాస్తవంగా మా సందేశహరుడు(ముహమ్మద్) మీవద్దకు వచ్చాడు. మీరు: "మా వద్దకు శుభవార్తలు వినిపించేవాడు మరియు హెచ్చరికలు చేసేవాడు ఎవ్వడూ రాలేదు." అని అనకూడదని. నిస్సందేహంగా ఇప్పుడు మీకు శుభవార్తలు వినిపించేవాడు మరియు హెచ్చరికలు చేసేవాడు వచ్చి వున్నాడు మరియు అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు.

---

[21] యూదులు 'ఉజైర్ ('అ.స.)ను మరియు క్రైస్తవులు 'ఈసా ('అ.స.)ను అల్లాహ్; లేక అల్లాహుతా'ఆలా కుమారులు అంటారు. మరియు యూదులు తమను తాము అల్లాహుతా'ఆలా సంతానంగా చెప్పుకుంటారు. ఈ ఆయత్ వారి ఈ వాదాన్ని ఖండిస్తోంది.

**20.** మరియు మూసా తన జాతి ప్రజలతో ఇలా అన్నది (జ్ఞాపకం చేసుకోండి): "నా జాతి ప్రజలారా! అల్లాహ్ మీకు చేసిన అనుగ్రహాలను జ్ఞాపకం చేసుకోండి; ఆయన మీలో నుండి ప్రవక్తలను ఆవిర్భవింపజేశాడు మరియు మిమ్మల్ని సార్వభౌములుగా చేశాడు[22]. మరియు (ఆ కాలంలో) ప్రపంచంలో ఎవ్వరికీ ప్రసాదించని వాటిని(అనుగ్రహాలను) మీకు ప్రసాదించాడు"

**21.** "నా జాతి ప్రజలారా! అల్లాహ్ మీ కొరకు వ్రాసి ఉంచిన పవిత్ర భూమి (ఫలస్తీన్) లో ప్రవేశించండి. వెనుకకు మరలి రాకండి, అలా చేస్తే నష్టపడి తిరిగి రాగలరు."

**22.** (అప్పుడు)వారన్నారు:"ఓమూసా!నిశ్చయంగా, అందులో బలిష్ఠులైన ప్రజలు (అమాలేకీయులు) ఉన్నారు. మరియు వారు అక్కడి నుండి వెళ్ళిపోనంత వరకు, మేము అందులో ఏ మాత్రమూ ప్రవేశించము; ఒకవేళ వారు వెళ్ళిపోతే మేము తప్పక ప్రవేశిస్తాము."

**23.** (అప్పుడు) భయపడేవారిలో నుండి అల్లాహ్ అనుగ్రహం పొందిన ఇద్దరు వ్యక్తులు అన్నారు:

---

[22] ఉదాహరణకు సులైమాన్ ('అ.స.) ప్రవక్త మరియు సార్వభౌముడు (రాజు) కూడా, దీనితో విశదమయ్యేదేమిటంటే అల్లాహ్ (సు.తా.) యే రాజులను కూడా ఎన్నుకుంటాడు.

"ద్వారం నుండి పోయి వారిపై దాడి చేయండి[23].
మీరు లోనికి ప్రవేశించారంటే నిశ్చయంగా,
విజయం మీదే! మీరు వాస్తవానికి విశ్వసించిన
వారే అయితే! అల్లాహ్ పైననే నమ్మకం
ఉంచుకోండి."

24. వారన్నారు: "ఓ మూసా! వారు అందు ఉన్నంత
వరకు మేము అందులో ఎన్నటికీ ప్రవేశించము.
కావున నీవు మరియు నీ ప్రభువు పోయి
పోరాడండి, మేము నిశ్చయంగా, ఇక్కడే కూర్చుని
ఉంటాము."

25. (దానికి మూసా) అన్నాడు: "ఓ నా ప్రభూ!
నాకు నాపై మరియు నా సోదరునిపై మాత్రమే
అధికారం గలదు. కావున నీవు మా మధ్య
మరియు ఈ అవిధేయుల మధ్య తీర్పు చేయి
(మమ్మల్ని ఈ అవిదేయుల నుండి దూరం
చేయి)."

26. (అల్లాహ్) అన్నాడు: "ఇక నిశ్చయంగా ఆ
భూమి వారి కొరకు నలభై సంవత్సరాల వరకు
నిషేధింపబడింది. వారు దేశదిమ్మరులై ఈ

---

[23] ఆ ఇద్దరు వ్యక్తులు యూషా బిన్-నూన్ మరియు కాలిబ్ బిన్-యూహన్నా (Joshua & Caleb). వీరు కానన్ ను పరిశీలించటానికి ఎన్నుకోబడిన పన్నెండు మందిలో నుండి ఇద్దరు.

భూమిలో తిరుగుతూ ఉంటారు[24]. కావున అవిధేయులైన జనులను గురించి నీవు చింతించకు."

**27.** మరియు వారికి ఆదమ్ యొక్క ఇద్దరు కుమారుల[25] (హాబిల్ మరియు ఖాబిల్ ల) యథార్థ కథను వినిపించు. వారిద్దరు (అల్లాహ్ కు) బలి (ఖుర్బానీ) ఇచ్చి నప్పుడు ఒకని (హాబిల్) బలి స్వీకరించ బడింది మరియు రెండవ వాని (ఖాబీల్) బలి స్వీకరించ బడలేదు. (ఖాబీల్) అన్నాడు: "నిశ్చయంగా నేను నిన్ను చంపుతాను." (దానికి హాబీల్) అన్నాడు: "నిశ్చయంగా, అల్లాహ్ భయభక్తులు గలవారి (బలినే) స్వీకరిస్తాడు.

**28.** ఒకవేళ నీవు నన్ను చంపటానికి నీ చేయి నా వైపుకు ఎత్తినా! నేను నిన్ను చంపటానికి నా చేయి నీ వైపుకు ఎత్తను. (ఎందుకంటే) నిశ్చయంగా, నేను సర్వలోకాలకు పోషకుడైన అల్లాహ్ కు భయపడుతున్నాను.

---

[24] ఆ భూమి పేరు 'తై' మైదానం. నలభై సంవత్సరాల వరకు యూదులు ఆ మైదానంలో తిరుగుతూ ఉండి, చివరకు ఫలస్తీన్ లోకి ప్రవేశించినప్పుడు మూసా ('అ.స.) అనుచరులలో కేవలం ఈ ఇద్దరు పెద్దలే మిగిలారు. యూషా బిన్-నూన్, మూసా ('అ.స.) తరువాత, అతని స్థానంలో 'ఖలీఫా అయ్యారు. కాలిబ్ బిన్-యూ'హన్నా అతనికి కుడిభుజం అయ్యారు.

[25] హాబిల్ మరియు ఖాబిల్ ఆదమ్ ('అ.స.) యొక్క ఇద్దరు కుమారులు. బైబిల్ లో వీరు ఏబిల్ (Abel) మరియు కేన్ (Cain)గా పేర్కొనబడ్డారు. హాబిల్ (Abel) ను ఖాబిల్ (Cain) చంపాడు.

29. నీవు నీ పాపంతో సహా, నా పాపాన్ని కూడా భరించి నరకవాసులలో ఒకడవు కావాలని నా కోరిక. మరియు ఇదే దుర్మార్గుల ప్రతిఫలం."

30. చివరికి అతడి మనస్సు అతడిని (తన సోదరుని) హత్యకు పురికొల్పింది, కావున అతడు తన సోదరుణ్ణి (హాబీల్ ను) చంపి నష్టం పొందిన వారిలో చేరి పోయాడు.

31. అప్పుడు అల్లాహ్ ఒక కాకిని పంపాడు; అది నేలను త్రవ్వి అతని సోదరుని శవాన్ని ఎలా దాచాలో చూపించింది. అతడు (ఖాబీల్): "అయ్యో, నా పాడుగాను! నేను ఈ కాకి పాటి వాణ్ణి కూడా కాలేక పోయాను! నా సోదరుని శవాన్ని దాచే (ఉపాయం) వెతక లేక పోయాను కదా!" అని వాపోయాడు. అప్పుడతడు పశ్చాత్తాప పడే వారిలో చేరి పోయాడు.

32. ఈ కారుణం వల్లనే మేము ఇస్రాయీల్ సంతతి వారికి ఈ ఉత్తరువు ఇచ్చాము: "నిశ్చయంగా- ఒక వ్యక్తి (హత్యకు) బదులుగా గానీ లేదా భూమిలో కల్లోలం వ్యాపింపజేసి నందుకు గానీ గాక-ఎవడైనా ఒక వ్యక్తిని(అన్యాయంగా) చంపితే,అతడు సర్వమానవజాతిని చంపి నట్లే మరియు ఎవడైనా ఒక మానవుని ప్రాణాన్ని కాపాడితే, అతడు సర్వమానవజాతి ప్రాణాలను కాపాడినట్లే!" మరియు వాస్తవానికి, వారి వద్దకు స్పష్టమైన సూచనలు తీసుకొని మా ప్రవక్తలు వచ్చారు, అయినా వాస్తవానికి వారిలో

పలువురు భూమిలో అక్రమాలు చేసేవారు.

33. నిశ్చయంగా, ఎవరైతే అల్లాహ్ తో మరియు ఆయన ప్రవక్తతో పోరాడుతారో మరియు ధరణిలో కల్లోలం రేకెత్తించటానికి ప్రయత్నిస్తారో, అలాంటి వారికి మరణ శిక్ష విధించాలి; లేదా శిలువపై ఎక్కించాలి; లేదా వారి అభిముఖ పక్షాల కాళ్ళు - చేతులను నరికించాలి; లేదా వారిని దేశ బహిష్కృతుల్ని చేయాలి. ఇది వారికి ఇహలోకంలో గల అవమానం. మరియు వారికి పరలోకంలో కూడా ఘోర శిక్ష ఉంటుంది.

34. మీరు స్వాధీనపరచుకోక ముందు పశ్చాత్తాప పడేవారు తప్ప! కావున మీరు నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత, అని తెలుసుకోండి.

35. ఓ విశ్వాసులారా! అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి. మరియు ఆయన సాన్నిధ్యానికి

చేరే మార్గాన్ని అన్వేషించండి[26]. మరియు ఆయన మార్గంలో నిరంతరం కృషి చేస్తే మీరు సాఫల్యం పొంద వచ్చు![27]

**36.** నిశ్చయంగా, సత్య తిరస్కారులైన వారు తీర్పుదినాన గల శిక్ష నుండి తప్పించుకోవటానికి - వారి వద్ద ఉంటే - భూమిలో ఉన్న సమస్తాన్ని దానితో పాటు మరి అంత (ధనాన్ని) కూడా, విమోచనా ధనంగా ఇవ్వగోరుతారు కాని అది స్వీకరించబడదు. మరియు వారికి అతి బాధాకరమైన శిక్ష ఉంటుంది[28].

**37.** వారు నరకాగ్ని నుండి బయటికి రాగోరుతారు, కాని వారు దాని నుండి బయటికి రాజాలరు.

---

[26] వసీల: మార్గం, అంటే తాను కోరిన దానిని పొందటానికి లేక దానికి సన్నిహితులవటానికి సహాయ పడేది. అంటే దైవభీతి మరియు సద్వర్తన మరియు అల్లాహ్ (సు.తా.) 'హరాం చేసిన వాటి నుండి దూరంగా ఉండటం. కాని మూర్ఖులు ఈ సత్యాన్ని విడిచి గోరీలలో ఉన్న వారిని తమకు వసీలాగా భావిస్తున్నారు. షరీ'అత్ లో ఇలాంటి అపోహలకు ఎలాంటి స్థానం లేదు. ('స'హీ'హ్ బు'ఖారీ, కితాబ్ అల్-అ'జాన్ మరియు 'స'హీ'హ్ ముస్లిం, కితాబ్ అ'స్సలాహ్). అ'జాన్ తరువాత చదువ వలసిన దు'ఆయే వసీలా అది: "అల్లాహుమ్మ రబ్బ హాజి హిద్ద'అవతి త్తామ్మతి, వ'స్సలాతిల్ ఖాయి'మతి, ఆతి ము'హమ్మదన్ వసీలత వల్ - ఫ'దీలత, వబ్'అస్ హు మకామమ్ మ'హ మూ దల్లజీ' వఅద్తహు." స్వర్గంలో నబీ ('స'అస) కు ప్రసాదించబడిన మకామె మ'హమూద్ కూడా వసీల అనబడుతుంది. కావున ఎవడైతే అ'జాన్ తరువాత పై దు'ఆ చేస్తాడో అతడు నా సిఫారసుకు యోగ్యుడవుతాడు అని మహా ప్రవక్త ('స'అస) అన్నారు.

[27] చూడండి, 2:186.

[28] చూడండి, 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 8, 'హదీస్' నం. 546.

మరియు వారికి ఎడతెగని శిక్ష ఉంటుంది[29].

38. మరియు పురుషుడు దొంగ అయినా లేదా స్త్రీ దొంగ అయినా, వారి చేతులను నరికి వేయండి. ఇది వారి కర్మలకు గుణపాఠంగా అల్లాహ్ నిర్ణయించిన ప్రతిఫలం (శిక్ష)[30]. మరియు అల్లాహ్ సర్వ శక్తిమంతుడు, మహా వివేచనాపరుడు.

39. ఎవడు నేరం చేసిన తరువాత పశ్చాత్తాప పడి తనను తాను సవరించు కుంటాడో! నిశ్చయంగా, అల్లాహ్ అలాంటి వాని పశ్చాత్తాపాన్ని అంగీకరిస్తాడు. నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

40. ఏమీ? నిశ్చయంగా, భూమ్యాకాశాలపై ఆధిపత్యం అల్లాహ్ దేనని నీకు తెలియదా? ఆయన తాను కోరిన వారిని శిక్షిస్తాడు మరియు తాను కోరిన వారిని క్షమిస్తాడు. మరియు అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు.

41. ఓ ప్రవక్తా! సత్యతిరస్కారంలోకి పరుగులు తీసే

---

[29] ఈ ఆయత్ సత్యతిరస్కారులను గురించి ఉంది. ఎందుకంటే ముఅ'మిన్ లను చివరకు నరకాగ్ని నుండి బయటకు తీయటం జరుగుతుంది. ఇది 'హదీస్' లలో పేర్కొనబడింది.

[30] ఈ శిక్ష వివరాలను గురించి 'హదీస్', ఫిఖ్ మరియు తఫాసీర్ పుస్తకాలను చదవాలి. ఇస్లాంలో ఈ విధంగా కఠినశిక్షలు ఉండటం వల్లనే ఇస్లామీయ శాసనం పాటించే దేశాలలో - ఎక్కడైతే ఇంత వరకు షరీ'అత్ శాసనమే అమలులో ఉందో - ఉన్నంత శాంతి భద్రతలు సుఖసంతోషాలు మరే ఇతర 'గైరు షరీ'అత్ శాసనాలు పాటించే దేశాలలో లేవు. ఉదా: స'ఊదీ 'అరేబియా.

వారి వల్ల నీవు దుఃఖపడకు. అలాంటి వారు: "మేము విశ్వసించాము." అని తమ నోటితో మాత్రమే అంటారు. కాని వారి హృదయాలు విశ్వసించలేదు. మరియు యూదులలో కొందరు అసత్యాలను కుతూహలంతో వినే వారున్నారు మరియు నీ వద్దకు ఎన్నడూ రాని ఇతర ప్రజలకు (అందజేయటానికి) మీ మాటలు వినేవారున్నారు. వారు పదాల అర్థాలను మార్చి, వాటి సందర్భాలకు భిన్నంగా తీసుకుని ఇలా అంటారు: "మీకు ఈ విధమైన (సందేశం) ఇస్తేనే స్వీకరించండి మరియు ఇలాంటిది ఇవ్వక పోతే, జాగ్రత్త పడండి!" మరియు అల్లాహ్ ఎవరిని పరీక్షించ దలచాడో (తప్పు దారిలో వదల దలచాడో) వారిని అల్లాహ్ నుండి తప్పించటానికి నీవు ఏమీ చేయలేవు. ఎవరి హృదయాలను అల్లాహ్ పరిశుద్ధ పరచగోరలేదో అలాంటి వారు వీరే. వారికి ఇహలోకంలో అవమానం ఉంటుంది. మరియు వారికి పరలోకంలో ఘోర శిక్ష ఉంటుంది.

42. వారు అబద్ధాన్ని వినేవారు మరియు నిషిద్ధమైన దానిని తినేవారు. కావున వారు నీ వద్దకు (న్యాయానికి) వస్తే, నీవు (ఇష్టపడితే) వారి మధ్య తీర్పు చేయి, లేదా ముఖం త్రిప్పుకో. నీవు వారి నుండి విముఖుడవైతే వారు నీకేమీ హాని చేయ లేరు. నీవు వారి మధ్య తీర్పు చేస్తే, న్యాయంగా మాత్రమే తీర్పు చేయి. నిశ్చయంగా, అల్లాహ్ న్యాయబద్ధులైన వారిని ప్రేమిస్తాడు.

**43.** మరియు - అల్లాహ్ ఉత్తరువులు ఉన్న తౌరాత్ గ్రంథం వారి వద్ద ఉన్నప్పటికీ - వారు తీర్పు కొరకు, నీ వద్దకు ఎందుకు వస్తున్నారు? ఆ తరువాత కూడా వారు దాని నుండి తిరిగి పోతున్నారు మరియు ఇలాంటి వారు (నిజానికి) విశ్వసించిన వారు కారు.

**44.** నిశ్చయంగా మేము తౌరాత్'ను (మూసాపై) అవతరింపజేశాము. అందులో మార్గదర్శకత్వం మరియు జ్యోతి ఉన్నాయి. అల్లాహ్ కు విధేయులైన (ముస్లింలైన) ప్రవక్తలు దానిని అనుసరించి, యూదుల మధ్య తీర్పు చేస్తూ ఉండేవారు[31]. అదే విధంగా ధర్మవేత్తలు (రబ్బానియ్యూన్) మరియు యూదమతాచారులు (అ'హ్'బార్'లు) కూడా (తీర్పు చేస్తూ ఉండేవారు). ఎందుకంటే వారు అల్లాహ్ గ్రంథానికి రక్షకులుగా మరియు దానికి సాక్షులుగా నియమింపబడి ఉండేవారు. కావున మీరు (యూదులారా) మానవులకు భయపడకండి. నాకే భయపడండి. నా సూక్తులను

---

[31] యూదుల ప్రవక్తలందరూ అల్లాహ్(సు.తా.)కు విధేయులైన వారే అంటే ముస్లింలే. ఆ ఇస్లాం వైపునకే దైవప్రవక్త ము'హమ్మద్ ('స'అస) పిలుస్తున్నారు.ఈ ఇస్లాంధర్మమే ఆదమ్ ('అ.స.) నుండి ప్రతి ప్రవక్తా బోధించిన ధర్మం. ఇక హిందూధర్మానికి మూలమైన వేదాలు మరియు భగవద్గీత కూడా ఏకైక పరమేశ్వరునికి అంటే అల్లాహుతా'ఆలాకు మాత్రమే విధేయులై ఉండి, కేవలం ఆయననే ఆరాధించాలని బోధిస్తున్నాయి. ఆ పరమేశ్వరుడు, సంతానం లేనివాడు అని కూడా వివరిస్తున్నాయి. అంతేగాక పామరులే కల్పిత దైవాలను, సృష్టించబడిన వాటిని ఆరాధిస్తారని కూడా బోధిస్తున్నాయి.

(ఆయాత్'లను) స్వల్పలాభాలకు అమ్ముకోకండి. మరియు ఎవరు అల్లాహ్ అవతరింపజేసిన (శాసనం) ప్రకారం తీర్పు చేయరో, అలాంటి వారే సత్యతిరస్కారులు.

**45.** మరియు ఆ గ్రంథం (తౌరాత్) లో వారికి మేము: "ప్రాణానికి బదులు ప్రాణం, కన్నుకు బదులు కన్ను, ముక్కుకు బదులు ముక్కు, చెవికి బదులు చెవి, పన్నుకు బదులు పన్ను మరియు గాయాలకు బదులుగా సరిసమానమైన ప్రతీకారం వ్రాశాము[32]. కాని ఎవరైనా దానిని క్షమిస్తే, అది అతనికి పాపపరిహారం (కఫ్ఫారా)! మరియు ఎవరు అల్లాహ్ అవతరింపజేసిన శాసనం ప్రకారం తీర్పుచేయరోఅలాంటివారు!వారేదుర్మార్గులు[33].

**46.** మరియు మేము వారి (ఆ ప్రవక్తల) అడుగుజాడలను (ఆసారిహిమ్) అనుసరించేవాడు మరియు తౌరాత్ లో మిగిలి ఉన్న సత్యాన్ని ధృవపరచే వాడయిన,మర్యమ్ కుమారుడు ఈసా (ఏసును)

---

[32] ఈ శిక్షలకు చూడండి, బైబిల్ (Old Testament), నిర్గమకాండం - (Exodus) 21:23-36.

[33] పూర్వ గ్రంథ ప్రజలు తమ ధర్మగ్రంథానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. అంటే అల్లాహ్ (సు.తా.) శాసనాన్ని అనుసరించటం లేదు. ఎవరైతే అల్లాహుతా'ఆలా శాసనాన్ని అనుసరించరో అలాంటి వారే "జాలిమూన్-దుర్మార్గులు, ఫాసిఖూన్-అవిధేయులు (దుష్టులు) మరియు కాఫిరూన్-సత్యతిరస్కారులుఅనబడతారు.అలాంటివారేఅల్లాహుతా'ఆలా ఆగ్రహానికి గురి అయ్యావారు.

పంపాము[34]. మేము అతనికి ఇంజీల్ గ్రంథాన్ని ప్రసాదించాము. అందులో మార్గదర్శకత్వం మరియు జ్యోతి ఉన్నాయి మరియు అది తౌరాత్ లో మిగిలి ఉన్న సత్యాన్ని ధృవీకరిస్తుంది మరియు దైవభీతి గలవారికి మార్గదర్శకత్వం మరియు హితోపదేశం కూడా!

47. మరియు ఇంజీల్ గ్రంథప్రజలను, అల్లాహ్! ఆ గ్రంథంలో అవతరింపజేసిన శాసనం ప్రకారం తీర్పు చేయమను మరియు ఎవరు అల్లాహ్ అవతరింపజేసిన శాసనం ప్రకారం తీర్పు చేయరో అలాంటి వారు, వారే అవిధేయులు

[34] మూసా ('అ.స.) పై అవతరింపజేయబడిన తౌరాత్ గ్రంథం తరువాత అల్లాహ్ (సు.తా.) 'ఈసా ('అ.స.) పై ఇంజీల్ ను అవతరింపజేశాడు. అతను తౌరాత్ లో మిగిలి ఉన్న సత్యాన్ని ధృవపరిచారు. 'ఈసా ('అ.స.): "ఇస్రాయీ'ల్ సంతతిలోని దారి తప్పిన గొర్రెల వద్దకే తప్ప ఇతరుల వద్దకు నేను పంపబడలేదు." అని అన్నారు. మత్తయి - (Mathew), 15:24. ఇక ము'హమ్మద్ ('స'అస) వచ్చారు. అతనిపై ఖుర్ఆన్ అవతరింపజేయబడింది. ఇది పూర్వగ్రంథాలలో మిగిలి ఉన్న సత్యాన్ని ధృవీకరిస్తుంది ఈ ఖుర్ఆన్ 1400 సంవత్సరాలలో, దానిలోని ఒక్క అక్షరమైనా మార్చబడకుండా, దాని అసలు రూపంలో భద్రపరచబడి ఉన్న ఏకైక, దివ్యగ్రంథం. ఎందుకంటే పునరుత్థానదినం వరకు నేను ఈ ఖుర్ఆన్ ను దాని అసలు రూపంలో భద్రపరుస్తానని అల్లాహ్ (సు.తా.) వాగ్దానం చేశాడు, చూడండి. 15:9. ఇది ర'హ్మతుల్లిల్ 'ఆలమీన్ - అంటే సర్వలోకాల వారికి కారుణ్యం. ఇది సర్వలోకాల వారి కొరకు అవతరించేయబడింది. ము'హమ్మద్ ('స'అస) చిట్టచివరి ప్రవక్త. అతనిపై అవతరింపజేయబడిన ఈ దివ్యఖుర్ఆన్ చిట్ట చివరి దివ్యగ్రంథం.

(దుష్టులు)[35].

**48.** మరియు (ఓ ప్రవక్తా!) మేము ఈ గ్రంథాన్ని నీపై సత్యంతో అవతరింపజేశాము. ఇది పూర్వ గ్రంథాలలో మిగిలి ఉన్న సత్యాన్ని ధృవపరుస్తుంది. మరియు వాటిలో ఉన్న సత్యాసత్యాలను పరిష్కరిస్తుంది[36]. కావున నీవు, అల్లాహ్ అవతరింపజేసిన ఈ శాసనం ప్రకారం వారి మధ్య తీర్పు చెయ్యి. మరియు నీ వద్దకు వచ్చిన సత్యాన్ని విడిచి వారి కోరికలను అనుసరించకు[37]. మీలో ప్రతి ఒక్క సంఘానికి ఒక ధర్మశాసనాన్ని మరియు ఒక జీవన మార్గాన్ని నియమించి

---

[35] ఎంతవరకైతే ఖుర్ఆన్ అవతరింపజేయబడలేదో, అంతవరకు బైబిల్ శాసనం అమలులో ఉండెను. కాని దైవప్రవక్త('స'అస) కు దివ్యఖుర్ఆన్ ప్రసాదింపబడిన తరువాత ఇది ఇంతకు ముందు అవతరింపజేయ బడిన దివ్యగ్రంథాలను రద్దు చేస్తుంది. ఇది అల్లాహ్(సు.తా.)శాసనం. మరొక విశేషం ఏమిటంటే అవి వాటి అసలు రూపంలో లేవు. వాటిని అనుసరించే వారు వాటిలో తమ ఇష్టానుసారంగా ఎన్నో సార్లు, ఎన్నో మార్పులు చేశారు. వాటిలో చివరి మార్పు గలది 1977 క్రీస్తు శకపు (Revised) Authorized KJV. అంతేగాక ఇప్పుడు ప్రపంచంలో ఎన్నో రకాలైన బైబిల్స్ చెలామణిలో ఉన్నాయి. చూడండి 3:3 వ్యాఖ్యానం 2. కాని ఖుర్ఆన్ మాత్రమే 1400 సంవత్సరాలలో ఏవిధమైన మార్పులు లేకుండా దాని అసలు రూపంలో సురక్షితంగా ఉన్న ఏకైక దివ్యగ్రంథం.

[36] ముహైమినన్ 'అలైహి: అంటే అది వాటిలో ఉన్న సత్యాన్ని ధృవపరుస్తుంది, వాటిలో చేర్చబడిన అసత్యాన్ని అసత్యమని నిరూపిస్తుంది మరియు స్పష్టపరుస్తుంది.

[37] అంటే ముస్లిమేతరులు కూడా తీర్పు కొరకు వస్తే వారి మధ్య దివ్యఖుర్ఆన్ (అల్లాహుత'ఆలా) ఆదేశానుసారంగా మాత్రమే తీర్పు చేయాలి; కానీ వారి ధర్మాన్ని అనుసరిస్తూ గానీ, లేక వారి కోరికలను అనుసరిస్తూ గానీ, తీర్పు చేయరాదు.

ఉన్నాము. ఒకవేళ అల్లాహ్ తలుచుకుంటే, మిమ్మల్ని అంతా ఒకేఒక సంఘంగా రూపొందించి ఉండేవాడు. కాని మీకు ఇచ్చిన దానితో (ధర్మంతో) మిమ్మల్ని పరీక్షించటానికి (ఇలా చేశాడు). కావున మీరు మంచిపనులు చేయటంలో ఒకరితో నొకరు పోటీ పడండి. అల్లాహ్ వద్దకే మీరందరూ మరలిపోవలసివుంది. అప్పుడు ఆయన మీకున్న భేదాభిప్రాయాలను గురించి మీకు తెలియజేస్తాడు.

49. మరియు (ఓ ప్రవక్తా!) నీవు అల్లాహ్ అవతరింపజేసిన శాసనం ప్రకారం వారి మధ్య తీర్పు చెయ్యి మరియు వారి వ్యర్థకోరికలను అనుసరించకు. అల్లాహ్ నీపై అవతరింపజేసిన కొన్ని శాసనాల నుండి వారు నిన్ను తప్పించకుండా జాగ్రత్తగా ఉండు. ఒకవేళ వారు వెనుదిరిగి పోతే, అల్లాహ్ వారిని, వారి కొన్ని పాపాలకు శిక్షించదలచాడని తెలుసుకో. మరియు నిశ్చయంగా, ప్రజలలో అనేకులు అవిధేయతకు పాల్పడే వారున్నారు.

50. ఏమీ? వారు అజ్ఞాన కాలపు తీర్పును కోరుతున్నారా? కాని ఆయన (అల్లాహ్) పై నమ్మకం గల వారికి అల్లాహ్ కంటే మంచి తీర్పు చేయగలవాడెవడు?[38]

---

[38] ఇస్లాం: అంటే అల్లాహ్ (సు.తా.)కు విధేయత. జాహిలియ్యహ్ - అంటే అజ్ఞానం. ఈ రెండు పదాలు ఒకదాని కొకటి వ్యతిరేకంగా వాడబడతాయి. ఎందుకంటే సర్వ జ్ఞానాలకు మూలాధారి అల్లాహ్ (సు.తా.) కావున అల్లాహుతా'ఆలాను విశ్వసించని వారు అజ్ఞానులే! (ఫ'త్హ అల్ ఖదీర్). ఇంకా చూడండి, 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 9, 'హదీస్' నం. 21.

51. ఓ విశ్వాసులారా! యూదులను మరియు క్రైస్తవులను మిత్రులుగా చేసుకోకండి. వారు ఒకరి కొకరు స్నేహితులు[39]. మీలో ఎవడు వారితో స్నేహం చేస్తాడో వాస్తవానికి అతడు వారిలో చేరిన వాడవుతాడు. నిశ్చయంగా, అల్లాహ్ దుర్మార్గులకు మార్గదర్శకత్వం చేయడు.

52. కావున ఎవరి హృదయాలలో రోగం (కాపట్యం) ఉందో వారు, వారి సాంగత్యం కొరకు పోటీ పడుతున్నది నీవు చూస్తున్నావు. వారు: "మాపై ఏదైనా ఆపద రాగలదని మేము భయపడుతున్నాము." అని అంటారు. బహుశా అల్లాహ్ (విశ్వాసులకు) విజయాన్ని గానీ, లేదా తన దిక్కు నుండి ఏదైనా అవకాశాన్ని గానీ కలిగించవచ్చు! అప్పుడు వారు తమ మనస్సులలో దాచి ఉంచిన దానికి పశ్చాత్తాప పడతారు.

53. మరియు విశ్వాసులు (పరస్పరం ఇలా అనుకుంటారు): "ఏమీ? వాస్తవానికి మేము మీతోనే ఉన్నామని, అల్లాహ్ పేరుతో కఠోర ప్రమాణాలు చేసి, నమ్మకం కలిగించే వారు వీరేనా?" వారి (కపటవిశ్వాసుల) కర్మలన్నీ వ్యర్థమై, వారు నష్టపడిన వారవుతారు!

54. ఓ విశ్వాసులారా! మీలో ఎవడైనా తన ధర్మం (ఇస్లాం) నుండి వైదొలగితే, అల్లాహ్ త్వరలోనే ఇతర ప్రజలను తేగలడు. ఆయన వారిని

[39] చూడండి, 3:38, 118. 4:139, 5:57, 8:73 మరియు 60:7-9.

ప్రేమిస్తాడు[40] మరియు వారు ఆయన (అల్లాహ్) ను ప్రేమిస్తారు. వారు విశ్వాసుల పట్ల మృదువుగా, సత్యతిరస్కారుల పట్ల కఠినంగా ప్రవర్తించే వారునూ, అల్లాహ్ మార్గంలో ధర్మపోరాటం చేసే వారూను మరియు నిందించే వారి నిందలకు భయపడని వారూనూ, అయి ఉంటారు. ఇది అల్లాహ్ అనుగ్రహం, ఆయన దానిని తాను కోరిన వారికి ప్రసాదిస్తాడు. మరియు అల్లాహ్ సర్వోపగతుడు (సర్వవ్యాప్తి), సర్వజ్ఞుడు.

**55.** నిశ్చయంగా, మీ స్నేహితులు, అల్లాహ్! ఆయన ప్రవక్త మరియు విశ్వసించిన వారు: ఎవరైతే నమాజ్ స్థాపిస్తారో, విధిదానం (జకాత్) ఇస్తూ ఉంటారో మరియు వారు (అల్లాహ్ ముందు) వంగుతూ (రుకూఉ చేస్తూ) ఉంటారో;

**56.** మరియు ఎవరు అల్లాహ్, ఆయన ప్రవక్త మరియు విశ్వసించిన వారి వైపునకు మరలుతారో! నిశ్చయంగా, వారే అల్లాహ్ పక్షానికి చెందినవారు, వారే విజయం సాధించేవారు[41].

---

[40] అల్లాహ్ (సు.తా.) కు ప్రియులైన వారి నాలుగు లక్షణాలు ఇక్కడ పేర్కొనబడ్డాయి. 1)వారు అల్లాహ్ కు ప్రియులై, అల్లాహ్ (సు.తా.)నుప్రేమించేవారూ, 2)విశ్వాసులపట్లమృదువుగానూ మరియు అవిశ్వాసుల పట్ల కఠినంగానూ ఉండేవారూ, 3) అల్లాహ్ (సు.తా.) మార్గంలో ధర్మపోరాటం (జిహాద్) చేసేవారూ మరియు 4) నిందించేవారి నిందలకు భయపడని వారునూ, అయి ఉంటారు.

[41] చూడండి, 58:22, 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 1, 'హదీస్' నం. 15, 25.

57. ఓ విశ్వాసులారా! మీ ధర్మాన్ని ఎగతాళిగా నవ్వులాటగా పరిగణించేవారు పూర్వగ్రంథ ప్రజలైనా, లేదా సత్యతిరస్కారులైనా, వారిని మీ స్నేహితులుగా చేసుకోకండి. మరియు మీరు విశ్వాసులే అయితే అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి.

58. మరియు మీరు నమాజ్ కొరకు పిలుపు (అజాన్) ఇస్తే, వారు దానిని ఎగతాళిగా, నవ్వులాటగా తీసుకుంటారు. అది ఎందుకంటే వాస్తవానికి వారు బుద్ధిహీనులైన జనులు![42]

59. వారితో ఇలా అను: "ఓ గ్రంథ ప్రజలారా! ఏమీ? మేము అల్లాహ్ ను మరియు ఆయన మా పై అవతరింపజేసిన మరియు మాకు పూర్వం అవతరింపజేసిన (గ్రంథాలను) విశ్వసించామనే, మీరు మమ్మల్ని పీడిస్తున్నారా? మరియు నిశ్చయంగా, మీలో చాలా మంది అవిధేయులు (దుష్టులు) ఉన్నారు!"

60. ఇలా అను: "ఏమీ? అల్లాహ్ తరఫు నుండి ఎవరికి, దీని కంటే హీనకరమైన ప్రతిఫలం దొరుకుతుందో మీకు తెలుపనా? వారే, ఎవరినైతే అల్లాహ్ శపించాడో (బహిష్కరించాడో) మరియు ఎవరిపైతే ఆయన ఆగ్రహానికి గురి అయ్యారో! మరియు వారిలో కొందరు, ఎవరినైతే ఆయన

---

[42] చూడండి, 62:9, 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 1, 'హదీస్' నం. 577.

కోతులుగా మరియు పందులుగా మార్చాడో![43] మరియు వారు ఎవరైతే కల్పితదైవాల (తాగూత్ ల)దాస్యంచేస్తారో[44]. అలాంటివారు(పునరుత్థాన దినమున) ఎంతో హీనస్థితిలో ఉంటారు మరియు వారు ఋజుమార్గం నుండి చాలా దూరం వెళ్ళిపోయిన వారే!"

**61.** మరియు వారు (కపట విశ్వాసులు) నీ వద్దకు వచ్చినప్పుడు: "మేము విశ్వసించాము." అని అంటారు. కాని వాస్తవానికి వారు సత్యతిరస్కారంతోనే వస్తారు మరియు దాని (సత్యతిరస్కారం) తోనే తిరిగి పోతారు కూడాను. మరియు వారు ఏమి దాస్తున్నారో అల్లాహ్ కు బాగా తెలుసు.

**62.** మరియు వారిలో అనేకులను పాపం మరియు దౌర్జన్యం చేయటానికి మరియు నిషిద్ధమైనవి తినటానికి చురుకుగా పాల్గొనటాన్ని నీవు చూస్తావు. వారు చేస్తున్న పనులు ఎంత నీచమైనవి!

**63.** వారి ధర్మవేత్తలు (రబ్బానియ్యూన్) మరియు మతాచారులు (అహ్ బార్) వారిని, పాపపు మాటలు పలకటం నుండి మరియు నిషిద్ధమైన వాటిని తినటం నుండి ఎందుకు వారించరు? వారు చేసే కార్యాలు ఎంత నీచమైనవి!

**64.** మరియు యూదులు: "అల్లాహ్ చేతులకు

---

[43] చూడండి, 2:65, 7:166.
[44] చూడండి, 2:256.

సంకెళ్ళు పడి ఉన్నాయి." అని అంటారు[45]. వారి చేతులకే సంకెళ్ళు వేయబడుగాక! మరియు వారు పలికిన దానికి వారు శపించ బడుగాక! వాస్తవానికి ఆయన (అల్లాహ్) రెండు చేతులు విస్తరింపబడి ఉన్నాయి; ఆయన (తన అనుగ్రహాలను) తాను కోరినట్లు ఖర్చు చేస్తాడు. మరియు (ఓ ప్రవక్తా!) నీ ప్రభువు తరపు నుండి నీపై అవతరింపజేయబడినది (ఈ గ్రంథం) నిశ్చయంగా, వారిలో చాలా మందికి తలబిరుసుతనం మరియు సత్య తిరస్కారాన్ని మాత్రమే పెంచుతున్నది. మరియు మేము వారి మధ్య విరోధాన్ని మరియు ద్వేషాన్ని, తీర్పుదినం వరకుఉండేటట్లుచేశాము.వారుయుద్ధజ్వాలలను ప్రజ్వలింపజేసినపుడల్లా, అల్లాహ్ దానిని చల్లార్చాడు. మరియు వారు భూమిలో కల్లోలం రేకెత్తించటానికి పాటు పడుతున్నారు. మరియు అల్లాహ్ కల్లోలం రేకెత్తించే వారిని ప్రేమించడు.

65. మరియు వాస్తవానికి గ్రంథప్రజలు విశ్వసించి దైవభీతి కలిగి వుంటే! నిశ్చయంగా, మేము వారి పాపాలను తొలగించి, వారిని శ్రేష్ఠమైన స్వర్గవనాలలో ప్రవేశింపజేసి ఉండేవారము.

66. మరియు వాస్తవానికి వారు తౌరాత్ ను, ఇంజీల్ ను మరియు వారి ప్రభువు తరఫు నుండి వారిపై (ఇప్పుడు) అవతరింప జేయబడిన దానిని (ఈ ఖుర్ఆన్ ను) ఆచరించి ఉండినట్లయితే, వారి

---

[45] చూడండి, 3:181 మరియు 14:34.

కొరకు వారిపై (ఆకాశం) నుండి మరియు కాళ్ళ
క్రింది నుండి (భూమి నుండి) జీవనోపాధి
పొందేవారు[46]. వారిలో కొందరు సరైన మార్గాన్ని
అవలంబించే వారున్నారు[47]. కాని వారిలో
అనేకులు చేసేవి చెడు (పాప) కార్యాలే!

**67.** ఓ ప్రవక్తా! నీవు నీ ప్రభువు తరఫు నుండి నీపై
అవతరింపజేయబడిన దానిని తెలియజేయి[48].
మరియు నీవట్టు చేయకపోతే, ఆయన సందేశాన్ని
పూర్తిగా తెలియజేయని వాడవవుతావు. మరియు
అల్లాహ్ మానవుల నుండి నిన్ను కాపాడతాడు.
నిశ్చయంగా, అల్లాహ్ సత్యతిరస్కారులైన ప్రజలకు
మార్గదర్శకత్వం చేయడు.

**68.** ఇలా అను: "ఓ గ్రంథ ప్రజలారా! మీరు తౌరాత్
ను, ఇంజీల్ ను మరియు మీ ప్రభువు
తరఫు నుండి మీపై అవతరింపజేయబడిన దానిని
(ఈ ఖుర్ఆన్ ను) ఆచరించనంత వరకు, మీరు
అసలు దేని (ఏ సత్యమార్గం) మీద కూడా
ఉండనట్లే!" మరియు నీ ప్రభువు తరఫు నుండి
నీపై అవతరింపజేయబడిన (ఈ గ్రంథం)
వాస్తవానికి వారిలోని అనేకుల తలబిరుసు

---

[46] చూడండి, 7:96.

[47] 'అబ్దుల్లాహ్ బిన్ సల్లాం మరికొందరు 8-9 మంది మదీనాలోని యూదులు మాత్రమే విశ్వసించారు.

[48] 'ఆయి'షహ్(ర.'అన్హా)కథనం: "ఏ వ్యక్తి అయినా ము'హమ్మద్('స'అస) వ'హీ నుండి ఏమైనా దాచారు." అని సందేహపడితే ఆ వ్యక్తి నిశ్చయంగా, అసత్యం పలికాడు. ('స'హీ'హ్ బు'ఖారీ, 'హ. 4855)

తనాన్ని మరియు సత్యతిరస్కారాన్ని మాత్రమే పెంచుతుంది[49]. కావున నీవు సత్యతిరస్కార ప్రజలను గురించి విచారించకు.

**69.** నిశ్చయంగా, ఈ (గ్రంథాన్ని) విశ్వసించిన వారు (ముస్లింలు) మరియు యూదులు మరియు సాబీయూలు మరియు క్రైస్తవులు, ఎవరైనా సరే అల్లాహ్ ను మరియు అంతిమ దినాన్ని విశ్వసిస్తే, సత్కార్యాలు చేస్తే వారికి ఎలాంటి భయమూ ఉండదు మరియు వారు దుఃఖపడరు కూడా[50].

**70.** వాస్తవానికి మేము ఇస్రాయీల్ సంతతి వారి నుండి ఒక గట్టి ప్రమాణాన్ని తీసుకున్నాము మరియు వారి వద్దకు ప్రవక్తలను పంపాము. కాని ఏ ప్రవక్త అయినా వారి మనోవాంఛలకు వ్యతిరేకమైన దానిని తెచ్చినపుడల్లా, వారు కొందరిని అసత్యవాదులని తిరస్కరించారు, మరి కొందరిని హత్య చేశారు.

**71.** మరియు తమకెలాంటి శిక్ష (ఫిత్నా) పడదని తలచి, వారు గ్రుడ్డి వారుగా, చెవిటి వారుగా అయిపోయారు. ఆ పిదప అల్లాహ్ వారి పశ్చాత్తాపాన్ని అంగీకరించాడు. ఆ తరువాత కూడ వారిలో అనేకులు తిరిగి గ్రుడ్డివారుగా, చెవిటివారుగా అయిపోయారు. మరియు వారు చేసేదంతా అల్లాహ్ చూస్తున్నాడు.

**72.** "నిశ్చయంగా, మర్యమ్ కుమారుడు మసీహ్

---

[49] చూడండి, 41:44 మరియు 17:82.
[50] చూడండి, 2:62 మరియు 3:85.

(క్రీస్తు) యే అల్లాహ్!" అని పలికే వారు వాస్తవంగా సత్యతిరస్కారులు! మరియు మసీహ్ (క్రీస్తు) ఇలా అన్నాడు: "ఓ ఇస్రాయీల్ సంతతి వారలారా! నా ప్రభువు మరియు మీ ప్రభువైన అల్లాహ్ నే ఆరాధించండి[51]. వాస్తవానికి, ఇతరులను అల్లాహ్ కు భాగస్వాములుగా చేసే వారికి, నిశ్చయంగా, అల్లాహ్ స్వర్గాన్ని నిషేధించాడు. మరియు వారి ఆశ్రయం నరకాగ్నియే! మరియు దుర్మార్గులకు సహాయం చేసే వారు ఎవ్వరూ ఉండరు.

73. "నిశ్చయంగా, అల్లాహ్ ముగ్గురిలో మూడవవాడు!" అని అనేవారు వాస్తవానికి సత్య తిరస్కారులే[52]. మరియు ఒకే ఒక్క ఆరాధ్యదేవుడు (అల్లాహ్) తప్ప మరొక ఆరాధ్యదేవుడు లేడు మరియు వారు తమ ఈ మాటలను మానుకోకపోతే, వారిలో సత్యతిరస్కారులైన వారికి బాధాకరమైన శిక్ష పడుతుంది.

74. వారెందుకు అల్లాహ్ వైపునకు పశ్చాత్తాపంతో మరలి ఆయనను క్షమాభిక్ష కొరకు వేడుకోరు? మరియు అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

---

[51] ఇట్టి ఆజ్ఞలకు చూడండి, మత్తయి - (Mathew), 4:10; లూకా - (Luke) 4:8. ఇంకా ఖుర్ఆన్ లో చూడండి, 19:30, 36 మరియు 3:51.

[52] ఇది క్రైస్తవులలో ఒక తెగ వారి ప్రస్తావన. వారు అల్లాహ్ (సు.తా.), జిబ్రీల్ మరియు 'ఈసా ('అలైహిమ్ స.) ముగ్గురు, దైవాలున్నారు అంటారు. చూడండి, 5:116 మరియు 5:75.

**75.** మర్యమ్ కుమారుడు మసీహ్ (క్రీస్తు) కేవలం ఒక ప్రవక్త మాత్రమే. అతనికి పూర్వం కూడా అనేక ప్రవక్తలు గతించారు మరియు అతని తల్లి సత్యవతి (సిద్దీఖహ్). వారిద్దరూ ఆహారం తినే వారు[53]. చూడండి! మేము వారికి ఈ సూచనలను ఏవిధంగా స్పష్టపరిచామో! అయినా చూడండి![54] ఏవిధంగా వారు మోసగింపబడుతున్నారో (సత్యం నుండి మరలింపబడు తున్నారో)!

**76.** ఇలా అను: "ఏమీ? మీరు అల్లాహ్ ను వదిలి, మీకు నష్టం గానీ, లాభం గానీ చేసే అధికారం లేని దానిని ఆరాధిస్తారా? మరియు కేవలం అల్లాహ్ మాత్రమే సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు."

**77.** (ఇంకా) ఇలా అను: "ఓ గ్రంథప్రజలారా! మీ ధర్మం విషయంలో మీరు అధర్మంగా హద్దులు మీరి ప్రవర్తించకండి[55]. మరియు ఇంతకు పూర్వం మార్గభ్రష్టులైన వారి కోరికలను అనుసరించకండి. వారు అనేక ఇతరులను కూడా మార్గభ్రష్టులుగా చేశారు మరియు వారు కూడా ఋజుమార్గం నుండి తప్పిపోయారు."

**78.** ఇస్రాయీల్ సంతతి వారిలో అవిశ్వాస మార్గం అవలంబించిన వారు, దావూద్ మరియు మర్యమ్ కుమారుడైన ఈసా (ఏసు) నాలుకతో (నోటితో)

---

[53] మర్యమ్ తాను అల్లాహ్ తల్లినని ఎన్నడూ అనలేదు. 'ఈసా ('అ.స.) కేవలం ఒక ప్రవక్త మాత్రమే. అల్లాహుతా'ఆలా కుమారుడు గానీ, అల్లాహ్ గానీ కారు. చూడండి, 5:73.

[54] మేము పంపిన ప్రవక్తలందరూ పురుషులే 12:109.

[55] చూడండి, 4:171 ఈ ఆయత్ క్రైస్తవులను సంబోధిస్తున్నది.

శపించబడ్డారు[56]. ఇది వారు అవిధేయులై హద్దులు మీరి ప్రవర్తించిన దాని ఫలితం.

**79.** వారు, తాము చేసే, అసభ్యకరమైన కార్యాల నుండి ఒకరినొకరు నిరోధించు కోలేదు. వారు చేసే పనులన్నీ ఎంతో నీచమైనవి.

**80.** వారిలో అనేకులు సత్యతిరస్కారులతో మైత్రి చేసుకోవటాన్ని, నీవు చూస్తున్నావు. వారు తమ కొరకు ముందుగా చేసి పంపుకున్న నీచ కర్మల వలన అల్లాహ్ కు వారిపై కోపం కలిగింది మరియు వారు నరకబాధలో శాశ్వతంగా ఉంటారు.

**81.** ఒకవేళ వారు అల్లాహ్ నూ, ప్రవక్తనూ మరియు అతనిపై అవతరింపజేయబడిన దానిని (నిజంగానే) విశ్వసించి ఉంటే! వారిని (సత్యతిరస్కారులను తమ మిత్రులుగా చేసుకొని ఉండేవారు కాదు, కాని వారిలో అనేకులు అవిధేయులున్నారు.

**82.** నిశ్చయంగా, విశ్వాసుల పట్ల (ముస్లింల పట్ల) విరోధ విషయంలో నీవు యూదులను మరియు బహుదైవారాధకును (ముష్రికీన్ లను), అందరి కంటే కఠినులుగా కనుగొంటావు. మరియు విశ్వాసుల పట్ల మైత్రి విషయంలో: "నిశ్చయంగా, మేము క్రైస్తవులము." అని, అన్న వారిని అత్యంత సన్నిహితులుగా పొందుతావు. ఇది ఎందుకంటే

---

[56] వారు శపించబడిన వాక్యాలకు చూడండి, కీర్తనలు - (Pslams), 78:21-22, 31-33. మత్తయి - (Mathew), 12:34, 23:33-35.

వారిలో మతగురువులు / విద్వాంసులు (ఖిస్సీసీన్) మరియు మునులు (రుహ్ బాన్) ఉన్నారు మరియు నిశ్చయంగా, వారు గర్వించరు.

**83.** మరియు వారు (కొందరు క్రైస్తవులు) ప్రవక్తపై అవతరింపజేయబడిన దానిని (ఈ గ్రంథాన్ని) విన్నప్పుడు, సత్యాన్ని తెలుసు కున్నందుకు, వారి కళ్ళ నుండి కన్నీళ్ళు కారటం నీవు చూస్తావు[57]. వారు ఇలా అంటారు: "ఓ మా ప్రభూ! మేము విశ్వసించాము. కావున మమ్మల్ని సాక్ష్యం ఇచ్చే వారిలో వ్రాసుకో!

**84.** "మరియు మేము అల్లాహ్ మరియు మా వద్దకు వచ్చిన సత్యాన్ని విశ్వసించకుండా ఉండటానికి మాకేమైంది? మాప్రభువు మమ్మల్ని సద్వర్తనులతో చేర్చాలని మేము కోరు కుంటున్నాము."

**85.** కావున వారు పలికిన దానికి ఫలితంగా, అల్లాహ్ వారికి క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలను ప్రసాదించాడు. వారందులో శాశ్వతంగా ఉంటారు. మరియు సజ్జనులకు లభించే ప్రతిఫలం ఇదే!

---

[57] చూడండి, 3:199. ఇథియోపియా('హబష) రాజు - జాఫర్('రది.'అ.) నుండి - సూరహ్ మర్యమ్ (19), విని కన్నీళ్ళు కార్చాడు. అతడు (ర'ది.'అ) ఇస్లాం స్వీకరించాడు. దానికి ఈ 'హదీస్' సాక్ష్యం: 'హబష రాజు మరణించినపుడు దైవప్రవక్త ('స'అస) సహా'రాలో తమ అనుచరులతో సహా గాయబానా నమా'జే జనా'జా చేశారు. ('స. బు'ఖారీ, 'స. ముస్లిం).

86. మరియు ఎవరైతే సత్యతిరస్కారులై మా సూచనలను (ఆయాత్ లను) అబద్ధాలన్నారో, అలాంటి వారు భగభగమండే నరకాగ్ని వాసులవుతారు.

87. ఓ విశ్వాసులారా! అల్లాహ్ మీకు ధర్మసమ్మతం చేసిన పరిశుద్ధ వస్తువులను నిషిద్ధం చేసుకో కండి మరియు హద్దులుమీరకండి. నిశ్చయంగా అల్లాహ్ హద్దులుమీరిపోయేవారినిప్రేమించడు[58]

88. మరియు అల్లాహ్ మీకు జీవనోపాధిగా ప్రసాదించినవాటిలో ధర్మసమ్మతమైన, పరిశుద్ధ మైన పదార్థాలను తినండి. మీరు విశ్వసించిన అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి.

89. మీరు ఉద్దేశం లేకుండానే చేసిన ప్రమాణాలను గురించి అల్లాహ్ మిమ్మల్ని పట్టుకోడు. కాని మీరు బుద్ధిపూర్వకంగా చేసే ప్రమాణాలను గురించి ఆయన మిమ్మల్ని (తప్పకుండా) పట్టు కుంటాడు. కావున దానికి (ఇలాంటి ప్రమాణ భంగానికి) పరిహారంగా మీరు మీ ఇంటి వారికి పెట్టే, మధ్యరకమైన ఆహారం పది మంది పేదలకు పెట్టాలి. లేదా వారికి వస్త్రాలు ఇవ్వాలి. లేదా ఒక బానిసకు స్వాతంత్ర్యం ఇప్పించాలి. ఎవడికి ఈ శక్తి లేదో! అతడు మూడు దినాలు ఉపవాసం

[58] ఒక 'స'హాబీ దైవప్రవక్త ('స'అస) దగ్గరికి హాజరై అన్నాడు: "ఓ దైవప్రవక్తా! నేను మాంసం తినటం వలన నా కామవాంఛలు పెరుగుతున్నాయి. కావున నేను మాంసాహారాన్ని నాపై నిషేధించుకున్నాను." అట్టి సందర్భంలో ఈ ఆయత్ అవతరింపజేయబడింది. (తిర్మిజీ').

ఉండాలి. మీరు ప్రమాణం చేసి భంగపరిస్తే, ఇది దానికి పరిహారం (కఫ్ఫారా)[59]. మీ ప్రమాణాలను కాపాడుకోండి. మీరు కృతజ్ఞులై ఉండటానికి అల్లాహ్ తన ఆజ్ఞలను ఈవిధంగా మీకు విశదపరుస్తున్నాడు[60].

**90.** ఓ విశ్వాసులారా! నిశ్చయంగా మద్యపానం[61], జూదం, బలిపీఠం మీద బలి ఇవ్వటం (అన్సాబ్)[62] మరియు శకునానికై బాణాల ప్రయోగం (అజ్లామ్) ఇవన్నీ కేవలం అసహ్యాకరమైన షైతాన్ చేష్టలు, కావున మీరు సాఫల్యం పొందాలంటే వీటిని త్యజించండి.

**91.** నిశ్చయంగా, షైతాన్ మద్యపానం మరియు జూదం ద్వారా మీ మధ్య విరోధాలు మరియు విద్వేషాలు రేకెత్తించాలని మరియు మిమ్మల్ని అల్లాహ్ ధ్యానం నుండి మరియు నమాజ్ నుండి

---

[59] ప్రమాణం: ఇది 'అరబ్బీలో 'హలఫ్ లేక అయ్'మాన్ అనబడుతుంది. ఇవి మూడు రకాలు: 1) ల'గ్వున్: ఇది మానవుడు మాటి మాటికి ఆలోచించకుండా చేసే ప్రమాణం. దీనికెట్టి పరిహారం (కఫ్ఫారా) లేదు. 2) 'గమూసున్: మానవుడు ఇతరులను మోసపుచ్చటానికి చేసే బూటక ప్రమాణం. ఇది మహాపాపం. దీనికెట్టి పరిహారం (కఫ్ఫారా) ఉపయోగకరం కాదు. 3) ము'అఖ్ఖదతున్: మానవుడు సహృదయంతో పూర్తి విశ్వాసంతో చేసే ప్రమాణం. దీనిని భంగపరిస్తే పరిహారం (కఫ్ఫారా) ఇవ్వాలి. అది ఈ ఆయత్ లో పేర్కొనబడింది.

[60] చూడండి, 2:224-225; 38:44.

[61] మద్యపానం (సారాయి మొదలైన మత్తు పదార్థాలను తినటం, త్రాగటం, పీల్చుకోవటం) గురించి ఇది మూడవ ఆజ్ఞ. ఇక్కడ వీటిని గురించి నిషేధం వచ్చింది. ఇంతకు ముందు 2:219, 4:43లలో వీటిని గురించి ఆజ్ఞలు వచ్చాయి.

[62] చూడండి, 5:3 వ్యాఖ్యానం 1.

తొలగించాలని కోరుతున్నాడు. అయితే మీరిప్పుడైనా మానుకోరా?

92. మరియు మీరు అల్లాహ్ కు విధేయులై ఉండండి మరియు ప్రవక్తను అనుసరించండి. జాగ్రత్త! మీరు ఒకవేళ తిరిగిపోతే! నిశ్చయంగా, మా ప్రవక్త బాధ్యత కేవలం (మా ఆజ్ఞను) మీకు స్పష్టంగా అందజేయటం మాత్రమే అని తెలుసుకోండి.

93. విశ్వసించి సత్కార్యాలు చేసే వారిపై, (ఇంతకు ముందు) వారు తిన్న (త్రాగిన) దాన్ని గురించి దోషం లేదు; ఒకవేళ వారు దైవభీతి కలిగి ఉండి, విశ్వసించి, సత్కార్యాలు చేస్తూ ఉంటే, ఇంకా దైవభీతి కలిగి ఉండి విశ్వాసులైతే, ఇంకా దైవభీతి కలిగి ఉండి సజ్జనులైతే! మరియు అల్లాహ్ సజ్జనులను ప్రేమిస్తాడు.

94. ఓ విశ్వాసులారా! (మీరు ఇహ్రామ్ స్థితిలో ఉన్నప్పుడు) - మీ ఇంద్రియాలకు అగోచరమైన అల్లాహ్ కు ఎవరు భయపడాతో చూడటానికి - అల్లాహ్ మీ చేతులకు మరియు మీ బల్లెములకు అందుబాటులో ఉన్న కొన్ని వేట (జంతువుల) ద్వారా మిమ్మల్ని పరీక్షకు గురి చేస్తాడు. కావున ఈ (హెచ్చరిక) తరువాత కూడా ఎవడు హద్దును అతిక్రమిస్తాడో, వాడికి బాధాకరమైన శిక్ష ఉంటుంది.

95. ఓ విశ్వాసులారా! మీరు ఇహ్రామ్ స్థితిలో ఉన్నప్పుడు

వేటాడకండి[63]. మీలో ఎవరైనా బుద్ధిపూర్వకంగా వేట చేస్తే, అతడు చంపిన జంతువుతో సరితూగే ఒక పశువును పరిహారంగా సమర్పించుకోవాలి. దానిని (ఆ పశువును) మీలో న్యాయవర్తులైన ఇద్దరు వ్యక్తులు నిర్ణయించాలి. పశువును ఖుర్బానీ కొరకు కఅబహ్ వద్దకు చేర్చాలి. లేదా దానికి పరిహారంగా కొందరు పేదలకు భోజనం పెట్టాలి, లేదా దానికి పరిహారంగా - తాను చేసిన దాని ప్రతిఫలాన్ని చవిచూడటానికి - ఉపవాసముండాలి. గడిచిపోయిన దానిని అల్లాహ్ మన్నించాడు. కాని ఇక ముందు ఎవరైనా మళ్ళీ అలా చేస్తే అల్లాహ్ అతనికి ప్రతీకారం చేస్తాడు. మరియు అల్లాహ్ సర్వ శక్తి సంపన్నుడు, ప్రతీకారం చేయగలవాడు.

**96.** సముద్ర జంతువులను వేటాడటం మరియు వాటిని తినటం[64], జీవనోపాధిగా మీకూ (స్థిరనివాసులకూ) మరియు ప్రయాణీకులకూ ధర్మసమ్మతం చేయబడింది. కానీ, మీరు ఇహ్రామ్ స్థితిలో ఉన్నంత వరకూ భూమిపై వేటాడటం మీకు నిషేధింపబడింది. కావున

---

[63] మీకు హానికలిగించ గల జంతువులను, ఇ'హ్రామ్ స్థితిలో చంపవచ్చు. ఉదా: పాము, తేలు, పిచ్చికుక్క మొదలైనవి. పేదలకు భోజనం పెట్టడం మరియు ఉపవాస విషయాలలో ధర్మవేత్తలను సంప్రదించండి. ఇవి చంపబడిన జంతువును బట్టి వివిధ రకాలు ఉంటాయి.

[64] నీటి జంతువు మరణించినది కూడా 'హలాలే. చూడండి, ఇబ్నె-కసీ'ర్.

మీరు (పునరుత్థాన దినమున) ఎవరి ముందు అయితే సమావేశ పరచ బడతారో ఆ అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి.

**97.** అల్లాహ్ పవిత్ర గృహం అయిన కఅబహ్ ను మానవజాతి కొరకు, సురక్షితమైన శాంతి నిలయంగా (బైతుల్ హరామ్ గా) చేశాడు[65]. మరియు పవిత్రమాసాన్ని మరియు బలి (హద్య) పశువులను మరియు మెడలలో పట్టాలు వేసి కఅబహ్ కు ఖుర్బానీ కొరకు తేబడే పశువులను (ఖలా ఇదలను) కూడా నియమించాడు. ఇది ఆకాశాలలోను మరియు భూమి లోను ఉన్నదంతా నిశ్చయంగా, అల్లాహ్ ఎరుగునని, మీరు తెలుసు కోవాలని! మరియు నిశ్చయంగా అల్లాహ్ కు ప్రతి ఒక్క విషయం గురించి బాగా తెలుసు.

**98.** నిశ్చయంగా, అల్లాహ్ శిక్ష విధించటంలో కఠినుడని తెలుసుకోండి మరియు నిశ్చయంగా అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

**99.** సందేశహరుని బాధ్యత కేవలం (అల్లాహ్ సందేశాలను) మీకు అందజేయటమే! మరియు మీరు వెలి బుచ్చేది మరియు దాచేది అంతా అల్లాహ్ కు బాగా తెలుసు.

---

[65] క'అబహ్ ('హరమ్) సరిహద్దులలో - ఇ'హ్రాంలో ఉన్నా, లేకున్నా - వేటాడటం, జంతువులను చంపటం, చెట్లను నరుకటం నిషేధింపబడ్డాయి. చూడండి, 2:125.

**100.** (ఓ ప్రవక్తా!) ఇలా అను: "చెడు వస్తువుల ఆధిక్యత నీకు ఎంత నచ్చినా! చెడు మరియు మంచి వస్తువులు సరిసమానం కాజాలవు[66]. కావున ఓ బుద్ధిమంతులారా! మీరు సాఫల్యం పొందాలంటే అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి."

**101.** ఓ విశ్వాసులారా! వ్యక్త పరిస్తే మీకు బాధ కలిగించెడు విషయాలను గురించి, మీరు ప్రశ్నించకండి. ఖుర్ఆన్ అవతరింప జేయబడే టప్పుడు, మీరు వాటిని గురించి ప్రశ్నిస్తే! అవి మీకు విశదపరచ బడవచ్చు! వాటి కొరకు (ఇంత వరకు మీరు చేసిన ప్రశ్నల కొరకు) అల్లాహ్ మిమ్మల్ని మన్నించాడు మరియు అల్లాహ్ క్షమాశీలుడు, సహనశీలుడు.

**102.** వాస్తవానికి మీకు పూర్వం ఒక జాతి వారు ఇటువంటి ప్రశ్నలనే అడిగారు. తరువాత వాటి (ఆ ప్రశ్నల) కారణంగానే వారు సత్యతిరస్కారానికి

---

[66] 'ఖబీస్': అంటే, అధర్మ, అపవిత్ర, చెడ్డ, నికృష్ట, అపరిశుద్ధ వస్తువులు, చేష్టలు, మాటలు, విషయాలు మొదలైనవి. 'తయ్యిబ్: అంటే ధర్మ, మంచి, పవిత్ర, ఉత్కృష్ట, శ్రేష్ఠ, పరిశుద్ధ వస్తువులు, చేష్టలు, మాటలు విషయాలు మొదలైనవి.

గురి అయ్యారు[67].

**103.** అల్లాహ్ బహీరహ్ ను గానీ, సాయిబహ్ ను గానీ, వసీలహ్ ను గానీ లేక హామ్ ను గానీ నియమించలేదు[68]. కాని సత్యతిరస్కారులు అల్లాహ్ పై అబద్ధాలు కల్పిస్తున్నారు. మరియు వారిలో చాలా మంది బుద్ధిహీనులే!

**104.** మరియు వారితో: "అల్లాహ్ అవతరింప జేసిన దాని (సందేశం) వైపునకు మరియు ప్రవక్త వైపునకు రండి." అని పిలిచినప్పుడు! వారు: "మా తండ్రితాతలు అవలంబిస్తూ ఉండగా మేము చూసిన (మార్గమే) మాకు చాలు!" అని జవాబిస్తారు. ఏమీ? వారి తండ్రితాతలకు ఏమీ తెలియకున్నా మరియు వారు సన్మార్గం మీద

[67] అబూ హురైరా (ర'ది.'అ.) కథనం: దైవప్రవక్త ('స'అస) తమ ప్రవచనంలో ఇలా అన్నారు:" 'హజ్ మీ కొరకు విధిగా నియమించబడింది." అపుడు ఒకతను (ర'ది.'అ) ప్రశ్నించాడు: "ప్రతి సంవత్సరామా?" దైవప్రవక్త ('స'అస) మౌనం వహించారు. ఆ వ్యక్తి మరీ రెండు సార్లు అదే ప్రశ్న అడిగాడు. దానికతను: "నేను అవును అంటే అది మీకు విధి అయ్యేది మరియు అది మీకు చేతనయ్యేది కాదు." ('స. ముస్లిం కితాబుల్ 'హజ్ 'హదీస్' నం. 412, దీనిసే అ'హ్మద్, అబూ-దావూద్, నసాయీ' మరియు ఇబ్నె మాజా ఉల్లేఖించారు). కావున ఖుర్ఆన్ లో ఉన్న ఆజ్ఞలను, ఉన్నవి ఉన్నట్లే పాటించాలి. ఏ విషయమైతే దానిలో పేర్కొనబడలేదో వాటిని గురించి మౌనం వహించటమే మేలు.

[68] ఇవి ముష్రిక్ ఖురైషులు తమ ఆడ ఒంటెలకు ఇచ్చిన పేర్లు. వాటిని వారు తమ దేవతలకు అర్పితం చేసి, వాటిని పనులకు, సవారీలకు ఉపయోగించకుండా, విచ్చలవిడిగా మేస్తూ తిరుగటానికి వదిలే వారు. ఇంకా చూడండి, 6:138-139, 143-144.

లేకున్నా (వారి మార్గాన్నే వీరు అనుసరిస్తారా)?

**105.** ఓ విశ్వాసులారా! మీ స్వయానికి మీరు బాధ్యత వహించండి. మీరు సన్మార్గంలో ఉంటే, మార్గభ్రష్టులైన వారు మీకు ఎలాంటి హాని చేయలేరు[69]. మీరంతా అల్లాహ్ వైపునకే మరలి పోవలసి వుంది. అప్పుడు ఆయన మీరేమేమి చేస్తూ ఉండే వారో మీకు తెలియజేస్తాడు.

**106.** ఓ విశ్వాసులారా! మీలో ఎవరికైనా మరణ సమయం ఆసన్నమైతే, మీరు వీలునామా వ్రాసే టప్పుడు, మీలో న్యాయవర్తులైన ఇద్దరు వ్యక్తులను సాక్షులుగా తీసుకోండి. ఒకవేళ మీరు ప్రయాణ స్థితిలో ఉండి, అక్కడ మీకు మరణ ఆపద సంభవిస్తే, మీ వారు (ముస్లింలు లేకుంటే) ఇతరులను ఎవరినైనా ఇద్దరిని (సాక్షులుగా) తీసుకోవచ్చు. ఆ ఇద్దరినీ నమాజ్ తరువాత ఆపు

---

[69] ప్రజలు ఈ ఆయత్ ను సరిగ్గా అర్థం చేసుకోలేనందువలన అబూ బక్ర్ సిద్దీఖ్ (ర'ది.'అ) వారితో ఇలా అన్నారు: "ప్రజలారా! నేను దైవప్రవక్త ('స'అస) ను ఇలా అంటుండగా విన్నాను: 'ప్రజలు చెడు జరుగు తుండగా చూసి, దానిని మార్చటానికి ప్రయత్నం చేయకుంటే త్వరలోనే అల్లాహ్ (సు.తా.) వారిని తన శిక్షకు గురి చేయవచ్చు!' " (ముస్నద్ అ'హ్మద్ పుస్తకము - 1, పేజీ - 5. తిర్మిజీ', 'హదీస్' నం. 2178; అబూ దావూద్, 'హదీస్' నం. 4338). ఈ ఆయత్ అర్థం ఏమిటంటే : మీరు సన్మార్గం మీద ఉండి, చెడు నుండి దూరంగా ఉంటూ, ప్రజలకు సన్మార్గం చూపుతూ దుర్మార్గం నుండి ఆపుతూ ఉంటే, వారు మీ మాటను లక్ష్యపెట్టనిచో మీ పని మీరు చేశారు. దానికి ప్రతిఫలం పొందుతారు. కాని మీ ప్రాణానికి హాని కలిగే భయం ఉంటే! మీరు: 'అమ్ర్ బిల్ మ'అరూఫ్ వ నహా 'అనిల్ మున్కర్.' ను ఉపేక్షించవచ్చు!

కోండి. మీకు సందేహముంటే, వారిద్దరూ అల్లాహ్ పై ప్రమాణం చేసి ఇలా అనాలి: "మా దగ్గరి బంధువు కొరకైనా సరే మేము స్వార్థం కొరకు మా సాక్ష్యాన్ని అమ్మము. మేము అల్లాహ్ కొరకు ఇచ్చే సాక్ష్యాన్ని దాచము. మేము ఆవిధంగా చేస్తే నిశ్చయంగా, పాపాత్ములలో లెక్కింపబడుదుము గాక!"

**107.** కాని, ఆ తరువాత ఆ ఇద్దరు (సాక్షులు) పాపం చేశారని తెలిస్తే! అప్పుడు మొదటి ఇద్దరి (సాక్ష్యం) వలన హక్కును కోల్పోయిన వారి (బంధువుల) లో నుండి ఇద్దరు, మొదటి వారిద్దరికి బదులుగా నిలబడి అల్లాహ్ పై శపథం చేసి ఇలా అనాలి: "మా సాక్ష్యం వీరువురి సాక్ష్యం కంటే ఎక్కువ హక్కు గలది (సత్యమైనది). మరియు మేము ఏ విధమైన అక్రమానికి పాల్పడలేదు. మేము ఆ విధంగా చేస్తే నిశ్చయంగా, అన్యాయపరులలో చేరి పోదుము గాక!"

**108.** ఇది (ఈ పద్ధతి) ప్రజలు నిజమైన సాక్ష్యం ఇవ్వటానికి లేదా వారి ప్రమాణాలను, తరువాత తీసుకొనబడే ప్రమాణాలు ఖండిస్తాయని వారిని భయపెట్టటానికి ఉత్తమమైనది. అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండి, (ఆయన ఆదేశాలను) వినండి. మరియు అల్లాహ్ అవిధేయులకు సన్మార్గం చూపడు.

**109.** ఆ రోజు అల్లాహ్ ప్రవక్తలందరిని సమావేశపరచి: "మీకేమి జవాబు ఇవ్వబడింది?" అని అడిగితే!

వారు: "మాకు యథార్థ జ్ఞానం లేదు! నిశ్చయంగా, నీవు మాత్రమే సర్వ అగోచర విషయాల జ్ఞానం గలవాడవు." అని పలుకుతారు[70].

**110.** (జ్ఞాపకముంచుకోండి!) అప్పుడు (పునరుత్థాన దినమున), అల్లాహ్: "ఓ మర్యమ్ కుమారుడా! ఈసా (ఏసు) నేను నీకు మరియు నీ తల్లికి ప్రసాదించిన అనుగ్రహాన్ని జ్ఞాపకం చేసుకో! నేను పరిశుద్ధాత్మ (రూహుల్ ఖుదుస్)[71] ద్వారా నిన్ను బలపరిచాను, నీవు ఉయ్యాలలోనూ మరియు యుక్తవయస్సులోనూ ప్రజలతో మాట్లాడేవాడివి. మరియు నేను గ్రంథాన్ని మరియు వివేకాన్ని, తౌరాతును మరియు ఇంజీలును నీకు నేర్పాను[72]. మరియు నీవు నా ఆజ్ఞతో పక్షి ఆకారం గల మట్టి బొమ్మను తయారు చేసి, దానిలో ఊదినపుడు, నా ఆజ్ఞతో అది పక్షిగా మారి పోయేది. మరియు నీవు పుట్టుగ్రుడ్డిని మరియు కుష్ఠరోగిని నా ఆజ్ఞతో బాగు చేసేవాడివి. మరియు నీవు నా ఆజ్ఞతో మృతులను లేపేవాడివి[73]. మరియు నీవు స్పష్టమైన సూచనలతో ఇస్రాయీలు సంతతి వారి వద్దకు వచ్చినపుడు[74], వారిలోని సత్యతిరస్కారులు:

---

[70] ఇక్కడ ప్రవక్త ('అలైహిమ్ స.) లందరూ అంటున్నారు: "మాకు అగోచర జ్ఞానం లేదు. అది కేవలం అల్లాహ్ (సు.తా.) కు మాత్రమే ఉంది!"

[71] చూడండి, 2:87.

[72] చూడండి, 3:48.

[73] చూడండి, 3:49.

[74] చూడండి, 3:54.

"ఇది స్పష్టమైన మాయాజాలం తప్ప మరేమీ కాదు!" అని అన్నారు. అప్పుడు నేను వారి కుట్ర నుండి నిన్ను కాపాడాను!

111. మరియు నేను, (ఈసా) శిష్యుల (హవారియ్యూన్ ల) మనస్సులలో ఇలా మాట వేసినప్పుడు[75]: "నన్ను మరియు నా ప్రవక్తను విశ్వసించండి." వారన్నారు: "మేము విశ్వసించాము మరియు మేము ముస్లింలను అయ్యాము అనే మాటకు సాక్షిగా ఉండు!"

112. (జ్ఞాపకం చేసుకోండి!) ఆ శిష్యులు (హవారియ్యూన్): "ఓ మర్యమ్ కుమారుడవైన ఈసా (ఏసూ) ఏమీ? నీ ప్రభువు మా కొరకు ఆకాశం నుండి ఆహారంతో నిండిన ఒక పళ్ళెం దింపగలడా?" అని అడిగారు![76] దానికి (ఈసా): "మీరు వాస్తవానికి విశ్వాసులే అయితే, అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి!" అని అన్నాడు.

113. వారు: "వాస్తవానికి, మేము దాని నుండి తిని, మా

[75] ఇక్కడ అవ్'హయ్'త అంటే వ'హీ. కాని ఈ పదానికి ఇక్కడ శిష్యుల మనస్సులో ఆలోచన వేయ బడిందని అర్థం. ఇదే విధంగా 'ఈసా('అ.స.) తల్లి మర్యమ్ ('అ.స.) మనస్సులో మరియు మూసా ('అ.స.) తల్లి మనస్సులో మాట వేయబడి వుండెను. వ'హీ కేవలం ప్రవక్తల పైననే అవతరింప జేయబడుతుంది.

[76] మాఇ'దతున్: అంటే ఆహారంతో నిండిన ఒక పళ్ళెం. దీనిని ఉర్దూలో దస్తర్'ఖాన్ అని అంటారు. ఎందుకంటే దస్తర్'ఖాన్ మీద కూడా ఆహారం పెట్టబడుతుంది.

హృదయాలను తృప్తి పరచు కోవటానికి మరియు నీవు మాతో సత్యం పలికావని తెలుసు కోవటానికి మరియు దానిని గురించి మేము సాక్షులుగా ఉండటానికి, మేమిలా కోరుతున్నాము!" అని అన్నారు.

114. దానికి మర్యమ్ కుమారుడు ఈసా (ఏసు): "ఓ అల్లాహ్! మా ప్రభూ! ఆకాశం నుండి ఆహారంతో నిండిన ఒక పళ్ళాన్ని మాకొరకు అవతరింపజేయి(దింపు); అది మాకు మొదటివాని నుండి చివరివాని వరకు పండుగగా ఉండాలి; అది నీ తరపు నుండి ఒక సూచనగా ఉండాలి. మాకు ఆహారాన్ని ప్రసాదించు. నీవే అత్యుత్తమమైన ఉపాధి ప్రదాతవు!" అని ప్రార్థించాడు.

115. (అప్పుడు) అల్లాహ్: "నిశ్చయంగా, నేను దానిని మీపై అవతరింపజేస్తాను (దింపుతాను). కాని, దాని తరువాత కూడా మీలో ఎవడైనా సత్యతిరస్కారానికి పాల్పబడితే! నిశ్చయంగా, వానికి నేను ఇంత వరకు సర్వలోకాలలో ఎవ్వడికీ విధించని శిక్షను విధిస్తాను!" అని అన్నాడు.

116. మరియు (జ్ఞాపకముంచుకోండి!) అప్పుడు (పునరుత్థాన దినమున), అల్లాహ్: "ఓ మర్యమ్ కుమారుడా! ఈసా (ఏసు) ఏమీ? నీవు ప్రజలతో: 'అల్లాహ్ కు బదులుగా నన్నూ మరియు నా తల్లినీ ఆరాధ్యులుగా చేసుకోండి!" అని చెప్పావా?" అని ప్రశ్నించగా! దానికి అతను (ఈసా) అంటాడు:

"నీవు సర్వలోపాలకు అతీతుడవు. నాకు పలకటానికి అర్హతలేని మాటను నేను పలకటం తగినపని కాదు. ఒకవేళ నేను అలా చెప్పి ఉంటే నీకు తప్పక తెలిసి ఉండేది. నా మనస్సులో ఉన్నది నీకు తెలుసు, కాని నీ మనస్సులో ఉన్నది నాకు తెలియదు. నిశ్చయంగా, నీవే సర్వ అగోచర విషయాలు తెలిసినవాడవు!

**117.** "నీవు ఆదేశించింది తప్ప, నేను మరేమీ వారికి చెప్పలేదు, అంటే: 'నా ప్రభువు మరియు మీ ప్రభువు అయిన అల్లాహ్ నే ఆరాధించండి.' అని. నేను వారి మధ్య ఉన్నంత వరకు వారికి సాక్షిగా ఉన్నాను. నీవు నన్ను పైకి లేపుకున్న తరువాత నీవే వారిని కనిపెట్టుకుని ఉన్నావు[77]. మరియు నీవే ప్రతి దానికి సాక్షివి![78]"

**118.** "ఒకవేళ నీవు వారిని శిక్షించదలిస్తే వారు నీ దాసులే! మరియు నీవు వారిని క్షమించదలిస్తే! నీవు సర్వశక్తిమంతుడవు, మహా వివేచనాపరుడవు!"

**119.** అప్పుడు అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "ఈ రోజు సత్యవంతులకు వారి సత్యం లాభదాయక మవుతుంది. వారికి క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలు లభిస్తాయి. అక్కడ వారు

---

[77] చూడండి, 3:55.
[78] షహీదున్ (అష్-షహీదు): All-Witness, The Omniscient. సర్వసాక్షి, తన జ్ఞానంతో ప్రతిచోట ఉండే వాడు. చూడండి, 3:98, 58:6.

శాశ్వతంగా కలకాలముంటారు. అల్లాహ్ వారి పట్ల ప్రసన్నుడవుతాడు మరియు వారు ఆయనతో ప్రసన్నులవుతారు. ఇదే గొప్ప విజయం (సాఫల్యం)!"

**120.** ఆకాశాల పైననూ, భూమి పైననూ మరియు వాటిలో నున్న సమస్తం పైననూ, సామ్రాజ్యాధిపత్యం అల్లాహ్ దే! మరియు ఆయనే ప్రతిదీ చేయగల సమర్థుడు (అన్నింటిపై అధికారం గలవాడు).

# 6. అల్-అన్ఆమ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఆకాశాలను మరియు భూమిని సృష్టించి; చీకట్లను మరియు వెలుగును నెలకొలిపిన అల్లాహ్ మాత్రమే సర్వస్తోత్రాలకు అర్హుడు. అయినా సత్యతిరస్కారులు (ఇతరులను) తమ ప్రభువుకు సమానులుగా పరిగణిస్తున్నారు.
2. ఆయనే మిమ్మల్ని మట్టితో సృష్టించి, ఆ తరువాత మీకు ఒక గడువు నియమించాడు[1]. ఆయన దగ్గర మరొక నిర్ణీత గడువు కూడా ఉంది[2]. అయినా మీరు సంశయంలో పడి ఉన్నారు.
3. మరియు ఆయన! అల్లాహ్ యే, ఆకాశాలలోనూ మరియు భూమిలోనూ (ఆరాధ్యుడు). మీరు దాచేది మరియు వెలిబుచ్చేది, అంతా ఆయనకు తెలుసు మరియు మీరు అర్జించేది (మంచి చెడు) అంతా ఆయనకు బాగా తెలుసు[3].
4. అయినా వారి ప్రభువు సూచనల నుండి వారి

---

[*] [అల్ అన్ఆమ్ - పశువులు]

[1] అంటే మరణసమయం

[2] అంటే పునరుత్థానదినం.

[3] అల్లాహ్ (సు.తా.) 'అర్ష్ పై ఉంటాడు. ఆయన ఔన్నత్యానికి తగినట్లుగా. కానీ అల్లాహుతా'ఆలా తన జ్ఞానంతో ప్రతిచోట ఉంటాడు. అంటే ఏ విషయం కూడా అల్లాహ్ (సు.తా.) జ్ఞానపరిధి నుండి అగోచరంగా లేదు. ఇది అహ్లెసున్నత్, సలఫుల విశ్వాసం (అఖీదహ్). వివరాలకు చూడండి, 'తబరీ, ఇబ్నె-కసీ'ర్.

వద్దకు ఏ సూచన వచ్చినా దానికి వారు విముఖతే చూపేవారు!

5. వాస్తవానికి, ఇప్పుడు వారు తమ వద్దకు వచ్చిన సత్యాన్ని (ఈ దివ్య గ్రంథాన్ని) కూడా అసత్యమని తిరస్కరించారు[4]. కాబట్టి వారు పరిహసించే దాని (ప్రతిఫలాన్ని) గురించిన వార్త వారికి త్వరలోనే రానున్నది.

6. ఏమీ? వారు చూడలేదా (వారికి తెలియదా?) వారికి పూర్వం ఎన్నో తరాలను మేము నాశనం చేశాము. మేము మీకు ఇవ్వని ఎన్నో బల సంపదలనిచ్చి వారిని భువిలో స్థిర పరిచాము; మరియు వారిపై మేము ఆకాశం నుండి ధారాపాతంగా వర్షాలు కురిపించాము; మరియు క్రింద నదులను ప్రవహింపజేశాము; చివరకు వారు చేసిన పాపాలకు ఫలితంగా వారిని నాశనం చేశాము; మరియు వారి స్థానంలో ఇతర తరాల వారిని లేపాము.

7. మరియు (ఓ ప్రవక్తా!) ఒకవేళ మేము చర్మపత్రం[5] పైన వ్రాయబడిన గ్రంథాన్ని నీపై అవతరింప జేసినా, అప్పుడు వారు దానిని తమ చేతులతో

---

[4] చూడండి, 'స. ముస్లిం, పుస్తకము - 1, అధ్యాయము - 240.

[5] ఖిర్'తాసున్ (ఖరా'తీసు బ.వ.): Parchment అంటే వ్రాయడానికి అనువయేటట్లు పదును చేసిన తోలు, చర్మపత్రం, చర్మపత్ర రాతప్రతి.

తాకి చూసినా! సత్యతిరస్కారులు: "ఇది స్పష్టమైన మాయాజాలం మాత్రమే!" అని అనేవారు[6].

8. మరియు వారు: "ఇతని వద్దకు (ప్రవక్త వద్దకు) ఒక దైవదూత ఎందుకు దింప బడ లేదు?" అని అడుగుతారు. మరియు ఒకవేళ మేము దైవదూతనే పంపి ఉంటే! వారి తీర్పు వెంటనే జరిగి ఉండేది. ఆ తరువాత వారికి ఎలాంటి వ్యవధి కూడా ఇవ్వబడి ఉండేది కాదు[7].

9. మరియు ఒకవేళ మేము దైవదూతను అవతరింపజేసినా, అతనిని మేము మానవ రూపంలోనే అవతరింపజేసి ఉండేవారం. మరియు వారు ఇపుడు ఏ సంశయంలో పడి ఉన్నారో! వారిని ఆ సంశయానికే గురి చేసి ఉండేవారం.

10. మరియు వాస్తవానికి నీకు పూర్వం కూడా చాలామంది ప్రవక్తలను ఎగతాళి చేయటం జరిగింది, కావున పరిహసించేవారు దేనిని గురించి ఎగతాళి చేసేవారో అదే వారిని చుట్టుకున్నది

11. ఇలా అను: "మీరు భూమిలో సంచారం చేసి, సత్యతిరస్కారుల ముగింపు ఎలా జరిగిందో చూడండి!"

12. వారిని అడుగు: "ఆకాశాలలో మరియు భూమిలో ఉన్నదంతా ఎవరికి చెందినది?" అని. (నీవే) జవాబివ్వు: "(అంతా)అల్లాహ్ దే!" ఆయన

[6] చూడండి, 15:14-15 మరియు 52:44.
[7] చూడండి, 3:164.

కరుణించటాన్ని, తనపై తాను (కర్తవ్యంగా) విధించుకున్నాడు[8]. నిశ్చయంగా, ఆయన పునరుత్థాన దినమున మీ అందరినీ సమావేశ పరుస్తాడు. అందులో ఎలాంటి సందేహం లేదు. ఎవరైతే తమను తాము నష్టానికి గురి చేసుకున్నారో, అలాంటి వారే విశ్వసించరు!

13. మరియు రేయింబవళ్ళలో ఉన్నదంతా ఆయనకు చెందినదే. మరియు ఆయనే సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

14. (ఓ ముహమ్మద్!) ఇలా అను: "ఏమీ? ఆకాశాల మరియు భూమి సృష్టికి మూలాధారుడు[9] అయిన అల్లాహ్'ను కాదని నేను మరెవరినైనా ఆరాధ్యునిగా[10] చేసుకోవాలా? మరియు ఆయనే అందరికీ ఆహారమిస్తున్నాడు. మరియు ఆయన కెవ్వడూ ఆహారమివ్వడు." (ఇంకా) ఇలా అను: "నిశ్చయంగా, అందరి కంటే ముందు నేను ఆయనకు (అల్లాహ్ కు) విధేయుడను (ముస్లింను) కావాలని మరియు ఆయనకు (అల్లాహ్ కు) సాటి కల్పించేవారిలో చేరకూడదనీ

---

[8] దైవప్రవక్త ('స'అస) ప్రచనం: "అల్లాహ్ (సు.తా.) సందేశం: 'నిశ్చయంగా, నా కారుణ్యం నా ఆగ్రహాని కంటే మించింది.' " ('స. బు'ఖారీ మరియు 'స. ముస్లిం). చూడండి, 6:64, 7:156.

[9] ఫాతిరు: Originator. సృష్టికి మూలాధారుడు, ఉత్పత్తికి కారకుడు. సృష్టించేవాడు.

[10] వలియ్యున్: అంటే ఇక్కడ ఆరాధ్యుడు అని అర్థం. సాధారణంగా దీని అర్థం: స్నేహితుడు, సహాయకుడు, రక్షించువాడు, Friend, Patron, Protector, Owner, Defender. అల్ - వలియ్యు: సంరక్షకుడు, స్వామి. చూడండి, 2:107.

ఆదేశించబడ్డాను!"

15. (ఇంకా) ఇలా అను: "నిశ్చయంగా, నేను నా ప్రభువుకు అవిధేయుడనైతే నిశ్చయంగా, రాబోయే ఆ గొప్ప దినపు శిక్ష నుండి భయపడుతున్నాను!"

16. ఆ రోజు దాని (ఆ శిక్ష నుండి) తప్పించుకున్న వాడిని, వాస్తవంగా! ఆయన (అల్లాహ్) కరుణించినట్లే. మరియు అదే స్పష్టమైన విజయం (సాఫల్యం)[11].

17. మరియు అల్లాహ్ నీకు ఏదైనా హాని కలిగిస్తే! ఆయన తప్ప మరెవ్వరూ దానిని తొలగించలేరు. మరియు ఆయన నీకు మేలు చేస్తే! ఆయనే ప్రతిదీ చేయగల సమర్థుడు.

18. మరియు ఆయన తన దాసులపై సంపూర్ణ అధికారం (ప్రాబల్యం)[12] గలవాడు. మరియు ఆయన మహా వివేచనాపరుడు, సర్వం తెలిసినవాడు[13].

19. (ఓ ముహమ్మద్! వారిని) అడుగు: "అన్నింటి

---

[11] చూడండి, 3:185.

[12] అల్ - ఖాహిరు: Subduer, Irresistible, Overcomer, Overpowerer, తన సృష్టిపై సంపూర్ణ అధికారం, ఆధిపత్యం, ఆధిక్యత, లోబరుకో గలవాడు, స్వాధీనంలోకి తెచ్చుకోగల, వశం చేసుకోగల, జయించగల వాడు, ప్రబలుడు, చూడండి, 6:61. అల్ - వాహిద్ అల్ ఖహ్హార్ లకు చూడండి, 12:39. ఇవి అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లు.

[13] అల్ -ఖబీరు: All-Aware, Well-Acquainted with all things. సర్వపరిచితుడు, అంతా ఎరిగినవాడు, అంతా తెలిసినవాడు. ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి, చూడండి, 6:103, 34:1, 67:14.

కంటే గొప్ప సాక్ష్యం ఏదీ?" ఇలా అను: "నాకూ మరియు మీకూ మధ్య అల్లాహ్ సాక్షిగా ఉన్నాడు. మరియు మిమ్మల్ని మరియు ఇది (ఈ సందేశం) అందిన వారిని అందరినీ హెచ్చరించటానికి, ఈ ఖుర్ఆన్ నాపై అవతరింప జేయబడింది." ఏమీ? వాస్తవానికి అల్లాహ్ తో పాటు ఇంకా ఇతర ఆరాధ్యదైవాలు ఉన్నారని మీరు నిశ్చయంగా, సాక్ష్యమివ్వగలరా? ఇలా అను: "నేనైతే అలాంటి సాక్ష్యమివ్వను!" ఇంకా ఇలా అను: "నిశ్చయంగా ఆయన (అల్లాహ్) ఒక్కడే ఆరాధ్య దేవుడు. మరియు నిశ్చయంగా, మీరు ఆయనకు సాటి కల్పిస్తున్న దాని నుండి నాకు ఎలాంటి సంబంధం లేదు!"

20. ఎవరికైతే మేము గ్రంథాన్ని ప్రసాదించామో! వారు తమ పుత్రులను గుర్తించినట్లు, ఇతనిని (ముహమ్మద్ ను) కూడా గుర్తిస్తారు. ఎవరైతే, తమను తాము నష్టానికి గురి చేసుకుంటారో అలాంటి వారే విశ్వసించరు.

21. మరియు అల్లాహ్ పై అసత్యం కల్పించే వాని కంటే! లేదా, అల్లాహ్ సూచనలను తిరస్కరించే వాని కంటే, ఎక్కువ దుర్మార్గుడు ఎవడు? నిశ్చయంగా, దుర్మార్గులు ఎన్నటికీ సాఫల్యం పొందరు.

22. మరియు ఆ రోజు మేము వారందరినీ సమావేశపరుస్తాము. ఆ తరువాత (అల్లాహ్ కు) సాటి కల్పించే (షిర్కు చేసే) వారితో: "మీరు (దైవాలుగా) భావించిన (అల్లాహ్ కు

సాటి కల్పించిన) ఆ భాగస్వాములు ఇప్పుడు ఎక్కడున్నారు?" అని అడుగుతాము.

23. అప్పుడు వారికి: "మా ప్రభువైన అల్లాహ్ సాక్షిగా! మేము ఆయన (అల్లాహ్) కు సాటి కల్పించేవారము (ముష్రికీన్) కాదు!" అని చెప్పడం తప్ప మరొక సాకు దొరకదు.

24. చూడండి! వారు తమను గురించి తామే ఏ విధంగా అబద్ధాలు కల్పించు కున్నారో! మరియు ఏ విధంగా వారు కల్పించుకున్నవి (బూటకదైవాలు) మాయమై పోయాయో!

25. మరియు (ఓ ప్రవక్తా!) వారిలో కొందరు నీ (మాటలు) వింటున్నట్లు (నటించే) వారున్నారు. మరియు వారు దానిని అర్థం చేసుకోకుండా మేము వారి హృదయాలపై తెరలు వేసి వున్నాము మరియు వారి చెవులకు చెవుడు పట్టించి వున్నాము[14]. మరియు వారు ఏ అద్భుత సంకేతాన్ని చూసినా దానిని విశ్వసించరు. చివరకు వారు నీ వద్దకు వచ్చి, నీతో వాదులాడేటప్పుడు, వారిలో సత్యాన్ని తిరస్కరించేవారు: "ఇవి కేవలం పూర్వీకుల కట్టుకథలు మాత్రమే!" అని అంటారు

26. మరియు వారు ఇతరులను అతని (ప్రవక్త) నుండి ఆపుతారు. మరియు స్వయంగా తాము కూడా అతనికి దూరంగా ఉంటారు. మరియు ఈ విధంగా వారు తమకు తామే నాశనం చేసుకుంటున్నారు. కాని వారది గ్రహించటం లేదు!

---

[14] చూడండి, 2:7.

27. మరియు వారిని నరకం ముందు నిలబెట్టబడినపుడు, నీవు చూడగలిగితే (ఎంత బాగుండేది!) వారు ఇలా అంటారు: "అయ్యో మా పాడుగానూ! మేము తిరిగి (పూర్వ జీవితంలోకి) పంపబడితే, మా ప్రభువు సూచనలను, అసత్యాలని తిరస్కరించకుండా విశ్వాసులలో చేరి పోయే వారం కదా![15]"
28. (వారు ఇలా అనటానికి కారణం), వాస్తవానికి వారు ఇంత వరకు దాచిన దంతా వారికి బహిర్గతం కావటమే! మరియు ఒకవేళ వారిని (గత జీవితంలోకి) తిరిగి పంపినా, వారికి నిషేధించబడిన వాటినే వారు తిరిగి చేస్తారు. నిశ్చయంగా, వారు అసత్యవాదులు!
29. మరియు వారు: "మాకు ఇహలోక జీవితం తప్ప మరొక (జీవితం) లేదు మరియు మేము తిరిగి లేపబడము (మాకు పునరుత్థానం లేదు)!" అని అంటారు.
30. మరియు ఒకవేళ వారిని, తమ ప్రభువు ముందు నిలబెట్టబడినప్పుడు, నీవు చూడగలిగితే (ఎంత బాగుండేది)! ఆయన (అల్లాహ్) అంటాడు: "ఏమీ? ఇది (పునరుత్థానం) నిజం కాదా?" వారు జవాబిస్తారు: "అవును (నిజమే) మా ప్రభువు సాక్షిగా!" అప్పుడు ఆయన: "అయితే మీరు మీ సత్యతిరస్కారానికి ఫలితంగా శిక్షను అనుభవించండి!" అని అంటాడు.
31. వాస్తవంగా అల్లాహ్ ను కలుసుకోవటాన్ని

[15] చూడండి, 23:107-108 మరియు 32:12.

అబద్ధంగా పరిగణించే వారే నష్టానికి గురి అయిన వారు![16] చివరకు ఆకస్మాత్తుగా అంతి ఘడియ వారి పైకి వచ్చినపుడు వారు: "అయ్యో మా దౌర్భాగ్యం! దీని విషయంలో మేమెంత అశ్రద్ధ వహించాము కదా! అని వాపోతారు. (ఎందుకంటే) వారు తమ (పాపాల) బరువును తమ వీపులపై మోసుకొని ఉంటారు. అయ్యో! వారు మోసే భారం ఎంత దుర్భరమైనది కదా!

**32.** మరియు ఇహలోక జీవితం ఒక ఆట మరియు ఒక కాలక్షేపము మాత్రమే! మరియు దైవభీతి గల వారికి పరలోక వాసమే అత్యంత శ్రేష్ఠమైనది. ఏమీ? మీరు అర్థం చేసుకోలేరా?

**33.** (ఓ ప్రవక్తా!) వాస్తవానికి వారు పలుకుతున్న మాటల వలన నీకు దుఃఖము కలుగు తున్నదని మాకు బాగా తెలుసు. కానీ, నిశ్చయంగా, వారు అసత్యుడవని తిరస్కరించేది నిన్ను కాదు! వాస్తవానికి ఆ దుర్మార్గులు అల్లాహ్ సూచనలను (ఆయాత్ లను) తిరస్కరిస్తున్నారు[17].

**34.** మరియు వాస్తవంగా, నీకు పూర్వం చాలామంది ప్రవక్తలు, అసత్యవాదులని తిరస్కరించ బడ్డారు. కాని వారు ఆ తిరస్కారాన్ని మరియు తమకు

---

[16] చూడండి, 'స. బు'ఖారీ, పుస్తకము - 8, 'హదీస్' నం. 515

[17] 'అలీ (ర'ది.'అ) కథనం: "ఒకసారి అబూ - జహల్ (దైవప్రవక్త 'స'అస యొక్క శత్రువు) ఇలా అన్నాడు:'ఓ ము'హమ్మద్! (స'అస) నేను నిన్ను అసత్యపరుడని అనటం లేదు. కాని నీవు వినిపించే వాటిని మటుకు సత్యాలని నమ్మలేను.' " (తిర్మిజీ').

కలిగిన హింసలను, వారికి మా సహాయం అందే వరకూ సహనం వహించారు[18] మరియు అల్లాహ్ మాటలను ఎవ్వరూ మార్చ లేరు మరియు వాస్తవానికి, పూర్వప్రవక్తలకొన్ని సమాచారాలు ఇది వరకే నీకు అందాయి.

35. మరియు (ఓ ముహమ్మద్!) వారి విముఖత నీకు భరించనిదైతే నీలో శక్తి ఉంటే, భూమిలో ఒక సొరంగం వెదకి, లేదా ఆకాశంలో ఒక నిచ్చెన వేసి, వారి కొరకు ఏదైనా అద్భుత సూచన తీసుకురా! మరియు అల్లాహ్ కోరితే వారందరినీ సన్మార్గం వైపునకు తెచ్చి ఉండేవాడు! కావున నీవు అజ్ఞానులలో చేరకు.

36. నిశ్చయంగా, ఎవరైతే (శ్రద్ధతో) వింటారో, వారే (సత్యసందేశాన్ని) స్వీకరిస్తారు. ఇక మృతులు (సత్యతిరస్కారులు) - అల్లాహ్ వారిని పునరుత్థరింపజేసినప్పుడు-(ప్రతిఫలం కొరకు) ఆయన వద్దకే రప్పింపబడతారు.

37. మరియు వారు: "ఇతనిపై (ప్రవక్తపై) ఇతని ప్రభువు తరఫు నుండి ఏదైనా అద్భుత సూచన ఎందుకు అవతరింప జేయబడలేదు?" అని అంటారు. ఇలా అను: "నిశ్చయంగా, అల్లాహ్! ఎలాంటి అద్భుత సూచనసైనా అవతరింప జేయగల శక్తి కలిగి ఉన్నాడు, కాని వారిలో అనేకులకు ఇది తెలియదు."

38. మరియు భూమిపై సంచరించే ఏ జంతువు గానీ,

---

[18] చూడండి, 40:51, 58:21 మరియు 37:171-172.

లేక తన రెండు రెక్కలతో ఎగిరే ఏ పక్షి గానీ, మీలాంటి సంఘజీవులుగా లేకుండా లేవు! మేము గ్రంథంలో ఏ కొరతా చేయలేదు[19]. తరువాత వారందరూ తమ ప్రభువు వద్దకు మరలింపబడతారు.

39. మా సూచనలను అబద్ధాలని తిరస్కరించే వారు, చెవిటివారు మరియు మూగవారు, అంధకారంలో పడిపోయిన వారు! అల్లాహ్ తాను కోరిన వారిని మార్గభ్రష్టులుగా చేస్తాడు మరియు తాను కోరిన వారిని ఋజుమార్గంలో ఉంచుతాడు[20].

40. వారితో అను: "ఏమీ? మీరు సత్యవంతులే అయితే ఆలోచించి (చెప్పండి!) ఒకవేళ మీపై అల్లాహ్ శిక్ష వచ్చి పడినా, లేదా అంతిమ ఘడియ వచ్చినా! మీరు అల్లాహ్ ను తప్ప ఇతరులను ఎవరినైనా పిలుస్తారా?

41. "అలా కానేరదు! మీరు ఆయన (అల్లాహ్) నే పిలుస్తారు. ఆయన కోరితే ఆ ఆపదను మీ పైనుండి తొలగిస్తాడు. అప్పుడు మీరు ఆయనకు సాటి కల్పించేవారిని మరచిపోతారు!"

42. మరియు వాస్తవానికి మేము, నీకు పూర్వం (ఓ

---

[19] చూడండి, 16:89.

[20] చూడండి, 2:26, 4:88, 143. అల్లాహుతా'ఆలా వారినే మార్గభ్రష్టులు చేస్తాడు, ఎవరైతే - విచక్షణా శక్తి మరియు తెలివి ఉండి కూడా - సత్యాన్ని తెలుసుకొని దానిపై అమలు పరచటానికి ప్రయత్నం చేయరో! సత్యం తెలిసినా దానిని నమ్మరో! అల్లాహ్ (సు.తా.) ఎవ్వరినీ కూడా బలవంతంగా మార్గభ్రష్టత్వంలో పడవేయడు. కాని షైతాన్ ఎల్లప్పుడూ మానవుణ్ణి మార్గభ్రష్టత్వం వైపుకు ఆహ్వానిస్తుంటాడు.

ముహమ్మద్!) అనేక జాతుల వారి వద్దకు ప్రవక్తలను పంపాము. ఆ పిదప వారు వినమ్రులవటానికి మేము వారిపై ఇబ్బందులను మరియు కష్టాలను కలుగ జేశాము.

43. పిదప మా తరఫు నుండి వారిపై ఆపద వచ్చినపుడు కూడా వారెందుకు వినమ్రులు కాలేదు? కాని వారి హృదయాలు మరింత కఠినమయ్యాయి మరియు షైతాన్ వారు చేసే కర్మలన్నింటినీ వారికి మంచివిగా కనబడేటట్లు చేశాడు.

44. ఆ పిదప వారికి చేయబడిన బోధనను వారు మరచిపోగా, మేము వారి కొరకు సకల (భోగభాగ్యాల) ద్వారాలను తెరిచాము, చివరకు వారు తమకు ప్రసాదించబడిన ఆనందాలలో నిమగ్నులై ఉండగా, మేము వారిని ఆకస్మాత్తుగా (శిక్షించటానికి) పట్టు కున్నాము, అప్పుడు వారు నిరాశులయ్యారు.

45. ఈ విధంగా దుర్మార్గానికి పాల్పబడిన వారు సమూలంగా నిర్మూలించబడ్డారు. మరియు సర్వలోకాలకు పోషకుడైన అల్లాహ్ మాత్రమే సర్వస్తోత్రాలకు అర్హుడు.

46. ఇలా అను: "ఏమీ? మీరు ఆలోచించారా (చెప్పండి)? అల్లాహ్ మీ వినికిడినీ మరియు మీ చూపునూ పోగొట్టి, మీ హృదయాలపై ముద్ర వేస్తే! అల్లాహ్ తప్ప ఏ దేవుడైనా వాటిని మీకు తిరిగి ఇవ్వగలడా? చూడు! మేము ఏ విధంగా మా

సూచనలను వారికి తెలుపు తున్నామో! అయినా వారు (వాటి నుండి) తప్పించుకొని పోతున్నారు.

47. ఇలా అను: "ఏమీ? మీరు ఆలోచించారా (చెప్పండి)? అల్లాహ్ శిక్ష మీపై (రాత్రివేళ) ఆకస్మాత్తుగా గానీ లేక (పగటివేళ) బహిరంగంగా గాని వచ్చి పడితే, దుర్మార్గులు తప్ప ఇతరులు నాశనం చేయబడతారా?[21]

48. మరియు మేము ప్రవక్తలను కేవలం శుభవార్తలు ఇచ్చేవారుగా మరియు హెచ్చరికలు చేసేవారుగా మాత్రమే పంపుతాము. కావున ఎవరైతే విశ్వసించి (తమ నడవడికను) సరిదిద్దు కుంటారో, అలాంటివారికి ఎలాంటి భయమూ ఉండదు మరియు వారు దుఃఖ పడరు కూడా!

49. కాని మా సూచనలను అబద్ధాలని తిరస్కరించే వారికి, తమ అవిధేయతకు ఫలితంగా తప్పకుండా శిక్ష పడుతుంది[22].

50. (ఓ ప్రవక్తా!) వారితో ఇలా అను: "నా వద్ద అల్లాహ్ కోశాగారాలు ఉన్నాయని గానీ లేదా నాకు అగోచర జ్ఞానమున్నదని గానీ, నేను మీతో అనడం లేదు. లేదా నేను దేవదూతనని కూడా అనడం లేదు.

---

[21] చూడండి, 10:50.

[22] చూడండి 'స. ముస్లిం, పు. 1, అధ్యాయం - 240. అబూ హురైరా (ర'ది.'అ) కథనం : "దైవప్రవక్త ('స'అస) అన్నారు: 'ఎవరి చేతిలోనైతే నాప్రాణముందో ఆ అల్లాహ్ (సు.తా.) సాక్షిగా! ఈ కాలపు యూదులు మరియు క్రైస్తవులలో ఎవరే గానీ నా గురించి విని నా సందేశాన్ని విశ్వసించకుండా మరణిస్తారో, వారు నరకవాసులవుతారు'

కాని, నేను కేవలం నాపై అవతరింప జేయబడిన దివ్యజ్ఞానాన్ని (వహీని) మాత్రమే అనుసరిస్తున్నాను[23]. వారిని ఇలా అడుగు: "ఏమీ? అంధుడూ మరియు దృష్టి గలవాడు సమానులా? అయితే మీరెందుకు ఆలోచించరు?"

51. మరియు తమ ప్రభువు సన్నిధిలో సమావేశ పరచబడతారని భయపడే వారికి ఆయన తప్ప వేరే రక్షించేవాడు గానీ, సిఫారసు చేసే వాడు గానీ ఉండడని, దీని (ఈ ఖుర్ఆన్) ద్వారా హెచ్చరించు, బహుశా వారు దైవభీతి గలవారు అవుతారేమో!

52. మరియు ఎవరైతే తమ ప్రభువును ఉదయం మరియు సాయంత్రం ప్రార్థిస్తూ, ఆయన ముఖాన్ని[24] (చూడ) గోరుతున్నారో, వారిని నీవు దూరం చేయకు. వారి లెక్క కొరకు నీవు ఎంత మాత్రమూ జవాబుదారుడవు కావు. మరియు నీ లెక్క కొరకు వారూ జవాబుదారులు కారు. కావున నీవు వారిని దూరం చేస్తే నీవు దుర్మార్గులలో చేరిన వాడవవుతావు.

53. మరియు ఈ విధంగా, మేము వారిలోని కొందరిని మరికొందరి ద్వారా పరీక్షకు గురి చేశాము. వారు

---

[23] చూడండి, 7:188.

[24] ప్రళయదినాన విశ్వాసులకు లభించే అతి గొప్ప వరం అల్లాహ్ (సు.తా.) దర్శనం. అందుకే ఖుర్ఆన్ లో అనేక చోట్లలో: "అల్లాహ్ ముఖాన్ని చూడగోరేవారు..." అని చెప్పబడింది: "ఓ ప్రవక్తా! 'ధనవంతులు, పేరు ప్రఖ్యాతులు గల అవిశ్వాసులైన ముష్రిక్ ల మాటలలో పడి - ఇస్లాం స్వీకరించి తమ ప్రభువైన అల్లాహ్ (సు.తా.) ను ప్రార్థించే - పేదవారిని, బానిసలను దూరం చేయకు.' "

(విశ్వాసులను చూసి): "ఏమీ? మా అందరిలో, వీరినేనా అల్లాహ్ అనుగ్రహించింది?[25]" అని అంటారు. ఏమీ? ఎవరు కృతజ్ఞులో అల్లాహ్ కు తెలియదా?[26]

**54.** మరియు మా సూచనలను విశ్వసించిన వారు నీ వద్దకు వచ్చినపుడు నీవు వారితో ఇలా అను: "మీకు శాంతి కలుగు గాక (సలాం)! మీ ప్రభువు కరుణించటమే తనపై విధిగా నిర్ణయించుకున్నాడు. నిశ్చయంగా, మీలో ఎవరైనా అజ్ఞానం వల్ల తప్పు చేసి, ఆ తరువాత పశ్చాత్తాప పడి, సరిదిద్దుకుంటే! నిశ్చయంగా, ఆయన క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

**55.** మరియు పాపుల మార్గం స్పష్టపడటానికి, మేము ఈ విధంగా మా సూచనలను వివరంగా తెలుపుతున్నాము.

**56.** ఇలా అను: "నిశ్చయంగా అల్లాహ్ ను వదిలి, మీరు ప్రార్థించే ఈ ఇతరులను (కల్పిత దైవాలను) ఆరాధించటం నుండి నేను వారించబడ్డాను." మరియు ఇలా అను: "నేను మీ కోరికలను అనుసరించను. (అలా చేస్తే!) వాస్తవానికి నేనూ

---

[25] చూడండి, 46:11, ఈ మాటలు ధనవంతులు పేరు మరియు పేరు ప్రఖ్యాతులు గల అవిశ్వాసులైన ముష్రికులు మొట్టమొదట కాలంలో ఇస్లాం స్వీకరించిన పేదవారినీ, బానిసలనూ చూసి అన్నారు.

[26] "అల్లాహ్ (సు.తా.) మీ రూపురేఖలు చూడడు. ఆయన కేవలం మీ హృదయాలు మరియు మీ కర్మలు మాత్రమే చూస్తాడు." ('స. ముస్లిం, కితాబ్ అల్ - బిర్ర్, బాబా అత్ - త'హ్రీమ్).

మార్గభ్రష్టుడను అవుతాను. మరియు నేను సన్మార్గం చూపబడిన వారిలో ఉండను."

**57.** ఇలా అను: "నిశ్చయంగా నేను నా ప్రభువు తరఫు నుండి లభించిన స్పష్టమైన ప్రమాణంపై ఉన్నాను. మీరు దానిని అబద్ధమని నిరాకరించారు. మీరు తొందర పెట్టే విషయం నా దగ్గర లేదు. నిర్ణయాధికారం కేవలం అల్లాహ్ కే ఉంది. ఆయన సత్యాన్ని తెలుపు తున్నాడు. మరియు ఆయనే సర్వోత్తమమైన న్యాయాధికారి![27]"

**58.** ఇలా అను: "ఒకవేళ వాస్తవానికి మీరు తొందర పెట్టే విషయం (శిక్ష) నా ఆధీనంలో ఉండినట్లయితే, నాకూ మీకూ మధ్య తీర్పు ఎప్పుడో జరిగిపోయి ఉండేది. మరియు అల్లాహ్ కు దుర్మార్గులను గురించి బాగా తెలుసు.

**59.** మరియు అగోచర విషయాల తాళపు చెవులు ఆయన (అల్లాహ్) వద్దనే ఉన్నాయి. వాటిని, ఆయన తప్ప మరెవ్వరూ ఎరుగరు. మరియు భూమిలోనూ, సముద్రంలోనూ ఉన్నది అంతా ఆయనకు తెలుసు. మరియు ఆయనకు తెలియకుండా ఏ చెట్టు ఆకు కూడా రాలదు. మరియు భూమిలోని చీకటి పొరలలో ఉన్న ప్రతి గింజ, అది పచ్చిది కానీ ఎండినది కానీ అంతా

---

[27] చూడండి, 8:32-33.

స్పష్టంగా ఒక గ్రంథంలో (వ్రాయబడి) ఉంది[28].

60. మరియు ఆయనే రాత్రివేళ (మీరు నిద్రపోయినపుడు) మీ ఆత్మలను తీసుకుంటాడు (స్వాధీనపరచు కుంటాడు)[29] మరియు పగటివేళ మీరు చేసేదంతా ఆయనకు తెలుసు. ఆ పిదప నిర్ణీత గడువు, పూర్తి అయ్యే వరకు దానిలో (పగటి వేళలో) మిమ్మల్ని తిరిగి లేపుతాడు. ఆ తరువాత ఆయన వైపునకే మీ మరలింపు ఉంది. అప్పుడు (పునరుత్థాన దినమున) ఆయన మీరు చేస్తూ ఉన్న కర్మలన్నీ మీకు తెలుపుతాడు[30].

61. ఆయన తన దాసులపై సంపూర్ణ అధికారం (ప్రాబల్యం)[31] గలవాడు. మరియు ఆయన మీపై కనిపెట్టుకొని ఉండే వారిని పంపుతాడు. చివరకు మీలో ఒకరికి చావు సమయం వచ్చినపుడు, మేము పంపిన దూతలు అతనిని మరణింపజేస్తారు

---

[28] అగోచర విషయాల తాళపు చెవులు ఐదు ఉన్నాయి. 1) పునరుత్థాన దినపు జ్ఞానం, 2) వర్షం వచ్చే సమయం, 3) తల్లి గర్భాశయంలో ఉన్న బిడ్డ విషయం, 4) రేపు సంభవించే విషయం, 5) మరణం సంభవించే చోటు. ('స'హీ'హ్ బు'ఖారీ, తఫ్సీర్ సూరహ్ అల్-అన్'ఆమ్).

[29] చూడండి, 39:42. చావును గురించి అవతరింపజేయబడిన మొదటి ఆయత్.

[30] చూడండి, 78:9-11.

[31] చూడండి అల్ ఖాహిరు, 6:18.

మరియు వారెప్పుడూ అశ్రద్ధ చూపరు[32].

**62.** తరువాత వారు, వారి నిజమైన[33] సంరక్షకుడు, అల్లాహ్ సన్నిధిలోకి చేర్చబడతారు. తెలుసు కోండి! సర్వ న్యాయాధికారం ఆయనదే! మరియు లెక్క తీసుకోవటంలో ఆయన అతి శీఘ్రుడు!

**63.** "'మమ్మల్ని ఈ ఆపద నుండి కాపాడితే మేమెంతో కృతజ్ఞులమవుతాము.' అని మీరు వినమ్రులై రహస్యంగా వేడుకున్నప్పుడు! భూమి మరియు సముద్రాలచీకట్లనుండిమిమ్మల్నికాపాడేదెవరు? అని వారిని అడుగు.

**64.** "అల్లాహ్ మాత్రమే మిమ్మల్ని దాని నుండి మరియు ప్రతి విపత్తు నుండి కాపాడు తున్నాడు. అయినా మీరు ఆయనకు సాటి (భాగస్వాములు) కల్పిస్తున్నారు!" అని వారికి చెప్పు.

**65.** ఇలా అను: "ఆయన మీ పైనుండి గానీ, లేదా మీ పాదాల క్రింది నుండి గానీ, మీపై ఆపద అవతరింప జేయగల సామర్థ్యం కలిగి ఉన్నాడు; మరియు మిమ్మల్ని తెగలు తెగలుగా చేసి, పరస్పర కలహాల రుచి చూప గలిగే (శక్తి కూడా)

---

[32] చూడండి, 32:11లో ఒక మరణదైవదూత పేర్కొనబడ్డాడు. కానీ, ఈ ఆయత్ లో దైవదూతలు, అని ఉంది. ఇదే విధంగా 4:97 మరియు 6:93లలో కూడా దైవదూతలు, అని ఉంది. దీన వల్ల స్పష్టమయ్యేదే మిటంటే మరణింపజేసే దైవదూత ఒక్కడే, కాని ఇతరులు అతని సహాయకులు. ఆ మరణింపజేసే దైవదూత పేరు 'ఇ'బ్రాయీ'ల్. (ఇబ్నె-కసీ'ర్).

[33] అల్-'హఖ్ఖు: The Truth, The Really Existing, whose existance and divinity are proved to be True. పరమ సత్యం, నిజం, యథార్థం, చూడండి, 2:119.

కలిగి ఉన్నాడు[34]." చూడు! బహుశా వారు (సత్యాన్ని) గ్రహిస్తారేమోనని, మేము ఏ విధంగా మా సూచనలను వివిధ రూపాలలో వివరిస్తున్నామో!

66. మరియు ఇది (ఈ ఖుర్ఆన్) సత్యమైనది అయినా నీ జాతి వారు దీనిని అబద్ధమని నిరాకరించారు. వారితో ఇలా అను: "నేను మీ కొరకు బాధ్యుడను (కార్యసాధకుడను) కాను![35]"

67. ప్రతి వార్తకు (విషయానికి) ఒక గడువు నియమింపబడి ఉంది. మరియు త్వరలోనే మీరిది తెలుసుకోగలరు.

68. మరియు మా సూచన (ఆయాత్) లను గురించి వారు వృథా మాటలు (దూషణలు) చేస్తూ ఉండటం నీవు చూస్తే, వారు తమ ప్రసంగం మార్చే వరకు నీవు వారి నుండి దూరంగానే ఉండు. మరియు ఒకవేళ షైతాన్ నిన్ను మరపింపజేస్తే! జ్ఞప్తికి వచ్చిన తరువాత అలాంటి దుర్మార్గులైన

---

[34] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'నేను మూడు దువాలు చేశాను: 1) నా ఉమ్మహ్ నీటిలో ముంచబడి నాశనం చేయబడగూడదని, 2) కరువుకు గురి అయి నాశనం చేయబడగూడదని, 3) వారు పరస్పరం యుద్ధాలు చేసుకోనగూడదని. అల్లాహ్ (సు.తా.) మొదటి రెండు దుఆలు అంగీకరించాడు, కాని మూడవ దువా నుండి నన్ను ఆపాడు. ('స'హీ'హ్ ముస్లిం. 2216) ఇంకా చూడండి, 35:43.

[35] అంటే అల్లాహ్ (సు.తా.) సందేశాన్ని మీకు యావత్తు అందజేయటమే నా పని. కాని మిమ్మల్ని దానిపై అమలు చేసేటట్లు చేయడం నా ('స'అస) పని కాదు. చూడండి, 18:29.

వారితో కలసి కూర్చోకు[36].

**69.** మరియు దైవభీతి గలవారు, వారి (అవిశ్వాసుల) లెక్కకు ఏ మాత్రం బాధ్యులు కారు. కాని వారికి హితోపదేశం చేయటం (విశ్వాసుల ధర్మం). బహుశా వారు కూడా దైవభీతిగలవారు కావచ్చు!

**70.** మరియు తమ ధర్మాన్ని ఒక ఆటగా మరియు కాలక్షేపంగా భావించేవారిని నీవు వదలిపెట్టు. మరియు ఇహలోక జీవితం వారిని మోసపుచ్చింది. ఏ వ్యక్తి గానీ తన కర్మల ఫలితంగా నాశనం చేయ బడకుండా ఉండటానికి దీని (ఈ ఖుర్ఆన్) ద్వారా హితోపదేశం చెయ్యి. అల్లాహ్ తప్ప, అతనికి రక్షించేవాడు గానీ సిఫారసు చేసేవాడు గానీ, ఎవ్వడూ ఉండడు. మరియు అతడు ఎలాంటి పరిహారం ఇవ్వదలచుకున్నా అది అంగీకరించబడదు. ఇలాంటివారే తమ కర్మల ఫలితంగా నాశనం చేయబడేవారు. వారికి తమ సత్యతిరస్కారానికి ఫలితంగా, త్రాగటానికి సలసల కాగే నీరు మరియు బాధాకరమైన శిక్ష గలవు.

**71.** (ఓ ముహమ్మద్!) వారితో అను: "ఏమీ? అల్లాహ్ ను వదలి మాకు లాభం గానీ, నష్టం గానీ కలిగించలేని వారిని మేము ప్రార్థించాలా? మరియు అల్లాహ్ మార్గదర్శకత్వం దొరికిన తరువాత కూడా మా మడమలపై వెనుదిరిగి పోవాలా? అతని వలే ఎవడైతే తన సహచరులు సన్మార్గం వైపుకు పిలుస్తూ, 'మా వైపుకురా!'

---

[36] చూడండి, 4:140.

అంటున్నా - షైతాన్ మోసపుచ్చటం వలన -భూమిలో ఏమీ తోచకుండా, తిరుగుతాడో?[37]" వారితో అను: "నిశ్చయంగా, అల్లాహ్ మార్గదర్శకత్వమే నిజమైన మార్గదర్శకత్వము[38]. మరియు మేము సర్వలోకాల ప్రభువుకు విధేయులముగా (ముస్లింలముగా) ఉండాలని ఆజ్ఞాపించబడ్డాము;

72. "మరియు నమాజ్ ను స్థాపించమని మరియి ఆయన యందు భయభక్తులు కలిగి ఉండమని కూడా[39]. మరియు మీరంతా ఆయన (అల్లాహ్) సమక్షంలో జమ చేయబడతారు."

73. మరియు ఆకాశాలను మరియు భూమిని నిజానికి[40] సృష్టించింది ఆయనే! మరియు ఆ రోజు ఆయన: "అయిపో!" అని అనగానే, అది అయి పోతుంది. ఆయన మాటే సత్యం! మరియు బాకా (సూర్) ఊదబడే రోజు[41], సార్వభౌమాధికారం ఆయనదే. ఆయనే అగోచర మరియు గోచర విషయాలన్నీ తెలిసినవాడు. మరియు ఆయన మహా వివేచనాపరుడు, సర్వం తెలిసిన వాడు.

74. (జ్ఞాపకం చేసుకోండి!) ఇబ్రాహీమ్ తన తండ్రి

---

[37] చూడండి, 2:14, 14:22 మరియు 15:17.

[38] చూడండి, 16:37.

[39] చూడండి, 2:45.

[40] అంటే ఒక ఉద్దేశంతో.

[41] 'హదీస్'లో ఇలా ఉంది: ఇస్రాఫీల్ ('అ.స.) కొమ్ము (బాకా)ను తన నోటిలో పెట్టుకొని, తలవంచి, దానిని ఊదటానికి అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞ కొరకు వేచి ఉంటారు.(ఇబ్నె-కసీ'ర్, అబూ దావూద్, తిర్మిజీ', 'హదీస్' నం. 4742, 4030, 3244). 'సూరున్: Trumpet, బాకా, కొమ్ము, తుత్తార, శంఖం.

ఆజర్ తో ఇలా అన్న విషయం: "ఏమీ? నీవు విగ్రహాలను ఆరాధ్యదైవాలుగా చేసుకుంటున్నావా? నిశ్చయంగా నేను నిన్ను మరియు నీ జాతి వారిని స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో ఉన్న వారిగా చూస్తున్నాను![42]"

**75.** మరియు ఈ విధంగా దృఢనమ్మకం ఉన్న వారిలో చేరాలని, మేము ఇబ్రాహీమ్ కు భూమ్యాకాశాలపై ఉన్న మా సామ్రాజ్య వ్యవస్థను చూపించాము.

**76.** ఆ పిదప రాత్రి చీకటి అతనిపై క్రమ్ముకున్నప్పుడు, అతను ఒక నక్షత్రాన్ని చూసి: "ఇది నా ప్రభువు!" అని అన్నాడు. కాని, అది అస్తమించగానే: "అస్తమించే వాటిని నేను ప్రేమించను!" అని అన్నాడు.

**77.** ఆ తరువాత ఉదయించే చంద్రుణ్ణి చూసి: "ఇది నా ప్రభువు!" అని అన్నాడు. కాని అది అస్తమించగానే, ఒకవేళ నా ప్రభువు నాకు సన్మార్గం చూపకపోతే నేను నిశ్చయంగా, మార్గభ్రష్టులైన వారిలో చేరి పోయేవాడను!"అని అన్నాడు.

**78.** ఆ తరువాత ఉదయించే సూర్యుణ్ణి చూసి: "ఇది నా ప్రభువు, ఇది అన్నిటికంటే పెద్దగా ఉంది!" అని అన్నాడు. కాని అది కూడా అస్తమించగానే: "ఓ నా జాతి ప్రజలారా! మీరు అల్లాహ్ కు సాటి (భాగస్వామ్యము) కల్పించే దానితో వాస్తవంగా నాకెలాంటి సంబంధం లేదు!" అని అన్నాడు.

**79.** (ఇంకా ఇలా అన్నాడు): " నిశ్చయంగా, నేను

---

[42] చూడండి, 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 4, 'హదీస్' నం. 569.

ఏక దైవసిద్ధాంతం (సత్యధర్మం) పాటించే వాడనై, నా ముఖాన్ని భూమ్యాకాశాల సృష్టికి మూలాధారి అయిన ఆయన (అల్లాహ్) వైపునకే త్రిప్పు కుంటున్నాను. మరియు నేను అల్లాహ్ కు సాటి (భాగస్వాములు) కల్పించే వారిలో చేరిన వాడను కాను."

80. మరియు అతని జాతివారు అతనితో వాదులాటకు దిగగా! అతను వారితో అన్నాడు: "ఏమీ? మీరు నాతో అల్లాహ్ విషయంలో వాదిస్తున్నారా? వాస్తవానికి ఆయనే నాకు సన్మార్గం చూపించాడు. మరియు మీరు ఆయనకు సాటి (భాగస్వాములుగా) కల్పించిన వాటికి నేను భయపడను. నా ప్రభువు ఇచ్ఛ లేనిది (ఏదీ సంభవించదు). నా ప్రభువు సకల వస్తువులను (తన) జ్ఞానంతో ఆవరించి వున్నాడు. ఏమీ? మీరిది గ్రహించలేరా?

81. "మరియు మీరు అల్లాహ్ కు సాటి (భాగస్వాములు) గా కల్పించిన వాటికి నేనెందుకు భయపడాలి? వాస్తవానికి, ఆయన మీకు ఏ విధమైన ప్రమాణం ఇవ్వనిదే, మీరు అల్లాహ్ కు సాటి (భాగస్వాములను) కల్పించి కూడా భయపడటం లేదే? కావున ఈ రెండు పక్షాల వారిలో ఎవరు శాంతి పొందటానికి అర్హులో! మీకు తెలిస్తే చెప్పండి?"

**82.** ఎవరైతే విశ్వసించి, తమ విశ్వాసాన్ని షిర్క్ తో[43] కలుషితం చేయరో! అలాంటి వారికే శాంతి ఉంది. మరియు వారే సన్మార్గంలో ఉన్నవారు.

**83.** మరియు ఇదే మా వాదన, దానిని మేము ఇబ్రాహీమ్ కు, తన జాతివారికి వ్యతిరేకంగా ఇచ్చాము. మేము కోరిన వారికి ఉన్నత స్థానాలకు ప్రసాదిస్తాము. నిశ్చయంగా, నీ ప్రభువు మహా వివేచనాపరుడు, సర్వజ్ఞుడు (జ్ఞాన సంపన్నుడు).

**84.** మరియు మేము అతనికి (ఇబ్రాహీమ్ కు) ఇస్'హాఖ్ మరియు యఅఖూబ్ లను ప్రసాదించాము[44]. ప్రతి ఒక్కరికీ సన్మార్గం చూపాము. అంతకు పూర్వం నూహ్ కు సన్మార్గం చూపాము. మరియు అతని సంతతిలోని వారైన దావూద్, సులైమాన్, అయ్యూబ్, యూసుఫ్, మూసా మరియు హారూన్ లకు మేము (సన్మార్గం చూపాము). మరియు ఈ విధంగా మేము సజ్జనులకు తగిన ప్రతిఫలమిస్తాము.

**85.** మరియు జకరియ్యా, యహ్యా, ఈసా మరియు

---

[43] ఇక్కడ "జుల్మ్ - అంటే షిర్క్ అని అర్థం. చూడండి, 31:13 "నిశ్చయంగా, షిర్క్ (బహుదైవారాధన) గొప్ప దుర్మార్గం." ('స. బు'ఖారీ, తఫ్సీర్ సూరతుల్ - అన్'ఆమ్).

[44] చూడండి, 11:71.

ఇల్యాస్ లకు[45] కూడా (సన్మార్గం చూపాము). వారిలో ప్రతి ఒక్కరూ సద్వర్తనులే!

**86.** మరియు ఇస్మా'యీల్, అల్ యసఅ, యూనుస్ మరియు లూత్ లకు[46] కూడా (సన్మార్గం చూపాము). ప్రతి ఒక్కరికీ (వారి కాలపు) సర్వలోకాల వాసులపై ఘనతను ప్రసాదించాము.

**87.** మరియు వారిలో నుండి కొందరి తండ్రి తాతలకు, వారి సంతానానికి మరియు వారి సోదరులకు కూడా మేము (సన్మార్గం చూపాము). మేము వారిని (మా సేవ కొరకు) ఎన్నుకొని, వారికి ఋజుమార్గం వైపునకు మార్గదర్శకత్వం చేశాము.

**88.** ఇదే అల్లాహ్ మార్గదర్శకత్వం. దీని ద్వారా ఆయన తన దాసులలో తాను కోరిన వారికి సన్మార్గం చూపుతాడు. ఒకవేళ వారు అల్లాహ్ కు సాటి (భాగస్వాములను) కల్పిస్తే, వారు

---

[45] చూడండి, 37:123. ఇల్యాస్ (Elijah) ('అ.స.), హారూన్ ('అ.స.) సంతతికి చెందిన వారు. అతని నివాసం బఅల్బక్ నగరం. ఇల్యాస్ (ఏలియా) హిబ్రూ (యూదుల) ప్రవక్త. ఇతను ఫలస్తీన్ ఉత్తర భాగంలో అహబ్ మరియు అహాజియా రాజుల కాలంలో ఉన్నారు, (దాదాపు 9వ క్రీ. శకానికి ముందు). ఇతని తరువాత అల్-యస'అ (Elisha, 'అ.స.) ప్రవక్తగా వచ్చారు.

[46] లూ'త్ ('అ.స.) ఇబ్రాహీమ్ ('అ.స.) సోదరుడైన హారాన బిన్-ఆజర్ కుమారుడు. ఇబ్రాహీమ్ ('అ.స.), లూ'త్ ('అ.స.) యొక్క చిన్నాన్న. కాని అతను కూడా ఇబ్రాహీం ('అ.స.) యొక్క సంతతి లోని వారిగా పరిగణింపబడ్డారు. ఖుర్ఆన్ లో ఇటువంటి ఉదాహరణ మరొకటి ఉంది. ఇస్మా'యీల్ ('అ.స.) య'అఖూబ్ ('అ.స.) యొక్క తండ్రిగా పరిగణింపబడ్డారు. వాస్తవానికి అతను, య'అఖూబ్ ('అ.స.) యొక్క పెద్ద నాన్న (Uncle). ఇంకా చూడండి, 2:133.

చేసిన సత్కార్యాన్నీ వృథా అయి పోయేవి![47]

**89.** వీరే, మేము గ్రంథాన్ని, వివేకాన్ని మరియు ప్రవక్త పదవిని ప్రసాదించిన వారు. కాని వారు దీనిని (ఈ గ్రంథాన్ని/ప్రవక్త పదవిని) తిరస్కరించినందుకు! వాస్తవానికి మేము, దీనిని ఎన్నడూ తిరస్కరించని ఇతర ప్రజలను దీనికి కార్యకర్తలుగా నియమించాము[48].

**90.** ఇలాంటి వారే అల్లాహ్ మార్గదర్శకత్వం పొందినవారు. కావున నీవు వారి మార్గాన్నే అనుసరించు. వారితో ఇలా అను: "నేను దీనికి బదులుగా మీ నుంచి ఎలాంటి ప్రతిఫలాన్ని అడగను. ఇది కేవలం సర్వలోకాల (వారి) కొరకు ఒక హితోపదేశం మాత్రమే."

**91.** మరియు వారు: "అల్లాహ్, ఏ మానవుని పైననూ ఏమీ అవతరింపజేయ లేదు[49]." అని పలికినప్పుడు, వారు (అవిశ్వాసులు) అల్లాహ్ ను గురించి తగు రీతిలో అంచనా వేయలేదు. వారిలో ఇలా అను: "అయితే! మానవులకు జ్యోతి మరియు మార్గదర్శిని అయిన గ్రంథాన్ని, మూసాపై ఎవరు అవతరింపజేశారు? దానిని

---

[47] ఇక్కడ అల్లాహ్ (సు.తా.), 18 మంది ప్రవక్తలను పేర్కొని: "వారు షిర్క్ చేసి ఉంటే వారి సత్కార్యాలు వృథా అయి పోయేవి." అని అన్నాడు. ఇదే విధంగా అల్లాహుతా'ఆలా ము'హమ్మద్ ('స'అస) ను సంబోధించి అన్నదానికి చూడండి, 39:65.

[48] ఈ కార్యకర్తలు అంటే దైవప్రవక్త ('స'అస) యొక్క అనుచరు(ర'ది.'అన్హుమ్)లు మరియు తరువాత వచ్చే విశ్వాసులు అని వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు.

[49] చూడండి, 10:2 మరియు 17:94.

మీరు (యూదులు) విడి పత్రాలుగా చేసి (దానిలోని కొంత భాగాన్ని) చుపుతున్నారు మరియు చాలా భాగాన్ని దాస్తున్నారు. మరియు దాని నుండి మీకూ మరియు మీ తండ్రితాతలకూ తెలియని విషయాల జ్ఞానం ఇవ్వబడింది కదా?" ఇంకా ఇలా అను:"అల్లాహ్ యే (దానిని అవతరింపజేశాడు)." ఆ పిదప వారిని, వారి పనికిమాలిన వివాదంలో పడి ఆడుకోనివ్వు!

**92.** మరియు మేము అవతరింపజేసిన ఈ గ్రంథం (ఖుర్ఆన్) ఎన్నో శుభాలు గలది. ఇది ఇంతకు పూర్వం వచ్చిన గ్రంథాలలో మిగిలి ఉన్న సత్యాలను ధృవపరుస్తోంది మరియు ఇది ఉమ్ముల్ ఖురా (మక్కా)[50] మరియు దాని చుట్టు ప్రక్కలలో ఉన్నవారిని హెచ్చరించటానికి అవతరింపజేయబడింది. మరియు పరలోకము నందు విశ్వాసమున్న వారు దీనిని (ఈ గ్రంథాన్ని ) విశ్వసిస్తారు. మరియు వారు తమ నమాజ్ లను క్రమబద్ధంగా పాటిస్తారు.

**93.** మరియు అల్లాహ్ పై అబద్ధపు నింద మోపే వాని కంటే, లేదా తనపై ఏ దివ్య జ్ఞానం (వహీ) అవతరించక పోయినప్పటికీ: "నాపై దివ్యజ్ఞానం అవతరింప జేయబడుతుంది." అని చేప్పేవాని కంటే, లేదా: "అల్లాహ్ అవతరింప జేసినటువంటి

---

[50] అదే అల్లాహ్ (సు.తా.) ఆరాధన కొరకు మొట్టమొదట నిర్మించబడిన ఆలయం క'అబహ్. అదే ఖిబ్లా, అదే మక్కా. ('తబరీ - ఇబ్నె - 'అబ్బాస్ ర'ది.'అ.) కథనం ఆధారంగా). చూడండి, 3:96.

విషయాలను నేను కూడా అవతరింప జేయగలను." అని పలికే వాని కంటే, మించిన దుర్మార్గుడు ఎవడు? దుర్మార్గులు మరణ వేదనలో ఉన్నప్పుడు దేవదూతలు తమ చేతులు చాచి: "మీ ప్రాణాలను వదలండి! అల్లాహ్ పై అసత్యాలు పలుకుతూ ఉన్నందు వలన మరియు ఆయన సూచనల పట్ల అనాదరణ చూపటం వలన, ఈ రోజు మీకు అవమానకరమైన శిక్ష విధించబడుతుంది![51]" అని అంటూ ఉండే దృశ్యాన్ని నీవు చూడగలిగితే ఎంత బాగుండేది![52]

**94.** మరియు వాస్తవంగా, మేము మొదటి సారి మిమ్మల్ని పుట్టించినట్లే, మీరిప్పుడు మా వద్దకు ఒంటరిగా వచ్చారు. మరియు మేము ఇచ్చినదంతా, మీరు మీ వీపుల వెనుక వదలి వచ్చారు. మరియు మీరు అల్లాహ్ కు సాటిగా (భాగస్వాములుగా) కల్పించిన మీ సిఫారసు దారులను, మేము మీతో పాటు చూడటం లేదే! వాస్తవంగా ఇప్పుడు మీ మధ్య ఉన్న సంబంధాలన్నీ తెగి పోయాయి మరియు మీ భ్రమలన్నీ మిమ్మల్ని త్యజించాయి.

**95.** నిశ్చయంగా, ధాన్యమును మరియు ఖర్జూరపు బీజాన్ని చీల్చే (మొలకెత్త జేసే) వాడు అల్లాహ్

---

[51] ఇక్కడ పేర్కొన్న శిక్ష చనిపోయిన తరువాత మరియు పునరుత్థాన దినానికి ముందు ఉండే బ'ర్జఖ్ కాలంలో ఇవ్వబడే శిక్ష.

[52] చూడండి, 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 2, 'హదీస్' నం. 450 మరియు 422.

మాత్రమే. ఆయనే సజీవమైన దానిని, నిర్జీవమైన దాని నుండి తీస్తాడు. మరియు నిర్జీవమైన దానిని సజీవమైన దాని నుండి తీస్తాడు. ఆయనే, అల్లాహ్! అయితే మీరెందుకు మోసగింప బడుతున్నారు (సత్యం నుండి మరలింపబడుతున్నారు)?

**96.** ఆయనే (రాత్రి చీకటిని) చీల్చి ఉదయాన్ని తెచ్చేవాడు. మరియు రాత్రిని విశ్రాంతి కొరకు చేసినవాడు మరియు సూర్యుణ్ణి మరియు చంద్రుణ్ణి (కాల) గణన కొరకు నియమించిన వాడు[53]. ఇవన్నీ ఆ సర్వశక్తిమంతుని, సర్వజ్ఞుని, నియమకాలే!

**97.** మరియు ఆయనే మీ కొరకు చీకట్లలో - భూమి మీద మరియు సముద్రంలో - మార్గాలను తెలుసు కోవటానికి, నక్షత్రాలను పుట్టించాడు[54]. వాస్తవానికి, ఈ విధంగా మేము జ్ఞానవంతుల కొరకు మా సూచనలను వివరించి తెలిపాము.

**98.** మరియు ఆయనే మిమ్మల్ని ఒకే వ్యక్తి (ప్రాణి)

---

[53] చూడండి, 7:54, 10:5 36:40.

[54] నక్షత్రాలను గురించి అల్లాహ్ (సు.తా.) యొక్క మూడు ఆదేశాలను అబూ-ఖతాదా (ర.'ది.'అ) ఇలా వివరించారు: 1) దగ్గరి ఆకాశాన్ని మేము నక్షత్రాలతో అలంకరించాము 67:5, 2) షై'తానులను తరిమే కొరవిగా మరియు 3) ఆ ఆయత్ లో చెప్పింది - చీకట్లలో మార్గాలు తెలుసుకోవటానికి. కావున నక్షత్రాలలో ఎవరైనా ఈ మూడు తప్ప ఇతర ఉపయోగాలను వెతికితే! వారు తప్పు దారిలో పడ్డవారే. ('స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 4). ఇంకా చూడండి, అబూ దావూద్ 'హదీస్' నం. 3905. కాబట్టి నక్షత్రాల ద్వారా భవిష్యత్తు చెప్పడం మొదలైనవి ఊహాగానాలే! అవి షరీయత్ కు విరుద్ధమైనవి. కావున వీటిని మంత్రజాలపు ఒక భాగంగా పేర్కొనబడింది.

నుండి పుట్టించి, తరువాత నివాసం మరియు సేకరించబడే స్థలం[55] నియమించాడు. వాస్తవంగా, అర్థం చేసుకునే వారికి ఈ విధంగా మేము మా సూచనలను వివరించాము.

99. మరియు ఆయనే ఆకాశం నుండి వర్షాన్ని కురిపించాడు తరువాత దాని ద్వారా మేము సర్వలోకాల వృక్షకోటిని ఉద్భవింపజేశాము[56]. మరియు దాని నుండి మేము పచ్చని పైరును పండించాము. వాటిలో దట్టమైన గింజలను పుట్టించాము. మరియు ఖర్జూరపు చెట్ల గెలల నుండి క్రిందికి వ్రేలాడుతున్న పండ్ల గుత్తులను, ద్రాక్ష, జైతూన్ మరియు దానిమ్మ తోటలను (పుట్టించాము). వాటిలో కొన్ని ఒకదాని నొకటి పోలి ఉంటాయి, మరికొన్ని ఒకదాని నొకటి పోలి ఉండవు[57]. ఫలించినప్పుడు వాటి ఫలాలను మరియు వాటి పరిపక్వాన్ని గమనించండి. నిశ్చయంగా, వీటిలో విశ్వసించే వారికి సూచనలున్నాయి.

---

[55] ముస్తఖర్రున్: నివాసం, ముస్ తౌద'ఉన్: కూడబెట్టబడే స్థలం, కొట్టు, గిడ్డంగి లేక సేకరించబడే స్థలం. వ్యాఖ్యాతలు ముస్తఖర్రున్ అంటే తల్లి గర్భకోశం, లేక భూమి, అని మరియు ముస్ తౌద'ఉన్ అంటే నడుము/రొండి, లేక గోరి/సమాధి అని అభిప్రాయపడ్డారు.

[56] ప్రతి జీవిని అల్లాహ్ (సు.తా.) నీటి నుండి పుట్టించాడు. చూడండి, 21:30.

[57] అంటే కొన్ని విషయాలలో అవి ఒకదానికొకటి పోలి ఉన్నా, ఇతర విషయాలలో వారి మధ్య పోలికలు ఉండవు. అంటే వారి ఆకులు పోలి ఉండవచ్చు, కాని వాటి ఫలాల, రుచి, రంగు మరియు వాసన పరిమాణాల విషయంలో వేరుగా ఉండవచ్చు. ఉదా: వేర్వేరు రకాల మామిడి పండ్లు.

**100.** మరియు వారు, ఆయన (అల్లాహ్) సృష్టించిన జిన్నాతులను, అల్లాహ్ కే సాటిగా (భాగస్వాములుగా)కల్పిస్తున్నారు. మూఢత్వంతో ఆయనకు కుమారులు, కుమార్తెలు ఉన్నారు అని ఆరోపిస్తున్నారు[58] ఆయన సర్వలోపాలకు అతీతుడు వారి ఈ కల్పనలకు మహోన్నతుడు[59].

**101.** ఆయనే ఆకాశాలను మరియు భూమిని ఏ నమూనా లేకుండా ఆరంభించిన వాడు[60]. నిశ్చయంగా, ఆయనకు జీవన సహవాసియే (భార్యయే) లేనప్పుడు ఆయనకు కొడుకు ఎలా ఉండగలడు?[61] మరియు ప్రతి దానిని ఆయనే సృష్టించాడు[62]. మరియు ఆయనే ప్రతి విషయం గురించి బాగా తెలిసినవాడు.

**102.** ఆయనే అల్లాహ్! మీ ప్రభువు, ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయనే సర్వానికి సృష్టికర్త[63],కావునమీరుఆయననేఆరాధించండి.

---

[58] చూడండి, 19:92.

[59] సుబ్'హాన: సర్వలోపాలకు అతీతుడు, చూడండి, 2:32, 42:11 మరియు 112:4.

[60] బదీ'ఉ (అల్-బదీ'ఉ): ఆరంభకుడు, చూడండి, 2:117.

[61] చూడండి, 2:116 మరియు 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 6, 'హదీస్' నం. 9.

[62] చూడండి, 4:117, 19:44, 34:41, 36:60.

[63] 'ఖాలిఖ్ (అల్-'ఖాలిఖు): The Greatest Creator, The Creator of all things. సృష్టికర్త. చూడండి, 59:24. ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి. అల్- 'ఖల్లాఖ్, సృష్టిక్రియలో పరిపూర్ణుడు, సముచిత రూపం శక్తిసామర్థ్యాలను ఇచ్చి తీర్చి దిద్ది అత్యుత్తమంగా సృష్టించేవాడు. చూడండి, 15:86.

మరియు ఆయనే ప్రతి దాని కార్యకర్త[64].

**103.** ఏ చూపులు కూడా ఆయనను అందుకోలేవు[65], కాని ఆయన (అన్ని) చూపులను పరివేష్టించి ఉన్నాడు. మరియు ఆయన సూక్ష్మగ్రాహి, సర్వం తెలిసినవాడు[66].

**104.** వాస్తవానికి ఇప్పుడు మీ ప్రభువు తరఫు నుండి నిదర్శనాలు వచ్చాయి. కావున వాటిని ఎవడు గ్రహిస్తాడో తన మేలుకే గ్రహిస్తాడు! మరియు ఎవడు అంధుడిగా ఉంటాడో అతడే నష్టపోతాడు[67]. మరియు నేను మీ రక్షకుడను కాను."(అని అను).

**105.** మరియు వారు (అవిశ్వాసులు): "నీవు ఎవరి వద్దనో నేర్చుకున్నావు." అని అనాలనీ మరియు తెలివి గలవారికి (సత్యాన్ని) స్పష్టపరచుటకూను,

---

[64] వకీలున్ (అల్-వకీలు): కార్యకర్త, కార్యనిర్వాహకుడు, కార్యసాధకుడు, Trustee, Overseer, Guardian, సాక్షి, బాధ్యుడు, సంరక్షకుడు, ధర్మకర్త. చూడండి, 3:173.

[65] ఇహలోకపు జీవితంలో ఎవ్వరూ కూడా ఆయనను చూడలేరు. కాని పునరుత్థాన దినమున సత్పురుషుల ముఖాలు అల్లాహ్ (సు.తా.) ను చూసి కళకళలాడతుంటాయి, (75:22-23).

[66] అల్-ల'తీఫు: Un-Fathomable, Subtle, Gentle. సూక్ష్మగ్రాహి, అతి సూక్ష్మ గ్రహణ శక్తి గల, సూక్ష్మ బుద్ధిగల, విస్తారమైన తెలివి యుక్తిగల వాడు, అంటే అల్లాహ్ (సు.తా.) ప్రతి చిన్న దానిని తెలుసుకోగలడు. కాని ఆయనను ఎవ్వరూ తెలుసుకోలేరు. అల్ -ఖ'బీరు: సర్వపరిచితుడు, అంతా ఎరిగినవాడు, All-Aware, చూడండి, 6:18. అల్-ల'తీఫు, అల్'ఖబీరు: ఈ రెండు పదాలు ఖుర్ఆన్ లో చాలా మట్టుకు కలసి వచ్చాయి. ఇవి అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లు. ఇంకా చూడండి, 22:63, 31:16, 33:34 67:14.

[67] చూడండి, 17:15.

మేము మా సూచనలను ఈ విధంగా వివరిస్తూ ఉంటాము[68].

**106.** నీవు నీ ప్రభువు తరఫు నుండి అవతరింప జేయబడిన దివ్యజ్ఞానాన్ని (వహీని) అనుసరించు ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు మరియు అల్లాహ్ సాటి (భాగస్వాములను) కల్పించే వారి నుండి విముఖుడవగు.

**107.** మరియు అల్లాహ్ సంకల్పించి ఉంటే! వారు అల్లాహ్ కు సాటి కల్పించి ఉండేవారు కాదు[69]. మరియు మేము నిన్ను వారిపై రక్షకునిగా నియమించలేదు. నీవు వారి కొరకు బాధ్యుడవు (కార్యకర్తవు) కావు[70].

**108.** మరియు - అల్లాహ్ ను వదలి వారు ప్రార్థిస్తున్న ఇతరులను (వారి దైవాలను) - మీరు దూషించకండి. ఎందుకంటే, వారు ద్వేషంతో, అజ్ఞానంతో అల్లాహ్ ను దూషించ వచ్చు! ఈ విధంగా మేము ప్రతి జాతికి, వారి కర్మలు (ఆచారాలు) వారికి ఆకర్షణీయంగా కనబడేటట్లు

---

[68] చూడండి, 25:4-5. ఇంకా చూడండి ఈ ఆయత్ యొక్క తాత్పర్యం కొరకు, నోబుల్ ఖుర్ఆన్ మరియు ము'హమ్మద్ జూనాగఢీ, (మదీనా మునవ్వరహ్ ప్రచురణలు).

[69] చూడండి, 2:253 మరియు 6:35.

[70] అంటే నీకు వారిపై ఎట్టి అధికారం లేదు. ఒకవేళ దైవప్రవక్త ('స'అస) కు అల్లాహ్ (సు.తా.) ఇతరులపై అధికారం ఇచ్చి ఉంటే, అతను తన పినతండ్రి అబూ - 'తాలిబ్ ను బలవంతంగా ముస్లిం చేసి ఉండేవారు. ఎందుకంటే దైవప్రవక్త ('స'అస) తండ్రి వంటి తన పోషకుణ్ణి తెలిసి ఉండి కూడా నరకాగ్నిలోకి ఎలా పోనివ్వగలరు.

చేశాము. తరువాత వారి ప్రభువు వైపునకు వారి మరలింపు ఉంటుంది; అప్పుడు వారికి వారి చేష్టలు తెలుపబడతాయి.

**109.** మరియు వారు: "ఒకవేళ మా వద్దకు అద్భుత సూచన (మహిమ) వస్తే, మేము తప్పక విశ్వసిస్తాము." అని అల్లాహ్ పేరుతో గట్టి ప్రమాణాలు చేస్తారు. వారితో అను: "నిశ్చయంగా, అద్భుత సూచనలు (మహిమలు) అల్లాహ్ వశంలోనే ఉన్నాయి[71]. ఒకవేళ అవి (అద్భుత సూచనలు) వచ్చినా వారు విశ్వసించరని(ఓ ముస్లిములారా!) మీకు ఏవిధంగా గ్రహింపజేయాలి?"

**110.** మరియు వారు మొదటిసారి దీనిని ఎలా విశ్వసించలేదో, అదే విధంగా వారి హృదయాలను మరియు వారి కన్నులను మేము త్రిప్పి వేస్తాము మరియు మేము వారిని వారి తలబిరుసుతనంలో అంధులై తిరగటానికి వదలిపెడతాము.

**111.** మరియు ఒకవేళ మేము వారి వైపుకు దైవదూతలను దింపినా మరియు మరణించిన వారు వారితో మాట్లాడినా మరియు మేము ప్రతి వస్తువును వారి కళ్ళముందు సమీకరించినా[72] - అల్లాహ్ సంకల్పం లేనిదే - వారు విశ్వసించేవారు కారు. ఎందుకంటే, వాస్తవానికి వారిలో అనేకులు అజ్ఞానులు ఉన్నారు.

**112.** మరియు ఈ విధంగా మేము మానవుల నుండి

---

[71] చూడండి, 17:59.
[72] చూడండి, 10:96-97.

మరియు జిన్నాతుల నుండి, షైతానులను ప్రతి ప్రవక్తకు శత్రువులుగా చేశాము. వారు ఒకరినొకరు మోసపుచ్చు కోవటానికి ఇంపైన మాటలు చెప్పుకుంటారు. మరియు నీ ప్రభువు తలచుకుంటే వారిలా చేసేవారు కాదు. కావును వారిని వారి కల్పనలలో వదిలి పెట్టు[73].

**113.** మరియు పరలోక జీవితాన్ని విశ్వసించని వారి హృదయాలు ఇలాంటి (మోసం) వైపుకు మొగ్గాలని మరియు వారు దానితో సంతోష పడుతూ ఉండాలని మరియు వారు అర్జించేవి (దుష్టఫలితాలు) అర్జిస్తూ ఉండాలనీను.

**114.** (వారితో ఇలా అను): "ఏమీ? నేను అల్లాహ్ ను వదలి వేరే న్యాయాధిపతిని అన్వేషించాలా? మరియు ఆయనే మీపై స్పష్టమైన గ్రంథాన్ని అవతరింపజేశాడు కదా?" మరియు నిశ్చయంగా, ఇది (ఈ గ్రంథం) నీ ప్రభువు తరఫు నుండి సత్యాధారంగా అవతరింప జేయబడిందని పూర్వం గ్రంథ మొసంగబడిన ప్రజలకు బాగా తెలుసు![74] కావున నీవు సందేహించే వారిలో చేరకు.

**115.** మరియు సత్యం రీత్యా మరియు న్యాయం రీత్యా

---

[73] 'తబరీ (ర'హ్మ) వ్రాశారు ఎన్నో 'స'హీ'హ్ 'హదీస్'లు ఉన్నాయని. కొందరు దైవప్రవక్త ('స'అస) ను అడిగారు: "ఏమీ? మానవులలో కూడా షైతును ఉన్నారా?" అతను జవాబిచ్చారు: "అవును మరియు వారు జిన్నాతులలోని షైతానుల కంటే ఎక్కువ దుష్టులు." ఇంకా చూడండి, 25:30-31.

[74] చూడండి, 2:146.

నీ ప్రభువు వాక్కు పూర్తి అయ్యింది[75]. ఆయన వాక్కులను మార్చేవాడు ఎవ్వడూ లేడు. మరియు ఆయన సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు

**116.** మరియు భూమిలోని అధిక సంఖ్యాకులను నీవు అనుసరిస్తే వారు నిన్ను అల్లాహ్ మార్గం నుండి తప్పిస్తారు. వారు కేవలం ఊహలనే అనుసరిస్తున్నారు మరియు వారు కేవలం ఊహాగానాలు మాత్రమే చేస్తున్నారు[76].

**117.** నిశ్చయంగా, నీ ప్రభువు! ఆయనకు ఎవడు ఆయన మార్గం నుండి వైదొలగి ఉన్నాడో తెలుసు. మరియు ఎవడు సన్మార్గంలో ఉన్నాడనేది కూడా ఆయనకు బాగా తెలుసు.

**118.** కావున మీరు ఆయన సూచనలను (ఆయాత్ లను) విశ్వసించేవారే అయితే, అల్లాహ్ పేరు స్మరించబడిన దానినే తినండి.

**119.** మరియు మీకేమయింది? అల్లాహ్ పేరు స్మరించబడిన దానిని మీరెందుకు తిన కూడదు?

---

[75] కలిమ: అంటే వాగ్దానం. అల్లాహ్ (సు.తా.) చేసిన వాగ్దానం. "మూసా ('అ.స.) వంటి ఒక ప్రవక్తను అల్లాహుతా'ఆలా 'అరబ్బులలో నుండి లేవుతాడు." చూడండి, ఖుర్ఆన్ 2:42.

[76] అధిక సంఖ్యాకులు అనుసరించే మార్గం సరైన మార్గం కాకపోవచ్చు! దీనికి ఈ 'హదీస్' ఒక నిదర్శనం. దైవప్రవక్త ప్రవచనం: "నా అనుచరులు 73 శాఖలలో విభజింపబడతారు. వారిలో కేవలం ఒక శాఖ వారు మాత్రమే స్వర్గానికి పోతారు. మిగిలిన వారంతా నరకానికి పోతారు. స్వర్గానికి పోయేవారి గుర్తు ఏమిటంటే వారు నేనూ మరియు నా అనుచరులు అనుసరించిన మార్గాన్నే అనుసరిస్తారు." (సునన్ అబూ-దావూద్, 'హదీస్' నం. 4596. తిర్మిజీ').

వాస్తవానికి - గత్యంతరంలేని సంకట పరిస్థితులలో తప్ప - ఏవేవి మీకు (తినటానికి) నిషేధింప బడ్డాయో, మీకు విశదీకరించబడింది కదా? మరియు నిశ్చయంగా చాలామంది అజ్ఞానంతో (ఇతరులను) తమ ఇష్టానుసారంగా మార్గభ్రష్టత్వానికి గురి చేస్తున్నారు. నిశ్చయంగా, నీ ప్రభువు, ఆయనకు హద్దులు మీరి ప్రవర్తించేవారి గురించి బాగా తెలుసు.

120. మరియు పాపాన్ని - బహిరంగంగా గానీ, రహస్యంగా గానీ - చేయటాన్ని మానుకోండి. నిశ్చయంగా, పాపం అర్జించిన వారు తాము చేసిన దుష్కృత్యాలకు తగిన ప్రతిఫలం పొందగలరు

121. మరియు అల్లాహ్ పేరు స్మరించబడని దానిని తినకండి. మరియు అది (తినటం) నిశ్చయంగా పాపం. మరియు నిశ్చయంగా, మీతో వాదులాడటానికి షైతానులు తమ స్నేహితులను (అవులియాలను) ప్రేరేపింపజేస్తారు[77]. ఒకవేళ మీరు వారిని అనుసరిస్తే! నిశ్చయంగా, మీరు కూడా అల్లాహ్ కు సాటి (భాగస్వాములు) కల్పించిన వారవుతారు.

122. మరియు ఏమీ? ఒక మరణించిన వ్యక్తిని (అవిశ్వాసిని), మేము సజీవునిగా (విశ్వాసిగా) చేసి జ్యోతిని ప్రసాదించగా! దానితో ప్రజల మధ్య సంచరిస్తున్నవాడూ మరియు అంధకారంలో (అవిశ్వాసంలో) చిక్కుకొని, వాటి నుండి

[77] చూడండి, 2:14 మరియు 14:22.

బయటకురాజాలనివాడూఇద్దరూసమానులా?[78] ఇదేవిధంగా సత్యతిరస్కారులకు, వారు చేస్తున్న కర్మలు, మరోహరమైనవిగా చేయబడ్డాయి.

**123.** మరియు ఇదే విధంగా మేము ప్రతి నగరంలో, దానిలోని నేరస్థులైన పెద్దవారిని, కుట్రలు పన్నేవారిగా చేశాము[79]. మరియు వారు చేసే కుట్రలు కేవలం వారికే ప్రతికూలమైనవి, కాని వారది గ్రహించడం లేదు[80].

**124.** మరియు వారి వద్దకు ఏదైనా సూచన వచ్చినప్పుడు వారు: "అల్లాహ్ యొక్క సందేశహరులకు ఇవ్వబడినట్లు, మాకు కూడా (దివ్యజ్ఞానం)[81] ఇవ్వబడనంత వరకు మేము విశ్వసించము." అని అంటారు. తన సందేశాన్ని ఎవరిపై అవతరింపజేయాలో అల్లాహ్ కు బాగా తెలుసు. త్వరలోనే అపరాధులు అల్లాహ్ దగ్గర అవమానింపబడగలరు. మరియు వారి కుట్రల ఫలితంగా వారికి తీవ్రమైన శిక్ష విధించబడగలదు.

**125.** కావున అల్లాహ్ సన్మార్గం చూపదలచిన వ్యక్తి హృదయాన్ని ఇస్లాం కొరకు తెరుస్తాడు. మరియు ఎవరిని ఆయన మార్గభ్రష్టత్వంలో వదలగోరుతాడో

---

[78] ఈ ఆయత్ లో అల్లాహ్ (సు.తా.) సత్యతిరస్కారులను మృతులతో మరియు విశ్వాసులను సజీవులతో పోల్చాడు. చూడండి, 2:257, 11:24 మరియు 35:19-22.

[79] చూడండి, 34:31-33, 43:23 మరియు 71:22.

[80] చూడండి, 16:25 మరియు 29:13.

[81] అంటే ప్రవక్తృత్వం మరియు దివ్యజ్ఞానం (వ'హీ) అవతరింపజేయబడటం.

అతని హృదయాన్ని (ఇస్లాం కొరకు) - ఆకాశం పైకి ఎక్కేవాని వలే - బిగుతుగా అణచివేయబడినట్లు చేస్తాడు. ఈ విధంగా, అల్లాహ్! విశ్వసించని వారిపై మాలిన్యాన్ని రుద్దుతాడు.

**126.** మరియు ఇది నీ ప్రభువు యొక్క ఋజుమార్గం. వాస్తవానికి యోచించేవారికి, మేము ఈ సూచనలను వివరించాము.

**127.** వారి కొరకు వారి ప్రభువు వద్ద శాంతినిలయం (స్వర్గం) ఉంటుంది. మరియు వారు (మంచి) కర్మలుచేస్తున్నందుకుఆయనవారిసంరక్షకునిగా ఉంటాడు.

**128.** మరియు ఆయన వారందరినీ జమ చేసిన రోజు వారితో ఇలా అంటాడు: "ఓ జిన్నాతుల వంశీయులారా! వాస్తవంగా మీరు మానవులలో నుండి చాలామందిని వలలో వేసుకున్నారు[82]. అప్పుడు మానవులలోని వారి స్నేహితులు (అవులియా) అంటారు: "ఓ మా ప్రభూ! మేము పరస్పరం బాగా సుఖసంతోషాలు పొందాము. మరియు నీవు మా కొరకు నియమించిన గడువుకు మేమిప్పుడు చేరుకున్నాము." అప్పుడు అల్లాహ్ వారితో అంటాడు: "మీ నివాసం నరకాగ్నియే - అల్లాహ్ కోరితే తప్ప - మీరందు శాశ్వతంగా ఉంటారు![83] నిశ్చయంగా, నీ ప్రభువు మహా వివేచనాపరుడు, సర్వజ్ఞుడు."

---

[82] చూడండి, 36:60-62.
[83] చూడండి, 40:12.

129. ఈ విధంగా మేము దుర్మార్గులను - వారు అర్జించిన దానికి ఫలితంగా - పరస్పరం స్నేహితులు (అవులియా) గా ఉంచుతాము.

130. "ఓ జిన్నాతుల మరియు మానవుల వంశీయులారా! ఏమీ? నా సూచనలను మీకు వినిపించి, మీరు (నన్ను) కలుసుకునే ఈ దినమును గురించి హెచ్చరించే ప్రవక్తలు మీలో నుంచే మీ వద్దకు రాలేదా?"(అని అల్లాహ్ వారిని అడుగుతాడు). దానికి వారు: "(వచ్చారని!) మాకు వ్యతిరేకంగా స్వయంగా మేమే సాక్షులం." అని జవాబిస్తారు. మరియు వారిని ఈ ప్రాపంచిక జీవితం మోసపుచ్చింది. మరియు వారు వాస్తవానికి సత్యతిరస్కారులుగా ఉండేవారిని స్వయంగా తమకు వ్యతిరేకంగా తామే సాక్ష్యమిస్తారు.

131. ఇదంతా ఎందుకంటే! నీ ప్రభువు నగరాలను - వాటిలోని ప్రజలు సత్యాన్ని ఎరుగకుండా ఉన్నప్పుడు - అన్యాయంగా నాశనంగా చేయడు[84].

132. మరియు ప్రతి ఒక్కరికీ వారి కర్మల ప్రకారం స్థానాలు ఉంటాయి. మరియు నీ ప్రభువు వారి కర్మల పట్ల నిర్లక్ష్యంగా లేడు.

133. మరియు నీ ప్రభువు స్వయం సమృద్ధుడు[85],

---

[84] చూడండి, 16:26, 17:15, 35:24 మరియు 67:8-9.

[85] అల్-'గనియ్యు: Self-Sufficient, స్వయంసమృద్ధుడు, సర్వసంపన్నుడు, Free of Want, నిరుపేక్షాపరుడు, ఏ అక్కరా లేనివాడు, చూడండి, 2:263.

కరుణించే స్వభావం గలవాడు. ఆయన కోరితే, ఇతర జాతి వారి తరువాత మిమ్మల్ని పుట్టించినట్లు, మిమ్మల్ని తొలగించి మీకు బదులుగా మీ తర్వాత తాను కోరిన వారిని పుట్టించగలడు[86].

**134.** మీకు చేయబడిన వాగ్దానం తప్పక పూర్తయి తీరుతుంది. మీరు దాని (శిక్ష) నుండి తప్పించు కోలేరు.

**135.** ఇలా అను: "ఓ నా జాతి (విశ్వసించని) ప్రజలారా! మీరు (సరి అనుకున్నది) మీ శక్తి మేరకు చేయండి. మరియు నిశ్చయంగా (నేను సరి అనుకున్నది) నేనూ చేస్తాను[87]. ఎవరి పరిణామం సఫలీకృతం కాగలదో! మీరు త్వరలోనే తెలుసుకుంటారు. నిశ్చయంగా, దుర్మార్గులు ఎన్నడూ సాఫల్యం పొందరు."

**136.** మరియు ఆయన (అల్లాహ్) పుట్టించిన పంటల నుండి మరియు పశువుల నుండి, వారు అల్లాహ్ కొరకు కొంత భాగాన్ని నియమించి: "ఇది అల్లాహ్ కొరకు మరియు ఇది మా దేవతల (అల్లాహ్ కు వారు సాటి కల్పించినవారి) కొరకు." అని తమ ఊహలో చెబుతారు. వారి దేవతలకు చెందిన భాగం అల్లాహ్ కు చేరదు. మరియు అల్లాహ్ కు చెందిన భాగం వారి దేవతలకు చేరుతుంది.

---

[86] చూడండి, 4:133, 14:19, 35:15-17 మరియు 47:38.
[87] చూడండి, 11:121-122.

ఎలాంటి చెడు నిర్ణయాలు చేస్తున్నారు వీరు![88]

**137.** మరియు ఇదే విధంగా చాలా మంది బహుదైవారాధకులకు (ముష్రికీన్ లకు) తమ సంతాన హత్యను - వారు (అల్లాహ్ కు సాటి కల్పించిన) భాగస్వాములు - సరైనవిగా కనిపించేటట్లు చేశారు. ఇది వారిని నాశనానికి గురి చేయటానికి మరియు వారి ధర్మం వారికి సంశయాస్పదమైనదిగా చేయటానికి! అల్లాహ్ కోరితే వారు అలా చేసి ఉండేవారు కాదు. కావున నీవు వారిని వారి కల్పనలోనే వదలిపెట్టు[89].

**138.** మరియు వారు:"ఈ పశువులు మరియు ఈ పంటలు నిషిద్ధం చేయబడ్డాయి మేము కోరిన

---

[88] ముష్రిక్ ఖురైషులు తమ సేద్యపు పంటలలో మరియు ఇతర ఆదాయలలో కొంతభాగం అల్లాహ్ (సు.తా.) పేర, మరికొంత తమ కల్పిత దైవాల పేర నిర్ణయించేవారు. అల్లాహుతా'ఆలా పేర ఉన్న దానిని తమ దగ్గరి బంధువుల పై, పేదవారిపై మరియు అతిథులపై ఖర్చు చేసేవారు. కల్పిత దైవాల పేర ఉన్న దానిని, వారి పూజారుల మీద. కల్పిత దేవాల పేర ఉన్నదానిలో పంట సరిగ్గా పండకుంటే అల్లాహ్ (సు.తా.) పేర ఉన్నదాని నుండి తీసుకొని పూజారులకు ఇచ్చేవారు, కాని అల్లాహుతా'ఆలా పేర ఉన్నదానిలో తగ్గింపు అయితే అల్లాహ్ (సు.తా.) స్వయంసమృద్ధుడు, ఏమీ అక్కర లేనివాడనే వారు. అంటే తమ దగ్గరి బంధువులకు, పేదవారికి మరియు అతిథులకు ఇచ్చేవారు కాదు.

[89] అల్లాహ్ (సు.తా.) కోరితే, తాను కోరినట్లు చేయటానికి వారికి మార్గం చూపేవాడు. కాని అల్లాహుతా'ఆలా వారికి తెలివినిచ్చి, మంచి-చెడుల విచక్షణా శక్తినిచ్చి, వారికి తాము కోరిన మార్గాన్ని ఎన్నుకోవటానికి స్వాతంత్ర్యం ఇచ్చి, వారి కర్మల ప్రకారం వారి కొరకు స్వర్గ-నరకాలను ఏర్పాటు చేశాడు మరియు తన ప్రవక్తల మరియు దివ్యగ్రంథాల ద్వారా, ఈ విషయం మానవులకు విశదం కూడా చేశాడు.

వారు తప్ప ఇతరులు వీటిని తినరాదు." అని అంటారు. కొన్ని జంతువుల వీపులపై బరువు వేయటాన్ని (స్వారీచేయటాన్ని) నిషేధిస్తారు. మరి కొన్ని జంతువులను (వధించేటప్పుడు) వాటి మీద అల్లాహ్ పేరు ఉచ్చరించరు[90]. ఇవన్నీ వారు ఆయనపై కల్పించిన (అబద్ధాలు) మాత్రమే. ఆయన త్వరలోనే వారికి, వారి (అసత్య) కల్పనలకు తగిన ప్రతిఫలం ఇవ్వగలడు.

**139.** ఇంకా వారు ఇలా అంటారు: "ఈ పశువుల గర్భాలలో ఉన్నది కేవలం మా పురుషులకే ప్రత్యేకించబడింది. మరియు ఇది మా స్త్రీలకు నిషేధించబడింది. కాని ఒకవేళ అది మరణించినది అయితే, వారు (స్త్రీలు) దానిలో భాగస్థులు." ఆయన వారి ఈ ఆరోపణలకు త్వరలోనే వారికి ప్రతీకారం చేస్తాడు. నిశ్చయంగా, ఆయన మహావివేచనాపరుడు, సర్వజ్ఞుడు.

**140.** మూఢత్వం మరియు అజ్ఞానం వల్ల తమ సంతానాన్ని హత్య చేసే వారునూ మరియు

---

[90] చూడండి, 5:103. దీని అర్థమేమిటంటే ముష్రిక్ 'అరబ్బులు అల్లాహ్ (సు.తా.) ను ఏకైక అత్యున్నత దైవంగా విశ్వసించి, కొన్ని పశువులను వధించేటప్పుడు అల్లాహుతా'ఆలా పుర తీసుకునేవారు. కాని తాము కల్పించిన దైవాలకు బలి ఇచ్చేటప్పుడు, ఆ దైవాల పేర్లే తీసుకునేవారు. ఇదే విధంగా ఈ నాటి హిందువులు (ముష్రికులు), కూడా పరమేశ్వరుణ్ణి ఏకైక అత్యుత్నత దైవంగా విశ్వసిస్తున్నారు. కాని అల్లాహ్ (సు.తా.)కు భాగస్వాములను, ప్రతి కార్యనిర్వాహణకు ఒక దైవాన్ని కల్పించుకున్నారు. అల్లాహుతా'ఆలా అన్నాడు: "నేను ప్రతి పాపాన్ని - నేను తలచుకుంటే - క్షమిస్తాను! ఒక్క షిర్కు తప్ప."

అల్లాహ్ పై అసత్యాలు కల్పిస్తూ, తమకు అల్లాహ్ ఇచ్చిన జీవనోపాధిని నిషేధించుకున్న వారునూ, వాస్తవంగా నష్టానికి గురి అయిన వారే! నిశ్చయంగా వారు మార్గం తప్పారు. వారెన్నటికీ మార్గదర్శకత్వం పొందేవారు కారు.

**141.** మరియు ఆయనే పందిళ్ళ మీద ప్రాకే (ఎక్కించబడే) తీగలు మరియు పందిళ్ళ మీద ప్రాకని (ఎక్కించబడని) చెట్ల తోటలు మరియు ఖర్జూరపు చెట్లు మరియు వివిధ రకాల రుచి గల పంటలు మరియు జైతూన్ (ఆలివ్), దానిమ్మ చెట్లను పుట్టించాడు. అవి కొన్ని విషయాలలో ఒకదానితో ఒకటి పోలి ఉంటాయి. మరికొన్ని విషయాలలో ఒకదానితో ఒకటి పోలి ఉండవు[91]. వాటికి ఫలాలు వచ్చినపుడు వాటి ఫలాలను తినండి. కానీ వాటి కోత దినమున (ఫలకాలంలో) వాటి హక్కు (జకాత్) చెల్లించండి[92]. మరియు వృథాగా ఖర్చు చేయకండి. నిశ్చయంగా, ఆయన వృథా ఖర్చు చేసే వారంటే ఇష్టపడడు.

**142.** మరియు పశువులలో కొన్ని బరువు మోయటానికి, మరికొన్ని చిన్నవి (భారం మోయ లేనివి) ఉన్నాయి. అల్లాహ్ మీకు జీవనోపాధికి ఇచ్చిన వాటిని తినండి. మరియు షైతాన్ అడుగుజాడలలో నడవకండి. నిశ్చయంగా, వాడు మీకు బహిరంగ

---

[91] చూడండి, 6:99 వ్యాఖ్యానం 2.

[92] ఈ 'జకాత్ కొందరు ధర్మవేత్తల ప్రకారం 1/10. ఒకవేళ నీటిని కుంటల నుండి లేక నదుల నుండి తీసుకుంటే! కాని ఒకవేళ బావి నీరు, బోర్ వెల్ నీరు తీసుకుంటే 1/20 వంతు.

శత్రువు!

**143.** (పెంటి-పోతు కలిసి) ఎనిమిది రకాలు (జతలు)[93]. అందులో గొర్రెలలో నుండి రెండు (పెంటి - పోతు) మరియు మేకలలో నుండి రెండు (పెంటి-పోతు). వారిని అడుగు: "ఏమీ? ఆయన నిషేధించింది, రెండు మగవాటినా? లేక రెండు ఆడవాటినా? లేక ఆ రెండు ఆడవాటి గర్భాలలో ఉన్న వాటినా?[94] మీరు సత్యవంతులే అయితే, నాకు సరైన జ్ఞానంతో తెలుపండి."

**144.** "మరియు ఒంటెలలో రెండు (పెంటి-పోతు) మరియు ఆవులలో రెండు (పెంటి-పోతు)[95]." వారిని అడుగు: "ఏమీ? ఆయన నిషేధించింది, రెండు మగవాటినా లేక రెండు ఆడవాటినా? లేక ఆ రెండింటి గర్భాలలో ఉన్నవాటినా? అల్లాహ్ ఈ విధంగా ఆజ్ఞాపించి నపుడు, మీరు సాక్షులుగా ఉంటిరా? లేకపోతే! జ్ఞానం లేకుండా ప్రజలను పెడమార్గం పట్టించటానికి అల్లాహ్ పేరుతో

---

[93] అరబ్బీ భాషలో ఒకే రమైన ఆడ-మగలను కలిపి జత ('జౌజ్), అంటారు. ఆ రెండింటిలోని, ప్రతి ఒక్క దానిని కూడా 'జౌజ్, అని అంటారు. అంటే జతలో నుండి ఒకటి. ఎందుకంటే, ఒకటి మరొకదాని జతకారి. ఇక్కడ ఆ జతలో ప్రతి ఒక్కటి అనే అర్థంలో ఉపయోగించబడింది.

[94] ముష్రికులు కొన్ని పశువులను తమంతట తామే నిషిద్ధం ('హరాం) చేసుకొని ఉండిరి. కావున ఇక్కడ వారితో ఈ ప్రశ్న అడుగబడుతోంది. ఎందుకంటే, అల్లాహ్(సు.తా.) వీటిలో దేనినీ కూడా 'హరామ్ చేయలేదు

[95] ఈ నాలుగు జతలు కలిసి మొత్తం ఎనిమిది పశువులు అవుతాయి.

అబద్ధాన్ని కల్పించే వ్యక్తి కంటే మించిన దుర్మార్గుడెవడు? నిశ్చయంగా, అల్లాహ్ దుర్మార్గులకు సన్మార్గం చూపడు."

**145.** (ఓ ప్రవక్తా!) వారికి తెలుపు: "నాపై అవతరింపజేయబడిన దివ్యజ్ఞానంలో (వహీలో): ఆహారపదార్థాలలో చచ్చిన జంతువు, కారిన రక్తం, పందిమాంసం - ఎందుకంటే అది అపరిశుద్ధమైనది (రిజ్స్); లేక అల్లాహ్ కు అవిధేయతకు పాల్పడి-ఆయన పేరుతో గాక-ఇతరుల పేరుతో కోయబడిన జంతువు తప్ప, ఇతర వాటిని తినటాన్ని నిషేధించబడినట్లు నేను చూడలేదు. కాని ఎవడైనా గత్యంతరం లేని పరిస్థితులలో దుర్నీతికి ఒడిగట్టకుండా, ఆవశ్యకత వలన హద్దులు మీరకుండా (తింటే) నీ ప్రభువు నిశ్చయంగా, క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత[96].

**146.** "మరియు యూదమతం అవలంబించిన వారికి మేము గోళ్ళు ఉన్న అన్ని జంతువులను నిషేధించాము[97]. మరియు వారికి ఆవు మరియు మేకలలో, వాటి వీపులకు లేదా ప్రేగులకు తగిలి వున్న మరియు ఎముకలలో మిశ్రమమై ఉన్న క్రొవ్వు తప్ప, మిగతా (క్రొవ్వును)

---

[96] చూడండి, 2:173 మరియు 5:3

[97] గోళ్ళు ఉన్న జంతువులు అంటే, వాటి వ్రేళ్ళు విడివడిగా లేని జంతువులు ఉదా. ఒంటెలు, బాతులు, నిప్పుకోడి (ఉష్ట్రపక్షి), ఆవులు మరియు మేకలు మొదలైనవి, యూదుల కొరకు 'హరామ్ చేయ బడ్డాయి. కేవలం వ్రేళ్ళు విడిగా ఉన్న పశుపక్షులు మాత్రమే వారికి 'హలాల్ చేయబడ్డాయి.

నిషేధించాము. ఇది వారి అక్రమాలకు విధించిన శిక్ష. మరియు నిశ్చయంగా, మేము సత్యవంతులము!"

**147.** (ఓ ముహమ్మద్!) ఒకవేళ వారు నిన్ను అసత్యుడవని తిరస్కరిస్తే![98] నీవు వారితో ఇలా అను: "మీ ప్రభువు కారుణ్య పరిధి సువిశాలమైనది. కాని ఆయన శిక్ష పాపిష్ఠి ప్రజలపై పడ కుండా నివారించబడదు."

**148.** అల్లాహ్ కు సాటి (భాగస్వాములు) కల్పించేవారు అంటారు: "ఒకవేళ అల్లాహ్ కోరితే మేము గానీ, మా తండ్రితాతలు గానీ ఆయనకు సాటి కల్పించేవారమూ కాము మరియు దేనినీ నిషేధించి ఉండేవారమూ కాము." వారికి పూర్వం వారు కూడా మా శిక్షను రుచి చూడనంత వరకు ఇదే విధంగా తిరస్కరించారు. వారిని అడుగు: "మీ వద్ద ఏదైనా (రూఢీ అయిన) జ్ఞానం ఉందా! ఉంటే మా ముందు పెట్టండి. మీరు కేవలం కల్పనలను అనుసరిస్తున్నారు మరియు మీరు కేవలం ఊహాగానాలే చేస్తున్నారు."

**149.** ఇలా అను: "రూఢీ అయిన ప్రమాణం అల్లాహ్ వద్దనే ఉంది. ఆయన గనక తలచుకుని ఉంటే మీ అందరికీ సన్మార్గం చూపి ఉండేవాడు."

**150.** (ఇంకా) ఇలా అను: " 'నిశ్చయంగా, అల్లాహ్ ఈ వస్తువులను నిషేధించాడు.' అని సాక్ష్యమిచ్చే మీ సాక్షులను తీసుకొని రండి." ఒకవేళ వారు అలా

---

[98] చూడండి, 3:93.

సాక్ష్యమిస్తే, నీవు వారితో కలిసి సాక్ష్యమివ్వకు. మరియు మా సూచనలను అసత్యాలని తిరస్కరించే వారి మరియు పరలోకము నందు విశ్వాసం లేని వారి మరియు ఇతరులను తమ ప్రభువుకు సమానులుగా నిలబెట్టే వారి మనోవాంఛలను నీవు ఏ మాత్రం అనుసరించకు!

151. ఇలా అను: "రండి మీ ప్రభువు మీకు నిషేధించి వున్న వాటిని మీకు వినిపిస్తాను: 'మీరు ఆయనకు సాటి (భాగస్వాములను) కల్పించకండి[99]. మరియు తల్లిదండ్రులతో మంచిగా ప్రవర్తించండి. మరియు పేదరికానికి భయపడి మీ సంతానాన్ని చంపకండి[100]. మేమే మీకూ మరియు వారికి కూడా జీవనోపాధిని ఇచ్చేవారము మరియు బహిరంగంగా గానీ లేదా దొంగచాటుగా గానీ అశ్లీలమైన(సిగ్గుమాలిన) పనులను సమీపించకండి. అల్లాహ్ నిషేధించిన ప్రాణిని, న్యాయం కొరకు తప్ప చంపకండి[101]. మీరు అర్థం చేసుకోవాలని ఈ విషయాలను ఆయన మీకు ఆజ్ఞాపిస్తున్నాడు.

152. "'మరియు అనాథుడు తన యుక్తవయస్సుకు

[99] షిర్క్: ఇతరులను అల్లాహ్ (సు.తా.)కు సాటి (భాగస్వాములుగా) కల్పించటం. అది మహాపాపం. దాని కెట్టి పరిహారం లేదు. అది క్షమింపబడని పాపం. షిర్కు చేసే వారికి స్వర్గం 'హరాం మరియు నరకం అనివార్యం చేయబడ్డాయి. ఈ విషయం దివ్యఖుర్‌ఆన్ లో మాటిమాటికి ఎన్నోసార్లు విశదీకరించబడింది.

[100] అంటే ఫామిలీ ప్లానింగ్ కొరకు చేసే అబార్షన్లు మొదలైనవి.

[101] చూడండి, 2:179.

చేరనంత వరకు అతని ఆస్తిని బాగు పరచటానికి తప్ప ఇతర ఉద్దేశ్యంతో సమీపించకండి. కొలవటంలో మరియు తూచటంలో న్యాయాన్ని పాటించండి. ఏ ప్రాణిపై గడూ మేము దాని శక్తికి మించిన భారాన్ని మోపము. పలికితే న్యాయమే పలకండి. అది మీ దగ్గరి బంధువుకు (ప్రతికూలమైనది) అయినా సరే! అల్లాహ్ తో చేసిన ఒడంబడికను పూర్తి చేయండి. మీరు హితోపదేశం స్వీకరించాలని ఆయన మీకు ఈ విషయాలను ఆజ్ఞాపిస్తున్నాడు.

153. " 'మరియు నిశ్చయంగా, ఇదే ఋజుమార్గం, కావున మీరు దీనినే అనుసరించండి. ఇతర మార్గాలను అనుసరించకండి. అవి మిమ్మల్ని ఆయన మార్గం నుండి తప్పిస్తాయి. మీరు భయభక్తులు కలిగి ఉండాలని ఆయన మిమ్మల్ని ఈ విధంగా ఆజ్ఞాపిస్తున్నాడు.' "

154. తరువాత మేము మూసాకు - సజ్జనులపై మా అనుగ్రహాన్ని పూర్తి చేయటానికి, ప్రతి విషయాన్ని వివరించటానికి మరియు మార్గదర్శకత్వం మరియు కరుణను చూపటానికి మరియు వారు తమ ప్రభువును దర్శించవలసి ఉన్నదానిని విశ్వసించటానికి - గ్రంథాన్ని ప్రసాదించాము.

155. మరియు ఇదేవిధంగా శుభప్రదమైన ఈ గ్రంథాన్ని (ఖుర్ఆన్'ను) అవతరింప జేశాము. కావున దీనిని అనుసరించి, భయభక్తులు కలిగి ఉంటే, మీరు కరుణింపబడవచ్చు!

156. లేకుంటే మీరు (అరబ్బులు): "వాస్తవానికి మాకు

పూర్వం ఉన్న రెండు వర్గాల వారికి (యూదులకు మరియు క్రైస్తవులకు) గ్రంథం అవతరింప జేయబడింది, కాని వారు చదివేదేమిటో మేము ఎరుగము." అని అంటారని!

**157.** లేదా మీరు: "ఒకవేళ నిశ్చయంగా, మాపై గ్రంథం అవతరింప జేయబడి ఉండే మేమూ వారి కంటే ఉత్తమరీతిలో సన్మార్గం మీద నడిచి ఉండేవారము." అని అంటారని. కాబట్టి వాస్తవానికి ఇప్పుడు మీ ప్రభువు తరఫు నుండి మీ వద్దకు ఒక స్పష్టమైన ప్రమాణం, మార్గదర్శకత్వం మరియు కారుణ్యం (ఈ ఖుర్ఆన్) వచ్చింది. ఇక అల్లాహ్ సూచనలను అసత్యాలని పలికే వాడికంటే, వాటి పట్ల వైముఖ్యం ప్రదర్శించే వాడి కంటే, మించిన దుర్మార్గుడెవడు? కాబట్టి మా సూచనల పట్ల విముఖత చూపేవారికి, వారి ఈ వైముఖ్యానికి ఫలితంగా భయంకరమైన శిక్ష విధిస్తాము.

**158.** ఏమీ? వారు తమ వద్దకు దేవదూతలు రావాలని గానీ, లేక నీ ప్రభువు రావాలని గానీ, లేదా నీ ప్రభువు యొక్క కొన్ని (బహిరంగ) నిదర్శనాలు రావాలని గానీ ఎదురు చూస్తున్నారా? నీ ప్రభువు యొక్క కొన్ని (బహిరంగ) నిదర్శనాలు వచ్చే రోజున, పూర్వం విశ్వసించకుండా ఆ రోజున విశ్వసించిన వ్యక్తికీ, లేదా విశ్వసించి కూడా ఏ మంచినీ సంపాదించుకోని వ్యక్తికీ, తన విశ్వాసం వల్ల (ఆ రోజు) ఏ ప్రయోజనం చేకూరదు. వారితో

ఇలా అను: "మీరు నిరీక్షించండి. నిశ్చయంగా, మేము కూడా నిరీక్షిస్తాము[102]."

**159.** నిశ్చయంగా, ఎవరైతే తమ ధర్మంలో విభేదాలు కల్పించుకొని, వేర్వేరు తెగలుగా చీలి పోయారో, వారితో నీకు ఎలాంటి సంబంధం లేదు. నిశ్చయంగా, వారి వ్యవహారం అల్లాహ్ ఆధీనంలో ఉంది. తరువాత ఆయనే వారు చేస్తూ వున్న కర్మలను గురించి వారికి తెలుపుతాడు[103].

**160.** ఎవడు ఒక సత్కార్యం చేస్తాడో, అతనికి దానికి పదిరెట్లు ప్రతిఫలం ఉంటుంది. మరియు ఎవడు ఒక పాపకార్యం చేస్తాడో, అతనికి దానంతటి శిక్షయే ఉంటుంది. మరియు వారికెలాంటి అన్యాయం జరుగదు[104].

**161.** వారితో ఇలా అను: "నిశ్చయంగా, నా ప్రభువు నాకు ఋజుమార్గం వైపునకు మార్గదర్శకత్వం చేశాడు. అదే సరైన ధర్మం. ఏకదైవ సిద్ధాంతమైన ఇబ్రాహీమ్ ధర్మం. అతను అల్లాహ్ కు సాటి కల్పించే వారిలో చేరినవాడు కాడు!"

**162.** (ఇంకా) ఇలా అను: "నిశ్చయంగా నా నమాజ్

---

[102] చూడండి, 40:84-85 మరియు 47:18. ఇంకా చూడండి, 'స. బు'ఖారీ, పు.6 'హ.నం.159 మరియు పు. 9 'హ.నం. 245.

[103] చూడండి, 3:105.

[104] చూడండి, 6:12. ఇంకా చూడండి, 'స. బు'ఖారీ, పు.8, 'హ.నం. 498.

నా బలి (ఖుర్బానీ)[105], నా జీవితం మరియు నా మరణం, సర్వలోకాలకు ప్రభువైన అల్లాహ్ కొరకే!

**163.** "ఆయనకు ఎలాంటి భాగస్వామి(సాటి) లేడు మరియు నేను ఇదే విధంగా ఆదేశించబడ్డాను మరియు నేను అల్లాహ్ కు విధేయుడను (ముస్లింను) అయిన వారిలో మొట్టమొదటి వాడను![106]"

**164.** ఇలా అను: "ఏమీ? నేను అల్లాహ్ ను వదలి ఇతరులను ప్రభువులుగా అర్థించాలా? ఆయనే ప్రతి దానికీ ప్రభువు! ప్రతి వ్యక్తీ తాను సంపాదించిందే అనుభవిస్తాడు. మరియు బరువు మోసేవాడు

---

[105] నుసుకున్: Ritual, బలి, ఉపహారం, అర్పణ, భక్తి మరియు ఆరాధన యొక్క ఇతర అన్నీ రూపాలకు కూడా వర్తిస్తుంది.

[106] ఈ విధంగా ఎంతో మంది ప్రవక్తలు అన్నారు. "మేము ఇలాంటి వహీ ప్రవక్తలందరికీ పంపాము." అని అల్లాహ్ (సు.తా.) అన్నాడు. చూడండి, 21:25; నూ'హ్ ('అ.స.) ఇదే ప్రకటించారు, 10:72; ఇబ్రాహీమ్ ('అ.స.) కూడా ఇలాగే అన్నారు, 2:131; ఇబ్రాహీమ్ మరియు య'అఖూబ్ ('అ.స.) కూడా తమ సంతానంతో ఇదే విధంగాఅన్నారు, 2:132; యూసుఫ్ ('అ.స.) ఇలాగే ప్రార్థించారు, 12:101; మూసా ('అ.స.) ఇలాగే తన జాతివారితో అన్నారు 10:84; మరియు 'ఈసా('అ.స.)కూడా తన 'హవారియ్యూలతో ఇలాగే అన్నారు, 5:111.

ఎవ్వడూ ఇతరుల బరువును మోయడు[107]. చివరకు మీరంతా మీ ప్రభువు వైపునకే మరలి పోవలసి ఉంది. అప్పుడు ఆయన మీరు ఏ విషయాలను గురించి భేదాభిప్రాయాలు కలిగి ఉండేవారో, వాటిని మీకు తెలియజేస్తాడు."

**165.** మరియు ఆయనే మిమ్మల్ని భూమి మీద ఉత్తరాధికారులుగా నియమించి[108] - మీకిచ్చిన దానితో మిమ్మల్ని పరీక్షించటానికి - మీలో కొందరికి మరికొందరిపై ఉన్నత స్థానాన్ని ఇచ్చాడు. నిశ్చయంగా, నీ ప్రభువు శిక్ష విధించటంలో అతి శీఘ్రుడు, మరియు నిశ్చయంగా, ఆయన క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

---

[107] అల్లాహ్(సు.తా.) ప్రతి ఒక్కనికి అతని కర్మలకు తగిన ప్రతిఫలమిస్తాడు. మంచి చేసిన వానికి మంచి ఫలితం మరియు చెడు చేసిన వానికి తగిన శిక్ష. అల్లాహుతా'ఆలా ఒకని పాపభారాన్ని మరొకనిపై మోపడు. ఏ వ్యక్తి కూడా ఇతరుల పాపభారాన్ని మోయడు. ఏ వ్యక్తిపై కూడా-అతడు ప్రవక్త అయినా సరే - ఇతరుల పాపభారం మోపబడదని అల్లాహ్(సు. తా.) ఈ ఆయత్ లో స్పష్టంగా తెలుపుతున్నాడు. అంటే మానవుల పాపభారాలను మోయటానికి 'ఈసా('అ.స.) సిలువపై ఎక్కారనే క్రైస్తవుల అపోహను ఈ ఆయత్ ఖండిస్తోంది.

[108] చూడండి, 2:30 వ్యాఖ్యానం 1.

# 7. అల్-అరాఫ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. అలిఫ్ - లామ్ - మీమ్ - సాద్![1]
2. (ఓ ముహమ్మద్!) ఈ గ్రంథం నీపై అవతరింప జేయబడింది. కావున దీనిని గురించి నీ హృదయంలో ఏ విధమైన సంకోచం ఉండనివ్వకు; ఇది నీవు (సన్మార్గం నుండి తప్పేవారికి) హెచ్చరిక చేయటానికి (అవతరింపజేయబడింది); మరియు ఇది విశ్వాసుల కొరకు హితోపదేశం.
3. (ప్రజలారా!) మీ ప్రభువు తరఫు నుండి మీ కొరకు అవతరింప జేయబడిన దానిని (ఈ ఖుర్ఆన్ ను) అనుసరించండి. మరియు ఆయన (అల్లాహ్)ను కాదని ఇతర స్నేహితులను (సహాయకులను) అనుసరించకండి. మీరు ఎంతో తక్కువగా ఈ హితబోధను స్వీకరిస్తున్నారు!
4. మరియు మేము ఎన్నో నగరాలను (వాటి నేరాలకు గాను) నాశనం చేశాము. వారిపై, మా శిక్ష (ఆకస్మాత్తుగా) రాత్రివేళలో గానీ, లేదా మధ్యాహ్నం వారు విశ్రాంతి తీసుకునే సమయంలో గానీ వచ్చిపడింది.

---

[*] [అల్ అరాఫ్ – శిఖరములు, ఎత్తైన ప్రదేశాలు]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

5. వారిపై మా శిక్ష పడినప్పుడు వారి రోదన: "నిశ్చయంగా, మేము అపరాధులంగా ఉండే వారం!" అని అనడం తప్ప మరేమీ లేకుండింది![2]
6. కావున మేము ఎవరి వద్దకు మా సందేశాన్ని (ప్రవక్తను) పంపామో, వారిని తప్పక ప్రశ్నిస్తాము. మరియు నిశ్చయంగా, ప్రవక్తలను కూడా ప్రశ్నిస్తాము[3].
7. అప్పుడు (జరిగిందంతా) వారికి పూర్తి జ్ఞానంతో వివరిస్తాము. ఎందుకంటే, మేము (ఎక్కడనూ, ఎప్పుడునూ) లేకుండా లేము[4].
8. మరియు ఆ రోజు (కర్మల) తూకం న్యాయంగా జరుగుతుంది. కావున ఎవరి తూనికలు బరువుగా ఉంటాయో అలాంటి వారే సఫలీకృతులు[5].
9. మరియు ఎవరి తూనికలు తేలికగా ఉంటాయో, అలాంటి వారే తమను తాము నష్టానికి గురి చేస్తుకున్నవారు[6]. ఎందుకంటే, వారు మా సూచనలను దుర్మార్గంతో తిరస్కరిస్తూ ఉండేవారు.
10. మరియు వాస్తవానికి మేము మిమ్మల్ని భూమిలో స్థిరపరచాము. మరియు అందులో మీకు జీవన

---

[2] కాని అప్పుడది వారికి ఏ విధంగాను పనికిరాదు. చూడండి, 40:85.
[3] చూడండి, 5:109.
[4] అంటే అల్లాహ్ (సు.తా.)కు ప్రతి ప్రత్యక్ష - పరోక్ష, గోచర - అగోచర, విషయాల జ్ఞానం ఉంది. అల్లాహుతా'ఆలా తన జ్ఞానంతో ప్రతిచోట ఉంటాడు.
[5] చూడండి, 101:6-7 మరియు 'స. బు'ఖారీ, పు. 9, 'హ. 652.
[6] చూడండి, 101:8-11.

వసతులను కల్పించాము (అయినా) మీరు కృతజ్ఞత చూపేది చాలా తక్కువ.

**11.** మరియు వాస్తవానికి మేము మిమ్మల్ని సృష్టించాము. పిదప మీ రూపాన్ని తీర్చిదిద్దాము. ఆ పిదప దైవదూతలను: "మీరు ఆదమ్ కు సాష్టాంగం (సజ్దా) చేయండి!" అని ఆదేశించగా, ఒక్క ఇబ్లీస్ తప్ప అందరూ సాష్టాంగం (సజ్దా) చేశారు, అతడు సాష్టాంగం చేసేవారిలో చేరలేదు[7].

**12.** (అప్పుడు అల్లాహ్) అన్నాడు: "(ఓ ఇబ్లీస్!) నేను ఆజ్ఞాపించినప్పటికీ, సాష్టాంగం చేయకుండా నిన్ను ఆపింది ఏమిటి?" దానికి (ఇబ్లీస్): "నేను అతని కంటే శ్రేష్ఠుడను. నీవు నన్ను అగ్నితో సృష్టించావు మరియు అతనిని నీవు మట్టితో సృష్టించావు." అని జవాబిచ్చాడు[8].

**13.** (అప్పుడు అల్లాహ్) ఆజ్ఞాపించాడు: "నీవిక్కడ నుండి దిగిపో! ఇక్కడ గర్వపడటం నీకు తగదు, కావున వెళ్ళిపో! నిశ్చయంగా, నీవు నీచులలో చేరావు!"

**14.** (ఇబ్లీస్) ఇలా వేడుకున్నాడు: "వారు తిరిగి లేపబడే (పునరుత్థాన) దినం వరకు నాకు వ్యవధినివ్వు!"

**15.** (అల్లాహ్) సెలవిచ్చాడు: "నిశ్చయంగా, నీకు వ్యవధి ఇవ్వబడుతోంది!"

---

[7] చూడండి, 2:30-34.
[8] చూడండి, 18:50, 38:76. అతడు (ఇబ్లీస్) జిన్నాతులలోని వాడు.

16. (దానికి ఇబ్లీస్) అన్నాడు: "నీవు నన్ను మార్గభ్రష్టత్వంలో వేసినట్లు, నేను కూడా వారి కొరకు నీ ఋజుమార్గంపై మాటువేసి కూర్చుంటాను!"

17. "తరువాత నేను వారి ముందు నుండి, వారి వెనుక నుండి, వారి కుడివైపు నుండి మరియు వారి ఎడమ వైపు నుండి, వారి వైపుకు వస్తూ ఉంటాను. మరియు వారిలో అనేకులను నీవు కృతజ్ఞులుగా పొందవు[9]!"

18. (అల్లాహ్) జవాబిచ్చాడు, "నీవిక్కడి నుండి అవమానింపబడి, బహిష్కృతుడవై వెళ్ళిపో! వారిలో ఎవరైతే నిన్ను అనుసరిస్తారో! అలాంటి మీ వారి అందరితో నిశ్చయంగా, నేను నరకాన్ని నింపుతాను."

19. మరియు : "ఓ ఆదమ్! నీవు మరియు నీ భార్య ఈ స్వర్గంలో ఉండండి. మరియు మీద్దరూ మీ ఇచ్ఛానుసారంగా దీనిలోని (ఫలాలను) తినండి. కాని ఈ వృక్షాన్ని సమీపించకండి![10] అలా చేస్తే మీరు దుర్మార్గులలో చేరి పోతారు."

20. ఆ పిదప షైతాన్ వారిద్దరి చూపులకు మరుగుగా ఉన్న వారిద్దరి మర్మాంగాలను వారికి బహిర్గతం చేయటానికి, రహస్యంగా వారి చెవులలో అన్నాడు: "మీరిద్దరూ దైవదూతలు అయిపోతారని, లేదా మీరిద్దరూ శాశ్వత జీవితాన్ని పొందుతారని మీ

---

[9] చూడండి, 34:20.
[10] చూడండి, 20:120.

ప్రభువు, మీ ఇద్దరినీ ఈ వృక్షం నుండి నివారించాడు[11]!"

21. మరియు (షైతాన్) వారిద్దరితో ప్రమాణం చేస్తూ పలికాడు: "నిశ్చయంగా, నేను మీ ఇద్దరి శ్రేయోభిలాషిని!"

22. ఈ విధంగా వారిద్దరిని మోసపుచ్చి, తన (పన్నుగడ) వైపునకు త్రిప్పుకున్నాడు. వారిద్దరూ ఆ వృక్షమును (ఫలమును) రుచి చూడగానే వారిద్దరి మర్మాంగాలు వారికి బహిర్గత మయ్యాయి. అప్పుడు వారు తమ (శరీరాల)పై స్వర్గపు ఆకులను కప్పుకోసాగారు. మరియు వారి ప్రభువు వారిద్దరినీ పిలిచి అన్నాడు: "ఏమీ? నేను మీ ఇద్దరినీ ఈ చెట్టు వద్దకు పోవద్దని నివారించలేదా? మరియు నిశ్చయంగా, షైతాన్ మీ ఇద్దరి బహిరంగ శత్రువని చెప్పలేదా?"

23. వారిద్దరూ ఇలా విన్నవించుకున్నారు: "మా ప్రభూ! మాకు మేము అన్యాయం చేసుకున్నాము. మరియు నీవు మమ్మల్ని కరుణించకపోతే! మమ్మల్ని క్షమించకపోతే! నిశ్చయంగా, మేము నాశనమై పోయేవారమవుతాము[12]."

24. (అల్లాహ్) అన్నాడు: "మీరందరు దిగిపోండి! మీరు ఒకరికొకరు శత్రువులు అవుతారు. మరియు మీరందరికీ ఒక నిర్ణీతకాలం వరకు భూమిలో నివాసం మరియు జీవనోపాధి ఉంటాయి"

---

[11] చూడండి, 20:120.
[12] చూడండి, 2:37.

**25.** ఇంకా ఇలా అన్నాడు: "మీరందరూ అందులోనే జీవిస్తారు మరియు అందులోనే మరణిస్తారు మరియు దాని నుండే మరల లేపబడతారు (పునరుత్థరింపబడతారు)."

**26.** ఓ ఆదమ్ సంతానమా! వాస్తవానికి మేము మీ కొరకు వస్త్రాలను కల్పించాము, అవి మీ మర్మాంగాలను కప్పుతాయి మరియు మీకు అలంకారమిస్తాయి. మరియు దైవభీతియే అన్నింటి కంటే శ్రేష్ఠమైన వస్త్రం. ఇవి అల్లాహ్ సూచనలలో కొన్ని; బహుశా గుణపాఠం నేర్చుకుంటారేమోనని, (వీటిని మీకు వినిపిస్తున్నాము).

**27.** ఓ ఆదమ్ సంతానమా! షైతాన్ మీ తల్లిదండ్రుల నుండి (స్వర్గ) వస్త్రాలను తొలగించి, వారి మర్మాంగాలను వారికి కనబడేటట్లు చేసి వారిని స్వర్గం నుండి వెడలగొట్టినట్లు మిమ్మల్ని కూడా ఆపదకు (ఫిత్నాకు) గురిచేయకూడదు. నిశ్చయంగా, వాడు మరియు వాని సంతతివారు మిమ్మల్ని కనిపెట్టుకొని ఉన్నారు. కాని, మీరు వారిని చూడలేరు. నిశ్చయంగా, మేము షైతానులను, విశ్వసించని వారికి స్నేహితులుగా చేశాము.

**28.** మరియు వారు (అవిశ్వాసులు), ఏదైనా అశ్లీలమైన పని చేసినపుడు ఇలా అంటారు: "మేము మా తండ్రితాతలను ఈ పద్ధతినే అవలంబిస్తూ ఉండగా చూశాము. మరియు అలా చేయమని అల్లాహ్ యే మమ్మల్ని ఆదేశించాడు." వారితో అను: "నిశ్చయంగా, అల్లాహ్ అశ్లీలమైన

పనులు చేయమని ఎన్నడూ ఆదేశించడు. ఏమీ? మీకు తెలియని విషయాన్ని గురించి అల్లాహ్ పై నిందలు వేస్తున్నారా?"

29. (ఓ ముహమ్మద్! వారితో) ఇలా అను: "నా ప్రభువు న్యాయాన్ని పాటించమని ఆదేశించాడు. మరియు మీరు ప్రతి మస్జిదులో (నమాజ్ లో) మీ ముఖాలను సరిగ్గా (ఆయన వైపునకే)[13] మరల్చుకొని నమాజ్ ను పూర్తి శ్రద్ధతో నిర్వహించండి మరియు ధర్మాన్ని / ఆరాధనను (దీన్ ను) కేవలం ఆయన కొరకే ప్రత్యేకించుకొని ఆయనను మాత్రమే ప్రార్థించండి." ఆయన మిమ్మల్ని మొదట సృష్టించినట్లు మీరు తిరిగి సృష్టించబడతారు.

30. మీలో కొందరికి ఆయన సన్మార్గం చూపించాడు. మరికొందరు మార్గభ్రష్టత్వానికి గురయ్యారు. ఎందుకంటే వాస్తవానికి వారు అల్లాహ్ ను వదలి షైతానులను తమ స్నేహితులుగా చేసుకున్నారు మరియు నిశ్చయంగా, తామే సన్మార్గంపై ఉన్నామని భ్రమలో ఉన్నారు.

31. ఓ ఆదమ్ సంతానమా ప్రతి మస్జిదులో (నమాజ్

---

[13] అంటే మీరు మీ ముఖాలను ఖిబ్లా వైపునకే మరల్చి మీ ఆరాధనను కేవలం అల్లాహ్ (సు.తా.) కొరకే ప్రత్యేకించుకోండి.

లో) మీ వస్త్రాలంకరణ పట్ల శ్రద్ధ వహించండి[14]. తినండి, త్రాగండి, కాని మితిమీరకండి. నిశ్చయంగా, ఆయన (అల్లాహ్) మితిమీరే వారిని ప్రేమించడు.

32. ఇలా అను: "అల్లాహ్ తన దాసుల కొరకు సృష్టించిన వస్త్రాలంకరణను మరియు మంచి జీవనోపాధిని నిషేధించేవాడెవడు?" (ఇంకా) ఇలా అను: "ఇవి ఇహలోక జీవితంలో విశ్వాసుల కొరకే; పునరుత్థాన దినమున ప్రత్యకంగా వారి కొరకు మాత్రమే గలవు[15]. ఈ విధంగా మేము మా సూచనలను జ్ఞానం గలవారికి స్పష్టంగా వివరిస్తున్నాము."

33. ఇలా అను: "నా ప్రభువు బహిరంగంగా గానీ, లేదా రహస్యంగా గానీ, అశ్లీల (అసహ్యకరమైన) కార్యాలను, పాపకార్యాలను చేయటాన్ని మరియు దౌర్జన్యం చేయటాన్ని మరియు ఆయన (అల్లాహ్) అవతరింపజేసిన ప్రమాణం ఏదీ లేనిదే ఇతరులను అల్లాహ్ కు సాటి (భాగస్వాములుగా) కల్పించటాన్ని మరియు మీకు జ్ఞానం లేనిదే ఏ విషయాన్ని అయినా అల్లాహ్ పై మోపటాన్ని నిషేధించి వున్నాడు."

34. మరియు ప్రతి సమాజానికి ఒక గడువు

---

[14] నమా'జ్, 'తవాఫ్, చేసేటప్పుడు బట్టలు ధరించటం విధి. ఇంకా (చూడండి, 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 1, 'హదీస్' నం. 368) ఇస్లాంకు ముందు ముష్రికులు, క'అబహ్ 'తవాఫ్ బట్టలు ధరించకుండా చేసేవారు. ఇస్లాం దానిని నిషేధించింది. చూడండి, 'స. బు'ఖారీ, పు.1, 'హ. 368.

[15] చూడండి, 7:50-51.

నియమింపబడి ఉంది. కావున ఆ గడువు వచ్చినపుడు, వారు ఒక ఘడియ వెనుక గానీ మరియు ముందు గానీ కాలేరు.

35. ఓ ఆదమ్ సంతానమా! మీలో నుంచే మీ వద్దకు నా సూచనలను వినిపించే ప్రవక్తలు వచ్చినపుడు, ఎవరైతే దైవభీతి కలిగి వుండి తమను తాము సరిదిద్దుకుంటారో, అలాంటి వారికి ఎలాంటి భయమూ ఉండదు మరియు వారు దుఃఖపడరు కూడా!

36. కాని ఎవరైతే మా సూచనలను అసత్యాలని నిరాకరించి, వాటి యెడల దురహంకారం చూపుతారో, అలాంటి వారు నరకాగ్ని వాసులవుతారు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు.

37. ఇక అల్లాహ్ పై అసత్యాలు కల్పించే వాని కంటే; లేదా ఆయన సూచనలను అసత్యాలని తిరస్కరించే వాని కంటే మించిన దుర్మార్గుడెవడు? అలాంటి వారు తమ విధివ్రాత ప్రకారం తమ భాగ్యాన్ని పొందుతారు[16]. తుదకు మేము పంపే దైవదూతలు వారి ప్రాణాలు తీయటానికి వారి వద్దకు వచ్చి: "మీరు అల్లాహ్ ను వదలి ప్రార్థించేవారు(ఆ దైవాలు) ఇపుడు ఎక్కడున్నారు?" అని అడుగుతారు. వారిలా జవాబిస్తారు: "వారు

---

[16] దీనిని వివిధ రకాలుగా బోధించారు. ఒక అర్థం వయస్సు మరియు జీవనోపాధి ఉన్నాయి. దీనికి సంబంధించిన ఆయత్ కు చూడండి, 10:69-70.

మమ్మల్ని వదిలి పోయారు." మరియు ఈ విధంగా వారు: "మేము నిజంగానే సత్యతిరస్కారులమై ఉండేవారము." అని తమకు వ్యతిరేకంగా తామే సాక్ష్యమిచ్చుకుంటారు.

**38.** (అల్లాహ్) అంటాడు: "మీకు పూర్వం గతించిన జిన్నాతుల మరియు మానవుల సమాజాలు పోయి చేరిన ఆ నరకాగ్నిలోకి ప్రవేశించండి." ప్రతి సమాజం (నరకంలో) ప్రవేశించి నపుడు తన పూర్వపు వారిని (సమాజాన్ని) శపిస్తుంది. తుదకు వారంతా అక్కడ చేరిన పిదప; తరువాత వచ్చిన వారు తమ కంటే ముందు వచ్చిని వారిని గురించి: "ఓ మా ప్రభూ! వీరే మమ్మల్ని మార్గభ్రష్టులుగా చేసినవారు, కావున వీరికి రెట్టింపు నరకాగ్ని శిక్ష విధించు!" అని అంటారు[17]. దానికి (అల్లాహ్): "ప్రతి వాడికి రెట్టింపు (శిక్ష) విధించబడుతుంది[18]. కాని మీరది తెలుసుకోలేరు!" అని అంటాడు.

**39.** మరియు అప్పుడు మొదటివారు తరువాత వచ్చిన వారితో: "మీకు మాపై ఎలాంటి ఆధిక్యకత లేదు కావున మీరు కూడా మీ కర్మలకు బదులుగా శిక్షను చవి చూడండి!" అని అంటారు.

**40.** నిశ్చయంగా, మా సూచనలను అబద్ధాలని తిరస్కరించిన వారి కొరకు మరియు వాటి పట్ల దురహంకారం చూపిన వారి కొరకు ఆకాశ

---

[17] చూడండి, 33:67-68 మరియు 16:25.

[18] చూడండి, 34:31-32.

ద్వారాలు ఏ మాత్రం తెరువబడవు. మరియు ఒంటె సూది బెజ్జంలో నుండి దూరి పోగలిగే వరకు వారు స్వర్గంలో ప్రవేశించ జాలరు. మరియు ఈ విధంగా మేము అపరాధులకు ప్రతిఫలమిస్తాము.

41. నరకమే వారి పాన్పు మరియు వారి దుప్పటి అవుతుంది. మరియు ఈ విధంగా మేము దుర్మార్గులకు ప్రతిఫలమిస్తాము.

42. కాని, ఎవరైతే విశ్వసించి సత్కార్యాలు చేస్తారో! అలాంటి వ్యక్తికి, మేము అతని శక్తికి మించిన భారం వేయము. ఇటువంటి వారే స్వర్గవాసులు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు.

43. మరియు మేము వారి హృదయాల నుండి పరస్పర ద్వేషభావాలను తొలగిస్తాము. వారి క్రింద సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి. మరియు వారు ఇలా అంటారు: "మాకు ఇక్కడికి చేరటానికి సన్మార్గం చూపిన అల్లాహ్ యే సర్వస్తోత్రాలకు అర్హుడు. అల్లాహ్ మాకు ఈ సన్మార్గం చూపకపోతే మేము సన్మార్గం పొంది ఉండేవారము కాదు. మా ప్రభువు పంపిన ప్రవక్తలు వాస్తవంగా సత్యాన్నే తీసుకు వచ్చారు!" అపుడు వారికి ఒక వాణి వినబడుతుంది: "మీరు చేస్తూ ఉండిన సత్కార్యాలకు ఫలితంగా, మీరు వారసులుగా చేయబడిన స్వర్గం ఇదే!"

44. మరియు స్వర్గవాసులు, నరకవాసులను ఉద్దేశించి ఇలా అంటారు: "మా ప్రభువు మాకు చేసిన వాగ్దానాన్ని మేము వాస్తవంగా, సత్యమైనదిగా

పొందాము. ఏమీ? మీరు కూడా మీ ప్రభువు చేసిన వాగ్దానాన్ని సత్యమైనదిగా పొందారా? వారు జవాబిస్తారు: "అవును!" అప్పుడు ప్రకటించే వాడొకడు వారి మధ్య ఇలా ప్రకటిస్తాడు: "దుర్మార్గులపై అల్లాహ్ శాపం (బహిష్కారం) ఉంది!"

**45.** ఎవరైతే (ప్రజలను) అల్లాహ్ మార్గం నుండి నిరోధిస్తారో మరియు అది తప్పు మార్గమని చూప గోరుతారో! అలాంటి వారే పరలోక జీవితాన్ని తిరస్కరించినవారు.

**46.** మరియు ఆ ఉభయ వర్గాల మధ్య ఒక అడ్డుతెర ఉంటుంది[19]. దాని ఎత్తైన ప్రదేశాల మీద కొందరు ప్రజలు ఉంటారు[20]. వారు ప్రతి ఒక్కరినీ వారి గుర్తులను బట్టి తెలుసుకుంటారు. వారు స్వర్గవాసులను పిలిచి: "మీకు శాంతి కలుగు గాక (సలాం)!" అని అంటారు. వారు ఇంకా స్వర్గంలో ప్రవేశించలేదు, కాని దానిని ఆశిస్తున్నారు.

**47.** మరియు వారి దృష్టి నరకవాసుల వైపునకు మళ్ళించబడినపుడు వారు ఇలా అంటారు: "ఓ మా ప్రభూ! మమ్మల్ని ఈ దుర్మార్గులతో చేర్చకు!"

**48.** మరియు ఎత్తైన ప్రదేశాలపై ఉన్నవారు వారిని (నరకవాసులను) వారి గుర్తుల ద్వారా గుర్తించి

---

[19] చూడండి, 57:13.

[20] అల్-అ'అరాఫు: ('అఫఫున్, ఏ.వ.) ఇవి స్వర్గ నరకాల మధ్య ఉన్న గోడపై నున్న ఎత్తైన ప్రదేశాలు. అక్కడ కొందరు తమ గమ్యస్థానం (స్వర్గం / నరకం) కొరకు వేచి ఉంటారు..

వారితో అంటారు: "మీరు కూడబెట్టిన ఆస్తిపాస్తులు మరియు మీ దురహంకారాలు, మీకు ఏమైనా లాభం చేకూర్చాయా?

49. "'వీరికీ, అల్లాహ్ తన కారుణ్యాన్ని ఏ మాత్రం ప్రసాదించడు.' అని మీరు ప్రమాణాలు చేసి చెబుతూ ఉండేవారు, వీరే కదా? (చూడండి వారితో ఇలా అనబడింది): 'మీరు స్వర్గంలో ప్రవేశించండి, మీకు ఎలాంటి భయమూ ఉండదు మరియు మీరు దుఃఖపడరు కూడా!' "

50. మరియు నరకవాసులు స్వర్గవాసులతో: "కొద్ది నీళ్ళో లేక అల్లాహ్ మీకు ప్రసాదించిన ఆహారంలో నుండైనా కొంత మా వైపుకు విసరండి." అని అంటారు. (దానికి స్వర్గవాసులు): "నిశ్చయంగా అల్లాహ్! ఈ రెండింటినీ సత్యతిరస్కారులకు నిషేధించి వున్నాడు[21]." అని అంటారు.

51. వీరే, వారు; ఎవరైతే తమ ధర్మాన్ని ఒక ఆటగా మరియు కాలక్షేపంగా చేసుకున్నారో. మరియు ఇహలోక జీవితం వారిని మోసానికి గురి చేసింది. (అల్లాహ్ ఇలా సెలవిస్తాడు): "వారు ఈనాటి సమావేశాన్ని మరచి, మా సూచనలను తిరస్కరించినట్లు, ఈనాడు మేమూ వారిని మరచిపోతాము!"

52. మరియు వాస్తవానికి మేము వారికి గ్రంథాన్ని ప్రసాదించి, దానిని జ్ఞానపూర్వకంగా స్పష్టంగా

[21] చూడండి, 7:32.

వివరించి ఉన్నాము[22]. అది విశ్వసించే వారికి ఒక మార్గదర్శిని, మరియు కారుణ్యం.

53. ఏమీ? వారు (అవిశ్వాసులు) దాని తుది ఫలితం సంభవించాలని నిరీక్షిస్తున్నారా? దాని తుది ఫలితం సంభవించే దినమున, దానిని నిర్లక్ష్యం చేసినవారు: "వాస్తవానికి మా ప్రభువు పంపిన ప్రవక్తలు సత్యం తెచ్చారు. అయితే ఏమీ? మా కొరకు సిఫారసు చేయటానికి, సిఫారసుదారులు ఎవరైనా ఉన్నారా? లేదా మేము మళ్ళీ తిరిగి (భూలోకంలోకి) పంపబడితే మేమింత వరకు చేసిన కర్మలకు విరుద్ధంగా చేసేవారం కదా?" అని పలుకుతారు. వాస్తవానికి వారు తమకు తాము నష్టం కలిగించుకున్నారు మరియు వారు కల్పించుకున్న (దైవాలన్నీ) వారిని త్యజించి ఉంటాయి.

54. నిశ్చయంగా, మీ ప్రభువైన అల్లాహ్ యే ఆకాశాలను మరియు భూమిని ఆరు దినములలో (అయ్యామ్ లలో) సృష్టించాడు[23]. ఆ పిదప తన

[22] చూడండి, 17:15.

[23] యౌమున్: దినం, మనం లెక్కిస్తున్న దినం (ఒక పగలు-రాత్రితో కూడుకున్నది), ఈ భూలోకానికే పరిమితిమైనది. ఇది మన భూలోక వాసుల అనుకూలం కొరకు అల్లాహ్ (సు.తా.) నిర్ణయించిన దినం. దీని సంబంధం భూమి సంచారంతో ఉంది. అల్లాహుతా'ఆలా ఇక్కడు: "ఆకాశాలు మరియు భూమిని ఆరు దినాలలో సృష్టించాను." అని అంటున్నాడు. ఈ యౌమున్, అంటే యుగం, దశ లేక కాలం (Aeon, Epoch) కావచ్చు! నిజం అల్లాహ్ తెలుసు.

సింహాసనాన్ని (అర్ష్ ను) అధిష్ఠించాడు[24]. ఆయన రాత్రిని పగటి వెంట ఎడతెగకుండా అనుసరింపజేసి, దానిపై (పగటిపై) కప్పుతూ ఉంటాడు. మరియు సూర్యచంద్ర, నక్షత్రాలు ఆయన ఆజ్ఞకు కట్టుబడి ఉన్నాయి. నిశ్చయంగా, సర్వసృష్టి ఆయనదే! మరియు ఆజ్ఞ నడిచేది ఆయనదే. అల్లాహ్ ఎంతో శుభదాయకుడు[25], సర్వ లోకాలకు పోషకుడు!

55. మీ ప్రభువును వినయంతో మరియు రహస్యంగా (మౌనంగా) ప్రార్థించండి. నిశ్చయంగా, ఆయన హద్దులు మీరే వారిని ప్రేమించడు.

56. మరియు భూమిలో సంస్కరణ జరిగిన పిదప దానిలో కల్లోలాన్ని రేకెత్తించకండి మరియు భయంతో మరియు ఆశతో ఆయనను ప్రార్థించండి. నిశ్చయంగా, అల్లాహ్ కారుణ్యం సజ్జనులకు

---

[24] అల్లాహ్ (సు.తా.) ఏ విధంగా తన 'అర్ష్ ను (సింహాసనాన్ని / విశ్వాధికార పీఠాన్ని ) అధిష్ఠించి ఉన్నాడో మనకు తెలియదు. మనం దానిని మానవ జ్ఞానపరిధి ప్రకారం ఉదాహరణలతో వివరించటం తగినది కాదు. మనము ఇలాంటి విషయాలను ఉన్నవి ఉన్నట్లుగా విశ్వసించటమే నిజమైన విశ్వాసం (ఇబ్నె-కసీ'ర్). ఇది ముతషాబిహాత్ - అస్పష్టమైన విషయాలలోనిది. ఈ శబ్దం ఖుర్ఆన్ లో చాలా చోట్లలో వచ్చింది. చూడండి, 7:54, 9:129, 10:3, 11:7, 13:2, 20:5, 25:59, 32:4 57:4.

[25] తబారక్: Blessed, Exalted, శుభదాయకుడు, శుభప్రదుడు, శుభకరుడు, అనుగ్రహించు, ఆశీర్వదించు, వరాలను, శుభాలను ప్రసాదించు, ఘనతగల, మహిమ గల వాడు.

సమీపంలోనే ఉంది[26].

57. మరియు ఆయనే తన కారుణ్యానికి ముందు శుభవార్తలు తెచ్చే వాయువులను పంపేవాడు. ఎప్పుడైతే అవి బరువైన మేఘాలను ఎత్తుకొని వస్తాయో మేము వాటిని నిర్జీవమైన నగరాల వైపునకు తీసుకొని పోయి వాటి నుండి నీటిని కురిపిస్తాము. ఆ నీటి వలన పలు విధాలైన ఫలాలను ఉత్పత్తి చేస్తాము. ఇదే విధంగా మేము మృతులను కూడా లేపుతాము; ఈ విధంగానైనా మీరు హితబోధ స్వీకరిస్తారని![27]

58. మరియు సారవంతమైన నేల తన ప్రభువు ఆదేశంతో పుష్కలంగా పంటనిస్తుంది. మరియు నిస్సారమైన దాని (నేల) నుండి నాసిరకం పంట తప్ప మరేమీ రాదు. ఈ విధంగా మేము కృతజ్ఞతలు చూపేవారికి మా సూచనలను

---

[26] ఈ రెండు ఆయత్ లలో నాలుగు విషయాలు వివరించబడ్డాయి. 1) అల్లాహ్ (సు.తా.) ను వినయంతో, రహస్యంగా (మౌనంగా) ప్రార్థించాలి. 2) ప్రార్థనలో మన కోరికలు హద్దులు మీరి ఉండ కూడదు. 3) సంస్కరణ తరువాత భూమిలో సంక్షోభాన్ని రేకెత్తించకూడదు. 4) హృదయాలలో అల్లాహ్ (సు.తా.) శిక్ష - భీతితో పాటూ, ఆయన (సు.తా.) కారుణ్యంపై ఆశ కూడా ఉండాలి.

[27] ఏ విధంగానైతే అల్లాహుతా'ఆలా వర్షం కురిపించి మృత భూమి నుండి పంట, ఫలాలను ఉత్పత్తి చేస్తాడో! అదే విధంగా, పునరుత్థాన దినమున మృతులను కూడా సజీవులుగా చేసి లేపుతాడు. అల్లాహుతా'ఆలా ప్రతిదీ చేయగల సమర్థుడు.

వివరిస్తాము[28].

**59.** వాస్తవంగా, మేము నూహ్ ను అతని జాతివారి వద్దకు పంపాము[29]. అతను వారితో: "నా జాతి ప్రజలారా! అల్లాహ్ నే ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరొక ఆరాధ్యదైవం లేడు. వాస్తవానికి నేను మీపై రాబోయే ఆ గొప్ప దినపు శిక్షను గురించి భయపడుతున్నాను." అని అన్నాడు.

**60.** అతని జాతి నాయకులు అన్నారు: "నిశ్చయంగా, మేము నిన్ను స్పష్టమైన తప్పు దారిలో చూస్తున్నాము!"

**61.** దానికి (నూహ్) అన్నాడు: "నా జాతి ప్రజలారా! నాలో ఏ తప్పిదం లేదు. మరియు వాస్తవానికి

---

[28] దైవప్రవక్త('స.అస)ప్రవచనం: "అల్లాహ్(సు.తా.) నాకు ఇచ్చి పంపిన జ్ఞానం మరియు మార్గదర్శకత్వపు ఉదాహరణ, ధారాళంగా కురిసే వర్షం లాంటిది. దానిని కొన్ని ప్రాంతాలలోని నేల పీల్చుకొని మంచి పంటలు, ఫలాలు పుష్కలంగా ఇస్తుంది. మరికొన్ని గట్టి ప్రాంతాలు నీటిని నిలబెట్టి తరవాత పండే పంటలకు, నీరు పారటానికి ఉపయోగబడతాయి. కాని ఏ రాళ్ళ నేల అయితే నీటిని పీల్చుకోలేదో, లేక దానిని ఆపలేదో, అది దానిని ఏ విధంగాను ఉపయోగించుకోలేదు. ఈ ఉదాహరణలు ఆ మానవుని వంటివి ఎవడైతే అల్లాహ్ ధర్మాన్ని అర్థం చేసుకుంటాడో మరియు అల్లాహుతా'ఆలా నాకు ఇచ్చి పంపిన దానితో మంచి ఫలితం పొందుతాడో! అతడు తాను కూడా జ్ఞానం పొందుతాడు మరియు ఇతరులకు కూడా బోధిస్తాడు. మరొక వ్యక్తి ఉదాహరణ కూడా ఇలా ఉంది: ఎవడైతే స్వయంగా కూడా జ్ఞానం మరియు హితబోధ పొందడు, దేనితోనైతే నేను పంపబడ్డానో. ('స'హీ'హ్ బు'ఖారీ, కితాబ్ అల్-'ఇల్మ్, బాబ్ ఫ'ద్ల్ మినల్ 'ఇల్మ్).

[29] ఈ సూరహ్ లోని 7:59-93 ఆయత్ లలో ప్రవక్తల గాథలున్నాయి.

నేను సర్వలోకాల ప్రభువు యొక్క సందేశహారుడను.

**62.** నా ప్రభువు సందేశాలను మీకు అందజేస్తున్నాను మరియు (ధర్మ) బోధనచేస్తున్నాను. ఎందుకంటే! మీకు తెలియని విషయాలు అల్లాహ్ తరఫు నుండి నాకు తెలుస్తున్నాయి.

**63.** మీలోని ఒక పురుషుని ద్వారా - దైవభీతి కలిగి ఉంటే, మీరు కరుణింపబడతారని - మిమ్మల్ని హెచ్చరించటానికి, మీ ప్రభువు తరఫు నుండి మీ వద్దకు జ్ఞాపిక వచ్చిందని మీరు ఆశ్చర్యపడుతున్నారా?"

**64.** అయినా, వారు అతనిని అసత్యవాదుడని తిరస్కరించారు. కావున మేము అతనిని మరియు అతనితో పాటు ఓడలో ఉన్నవారిని కాపాడాము. మరియు మా సూచనలను అసత్యాలని తిరస్కరించిన వారిని ముంచి వేశాము. నిశ్చయంగా, వారు గుడ్డిగా ప్రవర్తించిన జనం.

**65.** ఇంకా మేము ఆద్ (జాతి) వద్దకు వారి సోదరుడైన హూద్ ను పంపాము[30]. అతను: "ఓ నా జాతి సోదరులారా! మీరు అల్లాహ్ నే

---

[30] ఈ జాతివారు యమన్ ప్రాంతంలో ఇసుక పర్వతాలలో ఉండేవారు. ఈ ప్రాంతపు పేరు అహ'ఖాఫ్ అని పేర్కొనబడింది. ఈ ఎడారి 'ఉమాన్ మరియు హ'దరమౌత్ మధ్య ఉంది. హూద్ ('అ.స.) బహుశా మొదటి 'అరబ్బు ప్రవక్త. ఇంకా చూడండి, 89:8.

ఆరాధించండి, ఆయన తప్ప మీకు మరొకు ఆరాధ్య దైవుడు లేడు. ఏమీ? మీకు దైవభీతి లేదా ?" అని అన్నాడు.

66. అతని జాతివారిలో సత్యతిరస్కారులైన నాయకులు ఇలా అన్నారు: "మేము, నిశ్చయంగా నిన్ను మూఢత్వంలో చూస్తున్నాం మరియు నిశ్చయంగా నిన్ను అసత్యవాదిగా భావిస్తున్నాం!"

67. (హూద్) అన్నాడు: "నా జాతి ప్రజలారా! నాలో ఏ మూఢత్వం లేదు. మరియు నిశ్చయంగా, నేను సర్వలోకాల ప్రభువు యొక్క సందేశహరుడను!

68. "నేను మీకు నా ప్రభువు సందేశాలను అందజేస్తున్నాను మరియు నిశ్చయంగా, నేను మీకు నమ్మదగిన ఉపదేశకుడను.

69. లేదా ! మిమ్మల్ని హెచ్చరించటానికి మీ ప్రభువు తరఫు నుండి హితోపదేశం - మీలోని ఒక పురుషుని ద్వారా వచ్చిందని మీరు ఆశ్చర్యపడుతున్నారా? నూహ్ జాతి పిదప మిమ్మల్ని వారసులుగా చేసి, మీకు అపార బలాధిక్యతను ఇచ్చిన విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకోండి[31]. ఈ విధంగా అల్లాహ్ మీకు చేసిన అనుగ్రహాలను జ్ఞాపకం చేసుకుంటే మీరు సాఫల్యం పొందగలరని ఆశించవచ్చు!"

70. వారన్నారు: "మేము అల్లాహ్ ను ఒక్కణ్ణి మాత్రమే ఆరాధించి, మా తండ్రితాతలు ఆరాధించే వాటిని వదలిపెట్టమని (చెప్పటానికి) నీవు మా వద్దకు

---

[31] చూడండి, 89:8 మరియు 41:15.

వచ్చావా? ఒకవేళ నీవు సత్యవంతుడవే అయితే మమ్మల్ని భయపెట్టే దానిని (శిక్షను) తీసుకొనిరా[32]!"

71. (హూద్) అన్నాడు: "వాస్తవానికి మీపై మీ ప్రభువు యొక్క ఆగ్రహం మరియు శిక్ష విరుచుకుపడ్డాయి, అల్లాహ్ ఏ ప్రమాణం ఇవ్వకున్నా - మీరు మరియు మీ తండ్రితాతలు పెట్టుకున్న (కల్పిత) పేర్ల విషయంలో - నాతో వాదులాడుతున్నారా? సరే, అయితే మీరు నిరీక్షించండి, మీతో పాటు నేనూ నిరీక్షిస్తాను!"

72. కావున తుదకు మేము అతనిని (హూద్ ను) మరియు అతని తోటి వారిని మా అనుగ్రహంతో రక్షించాము. మరియు మా సూచనలు అసత్యాలని తిరస్కరించిన వారిని నిర్మూలించాము[33]. ఎందుకంటే వారు విశ్వసించకుండా ఉన్నారు.

73. ఇక సమూద్ జాతి వారి వద్దకు వారి సోదరుడైన

---

[32] చూడండి,8:32. ఇది ముష్రిక్ ఖురైషులు ము'హమ్మద్('సఅస) యొక్క ఇస్లాం ఆహ్వానానికి ఇచ్చిన జవాబు.

[33] వారిపై ఎనిమిది రోజులు, ఏడు రాత్రులు భయంకరమైన తుఫాను గాలి, విరుచుకు పడింది. వారు కోసిన ఖర్జూర చెట్ల వలె పడిపోయారు. చూడండి, 69:6-8, 11:53-56, 46:24-25.

సాలిహ్ ను పంపాము[34]. అతను వారితో! "నా జాతి సోదరులారా! అల్లాహ్ నే ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరొక ఆరాధ్యదైవం లేదు. వాస్తవానికి, మీ వద్దకు మీ ప్రభువు తరఫు నుండి ఒక స్పష్టమైన సూచన వచ్చింది. ఇది అల్లాహ్ మీకు ఒక అద్భుత సూచనగా పంపిన ఆడ ఒంటె. కావున దీనిని అల్లాహ్ భూమిపై మేయటానికి వదలిపెట్టండి. మరియు హాని కలిగించే ఉద్దేశంతో దీనిని ముట్టుకోకండి. అలా చేస్తే మిమ్మల్ని బాధాకరమైన శిక్ష పట్టుకుంటుంది[35].

**74.** "మరియు ఆయన, ఆద్ జాతి వారి పిదప మిమ్మల్ని వారసులుగా చేసి మిమ్మల్ని భూమిపై స్థిరపరచిన విషయం జ్ఞాపకం చేసుకోండి. మీరు దాని మైదానాలలో కోటలను నిర్మించుకున్నారు. మరియు కొండలను తొలచి గృహాలను నిర్మించుకుంటున్నారు. కావున అల్లాహ్ అనుగ్రహాన్ని జ్ఞాపకం

---

[34] నబాతియన్ - తెగకు చెందిన స'మూద్ జాతివారు, 'ఆద్ జాతికి చెందిన వారు. కావున వారు రెండవ 'ఆద్ జాతి వారిగా పిలువబడ్డారు. వారు 'హిజా'జ్ ఉత్తరభాగంలో ఉండే వారు. ఆ ప్రాంతం, వాది అల్-ఖురా అనబడుతోంది. వారు ఆ 'హిజ్ర్ ప్రాంతంలో గుట్టలను తొలిచి గృహాలను నిర్మించారు. వాటి పేరు మదాయిన్ 'సాలి'హ్. ఈ రోజు కూడా అవి ఈ పేరుతోనే పిలుబడతాయి. మదాయన్ 'సాలి'హ్ మదీనా మునవ్వరా మరియు తబూక్ ల మధ్య ఉన్నాయి. ఇప్పటికి కూడా అక్కడ స'మూద్ జాతి వారు కొండలను తొలిచి నిర్మించిన కట్టడాలు ఉన్నాయి.

[35] చూడండి, 54:27.

చేసుకోండి. మరియు భూమిపై అనర్థాన్ని, కల్లోల్లాన్ని రేకెత్తించకండి!" అని అన్నాడు.

75. (సాలిహ్) జాతి వారిలోని అహంకారులైన నాయకులు విశ్వసించిన బలహీన వర్గం వారితో అన్నారు: "సాలిహ్ తన ప్రభువు పంపిన ప్రవక్త అని మీకు నిశ్చయంగా తెలుసా? దానికి వారు: "మేము నిశ్చయంగా, అతని ద్వారా పంపబడిన సందేశాన్ని విశ్వసిస్తున్నాం." అని జవాబిచ్చారు

76. ఆ అహంకారులన్నారు: "మీరు విశ్వసించిన దానిని మేము నిశ్చయంగా తిరస్కరిస్తున్నాం!"

77. ఆ తరువాత వారు ఆ ఆడఒంటె వెనుక కాలి మోకాలి పెద్దనరం కోసి (చంపి), తన ప్రభువు ఆజ్ఞను ఉల్లంఘించి, అతనితో అన్నారు: "ఓ సాలిహ్! నీవు నిజంగానే సందేశహరుడవైతే నీవు మమ్మల్ని బెదిరించే, ఆ శిక్షను తీసుకురా!"

78. అప్పుడు వారిని భూకంపం పట్టుకున్నది[36]. వారు తమ ఇండ్లలోనే బోర్లా (శవాలుగా మారి) పడిపోయారు.

79. పిదప అతను (సాలిహ్) వారి నుండి తిరిగి పోతూ అన్నాడు: "నా జాతి ప్రజలారా! వాస్తవంగా, నేను నా ప్రభువు సందేశాన్ని మీకు అందజేశాను. మరియు మీకు మంచి సలహాలను ఇచ్చాను, కానీ మీరు మంచి సలహాలు ఇచ్చే వారంటే

[36] ఇక్కడ రజ్ ఫతున్: భూకంపం, అని ఉంది. మరొకచోట 54:31లో 'సై'హతున్: భయంకర అరుపు (ధ్వని), అని వ్రాయబడి ఉంది. బహుశా ఈ రెండు ఒకేసారి వచ్చి ఉంటాయి.

ఇష్టపడలేదు!"

**80.** ఇక లూత్![37] అతను తన జాతి వారితో: "ఏమీ? మీరు ఇంతకు పూర్వం ప్రపంచంలో ఎవ్వరూ చేయని అసహ్యకరమైన పనులు చేస్తారా?" అని అడిగిన విషయం జ్ఞప్తికి తెచ్చుకోండి.

**81.** "వాస్తవానికి, మీరు స్త్రీలను వదలి కామంతో పురుషుల వద్దకు పోతున్నారు. వాస్తవంగా, మీరు మితిమీరి ప్రవర్తిస్తున్నారు.

**82.** కాని అతని జాతి వారి జవాబు కేవలం ఇలాగే ఉండింది:[38] "వీరిని మీ నగరం నుండి వెళ్ళగొట్టండి. వాస్తవానికి వీరు తమను తాము మహా పవిత్రులని అనుకుంటున్నారు!"

**83.** ఆ పిదప మేము అతనినీ మరియు అతని ఇంటివారినీ - అతని భార్యను తప్ప - రక్షించాము. ఆమె వెనుక ఉండిపోయిన

---

[37] లూ'త్ ('అ.స.), ఇబ్రాహీమ్ ('అ.స.) యొక్క సోదరుని కుమారులు. అతని వృత్తాంతం, 11:69-83 లలో వివరంగా ఉంది. ఇతను ఇబ్రాహీమ్('అ.స.) ను విశ్వసించారు. ఈయన నివసించిన నగరం, "సోడోమ్, జోర్డన్ మరియు బైతుల్ మఖ్దిస్ మధ్య మృత సముద్రం ప్రాంతంలో ఉంది. ఇతని జాతివారు చరిత్రలో మొదటిసారి పురుషులు-పురుషులతో లైంగిక క్రియ (Sodomy) చేయసాగారు. స్త్రీలను, వదలి, పురుషులు-పురుషులతో తమ కామఇచ్ఛను పూర్తి చేసుకొనేవారు. ఇది మహాపాపం. కాని ఈ రోజు కొన్ని పశ్చిమ దేశాలలో ఇది నేరమూ కాదు, పాపమూ కాదు. ఇది వారి దగ్గర చట్టరీత్యా ఆమోదించబడింది. షరీయత్ లలో దీని శిక్ష వ్యభిచారానికి ఇవ్వ వలసిన శిక్షయే!

[38] చూడండి, 27:56.

వారిలో చేరిపోయింది[39].

**84.** మరియు మేము వారిపై (రాళ్ళ) వర్షాన్ని కురిపించాము[40]. చూడండి! ఆ అపరాధుల ముగింపు ఎలా జరిగిందో!

**85.** మరియు మేము మద్'యన్ జాతి వారి వద్దకు వారి సహోదరుడు షుఐబ్'ను (పంపాము)[41]. అతను వారితో అన్నాడు: "నా జాతి ప్రజలారా! అల్లాహ్ నే ఆరాధించండి, మీకు ఆయన తప్ప మరొక ఆరాధ్య దైవం లేడు. వాస్తవంగా, మీ వద్దకు, మీ ప్రభువు దగ్గర నుండి స్పష్టమైన (మార్గదర్శకత్వం) వచ్చి వున్నది. కొలిచేటప్పుడు మరియు తూచేటప్పుడు పూర్తిగా ఇవ్వండి. ప్రజలకు వారి వస్తువులను తగ్గించి ఇవ్వకండి. భూమిపై సంస్కరణ జరిగిన తరువాత కల్లోల్లాన్ని రేకెత్తించకండి. మీరు విశ్వాసులో అయితే, ఇదే మీకు మేలైనది.

---

[39] చూడండి, 11:81 మరియు 66:10.

[40] చూడండి, 11:82.

[41] మద్ యన్: ఒక తెగ మరియు నగరపు పేరు. వారి వద్దకు షు'ఐబ్ ('అ.స.) ప్రవక్తగా పంపబడ్డారు. దీని మరొక పేరు అయ్ కహ్.అది ఇప్పటి 'అఖబా అగాధం (Gulf of Aqaba) నుండి పడమటి వైపుకు సినాయి ద్వీపకల్పం (Sinai Peninsula) మరియు మో'ఆబ్ (Moab) పర్వతాల వరకు మరియు మృత సముద్రాని (Dead Sea)కి తూర్పు దిక్కున ఉంది. అక్కడ నివసించే వారు అమోరైట్ (Amorite) తెగకు చెందిన 'అరబ్బులు. షు'ఐబ్ ('అ.స.) మరొక పేరు ఎత్రో (Jethro), ఇతనే మూసా ('అ.స.) యొక్క భార్య తండ్రి అని కొందరు వ్యాఖ్యాతల అభిప్రాయం. ఇంకా చూడండి, 26:176.

**86.** మరియు ఆయనను విశ్వసించిన వారిని, అల్లాహ్ మార్గం నుండి నిరోధించటానికి వారిని బెదరిస్తూ, అది వక్రమమైనదని చూపగోరి ప్రతి మార్గంలో కూర్చోకండి. మీరు అల్పసంఖ్యలో ఉన్నప్పుడు ఆయన మీ సంఖ్యను అధికం చేసిన విషయాన్ని జ్ఞాపకం చేసుకోండి. మరియు కల్లోలం రేకెత్తించిన వారి గతి ఏమయిందో చూడండి.

**87.** మరియు నా ద్వారా పంపబడిన దానిని (సందేశాన్ని) మీలో ఒక వర్గం వారు విశ్వసించి, మరొక వర్గం వారు విశ్వసించకపోతే! అల్లాహ్ మన మధ్య తీర్పు చేసే వరకూ సహనం వహించండి. మరియు ఆయనే అత్యుత్తమమైన న్యాయాధిపతి!"[42]

**88.** దురహంకారులైన అతని జాతి నాయకులన్నారు: "ఓ షుఐబ్! మేము నిన్నూ మరియు నీతో పాటు విశ్వసించిన వారినీ, మా నరగం నుండి తప్పక వెడలగొడ్తాము. లేదా మీరు తిరిగి మా ధర్మంలోకి రండి!" అతనన్నాడు: "మేము దానిని అసహ్యించుకున్నప్పటికీ (మీ ధర్మంలోకి చేరాలా)?"

**89.** (ఇంకా ఇలా అన్నాడు): "వాస్తవంగా అల్లాహ్ మాకు (మీ ధర్మం నుండి) విముక్తి కలిగించిన తరువాత కూడా మేము తిరిగి మీ ధర్మంలోకి

---

[42] చూడండి, 9:52. 'సహీహ్ బు'ఖారీ, పుస్తకం - 9, 'హదీస్' నం. 252, 266, 267, పు - 2 'హ. 539.

చేరితే! మేము అల్లాహ్ పై అబద్ధం కల్పించిన వారమవుతాము. మా ప్రభువైన అల్లాహ్ కోరితే తప్ప! మేము తిరిగి దానిలో చేరలేము. మా ప్రభువు జ్ఞానం ప్రతి వస్తువునూ ఆవరించి ఉంది. మేము అల్లాహ్ పైననే ఆధరపడి ఉన్నాము. 'ఓ మా ప్రభూ! మా మధ్య మరియు మా జాతివారి మధ్య న్యాయంగా తీర్పు చేయి. మరియు నీవే అత్యుత్తమమైన తీర్పు చేసేవాడవు!"

**90.** మరియు అతన జాతిలోని సత్యతిరస్కారులైన నాయకులు అన్నారు: "ఒకవేళ మీరు షుఐబ్ ను అనుసరిస్తే! నిశ్చయంగా మీరు నష్టం పొందిన వారవుతారు."

**91.** అప్పుడు వారిని ఒక భూకంపం పట్టుకున్నది[43] మరియు వారు తమ ఇండ్లలోనే బోర్లా (శవాలై) పడిపోయారు.

**92.** షుఐబ్ ను అబద్ధమాడుతున్నాడని తిరస్కరించినవారు అక్కడ ఎన్నడూ నివసించి ఉండనే లేదన్నట్లుగా నశించి పోయారు. షుఐబ్ ను అబద్ధమాడుతున్నాడని తిరస్కరించిన వారే వాస్తవానికి నష్టం పొందిన వారయ్యారు.

**93.** (షుఐబ్) ఇలా అంటూ వారి నుండి మరలి పోయాడు: "నా జాతి ప్రజలారా! వాస్తవంగా నేను

[43] ఇక్కడ రజ్ ఫతున్ - భూకంపం అని, 11:94లో 'సై'హతున్ - భయంకరమైన అరుపు (ధ్వని) అని, మరియు 26:189లో "జుల్లతున్ - మేఘాల ఛాయ అని ఉంది. అన్నీ ఒకదాని వెంట ఒకటి, ఒకేసారి వచ్చాయన్నమాట, (ఇబ్నె-కసీ'ర్).

నా ప్రభువు సందేశాలను మీకు అందజేశాను మరియు మీకు హితోపదేశం చేశాను. కావున ఇపుడు సత్యతిరస్కారులైన జాతివారి కొరకు నేనెందుకు దుఃఖించాలి?"

**94.** మరియు మేము ఏ నగరానికి ప్రవక్తను పంపినా! దాని ప్రజలను ఆపదలకు మరియు దౌర్భాగ్యానికి గురి చేయకుండా ఉండలేదు, వారు ఇలాగైనా వినమ్రులు అవుతారేమోనని!

**95.** ఆ తరువాత వారి దుస్థితిని, సుస్థితిగా మార్చిన పిదప వారు హాయిగా ఉంటూ, ఇలా అన్నారు: "వాస్తవానికి కష్టసుఖాలు మా పూర్వీకులకు కూడా సంభవించాయి." కావున మేము వారిని ఆకస్మాత్తుగా పట్టుకున్నాము మరియు వారు దానిని గ్రహించలేక పోయారు[44].

**96.** మరియు ఒకవేళ ఆ నగరవాసులు విశ్వసించి, దైవభీతి కలిగి ఉంటే - మేము వారిపై ఆకాశం నుండి మరియు భూమి నుండి - సర్వశుభాల నొసంగి ఉండేవారం. కాని వారు (ప్రవక్తలను) అసత్యవాదులని తిరస్కరించారు, కనుక వారు చేసిన కర్మలకు ఫలితంగా మేము వారిని శిక్షించాము.

**97.** ఏమీ? ఈ నగరాలవాసులు, తాము నిద్రపోయేటప్పుడు రాత్రి సమయమున వచ్చే మా శిక్ష నుండి సురక్షితంగా ఉన్నారా?

**98.** లేదా ఈ నగరాల వాసులు, పట్టపగలు తాము

---

[44] చూడండి, 6:42-45.

కాలక్షేపంలో ఉన్నప్పుడు వచ్చే మా శిక్ష నుండి సురక్షితంగా ఉన్నారా?

**99.** ఏమీ? వారు అల్లాహ్ యుక్తి (శిక్ష) నుండి నిర్భయంగా ఉన్నారా? నాశనం కాబోయే వారు తప్ప ఇతర జాతి వారెవ్వరూ అల్లాహ్ యుక్తి గురించి నిర్భయంగా ఉండజాలరు[45].

**100.** ఏమీ? పూర్వపు భూలోకవాసుల తరువాత, భూమికి వారసులైన వారికి, మేము కోరితే వారి పాపాల వలన వారికి కూడా శిక్ష విధించగలమని ఉపదేశం అందలేదా? మరియు మేము, వారి హృదయాల మీద ముద్ర వేసి ఉన్నాము, దాని వల్ల వారు (మా హితోపదేశాన్ని) వినలేకున్నారు

**101.** ఈ నగరాల వృత్తాంతాలను కొన్నింటిని మేము నీకు వినిపిస్తున్నాము. మరియు వాస్తవానికి వారి వద్దకు వారి ప్రవక్తలు స్పష్టమైన (నిదర్శనాలు) తీసుకొని వచ్చారు[46]. కాని వారు ముందు తిరస్కరించిన దానిని మరల విశ్వసించలేదు. ఈ విధంగా అల్లాహ్ సత్యతిరస్కారుల హృదయాలపై ముద్ర

[45] చూడండి, 3:54, 33:62 మరియు 35:43.
[46] చూడండి, 17:15.

వేస్తాడు. [47]

102. మరియు మేము వారిలో చాలా మందిని తమ వాగ్దానాన్ని పాటించే వారిగా చూడలేదు. మరియు వాస్తవానికి వారిలో చాలామందిని దుష్టులుగానే (ఫాసిఖీన్'గానే) పొందాము (చూశాం).

103. ఆ తరువాత మేము మూసాను మా సూచనలతో ఫిర్ఔన్ మరియు అతని నాయకుల వద్దకు పంపాము. వారు వాటి (మా సూచనల) పట్ల దుర్మార్గంతో ప్రవర్తించారు. కావున చూడండి, దౌర్జన్యపరుల గతి ఏమయిందో!

104. మరియు మూసా అన్నాడు: "ఓ ఫిర్ఔన్! నేను నిశ్చయంగా, సర్వలోకాల ప్రభువు యొక్క సందేశహరుడను!

105. "అల్లాహ్ ను గురించి సత్యం తప్ప మరే విషయాన్ని పలకని బాధ్యత గలవాడను. వాస్తవానికి, నేను మీ వద్దకు, మీ ప్రభువు తరఫు నుండి స్పష్టమైన సూచనలు తీసుకొని వచ్చాను, కావున

---

[47] అల్లాహ్ (సు.తా.) కు ప్రతిదానిని గురించి, దాని భూతకాలపు, వర్తమానకాలపు మరియు భవిష్యత్తు కాలపు విషయాలన్నీ తెలుసు. ఇదంతా ఒక గ్రంథంలో వ్రాయబడి ఉంది. అల్లాహుతా'ఆలా సర్వవ్యాప్తి, సర్వస్వపరిచితుడు. కాబట్టి, ఇక్కడ: "సత్యతిరస్కారుల హృదయాల మీద ముద్రవేయబడి ఉంది." అని చెప్పబడింది. ('స. బు'ఖారీ, తఫ్సీర్ సూ. అల్-లైయిల్)

ఇస్రాయీల్ సంతతి వారిని నా వెంట పోనివ్వు[48]."

106. (ఫిర్ఔన్) అన్నాడు: "నీవు ఏదైనా సూచనను తీసుకొని వచ్చి ఉంటే - నీవు సత్యవంతుడవే అయితే - దానిని తీసుకొనిరా!"

107. అప్పుడు (మూసా) తన చేతికర్రను విసిరాడు, అకస్మాత్తుగా అది ఒక స్పష్టమైన పెద్ద సర్పంగా (సుఅబాన్ గా) మారిపోయింది.

108. మరియు అతడు తన చేతిని బయటికి తీశాడు. ఇక అది చూసే వారికి తెల్లగా మెరుస్తూ కనిపించింది.

109. (ఇది చూసి), ఫిర్ఔన్ జాతి నాయకులు అన్నారు: "నిశ్చయంగా, ఇతడు నేర్పు గల ఒక గొప్ప మాంత్రికుడు!"

110. (ఫిర్ఔన్ అన్నాడు): "ఇతడు మిమ్మల్ని మీ భూమి నుండి వెడల గొట్ట గోరుతున్నాడు. అయితే! మీ సలహా ఏమిటి?"

111. వారన్నారు: "అతనికి (మూసాకు) మరియు అతని సోదరునికి కొంత వ్యవధి నిచ్చి, అన్ని నగరాలకు బంటులను పంపు.

112. "వారు నిపుణులైన ప్రతి మాంత్రికుణ్ణి నీ వద్దకు

---

[48] ఇస్రాయీ'ల్ సంతతి వారు అసలు సిరియా (షామ్) ప్రాంతపు వాసులు. యూసుఫ్ ('అ.స.) కాలంలో వారు ఈజిప్టులో స్థిరపడ్డారు. కాలచక్రంలో ఈజిప్టురాజులు మారిప పోయారు. వారి ప్రాధాన్యత తగ్గి, వారు ఫిర్'ఔనుల రాజరికంలో బానిసలుగా మారిపోయారు. మరియు ఎన్నో కష్టాలకు అవమానాలకు గురి చేయబడ్డారు. వారికి స్వాతంత్ర్యం ఇప్పించటానికి అల్లాహ్ (సు.తా.) మూసా ('అ.స.)ను ప్రవక్తగా చేసి పంపాడు.

తీసుకొని వస్తారు[49]."

113. మరియు మాంత్రికులందరూ ఫిర్‌ఔన్ వద్దకు వచ్చి: "ఒకవేళ మేము గెలిస్తే మాకు ప్రతిఫలం తప్పకుండా ఉంటుంది కదా!" అని అన్నారు.

114. (ఫిర్‌ఔన్) అన్నాడు: "అవును, నిశ్చయంగా మీరు నా సాన్నిధ్యాన్ని కూడా పొందుతారు."

115. వారన్నారు: "ఓ మూసా! (ముందు) నీవు విసురుతావా? లేక మేము విసరాలా?"

116. (మూసా) అన్నాడు: "(ముందు) మీరే విసరండి!" వారు (తమ కర్రలను) విసిరి ప్రజల చూపులను మంత్రముగ్ధం చేస్తూ వారికి భయం కలిగించే ఒక అద్భుతమైన మాయాజాలాన్ని ప్రదర్శించారు.

117. మేము మూసాకు: "నీ చేతికర్రను విసురు." అని ఆదేశమిచ్చాము. అప్పుడది వారి (మాంత్రికుల) బూటక (మాయాజాలాన్ని) మ్రింగి వేసింది.

118. ఈ విధంగా సత్యం స్థాపితమయ్యింది మరియు వారు (మాంత్రికులు) చేసిందంతా విఫలమయ్యింది.

119. ఈ విధంగా వారక్కడ అపజయం పొంది అవమానంతో కృంగిపోయారు.

120. మరియు మాంత్రికులు సాష్టాంగ పడ్డారు.

121. (మాంత్రికులు) అన్నారు: "మేము సర్వలోకాల ప్రభువును విశ్వసించాము.

122. మూసా మరియు హారున్ ల ప్రభువును."

123. ఫిర్‌ఔన్ అన్నాడు: "నేను అనుమతి ఇవ్వక

---

[49] చూడండి, 20:57-59.

ముందే మీరు అతనిని విశ్వసించారా? నిశ్చయంగా, మీరందరూ కలిసి ఈ నగరం నుండి దాని వాసులను వెడల గొట్టటానికి పన్నిన పన్నాగమిది, (దీని పరిణామం) మీరిప్పుడే తెలుసుకోగలరు.

124. "నేను తప్పక మీ ఒక ప్రక్క చేతులను మరొక ప్రక్క కాళ్ళను నరికిస్తాను. ఆ తరువాత మీరందరినీ సిలువపై ఎక్కిస్తాను."

125. వారు ఇలా జవాబిచ్చారు: "నిశ్చయంగా, మేము మా ప్రభువు వద్దకే కదా మరలిపోయేది!

126. మరియు మా ప్రభువు తరఫు నుండి మా వద్దకు వచ్చిన సూచనలను, మేము విశ్వసించామనే కదా! నీవు మాతో పగతీర్చుకోదలచావు." (ఇలా ప్రార్థించారు): "ఓ మా ప్రభూ! మాకు సహనమొసంగు మేము నీకు విధేయులముగా (ముస్లింలుగా మృతినొందేటట్లు చేయి!"

127. మరియు ఫిర్ఔన్ జాతి నాయకులు అతనితో అన్నారు: "ఏమీ? భూమిలో కల్లోలం రేకెత్తించటానికి మరియు నిన్నూ నీ దేవతలను విడిచి పోవటానికి, నీవు మూసాను మరియు అతని జాతి వారిని వదులుతున్నావా?" అతడు (ఫిర్ఔన్) జవాబిచ్చాడు: "మేము తప్పక వారి కుమారులను చంపి వారి కుమార్తెలను బ్రతకనిస్తాము. మరియు నిశ్చయంగా, మేము వారిపై ప్రాబల్యం కలిగి ఉన్నాము."

128. మూసా తన జాతి వారితో అన్నాడు: "అల్లాహ్

సహాయం కోరండి మరియు సహనం వహించండి. నిశ్చయంగా ఈ భూమి అల్లాహ్ దే! ఆయన తన దాసులలో, తాను కోరిన వారిని దానికి వారసులుగా చేస్తాడు. మరియు అంతిమ (సాఫల్యం) దైవభీతి గలవారిదే!"

**129.** (మూసా జాతివారు) అన్నారు: "నీవు రాక పూర్వమూ మరియు నీవు వచ్చిన తర్వాతనూ మేము బాధించబడ్డాము!" (మూసా) జవాబిచ్చాడు: "మీ ప్రభువు త్వరలోనే మీ శత్రువులను నాశనం చేసి మిమ్మల్ని భూమిలో ఖలీఫాలుగా[50] చేసినప్పుడు మీరు ఎలా ప్రవర్తిస్తారో ఆయన చూస్తాడు?"

**130.** మరియు వాస్తవానికి, మేము ఫిర్ఔన్ జాతి వారిని - బహుశా వారికి తెలివి వస్తుందేమోనని - ఎన్నో సంవత్సరాల వరకు కరువుకు, ఫలాల నష్టానికి గురిచేశాము.

**131.** ఆ పిదప వారికి మంచికాలం వచ్చినపుడు వారు: "మేము దీనికే అర్హులం!" అని అనేవారు. కాని వారికి కష్టకాలం దాపురించి నపుడు, వారు మూసా మరియు అతనితో పాటు ఉన్నవారిని తమకు

[50] యస్త'ఖ్లిఫకుమ్: అంటే మిమ్ముల్ని ఉత్తరాధికారులుగా, వారసులుగా లేక నాయకులుగా చేస్తాడు.

అపశకునంగా పరిగణించేవారు[51]. వాస్తవానికి వారి అపశకునాలన్నీ అల్లాహ్ చేతుల్లోనే ఉన్నాయి, కాని వారిలో చాలా మందికి తెలియదు.

**132.** మరియు వారు (మూసాతో) అన్నారు: "నీవు మమ్మల్ని భ్రమింపజేయటానికి ఏ సూచనను తెచ్చినా మేము నిన్ను నమ్మేవారం కాము!"

**133.** కావున మేము వారిపై జలప్రళయం (తూఫాన్), మిడుతల దండు, పేనులు, కప్పలు మరియు రక్తం మొదలైన స్పష్టమైన సూచనలను పంపాము[52]. అయినా వారు దురహంకారం చూపారు ఎందుకంటే వారు మహా అపరాధులై ఉండిరి.

**134.** మరియు వారిపైకి ఆపద వచ్చినపుడు వారనేవారు: "ఓ మూసా! నీ ప్రభువు నీకిచ్చిన వాగ్దానం ఆధారంగా నీవు మా కొరకు ప్రార్థించు! ఒకవేళ నీవు మా నుండి ఈ ఆపదను తొలగిస్తే మేము నిన్ను విశ్వసిస్తాము; మరియు ఇస్రాయీల్ సంతతివారిని తప్పక నీ వెంట పంపుతాము"

---

[51] 'తాఇ'రున్: ఎగురుట. 'తాఇ'రుహుమ్: అపశకునం. ప్రాచీన కాలంలో శుభ - అశుభ శకునాలను పక్షులను ఎగుర వేసి అంచనా వేసేవారు. శకునాలు చూడటం ఇస్లాంలో 'హరాం. శకునాలను గురించి ఇంకా చూడండి, 3:49, 5:110, 17:13, 27:47 మరియు 36:18-19.

[52] ఈ తొమ్మిది అద్భుత సూచనలు: 1) కర్ర, 2) చేయి తెల్లగా మారుట, 3) కరువు (ఫల, పంటల నష్టం), 4) జల ప్రళయం (తుఫాను), 5) మిడుతల దండు, 6) పేనులు, 7) కప్పలు, 8) రక్తం, 9) సముద్రంలో త్రోవ.

**135.** కానీ, ఒక నిర్ణీతకాలం వరకు వారి నుండి ఆపదను తొలగించగానే - ఆ కాలానికి వారు చేరుకోవలసిన వారే కాబట్టి - వారు తమ వాగ్దానాన్ని భంగపరిచేవారు!

**136.** కావున మేము వారికి ప్రతీకారం చేశాము మరియు వారిని సముద్రంలో ముంచి వేశాము; ఎందుకంటే! వాస్తవానికి వారు మా సూచనలను అసత్యాలని తిరస్కరించారు మరియు వాటిని లక్ష్యపెట్టకుండా ఉన్నారు.

**137.** మరియు వారి స్థానంలో బలహీనులుగా ఎంచబడేవారిని మేము శుభాలతో నింపిన, ఆ దేశపు తూర్పు భాగాలకు మరియు పశ్చిమ భాగాలకు వారసులుగా చేశాము[53]. ఈ విధంగా నీ ప్రభువు ఇస్రాయీల్ సంతతి వారికి చేసిన ఉత్తమమైన వాగ్దానం, వారు ఓర్పు వహించి నందుకు పూర్తయింది[54]. మరియు ఫిర్ఔన్ మరియు అతని జాతి వారు ఉత్పత్తి చేసిన వాటిని మరియు ఎత్తిన (నిర్మించిన) కట్టడాలను నాశనం చేశాము[55].

**138.** మరియు మేము ఇస్రాయీల్ సంతతి వారిని సముద్రం దాటించిన తరువాత వారు (నడుస్తూ)

---

[53] చూడండి, 3:26.

[54] ఈ వాగ్దానం కొరకు చూడండి, 7:128-129 మరియు 28:5-6.

[55] ఇస్రాయీ'ల్ సంతతివారు, బహుశా సూయిజ్ అగాధం (Gulf of Suez) దాటి సినాయి వైపుకు వెళ్ళారు. మరియు ఫిర్'ఔను మరియు అతని సైన్యం అందులో మునిగి పోయారు.

తమ విగ్రహాలను ఆరాధించే ఒక జాతి వద్దకు చేరారు[56]. వారన్నారు: "ఓ మూసా! వీరి ఆరాధ్య దైవాల వలే మాకు కూడా ఒక ఆరాధ్య దైవాన్ని నియమించు." (దానికి మూసా) జవాబిచ్చాడు: "నిశ్చయంగా, మీరు జ్ఞానహీనులైన జాతికి చెందినవారు."

**139.** "నిశ్చయంగా వీరు ఆచరిస్తున్నందుకు (విగ్రహారాధన చేస్తున్నందుకు) నాశనం చేయబడతారు. వీరు చేస్తున్నదంతా నిరర్థకమైనదే."

**140.** (మూసా ఇంకా) ఇలా అన్నాడు: "ఏమీ? నేను అల్లాహ్ ను వదలి మరొక ఆరాధ్యదైవాన్ని మీ కొరకు అన్వేషించాలా? వాస్తవానికి ఆయనే (మీకాలపు) సర్వలోకాల వారిపై మీకు ఘనతను ప్రసాదించాడు కదా!"

**141.** మరియు మేము మిమ్మల్ని ఫిర్ఔన్ జాతి వారి నుండి విముక్తి కలిగించిన సందర్భాన్ని (జ్ఞాపకం చేసుకోండి). వారు మిమ్మల్ని ఘోర బాధకు గురిచేస్తూ ఉన్నారు. మీ కుమారులను చంపి, మీ స్త్రీలను సజీవులుగా వదులుతూ ఉన్నారు. మరియు ఇందు మీ ప్రభువు తరఫు నుండి మీకొక గొప్ప పరీక్ష ఉండింది.

**142.** మరియు మేము మూసా కొరకు (సినాయి కొండపై)

---

[56] ఈ ప్రజలు ఎవరో ఖుర్ఆన్ లో లేదు. వారు అమాలేకీయ (Amalekites) తెగకు చెందిన 'అరబ్బులు కావచ్చు! వీరు దక్షిణ ఫలస్తీన్ లో మరియు సినాయి ద్వీపకల్పం (Peninsula) లో నివసించేవారు.

ముప్పై రాత్రుల (గడువు) నిర్ణయించాము. తరువాత పది (రాత్రులు) పొడిగించాము. ఈ విధంగా అతని ప్రభువు నిర్ణయించిన నలభై రాత్రుల గడువు పూర్తయ్యింది. మూసా తన సోదరుడగు హారూన్ తో అన్నాడు: "నీవు నా జాతి ప్రజలలో నాకు ప్రాతినిథ్యం వహించు మరియు సంస్కరణకు పాటు పడు మరియు అరాచకాలు చేసేవారి మార్గాన్ని అనుసరించకు."

**143.** మరియు మూసా మేము నిర్ణయించిన సమయానికి (మా నిర్ణీత చోటుకు) వచ్చినపుడు, అతని ప్రభువు అతనితో మాట్లాడాడు. (మూసా) అన్నాడు: "ఓ నా ప్రభూ! నాకు నీ దర్శన భాగ్యమివ్వు (కనిపించు). నేను నిన్ను చూడదలచాను!" (అల్లాహ్) అన్నాడు: "నీవు నన్ను (ఏ మాత్రం) చూడలేవు! కాని ఈ పర్వతం వైపుకు చూడు! ఒకవేళ అది తన స్థానంలో స్థిరంగా ఉండగలిగితే, అప్పుడు నీవు నన్ను చూడగలవనుకో[57]!" అతని ప్రభువు ఆ కొండపై తన తేజస్సును ప్రసరింపజేయగా అది భస్మమై పోయింది మరియు మూసా స్పృహ తప్పి పడిపోయాడు. తెలివి వచ్చిన తరువాత (మూసా) అన్నాడు: "నీవు సర్వలోపాలకు అతీతుడవు,

[57] 'స'హీ'హ్ 'హదీస్'ల ద్వారా విశదమయ్యేది ఏమిటంటే, ఇహలోక జీవితంలో ఏ మానవుడు కూడా అల్లాహ్ (సు.తా.) ను చూడలేడు. అహ్లె-సున్నత్ వారి అఖీదహ్ ఏమిటంటే పునరుత్థాన దినమున అహ్లె ఈమాన్ (విశ్వాసు)లకు అల్లాహుతా'ఆలా దర్శనభాగ్యం లభిస్తుంది. మరియు స్వర్గంలో కూడా వారికి అల్లాహ్ (సు.తా.) దర్శనం లభిస్తుంది.

నేను పశ్చాత్తాపంతో నీ వైపుకు మరలుతున్నాను మరియు నేను విశ్వసించేవారిలో మొట్టమొదటి వాడను[58]."

**144.** (అల్లాహ్) అన్నాడు: "ఓ మూసా ప్రవక్త పదవికి మరియు సంభాషించటానికి - నిశ్చయంగా, నేను ప్రజలందరిలో, నిన్ను ఎన్నుకున్నాను. కావున నేను నీకిచ్చిన దానిని తీసుకొని, కృతజ్ఞులలో చేరు."

**145.** మరియు మేము అతని కొరకు, ఫలకాల మీద ప్రతి విధమైన ఉపదేశాన్ని ప్రతి వ్యవహారానికి సంబంధించిన వివరాలను వ్రాసి ఇచ్చి, అతనితో (మూసాతో) అన్నాము: "వీటిని గట్టిగా పట్టుకో! మరియు వీటి ఉత్తమ ఉపదేశాలను అనుసరించమని నీ జాతి వారిని ఆజ్ఞాపించు. త్వరలోనే నేను అవిధేయుల (ఫాసిఖూన్ ల) నివాసాన్ని మీకు చూపుతాను[59]."

**146.** ఏ హక్కూ లేకుండా భూమిపై దురహంకారంతో వ్యవహరించే వారిని నేను నా సూచనల (ఆయాత్ ల) నుండి దూరం చేస్తాను. మరియు వారు ఏ సూచనను (ఆయత్ ను) చూసినా దానిని

---

[58] ఇది రెండవసారి మూసా ('అ.స.) అల్లాహ్ (సు.తా.)తో మాట్లాడింది. మొదటిసారి అతను 'తువా వాదిలో వెలుగు చూసి దాని నుండి కొరివి తీసుకురావటానికి పోయినప్పుడు, అల్లాహుతా'ఆలా అతనిని ప్రవక్తగా ఎన్నుకొని ఫిర్'ఔను జాతి వద్దకు అద్భుత చిహ్నాలతో పంపాడు.

[59] ఇది అమాలేకీయుల షామ్ రాజ్యం కావచ్చు. వారు అల్లాహుతా'ఆలాకు అవిధేయులై ఉండిరి. (ఇబ్నె-కసీ'ర్).

విశ్వసించరు[60]. ఒకవేళ సక్రమమైన మార్గం వారి ముందుకు వచ్చినా, వారు దానిని అవలంబించరు. కాని వారు తప్పు దారిని చూస్తే దానినిఅవలంబిస్తారు.[61]ఎందుకంటేవాస్తవానికి, వారు మా సూచనలను (ఆయాత్ లను) అబద్ధాలని తిరస్కరించారు మరియు వాటి నుండి నిర్లక్ష్యులై ఉన్నారు[62].

**147.** మరియు మా సూచనలను (ఆయాత్ లను) మరియు పరలోక దర్శనాన్ని (పునరుత్థాన దినాన్ని ) అబద్ధాలని తిరస్కరించిన వారు చేసిన కర్మలన్నీ వ్యర్థమవుతాయి. ఏమీ? వారు కేవలం తమ కర్మలకు తగిన ప్రతిఫలం తప్ప మరేమైనా పొందగలరా!

**148.** మరియు మూసా జాతి వారు, అతను పోయిన పిదప తమ ఆభరణాలతో ఒక ఆవు దూడ విగ్రహాన్ని తయారు చేశారు. దానిలో నుండి (ఆవు అరుపు వంటి) ధ్వని వచ్చేది. ఏమీ? అది వారితో మాట్లాడజాలదని మరియు వారికి ఏ విధమైన మార్గదర్శకత్వం చేయజాలదని వారికి తెలియదా? అయినా వారు దానిని (దైవంగా)

---

[60] చూడండి, 10:96-97.

[61] ఈ విషయం ఈ కాలంలో గూడ జరుగుతోంది. ఈ కాలపు చాలా మంది ముస్లింలు కూడా మంచి నుండి దూరమై పోతున్నారు మరియు చెడును అవలంబిస్తున్నారు.

[62] చూడండి, 96:67.

చేసుకొని పరమ దుర్మార్గులయ్యారు[63].

149. మరియు వారు మార్గం తప్పారని తెలుసుకున్నప్పుడు పశ్చాత్తాపంతో మొత్తుకుంటూ అనేవారు: "మా ప్రభువు మమ్మల్ని కరుణించి, మమ్మల్ని క్షమించక పోతే మేము తప్పక నాశనం అయ్యే వారమే!"

150. మరియు మూసా తన జాతి వారి వద్దకు తిరిగి వచ్చి క్రోధంతో విచారంతో అన్నాడు: "నేను వెళ్ళిన పిదప మీరు ఆచరించింది ఎంత చెడ్డది! ఏమీ? మీ ప్రభువు ఆజ్ఞ (రాకముందే) తొందరపడి (ఆయన ఆరాధనను వదిలారా)?" తరువాత ఫలకాలను పడవేసి[64], తన సోదరుని తల

---

[63] మూసా ('అ.స.) 'తూర్ పర్వతం పైకి నలభై రాత్రుల కొరకు వెళ్ళినప్పుడు సామిరి ప్రజల ఆభరణాలతో ఒక ఆవు దూడ విగ్రహాన్ని తయారు చేస్తాడు. అందులో నుండి గాలి దూరినప్పుడు ఆవు అరుపు వంటి అరుపు వచ్చేది. దానిని అతడు ఇదే మీ ఆరాధ్య దైవం అని అంటాడు. ప్రజలు మూఢత్వంలో అతనిని అనుసరించి దానిని పూజించ సాగుతారు. ఏ విధంగానైతే ఈ నాడు కూడా, ఈ విధమైన మూఢనమ్మకాలు గలవారి కొరత లేదో! అది వారికి లాభం గానీ, నష్టం గానీ చేయలేదని తెలిసి కూడా, ప్రజలు ఇటువంటి వాటిని ఆరాధించడం, ప్రాచీన కాలం నుండి వస్తున్న తప్పుడు ఆచారమే!

[64] మూసా ('అ.స.) తన జాతివారు అల్లాహ్ (సు.తా.) ను వదలి ఆవుదూడ విగ్రహాన్ని ఆరాధించటాన్ని చూసి, క్రోధావేశంలో ఏమీ తోచక - తన సోదరుణ్ణి పట్టుకొని శిక్షించటానికి, తన చేతులలో ఉన్న ఫలకాలను క్రిందపెట్టి - తన సోదరుని తలవెంట్రుకలను పట్టుకున్నారే గానీ, ఫలకాలకు అనాదరణ చేయటం అతని ఉద్దేశం కాదు. కోపం చల్లారిన తరువాత అతను వాటిని ఎత్తుకున్నారు. చూడండి, ఆయత్, 154.

వెంట్రుకలను పట్టుకొని తన వైపుకు లాగాడు. (హారూన్) అన్నాడు: "నా సోదరుడా (తల్లి కుమారుడా!) వాస్తవానికి ఈ ప్రజలు బలహీనునిగా చూసి నన్ను చంపేవారే,[65] కావున నీవు (మన) శత్రువులకు, నన్ను చూసి సంతోషించే అవకాశం ఇవ్వకు మరియు నన్ను దుర్మార్గులలో లెక్కించకు!"

**151.** (మూసా) అన్నాడు: "ఓ నా ప్రభూ! నన్నూ మరియు నా సోదరుణ్ణి క్షమించు. మరియు మా ఇద్దరినీ నీ కారుణ్యంలోకి చేర్చుకో. మరియు నీవే కరుణించే వారిలో అందరి కంటే అధికంగా కరుణించేవాడవు!"

**152.** ఆవుదూడను (దైవంగా) చేసుకున్న వారు తప్పకుండా తమ ప్రభువు ఆగ్రహానికి గురి అవుతారు మరియు వారు ఇహలోక జీవితంలో అవమానం పాలవుతారు. మరియు అసత్యాలు కల్పించే వారిని మేము ఇదే విధంగా శిక్షిస్తాము.

**153.** మరియు ఎవరు దుష్కార్యాలు చేసిన పిదప, పశ్చాత్తాపపడతారో మరియు విశ్వసిస్తారో! అలాంటి వారు నిశ్చయంగా, ఆ తరువాత నీ ప్రభువును క్షమించేవాడుగా, కరుణించేవాడుగా పొందుతారు.

**154.** మరియు మూసా కోపం చల్లారిని తరువాత ఆ

---

[65] చూడండి, 20:92-94.

ఫలకాలను ఎత్తుకున్నాడు[66]. మరియు తమ ప్రభువుకు భయపడేవారికి, వాటి వ్రాతలలో మార్గదర్శకత్వం మరియు కారుణ్యం ఉన్నాయి.

155. మరియు మేము నిర్ణయించిన గడువు కొరకు, మూసా తన జాతి వారిలో నుండి డెబ్భై మందిని ఎన్నుకున్నాడు. ఆ పిదప వారిని భూకంపం ఆవరించగా[67] (మూసా) ఇలా ప్రార్థించాడు: "ఓ నా ప్రభూ! నీవు కోరితే, వీరిని మరియు నన్ను కూడాఇంతకుపూర్వమేసంహరించిఉండేవాడవు. ఏమీ? మాలో కొందరు మూఢులు చేసిన పనికి నీవు మమ్మల్ని నశింప జేస్తావా? ఇదంతా నీ పరీక్షయే! దీని ద్వారా నీవు కోరిన వారిని మార్గభ్రష్టత్వానికి గురి చేస్తావు మరియు నీవు కోరిన వారికి మార్గదర్శకత్వం చేస్తావు. మా సంరక్షకుడవు నీవే, కావున మమ్మల్ని క్షమించు, మమ్మల్ని కరుణించు. మరియు క్షమించే వారందరిలో నీవే అత్యుత్తముడవు!"

156. "మాకు ఇహలోకంలో మరియు పరలోకంలో

---

[66] మూసా ('అ.స.) ఫలకాలను క్రింద పెట్టారు. అవి ముక్కలు కాలేదు. కావున కోపం చల్లారిన తరువాత మూసా ('అ.స.) ఆ ఫలకాలను తిరిగి తీసుకున్నారు.

[67] చూడండి, 2:55 అక్కడ పిడుగు ('సా'యిఖతున్) పడి ఆ 70 మంది చనిపోయినట్లు ఉంది. బహుశా ఈ రెండు శిక్షలు వచ్చి ఉండవచ్చు. మూసా ('అ.స.) ప్రార్థన వల్ల ఆ 70 మంది మళ్ళీ సజీవులయ్యారు.

కూడా మంచి స్థితినే వ్రాయి. నిశ్చయంగా మేము నీ వైపునకే మరలాము." (అల్లాహ్) సమాధానం ఇచ్చాడు: "నేను కోరిన వారికి నా శిక్షను విధిస్తాను. నా కారుణ్యం ప్రతి దానిని ఆవరించి ఉన్నది[68]. కనుక నేను దానిని దైవభీతి గలవారికీ, విధిదానం (జకాత్) ఇచ్చేవారికీ మరియు నా సూచనలను విశ్వసించేవారికీ వ్రాస్తాను!

**157.** "ఎవరైతే ఈ సందేశహరుణ్ణి నిరక్ష్యరాస్యుడైన[69] ఈ ప్రవక్తను అనుసరిస్తారో! ఎవరి ప్రస్తావన వారి వద్ద వున్న తౌరాత్ మరియు ఇంజీల్ గ్రంథాలలో

---

[68] చూడండి, 6:12 మరియు 54.

[69] అల్లాహ్ (సు.తా.) ఇక్కడ ము'హమ్మద్ ('స'అస) ను నిరక్షరాస్యుడైన ప్రవక్త అని విశదం చేస్తున్నాడు. అంటే అతను ఏమీ చదువనూ లేరు మరియు వ్రాయనూ లేరు. కాబట్టి అతను చెప్పే మాటలు ప్రాచీన గ్రంథాలలో నుండి చదివినవి కావు, అవి దివ్యజ్ఞానం (వ'హీ) ద్వారా అతనిపై అవతరింప జేయబడినవి. కావున అతను వాటిని ప్రాచీన గ్రంథాలలో వ్రాయబడిన విధంగా గాకుండా నిజమైన వృత్తాంతాలను బోధించారు. ఎందుకంటే కొన్ని విషయాలు, ఈనాటి తౌరాత్ మరియు ఇంజీల్ లలో మార్చబడ్డాయి. వాటి నిజ వృత్తాంతం కేవలం అల్లాహుతా'ఆలా కే తెలుసు కాబట్టి 1400 సంవత్సరాలలో ఒక్క అక్షరపు మార్పు కూడా చెందని ఈ ఖుర్ఆన్ లో వచ్చిన అల్లాహుతా'ఆలా వ'హీయే పరమసత్యం. అల్లాహ్ (సు.తా.) స్వయంగా తీర్పుదినం వరకు ఈ ఖుర్ఆన్ ను , అది ఉన్నది ఉన్నట్లుగా భద్రంగా ఉంచుతానని తన గ్రంథంలో విశదం చేశాడు. చూడండి, ఖుర్ఆన్, 2:42, 4:47, 57:28, 61:6, 15:9.

వ్రాయ బడి ఉన్నదో[70], అతను వారికి ధర్మమును ఆదేశిస్తాడు మరియు అధర్మము నుండి నిషేధిస్తాడు మరియు వారి కొరకు పరిశుద్ధమైన వస్తువులను ధర్మసమ్మతం చేసి అపరిశుద్ధమైన వాటిని నిషేధిస్తాడు. వారిపై మోపబడిన భారాలను మరియు వారి నిర్భంధాలను తొలగిస్తాడు. కావున అతనిని సమర్థించి, అతనితో సహకరించి, అతనిపై అవతరింప జేయబడిన జ్యోతిని అనుసరించే వారు మాత్రమే సాఫల్యం పొందేవారు."

158. (ఓ ముహమ్మద్!) వారిలో ఇలా అను: "మానవులారా! నిశ్చయంగా, నేను మీ అందరి వైపునకు (పంపబడిన) అల్లాహ్ యొక్క

[70] ము'హమ్మద్ ('స'అస) అరబ్బులలో నుండి దైవప్రవక్తగా రాబోతున్నాడనే ప్రస్తావన కొరకు చూడండి, బైబిల్, ద్వితీయోపదేశ కాండము - (Deuteronomy) 18:15, 18; కీర్తనలు - (Pslams), 118:22-23; యెషయా - (Isaiah), 42:1-13; హబక్కూకు - (Habakkuk), 3:3-4; మత్తయి - (Mathew), 21:42-43; యోహాను - (John), 14:16-17, 26-28, 16:7-14.

సందేశహరుడను[71]. భూమ్యాకాశాల సామ్రాజ్యా ధిపత్యం ఆయనదే. ఆయన తప్ప మరొక ఆరాధ్యదేవుడు లేడు; ఆయనే జీవన్మరణాలను ఇచ్చేవాడు. కావున అల్లాహ్ ను మరియు ఆయన సందశహరుడు నిరక్షరాస్యుడైన ఈ ప్రవక్తను విశ్వసించండి. అతను అల్లాహ్'ను మరియు ఆయన సందేశాలను విశ్వసిస్తాడు. అతనినే అనుసరించండి అప్పుడే మీరు మార్గదర్శకత్వం పొందుతారు!"[72]

**159.** మరియు మూసా జాతివారిలో సత్యం ప్రకారమే

---

[71] పూర్వప్రవక్తలు ('అలైహిమ్ స.) తమ తమ జాతులవారి వద్దకే పంపబడి వుండిరి. మూసా ('అ.స.) ఇస్రాయీ'ల్ సంతతివారి కొరకు వచ్చారని తౌరాత్ అంటుంది. 'ఈసా ('అ.స.) : "నేను దారి తప్పిన ఇస్రాయీ'ల్ సంతతి వారి కొరకు పంపబడ్డాను." అని అన్నారు. చూడండి, 5:46 వ్యాఖ్యానం 1. కాని ఇక్కడ అల్లాహ్ (సు.తా.) అంటున్నాడు: "(ఓ ము'హమ్మద్!) వారితో అను: 'ఓ మానవులారా! నిశ్చయంగా, నేను మీ అందరివైపుకు పంపబడిన సందేశహరుడను, (ర'హ్మతల్ లిల్ 'ఆలమీన్, 21:107),' మరియు : 'ప్రవక్తలందరి ముద్రను ('ఖాతమన్నబియ్యీన్, 33:40' "

[72] ఇక్కడమరొకసారినిరక్షరాస్యుడుగా,దైవప్రవక్తగా,ము'హమ్మద్ ('స'అస) పేర్కొనబడ్డారు. అంటే అతనికి ఏ మానవ గురువు లేడు. అతను నేర్చుకున్నది, దైవదూత జిబ్రీల్ ('అ.స.) తెచ్చిన, అల్లాహ్ (సు.తా.) దివ్యజ్ఞానం (వ'హీ), ద్వారా మాత్రమే. చూశారా! అది ఎంత మహత్త్యమైనదో! ఈనాటికి కూడా దాని వంటి ఒక్క సూరహ్ కూడా ఎవ్వరూ రచించి తేలేక పోయారు. ఎందుకంటే ఇది (దివ్యఖుర్ఆన్) మానవ రచన కాదు, అల్లాహుతా'ఆలా తరపు నుండి అవతరింపజేయబడిన దివ్యజ్ఞానం. ఇది అల్లాహ్ (సు.తా.) ద్వారానే పునరుత్థాన దినం వరకు భద్రంగా చబడుతుందని అల్లాహుతా'ఆలా వ్యక్తం కూడా చేశాడు. చూడండి, 15:9.

మార్గదర్శకత్వం చూపుతూ మరియు దాని (సత్యం) ప్రకారమే న్యాయం చేసే ఒక వర్గం వారు ఉన్నారు[73].

**160.** మరియు మేము వారిని పన్నెండు తెగలుగా (వర్గాలుగా) విభవించాము[74]. మరియు మూసా జాతి వారు అతనిని నీటి కొరకు అడిగినపుడు, మేము అతనిని: "నీ చేతికర్రతో రాయి పై కొట్టు!" అని ఆజ్ఞాపించాము. అపుడు దాని నుండి పన్నెండు ఊటలు ప్రవహించ సాగాయి. అపుడు ప్రతి తెగవారు, తాము నీళ్ళు తీసుకునే స్థలాన్ని తెలుసుకున్నారు. మరియు మేము వారిపై మేఘాల ఛాయను కల్పించాము. మరియు వారి కొరకు మన్న మరియు సల్వాలను దింపాము[75]: "మేము మీకు ప్రసాదించిన పరిశుద్ధమైన పదార్థాలను తినండి." అని అన్నాము. మరియు వారు మాకు అన్యాయం చేయలేదు, కాని తమకు తామే అన్యాయం చేసుకున్నారు.

**161.** మరియు వారికి ఇలా ఆజ్ఞ ఇవ్వబడిన సందర్భాన్ని (జ్ఞాపకం చేసుకోండి!): "ఈ నగరంలో నివసించి, అందులో మీ ఇష్టప్రకారం తినండి. మరియు : 'మా పాపాలను క్షమించు (హిత్తతున్), అని అంటూ ఉండండి. మరియు సాష్టాంగ పడుతూ దాని ద్వారంలో ప్రవేశించండి, మేము మీ

---

[73] చూడండి, 3:113-115. ఉదాహరణకు 'అబ్దుల్లాహ్ బిన్ సల్లామ్.

[74] చూడండి, 5:12.

[75] చూడండి, 2:57.

పాపాలను క్షమిస్తాము. మేము సజ్జనులను అధికంగా (అనుగ్రహిస్తాము)."

**162.** కాని వారిలో దుర్మార్గులైన వారు తమకు చెప్పబడిన మాటను మార్చి, మరొకు మాటను ఉచ్ఛరించారు; కావున వారు చేస్తున్న దుర్మార్గానికి ఫలితంగా మేము వారిపై ఆకాశం నుండి ఆపదను పంపాము[76].

**163.** మరియు సముద్ర తీరము నందున్న ఆ నగర (వాసులను) గురించి వారిని అడుగు; వారు శనివారపు (సబ్త్) ధర్మాన్ని ఉల్లంఘించేవారు! ఆ శనివారం (సబ్త్) రోజుననే చేపలు వారి ముందుకు ఎగిరెగిరి నీటిపైకి వచ్చేవి. మరియు శనివారపు (సబ్త్) ధర్మం పాటించని రోజు (చేపలు) వచ్చేవి కావు. వారి అవిధేయతకు కారణంగా మేము వారిని ఈ విధంగా పరీక్షకు గురిచేశాము[77].

**164.** వారిలోని ఒక వర్గం వారు: "అల్లాహ్ ఎవరిని నశింప జేయనున్నాడో లేదా ఎవరికి కఠినశిక్ష విధించనున్నాడో! అలాంటి వారికి, మీరెందుకు ఉపదేశం చేస్తున్నారు?" అని అంటే అతను (ఉపదేశం చేసే వ్యక్తి) అన్నాడు: "మీ ప్రభువు ముందు, (హితబోధ ఎందుకు చేయలేదని), నాపై నింద ఉండకుండా మరియు వారు దైవభీతి

---

[76] ఆయత్ లు 160-162లలో వివరించబడిన విషయాలు సూరహ్ అల్ బఖరహ్ మొదటి భాగంలో కూడా ఉన్నాయి. (2:58-59).

[77] చూడండి, బైబిల్ యిర్మియా - (Jeremia), 17:21-27.

గల వారు అవుతారేమోనని!"

**165.** తరువాత వారికి చేయబడిన హితబోధను వారు మరచినప్పుడు! దుష్కార్యాల నుంచి వారిస్తూ ఉన్న వారిని మేము రక్షించాము. మరియు దుర్మార్గులైన ఇతరులను, అవిధేయత చూపినందుకు కఠినశిక్షకు గురిచేశాము.

**166.** కాని నిషేధించబడిన వాటినే వారు హద్దులు మీరి చేసినప్పుడు మేము వారితో: "మీరు నీచమైన కోతులుగా మారండి." అని అన్నాము[78].

**167.** మరియు నీ ప్రభువు వారిపై (యూదులపై) అంతిమదినం వరకు దుఃఖకరమైన శిక్ష విధించే వారిని పంపుతూ ఉంటానని ప్రకటించిన విషయాన్ని (జ్ఞప్తికి తెచ్చుకోండి)[79]. నిశ్చయంగా, నీ ప్రభువు శిక్ష విధించటంలో శీఘ్రుడు, మరియు నిశ్చయంగా ఆయన క్షమాశీలుడు, అపార కరుణాప్రదాత.

**168.** మరియు మేము వారిని భువిలో వేర్వేరు తెగలుగా జేసి వ్యాపింప జేశాము. వారిలో కొందరు సన్మార్గులున్నారు, మరి కొందరు దానికి దూరమైన వారున్నారు. బహుశా వారు (సన్మార్గానికి) మరలి వస్తారేమోనని, మేము వారిని మంచి-చెడు స్థితుల ద్వారా పరీక్షించాము.

**169.** ఆ పిదప వారి తరువాత దుష్టులైనవారు వారి స్థానంలో గ్రంథానికి వారసులై, తుచ్ఛమైన

---

[78] చూడండి, 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 8, 'హదీస్' నం. 481. ఇంకా చూడండి, 2:65, 5:60.

[79] చూడండి, 3:112.

ప్రాపంచిక వస్తువుల లోభంలో పడుతూ: "మేము క్షమింపబడతాము" అని పలుకు తున్నారు. అయినా ఇటువంటి సొత్తు తిరిగి వారికి లభిస్తే దానిని తీసుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. "అల్లాహ్ విషయంలో సత్యం తప్ప మరేమీ పలుకరాదు." అని గ్రంథంలో వారితో వాగ్దానం తీసుకో బడలేదా ఏమిటి? అందులో (గ్రంథంలో) ఉన్నదంతా వారు చదివారు కదా! మరియు దైవభీతి గలవారి కొరకు పరలోక నివాసమే ఉత్తమమైనది, ఏమీ? మీరిది గ్రహించలేరా?

**170.** మరియు ఎవరైతే గ్రంథాన్ని స్థిరంగా అనుసరిస్తారో మరియు నమాజ్ స్థాపిస్తారో, అలాంటి సద్వర్తనుల ప్రతిఫలాన్ని నిశ్చయంగా మేము వ్యర్థంచేయము.

**171.** మరియు (జ్ఞాపకం చేసుకోండి!) మేము (తూర్) పర్వతాన్ని పైకెత్తి వారిపై కప్పుగా ఉంచితే! వాస్తవానికి, వారు అది తమపై పడుతుందేమోనని భావించినప్పుడు మేము వారితో అన్నాము: "మేము మీకు ఇచ్చిన దానిని (గ్రంథాన్ని) దృఢంగా పట్టుకోండి మరియు అందులో ఉన్న దానిని జ్ఞాపకం ఉంచుకోండి, దానితో మీరు దైవభీతి పరులు కావచ్చు!"

**172.** మరియు (జ్ఞాపకం చేసుకోండి!) నీ ప్రభువు ఆదమ్ సంతతి వారి వీపున నుండి వారి సంతానాన్ని తీసి, వారికి వారినే సాక్షులుగా నిలబెట్టి: "ఏమీ? నేను మీ ప్రభువును కానా?"అని అడుగగా! వారు: "అవును! (నీవే మా ప్రభువని)

మేము సాక్ష్యమిస్తున్నాము." అని జవాబి
చ్చారు[80]. తీర్పుదినమున మీరు: "నిశ్చయంగా,
మేము దీనిని ఎరుగము." అని అనగూడదని.
173. లేక: "వాస్తవానికి ఇంతకు పూర్వం మా
తాతముత్తాతలు అల్లాహ్ కు సాటి (భాగస్వాములు)
కల్పించారు. మేము వారి తరువాత వచ్చిన, వారి
సంతతి వారం (కాబట్టి వారిని అనుసరించాము).
అయితే? ఆ అసత్యవాదులు చేసిన కర్మలకు
నీవు మమ్మల్ని నశింప జేస్తావా?" అని
అనగూడదని.
174. మరియు ఈ విధంగానైనా వారు సన్మార్గానికి
మరలుతారేమోనని మేము ఈ సూచనలను
స్పష్టంగా తెలుపుతున్నాము.
175. మరియు మేము, మా సూచనలు (ఆయాత్)
ప్రసాదించిన ఆ వ్యక్తి గాథ వారికి వినిపించు.
అతడు వాటి నుండి విముఖుడై నందుకు షైతాన్
అతనిని వెంబడించాడు, కావున అతడు
మార్గభ్రష్టులలో చేరిపోయాడు.
176. మరియు మేము కోరుకుంటే వాటి (ఆ సూచనల)
ద్వారా అతనికి ఔన్నత్యాన్ని ప్రసాదించేవారము.
కాని అతడు భూమి వైపునకు వంగాడు, మరియు

---

[80] చూడండి, 'స'హీ'హ్ బు'ఖారీ, కితాబుల్ జనాయ"జ్, మరియు ముస్లిం, కితాబుల్ ఖద్ర్: "ప్రతి బిడ్డ సహజ స్వభావంతో పుడ్తాడు. అంటే అల్లాహ్ (సు.తా.)కు విధేయత (ఇస్లాం)తో. కానీ, అతని తల్లిదండ్రులు అతనిని యూదుడు, క్రైస్తవుడు మజూసి లేక ఇతర ధర్మం వాడిగా మార్చుతారు."

తన కోరికలను అనుసరించాడు. అతని దృష్టాంతం ఆ కుక్క వలె ఉంది: నీవు దానిని బెదిరించినా అది నాలుకను బయటికి ప్రేలాడదీస్తుంది, లేక వదలి పెట్టినా అది నాలుకను బయటికి ప్రేలాడదీస్తుంది. మా సూచన (ఆయాత్) లను అబద్ధాలని నిరాకరించే వారి దృష్టాంతం కూడా ఇదే! నీవు వారికి ఈ గాథలను వినిపిస్తూ ఉంటే, బహుశా వారు ఆలోచించవచ్చు!

177. మా సూచనలను అబద్ధాలని తిరస్కరించే వారి దృష్టాంతం చాలా చెడ్డది. ఎందుకంటే వారు తమకు తాము అన్యాయం చేసుకుంటున్నారు.

178. అల్లాహ్ మార్గదర్శకత్వం చేసిన వాడే సన్మార్గం పొందుతాడు. ఆయన మార్గభ్రష్టత్వంలో పడ నిచ్చినవారు! వారే నష్టపోయేవారు.

179. మరియు వాస్తవానికి మేము చాలా మంది జిన్నాతులను మరియు మానవులను నరకం కొరకు సృజించాము. ఎందుకంటే! వారికి హృదయాలున్నాయి కాని వాటితో వారు అర్థం చేసుకోలేరు మరియు వారికి కళ్ళున్నాయి కాని వాటితో వారు చూడలేరు మరియు వారికి చెవులున్నాయి కాని వాటితో వారు వినలేరు. ఇలాంటి వారు పశువుల వంటి వారు; కాదు! వాటి కంటే అధములు. ఇలాంటి వారే నిర్లక్ష్యంలో మునిగి ఉన్నవారు.

180. మరియు అల్లాహ్ పేర్లు! అన్నీ అత్యుత్తమమైనవే;

కావున మీరు వాటితో ఆయనను ప్రార్థించండి[81]. మరియు ఆయన పేర్ల విషయంలో సత్యం నుండి వైదొలగిన వారిని విసర్జించండి. వారు తమ కర్మలకు ప్రతిఫలం పొందగలరు.

181. మరియు మేము సృష్టించిన వారిలో ఒక వర్గం వారు సత్యం ప్రకారం మార్గదర్శకత్వం చేసేవారునూ మరియు దానిని అనుసరించియే న్యాయం చేసేవారునూ ఉన్నారు.

182. మరియు మా సూచనలను అబద్ధాలని తిరస్కరించేవారిని, మేము వారికి తెలియ కుండానే క్రమక్రమంగా (నాశనం వైపునకు) తీసుకుపోతాము.

183. మరియు నేను వారికి వ్యవధి నిస్తున్నాను. నిశ్చయంగా, నా వ్యూహం బలమైనది[82].

---

[81] 'హదీస్'లలో అల్లాహ్ (సు.తా.) ఉత్తమ పేర్లు 99 ఉన్నాయని ఉంది. కాని ఇబ్నె-కసీ'ర్ మరియు ఫ'త్హ అల్ ఖదీర్ లలో, ఇవి 99 కంటే ఎక్కువ ఉన్నాయని ఉంది. ఈ శబ్దం అల్-అస్మా'ఉ'ల్ 'హుస్నా ఖుర్ఆన్ లో నాల్గుసార్లు వచ్చింది. ఈ ఆయత్ లో మరియు 17:110, 20:8 మరియు 59:24. ఈ శబ్దం అల్-అస్మా'ఉ'ల్ 'హుస్నా ఖుర్ఆన్ లో కేవలం అల్లాహ్ (సు.తా.) కొరకే వాడబడింది. యు'ల్హిదూన: అంటే ఒకవైపుకు మొగ్గటం. వ్యంగ్యార్థం తీయటం, మార్గభ్రష్టత్వంలో పడి పోవటం. Profanity భక్తిహీనంగా ప్రవర్తించటం, అగౌరవపరచటం, అల్లాహ్ (సు.తా.) పేర్ల విషయంలో తప్పు త్రోవలో పోవుటలో మూడు రకాలు ఉన్నాయి: 1) అల్లాహుతా'ఆలా పేర్లలో మార్పులు చేయటం. ఉదా: మక్కా ముష్రికులు 'అ'జీ'జ్ ను 'ఉ'జ్జా' గా మార్చింది. 2) అల్లాహుతా'ఆలా పేర్లను హెచ్చించటం. 3) అల్లాహుతా'ఆలా పేర్లను తగ్గించటం. (ఫ'త్హ అల్ ఖదీర్).

[82] చూడండి, 68:45. ఆ ఆయత్ లో ఖుర్ఆన్ అవతరణలో మొదటిసారి 'కైద్' పదం వాడబడింది.

**184.** ఏమీ? తన సహచరుడు పిచ్చి పట్టిన వాడు కాదని వారు గమనించలేదా? అతను కేవలం స్పష్టమైన హెచ్చరిక చేసేవాడు మాత్రమే!

**185.** ఏమీ? వారు భూమ్యాకాశాలపై గల (అల్లాహ్) ఆధిపత్యాన్ని మరియు అల్లాహ్ సృష్టించిన ప్రతివస్తువును గమనించి చూసి, బహుశా తమ గడువుకూడాసమీపించిందేమోననిఅనుకోలేరా? దీని తరువాత వారు మరేవిధమైన సందేశాన్ని విశ్వసిస్తారు?

**186.** అల్లాహ్ మార్గభ్రష్టత్వంలో పడనిచ్చిన వానికి మార్గదర్శకుడెవ్వడూ లేడు![83] మరియు ఆయన వారిని తమ తలబిరుసుతనంలో త్రోవతప్పి తిరుగటానికి వదలిపెడుతున్నాడు.

**187.** (ఓ ప్రవక్తా!) వారు నిన్ను ఆ అంతిమఘడియను గురించి: "అది ఎప్పుడు రానున్నది?" అని అడుగుతున్నారు. వారితో ఇలా అను: "నిస్సందేహంగా, దాని జ్ఞానం నా ప్రభువుకు

[83] ఇక్కడ మరియు 178వ ఆయత్ లో మరియు ఇంకా ఎన్నోచోట్లలో ఖుర్ఆన్ లో చెప్పబడిన విధంగా ఇది సున్నతుల్లాహ్ అంటే ఎవడైతే తనను తాను సవరించుకో గోరక అల్లాహ్ (సు.తా.) ఆదేశాలను అసత్యాలని మరియు ఆయన ప్రవక్తలను అసత్యవాదులని తిరస్కరించి, మూఢత్వంతో మార్గభ్రష్టత్వంలోపడిపోతాడో, అలాంటివానిని అల్లాహుతా'ఆలా మార్గభ్రష్టత్వంలో వదలుతాడు. అలాంటివానికి మార్గదర్శకత్వం చేయడు. కానీ అల్లాహ్ (సు.తా.) అతనిని బలవంతంగా మార్గభ్రష్టత్వంలో పడవేయడు.

మాత్రమే ఉంది[84]. కేవలం ఆయన స్వయంగా దానిని, దాని సమయంలో తెలియజేస్తాడు. అది భూమ్యాకాశాలకు ఎంతో దుర్భరమైనదిగా ఉంటుంది. అది మీపై అకస్మాత్తుగానే వచ్చి పడుతుంది." దానిని గురించి నీకు బాగా తెలిసి ఉన్నట్లు భావించి, వారు నిన్ను దానిని గురించి అడుగుతున్నారు. నీవు ఇలా సమాధానం ఇవ్వు: "నిస్సందేహంగా, దాని జ్ఞానం అల్లాహ్ కు మాత్రమే ఉంది. కాని చాలా మంది ఇది తెలుసుకోలేరు[85]."

**188.** (ఓ ప్రవక్తా!) వారితో ఇలా అను: "అల్లాహ్ కోరితే తప్ప నా స్వయానికి నేను లాభం[86] గానీ, నష్టం[87] గానీ చేసుకునే అధికారం నాకు లేదు. నాకు అగోచర విషయజ్ఞానం ఉండి ఉన్నట్లయితే నేను లాభం కలిగించే విషయాలను నా కొరకు అధికంగా సమకూర్చుకునే వాడిని. మరియు నాకు ఎన్నడూ ఏ నష్టం కలిగేది కాదు. నేను విశ్వసించే వారికి కేవలం హెచ్చరిక చేసేవాడను మరియు

---

[84] అంతిమ ఘడియ ఎప్పుడు రానున్నదో అల్లాహ్ (సు.తా.) కు తప్ప మరెవ్వరికీ తెలియదు. ఏ ప్రవక్తకు గానీ లేక దైవదూతకు గానీ అది వచ్చే సమయం గురించి తెలియదనే విషయం ఈ ఆయత్ ద్వారా స్పష్టమవుతోంది.

[85] చూడండి, 31:34.

[86] నఫ్'అన్: అంటే లాభం, మేలు, ప్రయోజనం, ఉపయోగం అనే అర్థాలున్నాయి.

[87] 'దర్రన్: అంటే నష్టం, కీడు, హాని, చెరుపు, అపాయం, దోషం, ఆపద, బాధ అనే అర్థాలున్నాయి.

శుభవార్త నిచ్చేవాడను మాత్రమే!"[88]

**189.** ఆయనే, మిమ్మల్ని ఒకే వ్యక్తి నుండి సృష్టించాడు మరియు అతని నుండియే జీవిత సౌఖ్యం పొందటానికి అతని భార్యను (జౌజను) పుట్టించాడు[89]. అతను ఆమెను కలుసుకున్నపుడు, ఆమె ఒక తేలికైన భారాన్ని ధరించి దానిని మోస్తూ తిరుగుతూ ఉంటుంది. పిదప ఆమె గర్భభారం అధికమైనప్పుడు, వారు ఉభయులూ కలిసి వారి ప్రభువైన అల్లాహ్ ను ఇలా వేడుకుంటారు: "నీవు మాకు మంచి బిడ్డను ప్రసాదిస్తే మేము తప్పక నీకు కృతజ్ఞతలు తెలిపే వారమవుతాము!"

**190.** ఆయన వారికి ఒక మంచి బిడ్డను ప్రసాదించిన పిదప వారు, ఆయన ప్రసాదించిన దాని విషయంలో ఆయనకు సాటి (భాగస్వాములను) కల్పించసాగుతారు. కాని వారు కల్పించే భాగస్వాముల కంటే అల్లాహ్ మహోన్నతుడు.

---

[88] దైవప్రవక్త ము'హమ్మద్ ('స'అస) కు ఎట్టి అగోచర జ్ఞానం లేదు అని ఇక్కడ స్పష్టంగా విశదమవుతుంది. అగోచర జ్ఞానం గలవాడు కేవలం అల్లాహ్ (సు.తా.) ఒక్కడు మాత్రమే! దీనికి నిదర్శనాలు: 1) ము'హమ్మద్ ('స'అస) యొక్క పన్ను 'ఉహుద్ యుద్ధరంగంలో విరిగి పోయింది. అతను గాయాలతో స్పృహ తప్పి పడిపోయారు. ఏ విధంగానైతే ఒక సాధారణ మానవుడు బాధపడుతాడో అదే విధంగా అతను బాధపడ్డారు. 2) 'ఆయి'షహ్ (ర.'అన్హా)పై నింద మోపబడినప్పుడు, అల్లాహుతా'ఆలా వ'హీ వచ్చేంత వరకు, అతను సాధారణ వ్యక్తిగానే వ్యవహరించారు. ఒకవేళ అతనికి అగోచర జ్ఞానమే ఉంటే ఇదంతా అతనికి ముందుగా తెలిసి, బాధపడేవారు కాదు.

[89] చూడండి, 4:1 మరియు 30:21.

**191.** ఏమీ? దేనినీ కూడ సృష్టించలేని మరియు (స్వయంగా) తామే సృష్టించబడిన వారిని, వారు ఆయనకు సాటిగా (భాగస్వాములుగా) కల్పిస్తారా?

**192.** మరియు వారు, వారికి ఎలాంటి సహాయం చేయలేరు. మరియు తమకు తాము కూడా సహాయం చేసుకోలేరు.

**193.** మరియు మీరు వారిని సన్మార్గానికి పిలిచినా, వారు మిమ్మల్ని అనుసరించలేరు. మీరు వారిని పిలిచినా, లేక మౌనం వహించినా మీకు సమానమే!

**194.** నిశ్చయంగా, మీరు అల్లాహ్ ను విడిచి ఎవరినైతే పిలుస్తున్నారో, వారు కూడా మీలాంటి దాసులే! మీరు వారిని పిలువండి, మీరు సత్యవంతులే అయితే మీ పిలుపుకు వారు సమాధానమివ్వాలి[90].

**195.** ఏమీ? వారికి కాళ్ళున్నాయా, వాటితో నడవటానికి? లేదా వారికి చేతులున్నాయా, వాటితో పట్టుకోవటానికి? లేదా వారికి కళ్ళున్నాయా, వాటితో చూడటానికి? లేదా వారికి చెవులున్నాయా, వాటిలో వినటానికి?

---

[90] ఇక్కడ ప్రజలు అల్లాహ్ (సు.తా.)ను వదలి ఇతరుల దగ్గరకు తమకు సహాయపడమని, ఆరోగ్యం చేకూర్చమని, పిల్లల నివ్వమని, బిడ్డల పెళ్ళిళ్ళు చేయించమని, ఉద్యోగాలు ఇప్పించమని లేక పరలోక జీవితంలో సిఫారసు చేయమని, వగైరా వగైరా కొరకు, దర్గాల దగ్గర, సన్యాసుల దగ్గర, బాబాల దగ్గర లేక మూర్తుల దగ్గరకు పోయి వేడుకోవటం గురించి విమర్శించబడింది. ఇంకా వారేమి చేయలేరని కూడా విశదపరచబడింది.

వారితో అను: "మీరు సాటి కల్పించిన వారిని (భాగస్వాములను) పిలువండి. తరువాత మీరంతా కలిసి నాకు వ్యతిరేకంగా కుట్రలు (వ్యూహాలు) పన్నండి, నాకు గడువు కూడా ఇవ్వకండి.

**196.** నిశ్చయంగా, ఈ గ్రంథాన్ని అవతరింప జేసిన అల్లాహ్ యే నా సంరక్షకుడు, ఆయన సద్వర్తనులనే మిత్రులుగా చేసుకుంటాడు.

**197.** మరియు ఆయనను విడిచి మీరు వేడుకునే వారు మీకు ఏ విధమైన సహాయం చేయలేరు. మరియు వారు తమకు తాము కూడా సహాయం చేసుకోలేరు.

**198.** మరియు మీరు వారిని సన్మార్గానికి పిలిచినా వారు వినలేరు. మరియు వారు నీవైపుకు చూస్తున్నట్లు నీవు భావిస్తావు, కాని వారు చూడలేరు.

**199.** మన్నింపు వైఖరిని అవలంబించు, ధర్మమును బోధించు మరియు మూర్ఖుల నుండి విముఖుడవకు[91].

**200.** మరియు ఒకవేళ షైతాన్ నుండి నీకు ప్రేరేపణ కలిగితే! నీవు అల్లాహ్ శరణు వేడుకో! నిశ్చయంగా, ఆయనే సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

---

[91] ఎందుకంటే మానవుడు బలహీనుడిగా పుట్టించబడ్డాడు. (చూడండి 4:28). అల్లాహ్ (సు.తా.) ఏ మానవుడి పైననూ అతన శక్తికి మించిన భారం వేయడు. (చూడండి, 2:286, 6:152 7:42 23:62).

**201.** వాస్తవానికి, దైవభీతి గలవారు తమకు షైతాన్ నుండి కలత గలిగితే! వారు (అల్లాహ్ ను) స్మరిస్తారు, అప్పుడు వారు అంతా సరిగ్గా చూస్తారు.

**202.** మరియు వారి (షైతాన్ ల) సహోదరులు వారిని తప్పు దారి వైపుకు లాక్కొని పోగోరుతారు మరియు వారు ఏ మాత్రం పట్టు వదలరు.

**203.** మరియు (ఓ ప్రవక్తా!) నీవు వారికి ఏదైనా సూచనను తేలేక పోయినప్పుడు వారు: "నీవే స్వయంగా దానిని ఎందుకు (కల్పించుకొని) తేలేదు?" అని అంటారు. వారితో ఇలా అను: "నేను కేవలం నా ప్రభువు తరఫు నుండి నాకు పంప బడే సందేశాన్ని (వహీని) మాత్రమే అనుసరించేవాడను[92]. ఇందు (ఈ ఖుర్ఆన్) లో విశ్వసించేవారి కొరకు, మీ ప్రభువు తరఫు నుండి అనేక బోధనలు, మార్గదర్శకత్వం మరియు కారుణ్యమున్నాయి[93]."

**204.** మరియు ఖుర్ఆన్ పారాయణం జరిగేటప్పుడు దానిని శ్రద్ధగా వినండి మరియు నిశ్శబ్దంగా ఉండండి, అప్పుడు మీరు కరుణింపబడవచ్చు![94]

**205.** మరియు నీవు నీ మనస్సులో వినయంతో, భయంతో మరియు ఎక్కువ శబ్దంతో గాక (తగ్గు

---

[92] చూడండి, 6:37 మరియు 109.
[93] చూడండి, స. బు'ఖారీ, పు.4, 'హ. 831.
[94] చూడండి, 41:26.

స్వరంతో) ఉదయం మరియు సాయంత్రం నీ ప్రభువును స్మరించు. మరియు నిర్లక్ష్యం చేసేవారిలో చేరకు[95].

**206.** నిశ్చయంగా, నీ ప్రభువుకు దగ్గరగా ఉన్నవారు (దైవదూతలు) తమ ప్రభువును ఆరాధించటానికి అహంభావం చూపరు. మరియు ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉంటారు. మరియు ఆయనకే సాష్టాంగం (సజ్దా) చేస్తూ ఉంటారు.

---

[95] చూడండి, 13:28.

# 8. అల్-అన్ఫాల్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. (ఓ ప్రవక్తా!) వారు నిన్ను విజయధనం (అన్ ఫాల్) ను గురించి అడుగుతున్నారు. వారితో ఇలా అను: "విజయధనం అల్లాహ్ ది మరియు ఆయన సందేశహరునిది." కనుక మీరు అల్లాహ్ యందు భయభక్తులు కలిగిఉండండి. మరియు మీ పరస్పర సంబంధాలను సరిదిద్దు కోండి. మీరు విశ్వాసులే అయితే, అల్లాహ్ కు మరియు ఆయన ప్రవక్తకు విధేయులై ఉండండి.
2. నిశ్చయంగా, విశ్వాసులైన వారి హృదయాలు అల్లాహ్ ప్రస్తావన వచ్చినపుడు భయంతో వణుకుతాయి. మరియు వారి ముందు ఆయన సూచనలు (ఖుర్ఆన్) పఠింపబడి నప్పుడు వారి విశ్వాసం మరింత అధికమే అవుతుంది. మరియు వారు తమ ప్రభువు మీదే దృఢనమ్మకం కలిగి ఉంటారు.
3. వారే నమాజ్ ను స్థాపిస్తారు మరియు మేము వారికిప్రసాదించినజీవనోపాధినుండి(ఇతరులపై) ఖర్చు చేస్తారు.
4. అలాంటి వారు! వారే, నిజమైన విశ్వాసులు. వారి

[*] [అల్ అన్ఫాల్ – విజయ ధనము, యుద్ధసొత్తు]

ప్రభువు వద్ద వారికి ఉన్నత స్థానాలు, క్షమాపణ మరియు గౌరవనీయమైన జీవనోపాధి ఉంటాయి.

5. (ఓ ప్రవక్తా!) ఎప్పుడైతే! నీ ప్రభువు నిన్ను సత్యస్థాపన కొరకు నీ గృహం నుండి (యుద్ధానికి) బయటకు తీసుకొని వచ్చాడో! అప్పుడు నిశ్చయంగా, విశ్వాసులలో ఒక పక్షం వారు దానికి ఇష్టపడలేదు;

6. సత్యం బహిర్గతమైన తరువాత కూడా, వారు దానిని గురించి నీతో వాదులాడు తున్నారు. అప్పుడు (వారి స్థితి) వారు చావును కళ్ళారా చూస్తూ ఉండగా! దాని వైపునకు లాగబడే వారి వలే ఉంది.

7. మరియు (జ్ఞాపకం చేసుకోండి) ఆ రెండు పక్షాలలో, ఒక పక్షం మీ చేతికి తప్పక చిక్కు తుందని అల్లాహ్ మీతో వాగ్దానం చేసినప్పుడు; ఆయుధాలు లేని పక్షం మీకు దొరకాలని మీరు కోరుతూ ఉన్నారు. కాని అల్లాహ్ తాను ఇచ్చిన మాట ప్రకారం సత్యాన్ని సత్యంగా నిరూపించాలనీ మరియు అవిశ్వాసులను సమూలంగా నాశనం చేయాలనీ కోరాడు.

8. అపరాధులు ఎంత అసహ్యించుకున్నా, సత్యాన్ని సత్యంగా నిరూపించాలని (నెగ్గించాలని) మరియు అసత్యాన్ని అసత్యంగా నిరూపించాలని (విఫలం

చేయాలని) ఆయన (ఇచ్ఛ)[1].

9. (జ్ఞాపకం చేసుకోండి!) మీరు మీ ప్రభువును సహాయం కొరకు ప్రార్థించినపుడు ఆయన ఇలా జవాబిచ్చాడు: "నిశ్చయంగా, నేను వేయి దైవదూతలను ఒకరి తరువాత ఒకరిని పంపి మిమ్మల్ని బలపరుస్తాను[2]."

10. మరియు మీకు శుభవార్తనిచ్చి, మీ హృదయాలకు శాంతి కలుగ జేయటానికే, ఈ విషయాన్ని అల్లాహ్ మీకు తెలిపాడు. మరియు వాస్తవానికి సహాయం (విజయం) కేవలం అల్లాహ్ నుంచే వస్తుంది. నిశ్చయంగా, అల్లాహ్ సర్వశక్తిమంతుడు, మహా వివేచనాపరుడు[3].

11. (జ్ఞాపకం చేసుకోండి!) ఆయన (అల్లాహ్), తన తరఫు నుండి మీకు మనశ్శాంతి కలుగజేయటానికి మీకు నిద్రమత్తును కలిగించాడు మరియు మీపై ఆకాశం నుండి నీటిని కురిపించాడు, దాని ద్వారా

---

[1] ముస్లింలు, మక్కా ముష్రికుల సైన్యంతో పోరాడి, వారిని ఓడించి, వారి హృదయాలలో భయభీతులు కలిగించాలని మరియు ముస్లింలకు ధైర్యస్థైర్యాలు ప్రసాదించాలని అల్లాహుతా'ఆలా కోరిక.

[2] చూడండి, 3:124-125 అక్కడ ఉ'హుద్ యుద్ధంలో అల్లాహ్ (సు.తా.) 3000 దైవదూతలను పంపి సహాయపడ్డాడు, అని ఉంది.

[3] ము'హమ్మద్ ('స'అస) ఇలా ప్రార్థించారు: "ఓ అల్లాహ్ (సు.తా.)! నీవు నాకు చేసిన వాగ్దానం పూర్తి చేయి. ఓ అల్లాహ్ (సు.తా.)! ఒకవేళ ఈనాడు నీకు విధేయు(ముస్లిం)లు అయిన ఈ చిన్న సమూహం, నిర్మూలించబడితే! నిన్ను ప్రార్థించేవారు భూమిలో ఎవ్వరూ ఉండరు!" ('స. బు'ఖారీ, 'స'హీ'హ్ ముస్లిం, తిర్మిజీ', అబూ-దావూద్, అ'హ్మద్ మరియు ఇబ్నె'హంబల్).

మిమ్మల్ని పరిశుద్ధపరచటానికి మీ నుండి షైతాన్ మాలిన్యాన్ని దూరం చేయటానికి మరియు మీ హృదయాలను బలపరచటానికి మరియు మీ పాదాలను స్థిరపరచటానికీ!

12. నీ ప్రభువు దైవదూతలకు ఇచ్చిన దివ్యజ్ఞానాన్ని (జ్ఞాపకం చేసుకోండి): "నేను నిశ్చయంగా, మీతో ఉన్నాను. కావున మీరు విశ్వాసులకు ఈ విధంగా ధైర్యస్థైర్యాలను కలిగించండి: 'నేను సత్యతిరస్కారులైన వారి హృదయాలలో భయాన్ని కలిగిస్తాను, అప్పుడు మీరు వారి మెడలపై కొట్టండి మరియు వారి వ్రేళ్ళకొనలను నరికివేయండి.' "

13. ఇది ఎందుకంటే! వాస్తవానికి వారు అల్లాహ్ ను మరియు ఆయన ప్రవక్తను వ్యతిరేకించారు కాబట్టి ఎవడైతే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను వ్యతిరేకిస్తాడో! నిశ్చయంగా, అల్లాహ్ (అలాంటి వానికి) శిక్ష విధించటంలో ఎంతో కఠినుడు.

14. (ఓ సత్యతిరస్కారులారా!): "ఇదే (మీ శిక్ష), దీనిని మీరు చవిచూడండి! నిశ్చయంగా, సత్యతిరస్కారులకు నరకాగ్ని శిక్ష ఉంటుంది."

15. ఓ విశ్వసించిన ప్రజలారా! మీరు సత్యతిరస్కారుల సైన్యాలను యుద్ధరంగంలో ఎదుర్కొన్నప్పుడు, వారికి మీ వీపులు చూపకండి (పారిపోకండి)!

16. మరియు ఆ దినమున వారికి వీపు చూపినవాడు - యుద్ధతంత్రం కోసమో, లేక (తమ వారి) మరొక సమూహంలో చేరటానికో (వెనుదిరిగితే తప్ప) - తప్పక అల్లాహ్ ఆగ్రహానికి పాత్రుడవుతాడు

మరియు అతని ఆశ్రయం నరకమే. అది ఎంత చెడ్డ గమ్యస్థానం!

17. మీరు వారిని చంపలేదు, కానీ అల్లాహ్ వారిని చంపాడు. (ప్రవక్తా!) నీవు (దుమ్ము) విసిరినపుడు, నీవు కాదు విసిరింది[4], కాని అల్లాహ్ విసిరాడు. మరియు విశ్వాసులను దీనితో పరీక్షించి, వారికి మంచి ఫలితాన్ని ఇవ్వటానికి ఆయన ఇలా చేశాడు. నిశ్చయంగా, అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

18. ఇదే (ఆయన ఇచ్ఛ!) మరియు నిశ్చయంగా, అల్లాహ్ సత్యతిరస్కారుల ఎత్తుగడలను బలహీనపరుస్తాడు.

19. (ఓ అవిశ్వాసులారా!) మీరు తీర్పు కోరితే, వాస్తవానికి మీకు తీర్పు లభించింది. ఇక మీద మీరు (దుర్మార్గాన్ని) మానుకుంటే అది మీకే మేలైనది. ఒకవేళ మీరు తిరిగి ఇలా చేస్తే మేము కూడా తిరిగి చేస్తాము. అప్పుడు మీ సైనికదళం ఎంత హెచ్చుగా ఉన్నా మీకెలాంటి లాభం చేకూర్చదు. మరియు నిశ్చయంగా, అల్లాహ్ విశ్వాసులతో ఉంటాడు.

20. ఓ విశ్వాసులారా! మీరు అల్లాహ్ కు మరియు ఆయన ప్రవక్తకు విధేయులుగా ఉండండి. మరియు మీరు (అతని సందేశాలను) వింటూ కూడా, అతని (ప్రవక్త) నుండి మరలి పోకండి.

---

[4] బద్ర్ యుద్ధరంగంలో దైవప్రవక్త ('స'అస) పిడికెడు దుమ్ము, అల్లాహ్ (సు.తా.) పేరుతో సత్యతిరస్కారులపై విసిరారు.

21. మరియు వాస్తవానికి వినకుండానే: "మేము విన్నాము!" అని అనే వారి వలే కాకండి[5].
22. తమ బుద్ధిని ఉపయోగించని చెవిటివారు, మూగవారు మాత్రమే, నిశ్చయంగా అల్లాహ్ దృష్టిలో నీచాతినీచమైన పశుజాతికి చెందినవారు[6].
23. మరియు అల్లాహ్ వారిలో కొంతైనా మంచితనాన్ని చూసి ఉంటే, వారిని వినేటట్లు చేసి ఉండేవాడు. (కాని వారిలో మంచితనం లేదు కాబట్టి), ఆయన వారిని వినేటట్లు చేసినా, వారు (తమ మూర్ఖత్వంలో) ముఖాలు త్రిప్పుకొని వెనుదిరిగి పోయేవారు.
24. ఓ విశ్వాసులారా! అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడు మీకు జీవనమిచ్చే దాని వైపునకు, మిమ్మల్ని పిలిచినప్పుడు దానికి జవాబు ఇవ్వండి[7]. మరియు నిశ్చయంగా, అల్లాహ్ మానవునికి మరియు అతని హృదయకాంక్షలకు మధ్య ఉన్నాడనీ మరియు నిశ్చయంగా, మీరంతా ఆయన వద్దనే సమీకరించబడతారని తెలుసుకోండి.
25. మరియు మీలోని దుర్మార్గులకు మాత్రమే గాక (అందరికీ) సంభవించబోయే ఆ విపత్తు గురించి భీతిపరులై ఉండండి. మరియు అల్లాహ్ శిక్ష విధించటంలో చాలా కఠినుడని తెలుసుకోండి.
26. మరియు ఆ సమయాన్ని జ్ఞాపకం చేసుకోండి:

---

[5] చూడండి, 2:93 మరియు 4:46.
[6] చూడండి, 7:179.
[7] అంటే ఖుర్ఆన్ మరియు షరీ'అత్ వైపుకు మరియి జిహాద్ కు. అంటే కేవలం అల్లాహ్ (సు.తా.) మరియు ఆయన ప్రవక్త ('స'అస) ఆజ్ఞలనే అనుసరించండి, అని అర్థం.

అప్పుడు మీరు అల్పసంఖ్యలో ఉన్నారు. భూమి పై మీరు బలహీనులుగా పరిగణించబడేవారు. ప్రజలు మిమ్మల్ని పారద్రోలుతారని (హింసిస్తారని) భయపడేవారు అప్పుడు ఆయన మీకు ఆశ్రయమిచ్చి తన సహాయంతో మిమ్మల్ని బలపరచి, మీకు మంచి జీవనోపాధిని సమకూర్చాడు, బహుశా మీరు కృతజ్ఞులవుతారని.

27. ఓ విశ్వాసులారా! మీరు అల్లాహ్ కు మరియు ఆయన ప్రవక్తకు నమ్మకద్రోహం చేయకండి మరియు తెలిసి ఉండి కూడా మీ (పరస్పర) అమానతుల[8] విషయంలో నమ్మకద్రోహం చేయకండి.

28. మరియు వాస్తవానికి మీ ఆస్తిపాస్తులు, మీ సంతానం పరీక్షా సాధనాలనీ మరియు నిశ్చయంగా, అల్లాహ్ వద్ద గొప్ప ప్రతిఫలం ఉన్నదనీ తెలుసుకోండి!

29. ఓ విశ్వాసులారా! మీరు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉంటే, ఆయన మీకు (మంచి-చెడులను గుర్తించే) విచక్షణా శక్తిని ప్రసాదించి, మీ నుండి మీ పాపాలను తొలగించి, మిమ్మల్ని క్షమిస్తాడు. మరియు అల్లాహ్ దాతృత్వంలో సర్వోత్తముడు.

30. మరియు (ఓ ప్రవక్తా!) సత్యతిరస్కారులు, నిన్ను బంధించటానికి నిన్ను హతమార్చటానికి, లేదా నిన్ను వెడలగొట్టటానికి కుట్రలు పన్నుతున్న

[8] అమానతుల కొరకు చూడండి, 33:72.

విషయాన్ని (జ్ఞప్తికి తెచ్చుకో!) వారు కుట్రలు పన్నుతూ ఉన్నారు మరియు అల్లాహ్ కూడా కుట్రలు పన్నుతూ ఉన్నాడు. మరియు వాస్తవానికి
అల్లాహ్ యే కుట్రలు పన్నటంలో అందరి కంటే ఉత్తముడు.[9]

**31.** మరియు మా సూచనలు (ఆయాత్) వారికి వినిపించబడి నప్పుడు వారు: "వాస్తవానికి, మేము విన్నాము మేము కోరితే మేము కూడా ఇటువంటివి రచించగలము (చెప్పగలము). ఇవి కేవలం పూర్వీకుల గాథలు మాత్రమే!" అని అంటారు.

**32.** మరియు వారు: "ఓ అల్లాహ్! ఇది (ఈ ఖుర్ఆన్) నిజంగా నీ తరఫు నుండి వచ్చిన సత్యమే అయితే! మాపై ఆకాశం నుండి రాళ్ళ వర్షం కురిపించు! లేదా ఏదైనా బాధాకరమైన శిక్షను మా పైకి తీసుకొనిరా!" అని పలికిన మాట (జ్ఞాపకం చేసుకోండి).

---

[9] ఇది మక్కా ముష్రిక్ లు దారున్నద్వాలో ము'హమ్మద్ ('స'అస) ను హత్య చేయటానికి; ప్రతి తెగ నుండి ఒక యువకుణ్ణి తయారు చేసిన కుట్ర. వారంతా దైవప్రవక్త ('స'అస), ఇంటి చుట్టు రాత్రివేళ గుమిగూడి, అతని రాకకు ఎదురు చూస్తూ ఉంటారు. అల్లాహ్ (సు.తా.), ఈ విషయం దైవప్రవక్త ('స'అస) కు తెలుపుతాడు. మరియు అతను ('స'అస) పిడికెడు దుమ్ము తీసుకొని, అల్లాహ్ (సు.తా.) ను ప్రార్థించి వారిపై చల్లుతారు. దానితో వారు అతని వెళ్ళిపోవటాన్ని గమనించలేకపోతారు. అతను ('స'అస) అబూబక్ర్ (ర'ది.'అ.) తో సహా 'గారె సూ'ర్ లో చేరుకుంటారు.

**33.** కాని (ఓ ముహమ్మద్!) నీవు వారి మధ్య ఉన్నంత వరకు అల్లాహ్ వారిని ఏ మాత్రం శిక్షించడు. మరియు వారు క్షమాభిక్ష కోరుతూ ఉన్నంత వరకు కూడా! అల్లాహ్ వారిని ఏ మాత్రం శిక్షించడు.

**34.** వారి వాదమేమిటీ? అల్లాహ్ వారిని ఎందుకు శిక్షించకూడదు? వారు దాని ధర్మకర్తలు కాకున్నా, వారు ప్రజలను మస్జిద్ అల్ హరామ్ నుండి ఆవుతున్నారు.[10] దాని ధర్మకర్తలు కేవలం దేవభీతి గలవారే కాగలరు. కాని వాస్తవానికి, చాలా మంది ఇది తెలుసుకోలేరు.

**35.** మరియు (అల్లాహ్) గృహం (కఅబహ్) వద్ద వారి ప్రార్థనలు, కేవలం ఈలలు వేయటం (ముకాఅ) మరియు చప్పట్లు కొట్టడం (తస్దియహ్) తప్ప మరేమీ లేవు. కావున మీ సత్యతిరస్కారానికి బదులుగా ఈ శిక్షను రుచి చూడండి.[11]

**36.** నిశ్చయంగా, సత్యతిరస్కారులు, ప్రజలను అల్లాహ్ మార్గం వైపునకు రాకుండా ఆపటానికి, తమ ధనం ఖర్చు చేస్తారు. వారు ఇలాగే ఖర్చు చేస్తూ ఉంటారు; చివరకు అది వారి వ్యసనానికి

---

[10] ముష్రిక్ ఖురైషులు, ముస్లింలు అయిన వారిని క'అబహ్ లోకి ప్రవేశించకుండా ఆపేవారు.

[11] ఇదే విధంగా ఈ కాలంలో కూడా మూఢులైన 'సూఫీలు, మస్జిద్ లలో మరియు ఆస్థానాలలో డోలు కొట్టుతూ నాట్యం చేస్తూ కాలక్షేపం చేస్తూ ఉంటారు. ఈ విధంగానే మేము అల్లాహుతా'ఆలాను సంతోష పరుస్తాము, అని అంటారు. అల్లాహ్ (సు.తా.) విశ్వాసులను ఇలాంటి విషయాల నుండి కాపాడుగాక!

(దుఃఖానికి) కారణమవుతుంది. తరువాత వారు పరాధీనులవుతారు. మరియు సత్యతిరస్కారులైన వారు నరకం వైపుకు సమీకరించబడతారు.

37. ఇదంతా అల్లాహ్, చెడును (దుష్టులను) మంచి (సత్పురుషుల) నుండి వేరు చేసి, దుష్టులందరినీ ఒకరితో పాటు మరొకరిని చేకూర్చి, ఒక గుంపుగా చేసి వారందరినీ నరకంలో పడవేయటానికి. ఇలాంటి వారు, వారే నష్టపోయేవారు!

38. సత్యతిరస్కారులతో ఇలా అను: ఒకవేళ వారు మానుకుంటే గడిచిపోయింది క్షమించబడుతుంది. కాని వారు (పూర్వ వైఖరినే) మళ్ళీ అవలంబిస్తే! వాస్తవానికి, (దుష్టులైన) పూర్వీకుల విషయంలో జరిగిందే, మరల వారికి సంభవిస్తుంది![12]

39. మరియు అధర్మం (ఫిత్న)[13] ఏ మాత్రం మిగలకుండా పోయే వరకు మరియు ఆరాధన (ధర్మం) కేవలం అల్లాహ్ కొరకే ప్రత్యేకించబడనంత వరకు వారితో (సత్యతిరస్కారులతో) పోరాడుతూ ఉండండి. కాని వారు (పోరాడటం) మానుకుంటే! నిశ్చయంగా అల్లాహ్ వారి కర్మలను

---

[12] అంటే వారు సత్యతిరస్కారం మరియు దుష్ట కర్మలలో మునిగి ఉంటే, వారిపై అల్లాహుతా'ఆలా శిక్ష తప్పక పడుతుందని తెలుసుకోవాలి.

[13] ఫిత్నతున్: అంటే ఇక్కడ సత్యతిరస్కారం మరియు అధర్మం అని అర్థం. చూడండి,2:193. ఈ విధమైన ఆయతే అక్కడ కూడా ఉంది. ఇంకా చూడండి, 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 1, 'హదీస్' నం. 24 మరియు పుస్తకం - 3, 'హదీస్' నం. 425.

గమనిస్తున్నాడు.

**40.** మరియు ఒకవేళ వారు తిరిగిపోతే! నిశ్చయంగా అల్లాహ్యే స్నేహితుడు(సంరక్షకుడు)అని తెలుసుకోండి. ఆయనే ఉత్తమ స్నేహితుడు(సంరక్షకుడు) మరియు ఉత్తమ సహాయకుడూను!

**41.** మరియు మీ విజయధనంలో[14] నిశ్చయంగా, అయిదవ భాగం, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తకు మరియు (అతని) దగ్గరి బంధువులకు మరియు అనాథులకు మరియు యాచించని పేదవారికి[15] మరియు ప్రయాణీకులకు ఉందని తెలుసుకోండి, ఒకవేళ మీరు - అల్లాహ్ ను మరియు మేము సత్యాసత్యాల అంతరాన్ని విశదం చేసే దినమున, ఆ రెండు సైన్యాలు మార్కొనిన (బద్ర్ యుద్ధ) దినమున, మా దాసునిపై అవతరింపజేసిన దానిని - విశ్వసించేవారే అయితే! మరియు అల్లాహ్ ప్రతిదీ

[14] 'గనీమతున్: విజయధనం, అంటే సత్యతిరస్కారులతో జరిగిన ధర్మయుద్ధంలో గెలుపు పొందిన తరువాత ముస్లింలకు దొరికేదంతా.

[15] ఇక్కడ అల్-మిస్కీనున్, అనే శబ్దం ఉంది. ఇది అల్ ఫుఖరా కంటే భిన్నమైనది. ఫఖీరున్ - అంటే ఏమీ లేనందుకు ఇతరుల నుండి యాచించే వాడు. మిస్కీన్ అంటే అతని దగ్గర కొంత ఆదాయం ఉంది, కాని అది అతని నిత్యావసరాలకు పూర్తి కాదు. ఇట్టివారు తమ స్వాభిమానం వల్ల ఇతరులను సహాయానికై యాచించరు.

చేయగల సమర్థుడు[16].

**42.** (ఆ దినాన్ని గుర్తుకు తెచ్చుకోండి!) అప్పుడు మీరు లోయలో (మదీనాకు) సమీపంగా ఉన్న స్థలంలో ఉన్నారు మరియు వారు (ముష్రికులు) దూరంగా ఉన్న స్థలంలో ఉన్నారు[17]. మరియు బిడారం మీకు క్రింది (ఒడ్డు) వైపునకు. ఒకవేళ మీరు (ఇరువురు) యుద్ధం చేయాలని నిర్ణయించుకొని ఉంటే! మీరు మీ నిర్ణయాన్ని పాటించ కుండా ఉండేవారు. కాని అల్లాహ్ తాను నిర్ణయించిన కార్యాన్ని పూర్తి చేయటానికి, నశించే వాడు స్పష్టమైన నిదర్శనం పొందిన తరువాత నశించాలని మరియు జీవించేవాడు స్పష్టమైన నిదర్శనం పొందిన తరువాత జీవించాలని అలా

---

[16] బద్ర్ యుద్ధం - యుద్ధ సామగ్రి తక్కువ తీసుకొని కేవలం వాణిజ్య బిడారాన్ని దోచుకోవటానికి వచ్చిన 313 ముస్లింలు మరియు వారిని పూర్తిగా నిర్మూలించాలనే ఉద్దేశంతో! అత్యధిక యుద్ధసామగ్రితో వచ్చిన ముష్రిక్ ఖురైషుల మధ్య జరిగింది. అల్లాహ్ (సు.తా.) తాను పంపిన ప్రవక్త ము'హమ్మద్ ('స'అస) సత్యవంతుడు, సన్మార్గంపై ఉన్నాడు మరియు తాను పంపిన, జీవన మార్గమే (ఇస్లామే), మోక్షం (స్వర్గం) పొందటానికి సరైన మార్గమని నిరూపించదలచి, ఈ యుద్ధాన్ని చేయించి, ముస్లింలకు విజయాన్ని చేకూర్చి, సత్యాసత్యాల మధ్య భేదాన్ని నిరూపించాడు. చివరకు సత్యమే వర్ధిల్లుతుందని చూపాడు.

[17] 'ఉద్ వతిద్దునియా: సమీప స్థలం. అంటే బద్ర్ లోయలో, మదీనా నుండి సమీపంలో నున్న స్థలం. మరియు 'ఉద్వతిల్ ఖు'స్వా: అంటే, బద్ర్ లోయలో, మొదటి స్థలంతో పోల్చితే మదీనా నుండి దూరంగా ఉన్న స్థలం.

చేశాడు మరియు నిశ్చయంగా, అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

43. (ఓ ప్రవక్తా!) అల్లాహ్ నీకు, నీ స్వప్నంలో వారిని కొద్దిమందిగా చూపింది (జ్ఞాపకం చేసుకో)! వారిని ఎక్కువ మందిగా నీకు చూపి ఉంటే, మీరు తప్పక ధైర్యాన్ని కోల్పోయి (యుద్ధ) విషయంలో వాదులాడే వారు. కాని వాస్తవానికి, అల్లాహ్ మిమ్మల్ని రక్షించాడు. నిశ్చయంగా, ఆయనకు హృదయాలలో ఉన్న విషయాలన్నీ బాగా తెలుసు.

44. మరియు (జ్ఞాపకం చేసుకోండి) అల్లాహ్ నెరవేర్చవలసిన పనిని నెరవేర్చటానికి - మీరు (బద్ర్ యుద్ధరంగంలో) మార్కొనినపుడు - వారి (అవిశ్వాసుల) సైన్యాన్ని మీ కన్నులకు కొద్దిగా చూపాడు మరియు మిమ్మల్ని కొద్దిమందిగా వారికి చూపాడు. మరియు అన్ని వ్యవహారాలూ (నిర్ణయానికి) అల్లాహ్ వైపునకే మరలింపబడతాయి.

45. ఓ విశ్వాసులారా! మీరు ఏ సైన్యాన్నైనా ఎదుర్కొనేటప్పుడు, స్థైర్యంతో ఉండండి. మరియు అల్లాహ్ ను అత్యధికంగా స్మరిస్తే, మీరు సాఫల్యం పొందవచ్చు!

46. మరియు అల్లాహ్ కు మరియు ఆయన ప్రవక్తకు విధేయులై ఉండండి మరియు పరస్పర కలహాలకు గురి కాకండి, అట్లు చేస్తే మీరు బలహీనులవుతారు

మరియు మీ బలసాహసాలు తగ్గిపోతాయి. మరియు సహనం వహించండి. నిశ్చయంగా, అల్లాహ్ సహనం వహించేవారితో ఉంటాడు.

**47.** మరియు తమ గృహాల నుండి, ప్రజలకు చూపటానికి దురాభిమానంతో బయలుదేరి ఇతరులను అల్లాహ్ మార్గం నుండి ఆపేవారి వలే కాకండి. మరియు వారు చేసే క్రియలన్నింటినీ అల్లాహ్ పరివేష్టించి ఉన్నాడు.

**48.** మరియు (జ్ఞాపకం చేసుకోండి అవిశ్వాసులకు) వారి కర్మలు ఉత్తమమైనవిగా చూపించి షైతాన్ వారితో అన్నాడు: "ఈరోజు ప్రజలలో ఎవ్వడు మిమ్మల్ని జయించలేడు (ఎందుకంటే) నేను మీకు తోడుగా ఉన్నాను." కాని ఆ రెండు పక్షాలు పరస్పరం ఎదురు పడినపుడు, అతడు తన మడమలపై వెనకకు మరలి అన్నాడు: "వాస్తవంగా నాకు మీతో ఎలాంటి సంబంధం లేదు, మీరు చూడనిది నేను చూస్తున్నాను. నిశ్చయంగా, నేను అల్లాహ్ కు భయపడుతున్నాను[18]. మరియు అల్లాహ్ శిక్ష విధించటంలో చాలా కఠినుడు."

**49.** కపట విశ్వాసులు మరియు ఎవరి హృదయాలలో రోగముందో వారు: "వీరిని (ఈ విశ్వాసులను) వీరి ధర్మం మోసపుచ్చింది." అని అంటారు, కాని అల్లాహ్ యందు నమ్మకం గలవాని కొరకు, నిశ్చయంగా అల్లాహ్ సర్వశక్తిమంతుడు, మహావివేచనాపరుడు.

---

[18] చూడండి, 59:16.

50. మరియు సత్యతిరస్కారుల ప్రాణాలను దైవదూతలు తీసే దృశ్యాన్ని నీవు చూపడగలిగితే (ఎంత బాగుండేది). వారు (దేవదూతలు) వారి ముఖాలపైనను మరియు వారి పిరుదుల పైనను కొడుతూ ఇలా అంటారు: "భగభగమండే ఈ నరకాగ్ని శిక్షను చవి చూడండి[19].

51. ఇది మీరు స్వయంగా మీ చేతులారా చేసి పంపిన కర్మల ఫలితమే! మరియు నిశ్చయంగా, అల్లాహ్ తన దాసులకు ఏ మాత్రం అన్యాయం చేయడు."

52. ఫిర్ఔన్ జాతి వారి మరియు వారికి పూర్వం వారి మాదిరిగా, వీరు కూడా అల్లాహ్ సూచనలను (ఆయాత్ లను) తిరస్కరించారు, కాబట్టి అల్లాహ్ వారి పాపాల ఫలితంగా వారిని శిక్షించాడు. నిశ్చయంగా అల్లాహ్ మహా బలవంతుడు, శిక్ష విధించటంలో చాలా కఠినుడు[20].

53. ఇది ఎందుకంటే! వాస్తవానికి, ఒక జాతి వారు, తమ నడవడికను తాము మార్చుకోనంత వరకు, అల్లాహ్ వారికి ప్రసాదించిన తన అనుగ్రహాన్ని ఉపసంహరించు కోడు[21]. మరియు నిశ్చయంగా, అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

54. ఫిర్ఔన్ జాతివారు మరియు వారికి పూర్వం వారి మాదిరిగా! వీరు కూడా తమ ప్రభువు సూచనలను

---

[19] చూడండి, 6:93.
[20] షదీద్ అల్ - 'ఇఖాబ్: Severe in Chastising కఠినంగా శిక్షించేవాడు, పటిష్టంగా పట్టుకునేవాడు.
[21] చూడండి, 13:11.

(ఆయాత్ లను) అబద్ధాలను నిరాకరించారు. కాబట్టి వారి పాపాలకు ఫలితంగా వారిని నాశనం చేశాము. మరియు ఫిర్ఔను జాతి వారిని ముంచి వేశాము. మరియు వారందరూ దుర్మార్గులు[22].

**55.** నిశ్చయంగా, అల్లాహ్ దృష్టిలో సత్యాన్ని తిరస్కరించే వారు నీచాతినీచమైన జీవులు, ఇక వారు విశ్వసించరు[23].

**56.** వారిలో ఎవరితోనైతే నీవు ఒడంబడిక చేసుకున్నావో! వారు ప్రతిసారీ తమ ఒడంబడికను భంగపరుస్తున్నారు. మరియు వారికి దైవభీతి లేదు[24].

**57.** ఒకవేళ నీవు యుద్ధరంగంలో వారిపై ప్రాబల్యం పొందితే - వారి వెనుక ఉన్నవారు చెల్లాచెదరై పోయేటట్లుగా - వారిని శిక్షించు. బహుశా వారు గుణపాఠం నేర్చుకోవచ్చు!

---

[22] అల్లాహ్ (సు.తా.) ఎవరికీ అన్యాయం చేయడు. చూడండి, 41:46.

[23] సత్యతిరస్కారులు అల్లాహ్ (సు.తా.) దృష్టిలో మానవులలోనే కాదు, జంతువులలో కూడా నీచాతి నీచ జాతికి చెందిన వారు అర్థం.

[24] కొందరు వ్యాఖ్యాతలు, వీరు బనూ-ఖురైజహ్ అనే యూద తెగవారు అని అంటారు. కందక యుద్ధకాలంలో వీరు సత్యతిరస్కారులకు సహాయపడమని దైవప్రవక్త ('స'అస)తో ఒడంబడిక చేసుకుంటారు. కాని వారు తమ ఒడంబడికకు కట్టుబడి ఉండరు. దీని మరొక భావం ఏమిటంటే ముస్లింలు, ఇతర ధర్మాల వారితో ఒప్పందాలు చేసుకొని వారితో శాంతియుతంగా నివసించడం, ధర్మ సమ్మతం మరియు యుక్తమైనది కూడాను. కాని వారు బహిరంగంగా విశ్వాసఘాతానికి పూనుకుంటే వారితో పోరాడాలి.

**58.** మరియు ఒకవేళ నీకు ఏ జాతి వారి వల్లనైనా నమ్మకద్రోహం జరుగుతుందనే భయం ఉంటే - మీరు ఇరుపక్షం వారు సరిసమానులని తెలుపటానికి[25] - (వారి ఒప్పందాన్ని) వారి వైపుకు విసరివేయి. నిశ్చయంగా, అల్లాహ్ నమ్మకద్రోహులంటే ఇష్టపడడు.

**59.** మరియు సత్యతిరస్కారులు, తాము తప్పించుకున్నామని భావించ నవసరంలేదు. నిశ్చయంగా, వారు (అల్లాహ్ శిక్ష నుండి) తప్పించుకోలేరు.

**60.** మరియు మీరు మీ శక్తి మేరకు బలసామగ్రిని, యుద్ధపు గుర్రాలను సిద్ధపరచుకొని, దాని ద్వారా అల్లాహ్ కు శత్రువులైన మీ శత్రువులను మరియు అల్లాహ్ కు తెలిసి, మీకు తెలియని ఇతరులను కూడా భయకంపితులుగా చేయండి. మరియు అల్లాహ్ మార్గంలో మీరు ఏమి ఖర్చు చేసినా దాని ఫలితం మీకు పూర్తిగా చెల్లించ బడుతుంది. మరియు మీకెలాంటి అన్యాయం జరగదు.

**61.** కాని ఒకవేళ వారు శాంతి వైపుకు మొగ్గితే నీవు కూడా దానికి దిగు మరియు అల్లాహ్ పై ఆధారపడు[26]. నిశ్చయంగా ఆయన సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

---

[25] 'అలా సవాఇన్: అంటే సరిసమానులని తెలుపటానికి. అంటే మీరు ఒడంబడికను త్రెంపి నందుకు మేము కూడా ఆ ఒడంబడికను త్రెంపుతున్నాము. ఇక మీదట ప్రతి ఒక్కరు తమ రక్షణకు తామే బాధ్యులని, స్పష్టం చేయటం.

[26] చూడండి, 47:35 మరియు 8:39.

**62.** కాని ఒకవేళ వారు నిన్ను మోసగించాలని సంకల్పిస్తే! నిశ్చయంగా, నీకు అల్లాహ్ యే చాలు. ఆయనే తన సహాయం ద్వారా మరియు విశ్వాసుల ద్వారా నిన్ను బలపరుస్తాడు.

**63.** మరియు ఆయనే వారి (విశ్వాసుల) హృదయాలను కలిపాడు. ఒకవేళ నీవు భూమిలో ఉన్న సమస్తాన్ని ఖర్చు చేసినా, వారి హృదయాలను కలుప జాలవు. కాని అల్లాహ్ యే వారి మధ్య ప్రేమను కలిగించాడు[27]. నిశ్చయంగా, ఆయన సర్వశక్తిసంపన్నుడు, మహా వివేచనాపరుడు.

**64.** ఓ ప్రవక్తా! నీకూ మరియు నిన్ను అనుసరించే విశ్వాసులకు అల్లాహ్ యే చాలు!

**65.** ఓ ప్రవక్తా! విశ్వాసులను యుద్ధానికి ప్రోత్సహించు. మీలో ఇరవై మంది స్థైర్యం గల వారుంటే, వారు రెండు వందల మందినీ జయించగలరు. మరియు మీరు వంద మంది ఉంటే వేయి మంది సత్యతిరస్కారులను జయించగలరు. ఎందుకంటే వారు (సత్యాన్ని) గ్రహించలేని జాతికి చెందిన వారు[28].

**66.** ఇప్పుడు అల్లాహ్ మీ భారాన్ని తగ్గించాడు,

---

[27] చూడండి, 3:103. 'హునైన్ విజయధనం పంచేటప్పుడు ము'హమ్మద్ ('స'అస) మదీనా అన్సార్ లను ఉద్దేశించి చేసిన ప్రసంగానికి చూడండి, ('స'హీ'హ్ బు.'ఖారీ, కితాబ్ అల్ మ'గా'జీ, బాబ్ 'గ'జ్ వత్ అ'త్తాయ'ఫ్, 'స. ముస్లిం కితాబ్ అ'జ్జకాత్, బాబ్ ఇ'అతా' అల్ - ముఅ'ల్లఫత్ ఖులూబుహుమ్ 'అలా అల్-ఇస్లాం).

[28] చూడండి, 6:25, 7:179, 9:87.

ఎందుకంటే వాస్తవానికి, మీలో బలహీనత ఉన్నదని ఆయనకు తెలుసు. కాబట్టి మీలో వందమంది స్థైర్యం గలవారు ఉంటే వారు రెండు వందల మందిని జయించగలరు మరియు మీరు వేయి మంది ఉంటే, అల్లాహ్ సెలవు తో రెండు వేల మందిని జయించగలరు మరియు అల్లాహ్ సహనం గలవారితో ఉంటాడు.

67. (శత్రువులతో తీవ్రంగా పోరాడి, వారిని) పూర్తిగా అణచనంత వరకు, తన వద్ద యుద్ధ ఖైదీలను ఉంచుకోవటం ధరణిలో, ఏ ప్రవక్తకూ తగదు[29]. మీరు ప్రాపంచిక సామగ్రి కోరు తున్నారు. కాని అల్లాహ్ (మీ కొరకు) పరలోక (సుఖాన్ని) కోరుతున్నాడు. మరియు అల్లాహ్ సర్వశక్తిమంతుడు, మహా వివేచనాపరుడు.

68. ఒకవేళ అల్లాహ్ (ఫర్మానా) ముందే వ్రాయబడి ఉండకపోతే, మీరు తీసుకున్న దానికి (నిర్ణయానికి) మీకు ఘోరశిక్ష విధించబడి

---

[29] చూడండి, 47:4. ఈ ఆయత్ సారాంశం ఏమిటంటే: ఎంత వరకైతే శత్రువులను హతమార్చి, వారిపై పూర్తిగా ప్రాబల్యాన్ని పొందరో, జయించరో! అంత వరకు, వారితో పోరాడి వారిని హతమార్చాలి, వారి యుద్ధం చేయగల శక్తిని పూర్తిగా అంతమొందించాలి. ఆ తరువాతనే వారి యుద్ధ ఖైదీలను విమోచనా ధనం తీసుకొని విడిచే విషయం గురించి ఆలోచించాలి, లేనిచో అవకాశం దొరకగానే వారు మిమ్మల్ని, నిర్మూలించటానికి ప్రయత్నించవచ్చు!

ఉండేది[30].

**69.** కావున మీకు ధర్మసమ్మతంగా లభించిన ఉత్తమమైన విజయధనాన్ని అనుభవించండి. అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి. నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

**70.** ఓ ప్రవక్తా! నీ ఆధీనంలో ఉన్న యుద్ధఖైదీలతో ఇలా అను: "ఒకవేళ అల్లాహ్ మీ హృదయాలలో మంచితనం చూస్తే ఆయన మీ వద్ద నుండి తీసుకున్న దాని కంటే ఎంతో ఉత్తమమైన దానిని మీకు ప్రసాదించి ఉంటాడు. మరియు మిమ్మల్ని క్షమించి ఉంటాడు. మరియు అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత[31]."

**71.** కాని ఒకవేళ వారు నీకు నమ్మక ద్రోహం చేయాలని తలచుకుంటే, వారు ఇంతకు పూర్వం అల్లాహ్ కు నమ్మకద్రోహం చేశారు, కావున వారిపై నీకు శక్తినిచ్చాడు. మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా

---

[30] ఈ ఆయత్ 67వ ఆయత్ తరువాత అవతరింపజేయబడింది. 'వ్రాయబడిన మాట'ను గురించి వ్యాఖ్యాతలలో భేదాభిప్రాయాలున్నాయి. కొందరు ఇది విజయధనం అంటారు. అందుకే ఫిద్య తీసుకున్నా క్షమించబడ్డారు అంటారు. మరికొందరు బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారి 'పాపాలన్నీ క్షమించ బడిన' విషయం అంటారు. మరికొందరు, దైవప్రవక్త వారి మధ్య ఉండటమే క్షమాపణకు కారణం అంటారు. బద్ర్ యుద్ధంలో ఖైదీలైన 70 మంది ముష్రిక్ ఖురైషులను విమోచనాధనం (ఫిద్య) తీసుకొని విడిచిన తరువాత ఈ ఆయత్ మరియు దీని మునుపటి మరియు దీని తరువాత ఆయత్ లు అవతరింపజేయబడ్డాయి. వివరాలకు చూడండి, ఫ'త్హ అల్ ఖదీర్.

[31] చూడండి, 47:4.

వివేచనాపరుడు.

72. నిశ్చయంగా, విశ్వసించి వలస పోయేవారూ మరియు తమ సంపద మరియు ప్రాణాలతో అల్లాహ్ మార్గంలో పోరాడేవారూ[32], వారికి ఆశ్రయమిచ్చేవారూ మరియు సహాయం చేసే వారూ[33], అందరూ ఒకరికొకరు మిత్రులు[34]. మరియు ఎవరైతే విశ్వసించి వలస పోలేదో వారు, వలస పోనంత వరకు వారి మైత్రిత్వంతో మీకు ఎలాంటి సంబంధం లేదు. కాని వారు ధర్మం విషయంలో మీతో సహాయం కోరితే, వారికి సహాయం చేయటం మీ కర్తవ్యం; కాని మీతో ఒడంబడిక ఉన్న జాతి వారికి వ్యతిరేకంగా మాత్రం కాదు. మరియు అల్లాహ్ మీరు చేస్తున్న దంతా చూస్తున్నాడు.

73. మరియు సత్యతిరస్కారులు ఒకరికొకరు స్నేహితులు. కావున (ఓ విశ్వాసులారా!) మీరు కూడా అలా చేయక (విశ్వాసుల మధ్య పరస్పర మైత్రిత్వాన్ని పెంచక) పోతే, భూమిలో ఉపద్రవం మరియు కల్లోలం చెలరేగుతాయి.

74. మరియు ఎవరైతే విశ్వసించి వలస పోయి అల్లాహ్ మార్గంలో పోరాడారో వారూ మరియు ఎవరైతే

---

[32] వీరు వలస పోయిన 'స'హాబీలు, మొదటి శ్రేణివారు.
[33] వీరు మదీనా ముస్లింలు (అన్సారులు), రెండవ శ్రేణివారు.
[34] మౌలా: అంటే మిత్రుడు, స్నేహితుడు, సమర్థుడు, సహాయకుడు, సహకారుడు, ఆశ్రయమిచ్చేవాడు, సన్నిహితుడు, సంరక్షకుడు, స్వామి, బంధువు, కార్యకర్త, వారసుడు.

వారికి ఆశ్రయమిచ్చి సహాయపడ్డారో వారూ; ఇలాంటి వారే నిజమైన విశ్వాసులు. వారికి వారి (పాపాల) క్షమాపణ మరియు గౌరవప్రదమైన జీవనోపాధి ఉంటాయి

75. మరియు ఎవరైతే తరువాత విశ్వసించి మరియు వలస పోయి మరియు మీతో బాటు (అల్లాహ్ మార్గంలో) పోరాడారో, వారు కూడా మీ వారే! కాని అల్లాహ్ గ్రంథం ప్రకారం, రక్తసంబంధం గలవారు (వారసత్వ విషయంలో) ఒకరిపై నొకరు ఎక్కువ హక్కుదారులు[35]. నిశ్చయంగా అల్లాహ్ కు ప్రతి విషయం గురించి బాగా తెలుసు.

---

[35] విశ్వాసులు (ముస్లింలందరు) ఒకరికొకరు సహోదరులు, 49:10. కాని వారసత్వపు విషయంలో ముస్లిం బంధువులే ఒకరికొకరు వారసులవుతారు. ఒక ముస్లిం అవిశ్వాసికి గానీ, లేక ఒక అవిశ్వాసి ముస్లింనకు గానీ వారసులు కాలేరు.

# 9. అత్-తౌబహ్ [*]

1. అల్లాహ్ తరఫు నుండి మరియు ఆయన ప్రవక్త తరఫు నుండి (ఓ విశ్వాసులారా!) మీరు ఒడంబడిక చేసుకున్న బహుదైవారాధకులతో (ముష్రికీన్ లతో) ఎలాంటి సంబంధం లేదు, అని ప్రకటించబడుతోంది[1].

2. కావున (ఓ ముష్రికులారా!) మీరు నాలుగు నెలల వరకు ఈ దేశంలో స్వేచ్ఛగా తిరగండి[2]. కాని మీరు అల్లాహ్ (శిక్ష) నుండి తప్పించుకోలేరని తెలుసుకోండి. మరియు నిశ్చయంగా, అల్లాహ్! సత్యతిరస్కారులను అవమానం పాలు చేస్తాడు.

3. మరియు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త తరఫు

---

[*] [అత్-తౌబా అంటే పశ్చాత్తాపం]

[1] బరా'తున్: అంటే ఎట్టి సంబంధం లేదనటం. ఈ ఆయత్ లు అవతరింపజేయబడినప్పుడు దైవప్రవక్త ('స'అస), 'అలీ ('ర. ది.అ.ను) 9వ హిజ్రీ 'హజ్ జనసమూహంలో ఈ విషయాలను ప్రకటించమని పంపారు: 1) ప్రజలు క'అబహ్ (బైతుల్లాహ్) చుట్టూ దిగంబరులై ప్రదక్షిణ ('తవాఫ్) చేయకూడదు. 2) ఈ సంవత్సరం (9వ హిజ్రీ) తరువాత ఏ ముష్రిక్ కూడా బైతుల్లాహ్('హజ్)కు రాకూడదు. 3) ఏ అవిశ్వాసులతోనైతే ఒడంబడిక ఉందో, వారి యెడల గడువు పూర్తి అయ్యేవరకు విశ్వాసపాత్రంతో వ్యవహరించడం జరుగుతుంది. ('స. బు'ఖారీ మరియు 'స. ముస్లిం). ఆ 9వ హిజ్రీ 'హజ్ కు అబూ బక్ర్ 'సిద్దీఖ్ (ర.'ది.అ.) అమీర్ గా ఉన్నారు.

[2] చూడండి, 8:58. ఈ ఆయత్, ముస్లింలతో చేసిన ఒడంబడికను త్రెంపిన ముష్రికులను ఉద్దేశించి ఉంది.

నుండి పెద్ద హజ్జ్[3] రోజున సర్వమానవ జాతికి ప్రకటన చేయబడుతోంది: "నిశ్చయంగా, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తకు, బహుదైవారాధకులతో, ఎలాంటి సంబంధం లేదు. కావున మీరు (ఓ ముష్రికులారా!) పశ్చాత్తాపపడితే, అది మీ మేలుకే. కాని మీరు విముఖులైతే, మీరు అల్లాహ్ (శిక్ష) నుండి తప్పించుకోలేరని తెలుసుకోండి." మరియు సత్యతిరస్కారులకు బాధాకరమైనశిక్ష (విధించ బడ) నున్నదనే వార్తను వినిపించు.

4. కాని ఏ బహుదైవాధకులతోనైతే మీరు ఒడంబడికలు చేసుకొని ఉన్నారో, వారు మీకు ఏ విషయంలోను లోపం చేయక, మీకు వ్యతిరేకంగా ఎవరికీ సహాయం చేయకుండా ఉంటే! వారి ఒడంబడికను దాని గడువు వరకు పూర్తి చెయ్యండి. నిశ్చయంగా, అల్లాహ్ దైవభీతి గలవారిని ప్రేమిస్తాడు.

---

[3] యౌమల్ 'హజ్జిల్-అక్బర్: అంటే 10వ జు'ల్-'హజ్ దినమని 'స'హీ'హ్ 'హదీసుల ద్వారా తెలుస్తుంది. ఎందుకంటే ఆ రోజు 'హాజీలకు చాలా మనాసిక్ లను పూర్తిచేయవలసి ఉంటుంది. అది 'హజ్జె 'అస్గర్ కు భిన్నపదం. అరేబియావాసులు 'ఉమ్రాను చిన్నహజ్('హజ్ 'అస్గర్) అనేవారు. దీనికి భిన్నంగా జు'ల్-'హజ్ మాసంలో జరిగేది పెద్దహజ్(హ'జ్ అక్బర్) 9వ జు'ల్-'హజ్ శుక్రవారం రోజు వస్తే 'హజ్జె అక్బర్ అనే దానికి ఎలాంటి ఆధారం లేదు. ('స. బు'ఖారీ,4655,'స.ముస్లిం 982 మరియు తిర్మిజీ 957)

**5.** ఇక నిషిద్ధమాసాలు[4] గడిచిపోయిన తరువాత బహుదైవారాధకులను, ఎక్కడ దొరికితే అక్కడ వధించండి[5]. మరియు వారిని పట్టుకోండి[6] మరియు చుట్టుముట్టండి మరియు ప్రతి మాటు వద్ద వారికై పొంచి ఉండండి[7]. కాని వారు పశ్చాత్తాపపడి, నమాజ్ స్థాపించి, జకాత్ ఇస్తే, వారిని వారి మార్గాన వదలిపెట్టండి[8] నిశ్చయంగా

---

[4] హిజ్రీ శకంలోని రజబ్, జు'ల్-ఖాయిదహ్, జు'ల్-'హిజ్జహ్ మరియు ము'హర్రమ్ నెలలు నిషిద్ధ మాసాలు. ఈ మాసాలలో యుద్ధం నిషిద్ధం. ఇది 'అరబ్బులలో ఇస్లాంకు ముందు నుండి వస్తూ ఉన్న ఆచారం. చూడండి, 2:194, 217. ఇబ్నె-కసీ'ర్ (ర'హ్మ) ఇక్కడ (ఈ ఆయత్ లో) నిషిద్ధమాసాలు అంటే ఈ ప్రకటన తరువాత 4 నెలలు అంటే 10వ జు'ల్-'హిజ్జహ్ నుండి 10వ రబీ'అ-అత్తాని వరకు అని అన్నారు

[5] 'హరమ్ సరిహద్దులలో కేవలం వారితోనే పోరాడాలి, ఎవరైతే మీపై దాడి చేస్తారో! చూడండి, 2:190-194, (ఇబ్నె-కసీ'ర్). మీతో యుద్ధం చేసే వారితోఅల్లాహ్ (సు.తా.) మార్గంలో పోరాడండి. ఎవరైతే మీతో విరోధాలు చేయరో, వారితో పోరాడవద్దు. జిహాద్ అంటే, మీరు ముస్లింలు అయి ఉండి. ఇతరులకు శాంతియుతంగా ఏక దైవసిద్ధాంతాం, సత్యధర్మం అయిన ఇస్లాంను బోధిస్తూ ఉంటే, మీ మార్గంలో ఆటంకాలు పెడుతూ, మీ ధన, మాన, ప్రాణాలకు హాని గలిగించగోరే వారితో, వారు మానుకునే వరకు లేదా నిర్మూలించబడే వరకు చేసే ధర్మయుద్ధం. చూడండి, 4:91. అంటే ఆత్మ సంరక్షణ కొరకు చేసే పోరాటం జిహాద్. చూడండి, 60:8-9.

[6] ఖైదీలుగా చేసుకొనండి.

[7] వారి రాకపోకడలపై కాపలా పెట్టండి. మీ అనుమతి లేనిదే వారిని కదలనివ్వకండి. వారి నివాస స్థలాలను కాపెట్టుకొని ఉండండి.

[8] చూడండి, 2:256. 'ధర్మ విషయంలో బలవంతం లేదు.' అంటే ఎవ్వరినీ కూడా ఇస్లాం స్వీకరించటానికి బలవంతం చేయకూడదు.

అల్లాహ్ క్షమాశీలుడు అపార కరుణా ప్రదాత

6. మరియు బహుదైవారాధకులలో (ముష్రికీన్'లలో) ఎవడైనా నీ శరణు కోరితే - అతడు అల్లాహ్ గ్రంథాన్ని (ఖుర్ఆన్'ను) వినటానికి - అతడికి శరణు ఇవ్వు. తరువాత అతడిని, అతడి కొరకు సురక్షితమైన స్థలానికి చేర్చు. ఇది ఎందుకంటే! వాస్తవానికి, వారు (సత్యం) తెలియని ప్రజలు[9].

7. బహుదైవారాధకులకు (ముష్రికీన్ లకు) అల్లాహ్ తో మరియు ఆయన ప్రవక్తతో ఒడంబడిక ఎలా సాధ్యం కాగలదు? మస్జిద్ అల్ హరామ్ వద్ద మీరు ఒడంబడిక చేసుకున్న వారితో తప్ప! వారు తమ (ఒడంబడికపై) స్థిరంగా ఉన్నంత వరకు మీరు కూడా దానిపై స్థిరంగా ఉండండి. నిశ్చయంగా, అల్లాహ్ దైవభీతి గలవారిని ప్రేమిస్తాడు.

8. (వారితో ఒడంబడిక) ఎలా సాధ్యం కాగలదు? ఎందుకంటే వారు మీపై ప్రాబల్యం వహిస్తే, వారు మీ బంధుత్వాన్ని గానీ, ఒడంబడికను గానీ పాటించరు. వారు కేవలం నోటి మాటలతోనే మిమ్మల్ని సంతోషపరుస్తున్నారు. కాని వారి

---

[9] పై ఆయత్ మీతో యుద్ధం చేస్తున్న సత్యతిరస్కారుల విషయంలో అవతరింపజేయబడింది. ఈ విరోధులైన సత్యతిరస్కారులలో ఎవడైనా మీ శరణు కోరితే అతనికి శరణు ఇవ్వండి. అతడు మీతో ఉండి మీ మంచితనాన్ని మరియు ఇస్లాంను దగ్గరనుండి చూసి ఖుర్ఆన్ విని ముస్లిం కావచ్చు. అతడు ఖుర్ఆన్ ను విన్న తరువాత కూడా ఇస్లాం స్వీకరించకుంటే అతనిని, అతనికి భద్రతనిచ్చే స్థలానికి పంపండి. అతడు ముస్లిం కాకున్నా సరే. మీరిచ్చిన శరణపు ప్రతిజ్ఞను పూర్తి చేసుకోండి. అతడు తన భద్రతా స్థలానికి చేరేంత వరకు వాని ప్రాణ రక్షణ మీ బాధ్యత.

హృదయాలు మాత్రం మిమ్మల్ని అసహ్యించు కుంటున్నాయి మరియు వారిలో అనేకులు అవిధేయులు (ఫాసిఖూన్) ఉన్నారు.

9. వారు అల్లాహ్ సూక్తులను (ఆయాత్ లను) అల్పధరకు విక్రయించి, ప్రజలను ఆయన మార్గం నుండి ఆటంకపరుస్తున్నారు. నిశ్చయంగా, వారు చేసే పనులు ఎంతో నీచమైనవి!

10. వారు ఏ విశ్వాసి విషయంలో కూడా బంధుత్వాన్ని గానీ, ఒడంబడికను గానీ పాటించరు! ఇటువంటి వారే, హద్దును అతిక్రమించినవారు.

11. కావున వారు పశ్చాత్తాపపడి, నమాజ్ స్థాపించి, జకాత్ ఇస్తే! వారు మీ ధార్మిక సోదరులు. మరియు తెలుసుకోగలవారికి, మేము మా సూచనలను, ఈ విధంగా స్పష్టపరుస్తున్నాము.

12. మరియు వారు ఒడంబడిక చేసిన తరువాత, మళ్ళీ తమ ప్రమాణాలను భంగం చేస్తే! మరియు మీ ధర్మాన్ని అవమానపరిస్తే, అలాంటి సత్యతిరస్కారుల నాయకులతో మీరు యుద్ధం చేయండి. నిశ్చయంగా, వారి ప్రమాణాలు నమ్మదగినవి కావు. బహుశా ఈ విధంగా నైనా వారు మానుకోవచ్చు![10]

13. ఏమీ? ఎవరైతే తమ ప్రమాణాలను భంగం చేసి, సందేశహరుణ్ణి (మక్కా నుండి) వెడల గొట్టాలని

[10] ఎవరైతే ఒడంబడిక చేసిన తరువాత తమ ఒండబడికలను భంగం చేస్తారో మరియు మీ ధర్మాన్ని అవమానపరుస్తారో, అలాంటి సత్యతిరస్కారులతో యుద్ధం చేయండి.

నిర్ణయించారో! మరియు మొదట వారే, మీతో తగవు ఆరంభించారో[11], అలాంటి వారితో మీరు యుద్ధం చేయరా? ఏమీ? మీరు వారికి భయపడుతున్నారా? వాస్తవానికి మీరు విశ్వాసులే అయితే, కేవలం అల్లాహ్ కు మాత్రమే భయపడటం మీ కర్తవ్యం.

**14.** వారితో యుద్ధం చేయండి. అల్లాహ్ మీ చేతుల ద్వారా వారిని శిక్షిస్తాడు మరియు వారిని అవమానం పాలు చేస్తాడు. మరియు వారికి ప్రతికూలంగా మీకు సహాయం చేస్తాడు. మరియు విశ్వసించిన ప్రజల హృదయాలను చల్లబరుస్తాడు;

**15.** మరియు వారి హృదయాలలోని క్రోధాన్ని దూరం చేస్తాడు. మరియు అల్లాహ్! తాను కోరిన వారి పశ్చాత్తాపాన్ని అంగీకరిస్తాడు. మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేచనాపరుడు.

**16.** ఏమీ? అల్లాహ్ మీలో నుండి (తన మార్గంలో) పోరాడేవారెవరో మరియు - అల్లాహ్, ఆయన ప్రవక్త మరియు విశ్వాసులు తప్ప - ఇతరుల నెవ్వరినీ తమ ఆప్తమిత్రులుగా చేసుకోని వారెవరో,

---

[11] బహుశా ఇక్కడ ఖురైషులు తమ ఒడంబడికకు విరుద్ధంగా బనీ-'ఖు'జా'అ వారిని చంపటానికి, బనీ-బక్ర్ వారికి తోడ్పడిన విషయం పేర్కొనబడింది. బనీ-'ఖు'జా'అ - ముస్లింల హలీఫ్ లు, మరియు బనీ-బక్ర్ - ఖురైషుల హలీఫ్ లు. దైవప్రవక్త ('స'అస) మరియు మక్కా ముష్రిక్ ఖురైషుల మధ్య: 'పది సంవత్సరాల వరకు - వారి మధ్య మరియు వారి హలీఫ్ లతో కూడా - యుద్ధం చేయకూడదు మరియు వారితో పోరాడే వారికి సహాయం కూడా చేయరాదు.' అనే, ఒడంబడిక ఉండెను. ఇది 6వ హిజ్రీలో హుదైబియాలో జరిగిన ఒడంబడిక.

తెలుసుకోనిదే మిమ్మల్ని వదలిపెడతాడని అనుకుంటున్నారా? మరియు అల్లాహ్ మీరు చేస్తున్నదంతా బాగా ఎరుగును.

17. బహుదైవారాధకులు (ముష్రికీన్), తాము సత్యతిరస్కారులమని సాక్ష్యమిస్తూ, అల్లాహ్ మస్జిదులను నిర్వహించటానికి (సేవ చేయటానికి) అర్హులు కారు. అలాంటి వారి కర్మలు వ్యర్థమై పోతాయి మరియు వారు నరకాగ్నిలో శాశ్వతంగా ఉంటారు.

18. నిశ్చయంగా, అల్లాహ్ ను అంతిమదినాన్ని విశ్వసించేవారు, నమాజ్ ను స్థాపించేవారు, జకాత్ ఇచ్చేవారు, అల్లాహ్ కు తప్ప మరెవ్వరికీ భయపడని వారు మాత్రమే అల్లాహ్ మస్జిదులను నిర్వహించాలి. ఇలాంటి వారే మార్గదర్శకత్వం పొందినవారని ఆశించవచ్చు![12]

19. ఏమీ? హజ్జ్ మరియు ఉమ్రా కొరకు వచ్చేవారికి నీరు త్రాపటాన్ని మరియు మస్జిద్ అల్ హరామ్ ను నిర్వహించటాన్ని, మీరు అల్లాహ్ ను మరియు

---

[12] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'ఒకవేళ మీరు ఒక వ్యక్తిని సక్రమంగా మస్జిద్ కు వస్తూ ఉండేది చూస్తే, అతని విశ్వాసానికి సాక్ష్యం ఇవ్వండి.' (తిర్మిజీ', తఫ్సీర్ 'సూ. అత్-తౌబహ్). ఖుర్ఆన్‌లో ఇక్కడ కూడా అల్లాహ్ (సు.తా.) ను అంతిమదినాన్ని విశ్వసించిన తరువాత చేయవలసిన పనులలో నమా'జ్, దాని తరువాత 'జకాత్ అని పేర్కొనబడ్డాయి. మరొక 'హదీస్' ముత్తఫిఖ్ అలైహి ఉంది. అబూ-బక్ర్ 'సిద్దీఖ్ (ర'ది.'అ) అన్నారు: 'అల్లాహ్ తోడు, నేను అలాంటి వారితో తప్పక పోరాడుతాను, ఎవరైతే నమా'జ్ మరియు 'జకాత్ ల మధ్య భేదం చూపుతారో!' అంటే నమా'జ్ చేస్తారు కాని 'జకాత్ ఇవ్వడానికి వెనుకంజవేస్తారో! (చూడండి, 9:5).

అంతిమదినాన్ని విశ్వసించి, అల్లాహ్ మార్గంలో పోరాడేదానికి సమానంగా భావిస్తున్నారా? అల్లాహ్ దగ్గర, వారు (ఈ రెండు పక్షాలవారు) సరిసమానులుకారు[13] మరియు అల్లాహ్ దుర్మార్గులైన ప్రజలకు సన్మార్గం చూపడు

20. విశ్వసించి, అల్లాహ్ మార్గంలో వలసపోయినవారికీ మరియు తమ ధనసంపత్తులను, ప్రాణాలను వినియోగించి పోరాడిన వారికీ, అల్లాహ్ దగ్గర అత్యున్నత స్థానముంది. మరియు అలాంటి వారే సాఫల్యం (విజయం) పొందేవారు[14].

21. వారి ప్రభువు వారికి, తన తరఫు నుండి కారుణ్యాన్ని మరియు ప్రసన్నతను మరియు శాశ్వత సౌఖ్యాలు

---

[13] ఈ ఆయత్ అవతరింపజేయబడిన సందర్భాన్ని గురించి, 'స'హాబా ('ర.ది.'అన్హుమ్)ల మధ్య మస్జిదె నబవీలో శుక్రవారం మింబర్ దగ్గర జరిగిన ఈ సంభాషణ కారణం అంటారు. ఒక 'సహాబీ (ర'ది.'అ) అంటారు: "నేను ఇస్లాం స్వీకరించిన తరువాత నా దృష్టిలో అన్నిటి కంటే ఉత్తమమైన కార్యం 'హాజీలకు 'జమ్'జమ్ త్రావపడం." రెండో అతను అంటాడు: "నా దగ్గర మస్జిద్ అల్-'హరాం సేవ చేయడం." మూడవ అతను అంటారు: "అల్లాహ్ (సు.తా.) మార్గంలో జిహాద్ చేయడం." ఈ 'హదీస్' కథకుడు నూమూన్ బిన్-బషీర్ (ర.'ది.'అ.) నేను ఆరోజు జుమ'అహ్ నమాజ్' తరువాత వెళ్ళి దైవప్రవక్త ('స'అస)కు ఈ విషయం తెలిపాను. అప్పుడు ఈ ఆయత్ అవతరింపజేయబడింది. ('స'హీ'హ్ ముస్లిం, కితాబ్ అల్ ఇమారహ్, బాబ్ ఫజ్ల్ అష్షహాదహ్ ఫీ సబీలిల్లాహ్). అల్లాహ్ (సు.తా.)ను అంతిమదినాన్ని విశ్వసించిన తరువాతనే అల్లాహ్ (సు.తా.) మార్గంలో జిహాద్ స్వీకరించబడుతుంది. ఈమాన్ లేనిదే ఎంత గొప్ప కార్యం చేసినా దాని ఫలితం శూన్యమే. విశ్వాసుని జిహాద్ సర్వకార్యాలలో గొప్పది. ఈ విషయం దీని తరువాత ఉన్న ఆయత్ లో స్పష్టంగా ఉంది.

[14] చూడండి, 'స. బు'ఖారీ, పు - 4, 'హ. 48, 54.

గల స్వర్గవనాల శుభవార్తను ఇస్తున్నాడు.

**22.** వారందులో శాశ్వతంగా కలకాలం ఉంటారు. నిశ్చయంగా, అల్లాహ్ దగ్గర గొప్ప ప్రతిఫలముంది.

**23.** ఓ విశ్వాసులారా! మీ తండ్రితాతలు మరియు మీ సోదరులు సత్యతిరస్కారానికి విశ్వాసంపై ప్రాధాన్యతనిస్తే, మీరు వారిని స్నేహితులుగా చేసుకోకండి. మీలో వారి వైపు మొగ్గేవారే (వారిని మీ స్నేహితులుగా చేసుకునే వారే) దుర్మార్గులు[15].

**24.** వారితో ఇలా అను: "మీ తండ్రితాతలు మీ కుమారులు, మీ సోదరులు, మీ సహవాసులు (అజ్వాజ్), మీ బంధువులు, మీరు సంపాదించిన ఆస్తిపాస్తులు, మందగిస్తాయేమోనని భయపడే మీ వ్యాపారాలు, మీకు ప్రీతికరమైన మీ భవనాలు - అల్లాహ్ కంటే, ఆయన ప్రవక్త కంటే మరియు ఆయన మార్గంలో పోరాడటం కంటే - మీకు ఎక్కువ ప్రియమైనవైతే, అల్లాహ్ తన తీర్పును బహిర్గతం చేసే వరకు నిరీక్షించండి. మరియు అల్లాహ్ అవిధేయులైన జాతి వారికి సన్మార్గం

---

[15] హిజ్రత్ నుండి జిహాద్ విషయంలో మీరు, మీ సోదరుల మరియు తండ్రుల ప్రేమను రానివ్వకండి. వారు మీ స్నేహితులు కాలేరు. వారు మీతో మంచిగా వ్యవహరిస్తే, మిమ్మల్ని మీ ఇస్లాం ధర్మాన్ని పాటించటం నుండి ఆపకుంటే, వారితో మంచిగా వ్యవహరించండి. కాని వారు మిమ్మల్ని ఇస్లాం కొరకే బాధిస్తే, వారిని మీ స్నేహితులుగా భావించకండి. (చూ. 3:28, 60:89).

చూపడు[16]."

**25.** వాస్తవానికి ఇది వరకు చాలా యుద్ధరంగాలలో (మీరు కొద్దిమంది ఉన్నా) అల్లాహ్ మీకు విజయం చేకూర్చాడు. మరియు హునైన్ (యుద్ధం) రోజు మీ సంఖ్యాబలం మీకు గర్వ కారణమయింది. కాని, అది మీకు ఏవిధంగానూ పనికి రాలేదు మరియు భూమి విశాలమైనది అయినప్పటికీ మీకు ఇరుకై పోయింది. తరువాత మీరు వెన్ను చూపి పారిపోయారు[17].

---

[16] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: "ఎవరిచేతిలోనైతే నా ప్రాణాలున్నాయో ఆ అల్లాహ్ (సు.తా.) తోడు. మీలో ఏ ఒక్కడు కూడా ముఅ'మిన్ కాజాలడు, ఎంతవరకైతే అతడు తన తండ్రి, తన సంతానం మరియు ఇతరులందరికంటే, నన్ను ('స'అస) ఎక్కువగా ప్రేమించడో!" ('స'హీ'హ్ బుఖా'రీ, కితాబ్ అల్ - ఈమాన్, బాబ్ 'హుబ్బె రసూల్ ('స'అస) మినల్ ఈమాన్; 'స'హీ'హ్ ముస్లిం, కితాబ్ అల్ - ఈమాన్).

[17] 'హునైన్, మక్కా మరియు 'తాయిఫ్ ల మధ్య పర్వతాలలో ఉన్న ఒక లోయ (వాది). అక్కడ హవా'జిన్ మరియు స'ఖీఫ్ అనే రెండు తెగలవారు ఉండేవారు. వారు విలువిద్యలో నిపుణులు. వారు ముస్లింలకు విరుద్ధంగా పోరాడటానికి, యుద్ధ తయారీలు చేస్తున్నారని తెలుసుకొని దైవప్రవక్త ('స'అస), 12,000 సైనికులతో, మక్కా విజయపు 18-19 దినాల తరువాత 8వ హిజ్రీ, షవ్వాల్ నెలలో వారిపై దాడి చేయడానికి వెళ్ళారు. ముస్లింలకు తమ సంఖ్యాబలం కొంత వరకు గర్వానికి కారణమవుతుంది. ఇది అల్లాహ్ (సు.తా.)కు నచ్చదు. శత్రువులు దాదాపు 4,000 మంది ఉంటారు. శత్రువుల బాణాల దెబ్బలకు తాళుకోలేక ముస్లిం సైనికులు వెనుదిరిగి పారిపోసాగుతారు. కేవలం దైవప్రవక్త ('స'అస), కొందరు ముస్లింలతో బాటు మిగిలిపోతారు. దైవప్రవక్త ('స'అస), పారిపోయే వారిని ఆపటానికి కేకలు వేస్తారు. తరువాత అతను ('స'అస), 'అబ్బాస్ (ర.'ది.'అ)తో వారిని పిలవమని అంటారు. అతను పెద్ద పెద్ద కేకలు వేయటం వల్ల, సిగ్గుపడి కొందరు తిరిగి వస్తారు. ఆ ఉన్నవారే ధైర్యస్థైర్యాలతో యుద్ధం చేసి అల్లాహ్ (సు.తా.) అనుగ్రహంతో విజయం పొందుతారు. శత్రువులు తమ ఆస్తిపాస్తులన్నీ విడిచి పారిపోతారు.

**26.** తరువాత అల్లాహ్ తన ప్రవక్తపై మరియు విశ్వాసులపై ప్రశాంత స్థితిని అవతరింప జేశాడు. మరియు మీకు కనిపించని (దైవదూతల) దళాలను దింపి సత్యతిరస్కారులను శిక్షించాడు[18]. మరియు ఇదే సత్యతిరస్కారులకు లభించే ప్రతిఫలం.

**27.** ఆ తరువాత కూడా అల్లాహ్ తాను కోరిన వారి పశ్చాత్తాపాన్ని అంగీకరిస్తాడు. మరియు అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

**28.** ఓ విశ్వాసులారా! నిశ్చయంగా, బహుదైవారాధకులు (ముష్రికీన్) అపరిశుద్ధులు (నజ్స్)[19] కనుక ఈ సంవత్సరం తరువాత వారు మస్జిద్ అల్ హరామ్

---

[18] కనిపించని దళాలను అంటే దైవదూతలను, అల్లాహ్ (సు.తా.) పంపాడు. ఏ విధంగానైతే ఉ'హుద్ యుద్ధంలో (చూడండి, 3:124-125) మరియు బద్ర్ యుద్ధంలో (చూడండి, 8:9) పంపాడో!

[19] నజసున్: అంటే అవిశ్వాసులు, అశుచులు, అశుభ్రులు, అపరిశుద్ధులు, మురికివారు, మాలిన్యులు, కల్మాషులు అనే అర్థాలున్నాయి. ఈ అపరిశుద్ధత శారీరకంగా గానీ, లేక మానసికంగా గానీ, లేక రెండూ గానీ కావచ్చు. శారీరకంగా ఎందుకంటే వారు లైంగిక లేక కాలకృత్యాల అపరిశుద్ధత తరువాత విధిగా పరిశుద్ధత అవలంబించక పోవడం. మానసికంగా, ఎందుకంటే వారు ఏకైక ఆరాధ్యుడు, సర్వసృష్టికర్త, సర్వపోషకుడు అయిన అల్లాహ్ (సు.తా.)ను వదలి ఇతరులను ఏమీ చేయలేని వారిని అల్లాహ్ (సు.తా.) కు సాటి కల్పించడం. ఈ శబ్దం ఖురఆన్ లో ఈ ఆయత్ లోనే ఒకేసారి వచ్చింది.

సమీపానికి రాకూడదు[20]. మరియు ఒకవేళ మీరు లేమికి భయపడితే! అల్లాహ్ కోరితే, తన అనుగ్రహంతో మిమ్మల్ని సంపన్నులుగా చేయగలడు! నిశ్చయంగా, అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేచనాపరుడు.

29. అల్లాహ్ ను మరియు అంతిమదినాన్ని విశ్వసించని; అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త నిషేధించినవి, నిషిద్ధమని భావించని; సత్యధర్మాన్ని తమ ధర్మంగా స్వీకరించని గ్రంథప్రజలతో - వారు స్వయంగా తమ చేతులతో జిజ్ యా[21] ఇచ్చి లోబడి ఉండే వరకూ –

---

[20] ముస్లిమేతరులు 'హరమ్ సరిహద్దులలోకి రాకూడదు. ఈ ఆజ్ఞ 9వ హిజ్రీలో వచ్చింది. కాని వారు ఇతర మస్జిదులలో ప్రవేశించవచ్చు. ఉదాహరణకు దైవప్రవక్త ('స'అస)స'మామ బిన్-ఆసాల్(ర'ది. 'అ.) ను అతడు ఇస్లాం స్వీకరించక ముందు మస్జిద్ అన్ నబవీలో ఒక స్థంభానికి ఖైదీగా కట్టి ఉంచారు.

[21] జి'జ్ యతున్: ఖుర్ఆన్ లో ఇచ్చట ఒకేసారి వచ్చింది. జి'జ్ యా అంటే, ముస్లిమేతరులతో ఇస్లామీయ ప్రభుత్వం వసూలు చేసే పన్ను. దీనికి కారణాలు: 1) వారు విధిగా 'జకాత్ చెల్లించరు, 2) వారికి ఇస్లామీయ ప్రభుత్వంలో జిహాద్, అంటే ఇస్లాం ధర్మ రక్షణ కొరకు పోరాడటం విధికాదు, 3) వారి ఆత్మరక్షణ ఖర్చు కొరకు. ఈ క్రింద పేర్కొన్న వారికి జి'జ్ యా లేదు. 1) స్త్రీలు, 2) యుక్తవయస్సుకు రాని పురుషులు, 3) వృద్ధులు, 4) వ్యాధిగ్రస్తులు మరియు వికలాంగులు, 5) ధర్మవేత్తలు, గురువులు, మునులు, 6) ఎవరైతే జిహాద్ (మిలటరీ డ్యూటీ) కొరకు సిద్ధపడతారో వారు.

పోరాడండి[22].

**30.** మరియు యూదులు ఉజైర్ అల్లాహ్ కుమారుడని అంటారు[23]. మరియు క్రైస్తవులు మసీహ్ (క్రీస్తు) అల్లాహ్ కుమారుడని. ఇవి వారు తమ నోటితో అనేమాటలే. ఇంతకుపూర్వపుసత్యతిరస్కారులు పలికిన మాటలనే వారు అనుకరిస్తున్నారు. అల్లాహ్ వారిని నశింప జేయుగాక! వారెంత మోసగింపబడుతున్నారు (సత్యం నుండి మరలింప బడుతున్నారు)!

**31.** వారు (యూదులు మరియు క్రైస్తవులు) అల్లాహ్ ను వదలి తమ యూద మతాచారులు (అహ్ బార్) లను మరియు (క్రైస్తవ) సన్యాసులను (రుహ్ బాన్ లను) మరియు మర్యమ్ కుమారుడైన మసీహ్ ను (క్రీస్తును) తమ ప్రభువులుగాచేసుకుంటున్నారు[24]. వాస్తవానికి, వారు ఒకే ఒక్క దైవాన్ని మాత్రమే ఆరాధించాలని ఆజ్ఞాపించబడ్డారు. ఆయన (అల్లాహ్) తప్ప

---

[22] జిహాద్ ను ఈ విధంగా కూడా వివరించారు: అల్లాహ్ (సు.తా.) మార్గంలో పోరాడటం, అంటే సత్యాన్ని మరియు దానిని అనుసరించే వారిని (ముస్లింలను) రక్షించటానికి చేసే ధర్మ యుద్ధం. ఇది ప్రతి ముస్లిం యొక్క విధి. (చూడండి, 2:190-194).

[23] బాబిలోనియన్ లు (Babylonians) యూదులను, వెడలగొట్టిన తరువాత వారు (యూదులు) తౌరాత్ ను కోల్పోయారు. అది ఈ రోజు న్న స్థితిలోకి, దానిని తిరిగి తెచ్చినవారు 'ఉ'జైర్ 'అ.స. (Ezra). అతనే ఈ రోజు ఆచారంలో ఉన్న యూదమతాన్ని స్థాపించారు. (Encyclopedia Brittanica, 1963, vol-9, p.15). అతనినే యూదులు అల్లాహుతా'ఆలా కుమారుడంటారు.

[24] చూడండి, 3:64.

మరొక ఆరాధ్య దైవం లేడు. ఆయన వారు సాటి కల్పించే వాటికి అతీతుడు.

**32.** వారు అల్లాహ్ జ్యోతిని (ఇస్లాంను) తమ నోటితో (ఊది) ఆర్పగోరుతున్నారు, కాని అల్లాహ్ అలా కానివ్వడు; సత్యతిరస్కారులకు అది ఎంత అసహ్యకరమైనా, ఆయన తన జ్యోతిని పూర్తిచేసి (ప్రసరింపజేసి) తీరుతాడు.

**33.** బహుదైవారాధకులకు (ముష్రికీన్ లకు) అది ఎంత అసహ్యకరమైనా, తన ప్రవక్తకు మార్గదర్శకత్వాన్ని మరియు సత్యధర్మాన్నీ ఇచ్చి పంపి దానిని సకల ధర్మాల మీద ప్రబలింప జేసినవాడు (ఆధిక్యతనిచ్చిన వాడు) ఆయన (అల్లాహ్) యే![25]

**34.** ఓ విశ్వాసులారా! నిశ్చయంగా, చాలా మంది యూద మతాచారులు (అహ్ బార్) మరియు క్రైస్తవ సన్యాసులు (రుహ్ బాన్) ప్రజల సొత్తును అక్రమ పద్ధతుల ద్వారా తిని వేస్తున్నారు మరియు వారిని అల్లాహ్ మార్గం నుండి ఆటంక పరుస్తున్నారు. మరియు ఎవరైతే వెండి, బంగారాన్ని కూడ బెట్టి, దానిని అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టరో వారికి బాధారకమైన శిక్ష గలదనే వార్తను వినిపించు.

**35.** ఆ దినమున దానిని (జకాత్ ఇవ్వని ధనాన్ని /ఆ వెండి బంగారాన్ని) నరకాగ్నిలో కాల్చి దానితో వారి నుదురుల మీద, ప్రక్కల మీద మరియు వీపుల మీద వాతలు వేయబడ

---

[25] చూడండి, 3:19 మరియు 61:8-9.

తాయి[26]. (అప్పుడు వారితో ఇలా అనబడుతుంది): "ఇదంతా మీరు మీ కొరకు కూడ బెట్టుకున్నదే. కావున మీరు కూడ బెట్టుకున్న దానిని చవి చూడండి."

**36.** నిశ్చయంగా, నెలల సంఖ్య అల్లాహ్ దగ్గర పన్నెండు నెలలు మాత్రమే. ఇది భూమ్యాకాశాలు సృష్టించిన దినం నుండి అల్లాహ్ గ్రంథంలో వ్రాయబడి ఉంది. వాటిలో నాలుగు నిషిద్ధ (మాసాలు)[27] ఇదే సరైన ధర్మం. కావున వాటిలో (ఆ నాలుగు హిజ్రీ మాసాలలో) మీకు మీరు అన్యాయం చేసుకోకండి[28]. బహుదైవారాధకులతో (ముష్రికీన్ లతో) అందరూ కలిసి పోరాడండి. ఏ

---

[26] చూడండి, 3:180 ఇంకా చూడండి, 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 2, 'హదీస్' నెం. 486.

[27] నిషిద్ధమాసాలు హిజ్రీ శకపు రజబ్, జు'ల్-ఖాయిదహ్, జు'ల్-'హిజ్జహ్ మరియు ము'హర్రమ్ (7, 11, 12 మరియు 1వ నెలలు).

[28] హిజ్రీ నెలల లెక్క చంద్రుని నెలప్రకారం ఉంది.అంటే హిజ్రీ సంవత్సరం చాంద్రమాన సంవత్సరం. ఇది ప్రకృతి సిద్ధమైన నెలలు మరియు సంవత్సరాలు. వీటిని అనుసరించటానికి లెక్కలు పెట్టే అవసరం లేదు. దీని వల్ల రమ'దాన్ ఉపవాసాలు మరియు 'హజ్ వేరువేరు ఋతువులలో వస్తాయి. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా, ప్రజలు ప్రతి ఋతువులో ఉపవాసాలు, పండుగలు చేసుకుంటారు. చాంద్రనెల 29.5 రోజులది మరియు చాంద్ర సంవత్సరం 354 రోజులది. సూర్యమాన సంవత్సరంలో ఇది 11.25 రోజులు తక్కువ. దీని వల్ల ప్రతి 34 చాంద్రమాన సంవత్సరాలకు అంటే 12,036 దినాలకు ఒకసారి 'హజ్ అదే దినమున మళ్ళీ వస్తుంది. ముష్రిక్ అరబ్బులు, చాంద్రమాన సంవత్సరాన్ని సూర్యమాన సంవత్సరంతో సరిపెట్టటానికి అధికమాసాన్ని చేర్చేవారు. ఈ ఆయత్ తరువాత ఇస్లాం షరీయత్ లో సూర్యమాన సంవత్సరం మరియు అలా సరిపెట్టటం రద్దు చేయబడ్డాయి.

విధంగా అయితే వారందరూ కలిసి మీతో పోరాడుతున్నారో! మరియు నిశ్చయంగా, అల్లాహ్ దైవభీతి గల వారితోనే ఉంటాడని తెలుసుకోండి[29].

**37.** నిశ్చయంగా, నెలలను వెనుక ముందు చేయటం(నసీఉ) సత్యతిరస్కారంలో అదనపు చేష్టయే! దాని వల్ల సత్యతిరస్కారులు మార్గభ్రష్టత్వానికి గురి చేయబడుతున్నారు. వారు దానిని ఒక సంవత్సరం ధర్మసమ్మతం చేసుకుంటారు, మరొక సంవత్సరం నిషేధించు కుంటారు. ఈ విధంగా వారు అల్లాహ్ నిషేధించిన (నెలల) సంఖ్యను తమకు అనుగుణంగా మార్చుకొని అల్లాహ్ నిషేధించిన దానిని ధర్మసమ్మతం చేసుకుంటున్నారు. వారి దుష్కార్యాలు వారికి మనోహరమైనవిగా కనిపిస్తున్నాయి. మరియు అల్లాహ్ సత్యతిరస్కారులకు సన్మార్గం చూపడు

**38.** ఓ విశ్వాసులారా! మీకేమయింది? మీతో: "అల్లాహ్ మార్గంలో బయలు దేరండి." అని చెప్పినపుడు మీరు భూమికి అతుక్కొని పోతున్నారేమిటి? ఏమీ? మీరు పరలోకాన్ని వదలి, ఇహలోక జీవితంతోనే తృప్తి పడదలచుకున్నారా? కాని ఇహలోక జీవిత సుఖం పరలోక (జీవిత సుఖాల ముందు) ఎంతో అల్పమైనది![30]

**39.** మీరు బయలు దేరకపోతే, ఆయన మీకు

---

[29] చూడండి, 2:193, 8:73.
[30] చూడండి, 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం - 4, 'హదీస్' నెం. 53.

బాధాకరమైన శిక్షను విధిస్తాడు. మరియు మీకు బదులుగా మరొక జాతిని మీ స్థానంలో తెస్తాడు. మరియు మీరు ఆయనకు ఎలాంటి నష్టం కలిగించలేరు[31]. మరియు అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు.

**40.** ఒకవేళ మీరు అతనికి (ప్రవక్తకు) సహాయం చేయకపోతే ఏం ఫర్వాలేదు! (అల్లాహ్ అతనికి తప్పక సహాయం చేస్తాడు). ఏ విధంగానైతే, సత్యతిరస్కారులు అతనిని పారద్రోలి నపుడు, అల్లాహ్ అతనికి సహాయం చేశాడో! అప్పుడు అతను ఇద్దరిలో రెండవ వాడిగా (సౌర్) గుహలో ఉన్నప్పుడు అతను తన తోటివానితో (అబూ బక్ర్ తో): "నీవు దుఃఖపడకు, నిశ్చయంగా

[31] ఇక్కడ 9వ హిజ్రీ షవ్వాల్ నెలలో జరిగిన తబూక్ దండ్రయాత్ర ప్రస్తావన ఉంది. బైజాంటైన్ (Byzantine) చక్రవర్తి, క్రైస్తవుడైన, హెరాక్లియస్, ముస్లింలకు విరుద్ధంగా యుద్ధసన్నాహాలు మొదలు పెట్టాడు. కావున ము'హమ్మద్ ('స'అస) కూడా యుద్ధసన్నాహాలు మొదలు పెట్టారు. అది కపట విశ్వాసులకు ఎంతో బాధాకరంగా ఉంటుంది. అప్పుడు ఈ ఆయత్ అవతరింపజేయబడింది. దైవప్రవక్త ('స'అస) ముస్లింలతో, క్రైస్తవులను ఎదుర్కోవటానికి తబూక్ వెళ్ళి, అక్కడ 20 రోజులుండి, క్రైస్తవులు యుద్ధానికి రానందుకు తిరిగి వచ్చేస్తారు.

అల్లాహ్ మనతో ఉన్నాడు!" అని అన్నాడు[32]. అప్పుడు అల్లాహ్! అతనిపై తన తరఫు నుండి మనశ్శాంతిని అవతరింప జేశాడు. అతనిని మీకు కనిపించని (దైవదూతల) దళాలతో సహాయం చేసి సత్యతిరస్కారుల మాటను కించపరచాడు. మరియు అల్లాహ్ మాట సదా సర్వోన్నతమైనదే. మరియు అల్లాహ్ సర్వశక్తిమంతుడు, మహావివేచనాపరుడు.

41. తేలికగానైనా సరే, బరువుగా నైనా సరే బయలుదేరండి. మరియు మీ సంపదలతో మరియు మీ ప్రాణాలతో అల్లాహ్ మార్గంలో పోరాడండి. ఒకవేళ మీరిది తెలుసుకో గలిగితే, ఇది మీకెంతో ఉత్తమమైనది.

42. అది తొందరగా దొరికే లాభం మరియు సులభమైన ప్రయాణం అయితే వారు తప్పక నీ వెంట వెళ్ళేవారు. కాని వారికది (తబూక్ ప్రయాణం) చాలా కష్టమైనదిగా (దూరమైనదిగా) అనిపించింది.

---

[32] క్రీ.శకం 622, (ప్రవక్త పదవి ప్రసాదించబడిన దాదాపు 13వ సంవత్సరం)లో, ము'హమ్మద్ ('స'అస) ను చంపటానికి, మక్కా ముష్రికులు అతని ఇంటి మీదికి, రాత్రివేళ ప్రతి తెగ నుండి ఒక యువకుణ్ణి తయారుచేసి పంపుతారు. అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞతో, దైవప్రవక్త ('స'అస) వారి మీద దుమ్ము విసరగా, వారికి కునుకు వస్తుంది. ఆ తరువాత అతను ('స'అస), అబూ బక్ర్ (ర'ది.'అ.)తో సహా బయలుదేరి, సౌ'ర్ కొండ గుహలో మూడు రోజులు దాగుతారు. ముష్రికులు వారిని వెతుక్కుంటూ గుహపై వరకు చేరుతారు. కాని ముష్రికులు వారిద్దరిని కనుగొనలేక పోతారు. అది వారిద్దరు గమనిస్తారు. ఆ సందర్భంలో దైవప్రవక్త ('స'అస) అబూ బక్ర్ (ర'ది.'అ)తో ఈ మాటలు అంటారు. ('స'హీ'హ్ బు'ఖారీ).

కావున వారు అల్లాహ్ పై ప్రమాణం చేస్తూ అంటున్నారు: "మేము రాగల స్థితిలో ఉంటే తప్పక మీ వెంట వచ్చి ఉండేవారము." (ఈ విధంగా అబద్ధమాడి) వారు తమను తాము నాశనం చేసుకుంటున్నారు. మరియు వారు అబద్ధమాడుతున్నారని అల్లాహ్ కు బాగా తెలుసు[33].

**43.** (ఓ ప్రవక్తా!) అల్లాహ్ నిన్ను మన్నించు గాక! సత్యవంతులెవరో నీకు స్పష్టం కాకముందే మరియు అబద్ధమాడే వారెవరో నీకు తెలియక ముందే, వారిని (వెనుక ఉండటానికి) ఎందుకు అనుమతి నిచ్చావు?[34]

**44.** అల్లాహ్ ను మరియు అంతిమదినాన్ని విశ్వసించేవారు, తమ సంపత్తి మరియు తమ ప్రాణాలను వినియోగించి (అల్లాహ్ మార్గంలో) పోరాడటం నుండి తప్పించుకోవటానికి ఎన్నడూ అనుమతి అడగరు. మరియు దైవభీతి గలవారు ఎవరో అల్లాహ్ కు బాగా తెలుసు.

**45.** నిస్సందేహంగా, అల్లాహ్ ను మరియు అంతిమదినాన్ని విశ్వసించని వారే, వెనుక

---

[33] ఎండాకాలం, ఖర్జూర పంటకాలం, చాలా దూరపు ప్రయాణం కావటం వల్ల కపటవిశ్వాసులు, బలహీన విశ్వాసం గలవారు, మరికొందరు ఎడారి వాసు(బద్దూ)లు, ఎన్నో బూటక సాకులు చెప్పి దైవప్రవక్త ('స'అస) ను వెనుక ఉండి పోవటానికి అనుమతి అడుగుతారు. దైవప్రవక్త ('స'అస) అనుమతి కూడా ఇస్తారు. ఆ సందర్భంలో ఇది మరియు దీని తరువాత ఆయతులు అవతరింపజేయబడ్డాయి.

[34] చూడండి, 24:62.

ఉండటానికి అనుమతి అడుగుతారు. మరియు వారి హృదయాలు సందేహంలో మునిగి ఉన్నాయి. కావున వారు తమ సందేహాలలో పడి ఊగిసలాడుతున్నారు[35].

**46.** మరియు ఒకవేళ వారు బయలుదేరాలని కోరి ఉంటే తప్పక దానికై వారు యుద్ధ సామగ్రి సిద్ధ పరచుకొని ఉండేవారు, కాని వారు బయలు దేరటం అల్లాహ్ కు ఇష్టం లేదు, కావున వారిని నిలిపివేశాడు. మరియు వారితో: "కూర్చొని ఉన్న వారితో మీరు కూడా కూర్చొని ఉండండి!" అని చెప్పబడింది.

**47.** ఒకవేళ వారు మీతో కలిసి వెళ్ళినా మీలో కలతలు తప్ప మరేమీ అధికం చేసేవారు కాదు. మరియు మీ మధ్య ఉపద్రవం (ఫిత్న) రేకెత్తించటానికి తీవ్రప్రయత్నాలు చేసేవారు. మరియు మీలో కొందరు వారి కొరకు (కపట విశ్వాసుల కొరకు) మాటలు వినేవారు (వారి గూఢాచారులు) ఉన్నారు. మరియు అల్లాహ్ కు దుర్మార్గుల గురించి బాగా తెలుసు.

---

[35] ఈ జిహాద్ లో పాల్గొనే విషయంలో ముస్లింల నాలుగు వర్గాలు ఏర్పడ్డాయి: 1) సహృదయంతో వెంటనే జిహాద్ కు సిద్ధపడ్డ వారు; 2) మొదట సంకోచించి వెంటనే సిద్ధపడ్డవారు; 3) వృద్ధులు, రోగులు, మరియు ప్రయాణ ఖర్చులు లేనివారు - వీరిని అల్లాహ్ (సు.తా.) క్షమించాడు - చూడండి 9:91-92; 4) కేవలం సోమరితనం వల్ల పాల్గొననివారు. వీరు పశ్చాత్తాపపడి క్షమాపణ కోరగా వారి క్షమాపణ తరువాత అంగీకరించబడుతుంది. వీరు గాక బూటక సాకులు చెప్పి వెనుక ఉండి పోయిన కపట విశ్వాసులు కూడా ఉన్నారు.

48. (ఓ ప్రవక్తా!) వాస్తవానికి, వారు ఇంతకు ముందు కూడా కల్లోలాన్ని (ఫిత్నను) పుట్టించి, నీ కార్యాలను తలక్రిందులు చేయగోరారు. చివరకు సత్యం బహిర్గతమయింది మరియు అల్లాహ్ నిర్ణయం స్పష్టమయ్యింది. మరియు వారు దీన్ని అసహ్యించుకున్నారు!

49. మరియు వారిలో: "నాకు (వెనుక ఉండటానికి) అనుమతినివ్వు! నన్ను ఏ మాత్రం పరీక్షకు గురిచేయకు!" అని అనేవారు కూడా ఉన్నారు. వాస్తవానికి, వారు (ఇలా అనుమతి కోరి) పరీక్షకు గురి అయ్యారు! మరియు నిశ్చయంగా, సత్యతిరస్కారులను నరకాగ్ని చుట్టుకోనున్నది.

50. (ఓ ప్రవక్తా!) ఒకవేళ నీకు మేలు కలిగితే వారికి బాధ కలుగుతుంది. మరియు నీపై ఆపద వస్తే వారు: "మేము ముందుగానే జాగ్రత్త పడ్డాము!" అని అంటూ సంతోషపడుతూ మరలిపోతారు.

51. వారితో ఇలా అను: "అల్లాహ్ మా కొరకు వ్రాసింది తప్ప మరేమీ మాకు సంభవించదు. ఆయనే మా సంరక్షకుడు. మరియు విశ్వాసులు అల్లాహ్ మీదే నమ్మకం ఉంచుకోవాలి!"

52. ఇలా అను: "మీరు మా విషయంలో నిరీక్షిస్తున్నది రెండు మేలైన వాటిలో ఒకటి. అల్లాహ్ స్వయంగా మీకు శిక్ష విధిస్తాడా, లేదా మా చేతుల ద్వారానా? అని మేము నిరీక్షిస్తున్నాము. కావున మీరూ నిరీక్షించండి, నిశ్చయంగా మేము కూడా మీతో పాటు నిరీక్షిస్తున్నాము!"

53. ఇలా అను: "మీరు మీ (సంపదను) ఇష్టపూర్వకంగా ఖర్చు చేసినా లేదా ఇష్టం లేకుండా ఖర్చు చేసినా అది మీ నుండి స్వీకరించబడదు[36]. నిశ్చయంగా, మీరు అవిధేయులు (ఫాసిఖూన్)."

54. మరియు వారి విరాళం (చందా) స్వీకరించబడకుండా పోవటానికి కారణం, వాస్తవానికి వారు అల్లాహ్ ను మరియు ఆయన సందేశహరుణ్ణి తిరస్కరించడం మరియు నమాజ్ కొరకు ఎంతో సోమరితనంతో తప్ప రాకపోవడం మరియు అయిష్టంతో (అల్లాహ్ మార్గంలో) ఖర్చు పెట్టడమే!"[37]

55. కావున వారి సిరిసంపదలు గానీ, వారి సంతానం గానీ, నిన్ను ఆశ్చర్యంలో పడనివ్వ కూడదు![38] నిశ్చయంగా, అల్లాహ్ వాటి వలన వారిని, ఇహలోక జీవితంలో శిక్షించగోరు తున్నాడు. మరియు వారు సత్యతిరస్కార స్థితిలోనే తమ ప్రాణాలను కోల్పోతారు.

56. మరియు వారు నిశ్చయంగా, మేము మీతోనే ఉన్నామని అల్లాహ్ పై ప్రమాణం చేస్తున్నారు. కాని వారు మీతో లేరు. వాస్తవానికి వారు మీకు భయపడుతున్నారు.

57. ఒకవేళ వారికి ఏదైనా ఆశ్రయం గానీ, గుహ గానీ

---

[36] చూడండి, 2:264, 4:38.
[37] చూడండి, 'స. బు'ఖారీ, పు-1, 'హ. 626.
[38] చూడండి, 20:131 మరియు 23:55-56. ఇంకా చూడండి, 3:178 మరియు 8:28.

లేదా తలదాచుకోవటానికి ఏకాంత స్థలం గానీ దొరికితే, వారు తొందరగా పరుగెత్తి అందులో దాక్కుంటారు[39].

**58.** మరియు (ఓ ప్రవక్తా!) వారిలో కొందరు దానాలు (సదఖాత్) పంచే విషయంలో నీపై అపనిందలు మోపుతున్నారు[40]. దాని నుండి వారికి కొంత ఇవ్వబడితే సంతోషిస్తారు. కాని దాని నుండి వారికి ఇవ్వబడక పోతే కోపగించుకుంటారు!

**59.** మరియు ఒకవేళ అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త వారికి ఇచ్చిన దానితో వారు తృప్తి పడి: "అల్లాహ్ యే మాకు చాలు! అల్లాహ్ తన అనుగ్రహంతో మాకు ఇంకా చాలా ఇస్తాడు మరియు ఆయన ప్రవక్త కూడా (ఇస్తాడు). నిశ్చయంగా, మేము అల్లాహ్ నే వేడుకుంటాము!" అని పలికి ఉంటే (అది వారికే బాగుండేది!)

---

[39] ఈ ఆయత్ కపటవిశ్వాసుల గురించి ఉంది. వారిని గురించి ఇంకా చూ, 4:142,9:67 మరియు 29:11 (ఖుర్ఆన్ అవతరణాక్రమంలో ఇది బహుశా కపట విశ్వాసులను గురించి వచ్చిన మొట్టమొదటి ఆయత్)

[40] చూడండి, 2:263-264.

60. నిశ్చయంగా దానాలు (సదఖాత్)[41] కేవలం యాచించు నిరుపేదలకు మరియు యాచించని పేదవారికి[42], (జకాత్) వ్యవహారాలపై నియుక్తులైన వారికి మరియు ఎవరి హృదయాలనైతే (ఇస్లాం వైపుకు) ఆకర్షించ వలసి ఉందో వారికి, బానిసల విముక్తి కొరకు, ఋణగ్రస్తులైన వారి కొరకు, అల్లాహ్ మార్గంలో (పోయేవారి) కొరకు మరియు బాటసారుల కొరకు. ఇది అల్లాహ్ నిర్ణయించిన ఒక విధి. మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేకవంతుడు.

61. మరియు వారిలో కొందరు ప్రవక్తను తమ మాటలతో బాధ కలిగించే వారున్నారు. వారంటారు: "ఇతను

[41] ఇక్కడ 'సదఖాత్ అంటే 'జకాత్ అని అర్థం. ఎనిమిది (8) రకాల వారు వీటికి హక్కుదారులు: 1) ఫుఖరాకు; 2)మసాకీన్ లకు; 3)'జకాత్ ప్రోగుచేయటానికి నియుక్తులైన వారికి; 4) ఎవరి హృదయాలను ఇస్లాం వైపునకు ఆకర్షించవలసి ఉందో వారికి; 5) ముస్లిం బానిసల విముక్తికి; 6) ఋణగ్రస్తులైన వారికి; 7) అల్లాహ్ మార్గంలో మరియు 8) బాటసారులకు - వారు పేదవారు కాకున్నా - ప్రయాణంలో ఉన్నప్పుడు లేమికి గురి అయితే వారికి ఇవ్వాలి.

[42] ఫఖీరున్:అంటేఏమీఆదాయంలేనందుకుతననిత్యావసరాలకు ఇతరులపై ఆధారపడి ఉండే వాడు. ఇట్టివారు విధిలేక యాచించవచ్చు. మిస్కీనున్: కొంత ఆదాయం గలవాడు కాని అది అతని నిత్యావసరాలకు సరిపోదు. అతడు ఇతరులతో యాచించుటకు వెనుకంజవేస్తాడు. తన స్వాభిమానంలో ఉంటాడు. ఇట్టి వాడికి వాడి లక్షణాలు చూసి ఇవ్వాలి. ('స'హీ'హ్ బు.'ఖారీ, 'స'హీ'హ్. ముస్లిం).

(చెప్పుడు మాటలు) వినేవాడు[43]." ఇలా అను: "అతను వినేది మీ మేలుకే! అతను అల్లాహ్ ను విశ్వసిస్తాడు మరియు విశ్వాసులను నమ్ముతాడు మరియు మీలో విశ్వసించిన వారికి అతను కారుణ్యమూర్తి." మరియు అల్లాహ్ సందేశహరునికి బాధ కలిగించే వారికి బాధాకరమైన శిక్ష ఉంటుంది.

62. (ఓ విశ్వాసులారా!) మిమ్మల్ని సంతోషపెట్టటానికి వారు మీ ముందు అల్లాహ్ పై ప్రమాణాలు చేస్తున్నారు. వాస్తవానికి వారు విశ్వాసులే అయితే, అల్లాహ్ ను మరియు ఆయన ప్రవక్తను సంతోషపెట్టటమే వారి బాధ్యత[44].

63. ఏమీ? అల్లాహ్ ను మరియు ఆయన సందేశహరుణ్ణి విరోధించేవానికి, నిశ్చయంగా! భగభగమండే నరకాగ్ని శిక్ష ఉందనీ, అదే అతని శాశ్వత నివాసమనీ, వారికి తెలియదా? ఇది ఎంత గొప్ప అవమానం!

64. తమ హృదయాలలో ఉన్న (రహస్యాలను) స్పష్టంగా తెలియజేసేటటు వంటి సూరహ్ వారికి విరుద్ధంగా అవతరింప జేయబడుతుందేమోనని, ఈ కపట విశ్వాసులు భయపడు తున్నారు. వారితో అను: "మీరు ఎగతాళి చెయ్యండి, మీరు (బయట పడుతుందని) భయ పడుతున్న విషయాన్ని, అల్లాహ్ తప్పక బయటపెడ్తాడు."

65. నీవు వారిని అడిగితే వారు తప్పక: "మేము

---

[43] చూడండి, 9:74.
[44] చూడండి, 4:80 మరియు 3:31

కేవలం కాలక్షేపానికి మరియు పరిహాసానికి మాత్రమే ఇలా మాట్లాడుతున్నాము." అని సమాధానమిస్తారు. వారితో అను: "ఏమీ? మీరు అల్లాహ్ తో మరియు ఆయన సూచనలతో (ఆయాత్ లతో) మరియు ఆయన ప్రవక్తతో వేళాకోళం చేస్తున్నారా?

66. ఇక మీరు సాకులు చెప్పకండి, వాస్తవానికి మీరు విశ్వసించిన తరువాత సత్యాన్ని తిరస్కరించారు." మీలో కొందరిని మేము క్షమించినా ఇతరులను తప్పకుండా శిక్షిస్తాము, ఎందుకంటే వాస్తవానికి వారు అపరాధులు[45].

67. కపట విశ్వాసులైన పురుషులు మరియు కపట విశ్వాసులైన స్త్రీలు అందరూ ఒకే కోవకు చెందినవారు! వారు అధర్మాన్ని ఆదేశిస్తారు. మరియు ధర్మాన్ని నిషేధిస్తారు[46]. మరియు తమ చేతులను(మేలు నుండి) ఆపుకుంటారు. వారు అల్లాహ్ ను మరచిపోయారు[47], కావున ఆయన కూడా వారిని మరచిపోయాడు. నిశ్చయంగా, ఈ కపట విశ్వాసులే అవిధేయులు (ఫాసిఖూన్).

68. మరియు కపట విశ్వాసులైన పురుషులకు మరియు కపట విశ్వాసులైన స్త్రీలకు మరియు సత్యతిరస్కారులకు, అల్లాహ్ నరకాగ్ని వాగ్దానం

[45] చూడండి, 4:98
[46] చూడండి, 3:104, 110, 114; 9:71, 112 మరియు 22:41 '
[47] చూడండి, 45:34

చేశాడు. వారందులో శాశ్వతంగా ఉంటారు. అదే వారికి తగినది. మరియు అల్లాహ్ వారిని శపించాడు (బహిష్కరించాడు). మరియు వారికి ఎడతెగని శిక్ష ఉంటుంది.

69. (మీరు కూడా) గతించిన మీ పూర్వీకుల వంటివారు. వారు మీకంటే ఎక్కువ బలవంతులు, ధనవంతులు మరియు అధిక సంతానం గలవారు. వారు తమ భాగపు ఐహిక సుఖాలను అనుభవించారు. మీరు కూడా మీ పూర్వీకులు అనుభవించినట్లు మీ భాగపు ఐహిక సుఖాలను అనుభవించారు. వారు పడినటువంటి వ్యర్థ వాదోపవాదాలలో మీరు కూడా పడ్డారు. ఇలాంటి వారి కర్మలు ఇహలోకంలోనూ మరియు పరలోకంలోనూ వ్యర్థమవుతాయి. మరియు ఇలాంటి వారు! వీరే నష్టానికి గురి అయ్యేవారు.

70. ఏమీ? వారి పూర్వీకుల గాథ వారికి అందలేదా? నూహ్ జాతి వారి, ఆద్, సమూద్[48], ఇబ్రాహీమ్ జాతి వారి[49], మద్ యన్ (షుఐబ్) ప్రజల[50] మరియు తలక్రిందులు చేయబడిన పట్టణాల (లూత్) వారి (గాథలు అందలేదా)?[51] వారి

---

[48] నూ'హ్, హూద్ మరియు 'సాలి'హ్ ('అలైహిమ్ స.) గాథల కొరకు చూడండి, 7:59-79.

[49] ఇబ్రాహీమ్ ('అ.స.) జాతివారు, బాబిలోనియనులు. 1100 సంవత్సరాలు క్రీస్తు శకానికి ముందు వారు అస్సీరియన్ ల ద్వారా అపజయం పొంది నాశనం చేయబడ్డారు.

[50] మద్ యన్ ప్రజల గాథలకు చూడండి, 7:85-93.

[51] సోడోమ్ మరియు గొమొర్రాహ్'లు, లూ'త్ ('అ.స.) ప్రజల నగరాలు. చూడండి, 7:80-84, 11:69-83.

ప్రవక్తలు వారి వద్దకు స్పష్టమైన సూచనలు తీసుకొని వచ్చారు. అల్లాహ్ వారికి అన్యాయం చేయదలచు కోలేదు కాని వారే తమకు తాము అన్యాయం చేసుకుంటూ ఉన్నారు.

**71.** మరియు విశ్వాసులైన పురుషులు మరియు విశ్వాసులైన స్త్రీలు ఒకరికొకరు స్నేహితులు. వారు ధర్మాన్ని ఆదేశిస్తారు (బోధిస్తారు) మరియు అధర్మం నుండి నిషేధిస్తారు (వారిస్తారు) మరియు నమాజ్ ను స్థాపిస్తారు మరియు విధిదానం (జకాత్) చెల్లిస్తారు మరియు అల్లాహ్ కు మరియు ఆయన ప్రవక్తకు విధేయులై ఉంటారు. ఇలాంటి వారినే అల్లాహ్ కరుణిస్తాడు. నిశ్చయంగా, అల్లాహ్ సర్వ శక్తిమంతుడు, మహావివేచనాపరుడు.

**72.** మరియు అల్లాహ్ విశ్వాసులైన పురుషులకు మరియు విశ్వాసులైన స్త్రీలకు క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాల వాగ్దానం చేశాడు. అక్కడ వారు శాశ్వతంగా ఉంటారు. మరియు శాశ్వతమైన సుఖాలున్న ఆ స్వర్గవనాలలో, వారి కొరకు పరిశుద్ధ నివాసాలు ఉంటాయి[52]. వాటన్నిటి కంటే మించింది వారికి లభించే అల్లాహ్ ప్రసన్నత. అదే ఆ గొప్ప సాఫల్యం (విజయం).

**73.** ఓ ప్రవక్తా! సత్యతిరస్కారులతో మరియు కపట విశ్వాసులతో పోరాడు మరియు వారి పట్ల

---

[52] చూడండి, 38:50. 'అద్న్: అవతరణ ప్రకారం ఈ శబ్దం మొట్టమొదటి పై ఆయత్ లో వచ్చింది. 'అద్న్, అంటే శాశ్వతమైన అని అర్థం.

కఠినంగా వ్యవహరించు. మరియు వారి ఆశ్రయం
నరకమే మరియు అది అతి చెడ్డ గమ్యస్థానం
74. "మేము ఏమీ (చెడు మాట) అనలేదు!" అని వారు
అల్లాహ్ పై ప్రమాణం చేసి అంటున్నారు. కాని
వాస్తవానికి వారు సత్యతిరస్కారపు మాట అన్నారు.
మరియు ఇస్లాంను స్వీకరించిన తరువాత దానిని
తిరస్కరించారు. మరియు వారికి అసాధ్యమైన
దానిని చేయదలచుకున్నారు. అల్లాహ్ మరియు
ఆయన ప్రవక్త, (అల్లాహ్) అనుగ్రహంతో వారిని
సంపన్నులుగా చేశారనే కదా! వారు ఈ విధంగా
ప్రతీకారం చేస్తున్నారు. ఇప్పుడైనా వారు పశ్చాత్తాప
పడితే అది వారికే మేలు. మరియు వారు మరలిపోతే,
అల్లాహ్ వారికి ఇహలోకంలోనూ మరియు
పరలోకంలోనూ, బాధాకరమైన శిక్ష విధిస్తాడు.
మరియు భూమిలో వారికి ఏ రక్షకుడు గానీ
సహాయకుడు గానీ ఉండడు.
75. మరియు వారిలో (కొందరు) ఈ విధంగా అల్లాహ్
పై ప్రమాణం చేసేవారు కూడా ఉన్నారు:
"ఆయన (అల్లాహ్) తన అనుగ్రహంతో మాకేమీ
ప్రసాదించినా మేము తప్పక దానం చేస్తాము
మరియు సద్వర్తనులమై ఉంటాము."
76. కాని అల్లాహ్ తన అనుగ్రహం వల్ల వారికి (ధనం)
ప్రసాదించినప్పుడు, వారు పిసినారితనం ప్రదర్శించి,
తమ (వాగ్దానం) నుండి విముఖులై మరలిపోతారు.
77. ఆ పిదప వారు అల్లాహ్ తో చేసిన వాగ్దానం పూర్తి

చేయనందుకు, అసత్యం పలికినందుకు, ఆయన్ను కలుసుకునే (పునరుత్థాన) దినం వరకు, ఆయన వారి హృదయాలలో కాపట్యం నాటుకునేటట్లు చేశాడు.

**78.** ఏమీ? వారి గుప్త రహస్యాలు మరియు వారి రహస్య సమాలోచనలు , అల్లాహ్ కు తెలుసని వారికి తెలియదా? మరియు నిశ్చయంగా, అల్లాహ్ అగోచర విషయాలన్నీ తెలిసి వున్నవాడు.

**79.** మనస్ఫూర్తిగా సంతోషంతో (అల్లాహ్ మార్గంలో) దానం చేసే విశ్వాసులను నిందించే వారినీ మరియు తమ శ్రమ తప్ప మరేమీ ఇవ్వటానికి లేని వారిని ఎగతాళి చేసే వారినీ, అల్లాహ్ ఎగతాళికి గురి చేస్తాడు. మరియు వారికి బాధాకరమైన శిక్ష ఉంటుంది.

**80.** (ఓ ప్రవక్తా!) నీవు వారి (కపట విశ్వాసుల) క్షమాపణ కొరకు వేడుకున్నా లేదా వారి క్షమాపణ కొరకు వేడుకోక పోయినా ఒక్కటే - ఇంకా నీవు డెబ్బైసార్లు వారి క్షమాపణ కొరకు వేడుకున్నా- అల్లాహ్ వారిని క్షమించడు[53]. ఎందుకంటే వాస్తవానికి వారు అల్లాహ్ ను మరియు ఆయన ప్రవక్తను తిరస్కరించారు. మరియు అల్లాహ్

---

[53] దైవప్రవక్త ము'హమ్మద్ ('స'అస) తన శత్రువులను క్షమించమని అల్లాహ్ (సు.తా.)ను ప్రార్థించినట్లు బు'ఖారీ, ముస్లిం మరియు ఇతరుల 'స'హీ'హ్ 'హదీస్'ల ద్వారా తెలుస్తుంది.

అవిధేయులైన ప్రజలకు సన్మార్గం చూపడు[54].

**81.** (తబూక్ దండయాత్రకు పోకుండా) వెనుక ఆగిపోయిన వారు, తాము అల్లాహ్ సందేశహరుని వెంట వెళ్ళటాన్ని నిరోధించి (తమ ఇండ్లలో) కూర్చుండి నందుకు సంతోష పడ్డారు. మరియు వారు తమ ధనసంపత్తులతో మరియు తమ ప్రాణాలతో అల్లాహ్ మార్గంలో పోరాడటాన్ని అసహ్యించుకున్నారు. మరియు వారు ఇతరులతో: "ఈ తీవ్రమైన వేడిలో వెళ్ళ కండి!" అని అన్నారు. వారితో అను: "భగభగ మండే నరకాగ్ని దీని కంటే ఎక్కువ వేడిగా ఉంటుంది." అది వారు అర్థం చేసుకుంటే ఎంత బాగుండేది!

**82.** కావున ఇప్పుడు వారిని కొంత నవ్వనివ్వు మరియు వారి కర్మలకు ప్రతిఫలంగా (మున్ముందు) వారికి ఎంతో ఏడ్వవలసి ఉంది.

**83.** కావున (ఓ ప్రవక్తా!) ఒకవేళ అల్లాహ్ నిన్ను తిరిగి వారిలో (కపట విశ్వాసులలో) ఒక వర్గం వారి వద్దకు తీసుకొని పోతే! మరియు వారు నిన్ను (మరొక దండయాత్రకు) పోవటానికి అనుమతి అడిగితే! వారితో అను! "మీరు నాతో ఏ మాత్రం బయలుదేర వద్దు! మరియు నా పక్షమున శత్రువులతో పోరాడనూ వద్దు! వాస్తవానికి మీరు మొదట కూర్చొని ఉండటానికి ఇష్టపడ్డారు, కాబట్టి మీరు వెనుక ఉండి పోయిన

[54] చూడండి, 76:3.

వారితో (ఇండ్లలోనే) కూర్చొని ఉండండి."

**84.** మరియు వారిలో (కపట విశ్వాసులలో) ఎవరైనా మరణిస్తే, అతడి నమాజె జనాజహ్ కూడా నీవు ఏ మాత్రం చేయకు మరియు అతని గోరీ వద్ద కూడా నిలబడకు[55], నిశ్చయంగా వారు అల్లాహ్ ను మరియు ఆయన ప్రవక్తను తిరస్కరించారు. మరియు వారు అవిధేయులు (ఫాసిఖూన్)గా ఉన్న స్థితిలోనే మరణించారు.

**85.** మరియు వారి సిరిసంపదలు మరియు వారి సంతానం నిన్ను ఆశ్చర్యానికి గురి చేయ నివ్వకూడదు. నిశ్చయంగా, అల్లాహ్! వాటితో ఈ ప్రపంచంలో వారిని శిక్షించాలనీ మరియు వారు సత్యతిరస్కారులుగా ఉన్న స్థితిలోనే వారి

---

[55] ఈ ఆయత్ కపట విశ్వాసుల నాయకుడు 'అబ్దుల్లాహ్ బిన్ ఉబైను గురించి అవతరింపజేయబడింది. కాని ఈ ఆజ్ఞ కపట విశ్వాసులందరికీ వర్తిస్తుంది. 'అబ్దుల్లాహ్ బిన్ ఉబై మరణించినప్పుడు అతని కుమారుడు 'అబ్దుల్లాహ్ (ర.'ది. అ) దైవప్రవక్త ('స'అస) దగ్గరికి వచ్చి, అతని ('స'అస) అంగీని, తన తండ్రికి కఫన్ గా తొడిగించటానికి అడుగుతారు మరియు అతని ('స'అస)తో , తన తండ్రి నమా'జే జనా'జహ్ చేయమని కూడా కోరుతారు. దైవప్రవక్త ('స'అస) తన అంగీని ఇస్తారు. 'ఉమర్ (ర.'ది.'అ.) ఆపినా, వినకుండా నమా'జే జనా'జహ్ కూడా చేస్తారు. ఆ తరువాత ఈ ఆయత్ అవతరింప జేయ బడింది. ('స'హీ'హ్ బు'ఖారీ, తఫ్సీర్ సూరహ్ అత్-తౌబహ్ మరియు 'స'హీ'హ్ ముస్లిం, కితాబ్ సిఫాత్ అల్-మునాఫిఖీన్ వ అ'హ్ కామహుమ్). ఇక్కడ మరొక విషయం విశదమయ్యే దేమిటంటే: ఎవడైతే నిజమైన విశ్వాసుడు కాడో అతని మోక్షం కొరకు ఎంత పెద్దవారు ప్రార్థన చేసినా అది అంగీకరించబడదు.

ప్రాణాలను కోల్పోవాలనీ సంకల్పించాడు[56].

86. మరియు: "అల్లాహ్ ను విశ్వసించండి. మరియు ఆయన ప్రవక్తతో కలసి (అల్లాహ్ మార్గంలో) పోరాడండి!" అని సూరహ్ అవతరింప జేయబడి నపుడు[57], వారిలోని ధనవంతులు నీతో: "వెనుక ఉండే వారితో కూర్చోవటానికి మమ్మల్ని విడిచి పెట్టు." అని అనుమతి కోరారు.

87. వారు, వెనుక ఉండిపోయే వారితో ఉండటానికి ఇష్టపడ్డారు. వారి హృదయాల మీద ముద్ర వేయబడి వుంది, కావున వారు అర్థం చేసుకోలేరు[58].

88. కాని, ప్రవక్త మరియు అతనితో పాటు విశ్వసించిన వారు తమ సిరిసంపదలతో మరియు తమ ప్రాణాలతో (అల్లాహ్ మార్గంలో) పోరాడారు. మరియు అలాంటి వారికి అన్ని మేళ్ళూ ఉన్నాయి. మరియు అలాంటి వారే సాఫల్యం పొందేవారు.

89. అల్లాహ్ వారి కొరకు క్రింద సెలయేళ్ళు ప్రవహించే స్వర్గవనాలు సిద్ధం చేసి ఉంచాడు, వారందులో శాశ్వతంగా ఉంటారు. అదే గొప్ప విజయం.

90. మరియు సాకులు చెప్పే ఎడారి వాసులు

---

[56] చూడండి, 9:55, 3:178 మరియు 8:28; ఈ ఆయత్ దాదాపు 9:55 మాదిరిగానే ఉంది.

[57] చూడండి, 47:20.

[58] చూడండి 7:100-101.

(బద్దూలు)[59] కూడా వచ్చి వెనుక ఉండి పోవటానికి అనుమతి అడిగారు. మరియు ఈ విధంగా అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తకు అబద్ధాలు చెప్పినవారు కూర్చుండిపోయారు. త్వరలో సత్యతిరస్కారులకు బాధాకరమైన శిక్ష ఉండగలదు.

**91.** బలహీనులు మరియు వ్యాధిగ్రస్తులు మరియు ప్రయాణపు ఖర్చులు లేనివారు, ఒకవేళ అల్లాహ్ కు మరియు ఆయన ప్రవక్తకు వాస్తవానికి విశ్వాసపాత్రులై ఉంటే వారిపై (జిహాద్ కు వెళ్ళకుంటే) ఎలాంటి నిందలేదు. సజ్జనులపై కూడా ఎలాంటి నిందలేదు. మరియు అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

**92.** మరియు ఎవరైతే నీ వద్దకు వచ్చి వాహనాలు కోరినప్పుడు నీవు వారితో: "నా దగ్గర మీకివ్వటానికి ఏ వాహనం లేదు." అని పలికినప్పుడు, ఖర్చు చేయటానికి తమ దగ్గర ఏమీ లేదు కదా అనే చింతతో కన్నీరు కార్చుతూ తిరిగి పోయారో, అలాంటి వారిపై కూడా ఎలాంటి నింద లేదు.

**93.** కాని వాస్తవానికి ధనవంతులై కూడా, వెనుక కూర్చున్న వారితో ఉండటానికి ఇష్టపడి, నిన్ను

[59] అల్-అ'అరాబు అంటే, ఎడారి వాసు(బద్దూ)లు. ఈ పదానికి ఇంకా చూడండి, 9:97, 98, 99, 101, 120, 33:20, 48:11, 16 మరియు 49:14.

అనుమతి అడిగే వారిపై తప్పక నింద గలదు. అల్లాహ్ వారి హృదయాల మీద ముద్ర వేసి ఉన్నాడు, కావున (తాము పోగొట్టుకునేదేమిటో) వారికి తెలియదు.[60]

**94.** మీరు (తబూక్ దండయాత్ర నుండి) మరలి వారి వద్దకు వచ్చిన తరువాత కూడా వారు (కపట విశ్వాసులు) మీతో తమ సాకులు చెబుతున్నారు. వారితో అను: "మీరు సాకులు చెప్పకండి, మేము మీమాటలను నమ్మము. అల్లాహ్ మాకు మీ వృత్తాంతం తెలిపి వున్నాడు. మరియు అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడు మీ ప్రవర్తనను కనిపెట్టగలరు, తరువాత మీరు అగోచర మరియు గోచర విషయాలు ఎరుగునట్టి ఆయన (అల్లాహ్) వైపునకు మరలింప బడతారు. అప్పుడాయన మీరు చేస్తూ ఉన్న వాటిని గురించి మీకు తెలుపుతాడు."

**95.** (ఓ విశ్వాసులారా!) మీరు వారి వద్దకు మరలి వచ్చిన తరువాత వారిని వదలి పెట్టాలని (మీరు వారిపై చర్య తీసుకో గూడదని), వారు మీ ముందు అల్లాహ్ పేరుతో ప్రమాణాలు చేస్తారు. కావున మీరు వారి నుండి విముఖులు కండి. నిశ్చయంగా, వారు అశుచులు (మాలిన్యం వంటివారు). వారి నివాసం నరకమే. అదే వారు అర్జించిన దాని ఫలితం.

---

[60] వీరు ఆయత్ 86, 87లలో పేర్కొనబడ్డ కపటవిశ్వాసులు.

96. మీరు వారితో రాజీ పడాలని, వారు (కపట విశ్వాసులు) మీ ముందు ప్రమాణాలు చేస్తున్నారు. ఒకవేళ మీరు వారితో రాజీ పడినా, నిశ్చయంగా, అల్లాహ్ అవిధేయులు (ఫాసిఖీన్) అయిన ప్రజలతో రాజీ పడడు[61].

97. ఎడారివాసులు (బద్దూలు) సత్యతిరస్కార మరియు కపట విశ్వాస విషయాలలో అతి కఠినులు. వారు అల్లాహ్ తన ప్రవక్త పై అవతరింపజేసిన (ధర్మ) నియమాలు అర్థం చేసుకునే యోగ్యత లేనివారు[62]. మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేకవంతుడు.

98. మరియు ఎడారివాసులలో (బద్దూలలో) కొందరు తాము (అల్లాహ్ మార్గంలో) ఖర్చు చేసిన దానిని దండుగగా భావించే వారున్నారు. (ఓ విశ్వాసులారా!) మీరు ఆపదలలో చిక్కుకోవాలని వారు ఎదురు చూస్తున్నారు. (కాని) వారినే ఆపద చుట్టుకుంటుంది. మరియు అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు[63].

99. మరియు ఎడారివాసులలో (బద్దూలలో) కొందరు అల్లాహ్ ను అంతిమదినాన్ని విశ్వసించే

---

[61] దైవప్రవక్త ('స'అస) తబూక్ దండయాత్ర నుండి తిరిగి వచ్చిన తరువాత, వారంతా క్షేమంగా తిరిగి వచ్చింది చూసి కపటవిశ్వాసులు, తాము నమ్మకస్తులమని నిరూపించగోరారు. ఆ సమయంలో పై మూడు ఆయతులు (94-96) అవతరింపజేయబడ్డాయి.

[62] ఎందుకంటే వారు నగరాల నుండి దూరప్రాంతాలలో ఉండటం వలన అల్లాహ్ (సు.తా.) మరియు ఆయన (సు.తా.), ప్రవక్త ('స'అస) మాటలు వినలేరు.

[63] వీరు మొదటి రకానికి చెందిన బుద్ధూలు.

వారున్నారు[64]. వారు తాము (అల్లాహ్ మార్గంలో) ఖర్చు చేసేది, తమకు అల్లాహ్ సాన్నిధ్యాన్ని మరియు ప్రవక్త ప్రార్థనలను చేకూర్చటానికి సాధనంగా చేసుకుంటున్నారు. వాస్తవానికి అది వారికి తప్పక సాన్నిధ్యాన్ని చేకూర్చుతుంది. అల్లాహ్ వారిని తన కారుణ్యంలోకి చేర్చుకో గలడు. నిశ్చయంగా! అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

**100.** మరియు వలస వచ్చిన ముహాజిర్ లలో నుండి మరియు అన్సారులలో (మదీనా వాసులలో) నుండి, ప్రప్రథమంగా ముందంజ వేసిన (ఇస్లాం ను స్వీకరించిన) వారితోనూ మరియు సహృదయంతో వారిని అనుసరించిన వారితోనూ, అల్లాహ్ సంతోషపడ్డాడు. మరియు వారు కూడా ఆయనతో సంతోషపడ్డారు. మరియు వారి కొరకు క్రింద సెలయేళ్ళు ప్రవహించే స్వర్గవనాలను సిద్ధ పరిచి ఉంచాడు. వారు వాటిలో శాశ్వతంగా కలకాలముంటారు. అదే గొప్ప సాఫల్యం (విజయం).

**101.** మరియు మీ చుట్టు ప్రక్కల ఉండే ఎడారివాసులలో (బద్దూలలో) కొందరు కపట విశ్వాసులున్నారు. మరియు (ప్రవక్త) నగరం (మదీనా మునవ్వరా) లో కూడా (కపట విశ్వాసులు) ఉన్నారు[65].

---

[64] వీరు రెండో రకానికి చెందిన మంచి విశ్వాసులు.

[65] మదీనా మునవ్వరా మొదటి పేరు యస్'రిబ్. 622 క్రీ.శ.లో ము'హమ్మద్ ('స'అస) వలస వచ్చిన తర్వాత అది మదీనతున్నబీ-ప్రవక్త నగరంగా, ఆ తర్వాత మదీనామునవ్వరగా కూడా పిలువబడుతోంది

వారు తమ కాపట్యంలో నాటుకొని ఉన్నారు. కాని (ఓ ప్రవక్తా!) నీవు వారిని ఎరుగవు[66]. మేము వారిని ఎరుగుతాము. మేము వారికి రెట్టింపు శిక్షను విధించగలము. తరువాత వారు ఘోరశిక్ష వైపుకు మరలింపబడతారు.

102. మరియు ఇతరులు, తమ పాపాలను ఒప్పుకున్న వారున్నారు. వారు తమ సత్కార్యాన్ని ఇతర పాపకార్యంతో కలిపారు[67]. అల్లాహ్ వారిని తప్పక[68] క్షమిస్తాడు! నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

103. (కావున ఓ ప్రవక్తా!) నీవు వారి సంపదల నుండి దానం (సదఖహ్) తీసుకొని, దానితో వారి పాపవిమోచనం చెయ్యి మరియు వారిని సంస్కరించు. మరియు వారి కొరకు (అల్లాహ్ ను) ప్రార్థించు. మరియు నిశ్చయంగా, నీ ప్రార్థనలు వారికి మనశ్శాంతిని కలిగిస్తాయి. అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

---

[66] ఇక్కడ స్పష్టమైన శబ్దాలతో ప్రవక్త ము'హమ్మద్ ('స'అస)కు అగోచరజ్ఞానం లేదని విశదపరచబడింది.

[67] వీరు ఉచితమైన కారణం లేకుండానే వెనుక ఉండి పోయిన విశ్వాసులు. వీరు పోనందుకు తమ వల్ల జరిగిన పాపాన్ని ఒప్పుకున్నారు. వీరి సత్కార్యాలంటే ఇంతకు ముందు జరిగిన యుద్ధాలలో పాల్గొనటం. వీరి పాపకార్యం అంటే తబూక్ యుద్ధానికి పోకుండా ఉండటం. ఇంకా చూడండి 'స'హీ'హ్ బు'ఖారీ, పు.6, 'హ. 196.

[68] 'అసా: అన్న పదం అల్లాహ్ (సు.తా.) కు సంబంధించి వస్తే, Be hopeful with Allah, నమ్ము, ఆశించు అనే భావం ఇస్తుంది. ఒకవేళ మానవునికి సంబంధించి ఉంటే Be conscious or Be afraid, జాగ్రత్త, ఏమో, బహుశా అనే భావం ఇస్తుంది.

104. ఏమీ? వాస్తవానికి అల్లాహ్ తన దాసుల పశ్చాత్తాపాన్ని (తౌబహ్ ను) అంగీకరిస్తాడని మరియు వారి దానాలను (సదఖాత్ లను) స్వీకరిస్తాడని వారికి తెలియదా? నిశ్చయంగా, అల్లాహ్! ఆయన మాత్రమే, పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడు, అపార కరుణా ప్రదాత.

105. మరియు (ఓ ప్రవక్తా!) వారితో అను: "మీరు (మీ పని) చేస్తూ ఉండండి, అల్లాహ్ ఆయన ప్రవక్త మరియు విశ్వాసులు మీరు చేస్తున్న పనులు చూస్తున్నారు. తరువాత మీరు తప్పక అగోచర మరియు గోచర విషయాలను ఎరుగు ఆయన (అల్లాహ్) వద్దకు తిరిగి పంపబడగలరు. అప్పుడాయన మీరు చేస్తూ వున్న కర్మలను గురించి మీకు తెలియజేస్తాడు."

106. మరికొందరు అల్లాహ్ ఆజ్ఞ (తీర్పు) కొరకు వేచి ఉన్నారు. ఆయన వారిని శిక్షించనూ వచ్చు, లేదా క్షమించనూ వచ్చు! మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేకవంతుడు.

107. మరియు (కపట విశ్వాసులలో) కొందరు (విశ్వాసులకు) హాని కలిగించటానికి, సత్యతిరస్కార వైఖరిని (బలపరచటానికి) మరియు విశ్వాసులను విడదీయటానికి, అల్లాహ్ మరియు ఆయన సందేశహరునితో ఇంతకు ముందు పోరాడిన వారు పొంచి ఉండటానికి, ఒక మస్జిద్ నిర్మించారు. మరియు వారు: "మా ఉద్దేశం మేలు చేయటం తప్ప మరేమీ

కాదు!" అని గట్టి ప్రమాణాలు కూడా చేస్తున్నారు[69].
కాని వారు వాస్తవంగా అసత్యవాదులని అల్లాహ్
సాక్ష్యమిస్తున్నాడు.

**108.** నీవెన్నడూ దానిలో (నమాజ్ కు) నిలబడకు. మొదటి రోజు నుండియే దైవభీతి ఆధారంగా స్థాపించబడిన మస్జిదే నీకు (నమాజ్ కు) నిలబడటానికి తగినది. అందులో పరిశుద్ధులు కాగోరే వారున్నారు. మరియు అల్లాహ్ పరిశుద్ధులు కాగోరేవారిని ప్రేమిస్తాడు.

**109.** ఏమీ? ఎవడైతే అల్లాహ్ యందు గల భయభక్తులు మరియు ఆయన ప్రీతి, పునాదుల మీద తన (మస్జిద్) కట్టడాన్ని కట్టాడో, అతడు శ్రేష్ఠుడా? లేక, తన కట్టడపు పునాదులను, వరదలకు కూలిపోయి దాని క్రింది భాగం ఖాళీగా ఉన్న నది ఒడ్డున కట్టేవాడా? అది వానితో సహా నరకాగ్నిలోకి

[69] 'ఖ'జరజ్ తెగకు చెందిన ఒక మదీనా వాసుడు అబూ 'ఆమిర్ క్రైస్తవుడవుతాడు. అతడు 3వ హిజ్రీలో జరిగిన ఉహుద్ యుద్ధంలో మక్కా ఖురైషులకు సహాయపడి, ఆ యుద్ధం తరువాత సిరియాకు పారి పోతాడు. అతడు బైజాన్'టైన్ చక్రవర్తి హిరాక్లియస్'ను మదీనాపై దండయాత్ర చేయటానికి ప్రోత్సహిస్తాడు మదీనాపై వారు రాకూడదని దైవప్రవక్త ('స'అస) వారిని ఎధుర్కొనటానికి తబూక్ కు బయలుదేరే సమయంలో అతడి అనుచరులు వచ్చి: "మేము మదీనా - ఖుబాల మధ్య ఒక మస్జిద్ నిర్మించాము. మీరు వచ్చి అందులో నమా'జ్ చేయించండి." అని కోరుతారు. దైవప్రవక్త ('స'అస): "తబూక్ నుండి వచ్చిన తరువాత వస్తాను." అని అంటారు. ఆ సందర్భంలో తబూక్ నుండి తిరిగి వచ్చిన తరువాత ఈ ఆయత్ లు అవతరింపజేయబడ్డాయి. దైవప్రవక్త ('స'అస) తరువాత దానిని పడగొట్టిస్తారు. ఎందుకంటే ఆ మస్జిద్ నిర్మాణ లక్ష్యం విశ్వాసుల మధ్య భేదభావాలు పుట్టించబడి ఉండెను.

కొట్టుకొని పోతుంది. మరియు అల్లాహ్ దుర్మార్గులకు సన్మార్గం చూపడు.

**110.** వారి హృదయాలు ముక్కలైపోయి (వారు చనిపోయి) నంత వరకు, వారు కట్టిన కట్టడం వారి హృదయాలలో కలతలు పుట్టిస్తూ ఉంటుంది. మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేచనాపరుడు.

**111.** నిశ్చయంగా, అల్లాహ్ విశ్వాసుల నుండి వారి ప్రాణాలను వారి సంపదలను కొన్నాడు. కాబట్టి నిశ్చయంగా, వారి కొరకు స్వర్గముంది. వారు అల్లాహ్ మార్గంలో పోరాడి (తమ శత్రువులను) చంపుతారు మరియు చంపబడతారు. మరియు ఇది తౌరాత్, ఇంజీల్ మరియు ఖుర్ఆన్ లలో, ఆయన (అల్లాహ్) చేసిన వాగ్దానం, సత్యమైనది. మరియు తన వాగ్దానాన్ని నెరవేర్చటంలో అల్లాహ్ ను మించిన వాడు ఎవడు? కావున మీరు ఆయనతో చేసిన వ్యాపారానికి సంతోషపడండి. మరియు ఇదే ఆ గొప్ప విజయం[70].

**112.** (వీరే అల్లాహ్ ముందు) పశ్చాత్తాప పడేవారు, ఆయనను ఆరాధించేవారు, స్తుతించేవారు (అల్లాహ్ మార్గంలో) సంచరించేవారు (ఉపవాసాలు చేసేవారు)[71]. ఆయన సన్నిధిలో వంగే (రుకూఉ

[70] చూడండి, 'స. బు'ఖారీ, పు-4, 'హ. 352, పు-5, 'హ 377, మరియు పు-3, 'హ 3462.

[71] చాలామంది వ్యాఖ్యాతలు ఈ పదం 'సాయి'హూన్'ను 'సాయిమూన్'గా బోధించారు అంటే ఉపవాసాలు చేసేవారు అని.

చేసే) వారు, సాష్టాంగం (సజ్దా) చేసేవారు, ధర్మమును ఆదేశించేవారు మరియు అధర్మమును నిషేధించేవారు[72] మరియు అల్లాహ్ విధించిన హద్దును పాటించేవారు కూడాను. మరియు విశ్వాసులకు శుభవార్త తెలుపు.

**113.** అల్లాహ్ కు సాటి కల్పించేవారు (ముష్రికులు) దగ్గరి బంధువులైనా, వారు నరకవాసులని వ్యక్తమైన తరువాత కూడా, ప్రవక్తకు మరియు విశ్వాసులకు వారి క్షమాపణకై ప్రార్థించటం తగదు[73].

**114.** మరియు ఇబ్రాహీమ్ తన తండ్రి క్షమాపణ కొరకు ప్రార్థించింది కేవలం అతను అతడి (తన తండ్రి)తో చేసిన వాగ్దానం వల్లనే[74]. కాని అతనికి, అతడు (తన తండ్రి) నిశ్చయంగా అల్లాహ్ కు శత్రువని స్పష్టమైనప్పుడు, అతను (ఇబ్రాహీమ్) అతడిని విడనాడాడు. వాస్తవానికి ఇబ్రాహీమ్ వినయ విధేయతలతో (అల్లాహ్ ను) అర్థించేవాడు[75], సహనశీలుడు.

**115.** మరియు ఒక జాతికి సన్మార్గం చూపిన తరువాత

---

[72] ఇటువంటి వాక్యానికి చూడండి, 3:104, 110, 1114; 9:71 మరియు 22:41.

[73] చూడండి, 28:56

[74] ఇబ్రాహీమ్ ('అ.స.) యొక్క ఈ వాగ్దానం కొరకు చూడండి, 19:47-48 మరియు 60:4. అతని ప్రార్థన కొరకు చూడండి, 26:86-87. ఇంకా చూడండి, 'స'హీ'హ్ బు'ఖారీ, పు-4, 'హ. 565.

[75] అవ్వాహున్: మృదుహృదయుడు, వినయవిధేయతలతో (అల్లాహుతా'ఆలా ను) అర్థించేవాడు.

వారు దూరంగా ఉండవలసిన విషయాలను గురించి వారికి స్పష్టంగా తెలుపనంత వరకు, అల్లాహ్ వారిని మార్గభ్రష్టత్వంలో పడవేయడు. నిశ్చయంగా అల్లాహ్ కు ప్రతి విషయం గురించి బాగా తెలుసు[76].

**116.** నిశ్చయంగా, భూమ్యాకాశాల సామ్రాజ్యాధిపత్యం అల్లాహ్ కే చెందుతుంది. ఆయనే జీవన్మరణాలను ఇచ్చేవాడు. మరియు అల్లాహ్ తప్ప మీకు వేరే రక్షకుడు గానీ సహాయకుడు గానీ ఎవ్వడూ లేడు.

**117.** వాస్తవానికి అల్లాహ్ ప్రవక్తను మరియు వలస వచ్చిన వారిని (ముహాజిర్ లను) మరియు అన్సార్ లను, ఎవరైతే బహు కష్టకాలంలో ప్రవక్త వెంట ఉన్నారో! అలాంటి వారినందరినీ క్షమించాడు[77]. వారిలో ఒక పక్షం వారి హృదయాలు, దాదాపు వక్రత్వం వైపునకు మరలి నప్పటికీ (ప్రవక్త వెంటవెళ్ళారు) అప్పుడు ఆయన వారి పశ్చాత్తాపాన్ని అంగీకరించాడు. నిశ్చయంగా, ఆయన వారి పట్ల ఎంతో కనికరుడు, అపార కరుణా ప్రదాత.

**118.** మరియు వెనుక ఉండి పోయిన ఆ ముగ్గురిని

---

[76] చూడండి, 6:131-132. ఇంకా చూడండి, 'స'హీ'హ్ బు'ఖారీ పు-9, 'హ, 66.

[77] తబూక్ దండయాత్ర కాలం బహు కష్టకాలంగా పేర్కొనబడింది. ఎందుకంటే అది తీవ్రమైన ఎండకాలం. ఖర్జూర ఫలాలు సిద్ధమయ్యేన కాలం.ఆ ప్రయాణం చాలా దూరప్రదేశానిది. మరియు ప్రయాణ సౌకర్యాలు కూడా చాలా తక్కువ ఉండేవి.

కూడా (ఆయన క్షమించాడు)[78]. చివరకు విశాలంగా ఉన్న భూమి కూడా వారికి ఇరుకై పోయింది. మరియు వారి ప్రాణాలు కూడా వారికి భార మయ్యాయి. అల్లాహ్ నుండి (తమను కాపాడుకోవటానికి) ఆయన శరణం తప్ప మరొకటి లేదని వారు తెలుసుకున్నారు. అప్పుడు ఆయన వారి పశ్చాత్తాపాన్ని అంగీకరించాడు - వారు పశ్చాత్తాప పడాలని. నిశ్చయంగా, అల్లాహ్ మాత్రమే పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడు, అపార కరుణా ప్రదాత.

**119.** ఓ విశ్వాసులారా! అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి మరియు సత్యవంతులతో ఉండండి[79].

**120.** మదీనా పురవాసులకు మరియు చుట్టుప్రక్కలలో ఉండే ఎడారి వాసులకు (బద్దూలకు) అల్లాహ్ ప్రవక్తను వదలి వెనుక ఉండి పోవటం మరియు

---

[78] తబూక్ దండయాత్రలో పాల్గొనని ఆ ముగ్గురు, క'అబ్ ఇబ్నె మాలిక్, మరారా ఇబ్నె రబీ మరియు హిలాల్ ఇబ్నె 'ఉమయ్యా (ర'ది.'అన్హుమ్) అనే అన్సారులు. వీరు, పైఆయత్ అవతరింప జేయబడే వరకు దైవప్రవక్త ('స'అస) మరియు అతని అనుచరులతో బహిష్కరించబడి ఉండిరి. వీరి పశ్చాత్తాపం యాభై రోజుల తరువాత అంగీకరించబడింది. వీరు విధేయులైన ముస్లింలు. ఇంతకు ముందు ప్రతి యుద్ధంలో పాల్గొన్నారు. తబూక్ దండయాత్రలో కేవలం సోమరితనం వల్లనే పాల్గొన లేక పోయారు. వారు కపటవిశ్వాసుల వలే బూటక సాకులు చెప్పలేదు. (చూడండి 'స'హీ'హ్ బు'ఖారీ, కితాబ్ అల్ మ'గాజీ, బాబ్ 'గజ్ వత్ అత్ తబూక్. ముస్లిం కితాబ్ అత్-తౌబహ్, బాబ్ 'హదీస్ తౌబతు క'అబ్ బిన్ మాలిక్).

[79] చూడండి, 'స. బు'ఖారీ, పు-8, 'హ. 116, 117, 118.

తమ ప్రాణాలకు అతని (దైవప్రవక్త) ప్రాణాలపై ఆధిక్యత నివ్వటం తగిన పని కాదు. ఎందుకంటే అల్లాహ్ మార్గంలో వారు ఆకలి దప్పులు, (శారీరక) కష్టాలు సహిస్తే, శత్రువుల భూమిలోకి దూరి సత్యతిరస్కారుల కోపాన్ని రేకెత్తిస్తే మరియు శత్రువుల నుండి ఏదైనా సాధిస్తే[80], దానికి బదులుగా వారికి ఒక సత్కార్యం వ్రాయబడకుండా ఉండదు. నిశ్చయంగా అల్లాహ్ సజ్జనుల ఫలితాన్ని వ్యర్థపరచడు.

**121.** మరియు(అల్లాహ్ మార్గంలో) వారు ఖర్చు చేసే ధనం కొంచెమైనా లేదా అధికమైనా లేక వారు (శ్రమపడి) కొండలోయలలను దాటే విషయమూ, అంతా వారి కొరకు వ్రాయబడకుండా ఉండదు - వారు చేస్తూ ఉండిన ఈ సత్కార్యాల కొరకు - అల్లాహ్ వారికి ప్రతిఫలాన్ని ప్రసాదించటానికి.

**122.** మరియు విశ్వాసులందరూ (పోరాటానికి) బయలు దేరటం సరికాదు. కావున వారిలో ప్రతి తెగ నుండి కొందరు ధర్మజ్ఞానాన్ని పెంపొందించుకోవటానికి పోయి, వారు వారి వద్దకు తిరిగి వచ్చినప్పుడు తమ జాతి (ప్రాంత) ప్రజలను హెచ్చరిస్తే! బహుశా వారు కూడా తమను తాము (దుర్మార్గం నుండి)

[80] నైలన్: attainment, సిద్ధి లేక సాధించడం. ఇక్కడ ఈ వాక్యపు అర్థం, శత్రువుల నుండి ఏదైనా తీసుకోవటం, లేక వారికి హాని కలిగించటం అంటే వారిని సంహరించటం లేదా ఖైదీలుగా చేసుకోవటం లేదా ఓడించి విజయధనం పొందటం, లేక అమరగతి పొందటం.

కాపాడు కోగలరు[81].

**123.** ఓ విశ్వాసులారా! మీ దగ్గరున్న సత్యతిరస్కారులతో పోరాడి, వారిని మీలో నున్న కాఠిన్యాన్ని గ్రహించనివ్వండి[82]. మరియు నిశ్చయంగా, అల్లాహ్ దైవభీతి గలవారితో ఉంటాడని తెలుసుకోండి.

**124.** మరియు ఒక సూరహ్ అవతరింపజేయబడినప్పుడల్లా వారి(కపటవిశ్వాసుల)లో కొందరు "ఇది మీలో ఎవరి విశ్వాసాన్ని అధికం చేసింది?" అని అడుగుతారు. కాని వాస్తవానికి అది విశ్వసించిన వారందరి విశ్వాసాన్ని అధికం చేస్తుంది మరియు వారు దానితో సంతోషపడతారు[83].

**125.** కాని ఎవరి హృదయాలలో రోగముందో, ఇది వారి

---

[81] తబూక్ దండయాత్ర కొరకు, ఆర్థిక మరియు భౌతిక స్తోమత గల వారంతా బయలుదేరాలని ప్రకటన చేయబడి ఉండెను. ఎందుకంటే అప్పుడు వారికి ఒక గొప్ప సామ్రాజ్యపు సేనతో యుద్ధం చేయవలసి ఉండెను. లేనిచో వారు మదీనాపై దాడి చేయటానికి యత్నాలు చేయచుండిరి. కాని అన్ని యుద్ధాలలో, అందరూ పాల్గొనే అవసరముండదు. అలాంటప్పుడు కొందరు యుద్ధానికి పోకుండా ధర్మజ్ఞానం పెంపొందించు కోవటానికి పోయి, తిరిగి వచ్చి తమ ప్రాంతంలోని ప్రజలకు ధర్మజ్ఞానం బోధించాలి. దీని వల్ల ప్రజలలో దైవభీతి పెరుగుతుంది.

[82] ఎందుకు జిహాద్ చేయాలో 2:190-194, 22:39, 60:8-9 ఆయత్'లలో వచ్చింది. ఇక్కడ: 'మీ ఇరుగు పొరుగు లో ఉన్నవారు మీకు హాని చేకూర్చదలిస్తే, మిమ్మల్ని మీ ధర్మం అనుసరించటంలో ఆటంకపరిస్తే, అట్టి వారితో మీరు కఠినత్వాన్ని వ్యక్తపరుస్తూ పోరాడండి'అని ఆదేశమివ్వబడుతోంది. ఇంకా చూడండి, 48:29 మరియు 5:54

[83] చూడండి, 8:2.

మాలిన్యంలో మరింత మాలిన్యాన్ని అధికం చేస్తుంది. మరియు వారు సత్యతిరస్కారులుగానే మరణిస్తారు[84].

**126.** ఏమీ? వారు ప్రతి సంవత్సరం ఒకసారి లేక రెండుసార్లు (బాధలతో) పరీక్షింప బడటాన్ని గమనించటం లేదా? అయినా వారు పశ్చాత్తాప పడటం లేదు మరియు గుణపాఠం కూడా నేర్చుకోవటం లేదు.

**127.** మరియు ఏదైనా సూరహ్ అవతరించినపుడల్లా వారు ఒకరినొకరు చూసుకుంటూ (అంటారు): "ఎవడైనా మిమ్మల్ని చూస్తున్నాడా?" ఆ తరువాత అక్కడి నుండి మెల్లగా జారుకుంటారు. అల్లాహ్ వారి హృదయాలను (సన్మార్గం నుండి) మళ్ళించాడు. ఎందుకంటే నిశ్చయంగా, వారు అర్థం చేసుకోలేని జనులు[85].

**128.** (ఓ ప్రజలారా!) వాస్తవానికి, మీ వద్దకు మీలో నుంచే ఒక సందేశహరుడు (ముహమ్మద్) వచ్చి ఉన్నాడు[86]; మీరు ఆపదకు గురి కావటం అతనికి కష్టం కలిగిస్తుంది; అతను మీ మేలు కోరేవాడు, విశ్వాసుల ఎడల కనికరుడు, కరుణామయుడు.

**129.** అయినా వారు విముఖులైతే, వారితో అను:

---

[84] చూడండి, 17:82.
[85] చూడండి, 8:55.
[86] చూడండి, 50:2.

"నాకు అల్లాహ్ చాలు! ఆయన తప్ప వేరే ఆరాధ్యనీయుడు లేడు! నేను ఆయననే నమ్ముకున్నాను. మరియు ఆయనే సర్వోత్తమ సింహాసనానికి (అర్ష్ కు) ప్రభువు[87]

[87] చూడండి, ఖుర్ఆన్ 7:54 మరియు 'స'హీ'హ్ బు'ఖారీ, పు-9, 'హ. 86 మరియు పు-6, 'హ. 87.

# 10. యూనుస్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. అలిఫ్ - లామ్ - రా[1]. ఇవి వివేకంతో నిండి వున్న దివ్యగ్రంథం యొక్క ఆయతులు.
2. "ఏమీ? మానవులను హెచ్చరించటానికి మరియు విశ్వసించిన వారికి నిశ్చయంగా, తమ ప్రభువు వద్ద, వారు చేసి పంపిన మంచిపనులకు తగిన స్థానం ఉంది." అనే శుభవార్త వినిపించటానికి, మేము వారిలోని ఒక మనిషి (ముహమ్మద్) పై మా సందేశాన్ని అవతరింప జేయటం ప్రజలకు ఆశ్చర్యకమైన విషయంగా ఉందా?[2] (ఎందుకంటే) సత్యతిరస్కారులు ఇలా అన్నారు: "నిశ్చయంగా ఇతను పచ్చి మాంత్రికుడు!"
3. నిశ్చయంగా మీ పోషకుడూ, ప్రభువూ అయిన అల్లాహ్, ఆకాశాలను మరియు భూమిని ఆరు దినములలో (అయ్యామ్ లలో) సృష్టించి, తర్వాత తన సింహాసనాన్ని (అర్ష్ ను) అధిష్టించాడు[3]. ఆయనే (సర్వసృష్టి) వ్యవహారాలను నడుపుతున్నాడు. ఆయన అనుమతి లేకుండా

[*] [యూనుస్ – ప్రవక్త యూనుస్ అలైహిస్సలామ్]
[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.
[2] చూడండి, 9:128.
[3] చూడండి, 7:54.

సిఫారసు చేయగలవాడు ఎవ్వడూ లేడు[4]. ఆయనే అల్లాహ్! మీ పోషకుడు (ప్రభువు), కావున మీరు ఆయననే ఆరాధించండి. ఏమీ? మీరు హితోపదేశం స్వీకరించరా?

4. ఆయన వైపునకే మీరందరూ మరలి పోవలసి ఉంది. అల్లాహ్ వాగ్దానం నిజమైనది. నిశ్చయంగా, ఆయనే సృష్టిని మొదట సరిక్రొత్తగా ప్రారంభించాడు, మరల ఆయనే దానిని ఉనికిలోకి తెస్తాడు. ఇది విశ్వసించి సత్కార్యాలు చేసేవారికి న్యాయమైన ప్రతిఫల మివ్వటానికి. మరియు సత్యాన్ని తిరస్కరించిన వారికి - వారు సత్యాన్ని తిరస్కరిస్తూ ఉండినందుకు - త్రాగటానికి సలసల కాగే నీళ్ళు మరియు బాధాకరమైన శిక్ష ఉంటాయి.

5. ఆయనే, సూర్యుణ్ణి (ప్రకాశించే) దీపంగానూ మరియు చంద్రుణ్ణి వెలుగును (ప్రతిబింబింపజేసే) దాని గానూ చేసి, దానికి (పెరిగే-తరిగే) దశలు

---

[4] అల్లాహ్ (సు.తా.) అనుమతి లేకుండా సిఫారసు చేయగలవారు ఎవ్వడూ లేడు. అల్లాహ్ (సు.తా.) వారి కొరకే సిఫారసు చేయటానికి అనుమతిస్తాడు. ఎవరి కొరకైతే ఆయన (సు.తా.) ఇష్టపడతాడో; అంటే షిర్క్ చేయకుండా, విశ్వాసులై అల్లాహ్ విధులను పాటిస్తూ అనుకోకుండా పాపాలు చేసిన వారి కొరకు మాత్రమే. ముష్రికీన్ లు భావించినట్లు: 'వారు ఆరాధించేవి, తమను అల్లాహ్(సు.తా.) శిక్ష నుండి తప్పించటానికి, అల్లాహ్ (సు.తా.) వద్ద సిఫారసు చేస్తాయి.' అనే తప్పుడు ఊహలను ఈ ఆయత్ మరియు ఇలాంటి ఎన్నో ఆయతులు ఖండిస్తున్నాయి. షిర్క్ (అల్లాహుతా'ఆలాకు సాటి కల్పించడం) ఎన్నటికీ క్షమించబడని మహాపాపం. ముష్రికీన్ ల గమ్యస్థానం - వారెన్ని పుణ్యకార్యాలు చేసినా - నరకం మాత్రమే. చూడండి, 2:255, 19:87, 20:109, 21:28, 34:23, మరియు 53:26.

నియమించాడు[5], దాని ద్వారా మీరు సంవత్సరాల మరియు (కాలపు) గణనను తెలుసుకోవాలని[6]. అల్లాహ్ ఇదంతా సత్యాధారంగా తప్ప సృష్టించలేదు. జ్ఞానం గల వారికి ఆయన తన సూచనలను (ఈ విధంగా) విశదీకరిస్తున్నాడు.

6. నిశ్చయంగా, రేయింబవళ్ళ నిరంతర మార్పులలోనూ మరియు భూమ్యాకాశాలలో అల్లాహ్ సృష్టించిన ప్రతిదానిలోనూ, దైవభీతి గల ప్రజలకు సూచనలున్నాయి.

7. నిశ్చయంగా, ఎవరైతే మమ్మల్ని కలుసుకోవటాన్ని ఆశించక, ఇహలోక జీవితంతోనే సంతసించి, దానితోనే తృప్తి చెందుతారో మరియు మా సూచన (ఆయాత్) లను గురించి నిర్లక్ష్యభావం కలిగి ఉంటారో!

8. అలాంటి వారి ఆశ్రయం - తమ కర్మలకు ఫలితంగా - నరకాగ్నియే!

9. నిశ్చయంగా, విశ్వసించి సత్కార్యాలు చేసిన వారిని వారి విశ్వాసఫలితంగా వారి ప్రభువు

---

[5] సూర్యుని ప్రకాశం స్వంతమైనది, ఏ విధంగానైతే దీపపు వెలుగో. చంద్రుని వెలుగు ప్రతిబింబింప జేయబడిన సూర్యుని వెలుగు. చంద్రునిలో తన స్వంత వెలుగు లేదు.

[6] చంద్రునికి 28 దశలున్నాయి. వాటిలో చంద్రుడు చిన్నరేఖ నుండి పూర్ణిమ రోజు పూర్తి చంద్రునిగా 14 రోజులలో మారుతాడు. ఆ తరువాత తిరిగి తగ్గుతూ 14 రోజులలో చిన్నరేఖగా మారుతాడు. తరువాత ఒకటి రెండు రోజులు కానరాకుండా పోతాడు. మళ్ళీ చిన్న రేఖగా మొదలవుతాడు. ఈ విధంగా చంద్రుని దిశల వల్ల దినాల, నెలల మరియు సంవత్సరాల గణనలు తెలుస్తాయి.

వారిని సన్మార్గం మీద నడిపిస్తాడు. వారి క్రింద పరమ సుఖాలతో నిండి ఉన్న స్వర్గవనాలలో, సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి.

**10.** అందులో వారి ప్రార్థన: "ఓ అల్లాహ్! నీవు సర్వలోపాలకు అతీతుడవు." అని మరియు వారి అభివందనం: "అస్సలాము అలైకుం (మీకు శాంతి కలుగు గాక)!" అని, మాత్రమే ఉంటాయి. మరియు వారు తమ ప్రార్థనలను: "సర్వస్తోత్రాలకు అర్హుడు సమస్తలోకాల పోషకుడైన అల్లాహ్ మాత్రమే!" అని ముగించుకుంటారు.

**11.** మరియు ప్రజలు తమ మేలు కొరకు తొందర పడినట్లు అల్లాహ్ వారిపై (వారి చేష్టలకు) కీడును పంపటంలో తొందర పడి ఉంటే, వారి వ్యవధి ఎప్పుడో పూర్తయి ఉండేది. అందువలన మేము, మమ్మల్ని కలుసుకునే నమ్మకంలేని వారిని, తమ తలబిరుసు తనంలో భ్రష్టులై తిరగటానికి వదలిపెడుతున్నాము[7].

**12.** మరియు మానవునికి కష్టకాలం వచ్చినప్పుడు: అతడు పరుండినా, కూర్చుండినా లేక నిలుచుండినా, మమ్మల్ని ప్రార్థిస్తాడు. కాని మేము అతని ఆపదను తొలగించిన వెంటనే, అతడు తనకు కలిగిన కష్టానికి, ఎన్నడూ మమ్మల్ని ప్రార్థించనే లేదు, అన్నట్లు ప్రవర్తిస్తాడు. ఈ విధంగా మితిమీరి ప్రవర్తించే వారికి, వారి చేష్టలు ఆకర్షణీయమైనవిగా చూపబడతాయి.

[7] చూడండి, 6:12.

13. మరియు వాస్తవంగా మీకు పూర్వం ఎన్నో తరాలను మేము నాశనం చేశాము[8], ఎందుకంటే వారు దుర్మార్గపు వైఖరిని అవలంబించారు; మరియు వారి ప్రవక్తలు వారి వద్దకు స్పష్టమైన నిదర్శనాలు తీసుకొని వచ్చినా, వారు విశ్వసించలేదు. ఈ విధంగా మేము అపరాధులకు ప్రతీకారం చేస్తాము.

14. వారి తరువాత - మీరు ఏ విధంగా ప్రవర్తిస్తారో చూడటానికి - మేము మిమ్మల్ని భూమికి వారసులుగా చేశాము.

15. మరియు మా స్పష్టమైన ఆయతులను వారికి చదివి వినిపించినప్పుడు - మమ్మల్ని కలుసుకునే నమ్మకం లేనివారు - అంటారు: "దీనికి బదులుగా మరొక ఖుర్ఆన్ తీసుకురా లేదా ఇందులో సవరణలు చెయ్యి." (ఓ ప్రవక్తా!) వారితో ఇలా అను: "ఇందులో నా అంతట నేను మార్పులు చేయటం నా పని కాదు. నా వద్దకు పంపబడే దివ్యజ్ఞానాన్ని (వహీని) మాత్రమే నేను అనుసరిస్తాను. నిశ్చయంగా, నేను నా ప్రభువు ఆజ్ఞను ఉల్లంఘిస్తే, ఆ గొప్ప దినమున శిక్ష పడుతుందని భయపడుతున్నాను!"

16. (ఇంకా ఇలా) అను: "ఒకవేళ అల్లాహ్ కోరితే, నేను దీనిని మీకు వినిపించి ఉండేవాడిని కాదు; మరియు ఆయన కూడా దీనిని మీకు తెలిపి

---

[8] చూడండి, 6:131-132. ఖర్ నున్: అంటే, ఒకే కాలానికి, లేక తరానికి చెందిన ప్రజలు.

ఉండేవాడు కాదు. వాస్తవంగా నేను దీనికి (ఈ గ్రంథ అవతరణకు) పూర్వం మీతో నా వయస్సులోని దీర్ఘకాలాన్ని గడిపాను కదా?[9] ఏమీ? మీరిది గ్రహించలేరా?"

**17.** ఇక అబద్ధాన్ని కల్పించి, దానిని అల్లాహ్ కు ఆపాదించే వాడి కంటే, లేక ఆయన సూచన (ఆయాత్) లను అబద్ధాలని తిరస్కరించే వాడి కంటే, మహా దుర్మార్గుడెవడు? నిశ్చయంగా, పాపులు ఎన్నటికీ సాఫల్యం పొందలేరు!

**18.** మరియు వారు అల్లాహ్ ను కాదని తమకు నష్టం గానీ, లాభం గానీ కలిగించలేని వాటిని ఆరాధిస్తున్నారు. మరియు వారు ఇలా అంటున్నారు: "వీరు మాకు అల్లాహ్ వద్ద

---

[9] దైవప్రవక్తగా ఎన్నుకొనబడక ముందు ము'హమ్మద్ ('స'అస) 40 సంవత్సరాలు మక్కా వారితో నివసించారు. మరియు వారు అతనిని నమ్మకస్తునిగా (అల్-అమీన్) మరియు ఎన్నడూ అబద్ధమాడని వారి (అ'స్సాదిఖ్)గా సాక్ష్యమిచ్చేవారు. అతనికి ('స'అస) ఏ గురువు లేడు. అతను చదువటం వ్రాయటం ఎరుగరు. ఇది కూడా వారికి బాగా తెలుసు. అలాంటప్పుడు ఈ ఖుర్ఆన్ ఏదైతే ఎన్నో అద్భుత విషయాలను, విజ్ఞాన విషయాలను, నక్షత్రాల విషయాలను, ప్రాచీన ప్రవక్తల గాథలను వివరిస్తుందో, అల్లాహ్ (సు.తా.) తరఫు నుండి గాక మరెవరి తరఫు నుండి రాగలదు. ఎందుకంటే ఇందులో వేయి కంటే ఎక్కువ విజ్ఞాన (Science) విషయాలు ఉన్నాయి. వాటిలో కొన్ని ఇప్పుడిప్పుడే వైజ్ఞానికి ప్రయోగాల ద్వారా సత్యమని నిరూపించబడ్డాయి. ఇకా ఎన్నో నిరూపించబడనున్నాయి. ఇంకొక విశేషమేమిటంటే దివ్య ఖుర్ఆన్ లో సూచించబడిన వైజ్ఞానిక విషయాలలో ఇంత వరకు ఒక్కటి కూడా తప్పని నిరూపించబడలేదు. మరియు దివ్య ఖుర్ఆన్‌లో సూచించబడిన ఇంకా ఎన్నో వైజ్ఞానిక విషయాలను మానవుడు ఇంతవరకు కూడా అర్థం చేసుకోలేక పోయాడు. .

సిఫారసు చేసేవారు." వారినడుగు: "ఏమీ? ఆకాశాలలో గానీ, భూమిలో గానీ, అల్లాహ్ ఎరుగని విషయాన్ని, మీరు ఆయనకు తెలుపగోరుతున్నారా?" ఆయన సర్వలోపాలకు అతీతుడు, మీరు సాటి కల్పించే వాటి కంటే ఆయన అత్యున్నతుడు[10].

**19.** మరియు మానవులందరూ మొదట ఒకే సంఘుంగా (ఒకే ధర్మం మీద) ఉండేవారు. కానీ, వారు తర్వాత భిన్నాభిప్రాయాలకు లోనయ్యారు. మరియు నీ ప్రభువు తరఫు నుండి ముందు గానే ఈ విషయం నిర్ణయించబడకుండా ఉండి ఉన్నట్లయితే, వారి మధ్య ఉన్న ఈ విభేదాల తీర్పు ఎప్పుడో జరిగి వుండేది[11].

**20.** మరియు వారంటున్నారు: "అతనిపై అతని ప్రభువు తరఫు నుండి ఏదైనా (అద్భుత) సంకేతం ఎందుకు అవతరింప జేయబడలేదు?" నీవిలా జవాబివ్వు: "నిశ్చయంగా అగోచర విషయ జ్ఞానం కేవలం అల్లాహ్ కే చెందుతుంది[12], కావున వేచి ఉండండి! నిశ్చయంగా, నేను కూడా మీతో బాటు

---

[10] విశ్వంలో అల్లాహ్ (సు.తా.)కు తెలియనిది ఏదీ లేదు, అలాంటప్పుడు అల్లాహ్ (సు.తా.) కు తెలియని, ఈ సిఫారసుదారులను వీరు ఎక్కడి నుండి కల్పించి తెచ్చారు?

[11] చూడండి, 2:213, 253. అల్లాహ్ (సు.తా.), పునరుత్థాన దినమున తీర్పు చేయాలనీ - మానవులకూ మరియు జిన్నాతులకూ - అంతవరకు వ్యవధినివ్వాలని నిర్ణయించి ఉండకపోతే! వీరి తీర్పు అప్పటికప్పుడే జరిగి ఉండేది.

[12] చూడండి, 2:105 మరియు 3:73-74.

వేచి ఉంటాను."

21. మరియు మానవులకు ఆపద కలిగిన పిదప, మేము వారికి కారుణ్యం రుచి చూపిస్తే, వెంటనే వారు మా సూచనలకు విరుద్ధంగా ఎత్తుగడలు వేయటం ప్రారంభిస్తారు[13]. వారితో అను: "ఎత్తుగడలు వేయటంలో అల్లాహ్ అతి శీఘ్రుడు!" నిశ్చయంగా, మా దూతలు మీరు చేసే ఎత్తుగడలన్నింటినీ వ్రాస్తున్నారు.

22. ఆయన (అల్లాహ్) యే! మిమ్మల్ని భూమిలోను మరియు సముద్రంలోనూ ప్రయాణింప జేయగలవాడు. ఇక మీరు ఓడలలో ఉన్నప్పుడు: అవి వారితో సహా, అనుకూలమైన గాలి వీస్తూ ఉండగా పోతూ ఉంటాయి మరియు దానితో వారు ఆనందిస్తూ ఉంటారు. (అకస్మాత్తుగా) వారిపైకి తీవ్రమైన తుఫాను గాలి వస్తుంది మరియు ప్రతిదిక్కు నుండి వారి మీదికి పెద్ద పెద్ద అలలు వస్తాయి మరియు వారు వాటి వల్ల వారు నిశ్చయంగా, చుట్టుకోబడ్డామని భావించి, అల్లాహ్ ను వేడుకుంటారు. తమ ధర్మం (ప్రార్థన)లో కేవలం ఆయననే ప్రత్యేకించుకొని ఇలా ప్రార్థిస్తారు: "ఒకవేళ నీవు మమ్మల్ని ఈ ఆపద నుండి కాపాడితే మేము నిశ్చయంగా కృతజ్ఞతలు చూపేవారమై

---

[13] వీరు ఆయత్ లు 7, 11, 12, 15, 18 మరియు 20లలో పేర్కొనబడిన రెండు రకాల మానవులు.

ఉంటాము[14]!"

23. కాని, ఆయన వారిని కాపాడిన వెంటనే, వారు భూమిలో అన్యాయంగా దౌర్జన్యం చేయ సాగుతారు[15]. ఓ మానవులారా! నిశ్చయంగా, మీ దౌర్జన్యాలు మీకే హాని కలిగిస్తాయి. ఇహలోక జీవితం తాత్కాలిక ఆనందమే. చివరకు మీకు మా వైపునకే మరలి రావలసి ఉన్నది, అప్పుడు మేము, మీరు చేస్తూ ఉండిన కర్మలన్నీ మీకు తెలియజేస్తాము.

24. వాస్తవానికి ఈ ప్రాపంచిక జీవితాన్ని ఇలా పోల్చవచ్చు: మేము ఆకాశం నుండి నీటిని కురిపించగా దాని నుండి భూమిలో మానవులకు మరియు పశువులకు తినటానికి, వివిధ రకాల చెట్లూ చేమలూ పెరుగుతాయి. అప్పుడు భూమి

[14] ఇక్రిమా బిన్ - అబూ జహల్ (ర'ది.'అ) మక్కా విజయం తరువాత మక్కాను విడిచి, ఒక నావలో కూర్చొని పోతూవుండగా, ఆ నావ తుఫానులో చిక్కుకుంటుంది. నావ నడిపించేవాడు: "ఇప్పుడు మమ్మల్ని రక్షించగలవాడు కేవలం ఆ ఏకైక ఆరాధ్యుడు అల్లాహ్ (సు.తా.) మాత్రమే! కావున మీరు ఆయనను ప్రార్థించండి." అని అంటాడు. అప్పుడు - ము'హమ్మద్ ('స'అస) అనే మాటలు నిజమేనని - ఇక్రిమా అర్థంచేసుకుంటాడు. "ఒకవేళ ఈ తుఫాను నుండి బ్రతికి బయటపడితే ఇస్లాం స్వీకరిస్తాను." అని అతడు నిర్ణయించుకుంటాడు. ఆ ఆపద దాటిన తరువాత అతడు దైవప్రవక్త ('స'అస) దగ్గరికి వచ్చి ఇస్లాం స్వీకరిస్తాడు. (సునన్ నసా'యీ, అబూ-దావూద్ నం. 2683, అల్బాని ప్రమాణీకం నం. 1723).

[15] ఇదే మానవుడి కృతఘ్నతా బుద్ధి. ఇది ఈ సూరహ్ 12వ ఆయత్ లో మరియు ఖుర్ఆన్ లో ఇతర ఎన్నో చోట్లలో పేర్కొనబడింది.

తన అలంకారంతో వర్ధిల్లుతూ ఉండగా, దాని యజమానులు నిశ్చయంగా, అది తమ వశంలో ఉందనుకుంటారు; అలాంటి సమయంలో అకస్మాత్తుగా రాత్రి పూటనో లేక పగటి పూటనో మా తీర్పు వస్తుంది. అప్పుడు మేము దానిని - నిన్నటివరకు ఏమీ లేని - కోసివేసిన పంటపొలంగా మార్చివేస్తాము. ఈ విధంగా మేము మా సూచనలను ఆలోచించే ప్రజల కొరకు స్పష్టంగా వివరిస్తాము.

**25.** మరియు అల్లాహ్ మిమ్మల్ని శాంతినిలయం (దారుస్సలాం) వైపునకు ఆహ్వానిస్తున్నాడు. మరియు ఆయన తాను కోరిన వానికి ఋజుమార్గం వైపునకు మార్గదర్శకత్వం చేస్తాడు.

**26.** మంచిపనులు చేసిన వారికి, మంచి ఫలితం దొరుకుతుంది. మరియు ఇంకా ఎక్కువ లభిస్తుంది[16]. మరియు వారి ముఖాలు నల్లబడవు మరియు వారికి అవమానమూ జరుగదు. అలాంటి వారు స్వర్గవాసులు. వారందు శాశ్వతంగా ఉంటారు.

**27.** మరియు పాపకార్యాలు చేసిన వారికి, వారి పాపాలకు తగినట్టి ప్రతిఫలం లభిస్తుంది మరియు వారిని అవమానం క్రమ్ముకుంటుంది. అల్లాహ్ నుండి వారిని రక్షించేవాడెవ్వడూ ఉండడు. వారి ముఖాలు చీకటి రాత్రి యొక్క నల్లని తెరల వంటి

---

[16] చూడండి, 6:160 మరియు 27:89.

వాటితో కప్పబడి ఉంటాయి[17]. అలాంటి వారు నరకాగ్ని వాసులు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు.

28. మరియు మేము వారందరినీ సమావేశపరచిన రోజు[18], సాటి కల్పించిన (షిర్కు చేసిన) వారితో ఇలా అంటాము: "మీరునూ మరియు మీరు అల్లాహ్ కు సాటి కల్పించిన వారునూ, మీ స్థానాలలోనే ఆగండి!" ఆ పిదప మేము వారిని వేరు చేస్తాము[19]. వారు అల్లాహ్ కు భాగస్వాములుగా కల్పించినవారు (వారి దైవాలు) ఇలా అంటారు: "మీరు ఆరాధిస్తూ ఉండేది మమ్మల్ని కాదు[20];

29. ఇక మీకూ మరియు మాకూ మధ్య అల్లాహ్ సాక్ష్యం చాలు. నిశ్చయంగా, మీరు (చేస్తూ వున్న) ఆరాధన గురించి మాకు ఏ మాత్రం తెలియదు[21]!"

30. అక్కడ ప్రతి వ్యక్తీ తాను ముందుగా చేసి పంపుకున్న కర్మలను తెలుసుకుంటాడు. అందరూ తమ వాస్తవ యజమాని అయిన అల్లాహ్ వైపునకు మరలింపబడతారు మరియు వారు

---

[17] చూడండి, 3:106 మరియు 80:38-41.

[18] చూడండి, 18:47.

[19] చూడండి, 36:59 మరియు 30:43.

[20] చూడండి, 34:41.

[21] చూడండి, 46:5-6 ఇక్కడ విశదపరచబడుతున్నది ఏమిటంటే ఏ సా ధూసన్యాసులను, దర్గాలను, వలీలను, ప్రవక్తలను వీరు ఆరాధించేవారో వారు: "మాకు వీరితో ఎలాంటి సంబంధం లేదు, వీరి ఆరాధన గురించి మాకు ఏమీ తెలియదు" అంటారు. ఇంకా చూడండి,5:116-117,10:30,11:21,16:87 మరియు 28:75

కల్పించుకున్న (బూటకదైవాలన్నీ) వారిని వీడి పోతాయి[22].

**31.** వారిని అడుగు: "ఆకాశం నుండి మరియు భూమి నుండి, మీకు జీవనోపాధిని ఇచ్చేవాడు ఎవడు? వినేశక్తీ, చూసేశక్తీ ఎవడి ఆధీనంలో ఉన్నాయి? మరియు ప్రాణం లేని దాని నుండి ప్రాణమున్న దానిని మరియు ప్రాణమున్న దాని నుండి ప్రాణం లేని దానిని తీసేవాడు ఎవడు? మరియు ఈ విశ్వవ్యవస్థను నడుపుతున్నవాడు ఎవడు?" వారు:"అల్లాహ్!" అని తప్పకుండా అంటారు. అప్పుడను: "అయితే మీరు దైవభీతి కలిగి ఉండరా?"

**32.** ఆయనే అల్లాహ్! మీ నిజమైన ప్రభువు. అయితే సత్యం తరువాత, మార్గభ్రష్టత్వం తప్ప మిగిలేదేమిటి? అయితే మీరు ఎందుకు (సత్యం నుండి) తప్పించబడుతున్నారు?

**33.** ఈ విధంగా దుష్టులైన వారి విషయంలో వారెన్నడూ విశ్వసించరని, నీ ప్రభువు అన్న మాట నిజమయింది[23].

**34.** వారిని అడుగు: "మీరు అల్లాహ్ కు సాటిగా కల్పించుకున్న వారిలో సృష్టిని మొదటిసారి ఆరంభించేవాడు, తరువాత దానిని తిరిగి ఉనికిలోకి తెచ్చేవాడు ఎవడైనా ఉన్నాడా?" ఇలా

---

[22] అంటే వారికి అక్కడ అల్లాహ్ (సు.తా.) తప్ప వారి ఏ కల్పిత దైవం కూడా పనికి రాదు.

[23] చూడండి, 39:71.

అను: "సృష్టి ఆరంభించేవాడు, దానిని తిరిగి ఉనికిలోకి తెచ్చేవాడూ కేవలం అల్లాహ్ మాత్రమే! అయితే మీరు ఎందుకు మోసగింపబడుతున్నారు (సత్యం నుండి మరలింప బడుతున్నారు)?"

35. వారిని అడుగు: "మీరు అల్లాహ్ కు సాటి కల్పించుకున్న వారిలో సత్యం వైపునకు మార్గదర్శకత్వం చేసేవాడు, ఎవడైనా ఉన్నాడా?" ఇంకా ఇలా అను: "కేవలం అల్లాహ్ యే సత్యం వైపునకు మార్గదర్శకత్వం చేసేవాడు. ఏమీ? సత్యం వైపునకు మార్గదర్శకత్వం చేసేవాడు విధేయతకుఎక్కువఅర్హుడా? లేకమార్గదర్శకత్వం చేయబడితేనే తప్ప స్వయంగా సన్మార్గం పొందలేని వాడా? అయితే మీకేమయింది? మీరెలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారు?"

36. మరియు వారిలో చాలా మంది తమ ఊహలను మాత్రమే అనుసరించే వారున్నారు. నిశ్చయంగా ఊహ, సత్య (అవగాహనకు) ఏ మాత్రం పనికిరాదు[24]. నిశ్చయంగా, వారు చేసేదంతా అల్లాహ్ కు బాగా తెలుసు.

37. మరియు అల్లాహ్ తప్ప మరొకరి ద్వారా ఈ ఖుర్ఆన్ కల్పించబడటం సంభవం కాదు;

[24] చాలామంది ఊహలను, అంటే తమ కల్పనలను లేక భావనలను అనుసరించే వారున్నారు. కాని సత్యం ముందు ఊహలకు, భావనలకు, కల్పనలకు ఎలాంటి స్థానం లేదు. ఖుర్ఆన్ లో 'జన్న' అనే పదం ఊహ మరియు నిశ్చయం రెండూ అర్థాలలో వాడబడింది. ఈ సందర్భాలలో ఊహ లేక కల్పన అనే అర్థంలో వాడబడింది. (ము'హమ్మద్ జూనాగఢీ).

వాస్తవానికి ఇది (పూర్వగ్రంథాలలో) మిగిలి ఉన్న దానిని (సత్యాన్ని) ధృవపరుస్తోంది మరియు ఇది (ముఖ్య సూచనలను) వివరించే గ్రంథం; ఇది సమస్త లోకాల పోషకుని (అల్లాహ్) తరఫు నుండి వచ్చిందనటంలో ఎలాంటి సందేహం లేదు!

38. అయినా వారు: "అతనే (ముహమ్మదే) దీనిని కల్పించాడు." అని అంటున్నారా? వారితో అను: "మీరు సత్యవంతులే అయితే - అల్లాహ్ ను విడిచి మీరు పిలువ గలిగే వారినందరినీ (మీ సహాయానికి) పిలుచుకొని - దీని వంటి ఒక్క సూరహ్ నైనా (రచించి) తీసుకురండి!"[25]

39. కాని వారు-దాని జ్ఞానాన్ని ఇముడ్చుకొనక ముందే మరియు దాన వ్యాఖ్యానం వారి వద్దకు రాకముందే-దానిని అబద్ధమని తిరస్కరించారు. వీరికి పూర్వమున్న వారు కూడా ఈ విధంగా నే అబద్ధమని తిరస్కరించారు. కావున, చూశారా! ఆ దుర్మార్గుల ముగింపు ఎలా జరిగిందో!

40. మరియు వారిలో కొందరు దీనిని (ఈ ఖుర్ఆన్ ను) నమ్మేవారున్నారు మరికొందరు దీనిని నమ్మనివారున్నారు. మరియు దౌర్జన్యపరులు ఎవరో నీ ప్రభువుకు బాగా తెలుసు.

41. మరియు ఒకవేళ వారు నిన్ను అసత్యుడవని తిరస్కరిస్తే, వారితో అను: "నా కర్మలు నాకు మరియు మీ కర్మలు మీకు. నా కర్మలకు మీరు

[25] చూడండి, 2:23 వ్యాఖ్యానం 1; 11:13, 17:88 మరియు 52:34.

బాధ్యులు కారు మరియు మీ కర్మలకు నేను బాధ్యుడను కాను."

42. మరియు వారిలో కొందరు నీ మాటలను వింటూ ఉంటారు! ఏమీ? నీవు చెవిటి వారికి వినిపించగలవా? మరియు వారు ఏమీ అర్థం చేసుకోలేకపోయినప్పటికీ (వారికి వినిపించగలవా)?

43. మరియు వారిలో కొందరు నీ వైపునకు చూస్తూ ఉంటారు. ఏమీ? నీవు గ్రుడ్డివారికి సరైన మార్గం చూపించగలవా? మరియు వారికి ఏమీ కనిపించనప్పటికి కూడానా?

44. నిశ్చయంగా, అల్లాహ్ మానవులకు ఎలాంటి అన్యాయం చేయడు, కాని మానవులే తమకు తాము అన్యాయం చేసుకుంటారు.

45. మరియు ఆయన (అల్లాహ్) వారిని సమావేశపరచే రోజు, ఒక దినపు ఒక ఘడియ కంటే ఎక్కువ కాలం (ఇహలోకంలో) గడప లేదని వారు భావిస్తారు[26]. వారు ఒకరినొకరు గుర్తుపడ తారు[27]. వాస్తవానికి అల్లాహ్ ను దర్శించ వలసివున్న సత్యాన్ని నిరాకరించిన వారు, తీవ్రమైన నష్టానికి గురి అవుతారు మరియు వారు మార్గదర్శకత్వాన్ని పొందలేక పోయారు.

46. మరియు (ఓ ముహమ్మద్!) మేము వాస్తవానికి వారికి వాగ్దానం చేసిన (శిక్షలలో) కొన్నింటిని నీకు చూపినా, లేక (అంతకు ముందే) నిన్నూ

---

[26] చూడండి, 79:46.
[27] చూడండి, 23:101.

మరణింపజేసినా, వారు మా వైపుకే కదా మరలి రావలసి వున్నది. చివరకు వారి కర్మలన్నింటికీ అల్లాహ్ యే సాక్షి!

47. మరియు ప్రతి సమాజానికీ ఒక ప్రవక్త (పంపబడ్డాడు). ఎప్పుడైతే వారి ప్రవక్త వస్తాడో, అప్పుడు వారి మధ్య (వ్యవహారాల) తీర్పు న్యాయంగా చేయబడుతుంది. మరియు వారికెలాంటి అన్యాయం జరుగదు[28].

48. మరియు వారిలా అడుగుతున్నారు: "మీరు సత్యవంతులే అయితే ఈ వాగ్దానం ఎప్పుడు పూర్తి కానున్నది?"

49. (ఓ ముహమ్మద్!) వారితో ఇలా అను: "అల్లాహ్ కోరితే తప్ప! నా కొరకు నేను కీడుగానీ, మేలుగానీ చేసుకోగలిగే శక్తి నాకు లేదు[29]. ప్రతి సమాజానికి ఒక గడువు నియమింపబడి ఉంది. వారి గడువు వచ్చినపుడు వారు ఒక ఘడియ వెనకగానీ లేక ముందుగానీ కాలేరు[30]."

50. వారితో అను: "ఏమీ? మీరు ఆలోచించారా

---

[28] చూడండి, 6:131-132, 17:15.

[29] ఇక్కడ అల్లాహుతా'ఆలా దైవప్రవక్త ('స'అస)తో: "అల్లాహ్ కోరనిదే నాకు నేను, కీడు గానీ, మేలు గానీ, చేసుకోలేను." అని చెప్పమంటున్నాడు. దైవప్రవక్త ('స'అస) కే తన స్వంతానికి కీడుగానీ మేలుగానీ చేసుకునే శక్తి లేనప్పుడు, ఇతర వలీలకు గానీ లేక సద్పురుషులకు గానీ - జీవించి ఉన్నా లేక మరణించినా - ఇతరులకు కీడు గానీ మేలు గానీ చేయగల శక్తి ఎలా ఉండగలదు? వారిని అర్థించేవారు ఇది ఎందుకు అర్థం చేసుకోలేరు?

[30] చూడండి, 7:34.

(చూశారా)! ఒకవేళ ఆయన శిక్ష మీపై రాత్రి గానీ, లేక పగలు గానీ వచ్చి పడితే (మీరేం చేయగలరు)? అయితే దేని కొరకు ఈ అపరాధులు తొందర పెడుతున్నారు?"[31]

51. ఏమి? అది (ఆ శిక్ష) మీపై వచ్చిపడిన తరువాతనే మీరు దానిని నమ్ముతారా? (ఆ రోజు మీరిలా అడగబడతారు): "ఇప్పుడా (మీరు దానిని నమ్మేది)? వాస్తవానికి మీరు దాని కొరకు తొందరపడ్తూ ఉండేవారు కదా!"

52. అప్పుడు దుర్మార్గులతో ఇలా అనబడుతుంది: "మీరు శాశ్వతమైన శిక్షను అనుభవించండి! మీకు - మీరు చేస్తూ ఉండిన కర్మల ప్రతిఫలం తప్ప - వేరే (శిక్ష) విధించబడునా?"

53. మరియు (ఓ ముహమ్మద్!) వారు ఇంకా ఇలా అడుగుతున్నారు:"ఏమీ? ఇదంతా సత్యమేనా?[32] వారితో అను: "అవును, నా ప్రభువు సాక్షిగా! ఇదంతా నిశ్చయంగా, జరగబోయే సత్యమే! మరియు మీరు దాని నుండి తప్పించుకోలేరు!"

54. మరియు దుర్మార్గం చేసిన ప్రతి వ్యక్తి వద్ద ఒకవేళ వాస్తవానికి భూమిలో ఉన్న ధనమంతా ఉన్నా, దానిని అంతా పరిహారంగా ఇవ్వటానికి

---

[31] చూడండి, 6:57-58, 48:32.

[32] "మరణించి మట్టిగా మారిపోయిన తరువాత కూడా మళ్ళీ సజీవులుగా మునపటి ఆకారంలో లేప బడతామా?" ఇలాంటి ప్రశ్నలు ఖుర్ఆన్ లో ఇంకా రెండు చోట్లలో ఉన్నాయి. 34:3, 64:7.

సిద్ధపడతాడు[33], (కాని అది స్వీకరించబడదు). మరియు వారు ఆ శిక్షను చూసినప్పుడు లోలోపల పశ్చాత్తాప పడతారు. మరియు వారి మధ్య తీర్పు న్యాయంగా జరుగుతుంది. మరియు వారికెలాంటి అన్యాయం జరుగదు.

**55.** వినండి! నిశ్చయంగా, ఆకాశాలలోనూ మరియు భూమిలోనూ ఉన్న సమస్తమూ అల్లాహ్ కే చెందినది. తెలుసుకోండి! నిశ్చయంగా అల్లాహ్ వాగ్దానం సత్యం, కాని చాలామందికిది తెలియదు

**56.** ఆయనే జీవన్మరణాలను ఇచ్చేవాడు మరియు ఆయన వైపునకే మీరంతా మరలింప బడతారు[34]

**57.** ఓ మానవులారా! వాస్తవంగా మీ ప్రభువు తరఫు నుండి మీ వద్దకు హితోపదేశం (ఈ ఖుర్ఆన్) వచ్చింది మరియు ఇది మీ హృదయాల (రోగాల) కు స్వస్థత నిస్తుంది. మరియు విశ్వసించిన వారికి మార్గదర్శకత్వం మరియు కారుణ్యం (ప్రసాదిస్తుంది)[35].

**58.** ఇలా అను: "ఇది అల్లాహ్ అనుగ్రహం వల్ల మరియు ఆయన కారుణ్యం వల్ల, కావున దీనితో వారిని ఆనందించమను, ఇది వారు కూడబెట్టే దానికంటే ఎంతో మేలైనది."

**59.** ఇలా అను: "మీరు ఆలోచించారా! అల్లాహ్ మీ కొరకు అవతరింపజేసిన జీవనోపాధిలో నుండి

---

[33] చూడండి, 3:91 మరియు 5:36.
[34] చూడండి, 11:123.
[35] చూడండి, 17:82 మరియు 41:44.

మీరు స్వయంగానే కొన్నింటిని ధర్మసమ్మతం, మరికొన్నింటిని నిషేధం చేసు కున్నారు[36]." ఇలా అడుగు: "ఏమీ అల్లాహ్ దీనికి అనుమతినిచ్చాడా? లేదా మీ బూటక కల్పనలను అల్లాహ్ కు అంటగట్టు తున్నారా?"

**60.** మరియు అల్లాహ్ పై అబద్ధాలు కల్పించేవారు, తీర్పుదినమును గురించి ఏమను కుంటున్నారు? నిశ్చయంగా, అల్లాహ్ మానవుల యెడల అత్యంత అనుగ్రహం కలవాడు, కాని చాలామంది కృతజ్ఞతలు చూపరు.

**61.** మరియు (ఓ ప్రవక్తా!) నీవు ఏ కార్యంలో ఉన్నా మరియు ఖుర్ఆన్ నుండి నీవు దేనిని పఠిస్తూ ఉన్నా మరియు (ఓ మానవులారా!) మీరు ఏమి చేస్తూ ఉన్నా! మీరు మీ పనులలో నిమగ్నులై ఉన్నప్పుడు, మేము మిమ్మల్ని కనిపెట్టుకునే ఉంటాము. భూమ్యాకాశాలలో ఉన్నటు వంటి ఒక రవంత (పరమాణువంత) వస్తువైనా, దాని కంటే చిన్నదైనా లేదా పెద్దదైనా, నీ ప్రభువు దృష్టి నుండి మరుగుగా లేదు. అదంతా ఒక స్పష్టమైన గ్రంథంలో వ్రాయబడి ఉంది[37].

**62.** వినండి! నిశ్చయంగా, అల్లాహ్ కు ప్రియులైన

---

[36] చూడండి, 5:101-102.
[37] చూడండి, 6:59, 38, 11:6.

వారికి[38] ఎలాంటి భయమూ ఉండదు మరియు వారు దుఃఖపడరు కూడా!

63. ఎవరైతే విశ్వసించారో మరియు దైవభీతి కలిగి ఉంటారో!

64. వారికి ఇహలోక జీవితంలోనూ మరియు పరలోకంలోనూ శుభవార్త ఉంటుంది. అల్లాహ్ పలుకులలో ఎలాంటి మార్పు ఉండదు. ఇదే ఆ గొప్ప సాఫల్యం (విజయం).

65. మరియు (ఓ ముహమ్మద్!) వారి మాటలు నిన్ను దుఃఖింప జేయకూడదు. నిశ్చయంగా, శక్తి (గౌరవం)[39] అంతా అల్లాహ్ కే చెందుతుంది. ఆయనే సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

66. వినండి! నిశ్చయంగా, ఆకాశాలలో ఉన్నదంతా మరియు భూమిలో ఉన్నదంతా అల్లాహ్ కే చెందుతుంది. మరియు అల్లాహ్ ను కాదని ఆయనకు భాగస్వాములను కల్పించి వారిని ప్రార్థించేవారు, ఎవరిని అనుసరిస్తున్నారు? వారు అనుసరిస్తున్నది కేవలం తమ భ్రమలనే. మరియు వారు కేవలం ఊహాగానాలు మాత్రమే చేస్తున్నారు.

67. ఆయనే మీ కొరకు రాత్రిని విశ్రాంతి పొందటానికి

---

[38] అవ్ లియా', వలియ్యున్: (ఏక.వ.) ఈ పదానికి, సహాయకుడు, రక్షించేవాడు, పోషించేవాడు, బంధువు, సన్నిహితుడు, ప్రియుడు, యజమాని, స్వామి, కర్త, స్నేహితుడు మొదలైన అర్థాలున్నాయి. చూడండి, 2:257 మరియు 3:68.

[39] 'ఇజ్జ'తున్: అనే పదానికి శక్తి, గౌరవం, ఆదరం అనే అర్థాలున్నాయి.

మరియు పగటిని (సంపాదించటానికి) ప్రకాశవంతంగా చేశాడు. నిశ్చయంగా శ్రద్ధగా వినేవారికి ఇందులో సూచనలున్నాయి.

**68.** "అల్లాహ్ (ఒకడ్ని) కొడుకుగా చేసుకున్నాడు[40]." అని వారు (యూదులు మరియు క్రైస్తవులు) అంటారు. ఆయన సర్వలోపాలకు అతీతుడు. ఆయన స్వయం సమృద్ధుడు. ఆకాశాలలోను మరియు భూమిలోనూ ఉన్నదంతా ఆయనకే చెందుతుంది! ఇలా అనటానికి మీ దగ్గర ఏదైనా నిదర్శనం ఉందా? ఏమీ? అల్లాహ్ ను గురించి మీకు తెలియని మాటలు అంటారా?

**69.** 69.ఇలా అను:"నిశ్చయంగా, అల్లాహ్ కు అబద్ధం అంటగట్టేవారు ఎన్నటికీ సాఫల్యం పొందరు"

**70.** ఇహలోకంలో వారు కొంతకాలం సుఖాలు అనుభవించవచ్చు! కాని తరువాత మా వైపునకే, వారికి మరలి రావలసి ఉంది. అప్పుడు మేము వారి సత్యతిరస్కారానికి ఫలితంగా, వారికి కఠినశిక్షను రుచి చూపుతాము.

---

[40] యూదులు అంటారు: " 'ఉ'జైర్ ('అ.స.) అల్లాహ్ కొడుకు." అని. క్రైస్తవులు అంటారు : "ఏసుక్రీస్తు అల్లాహ్ కొడుకు." అని, కుమారుడు ఉండాలని, వారే కోరుతారు, ఎవరైతే తమ మరణం తరువాత తమ ఆస్తిపాస్తులకు వారసుడు ఉండాలని కోరుతారో! అల్లాహ్ (సు.తా.) నిత్యుడు, సజీవుడు, అంతా నశించిన తరువాత కూడా మిగిలి ఉండేవాడు. విశ్వంలో ఉన్న సమస్తమూ ఆయనకే చెందినది. ఆయనే సర్వానికి వారసుడు. అలాంటప్పుడు, ఆయనకు కొడుకు అవసరం ఎందుకుంటుంది. చూడండి, 2:116, 19:90-92 మరియు 6:100.

71. మరియు వారికి నూహ్ గాథను వినిపించు[41]. అతను తన జాతివారితో ఇలా అన్నప్పుడు: "నా జాతి సోదరులారా! నేను మీతో ఉండటం మరియు అల్లాహ్ సూచన (ఆయాత్) లను బోధించటం, మీకు బాధాకరమైనదిగా ఉంటే! నేను మాత్రం అల్లాహ్ నే నమ్ముకున్నాను. మీరూ మరియు మీరు అల్లాహ్ కు సాటి కల్పించినవారూ, అందరూ కలిసి ఒక (పన్నాగపు) నిర్ణయం తీసుకోండి, తరువాత మీ నిర్ణయంలో మీకెలాంటి సందేహం లేకుండా చూసుకోండి. ఆ పిదప ఆ పన్నాగాన్ని నాకు వ్యతిరేకంగా ప్రయోగించండి; నాకు ఏ మాత్రం వ్యవధి నివ్వకండి.

72. "కాని, ఒకవేళ మీరు వెనుదిరిగితే, నేను మాత్రం మీ నుండి ఎలాంటి ప్రతిఫలాన్ని అడగటం లేదు! నా ప్రతిఫలం కేవలం అల్లాహ్ దగ్గర ఉంది. మరియు
నేను కేవలం అల్లాహ్ కే విధేయుడను (ముస్లిం) అయి ఉండాలని ఆజ్ఞాపించబడ్డాను[42]."

73. కాని, వారు అబద్ధీకుడని తిరస్కరించారు. కావున మేము అతనిని మరియు అతనితో పాటు ఓడలో

---

[41] నూ'హ్ ('అ.స.) వివరాలకు చూడండి, 11:36-48 మరియు 7:59-64.

[42] నూ'హ్ ('అ.స.) యొక్క ఈ మాటల నుండి తెలిసేదేమిటంటే ప్రవక్తలందరూ, ఇస్లాం - అంటే, ఏకైక ఆరాధ్యుడు అల్లాహ్ (సు.తా.) కే విధేయులై ఉండాలని - బోధించారు. చూడండి, 27:91, 2:131-132, 12:101, 10:84, 7:126, 27:44, 5:111 మరియు 6:162-163.

ఉన్న వారిని రక్షించి, వారిని భూమికి వారసులుగా చేశాము. మరియు మా సూచనలను అబద్ధాలని తిరస్కరించిన వారిని ముంచి వేశాము. కావున చూడండి, హెచ్చరిక చేయబడినా (విశ్వసించని) వారి గతి ఏమయిందో!

74. అతని (నూహ్) తరువాత ప్రవక్తలను వారి వారి జాతులవారి వద్దకు పంపాము. వారు, వారివద్దకు స్పష్టమైన నిదర్శనాలు తీసుకొని వచ్చినా! వారు మొదట అబద్ధమని తిరస్కరించిన విషయాన్ని మళ్ళీ విశ్వసించ లేక పోయారు. ఈ విధంగా మేము హద్దులు మీరి ప్రవర్తించే వారి హృదయాల మీద ముద్ర వేస్తాము.

75. ఇక వారి తరువాత, మూసా మరియు హారూన్ లను మా సూచనలతో ఫిర్ఔన్ మరియు అతని నాయకుల వద్దకు పంపితే వారు దురహంకారం చూపారు. వారు అపరాధులైన జనులు

76. కావున మా వద్ద నుండి సత్యం వారి ముందుకు వచ్చినపుడు వారు: "నిశ్చయంగా, ఇది స్పష్టమైన మంత్రజాలమే!" అని అన్నారు.

77. మూసా అన్నాడు: "ఏమీ? సత్యం మీ ముందుకు వచ్చిన తరువాత కూడా ఇలా అంటారా? ఏమీ? ఇది మంత్రజాలమా? మరియు మాంత్రికులు ఎన్నడూ సాఫల్యం పొందరు కదా!"

78. వారన్నారు: "మా తండ్రితాతలు నడిచిన మార్గం నుండి మమ్మల్ని మళ్ళించాలని మరియు మీ ఇద్దరి పెద్దరికాన్ని భూమిలో స్థాపించాలనా,

మీరిద్దరూ వచ్చింది? మరియు మేము మీ ఇద్దరినీ ఏ మాత్రం విశ్వసించము!"

**79.** మరియు ఫిర్ఔన్ (తన వారితో) అన్నాడు: "నేర్పుగల ప్రతి మాంత్రికుణ్ణి నా వద్దకు తీసుకు రండి!"

**80.** మాంత్రికులు వచ్చిన తరువాత మూసా వారితో: "మీరు విసర దలచుకున్న వాటిని విసరండి!" అని అన్నాడు.

**81.** వారు విసరగానే మూసా: "మీరు విసిరింది మంత్రజాలం. నిశ్చయంగా, అల్లాహ్ దానిని భంగ పరుస్తాడు[43]. నిశ్చయంగా అల్లాహ్ దౌర్జన్యపరుల కార్యాలను చక్కబడనివ్వడు.

**82.** మరియు అల్లాహ్ తన ఆజ్ఞతో సత్యాన్ని సత్యంగా నిరూపిస్తాడు[44], అది అపరాధులకు ఎంత అసహ్యకరమైనా సరే!"

**83.** కాని ఫిర్ఔన్ మరియు అతని నాయకులు తమను హింసిస్తారేమో అనే భయంతో! అతని జాతివారిలోని కొందరు ప్రజలు తప్ప ఇతరులు మూసాను విశ్వసించలేదు[45]. మరియు వాస్తవానికి, ఫిర్ఔన్ దేశంలో ప్రాబల్యం వహించి ఉండేవాడు. మరియు నిశ్చయంగా, అతడు మితిమీరి ప్రవర్తించేవారిలో ఒకడుగా ఉండేవాడు.

**84.** మరియు మూసా అన్నాడు: "నా జాతి ప్రజలారా!

---

[43] చూడండి, 7:116 మరియు 20:66.
[44] చూడండి, 8:7 మరియు 42:24.
[45] చూడండి, 7:120-126.

మీకు నిజంగానే అల్లాహ్ మీద విశ్వాసం ఉంటే మరియు మీరు నిజంగానే అల్లాహ్ కు విధేయులు (ముస్లింలు) అయితే, మీరు ఆయన (అల్లాహ్) పైననే నమ్మకం ఉంచుకోండి[46]."

**85.** అప్పుడు వారిలా జవాబిచ్చారు: "మేము అల్లాహ్ నే నమ్ముకున్నాము. ఓ మా ప్రభూ! మమ్మల్ని దుర్మార్గులకు పరీక్షా సాధనంగా చేయకు;

**86.** "మరియు నీ కారుణ్యంతో మమ్మల్ని సత్యతిరస్కార ప్రజల నుండి కాపాడు."

**87.** మరియు మేము మూసాకు మరియు అతని సోదరునికి ఇలా దివ్యజ్ఞానం (వహీ) పంపాము: "మీరు, మీ జాతివారి కొరకు ఈజిప్టులో గృహాలను సమకూర్చుకోండి. మరియు మీ గృహాలను, ప్రార్థనా స్థలాలుగా చేసుకొని నమాజ్ లను స్థాపించండి[47]. మరియు విశ్వాసులకు శుభవార్తలు ఇవ్వు."

**88.** మూసా ఇలా ప్రార్థించాడు: "ఓ మా ప్రభూ! నిశ్చయంగా, నీవు ఫిర్'ఔన్ కు మరియు అతని నాయకులకు ఇహలోక జీవితంలో వైభవం మరియు సంపదలను ప్రసాదించావు. ఓ మా ప్రభూ! వారిని (ప్రజలను) నీ మార్గం నుండి తప్పించటానికా ఇవి? ఓ మా ప్రభూ! వారి

---

[46] చూడండి, 7:128-129.

[47] దీని అర్థం ఏమిటంటే ఫిర్'ఔన్ జాతివారి దౌర్జన్యాల నుండి తప్పించుకోవటానికి వారితో: "మీరు మీ ఇండ్లలోనే ప్రార్థనాస్థలాలు ఏర్పాటు చేసుకొని, బైతుల్ మఖ్దిస్ వైపునకు మరలి ప్రార్థనలు చేయండి." అని ఆదేశమివ్వబడింది.

సంపదలను ధ్వంసం చేయి, వారి హృదయాలపై
కఠినావస్థను కలుగజేయి, ఎందుకంటే వారు
కఠిన శిక్షను చూసేంతవరకు విశ్వసించరు[48]!"
89. (అల్లాహ్) సెలవిచ్చాడు: "మీ ఉభయుల ప్రార్థన
అంగీకరించబడింది. మీరిద్దరూ (ఋజుమార్గంపై)
స్థిరంగా ఉండండి. మీరిద్దరూ తెలివి లేని వారి
మార్గాన్ని అనుసరించకండి."
90. మరియు మేము ఇస్రాయీల్ సంతతి వారిని
సముద్రం దాటించాము. ఆ పిదప ఫిర్ఔన్ మరియు
అతని సైనికులు దౌర్జన్యంతో మరియు శత్రుత్వంతో
వారిని వెంబడించారు. చివరకు (ఫిర్ఔన్)
మునిగిపోతూ అన్నాడు[49]: "నిశ్చయంగా,
ఇస్రాయీల్ సంతతివారు విశ్వసించిన దేవుడు తప్ప
మరొక దేవుడు లేడని నేను విశ్వసించాను. నేను
విధేయులలో (ముస్లింలలో) చేరాను!"
91. (అతనికి ఇలా జవాబివ్వబడింది): "ఇప్పుడా[50],
(నీవు విశ్వసించేది? మరియు వాస్తవానికి నీవు,
ఇంత వరకు ఆజ్ఞోల్లంఘన చేస్తూ ఉన్నావు

[48] నూ'హ్ ('అ.స.) 950 సంవత్సరాల వరకు ధర్మ ప్రచారం చేసినా కూడా అతని జాతివారు, ఇస్లాం వైపుకు రాలేదు, వారు అతని ఆహ్వానాన్ని తిరస్కరించారు. ఆ తరువాత అతను సహించలేక చేసిన శాపాన్ని గురించి చూడండి, 71:26. అదేవిధంగా మూసా ('అ.స.) కూడా సహించుకోలేక వారి మీదకు ఆపదలను పంపమని అల్లాహ్ (సు.తా.) ను ప్రార్థించారు.

[49] ఖుర్ఆన్ లో పేర్కొనబడిన కథలు గుణపాఠం నేర్చుకోవటానికే ఉన్నాయి. కానీ కథలు చెప్పాలనే ఉద్దేశ్యంతో కాదు. చూడండి ఖుర్ఆన్, 2:50 మరియు సూరహ్ అష్-షు'అరా.

[50] చూడండి, 4:18.

మరియు దౌర్జన్యపరులలో చేరి ఉన్నావు కదా!

92. "ఇక నీ తరువాత వచ్చేవారికి ఒక సూచనగా ఉండటానికి ఈనాడు నీ శవాన్ని కాపాడ తాము." మరియు నిశ్చయంగా, చాలా మంది ప్రజలు మా సూచనల పట్ల నిర్లక్ష్యులై ఉన్నారు.

93. మరియు వాస్తవానికి మేము ఇస్రాయీల్ సంతతి వారికి ఉండటానికి మంచి స్థానాన్ని ఇచ్చి, వారికి ఉత్తమ జీవనోపాధిని ప్రసాదించాము. మరియు వారి వద్దకు దివ్యజ్ఞానం వచ్చినంత వరకు వారి మధ్య భేదాభిప్రాయాలు రాలేదు. నిశ్చయంగా, నీ ప్రభువు పునరుత్థాన దినమున వారి మధ్య ఉన్న భేదాభిప్రాయాలను గురించి తీర్పు చేస్తాడు.

94. (ఓ ముహమ్మద్) ఒకవేళ నీ వైపునకు అవతరింప జేయబడిన విషయాలను గురించి నీకేమైనా సందేహముంటే నీకు పూర్వం వచ్చిన గ్రంథాన్ని చదువు తున్న వారిని అడుగు! వాస్తవంగా, నీ ప్రభువు తరఫు నుండి నీ వద్దకు సత్యం వచ్చింది. కావున నీవు సందేహించే వారిలో చేరకు;

95. మరియు అల్లాహ్ సూచనలను అబద్ధాలని నిరాకరించిన వారిలో చేరకు. అలా చేస్తే నీవు కూడా తప్పక నష్టం పొందే వారిలో చేరి పోతావు.

96. నిశ్చయంగా, ఎవరి విషయంలోనైతే నీ ప్రభువు వాక్కు సత్యమని నిరూపించబడిందో, వారు ఎన్నటికీ విశ్వసించరు.

97. మరియు ఒకవేళ వారి వద్దకు ఏ విధమైన అద్భుత సూచన వచ్చినా! వారు బాధాకరమైన శిక్షను

చూడనంత వరకు (విశ్వసించరు)[51].

**98.** యూనుస్ జాతివారు తప్ప! ఇతర ఏ పురవాసులకు కూడా, (శిక్షను చూసిన తరువాత) విశ్వసించగా, వారి విశ్వాసం వారికి లాభదాయకం కాలేక పోయింది! (యూనుస్ జాతి) వారు విశ్వసించిన పిదప మేము వారి నుండి ఇహలోక జీవితపు అవమానకరమైన శిక్షను తొలగించాము. మరియు వారిని కొంతకాలం వరకు వారికి (ఇహలోక జీవితాన్ని) అనుభవించే అవకాశాన్ని ఇచ్చాము[52].

**99.** మరియు నీ ప్రభువు కోరితే, భూమిలో ఉన్న వారందరూ విశ్వసించేవారు. ఏమీ? నీవు మానవులందరినీ విశ్వాసులయ్యే వరకు, వారిని బలవంతం చేస్తూ ఉంటావా?

**100.** మరియు ఏ వ్యక్తి అయినా సరే అల్లాహ్ అనుమతి లేనిదే విశ్వసించ జాలడు. జ్ఞానాన్ని ఉపయోగించని వారిపై ఆయన (అవిశ్వాసపు) మాలిన్యాన్ని

---

[51] మా శిక్ష చూసిన తరువాత విశ్వసిస్తే అది వారికి లాభదాయకం కాజాలదు. చూడండి, 40:85.

[52] యూనుస్ ('అ.స.) 'సైనవా' (Nineveh) వాసులకు ధర్మప్రచారం చేశారు. కాని వారతనిని తిరస్కరించారు. దానికి అతను కోపపడి ఉద్రేకంతో వారిని శపించి వెళ్ళిపోయారు. వారి పైకి శిక్ష రావడం చూసి ప్రజలందరూ ఒక మైదానంలో చేరుకొని అల్లాహ్ (సు.తా.) ను మన్నించమని ప్రార్థించారు. వారి క్షమాపణను అంగీకరించి అల్లాహ్ (సు.తా.) వారి శిక్షను తొలగించాడు. ఆ తరువాత వారు అల్లాహ్ (సు.తా.)కు విధేయు(ముస్లిం)లయ్యారు. ఈ విధంగా శిక్షను చూసిన తరువాత క్షమాపణ అంగీకరించబడిన వారు కేవలం యూనుస్ ('అ.స.) జాతి ప్రజలు మాత్రమే. ఇంకా చూడండి, 21:87-88, 37:139-148, (ఫ'త్హ అల్ -'ఖదీర్).

రుద్దుతాడు.

101. ఇలా అను: "ఆకాశాలలోనూ మరియు భూమిలోనూ, ఏమేమున్నాయో చూడండి!" మరియు విశ్వసించని ప్రజలకు సూచనలు గానీ, హెచ్చరికలు గానీ ఏవిధంగానూ పనికి రావు!

102. ఇప్పుడు వారు, తమకు పూర్వం గతించిన వారికి సంభవించిన దినాల కోసం తప్ప మరి దేని కోసం నిరీక్షిస్తున్నారు? వారితో అను: "మీరూ నిరీక్షించండి! నిశ్చయంగా, నేను కూడా మీతో పాటే నిరీక్షిస్తాను!"

103. తరువాత (చివరకు) మేము మా ప్రవక్తలను మరియు విశ్వసించిన వారిని కాపాడుతూ ఉంటాము. ఈ విధంగా విశ్వాసులను కాపాడటం మా విధి.

104. (ఓ ప్రవక్తా!) ఇలా అను: "ఓ మానవులారా! నా ధర్మాన్ని గురించి మీకు ఎలాంటి సందేహం ఉన్నా అల్లాహ్ ను వదలి మీరు ఆరాధించే వారిని నేనెన్నడూ ఆరాధించను. అంతేకాదు, నేను అల్లాహ్ నే ఆరాధిస్తాను. ఆయనే మిమ్మల్ని మరణింపజేస్తాడు. మరియు నేను విశ్వాసులలో ఒకడిగా ఉండాలని ఆదేశించబడ్డాను."

105. (నేను ఇలా ఆజ్ఞాపించబడ్డాను): "నీవు మాత్రం సత్యధర్మమైన ఏకదైవ సిద్ధాంతాన్నే అనుసరించు. మరియు ఎన్నటికీ అల్లాహ్ కు సాటి కల్పించే వారిలో (షిర్క్ చేసేవారిలో) చేరకు.

106. మరియు అల్లాహ్ ను వదలి నీకు లాభంగానీ మరియు నష్టంగానీ కలిగించలేని దానిని నీవు ప్రార్థించకు. ఒకవేళ నీవు అలా చేస్తే! నిశ్చయంగా, నీవు దుర్మార్గులలో చేరిన వాడవుతాడు."

107. ఒకవేళ అల్లాహ్ నీకు ఏదైనా ఆపద కలిగించదలిస్తే ఆయన తప్ప మరెవ్వరూ దానిని తొలగించలేరు. మరియు ఆయన నీకు మేలు చేయదలిస్తే, ఆయన అనుగ్రహాన్ని ఎవ్వడూ మళ్ళించలేడు. ఆయన తన దాసులలో తాను కోరిన వారికి తన అనుగ్రహాన్ని ప్రసాదిస్తాడు. మరియు ఆయనే క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

108. (ఓ ప్రవక్తా!) ఇలా అను: "ఓ మానవులారా! వాస్తవంగా, మీ ప్రభువు తరఫు నుండి మీ వద్దకు సత్యం వచ్చి ఉన్నది. ఇక ఎవడు సన్మార్గాన్ని అనుసరిస్తాడో! నిశ్చయంగా, అతడు తన మేలుకే సన్మార్గాన్ని అనుసరిస్తాడు. ఇక ఎవడు మార్గభ్రష్టుడవుతాడో నిశ్చయంగా, తనకే నష్టం కలిగించు కుంటాడు. నేను మీ బాధ్యత వహించేవాడను కాను!"

109. మరియు (ఓ ప్రవక్తా!) నీపై అవతరింప జేయబడిన సందేశాన్ని (వహీని) అనుసరించు. మరియు అల్లాహ్ తీర్పు చేసే వరకు నీవు ఓర్పు వహించు. మరియు న్యాయాధిపతులలో ఆయనే అత్యుత్తముడు.

# 11. హూద్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. అలిఫ్ - లామ్ - రా[1]. (ఇది) ఒక దివ్యగ్రంథం. దీని సూక్తులు (ఆయాత్) నిర్దుష్టమైనవి మరియు మహా వివేచనాపరుడు, సర్వం తెలిసినవాడు అయిన (అల్లాహ్) తరఫు నుండి వివరించబడ్డాయి;
2. మీరు అల్లాహ్ ను తప్ప ఇతరులను ఆరాధించ కూడదని (ఓ ముహమ్మద్) ఇలా అను: "నిశ్చయంగా నేను, ఆయన (అల్లాహ్) తరఫు నుండి మీకు హెచ్చరిక చేసేవాడిని మరియు శుభవార్తలు ఇచ్చేవాడిని మాత్రమే!
3. మరియు మీరు మీ ప్రభువును క్షమాభిక్ష వేడుకుంటే, తరువాత ఆయన వైపుకు పశ్చాత్తాపంతో మరలితే, ఆయన మీకు నిర్ణయించిన గడువు వరకు మంచి సుఖసంతోషాలను ప్రసాదిస్తాడు. మరియు అనుగ్రహాలకు అర్హుడైన ప్రతి ఒక్కనికీ ఆయన తన అనుగ్రహాలను ప్రసాదిస్తాడు కానీ, మీరు వెనుదిరిగితే! నిశ్చయంగా, ఆ గొప్ప దినమున మీపై రాబోయే శిక్షకు నేను భయపడుతున్నాను!
4. అల్లాహ్ వైపునకే మీ మరలింపు ఉంది. మరియు

---

[*] [హూద్ – ప్రవక్త హూద్ అలైహిస్సలాము]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

ఆయన ప్రతిదీ చేయగల సమర్థుడు."
5. వినండి! వాస్తవానికి వారు ఆయన నుండి దాక్కోవటానికి తమ వక్షాలను త్రిప్పు కుంటున్నారు. జాగ్రత్త! వారు తమ వస్త్రాలలో తమను తాము కప్పుకున్నప్పటికీ, ఆయన (అల్లాహ్) కు వారు దాచే విషయాలు మరియు వెలిబుచ్చే విషయాలూ అన్నీ బాగా తెలుసు. నిశ్చయంగా, ఆయనకు హృదయాలలో ఉన్నవి (రహస్యాలు) కూడా బాగా తెలుసు[2].
6. మరియు భూమిపై సంచరించే ప్రతి ప్రాణి జీవనోపాధి (బాధ్యత) అల్లాహ్ పైననే ఉంది. ఆయనకు దాని నివాసం, నివాసకాలం మరియు దాని అంతిమ నివాసస్థలమూ తెలుసు[3]. అంతా ఒక స్పష్టమైన గ్రంథంలో (వ్రాయబడి) ఉంది.
7. మరియు ఆయనే ఆకాశాలను మరియు భూమిని ఆరు దినములలో (అయ్యామ్ లలో) సృష్టించాడు. మరియు ఆయన సింహాసనం (అర్ష్) నీటి మీద ఉండెను. మీలో మంచిపనులు చేసేవాడు ఎవడో పరీక్షించటానికి (ఆయన ఇదంతా సృష్టించాడు). నీవు వారితో: "నిశ్చయంగా, మీరు మరణించిన తరువాత మరల లేపబడతారు." అని అన్నప్పుడు, సత్యతిరస్కారులు తప్పక అంటారు: "ఇది ఒక స్పష్టమైన మాయాజాలం మాత్రమే."
8. మరియు ఒకవేళ మేము వారి శిక్షను ఒక నిర్ణీత

---

[2] చూడండి, 8:55.
[3] చూడండి, 6:98.

కాలం[4] వరకు ఆపి ఉంచితే, వారు తప్పకుండా అంటారు: "దానిని ఆపుతున్నది ఏమిటీ?" వాస్తవానికి అది వచ్చిన రోజు, దానిని వారి నుండి తొలగించగల వారెవ్వరూ ఉండరు. మరియు వారు ఎగతాళి చేస్తూ ఉన్నదే, వారిని క్రమ్ముకుంటుంది.

9. మరియు ఒకవేళ మేము మానవునికి మా కారుణ్యాన్ని రుచి చూపించి, తరువాత అతని నుండి దానిని లాక్కుంటే! నిశ్చయంగా, అతడు నిరాశ చెంది, కృతఘ్నుడవుతాడు.

10. కాని ఒకవేళ మేము అతనికి ఆపద తరువాత, అనుగ్రహాన్ని రుచి చూపిస్తే: "నా ఆపదలన్నీ నా నుండి తొలగిపోయాయి!" అని అంటాడు. నిశ్చయంగా అతడు ఆనందంతో, విర్ర వీగుతాడు.

11. కాని ఎవరైతే సహనం వహించి, సత్కార్యాలు చేస్తూ ఉంటారో, అలాంటి వారికి క్షమాపణ మరియు గొప్ప ప్రతిఫలం ఉంటాయి[5].

12. (ఓ ప్రవక్తా!) బహుశా నీవు, నీ పై అవతరింపజేయబడిన దివ్యజ్ఞానం (వహీ) లోని

---

[4] ఉమ్మతున్: ఇక్కడ కాలం, అనే అర్థంలో వాడబడింది. (ఫ'త్హ్ అల్ 'ఖదీర్). ఏ విధంగానైతే 12:45లో వాడబడిందో. 16:120లో ఈ పదం ఇమామ్, నాయకుడనే అర్థంలో మరియు 43:23లో ధర్మం అనే అర్థంలో మరియు 28:23, 7:159, 10:47లలో సమాజం, సంఘం, తెగ అనే అర్థాలలో వాడబడింది(ఇబ్నె-కసీ'ర్).

[5] చూడండి, 70:19-22 మరియు ముస్నద్ అ'హ్మద్, పు-3, పే. 4.

కొంత భాగాన్ని విడిచి పెట్టనున్నావేమో! మరియు దానితో నీ హృదయానికి ఇబ్బంది కలుగు తుందేమో! ఎందుకంటే, (సత్యతిరస్కారులు): "ఇ తనిపై ఒక నిధి ఎందుకు దింపబడలేదు? లేదా ఇతనితో బాటు ఒక దేవదూత ఎందుకు రాలేదు?" అని అంటున్నారని. నిశ్చయంగా, నీవైతే కేవలం హెచ్చరిక చేసే వాడవు మాత్రమే. మరియు అల్లాహ్ యే ప్రతిదాని కార్యసాధకుడు[6].

13. లేదా వారు: "అతనే(ప్రవక్తయే) దీనిని (ఈ ఖుర్ఆన్ ను) కల్పించాడు." అని అంటున్నారా? వారితో అను: "మీరు సత్యవంతులే అయితే - అల్లాహ్ తప్ప, మీరు పిలుచు కోగల వారినందరినీ పిలుచుకొని - దీని వంటి పది సూరహ్ లను కల్పించి తీసుకురండి!"[7]

14. ఒకవేళ (మీరు సాటి కల్పించిన) వారు మీకు సహాయం చేయలేక పోతే (సమాధాన మివ్వకపోతే) నిశ్చయంగా ఇది అల్లాహ్ జ్ఞానంతోనే అవతరింప జేయబడిందని తెలుసుకోండి. మరియు ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. అయితే ఇప్పుడైనా

---

[6] చూడండి, 25:8, 6:8, 17:90-93, 6:50.

[7] చూడండి, 17:88, 52:34లలో: మీరు సత్యవంతులే అయితే ఈ ఖుర్ఆన్ వంటి ఒక గ్రంథం రచించి తీసుకురండి, అని; ఇక్కడ దీని వంటి పది సూరహ్ లనైనా అని, మరియు 2:23, 10:38 లలో ఒక్క సూరహ్ నైనా రచించి తీసుకురండి అని సవాల్ చేయబడింది, కానీ ఈ రోజు వరకు, ఖుర్ఆన్ విరోధులు, ఆ ఛాలెంజును పూర్తి చేయలేకపోయారు.

మీరు అల్లాహ్ కు విధేయులు (ముస్లింలు) అవుతారా?

15. ఎవరు ప్రాపంచిక జీవిత సౌకర్యాలు మరియు దాని అలంకరణ కోరుకుంటారో మేము వారి కర్మల ఫలితాన్ని, ఈ జీవితంలోనే పూర్తిగా చెల్లిస్తాము. మరియు అందులో వారి కెలాంటి లోపం జరుగదు.

16. అలాంటి వారికి పరలోకంలో నరకాగ్ని తప్ప మరేమీ ఉండదు. వారు ఇందులో (ఈ లోకంలో) పాటు పడినదంతా వ్యర్థమయి పోతుంది మరియు వారు చేసిన కర్మలన్నీ విఫలమవుతాయి[8].

17. ఏ వ్యక్తి అయితే తన ప్రభువు తరఫు నుండి వచ్చిన స్పష్టమైన నిదర్శనం పై ఉన్నాడో! మరియు దానికి తోడుగా ఆయన (అల్లాహ్) సాక్ష్యం ఉందో![9] మరియు దీనికి ముందు మార్గదర్శిని మరియు కారుణ్యంగా వచ్చిన, మూసా గ్రంథం కూడా సాక్షిగా ఉందో! (అలాంటి వాడు సత్యతిరస్కారులతో సమానుడా?) అలాంటి వారు దీనిని (ఖుర్ఆన్ ను) విశ్వసిస్తారు. మరియు దీనిని (ఖుర్ఆన్ ను) తిరస్కరించే

[8] చూడండి, 17:18, 21, 42:20.
[9] ఇక్కడ సాక్షి అంటే జిబ్రీల్ ('అ.స.)!

తెగలవారి[10] వాగ్దాన స్థలం నరకాగ్నియే! కావున దీనిని గురించి నీవు ఎలాంటి సందేహంలో పడకు. నిశ్చయంగా, ఇది నీ ప్రభువు తరఫు నుండి వచ్చిన సత్యం. కాని చాలా మంది ప్రజలు విశ్వసించరు[11].

**18.** మరియు అల్లాహ్ కు అబద్ధం అంటగట్టే వాడి కంటే ఎక్కువ దుర్మార్గుడు ఎవడు? అలాంటి వారు తమ ప్రభువు ముందు ప్రవేశ పెట్టబడతారు. అప్పుడు: "వీరే, తమ ప్రభువుకు అబద్ధాన్ని అంటగట్టిన వారు." అని సాక్షులు పలుకుతారు. నిస్సందేహంగా, అల్లాహ్ శాపం (బహిష్కారం) దుర్మార్గులపై ఉంటుంది[12].

**19.** ఎవరు అల్లాహ్ మార్గం నుండి (ప్రజలను) అడ్డగిస్తారో మరియు దానిని వక్రమైనదిగా చూపుతారో అలాంటి వారు, వారే! పరలోక జీవితం ఉన్నదనే సత్యాన్ని తిరస్కరించేవారు[13].

**20.** అలాంటి వారు భూమిలో (అల్లాహ్ శిక్ష నుండి)

---

[10] ఇక్కడ తెగలు అంటే అల్లాహుతా'ఆలాకు విధేయులు (ముస్లింలు) కాని జాతుల వారందరూ, దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: "ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ పరమ పవిత్రుని సాక్షి, ఈ సమాజపు ఏ మతస్థుడైనా సరే, అతడు యూదుడు గానీ, క్రైస్తవుడు గానీ, లేక ఇతర మతస్థుడు గానీ, నేను ప్రవక్తనని విన్న తరువాత నన్ను విశ్వసించడో! అతడు నరకాగ్నివాసి." ('స'హీ'హ్ ముస్లిం). ఇంకా చూడండి, 2:62, 4:150-152.

[11] చూడండి, 12:103, 34:20.

[12] చూడండి, 16:84.

[13] ఇదే విధమైన ఆయత్ కు చూడండి, 7:45.

తప్పించుకోలేరు. మరియు వారికి అల్లాహ్ తప్ప ఇతర సంరక్షకులు లేరు. వారి శిక్ష రెట్టింపు చేయబడుతుంది. (ఇహలోకంలో వారు సత్యాన్ని) విన లేక పోయేవారు మరియు చూడలేక పోయేవారు[14].

21. అలాంటి వారే తమను తాము నష్టానికి గురి చేసుకున్న వారు మరియు వారు కల్పించుకున్న (దైవాలన్నీ) వారిని వీడి పోతాయి[15].

22. నిస్సందేహంగా పరలోక జీవితంలో వీరే అత్యధికంగా నష్టపోయేవారు.

23. నిశ్చయంగా, విశ్వసించి సత్కార్యాలు చేసి తమ ప్రభువుకే అంకితమై పోయేటటువంటి వారే స్వర్గవాసులవుతారు. వారు దానిలోనే శాశ్వతంగా ఉంటారు.

24. ఈ ఉభయ పక్షాల వారిని, ఒక గ్రుడ్డి మరియు చెవిటి, మరొక చూడగల మరియు వినగల వారితో పోల్చవచ్చు! ఏమీ? పోలికలో వీరిరువురూ సమానులా? మీరు ఇకనైనా గుణపాఠం నేర్చుకోరా?[16]

25. మరియు వాస్తవానికి మేము నూహ్ ను అతని జాతి వారి వద్దకు పంపాము. (అతను వారితో అన్నాడు): "నిశ్చయంగా, నేను మీకు స్పష్టమైన

---

[14] చూడండి, 2:7, 7:179, 46:26, 67:10.

[15] చూడండి, 6:112, అంటే వారు కల్పించుకున్న బూటక దైవాలు, వారు ఆరాధించే పీర్లు, సన్యాసులు మొదలైనవారు.

[16] చూడండి, 59:20, 35:19-20.

హెచ్చరిక చేసేవాడిని మాత్రమే.

26. మీరు అల్లాహ్ ను తప్ప మరెవ్వరినీ ఆరాధించ కూడదని[17]. అలా చేస్తే ,నిశ్చయంగా ఆ బాధాకరమైన దినమున మీకు పడబోయే శిక్షకు నేను భయపడుతున్నాను."

27. అప్పుడు అతని జాతివారిలో సత్యతిరస్కారులైన నాయకులు: "నీవు కూడా మా మాదిరిగా ఒక సాధారణ మానవుడవే తప్ప, నీలో మరే ప్రత్యేకతను మేము చూడటం లేదు[18]. మరియు వివేకం లేని నీచమైన వారు తప్ప ఇతరులు నిన్ను అనుసరిస్తున్నట్లు కూడా మేము చూడటం లేదు[19]. మరియు మీలో మా కంటే ఎక్కువ ఘనత కూడా మాకు కనబడటం లేదు. అంతేగాక మీరు అసత్యవాదులని మేము భావిస్తున్నాము." అని అన్నారు.

28. అతను (నూహ్) అన్నాడు: "ఓ నా జాతి ప్రజలారా! మీరు చూస్తున్నారు కదా? నేను నా ప్రభువు తరఫు నుండి వచ్చిన స్పష్టమైన సూచనను (నిదర్శనాన్ని) అనుసరిస్తున్నాను. ఆయన తన కారుణ్యాన్ని నాపై ప్రసాదించాడు,

---

[17] చూడండి, 21:25.

[18] ఈ విషయం ఇంతకు ముందు కూడా విశదీకరించబడింది. సత్యతిరస్కారులకు మానవుడు దైవప్రవక్త గా పంపబడటం ఆశ్చర్యకరంగా ఉంది. ఈ రోజులలో కొందరు బిద్'అత్ చేసేవారికి కూడా ఈ విషయం ఆశ్చర్యకరంగా ఉంది, కావున వారు ము'హమ్మద్ ('స'అస) ను మానవునిగా అంగీకరించరు.

[19] చూడండి, 43:23.

కాని అది మీకు కనబడటం లేదు. అలాంటప్పుడు మీరు దానిని అసహ్యించుకుంటున్నా, దానిని స్వీకరించమని మేము మిమ్మల్ని బలవంతం చేయగలమా?[20]

**29.** "మరియు ఓ నా జాతి ప్రజలారా! నేను దాని కోసం మీ నుండి ధనాన్ని అడగటం లేదు. నా ప్రతిఫలం కేవలం అల్లాహ్ దగ్గరనే ఉంది. మరియు నేను విశ్వసించిన వారిని త్రోసి వేయలేను[21]. నిశ్చయంగా, వారైతే తమ ప్రభువును కలుసుకుంటారు, కాని నిశ్చయంగా నేను మిమ్మల్ని మూఢ జనులుగా చూస్తున్నాను.

**30.** "మరియు ఓ నాజాతి ప్రజలారా! ఒకవేళ నేను వారిని (విశ్వాసులను) గెంటి వేస్తే నన్ను అల్లాహ్ (శిక్ష) నుండి, ఎవడు కాపాడ గలడు? ఏమీ? మీరిది గ్రహించలేరా?

**31.** "మరియు నా వద్ద నిధులు ఉన్నాయని గానీ మరియు నాకు అగోచర జ్ఞానమున్నదని గానీ నేను మీతో అనటం లేదు; మరియు నేను దైవదూతనని కూడా అనటం లేదు[22] మరియు మీరు హీనంగా చూసే వారికి అల్లాహ్ మేలు చేయలేడని కూడా అనటం లేదు. వారి మనస్సులలో ఉన్నది అల్లాహ్ కు బాగా తెలుసు.

---

[20] చూడండి, 2:256.
[21] చూడండి, 26:111 మరియు 6:52.
[22] చూడండి, 6:50 మరియు 7:188.

అలా అయితే! నిశ్చయంగా, నేను దుర్మార్గులలో చేరిన వాడనే!"

32. వారు అన్నారు: "ఓ నూహ్! నీవు మాతో వాదించావు, చాలా వాదించావు[23], ఇక నీవు సత్యవంతుడవే అయితే నీవు భయపెట్టే దానిని (ఆ శిక్షను) మాపై దింపు!"

33. అతను (నూహ్) అన్నాడు: "అల్లాహ్ కోరితే నిశ్చయంగా, దానిని (ఆ శిక్షను) మీ పైకి తెస్తాడు మరియు మీరు దాని నుండి తప్పించుకోలేరు!

34. ఒకవేళ అల్లాహ్ మిమ్మల్ని తప్పు దారిలో విడిచి పెట్టాలని కోరితే, నేను మీకు మంచి సలహా ఇవ్వాలని ఎంత కోరినా, నా సలహా మీకు లాభదాయకం కాజాలదు. ఆయనే మీ ప్రభువు మరియు ఆయన వైపునకే మీరంతా మరలి పోవలసి ఉన్నది."

35. ఏమీ? వారు: "అతనే (ముహమ్మదే) దీనిని కల్పించాడు" అని అంటున్నారా? వారితో ఇలా అను: "నేను దీనిని కల్పిస్తే దాని పాపం నాపై ఉంటుంది మరియు మీరు చేసే పాపాలతో నాకు ఎలాంటి సంబంధం లేదు."

36. మరియు నూహ్ కు ఇలా సందేశం (వహీ) పంపబడింది: " నిశ్చయంగా, నీ జాతి వారిలో ఇంత వరకు విశ్వసించిన వారు తప్ప ఇతరులెవ్వరూ విశ్వసించరు, కావున వారు చేసే

---

[23] చూడండి, 71:5-6 మరియు 10:71.

కార్యాలకు నీవు చింతించకు!

37. మరియు నీవు మా సమక్షంలో, మా సందేశానుసారంగా, ఒక ఓడను నిర్మించు మరియు దుర్మార్గులను గురించి నన్ను అడుగకు. నిశ్చయంగా, వారు ముంచి వేయ బడతారు."

38. మరియు నూహ్ ఓడ నిర్మిస్తూ ఉన్నప్పుడు, ప్రతిసారి అతని జాతి నాయకులు అతని ఎదుట నుండి పోయేటప్పుడు అతనితో పరిహాసాలాడేవారు. అతను (నూహ్) వారితో అనే వాడు: "ఇప్పుడు మీరు మాతో పరిహాసాలాడుతున్నారు, నిశ్చయంగా, మీరు పరిహాసాలాడి నట్లే, మేము కూడా మీతో పరిహాసాలాడుతాము.

39. అవమానకరమైన శిక్ష ఎవరి పైకి వస్తుందో మరియు శాశ్వతమైన శిక్ష ఎవరిపై పడుతుందో త్వరలోనే మీరు తెలుసుకుంటారు."

40. చివరకు మా ఆజ్ఞ వచ్చింది మరియు పొయ్యి పొంగింది (జల ప్రవాహాలు భూమిని చీల్చుకొని రాసాగాయి)[24] . అప్పుడు మేము (నూహ్ తో) అన్నాము: "ప్రతి జాతి (పశువుల) నుండి రెండు (ఆడ మగ) జంటలను మరియు నీ కుటుంబం

---

[24] ఇది ఇబ్నె-కసీ'ర్ తాత్పర్యం. చూడండి, 54:11-12. నూ'హ తుపాన్ వచ్చినప్పుడే ఆఫ్రికా మరియు యూరోప్ ల మధ్య ఉన్న కొండలోయలో నీరు వచ్చి మెడిటరేనియన్ సముద్రం ఏర్పడి ఉండవచ్చని కొందరు వ్యాఖ్యాతల అభిప్రాయం. నూ'హ కుటుంబంవారిలో అతని ముగ్గురు కుమారులు సామ్, హామ్, మరియు యాఫస్ మరియు వారి భార్యలుండిరి.(ఇబ్నె-కసీ'ర్). వారి ప్రార్థనల కొరకు చూడండి, 23:28-29.

వారిని - ఇది వరకే సూచించబడిన వాడు తప్ప - మరియు విశ్వసించిన వారిని, అందరినీ దానిలోకి (నావలోకి) ఎక్కించుకో!" అతనిని విశ్వసించిన వారు కొందరు మాత్రమే.

41. మరియు (నూహ్) అన్నాడు: "ఇందులోకి ఎక్కండి, అల్లాహ్ పేరుతో దీని పయనం మరియు దీని ఆగటం. నిశ్చయంగా నా ప్రభువు క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత."

42. మరియు అది వారిని పర్వతాల వలే ఎత్తైన అలలలోనికి తీసుకొని పోసాగింది. అప్పుడు నూహ్ (పడవ నుండి) దూరంగా ఉన్న తన కుమారుణ్ణి పిలుస్తూ (అన్నాడు): "ఓ నా కుమారా! మాతో పాటు (ఓడలోకి) ఎక్కు అవిశ్వాసులలో కలిసిపోకు!"[25]

43. మరియు అతడు (కుమారుడు) అన్నాడు: "నేను ఒక కొండ పైకి ఎక్కి శరణు పొందుతాను, అది నన్ను నీళ్ల నుండి కాపాడుతుంది." (నూహ్) అన్నాడు: "ఈ రోజు అల్లాహ్ తీర్పుకు విరుద్ధంగా కాపాడేవాడు ఎవ్వడూ లేడు, ఆయన (అల్లాహ్) యే కరుణిస్తే తప్ప!" అప్పుడే వారి మధ్య ఒక కెరటం రాగా అతడు కూడా మునిగిపోయే వారిలో కలిసి పోయాడు.

---

[25] అతడు నూ'హ్ యొక్క నాలుగవ కుమారుడు. అతని పేరు యామ్ మరియు అతని ఇంటి (వంశం) పేరు కనాన్ గా పేర్కొనబడింది. అతడు సత్యతిరస్కారి కాబట్టి ఓడలో ఎక్కలేదు. కాని ముస్లిమైన అతని భార్య తన పిల్లలతో ఎక్కింది.

44. ఆ తరువాత ఆజ్ఞ వచ్చింది: "ఓ భూమీ! నీ నీళ్ళను మ్రింగివేయి. ఓ ఆకాశమా! (కురవటం) ఆపి వేయి!" అప్పుడు నీరు (భూమిలోకి) ఇంకి పోయింది. (అల్లాహ్) తీర్పు నెరవేరింది. ఓడ జూదీ కొండ మీద ఆగింది[26]. మరియు అప్పుడు: "దుర్మార్గుల జాతివారు దూరమై (నాశనమై) పోయారు!" అని అనబడింది.

45. మరియు నూహ్ తన ప్రభువును వేడుకుంటూ అన్నాడు: "ఓ నా ప్రభూ! నిశ్చయంగా, నా కుమారుడు నా కుటుంబంలోని వాడు! నీ వాగ్దానం సత్యమైనది మరియు నీవే సర్వోత్తమ న్యాయాధికారివి."

46. ఆయన (అల్లాహ్) జవాబిచ్చాడు: "ఓ నూహ్! అతడు నిశ్చయంగా, నీ కుటుంబంలోని వాడు కాడు[27]. నిశ్చయంగా, అతడి పనులు మంచివి కావు[28]. కావున నీకు తెలియని విషయం గురించి నన్ను అడగకు. నీవు కూడా మూఢులలో

---

[26] జూదీ కొండ కుర్దిస్తాన్'లో ఇబ్నె ఉమర్ ద్వీపానికి ఈశాన్య భాగంలో దాదాపు 25 మైళ్ళ దూరంలో ఉంది.

[27] ఎవరైతే విశ్వసించరో వారు ఒక ప్రవక్త ('అ.స.) యొక్క తండ్రి గానీ, కుమారుడు గానీ, లేక భార్య గానీ, అతని కుటుంబానికి చెందిన వారు కాజాలరు.

[28] ఎవరైతే విశ్వసించి, సత్కార్యాలు చేయరో వారిని అల్లాహ్ (సు.తా.) శిక్ష నుండి, దైవప్రవక్త ('అ.స.) కూడా రక్షించలేరు. అలాంటప్పుడు ఈ కాలంలో కొందరు ఏ విధంగానైతే అపోహలలో పడి ఉన్నారో వారిని, వారి పీర్లు, సజ్జాదాలు, వలీలు రక్షిస్తారని అనేది ఎలా సంభవం కాగలదు?

చేరిన వాడవు కావద్దు[29]. అని నేను నిన్ను ఉపదేశిస్తున్నాను."

47. నూహ్ ఇలా విన్నవించుకున్నాడు: "ఓ నా ప్రభూ! నిశ్చయంగా, నాకు తెలియని విషయాన్ని గురించి నిన్ను అడిగినందుకు, నేను నీ శరణు వేడుకుంటున్నాను. మరియు నీవు నన్ను క్షమించక పోతే, నన్ను కరుణించక పోతే, నేను నష్టపోయిన వారిలో చేరుతాను."

48. ఇలా ఆజ్ఞ ఇవ్వబడింది: "ఓ నూహ్! నీవు మరియు నీతో ఉన్న నీ జాతివారు శాంతి మరియు మా ఆశీర్వాదాలతో (ఓడ/జూదీ పర్వతం నుండి) దిగండి. వారిలోని కొన్ని సంఘాలకు మేము కొంతకాలం వరకు సుఖసంతోషాలను ప్రసాదించగలము. ఆ తరువాత మా వద్ద నుండి బాధాకరమైన శిక్ష వారిపై పడుతుంది."

49. (ఓ ప్రవక్తా!) ఇవి అగోచర విషయాలు. వాటిని మేము నీకు మా సందేశం (వహీ) ద్వారా తెలుపు తున్నాము. వాటిని నీవు గానీ, నీ జాతి వారు గానీ ఇంతకు పూర్వం ఎరుగరు. కనుక సహనం వహించు! నిశ్చయంగా, మంచి ఫలితం దైవభీతి గల వారికే లభిస్తుంది[30].

50. మరియు ఆద్ జాతివారి దగ్గరికి వారి సహోదరుడు

---

[29] దీనితో స్పష్టమయ్యేది ఏమిటంటే దైవప్రవక్తలకు అగోచర జ్ఞానం ఉండదు. అగోచర జ్ఞానం కేవలం అల్లాహుతా'ఆలా కు మాత్రమే ఉంది. ప్రవక్తలకు కేవలం అల్లాహుతా'ఆలా వ'హీ ద్వారా తెలిపిన జ్ఞానం మాత్రమే ఉంటుంది.

[30] చూడండి, 40:51 మరియు 37:171-173.

హూద్ ను పంపాము. అతను ఇలా అన్నాడు: "నా జాతి ప్రజలారా! మీరు అల్లాహ్ నే ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరొక ఆరాధ్యుడు లేడు. మీరు కేవలం అబద్ధాలు కల్పిస్తున్నారు!

51. ఓ నా జాతి ప్రజలారా! (ఈ పనికి) నేను మీ నుంచి ఎలాంటి ప్రతిఫలం అడగటం లేదు. నా ప్రతిఫలం కేవలం నన్ను సృజించిన ఆయన వద్దనే ఉంది. ఏమీ? మీరు బుద్ధిని ఉపయోగించరా (అర్థం చేసుకోలేరా)?

52. మరియు ఓ నా జాతి ప్రజలారా! మీ ప్రభువు క్షమాభిక్షను వేడుకోండి, తరువాత ఆయన వైపుకు పశ్చాత్తాపంతో మరలండి, ఆయన మీ కొరకు ఆకాశం నుండి భారీ వర్షాలు కురిపిస్తాడు మరియు మీకు, మీ శక్తిపై మరింత శక్తిని ఇస్తాడు[31], కావున మీరు నేరస్థులై వెనుదిరగకండి!"

53. వారు అన్నారు: "ఓ హూద్! నీవు మా వద్దకు స్పష్టమైన సూచనను తీసుకొని రాలేదు మరియు మేము కేవలం నీ మాటలు విని మా దేవతలను వదలిపెట్టలేము మరియు మేము నిన్ను విశ్వసించలేము.

54. "మా దైవాలలో నుండి కొందరు నీకు కీడు కలిగించారు (నిన్ను పిచ్చికి గురి చేశారు) అని

---

[31] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: "ఎవడైతే విధేయతతో క్షమాభిక్ష వేడుకుంటాడో, అల్లాహుతా'ఆలా అతని ప్రతి కష్టాన్ని దూరం చేసి, అతనికి, అతడు ఊహించని వైపు నుండి జీవనోపాధిని సమకూర్చుతాడు." (అబూ-దావూద్ కితాబ్ అల్-విత్ర్, బాబ్ ఫిల్-ఇస్తె'గ్ఫార్ నం. 1518; ఇబ్నె మాజా నం. 3819).

మాత్రమే మేము అనగలము!" అతను (హూద్) జవాబిచ్చాడు: "ఆయన (అల్లాహ్) తప్ప![32] మీరు ఆయనకు సాటి కల్పించే వాటితో నిశ్చయంగా, నాకు ఎలాంటి సంబంధం లేదని, నేను అల్లాహ్ ను సాక్షిగా పెడుతున్నాను మరియు మీరు కూడా సాక్షులుగా ఉండండి;

**55.** ఇక మీరంతా కలసి నాకు వ్యతిరేకంగా కుట్రలు పన్నండి. నాకెలాంటి వ్యవధి ఇవ్వకండి[33].

**56.** నిశ్చయంగా నాకూ మరియు మీకూ ప్రభువైన అల్లాహ్ నే నేను నమ్ముకున్నాను! ఏ ప్రాణి జుట్టు కూడా ఆయన చేతిలో లేకుండా లేదు[34]. నిశ్చయంగా, నా ప్రభువే ఋజుమార్గంపై (సత్యంపై) ఉన్నాడు.

**57.** "ఒకవేళ మీరు వెనుదిరిగితే (మీ ఇష్టం), వాస్తవానికి నేనైతే, నాకివ్వబడిన సందేశాన్ని మీకు అంద జేశాను. మరియు నా ప్రభువు మీ స్థానంలో మరొక జాతిని మీకు వారసులుగా చేయగలడు మరియు మీరు ఆయనకు ఏ మాత్రం హాని చేయలేరు. నిశ్చయంగా, నా ప్రభువే

---

[32] ఈ ఆయతులో వంకర అక్షరా (ఇటాలిక్స్)లలో ఉన్న ఈ భాగం, 55వ ఆయతు మొదటి వాక్యం. ఈ వాక్యాన్ని పూర్తి చేయటానికి ఇక్కడ కలుపబడింది.

[33] చూడండి, 7:195.

[34] చూడండి, 96:15-16.

ప్రతిదానికీ రక్షకుడు[35].

**58.** మరియు మా ఆదేశం జారీ అయినప్పుడు, మాకారుణ్యంతో హూద్ ను మరియు అతనితో పాటు విశ్వసించిన వారిని రక్షించాము మరియు వారిని ఘోరశిక్ష నుండి కాపాడాము![36]

**59.** మరియు వీరే ఆద్ జాతివారు! వారు తమ ప్రభువు సూచనలను (ఆయాత్ లను) తిరస్కరించారు మరియు ఆయన ప్రవక్తలకు అవిధేయులయ్యారు మరియు క్రూరుడైన ప్రతి (సత్య) విరోధి ఆజ్ఞలను అనుసరించారు![37]

**60.** మరియు ఇహలోకంలో (అల్లాహ్) శాపం (బహిష్కారం) వారిని వెంబడింప జేయబడింది మరియు పునరుత్థాన దినమున కూడా (అల్లాహ్ శాపం వారిని వెంబడించగలదు)[38]. వినండి! నిస్సందేహంగా, ఆద్ జాతివారు తమ ప్రభువును తిరస్కరించారు. కావున చూశారా!

---

[35] అల్-'హాఫీ"జు: Protector, Keeper, Defender, Preserver, రక్షకుడు, పర్యవేక్షకుడు, కనిపెట్టుకొని, కాచుకొని, కావలిఉండేవాడు కాపాడేవాడు చూడండి 25:45 ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి

[36] అదొక తీవ్రమైన తుఫాను గాలి. వివరాలకు చూడండి, 54:19-21, 69:6-8, 7:71-72.

[37] చూడండి, 7:66.

[38] ల'అనతున్: Wrath, Curse, Banishment, అల్లాహ్ (సు.తా.) అనుగ్రహం నుండి దూరం చేయబడటం, ప్రజల నుండి శపించబడటం, బహిష్కారం, దూశించ, గర్హించ, విసర్జించ బడటం, పునరుత్థాన దినమున అవమానానికి మరియు అల్లాహ (సు.తా.) శిక్షకు గురి అవటం.

హూద్ జాతి వారైన ఆద్ లు ఎలా (అల్లాహ్ కారుణ్యానికి) దూరమై పోయారో![39]

**61.** ఇక సమూద్ వారి వద్దకు వారి సహోదరుడు సాలిహ్ ను పంపాము. అతను అన్నాడు: "నా జాతి ప్రజలారా! అల్లాహ్ నే ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరొక ఆరాధ్యుడు లేడు. ఆయనే మిమ్మల్ని భూమి నుండి పుట్టించి[40], దానిలో మిమ్మల్ని నివసింప జేశాడు[41]. కనుక మీరు ఆయన క్షమాభిక్ష వేడుకోండి, తరువాత ఆయన వైపునకే పశ్చాత్తాపంతో మరలండి. నిశ్చయంగా, నా ప్రభువు దగ్గరలోనే ఉన్నాడు. (మీ ప్రార్థనలకు) జవాబిస్తాడు[42]."

**62.** వారన్నారు: "ఓ సాలిహ్! ఇంతకు ముందు మేము నీపై ఆశలు పెట్టుకొని ఉన్నాము. ఏమీ? మా తండ్రి తాతలు ఆరాధిస్తూ వచ్చిన వాటిని (దైవాలను) ఆరాధించకుండా, మమ్మల్ని ఆపదలచుకున్నావా? నీవు మాకు బోధించే (ధర్మం) విషయం గురించి వాస్తవంగా మాకు చాలా సందేహం ఉంది."

---

[39] బు'ఉద: అల్లాహ్ అనుగ్రహాన్ని కోల్పోవటం.

[40] మానవుడిని భూమి నుండి - మట్టి నుండి - అంటే ఈ భూమిలో దొరికే మూలపదార్థా(Elements)లతో సృష్టించాడు. ఇంకా చూడండి, 3:59, 18:37, 22:5 మరియు 30:20.

[41] చూడండి, 7:74.

[42] అల్ ముజీబు: The Answerer of prayers, Responding, Replying. తన దాసుల ప్రార్థనలకు ప్రత్యుత్తరమిచ్చు, జవాబిచ్చు, సమాధానమిచ్చు, అంగీకరించు వాడు. చూడండి,2:186.

63. (సాలిహ్) అన్నాడు: "ఓ నా జాతి సోదరులారా! ఏమీ? మీరు చూడరా(ఆలోచించరా)? నేను నా ప్రభువు యొక్క స్పష్టమైన (నిదర్శనంపై) ఉన్నాను. మరియు ఆయన నాకు తన కారుణ్యాన్ని ప్రసాదించాడు. ఇక నేను ఆయన (అల్లాహ్) ఆజ్ఞను ఉల్లంఘిస్తే[43] అల్లాహ్'కు విరుద్ధంగా నాకు ఎవడు సహాయపడగలడు? మీరు నాకు నష్టం తప్ప మరేమీ అధికం చేయటంలేదు

64. "మరియు నా జాతి ప్రజలారా! అల్లాహ్ యొక్క ఈ ఆడ ఒంటె మీ కొరకు ఒక అద్భుత సూచన! కావున దీనిని అల్లాహ్ భూమిలో స్వేచ్ఛగా మేయటానికి వదలి పెట్టండి. దానికి ఎలాంటి కీడు కలిగించకండి, లేదా త్వరలోనే మిమ్మల్ని శిక్ష పట్టుకోగలదు[44]."

65. అయినా వారు దానిని, వెనుక కాలి మోకాలి నరం కోసి చంపారు. అప్పుడు అతను (సాలిహ్) వారితో అన్నాడు: "మీరు మీ ఇండ్లలో మూడు రోజులు మాత్రమే హాయిగా గడపండి. ఇదొక వాగ్దానం,

---

[43] అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞను ఉల్లంఘించటం, అంటే ఇక్కడ: "సత్యం వైపునకు మరియు ఏకైక ఆరాధ్యుడు, అల్లాహుతా'ఆలా వైపునకు పిలవటాన్ని మానుకోవటం." ఇదే కదా! సత్యతిరస్కారులు కోరుతున్నది. ఇంకా చూడండి, 4:48.

[44] స'మూద్ జాతి ప్రజలు తమ ప్రవక్త 'సాలిహ్' ('అ.స.)తో : "నీవు దైవప్రవక్తవే అయితే మాకొక అద్భుత సూచనగా ఈ బండరాయి నుండి ఒక ఆడ ఒంటెను తీసుకురా?" అని గట్టిగా పట్టుపట్టి అడుగ్గా వచ్చిన ఆడఒంటె అది.

ఇది అబద్ధం కాబోదు."

**66.** ఆ తరువాత మాఆదేశం జారీఅయినప్పుడు మేము సాలిహ్‌'ను మరియు అతనితో పాటు విశ్వసించినవారిని మాకారుణ్యంతో రక్షించాం. వారిని ఆ దినపు అవమానం నుండి కాపాడాం. నిశ్చయంగా నీ ప్రభువు! ఆయన మాత్రమే మహాబలవంతుడు, సర్వశక్తి సంపన్నుడు.

**67.** మరియు దుర్మార్గానికి పాల్పడిన వారిపై ఒక పెద్ద అరుపు (ప్రేలుడు) పడి, వారు తమ ఇండ్లలోనే చలనం లేకుండా (చచ్చి) పడి పోయారు[45];

**68.** వారెన్నడూ అక్కడ నివసించనే లేదన్నట్లుగా. చూడండి! వాస్తవానికి, సమూద్ జాతి వారు తమ ప్రభువును తిరస్కరించారు. కాబట్టి చూశారా! సమూద్ వారెలా దూరమై పోయారో (నశించి పోయారో)!

**69.** మరియు వాస్తవానికి మా దూతలు శుభవార్త తీసుకొని ఇబ్రాహీమ్ వద్దకు వచ్చారు. వారు అన్నారు: "నీకు శాంతి కలుగు గాక (సలాం)!" అతను: "మీకూ శాంతి కలుగు గాక (సలాం)!" అని జవాబిచ్చాడు. తరువాత అతను అతి త్వరగా, వేపిన దూడను (వారి ఆతిథ్యానికి) తీసుకొని వచ్చాడు.

**70.** కానీ వారి చేతులు దాని వైపు పోక పోవటం

---

[45] ఇక్కడ అరుపు ('సై'హతున్) అని ఉంది మరియు 7:78లో భూకంపం (రజ్ ఫతున్) అని ఉంది. రెండూ వచ్చాయన్న మాట.

చూసి[46] వారిని గురించి అనుమానంలో పడ్డాడు మరియు వారి నుండి అపాయం కలుగు తుందేమోనని భయపడ్డాడు! వారన్నారు: "భయపడకు! వాస్తవానికి మేము లూత్ జాతి వైపునకు పంపబడినవారము (దూతలము)[47]."

**71.** అతని (ఇబ్రాహీమ్) భార్య (అక్కడే) నిలబడి ఉండెను; అప్పుడామె నవ్వింది; పిదప మేము ఆమెకు ఇస్ హాఖ్ యొక్క మరియు ఇస్ హాఖ్ తరువాత యఅఖూబ్ యొక్క శుభవార్తను ఇచ్చాము[48].

**72.** ఆమె (ఆశ్చర్యంతో) అన్నది: "నా దౌర్భాగ్యం!

---

[46] ఇబ్రాహీమ్ ('అస) అతిథులు అతను తెచ్చిన, వేచిన ఆవుదూడ మాంసం తిననందుకు, అతను వారు తనతో శత్రుత్వం వహిస్తారేమోనని భయపడ్డారు. దీనితో విశదమయ్యే మరొక విషయమేమిటంటే ప్రవక్తలకు అకోచర జ్ఞానముండదు. అతనికి అగోచరజ్ఞానముంటే వారు దైవదూతలని అతనికి తెలిసి ఉండేది. అతను వారి కొరకు వేపిన ఆవుదూడ తెచ్చేవారు కాదు.

[47] లూ'త్ ('అ.స.) ఇబ్రాహీమ్ ('అ.స.) సోదరుని కుమారులు. అతను జోర్డాన్ కు తూర్పుదిక్కు ఈనాటి లూ'త్ సముద్రం (Dead Sea) అనే ప్రాంతలో నివసించే వారు. ఇబ్రాహీమ్ ('అ.స.) వలే, లూ'త్ ('అ.స.) కూడా, దక్షిణ బాబిలోనియా (Babylonia) లోని 'ఊర్' అనే ప్రాంతవాసులు. తన పినాన్నతో సహా ఇక్కడికి వలస వచ్చారు. కావున లూ'త్ (అ'.స.) ప్రజలు అంటే అతని జాతివారు కాదు, కాని పైన పేర్కొన్న ప్రాంతంలోని సోడోమ్ మరియు గొమొర్రాహ్ అనే నగరాల వాసులు.

[48] ఇబ్రాహీం('అ.స.)భార్య సారహ్('అలైహా స.) నవ్వటానికి వ్యాఖ్యాతలు విభిన్న కారణాలు పేర్కొన్నారు: 1) ఆమెకు లూ'త్ ('అ.స.) జాతివారి దుష్చేష్టలు తెలుసు కావున వారి నాశనాన్ని గురించి విని, సంతోషంతో నవ్విందని. 2) వృద్ధాప్యంలో తనకు ఇవ్వబడిన సంతానపు వార్తవిని ఆశ్చర్యంతో నవ్విందని.

నాకిప్పుడు బిడ్డ పుడతాడా? నేను ముసలిదానిని మరియు నా ఈ భర్త కూడా వృద్ధుడు. (అలా అయితే) నిశ్చయంగా, ఇది చాలా విచిత్రమైన విషయమే!"

**73.** వారన్నారు: "అల్లాహ్ ఉత్తరువు విషయంలో మీరు ఆశ్చర్యపడుతున్నారా? ఓ (ఇబ్రాహీమ్) గృహస్థులారా![49] మీపై అల్లాహ్ కారుణ్యం మరియు ఆయన శుభాశీస్సులు ఉన్నాయి! నిశ్చయంగా, ఆయనే సర్వ స్తోత్రాలకు అర్హుడు, మహత్వపూర్ణుడు[50].

**74.** అప్పుడు ఇబ్రాహీమ్ భయం దూరమై, అతనికి (సంతానపు) శుభవార్త అందిన తరువాత, అతను

---

[49] అహ్ లున్: Family ఒక కుటుంబం / సంసారం / తెగ / వంశం వారు, ఒక (House) గృహవాసులు.

[50] అల్-మజీదు: The Glorious, Great in Dignity, who gives liberally or bountifully. The Bountiful, Beneficent, Exalted, Noble, Sublime. మహత్త్వపూర్ణుడు, అల్ - మాజిదు (సేకరించబడిన పదం): వీటికి వైభవం గలవాడు, ప్రభావం, ప్రతాపం, విశిష్టత, ఘనత గలవాడు, దివ్యుడు, మహిమాన్వితుడు, ఉత్కృష్టుడు, శ్రేష్టుడు, ఔదార్యుడు, ప్రశంసనీయుడు, అనే అర్థాలున్నాయి. ఇవి అల్లాహ్ (సు. తా.) అత్యుత్తమ పేర్లు. చూడండి, 85:15. ఈ పదం దివ్యఖుర్ఆన్ కొరకు గూడా వాడబడింది. Glorious, Noble, దివ్యమైన, ఉత్కృష్టమైన అనే అర్థాలలో, అల్ కరీము మాదిరిగా చూడండి, 50:1, 85:21.

లూత్ జాతి వారి కొరకు మాతో వాదించసాగాడు[51].

**75.** (ఎందుకంటే) వాస్తవానికి ఇబ్రాహీమ్ సహనశీలుడు, మృదు హృదయుడు (నమ్రతతో అల్లాహ్ ను అర్థించేవాడు) మరియు పశ్చాత్తాపంతో (అల్లాహ్ వైపుకు) మరలేవాడు!

**76.** (వారన్నారు): "ఓ ఇబ్రాహీమ్! దీనిని (నీ మధ్యవర్తిత్వాన్ని) మానుకో! నిశ్చయంగా, నీ ప్రభువు ఆజ్ఞ వచ్చి వున్నది. మరియు నిశ్చయంగా, వారిపై ఆ శిక్ష పడటం తప్పదు; అది నివారించబడదు."

**77.** మరియు మా దూతలు లూత్ వద్దకు వచ్చినపుడు, వారి రాకకు అతను, (వారిని కాపాడలేనని) దుఃఖితుడయ్యాడు. అతని హృదయం కృంగిపోయింది. అతను: "ఈ దినం చాలా ఆందోళనకరమైనది." అని వాపోయాడు.

**78.** మరియు అతని జాతి ప్రజలు అతని వైపు పరిగెత్తుకుంటూ వచ్చారు. వారు మొదటి నుండి నీచపు పనులు చేస్తూ ఉండేవారు. అతను (లూత్) అన్నాడు: "నా జాతి ప్రజలారా! ఇదిగో నా ఈ కుమార్తెలు (నా జాతి స్త్రీలు) ఉన్నారు[52]. వీరు మీ కొరకు చాలా శ్రేష్ఠమైన వారు. అల్లాహ్

---

[51] ఇబ్రాహీం ('అ.స.) అన్నారు: "మీరు నాశనం చేయబోయే నగరంలో లూ'త్ ('అ.స.) కూడా ఉన్నారు". దానికి దైవదూతలు జవాబిచ్చారు: "మాకు తెలుసు. మేము అతనిని మరియు అతనితో బాటు విశ్వసించిన వారిని కాపాడుతాము. అతన భార్య తప్ప." చూడండి. 29:32.

[52] నా కుమార్తెలు, అంటే నా జాతి కుమార్తెలు (ఇబ్నె-కసీ'ర్).

యందు భయభక్తులు కలిగి ఉండండి మరియు నా అతిథుల విషయంలో నన్ను అవమానం పాలు చేయకండి. ఏమీ? మీలో ఒక్కడైనా నీతిపరుడు లేడా?"[53]

**79.** వారన్నారు: "నీ కూతుళ్ళు మాకు అవసరం లేదని నీకు బాగా తెలుసు కదా! మరియు నిశ్చయంగా, మేము కోరేది ఏమిటో కూడా నీకు బాగా తెలుసు!"

**80.** అతను (లూత్) అన్నాడు: "మిమ్మల్ని ఎదుర్కొనే బలం నాకుంటే, లేక శరణు పొందటానికి పటిష్ఠమైన ఆధారమైనా ఉండి ఉంటే ఎంత బాగుండేది?"[54]

**81.** వారు (దైవదూతలు) అన్నారు: "ఓ లూత్! నిశ్చయంగా మేము నీ ప్రభువు తరఫు నుండి వచ్చిన దూతలము! వారు ఏ మాత్రం నీ వద్దకు చేరలేరు. కావున కొంత రాత్రి మిగిలి ఉండగానే నీవు నీ ఇంటి వారిని తీసుకొని బయలుదేరు - నీ భార్య తప్ప - మీలో ఎవ్వరూ వెనుకకు తిరిగి చూడగూడదు. నిశ్చయంగా, వారికి ఏ ఆపద సంభవించనున్నదో అదే ఆమె (నీ భార్య) కూ

---

[53] లూ'త్ ('అ.స.) ఒక దైవప్రవక్త అయినప్పటికీ వచ్చిన అతిథులు దైవదూతలని గుర్తించలేక పోయారు. అంటే దైవప్రవక్తలకు అగోచరజ్ఞానం ఉండదని విశదమవుతోంది.

[54] దీనితో అర్థమయ్యేదేమిటంటే దైవప్రవక్తలకు అగోచరజ్ఞానం ఉండదు. వారికి ప్రతిదీ చేయగల సామర్థ్యం కూడా ఉండదు. మరొక విషయం ఏమిటంటే దైవప్రవక్తలు కూడా, అల్లాహ్ (సు.తా.) కోరితే అంతా చేస్తాడని కూర్చొని తమకు సాధ్యమైనంతవరకు సమస్యలను తామే పరిష్కరించుకోవడానికి ప్రయత్నిస్తారు.

సంభవిస్తుంది[55]. నిశ్చయంగా, వారి నిర్ణీత కాలం ఉదయపు సమయం. ఏమీ? ఉదయం సమీపంలోనే లేదా?

**82.** మా తీర్పు సమయం వచ్చినపుడు మేము దానిని (సోడోంను) తలక్రిందులుగా జేసి, దాని మీద మట్టితో చేసి కాల్చిన గులకరాళ్ళను ఎడతెగకుండా కురిపించాము[56].

**83.** అవి నీ ప్రభువు తరఫు నుండి గుర్తు వేయబడినవి. అది (ఆ శిక్ష) ఈ దుర్మార్గులకు ఎంతో దూరంలో లేదు.

**84.** ఇక మద్'యన్ వారి వద్దకు, వారి సహోదరుడైన షుఐబ్'ను పంపాము[57]. అతను అన్నాడు: "ఓ నా జాతి ప్రజలారా! మీరు అల్లాహ్ నే ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరొక ఆరాధ్య దైవం లేడు. కొలతల్లో మరియు తూనికల్లో తగ్గించి ఇవ్వకండి. నేను నిశ్చయంగా, మిమ్మల్ని (ఇప్పుడు) మంచి స్థితిలో చూస్తున్నాను; కాని వాస్తవానికి మీపై ఆ రోజు చుట్టు ముట్టబోయే శిక్షను గురించి నేను భయపడుతున్నాను.

**85.** "మరియు ఓ నా జాతి ప్రజలారా! మీరు న్యాయంగా మరియు సరిగ్గా కొలవండి మరియు తూకం చేయండి. మరియు ప్రజలకు వారి వస్తువులను

---

[55] చూడండి, 7:83 మరియు 66:10 లూ'త్ భార్య అవిశ్వాసి. ఆమె సోడొమ్ వాసి.

[56] ఇటువంటి గులకరాళ్ళు 7:84 మరియు 105:4 లలో కూడా పేర్కొనబడ్డాయి.

[57] మద్ యన్ వారి గాథ కొరకు చూడండి, 7:85.

తక్కువ జేసి ఇవ్వకండి[58]. మరియు భూమిలో అనర్థాన్ని, కల్లోల్లాన్ని వ్యాపింపజేయకండి.

**86.** "మీరు విశ్వాసులే అయితే, (ప్రజలకు వారి హక్కు ఇచ్చిన తరువాత) అల్లాహ్ మీ కొరకు మిగిల్చినదే మీకు మేలైనది[59]. మరియు నేను మీ రక్షకుడను కాను[60]."

**87.** వారు (వ్యంగంగా) అన్నారు: "ఓ షుఐబ్! ఏమీ? మా తండ్రి తాతలు ఆరాధించే దేవతలను మేము వదలి పెట్టాలని, లేదా మా ధనాన్ని నీ ఇష్ట ప్రకారం ఖర్చు చేయాలని, నీకు నీ నమాజ్ నేర్పుతుందా?[61] (అయితే) నిశ్చయంగా, ఇక నీవే చాలా సహనశీలుడవు, ఉదాత్తుడవు!"[62]

**88.** అప్పుడు అతను (షుఐబ్) అన్నాడు: "ఓ నా జాతి ప్రజలారా! ఏమీ? మీరు చూశారా (ఆలోచించారా)? ఒకవేళ నేను నా ప్రభువు తరఫు నుండి స్పష్టమైన నిదర్శనాన్ని కలిగి ఉండి మరియు ఆయన నాకు

---

[58] చూడండి, 83:1-3.

[59] చూడండి, 18:46 మరియు 19:76. 'అల్లాహ్ (సు.తా.) మీ కొరకు మిగిల్చేది,' అంటే మీరు న్యాయంగా నడుచుకొని మీ వ్యాపారాలలో సరిగ్గా కొలిచి, తూచి ఇచ్చిన తరువాత మీకు మిగిలే లాభం, అని అర్థం.

[60] నేను మీకు చేసే ఉపదేశం కేవలం అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞ ప్రకారం చేస్తున్నాను. మిమ్మల్ని దుష్ట కార్యాల నుండి ఆపటంగానీ లేక శిక్షించటంగానీ నా పని కాదు. అది కేవలం అల్లాహ్(సు.తా.) పని మాత్రమే

[61] సలాతున్: అంటే ఇక్కడ ధర్మం, ఆరాధన అని అర్థం.

[62] అర్-రషీద్: The Director to the Right path, Leader. సన్మార్గం చూపువాడు. నీతిపరుడు, సన్మార్గగామిని, ఋజువర్తనుడు.

తన తరఫు నుండి మంచి జీవనోపాధిని కూడా ప్రసాదించినపుడు (నేను ఇలా కాకుండా మరేమి అనగలను)? నేను మిమ్మల్ని నిషేధించిన దానికి వ్యతిరేకంగా చేయదలచుకోలేదు. నేను మాత్రం మిమ్మల్ని నా శక్తి మేరకు సంస్కరించ దలచుకున్నాను. నా కార్యసిద్ధి కేవలం అల్లాహ్ పైననే ఆధారపడి వుంది. నేను ఆయననే నమ్ముకున్నాను మరియు నేను ఆయన వైపునకే పశ్చాత్తాపంతో మరలుతాను.

89. "మరియు ఓ నా జాతి ప్రజలారా! నాతో ఉన్న భేదాభిప్రాయం మిమ్మల్ని నూహ్ జాతి వారి పై, హూద్ జాతి వారిపై లేక సాలిహ్ జాతి వారిపై పడినటు వంటి శిక్షకు గురి చేయకూడదు సుమా! మరియు లూత్ జాతివారు మీకు ఎంతో దూరం వారు కారు కదా![63]

90. "మరియు మీరు మీ ప్రభువు క్షమాభిక్షను కోరుకోండి. మరియు ఆయన వైపునకు పశ్చాత్తాపంతో మరలండి. నిశ్చయంగా, నా

---

[63] చూడండి, 7:85 షు'ఐబ్ ('అ.స.) మూసా ('అ.స.) యొక్క భార్య తండ్రి అని కొందరు వ్యాఖ్యాతలు అంటారు. మరికొందరు, ఇతను ఆ షు'ఐబ్ కాదు అంటారు. అతడు ఉన్న ప్రాంతం ఈనాటి అఖబా అఖాతం (Gulf of Aqabah) నుండి పడమటి వైపునకు సినాయి ద్వీపకల్పంలో మోబ్ (Moab) పర్వతం వరకు మరియు తూర్పుదిశలో మృతసముద్రం (Dead Sea) వరకు ఉంది. దాని వాసులు అమోరైట్ తెగకు చెందిన అరబ్బులు. మృత సముద్రం (Dead Sea) దగ్గరలోనే సోదోమ్ మరియు గొమర్రాహ్ నగరాలు కూడా ఉండేవి.

ప్రభువు అపార కరుణా ప్రదాత, వాత్సల్యుడు."[64]
91. వారన్నారు: "ఓ షుఐబ్! నీవు చెప్పే మాటలు చాలా వరకు మేము గ్రహించలేక పోతున్నాము[65]. మరియు నిశ్చయంగా, నీవు మాలో బలహీనుడివిగా పరిగణించబడు తున్నావు. మరియు నీ కుటుంబం వారే గనక లేకుంటే! మేము నిశ్చయంగా, నిన్ను రాళ్ళు రువ్వి చంపేవారం. మరియు నీవు మా కంటే శక్తి శాలివి కావు."
92. అతను అన్నాడు: "ఓ నా జాతి ప్రజలారా! ఏమీ? నా కుటుంబం మీకు అల్లాహ్ కంటే ఎక్కువ గౌరవనీయమైనదా? మరియు మీరు ఆయన (అల్లాహ్) ను మీ వీపుల వెనుకకు నెట్టుతారా? నిశ్చయంగా, నా ప్రభువు మీరు చేసే పనులను ఆవరించి ఉన్నాడు.
93. "మరియు ఓ నా జాతి ప్రజలారా! మీ శక్తి మేరకు మీరు చేసేది చేయండి, నిశ్చయంగా, (నా శక్తి మేరకు) నేను కూడా చేస్తాను. అవమాన కరమైన శిక్ష ఎవరికి పడుతుందో అసత్యవాది ఎవడో మీరు మున్ముందు తెలుసుకోగలరు. మరియు మీరు నిరీక్షించండి, నిశ్చయంగా, మీతో బాటు నేను కూడా నిరీక్షిస్తాను."
94. చివరకు మా ఆదేశం వచ్చినప్పుడు, మేము

---

[64] అల్ - వదూద్: Affectionate, The Loving towards His servants or towards those who obey. తన దాసుల పట్ల వాత్సల్యం, ప్రేమ, ప్రీతి గలవాడు. చూ 85:14. ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి.

[65] చూడండి, 6:25.

షుఐబ్ ను మరియు అతనితో పాటు విశ్వసించిన వారిని మా కారుణ్యంతో రక్షించాము. మరియు దుర్మార్గులైన వారిపై ఒక తీవ్రమైన అరుపు (ధ్వని) విరుచుకు పడింది. కాబట్టి వారు తమ ఇండ్లలోనే చలనం లేకుండా (చచ్చి) పడిపోయారు

95. వారక్కడ ఎన్నడూ నివసించనే లేదన్నట్లుగా! ఈ విధంగా సమూద్ జాతివారు లేకుండా పోయినట్లు, మద్ యన్ జాతివారు కూడా లేకుండా (నశించి) పోయారు![66]

96. మరియు నిశ్చయంగా, మేము మూసాను కూడా మా సూచనలతో మరియు స్పష్టమైన ప్రమాణంతో పంపాము -

97. ఫిర్ఔన్ మరియు అతని నాయకుల వద్దకు! కానీ వారు ఫిర్ఔన్ ఆజ్ఞలనే అనుసరించారు. మరియు ఫిర్ఔన్ ఆజ్ఞ సరైనది కాదు.

98. పునరుత్థాన దినమున అతడు (ఫిర్ఔన్) తన జాతి వారికి ముమ్ముందుగా ఉండి, వారిని నరకాగ్నిలోకి తీసుకొని పోతాడు మరియు అది ప్రవేశించే వారికి ఎంత చెడ్డ గమ్యస్థానం.

99. మరియు వారు ఈ లోకంలో శాపంతో వెంబడించబడ్డారు మరియు పునరుత్థాన దినమున కూడా (బహిష్కరించబడతారు). ఎంత చెడ్డ బహుమానం (వారికి) బహూకరించ బడుతుంది.

100. ఇవి కొన్ని (ప్రాచీన) పట్టణాల గాథలు వీటిని

[66] అల్లాహుతా'ఆలా అనుగ్రహానికి దూరమై పోయారు.

మేము నీకు వినిపిస్తున్నాము. వాటిలో కొన్ని నిలిచి (మిగిలి) ఉన్నాయి. మరికొన్ని పంటపొలాల మాదిరిగా కోయబడ్డాయి (నిర్మూలించబడ్డాయి).

101. మరియు మేము వారి కెలాంటి అన్యాయం చేయలేదు. కాని వారే తమకు తాము అన్యాయం చేసుకున్నారు. నీ ప్రభువు ఆజ్ఞ వచ్చినప్పుడు - అల్లాహ్ ను వదలి - వారు ఏ దేవతలనైతే ప్రార్థించేవారో! వారు, వారికి ఏ విధంగానూ సహాయపడ లేక పోయారు. మరియు వారు, వారి వినాశం తప్ప మరేమీ అధికం చేయలేదు.

102. మరియు ఈ విధంగా నీ ప్రభువు దుర్మార్గులైన నగర(వాసులను) పట్టుకొన(శిక్షించ) దలచితే, ఇలాగే పట్టుకుంటాడు(శిక్షిస్తాడు). నిశ్చయంగా, ఆయన పట్టు చాలా బాధాకరమైనది, ఎంతో తీవ్రమైనది.

103. నిశ్చయంగా, ఇందులో పరలోక శిక్షకు భయపడే వారికి ఒక సూచన ఉంది. అది సర్వ మానవులను సమావేశ పరిచే రోజు! ఆ దినమున అందరూ హాజరవుతారు.

104. మరియు మేము దానిని కేవలం ఒక నియమిత కాలం వరకు మాత్రమే ఆపి ఉన్నాము.

105. ఆ దినం వచ్చినప్పుడు, ఆయన (అల్లాహ్) సెలవు లేనిదే, ఏ ప్రాణి కూడా మాట్లాడ జాలదు. వారిలో కొందరు దౌర్భాగ్యులుంటారు మరికొందరు భాగ్యవంతులుంటారు.

106. దౌర్భాగ్యులైన వారు నరకాగ్నిలో చేరుతారు,

అక్కడ వారు దుఃఖం వల్ల మూలుగుతూ ఉంటారు మరియు వెక్కి వెక్కి ఏడుస్తూ ఉంటారు.

**107.** వారందులో శాశ్వతంగా, భూమ్యాకాశాలు ఉన్నంత వరకు ఉంటారు[67]. నీ ప్రభువు (మరొకటి) కోరితే తప్ప! నిశ్చయంగా, నీ ప్రభువు తాను కోరిందే చేసేవాడు.

**108.** ఇక భాగ్యవంతులైన వారు, భూమ్యాకాశాలు ఉన్నంత వరకు స్వర్గంలో శాశ్వతంగా ఉంటారు. నీ ప్రభువు (మరొకటి) కోరితే తప్ప! ఇదొక ఎడతెగని బహుమానం[68].

**109.** కావున (ఓ ప్రవక్తా!) వారు ఆరాధించే వాటిని గురించి నీవు సందేహంలో పడకు. పూర్వం నుండి వారి తాతముత్తాతలు ఆరాధించినట్లుగానే వారు కూడా (అంధులై) ఆరాధిస్తున్నారు. మరియు మేము నిశ్చయంగా, వారి భాగపు (శిక్షను) ఏ మాత్రం తగ్గించకుండా వారికి పూర్తిగా నొసంగుతాము.

**110.** మరియు వాస్తవంగా, మేము మూసాకు గ్రంథాన్ని ప్రసాదించాము. పిదప అందులో అభిప్రాయభేదాలు వచ్చాయి. నీ ప్రభువు మాట (ఆజ్ఞ) ముందుగానే నిర్ణయించబడి ఉండ కుంటే, వారి తీర్పు ఎప్పుడో జరిగి ఉండేది. మరియు నిశ్చయంగా, వారు దీనిని గురించి సంశయంలో, సందేహంలో పడి వున్నారు.

---

[67] చూడండి, 6:128, 14:48. 'ఈ భూమి మరొక భూమిగా మరియు ఆకాశాలు (మరొక ఆకాశాలుగా) మారే రోజు.' ఇక్కడ దీని అర్థం వారు శాశ్వతంగా ఎల్లప్పుడు నరకంలో ఉంటారని అర్థం (ఇబ్నె-కసీ'ర్).

[68] చూడండి, పై ఆయత్ 11:107 వ్యాఖ్యానం 1.

111. మరియు నిశ్చయంగా, నీ ప్రభువు ప్రతి ఒక్కరి కర్మల ప్రతిఫలాన్ని వారికి తప్పకుండా పూర్తిగా ఇచ్చి వేస్తాడు. నిశ్చయంగా ఆయన వారి కర్మలను బాగా ఎరుగును.

112. కనుక (ఓ ప్రవక్తా!) నీవూ మరియు పశ్చాత్తాప పడి (ఆయన వైపుకు మరలిన) నీ సహచరులూ, నీకు ఆజ్ఞ ఇవ్వబడిన విధంగా ఋజుమార్గంపై స్థిరంగా ఉండండి, హద్దు మీరకండి. నిశ్చయంగా, ఆయన మీ కర్మలన్నీ చూస్తున్నాడు.

113. దుర్మార్గుల వైపునకు మీరు మొగ్గకండి. నరకాగ్నిలో చిక్కుకుంటారు. ఆ తరువాత అల్లాహ్ తప్ప మరెవ్వరూ మీకు సంరక్షకులూ ఉండరు. అప్పుడు మీకెవ్వరి సహాయమూ లభించదు.

114. మరియు దినపు చివరి రెండు భాగాల్లోనూ మరియు రాత్రిపూట కొంత భాగంలో కూడా నమాజ్ సలపండి[69]. నిశ్చయంగా, సత్కార్యాలు దుష్కార్యాలను దూరం చేస్తాయి. జ్ఞాపకం ఉంచుకునే వారికి ఇది ఒక ఉపదేశం (జ్ఞాపిక).

115. మరియు సహనం వహించు; నిశ్చయంగా,

[69] దైవప్రవక్త ('స'అస) తమ అనుచరు(ర'ది.'అన్హుమ్)లతో ప్రశ్నిస్తారు. "మీలో ఒకరి ఇంటి ముందు ఒక పెద్ద నది ప్రవహిస్తూ ఉండి, అతడు అందులో ప్రతిరోజు ఐదుసార్లు స్నానం చేస్తూ ఉంటే, అతని శరీరం మీద మలినం ఉండగలదా?" అనుచరులు అంటారు: "ఉండదు!" దైవప్రవక్త ('స'అస) అంటారు: "ఇదే విధంగా ఐదుసార్లు నమా'జ్ చేసేవారి, తప్పులు, పాపాలు కూడా అల్లాహ్ (సు.తా.) తుడిచివేస్తాడు." 'స'హీ'హ్ బు'ఖారీ, కితాబ్ మౌఖీయత్, బాబ్'సలాత్ అల్-'ఖమ్స్).

అల్లాహ్ సజ్జనుల ప్రతిఫలాన్ని వ్యర్థం చేయడు.

116. మీకు పూర్వం గతించిన తరాల వారిలో, భూమిలో కల్లోలం రేకెత్తించకుండా నిషేధించే సజ్జనులు ఎందుకు లేరు? కాని అలాంటి వారు కొందరు మాత్రమే ఉండేవారు! వారిని మేము అలాంటి వారి (దుర్మార్గుల) నుండి కాపాడాము. మరియు దుర్మార్గులైనవారు ఐహికసుఖాలకులోనయ్యారు మరియు వారు అపరాధులు.

117. మరియు వాటిలో నివసించే ప్రజలు సద్వర్తనులై ఉన్నంత వరకు, అలాంటి నగరాలను నీ ప్రభువు అన్యాయంగా నాశనం చేసేవాడు కాడు.

118. మరియు నీ ప్రభువు సంకల్పిస్తే, సర్వ మానవులను (ఒకే ధర్మాన్ని అవలంబించే) ఒకే ఒక్క సంఘంగా చేసేవాడు. అయినా వారు అభిప్రాయ భేదాలు లేకుండా ఉండ లేక పోయేవారు[70].

119. నీ ప్రభువు కరుణించినవాడు తప్ప![71] మరియు దాని కొరకే ఆయన వారిని సృష్టించాడు[72]. మరియు నీ ప్రభువు: "నేను జిన్నాతులు మరియు మానవులు అందరితో నరకాన్ని నింపుతాను!" అని అన్నమాట నెరవేరుతుంది[73].

---

[70] చూడండి, 2:253 మరియు 5:48.
[71] చూడండి, 7:172.
[72] చూడండి, 2:30-34.
[73] చూడండి, 7:18, 32:13.

**120.** మరియు (ఓ ప్రవక్తా!) నీ హృదయాన్ని స్థిరపరచటానికి, మేము ప్రవక్తల గాథలను నీకు వినిపిస్తున్నాను. మరియు ఇందు (ఈ సూరహ్) లో నీకు సత్యం వచ్చింది మరియు విశ్వాసులకు హితబోధ మరియు జ్ఞాపిక.

**121.** మరియు విశ్వసించని వారితో ఇలా అను: "మీరు మీ శక్తి మేరకు మీ పనులు చేయండి. నిశ్చయంగా, మేము కూడా మా శక్తి మేరకు మా పనులు చేస్తాము.

**122.** మరియు మీరు వేచి చూడండి; మేము కూడా వేచి ఉంటాము."

**123.** మరియు ఆకాశాల యొక్క మరియు భూమి యొక్క సర్వ అగోచర విషయాలు కేవలం అల్లాహ్ కే తెలుసు[74]. మరియు సర్వ విషయాలు ఆయన వద్దకే మరలింప బడతాయి కావున మీరు ఆయననే ఆరాధించండి మరియు ఆయననే నమ్ముకోండి. మరియు మీరు చేసే కర్మలు నీ ప్రభువు ఎరుగకుండా లేడు.

---

[74] చూడండి, 2:3.

# 12. యూసుఫ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. అలిఫ్ - లామ్ - రా[1]. ఇవి స్పష్టమైన గ్రంథ ఆయతులు.
2. వాస్తవంగా, మీరు బాగా అర్థం చేసుకోవాలని, మేము ఈ ఖుర్ఆన్ ను అరబ్బీ భాషలో అవతరింప జేశాము[2].
3. (ఓ ప్రవక్తా!) మేము ఈ ఖుర్ఆన్ ద్వారా అవతరింపజేసిన కథలలో ఉత్తమమైన గాథను నీకు వినిపించ బోతున్నాము మరియు ఇంతకు ముందు నీవు దీనిని ఎరుగవు[3].
4. (జ్ఞాపకం చేసుకోండి) యూసుఫ్ తన తండ్రితో: "ఓ నాన్నా! నేను వాస్తవంగా (కలలో) పదకొండు

---

[*] [యూసుఫ్ – ప్రవక్త యూసుఫ్ అలైహిస్సలాము]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

[2] ప్రతి దివ్యగ్రంథం ఆ ప్రాంతపు ప్రజల భాషలోనే అవతరింపజేయబడింది. దివ్యగ్రంథాలు ప్రజల మార్గదర్శకత్వం కొరకే అవతరింపజేయబడతాయి. కావు అల్లాహ్ (సు.తా.) ఈ ఉత్తమ దివ్యగ్రంథం (ఖుర్ఆన్), ఉత్తమ భాష 'అరబ్బీలో, ఉత్తమ ప్రవక్త ము'హమ్మద్ ('స'అస)పై, ఉత్తమమైన దైవదూత జిబ్రీల్ ('అ.స.) ద్వారా, ఉత్తమమైన నగరం మక్కాలో, ఉత్తమమైన నెల రమ'దాన్ లో అవతరింప జేశాడు. చూడండి, 13:37, 14:4.

[3] ప్రవక్తలకు అగోచరజ్ఞానం ఉండదని ఇక్కడ మరొకసారి విశదీకరించబడింది. చూడండి, 4:113 మరియు 43:52.

నక్షత్రాలను, సూర్యుణ్ణి మరియు చంద్రుణ్ణి చూశాను; వాటిని నా ముందు సాష్టాంగ పడుతున్నట్లు చూశాను." అని అన్నప్పుడు!

5. (అతని తండ్రి) అన్నాడు: "ఓ నా చిన్ని ప్రియకుమారుడా! నీ స్వప్నాన్ని నీ సోదరులకు తెలుపకు. ఎందుకంటే వారు నీకు విరుద్ధంగా కుట్ర పన్నవచ్చు![4] నిశ్చయంగా, షైతాన్ మానవునికి బహిరంగ శత్రువు.

6. "మరియు ఆ విధంగానే జరుగుతుంది! నీ ప్రభువు నిన్ను ఎన్నుకుంటాడు మరియు నీకు సంఘటనల (స్వప్నాల) గూఢార్థ వివరణ కూడా నేర్పుతాడు మరియు నీ పూర్వీకులైన (తాతముత్తాతలైన), ఇబ్రాహీమ్ మరియు ఇస్'హాఖ్ లకు ప్రసాదించినట్లు నీకూ మరియు యఅఖూబ్ సంతతి వారికి సంపూర్ణంగా తన అనుగ్రహాన్ని ప్రసాదిస్తాడు. నిశ్చయంగా, నీ ప్రభువు సర్వజ్ఞుడు, మహా వివేకవంతుడు.

7. వాస్తవానికి, యూసుఫ్ మరియు అతని సోదరుల (గాథలో) అడిగే వారికి ఎన్నో సూచనలు ఉన్నాయి.

8. అప్పుడు వారు (యూసుఫ్ సోదరులు) పరస్పరం ఇలా అనుకున్నారు: "మనది ఒక బలమైన వర్గం, అయినప్పటికీ యూసుఫ్ మరియు అతని సోదరుడు (బెన్యామీన్) అంటే మన తండ్రికి మన

---

[4] య'అఖూబ్ ('అ.స.) ఒక ప్రవక్త, కాబట్టి తన కుమారుని స్వప్నాన్ని వెంటనే అర్థం చేసుకున్నారు.

కంటే ఎక్కువ ప్రేమ[5]. నిశ్చయంగా, మన తండ్రి స్పష్టమైన తప్పుడు అభిప్రాయంలో ఉన్నాడు."

9. (వారిలో ఒకడు ఇలా అన్నాడు): "యూసుఫ్ ను చంపండి, లేదా అతణ్ణి ఎక్కడైనా ఒంటరిగా వదలి పెట్టండి. ఇలా చేసినట్లయితే మీ తండ్రి ధ్యాస (ప్రేమ) కేవలం మీ వైపునకే మరలు తుంది. ఆ తరువాత మీరు (ప్రాయశ్చిత్తం చేసి) సద్వర్తనులుగా ప్రవర్తించండి."

10. వారిలో మరొకడు అన్నాడు: "యూసుఫ్ ను చంపకండి. మీరు (ఏదైనా) చేయాలనే అనుకుంటే! అతనిని ఒక లోతైన బావిలో పడవేయండి[6], ఎవరైనా బాటసారులు అతనిని తీసుకొని పోవచ్చు!"

11. వారు అన్నారు: "నాన్నా! నీవు యూసుఫ్ విషయంలో మమ్మల్ని ఎందుకు నమ్మవు? వాస్తవానికి మేము అతని శ్రేయోభిలాషులము!

12. రేపు అతనిని మా వెంట పంపండి, అతడు అక్కడ ఆడుకొని సంతోషపడతాడు. మరియు మేము తప్పక అతనికి రక్షకులముగా ఉంటాము."

13. (వారి తండ్రి యఅఖూబ్) అన్నాడు: "మీరు అతనిని తీసుకొని పోవటం నిశ్చయంగా నన్ను

---

[5] బెన్యామీన్ మరియు యూసుఫ్ ('అలైహిమ్ స.లు); య'అఖూబ్ ('అ.స.) మరియు రాచెల్ (Rachel) కుమారులు. మిగతా 10 మంది సోదరుల తండ్రి య'అఖూబ్ ('అ.స.) కాని తల్లులు వేరు.

[6] అల్-జుబ్బు: అంటే ఒక లోతైన బావి. దాని చుట్టు గోడ ఉండదు. మరియు నీళ్ళు కూడా చాలా లోతుగా ఉండవు.

చింతాక్రాంతునిగా చేస్తోంది. మీరు అతని విషయంలో ఏమరు పాటులో ఉన్నప్పుడు, అతనిని ఏదైనా తోడేలు తిని వేస్తుందేమోనని నేను భయపడుతున్నాను."

14. వారన్నారు: "మేము ఇంత పెద్ద బలగం ఉన్నప్పటికీ అతనిని తోడేలు తినివేస్తే! నిశ్చయంగా మేము పనికిరాని (చేతకాని) వారమే కదా!"

15. ఆ పిదప వారు అతనిని తీసుకొని పోయి ఒక లోతు బావిలో పడ వేద్దామని నిర్ణయించు కున్నారు. అప్పుడు మేము అతనికి దివ్యజ్ఞానం(వహీ) ద్వారా ఇలా తెలిపాము: "నీవు (ఒకరోజు) వారికి ఈ కార్యాన్ని జ్ఞప్తికి తెచ్చే సమయం వస్తుంది మరియు వారు నిన్ను గుర్తు పట్ట లేరు[7]."

16. మరియు ఇషా సమయంలో (చీకటి పడ్డ తరువాత) వారు తమ తండ్రి వద్దకు ఏడ్చు కుంటూ వచ్చారు.

17. వారన్నారు: "ఓ నాన్నా! మేము పరుగు పందాలలో మునిగి పోయాము. మరియు యూసుఫ్ ను మేము మా సామాగ్రి వద్ద విడిచి వెళ్లాము; అప్పుడు ఒక తోడేలు అతనిని తిని పోయింది. మరియు మేము సత్యం పలికినా నీవు మా మాట నమ్మకపోవచ్చు!"

---

[7] చూడండి, ఈ సూరహ్ యొక్క ఆయత్ లు 89-90.

18. వారు అతని అంగికి బూటకపు రక్తాన్ని పూసి తెచ్చారు. (వారి తండ్రి) అన్నాడు: "మీ ఆత్మ మిమ్మల్ని (ఒక ఘోర) కార్యాన్ని (విషయాన్ని), తేలికైనదిగా అనిపించేటట్లు చేసింది. ఇక (నా కొరకు) సహనమే మేలైనది. మరియు మీరు చెప్పే విషయంలో అల్లాహ్ సహాయమే నేను కోరేది!"

19. మరియు అటు వైపునకు ఒక బాటసారుల బృందం వచ్చింది. వారు తమ నీరు తెచ్చే మనిషిని పంపారు, అతడు (బావిలో) బొక్కెనను దింపాడు. (అతనికి బావిలో ఒక బాలుడు కనిపించగా) అన్నాడు: "ఇదిగో శుభవార్త! ఇక్కడ ఒక బాలుడున్నాడు." వారు అతనిని ఒక వ్యాపార సరుకుగా (బానిసగా) భావించి దాచుకున్నారు. మరియు వారు చేస్తున్నదంతా అల్లాహ్ కు బాగా తెలుసు.

20. మరియు వారు స్వల్ప ధరకు, కొన్ని దిర్హములకు మాత్రమే అతనిని అమ్ముకున్నారు[8]. మరియు అసలు వారు అతనికి ఎలాంటి ప్రాధాన్యతనివ్వలేదు.

21. మరియు అతనిని కొన్న ఈజిప్టు(మిస్ర్)వాసి తన భార్యతో[9] అన్నాడు: "ఇతనిని గౌరవంగా ఉంచుకో! బహుశా ఇతను మనకు లాభదాయకుడు కావచ్చు!

---

[8] ఈ అమ్ముకున్నవారు యూసుఫ్ ('అ.స.) సోదరులని కొందరు వ్యాఖ్యాతల అభిప్రాయం. ఇతరులు ఆ వ్యాపార బృందం వారని అంటారు.

[9] ఆమె పేరు జులేఖా లేక రాయిల్. ఆమె భర్త ఆ దేశపు విత్తమంత్రి.

లేదా మనం ఇతనిని కొడుకుగా చేసుకోవచ్చు!" మరియు ఈ విధంగా మేము యూసుఫ్ ను భూమిపై స్థానమిచ్చి అతనికి సంఘటనల గూఢార్థాన్ని (స్వప్నాల భావాన్ని) తెలియజేసే (విద్యను) నేర్పాము. అల్లాహ్ తన కార్యాన్ని పూర్తిచేయగల శక్తి కలిగిఉన్నాడు, కాని చాలామందికి ఇది తెలియదు

22. మరియు అతను తన నిండు యవ్వనానికి చేరుకున్నపుడు, మేము అతనికి వివేకాన్ని మరియు జ్ఞానాన్ని ప్రసాదించాము. మరియు ఈ విధంగా మేము సజ్జనులకు ప్రతిఫలము నొసంగుతాము.

23. మరియు అతను నివసించే ఇంటి స్త్రీ అతనిని మోహించి అతని మనస్సును చలింప జేయగోరి తలుపులు మూసి, అతనితో: "(నా వద్దకు) రా!" అని పిలిచింది. అతను: "నేను అల్లాహ్ శరణు గోరుతున్నాను! నిశ్చయంగా ఆయన! నా ప్రభువు, నాకు మంచి స్థానాన్ని ప్రసాదించాడు. నిశ్చయంగా, దుర్మార్గులు ఎన్నటికీ సాఫల్యం పొందలేరు." అని పలికాడు.

24. మరియు వాస్తవానికి, ఆమె అతనిని ఆశించింది. మరియు అతను కూడా ఆమె కోరికకు మొగ్గి ఉండేవాడే! ఒకవేళ అతను తన ప్రభువు యొక్క నిదర్శనాన్ని చూసి ఉండక పోతే! ఈ విధంగా జరిగింది, మేము పాపం మరియు అశ్లీలతను అతని నుండి దూరంగా ఉంచటానికి. నిశ్చయంగా,

అతను మేము ఎన్నుకున్న దాసులలో ఒకడు.
25. మరియు వారిద్దరు (ఒకరి వెనుక ఒకరు) తలుపు వైపుకు పరుగెత్తారు. ఆమె అతని అంగిని వెనుక నుండి లాగి చించింది. వారిద్దరు తలుపు వద్ద ఆమె భర్తను చూశారు. ఆమె (తన భర్తతో) అన్నది: "నీ భార్యను చెరుపాలని తలచిన వానికి చెరసాలలో ఉంచటం, లేదా బాధాకరమైన శిక్ష విధించటం తప్ప, మరొక శిక్ష ఏముంటుంది?"
26. (యూసుఫ్) అన్నాడు: "ఈమెనే, నన్ను మోహింప జేయగోరింది!" ఆమె కుటుంబం వారిలో నుండి అక్కడ ఉన్న ఒకడు ఇలా సాక్ష్యమిచ్చాడు: "ఒకవేళ అతని అంగి, ముందు నుండి చినిగి ఉంటే ఆమె పలికేది సత్యం మరియు అతను అసత్యుడు!
27. కానీ ఒకవేళ అతని అంగి వెనుక నుండి చినిగి ఉంటే! ఆమె పలికేది అబద్ధం మరియు అతను సత్యవంతుడు!"
28. అతని అంగి వెనుక నుండి చినిగి ఉండటాన్ని చూసి (ఆమె భర్త) ఇలా అన్నాడు: "నిశ్చయంగా, ఇది మీ స్త్రీల పన్నాగం. నిశ్చయంగా మీ పన్నాగం ఎంతో భయంకరమైనది!
29. ఓ యూసుఫ్! ఈ విషయాన్ని పోనివ్వు!" (తన భార్యతో అన్నాడు): "నీవు నీ పాపానికి క్షమాపణ కోరుకో, నిశ్చయంగా నీవే తప్పు చేసిన దానవు."
30. మరియు నగర స్త్రీలు పరస్పరం ఇలా చర్చించుకోసాగారు. "అజీజ్ భార్య తన యువ

బానిసను మోహింపగోరింది. నిశ్చయంగా ఆమె గాఢమైన ప్రేమలో పడి ఉంది. నిశ్చయంగా, ఆమె స్పష్టమైన పొరపాటులో ఉన్నట్లు మేము చూస్తున్నాము."

31. ఆమె వారి నిందారోపణలు విని, వారికి ఆహ్వానం పంపింది. వారికి ఒక మంచి విందు ఏర్పాటు చేసి, ఒక్కొక్క స్త్రీకి ఒక్కొక్క కత్తి ఇచ్చి, (యూసుఫ్ తో): "వారి ముందుకు రా!" అని అన్నది ఆ స్త్రీలు అతనిని చూడగానే నివ్వెరపోయారు మరియు (ఆశ్చర్యంతో చేతులలో ఉన్న కత్తులతో) తమ చేతులను కోసుకున్నారు. (అప్రయత్నంగా) అన్నారు: "అల్లాహ్ మహిమ! (హాషలిల్లాహ్) ఇతను మానవుడు మాత్రం కాడు! ఇతను గొప్ప దేవదూతయే కాగలడు!"

32. ఆమె అన్నది: "ఇతనే ఆ మనిషి! ఇతనిని గురించే మీరు నాపై నిందలు మోపింది. వాస్తవానికి నేనే ఇతనిని మోహింప జేయటానికి ప్రయత్నించాను, కాని ఇతను తప్పించు కున్నాడు. కాని ఇతను ఇక నేను చెప్పింది చేయకుంటే తప్పక చెరసాల పాలు కాగలడు, లేదా తీవ్ర అవమానానికి గురి కాగలడు!"

33. (యూసుఫ్) అన్నాడు: "ఓ నా ప్రభూ! ఈ స్త్రీలు నన్ను పిలిచే విషయాని కంటే నాకు చెరసాలయే ప్రియమైనది. నీవు వారి ఎత్తుగడల నుండి నన్ను తప్పించక పోతే, నేను వారి వలలో చిక్కిపోయే వాడిని మరియు అజ్ఞానులలో చేరి పోయేవాడిని."

34. అప్పుడు అతని ప్రభువు అతని ప్రార్థనను అంగీకరించి, అతనిని ఆ స్త్రీల పన్నాగాల నుండి తప్పించాడు. నిశ్చయంగా, ఆయనే సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

35. ఆ తరువాత వారికి - (అతను నిర్దోషి అనే) సూచనలు కనిపించినా - అతనిని కొంత కాలం చెరసాలలో ఉంచాలని అనిపించింది.

36. మరియు అతనితో బాటు ఇద్దరు యువకులు కూడా చెరసాలలో ప్రవేశించారు. వారిలో ఒకడు అన్నాడు: "నేను సారాయి పిండుతూ ఉన్నట్లు కల చూశాను!" రెండో వాడు అన్నాడు: "నేను నా తలపై రొట్టెలు మోస్తున్నట్లు, వాటిని పక్షులు తింటున్నట్లు కలలో చూశాను." (ఇద్దరూ కలిసి అన్నారు): "మాకు దీని భావాన్ని తెలుపు. నిశ్చయంగా, మేము నిన్ను సజ్జనునిగా చూస్తున్నాము."

37. (యూసుఫ్) అన్నాడు: "మీరిద్దరికి తినటానికి ఇవ్వబడే భోజనం వస్తుంది కదా! అది రాకముందే నేను వీటి (మీ కలల) భావాన్ని మీ ఇద్దరికి తెలుపుతాను. ఇది నా ప్రభువు నేర్పిన విద్యలలోనిదే. నిశ్చయంగా నేను అల్లాహ్ ను విశ్వసించనివారి మరియు పరలోకాన్ని తిరస్కరించేవారి ధర్మాన్ని వదలి పెట్టాను.

38. మరియు నేను నా తండ్రి తాతలైన ఇబ్రాహీమ్, ఇస్ హాఖ్ మరియు యఅఖూబ్ ల యొక్క ధర్మాన్ని అవలంబించాము. అల్లాహ్ కు ఎవడినైనా

సాటి కల్పించటం మా విధానం కాదు. వాస్తవానికి ఇది మాపై మరియు సర్వ మానవులపై ఉన్న అల్లాహ్ యొక్క అనుగ్రహం. కాని చాలా మంది ప్రజలు కృతజ్ఞతలు చూపరు.

**39.** ఓ నా ఇద్దరు చెరసాల సహచరులారా! ఏమీ? చాలామంది విభిన్న ప్రభువులు మేలా? లేక, తన సృష్టిపై సంపూర్ణాధికారం గల అద్వితీయుడైన[10] అల్లాహ్ మేలా?

**40.** ఆయన (అల్లాహ్) ను వదలి మీరు ఆరాధిస్తున్నవి - మీరు మరియు మీ తండ్రి తాతలు కల్పించుకున్న - పేర్లు మాత్రమే! దాని కొరకు అల్లాహ్ ఎలాంటి ప్రమాణాన్ని అవతరింప జేయలేదు. నిశ్చయంగా ఆజ్ఞాపించే అధికారం కేవలం అల్లాహ్ కే చెందుతుంది. ఆయనను తప్ప మరొకరిని ఆరాధించరాదని ఆయన ఆజ్ఞాపించాడు. ఇదే సరైన ధర్మం, కానీ చాలా మందికి ఇది తెలియదు[11].

**41.** ఓ నా ఇద్దరు చెరసాల సహచరులారా! మీలో ఒకడు తన యజమానికి మద్యపానం (సారాయి) త్రాగిస్తూ ఉంటాడు. ఇక రెండవ వాడు సిలువపై ఎక్కించబడతాడు మరియు అతని నెత్తిపై నుండి

[10] అల్-వాహిద్: The One, The Sole. అద్వితీయుడు, ఒకే ఒక్కడు, చూడండి. 2:163. అల్ ఖహ్హారు: Suduer, Inrrestible, OverPowerer, తన సృష్టి మీద ప్రబలుడు, అల్ - ఖాహిరుకు చూడండి, 6:18, 61. అల్ వాహిద్, అల్ ఖహ్హార్ లకు చూడండి, 13:16 14:48, 38:65, 39:4, 40:16. ఇవి అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లు.

[11] చూడండి, 30:30 12:103 మరియు 106.

పక్షులు తింటూ ఉంటాయి. మీరు అడుగుతున్న
(కలల) విషయం గురించి ఈ విధమైన తీర్పు
ఇవ్వబడుతోంది!"

**42.** మరియు వారిద్దరిలో విడుదల పొందుతాడని
భావించని వాడితో (యూసుఫ్) అన్నాడు: "నీ
స్వామి దగ్గర నా ప్రస్తావన చెయ్యి." కాని అతనిని
తన స్వామి దగ్గర ప్రస్తావన చేయటాన్ని షైతాన్
మరపింప జేశాడు, కావున (యూసుఫ్) చెరసాలలో
మరికొన్ని సంవత్సరాలు ఉండిపోయాడు[12].

**43.** (ఒకరోజు) రాజు అన్నాడు: "వాస్తవానికి నేను
(కలలో) ఏడు బలిసిన ఆవులను, ఏడు బక్కచిక్కిన
(ఆవులు) తిని వేస్తున్నట్లు మరియు ఏడు పచ్చి
వెన్నులను మరొక ఏడు ఎండిపోయిన వాటిని
చూశాను. ఓ సభాసదులారా! మీకు స్వప్నాల
భావం తెలిస్తే నా స్వప్నాల భావాన్ని తెలుపండి!"

**44.** వారన్నారు: "ఇవి పీడకలలు మరియు మాకు
కలల గూఢార్థం తెలుసుకునే నైపుణ్యం లేదు"

**45.** ఆ ఇద్దరు బందీలలో నుండి విడుదల పొందిన
వ్యక్తికి చాలా కాలం తరువాత ఇప్పుడా విషయం
గుర్తుకు వచ్చింది[13]. అతడు అన్నాడు: "నేను
దీని గూఢార్థాన్ని మీకు తెలుపుతాను దానికి
నన్ను (యూసుఫ్ వద్దకు) పంపండి."

**46.** (అతడు అన్నాడు): "యూసుఫ్! సత్యవంతుడా!

---

[12] బిద్'ఉన్: అనే పదం, 3 నుండి 9 సంఖ్యల కొరకు వాడబడుతోంది.

[13] ఉమ్మతున్: అనే శబ్దానికి విద్వాంసులందరి ఏకైక అభిప్రాయం ఇక్కడ 'కాలం' అనే ఉంది.

నాకు - ఏడు బలిసిన ఆవులను, ఏడు బక్కచిక్కిన ఆవులు తిని వేయటాన్ని; మరియు ఏడు పచ్చి వెన్నుల మరి ఏడు ఎండిపోయిన (వెన్నుల) - గూఢార్థమేమిటో చెప్పు. నేను (రాజసభలోని) ప్రజల వద్దకు పోయి (చెబుతాను), వారు దానిని తెలుసుకుంటారు."

**47.** (యూసుఫ్) అన్నాడు: "మీరు యథాప్రకారంగా ఏడు సంవత్సరాలు సేద్యం చేస్తూ ఉంటారు, కాని మీరు కోసిన పంటలో కొంత భాగాన్ని మాత్రమే తినటానికి ఉపయోగించుకొని, మిగిలినదంతా,వెన్నులతోనే కొట్లలో ఉంచి (భద్రపరచండి).

**48.** ఆ తరువాత చాలా కఠినమైన ఏడు సంవత్సరాలు వస్తాయి, వాటిలో మీరు ముందే నిలువ చేసి ఉంచిన దానిని తింటారు. మీరు (విత్తనం కోసం) భద్రంగా ఉంచుకున్న కొంతభాగం తప్ప![14]

**49.** ఆ తరువాత ఒక సంవత్సరం వస్తుంది. అందులో ప్రజలకు పుష్కలమైన వర్షాలు కురుస్తాయి. అందులో వారు (రసం/నూనె) తీస్తారు (పిండుతారు)."

**50.** రాజు ఇలా అన్నాడు: "అతనిని నా వద్దకు తీసుకు రండి!" రాజదూత అతని వద్దకు వచ్చినపుడు (యూసుఫ్) అన్నాడు: "నీవు తిరిగి పోయి నీ స్వామిని అడుగు: 'తమ చేతులు కోసుకున్న

---

[14] మిమ్మాతు'హ్'సినూన్: అంటే విత్తనాల కొరకు భద్రపరచిన ధాన్యం.

స్త్రీల వాస్తవ విషయం ఏమిటి?'[15] నిశ్చయంగా, నా ప్రభువుకు వారి కుట్ర గురించి బాగా తెలుసు."

**51.** (రాజు స్త్రీలను) విచారించాడు: "మీరు యూసుఫ్ ను మోహింపజేయటానికి ప్రయత్నించిన విషయమేమిటి?" వారందరూ (ఒకేసారిగా) అన్నారు: "అల్లాహ్ రక్షించుగాక! మేము అతనిలో ఏ పాపాన్ని చూడలేదు!" అజీజ్ భార్య అన్నది: "ఇప్పుడు సత్యం బయట పడింది. నేనే అతనిని మోహింప జేయటానికి ప్రయత్నించాను. మరియు నిశ్చయంగా, అతను సత్యవంతుడు."

**52.** (అప్పుడు యూసుఫ్) అన్నాడు: "నేను ఇదంతా చేసింది నిశ్చయంగా, నేను (అజీజ్ కు) గోప్యంగా ఎలాంటి నమ్మకద్రోహం చేయలేదని తెలుపటానికే మరియు నిశ్చయంగా, అల్లాహ్ నమ్మకద్రోహుల కుట్రను సాగనివ్వడు.

**53.** "మరియు నన్ను నేను (ఈ నింద నుండి) విముక్తి

---

[15] యూసుఫ్ ('అ.స.) నిందితుడిగానే, కేవలం రాజు కనికరం వల్లనే కారాగారం నుండి విముక్తి పొందదలచుకోలేదు. అతను తనపై మోపబడిన నిందల నుండి పవిత్రుడనని, నిరూపించదలచు కున్నారు. కాబట్టి జవాబిచ్చారు: "అయితే, తమ చేతులు కోసుకున్న స్త్రీల వాస్తవ విషయమేమిటి" అని. ఇదే సత్యవంతులు పవిత్రులు అయిన అల్లాహ్ (సు.తా.) దా'ఈల విధానం.

చేసుకోవడం లేదు[16]. వాస్తవానికి మానవ ఆత్మ చెడు (పాపం) చేయటానికి పురికొల్పుతూ ఉంటుంది - నా ప్రభువు కరుణించిన వాడు తప్ప - నిశ్చయంగా, నా ప్రభువు క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత."

54. మరియు రాజు[17] అన్నాడు: "అతనిని నా వద్దకు తీసుకొని రండి నేను అతనిని ప్రత్యేకంగా నా కొరకు నియమించుకుంటాను." (యూసుఫ్) అతడితో మాట్లాడినప్పుడు (రాజు) అన్నాడు: "నిశ్చయంగా, నీవు ఈనాటి నుండి మావద్ద ఉన్నతస్థానంలో నమ్మకంగల వ్యక్తిగా పరిగణింప బడతావు."

55. (యూసుఫ్) అన్నాడు: "నన్ను దేశపు కోశాగారాధికారిగా నియమించండి. నిశ్చయంగా నేను తెలివి గల మంచి రక్షకుడను."

56. మరియు ఈ విధంగా మేము యూసుఫ్ కు భూమిపై అధికార మొసంగాము. దానితో అతను తన ఇష్ట ప్రకారం వ్యవహరించ గలిగాడు. మేము కోరిన వారి మీద మా కారుణ్యాన్ని ధార పోస్తాము. మరియు మేము సజ్జనుల ప్రతిఫలాన్ని వ్యర్థం చేయము.

57. మరియు విశ్వసించి భయభక్తులుగలవారికి,

---

[16] ఈ వాక్యాన్ని కొందరు వ్యాఖ్యాతలు యూసుఫ్ ('అ.స.) ఉచ్చరించారని, మరికొందరు ఇది 'అ'జీ'జ్ యొక్క ప్రవచనమని అంటారు (ఇబ్నె-కసీ'ర్).

[17] ఆ రాజు పేరు రయ్యాన్ బిన్ వలీద్ అంటారు.

పరలోక ప్రతిఫలమే ఎంతో ఉత్తమమైనది.

58. మరియు యూసుఫ్ (జోసెఫ్) సోదరులు వచ్చి అతని ముందు ప్రవేశించారు. అతను వారిని గుర్తించాడు కాని వారు అతనిని గుర్తించ లేక పోయారు.

59. మరియు అతను వారి సామగ్రిని సిద్ధపరచిన తరువాత వారితో అన్నాడు: "మీ నాన్న కుమారుడైన మీ సోదరుణ్ణి[18] మీరు (మళ్ళీ వచ్చేటప్పుడు) నా వద్దకు తీసుకొని రండి. ఏమీ? నేను ఏ విధంగా నిండుగా కొలిచి ఇస్తున్నానో మీరు చూడటం లేదా? నిశ్చయంగా ఆతిథ్యం చేసేవారిలో నేను ఉత్తముడను.

60. కాని మీరు అతనిని నా వద్దకు తీసుకొని రాకపోతే నా వద్ద మీకు ఎలాంటి (ధాన్యం) దొరకదు, అలాంటప్పుడు మీరు నా దరిదాపులకు కూడా రాకండి!"

61. వారు ఇలా అన్నారు: "మేము అతనిని గురించి అతని తండ్రిని ఒప్పించటానికి ప్రయత్నిస్తాము. మరియు మేము అలా తప్పకుండా చేస్తాము."

62. మరియు (యూసుఫ్) తన సేవకులతో: "వారు (ధాన్యాన్ని కొనటానికి) తెచ్చిన సామగ్రిని (తిరిగి) వారి సంచులలో పెట్టండి. వారు తిరిగి తమ

---

[18] బెన్యామీన్ మరియు యూసుఫ్ ('అ.స.) ఇద్దరూ య'అఖూబ్ ('అ.స.) భార్య రాచెల్ (Rachel) కుమారులు. మిగతా పది మంది యూసుఫ్ ('అ.స.) యొక్క సవతి సోదరులు.

కుటుంబం వారి వద్దకు పోయిన తరువాత అది తెలుసుకొని బహుశా తిరిగి రావచ్చు!" అని అన్నాడు.

63. వారు తమ తండ్రి దగ్గరకు తిరిగి వచ్చిన తరువాత అన్నారు: "నాన్నా! ఇక ముందు మనకు ధాన్యం ఇవ్వడానికి తిరస్కరించారు, కావున ధాన్యం తేవాలంటే! నీవు మా తమ్ముణ్ణి (బెన్యామీన్ ను) మాతోపాటు పంపు మరియు నిశ్చయంగా, మేము అతనిని కాపాడుతాము."

64. (యఅఖూబ్) అన్నాడు: "ఏమీ? నేను మిమ్మల్ని అతని విషయంలో - ఇది వరకు అతని సోదరుని విషయంలో నమ్మినట్లు - నమ్మాలా? వాస్తవానికి, అల్లాహ్ యే ఉత్తమ రక్షకుడు. ఆయనే కరుణించేవారిలో అందరికంటే ఉత్తమమైన కారుణ్యమూర్తి."

65. మరియు వారు తమ మూటలను విప్పగా తమ సొమ్ము కూడా తమకు తిరిగి ఇవ్వబడటాన్ని చూసి తమ తండ్రితో అన్నారు: "నాన్నా! (చూడండి) ఇంకేం కావాలి? మన సొమ్ము కూడా మనకు తిరిగి ఇవ్వబడింది. మరియు మేము మన ఇంటివారి కొరకు మరింత ఎక్కువ ధాన్యం తేగలము. మేము మా తమ్ముణ్ణి కాపాడుకుంటాము. ఇంకా ఒక ఒంటె మోసే బరువు (ధాన్యం) కూడా ఎక్కువగా తీసుకొని రాగలము. ఇక అంత ధాన్యం కూడా (అదనంగా) సులభంగా లభిస్తుంది కదా!"

66. (యఅఖూబ్) అన్నాడు: "మీరు ముట్టడికి గురి అయితే తప్ప, అతనిని నా వద్దకు తప్పక తీసుకు రాగలమని అల్లాహ్ పేరుతో నా ముందు ప్రమాణం చేస్తేనే గానీ, నేను అతనిని మీ వెంట పంపను." వారు ప్రమాణం చేసిన తరువాత, అతను అన్నాడు: "మన ఈ మాటలకు అల్లాహ్ యే సాక్షి!"

67. (ఇంకా) ఇలా అన్నాడు: "ఓ నా కుమారులారా! మీరందరూ ఒకే ద్వారం గుండా ప్రవేశించ కండి, మీరు వేర్వేరు ద్వారాల గుండా ప్రవేశించండి[19]. నేను మిమ్మల్ని అల్లాహ్ (సంకల్పం) నుండి ఏ విధంగానూ తప్పించలేను. అంతిమతీర్పు కేవలం అల్లాహ్ కే చెందు తుంది. నేను ఆయనను మాత్రమే నమ్ముకున్నాను. మరియు ఆయనను నమ్ముకున్న వారు కేవలం ఆయన పైననే ఆధారపడి ఉంటారు."

68. మరియు వారు తమ తండ్రి ఆజ్ఞ ప్రకారం (ఆ నగరంలో వేర్వేరు ద్వారాల గుండా) ప్రవేశించారు.

---

[19] ఒకవేళ వారు 11 మంది ఒకే ద్వారం నుండి ప్రవేశిస్తే, బహుశా వారికి దిష్టి తగులవచ్చని వారి తండ్రి భావించారు. దైవప్రవక్త ('స'అస) ప్రవచించారు: 'అల్ 'ఐను 'హఖ్ఖ్' అంటే దిష్టి తగలటం నిజమే! ('స'హీ'హ్ బు'ఖారీ, కితాబ్ తిబ్బ్, బాబ్ అల్ 'ఐను 'హఖ్ఖ్, మరియు 'స'హీ'హ్ ముస్లిం, కితాబ్ అస్ సలాం, బాబ్ అత్ 'తిబ్బ్). అతను దానికి తోడుగా ఈ దుఆలు కూడా తెలిపారు. మీకు ఏదైనా వస్తువు నచ్చితే, 'బారకల్లాహ్' అనండి. (ముఅ'త్తఅ' ఇమామ్ మాలిక్. అల్బానీ ప్రమాణీకం నం. 1286) మాషా' అల్లాహ్ లా ఖువ్వత ఇల్లా బిల్లాహ్ (18:39) చదవండి. సూరహ్ అల్ ఫలఖ్ (113), సూరహ్ అన్ నాస్ (114) చదవండి. (జామె తిర్మిజీ', అబ్ వాబ్ అ'త్-'తిబ్).

అది కేవలం యఅఖూబ్ మనస్సులోని కోరికను పూర్తి చేయటానికి మాత్రమే, కాని అల్లాహ్ సంకల్పం నుండి తప్పించుకోవటానికి, వారికి ఏ మాత్రమూ పనికి రాలేదు. మేము అతనికి నేర్పిన జ్ఞానం ప్రకారం అతను జ్ఞానవంతుడే కాని చాలా మందికి తెలియదు[20].

**69.** మరియు వారు యూసుఫ్ వద్ద ప్రవేశించగా అతను తన సోదరుణ్ణి (బెన్యామీన్ ను) తన దగ్గరికి తీసుకున్నాడు. అతనితో అన్నాడు: "వాస్తవానికి! నేనే నీ (తప్పిపోయిన) సోదరుడను, కావున వారు ఇంత వరకు చేస్తూ వచ్చిన పనులకు నీవు దుఃఖపడకు."

**70.** వారికి వారి సామగ్రి సిద్ధపరచిన తరువాత తన సోదరుని జీను సంచిలో ఒక నీరు త్రాగే పాత్రను[21] పెట్టాడు. ఆ పిదప ఒక ప్రకటించేవాడు ఇలా ప్రకటించాడు: "ఓ బిడారు వారలారా! మీరు నిశ్చయంగా దొంగలు!"

**71.** వారు(యూసుఫ్ సోదరులు) వారివైపు తిరిగి ఇలా అన్నారు: "మీ వస్తువు ఏదైనా పోయిందా?"

**72.** (కార్యకర్తలు) అన్నారు: "రాజు గారి పాత్రపోయింది! మరియు ఎవడు దానిని తీసుకొని వస్తాడో అతనికి ఒక ఒంటె బరువు ధాన్యం (బహుమానంగా)

---

[20] ఆపదల నుండి తప్పించుకోవటానికి ప్రయత్నించటం మంచిదే, కాని ఎంత ప్రయత్నించినా విధివ్రాత నుండి తప్పించుకోవటం సాధ్యం కాని పని.

[21] ఆ నీరు త్రాగే కప్పు వెండిది లేక బంగారుది.

ఇవ్వబడుతుంది మరియు నేను దానికి బాధ్యుణ్ణి."

73. (యూసుఫ్ సోదరులు) అన్నారు: "అల్లాహ్ సాక్షి! మీకు బాగా తెలుసు. మేము మీ దేశంలో సంక్షోభం రేకెత్తించటానికి రాలేదు మరియు మేము దొంగలము కాము!"

74. (కార్యకర్తలు) అన్నారు: "మీరు అబద్ధమాడుతున్నారని తెలిస్తే దానికి శిక్ష ఏమిటి?"

75. వారు (యూసుఫ్ సోదరులు) జవాబిచ్చారు: "ఎవడి సంచిలో ఆ పాత్ర దొరకుతుందో అతడు దానికి పరిహారంగా (బానిసగా) ఉండాలి. మేము ఇదే విధంగా దుర్మార్గులను శిక్షిస్తాము[22]."

76. అప్పుడతడు తన సోదరుని మూట వెదికే ముందు, వారి (సవతి సోదరుల) మూటలను వెతకటం ప్రారంభించాడు. చివరకు తన సోదరుని మూట నుండి దానిని (పాత్రను) బయటికి తీశాడు. ఈవిధంగా మేము యూసుఫ్ కొరకు యుక్తి చూపాము. ఈ విధంగా - అల్లాహ్ ఇచ్ఛయే లేకుంటే - అతను తన సోదరుణ్ణి, రాజధర్మం ప్రకారం పొంద లేకపోయేవాడు[23]. మేము కోరిన

---

[22] య'అఖూబ్ ('అ.స.) షరీయత్ లో, దొంగతనం చేసినవాడు, పట్టుబడిన తరువాత దొంగిలించబడిన సరుకు యజమాని దగ్గర బానిసగా ఉండాలి. కావున వారు కూడా ఆ శిక్షనే ప్రతిపాదించారు.

[23] ఈజిప్టు రాజ్యధర్మం ప్రకారం యూసుఫ్ ('అ.స.) దొంగగా నిరూపించబడినా (బెన్యామీన్ ను) పొంద లేకపోయేవారు. కావున అతను, తన మారు సోదరులను మొదటనే ప్రశ్నించి దొంగతనం చేసిన వారి విషయంలో వారి అభిప్రాయాన్ని తీసుకున్నారు.

వారి స్థానాలను పెంచుతాము. మరియు జ్ఞానులందరినీ మించిన జ్ఞాని ఒకడు (అల్లాహ్) ఉన్నాడు.

77. (అతని సోదరులన్నారు): "ఇతడు దొంగతనం చేసినా (ఆశ్చర్యం లేదు)! వాస్తవానికి ఇతని సోదరుడు కూడా ఇంతకు ముందు దొంగతనం చేశాడు." ఇది విని యూసుఫ్ (కోపాన్ని) తన హృదయంలోనే దాచుకున్నాడు మరియు దానిని వారిపై వ్యక్త పరచలేదు. (తన మనస్సులో) అనుకున్నాడు: "మీరు చాలా నీచమైనవారు మరియు మీరు పలికేది అల్లాహ్ కు బాగా తెలుసు!"

78. వారన్నారు: "ఓ సర్దార్ (అజీజ్) వాస్తవానికి, ఇతని తండ్రి చాలా ముసలివాడు, కావున ఇతనికి బదులుగా నీవు మాలో ఒకనిని ఉంచుకో. వాస్తవానికి, మేము నిన్ను మేలు చేసేవానిగా చూస్తున్నాము."

79. అతను అన్నాడు: "అల్లాహ్ నన్ను రక్షించుగాక! మా సొమ్ము ఎవరి వద్ద దొరికిందో అతనిని విడిచి, మరొకతనిని మేమెలా పట్టుకోగలము. ఒకవేళ అలా చేస్తే నిశ్చయంగా, మేము దుర్మార్గులమవుతాము."

80. తరువాత వారు అతని పట్ల నిరాశులై, ఆలోచించటానికి ఏకాంతంలో చేరారు! వారిలో పెద్దవాడు అన్నాడు: ఏమీ? మీ తండ్రి వాస్తవానికి మీతో అల్లాహ్ పై ప్రమాణం తీసుకున్న విషయం మీకు గుర్తులేదా? మరియు ఇంతకు పూర్వం మీరు యూసుఫ్ విషయంలో కూడా

మాట తప్పారు కదా? కావున నేను నా తండ్రి నాకు అనుమతి ఇవ్వనంత వరకు లేదా అల్లాహ్ నా గురించి తీర్పు చేయనంత వరకు, నేను ఈ దేశాన్ని వదలను. మరియు ఆయనే తీర్పు చేసేవారిలో అత్యుత్తముడు."

81. (ఇంకా ఇలా అన్నాడు): "మీరు నాన్న దగ్గరికి పోయి అతనితో ఇలా చెప్పండి: 'నాన్నా! వాస్తవానికి నీ కుమారుడు దొంగతనం చేశాడు. మేము అతనిని (దొంగతనం చేస్తూ ఉండగా) చూడలేదు! మాకు తెలిసిందే (మేము చెబుతున్నాము). మరియు వాస్తవానికి రహస్యంగా జరిగే దానిని మేము చూడలేము కదా!

82. మరియు మేము ఉన్న నగరవాసులను మరియు మేము కలిసి తిరిగి వచ్చిన బిడారు వారిని కూడా అడగండి. మరియు మేము నిశ్చయంగా సత్యం పలుకుతున్నాము.'"

83. (యఅఖూబ్) అన్నాడు: "కానీ, మీ (దుష్ట) మనస్సులు మీచేత మరొక ఘోరకార్యాన్ని తేలికగా చేయించాయి. ఇక నా కొరకు సహనమే మేలైనది. ఇక అల్లాహ్ యే! వారందరినీ నా వద్దకు తీసుకు రావచ్చు! నిశ్చయంగా, ఆయనే సర్వజ్ఞుడు, మహా వివేకవంతుడు."

84. మరియు అతను వారి నుండి ముఖం త్రిప్పుకొని అన్నాడు: "అయ్యో! యూసుఫ్" అతని కన్నులు, దుఃఖం వలన తెల్లబడ్డాయి (చూపు పోయింది). అయినా అతను దానిని (వెలిబుచ్చకుండా) అణచుకున్నాడు.

**85.** అతని (కుమారులు) అన్నారు: "అల్లాహ్ తోడు! నీవు వ్యాధితో కృశించిపోయే వరకో లేదా నశించిపోయే వరకో యూసుఫ్ ను జ్ఞాపకం చేసుకోవటం మానవు."

**86.** (యఅఖూబ్) అన్నాడు: "వాస్తవానికి నా ఆవేదనను మరియు నా దుఃఖాన్ని నేను కేవలం అల్లాహ్ తో మాత్రమే మొరపెట్టుకోగలను మరియు మీకు తెలియనిది నాకు అల్లాహ్ ద్వారా తెలుస్తుంది.

**87.** నా కుమారులారా! మీరు పోయి యూసుఫ్ ను మరియు అతని సోదరుణ్ణి గురించి దర్యాప్తు చేయండి మరియు అల్లాహ్ అనుగ్రహం పట్ల నిరాస చెందకండి. నిశ్చయంగా సత్య తిరస్కార జాతికి చెందినవారు తప్ప, ఇతరులు అల్లాహ్ అనుగ్రహం పట్ల నిరాశ చెందరు[24]."

**88.** వారు అతని (యూసుఫ్) దగ్గరకు (మరల) వచ్చి[25] అన్నారు: "ఓ సర్దార్ (అజీజ్)! మేము మా కుటుంబం వారు చాలా ఇబ్బందులకు గురయ్యాము. మరియు మేము చాలా తక్కువ సామగ్రి తెచ్చాము, కాని మాకు పూర్తి సామగ్రి (ధాన్యాన్ని) దాన ధర్మ రూపంలోనైనా సరే ఇవ్వండి. నిశ్చయంగా, అల్లాహ్ దానధర్మాలు చేసే వారికి మంచి ప్రతిఫలం ఇస్తాడు."

---

[24] చూడండి, 15:56.
[25] ధాన్యం కొరకు, ఇది వారి మూడవ ఈజిప్టు ప్రయాణం.

89. (యూసుఫ్) అడిగాడు: "అజ్ఞానంలో పడి మీరు యూసుఫ్ మరియు అతని సోదరునితో ఎలా వ్యవహరించారో మీకు గుర్తుందా?"

90. వారన్నారు: "ఏమిటి? వాస్తవానికి నీవే యూసుఫ్ వా?" అతను జవాబిచ్చాడు: "నేనే యూసుఫ్ ను మరియు ఇతడు (బెన్యామీన్) నా సోదరుడు. నిశ్చయంగా, అల్లాహ్ మమ్మల్ని అనుగ్రహించాడు. నిశ్చయంగా, ఎవరైతే దైవభీతి కలిగి వుండి, సహనంతో ఉంటారో, అలాంటి సజ్జనుల ప్రతిఫలాన్ని అల్లాహ్ ఎన్నడూ వృథా చేయడు."

91. వారన్నారు: "అల్లాహ్ తోడు! వాస్తవంగా, అల్లాహ్ నీకు మాపై ఔన్నత్యాన్ని ప్రసాదించాడు. మరియు నిశ్చయంగా మేము అపరాధులము!"

92. (యూసుఫ్) అన్నాడు: "ఈరోజు మీపై ఎలాంటి నిందలేదు[26]. అల్లాహ్ మిమ్మల్ని క్షమించుగాక! ఆయన కరుణించే వారిలో అందరి కంటే ఉత్తమమైన కారుణ్యమూర్తి!

93. మీరు నా ఈ చొక్కా తీసుకొని పోయి దానిని నా తండ్రి ముఖం మీద వేయండి. అతనికి దృష్టి వస్తుంది. మరియు మీరు మీ కుటుంబం వారినందరినీ నా వద్దకు తీసుకొని రండి."

---

[26] ఏ విధంగానైతే యూసుఫ్ ('అ.స.) తనను చంపగోరి బావిలో పడవేసిన తన సోదరులను క్షమించారో! అదే విధంగా మక్కా విజయం రోజు దైవప్రవక్త ము'హమ్మద్ ('స'అస) తతను చంపగోరిన, తన తెగవారైన, మక్కా ఖురైషులను క్షమించారు.

94. ఆ బిడారం (ఈజిప్టు నుండి) బయలు దేరగానే వారి తండ్రి అన్నాడు: "మీరు నన్ను బుద్ధి నశించిన ముసలివాడు అన్నా! నిశ్చయంగా నాకు యూసుఫ్ సువాసన వస్తోంది."

95. (అతని దగ్గర ఉన్నవారు) అన్నారు: "అల్లాహ్ తోడు! నిశ్చయంగా నీవు నీ పూర్వపు పొరపాటులోనే పడి ఉన్నావు."

96. ఆ తరువాత శుభవార్త తెలిపేవాడు వచ్చి, (యూసుఫ్ చొక్కాను) అతని ముఖం మీద వేయగానే అతని దృష్టి తిరిగి వచ్చేసింది. (అప్పుడు) అతను అన్నాడు: "ఏమీ? నేను మీతో అనలేదా? 'మీకు తెలియనిది నాకు అల్లాహ్ ద్వారా తెలుస్తుందని?'"

97. వారన్నారు: "ఓ మా నాన్నా! మా పాపాల క్షమాపణకై (అల్లాహ్ ను) ప్రార్థించు. నిశ్చయంగా, మేము అపరాధులము."

98. అతను అన్నాడు: "మిమ్మల్ని క్షమించమని నేను నా ప్రభువును ప్రార్థించగలను. నిశ్చయంగా, ఆయన క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత!"

99. తరువాత వారందరూ యూసుఫ్ వద్దకు

వెళ్ళినప్పుడు, అతను తన తల్లిదండ్రులకు[27] స్థానమిచ్చి అన్నాడు: "ఈజిప్టులో ప్రవేశించండి. అల్లాహ్ కోరితే, మీకు సుఖశాంతులు దొరుకుతాయి"

**100.** మరియు అతను తన తల్లిదండ్రులను సింహాసనం మీద కూర్చోబెట్టుకున్నాడు. మరియు వారందరూ అతని ముందు సాష్టాంగపడ్డారు[28]. మరియు (యూసుఫ్) అన్నాడు: "ఓ నా తండ్రీ! నేను పూర్వం కన్న కల యొక్క భావం ఇదే కదా! నా ప్రభువు వాస్తవంగా దానిని సత్యం చేసి చూపాడు. మరియు వాస్తవంగా నన్ను చెరసాల నుండి బయటికి తీసి కూడా నాకు ఎంతో మేలు చేశాడు; నాకూ మరియు నా సోదరుల మధ్య షైతాను విరోధం కలిగించిన తరువాత (ఇప్పుడు) మిమ్మల్ని

---

[27] యూసుఫ్ ('అ.స.) మరియు బెన్యామీన్ తల్లి రాచెల్ (Rachel), బెన్యామీన్ పుట్టిన తరువాత మరణించింది. కావు ఇక్కడ అతన తండ్రితో పాటు వచ్చిన ఆమె అతని తల్లి చెల్లెలు. తల్లి మరణించిన తరువాత య'అఖూబ్ ('అ.స.) ఆమె చెల్లెలను వివాహమాడారని కొందరు వ్యాఖ్యాతలు అంటారు. (ఫ'త్హ అల్ ఖదీర్). కాని ఇమామ్ ఇబ్నె జరీర్ 'తబరీ ('ర'హ్మ.) అభిప్రాయమేమిటంటే, యూసుఫ్ ('అ.స.) తల్లి బ్రతికి ఉండెను. ఆమె తన భర్త వెంట వచ్చింది, (ఇబ్నె-కసీ'ర్).

[28] ఈ సాష్టాంగం కేవలం ఒకరి పట్ల ఉన్న గౌరవాన్ని చూపటానికి చేసింది. ఈ విధంగా గౌరవం చూపడం య'అఖూబ్ ('అ.స.) షరీయత్ లో అనుమతించబడి వుండెను. కాని ము'హమ్మద్ ('స'అస) షరీయత్ లో గౌరవార్థం కూడా ఎవరి ముందైనా సాష్టాంగం చేయటం ధర్మసమ్మతం కాదు.

ఎడారి నుండి (ఇక్కడకు) తెచ్చాడు[29]. నిశ్చయంగా, నా ప్రభువు సూక్ష్మగ్రాహి తాను కోరినది యుక్తితో నెరవేర్చుతాడు. నిశ్చయంగా ఆయన సర్వజ్ఞుడు, మహా వివేకవంతుడు.

**101.** "ఓ నా ప్రభూ! నీవు నాకు వాస్తవంగా రాజ్యాధికారాన్ని ప్రసాదించావు మరియు నాకు స్వప్న నిర్వచన జ్ఞానాన్ని కూడా ప్రసాదించావు. నీవే భూమ్యాకాశాలకు మూలాధారుడవు. మరియు ఇహపర లోకాలలో నీవే నా సంరక్షకుడవు. నీకు విధేయునిగా (ముస్లింగా) ఉన్న స్థితిలోనే నన్ను మరణింపజేయి. మరియు నన్ను సద్వర్తనులలో కలుపు."

**102.** (ఓ ప్రవక్తా!) మేము నీక దివ్యజ్ఞానం (వహీ) ద్వారా అవతరింపజేసిన ఈ గాథ అగోచర విషయాలలోనిది. ఎందుకంటే, వారందరూ కలసి కుట్రపన్ని, నిర్ణయాలు చేసినప్పుడు, నీవు అక్కడ

---

[29] ఈజిప్టుతో పోల్చితే ఆ కాలంలో కానాన్ ఒక ఎడారి మాదరిగానే ఉండెను. అల్ బద్ వు: ఎడారి, (చూ. 12:100); అల్ బాదు: ఎడారి వాసుడు, (చూడండి. 22:25); బాదూన్ (బ.వ.): ఎడారి వాసులు (చూడండి. 33:20). అల్ అ'అరాబ్, అంటే, కూడా ఎడారివాసులు (బద్దూలు, చూడండి. 9:90).

వారితో బాటు లేవు[30].

103. మరియు నీవు ఎంత కోరినా, వీరిలో చాలా మంది విశ్వసించేవారు కారు[31].

104. మరియు నీవు వారిని దీని (హితబోధ) కొరకు ఎలాంటి ప్రతిఫలాన్ని అడగటం లేదు. ఇది సర్వలోకాల వారికి కేవలం ఒక హితబోధ మాత్రమే.

105. మరియు ఆకాశాలలో మరియు భూమిలో ఎన్ని సూచనలను వారు చూస్తూ ఉన్నారు. అయినా వారు (వాటిని గమనించలేక) వాటి నుండి ముఖం త్రిప్పుకుంటున్నారు.

106. మరియు వారిలో చాలా మంది అల్లాహ్ ను విశ్వసించి కూడా, ఆయనకు సాటి కల్పించే

---

[30] ఇక్కడ అల్లాహ్ (సు.తా.) విశదీకరించేది ఏమిటంటే, కొందరు సత్యతిరస్కారులు నిందమోపినట్లు ఈ విషయాలు ము'హమ్మద్ ('స'అస) ఎవరితోనో విని నేర్చుకున్నవి కావు. ఎందుకంటే ఇవి క్రైస్తవుల మరియు యూదుల కథలకు భిన్నంగా ఉన్నాయి. ఇంకా అల్లాహ్ (సు.తా.) ఇక్కడ సాక్ష్యమిస్తున్నాడు: "ఇవి దైవప్రవక్త ('స'అస)కు వ'హీ ద్వారా తెలుపుతున్నాను," అని. మరొక విషయం ఏమిటంటే ప్రవక్తలకు కూడా అల్లాహ్ (సు. తా.) తెలిపినది తప్ప, అగోచర విషయాల జ్ఞానం ఉండదు. ఇంకా ఇతర చోట్లలో కూడా అల్లాహ్ (సు.తా.) అన్నాడు: "ఓ ము'హమ్మద్ ('స'అస)! నీకు అగోచర విషయాల జ్ఞానం లేదు." (చూడండి, 3:17, 44; 28:45-46; 38:69-70).

[31] అల్లాహ్(సు.తా.) తన ప్రవక్తల ద్వారా, ప్రజలకు గడిచిన వారి వృత్తాంతాలు తెలిపి గుణపాఠం నేర్చు కొని, సత్యధర్మం (ఇస్లాం) మీద ఉండాలని బోధించాడు. అయినా ప్రజలు వాటిని కేవలం కాలక్షేపానికి మాత్రమే విన్నట్లు వింటున్నారు. గుణపాఠం నేర్చుకొని సత్యధర్మాన్ని అవలంబించేవారు తక్కువే!

వారున్నారు[32].

**107.** ఏమిటి? అల్లాహ్ శిక్ష తమను క్రమ్ముకోకుండా, వారు సురక్షితంగా ఉండగలరని, వారు భావిస్తున్నారా? లేదా వారికి తెలియకుండానే అకస్మాత్తుగా (అంతిమ) ఘడియ రాదని వారు భావిస్తున్నారా?

**108.** (వారితో) అను: "ఇదే నా మార్గం. నేనూ మరియు నన్ను అనుసరించేవారూ, నిశ్చిత జ్ఞానంతో మిమ్మల్ని అల్లాహ్ వైపునకు పిలుస్తున్నాము. మరియు అల్లాహ్ సర్వలోపాలకు అతీతుడు మరియు నేను ఆయనకు సాటి కల్పించే వారిలోని వాడను కాను!"

**109.** మరియు మేము నీ కంటే పూర్వం దివ్యజ్ఞానం (వహీ) ఇచ్చి పంపిన వారందరూ పురుషులే[33], వారూ నగరవాసులలోని వారే. ఏమీ? వీరు భూమిలో సంచారం చేయలేదా, తమ పూర్వీకుల గతి ఏమయిందో చూడటానికి ? దైవభీతి గలవారికి పరలోక వాసమే ఎంతో మేలైనది. ఏమీ? మీరిది

[32] చాలామంది ముష్రికులు భూమ్యాకాశాల సృష్టికర్త మరియు పోషకుడు, అయిన అల్లాహ్ (సు.తా.) ను మాత్రమే నమ్ముతారు. అయినా తమ ఆరాధనలలో ఆయనకు సాటి కల్పిస్తారు. దర్గాలకు పోయి మన్నతులు చేసేవారి విషయం కూడా ఇలాంటిదే.

[33] ఇక్కడ, ప్రవక్తలందూ పురుషులే, అని విశదీకరించబడింది. స్త్రీలకు ప్రవక్త పదవి ఇవ్వబడలేదు. మరొక విషయం విశదమయ్యేదేమిటంటే, ప్రవక్తలందరూ అహ్ లల్ ఖురా' పురవాసులే కానీ అహ్ లల్ బాదియహ్ సహారా వాసులు (పల్లెటూరు వాసులు) కారు.

అర్థం చేసుకోలేరా?

110. తుదకు ప్రవక్తలు నిరాశులయ్యారు మరియు వారు వాస్తవానికి (ప్రజల ద్వారా) అబద్ధీకులని తిరస్కరించబడ్డారని భావించినప్పుడు వారికి (ప్రవక్తలకు) మా సహాయం లభించింది కాబట్టి మేము కోరినవాడు రక్షించబడ్డాడు. మరియు మా శిక్ష అపరాధులైన జాతి వారిపై నుండి తొలగింపబడదు.

111. వాస్తవానికి వారి గాథలలో బుద్ధిమంతులకు గుణపాఠముంది. ఇది (ఈ ఖుర్ఆన్) కల్పితగాథ కాదు. కాని ఇది ఇంత వరకు వచ్చిన గ్రంథాలలో మిగిలి వున్న సత్యాన్ని ధృవీకరిస్తుంది మరియు ప్రతి విషయాన్ని వివరిస్తుంది. మరియు ఇది విశ్వసించేవారికి మార్గదర్శిని మరియు కారుణ్యం కూడాను.

# 13. అర్-రఅద్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. అలిఫ్ - లామ్ - మీమ్ - రా[1]. ఇవి స్పష్టమైన గ్రంథ ఆయతులు మరియు ఇది నీ ప్రభువు తరఫు నుండి నీ పై అవతరింపజేయబడిన సత్యం! అయినా చాలామంది, విశ్వసించటం లేదు.

2. మీరు చూస్తున్నారు కదా! ఆకాశాలను స్తంభాలు లేకుండా నిలిపిన ఆయన, అల్లాహ్ యే! ఆ తరువాత ఆయన, తన సింహాసనాన్ని (అర్ష్ ను) అధిష్ఠించాడు. మరియు ఆయన సూర్యచంద్రులను తన నియమానికి బద్ధులుగా చేశాడు. ప్రతి ఒక్కటీ తన నిర్ణీత కాలంలో (తన పరిధిలో) పయనిస్తూ ఉంటుంది[2]. ఆయన అన్ని వ్యవహారాలను నడిపిస్తూ, తన సూచనలను వివరిస్తున్నాడు; బహుశా! (ఈ విధంగా నైనా) మీరు మీ ప్రభువున కలుసుకో వలసి ఉందనే విషయాన్ని నమ్ముతారేమోనని.

3. మరియు ఆయనే భూమిని విశాలంగా చేసి దానిలో స్థిరమైన పర్వతాలను మరియు నదులను

[*] [అర్-రఅద్ అంటే ఉరుము]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

[2] చూడండి, 36:38, 39 మరియు 7:54.

నెలకొల్పాడు. అందులో ప్రతి రకమైన ఫలాన్ని, రెండేసి (ఆడ-మగ) జతలుగా చేశాడు[3]. ఆయనే రాత్రిని పగటి మీద కప్పుతాడు. నిశ్చయంగా వీటన్నింటిలో ఆలోచించేవారి కొరకు సూచనలున్నాయి.

4. మరియు భూమిలో వేర్వేరు రకాల (నేలలు) ఒకదాని కొకటి ప్రక్కప్రక్కన ఉన్నాయి మరియు ద్రాక్షతోటలు, పంటపొలాలు మరియు ఖర్జూరపు చెట్లు, కొన్ని ఒక్కొక్కటి గానూ, మరికొన్ని గుచ్ఛలు-గుచ్ఛలు (జతలు) గానూ ఉన్నాయి[4]. వాటన్నిటికీ ఒకే నీరు పారుతుంది. కాని తినటానికి వాటి రుచులు, ఒకటి మరొకదాని కంటే ఉత్తమమైనదిగా ఉన్నట్లు చేశాము. నిశ్చయంగా వీటన్నింటిలో అర్థం చేసుకో గల వారి కొరకు ఎన్నో సూచనలున్నాయి[5].

5. ఇది నీకు ఆశ్చర్యకరంగా ఉంటే, వారి ఈ మాట అంతకంటే ఆశ్చర్యకరమైనది: "ఏమీ? మేము మట్టిగా మారిపోయిన తరువాత కూడా వాస్తవంగా

---

[3] వృక్షకోటిలో కూడా ఆడ-మగ అంతరం ఉంది. సాధారణంగా ఆడ-మగ అంగాలు ఒకే పువ్వులో ఉంటాయి. ఉదా: మామిడి, కొన్ని ఒకే వృక్షం మీద వేర్వేరు పువ్వులలో ఉంటాయి. ఉదా: దోసతీగ. మరికొన్ని వేర్వేరు వృక్షాలపై ఉంటాయి. ఉదా: ఖర్జూరపు చెట్లు.

[4] కొన్ని చెట్లు ఒకే కాండం గలవి. మరికొన్ని శాఖలు గలవి ఉన్నాయి.

[5] చూడండి, 6:99 మరియు 141.

మరల క్రొత్తగా సృష్టించబడతామా?" అలాంటి వారే తమ ప్రభువును తిరస్కరించిన వారు. అలాంటి వారి మెడలలో సంకెళ్ళు వేయబడి ఉంటాయి[6]. మరియు అలాంటి వారే నరకవాసులు. అక్కడ వారు శాశ్వతంగా ఉంటారు.

6. మరియు వారు మేలుకు ముందు కీడును (తెమ్మని) నిన్ను తొందర పెడుతున్నారు[7]. మరియు వారికి పూర్వం అనేక ఉదాహరణలు గడిచాయి. మరియు వారు దుర్మార్గం చేసినప్పటికీ![8] నిశ్చయంగా, నీ ప్రభువు ప్రజల యెడల క్షమాశీలుడు. మరియు నిశ్చయంగా, నీ ప్రభువు శిక్షించటంలో కూడా చాలా కఠినుడు[9].

7. మరియు సత్యతిరస్కారులు అంటున్నారు: "అతనిపై అతని ప్రభువు తరఫు నుండి ఏదైనా ఒక అద్భుత సంకేతం ఎందుకు అవతరింపజేయబడలేదు?"[10] వాస్తవానికి నీవు కేవలం హెచ్చరిక చేసేవాడవు మాత్రమే! మరియు ప్రతి జాతికి ఒక మార్గదర్శకుడు వచ్చి ఉన్నాడు[11].

---

[6] చూడండి, 34:33, 36:8.
[7] చూడండి, 6:57-58; 8:32.
[8] చూడండి, 35:45.
[9] చూడండి, 6:47; 7:167; 15:49-50, 10:11.
[10] చూడండి, 6:7, 111; 10:96-97 మరియు 13:31
[11] చూడండి, 35:24, 6:131.

8. అల్లాహ్ కు, ప్రతి స్త్రీ తన గర్భంలో దాల్చేది[12] మరియు గర్భకాలపు హెచ్చు-తగ్గులు[13] కూడా బాగా తెలుసు. ప్రతిదానికి ఆయన దగ్గర ఒక పరిమాణం (నిర్ణయింపబడి) ఉంది.

9. ఆయన అగోచర మరియు గోచర విషయాన్నింటినీ ఎరిగిన వాడు. మహనీయుడు[14],సర్వోన్నతుడు[15].

10. మీలో ఒకడు తన మాటను రహస్యంగా చెప్పినా, లేక దానిని బహిరంగంగా చెప్పినా మరియు ఒకడు రాత్రి చీకటిలో దాగి ఉన్నా లేక పగటి వెలుగులో తిరుగుతూ ఉన్నా, (అల్లాహ్ దృష్టిలో) అంతా సమానమే (ఒకటే)![16]

11. ప్రతివాని ముందూ వెనుకా ఆయన నియమించిన,

---

[12] త'హ్ మిలు: Bear, Carry, అంటే కలిగి ఉండు, సహించు, మోయు, వహించు, భరించు, పెట్టుకొను. ఇక్కడ స్త్రీ గర్భంలో ఉన్న శిశువు యొక్క స్వభావం, లక్షణాలు, అదృష్టం, వయస్సు అని అర్థం.

[13] త'గీదుల్ అర్'హామ్: Fall short, Absorb, అంటే గర్భకాలపు హెచ్చుతగ్గులు.

[14] అల్-కబీర్: అల్-అజీమ్ The Incomparably Great, The Greatest, మహనీయుడు, గొప్పవాడు, మహత్త్వం, ప్రభావం, ప్రతాపం గలవాడు, గొప్పదనానికి సరోవరం. ఇవ్ అల్లాహ్ (సు. తా.) అత్యుత్తమ పేర్లు. చూడండి, 22:62, 31:30 మొదలైనవి.

[15] అల-ముత'ఆలి: Most High, He who is higher than every (other) high one. సర్వోన్నతుడు, అందరి కంటే అత్యుతన్నతుడు. ఖుర్ఆన్ లో ఇక్కడ మాత్రమే ఒకేసారి వచ్చింది. అల్-అలియ్యు: మహోన్నతుడు, చూడండి, 2:255. ఇవి అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లు.

[16] ఈ తాత్పర్యం ము'హమ్మద్ జునాగఢీ గారి అనువాదాన్ని అనుసరించి ఉంది. అంటే అల్లాహ్ (సు.తా.)కు అంతా తెలుస్తుంది. ఆయన నుండి దాగింది ఏదీ లేదు.

ఒకరి వెంట ఒకరు వచ్చే[17] కావలివారు (దైవదూతలు) ఉన్నారు. వారు అల్లాహ్ ఆజ్ఞానుసారం అతనిని (మనిషిని) కాపాడుతూ ఉంటారు. నిశ్చయంగా, ఒక జాతివారు తమ స్థితిని తాము మార్చుకోనంతవరకు, అల్లాహ్ వారి స్థితిని మార్చడు[18]. అల్లాహ్ ఒక జాతి వారికి కీడు చేయదలిస్తే దానిని ఎవ్వరూ తొలగించలేరు. మరియు వారికి ఆయన తప్ప మరొక స్నేహితుడు (ఆదుకునేవాడు) లేడు.

12. ఆయనే! మీకు భయం మరియు ఆశ కలిగించే మెరుపులను చూపుతున్నాడు. మరియు ఆయనే నీళ్ళతో బరువెక్కిన మేఘాలను పుట్టిస్తున్నాడు.

13. మరియు ఉరుము ఆయన పవిత్రతను కొనియాడుతుంది. ఆయన స్తోత్రం చేస్తుంది; మరియు దైవదూతలు కూడా ఆయన భయంతో (ఆయన స్తోత్రం చేస్తూ ఉంటారు)![19] మరియు ఆయన ఫెళఫెళమనే ఉరుములను పంపి, వాటి ద్వారా తాను కోరిన వారిని శిక్షిస్తాడు. అయినా వీరు (సత్యతిరస్కారులు) అల్లాహ్ ను గురించి వాదులాడుతున్నారు. మరియు ఆయన అద్భుత

---

[17] అంటే ఎడతెగకుండా ఒకరి తరువాత ఒకరు రాత్రింబవళ్ళు కాపలా ఉంటారు.

[18] చూడండి, 8:53.

[19] చూడండి, 17:44.

యుక్తిపరుడు[20].

**14.** ఆయనను ప్రార్థించటమే విద్యుక్త ధర్మం. ఆయనను వదలి వారు ప్రార్థించేవి (ఇతర శక్తులు) వారికి ఏ విధమైన సమాధాన మివ్వలేవు. అది (వాటిని వేడుకోవడం): ఒకడు తన రెండు చేతులు నీటి వైపుకు చాచి, అది (నీరు) నోటి దాకా రావాలని ఆశించటమే! కాని అది అతని (నోటి వరకు) చేరదు కదా! (అలాగే) సత్యతిరస్కారుల ప్రార్థనలన్నీ వ్యర్థమై పోతాయి.

**15.** మరియు భూమ్యాకాశాలలో ఉన్న ప్రతి వస్తువు ఇష్టంగానో అయిష్టంగానో అల్లాహ్ కు సాష్టాంగం (సజ్దా) చేస్తూ ఉంటుంది. మరియు వాటి నీడలు కూడా ఉదయం మరియు సాయంత్రం (సాష్టాంగం చేస్తూ ఉంటాయి)[21].

**16.** ఇలా అడుగు: "భూమ్యాకాశాలకు ప్రభువు ఎవరు?" నీవే ఇలా జవాబివ్వు: "అల్లాహ్!" తరువాత ఇలా అను: "అయితే మీరు ఆయనను

---

[20] షదీదుల్ మి'హాల్: ఖుర్ఆన్ లో ఈ వాక్యం కేవలం ఇక్కడే ఒకేసారి వచ్చింది. మి'హాల్: Contrivance, అంటే యుక్తి, కల్పన, తంత్రం, పన్నుగడ, కుట్ర, ఉపాయం, మొదలైనవి. షదీద్: Severe, Strong, కఠిన, తీవ్ర, దృఢ, బల, అద్భుత, ఘనమైనది.

[21] చూడండి, 16:48-49 మరియు 22:18. భూమి చుట్టూ తాను తిరగటం వల్ల రాత్రింబవళ్ళు వస్తాయి. సూర్యచంద్రులు కూడా గమనంలో ఉన్నాయి. ఇదంతా అల్లాహ్ (సు.తా.) ఆదేశంతో జరుగుతోంది. కాబట్టి నీడలు కూడా ఉదయం మరియు సాయంత్రం పొడుగ్గా ఉండి మధ్యాహ్నం చిన్నదవటం కూడా అల్లాహ్ (సు.తా.) ఆదేశాలను అనుసరిచటమే!

వదలి తమకు తాము మేలు గానీ, కీడు గానీ చేసుకోలేని వారిని, మీకు సహాయకులుగా (సంరక్షకులుగా) ఎన్నుకుంటారా?" ఇంకా ఇలా అడుగు: "ఏమీ? గ్రుడ్డివాడు మరియు చూడగలిగే వాడూ సమానులు కాగలరా? లేక అంధకారాలు మరియు వెలుగు సమానమేనా? లేక వారు (అల్లాహ్ కు) సాటి కల్పించిన వారు కూడా అల్లాహ్ సృష్టించినట్లు ఏమైనా సృష్టించారా, అందువలన సృష్టి విషయంలో వారికి సందేహం కలిగిందా?" వారితో అను: "అల్లాహ్ యే ప్రతిదానికి సృష్టికర్త[22]. మరియు ఆయన అద్వితీయుడు, ప్రబలుడు (తన సృష్టిపై సంపూర్ణ అధికారం గలవాడు)[23]"

17. ఆయన (అల్లాహ్) ఆకాసం నుండి నీరు కురిపించగా (ఎండిపోయిన) సెలయేళ్ళు తమ తమ పరిమాణాలకు సరిపడేలా[24] ప్రవహింప సాగుతాయి. అప్పుడు వరద (ఉపరితలం మీద) నురుగులు ఉబ్బి వస్తాయి. మరియు అగ్నిని రగిలించి నగలు, పాత్రలు చేసేటప్పుడు కూడా కరిగించే లోహాల మీద కూడా అదే విధంగా

[22] అల్-ఖాలిఖు: సృష్టికర్త, అల్లాహ్ (సు.తా.) యే ఏ నమూనా లేకుండా క్రొత్తగా సృష్టించేవాడు. ఆయన (సు.తా.) ఏదైనా చేయటానికి పూనుకున్నప్పుడు దానిని : 'అయిపో' అని ఆజ్ఞాపిస్తాడు. అంతే అది అయిపోతుంది. చూడండి, 102 మరియు 2:117.

[23] అల్ వాహిద్, అల్ ఖహ్హార్ లకు చూడండి, 12:39.

[24] బి ఖద్ రిహా: తమ తమ పరిమాణాన్ని బట్టి పూర్తిగా నిండి.

నురుగులు వస్తాయి[25]. ఈ విధంగా అల్లాహ్ సత్యమేదో అసత్యమేదో పోల్చి వివరిస్తున్నాడు. ఎందుకంటే నురుగంతా ఎగిరి పోతుంది, కాని మానవులకు లాభదాయకమైనది భూమిలో మిగులుతుంది. ఈ విధంగా అల్లాహ్ ఉదాహరణలను వివరిస్తున్నాడు[26].

**18.** తమ ప్రభువు సందేశాన్ని స్వీకరించిన వారికి మంచి ప్రతిఫలం ఉంటుంది. మరియు ఆయన సందేశాన్ని స్వీకరించని వారి దగ్గర భూమిలో ఉన్నదంతా, మరియు దానితో పాటు దానికి సమానంగా ఉన్నా, వారు అదంతా పరిహారంగా ఇవ్వదలచుకున్నా (అది స్వీకరించబడదు)[27]. అలాంటి వారి లెక్క దారుణంగా ఉంటుంది. మరియు వారి ఆశ్రయం నరకమే. మరియు అది ఎంతో దుర్భరమైన విరామ స్థలము.

**19.** ఏమీ? నీ ప్రభువు నుండి నీపై అవతరింప జేయబడినది (ఈ సందేశం) సత్యమని తెలుసుకున్నవాడు, గ్రుడ్డివానితో సమానుడా? నిశ్చయంగా, బుద్ధిమంతులే ఇది (ఈ విషయం) గ్రహించగలరు.

---

[25] పారే నీటిపై వచ్చే నురుగు గానీ, వెండి, బంగారు కరిగించినపుడు వచ్చే నురుగు గానీ, మాలిన్యాలే. అవి ఎగిరిపోతాయి. మరియు అసలే క్రింద మిగిలిపోతుంది.

[26] చూడండి, 24:39-40.

[27] చూడండి, 3:91; 10:54.

**20.** వారే, ఎవరైతే అల్లాహ్ తో చేసిన వాగ్దానం పూర్తి చేస్తారో మరియు తమ వాగ్దానాన్ని భంగపరచరో![28]

**21.** మరియు ఎవరైతే అల్లాహ్ కలుపమని ఆజ్ఞాపించిన వాటిని కలుపుతారో![29] మరియు తమ ప్రభువుకు భయపడతారో మరియు దారుణంగా (ఖచ్చితంగా) తీసుకోబడే లెక్కకు భయ పడుతారో!

**22.** మరియు ఎవరైతే తమ ప్రభువు ప్రీతి కొరకు సహనం వహించి[30] మరియు నమాజ్ స్థాపించి[31] మరియు మేము ప్రసాదించిన ఉపాధి నుండి రహస్యంగా మరియు బహిరంగంగా (అల్లాహ్ మార్గంలో) ఖర్చు చేస్తూ, చెడును మంచి ద్వారా పారద్రోలుతూ ఉంటారో[32]; అలాంటి వారికే ఉత్తమ పరలోక గృహం ప్రతిఫలంగా ఉంటుంది.

**23.** శాశ్వతంగా ఉండే ఉద్యానవనాలలో[33] వారు మరియు వారితో పాటు సద్వర్తనులైన వారి తండ్రి తాతలు, వారి సహవాసులు (అజ్వాజ్) మరియు

---

[28] చూడండి, 5:1

[29] చూడండి, 8:75

[30] అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞలను పాటించటం మరయు పాపాల నుండి తప్పించుకోవటం ఒక సహనం. మరియు బాధలలో, ఆపదలలో సహనం వహించటం రెండవది. సత్పురుషులు ఈ రెండు రకాల సహనాన్ని వహిస్తారు.

[31] నమా'జ్ స్థాపించటం అంటే నమా'జ్ ను దాని సమయంలో, భయభక్తులతో సరిగ్గా సలపటం.

[32] వారు, ఎవరికైతే చెడు సంభవిస్తే దానికి బదులుగా మంచి చేస్తారో లేక మన్నించి సహనం వహిస్తారో, చూడండి, 41:34.

[33] 'అద్నున్: అంటే శాశ్వతమైన స్వర్గవనాలు.

వారి సంతానం కూడా ప్రవేశిస్తారు[34]. మరియు ప్రతి ద్వారం నుండి దేవదూతలు వారి (స్వాగతం) కొరకు వస్తారు.

**24.** (దేవదూతలు అంటారు): "మీ సహనానికి, ఫలితంగా ఇప్పుడు మీకు శాంతి కలుగు గాక(సలాం)! ఇక ఈ అంతిమ (పరలోక) గృహం ఎంతో సౌఖ్యదాయకమైనది!"

**25.** మరియు అల్లాహ్ తో ఒడంబడిక చేసుకున్న తరువాత తమ వాగ్దానాన్ని భంగం చేసేవారు మరియు అల్లాహ్ కలపండి అని ఆదేశించిన వాటిని త్రెంచేవారు మరియు భూమిలో కల్లోలం రేకెత్తిచేవారు! ఇలాంటి వారందరికీ ఆయన శాపం (బహిష్కారం) ఉంటుంది మరియు వారికి (పరలోకంలో) బహుచెడ్డ నివాసముంటుంది.

**26.** అల్లాహ్ తాను కోరిన వారికి జీవనోపాధి పుష్కలంగా ప్రసాదిస్తాడు మరియు (తాను కోరిన వారికి) పరిమితం చేస్తాడు[35]. మరియు వారు ఇహలోక జీవితంలో సంతోషంగా ఉన్నారు, కాని

---

[34] చూడండి, 52:21.

[35] అల్లాహ్ (సు.తా.) తాను కోరింది చేస్తాడు. ఇహలోకంలో పుష్కలంగా జీవనోపాధి ఉన్నవాడితో అల్లాహ్ (సు.తా.) సంతోషపడ్డాడని మరియు ఇహలోక జీవితంలో కష్టాలలో ఉన్న వాడితో అల్లాహ్ (సు.తా.) సంతోషపడలేదని, దీని అర్థం కాదు. ఎవరికైనా అత్యధికంగా ధనసంపత్తులు ఇవ్వటం కేవలం అతనిని పరీక్షించటానికే! సత్యధర్మం మీద ఉండి సత్కార్యాలు చేసేవారే సాఫల్యం పొందుతారు.

పరలోక జీవితం ముందు ఇహలోక జీవిత సుఖసంతోషాలు తాత్కాలికమైనవే (తుచ్ఛమైనవే)!

27. మరియు సత్యతిరస్కారులు: "అతని (ముహమ్మద్) పై, అతని ప్రభువు తరఫు నుండి ఏదైనా ఒక అద్భుత సంకేతం ఎందుకు అవతరింప జేయబడలేదు?"[36] అని అంటున్నారు. వారితో అను: "నిశ్చయంగా, అల్లాహ్ తాను కోరిన వారిని మార్గభ్రష్టులుగా వదలుతాడు మరియు పశ్చాత్తాప పడి ఆయన వైపునకు తిరిగే వారికి సన్మార్గం చూపుతాడు."

28. ఎవరైతే విశ్వసించారో వారి హృదయాలు అల్లాహ్ ధ్యానం వలన తృప్తి పొందుతాయి. జాగ్రత్తగా వినండి! కేవలం అల్లాహ్ ధ్యానమే (స్మరణయే) హృదయాలకు తృప్తినిస్తుంది.

29. విశ్వసించి సత్కార్యాలు చేసే వారికి (ఇహలోకంలో) ఆనందం, సర్వసుఖాలు[37] మరియు (పరలోకంలో) మంచి గమ్యస్థానం ఉంటాయి.

30. అందుకే (ఓ ముహమ్మద్!) మేము నిన్ను ఒక సమాజం వారి వద్దకు పంపాము - వాస్తవానికి వారికి పూర్వం ఎన్నో సమాజాలు గతించాయి - నీవు నీపై మేము అవతరింప జేసిన దివ్యజ్ఞానం వారికి వినిపించటానికి! ఎందుకంటే వారు తమ

---

[36] చూడండి, 6:109.

[37] 'తూబా: అంటే స్వర్గంలో మంచి స్థానం మరియు దాని భోగభాగ్యాలు.

కరుణామయుణ్ణి తిరస్కరిస్తున్నారు[38]. వారితో అను: "ఆయనే నా ప్రభూవు! ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు! నేను ఆయననే నమ్ముకున్నాను. మరియు ఆయన వైపునకే నేను పశ్చాత్తాపంతో మరలి పోవలసి ఉన్నది."

31. మరియు నిశ్చయంగా, (ఖుర్ఆన్ ను) పఠించటం వలన కొండలు కదలింపబడినా, లేదా దాని వల్ల భూమి చీల్చబడినా, లేదా దాని వల్ల మృతులు మాట్లాడేటట్లు చేయబడినా! (అవిశ్వాసులు దానిని విశ్వసించరు). వాస్తవానికి సర్వ నిర్ణయాల

[38] మక్కా ముష్రికులు రహ్మాన్ శబ్దాన్ని తిరస్కరించేవారు. కావున హుదైబియా ఒప్పందం రోజు దైవ ప్రవక్త ము'హమ్మద్('స'అస): "బిస్మిల్లా హిర్ర'హ్మా నిర్ర'హీమ్." అని ఒప్పందం వ్రాయించడం ప్రారంభించి నప్పుడు, ఒప్పందం చేసుకోవడానికి వచ్చిన రాయబారి:"అర్-రహ్మాన్ అర్-రహీమ్'ను" మేము ఎరుగం "బిస్మిక అల్లాహుమ్మ" అని వ్రాయలి." అని పట్టుపట్టాడు. ఖతదా('ర.ది.'అ.) కథనం, 'స. బు'ఖారీ).

అధికారం కేవలం అల్లాహ్ కే చెందుతుంది[39]. ఏమీ? ఒకవేళ అల్లాహ్ కోరితే సర్వ మానవులకు సన్మార్గం చూపేవాడని తెలిసి కూడా విశ్వాసులు ఎందుకు ఆశ వదులు వారిపై, వారి కర్మల ఫలితంగా, ఏదో ఒక ఆపద కలుగుతూనే ఉంటుంది. లేదా అది వారి ఇండ్ల సమీపంలో పడుతూ ఉంటుంది[40]. నిశ్చయంగా అల్లాహ్ తన వాగ్దానాన్ని భంగ పరచడు.

**32.** మరియు (ఓ ముహమ్మద్!) వాస్తవానికి నీకు పూర్వం కూడా చాలా మంది ప్రవక్తలు పరిహసించ బడ్డారు, కావున (మొదట) నేను సత్యతిరస్కారులకు వ్యవధి నిచ్చాను తరువాత వారిని పట్టుకున్నాను.

---

[39] ఇబ్నె-కసీ'ర్ (ర'హ్మ) అంటారు: 'ప్రతి దివ్యగ్రంథం ఖుర్ఆన్ అనబడుతోంది.' ఒక 'హదీస్'లో ఉంది: 'దావూద్ (అ.స.) పశువులను సిద్ధపరచమని ఆజ్ఞాపించి ఆ సమయంలో ఖుర్ఆన్ పఠనం పూర్తి చేసుకునేవారు.' ('స. బు'ఖారీ, కితాబ్ అల్ అంబియా, బాబె ఖౌల్ అల్లాహుతా'ఆలా: 'వ ఆతైనా దావూద జబూరా.') ఇక్కడ ఖుర్ఆన్ అంటే జబూర్ అని అర్థం. ఈ వాక్యపు అర్థం ఏమిటంటే ఒకవేళ ఇంతకూ పూర్వం దివ్యగ్రంథం చదువటం వలన కొండలు కదిలింపబడితే (పొడిపొడిగా మారిపోతే), లేక మృతులు మాట్లాడగలిగితే, ఈ ఖుర్ఆన్ లో కూడా అటువంటి లక్షణాలు ఉండేవి. మరికొందరి అభిప్రాయం ఏమిటంటే, ఈ ఖుర్ఆన్ లో ఇటువంటి విశేష లక్షణాలు ఉండినా, ఈ సత్యతిరస్కారులు దీనిని ఏ మాత్రమూ విశ్వసించేవారు కారు. ఎందుకంటే వారిని విశ్వాసులుగా చేయటం అల్లాహ్ (సు.తా.) పనే. అల్లాహ్ (సు.తా.) ఎవ్వరినీ కూడా మార్చడు. ఎంతవరకైతే వారు తమను తాము మార్చుకోవటానికి ప్రయత్నించరో!

[40] చూడండి, 5:33.

(చూశారా!) నా ప్రతీకారం (శిక్ష) ఎలా ఉండిందో![41]

**33.** ఏమీ? ఆయన (అల్లాహ్), ప్రతి వ్యక్తి అర్జించే దానిని కనిపెట్టుకొని ఉండేవాడు (మరియు లాభనష్టాలు కలుగజేయలేని మీ బూటకపు దైవాలు సరిసమానులా)? అయినా వారు అల్లాహ్ కు భాగస్వాములు (సాటి) కల్పిస్తారు. వారితో ఇలా అను: "(నిజంగానే వారు అల్లాహ్ స్వయంగా నియమించుకున్న భాగస్వాములే అయితే) వారి పేర్లను తెలుపండి! లేక భూమిలో ఉన్నట్లు ఆయనకు తెలియని విషయాన్ని మీరు ఆయనకు తెలుపుతున్నారా? లేక మీరు ఇట్లే నోటికి వచ్చినట్లు వాగుతున్నారా?[42] వాస్తవానికి, సత్యాన్ని తిరస్కరించిన వారికి, వారి కుట్ర ఆకర్షణీయంగా చేయబడుతోంది. మరియు వారు ఋజుమార్గం నుండి నిరోధించబడ్డారు. మరియు అల్లాహ్ మార్గభ్రష్టత్వంలో వదలిన వానికి సన్మార్గం చూపేవాడు ఎవ్వడూ ఉండడు[43]

---

[41] 'హదీస్'లో కూడా ఉంది: 'అల్లాహ్ (సు.తా.) దుర్మార్గులకు వ్యవధినిస్తూ పోతాడు, చివరకు వారిని శిక్షించటానికి పట్టుకున్నప్పుడు ఏ మాత్రమూ వదలడు.' దైవప్రవక్త ('స'అస), ఇది వినిపించిన తరువాత, ఆయత్ 11:102 ను చదివి వినిపించారు. ('స'హీ'హ్ బు'ఖారీ, 'స. ముస్లిం).

[42] మీరు కేవలం ఊహాగానాలే చేస్తున్నారు. మీరు ఏ దేవతలనైతే ఆరాధిస్తున్నారో అవి మీకు కీడు గానీ, మేలు గానీ చేయలేవు. మీరు పిలిచేవి - వాటి పేర్లే. అవి మీరో లేక మీ తండ్రితాతలో ఇచ్చినవే. అవి మీ కల్పిత దైవాలే. చూడండి, 53:23, 7:71 మరియు 12:40.

[43] చూడండి, 5:41 మరియు 16:37.

**34.** వారికి ఇహలోక జీవితంలో శిక్ష వుంది. మరియు వారి పరలోక జీవిత శిక్ష ఎంతో కఠినమైనది. మరియు వారిని అల్లాహ్ (శిక్ష) నుండి రక్షించేవాడు ఎవ్వడూ ఉండడు[44].

**35.** దైవభీతి గలవారికి వాగ్దానం చేయబడిన స్వర్గపు ఉదాహరణ ఇదే! దాని క్రింద సెలయేళ్ళు పారుతూ ఉంటాయి[45]. దాని ఫలాలు మరియు నీడ సదా ఉంటాయి[46]. దైవభీతి గలవారి అంతిమ ఫలితం ఇదే. మరియు సత్యతిరస్కారుల అంతిమ ఫలితం నరకాగ్నియే!

**36.** మరియు (ఓ ప్రవక్తా!) ఎవరికైతే మేము (ముందు) గ్రంథాన్ని ఇచ్చామో! వారు నీపై అవతరింప జేయబడిన దాని (ఈ గ్రంథం) వలన సంతోషపడుతున్నారు[47]. మరియు వారిలోని కొన్ని వర్గాల వారు దానిలోని కొన్ని విషయాలను తిరస్కరించేవారు కూడా ఉన్నారు[48]. వారితో ఇలా అను: "నిశ్చయంగా, నేను అల్లాహ్ ను

---

[44] ఈ ప్రపంచ శిక్ష (అ'జాబ్) పరలోక శిక్ష కంటే చాలా తేలికైనది. ఈ ప్రపంచ శిక్ష తాత్కాలికమైనది. పరలోక శిక్ష శాశ్వతమైనది. నరకాగ్ని భూలోక అగ్ని కంటే 69 రెట్లు అధిక తీవ్రత గలది ('స'హీ'హ్ ముస్లిం)

[45] స్వర్గనరకాలు మానవుల జ్ఞానపరిధికి అగోచర విషయాలు. కావున వాటిని మానవులకు తెలిసిన ఉద్యానవనాలు మరియు అగ్నితో పోల్చి చెప్పబడుతోంది. చూడండి, 47:15.

[46] "జిల్లున్: అర్థం కొరకు చూడండి, 4:57 చివరి భాగం.

[47] వీరు ముస్లింలు.

[48] వీరు క్రైస్తవులు, యూదులు మరియు ముష్రికులు.

మాత్రమే ఆరాధించాలని మరియు ఆయనకు సాటి (భాగస్వాములను) కల్పించరాదని ఆజ్ఞాపించబడ్డాను. నేను మిమ్మల్ని ఆయన వైపునకే ఆహ్వానిస్తున్నాను మరియు గమ్యస్థానం కూడా ఆయన వద్దనే ఉంది!

**37.** మరియు ఈ విధంగా మేము అరబ్బీ భాషలో మా శాసనాన్ని అవతరింప జేశాము[49]. ఇక నీవు ఈ జ్ఞానం వచ్చిన తరువాత కూడా వారి కోరికలను అనుసరిస్తే, అల్లాహ్ నుండి నిన్ను రక్షించేవాడు గానీ, కాపాడేవాడు గానీ ఎవ్వడూ ఉండడు.

**38.** మరియు (ఓ ముహమ్మద్!) వాస్తవానికి మేము నీకు పూర్వం అనేక ప్రవక్తలను పంపాము మరియు వారికి భార్యాపిల్లలను ప్రసాదించాము[50]. అల్లాహ్ అనుమతి లేకుండా, ఏ అద్భుత సంకేతాన్ని (స్వయంగా) తెచ్చి చూపే

---

[49] చూడండి, 14:4 మరియు12:2. ప్రతి ప్రవక్తపై అతన ప్రజల కొరకు ఆ ప్రాంతపు భాషలోనే దివ్యగ్రంథం అవతరింపజేయబడింది. వారు దానిని సులభంగా అర్థం చేసుకోవాలని. ఈ ఖుర్ఆన్ దైవప్రవక్త ము'హమ్మద్ ('స'అస) పై సర్వలోకాల వారి కొరకు, అవతరింపజేయబడిన అంతిమ దివ్యగ్రంథం. చూడండి, 7:158.

[50] చూడండి, 25:7 దైవప్రవక్తలు అందరూ మానవులే. వారికి కుటుంబం ఉండేది. వారికి భార్యాబిడ్డ లుండిరి. వారు సాధారణ మానవుల వలే తినేవారు, త్రాగేవారు, ప్రజలతో కలిసి మెలిసి తిరిగే వారు. కాని వారిపై దివ్యజ్ఞాన (వ'హీ) వస్తూ ఉండేది. దానిని వారు ఉన్నది ఉన్నట్టుగా పూర్తిగా ప్రజలకు వినిపించి సత్యధర్మం వైపునకు ఆహ్వానించేవారు. ఒకవేళ వారు దైవదూతలైతే వారికెలా సంతానం మరియు కుటుంబం ఉంటాయి?

శక్తి ఏ ప్రవక్తకూ లేదు[51]. ప్రతి వాగ్దానానికి (విషయానికి) వ్రాయబడిన ఒక ఆదేశం (శాసనం) ఉంది[52].

**39.** అల్లాహ్ తాను కోరిన దానిని రద్దు చేస్తాడు మరియు (తాను కోరిన దానిని) స్థిరపరుస్తాడు[53]. మరియు మాతృగ్రంథం (ఉమ్ముల్ కితాబ్)[54] ఆయన దగ్గరే ఉంది.

**40.** మరియు (ఓ ప్రవక్తా!) మేము వారికి చేసిన వాగ్దానాలలో కొన్నింటిని నీకు చూపినా, లేదా (వాటిని చూపక ముందు) నిన్ను మరణింప జేసినా, నీ బాధ్యత కేవలం (మా సందేశాన్ని) అందజేయటమే! మరియు లెక్క తీసుకోవటం కేవలం మా పని.

**41.** ఏమీ? వాస్తవానికి మేము భూమిని అన్ని వైపుల నుండి తగ్గిస్తూ వస్తున్నామనేది వారు చూడటం

---

[51] అద్భుత సంకేతాల శక్తి కేవలం అల్లాహ్ (సు.తా.)కే ఉంది. ఆయన అనుమతి లేనిదే ఏ ప్రవక్త కూడా వాటిని చూపలేడు. అల్లాహ్ (సు.తా.) తన ఇష్టప్రకారం తాను అవసరం అనుకున్నప్పుడు వాటిని చూపుతాడు. చూడండి, 6:109

[52] అల్లాహ్ (సు.తా.) యొక్క ప్రతి వాగ్దానికి ఒక సమయం నియమింపబడి ఉంది.అల్లాహుతా'ఆలా ఆ సమయం వచ్చే వరకు ప్రజలకు వ్యవధినిస్తాడు. అది వచ్చిన తరువాత దానిని ఎవ్వరూ ఆపలేరు. అల్లాహ్ (సు.తా.) తన వాగ్దానం పూర్తి చేసి తీరుతాడు. దీని మరొక తాత్పర్యం: 'ప్రతి యుగానికి ఒక గ్రంథం ఉంది.'

[53] చూడండి, 2:106

[54] చూడండి, 43:4 మరియు 85:22. ఉమ్ముల్ కితాబ్, అంటే లౌ'హె మ'హ్ ఫూ"జ్. సురక్షితమైన ఫలకం, మూలగ్రంథం. అంటే యథాస్థితిలో, భద్రంగా ఉంచబడిన గ్రంథం.

లేదా?[55] మరియు అల్లాహ్ యే ఆజ్ఞ ఇస్తాడు! ఆయన ఆజ్ఞను మార్చే వాడు ఎవ్వడు లేడు. మరియు ఆయన లెక్క తీసుకోవటంలో అతి శీఘ్రుడు.

**42.** మరియు వాస్తవానికి వారికి పూర్వం ఉన్నవారు కూడా కుట్రలు పన్నారు. కాని, కుట్రలన్నీ అల్లాహ్ కే చెందినవి. ప్రతి ప్రాణి సంపాందించేది ఆయనకు తెలుసు. మరియు (మేలైన) అంతమ (పరలోక) నివాసం ఎవరిదో సత్యతిరస్కారులు తెలుసుకుంటారు.

**43.** మరియు (ఓ ప్రవక్తా!) సత్యతిరస్కారులు నీతో అంటున్నారు: "నీవు సందేశహరుడవు కావు!" వారితో అను: "నాకూ - మీకూ మధ్య అల్లాహ్ సాక్ష్యమే చాలు! మరియు వారి (సాక్ష్యం), ఎవరికైతే గ్రంథజ్ఞానం ఉందో!"[56]

---

[55] అంటే, 'అరేబియా భూభాగం, రోజు రోజుకు ముష్రికుల కొరకు తగ్గుతూపోవడం మరియు ముస్లింలు దానిని ఆక్రమించుకోవడం వారు (ముష్రికులు) చూడటం లేదా?

[56] అంటే, ఇస్లాం స్వీకరించిన 'అబ్దుల్లాహ్ బిన్ సల్లాం మరియు సల్మాన్ ఫారసీ (ర'ది.'అన్హుమ్)ల వంటి యూదుల మరియు క్రైస్తవుల సాక్ష్యం అన్నమాట!

# 14. ఇబ్రాహీమ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. అలిఫ్-లామ్-రా[1]. (ఇది)ఒక దివ్యగ్రంథం. దీనిని మేము ప్రజలను-వారి ప్రభువు అనుమతి తో - అంధకారాల నుండి వెలుతురులోకి[2] సర్వశక్తిమంతుడు సర్వస్తోత్రాలకు అర్హుడైన (అల్లాహ్) మార్గం వైపునకు తీసుకు రావటానికి, (ఓ ముహమ్మద్!) నీపై అవతరింప జేశాము.
2. ఆయనే అల్లాహ్! ఆకాశాలలో ఉన్నదీ మరియు భూమిలో ఉన్నదీ సర్వమూ ఆయనకే చెందు తుంది మరియు సత్యతిరస్కారులకు కఠినశిక్ష వల్ల తీవ్రమైన దుఃఖం (వ్యధ) కలుగుతుంది.
3. ఎవరైతే పరలోక జీవితం కంటే, ఇహలోక జీవితానికి అధిక ప్రాధాన్యతనిచ్చి, (ప్రజలను) అల్లాహ్ మార్గం నుండి ఆటంక పరుస్తూ, దానిని వక్రమైనదిగా చూపగోరుతారో! అలాంటి వారే మార్గభ్రష్టత్వంలో చాలా దూరం వెళ్ళిపోయిన వారు.
4. మరియు మేము ప్రతి ప్రవక్తను అతని జాతివారి భాషతోనే పంపాము; అతను వారికి స్పష్టంగా

[*] [ఇబ్రాహీమ్ – ప్రవక్త ఇబ్రాహీమ్ అలైహిస్సలాము]
[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి. ‘
[2] చూడండి 57:9 మరియు 2:257.

బోధించటానికి, మరియు అల్లాహ్ తాను కోరిన వారిని మార్గభ్రష్టత్వంలో వదలు తాడు. మరియు తాను కోరిన వారికి మార్గదర్శకత్వం చేస్తాడు[3]. మరియు ఆయన సర్వ శక్తిమంతుడు, మహా వివేకవంతుడు.

5. మరియు వాస్తవానికి మేము మూసాను, మా సూచనలతో (ఆయాత్ లతో) పంపి: "నీ జాతి వారిని అంధకారాల నుండి వెలుతురు వైపునకు తెచ్చి, వారికి అల్లాహ్ దినాలను[4] జ్ఞాపకం చేయించు." అని అన్నాము. నిశ్చయంగా, ఇందులో సహనశీలురకు, కృతజ్ఞులకు ఎన్నో సూచనలున్నాయి[5].

6. మూసా తన జాతివారితో ఇలా అన్నాడు: "అల్లాహ్ మీకు చేసిన అనుగ్రహాలను జ్ఞాపకం చేసుకోండి. ఆయన మీకు ఫిర్'ఔన్ జాతివారి నుండి విముక్తి

[3] ఎవడు మార్గభ్రష్టుడవుతాడో మరియు ఎవడు సన్మార్గంపై ఉంటాడో అల్లాహ్ (సు.తా.)కు తెలుసు. కాబట్టి ఆయన వారిని వారి పరిస్థితులలో వదలుతాడు. అల్లాహ్ (సు.తా.) బలవంతంగాఎవరినీకూడామార్గభ్రష్టులుగాగానీ,సన్మార్గులుగా గానీ చేయడు. ఇంకా చూడండి, 16:93.

[4] అయ్యామిల్లాహ్: అంటే ఇస్రాయీ'ల్ సంతతివారిపై అల్లాహుతా'ఆలా చేసిన అనుగ్రహాలు మరియు వారిపై పడ్డ శిక్షలు.

[5] సహనంవహించికృతజ్ఞతలుతెలిపేవారికిచాలాలాభాలుంటాయి. దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'అల్లాహ్ (సు.తా.) తన దాసుని కొరకు ఎట్టి పరిస్థితిని ఏర్పరిచినా అది అతని మేలుకే! అతనికి కష్టాలు కలిగిస్తే, వాటిని అతడు సహించితే అతని మేలుకే! లేక అతనికి సుఖసంతోషాలు ప్రసాదిస్తే అతడు దానికి తన ప్రభువుకు కృతజ్ఞతలు చూపాలి.' ('స'హీ'హ్ ముస్లిం).

కలిగించాడు. వారు మిమ్మల్ని తీవ్రమైన శిక్షలకు గురి చేస్తూ ఉండేవారు, మీ కుమారులను వధించి, మీ కుమార్తెలను (స్త్రీలను) బ్రతకనిచ్చేవారు[6]. మరియు అందులో మీకు, మీ ప్రభువు తరపు నుండి ఒక గొప్ప పరీక్ష ఉండింది.

7. మరియు మీ ప్రభువు ప్రకటించింది (జ్ఞాపకం చేసుకోండి): "మీరు కృతజ్ఞులైతే! నేను మిమ్మల్ని ఎంతో అధికంగా అనుగ్రహిస్తాను[7]. కాని ఒకవేళ మీరు కృతఘ్నులైతే! నిశ్చయంగా, నా శిక్ష ఎంతో కఠినమైనది[8].

8. మరియు మూసా ఇలా అన్నాడు: "ఒకవేళ మీరు మరియు భూమిలో నున్న వారందరూ సత్యతిరస్కారానికి పాల్పడితే! తెలుసుకోండి నిశ్చయంగా, అల్లాహ్ స్వయం సమృద్ధుడు, సర్వస్తోత్రాలకు అర్హుడు."

9. ఏమీ? పూర్వం గతించిన, ప్రజల గాథలు మీకు చేరలేదా? నూహ్, ఆద్ మరియు సమూద్ జాతివారి మరియు వారి తరువాత వచ్చినవారి (గాథలు)? వారిని గురించి అల్లాహ్ తప్ప మరెవ్వరూ ఎరుగరు! వారి ప్రవక్తలు వారి వద్దకు స్పష్టమైన సూచనలు తీసుకొని వచ్చినపుడు,

[6] చూడండి, 2:49.
[7] అల్లాహుతా'ఆలా మీకు ప్రసాదించిన దానికి మీరు కృతజ్ఞులైతే ఆయన మరింత ప్రసాదిస్తాడు.
[8] కృతఘ్నులను అల్లాహుతా'ఆలా కఠినంగా శిక్షిస్తాడు.

వారు తమ నోళ్ళలో తమ చేతులు పెట్టుకొని[9] ఇలా అన్నారు: "నిశ్చయంగా మేము మీతో పంపబడిన సందేశాన్ని తిరస్కరిస్తున్నాము. మరియు నిశ్చయంగా, మీరు దేని వైపునకైతే మమ్మల్ని ఆహ్వానిస్తున్నారో, దానిని గురించి మేము ఆందోళన కలిగించేటంత సందేహంలో పడి వున్నాము[10]."

10. వారి ప్రవక్తలు (వారితో) ఇలా అన్నారు: "ఏమీ? ఆకాశాలనూ మరియు భూమినీ సృష్టించిన, అల్లాహ్ ను గురించి (మీకు) సందేహం ఉందా? ఆయన మీ పాపాలను క్షమించటానికి మరియు మీకు ఒక నిర్ణీత కాలం వరకు వ్యవధి నివ్వటానికి మిమ్మల్ని పిలుస్తున్నాడు!"[11] వారన్నారు: "మీరు కూడా మా వంటి మానవులే, మీరు మా తండ్రి తాతలు ఆరాధిస్తూ వచ్చిన (దైవాల) ఆరాధన నుండి మమ్మల్ని ఆపాలనుకుంటున్నారా? అయితే స్పష్టమైన ప్రమాణం ఏదైనా తీసుకురండి[12]."

11. వారి ప్రవక్తలు వారితో (ఇంకా) ఇలా అన్నారు:

---

[9] చూడండి, 3:119, కోపంతో తమ చేతులను కొరుక్కుంటూ అన్నారు.(షౌకాని, 'తబరీ, ర.'అలైహిమ్).

[10] చూడండి, 11:62. ఇదే విధమైన ఆశ్చర్యం, 'సాలి'హ్ ('అ.స.) యొక్క ప్రజలు సూచించారు. ప్రతి కాలపు ప్రజలు అల్లాహ్ (సు.తా.)ను నిరాకరించారు లేదా ఆయనకు సిఫారసు దారులను లేక భాగస్వాములను కల్పించారు.

[11] అద్భుత సూచనలైతే ప్రవక్తల ద్వారా చూపబడతాయి. కాని వారు, తాము కోరిన అద్భుత సూచనలు చూపమని కోరారు.

[12] చూడండి, 13:31 చివరి భాగం.

"నిశ్చయంగా, మేము మీ వంటి మానవులం మాత్రమే! కాని అల్లాహ్ తన దాసులలో తాను కోరిన వారిని అనుగ్రహిస్తాడు. మరియు - అల్లాహ్ అనుమతిస్తేనే తప్ప - మీ కొరకు ప్రమాణం తీసుకు రావటమనేది మా వశంలో లేదు. మరియు విశ్వాసులు కేవలం అల్లాహ్ మీదనే దృఢనమ్మకం ఉంచుకోవాలని[13].

12. "మరియు మేము అల్లాహ్ మీద నమ్మకం ఎందుకు ఉంచుకోరాదు? వాస్తవానికి ఆయనే మాకు సన్మార్గపు దారులను చూపాడు. మరియు మేము నిశ్చయంగా మీరు పెట్టే బాధలను సహనంతో భరిస్తాము. మరియు నమ్మకం గలవారు, కేవలం అల్లాహ్ మీదే దృఢ నమ్మకం ఉంచుకోవాలి!"

13. మరియు సత్యతిరస్కారులు తమ ప్రవక్తలతో అన్నారు: "మీరు మా మతంలోకి తిరిగి రాక పోతే మేము తప్పకుండా మిమ్మల్ని మా దేశం నుండి వెళ్ళగొడ్తాము[14]." అప్పుడు వారి ప్రభువు వారికి ఇలా దివ్యజ్ఞానం (వహీ) పంపాడు: "మేము ఈ దుర్మార్గులను తప్పక నాశనం చేస్తాము[15].

14. మరియు వారి తరువాత ఆ భూమి మీద మిమ్మల్ని నివసింపజేస్తాము[16]. ఇది నా

---

[13] చూడండి, 7:75 మరియు 13:43.

[14] చూడండి 7:88-89. అక్కడ ఇదే ప్రశ్న షు'ఐబ్ ('అ.స.) ముందు పెట్టబడింది.

[15] చూడండి, 37:171-173.

[16] చూడండి, 21:105.

సాన్నిధ్యంలో నిలువటానికి (లెక్క చెప్పటానికి) భయపడేవానికి మరియు నా హెచ్చరికకు (శిక్షకు) భయపడేవానికి (నా వాగ్దానం)[17]."

**15.** మరియు వారు తీర్పు కోరారు[18] మరియు నిర్దయుడూ[19], (సత్య) విరోధి అయిన ప్రతి వాడూ నాశనమయ్యాడు.

**16.** అతని ముందు నరకం అతనికై వేచి ఉంటుంది మరియు అక్కడ సలసల కాగే చిక్కని చీములాంటి నీరు త్రాగటానికి ఇవ్వబడుతుంది[20].

**17.** దానిని అతడు గుటకలు గుటకలుగా బలవంతంగా గొంతులోకి దింపటానికి ప్రయత్నిస్తాడు. కాని దానిని మ్రింగలేడు. అతనికి ప్రతి వైపు నుండి మరణం ఆసన్నమవుతుంది, కాని అతడు మరణించలేడు. మరియు అతని ముందు భయంకరమైన శిక్ష వేచి ఉంటుంది.

**18.** తమ ప్రభువును తిరస్కరించిన వారి కర్మలను, తుఫాను దినమున పెనుగాలి ఎగురవేసే

---

[17] చూడండి, 79:40-41; మరియు 55:46.

[18] ఈ కోరిక సత్యతిరస్కారులది కూడా కావచ్చు. చూడండి, 8:19,32. లేదా ప్రవక్తలది కూడా కావచ్చు. ఒకవేళ ఈ కోరిక ప్రవక్తలది అయితే: 'మరియు వారు (ప్రవక్తలు తమ ప్రభువు) సహాయాన్ని (జయాన్ని) కోరారు. మరియు నిర్దయుడు .... నాశనమయ్యాడు.' అని చదవబడుతుంది.

[19] జబ్బారున్ : Insolent, Compeller, Ferocious, Irresistible, బలవంతం, లేక నిర్బంధం చేసేవాడు, నిరంకుశుడు, నిర్దయుడు, క్రూరుడు.

[20] చూడండి, 6:70.

బూడిదతో పోల్చవచ్చు[21]. వారు తమ కర్మలకు ఎలాంటి ప్రతిఫలం పొందలేరు. ఇదే మార్గభ్రష్టత్వంలో చాలా దూరం పోవటం[22].

**19.** ఏమీ? నిశ్చయంగా, అల్లాహ్ భూమ్యాకాశాలను సత్యంతో సృష్టించాడని నీకు తెలియదా?"[23] ఆయన కోరితే మిమ్మల్ని నశింపజేసి, మరొక క్రొత్త సృష్టిని తేలగడు![24]

**20.** మరియు అలా చేయటం అల్లాహ్ కు కష్టమైన పని కాదు.

**21.** మరియు వారందరూ అల్లాహ్ ముందు హాజరు పరచబడి నప్పుడు, (ఇహలోకంలో) బలహీనులుగా ఉన్నవారు గొప్పవారిగా ఉన్న వారితో అంటారు: "వాస్తవానికి ప్రపంచంలో మేము మిమ్మల్ని అనుసరించాము, ఇపుడు మీరు మమ్మల్ని అల్లాహ్ శిక్ష నుండి కాపాడ టానికి ఏమైనా చేయగలరా?" వారంటారు: "అల్లాహ్ మాకు సన్మార్గం చూపి ఉంటే మేము మీకు కూడా (సన్మార్గం) చూపి ఉండేవారం. ఇపుడు మనం దుఃఖపడినా లేదా సహనం వహించినా అంతా

---

[21] సత్యతిరస్కారుల కర్మలు పునరుత్థాన దినమున ఈ విధంగా ఎగిరిపోతాయి. వారికెలాంటి పుణ్య ఫలితం దొరకదు.

[22] చూడండి, 22:12 చివరి భాగంలో కూడా ఈ పలుకులే ఉన్నాయి.

[23] ఇటువంటి ఆయత్ కు చూడండి 10:5.

[24] ఈ విషయమే ఎన్నో సార్లు విశదీకరించబడింది. చూడండి 35:16-17, 47:38, 5:54, 4:133.

ఒక్కటే! మనకిప్పుడు తప్పించుకునే మార్గం ఏదీ లేదు[25]."

**22.** మరియు తీర్పు జరిగిన తరువాత షైతాను (వారితో) అంటాడు: "నిశ్చయంగా, అల్లాహ్ మీకు చేసిన వాగ్దానమే సత్యమైన వాగ్దానం మరియు నేను మీకు వాగ్దానంచేసి దానిని భంగం చేశాను. మరియు నాకు మీపై ఎలాంటి అధికారం ఉండేది కాదు; నేను కేవలం మిమ్మల్ని ఆహ్వానించాను, మీరు స్వీకరించారు[26]. కావున మీరు నన్ను నిందించకండి మిమ్మల్ని మీరే నిందించుకోండి. నేను మీకు సహాయం చేయలేను మరియు మీరూ నాకు సహాయం చేయ లేరు ఇంతకు ముందు మీరు నన్ను (అల్లాహ్ కు) సాటిగా కల్పించిన దాన్ని నిశ్చయంగా నేను తిరస్కరిస్తున్నాను[27]". నిశ్చయంగా, దుర్మార్గులకు బాధాకరమైన శిక్ష ఉంటుంది.

**23.** మరియు విశ్వసించి, సత్కార్యాలు చేసే వారిని

---

[25] ఈ విధమైన ఆయతులకు చూడండి, 40:47-48, 7:38-39, 33:66, 68. నరకవాసులు ఒకరితోనొకరు వాదులాడుకునే దానికి, చూడండి, 34:31-33.

[26] చూడండి,4:120 షైతాను అంటాడు నేను మిమ్మల్ని బలవంతం చేయలేదు. కేవలం వాగ్దానం చేశాను

[27] షైతాను ఎన్నడూ తాను అల్లాహ్ (సు.తా.) కు సాటి అనలేదు. చూడండి, 7:20 మరియు 15:36, 39 లలో షైతాను అన్నాడు: 'ఓ నా ప్రభూ!....' అని మరియు 8:48, 59:16లలో: 'నేను అల్లాహ్ కు భయ పడతాను .....' అని. కాని ప్రజలకు వారి పాపకార్యాలను మంచివిగా కనిపించేటట్లు చేస్తాడు. చూడండి, 6:43, 8:48, 16:63, 27:24, 29:38. షైతాను ఎన్నడూ తనను తాను అల్లాహ్ (సు.తా.) కు సమానుడిగా చెప్పుకోలేదు.

క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేయబడుతుంది. వారి ప్రభువు అనుమతితో వారక్కడ శాశ్వతంగా ఉంటారు. వారితో అక్కడ: "మీకు శాంతి కలుగు గాక (సలాం)!" అని అనబడుతుంది[28].

24. మంచి మాట (కలిమయె తయ్యిబ్) ను అల్లాహ్ దేనితో పోల్చాడో మీకు తెలియదా? ఒక మేలుజాతి చెట్టుతో! దాని వ్రేళ్ళు (భూమిలో) స్థిరంగా నాటుకొని ఉంటాయి. మరియు దాని శాఖలు ఆకాశాన్ని (అంటుకొంటున్నట్లు) ఉంటాయి.

25. తన ప్రభువు ఆజ్ఞతో, అది ఎల్లప్పుడూ ఫలాలను ఇస్తూ ఉంటుంది. మరియు ప్రజలు జ్ఞాపకముంచుకోవాలని అల్లాహ్ ఈ విధమైన ఉపమానాలు ఇస్తూ ఉంటాడు[29].

26. మరియు చెడ్డమాటను, భూమి నుండి పెల్లగింపబడిన, స్థిరత్వం లేని, ఒక చెడ్డ జాతి చెట్టుతో పోల్చవచ్చు!

27. విశ్వసించి తమ మాటపై స్థిరంగా ఉన్నవారిని అల్లాహ్ ఇహలోకంలోనూ మరియు పరలోకంలోనూ స్థిరపరుస్తాడు మరియు అల్లాహ్ దుర్మార్గులను మార్గభ్రష్టులుగా చేస్తాడు. మరియు అల్లాహ్ తాను కోరినది చేస్తాడు.

28. ఏమీ? నీవు చూడలేదా (ఎరుగవా)? అల్లాహ్ అనుగ్రహాలను సత్యతిరస్కారంగా మార్చిన వారిని

[28] చూడండి, 10:10
[29] చూడండి, 39:29.

మరియు తమ జాతి వారిని వినాశ గృహంలోకి త్రోసినవారిని -

**29.** (అంటే) నరకం! వారంతా అందులో ప్రవేశిస్తారు మరియు అది ఎంత దుర్భరమైన నివాసం.

**30.** మరియు (ప్రజలను) ఆయన మార్గం నుండి తప్పించటానికి వారు అల్లాహ్ కు సమానులను (అందాదులను) కల్పించారు. వారితో అను: "మీరు (తాత్కాలికంగా) సుఖసంతోషాలను అనుభవించండి. ఎందుకంటే! నిశ్చయంగా, మీ గమ్యస్థానం నరకాగ్నియే!"

**31.** నా దాసులలో విశ్వసించిన వారితో నమాజు స్థాపించమని మరియు మేము వారికిచ్చిన ఉపాధి నుండి రహస్యంగానో బహిరంగంగానో - బేరం జరుగటం గానీ, మిత్రుల సహాయం పొందటం గానీ సాధ్యం కాని దినం రాక పూర్వమే - ఖర్చు పెట్టమని చెప్పు[30].

**32.** అల్లాహ్! ఆయనే, భూమ్యాకాశాలను సృష్టించాడు. మరియు ఆకాశం నుండి నీటిని కురిపించి, దాని నుండి మీ కొరకు ఆహారంగా ఫలాలను పుట్టింటాడు. మరియు తన ఆజ్ఞతో ఓడలను మీకు ఉపయుక్తంగా చేసి సముద్రంలో నడిపించాడు. మరియు నదులను కూడా మీకు ఉపయుక్తంగా చేశాడు.

**33.** మరియు ఎడతెగకుండా, నిరంతరం పయనించే, సూర్యచంద్రులను మీకు ఉపయుక్తంగా చేశాడు.

---

[30] ఈ విధమైన ఆయత్ ల కొరకు చూడండి, 3:91, 5:36, 10:54, 13:18, 39:47, 70:11-15.

మరియు రాత్రింబవళ్ళను కూడా మీకు ఉపయుక్తంగా ఉండేటట్లు చేశాడు[31].

**34.** మరియు మీరు అడిగినదంతా మీకు ఇచ్చాడు. మీరు అల్లాహ్ అనుగ్రహాలను లెక్కించదలచినా లెక్కించజాలరు. నిశ్చయంగా, మానవుడు దుర్మార్గుడు, కృతఘ్నుడు.

**35.** మరియు ఇబ్రాహీమ్ ఇలా ప్రార్థించిన విషయం (జ్ఞాపకం చేసుకోండి)[32]: "ఓ నా ప్రభూ! ఈ నగరాన్ని (మక్కాను) శాంతినిలయంగా ఉంచు! మరియు నన్నూ నా సంతానాన్నీ విగ్రహారాధన నుండి తప్పించు!

**36.** ఓ మా ప్రభూ! నిశ్చయంగా, అవి అనేక మానవులను మార్గభ్రష్టులుగా చేశాయి. ఇక నా విధానాన్ని అనుసరించేవాడు, నిశ్చయంగా, నా వాడు. మరియు ఎవడైనా నా విధానాన్ని ఉల్లంఘిస్తే! నిశ్చయంగా, నీవు క్షమాశీలుడవు, అపార కరుణా ప్రదాతవు.

**37.** ఓ మా ప్రభూ! వాస్తవానికి నేను నా సంతానంలో కొందరిని నీ పవిత్రగృహం(కఅబహ్) దగ్గర, పైరు పండని, ఎండిపోయిన కొండలోయలో నివసింపజేశాను[33]. ఓ మా ప్రభూ! వారిని

---

[31] రాత్రింబవళ్ళ గురించి చూడండి, 10:67, 27:86 మరియు 40:61.

[32] ఆయత్ లు 35-41 ఈ సూరహ్ పేరును సూచిస్తున్నాయి. మరియు ఇబ్రాహీం ('అ.స.) ప్రార్థనను జ్ఞాపకం చేయిస్తున్నాయి.

[33] ఇస్మాయీల్ ('అ.స.), అతని తల్లి హాజర్ ('అ.స.) లు మరియు వారి సంతతివారు.

అక్కడ నమాజ్ స్థాపించటానికి ఉంచాను. కనుక నీవు ప్రజల హృదయాలను, వారి వైపుకు ఆకర్షింప జేయి మరియు వారు కృతజ్ఞులై ఉండటానికి వారికి జీవనోపాధిగా ఫలాలను సమకూర్చు.

38. ఓ మా ప్రభూ! నిశ్చయంగా, మేము దాచేదంతా మరియు వ్యక్త పరచేదంతా నీకు తెలుసు. మరియు భూమిలో గానీ, ఆకాశంలో గానీ అల్లాహ్ నుండి దాగి ఉన్నది ఏదీ లేదు.

39. సర్వస్తోత్రాలకు అర్హుడైన అల్లాహ్ నాకు వృద్ధాప్యంలో కూడా ఇస్మాయీల్ మరియు ఇస్ హాఖ్ లను ప్రసాదించాడు. నిశ్చయంగా, నా ప్రభువు ప్రార్థనలను వినేవాడు.

40. "ఓ నా ప్రభూ! నన్ను మరియు నా సంతతి వారిని నమాజ్ స్థాపించేవారిగా చేయి[34]. ఓ మా ప్రభూ! నా ప్రార్థనలను స్వీకరించు.

41. ఓ మా ప్రభూ! నన్నూ నా తల్లిదండ్రులను మరియు సమస్త విశ్వాసులను లెక్కల పరిష్కారం రోజు క్షమించు."

42. మరియు ఈ దుర్మార్గుల చేష్టల నుండి అల్లాహ్ నిర్లక్ష్యంగా ఉన్నాడని నీవు భావించకు[35].

---

[34] ఇస్'హాఖ్ ('అ.స.) సంతతివారిలో నుండి ఇస్రాయీ'ల్ సంతతి (బనీ-ఇస్రాయీ'ల్) వారు వచ్చారు. మరియు ఇస్మాయీ'ల్ ('అ.స.) సంతతి వారలో నుండి ఖురైషులు వచ్చారు. వారందరిలో కూడా అల్లాహ్ (సు.తా.)కు అవిధేయులైన వారుండిరి.

[35] దుర్మార్గులంటే ఇక్కడ అల్లాహ్ సుతా'ఆలాకు సాటి కల్పించేవారు.

నిశ్చయంగా, ఆయన వారిని - వారి కళ్ళు, రెప్ప వేయకుండా ఉండిపోయే - ఆ రోజు వరకు వ్యవధి నిస్తున్నాడు.

**43.** (ఆ రోజు) వారు తలలు పైకెత్తి, పరిగెత్తుతూ ఉంటారు, పై చూపులు పైనే నిలిచి ఉంటాయి. మరియు వారు శూన్యహృదయులై ఉంటారు.

**44.** మరియు (ఓ ముహమ్మద్!) శిక్షపడే ఆ రోజు గురించి ప్రజలను నీవు హెచ్చరించు. ఆ రోజు దుర్మార్గం చేసిన వారు అంటారు: "ఓ మా ప్రభూ! నీ సందేశాన్ని స్వీకరించటానికి, ప్రవక్తలను అనుసరించటానికి, మాకు మరికొంత వ్యవధినివ్వు!"[36] (వారికి ఇలాంటి సమాధాన మివ్వబడుతుంది): "ఏమీ? ఇంతకు ముందు 'మాకు వినాశం లేదు' అని ప్రమాణం చేసి చెప్పిన వారు మీరే కాదా?

**45.** "మరియు తమకు తాము అన్యాయం చేసుకున్న వారి స్థలాలలో మీరు నివసించారు. మరియు వారితో ఎలా వ్యవహరించామో మీకు బాగా తెలుసు. మరియు మేము మీకు ఎన్నో ఉపమానాలు కూడా ఇచ్చాము."

**46.** మరియు వాస్తవానికి వారు తమ కుట్ర పన్నారు మరియు వారి కుట్ర అల్లాహ్ కు బాగా తెలుసు. కాని వారి కుట్ర కొండలను తమ చోటు నుండి

---

[36] చూడండి, 6:27.

కదిలింప గలిగేది కాదు[37].

47. కనుక అల్లాహ్ తన ప్రవక్తలకు చేసిన వాగ్దానాన్ని భంగపరుస్తాడని భావించకు. నిశ్చయంగా, అల్లాహ్! సర్వశక్తిమంతుడు, ప్రతీకారం తీర్చుకోగలవాడు.

48. ఈ భూమి మరొక భూమిగా మరియు ఆకాశాలు (వేరే ఆకాశాలుగా) మారే రోజు[38]; ఆ అద్వితీయుడు, ప్రబలుడు అయిన అల్లాహ్ ముందు అందరూ హాజరు చేయబడతారు.

49. మరియు ఆ రోజు అపరాధులను సంకెళ్ళలో, కూడబెట్టి, బంధించి ఉంచటాన్ని నీవు చూస్తావు.

50. వారి వస్త్రాలు తారు (నల్ల జిడ్డు ద్రవం)తో చేయబడి ఉంటాయి మరియు అగ్ని జ్వాలలు వారి ముఖాలను క్రమ్ముకొని ఉంటాయి -

51. అల్లాహ్ ప్రతి ప్రాణికి దాని కర్మల ప్రతిఫలం ఇవ్వటానికి. నిశ్చయంగా, అల్లాహ్ లెక్క తీసుకోవటంలో అతి శీఘ్రుడు.

52. ఇది (ఈ ఖుర్ఆన్) మానవులకు ఒక సందేశం. వారు దీనితో హెచ్చరించబడటానికి మరియు నిశ్చయంగా ఆయన (అల్లాహ్) ఒక్కడే ఆరాధ్య

---

[37] చూడండి, 19:90-91. పై తాత్పర్యం ఇబ్నె-కసీ'ర్ (ర'హ్మా.) గారిది. కొందరు వ్యాఖ్యాతలు ఈ విధంగా కూడా బోధించారు: 'ముష్రిక్ ఖురైషులు దైవప్రవక్త ము'హమ్మద్ ('స'అస) ను చంపటానికి పన్నాగాలు పన్నారు. కాని వారు తమ పన్నాగాలలో నెగ్గలేక పోయారు, విఫలులయ్యారు.'

[38] చూడండి. 20:105-107.

దైవమని వారు తెలుసుకోవడానికి మరియు బుద్ధిమంతులు గ్రహించడానికి ఇది పంపబడింది.

# 15. అల్-హిజ్ర్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. అలిఫ్ - లామ్ - రా[1]. ఇవి దివ్యగ్రంథ ఆయత్ లు మరియు (ఇది) ఒక స్పష్టమైన ఖుర్ఆన్[2].
2. సత్యతిరస్కారులు: "మేము అల్లాహ్ కు విధేయులమైతే(ముస్లింలమైతే) ఎంత బాగుండేది!" అని (పునరుత్థాన దినమున), పలుమార్లు కోరుకుంటారు.
3. వారిని తింటూ (త్రాగుతూ) సుఖసంతోషాలను అనుభవిస్తూ (వృథా) ఆశలలో ఉండటానికి విడిచిపెట్టు. తరువాత వారు (సత్యాన్ని) తెలుసుకుంటారు.
4. మరియు (దాని వ్యవధి) నిర్ణయించి వ్రాయబడి ఉండనిదే, మేము ఏ నగరాన్నీ కూడా నాశనం చేయలేదు[3].
5. ఏ సమాజం కూడా తన నిర్ణీత గడువుకు, ముందు

---

[*] [అల్-హిజ్ర్ అంటే రాతి ప్రదేశము, రాళ్ళసీమ]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి. '

[2] చూడండి, 5:15.

[3] ఇంకా చూడండి, 26:208 మరియు 6:131.

గానీ మరియు వెనుక గానీ కాజాలదు[4].

6. మరియు (సత్యతిరస్కారులు) అంటారు: "ఓ హితబోధ (ఖుర్ఆన్) అవతరింప జేయబడిన వాడా (ముహమ్మద్)! నిశ్చయంగా నీవు పిచ్చివాడవు.

7. "నీవు సత్యవంతుడవే అయితే, మా వద్దకు దేవదూతలను ఎందుకు తీసుకొనిరావు?"

8. మేము దేవదూతలను, సత్యంతో తప్ప పంపము మరియు వారు వచ్చినప్పుడు వీరికి ఏ మాత్రం వ్యవధి ఇవ్వబడదు[5].

9. నిశ్చయంగా, మేమే ఈ జ్ఞాపిక (ఖుర్ఆన్) ను అవతరింప జేశాము మరియు నిశ్చయంగా మేమే దీనిని కాపాడేవారము[6].

10. మరియు (ఓ ముహమ్మద్!) వాస్తవానికి మేము, నీకు పూర్వం గతించిన తెగల వారి వద్దకు కూడా

---

[4] చూడండి, 7:34. ఏ నగరం కూడా దాని సత్యతిరస్కారం మరియు అత్యాచారాలకు వెంటనే నాశనం చేయబడలేదు. దానికి ఒక వ్యవధి, నియమిత కాలం అల్లాహుతా'ఆలా తరఫు నుండి ఇవ్వబడుతోంది. ఇక ఆ నియమిత కాలం వచ్చిన తరువాత వారు దాని నుండి వెనుకా ముందు కాలేరు అంటే ఒక్క క్షణం కూడా వ్యవధి పొందలేరు.

[5] చూడండి, 6:8-9.

[6] 1400 సంవత్సరాలలో ఒక అక్షరం కూడా మార్పు లేకుండా భద్రపరచబడిన దివ్యగ్రంథం కేవలం ఈ ఖుర్ఆన్ మాత్రమే. ఎందుకంటే అల్లాహుతా'ఆలా: "నిశ్చయంగా, మేమే ఈ జ్ఞాపిక (ఖుర్ఆన్) ను అవతరింపజేశాము మరియు నిశ్చయంగా మేమే దీనిని కాపాడేవారము." అని అన్నాడు. ఇంకా చూడండి, 2:23 మరియు 85:22.

(ప్రవక్తలను) పంపాము.

11. మరియు వారి వద్దకు వచ్చిన ఏ ప్రవక్తను కూడా, వారు పరిహసించకుండా ఉండలేదు[7].

12. ఈ విధంగా మేము దీనిని (సత్యతిరస్కారాన్ని) అపరాధుల హృదయాలలో ప్రవేశపెడు తున్నాము.

13. వారు దీనిని (ఈ ఖుర్ఆన్ ను) విశ్వసించడం లేదు. మరియు వాస్తవానికి (సత్యతిరస్కారులైన) వారి పూర్వీకుల విధానం కూడా ఇలాగే ఉండేది.

14. మరియు ఒకవేళ మేము వారి కొరకు ఆకాశపు ఒక ద్వారాన్ని తెరిచినా, వారు దానిపైకి ఎక్కుతూ పోతూ!

15. ఇలా అనేవారు: "నిశ్చయంగా, మా చూపులు భ్రమింపజేయబడ్డాయి. అలా కాదు, మాపై మంత్రజాలం చేయబడింది[8]."

16. మరియు వాస్తవానికి, మేము ఆకాశంలో తారాగణాన్ని (నక్షత్రరాశులను) సృష్టించి, దానిని చూపరులకు అలంకారమైనదిగా చేశాము.

17. మరియు శపించబడిన (బహిష్కరించబడిన) ప్రతి షైతాన్ నుండి దానిని (ఆకాశాన్ని) సురక్షితంగా[9].

18. కాని, ఎవడైనా (ఏ షైతానైనా) దొంగచాటుగా వినటానికి ప్రయత్నిస్తే, స్పష్టమైన కొరవి (అగ్ని

---

[7] చూడండి, 6:10.
[8] ఇంకా చూడండి, 6:7 మరియు 10:2.
[9] ఇంకా చూడండి, 2:14 మరియు 37:7.

జ్వాల) అతనిని వెంబడిస్తుంది[10].

**19.** మరియు మేము భూమిని వ్యాపింపజేశాము మరియు దానిలో స్థిరమైన పర్వతాలను నాటాము మరియు దానిలో ప్రతి వస్తువును తగిన పరిమాణంలో ఉత్పత్తి చేశాము.

**20.** మరియు అందులో మీకూ మరియు మీరు పోషించని వాటి కొరకూ (జీవరాసుల కొరకూ) మేము జీవనోపాధిని కల్పించాము[11].

**21.** మరియు మా దగ్గర పుష్కలంగా నిలువలేని వస్తువు అంటూ ఏదీ లేదు మరియు దానిని మేము ఒక నిర్ణీత పరిమాణంలో మాత్రమే పంపుతూ ఉంటాము.

**22.** మరియు మేము (వృక్షకోటిని) ఫలవంతం చేయటానికి గాలులను పంపుతాము! తరువాత మేము ఆకాశం నుండి నీటిని కురిపించి, దానిని మీకు త్రాగటానికి సమకూర్చుతాము మరియు దాని కోశాధికారులు మీరు మాత్రం కారు!

**23.** మరియు నిశ్చయంగా, మేమే జీవన్మరణాలను ఇచ్చేవారము; మరియు చివరకు మేమే వారసులుగా మిగిలే వారము[12].

**24.** మరియు వాస్తవానికి, మీకు ముందు గడిచి పోయిన వారిని గురించి మాకు తెలుసు మరియు వాస్తవంగా మీ తరువాత వచ్చే వారిని గురించి

---

[10] ఇంకా చూడండి, 37:10.

[11] ఇంకా చూడండి, 11:6.

[12] ఇంకా చూడండి, 3:180 మరియు 57:10.

కూడా మాకు బాగా తెలుసు[13].
**25.** మరియు నిశ్చయంగా, నీ ప్రభువు, ఆయనే! వారందరినీ సమావేశపరుస్తాడు. నిశ్చయంగా, ఆయన మహా వివేకవంతుడు, సర్వజ్ఞుడు.
**26.** మరియు వాస్తవంగా మేము మానవుణ్ణి మ్రోగే (ధ్వని చేసే) మట్టి, రూపాంతరం చెందిన జిగట బురద (బంకమట్టి)తో సృష్టించాము[14].
**27.** మరియు దీనికి పూర్వం మేము జిన్నాతులను (పొగలేని) మండే అగ్నిజ్వాలతో సృష్టించాము[15].

---

[13] 'ఎవరైతే ముందుగా (మా వద్దకు) వస్తారో మరియు ఎవరు వెనుక ఉండిపోతారో తెలుసు'. ఈ రెండు రకాల వ్యాఖ్యానాలు కూడ సరైనవే అని వ్యాఖ్యాతలు అంగీకరించారు. మరొక వ్యాఖ్యానం: 'మరియు వాస్తవానికి, మీలో ముందుకు సాగిపోయే వారెవరో మాకు తెలుసు మరియు వాస్తవానికి, వెనుకంజ వేసేవారెవరో కూడా మాకు తెలుసు.' అని కూడా ఇవ్వబడింది.

[14] మానవుడు మట్టితో సృష్టించబడ్డాడు. వేర్వేరు చోట్లలో ఆ మట్టి స్థితిని బట్టి వేర్వేరు పేర్లు ఇవ్వబడ్డాయి. 1) సాధారణంగా ఎడిపోయిన (తడిలేని) మట్టిని తురాబ్ - దుమ్ము అని, 2) దానిని నీళ్ళు వేసి కలిపితే 'తీన్ - మట్టి అని, 3) అది చాలా నీళ్ళతో కలిపి వాసన వచ్చే బురదగా ఉంటె, 'హమఇన్ మస్నూన్ - జిగట బురద అని, 4) అది ఎండిపోయి శబ్దం చేస్తే, - 'స'ల్సాల్ - అని, 5) దానిని కాల్చితే, ఫ'ఖ్ఖార్ - పెంకు, అని పేర్లు ఇవ్వబడ్డాయి. (చూడండి, 55:14).

[15] అల్ - జిన్ను, జిన్నతున్ (బ.వ.) అంటే మానవుల కండ్లకు కనబడనిది అని అర్థము. అందుకే వారిని ఈ పేరుతో పిలుస్తారు. వారికి తెలివి ఉంది, మంచి చెడుల విచక్షణా శక్తి ఉంది. పొగలేని అగ్నిజ్వాలలతో సృష్టించబడ్డారు. వారు తింటారు, త్రాగుతారు. వారి సంతతి పెరుగుతుంది. వారికి మరణం ఉంది. వారి కర్మలను బట్టి వారికి, మానవుల వలె స్వర్గనరకాల ప్రతిఫలాలు కూడా ఉన్నాయి. ('అబ్దుల్ మజీద్ దర్యాబాదీ, ర'హ్మ.) చూడండి 55:15 మరియు 6:100.

**28.** మరియు నీ ప్రభువు దేవదూతలతో ఇలా అన్న విషయం(జ్ఞాపకం చేసుకో!) "నిశ్చయంగా నేను మ్రోగే మట్టి, రూపాంతరం చెందిన జిగట బురదతో మానవుణ్ణి సృష్టించబోతున్నాను.

**29.** ఇక నేను అతనికి పూర్తిగా ఆకారమిచ్చి (రూపమిచ్చి), అతని (ఆదమ్) లో నా తరఫు నుండి ప్రాణం(రూహ్) ఊదిన తరువాత, మీరంతా అతని ముందు సాష్టాంగం (సజ్దా) చేయాలి[16]"

**30.** అప్పుడు దేవదూతలు, అందరూ కలిసి సాష్టాంగం (సజ్దా) చేశారు -

**31.** ఒక్క ఇబ్లీస్ తప్ప! అతడు సాష్టాంగం (సజ్దా) చేసే వారిలో చేరనని మొండికేశాడు[17].

**32.** (అల్లాహ్) ఇలా ప్రశ్నించాడు: "ఓ ఇబ్లీస్! నీకేమయింది, నీవు సాష్టాంగం (సజ్దా) చేసే వారిలో ఎందుకు చేరలేదు?”

---

[16] ఈ సాష్టాంగం కేవలం అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞను శిరసావహించటానికి చేయబడిన గౌరవప్రదమైన సాష్టాంగం. ఇది ఆరాధనార్థం చేసింది కాదు. ము'హమ్మద్ ('స'అస) షరీఅత్ లో గౌరవార్థం కూడా ఎవ్వరికైనను సాష్టాంగం చేయటం ధర్మసమ్మతం కాదు. ఇంకా చూడండి, 2:30-34 మరియు 7:11-18.

[17] 'మానవుడు మట్టితో సృష్టించబడ్డాడు, కాని నేనైతే అగ్నితో సృష్టించబడ్డాను, కాబట్టి నేను మానవుని కంటే ఉత్తముడను, నేనెందుకు అతనికి సజ్దా చేయాలి.' అని ఇబ్లీస్ అన్నాడు. దైవప్రవక్తలందరూ మట్టితోనే సృష్టించబడ్డ మానవులేనని ఖుర్ఆన్ విశదీకరించింది. దీనిని విశ్వసించక పోవడం మరియు మట్టితో సృష్టించబడ్డవారు అధములని భావించడం షై'తాన్ ను అనుసరించడమే! ఇంకా చూడండి, 7:11

33. (ఇబ్లీస్) ఇలా జవాబిచ్చాడు: "మ్రోగే మట్టి, రూపాంతరం చెందిన జిగట బురదతో నీవు సృష్టించిన మానవునికి నేను సాష్టాంగం (సజ్దా) చేసే వాడను కాను."

34. (అల్లాహ్) అన్నాడు: "అయితే నీవు ఇక్కడి నుండి వెళ్ళిపో! ఇక, నిశ్చయంగా, నీవు శపించ (బహిష్కరించ) బడ్డవాడవు!

35. మరియు నిశ్చయంగా, తీర్పు దినము వరకు నీపై శాపం (బహిష్కారం) ఉంటుంది."

36. (ఇబ్లీస్) వేడుకున్నాడు: "ఓ నా ప్రభూ! పునరుత్థాన దినం వరకు నాకు వ్యవధినివ్వు!"

37. (అల్లాహ్) జవాబిచ్చాడు: "ఇక నిశ్చయంగా, నీవు వ్యవధి ఇవ్వబడిన వారిలోని వాడవు!

38. (నాకు మాత్రమే) తెలిసి వున్న ఆ దినపు, ఆ సమయం వరకు!"

39. (ఇబ్లీస్) అన్నాడు: "ఓ నా ప్రభూ! నీవు నన్ను అపమార్గం పట్టించావు, కావున నేను వారికి, భూమిలో (వారి దుష్కర్మలన్నీ) మంచివిగా కనబడేటట్లు చేస్తాను మరియు నిశ్చయంగా, వారందరినీ అపమార్గంలో పడవేస్తాను.

40. వారిలో నీవు ఎన్నుకున్న (నీ ఆజ్ఞానువర్తనులైన) నీ దాసులు తప్ప!"

41. (అల్లాహ్) అన్నాడు: "ఇదే మా దగ్గరకు తెచ్చే

ఋజుమార్గం[18].

**42.** నిశ్చయంగా, నా దాసులపై నీ అధికారం సాగదు! కేవలం మార్గభ్రష్టులైన నిన్ను అనుసరించే వారి మీద తప్ప![19]

**43.** మరియు నిశ్చయంగా, వారందరి కొరకు వాగ్దానం చేయబడిన (నివాసం) నరకమే!

**44.** దానికి (నరకానికి) ఏడు ద్వారాలు ఉన్నాయి[20]. వాటిలో ఒక్కొక్క ద్వారానికి ఒక్కొక్క వర్గం వారు ప్రత్యేకించబడి ఉన్నారు.

**45.** నిశ్చయంగా, దైవభీతి గలవారు స్వర్గవనాలలో చెలమల మధ్య ఉంటారు.

**46.** వారు: 'శాంతితో సురక్షితంగా ప్రవేశించండి!' అని ఆహ్వానించబడతారు.

**47.** వారి హృదయాలలో మిగిలి వున్న కాపట్యాన్ని (మాలిన్యాన్ని) మేము తొలగిస్తాము. వారు

---

[18] బహిష్కరించబడిన ఇబ్లీస్, అల్లాహుతా'ఆలా ఇచ్చనే నెరవేరుస్తున్నాడు. అల్లాహ్ (సు.తా.) మానవునికి మంచి చెడును అర్థం చేసుకునే జ్ఞానాన్ని ప్రసాదించి, ఎవడు చెడు (షై'తాన్ ప్రేరణ)లో పడిపోతాడో చూస్తాడు. ఈ విధంగా షై'తాన్ అల్లాహ్(సు.తా.)ఇచ్చనిర్వహణలో ఒకపాత్రనిర్వహిస్తున్నాడు. కావు షై'తాన్ వల నుండి తప్పించుకునే వాడు ఋజుమార్గం మీద ఉండగలడు. ఇంకా చూ 19:83 మరియు 7:24.

[19] చూడండి, 14:22 మరియు 7:11-18.

[20] నరకానికి ఏడు అంతస్తులు లేక శ్రేణులున్నాయి. 1) జహన్నుమ్, 2) ల"జ్జా, 3) 'హుత్మ', 4) స'యీర్, 5) సఖర్, 6) జ'హీమ్, 7) హావియహ్, ఇది అన్నింటి కంటే క్రింది అంతస్తు, ఇందులో మునాఫిఖులు (కపటవిశ్వాసులు) ఉంటారు. (ఫ'త్హ అల్ ఖదీర్), చూడండి, 74:27 వ్యాఖ్యానం 2.

సోదరుల వలే ఎదురెదురుగా పీఠాలపై కూర్చొని ఉంటారు[21].

**48.** అక్కడ వారికి అలసట ఉండదు మరియు అక్కడి నుండి వారు ఎన్నడూ వెడలగొట్టబడరు.

**49.** నా దాసులకు ఇలా తెలియజెయ్యి: "నిశ్చయంగా నేను, కేవలం నేనే! క్షమించే వాడను, కరుణించేవాడను[22].

**50.** మరియు నిశ్చయంగా, నా శిక్షయే అతి బాధాకరమైన శిక్ష!

**51.** మరియు వారికి ఇబ్రాహీమ్ అతిథులను గురించి తెలుపు[23].

**52.** వారు అతని వద్దకు వచ్చి: "నీకు శాంతి కలుగు గాక (సలాం)!" అని అన్నారు. అతనన్నాడు: "నిశ్చయంగా, మాకు మీ వలన భయం కలుగుతున్నది[24]."

**53.** వారు జవాబిచ్చారు: "నీవు భయపడకు! నిశ్చయంగా, మేము జ్ఞానవంతుడైన ఒక

---

[21] చూడండి, 56:15 మరియు 88:13.

[22] చూడండి, 6:12 మరియు 6:54.

[23] ఇబ్రాహీమ్ ('అ.స.) యొక్క విరరమైన గాథ కొరకు చూడండి, 11:69-76. దీనికి కొంత కాలం ముందే అవతరింపజేయబడిన సూరహ్.

[24] వారి భయానికి కారణం కొరకు చూడండి, 11:70 దీని ద్వారా తెలిసేదేమిటంటే ఇబ్రాహీమ్ ('అ.స.) ఒక దైవప్రవక్త అయినా, వచ్చిన అతిథులు దైవదూతలని వారు చెప్పేంత వరకు తెలుసుకోలేకపోయారు. అంటే దైవప్రవక్తలకు అగోచరజ్ఞానం ఉండదు. అల్లాహ్ (సు.తా.) వారికి తెలిపినది మాత్రమే వారికి తెలుస్తుంది.

కుమారుని శుభవార్తను నీకు ఇస్తున్నాము."

54. (ఇబ్రాహీమ్)అన్నాడు: "మీరు ఈ ముసలితనంలో నాకు (కుమారుడు కలుగుననే) శుభవార్తను ఇస్తున్నారా? మీరు ఎలాంటి (అసాధ్యమైన) శుభవార్తను ఇస్తున్నారు?"

55. వారన్నారు: "మేము నీకు సత్యమైన శుభవార్తను ఇచ్చాం. కనుక నీవు నిరాశ చెందకు."

56. (ఇబ్రాహీమ్) అన్నాడు: "తన ప్రభువు కారుణ్యం పట్ల నిరాశ చెందేవారు మార్గభ్రష్టులు తప్ప మరెవరు?"

57. (ఇంకా) ఇలా అన్నాడు: "ఓ దైవదూతలారా! మరి మీరు వచ్చిన కారణమేమిటి?"

58. వారన్నారు: "వాస్తవానికి మేము అపరాధులైన జాతి వారి వైపునకు పంపబడ్డాము[25].

59. లూత్ ఇంటివారు[26] తప్ప - నిశ్చయంగా వారందరినీ రక్షిస్తాము;

60. అతని భార్య తప్ప! (ఆమెను గురించి అల్లాహ్ అన్నాడు): "నిశ్చయంగా ఆమె వెనుక ఉండి పోయే వారిలో చేరాలని మేము నిర్ణయించాము[27]."

61. తరువాత ఆ దేవదూతలు లూత్ ఇంటి వారి వద్దకు వచ్చినపుడు;

---

[25] సోడోమ్ మరియు గొమొర్రహ్ ప్రజల గాథ కొరకు చూడండి, 7:80-84 మరియు 11:77-83.

[26] ఆల: అంటే ఇంటివారే కాక అనుచరులందరూ కూడా అన్న మాట.

[27] చూడండి, 7:83 11:81 మరియు 66:10.

62. (లూత్) అన్నాడు: "నిశ్చయంగా, మీరు (నాకు) పరాయివారిగా కన్పిస్తున్నారు[28]."

63. వారన్నారు: "కాదు! వాస్తవానికి వారు (దుర్మార్గులు) దేనిని గురించి సందేహంలో పడి ఉన్నారో, దానిని (ఆ శిక్షను) తీసుకొని నీ వద్దకు వచ్చాము[29].

64. మరియు మేము నీ వద్దకు సత్యాన్ని తెచ్చాము. మరియు మేము నిశ్చయంగా, సత్యం పలుకుతున్నాము.

65. కావున నీవు కొంత రాత్రి మిగిలి ఉండగానే, నీ ఇంటి వారిని తీసుకొని బయలుదేరు, నీవు వారి వెనుక పో! మీలో ఎవ్వరూ కూడా వెనుదిరిగి చూడరాదు; మరియు మీరు, మీకు ఆజ్ఞాపించిన వైపునకే పోతూ ఉండండి."

66. మరియు (మా దూతల ద్వారా) మా ఆదేశాన్ని అతనికి ఇలా తెలియజేశాము: "నిశ్చయంగా, తెల్లవారే సరికి వారందరూ సమూలంగా నిర్మూలించబడతారు."

67. మరియు నగరవాసులు ఉల్లాసంతో అక్కడికి వచ్చారు.

68. (లూత్) అన్నాడు: "వాస్తవానికి, వీరు నా అతిథులు, కావున నన్ను అవమానం పాలు

---

[28] ఆ దేవదూతలు యువకుల ఆకారంలో వచ్చారు. చూడండి, 11:77.

[29] చూడండి, 6:57-58, 8:32, 11:8.

చేయకండి[30].

69. మరియు అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగిఉండండి మరియు నా గౌరవాన్ని పోగొట్టకండి"

70. వారన్నారు: "ప్రపంచంలోని (ప్రతివాణ్ణి వెనకేసుకోకు!"అని మేము నిన్ను వారించలేదా?"[31]

71. (లూత్)అన్నాడు:"మీకు(ఏమైనా)చేయాలనే ఉంటే,నా కుమార్తెలు(జాతిస్త్రీలు) ఉన్నారు"[32]

72. "నీ ప్రాణం సాక్షి! నిశ్చయంగా, వారు తమ (కామ) మత్తులో త్రోవ తప్పి తిరుగు తున్నారు[33]." (అని దైవదూతలు అన్నారు.)

73. ఆ పిదప సూర్యోదయమున ఒక భయంకరమైన గర్జన (సయ్ హా) వారిని పట్టుకున్నది.

74. తరువాత మేము ఆ నగరాన్ని తలక్రిందులుగా చేశాము మరియు వారిపై కాల్చిన మట్టి గులకరాళ్ళను కురిపించాము.

---

[30] చూడండి, 7:80-81, 11:77-79.

[31] లూ'త్ ('అ.స.) సొడోమ్ ప్రాంతంలో విదేశీయుడు. ఎందుకంటే అతను మెసపొటోమియా నుండి వచ్చిన వాడు. చూడండి, 7:80-82.

[32] లూ'త్ ('అ.స.) తన జాతి స్త్రీలను తన కుమార్తెలని సంబోధించారు.

[33] కొందరు వ్యాఖ్యాతలు ఈ ఆయత్ లూ'త్ ('అ.స.) ను సంబోధిస్తున్నదని అంటారు. మరికొందరు దైవప్రవక్త ('స'అస) ను సంబోధిస్తున్నదని. అల్లాహుతా'ఆలా ఇక్కడ ము'హమ్మద్ ('స'అస) యొక్క ప్రాణ సాక్ష్యం ఇస్తున్నాడు. ఆయన (సు.తా.) తాను కోరిన దాని ప్రమాణం చేస్తాడు. కాని మానవులకు అల్లాహుతా'ఆలా తప్ప మరెవ్వరి ప్రమాణం చేయటం ధర్మసమ్మతం కాదు.

**75.** నిశ్చయంగా, ఇందులో దూరదృష్టి గలవారికి ఎన్నో సూచనలున్నాయి.

**76.** మరియు వాస్తవానికి ఆ ప్రాంతం ఒక రహదారి పైననే ఉన్నది.

**77.** నిశ్చయంగా, ఇందులో విశ్వసించిన వారికి ఒక సూచన ఉంది.

**78.** మరియు అయ్ కహ్ (మద్ యన్) వాసులు కూడా దుర్మార్గులుగానే ఉండేవారు[34].

**79.** కావున మేము వారి మీద కూడా ప్రతీకారం తీర్చుకున్నాము. మరియు ఆ రెండు (శిథిలాలు) కూడా ఒక స్పష్టమైన మార్గం మీద ఉన్నాయి[35].

**80.** మరియు వాస్తవానికి హిజ్ర్ వాసులు కూడా ప్రవక్తలను అసత్యవాదులన్నారు[36].

**81.** మరియు వారికి కూడా మేము అద్భుత సూచన (ఆయాత్) లను ఇచ్చి ఉంటిమి. కాని వారు వాటి

---

[34] అయ్ కహ్ వాసులు (దట్టమైన వనవాసులు) మద్ యన్ ప్రజలు. వారు తమ ప్రవక్తల షు'ఐబ్ ను తిరస్కరించారు. వారు ఒక భూకంపం మరియు జ్వాలాముఖి సంభవించి నాశనమయ్యారు. చూడండి, 7:85-93 మరియు 11:84-95.

[35] లూ'త్ ('అ.స.) ప్రజలు మరియు షు'ఐబ్ ('అ.స.) ప్రజలు దగ్గరి దగ్గరి ప్రాంతాలలో నివసించారు. వారు లూ'త్ ('అ.స.) మరణించిన కొన్ని సంవత్సరాల తరువాత వచ్చారు.

[36] స'మూద్ జాతి మరియు వారి ప్రవక్త 'సాలి'హ్ ('అ.స.) నివసించే ప్రాంతం పేరు 'హిజ్ర్, కావున వారిని అస్'హాబ్ అల్-'హిజ్ర్ అంటారు. ఈ ప్రాంతం మదీనా-తబూక్'ల మధ్య ఉంది. చూ, 7:73-79.

నుండి విముఖులై ప్రవర్తించారు[37].

**82.** మరియు వారు కొండలను తొలచి గృహాలను నిర్మించుకునేవారు[38], సురక్షితంగా ఉండగలమని (భావిస్తూ)!

**83.** చివరకు ఒక ఉదయమున ఒక తీవ్రమైన గర్జన(సయ్ హ్)వారిపై కూడా వచ్చి పడింది.

**84.** అప్పుడు వారు సంపాదించింది వారికి ఏ మాత్రం పనికి రాలేక పోయింది.

**85.** మరియు మేము ఆకాశాలనూ, భూమినీ మరియు వాటి మధ్యనున్న సర్వాన్ని కేవలం సత్యంతోనే[39] సృష్టించాము. మరియు నిశ్చయంగా, తీర్పు గడియ రానున్నది. కావున నీవు ఉదార భావంతో వారిని ఉపేక్షించు!

---

[37] ఈ అద్భుత సూచనలలో ఆ ఆడఒంటె ఒకటి. కాని వారు దానిని చంపేశారు.

[38] చూడండి 7:74. 9వ హిజ్రీలో దైవప్రవక్త('స'అస) తబూక్ దండయాత్రకు పోయేటప్పుడు, ఈ నగరం దారి లో వచ్చింది అతను('స'అస) తమ నెత్తి మీద బట్ట చుట్టుకున్నారు మరియు తమ ఒంటె గమనాన్ని తీవ్రం చేశారు మరియు తమ సహీబీలతో ఇలా అన్నారు: 'ఏడుస్తూ, అల్లాహ్(సు.తా.) శిక్షకు భయ పడుతూ ఈ నగరం నుండి ప్రయణించండి. ('స'హీ'హ్ బు'ఖారీ, 433; 'స. ముస్లిం 2285. ఇబ్నె కసీ'ర్ వ్యాఖ్యానం).

[39] చూడండి, 53:31.

**86.** నిశ్చయంగా, నీ ప్రభువు ఆయనే సర్వ సృష్టికర్త[40], సర్వజ్ఞుడు[41].

**87.** మరియు మేము నిశ్చయంగా, నీకు తరచుగా పఠింపబడే ఏడు (సూక్తులను) మరియు సర్వోత్తమ ఖుర్ఆన్ ను ప్రసాదించాము[42].

**88.** వారిలో (అవిశ్వాసులలో) కొందరికి మేము ఒసంగిన ఐహిక సంపదలను నీవు కన్నెత్తి కూడా చూడకు. మరియు వారి (అవిశ్వాస) వైఖరికి బాధపడకు. మరియు విశ్వసించిన వారికి ఆశ్రయం (ఛాయ) ఇవ్వటానికి నీ రెక్కలను విప్పు[43].

**89.** మరియు (ఓ ముహమ్మద్!) వారితో ఇలా అను: "నిశ్చయంగా, నేను స్పష్టమైన హెచ్చరిక చేసే వాడను మాత్రమే!"

**90.** ఏ విధంగానైతే మేము (గ్రంథాన్ని), విభజించే

---

[40] అల్-'ఖల్లాఖ్: The Greatest Creator, The Creator of all things. సృష్టి క్రియలో పరిపూర్ణుడు, సృష్టికర్త. సముచిత రూపం శక్తిసామర్థ్యాలు ఇచ్చి తీర్చిదిద్ది అత్యుత్తమంగా సృష్టించేవాడు. చూడండి, అల్-'ఖాలిఖు:7:102.

[41] చూడండి, 7:199.

[42] సబ్ 'అమ్మినల్ మసా'ని. ఈ పేరు సూరహ్ అల్ ఫాతిహా'కు దైవప్రవక్త ము'హమ్మద్ ('స'అస) స్వయంగా ఇచ్చారు. అది దివ్యఖుర్ఆన్ సారం (ఉమ్ముల్ కితాబ్) అని కూడా అనబడుతుంది. ('స'హీ'హ్ బు'ఖారీ, కితాబ్ అత్తఫ్సీర్ సూరాహ్ అల్-'హిజ్ర్). చూడండి, సూరహ్ అల్ ఫాతి'హా (1).

[43] విశ్వసించినవారితో సానుభూతితో, ప్రేమతో, కనికరంతో వ్యవహరించు. చూడండి, 17:24.

వారిపై అవతరింపజేశామో![44]

91. ఎవరైతే ఈ ఖుర్ఆన్ ను (తమ తిరస్కారంతో) ముక్కలు ముక్కులుగా చేశారో!

92. నీ ప్రభువు సాక్షిగా! నిశ్చయంగా, మేము వారందరినీ ప్రశ్నిస్తాము;

93. వారు చేస్తూ ఉండిన కర్మలను గురించి.

94. కావున నీకు ఆజ్ఞాపించబడిన దానిని బహిరంగంగా చాటించు[45]. మరియు అల్లాహ్ కు సాటి కల్పించే వారి (ముష్రికీన్) నుండి విముఖుడవకు.

95. నిశ్చయంగా, నీతో పరిహాసాలాడే వారి నుండి

---

[44] 1) కొందరు వ్యాఖ్యాతలు అ'న్జల్ నా అవతరింపబజేశాము అంటే 'అజా'బ్ - శిక్ష అ అర్థంలో తీసుకున్నారు. ఆ శిక్ష వారి (ఖురైషుల) కొరకు ఎవరైతే దివ్యగ్రంథాన్ని (ఈ ఖుర్ఆన్ ను) వేర్వేరు ముక్కలుగా చేసి, కొంత భాగాన్ని కవిత అని, కొంత భాగాన్ని మంత్రజాలమని, మరికొంత భాగాన్ని ప్రాచీన గాథలని, పేర్లు పెట్టారో. 2) మరికొందరు వ్యాఖ్యాతలు ముఖ్తసిమీన్ - అంటే పూర్వ గ్రంథ ప్రజలు (యూదులు, క్రైస్తవులు) అని అంటారు. మరియు ఖుర్ఆన్ అంటే తౌరాత్ /ఇంజీల్ అంటారు. వారు వీటిని విభిన్న భాగాలలోకి ముక్కలు ముక్కలుగా చేశారు. 3) ఇంకా మరికొందరు వ్యాఖ్యాతలు వీరు 'సాలి'హ్ ('అస) యొక్క జాతివారు అంటారు. వారు 'సాలి'హ్ మరియు అతన కుటుంబం వారిని చంపి ముక్కలు ముక్కలుగా చేయాలని కుట్రలు పన్నారు. చూడండి, 27:49. 4) మరొక వ్యాఖ్యానం ఏమిటంటే దివ్యగ్రంథపు కొంత భాగాన్ని నమ్మి, ఇతర భాగాన్ని తిరస్కరించటం.

[45] ఈ ఆయత్ అవతరింక ముందు దైవప్రవక్త ('స'అస) రహస్యంగా ప్రజలకు ధర్మబోధన (తబ్లీగ్ / ద'ఆవహ్) చేసేవారు. ఇది అవతరింప జేయబడిన తరువాత బహిరంగంగా ధర్మబోధన (ద'ఆవహ్) చేయటం ప్రారంభించారు. (ఫ'త్హ్ అల్ ఖదీర్).

నిన్ను రక్షించటానికి మేమే చాలు!

96. ఎవరైతే అల్లాహ్ తో పాటు ఇతర దైవాలను కూడా (ఆరాధనకు) నియమించు కుంటున్నారో, వారు త్వరలోనే (సత్యాన్ని) తెలుసుకుంటారు.

97. మరియు వాస్తవానికి వారు పలికే మాటల వలన నీ హృదయానికి తప్పక కష్టం కలుగుతుందని మాకు బాగా తెలుసు.

98. కావుననీవునీప్రభువుపవిత్రతనుకొనియాడుతూ స్తోత్రం చేస్తూ ఉండు మరియు సాష్టాంగం (సజ్దా) చేసే వారిలో చేరు.

99. మరియు తప్పక రాబోయే ఆ అంతిమ ఘడియ (మరణం) వచ్చే వరకు, నీ ప్రభువును ఆరాధిస్తూ ఉండు[46].

---

[46] అల్ - యఖీను: అంటే మరణం. ('స. బు'ఖారీ, కితాబ్ అత్తఫ్సీర్). ఇంకా చూడండి, 74:47.

# 16. అస్-నహల్

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. అల్లాహ్ ఆజ్ఞ (తీర్పు) వచ్చింది! కావున మీరు దాని కొరకు తొందర పెట్టకండి. ఆయన సర్వలోపాలకు అతీతుడు మరియు వారు సాటి కల్పించే భాగస్వాములకు అత్యున్నతుడు.
2. ఆయనే తన ఆజ్ఞతో, దేవదూతల ద్వారా, దివ్యజ్ఞానాన్ని (రూహ్ ను)[1] తాను కోరిన, తన దాసులపై అవతరింపజేస్తాడు[2] వారిని (ప్రజలను) ఇలా హెచ్చరించటానికి: "నిశ్చయంగా, నేను తప్ప మరొక ఆరాధ్య దేవుడు లేడు! కావున మీరు నాయందే భయభక్తులు కలిగి ఉండండి!"
3. ఆయన ఆకాశాలను మరియు భూమిని సత్యంతో సృష్టించాడు. వారు, ఆయనకు సాటి కల్పించే భాగస్వాముల (షరీక్ ల) కంటే ఆయన అత్యున్నతుడు[3].
4. ఆయన మానవుణ్ణి ఇంద్రియ (వీర్య) బిందువుతో

---

[1] అర్ - రూ'హు: అంటే ఇక్కడ దివ్యజ్ఞానం (వ'హీ) అని అర్థం. చూడండి, 40:15, 42:52. అక్కడ కూడా రూ'హ్ అర్థం వ'హీ అని ఉంది. మూడు చోట్లలో ఖుర్ఆన్ లో రూ'హ్, జిబ్రీల్ ('అ.స.) అనే అర్థంతో కూడా వాడబడింది. 19:17, 97.4. వివరాలకు చూడండి, 19:17 వ్యాఖ్యానం 3.

[2] తన సందేశాన్ని ఎవరిపై అవతరింపజేయాలో అల్లాహ్ (సు.తా.) కు బాగా తెలుసు. చూడండి, 6:124 మరియు 40:15.

[3] చూడండి, 10:5.

సృష్టించాడు, తరువాత ఆ వ్యక్తియే ఒక బహిరంగ వివాదిగా మారిపోతాడు.

5. మరియు ఆయన పశువులను సృష్టించాడు. వాటిలో మీ కొరకు వెచ్చని దుస్తులు మరియు అనేక లాభాలు కూడా ఉన్నాయి. మరియు వాటిలో నుండి (కొన్నిటి మాంసం) మీరు తింటారు.

6. మరియు వాటిని మీరు సాయంత్రం ఇండ్లకు తోలుకొని వచ్చేటప్పుడు మరియు ఉదయం మేపటానికి తోసుకొని పోయేటప్పుడు, వాటిలో మీకొక మనోహరమైన దృశ్యం ఉంది.

7. మరియు అవి మీబరువును మోసుకొని - మీరు ఎంతో శ్రమపడనిదే చేరుకోలేని ప్రాంతాలకు - తీసుకుపోతాయి. నిశ్చయంగా మీ ప్రభువు మహాకనికరుడు, అపార కరుణా ప్రదాత.

8. మరియుఆయనగుర్రాలను[4],కంచరగాడిదలను మరియు గాడిదలను, మీరు స్వారీ చేయటానికి

[4] ఇక్కడ గుర్రాల విషయం స్వారీ చేయటానికి అని వచ్చింది. అవి స్వారీ కొరకు చాలా విలువైనవి కాబట్టి సాధారణంగా వాటిని, వాటి మాంసాన్ని తినటానికి ఉపయోగించరు. 'స. బు'ఖారీ, కితాబ్ అల్ - 'హజ్జ్, జు'బాయ'హ్, బాబ్ ల'హుమ్ అల్ 'ఖైల్; మరియు స 'హీ ముస్లిం, కితాబ్ అ'స్సైద్, బాబ్ ఫి అక్ల్ ల'హుమ్ అల్ - 'ఖైల్, జావబిర్ (ర'ది. 'అ.) ఉల్లేఖనం ప్రకారం పై ఇద్దరు 'హదీస్'వేత్తలు పేర్కొన్నట్లు గుర్రాల మాంసము తినటానికి 'హలాలే. ఇంతేగాక దైవప్రవక్త ('స'అస) సమక్షంలో 'ఖైబర్ మరియు మదీనాలలో గుర్రాలను కోసి తిన్నట్లు ఉల్లేఖనా (రివాయత్)లు ఉన్నాయి. దైవప్రవక్త ('స'అస) వారిని నివారించలేదు. ('స. ముస్లిం, ముస్నద్ అ'హ్మద్, అబూ దావూద్, ఇబ్నె కసీ'ర్ వ్యాఖ్యానం).

మరియు మీ శోభను పెంచటానికి సృష్టించాడు. మరియు ఆయన, మీకు తెలియనివి (అనేక ఇతర సాధనాలను) కూడా సృష్టించాడు[5].

9. మరియు సన్మార్గం చూపటమే అల్లాహ్ విధానం[6] మరియు అందులో (లోకంలో) తప్పుడు (వక్ర) మార్గాలు కూడా ఉన్నాయి. ఆయన తలచుకొని ఉంటే మీరందరికీ సన్మార్గం చూపి ఉండేవాడే[7].

10. ఆయనే, ఆకాశం నుండి మీకొరకు నీళ్ళను కురిపిస్తాడు. దాని నుండి మీకు త్రాగటానికి నీరు దొరకుతుంది మరియు మీ పశువులను మేపటానికి పచ్చిక పెరుగుతుంది.

11. ఆయన దీని (నీటి) ద్వారా మీ కొరకు

---

[5] వెంటనే అల్లాహ్ (సు.తా.) అంటున్నాడు: 'మీకు తెలియని ఇంకా ఎన్నో సాధనాలను కూడా సృష్టిస్తాను.' కాబట్టి ఈ ఆయత్ ఎల్లప్పటికి నిజమే. ఈనాడు విమానాలు, రాకెట్లు వచ్చాయి. ఇంకా ముందు ఏమేమి వస్తాయో అల్లాహుతా'ఆలాకే తెలుసు. చూడండి, 36:42.

[6] అల్లాహ్ (సు.తా.) ప్రతి ఒక్కరికీ ఎవరైతే వినగోతారో ఋజుమార్గం వైపునకే మార్గ దర్శకత్వం చేస్తాడు. చూడండి, 6:12, 54. అల్లాహ్ (సు.తా.) కరుణిస్తానని పూనుకున్నాడు.

[7] అల్లాహుతా'ఆలా మానవునికి తెలివి, విచక్షణా శక్తిని ఇచ్చి, మంచి చెడులను తెలుపుతున్నాడు. మరియు మానవునికి వీటి మధ్య ఎన్నుకోవటానికి స్వాతంత్ర్యం ఇస్తున్నాడు. ఎవరిని కూడా సన్మార్గం మీద నడవటానికి గానీ, లేదా మార్గభ్రష్టత్వాన్ని అవలంబించటానికి గానీ బలవంతం చేయడు. చివరకు వారి విశ్వాసం మరియు కర్మలకు తగిన ప్రతిఫలం స్వర్గమో లేదా నరకమో ఇస్తాడు. అల్లాహుతా'లా తనకు సాటి కల్పించిన వారిని ఎన్నటికీ క్షమించడు. ఆయన (సు.తా.) కు ఆరాధనలో సాటి కల్పించటం (షిర్క్) తప్ప మరే ఇతర పాపమైనా ఆయన (సు.తా.) తాను కోరిన వారిని క్షమిస్తానన్నాడు.

పంటలను, జైతూన్ మరియు ఖర్జూరపు వృక్షాలను, ద్రాక్ష మరియు ఇతర రకాల ఫలాలను పండింపజేస్తున్నాడు. నిశ్చయంగా, ఆలోచించే వారికి ఇందులో ఒక సూచన (నిదర్శనం) ఉంది.

12. మరియు ఆయనే రేయింబవళ్ళను మరియు సూర్యచంద్రులను, మీకు ఉపయుక్తమైనవిగా చేశాడు మరియు నక్షత్రాలు కూడా ఆయన ఆజ్ఞతోనే మీకు ఉపయుక్తమైనవిగా చేయ బడ్డాయి[8] నిశ్చయంగా బుద్ధిని ఉపయోగించేవారికి వీటిలో సూచనలు(నిదర్శనాలు) ఉన్నాయి

13. మరియు ఆయన మీ కొరకు భూమిలో వివిధ రంగుల వస్తువులను ఉత్పత్తి (వ్యాపింప) జేశాడు. నిశ్చయంగా, హితబోధ స్వీకరించే వారికి వీటిలో సూచన ఉంది.

14. మరియు ఆయన సముద్రాన్ని - తాజా మాంసము తినటానికి మరియు మీరు ధరించే ఆభరణాలు తీయటానికి - మీకు ఉపయుక్తమైనదిగా చేశాడు. ఆయన అనుగ్రహాన్ని అన్వేషించటానికి (ప్రజలు), అందులో ఓడల మీద దాని నీటిని చీల్చుకొని పోవటాన్ని నీవు చూస్తున్నావు. మరియు బహుశా మీరు కృతజ్ఞులు అవుతారని ఆయన మీకు (ఇవన్నీ ప్రసాదించాడు).

15. మరియు భూమి మీతో పాటు చలించకుండా ఉండటానికి, ఆయన దానిలో స్థిరమైన పర్వతాలను

---

[8] చూడండి, 14:33

నాటాడు[9]. మరియు అందులో నదులను ప్రవహింపజేశాడు. మరియు రహదారులను నిర్మించాడు. బహుశా మీరు మార్గం పొందుతారని!

16. మరియు (భూమిలో మార్గం చూపే) సంకేతాలను పెట్టాడు. మరియు వారు (ప్రజలు) నక్షత్రాల ద్వారా కూడా తమ మార్గాలు తెలుసుకుంటారు.

17. సృష్టించేవాడూ అసలు ఏమీ సృష్టించలేనివాడూ సమానులా? ఇది మీరెందుకు గమనించరు?

18. మరియు మీరు అల్లాహ్ అనుగ్రహాలను లెక్క పెట్టదలచినా, మీరు వాటిని లెక్క పెట్టలేరు. నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

19. మరియు అల్లాహ్ కు మీరు దాచేవి మరియు మీరు వెలిబుచ్చేవి అన్నీ తెలుసు.

20. మరియు ఎవరినైతే వారు (ప్రజలు), అల్లాహ్ ను వదలి ప్రార్థిస్తున్నారో, వారు ఏమీ సృష్టించలేరు మరియు స్వయంగా వారే సృష్టించబడి ఉన్నారు.

21. వారు (ఆ దైవాలు) మృతులు, ప్రాణం

---

[9] చూడండి, 78:7, 21:31 మరియు 31:10.

లేనివారు[10]. మరియు వారికి తాము తిరిగి ఎప్పుడు లేపబడతారో కూడా తెలియదు.

**22.** మీ ఆరాధ్యదైవం కేవలం(అల్లాహ్) ఒక్కడే! పరలోక జీవితాన్ని విశ్వసించనివారి హృదయాలు (ఈ సత్యాన్ని) తిరస్కరిస్తున్నాయి మరియు వారు దురహంకారంలో పడి ఉన్నారు[11].

**23.** నిస్సందేహంగా, వారి రహస్య విషయాలు మరియు వారి బహిరంగ విషయాలు అన్నీ, నిశ్చయంగా అల్లాహ్ కు తెలుసు. నిశ్చయంగా దురహంకారులంటే[12] ఆయన ఇష్టపడడు.

**24.** మరియు: "మీ ప్రభువు ఏమి అవతరింపజేశాడు?" అని వారిని అడిగినప్పుడు, వారు: "అవి పూర్వకాలపు కల్పిత గాథలు మాత్రమే!" అని

---

[10] ఈ 'మృతులు' అంటే కేవలం విగ్రహాలు మాత్రమే కాదు, మరణించిన సాధులు మరియు వలీలు కూడా! తరువాత ప్రాణం లేని వారు అని మళ్ళీ నొక్కి చెప్పబడుతోంది. దీనితో దర్గాలను ఆరాధించే వారు చెప్పే మాటలు: 'మేము మృతులను కాదు ప్రార్థించేది, వారు తమ గోరీలలో సజీవులై ఉన్నారు' అనేది తప్పని విశదమౌతోంది. అంటే మరణించిన తరువాత వారికి ఈ లోకంతో ఎట్టి సంబంధం ఉండదు. వారు ఏమీ చేయలేరు. అయితే వారెలా మేలు గానీ, కీడు గానీ చేయగలరు? చూడండి, 7:191-194.

[11] అంటే మీ ఆరాధ్య దైవం ఒక్కడే (అల్లాహ్)! అనే మాటను నమ్మటం సత్యతిరస్కారులకు ఆశ్చర్యదాయక మౌతోంది. చూడండి, 38:5 మరియు 39:45.

[12] ఇస్తెక్బారున్: అంటే తనను తాను పెద్ద వాడిగా భావించి, సత్యాన్ని కూడా తిరస్కరించడం మరియు ముందు వారిని నీచులుగా, చిన్నవారిగా భావించడం. ఈ విధమైన గర్విష్ఠులు దురహంకారులంటే అల్లాహ్ (సు.తా.) ఇష్టపడడు. ('స'హీ'హ్ ముస్లిం, కితాబ్ అల్ ఈమాన్, బాబ్ త'ప్రీమ్ కిబ్ర్).

జవాబిస్తారు.

25. కావున పునరుత్థాన దినమున వారు తమ (పాపాల) భారాలను పూర్తిగా మరియు తాము మార్గం తప్పించిన అజ్ఞానుల భారాలలోని కొంతభాగాన్ని కూడా మోస్తారు[13]. వారు మోసే భారం ఎంత దుర్భరమైనదో చూడండి!

26. వాస్తవానికి, వారి కంటే పూర్వం గతించినవారు కూడా (అల్లాహ్ సందేశాలకు వ్యతిరేకంగా) కుట్రలు పన్నారు. కాని అల్లాహ్ వారి (పన్నాగపు) కట్టడాలను వాటి పునాదులతో సహా పెకలించాడు. దానితో వాటి కప్పులు వారి మీద పడ్డాయి మరియు వారిపై, వారు ఊహించని వైపు నుండి శిక్ష వచ్చి పడింది.

27. తరువాత పునరుత్థాన దినమున ఆయన వారిని అవమానపరుస్తాడు మరియు వారిని అడుగుతాడు: "మీరు నాకు సాటి కల్పించిన వారు - ఎవరిని గురించి అయితే మీరు (విశ్వాసులతో) వాదులాడేవారో - ఇప్పుడు ఎక్కడున్నారు?" జ్ఞానం ప్రసాదించబడిన వారు అంటారు: "నిశ్చయంగా, ఈ రోజు అవమానం మరియు దుర్దశ సత్యతిరస్కారుల కొరకే!"

28. "వారిపై, ఎవరైతే, తమను తాము దుర్మార్గంలో ముంచుకొని ఉన్నప్పుడు, దేవదూతలు వారి

---

[13] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'ఎవరైతే ప్రజలను సన్మార్గం వైపునకు పిలుస్తారో, వారికి వారందరి పుణ్యఫలితం లభిస్తుంది. ఎవరైతే ప్రజలను దుర్మార్గం వైపునకు పిలుస్తారో, వారు వారందరి పాపభారాలను కూడా మోస్తారు.' (అబూ-దావూద్, కితాబ్ సున్నహ్, బాబ్ ల'జూమ్ అస్సున్నహ్).

ప్రాణాలు తీస్తారో!" అప్పుడు వారు (సత్యతిరస్కారులు) లొంగి పోయి: "మేము ఎలాంటి పాపం చేయలేదు[14]." అని అంటారు. (దేవదూతలు వారితో ఇలా అంటారు): "అలా కాదు! నిశ్చయంగా, మీరు చేసేదంతా అల్లాహ్ కు బాగా తెలుసు."

**29.** "కావున నరక ద్వారాలలో ప్రవేశించండి. అక్కడ శాశ్వతంగా ఉండటానికి! గర్విష్ఠులకు లభించే నివాసం ఎంత చెడ్డది!"

**30.** మరియు దైవభీతిగలవారితో: "మీ ప్రభువు ఏమి అవతరింపజేశాడు?" అని అడిగినప్పుడు, వారు: "అత్యుత్తమమైనది." అని జవాబిస్తారు. ఎవరైతే ఈ లోకంలో మేలు చేస్తారో వారికి మేలుంటుంది మరియు పరలోక గృహం దీని కంటే ఉత్తమమైంది. మరియు దైవభీతి గలవారి గృహం పరమానందకరమైనది.

**31.** వారు ప్రవేశించే శాశ్వత స్వర్గవనాలలో క్రింద సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడ వారికి వారు కోరేది దొరుకుతుంది. దైవభీతి గలవారికి అల్లాహ్ ఈ విధంగా ప్రతిఫలమిస్తాడు.

**32.** ఎవరైతే, పరిశుద్ధులుగా ఉండగా దైవదూతలు వారి ప్రాణాలు తీస్తారో, వారితో: "మీకు శాంతి కలుగు గాక (సలాం)! మీరు చేసిన మంచిపనులకు ప్రతిఫలంగా

---

[14] చూడండి, 6:23 మరియు 2:11.

స్వర్గంలో ప్రవేశించండి!" అని అంటారు[15].

**33.** ఏమీ? వారు (సత్యతిరస్కారులు) తమ వద్దకు దేవదూతల రాక కోసం ఎదురు చూస్తున్నారా? లేక నీప్రభువుఆజ్ఞ(తీర్పు)కోసంఎదురుచూస్తున్నారా?[16] వారికి పూర్వం ఉన్నవారు కూడా ఈ విధంగానే ప్రవర్తించారు. మరియు అల్లాహ్ వారికి ఎలాంటి అన్యాయం చేయలేదు, కాని వారే తమకు తాము అన్యాయం చేసుకున్నారు.

**34.** అప్పుడు వారి దుష్కర్మల ఫలితాలు వారిపై పడ్డాయి మరియు వారు దేనిని గురించి పరిహాసమాడుతూ ఉన్నారో, అదే వారిని క్రమ్ముకుంది[17].

**35.** మరియు (అల్లాహ్ కు) సాటి కల్పించే వారు అంటారు: "ఒకవేళ అల్లాహ్ కోరి ఉంటే! మేము గానీ మా తండ్రితాతలు గానీ, ఆయన్ని తప్ప మరెవ్వరినీ ఆరాధించేవారం కాదు. మరియు ఆయన ఆజ్ఞ లేనిదే మేము దేన్ని కూడా నిషేధించేవారం కాదు[18]." వారికి పూర్వం వారు కూడా ఇలాగే చేశారు. అయితే ప్రవక్తల బాధ్యత (అల్లాహ్) సందేశాన్ని స్పష్టంగా అందజేయటం తప్ప ఇంకేమిటి?

---

[15] అల్లాహ్ (సు.తా.) మీ సౌందర్యాన్ని చూడడూ మరియు మీ ధనసంపత్తులను చూడడూ, కాని మీ హృదయాలను మరియు మీ కర్మలను చూస్తాడు. ('స 'హీహ్ 'హ్ ముస్లిం, కితాబ్ అల్ బిర్ర్, బాబ్ త'హ్రీమ్ "జుల్మ్ అల్ ముస్లిం).

[16] చూడండి, 6:158.

[17] చూడండి, 6:10.

[18] చూడండి, 6:148 మరియు 6:136-153.

36. మరియు వాస్తవానికి, మేము ప్రతి సమాజం వారి వద్దకు ఒక ప్రవక్తను పంపాము. (అతనన్నాడు): "మీరు అల్లాహ్ ను మాత్రమే ఆరాధించండి. మరియు మిథ్యాదైవాల (తాగూత్ ల) ఆరాధనను త్యజించండి." వారిలో కొందరికి అల్లాహ్ సన్మార్గం చూపాడు. మరికొందరి కొరకు మార్గభ్రష్టత్వం నిశ్చితమై పోయింది. కావున మీరు భూమిలో సంచారం చేసి చూడండి, ఆ సత్యతిరస్కారుల గతి ఏమయిందో!

37. ఇక (ఓ ముహమ్మద్!) నీవు వారిని సన్మార్గానికి తేవాలని ఎంత కోరుకున్నా! నిశ్చయంగా, అల్లాహ్ మార్గభ్రష్టతకు గురి చేసిన వానికి సన్మార్గం చూపడు[19]. వారికి సహాయపడే వారు ఎవ్వరూ ఉండరు.

38. మరియు వారు అల్లాహ్ పేరుతో దృఢమైన శపథం చేసి ఇలా అంటారు: "మరణించిన వానిని అల్లాహ్ తిరిగి బ్రతికించి లేపడు!" ఎందుకు లేపడు! ఆయన చేసిన వాగ్దానం సత్యం! అయినా చాలా మంది ప్రజలకు ఇది తెలియదు (కాని అది జరిగి తీరుతుంది);

39. వారు వాదిస్తూ ఉండిన దానిని గురించి వారికి తెలుపటానికి మరియు సత్యతిరస్కారులు తాము నిశ్చయంగా, అబద్ధమాడుతున్నారని తెలుసుకోవటానికి.

40. నిశ్చయంగా, మేము ఏదైనా వస్తువును

[19] చూడండి, 8:55.

ఉనికిలోనికి తీసుకురాదలచి నపుడు దానిని మేము: "అయిపో!" అని ఆజ్ఞాపిస్తాము. అంతే! అది అయిపోతుంది[20].

**41.** మరియు దౌర్జన్యాన్ని సహించిన తరువాత, ఎవరైతే అల్లాహ్ కొరకు వలస పోతారో[21]; అలాంటి వారికి మేము ప్రపంచంలో తప్పకుండా మంచి స్థానాన్ని నొసంగుతాము. మరియు వారి పరలోక ప్రతిఫలం దాని కంటే గొప్పగా ఉంటుంది. ఇది వారు తెలుసుకొని ఉంటే ఎంత బాగుండేది!

**42.** అలాంటి వారే సహనం వహించిన వారు మరియు తమ ప్రభువును నమ్ముకున్నవారు.

**43.** మరియు (ఓ ముహమ్మద్!) నీకు పూర్వం కూడా మేము పంపిన ప్రవక్తలందరూ పురుషులే

---

[20] ఈ విధమైన వాక్యం 'కున్ ఫ యకూన్' ఖుర్ఆన్ లో 8 సార్లు వచ్చింది. చూడండి, 2:117 వ్యాఖ్యానం 4. పునరుత్థానదినం కొరకు చూడండి, 16:77.

[21] హిజ్రతున్: Migration, Exodus, వలసపోవటం, ప్రస్థానం, అంటే అల్లాహ్ ధర్మం కొరకు, అల్లాహ్ ప్రీతి కొరకు, తన దేశాన్ని బంధు స్నేహితులను విడిచి - అల్లాహ్ ధర్మం మీద ఉండటానికి ఆటంకాలు లేని - ఇతర దేశాలకు వెళ్ళిపోవటం. ఈ ఆయత్ లో ఇలాంటి ముహాజిర్ ల ప్రస్తావన వచ్చింది. బహుశా ఈ ఆయత్ ఆ ముహాజిర్ లను గరించి అవతరింపజేయబడి ఉండవచ్చు, ఎవరైతే మక్కా ముష్రికుల బాధలను సహించలేక 'హబషా (అబిసీనియా) కు వలస పోయారో! వారిలో 'ఉస్మాన్ (ర' ది. 'అ.) మరియు అతని భార్య దైవప్రవక్త ('స'అస) కూతురు, రుఖయ్యా (ర.'అన్హా) కూడా - ఇతర దాదాపు నూరుమంది వలసపోయిన వారితో సహా - ఉన్నారు.

(మానవులే)![22] మేము వారిపై దివ్యజ్ఞానాన్ని (వహీని) అవతరింపజేశాము. కావున ఇది మీకు తెలియకపోతే పూర్వ గ్రంథ ప్రజలను అడగండి.

44. (పూర్వపు ప్రవక్తలను) మేము స్పష్టమైన నిదర్శనాలతో మరియు గ్రంథాలతో (జబూర్ లతో) పంపాము. మరియు (ఓ ప్రవక్తా!) ఇప్పుడు ఈ జ్ఞాపికను (గ్రంథాన్ని) నీపై అవతరింప జేసింది, వారి వద్దకు అవతరింపజేయబడిన దానిని వారికి నీవు స్పష్టంగా వివరించటానికి మరియు బహుశా వారు ఆలోచిస్తారేమోనని!

45. దుష్టపన్నాగాలు చేస్తున్నవారు - అల్లాహ్ తమను భూమిలోనికి దిగి పోయినట్లు చేయకుండా, లేదా తాము ఊహించని వైపు నుండి తమపై శిక్ష అవతరింపజేయకుండా - తాము సురక్షితంగా ఉన్నారనుకొంటున్నారా ఏమిటి?

46. లేదా వారు తిరుగాడుతున్నపుడు, అకస్మాత్తుగా ఆయన వారిని పట్టుకుంటే, వారు ఆయన (పట్టు) నుండి తప్పించుకోగలరా?

47. లేదా, వారిని భయకంపితులు జేసి పట్టుకోవచ్చు కదా! కాని నిశ్చయంగా, నీ ప్రభువు మహా

---

[22] ఇక్కడ విశదమయ్యేదేమిటంటే ప్రతి సమాజంలో దైవప్రవక్త ('అ.స.)లు పంపబడ్డారు. వారందరూ మానవులే. అయితే ము'హమ్మద్ ('స'అస) మానవుడైతే ఇందులో ఆశ్చర్యమేముంది. ఏ ప్రవక్తకు కూడా అగోచర జ్ఞానం లేదు. మీకు తెలియనిచో పూర్వగ్రంథ ప్రజలను అడగండి. వారి ప్రవక్తలు కూడా మానవులే. ఇంకా చూడండి, 6:50, 7:188, 11:31.

కనికరుడు, అపార కరుణా ప్రదాత.

**48.** ఏమీ? వారు అల్లాహ్ సృష్టించిన ప్రతి వస్తువునూ గమనించటం (చూడటం) లేదా? వాటి నీడలు కుడివైపుకూ, ఎడమ వైపుకూ వంగుతూ ఉండి, అల్లాహ్ కు సాష్టాంగం (సజ్దా) చేస్తూ, ఎలా వినమ్రత చూపుతున్నాయో?[23]

**49.** మరియు ఆకాశాలలోను మరియు భూమిలోను ఉన్న సమస్త ప్రాణులు మరియు దేవదూతలు అందరూ అల్లాహ్ కు సాష్టాంగం (సజ్దా) చేస్తూ ఉంటారు. వారెన్నడూ (తమ ప్రభువు సన్నిధిలో) గర్వపడరు.

**50.** వారు తమపై నున్న ప్రభువునకు భయపడుతూ తమకు ఆజ్ఞాపించిన విధంగా నడుచు కుంటారు.

**51.** మరియు అల్లాహ్ ఇలా ఆజ్ఞాపించాడు: "(ఓ మానవులారా!) ఇద్దరినీ ఆరాధ్య దైవాలుగా చేసుకోకండి. నిశ్చయంగా ఆరాధ్య దైవం ఆయన (అల్లాహ్) ఒక్కడే! కావున నాకే భీతిపరులై ఉండండి[24]."

**52.** మరియు ఆకాశాలలో మరియు భూమిలో ఉన్నదంతా ఆయకు చెందినదే! మరియు నిరంతర విధేయతకు కేవలం ఆయనే అర్హుడు[25]. ఏమీ?

---

[23] చూడండి, 13:15.

[24] ఏకైక ఆరాధ్యుడు అల్లాహ్ (సు.తా.) తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. అలా ఉంటే విశ్వవ్యవస్థ ఈ విధంగా శాంతియుతంగా నడిచేది కాదు. అప్పుడు విశ్వంలో అల్లకల్లోలం రేకెత్తి ఉండేది. చూడండి, 21:22.

[25] చూడండి, 39:2-3.

మీరు అల్లాహ్ ను కాదని ఇతరులకు భయభక్తులు చూపుతారా?

53. మరియు మీకు లభించిన అనుగ్రహాలన్నీ కేవలం అల్లాహ్ నుండి వచ్చినవే. అంతేగాక మీకు ఆపదలు వచ్చినపుడు కూడా మీరు సహాయం కొరకు ఆయననే మొరపెట్టుకుంటారు[26].

54. తరువాత ఆయన మీ ఆపదలు తొలగించినపుడు; మీలో కొందరు మీ ప్రభువుకు సాటి (షరీక్ లను) కల్పించ సాగుతారు -

55. మేము చేసిన ఉపకారానికి కృతఘ్నతగా - సరే(కొంతకాలం) సుఖాలను అనుభవించండి. తరువాత మీరు తెలుసుకుంటారు[27].

56. మరియు మేము వారికిచ్చిన జీవనోపాధి నుండి కొంత భాగాన్ని, తాము ఏ మాత్రం ఎరుగని తమ (బూటక దైవాల) కొరకు నిర్ణయించుకుంటారు వారు[28]. అల్లాహ్ తోడు! మీరు కల్పిస్తున్న ఈ బూటక (కల్పిత) దైవాలను గురించి మీరు తప్పక ప్రశ్నింపబడతారు.

57. మరియు వారు అల్లాహ్ కేమో కుమార్తెలను అంటగడుతున్నారు - ఆయన సర్వలోపాలకు అతీతుడు - మరియు తమకేమో తాము

---

[26] అలాంటప్పుడు మీరు ఇతరులను అల్లాహ్ (సు.తా.)కు సాటిగా నిలబెట్టి, వారిని ఎందుకు ఆరాధిస్తున్నారు? చూడండి, 6:40-44.

[27] చూడండి, 14:30

[28] చూడండి, 6:136.

కోరేది[29]. (నియమించుకుంటారు).

**58.** మరియు వారిలో ఎవడికైనా బాలిక (పుట్టిందనే) శుభవార్త అందజేస్తే; అతడి ముఖం నల్లబడి పోతుంది. మరియు అతడు తన క్రోధావేశాన్ని అణచుకోవటానికి ప్రయత్నిస్తాడు.

**59.** తనకు ఇవ్వబడిన శుభవార్తను (అతడు) దుర్వార్తగా భావించి, తన జాతి వారి నుండి దాక్కుంటూ తిరుగుతాడు. అవమానాన్ని భరించి దానిని (ఆ బాలికను) ఉంచుకోవాలా? లేక, దానిని మట్టిలో పూడ్చి వేయాలా? అని ఆలోచిస్తాడు. చూడండి! వారి నిర్ణయం ఎంత దారుణమైనదో![30]

**60.** ఎవరైతే పరలోకాన్ని విశ్వసించరో వారే దుష్టులుగా పరిగణింపబడేవారు. మరియు అల్లాహ్ మాత్రమే సర్వోన్నతుడిగా పరిగణింపబడేవాడు. మరియు ఆయన సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు.

**61.** మరియు ఒకవేళ అల్లాహ్ మానవులను - వారు చేసే దుర్మార్గానికి - పట్టుకో దలిస్తే, భూమిపై ఒక్క

---

[29] చూడండి, 53:19-22, ముష్రిక్ 'అరబ్బులు లూత్, 'ఉ'జ్జ, మనాత్ అనే ఆడ దేవతలను పూజించేవారు. వారు వారిని దైవదూతలుగా అల్లాహుతా'ఆలా కుమార్తెలుగా పరిగణించేవారు.

[30] ముష్రిక్ 'అరబ్బులు, ఇస్లాంకు పూర్వం ఆడబిడ్డ పుట్టుకను ఎంతో అవమానంగా భావించేవారు, కొందరు ఆ ఆడబిడ్డను సజీవంగా భూమిలో పాతేవారు. చూడండి, 81:8.

ప్రాణిని కూడ వదిలేవాడు కాదు[31]. కాని, ఆయన ఒక నిర్ణీత కాలం వరకు వారికి వ్యవధినిస్తున్నాడు. ఇక, వారి కాలం వచ్చినప్పుడు వారు, ఒక ఘడియ వెనుక గానీ మరియు ముందు గానీ కాలేరు[32].

**62.** మరియు వారు తమకు ఇష్టం లేని దానిని అల్లాహ్ కొరకు నియమిస్తారు. "నిశ్చయంగా, వారికి ఉన్నదంతా శుభమే (మేలైనదే)." అని వారి నాలుకలు అబద్ధం పలుకుతున్నాయి. నిస్సందేహంగా, వారు నరకాగ్ని పాలవుతారు. మరియు నిశ్చయంగా, వారందులోకి త్రోయబడి, వదలబడతారు.

**63.** అల్లాహ్ తోడు, (ఓ ప్రవక్తా!) వాస్తవానికి, నీకు పూర్వమున్న సమాజాల వారి వద్దకు, మేము ప్రవక్తలను పంపాము! కాని షైతాన్ వారి (దుష్ట) కర్మలను వారికి మంచివిగా కనిపించేటట్లు చేశాడు. అదే విధంగా ఈనాడు కూడా వాడు వారి

---

[31] అల్లాహుతా'ఆలా ప్రజలను ప్రతి పాపానికి పట్టి శిక్షించడు. కాని పాపాత్ముల పాపాలు చాలా అయినప్పుడు అల్లాహ్ (సు.తా.) శిక్ష వచ్చి పడుతోంది. ఆ సమయంలో పుణ్యాత్ములు కూడా దాని నుండి తప్పించుకోలేరు. కాని వారు (పుణ్యాత్ములు) పరలోకంలో అల్లాహ్ (సు.తా.) సన్నిహితులలో ఉంటారు. ('స. బు'ఖారీ 2118, 'స. ముస్లిం, 2206 మరియు 2210).

[32] దీని మరొక తాత్పర్యం ఈ విధంగా ఉంది: 'ఇక వారి కాలం వచ్చినప్పుడు, వారు దానిని ఒక్క ఘడియ ఆలస్యం చేయలేరు, లేక ఒక్క ఘడియ ముందుగానూ తేలేరు.'

స్నేహితుడిగా ఉన్నాడు[33]. మరియు వారికి బాధాకరమైన శిక్ష ఉంటుంది.

64. మరియు మేము ఈ గ్రంథాన్ని (ఖుర్ఆన్ ను) నీపై అవతరింపజేసింది, వారు విభేదాలకు గురి అయిన విషయాన్ని వారికి నీవు స్పష్టం చేయటానికీ మరియు విశ్వసించే జనుల కొరకు మార్గదర్శకత్వం గానూ మరియు కారుణ్యం గానూ ఉంచటానికి!

65. మరియు అల్లాహ్ ఆకాశం నుండి నీటిని కురిపించి, దాని ద్వారా నిర్జీవంగా ఉన్న భూమిలో జీవం పోశాడు. నిశ్చయంగా ఇందులో వినేవారికి సూచన ఉంది.

66. మరియు నిశ్చయంగా, మీకు పశువులలో ఒక గుణపాఠం ఉంది. వాటి కడుపులలో ఉన్న దానిని (పాలను) మేము మీకు త్రాగటానికి ఇస్తున్నాము. అది మలం మరియు రక్తముల మధ్యనున్న నిర్మలమైన (స్వచ్ఛమైన) పాలు, త్రాగేవారికి ఎంతో రుచికరమైనది.

67. మరియు ఖర్జూరపు మరియు ద్రాక్షఫలాల నుండి మీరు మత్తుపానీయం మరియు మంచి ఆహారం

---

[33] వలి, వలియ-నుండి వచ్చింది. వలియ దగ్గరివాడు, స్నేహితుడు, ప్రియుడు, మిత్రుడు, సహాయకుడు, ఆధారమిచ్చే, కాపాడే, ఆశ్రయమిచ్చే, పోషించే వాడు. అల్లాహ్ (సు.తా.) విశ్వాసుల వలి, అని 2:257 మరియు 3:68 లో పేర్కొనబడింది. అదే విధంగా విశ్వాసులు అల్లాహ్ (సు.తా.)కు వలి అని 10:62లో ఉంది. మరియు తాగూత్ సత్యతిరస్కారుల అవ్ లియా అని 2:257లో పేర్కొనబడింది.

కూడా పొందుతారు[34]. నిశ్చయంగా, ఇందులో బుద్ధిమంతులకు సూచన ఉంది.

68. మరియు నీ ప్రభువు తేనెటీగకు ఈ విధంగా ఆదేశమిచ్చాడు[35]:
"నీవు కొండలలో, చెట్లలో మరియు మానవుల కట్టడాలలో నీ తుట్టెలను కట్టుకో!

69. తరువాత అన్ని రకాల ఫలాలను తిను. ఇలా నీ ప్రభువు మార్గాలపై నమ్రతతో నడువు." దాని కడుపు నుండి రంగు రంగుల పానకం (తేనే) ప్రసవిస్తుంది; అందులో మానవులకు వ్యాధి నివారణ ఉంది. నిశ్చయంగా, ఇందులో ఆలోచించే వారికి సూచన ఉంది.

70. మరియు అల్లాహ్ యే మిమ్మల్ని సృష్టించాడు, తరువాత మిమ్మల్ని మరణింప జేస్తాడు. మరియు మీలో కొందరు అతి నికృష్టమైన (ముసలి) వయస్సుకు చేరుతారు. అప్పుడు అతడు అంతా తెలిసినా, ఏమీ తెలియని వాడిగా అయి పోతాడు. నిశ్చయంగా, అల్లాహ్ సర్వజ్ఞుడు, సర్వ సమర్థుడు.

71. మరియు అల్లాహ్ జీవనోపాధి విషయంలో మీలో కొందరికి మరికొందరిపై ఆధిక్యతను ప్రసాదించాడు.

---

[34] ఈ ఆయత్ అవతరింపజేయబడిన 10 సంవత్సరాల తరువాత మద్యపానాన్ని నిషిద్ధం ('హరామ్) చేసే ఆయత్'లు (5:90-91) అవతరింపజేయబడ్డాయి. ఇక్కడ మద్యపానాన్ని గురించి అయిష్టత పేర్కొనబడింది.

[35] ఇక్కడ వ'హీ అంటే అల్లాహ్ (సు.తా.) దానికి ఇచ్చిన జ్ఞానం అని అర్థం.

కాని ఈ ఆధిక్యత ఇవ్వబడిన వారు తమ జీవనోపాధిని తమ ఆధీనంలో ఉన్న వారికి (బానిసలకు) ఇవ్వటానికి ఇష్టపడరు. ఎందుకంటే వారు తమతో సమానులు అవుతారేమోనని! ఏమీ? వారు అల్లాహ్ అనుగ్రహాన్ని తిరస్కరిస్తున్నారా?

72. మరియు అల్లాహ్ మీ వంటి వారి నుండియే మీ సహవాసులను(అజ్వాజ్ లను) పుట్టించాడు. మరియు మీ సహవాసుల నుండి మీకు పిల్లలను మరియు మనుమళ్ళను ప్రసాదించి, మీకు ఉత్తమమైన జీవనోపాధులను కూడా సమకూర్చాడు. అయినా వారు (మానవులు) అసత్యమైన వాటిని (దైవాలుగా) విశ్వసించి, అల్లాహ్ అనుగ్రహాలను తిరస్కరిస్తారా?

73. మరియు వారు అల్లాహ్ ను వదలి ఆకాశాల నుండి గానీ, భూమి నుండి గానీ వారికి ఎలాంటి జీవనోపాధిని సమకూర్చలేని మరియు కనీసం (సమకూర్చే) సామర్థ్యం కూడా లేని వారిని ఆరాధిస్తున్నారు.

**74.** కావున అల్లాహ్ కు పోలికలు కల్పించకండి[36]. నిశ్చయంగా, అల్లాహ్ కు అంతా తెలుసు మరియు మీకేమీ తెలియదు.

**75.** అల్లాహ్ ఒక ఉపమానం ఇచ్చాడు: ఒకడు బానిసగా ఇతరుని యాజమాన్యంలో ఉన్న వాడు. అతడు ఏ విధమైన అధికారం లేని వాడు, మరొకడు మా నుండి మంచి జీవనోపాధి పొందినవాడు. అతడు దానిలో నుండి రహస్యంగాను మరియు బహిరంగంగాను ఖర్చు చేయ గలవాడు. ఏమీ? వీరిద్దరు సమానులవుతారా? సర్వస్తోత్రాలకు అర్హుడు కేవలం అల్లాహ్ మాత్రమే! కానీ, చాలా మందికి ఇది తెలియదు.

**76.** అల్లాహ్ ఇద్దరు పురుషుల, మరొక ఉపమానం ఇచ్చాడు: వారిలో ఒకడు మూగవాడు, అతడు ఏమీ చేయలేడు, అతడు తన యజమానికి భారమై ఉన్నాడు. అతనిని ఎక్కడికి పంపినా

---

[36] 'మీరు ఒక పెద్ద ఉద్యోగి దగ్గరికి పోవాలంటే మొదట అతని సెక్రేటరీ ద్వారా సమయం తీసుకోవలసి ఉంటుంది. అదే విధంగా అల్లాహుతా'ఆలా వద్దకు చేరటానికి సిఫారసు కావాలి.' అని కొందరు, అల్లాహ్ (సు.తా.) కు బదులుగా ఇతరులను వేడుకునేవారు వాదిస్తారు. వారు తప్పు దారిలో ఉన్నారు. ఇక్కడ అల్లాహ్(సు.తా.) అంటున్నాడు: 'మీరు ఆయనను ఇతరులతో పోల్చకండి. ఆయనతో పోల్చదగినది ఏదీ లేదు,' అని. అల్లాహుతా'ఆసా ఏకైకుడు, సర్వసమర్థుడు అంతా ఎరుగువాడు. ఆయన ప్రసన్నత ను పొందటానికి, ఆయన (సు.తా.) ప్రవక్తల ద్వారా చూపిన మార్గం (సత్యధర్మమైన ఇస్లాం) మీద నడిచి, సత్కార్యాలు చేయటమే చాలు. చూడండి, 10:3.

మేలైనపని చేయలేడు. ఏమీ? ఇటువంటి వాడు మరొకతనితో - ఎవడైతే న్యాయాన్ని పాటిస్తూ, ఋజుమార్గంపై నడుస్తున్నాడో - సమానుడు కాగలడా?[37]

77. మరియు ఆకాశాలలోనూ మరియు భూమిలోనూ ఉన్న అగోచర విషయాల జ్ఞానం కేవలం అల్లాహ్ కు మాత్రమే ఉంది. అంతిమ ఘడియ కేవలం రెప్పపాటు కాలంలో లేదా అంతకు ముందే సంభవించవచ్చు! నిశ్చయంగా, అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు.

78. మరియు అల్లాహ్, మిమ్మల్ని మీ తల్లుల గర్భాల నుండి, బయటికి తీశాడు (పుట్టించాడు) అప్పుడు మీకేమీ తెలియదు. మరియు మీకు వినికిడినీ, దృష్టినీ మరియు హృదయాలను ప్రసాదించాడు.

[37] సమానుడు కాజాలడు అని అర్థం.

బహుశా మీరు కృతజ్ఞులై ఉంటారని[38].

**79.** ఏమీ? వారు పక్షులను ఆకాశం మధ్యలో తాటస్థ్య స్థితిలో (పడిపోకుండా) ఎగురుతూ ఉండేది, గమనించడం లేదా? వాటిని అల్లాహ్ తప్ప ఇతరులెవ్వరూ (ఆకాశంలో) నిలుపలేరు. నిశ్చయంగా, ఇందులో విశ్వసించేవారికి సూచనలున్నాయి.

**80.** మరియు అల్లాహ్ మీకు, మీ గృహాలలో నివాసం ఏర్పరిచాడు. మరియు పశువుల చర్మాలతో మీకు ఇండ్లు (గుడారాలు) నిర్మించాడు. అవి మీకు ప్రయాణంలో ఉన్నప్పుడు మరియు మీరు బస చేసినప్పుడు, చాలా తేలికగా ఉంటాయి. వాటి ఉన్నితో, బొచ్చుగల చర్మాలతో మరియు వెంట్రుకలతో గృహోపలంకరణ సామగ్రి మరియు కొంతకాలం సుఖంగా గడుపుకునే వస్తువులను

---

[38] నా దాసుడు నా సాన్నిహిత్యాన్ని పొందటానికి నేను అతనికి విధి ఫ'ర్ద్‌గా చేసిన వాటిపై అమలు చేస్తాడు. ఆ తరువాత నవాఫిల్ ద్వారా కూడా మరింత నా సాన్నిహిత్యాన్ని పొందటానికి ప్రయత్నిస్తాడు. మరియు నేను అతనిని ప్రేమిస్తాను. నేను అతనిని ప్రేమించినపుడు నేను అతని చెవి అవుతాను దానితో అతడు వింటాడు. అతని కన్ను అవుతాను దానితో అతడు చూస్తాడు, అతని చేయి అవుతాను దానితో అతడు పట్టుకుంటాడు, కాలు అవుతాను దానితో అతడు నడుస్తాడు మరియు అతడు నన్ను అడిగిన దానిని నేను అతనికి ఇస్తాను. నన్ను శరణు వేడుకుంటే, నేను శరణు ఇస్తాను. ('స.బు'ఖారీ, కితాబ్ అర్రిఖాఖ్). దీనిని తప్పుగా అర్థం చేసుకోరాదు. ఏ మానవుడైతే తన ఆరాధన మరియు విధేయతలో కేవలం అల్లాహ్ (సు.తా.) నే ప్రత్యేకించుకుంటాడో అతడు అల్లాహ్ (సు.తా.)కు ఇష్టం లేనటువంటిది ఏదీ వినడు, చూడడు, చేయడు మరియు పలకడు. అతడు చేసే ప్రతికార్యం కేవలం అల్లాహ్ (సు.తా.) సంతుష్టి పొందడానికే ఉంటుంది.

(మీ కొరకు సృష్టించాడు).

81. మరియు అల్లాహ్ తాను సృష్టించిన వస్తువులలో కొన్నింటిని నీడ కొరకు నియమించాడు మరియు పర్వతాలలో మీకు రక్షణా స్థలాలను ఏర్పరచాడు. మరియు మీరు వేడి నుండి కాపాడు కోవటానికి వస్త్రాలను మరియు యుద్ధం నుండి కాపాడు కోవటానికి కవచాలను ఇచ్చాడు. మీరు ఆయనకు విధేయులై ఉండాలని, ఈ విధంగా ఆయన మీపై తన అనుగ్రహాలను పూర్తి చేస్తున్నాడు.

82. (ఓ ప్రవక్తా!) ఒకవేళ వారు వెనుదిరిగితే, నీ కర్తవ్యం కేవలం సందేశాన్ని స్పష్టంగా అందజేయటం మాత్రమే!

83. వారు అల్లాహ్ ఉపకారాన్ని గుర్తించిన తరువాత దానిని నిరాకరిస్తున్నారు మరియు వారిలో చాలా మంది సత్యతిరస్కారులే!

84. మరియు (జ్ఞాపకం ఉంచుకోండి) ఆ రోజు మేము ప్రతి సమాజం నుండి ఒక సాక్షిని లేపి నిలబెడ్తాము. అప్పుడు సత్యతిరస్కారులకు ఏ విధమైన (సాకులు చెప్పటానికి) అనుమతి ఇవ్వబడదు[39] మరియు వారికి పశ్చాత్తాప పడే అవకాశం కూడా ఇవ్వబడదు.

85. మరియు దుర్మార్గులు ఆ శిక్షను చూసినప్పుడు, అది వారి కొరకు తగ్గించడం జరుగదు మరియు వారికి

[39] చూడండి, 77:35-36 మరియు 89 వ్యాఖ్యానం.

ఎలాంటి వ్యవధి కూడా ఇవ్వబడదు[40].

**86.** మరియు (అల్లాహ్ కు) సాటి కల్పించిన వారు, తాము సాటిగా నిలిపిన వారిని చూసి అంటారు: "ఓ మా ప్రభూ! వీరే మేము నీకు సాటి కల్పించి, నీకు బదులుగా ఆరాధించిన వారు." కాని (సాటిగా నిలుపబడిన) వారు, సాటి కల్పించిన వారి మాటలను వారి వైపుకే విసురుతూ అంటారు: "నిశ్చయంగా, మీరు అసత్యవాదులు[41]."

**87.** మరియు ఆ రోజు (అందరూ) వినమ్రులై తమను తాము అల్లాహ్ కు అప్పగించుకుంటారు. వారు కల్పించినవి (దైవాలు) వారిని త్యజించి ఉంటాయి.

**88.** ఎవరైతే సత్యాన్ని తిరస్కరించి (ప్రజలను) అల్లాహ్ మార్గం నుండి నిరోధించారో వారికి, మేము వారు చేస్తూ ఉండిన దౌర్జన్యాలకు శిక్ష మీద శిక్ష విధిస్తాము[42].

**89.** మరియు (జ్ఞాపకముంచుకోండి) ఆ రోజు మేము ప్రతి సమాజంలో నుండి వారికి వ్యతిరేకంగా సాక్ష్యమిచ్చే వానిని (ప్రవక్తను) లేపి నిలబెడ్తాము. మరియు (ఓ ప్రవక్తా!) మేము నిన్ను వీరికి

---

[40] పరలోక జీవితం ప్రతిఫల జీవితం. అక్కడ మంచి కర్మలు చేయటానికి గానీ లేక పశ్చాత్తాప పడటానికి గానీ వ్యవధి ఇవ్వబడదు.

[41] సాటిగా నిలుపబడిన వారి జవాబుకు చూడండి, 10:29, 46:56, 19:81-82, 29:25, 18:52.

[42] తాము స్వయంగా మార్గభ్రష్టులైనదే కాక ఇతరులను, అల్లాహ్ (సు.తా.) మార్గం నుండి ఆపేవారికి రెట్టింపు శిక్ష విధించబడుతుంది.

వ్యతిరేకంగా సాక్ష్యమివ్వటానికి తీసుకువస్తాము[43]. ప్రతి విషయాన్ని స్పష్టపరచ టానికి నీపై ఈ దివ్యగ్రంథాన్ని అవతరింపజేశాం. మరియు ఇందులో అల్లాహ్ కు విధేయులు (ముస్లింలు) అయిన వారికి మార్గదర్శకత్వం, కారుణ్యం మరియు శుభవార్తలూ ఉన్నాయి.

90. నిశ్చయంగా, అల్లాహ్ న్యాయం చేయమని మరియు (ఇతరులకు) మేలు చేయమని మరియు దగ్గరి బంధువులకు సహాయం చేయమని మరియు అశ్లీలత, అధర్మం మరియు దౌర్జన్యాలకు దూరంగా

[43] ప్రతి ప్రవక్త తన జాతివారిలో సత్యాన్ని తిరస్కరించిన వారికి వ్యతిరేకంగా సాక్ష్యమిస్తాడు. మరియు ము'హమ్మద్ ('స'అస) మరియు అతని అనుచరులు (ర'ది.'అన్హుమ్) ప్రవక్త ('అలైహిమ్ స.) ల విషయంలో వారు సత్యవాదులు మరియు వారు అల్లాహ్ (సు.తా.) సందేశాన్ని ప్రచారం చేశారని సాక్ష్యమిస్తారు. ('స.బు'ఖారీ, తఫ్సీర్ సూరహ్ అన్-నిసా').

ఉండమని ఆజ్ఞాపిస్తున్నాడు[44]. ఆయన ఈ విధంగా మీకు బోధిస్తున్నాడు, బహుశా మీరు హితబోధ గ్రహిస్తారని.

91. మరియు మీరు అల్లాహ్ పేరుతో వాగ్దానం చేస్తే మీ వాగ్దానాలను తప్పక నెరవేర్చండి. మరియు మీరు ప్రమాణాలను దృఢపరచిన తర్వాత భంగపరచకండి[45]. (ఎందుకంటే) వాస్తవానికి, మీరు అల్లాహ్ ను మీకు జామీనుదారుగా[46]

---

[44] అల్-'అద్లు: తన వారితోనే కాక ఇతరులతో కూడా న్యాయం చేయటం. ఎవరితోనైనా ఉన్న ప్రేమ లేక శత్రుత్వం, న్యాయానికి అడ్డు రాకూడదు. మరొక అర్థం న్యాయంలో హెచ్చు తగ్గులు చేయగూడదు. ధర్మవిషయంలో కూడా ఏ విధమైన అన్యాయం జరుగకూడదు. అల్-ఎ'హ్సాను: అంటే, ఒకటి: మంచినడవడిక మరియు క్షమాగుణం. రెండోది: న్యాయంగా ఇవ్వవలసిన దాని కంటే ఎక్కువ ఇవ్వటం. ఉదా: నూరు రూపాయలు కూలి మాట్లాడుకున్న వానికి పని ముగిసిన తరువాత 110 రూపాయలు ఇవ్వటం. మూడవది: ఏ పని చేసినా కర్తవ్యంగా హృదయపూర్వకంగా చేయటం మరియు ఏకాగ్రచిత్తంతో అల్లాహ్ (సు.తా.)ను ఆరాధించటం (అన్ త'అబుదుల్లాహ్ క అన్నక తరాహు). అల్-ఫ'హ్ షా ఉ': అశ్లీలత, చెడు నడత, అసభ్యకరమైన పని, సిగ్గుమాలిన నడవడిక. ఈ కాలంలో ఫ్యాషన్ పేరు మీద జరిగేవి. స్త్రీపురుషులు సిగ్గు విడిచి, కలసి మెలసి తిరుగటం, డాన్సులు చేయటం, మొదలైనవి. అల్-మున్కరు: షరీయత్ నిషేధించిన పని. అల్-బ'గీ: ఆందోళన, అక్రమము, దౌర్జన్యం.

[45] దృఢంగా చేసిన ప్రమాణాలు. ఆలోచించకుండా చేసిన ప్రమాణాలకు చూడండి, 2:225. 'ఒక వ్యక్తి ప్రమాణం చేసిన తరువాత తాను చేసిన ప్రమాణం తప్పు అని తెలుసుకుంటే, తన ప్రమాణాన్ని తెంపి పరిహారం (కఫ్ఫార) ఇవ్వాలి.' ('స. ముస్లిం. నం. 1272).

[46] కఫీలున్: అంటే జామీనుదారు, లేక హామీ ఇచ్చేవాడు అని అర్థం.

చేసుకున్నారు. నిశ్చయంగా మీరు చేసేదంతా అల్లాహ్ కు బాగా తెలుసు.

92. మరియు మీరు ఆ స్త్రీవలే కాకండి, ఏ స్త్రీ అయితే స్వయంగా కష్టపడి నూలు వడికి గట్టి దారాన్ని చేసిన తరువాత దాన్ని ముక్కలు ముక్కలుగా త్రెంచి వేసిందో! ఒక వర్గం వారు మరొక వర్గం వారి కంటే అధికంగా ఉన్నారని, పరస్పరం మోసగించుకోవటానికి, మీ ప్రమాణాలను ఉపయోగించుకోకండి. నిశ్చయంగా అల్లాహ్ మిమ్మల్ని వీటి (ఈ ప్రమాణాల) ద్వారా పరీక్షిస్తున్నాడు. మరియు నిశ్చయంగా, పునరుత్థాన దినమున ఆయన మీకు, మీరు వాదులాడే విషయాలను గురించి స్పష్టంగా తెలియజేస్తాడు.

93. ఒకవేళ అల్లాహ్ కోరితే మిమ్మల్ని అందరినీ ఒకే సమాజంగా చేసి ఉండేవాడు. కాని ఆయన తాను కోరిన వారిని మార్గభ్రష్టత్వానికి గురి చేస్తాడు. మరియు తాను కోరిన వారికి సన్మార్గం చూపుతాడు[47]. మరియు నిశ్చయంగా, మీరు చేస్తున్న కర్మలను గురించి మీరు తప్పక ప్రశ్నించ బడతారు.

94. మరియు మీ ప్రమాణాలను పరస్పరం మోసగించుకోవటానికి ఉపయోగించుకోకండి.

---

[47] చూడండి, 14:4 మరియు 2:26-27. అల్లాహుతా'ఆలాకు ప్రతివాని భవిష్యత్తు తెలుసు. కాబట్టి ఎవడైతే సన్మార్గానికి రాడని ఆయనకు తెలుసో అలాంటి వాడిని, మార్గభ్రష్టత్వంలో వదలిపెడతాడే కానీ, ఎవ్వడిని కూడా బలవంతంగా తప్పు దారిలో వేయడని దీని అర్థం.

అలా చేస్తే స్థిరపడిన పాదాలు జారిపోవచ్చు మరియు మీరు అల్లాహ్ మార్గం నుండి ప్రజలను నిరోధించిన పాప ఫలితాన్ని రుచి చూడగలరు[48]. మరియు మీకు ఘోరమైన శిక్ష పడగలదు.

95. మరియు మీరు అల్లాహ్ తో చేసిన వాగ్దానాన్ని స్వల్పలాభానికి అమ్ముకోకండి. మీరు తెలుసుకోగలిగితే, నిశ్చయంగా, అల్లాహ్ వద్ద ఉన్నదే మీకు ఎంతో మేలైనది.

96. మీ దగ్గర ఉన్నదంతా నశించేదే మరియు అల్లాహ్ వద్ద ఉన్నదే (శాశ్వతంగా) మిగిలేది! మరియు మేము సహనం వహించేవారికి, వారు చేసిన సత్కార్యాలకు ఉత్తమ ప్రతిఫలం తప్పక ప్రసాదిస్తాము.

97. ఏ పురుషుడు గానీ, లేక స్త్రీ గానీ విశ్వాసులై, సత్కార్యాలు చేస్తే, అలాంటి వారిని మేము తప్పక (ఇహలోకంలో) మంచి జీవితం గడిపేలా చేస్తాము[49]. మరియు వారికి (పరలోకంలో) వారు చేసిన సత్కార్యాలకు ఉత్తమ ప్రతిఫలం తప్పక ప్రసాదిస్తాము.

98. కావున నీవు ఖుర్ఆన్ పఠించబోయేటప్పుడు శపించబడిన (బహిష్కరించబడిన) షైతాన్ నుండి

---

[48] ఈ విధంగా ప్రజలు తమ ప్రమాణాలను తెంపుకొని, ఇతరులను మోసగించటానికి పాల్పడితే సమాజం లో ఒకరిపై ఒకరికి ఏ విధమైన విశ్వాసం ఉండదు, అన్యాయం మరియు దౌర్జన్యం నెలకొంటాయి.

[49] చూడండి. 20:124.

(రక్షణ పొందటానికి) అల్లాహ్ శరణు వేడుకో![50]

**99.** విశ్వసించి, తమ ప్రభువును నమ్ముకున్న వారిపై నిశ్చయంగా, వాడికి ఎలాంటి అధికారం ఉండదు.

**100.** కాని! నిశ్చయంగా, వాడి (షైతాన్) వైపుకు మరలి వాడిని అనుసరించే (స్నేహంచేసుకునే) వారిపై[51] మరియు ఆయనకు (అల్లాహ్ కు) సాటి కల్పించే వారిపై, వాడికి అధికారం ఉంటుంది.

**101.** మరియు మేము ఒక సందేశాన్ని (ఆయత్ ను) మార్చి దానిస్థానంలో మరొక సందేశాన్ని అవతరింపజేసినప్పుడు[52]; తాను దేన్ని ఎప్పుడు అవతరింపజేశాడో అల్లాహ్ కు బాగా తెలుసు. (అయినా) వారు (సత్యతిరస్కారులు) ఇలా అంటారు: "నిశ్చయంగా నీవే (ఓ ముహమ్మద్!) దీనిని కల్పించేవాడవు" అసలు వారిలో చాలామంది (యథార్థం) తెలుసుకోలేరు.

**102.** వారితో అను: "దీనిని (ఈ ఖుర్ఆన్ ను) నీ ప్రభువు వద్ద నుండి సత్యంతో, విశ్వాసులను (విశ్వాసంలో) పటిష్ఠం చేయటానికి మరియు (అల్లాహ్ కు) సంపూర్ణంగా విధేయులుగా ఉన్న వారికి (ముస్లింలకు) సన్మార్గం చూపటానికి మరియు

---

[50] ఈ ఆయత్ దైవప్రవక్త ('స'అస) ను సంబోధిస్తుంది. కాని ఇది విశ్వాసులందరి కొరకు ఉంది. కావున ప్రతివాడు ఖుర్ఆన్ చదవటం ప్రారంభించేటప్పుడు: 'బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్'కు ముందు, 'అ 'ఊజుబిల్లాహి మినష్షైతా నిర్రజీమ్.' తప్పక చదవాలి.

[51] చూడండి, 14:22

[52] చూడండి, 2:106, 13:39, 41:42.

శుభవార్త అందజేయటానికి, పరిశుద్ధాత్మ (జిబ్రీల్)[53] క్రమక్రమంగా ఉన్నది ఉన్నట్లుగా తీసుకొని వచ్చాడు."

**103.** మరియు: "నిశ్చయంగా, ఇతనికి ఒక మనిషి నేర్పుతున్నాడు[54]." అని, వారు అనే విషయం మాకు బాగా తెలుసు. వారు సూచించే (అపార్థం చేసే) వ్యక్తి భాష పరాయి భాష. కాని ఈ (ఖుర్ఆన్) భాష స్వచ్ఛమైన అరబ్బీ భాష[55].

**104.** నిశ్చయంగా ఎవరైతే అల్లాహ్ సందేశాలను (ఆయాత్ లను) విశ్వసించరో! వారికి అల్లాహ్ సన్మార్గం చూపడు. మరియు వారికి బాధాకరమైన శిక్ష ఉంటుంది.

**105.** నిశ్చయంగా, అల్లాహ్ సూచనలను (ఆయాత్ లను) విశ్వసించని వారు, అబద్ధాలను కల్పిస్తున్నారు. మరియు అలాంటివారు! వారే, అసత్యవాదులు.

**106.** ఎవడైతే విశ్వసించిన తరువాత, అల్లాహ్ ను

---

[53] జిబ్రీల్ ('అ.స.) ను సంబోధిస్తూ, రూ'హుల్ ఖుద్స్, అని ఖుర్ఆన్ లో నాలుగు సార్లు వచ్చింది. ఇక్కడ మరియు 2:87, 253; 5:110లలో. రూ'హుల్ అమీన్, అని 26:193లో వచ్చింది. రూ'హ్, అని మూడు సార్లు, 78:38, 19:17, 97:4లలో వచ్చింది. కాని 16:2, 42:52లలో మాత్రం రూ'హ్, దివ్యజ్ఞానం అనే అర్థం ఇస్తుంది.

[54] కొందరు బానిస యూదులు మరియు క్రైస్తవులు ముస్లింలు అయ్యారు. వారికి కొంత బైబిల్ జ్ఞానముండెను. మక్కా ముష్రిక్ లు అనే వారు: 'వారి నుండియే ము'హమ్మద్ ('స'అస) ఖుర్ఆన్ నేర్చుకున్నారు.' అని.

[55] దానికి అల్లాహ్ (సు.తా.) అంటున్నాడు: 'వారి 'అరబ్బీ భాషైతే స్వచ్ఛమైనది కాదు మరియు ఈ ఖుర్ఆన్ స్వచ్ఛమైన 'అరబ్బీ భాషలో ఉంది.' అని.

తిరస్కరిస్తాడో - తన హృదయం సంతృప్తికర మైన విశ్వాసంతో నిండి ఉండి, బలవంతంగా తిరస్కరించేవాడు తప్ప![56] – మరియు ఎవరైతే హృదయపూర్వకంగా సత్యతిరస్కారానికి పాల్పడతారో, అలాంటి వారిపై అల్లాహ్ ఆగ్రహం (దూషణ) విరుచుకు పడుతుంది. మరియు వారి కొరకు ఘోరమైన శిక్ష ఉంటుంది.

**107.** ఇది ఎందుకంటే! నిశ్చయంగా, వారు పరలోక జీవితం కంటే ఇహలోక జీవితాన్ని ఎక్కువ గా ప్రేమించటం మరియు నిశ్చయంగా అల్లాహ్ సత్యతిరస్కారులకు సన్మార్గం చూపడు.

**108.** ఇలాంటి వారి హృదయాల మీదా. చెవుల మీదా మరియు కన్నుల మీదా అల్లాహ్ ముద్ర వేసి ఉన్నాడు[57]. మరియు ఇలాంటి వారే నిర్లక్ష్యంలో మునిగి ఉన్నవారు!

**109.** నిశ్చయంగా, పరలోకంలో నష్టానికి గురి కాగలవారు వీరే, అని అనటంలో ఎలాంటి సందేహం లేదు.

**110.** ఇక నిశ్చయంగా, నీ ప్రభువు! వారి కొరకు, ఎవరైతే మొదట పరీక్షకు గురి చేయబడి, పిదప (తమ

---

[56] తనహృదయంలోదృఢవిశ్వాసంఉండి-కేవలంసత్యతిరస్కారుల శిక్షకు తాళలేక - తనను తాను సత్యతిరస్కారిగా చెప్పుకునే వాడిపై ఎట్టి నిందలేదు. ఇస్లాం కొరకు చంపబడటం ఎంతో గొప్ప పుణ్య కార్యం. అయినా ఖుర్ఆన్ లో అనేక చోట్లలో: 'అల్లాహ్ (సు.తా.) మానవునిపై అతని శక్తికి మించిన భారం వేయడు.' అని చెప్పబడింది. చూడండి, 2:233, 286; 6:152, 7:42, 23:62 వగైరా. కావున ఈ విడుదల ఇవ్వబడింది.

[57] చూడండి, 2:7, 6:25.

ఇల్లూ వాకిలి విడిచి) వలసపోయి, తరువాత ధర్మపోరాటంలో పాల్గొంటారో మరియు సహనం వహిస్తారో![58] దాని తరువాత నిశ్చయంగా, అలాంటి వారి కొరకు నీ ప్రభువు! ఎంతో క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

**111.** ఆ దినమును (జ్ఞాపకముంచుకోండి), ఎప్పుడైతే ప్రతి ప్రాణి కేవలం తన స్వంతం కొరకే బ్రతిమాలుకుంటుందో![59] ప్రతి ప్రాణికి దాని కర్మలకు తగిన ప్రతిఫలం ఇవ్వబడుతుంది మరియు వారికెలాంటి అన్యాయం జరుగదు[60].

**112.** మరియు అల్లాహ్ ఒక నగరపు ఉపమానం ఇస్తున్నాడు: మొదట అది (ఆ నగరం) శాంతి భద్రతలతో నిండి ఉండేది. దానికి (దాని ప్రజలకు) ప్రతి దిక్కునుండి జీవనోపాధి పుష్కలంగా లభిస్తూ ఉండేది. తరువాత (ఆ నగరం) వారు అల్లాహ్ అనుగ్రహాలను తిరస్కరించారు (కృతఘ్నులయ్యారు), కావున అల్లాహ్ వారి

---

[58] ఇది మక్కాలో మున్ముందు ఇస్లాం స్వీకరించిన తరువాత, ముష్రికీన్ మక్కా యొక్క దౌర్జన్యాలను సహించలేక 'హబషా మరియు మదీనాకు వలస పోయిన వారి విషయం.

[59] పునరుత్థాన దినమున, ఒకరు మరొకరిని గురించి పట్టించుకోరు. తల్లిదండ్రులు తమ సంతానాన్ని లెక్క చేయరు. మరియు సంతానం తమ తోబుట్టిన వారిని గానీ, తల్లిదండ్రులను గానీ పట్టించుకోరు. ఇంకా చూడండి, 80:37.

[60] పుణ్యం చేసిన వారికి, అల్లాహ్ (సు.తా.) కరుణిస్తే ఎన్నో రెట్లు అధికంగా పుణ్యఫలితం ప్రసాదిస్తాడు. కాని పాపం చేసిన వారికి దానంతట శిక్ష మాత్రమే విధిస్తాడు. శిక్షించుటలో ఎలాంటి అన్యాయం జరుగదు.

చర్యలకు బదులుగా వారికి ఆకలీ, భయమూ వంటి ఆపదల రుచి చూపించాడు.

**113.** మరియు వాస్తవంగా వారి వద్దకు వారి (జాతి) నుండి ఒక ప్రవక్త వచ్చి ఉన్నాడు, కాని వారు అతనిని అసత్యవాదుడవని తిరస్కరించారు. కావున వారు దుర్మార్గంలో మునిగి ఉన్నప్పుడు వారిని శిక్ష పట్టుకున్నది.

**114.** కావున మీరు అల్లాహ్ నే ఆరాధించే వారైతే, ఆయన మీ కొరకు ప్రసాదించిన ధర్మసమ్మతమైన, పరిశుద్ధమైన ఆహారాలనే తినండి మరియు అల్లాహ్ అనుగ్రహాలకు కృతజ్ఞతలు చూపండి.

**115.** నిశ్చయంగా, ఆయన మీ కొరకు (దానంతట అది) చచ్చినది (పశువు/పక్షి) రక్తం, పందిమాంసం, అల్లాహ్ తప్ప ఇతరుల కొరకు (ఇతరుల పేర) జిబహ్ చేయబడినది (పశువు/ పక్షి మాంసాన్ని) నిషేధించి ఉన్నాడు. కాని ఎవడైనా (అల్లాహ్) నియమాలను ఉల్లంఘించే ఉద్దేశంతో కాక, (ఆకలికి) తాళలేక, గత్యంతరం లేని పరిస్థితిలో (తింటే); నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత[61].

**116.** అల్లాహ్ మీద అబద్ధాలు కల్పిస్తూ: "ఇది ధర్మసమ్మతం, ఇది నిషిద్ధం." అని మీ నోటికొచ్చినట్లు (మనస్సులకు తోచినట్లు) అబద్ధాలు పలకకండి. నిశ్చయంగా, అల్లాహ్ పై

[61] ఈ రెండూ 114, 115 ఆయతులు, 2:172, 173 ఆయతులను పోలి ఉన్నాయి. చూడండి, 6:145.

అబద్ధాలు కల్పించేవారు ఎన్నడూ సాఫల్యం పొందరు.

**117.** దీనితో కొంతవరకు సుఖసంతోషాలు కలుగవచ్చు, కానీ వారికి బాధాకరమైన శిక్ష ఉంటుంది

**118.** మరియు మేము నీకు ప్రస్తావించిన వాటిని, ఇంతకు ముందు యూదులకు నిషేధించాము. మరియు మేము వారికి అన్యాయం చేయలేదు, కాని వారే తమకు తామే అన్యాయం చేసుకుంటూ ఉండేవారు[62].

**119.** అయితే నిశ్చయంగా, నీ ప్రభువు - ఎవరైతే అజ్ఞానంలో పాపాలు చేసి, ఆ పిదప పశ్చాత్తాప పడి, సరిదిద్దుకుంటారో - దాని (ఆ పశ్చాత్తాపం) తరువాత (వారిని క్షమిస్తాడు); నిశ్చయంగా, నీ ప్రభువు క్షమించేవాడు, అపార కరుణా ప్రదాత.

**120.** నిశ్చయంగా, ఇబ్రాహీమ్ (ఒక్కడే) అల్లాహ్ కు భక్తిపరుడై, ఏకదైవ సిద్ధాంతాన్ని (సత్యధర్మాన్ని) స్థాపించటంలో తనకు తానే ఒక సమాజమై ఉండెను[63]. అతను అల్లాహ్ కు సాటి కల్పించేవారిలో ఎన్నడూ చేరలేదు.

**121.** ఆయన (అల్లాహ్) యొక్క అనుగ్రహాలకు కృతజ్ఞుడై ఉండేవాడు. ఆయన (అల్లాహ్) అతనిని (తన స్నేహితునిగా) ఎన్నుకొని అతనికి ఋజుమార్గం వైపుకు మార్గదర్శకత్వం చేశాడు.

---

[62] యూదులకు విధించిన ఆహార పదార్థాల నిషేధాలు వారి అన్యాయ ప్రవర్తన కారణంగా ఉండెను. చూడండి, 3:93, 6:146, 4:160.

[63] లేక ఒక నాయకుడై ఉండెను. ఇంకా చూడండి, 4:125.

**122.** మేము అతనికి ఇహలోకంలో మంచి స్థితిని ప్రసాదించాము. మరియు నిశ్చయంగా, అతను పరలోకంలో సద్వర్తనులతో పాటు ఉంటాడు.

**123.** తరువాత మేము నీకు (ఓ ముహమ్మద్!) ఈ సందేశాన్ని పంపాము: "నీవు ఇబ్రాహీమ్ అనుసరించిన, ఏకదైవ సిద్ధాంతాన్ని (సత్యధర్మాన్ని) అనుసరించు. అతను (ఇబ్రాహీమ్) అల్లాహ్ కు సాటి కల్పించే వారిలోని వాడు కాడు."

**124.** వాస్తవానికి, శనివార శాసనం (సబ్త్) విషయంలో అభిప్రాయభేదాలు కలిగి ఉన్న వారికే అది విధించబడింది. మరియు నిశ్చయంగా, నీ ప్రభువు! పునరుత్థాన దినమున వారి మధ్య ఉన్న భిన్నాభిప్రాయాలను గురించి తీర్పు చేస్తాడు.

**125.** (ప్రజలను) వివేకంతోనూ, మంచి ఉపదేశం (ప్రచారం) తోనూ నీ ప్రభువు మార్గం వైపునకు ఆహ్వానించు. మరియు వారితో ఉత్తమరీతిలో వాదించు[64]. నిశ్చయంగా, నీ ప్రభువుకు తన మార్గం నుండి భ్రష్టుడైన వాడెవడో తెలుసు. మరియు మార్గదర్శకత్వం పొందిన వాడెవడో కూడా ఆయనకు బాగా తెలుసు.

**126.** మరియు మీరు (మీ ప్రత్యర్థులను) శిక్షించదలచుకుంటే, మీకు జరిగిన దానికి (అన్యాయానికి) సమానమైన శిక్ష మాత్రమే

---

[64] ఇదే విధమైన ఆయత్ కు చూడండి, 29:46. 'ధర్మం విషయంలో బలవంతం లేదు.' 2:256.

ఇవ్వండి. కాని మీరు సహనం వహిస్తే నిశ్చయంగా, సహనం వహించేవారికి ఎంతో మేలు కలుగుతుంది.

127. (ఓ ముహమ్మద్!) నీవు సహనం వహించు మరియు నీకు సహనమిచ్చేవాడు కేవలం అల్లాహ్ మాత్రమే. మరియు వారిని గురించి దుఃఖపడకు. మరియు వారు పన్నే కుట్రలకు నీవు వ్యాకుల పడకు.

128. నిశ్చయంగా, అల్లాహ్ భయభక్తులు గల వారితో మరియు సజ్జనులైన వారితో పాటు ఉంటాడు.

# 17. అల్-ఇస్రా [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. తన దాసుణ్ణి (ముహమ్మద్ ను), మస్జిద్ అల్ హరామ్ (మక్కా ముకర్రమా) నుండి పరిసరాలను శుభవంతం చేసిన మస్జిద్ అల్ అఖ్సా (బైతుల్ మఖ్దిస్) వరకు రాత్రి వేళ తీసుకు పోయిన ఆయన (అల్లాహ్) సర్వ లోపాలకు అతీతుడు. ఇది మేము అతనికి మా కొన్ని నిదర్శనాలను (ఆయాత్

[*] [అల్- ఇస్రా అంటే మక్కాలోని మస్జిదె హరామ్ నుండి జెరూసలేంలోని మస్జిదె అల్ అఖ్సా వరకు ప్రవక్త ముహమ్మద్ (స) చేసిన అద్భుతమైన రాత్రి ప్రయాణం, దీని మరో పేరు బనీఇస్రాయీలు]

లను) చూపటానికి చేశాము[1]. నిశ్చయంగా, ఆయన సర్వం వినేవాడు, సర్వం చూసేవాడు.

2. మరియు మేము మూసాకు గ్రంథాన్ని ఇచ్చాము[2] మరియు దానిని ఇస్రాయీల్ సంతతి వారికి మార్గదర్శినిగా చేసి, దాని

---

[1] 'ఈ ప్రయాణాన్ని మేము మా దాసునికి కొన్ని అద్భుత నిదర్శనాలు, సంకేతాలను చూపటానికి చేయించాము.' ఇంత దూరప్రయాణం రాత్రిపూట స్వల్పకాలంలో పూర్తి చేయించడం కూడా ఒక అద్భుత సూచనయే. ఈ ప్రయాణం రెండు భాగాలలో ఉంది. (1) మొదటి భాగం: ఇస్రా' జిబ్రీల్ ('అ.స.) తెచ్చిన బుర్రాఖ్ పైఎక్కి అతనితో బాటు, మక్కా ముకర్రమా నుండి బైతుల్-మఖ్దిస్ కు రాత్రిపూట పయనించడం, అక్కడ మహాప్రవక్త ('స'అస) సర్వదైవప్రవక్తలకు ('అలైహిమ్ స.) ఇమాముగా నిలిచి నమా'జ్ చేయించడం. (2) రెండో భాగం మే'రాజ్: అంటే పైకి ఎక్కించబడటం, లేక పైకి తీసుకొని పోబడటం. బైతుల్-మఖ్దిస్ నుండి ఆకాశాలలోనికి, చివరకు సిద్రతుల్ మున్తహా వరకు పోయిన ప్రయాణం. అది 'అర్ష్ క్రింది ఏడవ ఆకాశంపై ఉంది. అక్కడ అతనికి ('స'అస) అల్లాహుతా'ఆలా వ'హీ ద్వారా నమా'జ్ మరియు ఇతర ఆదేశాలు ఇచ్చాడు. ఆ విషయాలు 'స'హీ'హ్ 'హదీస్ లలో పేర్కొనబడ్డాయి. మే'రాజ్ గురించి కొంతవరకు సూరహ్ అన్-నజ్మ్ (53) లో కూడ ఉంది. మే'రాజ్ సమయంలో దైవప్రవక్త ('స'అస), ఆకాశాలలో ఇతర ప్రవక్తలతో కలుసుకున్నారు. ఈ ప్రయాణం దైవప్రవక్త పూర్తి చేసింది కలలో కాదు. అతను శారీరకంగా మేల్కొని ఉండి, పూర్తి స్పృహలో ఉన్న స్థితిలో (Bodily, Fully awake and with Full Consciousness and orientation of Mind) చేశారు. ఈ ప్రయాణం అల్లాహుతా'ఆలా ఆజ్ఞతో జరిగింది. అల్లాహ్ (సు.తా.) తాను కోరినది చేస్తాడు. ఇదిజరిగినకాలంమరియుతేదీలలోభిన్నాభిప్రాయాలున్నాయి. కొందరు రబీ'అ అల్ అవ్వల్ 17 లేక 27వ తేదీలలో అని, మరి కొందరు రజబ్ 27 అని, మరి కొందరు ఇతర నెలలని కూడా అంటారు. (ఫ'త్హ్ అల్-ఖదీర్).

[2] అల్లాహుతా'ఆలా మూసా ('అ.స.)తో సూటీగా మాట్లాడిన దానికి చూడండి, 4:164, 7:144.

ద్వారా ఇలా ఆజ్ఞాపించాము: "నన్ను (అల్లాహ్ ను) తప్ప మరెవ్వరినీ సంరక్షకునిగా (కార్యసాధకునిగా) చేసుకోవద్దు.

3. మేము నూహ్ తో బాటు ఓడలో ఎక్కించిన వారి సంతతివారలారా! నిశ్చయంగా అతను (నూహ్) కృతజ్ఞుడైన దాసుడు."

4. మరియు మేము గ్రంథంలో ఇస్రాయీల్ సంతతి వారిని ఇలా హెచ్చరించాము: "మీరు భువిలో రెండుసార్లు సంక్షోభాన్ని రేకెత్తిస్తారు మరియు గొప్ప అహంకారాన్ని ప్రదర్శిస్తారు!"

5. ఇక ఆ రెంటిలో మొదటి వాగ్దానం రాగా మేము మీపై ఘోర యుద్ధనిపుణులైన మా దాసులను పంపాము[3]. వారు మీ గృహాలలోకి దూసుకెళ్ళారు మరియు ఈ విధంగా మా వాగ్దానం నెరవేర్చబడింది.

6. ఆ తరువాత మేము మీకు వారిపై మరల ప్రాబల్యం వహించే అవకాశం కలిగించాము. మరియు సంపదతోనూ మరియు సంతానంతోనూ మీకు

---

[3] మొదటి శిక్ష దాదాపు క్రీ. శ. ఆరంభానికి 600 సంవత్సరాలకు ముందు వచ్చింది. ఇది బాబిలోనియన్ పాలకుడు బ'ఖ్త్ న'స్ర్ ఇస్రాయీ'ల్ సంతతివారిపై జెరూసలంలో చేసిన దౌర్జన్యం. అతడు ఎంతోమంది యూదులను చంపి మిగిలినవారిని ఖైదీలుగా బానిసలుగా చేసుకున్నాడు. ఈ శిక్ష వారు దైవప్రవక్తలను చంపినందుకు మరియు తౌరాత్ ఆజ్ఞలను ఉల్లంఘించినందుకు పడింది. కొందరి అభిప్రాయంలో ఈ రాజు జాలూత్. ఆ తరువాత 'తాలూత్ సైన్యాధిపత్యంలో ఉన్న దావూద్ ('అ.స.) జాలూత్ ను సంహరించి వారికి విముక్తి కలిగించారు.

సహాయం చేశాము మరియు మీ సంఖ్యా బలాన్ని కూడా పెంచాము.

7. (మరియు మేము అన్నాము): "ఒకవేళ మీరు మేలు చేస్తే అది మీ స్వయం కొరకే మేలు చేసుకున్నట్లు. మరియు ఒకవేళ మీరు కీడు చేస్తే అది మీ కొరకే!" పిదప రెండవ వాగ్దానం రాగా మీ ముఖాలను (మిమ్మల్ని) అవమాన పరచటానికి, మొదటిసారి వారు మస్జిద్ అల్ అఖ్సాలో దూరినట్లు, మరల దూరటానికి మరియు వారికి అందిన ప్రతి దానిని నాశనం చేయటానికి (మీ శత్రువులను మీపైకి పంపాము)[4].

8. (మరియు తౌరాత్ లో ఇలా అన్నాము): "బహుశా మీ ప్రభువు ఇప్పుడు మిమ్మల్ని కరుణించవచ్చు! కాని ఒకవేళ మీరు అలాగే ప్రవర్తిస్తే, మేము కూడా తిరిగి అలాగే చేస్తాము. మేము నరకాగ్నిని, సత్యతిరస్కారుల కొరకు చెరసాలగా చేసి ఉంచాము."

---

[4] రెండవసారి యూదులు అత్యాచారాలు చేశారు. జ'కరియ్యా ('అ.స.)ను చంపారు. ఏసుక్రీస్తును సిలువ పై ఎక్కించగోరారు కాని అల్లాహుతా'ఆలా అతనిని సజీవునిగా ఆకాశాలలోకి ఎత్తుకున్నాడు. అప్పుడు అల్లాహుతా'ఆలా రోమన్ పాలకుడు టైటస్ ను వారి పైకిపంపాడు.అతడు జేరూసలంపై దండయాత్ర చేసి యూదులను నాశనం చేశాడు. వారిని ఖైదీలుగా బానిసలుగా చేసుకున్నాడు. హైకిలెసులేమాన్ ను నాశనం చేశాడు. యూదులను బైతుల్ మ'ఖ్దిస్ నుండి వెళ్ళగొట్టాడు. ఇది దాదాపు క్రీ.శ. 70వ సంవత్సరంలో జరిగింది.

9. నిశ్చయంగా, ఈ ఖుర్ఆన్ పూర్తిగా, సరైన (సవ్యమైన) మార్గం వైపుకు మార్గదర్శకత్వం చేస్తుంది. మరియు సత్కార్యాలు చేస్తూ ఉండే విశ్వాసులకు తప్పక గొప్ప ప్రతిఫలముందనే శుభవార్తనూ అందజేస్తుంది;

10. మరియు నిశ్చయంగా, పరలోకాన్ని విశ్వసించిన వారికి మేము బాధాకరమైన శిక్షను సిద్ధ పరచి ఉంచామని (తెలియజేస్తుంది).

11. మరియు మానవుడు (తెలియక తరచుగా) మేలు కొరకు ఎలా అర్థించాలో, కీడు కొరకు కూడా అలాగే అర్థిస్తాడు. మరియు మానవుడు చాలా తొందరపాటు గలవాడు (ఆత్రగాడు).

12. మరియు మేము రాత్రింబవళ్ళను రెండు సూచనలుగా చేశాము. రాత్రి సూచనను మేము కాంతిహీనం చేశాము. మరియు పగటి సూచనను - మీరు మీ ప్రభువు అనుగ్రహాన్ని అన్వేషించ టానికి మరియు సంవత్సరాల లెక్కపెట్టటానికి మరియు(కాలాన్ని ) గణించటానికి – ప్రకాశవంత మైనదిగా చేశాము. మరియు మేము ప్రతి విషయాన్ని వివరించి స్పష్టంగా తెలిపాము.

13. మరియు మేము ప్రతి మానవుని మెడలో అతని

కర్మలను[5] కట్టి ఉంటాము. మరియు పునరుత్థాన దినమున అతని (కర్మ) గ్రంథాన్ని అతని ముందుపెడ్తాము, దానిని అతడు స్పష్టమైనదిగా గ్రహిస్తాడు.

**14.** (అతనితో ఇలా అనబడుతుంది): "నీవు నీ కర్మపత్రాన్ని చదువుకో! ఈ రోజు నీ (కర్మల) లెక్క చూసుకోవటానికి స్వయంగా నీవే చాలు[6]."

**15.** ఎవడు సన్మార్గాన్ని అవలంబిస్తాడో, అతడు నిశ్చయంగా, తన మేలుకే సన్మార్గాన్ని అవలంబిస్తాడు. మరియు ఎవడు మార్గభ్రష్టుడవుతాడో, అతడు నిశ్చయంగా, తన నష్టానికే మార్గభ్రష్టుడవుతాడు. మరియు బరువు మోసే వాడెవ్వడూ మరొకని బరువును మోయడు[7] మరియు మేము ఒక ప్రవక్తను పంపనంత వరకు (ప్రజలకు) శిక్ష విధించేవారము కాము.

**16.** మరియు మేము ఒక నగరాన్ని నాశనం చేయదలచుకున్నప్పుడు (మొదట) అందులో

---

[5] చూడండి, 'స. బు'ఖారీ, పు. 9, 'హ. నం. 625. ఇమామ్ షౌకాని 'తాయిరతున్ - అంటే మానవుని అదృష్టం లేక భవిష్యత్తు, అని అన్నారు. అల్లాహుతా'ఆలా కు జరుగబోయేది అంతా తెలుసు కాబట్టి ఆయన ప్రతివాని అదృష్టం వ్రాసి అతని వెంట ఉంచుతాడు. అందుకొరకే దాని ప్రకారం అతని కర్మలు (మంచి-చెడులు) ఉంటాయి. పునరుత్థాన దినమున వాటికి తగినట్టి ప్రతిఫలమే దొరుకుతుంది.

[6] చూడండి, 50:22.

[7] ఇలాంటి సందేశానికి చూడండి, 6:164, 35:18, 39:7 మరియు 53:38. దీని మరొక తాత్పర్యం: 'భారం మోసేవానిపై మరొకని భారం మోపబడదు.'

ఉన్న స్థితిమంతులకు ఆజ్ఞ పంపుతాము; ఆ పిదప కూడా వారు భ్రష్టాచారానికి పాల్పడితే! అప్పుడు దానిపై (మా) ఆదేశం జారీ చేయబడుతుంది. అప్పుడు మేము దానిని నాశనం చేస్తాం.

17. మరియు మేము నూహ్ తర్వాత ఎన్నో తరాల వారిని ఈ విధంగా నాశనం చేశాము. మరియు తన దాసుల పాపాలను తెలుసుకోవటానికి, చూడటానికి నీ ప్రభువే చాలు!

18. ఎవడు (ఇహలోక) తాత్కాలిక సుఖాలు కోరుకుంటాడో - మేము కోరిన వానికి - దానిలో మాకు ఇష్టం వచ్చినంత, ఒసంగుతాము. తరువాత అతని కొరకు నరకాన్ని నియమిస్తాము, దానిలో అతడు అవమానంతో బహిష్కరించ బడినవాడై దహింపబడతాడు.

19. మరియు ఎవడు విశ్వాసి అయి, పరలోక (సుఖాన్ని) కోరి దానికై కృషి చేయవలసిన విధంగా కృషిచేస్తాడో, అలాంటి వారి కృషి స్వీకరించబడుతుంది.

20. నీ ప్రభువు యొక్క బహుమానాలు వీరికి మరియు వారికీ అందరికీ స్వేచ్ఛగా ప్రసాదించ బడతాయి. మరియు నీ ప్రభువు యొక్క బహుమానాలు (ఎవ్వరికీ) నిషేధించబడలేదు.

21. చూడండి! మేము కొందరికి మరికొందరిపై ఏ విధంగా ఘనత నొసంగామో! కాని పరలోక (జీవిత సుఖ) మే గొప్ప స్థానాలు గలది మరియు గొప్ప

ఘనత గలది.

22. (ఓ మానవుడా!) అల్లాహ్ కు తోడుగా మరొక ఆరాధ్య దైవాన్ని కల్పించకు. అలా చేస్తే నీవు అవమానించబడి సహకారాలు పొందని (త్యజించబడిన) వాడవవుతావు.

23. మరియు నీ ప్రభువు: తనను తప్ప ఇతరులను ఆరాధించకూడదనీ మరియు తల్లిదండ్రుల తో మంచితనంతో వ్యవహరించాలనీ, ఆజ్ఞాపించి ఉన్నాడు[8]. ఒకవేళ వారిలో ఏ ఒక్కరు గానీ, లేదా వారిరువురు గానీ ముసలివారైతే, వారితో విసుక్కుంటూ: "ఛీ! (ఉఫ్)" అని కూడా అనకు మరియు వారిని గద్దించకు మరియు వారితో మర్యాదగా మాట్లాడు.

24. మరియు వారి మీద కరుణ మరియు వినయవిధేయతల రెక్కలను చాపు మరియు వారి కొరకు ఇలా ప్రార్థించు: "ఓ నా ప్రభూ! వారు ఏ విధంగా నన్ను బాల్యంలో పెంచారో అదే విధంగా నీవు వారి యెడల కరుణను చూపు!"

25. మీ మనస్సులలో ఉన్నది మీ ప్రభువుకు బాగా తెలుసు. మీరు సన్మార్గులయితే, నిశ్చయంగా ఆయన వైపునకు (పశ్చాత్తాపంతో) పలుమార్లు

---

[8] అల్లాహుతా'ఆలా ఈ ఆయత్ లో తన ఆరాధన తరువాత, రెండో స్థానంలో, తమ తల్లిదండ్రులతో మంచిగా వ్యవహించాలని ఆజ్ఞాపించాడు. దీనితో వారి ఆదరణ, ఆజ్ఞాపాలన మరియు వారికి వినయ విధేయతలు చూపటం ఎంత ముఖ్యమో తెలుస్తోంది.

మరలే వారిని ఆయన క్షమిస్తాడు.

26. మరియు బంధువులకు, పేదలకు మరియు బాటసారులకు, వారి హక్కు ఇవ్వు[9]. మరియు (నీ ధనాన్ని) వృథా ఖర్చులలో వ్యర్థం చేయకు.

27. నిశ్చయంగా, వ్యర్థమైన ఖర్చులు చేసేవారు షైతానుల సోదరులు. మరియు షైతాన్ తన ప్రభువు పట్ల కృతఘ్నుడైన వాడు.

28. మరియు నీవు ఆశించే, నీ ప్రభువు కారుణ్యాన్ని పొందటానికి - నీకు వారి నుండి ముఖం త్రిప్పుకోవలసి వచ్చినా - వారితో మృదువుగా మాట్లాడు[10].

29. మరియు నీవు (పిసినారితనంతో) నీ చేతిని నీ మెడకు కట్టుకోకు[11] మరియు దానిని పూర్తిగా స్వేచ్ఛగా కూడా వదలి పెట్టకు. అలా చేస్తే నిందలకు గురి అవుతావు, దిక్కులేని వాడవై కూర్చుంటావు (విచారిస్తావు).

30. నిశ్చయంగా, నీ ప్రభువు తాను కోరిన వారికి

---

[9] ఇక్కడ విశదమయ్యేది ఏమిటంటే మన సంపత్తిలో దగ్గరి బంధువులకు, పేదలకు మరియు బాటసారులకు హక్కు ఉంది. కావున వారికి ఇవ్వటం, వారిని కనికరించటమని భావించరాదు. వారికి, వారి హక్కు ఇవ్వని వారు అల్లాహు తా'ఆలా దృష్టిలో నిందార్హులు. ఈ ఆయత్ లో పేర్కొన్నట్లు ధన సహాయానికి మొట్టమొదటి హక్కుదార్లు, దగ్గరి బంధువులు, ఎవరి పోషణైతే విధి కాదో వారు, తరువాత పేదవారు ఆ తరువాత బాటసార్లు అని తెలుస్తోంది.

[10] ఒకవేళ నీవు బంధువులకు, పేదలకు ఇవ్వలేని స్థితిలో ఉంటే, వారిని కసిరి కొట్టే బదులు, నమ్రతతో, మృదువుగా నిరాకరించు.

[11] ఇదే విధమైన వాక్యానికి చూడండి, 5:64.

జీవనోపాధిని పుష్కలంగా ప్రసాదిస్తాడు మరియు తాను కోరిన వారికి తగ్గిస్తాడు. నిశ్చయంగా, ఆయనే తన దాసుల (స్థితుల)ను బాగా ఎరిగేవాడూ, చూసేవాడూను!

31. మరియు పేదరికానికి భయపడి మీరు మీ సంతానాన్ని చంపకండి. మేమే వారికి మరియు మీకు కూడా జీవనోపాధిని సమకూర్చేవారము. నిశ్చయంగా, వారిని చంపటం గొప్ప నేరం[12].

32. మరియు వ్యభిచారాన్ని సమీపించకండి. అది నిశ్చయంగా, అశ్లీలమైనది మరియు బహు చెడ్డ మార్గము[13].

33. న్యాయానికి తప్ప, అల్లాహ్ నిషేధించిన ఏ ప్రాణిని కూడా చంపకండి[14]. ఎవడు అన్యాయంగా చంపబడతాడో, మేము అతని వారసునికి (ప్రతీకార) హక్కు ఇచ్చి ఉన్నాము[15]. కాని అతడు హత్య (ప్రతీకార) విషయంలో హద్దులను మీరకూడదు. నిశ్చయంగా, అతనికి (ధర్మప్రకారం)

---

[12] చూడండి, 6:137, 6:151, 81:8-9లలో మరియు 'స'హీహ్ బు'ఖారీలో: 'షిర్క్ తరువాత ఘోరపాపం, పేదరికానికి భయపడి తన సంతానాన్ని హత్య చేయటం.' అని ఉంది. అంటే, ఫేమిలీ ప్లానింగ్ చేయటం, అబార్షన్ చేయించుకోవటం.

[13] వ్యభిచారం అంటే భార్యా-భర్త కాకుండా, ఏ ఇతర ఆడ-మగ, మగ-మగ లేక ఆడ-ఆడ వారి మధ్య ఉండే లైంగిక సంబంధం. వారిలో ఏ ఒక్కరూ లేక ఇద్దరూ వివాహితులైనా కాకపోయినా.

[14] చూడండి, 2:190. అంటే, ధర్మయుద్ధంలో గానీ లేక న్యాయ ప్రతీకారానికి గానీ, లేక ఆత్మరక్షణకు గానీ కాకుండా, అన్యాయంగా ఏ ప్రాణిని కూడా చంపరాదు.

[15] అల్-ఖి'సా'సు: న్యాయ ప్రతీకారం. చూడండి, 2:178. ఇక్కడ వలీ అంటే రక్తసంబంధీకుడైన దగ్గర బంధువు అని అర్థం.

సహాయ మొసంగబడుతుంది.

**34.** మరియు అతడు యుక్తవయస్సుకు చేరనంత వరకు - సక్రమమైన పద్ధతిలో తప్ప అనాథుని ఆస్తిని సమీపించకండి. మరియు చేసిన వాగ్దానాన్ని పూర్తి చేయండి, నిశ్చయంగా వాగ్దానం గురించి ప్రశ్నించడం జరుగుతుంది[16].

**35.** మరియు మీరు కొలిచి ఇచ్చేటప్పుడు కొలత పాత్ర నిండుగా కొలిచి ఇవ్వండి. మరియు (తూచి ఇచ్చేటప్పుడు) త్రాసుతో సమానంగా తూకం చేయండి. ఇదే మంచి పద్ధతి మరియు (ఇదే) చివరకు మంచి ఫలితం ఇస్తుంది.

**36.** మరియు (ఓ మానవుడా!) నీకు తెలియని విషయం వెంటబడకు[17]. నిశ్చయంగా చూపులూ, వినికిడీ మరియు హృదయం వీటన్నింటినీ గురించీ, (తీర్పు దినమున) ప్రశ్నించడం జరుగుతుంది.

**37.** మరియు భూమిపై విర్రవీగుతూ నడవకు[18]. నిశ్చయంగా నీవు భూమిని చీల్చనూ లేవు

---

[16] మానవుడు అల్లాహ్ (సు.తా.)తో చేసుకున్న వాగ్దానమైనా, లేక తన తోటి మానవునితో చేసిన వాగ్దానమైనా దానిని తప్పక పూర్తి చేయాలి, లేకుంటే పునరుత్థాన దినమున దానిని గురించి ప్రశ్నించడం జరుగుతుంది.

[17] అంటే నీకు తెలియని దానిని గురించి ఇతరులపై అనుమానపడకు. మరియు నీకు తెలియని దానిని అనుసరించకు.

[18] విర్రవీగటం అల్లాహుతా'ఆలాకు ఎంతో అసహ్యకరమైనది. ఖారూన్ విర్రవీగటం వల్లనే, తన ధన సంపత్తులతో సహా భూమిలోకి త్రొక్కి వేయబడ్డాడు. చూడండి, 28:81.

మరియు పర్వతాల ఎత్తుకు చేరనూ లేవు!

38. ఇవన్నీ దుష్కార్యాలే, నీ ప్రభువు దృష్టిలో ఎంతో అసహ్యాకరమైనవి.

39. ఇవి వివేకంతో నిండి వున్న విషయాలు. వాటిని నీ ప్రభువు నీకు దివ్యజ్ఞానం (వహీ) ద్వారా తెలియజేశాడు. మరియు అల్లాహ్ తో పాటు మరొకరిని ఆరాధ్య దైవంగా చేసుకోకు. అలా చేస్తే అవమానానికి గురి అయి, బహిష్కరించబడి నరకంలో త్రోయబడతావు.

40. ఏమీ? మీ ప్రభువు, మీకు ప్రత్యేకంగా కుమారులను ప్రసాదించి తన కొరకు దేవదూతలను కుమార్తెలుగా చేసుకున్నాడా? నిశ్చయంగా మీరు పలికేది చాలా ఘోరమైన మాట[19].

41. మరియు వారు వాస్తవానికి హితబోధ పొందుతారని, మేము ఈ ఖుర్ఆన్ లో అనేక విధాలుగా బోధించాము[20]. కాని అది వారి వ్యతిరేకతను మాత్రమే అధికం చేస్తున్నది.

---

[19] వారు అల్లాహ్ (సు.తా.)కు కుమార్తెలను మరియు తమకేమో కుమారులను ఎన్నుకుంటున్నారు. చూడండి, 16:57-59.

[20] ప్రతివిధంగా బోధించాము: అంటే పూర్వకాలపు ప్రజల కథలు చెప్పి, ఉదాహరణలు, ఉపమానాలు ఇచ్చి, హితబోధలు చేసి, పర్యవసానాలు చూపి, అనేక విధాలుగా అల్లాహ్ (సు.తా.) ఖుర్ఆన్ లో బోధించాడు, భయపెట్టాడు. బహుశా మానవులు గుణపాఠం నేర్చుకొని, అతి స్వల్పకాలపు ఈ జీవితంలో విశ్వసించి, సత్కార్యాలు చేసి, రాబోయే శాశ్వత జీవితంలో ఎడతెగని సుఖసంతోషాలు పొందాలని. కాని చాలామంది దానిని అర్థం చేసుకోలేకపోతున్నారు. తమ భ్రష్టాచారాలను మరింత అధికం చేసుకుంటున్నారు.

**42.** వారితో అను: "ఒకవేళ వారన్నట్లు అల్లాహ్ తో పాటు ఇతర ఆరాధ్యదైవాలే ఉన్నట్లయితే, వారు కూడా (అల్లాహ్) సింహాసనానికి (అర్ష్ కు) చేరే మార్గాన్ని వెతికే వారు కదా!"[21]

**43.** ఆయన సర్వలోపాలకు అతీతుడు మరియు అత్యున్నతుడు, వారు ఆపాదించే మాటల కంటే మహోన్నతుడు, మహనీయుడు (గొప్పవాడు).

**44.** సప్తాకాశాలు, భూమి మరియు వాటిలో ఉన్న సమస్తమూ ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉంటాయి. మరియు ఆయన పవిత్రతను కొనియాడనిది, ఆయన స్తోత్రం చేయ నటువంటిది ఏదీ లేదు, కాని మీరు వాటి స్తుతిని అర్థం చేసుకోలేరు. నిశ్చయంగా, ఆయన ఎంతో సహనశీలుడు, క్షమాశీలుడు.

**45.** మరియు నీవు ఖుర్ఆన్ ను పఠించేటప్పుడు నీకూ మరియు పరలోక జీవితాన్ని విశ్వసించని

---

[21] ఈ ఆయత్ ను వ్యాఖ్యాతలు రెండు విధాలుగా బోధించారు: (1) ఇద్దరు లేక అంతకంటే ఎక్కువమంది రాజులు ఉంటే, వారిలో ప్రతి ఒక్కడు భూమిలో ప్రతి చోటా తన అధికారాన్ని నెలకొల్పటానికి పాటు పడతాడు. అదే విధంగా ఈ ఇతర దేవతలు కూడా ప్రయత్నించేవారు, ఒకవేళ వారు ఉండి ఉంటే! అది ఇంత వరకు జరుగలేదు. అంటే అల్లాహ్ (సు.తా.) తప్ప మరొక విశ్వసామ్రాజ్యాధిపతి లేడు. (2) ఏ విధంగానైతే ముష్రికులు భావిస్తున్నారో: వారు ఆరాధించేవారు ఇంత వరకు అల్లాహ్ (సు.తా.) సాన్నిహిత్యాన్ని పొంది ఉన్నారు మరియు తమను ఆరాధించే వారిని కూడా అల్లాహ్ (సు.తా.) దగ్గరకు తీసుకుపోవటానికి ప్రయత్నిస్తారు. ఇది సత్యం కాదు. ఈ విషయం అల్లాహుతా'ఆలా తన గ్రంథం (ఖుర్ఆన్)లో ఎన్నో సార్లు విశదం చేశాడు. చూడండి, 17:57.

వారికీ, మధ్య కనబడని తెర వేసి ఉన్నాము.

**46.** మరియు వారు గ్రహించకుండా, వారి హృదయాల మీద తెరలు మరియు వారి చెవులలో చెవుడు వేసి ఉన్నాము[22]. ఒకవేళ నీవు ఖుర్ఆన్ (పారాయణం) తో నీ ప్రభువు యొక్క ఏకత్వాన్ని ప్రస్తావిస్తే వారు అసహ్యంతో వెనుదిరిగి మరలిపోతారు.

**47.** వారు నీ మాటలను వింటున్నప్పుడు, వారు ఏమి వింటున్నారో మాకు బాగా తెలుసు. ఈ దుర్మార్గులు ఏకాంతంలో ఉన్నప్పుడు పరస్పరం గుసగుసలాడుతూ ఇలా చెప్పుకుంటారు: "మీరు అనుసరిస్తున్న ఈ మనిషి కేవలం మంత్రజాలానికి గురి అయిన వాడు మాత్రమే."

**48.** (ఓ ముహమ్మద్!) చూడు! వారు నిన్ను ఎలాంటి ఉదాహరణలతో పోల్చుతున్నారో, ఎందుకంటే వారు మార్గం తప్పారు, కావున వారు (సరైన) మార్గం పొందలేరు[23].

**49.** మరియు వారు ఇలా అంటారు: "ఏమీ? మేము ఎముకలుగా మరియు దుమ్ముగా (పొడిగా) మారిపోయిన తరువాత కూడా తిరిగి క్రొత్త సృష్టిగా లేపబడతామా?"

**50.** వారితో అను: "మీరు రాళ్ళుగా గానీ, లేదా

---

[22] చూడండి, 6:25 మరియు 2:7.

[23] వారు దైవప్రవక్త ('స'అస) ను మాంత్రికుడు, మంత్రజాలానికి గురి అయినవాడు, పిచ్చివాడు, జ్యోతిష్యుడు అని నోటికి వచ్చినట్లు ఆరోపించారు. ఎందుకంటే వారు మార్గభ్రష్టులైన వారు కాబట్టి వారెన్నడూ మార్గదర్శకత్వం పొందలేరు.

ఇనుముగా గానీ మారిపోయి ఉండినా సరే!"

51. "లేదా! తిరిగి సృష్టింపబడటానికి అసాధ్యమైనదని మీ హృదయాలు భావించే దానిగా ఉన్నా సరే! (తిరిగి లేపబడతారు)". వారు మళ్ళీ ఇలా అడుగుతారు: "మమ్మల్ని తిరిగి బ్రతికించి లేపగలవాడు ఎవడు?" వారితో అను: "ఆయనే, మిమ్మల్ని మొదటిసారి పుట్టించిన వాడు!" వారు ఎగతాళిగా తలలు ఊపుతూ అంటారు: "అయితే! అది ఎప్పుడు సంభవిస్తుంది?" వారితో అను: "బహుశా ఆ సమయం సమీపంలోనే ఉండవచ్చు!"

52. ఆ దినమున, ఆయన మిమ్మల్ని పిలిచినపుడు! మీరు ఆయన పిలుపుకు సమాధానంగా ఆయనను స్తుతిస్తూ వస్తారు. మరియు మీరు కేవలం కొంత కాలం మాత్రమే (భూమిలో) ఉండి వున్నట్లు భావిస్తారు[24].

53. మరియు నా దాసులతో, వారు మాట్లాడేటప్పుడు మంచి మాటలనే పలకమని చెప్పు. (ఎందుకంటే) షైతాన్ నిశ్చయంగా, వారి మధ్య విరోధాన్ని రేకెత్తించడానికి ప్రయత్నిస్తుంటాడు. నిశ్చయంగా,

---

[24] పరలోక జీవితంతో పోల్చితే ఇహలోక జీవితకాలం ఎంతో చిన్నది. పరలోక జీవితం అంతం లేనిది. మానవుని కాలగణనం ఈ భూలోకానికి మాత్రమే వర్తిస్తుంది. ఎందుకంటే దాని గణన భూగోళపు తన చుట్టూ చేసే పర్యటనకు బద్ధమై ఉంది. చూడండి, 79:46, 20:102, 104, 30:55, 23:112, 114.

షైతాన్ మానవుడికి బహిరంగ శత్రువు[25].

**54.** మీ ప్రభువుకు మిమ్మల్ని గురించి బాగా తెలుసు. ఆయన కోరితే మిమ్మల్ని కరుణించ వచ్చు, లేదా ఆయన కోరితే మిమ్మల్ని శిక్షించవచ్చు! మరియు (ఓ ముహమ్మద్!) మేము నిన్ను వారి కార్యకర్తగా (రక్షకునిగా) నియమించి పంపలేదు.

**55.** మరియు భూమ్యాకాశాలలో ఉన్న వారందరినీ గురించి నీ ప్రభువుకు బాగా తెలుసు. మరియు వాస్తవానికి మేము కొందరు ప్రవక్తలకు మరికొందరిపై ఘనత నొసంగాము. మరియు మేము దావూద్ కు జబూర్[26] ఇచ్చాము.

**56.** వారితో ఇట్లను: "ఆయన (అల్లాహ్) ను కాదని మీరెవరినైతే (ఆరాధ్యదైవాలుగా) భావించారో, వారిని అర్థించి చూడండి; మీ ఆపదను తొలగించటానికి గానీ, దానిని మార్చటానికి గానీ వారికి ఎలాంటి శక్తి లేదు."

**57.** వారు, ఎవరినైతే వీరు ప్రార్థిస్తూ ఉన్నారో, వారే

---

[25] ఇది ప్రతి ఒక్కడు ఇతరులతో మాట్లాడేటప్పుడు జ్ఞాపకముంచుకోవలసిన ఆయత్. దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'మీలో ఎవ్వరు కూడా తన సోదరుని (ముస్లిం) వైపునకు ఆయుధాన్ని చూపకండి. ఎందుకంటే మీకు తెలియకుండానే షై'తాన్ ఆ ఆయుధాన్ని నడిపించి అతన్ని చంపించవచ్చు మరియు మీరు నరకాగ్నిలో పడి పోవచ్చు.' ('స. బు'ఖారీ, ముస్లిం). ఇంకా చూడండి, 16:125 మరియు 29:46.

[26] దావూద్ ('అ.స.) పై అవతరింపజేయబడిన దివ్యగ్రంథం 'జబూర్ (కీర్తనలు / Psalms).

తమ ప్రభువు సాన్నిధ్యాన్ని పొందటానికి మార్గాన్ని వెతుకుతున్నారు. మరియు వారిలో ఆయనకు ఎవరు ఎక్కువ సాన్నిధ్యం పొందు తారో అని ప్రయత్నిస్తున్నారు మరియు ఆయన కారుణ్యాన్ని ఆశిస్తున్నారు మరియు ఆయన శిక్షకు భయపడుతున్నారు[27] నిశ్చయంగా నీప్రభువు శిక్ష దానికి భయపడ వలసిందే!

58. మరియు పునరుత్థాన దినానికి ముందు మేము నాశనం చేయని, లేదా కఠినశిక్షకు గురిచేయని, నగరమనేది ఉండదు. ఈ విషయం గ్రంథంలో వ్రాయబడి వుంది.

59. మరియు నిదర్శనాలను (ఆయాత్ లను) పంపకుండా మమ్మల్ని ఏదీ ఆపలేదు. కాని పూర్వకాలపు ప్రజలు వాటిని తిరస్కరించడమే

[27] వారు ఆ దైవాలు: అంటే, యూదులూ మరియు క్రైస్తవులు, దేవుళ్ళని భావించే 'ఉ'జైర్ ('అ.స.) లేక 'ఈసా ('అ.స.) గానీ ; లేక ముష్రికులు ఆరాధించే జిన్నాతులు గానీ, దైవదూతలు గానీ, కల్పిత దైవాలు గానీ, విగ్రహాలు గానీ లేక పుణ్యవంతులైన ముస్లింలు గానీ, లేక ఇతర వలీలు గానీ కావచ్చు. వీరంతా తమప్రభువుసాన్నిధ్యాన్ని పొందే మార్గాన్ని వెతుకుతున్నారు. అలాంటప్పుడు వారు ఇతరులకు ఏ విధంగా సహాయపడగలరు. వీరిని ఆరాధించటం మరియు వీరి సహాయం కోరటం షిర్క్. అల్లాహ్ (సు.తా.) షిర్క్ ను ఎన్నడూ క్షమించడు.

తప్పు![28] మరియు మేము సమూద్ జాతి వారికి ప్రత్యక్ష నిదర్శనంగా ఒక ఆడ ఒంటెను పంపాము, కాని వారు దాని పట్ల క్రూరంగా ప్రవర్తించారు[29]. మరియు మేము నిదర్శనాలను (ఆయాత్ లను) పంపుతున్నది, కేవలం ప్రజలు వాటిని చూసి భయపడటానికే!

**60.** "నిశ్చయంగా, నీ ప్రభువు ప్రజలను పరివేష్టించి ఉన్నాడు." అని మేము నీతో చెప్పిన విషయం (జ్ఞాపకం చేసుకో)! మేము నీకు (ఇస్రా రాత్రిలో) చూపిన దృశ్యం[30] - మరియు ఖుర్ఆన్ లో

---

[28] పూర్వకాలపు ప్రజలు తమ ప్రవక్తల నుండి నిదర్శనాలు (ఆయాత్) కోరారు. ఆ నిదర్శనాలు వచ్చిన తరువాత కూడా వారు విశ్వాసులు కాలేదు. దాని ఫలితంగా వారిపై అల్లాహ్ (సు.తా.) శిక్ష పడి వారు నాశనం చేయబడ్డారు. ఇదే విధంగా మక్కా ముష్రిక్ లు కూడా దైవప్రవక్త ('స'అస) నుండి నిదర్శనాలు కోరారు. మక్కా పర్వతాలను బంగారంగా మార్చమన్నారు. పూర్వ జాతి వారి వలే వీరూ నిదర్శనాలు వచ్చిన తరువాత కూడా విశ్వసించరని మరియు వారంతా నాశనం చేయబడతారని అతను ('స'అస) నిదర్శనాలను కోరలేదు. (వివరాలకు చూడండి, ముస్నద్ అ'హ్మద్, పుస్తకం-1, పేజీ 258)

[29] ఆ ఆడ ఒంటె నిదర్శనం కొరకు చూడండి, 7:73 మరియు 54:27.

[30] దైవప్రవక్త ('స'అస) యొక్క రాత్రివేళ మస్జిద్ అల్-'హరాం నుండి మస్జిద్ అల్ అ'ఖ్సా మరియు అక్కడ నుండి సప్తాకాశాలలోనికి పోవటం మరియు తమ ప్రయాణాలలో సాక్షాత్తుగా చూసిన దృశ్యాల వివరణ విశ్వాసులకు వారి విశ్వాసాన్ని అధికం చేసింది మరియు సత్యతిరస్కారులకు వారి తలబిరుసుతనాన్ని.

శపించబడిన (నరక) వృక్షం[31] - మేము వారికి ఒక పరీక్షగా చేశాము. కాని మా భయ పెట్టడం, వారి తలబిరుసుతనాన్ని మాత్రమే మరింత అధికం చేస్తున్నది.

**61.** మరియు (జ్ఞాపకం చేసుకోండి!) మేము దేవదూతలతో: "ఆదమ్ కు సాష్టాంగం (సజ్దా) చేయండి." అని చెప్పినపుడు; ఒక్క ఇబ్లీస్ తప్ప, అందరూ సాష్టాంగపడ్డారు[32]. అతడు అన్నాడు: "ఏమీ? నీవు మట్టితో సృష్టించిన వానికి నేను సాష్టాంగం (సజ్దా) చేయాలా?"

**62.** ఇంకా ఇలా అన్నాడు: "ఏమీ? నేను చూడటం లేదా? నీవు ఇతనికి వాపై ఆధిక్యత నిచ్చావు. కానీ ఒకవేళ నీవు నాకు పునరుత్థాన దినం వరకు వ్యవధినిస్తే, నేను ఇతని సంతతి వారిలో కొందరిని తప్ప అందరినీ వశపరచుకొని తప్పు దారి పట్టిస్తాను[33]."

**63.** ఆయన (అల్లాహ్) అన్నాడు: "సరే పో! వారిలో నిన్ను ఎవరు అనుసరిస్తారో! నిశ్చయంగా, మీరందరికీ నరకమే ప్రతిఫలమవుతుంది. పరిపూర్ణ ప్రతిఫలం!

**64.** మరియు నీవు నీ ధ్వనితో (మాటలతో) వారిలో

---

[31] ఆ నరకవృక్షఫలాలు, నరకవాసులకు ఆహారంగా ఇవ్వబడతాయి. దాని పేరు 'జఖ్ఖూమ్ (జెముడు వృక్షం). దాని వివరాలకు చూడండి, 37:62-66 44:43-44.

[32] ఆదమ్ ('అ.స.) వివరాలక కొరకు చూడండి, 2:30-34, 7:11-18, 15:26-41 మరియు సూరహ్ లు 18, 20, 38 కూడా.

[33] ఇబ్లీస్ మాటల కొరకు చూడండి, 7:16-17

ఎవరెవరిని ఆశ చూపి (ఆకర్షించగలవో) ఆకర్షించు[34]. మరియు నీ అశ్వికదళాలతో మరియు నీ పదాతిదళాలతో వారి మీద పడు[35]. మరియు వారికి సంపదలో, సంతానంలో భాగస్వామివికా[36] మరియు వారితో వాగ్దానాలు చెయ్యి[37]. మరియు షైతాన్ చేసే వాగ్దానాలు మోసపుచ్చటం తప్ప ఇంకేముంటాయి[38].

**65.** నిశ్చయంగా, నా దాసులు! వారిపై నీకు ఏ విధమైన అధికారం లేదు[39]. మరియు వారికి కార్యకర్తగా (రక్షకునిగా) నీ ప్రభువే చాలు!"

---

[34] 'సౌతిక: నీ ధ్వని అంటే పాటలు, వాద్యాలు మరియు ఇతర మోసపుచ్చే మాటలు, అని అర్థం. వీటితో ష'తాన్ మానవులను మోసపుచ్చుతాడు.

[35] దళాలు అంటే - షైతాను అడుగు జాడలను అనుసరించే మానవులు, జిన్నాతులు.

[36] అమ్వాల్ వ అవ్ లాద్: అంటే సంపదలు మరియు సంతానం. అంటే నిషిద్ధ ( 'హరామ్) మార్గాలతో సంపాదించి, 'హరామ్ చేష్టలలో ఖర్చు చేసే ధనసంపత్తులు మరియు వ్యభారం వల్ల వచ్చే సంతానం.

[37] 'షైతాన్ వాగ్దానాలు అంటే స్వర్గనరకాలు అనేవి ఏమీ లేవు, మరణించిన తరువాత పునరుత్థానం అనేది లేదు. మన జీవితం ఈ భూలోక జీవితం మాత్రమే. కావున వీలైనంత వరకు దీని సుఖసంతోషాలను మీకు తోచినట్లు అనుభవించండి, అని ప్రజలను మోసపుచ్చటం.

[38] చూడండి, 4:120

[39] నా దాసులు: అంటే అల్లాహ్ (సు.తా.) ను నమ్ముకుని ఆయనపై ఆధారపడి, ఆయన చూపిన మార్గం మీదనే నడిచే సద్పురుషులు. అల్లాహ్ (సు.తా.) అలాంటి వారి, రక్షకుడు మరియు కార్యకర్త. షై'తాన్ కు అలాంటి వారిపై ఎలాంటి అధికారం ఉండదు. చూడండి, 14:22 మరియు 15:42

**66.** మీ ప్రభువు, ఆయనే - ఆయన అనుగ్రహాన్ని అన్వేషించటానికి - మీ కొరకు సముద్రంలో నావలను నడిపింపజేసేవాడు. నిశ్చయంగా, ఆయన మీ పట్ల అపార కరుణా ప్రదాత.

**67.** మరియు ఒకవేళ సముద్రంలో మీకు ఆపద వస్తే ఆయన (అల్లాహ్) తప్ప, మీరు పిలిచే వారందరూ మిమ్మల్ని త్యజిస్తారు. కాని, ఆయన మిమ్మల్ని రక్షించి, ఒడ్డుకు చేర్చినపుడు, మీరు ఆయన నుండి ముఖం త్రిప్పుకుంటారు. వాస్తవానికి మానవుడు ఎంతో కృతఘ్నుడు.

**68.** ఏమీ? ఆయన! నేల చీలిపోయి మిమ్మల్ని మ్రింగకుండా; లేదా తుఫాను మీపై రాకుండా; మిమ్మల్ని సురక్షితంగా ఉండనివ్వగలడని మీరు భావిస్తున్నారా?"[40] అప్పుడు మీరు ఏ రక్షకుడినీ పొందలేరు.

**69.** లేదా! మరొకసారి ఆయన మిమ్మల్ని సముద్రంలోకి తీసుకొని పోయి - మీ కృతఘ్నతకు ఫలితంగా - మీ మీద తీవ్రమైన తుఫాను గాలిని పంపి, మిమ్మల్ని ముంచి వేయకుండా సురక్షితంగా ఉండనివ్వగలడని భావిస్తున్నారా?

---

[40] ఏ విధంగానైతే అల్లాహ్ (సు.తా.) కు అవిధేయులైన, పూర్వ తరాల వారు శిక్షింపబడ్డారో, అలా మీరు కూడా శిక్షింపబడరని భావిస్తురా?

అప్పుడు మాకు విరుద్ధంగా[41] సహాయపడే వారినెవ్వరినీ మీరు పొందలేరు.

70. మరియు వాస్తవానికి మేము ఆదమ్ సంతతికి గౌరవము నొసంగాము[42]. మరియు వారికి నేల మీదనూ, సముద్రం లోనూ, ప్రయాణం కొరకు వాహనాలను ప్రసాదించాము. మరియు మేము వారికి పరిశుద్ధమైన వస్తువులను జీవనోపాధిగా సమకూర్చాము. మరియు మేము సృష్టించిన ఎన్నో ప్రాణులపై వారికి ప్రత్యేక ప్రాధాన్యత నిచ్చాము.

71. (జ్ఞాపకముంచుకోండి!) ఒకరోజు మేము మానవులందరినీ వారి వారి నాయకులతో (ఇమామ్ లతో) సహా పిలుస్తాము[43]. అప్పుడు వారి కర్మపత్రాలు కుడిచేతిలో ఇవ్వబడిన

---

[41] తబీ'ఉన్: పగతీర్చుకునేవాడు, కక్ష తీర్చుకునేవాడు. అంటే ఒకసారి మిమ్మల్ని సముద్రంలో తుఫాన్ నుండి క్షేమంగా బయట పెట్టిన తర్వాత ఆయన (అల్లాహుతా'ఆలాయే) మీ అవిధేయతకు కారణంగా మీరు మరల సముద్రంలోకి పోయినపుడు మిమ్మల్ని ముంచి వేయ వచ్చని మీరు భయపడరా? అప్పుడు ఆయన (సు.తా.)కు విరుద్ధంగా మీకు, మీ కల్పిత దైవాలు ఎవ్వరూ సహాయపడలేరు.

[42] చూడండి 2:31, వారికి మంచి చెడును అర్థం చేసుకునే విచక్షణా శక్తినీ, బుద్ధినీ ప్రసాదించాము.

[43] ఇమామ్: అంటే నాయకుడు ఇక్కడ వ్యాఖ్యాతలు దీనికి మూడు అర్థాలిచ్చారు. 1) దైవప్రవక్తలు, 2) దివ్యగ్రంథాలు, 3) కర్మపత్రాలు. ప్రతి ఒక్కరు తమ కాలపు దైవప్రవక్త లేక దివ్యగ్రంథం లేక కర్మపత్రంతో పిలువబడతారు. ఇబ్నె-కసీ'ర్ మరియు షౌకాని ఈ మూడవది అంటే కర్మపత్రమని భావిస్తున్నారు. చూడండి, 53:39.

వారు[44], తమ కర్మపత్రాలను చదువుకుంటారు. మరియు వారికి రవ్వంత (ఖర్జూర బీజపు చీలికలోని పొరంత) అన్యాయం కూడా జరగదు.

**72.** మరియు ఎవడు ఇహలోకంలో అంధుడై మెలగుతాడో, అతడు పరలోకంలో కూడా అంధుడిగానే ఉంటాడు[45] మరియు సన్మార్గం నుండి భ్రష్టుడవుతాడు.

**73.** మరియు (ఓ ప్రవక్తా!) మేము నీపై అవతరింపజేసిన దివ్యజ్ఞానం (వహీ) నుండి నిన్ను మరలించి, నీవు అదికాక మా పేరుతో మరొక దానిని (సందేశాన్ని) కల్పించాలని నిన్ను పురికొల్పటానికి వారు ప్రయత్నిస్తున్నారు[46]. నీవు అలా చేసి ఉంటే వారు తప్పకుండా నిన్ను తమ ఆప్తమిత్రులుగా చేసుకునేవారు.

**74.** మరియు ఒకవేళ మేము నిన్ను స్థిరంగా ఉంచకపోతే నీవు వారి వైపుకు కొంతైనా మొగ్గి ఉండే వాడవు.

**75.** అలాగైతే, మేము నీకు ఈ జీవితంలో రెట్టింపు శిక్షను మరియు చనిపోయిన తరువాత కూడా రెట్టింపు శిక్షను రుచి చూపి ఉండేవారం. అప్పుడు

---

[44] చూడండి, 69:19 మరియు 84:7.
[45] చూడండి, 20:124-125.
[46] ఇది ముష్రిక్ ఖురైషులు దైవప్రవక్త ('స'అస) ముందు పెట్టిన మరొక ప్రస్తావన. అంటే అతను వారి కల్పిత దైవాలను నిజమైన దైవాలని గుర్తిస్తే వారు కూడా అతనిని దైవప్రవక్తగా గుర్తిస్తామని పెట్టిన షరతు. దానిని అతను ('స'అస) నిరాకరించారు.

మాకు వ్యతిరేకంగా నీకు సహాయపడే వాడిని
ఎవ్వడినీ నీవు పొంది వుండేవాడవు కాదు.

**76.** మరియు వారు (అవిశ్వాసులు) నిన్ను
కలవరపెట్టి, నిన్ను ఈ భూమి నుండి వెడల
గొట్టడానికి ప్రయత్నిస్తున్నారు. అలాంటప్పుడు
నీవు వెళ్ళిపోయిన తరువాత, వారు కూడా
కొద్ది కాలం మాత్రమే ఉండగలిగేవారు[47].

**77.** (ఓ ముహమ్మద్!) ఇది వాస్తవానికి! మేము
నీకు పూర్వం పంపిన ప్రవక్తలందరికీ వర్తించిన
సంప్రదాయమే! నీవు మా సాంప్రదాయంలో
ఎలాంటి మార్పును పొందలేవు.

**78.** మధ్యాహ్నం సూర్యుడు వాలినప్పటి నుండి,
రాత్రి అయి చీకటి పడే వరకూ నమాజ్ లను
సలుపు. మరియు ప్రాతఃకాలంలో (నమాజ్ లో)
ఖుర్ఆన్ పఠించు[48]. నిశ్చయంగా ప్రాతఃకాల
ఖుర్ఆన్ పఠనం (దేవదూతల ద్వారా) వీక్షింప

---

[47] కావున కొద్దికాలం తరువాత 2 హి.శ.లో బద్ర్ లో మక్కా ఖురైషుల పలువురు నాయకులు చంపబడ్డారు. మరియు 8వ హిజ్రీలో ముస్లింలు మక్కాను జయించారు.

[48] ఈ ఆయత్ లో ఐదు విధి (ఫ'ర్ద్) గా సలుప వలసిన నమా'జ్ ల ప్రస్తావన వచ్చింది. సూర్యుడు వాలిన తరువాత జుహ్ర్, సూర్యాస్తమయానికి కొంత కాలం ముందు 'అ'స్ర్, సూర్యాస్తమయం కాగానే మ'గ్ రిబ్, కొంత చీకటి పడ్డ తరువాత 'ఇషా మరియు ప్రాతఃకాలమున సూర్యోదయానికి ముందు ఫజ్ర్ చేయాలని. ఫజ్ర్ నమాజ్ లో ఖుర్ఆన్ పఠనం ఎక్కువగా చేయాలి. ఈ నమా'జ్ లను గురించి వివరాలు 'స'హీ'హ్ 'హదీస్'లలో ఉన్నాయి.

బడుతుంది[49].

**79.** మరియు రాత్రివేళలో జాగరణ (తహజ్జుద్) నమాజ్ చెయ్యి[50]. ఇది నీ కొరకు అదనపు (నఫిల్) నమాజ్. దీనితో నీ ప్రభువు నిన్ను (పునరుత్థాన దినమున) ప్రశంసనీయమైన స్థానము (మఖామ్మ్ మహ్మూద్) నొసంగవచ్చు!

**80.** మరియు ఇలా ప్రార్థించు: "ఓ నా ప్రభూ! నీవు నా ప్రతి ప్రవేశాన్ని, సత్యప్రవేశంగా చేయి మరియు నా బహిర్గమనాన్ని కూడా సత్య బహిర్గమనంగా చేయి మరియు నీ వైపు నుండి నాకు అధికార శక్తిని, సహాయాన్ని ప్రసాదించు[51]."

---

[49] ప్రాతఃకాలపు ఫజ్ర్ నమా'జ్ సమయంలో పగటి మరియు రాత్రి దైవదూతలు కలుస్తారు. వారంతా ప్రజల నమా'జ్ లను చూస్తారు. మరియు దానిని గురించి అల్లాహుతా'ఆలాకు తెలుపుతారు. అది అల్లాహ్ (సు.తా.)కు అగోచరమైనది కాదు, కానీ ఆయన (సు.తా.) వారి నుండి తన ప్రజల ప్రశంసలు వినగోరుతాడు. ('స. బు'ఖారీ మరియు ముస్లిం).

[50] తహజ్జుద్: అంటే నిద్రాభంగం. ఇది నఫీల్ నమా'జ్, అంటే అదనంగా చేసే నమా'జ్. దైవప్రవక్త ('స'అస) రాత్రి మొదటి భాగంలో నిద్ర తీసుకొని, చివరి భాగంలో నిద్ర నుండి లేచి నమా'జ్ చేసేవారు, అదే తహజ్జుద్ నమా'జ్. 'స'హీ'హ్ 'హదీస్'లలో దీని వివరాలున్నాయి. ఇంకా చూడండి, 76:26.

[51] కొందరు వ్యాఖ్యాతలు ఈ ఆయత్ ప్రస్థానం (హిజ్రత్) సమయంలో అవతరింపజేయ బడిందని అంటారు. అంటే యస్'రిబ్ (మదీనా మునవ్వరా) ప్రవేశాన్ని మరియు మక్కా ముకర్రమా బహిర్గమనాన్ని సత్యమైనవి చేయమని దైవప్రవక్త ('స'అస) ప్రార్థిస్తున్నారు. మరికొందరు అంటారు: నన్ను సత్యం మీద మరణింపజేయి మరియు సత్యంతో పునరుత్థరింపజేయి. ఇమామ్ షౌకాని అంటారు: ఈ అన్ని అర్థాలు కూడా సమంజసమైనవే, ఎందుకంటే ఇది ఒక దు'ఆ.

**81.** మరియు ఇలా అను: "సత్యం వచ్చింది మరియు అసత్యం అంతరించింది. నిశ్చయంగా అసత్యం అంతరించక తప్పదు[52].

**82.** మరియు మేము ఈ ఖుర్ఆన్ ద్వారా విశ్వాసులకు స్వస్థతను మరియు కారుణ్యాన్ని క్రమ క్రమంగా అవతరింపజేస్తాము. కాని దుర్మార్గులకు ఇది నష్టం తప్ప మరేమీ అధికం చేయదు[53].

**83.** మరియు ఒకవేళ మేము మానవుణ్ణి అనుగ్రహిస్తే, అతడు ముఖం త్రిప్పుకొని (మా నుండి మరలిపోతాడు. కాని అతనికి కీడు కలిగితే నిరాశ చెందుతాడు[54].

**84.** వారితో ఇలా అను: "ప్రతి ఒక్కడు తనకు తోచినట్లే పనులు చేస్తాడు, కాని మీ ప్రభువుకు మాత్రం ఎవడు సన్మార్గం పొందే వాడో బాగా తెలుసు[55]."

**85.** మరియు వారు నిన్ను ఆత్మ (రూ'హ్) ను గురించి ప్రశ్నిస్తున్నారు. వారితో ఇలా అను: "ఆత్మ! నా ప్రభువు ఆజ్ఞతో వస్తుంది. మరియు (దానిని

---

[52] మక్కా ముకర్రమా విజయం తరువాత, దైవప్రవక్త ('స'అస) కాబాలో ప్రవేశిస్తారు. అక్కడ 360 విగ్రహాలు ఉంటాయి. వాటిని ఒక చిన్న కట్టెతో కొట్టుతూ ఈ ఆయత్ చదువుతారు. ('స'హీ'హ్ బు'ఖారీ, ముస్లిం)

[53] ఇటువంటి ఆయత్ కు చూడండి, 10:57

[54] మానవుడు సుఖసంతోషాలలో ఉన్నప్పుడు అల్లాహ్ (సు.తా.)ను మరచిపోతాడు మరియు కష్టకాలంలో నిరాశ చెందుతాడు. కాని ఒక విశ్వాసి రెండు పరిస్థితులలోనూ తన ప్రభువు పవిత్రతను కొనియాడుతూ, ఆయన స్తోత్రం చేస్తూ ఉంటాడు. చూడండి, 11:9-11.

[55] దీని సారాంశము, 11:121-122 ఆయత్ ల మాదిరిగానే ఉంది.

గురించి) మీకు ఇవ్వబడిన జ్ఞానం అతి స్వల్పమైనది[56]."

**86.** మరియు ఒకవేళ మేము కోరినట్లయితే నీపై అవతరింపజేయబడిన సందేశాన్ని (ఖుర్ఆన్ ను) లాగుకోగలము (స్వాధీనపరచు కోగలము). అప్పుడు దానిని గురించి, మాకు వ్యతిరేకంగా, నీవు ఏ సహాయకుడినీ పొందలేవు -

**87.** కేవలం నీ ప్రభువు కారుణ్యం తప్ప! నిశ్చయంగా, నీ పై ఉన్న ఆయన (నీ ప్రభువు) అనుగ్రహం ఎంతో గొప్పది.

**88.** ఇలా అను: "ఒకవేళ మానవులు మరియు జిన్నాతులు అందరూ కలిసి, ఈ ఖుర్ఆన్ వంటి దానిని కల్పించి తీసుకురావటానికి ప్రయత్నించినా - వారు ఒకరికొకరు తోడ్పడినప్పటికీ - ఇటువంటి దానిని కల్పించి తేలేరు[57]."

**89.** మరియు వాస్తవానికి, మేము ఈ ఖుర్ఆన్ లో ప్రజలకు ప్రతివిధమైన ఉపమానాన్ని వివరించి బోధించి ఉన్నాం. అయినా చాలామంది ప్రజలు సత్యతిరస్కారులుగానే ఉండి పోయారు

**90.** మరియు వారు ఇలా అంటారు: "(ఓ ముహమ్మద్!)

---

[56] అర్-రూ'హు: ఆత్మను గురించి కేవలం అల్లాహ్ (సు.తా.) కు మాత్రమే తెలుసు. దాని జ్ఞానం కేవలం నా ప్రభువు (సు.తా.) కు మాత్రమే ఉంది. దాని జ్ఞానం (సు.తా.) ప్రవక్తల (అ.స.)కు కూడా ఇవ్వలేదు. అది ఆయన (సు.తా.) ఆజ్ఞతో వస్తుంది: 'కున్ ఫ యకూన్.'

[57] చూడండి, 52:34.

నీవు భూమి నుండి మా కొరకు ఒక చెలమను ఝుల్లున ప్రవహింప జేయనంత వరకు మేము నిన్ను విశ్వసించము[58];

**91.** లేదా! నీ కొరకు ఖర్జూరపు మరియు ద్రాక్షతోట ఏర్పడి దాని మధ్య నుండి సెలయేళ్ళు పొంగి ప్రవహింప జేయనంత వరకు;

**92.** లేదా, నీవు మమ్మల్ని భయపెట్టినట్లు[59], ఆకాశం ముక్కలై మాపై పడవేయబడనంత వరకు; లేదా అల్లాహ్ ను మరియు దేవదూతలను మా ముందు ప్రత్యక్ష పరచనంత వరకు;

**93.** లేదా నీ కొరకు స్వర్ణగృహం ఏర్పడనంత వరకు; లేదా నీవు ఆకాశంలోకి ఎక్కి పోయినా నీవు, మేము చదువగలిగే ఒక గ్రంథాన్ని అవతరింప జేయనంత వరకు; నీవు ఆకాశంలోకి ఎక్కటాన్ని మేము నమ్మము." వారితో అను: "నా ప్రభువు సర్వలోపాలకు అతీతుడు, నేను కేవలం సందేశహరునిగా పంపబడిన మానవుడను మాత్రమే?"[60]

**94.** మరియు ప్రజల ముందుకు మార్గదర్శకత్వం

---

[58] ఇది ముష్రిక్ ఖురైషులు ఇస్లాం స్వీకరించటానికి - మూసా ('అ.స.) బండ నుండి పన్నెండు ఊటలను ప్రవహింపజేసినట్లు, మీరు కూడా ప్రవహింపజేయండని - పెట్టిన షర్తు. చూ, 2:60.

[59] భయ పెట్టుటకు - ఇలాంటి ఆయత్ కు చూడండి, 34:9.

[60] అద్భుత సూచనలు కేవలం అల్లాహ్ (సు.తా.) చేతిలోనే ఉన్నాయి. ఆయన (సు.తా.) కోరితేనే వాటిని చూపుతాడు. చూడండి, 6:109.

వచ్చినపుడు, దానిని విశ్వసించకుండా వారిని ఆపిందేమిటి? వారు (మూఢ విశ్వాసంలో మునిగి): "ఏమీ? అల్లాహ్ మానవుణ్ణి తన సందేశహరునిగా పంపాడా?" అని పలకడం తప్ప!

**95.** ఇలా అను: "ఒకవేళ భూమి మీద దేవదూతలు నివసిస్తూ నిశ్చింతగా తిరుగుతూ ఉండినట్లయితే, మేము వారి కొరకు దేవదూతనే సందేశహరునిగా పంపి ఉండేవారము."

**96.** ఇలా అను: "నాకూ మరియు మీకూ మధ్య అల్లాహ్ యే సాక్షిగా చాలు. నిశ్చయంగా ఆయన తనదాసులనుబాగాఎరుగువాడు,సర్వదృష్టికర్త."

**97.** మరియు ఎవడికి అల్లాహ్ మార్గదర్శకత్వం చేస్తాడో అతడే సన్మార్గం పొందుతాడు. మరియు ఎవడిని ఆయన మార్గభ్రష్టత్వంలో పడనిస్తాడో వాడికి, ఆయన తప్ప, ఇతరుల నెవ్వరినీ నీవు సంరక్షకులుగా పొందలేవు. మరియు వారిని మేము పునరుత్థాన దినమున గ్రుడ్డివారిగా, మూగవారిగా మరియు చెవిటివారిగా చేసి, వారి ముఖాల మీద బోర్లా పడవేసి లాగుతూ ప్రోగుచేస్తాము. వారి ఆశ్రయం నరకమే! అది చల్లారినప్పుడల్లా మేము వారికై అగ్నిజ్వాలను తీవ్రం చేస్తాము.

**98.** అదే వారి ప్రతిఫలం. ఎందుకంటే వాస్తవానికి వారు మా సూచనలను తిరస్కరించారు మరియు

అన్నారు: "ఏమీ? మేము ఎముకలుగా, పొడిగా మారిపోయిన తరువాత కూడా, సరిక్రొత్త సృష్టిగా మళ్ళీ లేపబడతామా?"[61]

**99.** ఏమీ? వారు చూడటం లేదా (ఎరుగరా)? నిశ్చయంగా, అల్లాహ్ యే ఆకాశాలనూ మరియు భూమినీ సృష్టించిన వాడనీ[62] మరియు వారి వంటి వారినీ సృష్టించగల సమర్థుడనీ మరియు ఆయనే వారి కొరకు ఒక నిర్ణీత సమయాన్ని నియమించాడనీ[63], దానిని (ఆ సమయాన్ని) గురించి ఎలాంటి సందేహం లేదనీ; అయినా ఈ దుర్మార్గులు మొండిగా సత్యాన్ని తిరస్కరించటానికే పూనుకున్నారు.

**100.** వారితో అను: "ఒకవేళ మీరు నా ప్రభువు యొక్క అనుగ్రహపు నిధులను పొంది వున్నా, అవి ఖర్చయి పోతాయేమోననే భయంతో, వాటిని మీరు పట్టుకొని (ఖర్చు చేయకుండా) ఉండేవారు[64]. మరియు వాస్తవానికి మానవుడు ఎంతో లోభి!"

**101.** మరియు మేము వాస్తవానికి, మూసాకు స్పష్టమైన

---

[61] ఇటువంటి వాక్యానికి చూడండి, 17:49.
[62] చూడండి, 40:57, 46:33 మరియు 36:81-82.
[63] నిర్ణీత సమయం అంటే పునరుత్థాన దినం.
[64] ఇటువంటి వాక్యానికి చూడండి, 4:53.

తొమ్మిది అద్భుత సూచనలను ప్రసాదించాము[65]. ఇస్రాయీల్ సంతతి వారిని అడుగు, అతను (మూసా) వారి వద్దకు వచ్చినపుడు ఫిర్ఔన్ అతనితో అన్నాడు: "ఓ మూసా! నిశ్చయంగా, నీవు మంత్రజాలానికి గురి అయ్యావని నేను భావిస్తున్నాను."

102. (మూసా) అన్నాడు: "నీకు బాగా తెలుసు, జ్ఞానవృద్ధి కలుగజేసే వాటిని (సూచనలను) భూమ్యాకాశాల ప్రభువు తప్ప మరెవ్వరూ అవతరింపజేయలేరని! ఓ ఫిర్ఔన్, నీవు నిశ్చయంగా నశింపనున్నావని నేను భావిస్తున్నాను!"[66]

103. అప్పుడు అతడు (ఫిర్ఔన్) వారిని భూమి (ఈజిప్టు) నుండి వెడలగొట్టాలని సంకల్పించుకున్నాడు. కావున మేము అతనిని (ఫిర్ఔన్ ను) మరియు అతనితో పాటు ఉన్న వారందరినీ ముంచి వేశాము.

104. మరియు ఆ తరువాత, ఇస్రాయీల్ సంతతివారితో మేము ఇలా అన్నాము: "మీరు ఈ భూమిలో

---

[65] మూసా ('అ.స.) కు ఇవ్వబడిన (ఫిర్'ఔన్ జాతి వారికి చూపిన) తొమ్మిది అద్భుత సూచనలు: 1) ప్రకాశించే చేయి, 2) సర్పంగా మారే చేతి కర్ర, 3) దుష్టులకు కలిగిన కరువు మరియు ఫల నష్టము, 4) 'తుఫాను, 5) మిడుతల దండు, 6) పేనులు, 7) కప్పలు, 8) రక్తం మరియు 9) సముద్రంలో ఏర్పడిన బాట. ఇవి సూరహ్ అల్-అ'అరాఫ్ (7) లో కూడా వివరించబడ్డాయి. ఇబ్నె 'అబ్బాస్, ముజాహిద్, ఇక్రిమా, షాబీ, ఖతద ర'ది. 'అన్హుమ్ ల వ్యాఖ్యానం, (ఇబ్నె-క'సీర్). ఇవేగాక బండ నుండి తీసిన 12 ఊటలూ, మన్న మరియు సల్వాలు కూడా అద్భుత సూచనలే, కానీ వీటిని ఫిర'ఔన్ జాతి వారు చూడలేదు.

[66] మూసా ('అ.స.) యొక్క వివరాలకు చూడండి, 7:103-137 మరియు 20:49-79.

స్వేచ్ఛగా నివసించండి. కానీ అంతిమ వాగ్దానం ఆసన్నమైనప్పుడు, మేము మీరందరినీ ఒకచోట చేర్చుతాము."

105. మరియు మేము దీనిని (ఈ ఖుర్ఆన్ ను) సత్యంతో అవతరింపజేశాము. మరియు ఇది సత్యంతోనే అవతరించింది. (ఓ ప్రవక్తా!) మేము నిన్ను కేవలం శుభవార్త అందజేసేవానిగా మరియు హెచ్చరిక చేసేవానిగా మాత్రమే పంపాము!

106. మరియు నీవు ప్రజలకు నెమ్మది నెమ్మదిగా చదివి వినిపించాలని, మేము ఖుర్ఆన్ ను విభజించి, క్రమక్రమంగా అవతరింపజేశాము.

107. వారితో అను: "మీరు దీనిని (ఈ ఖుర్ఆన్ ను) నమ్మినా నమ్మకపోయినా; నిశ్చయంగా, ఇది వరకు జ్ఞానమొసంగపడిన వారికి దీనిని వినిపించినప్పుడు, వారు తమ ముఖాల మీద పడి సాష్టాంగం (సజ్దా) చేస్తారు."

108. మరియు ఇలా అంటారు: "మా ప్రభువు సర్వలోపాలకు అతీతుడు, మా ప్రభువు వాగ్దానం పూర్తయి తీరుతుంది."

109. మరియు వారు ఏడుస్తూ, తమ ముఖాల మీద పడి పోతారు. మరియు వారి వినమ్రత మరింత అధికమవుతుంది.

110. వారితో అను: "మీరు ఆయనను, అల్లాహ్! అని పిలవండీ లేదా అనంత కరుణామయుడు (అర్రహ్మాన్)! అని పిలువండీ, మీరు ఆయనను ఏ పేరుతోనైనా పిలవండీ, ఆయనకున్న పేర్లన్నీ

అత్యుత్తమమైనవే! నీ నమాజ్ లో నీవు చాలా గట్టిగా గానీ, చాలా మెల్లగా గానీ పఠించక, వాటి మధ్య మార్గాన్ని అవలంబించు."

111. ఇంకా ఇలా అను: "సంతానం లేనటువంటి మరియు తన రాజరికంలో భాగస్వాములు లేనటువంటి మరియు తనలో ఎలాంటి లోపం లేనటువంటి మరియు సహాయకుడి అవసరం లేనటు వంటి అల్లాహ్ యే సర్వస్తోత్రాలకు అర్హుడు. మరియు మీరు ఆయన మహనీయతను గొప్పగా కొనియాడండి!"

# 18. అల్-కహఫ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. తన దాసునిపై (ముహమ్మద్ పై) ఈ గ్రంథాన్ని (ఖుర్ఆన్ ను) అవతరింపజేసిన అల్లాహ్ యే సర్వస్తోత్రాలకు అర్హుడు. మరియు ఆయన ఇందులో ఏ విధమైన వక్రత్వాన్ని ఉంచలేదు[1].
2. ఇది సక్రమంగా స్థిరంగా ఉండి, ఆయన నుండి వచ్చే కఠిన శిక్షను గురించి హెచ్చరిస్తుంది మరియు విశ్వసించి సత్కార్యాలు చేసేవారికి మంచి ప్రతిఫలం (స్వర్గం) తప్పక ఉంటుందనే శుభవార్తనూ ఇస్తుంది.
3. అందులో వారు నిరంతరంగా కలకాలముంటారు.
4. ఇంకా ఇది: "అల్లాహ్ కు సంతానముంది!" అని అనే వారిని హెచ్చరిస్తుంది.
5. ఈ విషయాన్ని గురించి వారికి గానీ, వారి తండ్రి తాతలకు గానీ ఎలాంటి జ్ఞానం లేదు, వారి నోటి నుండి వచ్చే ఈ మాట ఎంతో దారుణమైనది. వారు పలికేదంతా కేవలం అసత్యమే.
6. ఈ సందేశాన్ని విశ్వసించనివారి పైఖరి వల్ల

---

[*] [అల్-కహఫ్ అంటే కహఫ్ గుహ]

[1] చూడండి, 4:82, ఈ గ్రంథం అల్లాహ్ (సు.తా.) తరఫు నుండి కాక ఇతరుల దగ్గర నుండి వచ్చి ఉంటే అందులో ఎన్నో లోపాలు ఉండేవి.

దుఃఖపడి బహుశా నీవు నీ ప్రాణాన్నే కోల్పోతావేమో!

7. నిశ్చయంగా - ప్రజలలో మంచిపనులు చేసేవారు ఎవరో పరీక్షించటానికి - మేము భూమిపై ఉన్న వస్తువులను దానికి అలంకారంగా (ఆకర్షణీయమైనవిగా) చేశాము.

8. మరియు నిశ్చయంగా, మేమే దానిపై ఉన్న దాన్నంతటినీ చదునైన మైదానం (బంజరునేల) గా మార్చగలము.

9. ఏమీ? నిశ్చయంగా, ఆ గుహవాసులు మరియు ఆ శిలాఫలకం వారు, మా (ఇతర) సూచనలన్నింటిలో అద్భుతమైనవి నీవు భావించావా?[2]

10. (జ్ఞాపకం చేసుకోండి) ఎప్పుడైతే ఆ యువకులు ఆ గుహలో ఆశ్రయం పొందారో, ఇలా ప్రార్థించారు: "ఓ మా ప్రభూ! మాపై నీ కారుణ్యాన్ని ప్రసాదించు. మరియు మా వ్యవహారంలో మేము నీతిపరులమై ఉండేటట్లు మమ్మల్ని సరిదిద్దు!"

11. కావున ఆ గుహలో, కొన్ని సంవత్సరాల వరకు మేము వారి చెవులను మూసివేశాము[3].

12. ఆ తరువాత ఆ రెండు పక్షాల వారిలో[4] ఎవరు,

---

[2] అంటే ఇదొక్కటే అద్భుత సూచన కాదు. దీని కంటే అద్భుత సూచనలు ఇంకా ఎన్నో ఉన్నాయి. సూర్య-చంద్రుల, నక్షత్రాల మరియు రేయింబవళ్ళ సృష్టి మొదలైనవి. అర్-రఖీమ్: కొందరు వ్యాఖ్యాతలు దీనిని ఆ గుహవాసుల నగరపు పేరని మరి కొందరు గుహ ఉన్న ఆ కొండ పేరని ఇంకా కొందరు ఆ సీసపు పలక దేనిపైనైతే వారి పేర్లు వ్రాయబడి ఉండెనో అది, అని అంటారు.

[3] వారికి గాఢ నిద్రను కలిగించాము.

[4] గుహలో నున్న వారిలోని రెండు పక్షాలు.

వారు (గుహలో) నివసించిన కాలాన్ని సరిగ్గా లెక్కపెడతారో చూద్దామని వారిని లేపాము.

13. మేము వారి యథార్థ గాథ నీకు వినిపిస్తున్నాము. నిశ్చయంగా, వారు తమ ప్రభువును విశ్వసించిన కొందరు యువకులు[5]; మేము వారి మార్గదర్శకత్వాన్ని అధికం చేశాము.

14. మరియు మేము వారి హృదయాలకు దృఢత్వాన్ని ప్రసాదించాము. వారు లేచి నిలబడినప్పుడు ఇలా అన్నారు: "భూమ్యాకాశాల ప్రభువే మా ప్రభువు! ఆయనను వదలి మేము వేరే దైవాన్ని ఎలాంటి స్థితిలోనూ ప్రార్థించము. వాస్తవానికి అలా చేస్తే దారుణం చేసిన వారమవుతాము!

15. "ఈ, మా జాతివారు ఆయనను విడిచి ఇతర దైవాలను నియమించుకున్నారు. అయితే, వారిని (ఆ దైవాలను) గురించి వారు స్పష్టమైన ప్రమాణాన్ని ఎందుకు తీసుకురారు? ఇక అల్లాహ్ పై అబద్ధాలు కల్పించేవాని కంటే మించిన దుర్మార్గుడు ఎవడు?"

16. (వారు పరస్పరం ఇలా అనుకున్నారు): "ఇపుడు

---

[5] ఫిత్ యతున్: అంటే 9 లేక దాని కంటే తక్కువ అని అర్థం. ఆ యువకులు 'ఈసా ('అ.స.) కంటే ముందు వారు కావచ్చని ఇబ్నె-కసీ'ర్ (ర'హ్మ.) అభిప్రాయం. మరికొందరు వారు క్రైస్తవులని అంటారు. వారు ఎవరైనా సరే, ఏక దైవ సిద్ధాంతంపై ఉన్నవారూ మరియు కేవలం అల్లాహ్ (సు.తా.) ను మాత్రమే ఆరాధించేవారూ ఉండిరి. వారి కాలపు నాయకులు మరియు ఇతర ప్రజల వలే అల్లాహ్ (సు.తా.) ను విడిచి ఇతరులను ఆరాధించేవారు కారు. కాబట్టి ఆ సత్యతిరస్కారుల శిక్షకు భయపడి ఏకాంతపు కొండగుహలో శరణం తీసుకొని ఉండిరి.

మీరు వారిని మరియు అల్లాహ్ ను కాదని వారు ఆరాధించే దైవాలను విడిచి, గుహలో శరణు తీసుకోండి. మీ ప్రభువు తన కారుణ్యాన్ని మీపై విస్తరింపజేస్తాడు. మరియు మీ కార్యాలను సరిదిద్ది వాటిని మీకు సులభమైనట్లుగా చేస్తాడు."

17. మరియు వారు (ఆ గుహలోని) ఒక విశాలమైన భాగంలో (నిద్రిస్తూ) ఉన్నప్పుడు; సూర్యుడు ఉదయించేటప్పుడు, (ఎండ) వారి గుహ నుండి కుడి ప్రక్కకు వాలి పోవటాన్ని మరియు అస్తమించేటప్పుడు (ఎండ) ఎడమ ప్రక్కకు తొలగి పోవటాన్ని నీవు చూసి ఉంటావు. ఇది అల్లాహ్ సూచనలలో ఒకటి. అల్లాహ్ మార్గదర్శకత్వం చేసినవాడే సన్మార్గం పొందుతాడు. ఆయన మార్గభ్రష్టత్వంలో వదలిన వాడికి సరైన మార్గం చూపే సంరక్షకుడిని నీవు పొందలేవు.

18. మరియు వారు నిద్రపోతున్నప్పటికీ, నీవు వారిని మేల్కొని ఉన్నారనే భావించి ఉంటావు! మరియు మేము వారిని కుడి ప్రక్కకు మరియు ఎడమ ప్రక్కకు మరలించే వారము. మరియు వారి కుక్క గుహద్వారం వద్ద తన ముందు కాళ్ళను చాచి పడి ఉండెను. ఒకవేళ నీవు వారిని తొంగిచూసి ఉంటే, నీవు తప్పక వెనుదిరిగి పారిపోయే వాడవు మరియు వారిని గురించి భయకంపితుడవై పోయేవాడవు.

19. మరియు ఈ విధంగా (ఉన్న తరువాత), వారు ఒకరినొకరు ప్రశ్నించుకోవటానికి మేము వారిని

(నిద్ర నుండి) లేపాము. వారిలో నుండి ఒకడు మాట్లాడుతూ ఇలా అన్నాడు: "మీరు ఈ స్థితిలో ఎంత కాలమున్నారు?" వారన్నారు: "మేము ఒక దినమో లేదా అంతకంటే తక్కువనో ఈ స్థితిలో ఉన్నాము[6]." (మరికొందరు) ఇలా అన్నారు: "మీరెంత కాలమున్నారో మీ ప్రభువుకే తెలుసు! మీలో ఒకనికి నాణ్యం (డబ్బు) ఇచ్చి పట్టణానికి పంపండి. అతడు అక్కడ శ్రేష్ఠమైన ఆహారాన్ని వెతికి, దానినే మీ కొరకు తినటానికి తెస్తాడు. అతడు జాగ్రత్తగా వ్యవహరించాలి మరియు మీ గురించి ఎవ్వడికీ తెలియనివ్వ గూడదు.

20. “ఒకవేళ వారు మిమ్మల్ని గుర్తు పడితే, వారు తప్పక మిమ్మల్ని రాళ్ళు రువ్వి చంపుతారు లేదా (బలవంతంగా) మిమ్మల్ని వారి మతంలోకి త్రిప్పుకుంటారు, అలాంటప్పుడు మీరు ఎలాంటి సాఫల్యం పొందలేరు."

21. మరియు ఈ విధంగా అల్లాహ్ వాగ్దానం సత్యమని చివరి ఘడియ నిశ్చయమని, అది రావటంలో ఎలాంటి సందేహం లేదని తెలుసు కోవటానికి, ఆ

---

[6] చూడండి, 2:259 అక్కడ ఒకడు, మరణించి నూరు సంవత్సరాలు పడి ఉన్న తరువాత, అల్లాహ్ (సు.తా.) అతడిని మరల సజీవునిగా చేసినప్పుడు ఇలాగే భావిస్తాడు. అల్లాహుతా'ఆలా నిర్జీవుల నుండి సజీవులను మరియు సజీవుల నుండి నిర్జీవులను తేగలడు, అనే సత్యానికి ఇది ఉదాహరణం. ఇంకా చూడండి, 3:27, 6:95, 10:31, 30:19.

యువకుల విషయం ప్రజలకు తెలియజేశాము. అప్పుడు వారు (ప్రజలు) వారి (గుహవాసుల) విషయాన్ని తీసుకొని పరస్పరం వాదులాడుకున్న విషయం (జ్ఞాపకం చేసుకోండి!) వారిలో కొందరన్నారు: "వారి కొరకు ఒక స్మారక భవనం నిర్మించాలి." వారి విషయం వారి ప్రభువుకే తెలుసు. ఆ వ్యవహారంలో పైచేయి (ప్రాబల్యం) ఉన్నవారు: "వారి స్మారకంగా ఒక మస్జిద్ ను నిర్మించాలి." అని అన్నారు.

22. (వారి సంఖ్యను గురించి) కొందరంటారు: "వారు ముగ్గురు, నాలుగవది వారి కుక్క." మరికొందరంటారు: "వారు అయిదుగురు ఆరవది వారి కుక్క." ఇవి వారి ఊహాగానాలే. ఇంకా కొందరంటారు: "వారు ఏడుగురు, ఎనిమిదవది వారి కుక్క." వారితో అను: "వారి సంఖ్య కేవలం నా ప్రభువుకే తెలుసు. వారిని గురించి కొందరికి మాత్రమే తెలుసు." కావున నిదర్శనం లేనిదే వారి గురించి వాదించకు మరియు (గుహ) వారిని గురించి వీరిలో ఎవ్వరితోనూ విచారణ చేయకు.

23. మరియు ఏ విషయాన్ని గురించి అయినా: "నేను ఈ పనిని రేపు చేస్తాను." అని అనకు-

24. "అల్లాహ్ కోరితే తప్ప (ఇన్షా అల్లాహ్)!" అని

అననిదే![7] మరియు నీ ప్రభువును స్మరించు, ఒకవేళ నీవు మరచిపోతే! ఇలా ప్రార్థించు: "బహుశా నా ప్రభువు నాకు సన్మార్గం వైపునకు దీని కంటే దగ్గరి త్రోవ చూపుతాడేమో!"

25. మరియు వారు తమ గుహలో మూడు వందల సంవత్సరాలు ఉన్నారు. మరియు వాటి తొమ్మిది సంవత్సరాలు అధికం[8].

26. వారితో అను: "వారెంతకాలం (గుహలో) ఉన్నారో అల్లాహ్ కు మాత్రమే తెలుసు. ఆకాశాలలోను మరియు భూమిలోను ఉన్న సమస్త అగోచర విషయాలు కేవలం ఆయనకే తెలుసు. ఆయన అంతా చూడగలడు మరియు వినగలడు. వారికి ఆయన తప్ప మరొక సంరక్షకుడు లేడు మరియు ఆయన తన ఆధిపత్యంలో ఎవ్వడినీ భాగస్వామిగా చేర్చుకోడు."

---

[7] యూదులు దైవప్రవక్త ('స'అస) తో మూడు ప్రశ్నలు అడిగారు: 1) రూ'హ్ ఆత్మ అంటే ఏమిటి? 2) గుహవారి విషయం ఏమిటి? 3) జు'ల్-ఖర్ నైన్ ఎవడు? దైవప్రవక్త ('స'అస) అన్నారు: 'నేను రేపు మీకు జవాబిస్తాను.' కాని అతను ('స'అస): "అల్లాహ్ కోరితే," (ఇన్షా 'అల్లాహ్! అని అనలేదు. కావున 15 రోజుల వరకు ఏ వ'హీ రాలేదు. ఆ తరువాత వ'హీ వచ్చినప్పుడు: "ఇన్షా 'అల్లాహ్," అని తప్పక అనాలని ఆజ్ఞ వచ్చింది.

[8] చాలామంది వ్యాఖ్యాతల అభిప్రాయం ప్రకారం ఇది అల్లాహ్ (సు.తా.) ప్రవచనం. అంటే వారు గుహలో 300 సూర్య సంవత్సరాలు లేక 309 చాంద్రమాన సంవత్సరాలు ఉన్నారు.

27. మరియు (ఓ ప్రవక్తా!) నీ ప్రభువు గ్రంథం నుండి నీపై అవతరింపజేయబడిన దివ్యజ్ఞానాన్ని (వహీని) చదివి వినిపించు[9]. ఆయన ప్రవచనాలను ఎవ్వడూ మార్చలేడు. మరియు ఆయన వద్ద తప్ప నీవు మరెక్కడా శరణు పొందలేవు[10].

28. మరియు (ఓ ప్రవక్తా!) ఎవరు ఆయన ముఖ దర్శనం (ప్రసన్నతను) కోరుతూ, ఉదయం మరియు సాయంత్రం తమ ప్రభువును ప్రార్థిస్తున్నారో, వారి సహచర్యంలోనే సహనం వహించి ఉండు. ఇహలోక ఆడంబరాలను అపేక్షించి నీ దృష్టిని వారి నుండి దాటనివ్వకు

---

[9] గుహవారి కథ వినిపిస్తూ అల్లాహుతా'ఆలా అలా అంటున్నాడు:'ఇప్పుడు నిన్ను ప్రశించేవారికి ఇది వినిపించు.' వాస్తవానికి ('స'అస) ఎల్లప్పుడు తనపై అవతరింపజేయబడిన దివ్య జ్ఞానాన్నంతా ప్రజలకు వినిపించారు. మరియు వారిని సన్మార్గం వైపునకు పిలిచారు. అది అతని ('స'అస) విద్యుక్త ధర్మం. అల్లాహ్ (సు.తా.) దాని కొరకే ప్రవక్తలను ఎన్నుకుంటాడు.

[10] అల్లాహ్ (సు.తా.) ప్రవచనాలను ఉన్నవి ఉన్నట్లుగా ఎట్టి మార్పులు చేయకుండా వినిపించాలని ఆజ్ఞ ఇవ్వబడుతోంది. లేనిచో అల్లాహ్ (సు.తా.) శిక్ష నుండి తప్పించేవాడు ఎవ్వడూ లేడు. ఈ ప్రవచనం దైవప్రవక్త ('స'అస) తో చెప్పబడినా అది సర్వసమాజం కొరకు వర్తిస్తుంది.

(వారిని ఉపేక్షించకు)[11]. మరియు అలాంటి వానిని అనుసరించకు (మాట వినకు), ఎవడి హృదయాన్ని మా ధ్యానం నుండి తొలగించామో మరియు ఎవడు తన మనోవాంఛలను అనుసరిస్తున్నాడో మరియు ఎవడి వ్యవహారాలు (కర్మలు) వ్యర్థమయ్యాయో!

29. మరియు వారితో అను: "ఇది మీ ప్రభువు తరఫు నుండి వచ్చిన సత్యం. కావున ఇష్టపడిన వారు దీనిని విశ్వసించ వచ్చు మరియు ఇష్టపడని వారు దీనిని తిరస్కరించ వచ్చు!" నిశ్చయంగా, మేము దుర్మార్గుల కొరకు నరకాగ్నిని సిద్ధపరచి ఉంటాము, దాని జ్వాలలు వారిని చుట్టుకుంటాయి. అక్కడ వారు నీటి కొరకు మొరపెట్టుకున్నప్పుడు, వారికి ముఖాలను మాడ్చే (మరిగే) నూనె వంటి నీరు (అల్ ముహ్లు) ఇవ్వ బడుతుంది. అది ఎంత చెడ్డ పానీయం మరియు ఎంత చెడ్డ (దుర్భరమైన) విరామ స్థలం!

30. నిశ్చయంగా, ఎవరైతే విశ్వసించి సత్కార్యాలు

---

[11] ఈ వాక్యం 6:52లో కూడా ఉంది. స'ఆద్ బిన్ అబీ- వఖ్ఖా'స్ కథనం: ఒకసారి దైవప్రవక్త '(స'అస) స'ఆద్ బిన్ అబీ-వఖ్ఖా'స్, బిలాల్, ఇబ్నె-మసూ'ద్, ఒక 'హుజ'లీ మరియు ఇద్దరు 'స'హాబీ (ర'ది. 'అన్హుమ్)లతో కలిసి కూర్చొని ఉంటారు. అప్పుడు కొందరు ఖురైష్ నాయకులు వచ్చి, దైవప్రవక్త ('స'అస)తో: 'వీరిని మీ దగ్గర నుండి పంపండి. మేము మీతో మాట్లాడదలచాము.' అని అంటారు. అప్పుడు దైవప్రవక్త ('స'అ)కు తట్టుతుంది: 'బహుశా వీరు నా మాట వింటారేమో.' అని, కాని అల్లాహుతా'ఆలా అతనిని ('స'అ) నివారించాడు.' ('స.ముస్లిం)

చేశారో, నిశ్చయంగా మేము అలాంటి వారి మంచిపనుల ప్రతిఫలాన్ని వృథా కానివ్వము[12].

**31.** అలాంటి వారు! వారి కొరకు క్రింద సెలయేళ్ళు ప్రవహించే శాశ్వత స్వర్గవనాలు ఉంటాయి. అందువారు బంగారు కంకణాలను మరియు ఆకు పచ్చని బంగారు జలతారు గల పట్టు వస్త్రాలను ధరించి, ఎత్తైన ఆసనాలపై దిండ్లకు ఆనుకొని కూర్చొని ఉంటారు[13]. ఎంత మంచి ప్రతిఫలం మరియు ఎంత శ్రేష్ఠమైన విరామ స్థలం!

**32.** మరియు వారికి ఆ ఇద్దరు మనుష్యుల ఉదాహరణ తెలుపు: వారిద్దరిలో ఒకడికి మేము రెండు ద్రాక్షతోటలను ప్రసాదించి, వాటి చుట్టూ ఖర్జూరపు చెట్లను మరియు వాటి మధ్య పంటపొలాన్ని ఏర్పరిచాము.

**33.** ఆ రెండు తోటలు, ఏ కొరతా లేకుండా (పుష్కలంగా) పంటలిచ్చేవి. మరియు వాటి మధ్య మేము ఒక సెలయేరును ప్రవహింపజేశాము.

**34.** మరియు అతడికి పుష్కలమైన ఫలాలు పండేవి

---

[12] ప్రజలలో స్వర్గాన్ని పొందే అభిలాష అధికం కావాలని ఇక్కడ నరకం తర్వాత స్వర్గపు సౌఖ్యాల ప్రస్తావన ఇవ్వబడింది.

[13] రాజులు బంగారు కంకణాలు, ఆభరణాలు మరియు పట్టు వస్త్రాలు ధరిస్తారు. స్వర్గవాసులకు రాజులకు ఉంటేటటువంటి సుఖసంతోషాలు ఉంటాయిని చెప్పడానికి ఈ వివరాలు ఇవ్వబడ్డాయి. మరియు పురుషులకు ఇహలోకంలో హరాం చేయబడిన, బంగారు ఆభరణాలు మరియు పట్టు వస్త్రాలను వారు త్యజించుకుంటే వారికి స్వర్గంలో అవన్నీ లభిస్తాయి. అంతేగాక వారు కోరేవన్నీ దొరుకుతాయి. చూడండి, 22:23, 35:33, 76:21.

(లాభాలు వచ్చేవి). మరియు అతడు తన పొరుగువాడితో మాట్లాడుతూ అన్నాడు: "నేను నీ కంటే ఎక్కువ ధనవంతుణ్ణి మరియు నా వద్ద బలవంతులైన మనుషులు కూడా ఉన్నారు."

35. మరియు ఈ విధంగా అతడు తనకు తాను అన్యాయం చేసుకునేవాడవుతూ, తన తోటలో ప్రవేశించి ఇలా అన్నాడు: "ఇది ఎన్నటికైనా నాశనమవుతుందని నేను భావించను!

36. మరియు అంతిమ ఘడియ కూడా వస్తుందని నేను భావించను, ఒకవేళ నా ప్రభువు వద్దకు నేను తిరిగి మరలింపబడినా అచ్చట నేను దీని కంటే మేలైన స్థానాన్నే పొందగలను[14]."

37. అతడి పొరుగువాడు అతడితో మాట్లాడుతూ అన్నాడు: "నిన్ను మట్టితో[15], తరువాత ఇంద్రియ బిందువుతో సృష్టించి, ఆ తరువాత నిన్ను (సంపూర్ణ) మానవుడిగా తీర్చిదిద్దిన ఆయన (అల్లాహ్)ను నీవు తిరస్కరిస్తున్నావా?

38. కాని నిశ్చయంగా, నా మట్టుకు మాత్రం ఆయన! అల్లాహ్ యే నా ప్రభువు మరియు నేను ఎవ్వడినీ నా ప్రభువుకు భాగస్వామిగా (సాటిగా) కల్పించను.

39. "మరియు ఒకవేళ నీవు, నన్ను సంపదలో మరియు సంతానంలో నీ కంటే తక్కువగా తలచినప్పటికీ, నీవు నీ తోటలో ప్రవేశించినపుడు:

---

[14] ఇటువంటి వాక్యానికి చూడండి, 41:50 మరియు 19:77.

[15] ఆదమ్ ('అ.స.) మట్టితో సృష్టించిన వివరాలకు చూడండి, 3:59, 23:12, 11:61, 22:5 మరియు 30:20

"అల్లాహ్ కోరిందే అవుతుంది (మాషా అల్లాహ్), సర్వశక్తికి ఆధారభూతుడు కేవలం అల్లాహ్ యే (లా ఖువ్వత ఇల్లా బిల్లాహ్)! అని అని వుంటే ఎంత బాగుండేది.

**40.** "వాస్తవానికి నా ప్రభువు, నీ తోట కంటే ఉత్తమమైన దానిని నాకు ప్రసాదించి, దాని (నీ తోట) పైకి ఆకాశం నుండి ఒక పెద్ద ఆపదను పంపి, దానిని చదునైన మైదానంగా చేయవచ్చు!

**41.** లేదా! దాని నీటిని భూమిలో ఇంకి పోయినట్లు చేస్తే, నీవు దానిని ఏ విధంగానూ తిరిగి పొందలేవు!"

**42.** మరియు అతడి పంటను (వినాశం) చుట్టుముట్టింది, అతడు తాను ఖర్చు చేసినదంతా నాశనమైనదని చేతులు నలుపుకుంటూ ఉండిపోయాడు. మరియు అది దాని పందిరితో సహా నాశనమైపోయింది. మరియు అతడు ఇలా వాపోయాడు: "అయ్యో! నా దౌర్భాగ్యం! నేను నా ప్రభువుకు భాగస్వాములను (షరీక్ లను) కల్పించకుండా ఉంటే ఎంత బాగుండేది!"

**43.** మరియు అల్లాహ్ కు విరుద్ధంగా అతడికి సహాయపడే వారెవ్వరూ లేకపోయారు. మరియు అతడు కూడా తనకు తాను సహాయం చేసుకోలేక పోయాడు.

**44.** అక్కడ (ఆ తీర్పుదినం నాడు)[16] శరణు (రక్షణ)

---

[16] ఈ బ్రాకెట్ ఇబ్నె-కసీ'ర్ లో ఇవ్వబడి ఉంది.

కేవలం అల్లాహ్, ఆ సత్యవంతునిదే! ఆయనే ప్రతిఫలం ఇవ్వటంలో ఉత్తముడు మరియు అత్యుత్తమ అంతిమ ఫలితం ఇచ్చేవాడు.

**45.** మరియు వారికి ఇహలోక జీవితాన్ని[17] ఈ ఉపమానం ద్వారా బోధించు: మేము ఆకాశం నుండి నీటిని కురిపించినపుడు, దానిని భూమిలోని చెట్టూ చేమలు పీల్చుకొని (పచ్చగా పెరుగుతాయి). ఆ తరువాత అవి ఎండి పొట్టుగా మారిపోయినపుడు, గాలి వాటిని చెల్లాచెదురు చేస్తుంది. మరియు వాస్తవానికి అల్లాహ్ యే ప్రతిదీ చేయగల సమర్థుడు.

**46.** ఈ సంపదా మరియు ఈ సంతానం, కేవలం ఐహిక జీవితపు అలంకారాలు మాత్రమే. కాని శాశ్వతంగా నిలిచేవి సత్కార్యాలే! అవే నీ ప్రభువు దృష్టిలో ప్రతిఫలానికి ఉత్తమమైనవి మరియు దానిని ఆశించటానికి కూడా

---

[17] ఇహలోక జీవితం ఈ విధంగా బోధించబడుతోంది: అల్లాహుతా'ఆలా! ఆ ఏకైక ఆరాధ్యుడు, సర్వశక్తిమంతుడు, కోరితే మన జీవితాలను, వర్షం కురిసినపుడు కళకళలాడే పంటపొలాల మాదిరిగా చేయగలడు. లేదా ఎండిన పొట్టుగా గాలికి ఎగురవేయగలడు. కేవలం అల్లాహ్ (సు.తా.) యే ప్రతిదీ చేయగల సమర్థుడు. ఇటువంటి వాక్యాలకు చూడండి 10:24, 39:21, 57:20

ఉత్తమమైనవి[18].

**47.** మరియు (జ్ఞాపకముంచుకోండి) ఆ రోజున మేము పర్వతాలను చలింపజేస్తాము[19]. మరియు నీవు భూమిని చదునైన మైదానంగా చూస్తావు. మరియు మేము ఒక్కడిని కూడా విడువకుండా అందరినీ సమావేశపరుస్తాము.

**48.** మరియు వారందరు నీ ప్రభువు సన్నిధిలో వరుసలలో ప్రవేశపెట్టబడతారు, (నీ ప్రభువు వారితో): "వాస్తవానికి మేము మొదటిసారి మిమ్మల్ని పుట్టించిన స్థితిలోనే[20] మీరు మా వద్దకు వచ్చారు! కాని మా ముందు హాజరయ్యే ఘడియను మేము నియమించలేదని మీరు భావించేవారు కదా!" అని పలుకుతాడు.

**49.** మరియు కర్మపత్రం వారి ముందు ఉంచబడినపుడు, ఆ అపరాధులు, అందులో ఉన్న దానిని చూసి భయపడటాన్ని నీవు చూస్తావు. వారు ఇలా అంటారు: "అయ్యో! మా దౌర్భాగ్యం, ఇదేమి గ్రంథం!

---

[18] సత్కార్యాలంటే మంచిపనులు; అల్లాహ్ (సు.తా.) నియమించిన విధులు (ఫ'ర్ద్ లు) వాజిబాత్ లు, దైవప్రవక్త సంప్రదాయాలు (సునన్), అదనంగా చేసే మంచి పనులు (నవాఫిల్). ఇంతే గాకుండా నిషేధింపబడిన వాటి నుండి దూరంగా ఉండటం కూడా సత్కార్యాలలోనే లెక్కించ బడుతుంది. ఇంకా ఇటువంటివాక్యానికి చూడండి, 19:76.

[19] పర్వతాలు ఏకిన దూదివలే మారి ఎగిరిపోతూ ఉంటాయి. చూడండి, 101:5, 52:9-10, 27:88, 20:105-107 మరియు భూమిపై ఉన్న భవనాలూ, చెట్టుచేమలూ అన్నీ నాశనమై పోయి భూమి ఒక చదునైన మైదానంగా మారి పోతుంది.

[20] ఇట్టి వాక్యానికి చూడండి, 6:94.

ఏ చిన్న విషయాన్ని గానీ, ఏ పెద్ద విషయాన్ని గానీ ఇది లెక్క పెట్టకుండా విడువ లేదే!" తాము చేసిందంతా వారు తమ ఎదుట పొందుతారు. నీ ప్రభువు ఎవ్వరికీ అన్యాయం చేయడు.

**50.** మరియు (జ్ఞాపకం చేసుకోండి!) మేము దేవదూతలతో: "ఆదమ్ కు సాష్టాంగ పడండి." అని చెప్పినపుడు, ఒక్క ఇబ్లీస్ తప్ప మిగతా వారందరూ సాష్టాంగపడ్డారు. అతడు జిన్నాతులలోని వాడు[21]. అప్పుడు అతడు తన ప్రభువు ఆజ్ఞను ఉల్లంఘించాడు. ఏమీ? మీరు నన్ను కాదని అతనిని మరియు అతని సంతానాన్ని స్నేహితులుగా (సంరక్షకులుగా) చేసుకుంటారా? మరియు వారు మీ శత్రువులు కదా! దుర్మార్గులకు ఎంత చెడ్డ ఫలితముంది.

**51.** నేను ఆకాశాలను మరియు భూమిని సృష్టించినప్పుడు గానీ, లేదా స్వయంగా వారిని (షైతానులను) సృష్టించినప్పుడు గానీ వారిని సాక్షులుగా పెట్టలేదు[22]. మార్గం తప్పించే వారిని నేను (అల్లాహ్) సహాయకులుగా చేసుకునే వాడను కాను.

**52.** మరియు (జ్ఞాపకముంచుకోండి!) ఆ దినమున ఆయన (అల్లాహ్) వారితో: "మీరు నా

---

[21] ఇబ్లీస్ దైవదూత కాడు జిన్నాతుడు అని ఇక్కడ విశదమౌతుంది. ఇంకా చూడండి, 2:31-34.

[22] అంటే భూమ్యాకాశాలను మరియు (వారిని) షైతానులను సృష్టించినప్పుడు, వారు (షైతానులు) ఉనికిలో లేరు. అల్లాహ్ (సు.తా.) యే వారిని సృష్టించాడు.

భాగస్వాములని భావించిన వారిని పిలవండి!" అని అన్నప్పుడు, వారు (భాగస్వాములుగా భావించిన) వారిని పిలుస్తారు, కాని వారు వారికి జవాబివ్వరు. మరియు మేము వారి మధ్య ఒక పెద్ద లోతైన వినాశగుండాన్ని నియమించి ఉంటాము.

53. మరియు ఆ అపరాధులు నరకాగ్నిని చూసి వారు తప్పక అందులో పడవలసి ఉన్నదని తెలుసుకుంటారు మరియు వారు దాని నుండి తప్పించుకోవటానికి ఎలాంటి ఉపాయం పొందరు.

54. మరియు నిశ్చయంగా, మేము ఈ ఖుర్ఆన్ లో మానవులకు, ప్రతి విధమైన ఉపమానాన్ని వివరించాము. కాని మానవుడు పరమ జగడాల మారి!

55. మరియు వారి ముందుకు మార్గదర్శకత్వం వచ్చినప్పుడు, దానిని విశ్వసించకుండా మరియు తమ ప్రభువు సన్నిధిలో క్షమాభిక్ష కోరకుండా ఉండటానికి వారిని ఆటంక పరిచిందేమిటి! వారి పూర్వీకుల మీద పడిన (ఆపద) వారి మీద కూడా పడాలనో, లేదా ఆ శిక్ష ప్రత్యక్షంగా వారిపైకి రావాలనో వేచి ఉండటం తప్ప?

56. మరియు మేము సందేశహరులను కేవలం శుభవార్తలు అందజేసేవారిగా మరియు హెచ్చరికలు చేసేవారిగా మాత్రమే పంపుతాము. మరియు సత్యతిరస్కారులు, సత్యాన్ని ఖండించటానికి నిరర్థకమైన మాటలతో వాదులాడుతారు. మరియు

నా సూచనలను మరియు హెచ్చరికలను హాస్యంగా తీసుకుంటారు.

**57.** మరియు తన ప్రభువు సూచనలతో హితబోధ చేయబడినపుడు, వాటికి విముఖుడై తన చేతులారా చేసుకొని పంపిన దాన్ని (దుష్పరిణామాన్ని) మరచిపోయే వ్యక్తి కంటే, పరమ దుర్మార్గుడెవడు? వారు దానిని (ఖుర్ఆన్ ను) అర్థం చేసుకోకుండా మేము వారి హృదయాల మీద తెరలు వేసి ఉన్నాము మరియు వారి చెవులకు చెవుడు కలిగించాము. కావున, నీవు వారిని సన్మార్గం వైపునకు పిలిచినా వారెన్నటికీ సన్మార్గం వైపునకు రాలేరు.

**58.** మరియు నీ ప్రభువు క్షమాశీలుడు, కారుణ్యమూర్తి. ఆయన వారి దుష్కర్మల ఫలితంగా వారిని పట్టుకోదలిస్తే, వారిపై తొందరగానే శిక్ష పంపి ఉండేవాడు. కాని వారికొక నిర్ణీత సమయం నిర్ణయించబడి ఉంది, దాని నుండి వారు ఏ విధంగానూ తప్పించుకోలేరు[23].

**59.** మరియు (ఆ నగరాల వారు) దుర్మార్గం చేసినందుకు మేము నాశనం చేసిన నగరాలు ఇవే! మరియు వారి నాశనం కొరకు కూడా మేము ఒక సమయాన్ని నిర్ణయించి ఉన్నాము.

**60.** మరియు (జ్ఞాపకం చేసుకోండి) మూసా తన

---

[23] ఇటువంటి ఆయతులకు చూడండి, 16:61 మరియు 35:45

సేవకునితో[24] ఇలా అన్నది: "రెండు సముద్రాల సంగమ స్థలానికి చేరనంత వరకు నేను నా ప్రయాణాన్ని ఆపను[25]. నేను సంవత్సరాల తరబడి సంచరిస్తూ ఉండవలసినా సరే!"[26]

61. ఆ పిదప వారిద్దరు ఆ (రెండు సముద్రాల) సంగమ స్థలానికి చేరినప్పుడు, వారి చేపను గురించి మరిచిపోయారు. అది వారి నుండి తప్పించుకొని వేగంగా సముద్రంలోకి - సొరంగం గుండా పోయినట్లు[27] - దూసుకు పోయింది.

62. ఆ పిదప వారు మరికొంత ముందుకు పోయిన తరువాత, అతను (మూసా) తన సేవకునితో ఇలా అన్నాడు: "మన భోజనం తీసుకురా! వాస్తవానికి మనం ఈ ప్రయాణంలో చాలా అలసిపోయాము."

63. (సేవకుడు) ఇలా అన్నాడు: "చూశారా! మనం

---

[24] ఈ యువకుడే యూషాఅ'బిన్. మూసా ('అ.స.) తరువాత, అతను తన జాతి వారికి నాయకత్వాన్ని వహించారు.

[25] ఈ సంగమ స్థానం అఖ్బా అఖాతం మరియు సూయజ్ అఖాతం రెండు వచ్చి ఎర్రసముద్రంలో (రెడ్ సీ) లో కలిసే సంగమం కావచ్చని వ్యాఖ్యాతల అభిప్రాయం.

[26] మూసా ('అ.స.) ఒకనితో ఒకసారి: 'నాకు మించిన జ్ఞానవంతుడు ఇప్పుడు ఎవ్వడూ లేడు!' అని అంటారు. అది అల్లాహ్ (సు.తా.)కు నచ్చదు. అప్పుడు అల్లాహుతా'ఆలా అతనితో రెండు సముద్రాల సంగమంలో నీవు: 'నిన్ను మించిన జ్ఞానిని పొందగలవు.' అని దివ్యజ్ఞానం ద్వారా తెలుపుతాడు. అప్పుడతను ('అ.స.) ఆ జ్ఞాని అన్వేషణలో బయలుదేరుతారు.

[27] "తన త్రోవను సొరంగంగా చేసుకుంటూ." (ఇది ము'హమ్మద్ జునాగఢీ గారి తాత్పర్యం). పైన ఉన్నది నోబుల్ ఖుర్ఆన్ తాత్పర్యము.

ఆ బండ మీద విశ్రాంతి తీసుకోవటానికి ఆగినపుడు వాస్తవానికి నేను చేపను గురించి పూర్తిగా మరచి పోయాను. షైతాను తప్ప మరెవ్వడూ నన్ను దానిని గురించి మరపింపజేయలేదు. అది విచిత్రంగా సముద్రంలోకి దూసుకొని పోయింది!"

64. (మూసా) అన్నాడు: "అదే కదా, మనం కోరుతున్నది (వెతుకుతున్న స్థానం)!" ఆ పిదప వారిరువురు తమ అడుగుజాడలను అనుసరిస్తూ వెనుకకు మరలిపోయారు.

65. అప్పుడు వారు మా దాసులలో ఒక దాసుణ్ణి (అచ్చట) చూశారు. మేము అతనికి మా అనుగ్రహాన్ని ప్రసాదించి[28], అతనికి మా తరఫు నుండి విశిష్ట జ్ఞానం నేర్పి ఉన్నాము[29].

66. మూసా అతనితో (ఖిద్ర్ తో) అన్నాడు: "నీకు నేర్పబడిన జ్ఞానాన్ని నీవు నాకు నేర్పుటకై నేను నిన్ను అనుసరించ వచ్చునా?"

67. అతను జవాబిచ్చాడు: "నీవు నాతో పాటు ఏ మాత్రం సహనం వహించలేవు!

68. అసలు నీకు తెలియని విషయాన్ని గురించి నీవెట్లు సహనం వహించగలవు?"

69. (మూసా) అన్నాడు: "అల్లాహ్ కోరితే! నీవు

---

[28] ర'హ్మతున్: అంటే ఇక్కడ ప్రత్యేక అనుగ్రహాలు అని కొందరు వ్యాఖ్యాతలు అన్నారు. మరియు చాలా మంది వ్యాఖ్యాతలు దీనిని ప్రవక్త పదవిగా వ్యాఖ్యానించారు.

[29] అల్లాహుత'ఆలా 'ఖి'ద్ర్ ('అ.స.)కు ప్రవక్త పదవినే గాక, తన వైపు నుండి విశిష్ట జ్ఞానం కూడా ప్రసాదించాడు.

నన్ను సహనశీలునిగా పొందగలవు. నేను నీ యొక్క ఏ ఆజ్ఞనూ ఉల్లంఘించను!"

70. అతను అన్నాడు: "ఒకవేళ నీవు నన్ను అనుసరించటానికే నిశ్చయించుకుంటే, స్వయంగా నేనే నీతో ప్రస్తావించనంత వరకు నీవు నన్ను, ఏ విషయాన్ని గురించి కూడా ప్రశ్నించ కూడదు."

71. ఆ పిదప వారిద్దరూ బయలుదేరారు. చివరికి వారిద్దరు పడవలో ఎక్కినపుడు అతను పడవకు రంధ్రం చేశాడు. (మూసా) అతనితో అన్నాడు: "ఏమీ? పడవలో ఉన్న వారిని ముంచి వేయటానికా, నీవు దానిలో రంధ్రం చేశావు? వాస్తవానికి, నీవు ఒక దారుణమైన పని చేశావు!"

72. అతను అన్నాడు:"నేను నీతో అనలేదా? నీవు నాతో పాటు ఏమాత్రం సహనం వహించలేవని?"

73. (మూసా) అన్నాడు: "మరచిపోయి చేసిన దానికి నన్ను తప్పుపట్టకు. నేను చేసిన దానికి నా పట్ల కఠినంగా వ్యవహరించకు!"

74. ఆ పిదప వారు తమ ప్రయాణం సాగించగా వారికి ఒక బాలుడు కలిశాడు. అతను వానిని (బాలుణ్ణి) చంపాడు. (అది చూసి) మూసా అన్నాడు: "ఏమీ? ఒక అమాయకుడిని చంపావా? అతడు ఎవ్వడినీ (చంపలేదే)! వాస్తవానికి నీవు ఒక ఘోరమైన పని చేశావు!"

75. అతను (ఖిద్ర్) అన్నాడు: "నేను నీతో అనలేదా, నిశ్చయంగా, నీవు నాతో పాటు ఏ మాత్రం సహనం వహించలేవని?"

76. (మూసా) అన్నాడు: "ఇక ముందు దేన్ని గురించి అయినా నిన్ను అడిగితే నన్ను నీతో పాటు ఉండనివ్వకు. వాస్తవానికి నీవు, నా తరఫు నుండి ఇంత వరకు చాలినన్ని సాకులు స్వీకరించావు."

77. ఆ పిదప వారిద్దరూ ముందుకు సాగిపోయి ఒక నగరం చేరుకొని ఆ నగరవాసులను భోజన మడిగారు. కాని వారు(ఆ నగరవాసులు) వారిద్దరికి ఆతిథ్యమివ్వటానికి నిరాకరించారు[30]. అప్పుడు వారక్కడ కూలిపోనున్న ఒక గోడను చూశారు. అతను (ఖిద్ర్) దానిని మళ్ళీ నిలబెట్టాడు. (మూసా) అన్నాడు: "నీవు కోరితే దానికి (ఆ శ్రమకు) ప్రతిఫలం (వేతనం) తీసుకొని ఉండవచ్చు కదా!"

78. అతను (ఖిద్ర్) అన్నాడు: "ఇక నేనూ నీవూ విడిపోవలసిన(సమయం) వచ్చింది. ఇక నీవు సహనం వహించ లేకపోయిన విషయాల వాస్తవాలను(తత్త్వాలను) గురించి నీకు తెలుపుతాను.

79. ఇక ఆ నావ విషయం: అది సముద్రంలో పని చేసుకునే కొందరు పేదవారిది. కావున దానిలో లోపం కలిగించగోరాను; ఎందుకంటే వారి వెనుక ఒక క్రూరుడైన రాజు ఉన్నాడు. అతడు (లోపం లేని) ప్రతి నావను బలవంతంగా తీసుకుంటాడు.

---

[30] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'అల్లాహుతా'ఆలాను మరియు పరలోకాన్ని విశ్వసించేవాడు, తన అతిథిని ఆదరించాలి, ఆతిథ్యమివ్వాలి.' ('సైద్ అల్ - ఖదీర్, షర్హ్ అల్ జామె' అ'స్స'గీర్ 5-209)

**80.** ఇక ఆ బాలుని విషయం: అతని తల్లిదండ్రులు విశ్వాసులు. అతడు తన సత్యతిరస్కారం మరియు తలబిరుసుతనం వలన వారిని బాధిస్తాడని భయపడ్డాము.

**81.** కావున వారిద్దరి ప్రభువు వారికి అతనికి బదులు అతని కంటే ఎక్కువ నీతిమంతుడు మరియు కారుణ్యం గలవాడిని ఇవ్వాలని కోరాము.

**82.** ఇక ఆ గోడ విషయం: అది ఈ పట్టణంలోని ఇద్దరు అనాథ బాలురకు చెందినది. దాని క్రింద వారి ఒక నిధి (పాతబడి) ఉంది. మరియు వారి తండ్రి పుణ్యపురుషుడు. ఆ ఇద్దరు బాలురు యుక్తవయస్సులైన పిదప - నీ ప్రభువు కారుణ్యంగా - తమ నిధిని, వారు త్రవ్వి తీసుకోవాలని, నీ ప్రభువు సంకల్పం. ఇదంతా నా అంతట నేను చేయలేదు. నీవు సహనం వహించలేని విషయాల వాస్తవం (తత్త్వం) ఇదే!"

**83.** మరియు వారు నిన్ను జుల్ ఖర్ నైన్[31] ను గురించి అడుగుతున్నారు. వారితో అను: "అతనిని గురించి జ్ఞాపకముంచుకో దగిన విషయాన్ని నేను మీకు వినిపిస్తాను."

**84.** నిశ్చయంగా మేము అతని (అధికారాన్ని) భూమిలో స్థాపించాము మరియు అతనికి

---

[31] జు'ల్-ఖర్ నైన్ అంటే రెండు కొమ్ములున్నవాడు.

ప్రతిదానిని పొందే మార్గాన్ని చూపాము[32].

**85.** అతను ఒక మార్గం మీద పోయాడు.

**86.** చివరకు సూర్యుడు అస్తమించు (నట్లు కనబడే) స్థలానికి చేరాడు. దానిని (సూర్యుణ్ణి) నల్ల బురద వంటి నీటి చెలిమలో మునుగుతున్నట్లు చూశాడు[33]. మరియు అక్కడొక జాతి వారిని చూశాడు. మేము అతనితో అన్నాము[34]: "ఓ జుల్'ఖర్'నైన్! నీవు వారిని శిక్షించవచ్చు లేదా వారి యెడల ఉదార వైఖరిని అవలంబించ వచ్చు!"

**87.** అతను అన్నాడు: "ఎవడైతే దుర్మార్గం చేస్తాడో మేము అతనిని శిక్షిస్తాము. ఆ పిదప అతడు తన ప్రభువు వైపునకు మరలింపబడతాడు. అప్పుడు ఆయన అతనికి ఘోరమైన శిక్ష విధిస్తాడు.

---

[32] అస్-సబబు: అంటే ఇక్కడ తాను కోరిన దానిని పొందే మార్గాన్ని అన్వేషించడమని అర్థం.

[33] 'ఐనున్: సముద్రం లేక చెలిమ. 'హమిఅతిన్: బురద. వజద: పొందాడు, చూశాడు, కనుగొన్నాడు. అతడు పూర్తి పశ్చిమ దిశకు పోయిన తరువాత అక్కడ ఒక సముద్రం లేక చెలిమను చూశాడు. దాని నీరు నల్లని బురదగా కనిపించింది. దాని తరువాత అతనికి ఏమీ కనిపించక అస్తమయ్యే సూర్యుడు మాత్రమే కనిపించాడు. సముద్రపు ఒడ్డున నిలబడి అస్తమించే సూర్యుణ్ణిచూస్తే,సూర్యుడుఆసముద్రమలో మునిగిపోతున్నట్లు కనబడటం మనం చూస్తున్న విషయమే! భూమి గుండ్రంగా ఉన్నదనటానికి ఇదొక నిదర్శనం.

[34] ఖుల్నా: మేమన్నాము, అంటే అల్లాహుతా'ఆలా అనతికి వ'హీ ద్వారా తెలిపాడు. అంటే, అతడు ప్రవక్త కావచ్చని కొందరు భావిస్తారు. అతనిని ప్రవక్తగా పరిగణించని వారు; ఆ కాలపు ప్రవక్త ద్వారా అతనికి సందేశం ఇవ్వబడిందని అంటారు.

88. ఇక ఎవడైతే! విశ్వసించి సత్కార్యాలు చేస్తాడో అతనికి మంచి ప్రతిఫల ముంటుంది. మేము అతనిని ఆజ్ఞాపించి నపుడు, సులభతరమైన ఆజ్ఞనే ఇస్తాము."

89. తరువాత అతను మరొక మార్గం మీద పోయాడు.

90. చివరకు సూర్యుడు ఉదయించు (నట్లు కనబడే) స్థలానికి చేరాడు. అక్కడ అతను దానిని (సూర్యుణ్ణి) ఒక జాతిపై ఉదయించడం చూశాడు. వారికి మేము దాని (సూర్యుని) నుండి కాపాడుకోవటానికి ఎలాంటి చాటు (రక్షణ) నివ్వలేదు[35].

91. ఈ విధంగా! వాస్తవానికి, అతనికి (జుల్ ఖర్ నైన్ కు) తెలిసి ఉన్న విషయాలను గురించి మాకు బాగా తెలుసు.

92. ఆ తరువాత అతను మరొక మార్గం మీద పోయాడు.

93. చివరకు అతను రెండు పర్వతాల మధ్య చేరాడు. వాటి మధ్య ఒక జాతివారిని చూశాడు. వారు అతని మాటలను అతి కష్టంతో అర్థం చేసుకోగలిగారు[36].

94. వారన్నారు: "ఓ జుల్ ఖర్ నైన్! వాస్తవానికి

---

[35] ఆ జాతివారు ఇండ్లలో నివసించేవారు కాదు. మైదానాలలో నివసించేవారు. మరియు వారు బట్టలు కూడా ధరించకుండా నివసించే ఆదివాసులు.

[36] ఆ జాతి వారు తమ భాష తప్ప ఇతరుల భాషను అర్థం చేసుకోలేరు. కావున వారు అతని మాటలను అర్థం చేసుకోలేక పోయారు.

యాజూజ్ మరియు మాజూజ్ లు[37], ఈ భూభాగంలో కల్లోలం రేకెత్తిస్తున్నారు. అయితే నీవు మాకూ మరియు వారికీ మధ్య ఒక అడ్డుగోడను నిర్మించటానికి, మేము నీకేమైనా శుల్కం చెల్లించాలా?"

**95.** అతను అన్నాడు: "నా ప్రభువు ఇచ్చిందే నాకు ఉత్తమమైనది. ఇక మీరు మీ శ్రమ ద్వారా మాత్రమే నాకు సహాయపడితే, నేను మీకూ మరియు వారికీ మధ్య అడ్డుగోడను నిర్మిస్తాను.

**96.** "మీరు నాకు ఇనుప ముద్దలు తెచ్చి ఇవ్వండి." అతను ఆ రెండు కొండల మధ్య ఉన్న సందును మూసిన తరువాత వారితో అన్నాడు: "అగ్ని రగిలించండి." దానిని ఎర్రని నిప్పుగా మార్చిన తరువాత, అన్నాడు: "ఇక కరిగిన రాగిని తీసుకు రండి, దీని మీద పోయటానికి."

**97.** ఈ విధంగా వారు (యాజూజ్ మరియు మాజూజ్

---

[37] వీరి గాథ బైబిల్ లో కూడా పేర్కొనబడింది. చూడండి, యెహెజ్కేలు - (Exekiel), 38:2 మరియు 39:6. ఇంకా ఇతర చోట్లలో కూడా వీరి విషయం పేర్కొనబడింది. చూడండి, యోహాను ప్రకటన - (Revelation of St. John), 20:8. చాలా మంది వ్యాఖ్యాతలు వీరిని మంగోలులు లేక టాటార్ లు (MongolsorTatars)కావచ్చనిఅంటారు.వీరుఅసత్యవాదులు మరియు అంతిమ గడియకు ముందు భూమిలో కల్లోలం రేకెత్తించి మానవ నాగరికతను నాశనం చేస్తారు. ఇంకా చూడండి, 21:96-97. వాస్తవం అల్లాహ్ (సు.తా.)కే తెలుసు. 'స'హీ'హ్ బు'ఖారీ మరియు ముస్లింలలో ఇలా ఉంది: 'యా'జూజ్ మా'జూజ్ లు,' రెండు మానవ జాతులు. వారి సంఖ్య ఇతర మానవుల కంటే అధికముగా ఉంటుంది. మరియు వారితోనే నరకం అత్యధికంగా నిండుతుంది.

లు) దానిపై నుండి ఎక్కి రాలేక పోయారు. మరియు దానిలో కన్నం కూడా చేయలేక పోయారు.

98. అతను (జుల్ ఖర్ నైన్) అన్నాడు: "ఇది నా ప్రభువు యొక్క కారుణ్యం. కాని నా ప్రభువు వాగ్దానపు ఘడియ వచ్చినపుడు ఆయన దీనిని బూడిదగా మార్చివేస్తాడు. మరియు నా ప్రభువు వాగ్దానం నిజమై తీరుతుంది."

99. మరియు ఆ (యాజూజ్ మరియు మాజూజ్ లు బయటికి వచ్చిన) రోజు, మేము వారిని అలల వలే ఒకరి మీద ఒకరు పడటానికి వదిలివేస్తాము.

100. మరియు బాకా (సూర్) ఊదబడి నప్పుడు, వారందరినీ ఒకచేట సమావేశ పరుస్తాము. మరియు ఆ రోజున మేము సత్యతిరస్కారులకు నరకాన్ని స్పష్టంగా చూసేందుకు వారి ముందుకు తెస్తాము.

101. అలాంటి వారికి, ఎవరి కన్నులైతే, మా హితోపదేశం పట్ల కప్పబడి ఉండెనో మరియు వారికి, ఎవరైతే (దానిని) ఏ మాత్రమూ వినటానికి కూడా ఇష్టపడలేదో!

102. ఏమీ? ఈ సత్యతిరస్కారులు నన్ను వదలి, నా దాసులను తమ స్నేహితులుగా (సంరక్షకులుగా) చేసుకొనగలరని భావించారా? నిశ్చయంగా, మేము సత్యతిరస్కారుల ఆతిథ్యం కొరకు నరకాన్ని సిద్ధపరచి ఉంటాము.

**103.** వారితో అను: "కర్మలను బట్టి అందరి కంటే ఎక్కువ నష్టపడేవారు ఎవరో మీకు తెలుపాలా?

**104.** "ఎవరైతే ఇహలోక జీవితంలో చేసే కర్మలన్నీ వ్యర్థమైనా, తాము చేసే వన్నీ సత్కార్యాలే అని భావిస్తారో!

**105.** వీరే తమ ప్రభువు సూచనలను మరియు ఆయననుకలుసుకోవలసివున్నదనేవిషయాన్ని తిరస్కరించిన వారు. కావున వారి కర్మలన్నీ వ్యర్థమయ్యాయి. కాబట్టి మేము పునరుత్థాన దినమున వారి కర్మలకు ఎలాంటి విలువ (తూకము) నివ్వము.

**106.** అదే వారి ప్రతిఫలం నరకం! ఎందుకంటే వారు సత్యాన్ని తిరస్కరించారు మరియు నా సూచనలను మరియు నా సందేశహరులను పరిహాసించారు.

**107.** నిశ్చయంగా, ఎవరైతే విశ్వసించి సత్కార్యాలు చేస్తారో! వారి ఆతిథ్యం కొరకు ఫిర్'దౌస్ స్వర్గవనాలు ఉంటాయి[38].

**108.** వారందులో శాశ్వతంగా ఉంటారు. వారు అక్కడి నుండి వేరగుటకు ఇష్టపడరు.

**109.** వారితో అను: "నా ప్రభువు మాటలను వ్రాయటానికి, సముద్రమంతా సిరాగా మారి

[38] జన్నతుల్-ఫిర్ దౌస్: ఇది అన్నిటి కంటే ఉత్తమమైన స్వర్గం. దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'మీరు ఎల్లప్పుడు జన్నతుల్ ఫిర్ దౌస్ కొరకే ప్రార్థించండి.' ('స'హీ'హ్ బు'ఖారీ).

పోయినా - నా ప్రభువు మాటలు పూర్తికాక ముందే - దానికి తోడుగా దాని వంటి మరొక సముద్రాన్ని తెచ్చినా, అది కూడా తరిగి పోతుంది[39]."

**110.** (ఓ ప్రవక్తా!) ఇంకా ఇలా అను: "నిశ్చయంగా, నేను కూడా మీలాంటి ఒక మానవుడనే! నాపై దివ్యజ్ఞానం (వహీ) అవతరింపజేయబడింది. నిశ్చయంగా, మీ ఆరాధ్య దేవుడు ఆ ఏకైక దైవం (అల్లాహ్) మాత్రమే! కావున తన ప్రభువును కలుసుకోవాలని ఆశించేవాడు సత్కార్యాలు చేయాలి. మరియు ఆరాధనలో తన ప్రభువుతో పాటు మరెవ్వరినీ భాగస్వాములుగా (షరీక్ లుగా) కల్పించుకోరాదు."

---

[39] చూడండి, 31:27.

# 19. మర్యమ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. కాఫ్ - హా - యా - ఐన్ - సాద్[1].
2. ఇది నీ ప్రభువు తన దాసుడు జకరియ్యాపై చూపిన కారుణ్య ప్రస్తావన.
3. అతను తన ప్రభువును రహస్యంగా (ఏకాంతంలో) మొరపెట్టుకుంటూ;
4. ఇలా ప్రార్థించాడు: "ఓ నా ప్రభూ! నా ఎముకలు బలహీనమై పోయాయి మరియు నా తల (వెంట్రుకలు) ముసలితనం వల్ల తెల్లబడి మెరిసిపోతున్నాయి మరియు ఓ నా ప్రభూ! నిన్ను వేడుకొని నేను ఎన్నడూ నిష్ఫలుడను కాలేదు!
5. మరియు వాస్తవానికి నా తరువాత నా బంధువులు (ఏమి చేస్తారో అని) నేను భయపడు తున్నాను. నా భార్యనేమో గొడ్రాలు. కావున (నీ అనుగ్రహంతో) నాకు ఒక వారసుణ్ణి ప్రసాదించు.
6. అతడు నాకు మరియు యఅఖూబ్ సంతతి వారికి వారసుడవుతాడు మరియు ఓ నా ప్రభూ! అతనిని నీకు ప్రీతిపాత్రునిగా చేసుకో!"

---

[*] [మర్యమ్ - మేరీ]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

7. (అతనికి ఇలా జవాబివ్వబడింది): "ఓ జకరియ్యా! నిశ్చయంగా, మేము నీకు 'యహ్యా' అనే పేరు గల ఒక కుమారుని శుభవార్తను ఇస్తున్నాము![2] ఇంతకు పూర్వం మేము ఈ పేరు ఎవ్వరికీ ఇవ్వలేదు."

8. (జకరియ్యా) అన్నాడు: "ఓ నా ప్రభూ! నాకు కుమారుడు ఎలా కలుగుతాడు? నా భార్యనేమో గొడ్రాలు[3], మరియు నేనేమో వృద్ధాప్యంతో క్షీణించి (దుర్బలుడనై) పోయాను?"

9. ఇలా జవాబిచ్చాడు: "అలాగే అవుతుంది. నీ ప్రభువు ఇలా అంటున్నాడు: 'ఇది నాకు సులభం మరియు వాస్తవానికి ఇంతకు ముందు నీవు ఏమీ లేనప్పుడు, నేను నిన్ను సృష్టించాను కదా!'"

10. (జకరియ్యా) అన్నాడు: " ఓ నా ప్రభూ! నాకొక గుర్తును నియమించు." ఇలా జవాబు ఇవ్వబడింది: "నీ గుర్తు ఏమిటంటే! నీవు స్వస్థతతో ఉండి కూడా వరుసగా మూడు రాత్రులు (దినములు) ప్రజలతో మాట్లాడలేవు[4]."

---

[2] చూడండి, 3:39.

[3] 'జకరియ్యా ('అ.స.) భార్య, మర్యమ్ ('అ.స.) తల్లి యొక్క సోదరిమణి అని కొందరంటారు. చూడండి, 3:37 వ్యాఖ్యానం 3. మరికొందరు ఆమె మర్యమ్ ('అ.స.) తండ్రి 'ఇమ్రాన్ కూతురని అంటారు. అంటే య'హ్యా ('అ,స.) మరియు 'ఈసా ('అ.స.) అక్కాచెల్లేళ్ళ కుమారులు, అంటె కజిన్ లు. ('స'హీ'హ్ అ'హాదీస్ ల ఆధారంగా, ఫ'త్హ్ అల్-ఖదీర్.)

[4] చూడండి, 3:41

11. ఆపిదప అతను (జకరియ్యా) తన ప్రార్థనాలయం నుండి బయటికి వచ్చి తన జాతి వారికి, సైగలతో ఉదయమూ మరియు సాయంత్రమూ, ఆయన (ప్రభువు) పవిత్రతను కొనియాడండని సూచించాడు.

12. (అతని కుమారునితో ఇలా అనబడింది): "ఓ యహ్యా! ఈ దివ్యగ్రంథాన్ని గట్టిగా పట్టుకో." మరియు మేము అతనికి బాల్యంలోనే వివేకాన్ని[5] ప్రసాదించాము.

13. మరియు మా తరఫు నుండి కనికరాన్ని, పరిశుద్ధతను ఒసంగాము మరియు అతను దైవభీతి గలవాడు.

14. మరియు తన తల్లిదండ్రుల పట్ల కర్తవ్యపాలకుడు మరియు అతను హింసాపరుడు గానీ, అవిధేయుడు గానీ కాడు.

15. మరియు అతను పుట్టినరోజు మరియు అతను మరణించే రోజు మరియు అతను బ్రతికించి మరల లేపబడే రోజు అతనికి శాంతి కలుగు గాక![6]

16. మరియు ఈ గ్రంథం (ఖుర్ఆన్ లో) ఉన్న మర్యమ్ (గాథను) ప్రస్తావించు. ఆమె తన కుటుంబం వారిని విడిచి తూర్పుదిశలో ఒక స్థలానికి

---

[5] అల్-'హుక్మ్: అంటే జ్ఞానం, తెలివి, నిర్ణయసామర్థ్యం గ్రంథాన్ని అర్థం చేసుకునే శక్తి, మొదలైనవన్నీ అని ఇమామ్ షౌకాని అభిప్రాయం.

[6] ఎందుకంటే ఈ మూడు దినాలు మానవుని కొరకు ఎంతో కష్టదాయకమైనవి మరియు భయంకరమైనవి

వెళ్ళిపోయింది.

17. అక్కడ ఆమె వారి నుండి ఏకాంతంలో ఒక అడ్డుతెర కట్టుకొని ఉండసాగింది. అప్పుడు మేము ఆమె వద్దకు మా దూత (జిబ్రీల్)ను పంపాము[7]. అతను ఆమె ముందు సంపూర్ణ మానవ ఆకారంలో (రూపంలో) ప్రత్యక్షమయ్యాడు.

18. (మర్యమ్) ఇలా అన్నది: "ఒకవేళ నీవు దైవభీతి గల వాడవే అయితే! నిశ్చయంగా నేను నీ నుండి (రక్షింపబడటానికి) అనంత కరుణామయుని శరణు వేడుకుంటున్నాను."

19. (దేవదూత ఇలా) జవాబిచ్చాడు: "నిశ్చయంగా, నేను నీ ప్రభువు యొక్క సందేశహరుడను! నీకు ఒక సుశీలుడైన (నీతిమంతుడైన) కుమారుని (సందేశాన్ని) ఇవ్వటానికి పంపబడ్డాను."

20. ఆమె ఇలా ప్రశ్నించింది: "నాకు కుమారుడు ఎలా కలుగుతాడు? నన్ను ఏ మానవుడునూ

---

[7] రూహు'న్: దివ్యజ్ఞానం (వ'హీ)గా లేక దానిని తెచ్చే దేవదూత జిబ్రీల్ ('అ.స.) గా ఉపయోగించబడింది. ఇక్కడ దేవదూత జిబ్రీల్ ('అ.స.)గా ఉపయోగించబడింది. రూ'హుల్ ఖుద్స్: అని, 2:87, 253, 5:110 మరియు 16:102లలో జిబ్రీల్ ('అ.స.) కొరకు నాలుగు చోట్లలో వాడబడింది. రూ'హుల్ అమీన్: అని 26:193లో జిబ్రీల్ ('అ.స.) కొరకు వాడబడింది. అర్-రూ'హు: అని ఇక్కడ, 78:38 మరియు 97:4లలో జిబ్రీ('అ.స.) కొరకు మూడు చోట్లలో వాడబడింది, అవతరణలో మొదటిసారిగా 97:4లో వచ్చింది. అర్-రూ'హు: అంటే దివ్యజ్ఞానం అని, 16:2, 40:15 మరియు 42:52లలో మూడు చోట్లలో వాడబడింది.

ముట్టుకోలేదే! మరియు నేను చెడు నడవడిక
గల దానిని కూడా కాను!"

21. అతనన్నాడు: "అలాగే అవుతుంది! నీ ప్రభువు అంటున్నాడు: 'అది నాకు సులభం! మేము అతనిని, మా నుండి ప్రజలకు ఒక సూచనగా మరియు కారుణ్యంగా పంపు తున్నాము.' మరియు (నీ ప్రభువు) ఆజ్ఞ నెరవేరి తీరుతుంది."

22. తరువాత మర్యమ్ ఆ బాలుణ్ణి గర్భంలో భరించి, అతనితో ఒక దూరమైన స్థలానికి వెళ్ళి పోయింది.

23. ఆ తరువాత ప్రసవ వేదనతో ఆమె ఒక ఖర్జూరపు చెట్టు మొదలు దగ్గరికి చేరుకొని ఇలా వాపోయింది: "అయ్యో! నా దౌర్భాగ్యం, దీనికి ముందే నేను చనిపోయి వుంటే! మరియు నామరూపాలు లేకుండా నశించి పోతే ఎంత బాగుండేది!"

24. అప్పుడు క్రింది నుండి ఒక ధ్వని వినిపించింది: "నీవు దుఃఖించకు! వాస్తవాంగా నీ ప్రభువు, నీ క్రింద (దగ్గరగా) ఒక సెలయేరు సృష్టించాడు;

25. మరియు నీవు ఈ చెట్టు మొదలు పట్టి ఊపితే నీపై తాజా ఖర్జూరపు పండ్లు రాలుతాయి.

26. కావున నీవు తిను త్రాగు, నీ కళ్ళను చల్లబరచుకో! ఇక ఏ మానవుణ్ణి చూసినా అతనితో (సైగలతో): 'నేను నా కరుణామయుని కొరకు ఉపవాసమున్నాను, కావున ఈ రోజు నేను ఏ మానవునితో మాట్లాడను.' అని చెప్పు."

27. తరువాత ఆమె ఆ బాలుణ్ణి తీసుకొని తన జాతి వారి వద్దకు రాగా! వారన్నారు: "ఓ మర్యమ్! వాస్తవానికి నీవు నింద్యమైన (పాపమైన) పని చేశావు!

28. ఓ హారూన్ సోదరీ![8] నీ తండ్రీ చెడ్డవాడు కాదు మరియు నీ తల్లి కూడా చెడునడత గలది కాదే"

29. అప్పుడామె అతని (ఆ బాలుని) వైపు సైగ చేసింది. వారన్నారు: "తొట్టెలో వున్న ఈ బాలునితో మేమెలా మాట్లాడగలము?"

30. (ఆ బాలుడు) అన్నాడు: "నిశ్చయంగా నేను అల్లాహ్ దాసుణ్ణి. ఆయన నాకు దివ్యగ్రంథాన్నిచ్చి, నన్ను ప్రవక్తగా నియమించాడు.

31. మరియు నేనెక్కడున్నా సరే ఆయన నన్ను శుభవంతునిగా చేశాడు; నేను బ్రతికి వున్నంత కాలం నమాజ్ చేయమని మరియు విధిదానం(జకాత్) ఇవ్వమని నన్ను ఆదేశించాడు.

32. మరియు నన్ను నా తల్లి యెడల కర్తవ్యపాలకునిగా చేశాడు. నన్ను దౌర్జన్యపరునిగా, దౌర్భాగ్యునిగా చేయలేదు.

---

[8] హారూన్ సోదరీ! అంటే ఆమెకు హారూన్ అనే సవతి (అర్థ) సోదరుడు ఉండవచ్చు, లేదా మూసా ('అ.స.) సోదరుడు హారూన్ తో సంబంధం ఉన్నందున అలా పిలువబడి ఉండవచ్చు! తమ వంశంలోని పెద్దవాని పేరుతో పిలువబడటం ఆచారమే. (ఇబ్నె-కసీ'ర్ మరియు ఏసర్ అత్ -తఫాసీర్). చూడండి, 3:37 వ్యాఖ్యానం 3.

33. మరియు నేను పుట్టినరోజు మరియు నేను మరణించే రోజు మరియు నేను సజీవుడనై మరల లేచే రోజు, నాకు శాంతి కలుగు గాక!"

34. ఇతనే మర్యమ్ కుమారుడు ఈసా! ఇదే సత్యమైన మాట, దీనిని గురించే వారు వాదులాడుతున్నారు (సందేహంలో పడి ఉన్నారు).

35. ఎవరినైనా కుమారునిగా చేసుకోవటం అల్లాహ్ కు తగినపని కాదు. ఆయన సర్వలోపాలకు అతీతుడు, ఆయన ఏదైనా చేయదలుచు కుంటే, దానిని కేవలం: "అయిపో!" అని అంటాడు, అంతే అది అయిపోతుంది[9].

36. (ఈసా అన్నాడు): "నిశ్చయంగా అల్లాహ్ యే నా ప్రభువు మరియు మీ ప్రభువు, కావున మీరు ఆయననే ఆరాధించండి. ఇదే ఋజుమార్గము."

37. తరువాత విభిన్న (క్రైస్తవ) వర్గాల వారు (ఈసాను గురించి) పరస్పర అభిప్రాయభేదాలు నెలకొల్పుకున్నారు. కావున ఈ సత్యతిరస్కారులకు ఆ మహా దినపు దర్శనం వినాశాత్మకంగా

---

[9] అల్లాహుతా'ఆలా ప్రతిదీ చేయగల సమర్థుడు. తాను చేయదలచుకున్న దానిని: 'అయిపో!' అని అనగానే, అది అయిపోతుంది. అలాంటప్పుడు ఆయన (సు.తా.)కు సంతానపు ఆవశ్యకత ఎలా ఉంటుంది. అల్లాహుతా'ఆలాకు సంతానముందని భావించేవారు ఆయన (సు.తా.) శక్తి సామర్థ్యాలను విశ్వసించనట్లే! అది సత్యతిరస్కారం.

ఉంటుంది[10].

**38.** వారు మా ముందు హాజరయ్యే రోజున వారి చెవులు బాగానే వింటాయి మరియు వారి కండ్లు బాగానే చూస్తాయి. కాని ఈనాడు ఈ దుర్మార్గులు స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నారు[11].

**39.** మరియు వారిని (రాబోయే) ఆ పశ్చాత్తాప పడవలసిన దినాన్ని[12] గురించి హెచ్చరించు. అప్పుడు పరిణామం నిర్ణయించ బడి ఉంటుంది[13].

---

[10] యూదులు 'ఈసా ('అ.స.)ను మాంత్రికుడు, యూసుఫ్ నజ్జార్ కుమారుడు అన్నారు. ప్రొటెస్టెంట్ క్రైస్తవులు అతనిని అల్లాహ్ (సు.తా.) కుమారుడు అన్నారు. కేథోలిక్ తెగవారు అతను ముగ్గురు దైవాలలో, అల్లాహ్ (సు.తా.) జిబ్రీల్ ('అ.స.) మరియు 'ఈసా ('అ.స.) ముగ్గురిలో మూడవవారు అన్నారు. ఆర్థోడాక్స్ తెగవారు అతనిని స్వయం దేవుడు (God అల్లాహ్) అన్నారు. (ఫ'త్హ్ అల్-ఖదీర్ మరియు అయ్ సర్ అత్-తఫాసీర్)

[11] కాని వారు వినడం మరియు చూడడం పునరుత్థాన దినమున వారికి ఏమీ పనికి రావు.

[12] యౌమల్-'హస్ రతి: పశ్చాత్తాప పడే దినం అంటే పునరుత్థాన దినము.

[13] పునరుత్థాన దినమున స్వర్గానికి అర్హులైన వారిని స్వర్గానికి మరియు నరకానికి అర్హులైన వారిని నరకానికి పంపిన తరువాత మరణం ఒక గొర్రె ఆకారంలో తేబడుతుంది. దానిని స్వర్గనరకాల మధ్య నిలబెట్టబడి, స్వర్గ-నరక వాసులతో: 'దీనిని ఎరుగుదురా?' అని ప్రశ్నించగా వారు: 'అవును, ఇది మరణం.' అని అంటారు. వారి సమక్షంలో అది వధింపబడుతుంది. అప్పుడు స్వర్గవాసులతో ఇలా అనబడుతుంది: 'స్వర్గవాసులారా! మీ కొరకు స్వర్గజీవితం కలకాలం ఉంటుంది.' మరియు నరకవాసులతో అనబడుతుంది: 'మీకు ఈ నరకశిక్ష ఎల్లప్పుడూ ఉంటుంది.' మరియు మీ కెవ్వరికీ ఇక చావురాదు. ('స'హీ'హ్ బు'ఖారీ).

(ఇప్పుడైతే) వారు ఏమరుపాటులో పడి ఉన్నారు, కావున వారు విశ్వసించడం లేదు.

40. నిశ్చయంగా! భూమికి మరియు దానిపై వున్న వారికి వారసులం మేమే! వారందరూ మా వైపునకే మరలింపబడతారు.

41. మరియు ఈ గ్రంథం (ఖుర్ఆన్ లో) వున్న ఇబ్రాహీమ్ గాథను ప్రస్తావించు. నిశ్చయంగా, అతను సత్యవంతుడైన దైవప్రవక్త.

42. అతను తన తండ్రితో ఇలా అన్నప్పుడు: "ఓ నాన్నా! వినలేని మరియు చూడలేని మరియు నీకు ఏ విధంగానూ సహాయపడలేని వాటిని, నీవెందుకు ఆరాధిస్తున్నావు?

43. ఓ నాన్నా! వాస్తవానికి, నా వద్దకు వచ్చిన జ్ఞానం నీ వద్దకు రాలేదు, కావున నీవు నన్ను అనుసరిస్తే, నేను నీకు సరైన మార్గం చూపుతాను.

44. ఓ నాన్నా! నీవు షైతాన్ ను ఆరాధించకు, నిశ్చయంగా షైతాన్ అనంత కరుణామయుణ్ణి ఉల్లంఘించాడు.

45. ఓ నాన్నా! నిశ్చయంగా, నీవు అనంత కరుణామయుని శిక్షకు గురి అయ్యి, షైతాను యొక్క స్నేహితుడవు/సహచరుడవు (వలి) అయిపోతావేమోనని నేను భయపడు తున్నాను!"

46. (అతని తండ్రి) అన్నాడు: "ఓ ఇబ్రాహీమ్! ఏమీ? నీవు నా దేవుళ్ళకు విముఖత చూపుతున్నావా? ఒకవేళ నీవిది మానుకోక పోతే నేను నిన్ను రాళ్ళు రువ్వి చంపిస్తాను. కావున నీవు నా నుండి చాలా దూరమై పో!"

47. (ఇబ్రాహీమ్) అన్నాడు: "నీకు సలాం![14] నీ కొరకు నా ప్రభువు క్షమాపణను వేడుకుంటాను[15]. నిశ్చయంగా, ఆయన నా యెడల ఎంతో దయాళువు.

48. మరియు నేను మిమ్మల్ని - మరియు అల్లాహ్ కు బదులుగా మీరు ప్రార్థిస్తున్న వాటిని - అందరినీ వదలి పోతున్నాను. మరియు నేను నా ప్రభువును ప్రార్థిస్తాను. నేను నా ప్రభువును ప్రార్థించి విఫలుడను కానని, నమ్ముతున్నాను!"

49. అతను (ఇబ్రాహీమ్) వారిని - మరియు అల్లాహ్ ను వదలి వారు ఆరాధించే వాటిని - వదలి పోయిన తరువాత మేము అతనికి ఇస్ హాఖ్ మరియు

---

[14] ఈ సలాం ఇక నా సంభాషణ ముగిస్తాను, అనే భావంలో ఉంది. ఎందుకంటే దీని ముందు 'అల్' లేదు. ఇంకా ఇటువంటి సందర్భానికి చూడండి, 25:63.

[15] ఈ దు'ఆ - ముష్రిక్ ల కొరకు క్షమాపణ వేడుకోరాదని తెలియక - అల్లాహ్ (సు.తా.) ను, తన తండ్రిని క్షమించమని వేడుకున్నది. కాని ముష్రిక్ కొరకు క్షమాపణ వేడుకోరాదని, తెలిసిన తరువాత, అతని తండ్రి అల్లాహ్ (సు.తా.) కు విరోధుడని స్పష్టమైనప్పుడు, అతను ('అ.స.) తన తండ్రి నుండి దూరమయ్యాడు. అంటే అతని క్షమాపణ కొరకు ప్రార్థించడం మానుకున్నాడు. చూడండి, 9:114.

యఅఖూబ్ లను ప్రసాదించాము. మరియు ప్రతి ఒక్కరినీ ప్రవక్తలుగా చేశాము.

50. మరియు వారికి మా కారుణ్యాన్ని ప్రసాదించాము. వారికి నిజమైన, ఉన్నతమైన కీర్తి ప్రతిష్ఠను కలుగజేశాము.

51. మరియు ఈ గ్రంథం (ఖుర్ఆన్) లో వచ్చిన మూసా గాథను ప్రస్తావించు. నిశ్చయంగా, అతను (అల్లాహ్) ఎన్నుకున్న ఒక సందేశహరుడు మరియు ఒక ప్రవక్త[16].

52. మరియు మేము తూర్ కొండ కుడివైపు నుండి అతనిని (మూసాను) పిలిచి[17], అతనితో ఏకాంతంలో మాట్లాడటానికి మమ్మల్ని సమీపింపజేశాము.

53. మరియు మా కారుణ్యంతో, అతనికి తోడుగా అతని సోదరుడైన, హారూన్ ను కూడా ప్రవక్తగా నియమించాము.

54. మరియు ఈ గ్రంథం (ఖుర్ఆన్) లో వచ్చిన

---

[16] చూడండి, 22:52 రసూలున్: సందేశహరుడు - అంటే అల్లాహ్ (సు.తా.) తన సందేశం అవతరింపజేయటానికి ఎన్నుకున్న ప్రవక్త. సందేశహరునిపై దివ్యగ్రంథం అవతరింపజేయబడుతుంది, ఉదా. మూసా('అ.స.) నబియ్యున్: ప్రవక్త - దివ్యగ్రంథమివ్వబడక అతని కంటే ముందు వచ్చి ఉన్న దివ్యగ్రంథపు సందేశాన్నే ప్రజలకు బోధించేవాడు. ఉదా. హారూన్ ('అ.స.) చూడండి, 19:53. సందేశహరులందరూ ప్రవక్తలే కాని ప్రవక్తలందరూ సందేశరులు కారు.

[17] వివరాల కొరకు చూడండి, 20:9 మరియు దాని తరువాత ఉన్న ఆయతులు.

ఇస్మాయీల్ గాథను ప్రస్తావించు. నిశ్చయంగా, అతను వాగ్దానాలను సత్యం చేసే (నెరవేర్చే) వాడు మరియు ఒక సందేశహరుడు మరియు ఒక ప్రవక్త.

**55.** మరియు అతను తన కుటుంబం వారిని నమాజ్ మరియు విధిదానం (జకాత్) లను పాటించమని ఆజ్ఞాపించేవాడు. మరియు తన ప్రభువుకు ప్రీతిపాత్రుడుగా ఉండేవాడు.

**56.** మరియు ఈ గ్రంథం (ఖుర్ఆన్)లో వచ్చిన ఇద్రీస్ గాథను ప్రస్తావించు. నిశ్చయంగా, అతను సత్యవంతుడైన ప్రవక్త.

**57.** మరియు మేము అతనిని ఉన్నత స్థానానికి ఎత్తాము[18].

**58.** వారందరూ, అల్లాహ్ అనుగ్రహించిన ఆదమ్ సంతతి వారిలోని దైవప్రవక్తలలో కొందరు. మరియు వారిలో కొందరు మేము నూహ్ ఓడలో ఎక్కించపజేసిన వారు, మరికొందరు ఇబ్రాహీమ్ మరియు ఇస్రాయీల్ (యఅఖూబ్) సంతానానికి చెందిన వారున్నారు. మరియు వారిలో మేము

---

[18] ఇద్రీస్ ('అ.స.) ఆదమ్ ('అ.స.) తరువాత వచ్చిన మొదటి ప్రవక్త. ఇతను నూ'హ్ ('అ.స.) లేక అతని తండ్రి యొక్క తాత. ఇస్రాయీ'లీ గాథలలో అతను ఆకాశంలోకి లేపుకోబడ్డారు, అని ఉంది. కాని ఖుర్ఆన్ మరియు 'స'హీ'హ్ 'హదీస్'లు ఈ విషయాన్ని ధృవపరచలేదు. వాస్తవం అల్లాహ్ (సు.తా.)కే తెలుసు. ఇంకా చూడండి, 21:85. ఇతను బైబిల్ లో E'noch గా పేర్కొనబడ్డారు. చూడండి, ఆదికాండము - (Genesis), 5:18-19 మరియు 21-24.

ఎన్నుకొని సన్మార్గం చూపిన వారున్నారు. ఒకవేళ వారికి కరుణామయుని సూచనలు (ఆయాత్) చదివి వినిపించినప్పుడు, వారు విలపిస్తూ సాష్టాంగం (సజ్దా)లో పడి పోయేవారు.

59. కాని వారి తరువాత వచ్చినవారి సంతతివారు కొందరు నమాజ్ లను విడిచిపెట్టి తమ (దుష్ట) మనోవాంఛలను అనుసరించారు. కావున త్వరలోనే వారు అధోగతి (నరకంలో)కి చేరగలరు.

60. కాని ఎవరైతే, పశ్చాత్తాప పడి మరియు విశ్వసించి సత్కార్యాలు చేస్తారో, అలాంటి వారు స్వర్గంలో ప్రవేశిస్తారు మరియు వారి కెలాంటి అన్యాయం జరుగదు.

61. అనంత కరుణామయుడు, తన దాసులకు వాగ్దానం చేసిన అగోచర జగత్తులోని శాశ్వతమైన స్వర్గవనాలు. నిశ్చయంగా ఆయన వాగ్దానం పూర్తయి తీరుతుంది.

62. వారందులో మీకు శాంతి కలుగు గాక (సలాం!) అనడం తప్ప ఇతర ఏ విధమైన వ్యర్థపు మాటలు వినరు. మరియు అందులో వారికి ఉదయం మరియు సాయంత్రం జీవనోపాధి లభిస్తూ ఉంటుంది.

63. మా దాసులలో దైవభీతి గలవారిని వారసులుగా చేసే స్వర్గం ఇదే!

64. (దేవదూతలు అంటారు): "మరియు మేము కేవలం నీ ప్రభువు ఆజ్ఞతో తప్ప క్రిందికి దిగిరాము. మా ముందున్నది, మా వెనుక నున్నది మరియు వాటి మధ్య నున్నదీ, సర్వం ఆయనకు చెందినదే![19] నీ ప్రభువు మరచి పోయేవాడు కాడు.

65. "ఆకాశాలకూ, భూమికీ మరియు వాటి మధ్యనున్న సమస్తానికీ ఆయనే ప్రభువు, కావున మీరు ఆయననే ఆరాధించండి మరియు ఆయన ఆరాధనలోనే స్థిరంగా వుండండి. ఆయనతో సమానమైన స్థాయిగల వానిని ఎవడినైనా మీరెరుగుదురా?"

66. మరియు మానవుడు[20] ఇలా అంటూ ఉంటాడు: "ఏమీ? నేను చనిపోయిన తరువాత మళ్ళీ బ్రతికించబడి లేపబడతానా?"

67. ఏమీ? మునుపు, అతడి ఉనికే లేనప్పుడు, మేము అతనిని సృష్టించిన విషయం అతనికి జ్ఞాపకం రావటం లేదా?"

68. కావున నీ ప్రభువు సాక్షిగా! నిశ్చయంగా, మేము వారందరినీ మరియు (వారితో పాటు) షైతానులను కూడా ప్రోగు చేసి, ఆ తరువాత నిశ్చయంగా, వారందరినీ నరకం చుట్టూ మోకాళ్ళ మీద సమావేశ

[19] ఇటువంటి వాక్యం కొరకు చూడండి, 2:255.
[20] ఇక్కడ మానవుడు అంటే సత్యతిరస్కారుడు, చనిపోయిన తరువాత పునరుత్థానాన్ని మరియు పరలోక ప్రతిఫలాన్ని నమ్మని వాడు.

పరుస్తాము.

69. ఆ తరువాత నిశ్చయంగా, ప్రతి తెగ వారిలో నుండి అనంత కరుణామయునికి ఎవరు ఎక్కువ అవిధేయులుగా ఉండేవారో, వారిని వేరు చేస్తాము[21].

70. అప్పుడు వారిలో (నరకాగ్నిలో) కాలటానికి ఎక్కువ అర్హులెవరో, మాకు బాగా తెలుసు.

71. మరియు మీలో ఎవ్వడునూ దాని (నరకంపై గల వంతెన) మీద నుండి పోకుండా (దాటకుండా) ఉండలేడు. ఇది తప్పించుకోలేని, నీ ప్రభువు యొక్క నిర్ణయం[22].

72. ఆ పిదప మేము దైవభీతి గలవారిని రక్షిస్తాము. మరియు దుర్మార్గులను అందులో మోకాళ్ళ

---

[21] అంటే సత్యతిరస్కారుల నాయకులు, ఎవరైతే దురహంకారంతో సత్యాన్ని తిరస్కరించే వారో వారికి అధిక శిక్ష విధించబడుతుంది.

[22] స'హీ'హ్ 'హదీస్'లో ఈ ఆయత్ వివరాలు ఈ విధంగా వచ్చాయి: నరకం మీద ఒక వంతెన ఉంది. ప్రతి ఒక్కనికి దానిపై నుండి దాట వలసి ఉంటుంది. విశ్వాసులు తమ తమ సత్కార్యాలను బట్టి త్వరత్వరగా లేక నెమ్మదిగా దానిపై నుండి దాటిపోతారు. కొందరు ఏ హానీ కలుగకుండా దాటుతారు. మరికొందరు గాయాలు తగిలి చివరకు దానిని దాటుతారు. మరికొందరు నరకంలో పడిపోతారు. కాని తరువాత సిఫారసు వల్ల దాని నుండి బయటపడి స్వర్గం చేరుకుంటారు. కాని సత్యతిరస్కారులు ఆ వంతెనను దాటలేరు. వారు నరకాగ్నిలో పడిపోతారు. మరొక హదీసు ఇలా ఉంది: 'ఏ విశ్వాసుల ముగ్గురు పిల్లలు యౌవ్వనానికి చేరక ముందే మరణిస్తారో వారిని నరకాగ్ని కేవలం వారి ప్రమాణాలను పూర్తిచేయటానికే తాకుతుంది.' ('స'హీ'హ్ బు'ఖారీ) చూడండి, ఇబ్నె-కసీ'ర్).

మీద పడి ఉండటానికి వదులుతాము.

73. మరియు స్పష్టమైన మా సూచనలను వారికి చదివి వినిపించినపుడు, సత్యతిరస్కారులు విశ్వాసులతో అంటారు: "మన రెండు వర్గాల వారిలో ఎవరి వర్గం మంచి స్థితిలో ఉంది మరియు ఎవరి సభ ఉత్తమమైనది?"[23]

74. మరియు వారికి ముందు మేము ఎన్నో తరాలను (వంశాలను) నాశనం చేశాము; వారు వీరి కంటే ఎక్కువ సిరిసంపదలు మరియు బాహ్యా ఆడంబరాలు గలవారై ఉండిరి?

75. వారితో అను: "మార్గభ్రష్టత్వంలో పడివున్నవానికి, అనంత కరుణామయుడు, ఒక సమయం వరకు వ్యవధి నిస్తూ ఉంటాడు. తుదకు వారు తమకు వాగ్దానం చేయబడిన దానిని చూసినపుడు, అది (కఠినమైన) శిక్షనో కావచ్చు లేదా అంతిమ ఘడియనో కావచ్చు! హీనస్థితిలో ఉన్నవాడెవడో మరియు బలహీనవర్గం (సేన) ఎవరిదో వారికి

[23] సత్యతిరస్కారులైన ఖురైషులు - పేద ముస్లింలు అయిన 'అమ్మార్, బిలాల్ 'సుహైబ్ (ర.'ది. 'అ.) లను మరియు వారి సమావేశ స్థలాలైన దారుష్షూరా' మరియు దారుల్-అ'ర్ఖమ్ లను - అబూ జహల్, న'దర్ బిన్ 'హారిస్, 'ఉత్బా, షైబా, వంటి ధనవంతుల మరియు వారి పెద్ద పెద్ద భవనాల మరియు వారు సమావేశాలు చేసే దారున్నద్వాలతో పోల్చి తమ భౌతిక ఉన్నత స్థాయికి గర్వించేవారు మరియు పునరుత్థానాన్ని తిరస్కరించేవారు. మనం జీవించేది ఈ భూలోక జీవితం మాత్రమేనని వాదులాడే వారు. కాని వారికి ముందున్న వారు, వారి కంటే ఎక్కువ సిరిసంపదలున్నా నాశనం చేయబడ్డారనే విషయాన్ని మరచిపోయే వారు. చూడండి, 19:74

తెలియగలదు!

76. మరియు (దానికి ప్రతిగా) మార్గదర్శకత్వం పొందిన వారికి, అల్లాహ్ మార్గదర్శకత్వంలో వృద్ధిని ప్రసాదిస్తాడు. చిరస్థాయిగా ఉండిపోయే సత్కార్యాలే, "నీ ప్రభువు దగ్గర ప్రతిఫలం రీత్యా ఉత్తమమైనవి మరియు పర్యవసానం దృష్ట్యా కూడా ఉత్తమమైనవి[24]."

77. ఏమీ? మా సూచనలను తిరస్కరించి: "నిశ్చయంగా, నాకు ధనసంపదలూ మరియు సంతానం ఇవ్వబడుతూనే ఉంటాయి." అని పలికే వానిని నీవు చూశావా?

78. ఏమీ? అతడు అగోచరాన్ని చూశాడా? లేదా అనంత కరుణామయుని వాగ్దానం పొందాడా?

79. అలా కాదు! అతడు చెప్పేది, మేము వ్రాసి పెట్టగలము. మరియు అతడి శిక్షను మరింత పెంచగలము.

80. మరియు అతడు చెప్పే వస్తువులకు మేమే వారసులమవుతాము మరియు అతడు ఒంటరిగానే మా వద్దకు వస్తాడు.

81. మరియు వారు అల్లాహ్ ను వదిలి ఇతరులను ఆరాధ్య దైవాలుగా చేసుకున్నారు, వారు వీరికి అండగా ఉంటారనుకొని!

82. అలాకాదు! వారు(ఆదైవాలు)వీరి ఆరాధనను

[24] చూడండి, 18:46.

నిరాకరించటమేగాక, వీరికి విరోధులుగా ఉంటారు

83. ఏమీ? నీకు తెలియదా? నిశ్చయంగా మేము సత్యతిరస్కారులపై షైతానులను వదిలామని? అవి వారిని (సత్యాన్ని తిరస్కరించమని) అత్యధికంగా ప్రేరేపిస్తూ ఉంటాయని?[25]

84. కావున వారి మీద (శిక్షను) అవతరింప జేయమని నీవు తొందర పెట్టకు. నిశ్చయంగా, మేము (వారి దినాలను) ఖచ్చితంగా లెక్క పెడుతున్నాము.

85. ఆ రోజు మేము దైవభీతి గలవారిని అనంత కరుణామయుని సన్నిధిలో అతిథులుగా ప్రవేశపెడతాము.

86. మరియు అపరాధులను దప్పిక గొన్న వాటి వలే (జంతువుల వలే), నరకం వైపునకు తోలుకొని పోతాము.

87. (ఆనాడు) అనంత కరుణామయుని అనుమతి పొందినవాడు తప్ప మరెవ్వరికీ సిఫారసు చేసే అధికారం ఉండదు[26].

88. వారిలా అన్నారు: "అనంతకరుణామయునికి కొడుకున్నాడు[27]."

---

[25] షై'తాన్ చివరకు ఎలాంటి బాధ్యత వహించడు. దానికి చూడండి, 14:22.

[26] సిఫారసు చేసే అనుమతి అల్లాహుతా'ఆలా తాను కోరిన వారికే ఇస్తాడు. చూడండి 10:3, 21:28, 53:26

[27] ప్రవక్తలకు దైవత్వం అంటగట్టడం అల్లాహ్ (సు.తా.) తో సంబంధం తెంపుకోవటమే. మరియు ఇది క్షమింపబడని మహా పాపం. చూడండి, 4:48.

**89.** వాస్తవానికి, మీరు ఎంత పాపిష్ఠికరమైన విషయాన్ని కల్పించారు.

**90.** దాని వలన ఆకాశాలు ప్రేలి పోవచ్చు! భూమి చీలి పోవచ్చు! మరియు పర్వతాలు ధ్వంసమై పోవచ్చు!

**91.** ఎందుకంటే వారు అనంత కరుణామయునికి కొడుకున్నాడని ఆరోపించారు[28].

**92.** ఎవరినైనా కొడుకునిగా చేసుకోవటం అనంత కరుణామయునికి తగినది కాదు.

**93.** ఎందుకంటే! భూమ్యాకాశాలలో నున్న వారందరూ కేవలం అనంత కరుణామయుని దాసులుగా మాత్రమే హాజరు కానున్నారు[29].

**94.** వాస్తవానికి, ఆయన అందరినీ పరివేష్టించి ఉన్నాడు మరియు వారిని సరిగ్గా లెక్క పెట్టి ఉన్నాడు.

**95.** మరియు పునరుత్థాన దినమున వారందరూ,

---

[28] చూడండి 42:11: 'ఆయనను పోలిన వస్తువు ఏదీ లేదు.' అనే ఖుర్ఆన్ ఆయత్ అల్లాహ్ (సు.తా.)కు సంతానం లేదు అనే విషయాన్ని స్పష్టపరుస్తోంది. ఇంకా చూడండి, 112:4 మరియు 6:100: 'మరియు ఆయ(సు.తా.)తో పోల్చదగినది ఏదియూ లేదు.' సంతానమనేది ఇంద్రియ సంబంధమైనది. కావున దీనిని అల్లాహ్ (సు.తా.)కు అంటగట్టడం ఘోరపాపం.

[29] మానవులు కానీ, దైవదూతలు కానీ, జిన్నాతులు కానీ, అందరూ ఆయన (సు.తా.) సృష్టించిన వారే, కావున వారికి ఆయన దైవత్వంలో ఎలాంటి భాగం లేదు. వారంతా ఇష్టంతో గానీ అయిష్టంతో గానీ ఆయన ఇచ్ఛను శిరసావహించవలసిందే. చూడండి, 13:15, 16:48-49.

ఒంటరిగానే ఆయన ముందు హాజరవుతారు[30].

96. నిశ్చయంగా, విశ్వసించి సత్కార్యాలు చేసే వారి పట్ల అనంత కరుణామయుడు (ప్రజల హృదయాలలో) ప్రేమను (వాత్సల్యాన్ని) కలుగజేయగలడు.

97. కావున నీవు (ఓ ప్రవక్తా!) దైవభీతి గలవారికి శుభవార్త నివ్వటానికి మరియు వాదులాడే జాతి వారిని హెచ్చరించటానికీ, మేము దీనిని (ఈ ఖుర్ఆన్ ను) సులభతరం చేసి, నీ భాషలో అవతరింపజేశాము[31].

98. మరియు వీరికి పూర్వం మేము ఎన్ని తరాల వారిని నాశనం చేయలేదు! ఏమీ? నీవు ఇప్పుడు వారిలో ఏ ఒక్కరినైనా చూస్తున్నావా? లేక వారి మెల్లని శబ్దమైనా వింటున్నావా?

---

[30] అక్కడ ధన సంపత్తులు గానీ, సంతానం గానీ ఏ విధంగానూ పనికిరావు. చూడండి, 26:88

[31] మానవుడు అల్లాహ్ (సు.తా.) మాటలను అర్థం చేసుకోవటానికి ఆయన దివ్యగ్రంథాలను ఆ ప్రాంతపు ప్రజల భాషలోనే అవతరింపజేశాడు, చూడండి, 14:4 మరియు ము'హమ్మద్ ('స'అస) పై ఈ ఖుర్ఆన్ అవతరణ కొరకు చూడండి, 2:97 మరియు 26:193-194.

# 20. తా హా్

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. తా హా్![1]
2. మేము ఈ ఖుర్ఆన్ ను నీపై అవతరింపజేసింది నిన్ను కష్టానికి గురిచేయటానికి కాదు[2].
3. కేవలం (అల్లాహ్ కు) భయపడే వారికి హితబోధ చేయటానికే!
4. ఇది (ఈ ఖుర్ఆన్) భూమినీ మరియు అత్యున్నతమైన ఆకాశాలనూ సృష్టించిన ఆయన (అల్లాహ్) తరఫు నుండి క్రమక్రమంగా అవతరింపజేయబడింది.
5. ఆ కరుణామయుడు, సింహాసనం (అర్ష్)పై ఆసీనుడై ఉన్నాడు[3].
6. ఆకాశాలలోనూ మరియు భూమిలోనూ మరియు ఆ రెండింటి మధ్యనూ, ఇంకా నేల క్రిందనూ ఉన్న[4], సమస్తమూ ఆయనకు చెందినదే.
7. మరియు నీవు బిగ్గరగా మాట్లాడితే (ఆయన

---

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

[2] చూడండి, 18:6.

[3] తన గొప్పతనానికి అనుగుణంగా అల్లాహ్ (సు.తా.) 'అర్ష్ (విశ్వసామ్రాజ్యాధిపత్య పీఠం)పై అధిష్ఠుడై ఉన్నాడు. కాని ఎట్లు, ఏ విధంగా ఎవ్వరికీ తెలియదు.

[4] అస్-స'రా: అంటే భూమిలోని లోతైన భాగంలో, అంటే సర్వం ఆయనకు చెందిందే!

వినసే వింటాడు); వాస్తవానికి, ఆయనకు రహస్యంగా (చెప్పుకునే మాటలే గాక) అతి గోప్యమైన మాటలు కూడా, తెలుస్తాయి[5].

8. అల్లాహ్! ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయనకు అత్యుత్తమమైన పేర్లు ఉన్నాయి[6].

9. ఇక మూసా వృత్తాంతం నీకు అందిందా?[7]

10. అతను ఒక మంటను చూసినపుడు తన ఇంటి వారితో ఇలా అన్నాడు[8]: "ఆగండి! నిశ్చయంగా, నాకొక మంట కనబడుతోంది; బహుశా నేను దాని

---

[5] అల్లాహ్ (సు.తా.) ను పెద్ద స్వరంతో అర్థించే అవసరం లేదు. ఎందుకంటే ఆయన అతి రహస్య విషయాలను కూడా తెలుసుకుంటాడు. ఆయనకు మానవుల భవిష్యత్తు కూడా తెలుసు. అది ఆయన దగ్గర వ్రాయబడి ఉంది! ఆయనకు జరిగిపోయిందే గాక, జరుగుతున్నది మరియు ముందు జరగబోయేది అన్నీ తెలుసు. అంటే పునరుత్థాన దినం వరకు మరియు ఆ తరువాత కూడా ఎల్లప్పుడూ జరుగబోయే అన్ని విషయాల జ్ఞానం కేవలం అల్లాహ్ (సు.తా.) కే ఉంది మరియు ఇతరులకు ఎవ్వరికీ లేదు. అంటే దైవప్రవక్తలు, దైవదూత ('అలైహిమ్.స.)లకు మరియు జిన్నాతులకు కూడా లేదు.

[6] "అల్లాహ్ (సు.తా.) యొక్క అత్యుత్తమ పేర్లు" (అల్-అస్మా'ఉ'ల్-'హుస్నా). ఈ శబ్దం ఖుర్ఆన్ లో నాల్గుసార్లు వచ్చింది. 7:180, 17:110, 59:24 మరియు ఇక్కడ.

[7] మూసా (అ.స.) వృత్తాంతం, 7, 17, 18 మరియు 28 సూరాహ్ లలో వచ్చింది. ఈ సూరహ్ లో 9-98 ఆయత్ లలో కొన్ని వివరాలున్నాయి.

[8] మూసా ('అ.స.) కొన్ని సంవత్సరాలు ఆయ్ కహ్ లో గడిపిన తరువాత - తన భార్యా పిల్లలతో సహా - తన తల్లి, సోదరుడు హారూన్ ('అ.స.) మరియు తన జాతి వారి వద్దకు వెళ్ళటానికి బయలుదేరుతారు. సినాయి ద్వీపకల్పం దక్షిణ ప్రాంతం గుండా ప్రయాణం చేస్తున్నప్పుడు ఈ విషయం సంభవిస్తుంది. ఇంకా చూడండి, 27:78 మరియు 28:29.

నుండి మీ కొరకు ఒక కొరివిని తీసుకొని వస్తాను
లేదా ఆ మంట దగ్గర, నాకేదైనా మార్గదర్శకత్వం
లభించ వచ్చు!"

11. అతను దాని దగ్గరకు చేరినప్పుడు ఇలా పిలువబడ్డాడు[9]: "ఓ మూసా!

12. నిశ్చయంగా, నేనే నీ ప్రభువును, కావున నీవు నీ చెప్పులను విడువు. వాస్తవానికి, నీవు పవిత్రమైన తువా[10] లోయలో ఉన్నావు.

13. మరియు నేను నిన్ను (ప్రవక్తగా) ఎన్నుకున్నాను. నేను నీపై అవతరింపజేసే దివ్యజ్ఞానాన్ని (వహీని) జాగ్రత్తగా విను.

14. నిశ్చయంగా, నేనే అల్లాహ్ ను! నేను తప్ప మరొక ఆరాధ్యుడు లేడు, కావున నన్నే ఆరాధించు మరియు నన్ను స్మరించడానికి నమాజ్ ను స్థాపించు.

15. నిశ్చయంగా, తీర్పు ఘడియ రానున్నది, ప్రతి వ్యక్తి తాను చేసిన కర్మల ప్రకారం ప్రతిఫలం పొందటానికి; నేను దానిని గోప్యంగా ఉంచాలని నిర్ణయించాను[11].

16. కావున దానిని విశ్వసించకుండా, తన మనోవాంఛలను అనుసరించేవాడు, నిన్ను దాని (ఆ ఘడియ చింత) నుండి మరలింపనివ్వరాదు; అలా అయితే నీవు

---

[9] మూసా ('అ.స.) అక్కడికి చేరుకున్న తరువాత ఒక వృక్షం వెలుగుతో నిండి ఉంటుంది. దాని నుండి ఈ విధంగా పిలువబడతారు. చూడండి, 28:30.

[10] 'తువా - ఆ లోయ పేరు.

[11] చూడండి, 53:39.

నాశనానికి గురి కాగలవు.

17. మరియు ఓ మూసా! నీ కుడిచేతిలో ఉన్నది ఏమిటి?"

18. (మూసా) అన్నాడు: "ఇది నా చేతికర్ర, దీనిని ఆనుకొని నిలబడతాను మరియు దీనితో నా మేకల కొరకు ఆకులు రాల్చుతాను. మరియు దీని నుండి నాకు ఇంకా ఇతర ఉపయోగాలు కూడా ఉన్నాయి."

19. (అల్లాహ్) అన్నాడు: "ఓ మూసా! దానిని భూమి మీద పడవేయి."

20. అప్పుడు అతను దానిని పడవేశాడు. వెంటనే అది పాముగా[12] మారిపోయి చురుకుగా చలించసాగింది.

21. (అల్లాహ్) ఆజ్ఞాపించాడు: "దానిని పట్టుకో, భయపడకు. మేము దానిని దాని పూర్వస్థితి లోకి మార్చుతాము.

22. మరియు నీ చేతిని చంకలో పెట్టి తీయి, దాని కెలాంటి బాధ కలుగకుండా, అది తెల్లగా మెరుస్తూ బయటికి వస్తుంది[13], ఇది రెండవ అద్భుత సూచన!

23. ఇదంతా మేము నీకు మా గొప్ప సూచనలను చూపటానికి!

---

[12] ఇక్కడ (20:20లో) 'హయ్యతున్ అని, 27:10, 28:31లలో జాన్నున్ అని, 7:107లో సు"అబానున్ అని ఉంది. సందర్భాన్ని బట్టి దానిని మార్చబడింది.

[13] చూడండి, 7:108, 28:32.

24. నీవు ఫిర్ఔన్ వద్దకు పో! నిశ్చయంగా అతడు మితిమీరి పోయాడు[14]."
25. (మూసా) ఇలా మనవి చేసుకున్నాడు: "ఓ నా ప్రభూ! నా హృదయాన్ని వికసింపజేయి.
26. మరియు నా వ్యవహారాన్ని నా కొరకు సులభం చేయి.
27. నా నాలుకలోని ముడిని (ఆటంకాన్ని) తొలగించు.
28. (దానితో) వారు నా మాటలను సులభంగా అర్థం చేసుకోవటానికి.
29. మరియు నా కొరకు నా కుటుంబం నుండి ఒక సహాయకుణ్ణి నియమించు[15].
30. నా సోదరుడైన హారూన్ ను.
31. అతని ద్వారా నా బలాన్ని దృఢపరచు.
32. మరియు అతనిని నా వ్యవహారంలో సహాయకారిగా (భాగస్వామిగా) చేయి.
33. మేము నీ పవిత్రతను బాగా కొనియాడటానికి;
34. మరియు నిన్ను అత్యధికంగా స్మరించటానికి;
35. నిశ్చయంగా, నీవు మమ్మల్ని ఎల్లప్పుడూ కని పెట్టుకునే ఉంటావు!"
36. (అల్లాహ్) సెలవిచ్చాడు: "ఓ మూసా! వాస్తవంగా, నీవు కోరినదంతా నీకు ఇవ్వబడింది.

---

[14] ఫిర్'ఔన్ తనను తాను ఆరాధ్యదైవంగా చేసుకున్నాడు. చూడండి, 28:38 మరియు 79:24, 'నేనే మీ ప్రభువును' అని అనేవాడు.

[15] వ'జీరున్: భారం మోసేవాడు, మంత్రి, రాజు యొక్క రాజకీయ భారాన్ని పంచుకునేవాడు.

**37.** మరియు వాస్తవానికి మేము నీకు మరొకసారి ఉపకారం చేశాము[16].

**38.** అప్పుడు మేము నీ తల్లికి ఇవ్వవలసిన ఆ సూచనను ఈ విధంగా సూచించాము:

**39.** ఇతనిని (ఈ బాలుణ్ణి) ఒక పెట్టెలో పెట్టి దానిని (ఆ పెట్టెను) నదిలో విడువు. నది దానిని ఒక ఒడ్డుకు చేర్చుతుంది; దానిని నాకు మరియు ఇతనికి శత్రువు అయిన వాడు తీసుకుంటాడు; మరియు నేను నా తరఫు నుండి నీ మీద ప్రేమను కురిపించాను మరియు నిన్ను నా కంటి ముందు పోషింపబడేటట్లు చేశాను[17].

**40.** అప్పుడు నీ సోదరి (నిన్ను) అనుసరిస్తూ పోయి, వారితో ఇలా అన్నది: 'ఇతనిని పెంచి పోషించగల ఒకామెను నేను మీకు చూపనా?'[18] ఈ విధంగా మేము నిన్ను మళ్ళీ నీ తల్లి దగ్గర కు చేర్చాము, ఆమె కళ్ళకు చల్లదనమివ్వటానికి, ఆమెను దుఃఖపడకుండా ఉంచటానికి[19]. మరియు నీవొక వ్యక్తిని చంపావు[20], మేము ఆ ఆపద నుండి నీకు విముక్తి కలిగించాము. మేము నిన్ను అనేక విధాలుగా పరీక్షించాము[21]. ఆ తరువాత నీవు ఎన్నో సంవత్సరాలు మద్'యన్

---

[16] ఈ వివరాలకు చూడండి, 28:3-21.
[17] చూడండి, 79:24 మరియు 28:9.
[18] వివరాలకు చూడండి, 28:12.
[19] చూడండి, 28:12-13.
[20] చూడండి, 28:14.
[21] చూడండి, 28:15-21.

వారితో ఉంటివి[22]. ఓ మూసా! ఇప్పుడు నీవు (మా) నిర్ణయానుసారంగా (ఇక్కడికి) వచ్చావు.

41. మరియు నేను నిన్ను నా (సేవ) కొరకు ఎన్నుకున్నాను.

42. నీవు మరియు నీ సోదరుడు నా సూచనలతో వెళ్ళండి. నన్ను స్మరించటంలో అశ్రద్ధ వహించకండి[23].

43. మీరిద్దరు ఫిర్ఔన్ దగ్గరకు వెళ్ళండి. అతడు మితమీరి ప్రవర్తిస్తున్నాడు.

44. కాని అతనితో మృదువుగా మాట్లాడండి. బహుశా అతడు హితబోధ స్వీకరిస్తాడేమో, లేదా భయపడతాడేమో!"[24]

45. (మూసా మరియు హారూన్) ఇద్దరూ ఇలా అన్నారు: "ఓ మా ప్రభూ! వాస్తవానికి, అతడు మమ్మల్ని శిక్షిస్తాడేమోనని, లేదా తలబిరుసుతనంతో ప్రవర్తిస్తాడేమోనని మేము భయపడు తున్నాను!"

46. (అల్లాహ్) సెలవిచ్చాడు: "మీరిద్దరు భయపడకండి,

---

[22] చూడండి, 28:22-28.

[23] ఇక్కడ అల్లాహ్ (సు.తా.) వైపుకు ఆహ్వానించే దా'ఈలకు ఎల్లప్పుడూ అల్లాహ్ (సు.తా.)ను స్మరిస్తూ ఉండాలనే సూచన ఉంది.

[24] అల్లాహ్ (సు.తా.)కు తెలుసు అతడు హితబోధ స్వీకరించడని, కాని మూసా (అ.స.)కు ఏమీ తెలియదు. ఎందుకంటే ప్రవక్తలు కూడా మానవులే. వారికి అల్లాహ్ (సు.తా.) తెలిపేది తప్ప ఇతర అగోచర విషయాల జ్ఞానం ఉండదు. ఇదే అల్లాహ్(సు.తా.) ఇచ్ఛ. దీని వల్ల ప్రవక్త ప్రతి వానిని: 'అల్లాహ్ (సు.తా.) మార్గం వైపునకు, సత్యమార్గం వైపునకు, మోక్షం పొందటానికి రండి.' అని ఆహ్వానిస్తుంటాడు. అదే ప్రవక్త బాధ్యత. ఇందులో దా'ఈలు మృదువుగా వ్యవహరించాలనే సూచన కూడా ఉంది.

నిశ్చయంగా, మీరిద్దరితో పాటు నేనూ ఉన్నాను. నేను అంతా వింటూ ఉంటాను మరియు అంతా చూస్తూ ఉంటాను.

**47.** కావున మీరిద్దరూ అతని వద్దకు పోయి ఇలా అనండి: "నిశ్చయంగా, మేమిద్దరం నీ ప్రభువు యొక్క సందేశహరులము. కావున ఇస్రాయీల్ సంతతి వారిని మా వెంట పోనివ్వు[25]. మరియు వారిని బాధ పెట్టకు. వాస్తవానికి మేము నీ వద్దకు నీ ప్రభువు తరఫు నుండి సూచనలు తీసుకొని వచ్చాము. మరియు సన్మార్గాన్ని అనుసరించే వానిపై (అల్లాహ్ తరపు నుండి) శాంతి వర్ధిల్లుతుంది![26]

**48.** "'నిశ్చయంగా, ఎవడైతే సత్యాన్ని తిరస్కరించి వెనుదిరిగి పోతాడో, అతనికి కఠినశిక్ష తప్పక ఉంటుంది' అని వాస్తవానికి మాకు దివ్యజ్ఞానం (వహీ) ద్వారా తెలుపబడింది."

**49.** (ఫిర్ఔన్) అన్నాడు: "ఓ మూసా! మీ ఇరువురి ప్రభువు ఎవరు?"

**50.** (మూసా)జవాబిచ్చాడు: "ప్రతిదానికి దాని రూపాన్నిచ్చి, తరువాత దానికి మార్గదర్శకత్వం చేసేవాడే మా ప్రభువు."

---

[25] వివరాలకు చూడండి, 2:49, 7:141, 14:6.

[26] వస్సలాము 'అలా మనిత్తబ'ల్ హుదా! దైవప్రవక్త ('స'అస) రోమన్‌చక్రవర్తికివ్రాసినఉత్తరాన్ని ఈపైవాక్యంతో ప్రారంభించారు, (ఇబ్నె-కసీ'ర్).దీనితోస్పష్టమయ్యేదిఏమిటంటేముస్లిమేతరుల సభలో లేక ఉత్తరం ద్వారా సంభాషణ ప్రారంభించునప్పుడు ఈ శబ్దాలను వాడాలి.

51. (ఫిర్ఔన్) అన్నాడు: "అయితే పూర్వం గతించిన తరాల వారి సంగతి ఏమిటి?"

52. (మూసా) జవాబిచ్చాడు: "వాటి జ్ఞానం నా ప్రభువు వద్ద ఒక గ్రంథంలో (వ్రాయబడి) వుంది. నా ప్రభువు పొరపాటు చేయడు మరియు మరువడు కూడాను."

53. ఆయనే మీ కొరకు భూమిని చదునుగా (పరుపుగా) జేసి, అందులో మీకు (నడవటానికి) త్రోవలను ఏర్పరిచాడు. మరియు ఆకాశం నుండి నీటిని కురిపించాడు. మేము దాని ద్వారా రకరకాల వృక్షకోటిని పుట్టించాము[27].

54. మీరు వాటిని తినండి మరియు మీ పశువులకు మేపండి. నిశ్చయంగా, అర్థం చేసుకో గల వారికి ఇందులో అనేక సూచనలున్నాయి.

55. దాని (ఆ మట్టి) నుంచే మిమ్మల్ని సృష్టించాము, మరల మిమ్మల్ని దానిలోకే చేర్చుతాము మరియు దాని నుంచే మిమ్మల్ని మరొకసారి లేవుతాము[28].

56. మరియు వాస్తవానికి, మేము అతనికి (ఫిర్ఔన్ కు) మా సూచనలన్నీ చూపాము, కాని అతడు

---

[27] అ'జ్వాజున్: ఇక్కడ దీని అర్థం వివిధ రకాలు. ఇదే అర్థం 13:3లో కూడా ఉంది.

[28] మానవుణ్ణి మట్టి నుండి సృష్టించాము. వివరాలకు చూడండి, 3:59లో తురాబ్ మరియు 15:26లో 'స'ల్సాలిన్ 'హమఇన్ మస్నూన్. ఇబ్నె మాజా ఉల్లేఖనం: ఒక మృతుణ్ణి సమాధిలో పెట్టిన తరువాత రెండు చేతులతో మూడు సార్లు మట్టి పోయడం అభిలషణీయం (ముస్త'హబ్).

వాటినిఅబద్ధాలన్నాడుమరియుతిరస్కరించాడు.

57. (ఫిర్ఔన్) ఇలా అన్నాడు: "ఓ మూసా! నీవు నీ మంత్రజాలంతో మమ్మల్ని మా దేశం నుండి వెడల గొట్టటానికి మా వద్దకు వచ్చావా?[29]

58. సరే! మేము కూడా దాని వంటి మంత్రజాలాన్ని నీకు పోటీగా తెస్తాము; కావున మా మధ్య నీ మధ్య (సమావేశానికి) ఒక సమయం మరియు స్థలాన్ని నిర్ణయించు. దాని నుండి మేము కానీ నీవు కానీ వెనుకాడ కూడదు. మరియు అదొక యుక్తమైన స్థలమై ఉండాలి."

59. (మూసా) అన్నాడు: "మీతో సమావేశం ఉత్సవ దినమున నియమించుకుందాము. ప్రొద్దెక్కే వరకు ప్రజలందరూ సమావేశమై ఉండాలి."

60. ఆ పిదప ఫిర్ఔన్ వెళ్ళిపోయి తన తంత్ర సామగ్రిని సమీకరించుకొని తిరిగి వచ్చాడు[30].

61. మూసావారితోఅన్నాడు:"మీరునాశనమవుగాక! అల్లాహ్ పై అబద్ధాలు కల్పించకండి! అలా చేస్తే ఆయన కఠినశిక్షతో మిమ్మల్ని నిర్మూలించవచ్చు! (అల్లాహ్ పై) అబద్ధాలు కల్పించేవాడు తప్పక విఫలుడవుతాడు."

62. (ఇది విన్న) తరువాత వారు ఆ విషయాన్ని గురించి తర్కించుకున్నారు, కాని తమ చర్చను రహస్యంగానే సాగించారు.

63. (వారు పరస్పరం ఈ విధంగా) మాట్లాడుకున్నారు:

---

[29] చూడండి, 7:110.
[30] చూడండి, 7:111-114.

"వాస్తవానికి వీరిద్దరూ మాంత్రికులే! వీరిద్దరు తమ మంత్రజాలంతో మిమ్మల్ని మీ దేశం నుండి వెడల గొట్టి, మీ ఆదరణీయమైన విధానాన్ని అంతమొందించ గోరుతున్నారు[31].

**64.** కావున మీరు మీ యుక్తులను సమీకరించుకొని సమైక్యంగా (రంగంలోకి) దిగండి. ఈనాడు ప్రాబల్యం పొందిన వాడే, వాస్తవానికి సాఫల్యం (గెలుపు) పొందిన వాడు[32]."

**65.** వారు (మాంత్రికులు) ఇలా అన్నారు: "ఓ మూసా! నీవు విసురుతావా, లేదా మేము మొదట విసరాలా?"

**66.** (మూసా) అన్నాడు: "లేదు! మీరే (ముందు) విసరండి!" అప్పుడు ఆకస్మాత్తుగా వారి త్రాళ్ళు మరియు వారి కర్రలూ - వారి మంత్రజాలం వల్ల - అతనికి (మూసాకు) చలిస్తూ ఉన్నట్లు కనిపించాయి[33].

**67.** దానితో మూసాకు, తన మసనస్సులో కొంత భయం కలిగింది[34].

---

[31] ఏ విధంగానైతే ఈ రోజు కూడా అసత్య మార్గం మీద, షిర్కులో మునిగి ఉన్న వారు కూడా తామే సరైన మార్గం మీద ఉన్నామని గర్విస్తారో అదే విధంగా వారూ గర్వించారు. చూడండి, 30:32.

[32] చూడండి, 7:113-114.

[33] ఇక్కడ: 'వారి త్రాళ్ళు మంత్రజాలం వల్ల చలిస్తున్నట్లు,' అని ఉంది. అంటే అవి పాములుగా కనిపించాయే, గానీ వాస్తవానికి పాములుగా మారలేదు. దీనితో విశదమయ్యేది ఏమిటంటే మంత్రజాలం (మిస్మరిస్మ్), మంత్రప్రభావం వల్ల తాత్కాలికంగా ప్రజలకు అలా కనిపిస్తుందే కానీ నిజానికి ఏమార్పూరాదు

[34] చూడండి, 7;116.

**68.** మేము (అల్లాహ్) అన్నాము: "భయపడకు! నిశ్చయంగా నీవే ప్రాబల్యం పొందుతావు[35].

**69.** నీ కుడిచేతిలో ఉన్నదానిని విసురు! అది వారు కల్పించిన వాటిని మ్రింగి వేస్తుంది. వారు కల్పించినది నిశ్చయంగా, మాంత్రికుని తంత్రమే! మరియు మాంత్రికుడు ఎన్నడూ సఫలుడు కానేరడు. వాడు ఎటు నుంచి, ఎలా వచ్చినా సరే!"

**70.** అప్పుడు ఆ మాంత్రికులు సాష్టాంగం (సజ్దా)లో పడుతూ అన్నారు: "మేము హారూన్ మరియు మూసాల ప్రభువును విశ్వసించాము[36]."

**71.** (ఫిర్ఔన్) అన్నాడు: "నేను అనుమతించక ముందే, మీరు ఇతనిని విశ్వసించారా?[37] నిశ్చయంగా, ఇతనే మీకు మంత్రజాలం నేర్పిన గురువు! కావున ఇప్పుడు నేను మీ అందరి చేతులను మరియు కాళ్ళను వ్యతిరేక పక్షల

---

[35] మూసా('అ.స.) భయపడటానికి కారణం అతను కూడా ఒక మానవుడే. ప్రవక్త('అలైహిమ్. స.)లు అందరూ మానవులే కాని వారిపై దివ్యజ్ఞానం (వ'హీ) అవతరింపజేయబడుతుంది. అల్లాహ్ (సు.తా.) తెలిపినది తప్ప, వేరే అగోచర జ్ఞానం గానీ, భవిష్యత్తులో జరుగబోయే వాటి జ్ఞానం గానీ వారికి ఉండదు. అల్లాహ్ (సు.తా.): 'భయపడకు నీవే ఆధిక్యత వహిస్తావు.' అని అన్నప్పుడు అతనికి ధైర్యం వచ్చింది. అంటే అద్భుత సూచనలు చూపటం కూడా అల్లాహ్ (సు.తా.) చేతిలోనే ఉంది. ప్రవక్తలు ఏదైనా అద్భుత విషయం జరిగే వరకు, అది జరుగనున్నదని ఎరగరు. అంటే వారికెలాంటి అగోచర జ్ఞానం ఉండదు.

[36] చూడండి, 7:117-120.

[37] చూడండి, 71:23.

నుండి నరికిస్తాను[38] మరియు మిమ్మల్ని అందరినీ, ఖర్జూరపు దూలాల మీద సిలువ (శూలారోహణ) చేయిస్తాను. అప్పుడు మా ఇద్దరి లో ఎవరి శిక్ష ఎక్కువ కఠినమైనదో మరియు దీర్ఘకాలికమైనదో మీకు తప్పక తెలియ గలదు."

**72.** వారు (మాంత్రికులు) అన్నారు: "మా వద్దకు వచ్చిన స్పష్టమైన సూచనలను మరియు మమ్మల్ని సృజించిన ప్రభువు (అల్లాహ్)ను వదలి, మేము నీకు ప్రాధాన్యతనివ్వం. నీవు చేయ దలచుకున్నది చేసుకో! నీవు కేవలం ఐహిక జీవితాన్ని మాత్రమే అంతమొందించ గలవు[39].

**73.** నిశ్చయంగా, మేము మా ప్రభువునందే విశ్వాసముంచాము, ఆయన (అల్లాహ్) యే మా తప్పులను మరియు నీవు బలవంతంగా మా చేత చేయించిన మంత్రతంత్రాలను క్షమించేవాడు. (ప్రతి ఫలమివ్వటంలో) అల్లాహ్ యే సర్వశ్రేష్ఠుడు మరియు శాశ్వతంగా

---

[38] అంటే కుడిచేయి ఎడమకాలు.

[39] ఇక్కడ మాంత్రికులు అవిశ్వాసులుగా ఉన్నప్పుడు ఫిర్'ఔన్ ను సంతోషపరచటంలో నిమగ్నులై ఉండిరి. ప్రాపంచిక వ్యామోహంలో పడి ఉండిరి, కాబట్టి: 'మేము గెలిస్తే మాకు బహుమానం దొరుకుతుంది కదా?' అని అడిగారు. కాని వారికి మార్గదర్శకత్వం దొరికి మూసా ('అ.స.) ఆరాధించే ప్రభువే నిజమైన ప్రభువు అని తెలిసినప్పుడు, వారు అల్లాహ్ (సు.తా.) సాన్నిధ్యాన్ని పొందటానికి ఇహలోక భోగభాగ్యాలనే కాదు, తమ జీవితాలను కూడా కోల్పోవటానికి సిద్ధపడ్డారు. ఎంత గొప్ప దైవభీతిని (తఖ్వా) కనబరచారో చూడండి.

ఉండేవాడు (నిత్యుడు)[40] ."

74. నిశ్చయంగా, తన ప్రభువు ముందు పాపాత్ముడిగా హాజరయ్యే వాడికి తప్పక నరకం గలదు. అందులో వాడు చావనూ లేడు, బ్రతకనూ లేడు!

75. ఎవడైతే విశ్వాసిగా హాజరవుతాడో మరియు సత్కార్యాలు చేసి ఉంటాడో[41], అలాంటి వారికి ఉన్నత స్థానాలుంటాయి -

76. శాశ్వతమైన స్వర్గవనాలు! వాటి క్రింద సెలయేళ్ళు పారుతూ ఉంటాయి. వారందులో శాశ్వతంగా ఉంటారు. మరియు ఇదే పుణ్యవంతులకు దొరికే ప్రతిఫలం.

77. మరియు వాస్తవానికి, మేము మూసాకు దివ్యజ్ఞానం (వహీ) ద్వారా ఇలా తెలిపాము[42]: "నా దాసులను రాత్రివేళ తీసుకొని బయలుదేరు మరియు వారి కొరకు సముద్రం నుండి తడి లేని మార్గాన్ని ఏర్పరచు; వెంబడించి పట్టుబడతావేమోనని భయపడకు, (సముద్రంలో మునిగి పోతావేమోనని కూడా) భీతి చెందకు[43]."

78. ఆ పిదప ఫిర్ఔన్ తన సేనలతో వారిని వెంబడించి

---

[40] అల్'ఖా, అల్-బా'ఖి: The Ever-Lasting. He whose existence will have no end. నిత్యుడు, శాశ్వితుడు, చిరస్థాయిగాఉండేవాడు.చూడండి, 55:26-27, (సేకరించబడిన పదం). ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి.

[41] సత్కార్యాలు చేయకుండా కేవలం విశ్వసించటం మాత్రమే పునరుత్థాన దినమున ఏ విధంగానూ ఉపయోగకరం కాదు. చూడండి, 6:158.

[42] చూడండి, 7:130

[43] చూడండి, 26:63-66.

(అక్కడికి) చేరగానే, సముద్రం వారిని హఠాత్తుగా
అలుముకొని క్రమ్ముకున్నది.

**79.** మరియు ఫిర్‌ఔన్ తన జాతి ప్రజలను మార్గభ్రష్టులుగా చేశాడు మరియు వారికి సన్మార్గం చూపలేదు.

**80.** ఓ ఇస్రాయీల్ సంతతి వారలారా! వాస్తవానికి మేము, మిమ్మల్ని మీ శత్రువు నుండి విముక్తి కలిగించి, తూర్ పర్వతపు కుడివైపున మీతో వాగ్దానం చేసి, మీపై మన్న మరియు సల్వాలను అవతరింపజేశాము[44].

**81.** (ఇంకా ఇలా అన్నాము): "మేము మీకు ప్రసాదించినమంచిఆహారపదార్థాలనుతినండి[45], అందు తలబిరుసుతనం చేయకండి, అలా చేస్తే నా ఆగ్రహానికి గురి కాగలరు. నా ఆగ్రహానికి గురి అయినవాడు తప్పక నాశనమవుతాడు.

**82.** అయితే, ఎవడైతే పశ్చాత్తాపపడి విశ్వసించి మరియు సత్కార్యాలు చేసి సన్మార్గంలో ఉంటాడో, అలాంటి వాని పట్ల నేను క్షమాశీలుడను[46]."

---

[44] చూడండి, 19:52 మరియు 2:63.

[45] మన్న మరియు సల్వాలను గురించి చూడండి, 2:57, 7:160. మన్న ఒక తియ్యని ఆహారపదార్థం. సల్వా ఒక రకమైన పక్షి (బుర్రపిట్ట, పూరెడు పిట్ట, కోలంకి పిట్ట లాంటిది).

[46] అల్-గఫ్ఫారు': Oft-Forgiving, Most Forgiving. క్షమించేవాడు, పాపాలను క్షమించేవాటడు, ఎక్కువగా క్షమించేవాడు. ఇంకా చూడండి, అల్-గాఫిర్: క్షమాగుణ పరిపూర్ణుడు, 40:3. అల్-'గఫూరు: క్షమాశీలుడు, 2:173, అల్-'గఫ్ఫారు మరియు అల్-'గఫూరు అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లు.

**83.** మరియు (మూసా తూర్ పర్వతం మీద ఉన్నప్పుడు[47] అల్లాహ్ అన్నాడు): "ఓ మూసా! నీవు నీ జాతి వారిని విడిచి శీఘ్రంగా (ఇక్కడికి) వచ్చిన కారణమేమిటి?"

**84.** (మూసా) జవాబిచ్చాడు: "అదిగో! వారు నా వెనుక నా అడుగు జాడలలో వస్తూనే ఉన్నారు; నీవు నా పట్ల ప్రసన్నుడవు కావాలని, ఓ నా ప్రభూ! నేను త్వరత్వరగా నీ సాన్నిధ్యానికి వచ్చాను[48]."

**85.** (అల్లాహ్) అన్నాడు "వాస్తవానికి! నీ వెనుక మేము, నీ జాతి వారిని పరీక్షకు గురి చేశాము మరియు సామిరి వారిని మార్గభ్రష్టులుగా చేశాడు."

**86.** ఆ తరువాత మూసా కోపంతోనూ, విచారంతోనూ, తన జాతి వారి వద్దకు తిరిగి వచ్చి అన్నాడు: "ఓ నా జాతి ప్రజలారా! ఏమీ? మీ ప్రభువు మీకు మంచి వాగ్దానం చేయలేదా? ఏమీ? ఒడంబడిక పూర్తి కావటంలో ఏమైనా ఆలస్యమయ్యిందా? లేదా! మీ ప్రభువు యొక్క ఆగ్రహం మీపై

---

[47] చూడండి, 2:51 మరియు 7:142.

[48] ఇక్కడ స్పష్టమయ్యేది ఏమిటంటే ఒక జాతి చాలా కాలం వరకు దాస్యంలో ఉండి అకస్మాత్తుగా దానికి స్వాతంత్ర్యం దొరికితే, అది తన భూత కాలపు క్రమశిక్షణలేని స్వభావాన్ని మార్చుకోలేదు. కాబట్టి ముందు తెలుపబడినట్లు, మూసా ('అ.స.) వెళ్ళిపోగానే అతన జాతివారు, ఆవుదూడను ఆరాధ్యదైవంగా చేసుకున్నారు. ఎందుకంటే, అంతకు ముందు వారు ఈజిప్టులో విగ్రహారాధనకు అలవాటు పడి ఉండిరి.

విరుచుకు పడాలని కోరుతున్నారా? అందుకేనా మీరు నాకు చేసిన వాగ్దానాన్ని భంగ పరచారు?"

87. వారు అన్నారు: "మేము నీకు చేసిన వాగ్దానాన్ని మాకు మేమై భంగపరచలేదు. కాని మాపై ప్రజల ఆభరణాల భారం మోపబడి ఉండెను, దానిని (అగ్నిలోకి) విసిరాము, ఇదే విధంగా సామిరి కూడా వేశాడు."

88. తరువాత అతడు (సామిరి) వారికొక ఆవుదూడ విగ్రహాన్ని తయారు చేశాడు. దాని నుండి ఆవుదూడ అరుపు వంటి శబ్దం వచ్చేది[49]. పిదప వారన్నారు: "ఇదే మీ ఆరాధ్యదైవం మరియు మూసా యొక్క ఆరాధ్యదైవం కూడాను, కాని అతను దానిని మరచి పోయాడు."

89. ఏమీ? అది వారికెలాంటి సమాధానమివ్వజాలదనీ మరియు వారికెలాంటి కీడు గానీ, మేలు గానీ చేయజాలదనీ వారు చూడటం లేదా?"[50]

90. మరియు వాస్తవానికి హారూన్ ఇంతకు ముందు వారితో చెప్పి ఉన్నాడు: "ఓ నా జాతి ప్రజలారా! దీని (విగ్రహం)తో మీరు పరీక్షింప బడుతున్నారు. మరియు నిశ్చయంగా, ఆ అనంత కరుణామయుడే

[49] చూడండి, 7:148.
[50] అల్లాహ్ (సు.తా.) వారి బుద్ధిహీనతను స్పష్టం చేస్తున్నాడు. ఆ ఆవుదూడ వారి ప్రశ్నకు సమాధాన మివ్వజాలదూ మరియు వారికెలాంటి లాభం గానీ నష్టం గానీ చేయజాలదూ అని తెలిసి కూడా వారు దానిని ఆరాధించడం బుద్ధిహీనత కాక మరేమిటి? ఆరాధ్య దేవుడు అల్లాహ్ (సు.తా.) మాత్రమే, ఆయనే తన దాసుల మొర వింటాడు మరియు వారికి లాభాం గానీ, నష్టం గానీ చేయగల శక్తి సామర్థ్యాలు కలిగి ఉన్నాడు.

మీ ప్రభువు! కావున మీరు నన్నే అనుసరించండి మరియు నా ఆజ్ఞనే పాలించండి."

**91.** వారన్నారు: "మూసా తిరిగి మా వద్దకు వచ్చే వరకు, మేము దీనిని ఆరాధించకుండా ఉండలేము."

**92.** (మూసా, హారూన్ తో) అన్నాడు: "ఓ హారూన్! నీవు వారిని మార్గభ్రష్టత్వంలో పడటం చూసినప్పుడు (వారిని వారించకుండా) నిన్ను ఎవరు ఆపారు?

**93.** నీవెందుకు నన్ను అనుసరించలేదు? నీవు కూడా నా ఆజ్ఞను ఉల్లంఘించావా?"[51]

**94.** (హారూన్) అన్నాడు: "నా తల్లి కుమారుడా (సోదరుడా)! నా గడ్డాన్ని గానీ, నా తల వెంట్రుకలను గానీ పట్టి లాగకు: 'వాస్తవానికి ఇస్రాయీల్ సంతతివారిలో విభేదాలు కల్పించావు, నీవు నా మాటను లక్ష్యపెట్టలేదు.' అని, నీవు అంటావేమోనని నేను భయపడ్డాను[52]."

**95.** (మూసా) అన్నాడు: "ఓ సామిరీ! ఇక నీ సంగతేమిటి?"

**96.** (సామిరీ) అన్నాడు: "వారు చూడని దానిని నేను చూశాను. ఆ తరువాత నేను సందేశహరుని (జిబ్రీల్)[53] పాదగుర్తుల నుండి ఒక పిడికెడు

[51] చూడండి, 7:142.
[52] దీని వివరాలకు చూడండి, 7:150.
[53] చాలామంది వ్యాఖ్యాతలు రసూల్ అంటే ఇక్కడ జిబ్రీల్ ('అ.స.) అనే వ్యాఖ్యానించారు.

(మట్టి) తీసుకొని దాని (ఆవుదూడ విగ్రహం) మీద వేశాను మరియు నా ఆత్మ నన్ను ఈ విధంగా ప్రేరేపించింది."

**97.** (మూసా) అన్నాడు: "సరే వెళ్ళిపో! నిశ్చయంగా, నీ శిక్ష ఏమిటంటే, నీవు జీవితాంతం 'నన్ను ముట్టవద్దు' (లా మిసాస) అని, అంటూ ఉంటావు. మరియు నిశ్చయంగా, నీకు (వచ్చే జీవితంలో శిక్ష) నిర్ణయించబడి ఉంది, దాని నుండి నీవు తప్పించుకోలేవు. ఇక నీవు, భక్తుడవైన నీ ఆరాధ్యదైవాన్ని చూడు! మేము దానిని నిశ్చయంగా, కాల్చుతాము తరువాత దానిని భస్మం చేసి సముద్రంలో విసిరి వేస్తాము[54]."

**98.** నిశ్చయంగా, మీ ఆరాధ్యదైవం అల్లాహ్ మాత్రమే. ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయన జ్ఞానం ప్రతి దానిని ఆవరించి ఉంది.

**99.** (ఓ ముహమ్మద్!) ఈ విధంగా మేము పూర్వం జరిగిన గాథలను నీకు వినిపిస్తున్నాము. మరియు వాస్తవంగా మేము, మా తరఫు నుండి నీకు హితోపదేశాన్ని (ఈ ఖుర్ఆన్ ను) ప్రసాదించాము.

**100.** దీనినుండి ముఖం త్రిప్పుకునేవాడు పునరుత్థాన దినాన(గొప్పపాప)భారాన్ని భరిస్తాడు

---

[54] దీనితో విశదమయ్యేదేమిటంటే, షిర్క్ వైపుకు మరల్చే ప్రతిదానిని నాశనం చేయాలి. అది జిబ్రీల్ ('అ.స.) పాద గుర్తుల మట్టి అయినా సరే! దానిని ప్రసాదంగా భావించి ఆరాధిస్తే, అది కూడా షిర్కే.

101. అదే స్థితిలో వారు శాశ్వతంగా ఉంటారు. పునరుత్థాన దినమున వారికా భారం ఎంతో దుర్భరమైనదిగా ఉంటుంది.

102. ఆ దినమున బాకా (సూర్) ఊదబడుతుంది[55]. మరియు మేము అపరాధులను ఒకచోట జమ చేస్తాము. ఆ రోజు వారి కళ్ళు (భయంతో) నీలమై పోతాయి.

103. వారు ఒకరితో నొకరు ఇలా గుసగుసలాడుకుంటారు: "మీరు (భూమిలో) పది (రోజుల) కంటే ఎక్కువ ఉండలేదు[56]."

104. వారు ఏమి మాట్లాడుకుంటున్నారో మాకు బాగా తెలుసు. వారిలో మంచి తెలివి గలవారు: "మీరు కేవలం ఒక్క దినం మాత్రమే ఉన్నారు!" అని అంటారు.

105. మరియు వారు నిన్ను పర్వతాలను గురించి అడుగుతున్నారు. వారితో అను: "నా ప్రభువు వాటిని ధూళిగా మార్చి ఎగురవేస్తాడు.

106. ఆ తరువాత దానిని (భూమిని) చదునైన మైదానంగా చేసి వేస్తాడు.

---

[55] 'సూర్: అంటే ఖర్న్, బాకా. అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞతో ఇస్రాఫీల్ ('అ.స.) దానిని ఊదుతారు. అప్పుడు పునరుత్థానం ఆవరిస్తుంది. (ముస్నద్ అ'హ్మద్, 2/191) దాదాపు ఇలాంటి 'హదీసే 'తిర్మిజీ'లో కూడా ఉంది. మొదటి శబ్దంతో అందరూ మరణిస్తారు. రెండవసారి బాకా ఊదగానే అందరూ తిరిగి సజీవులుగా లేచి వస్తారు.

[56] ఈ విధమైన ఆయత్ ల కొరకు చూడండి, 2:259, 17:52, 18:19, 23:112-113, 30:55, 79:46.

**107.** నీవు దానిలో ఎలాంటి పల్లం గానీ, మిట్టగానీ చూడలేవు[57]."

**108.** ఆ రోజు అందరూ పిలిచేవానిని వెంబడిస్తారు, అతని నుండి తొలగిపోరు[58]. అనంత కరుణామయుని ముందు వారి కంఠస్వరాలన్నీ అణిగిపోయి ఉంటాయి, కావున నీవు గొణుగులు తప్ప మరేమీ వినలేవు.

**109.** ఆ రోజు సిఫారసు ఏ మాత్రం పనికిరాదు. కానీ! అనంత కరుణామయుడు ఎవరికైనా అనుమతినిచ్చి, అతని మాట ఆయనకు సమ్మతమైనదైతేనే తప్ప![59]

**110.** (ఎందుకంటే!) ఆయనకు - వారికి ప్రత్యక్షంగా నున్నది మరియు పరోక్షంగా నున్నది – అంతా తెలుసు, కాని వారు తమ జ్ఞానంతో ఆయనను గ్రహించజాలరు[60].

**111.** మరియు సజీవుడు, విశ్వవ్యవస్థకు ఆధారభూతుడు (శాశ్వితుడు) అయిన ఆయన (అల్లాహ్) ముందు అందరి ముఖాలు నమ్రతతో వంగి ఉంటాయి.

---

[57] చూడండి, 14:48.

[58] ఆ పిలిచే వాని నుండి తప్పించుకొని అటూ ఇటూ పోకుండా అతని వెంటబడే పోతారు.

[59] ఈ విధమైన ఆయత్ ఖుర్ఆన్ లో ఎన్నో సార్లు వచ్చింది. చూడండి, 53:26, 21:28, 34:23, 10:3, 78:38, 2:255, 19:87 మొదలైనవి.

[60] అల్లాహ్ (సు.తా.)కు ప్రతి ఒక్కరి విషయం తెలుసు, కాబట్టి ఎవరు ఎక్కువ సత్పురుషులో ఆయనకు బాగా తెలుసు. అల్లాహ్ (సు.తా.) తప్ప మరెవ్వరూ అది ఎరుగరు. కావున సిఫారసు చేసే అర్హత గల వానిని ఆయనే ఎన్నుకుంటాడు.

మరియు దుర్మార్గాన్ని అవలంబించినవాడు, నిశ్చయంగా, విఫలుడవుతాడు[61].

**112.** మరియు సత్కార్యాలు చేస్తూ, విశ్వాసి అయి ఉన్న వానికి ఎలాంటి అన్యాయం గానీ, నష్టం గానీ జరుగునేమోనని భయపడే అవసరం ఉండదు[62].

**113.** మరియు ఈ విధంగా మేము ఈ ఖుర్ఆన్ ను అరబ్బీ భాషలో క్రమక్రమంగా అవతరింప జేశాము. మరియు ఇందులో పలురకాల హెచ్చరికలు చేశాము. బహుశా వారు దైవభీతి కలిగి ఉంటారేమోనని; లేదా! వారు ఉపదేశం గ్రహిస్తారేమోనని[63].

**114.** అల్లాహ్ అత్యున్నతుడు, సార్వభౌముడు[64], పరమ సత్యుడు (ఓ ముహమ్మద్!) నీకు ఖుర్ఆన్ సందేశం (వహీ) పూర్తిగా అవతరింప జేయబడే వరకు దానిని గురించి తొందర పడకు. మరియు ఇలా ప్రార్థించు: "ఓ నా ప్రభూ! నా

---

[61] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'ప్రతివానికి అతని హక్కు చెల్లించండి. లేకుంటే పునరుత్థాన దినమున ఇవ్వవలసి ఉంటుంది.' మరొక 'హదీస్'లో ఉంది: 'దుర్మార్గం నుండి దూరంగా ఉండండి, షిర్క్ మహా దుర్మార్గం ("జుల్మున్ అ"జీమ్), అది క్షమించబడదు.' ('స. ముస్లిం).

[62] చూడండి, 16:96-97.

[63] చూడండి, 12:2, 13:37, 14:4, 19:97.

[64] అల్-మలికు: చూడండి, 23:116, 59:23, 62:1, Sovereign, సార్వభౌముడు, విశ్వాధిపతి. అల్-మలీక్: Mighty Emperor, చక్రవర్తి, సర్వాధికారి, 54:55. మాలికు: Master, Owner, 1:4 : Sovereign, of the Universe, విశ్వసామ్రాట్టు, విశ్వసామ్రాజ్యాధిపతి, చూడండి, 3:26.

జ్ఞానాన్ని వృద్ధి పరచు!"[65]

**115.** మరియు వాస్తవానికి, మేము ఇంతకు పూర్వం ఆదమ్ తో ఒక వాగ్దానం చేయించి ఉన్నాము, కాని అతడు దానిని మరచి పోయాడు మరియు మేము అతనిలో స్థిరత్వాన్ని చూడలేదు[66].

**116.** మరియు మేము దేవదూతలతో: "ఆదమ్[67]కు సాష్టాంగం (సజ్దా) చేయండి." అని ఆజ్ఞాపించినపుడు ఒక్క ఇబ్లీస్ తప్ప అందరూ సాష్టాంగం (సజ్దా) చేశారు. అతడు నిరాకరించాడు.

**117.** అప్పుడు అన్నాము: "ఓ ఆదమ్! నిశ్చయంగా, ఇతడు నీకు మరియు నీ భార్యకు శత్రువు, కాబట్టి ఇతడిని, మీ ఇద్దరిని స్వర్గం నుండి వెడల గొట్టనివ్వకండి అలా అయితే మీరు దురవస్థకు గురి కాగలరు[68].

---

[65] ఖుర్ఆన్ అవతరణకు చూడండి, 75:16-19 మరియు 25:32.

[66] ఆ వాగ్దానం ఏమిటంటే ఒక ప్రత్యేక వృక్షపు దరిదాపులకు పోగూడదని, అంటే ఆ వృక్షపు ఫలాలు తినకూడదని. కాని షైతాన్ అతనిని ('అ.స.) మరియు అతని ('అ.స.) భార్యను తన వలలోకి తీసుకొని: 'ఆ వృక్షపు ఫలాలను తినటం వల్ల మీరు చిరంజీవులవుతారు.' అని చెప్పి, వారి చేత ఆ ఫలాన్ని తినిపించి, అల్లాహ్ (సు.తా.) తో చేసిన వాగ్దానాన్ని భంగం చేయించాడు.

[67] ఆదమ్ ('అ.స.) గాథ కొరకు చూడండి, 2:30-34, 15:28-34.

[68] తష్ఖా:అంటే ప్రయాస, కష్టం, కఠినం. ఏమిటంటే, స్వర్గంలో మానవుని అత్యవసర వసతులు అంటే ఆహార పానీయాలు, వస్త్రాలు మరియు నివాసం అన్నీ కోరిన వెంటనే లభిస్తాయి. వాటి కొరకు కష్టపడే అవసరం వుండదు. కాని, ఇహలోకంలో వాటి కొరకు మానవుడు ప్రయాస పడుతూ వుంటాడు. అదే దీని అర్థం.

**118.** నిశ్చయంగా ఇక్కడ నీవు ఆకలిగొనవూ మరియు వస్త్రహీనుడవూ (దిగంబరుడవూ) కావు[69]

**119.** మరియు నిశ్చయంగా, ఇందులో నీకు దాహమూ కలుగదు మరియు ఎండ కూడా తగలదు."

**120.** అప్పుడు షైతాన్ అతని మనస్సులో కలతలు రేకెత్తిస్తూ అన్నాడు: "ఓ ఆదమ్! శాశ్వత జీవితాన్ని మరియు అంతం కాని సామ్రాజ్యాన్ని, ఇచ్చే వృక్షాన్ని నీకు చూపనా?"

**121.** ఆ పిదప వారిద్దరు దాని నుండి (ఫలాన్ని) తినగానే వారిద్దరికి, వారి దిగంబరత్వం వ్యక్తం కాసాగింది[70]. మరియు వారిద్దరు స్వర్గపు ఆకులను తమ మీద కప్పుకోసాగారు. (ఈ విధంగా) ఆదమ్ తన ప్రభువు ఆజ్ఞను ఉల్లంఘించి, సన్మార్గం నుండి తప్పి పోయాడు.

**122.** ఆ తరువాత అతని ప్రభువు, అతనిని (తన కారుణ్యానికి) ఎన్నుకొని, అతని పశ్చాత్తాపాన్ని స్వీకరించి, అతనికి మార్గదర్శకత్వం చేశాడు.

**123.** (అల్లాహ్) అన్నాడు: "మీరిద్దరూ కలసి ఇక్కడి నుండి దిగిపోండి. మీరు ఒకరి కొకరు శత్రువులై[71] ఉంటారు. కాని నా తరపు నుండి మీకు మార్గదర్శకత్వం తప్పక వస్తూ ఉంటుంది, కావున నా మార్గదర్శకత్వాన్ని అనుసరించే వాడు,

---

[69] చూడండి, 7:20-22.

[70] వారి దిగంబరత్వం వ్యక్తం కాసాగింది. చూడండి, 7:26-27.

[71] అంటే మానవుడు మరియు షైతాను చూడండి, 7:24 మరియు 2:36.

మార్గభ్రష్టుడూ కాడు మరియు దురవస్థకు గురికాడు.

124. మరియు ఎవడైతే నా సందేశం నుండి విముఖుడవుతాడో నిశ్చయంగా, అతని జీవితం ఇరుకై పోతుంది మరియు పునరుత్థాన దినమున అతినిని అంధునిగా లేపుతాము."

125. అప్పుడతను అంటాడు: "ఓ నా ప్రభూ! నన్నెందుకు గ్రుడ్డివానిగా లేపావు, వాస్తవానికి నేను (ప్రపంచంలో) చూడగలిగే వాణ్ణి కదా?"

126. అప్పుడు (అల్లాహ్) అంటాడు: "మా సూచనలు నీ వద్దకు వచ్చినపుడు, నీవు వాటిని విస్మరించావు. మరియు అదే విధంగా ఈ రోజు నీవు విస్మరించబడుతున్నావు."

127. మరియు ఈ విధంగా, మేము మితిమీరి ప్రవర్తిస్తూ, తన ప్రభువు సూచనలను విశ్వసించని వానికి ప్రతీకారం చేస్తాము. మరియు పరలోక శిక్ష ఎంతో కఠినమైనది మరియు శాశ్వతమైనది.

128. వీరికి పూర్వం గడిచిన ఎన్నో తరాలను మేము నాశనం చేసి ఉన్నాము. వీరు వారి నివాసస్థలాలలో తిరుగుతున్నారు. ఏమీ? దీని వలన కూడా వీరికి మార్గదర్శకత్వం లభించలేదా? నిశ్చయంగా, ఇందులో అర్థం చేసుకునే వారికి ఎన్నో సూచనలున్నాయి.

129. మరియు నీ ప్రభువు నుండి మొదట్లోనే ఒక గడువు కాలం నిర్ణయించబడి ఉండక పోతే, వీరికి ఈ పాటికే (శిక్ష) తప్పక విధించబడి

ఉండేది. కాని (వీరి) గడువు కాలం నిర్ణయించబడి ఉంది[72].

**130.** కావున (ఓ ముహమ్మద్!) వారు పలికే మాటలకు నీవు ఓర్పు వహించు. సూర్యుడు ఉదయించక ముందు మరియు అస్తమించక ముందు నీ ప్రభువు పవిత్రతను కొనియాడుతూ, ఆయన స్తోత్రం చెయ్యి. మరియు రాత్రి సమయాలలో మరియు పగటి వేళలలో కూడా ఆయన పవిత్రతను కొనియాడు[73]. అప్పుడు నీవు సంతుష్టుడవవు తావు!

**131.** మేము వారిలో చాలామందికి - వాటితో వారిని పరీక్షించటానికి - వారు అనుభవించ టానికి, ఇచ్చిన ఇహలోక జీవిత శోభను నీవు కళ్ళెత్తి చూడకు[74]. నీ ప్రభువు ఇచ్చే జీవనోపాధియే

---

[72] అల్లాహ్ (సు.తా.) పాపం చేసేవారిని వెనువెంటనే శిక్షిస్తే ప్రపంచంలో ఒక్కడు కూడా శిక్షింపబడ కుండా ఉండడు. ఇది అల్లాహ్ (సు.తా.) కు తెలుసు, కాబట్టి ఆయన (సు.తా.) ప్రతి ఒక్కరికి పశ్చాత్తాప పడటానికి గడువు ఇస్తాడు. ఇదే అల్లాహ్ (సు.తా.) విధానం (సాంప్రదాయం). ఇక ఆ సమయం వచ్చిన తరువాత ఆయన శిక్ష నుండి తప్పించేవారు ఎవ్వరూ ఉండరు. అందుకే నీవు సత్య తిరస్కారులను భోగభాగ్యాలతో విర్రవీగుతూ ఉండటాన్ని చూస్తున్నావు. చూడండి, 10:11, 16:61, 18:58.

[73] చూడండి, 11:114.

[74] ఇలాంటి సందేశానికి చూడండి, 3:196-197, 15:88 18:7

అత్యుత్తమమైనది మరియు చిరకాలముండేది[75].

**132.** మరియు నీ కుటుంబం వారిని నమాజ్ చేయమని ఆజ్ఞాపించు; మరియు స్వయంగా నీవు కూడా దానిని సహనంతో పాటించు. మేము నీ నుండి జీవనోపాధిని ఆశించము. మేమే నీకు జీవనోపాధిని ఇచ్చే వారము. చివరకు దైవభీతి గలవారిదే ఉత్తమ ముగింపు.

**133.** మరియు వారంటారు: "ఇతను (ఈ ప్రవక్త) తన ప్రభువు నుండి ఏదైనా ఒక అద్భుత సూచన (మహిమ) ఎందుకు తీసుకురాడు?" ఏమీ? పూర్వపు గ్రంథాలలో పేర్కొనబడిన స్పష్టమైన నిదర్శనం వారి వద్దకు రాలేదా?[76]

**134.** ఒకవేళ మేము దీనిని (ఈ ఖుర్ఆన్ ను / ముహమ్మద్ ను) పంపక ముందే వారిని శిక్షించి ఉంటే! వారు అనేవారు: "ఓ మా ప్రభూ! నీవు మా వద్దకు ఒక సందేశహరుణ్ణి ఎందుకు

---

[75] ఒకసారి 'ఉమర్ (ర'ది.'అ.) దైవప్రవక్త ('స'అ) దగ్గరికి వచ్చారు. అతన ఒక చాప మీద పండుకొని ఉన్నది చూసి ఏడ్వసాగారు. అతని ఇంట్లో రెండు చర్మాల కంటే ఎక్కువ ఏమీ లేవు. దైవప్రవక్త ('స'అస) అతని ఏడ్పుకు కారణమడగగా, 'ఉమర్ (ర'ది.'అ) ఇలా జవాబిచ్చారు: 'ఖైసర్ మరియు కిస్రాలు ఎన్నో భోగభాగ్యాలలో మునిగి ఉన్నారు. మీరేమో అత్యుత్తమ సృష్టి అయి కూడా ఈ స్థితిలో ఉన్నారు.' దానికి దైవప్రవక్త ('స'అస) అన్నారు: " 'ఉమర్ (ర'ది.'అ) నీకు ఇంకా సందేహముందా? ఎవరికైతే కేవలం ఇహలోకంలోనే భోగభాగ్యాలు ఇవ్వబడ్డాయో వారే వీరు. వీరికి పరలోకంలో ఏమీ మిగలదు." ('స'హీ'హ్ బు'ఖారీ, ముస్లిం).

[76] ఇంకా చూడండి, 2:42 మరియు 61:6.

పంపలేదు? (అలా చేస్తే) నిశ్చయంగా, మేము - అవమానం పొంది, అగౌరవం పాలుకాక ముందే - నీ సూచనలను పాటించేవారం కదా?"[77]

**135.** వారితో ఇలా అను: "ప్రతి ఒక్కడు (తన అంతిమ ఫలితం కొరకు వేచి ఉన్నాడు. కావున మీరు కూడా వేచి ఉండండి. సరైన మార్గంలో ఉన్న వారెవరో మరియు మార్గదర్శకత్వం పొందిన వారెవరో మీరు త్వరలోనే తెలుసుకుంటారు."

---

[77] అల్లాహ్ (సు.తా.) ఎవరిని కూడా అజ్ఞానంతో చేసే తప్పుల కొరకు - వారికి మార్గదర్శకత్వం చూపనంత వరకు - శిక్షించడు. అంటే సన్మార్గాన్ని చూసిన తరువాత కూడా దాన్ని తిరస్కరించి మార్గభ్రష్టులైన వారిని శిక్షిస్తాడు. ఇంకా చూడండి, 6:131, 15:4 మరియు 26:208-209.

# 21. అల్-అంబియా [*]

అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

1. మానవులతో లెక్క (తీసుకునే) సమయం సమీపించింది, అయినా వారు ఏమరుపాటులో పడి విముఖులై ఉన్నారు[1].

2. (కావున) వారి ప్రభువు తరఫు నుండి వారి వద్దకు ఏ క్రొత్త సందేశం వచ్చినా, వారు దానిని పరిహసించకుండా వినలేరు.

3. వారి హృదయాలు వినోద క్రీడలలో (అశ్రద్ధలో) మునిగి ఉన్నాయి. మరియు వారిలో దుర్మార్గానికి పాల్పడిన వారు రహస్య సంప్రదింపులు చేసుకొని (ఇలా అంటారు): "ఏమీ? ఇతను (ముహమ్మద్) మీలాంటి ఒక సాధారణ మానవుడు కాడా?[2] అయినా మీరు చూస్తూ వుండి కూడా, ఇతని మంత్రజాలంలో[3] చిక్కుకుపోయారా?"

---

[*] [అల్-అంబియా అంటే దైవప్రవక్తలు]

[1] అంటే పునరుత్థాన దినం.

[2] అంటే ఆ కాలపు మక్కా ముష్రికులు, వారి తోటి మానవుడు ప్రవక్త కావడం నమ్మ లేక పోయారు. కాని ఈ కాలంలో కొందరు ప్రవక్తలను దైవాలుగా చేసుకుంటున్నారు.

[3] అస్-సి'హ్ర్: మంత్రజాలం, జాలవిద్య, మాయాజాలం. ఈ పదం ఖుర్ఆన్ అవతరణ క్రమంలో మొదటి సారి 74:24లో వచ్చింది.

4. (ముహమ్మద్) ఇలా అన్నాడు: "నా ప్రభువుకు ఆకాశంలోను మరియు భూమిలోను పలుకబడే ప్రతి మాట తెలుసు. మరియు ఆయన సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

5. అలా కాదు! వారన్నారు: "ఇవి (ఈ సందేశాలు) కేవలం పీడకలలు మాత్రమే; కాదు కాదు! ఇతడే దీనిని కల్పించాడు; అలా కాదు! ఇతడొక కవి! (ఇతడు ప్రవక్తయే అయితే) పూర్వం పంపబడిన సందేశహరుల మాదిరిగా, ఇతనిని కూడా మా కొరకు ఒక అద్భుత సూచన (ఆయత్) ను తెమ్మను!"

6. మరియు వీరికి పూర్వం మేము నాశనం చేసిన ఏ పురవాసులు కూడా విశ్వసించి ఉండ లేదు. అయితే! వీరు మాత్రం విశ్వసిస్తారా?

7. మరియు నీకు పూర్వం కూడా (ఓ ముహమ్మద్!) మేము పురుషులను మాత్రమే ప్రవక్తలుగా చేసి పంపి, వారిపై దివ్యజ్ఞానాన్ని (వహీని) అవతరింపజేశాము. కావున మీకిది తెలియకుంటే హితబోధ గలవారిని (గ్రంథప్రజలను) అడగండి.

8. మరియు మేము వారికి (ఆ ప్రవక్తలకు) ఆహారం తినే అవసరం లేని శరీరాలను ఇవ్వలేదు.

మరియు వారు చిరంజీవులు కూడా కాలేదు[4].

9. ఆ పిదప మేము వారికి చేసిన వాగ్దానాలు పూర్తి చేశాము. కావున వారిని మరియు మేము కోరిన వారిని రక్షించాము మరియు మితిమీరి ప్రవర్తించిన వారిని నాశనం చేశాము.

10. (ఓ మానవులారా!) వాస్తవంగా, మేము మీ కొరకు ఒక గ్రంథాన్ని (ఖుర్ఆన్ ను) అవతరింపజేశాము. అందులో మీ కొరకు ఉపదేశముంది. ఏమీ? మీరిది అర్థం చేసుకోలేరా?

11. మరియు దుర్మార్గానికి పాల్పడిన ఎన్ని నగరాలను మేము నిర్మూలించలేదు! మరియు వారి తరువాత మరొక జాతి వారిని పుట్టించాము![5]

12. మాశిక్ష(రావటం)తెలుసుకున్నప్పుడు వారు దానినుండి పారిపోవటానికి ప్రయత్నించేవారు

13. (అప్పుడు వారితో ఇలా చెప్పబడింది): "పారిపోకండి! మరలిరండి-మీరు అనుభవిస్తున్న మీ సుఖసంపదలవైపుకు మరియు మీఇళ్ళ

---

[4] అంటే ఏ ప్రవక్తకు కూడా అమానుషమైన యోగ్యతలు ప్రసాదించబడలేదు. వారు ('అలైహిమ్. స.) సాధారణ మానవుల్లాగానే ఉండేవారు, కాని వారిపై అల్లాహ్ (సు.తా.) దివ్యజ్ఞానం (వ'హీ) అవతరింప జేయబడుతూ ఉండేది. వారికి అల్లాహ్ (సు.తా.) తెలిపినది తప్ప మరే అగోచర జ్ఞానం లేదు. ఇంకా చూడండి, 5:75, 3:164, 13:38, 25:20.

[5] చూడండి, 17:17

వైపుకు-ఎందుకంటే! మిమ్మల్ని ప్రశ్నించవలసి ఉంది"

14. వారన్నారు: "అయ్యో! మా దౌర్భాగ్యం! నిస్సందేహంగా మేము దుర్మార్గులము."

15. ఆ పిదప మేము వారిని కోయబడిన పైరువలే, చల్లారిన అగ్ని వలే, చేసినంత వరకు వారి అరపు ఆగలేదు.

16. మరియు మేము ఈ ఆకాశాన్ని, భూమిని మరియు వాటి మధ్య ఉన్నదంతా కేవలం వినోదం కొరకు సృష్టించలేదు.

17. ఒకవేళ మేము కాలక్షేపమే చేయదలచుకుంటే, మేము మా వద్ద ఉన్న దానితోనే చేసుకునే వారం; వాస్తవానికి, ఇలా చేయడమే, మా ఉద్దేశ్యమై ఉంటే![6]

18. అలా కాదు! మేము సత్యాన్ని అసత్యంపై విసురుతాము. అది దాని తలను పగుల గొడుతుంది, అప్పుడు అది (అసత్యం) నశించి పోతుంది మరియు మీరు కల్పించే కల్పనలకు, మీకు వినాశం తప్పదు.

19. మరియు ఆకాశాలలో మరియు భూమిలో ఉన్న సమస్తమూ ఆయనకు చెందినదే. మరియు ఆయనకు దగ్గరగా ఉన్నవారు, ఆయనను

[6] చూడండి, 10:5.

ఆరాధిస్తూ ఉన్నామని గర్వించరు మరియు (ఆయన ఆరాధనలో) అలసట కూడా చూపరు[7].

**20.** వారు రేయింబవళ్ళు ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉంటారు, వారు ఎన్నడూ బలహీనత చూపరు.

**21.** ఏమీ? వారు భూలోకం నుండి ఆరాధ్య దైవాలను నియమించుకున్నారా? అవి (చనిపోయిన వారిని) మరల బ్రతికించి లేపగలవా?[8]

**22.** వాటిలో (భూమ్యాకాశాలలో) అల్లాహ్ తప్ప ఇతర ఆరాధ్య దైవాలు ఉంటే అవి రెండూ నాశనమైపోయేవే కదా! కావున సింహాసనానికి (అర్ష్ కు) ప్రభువైన అల్లాహ్! వారు కల్పించే కల్పనలకు అతీతుడు[9].

**23.** తాను చేసే దానిని గురించి ఆయన (అల్లాహ్)

---

[7] చాలా మంది వ్యాఖ్యాతలు వీరిని దైవదూతలుగా పరిగణిస్తారు.

[8] అంటే అవి చనిపోయిన వారిని మరల బ్రతికించి లేపలేవు, అని అర్థం. అంటే వారికి ఎలాంటి శక్తి లేదు. అలాంటప్పుడు వారు ఆ కల్పిత దైవాలను ఎందుకు ఆరాధించాలి?

[9] ఒకవేళ అల్లాహ్ (సు.తా.)కు సాటిగా మరొక దైవం ఉండి ఉంటే, ఇద్దరి ఆధిపత్యం నడిచేది. ప్రతి ఒక్కరూ తమ ఇచ్ఛానుసారంగా ప్రపంచాన్ని నడపగోరేవారు. దాని వల్ల విశ్వంలో ఇంత శాంతి ఉండక పోయేది. అల్లకల్లోలం చెలరేగిపోయేది. మానవుల రాజ్యపాలన ఏదైతే భూమిలోని ఒక్క చిన్న భాగం మీద ఉందో, దానికి ఒకే ఒక్క ఉన్నత పాలకుడిని ప్రసిడెంట్, లేక రాజు, లేక ప్రైమ్ మినిష్టర్ ను నియమించుకుంటాము. అలాంటప్పుడు విశ్వసామ్రాజ్య వ్యవస్థలో ఒకని కంటే ఎక్కువ పాలకులు ఉండి ఉంటే, అల్లాకల్లోలం చెలరేగదా? ఇంకా చూడండి, 6:100.

ప్రశ్నించబడడు, కాని వారు ప్రశ్నించ బడతారు
24. ఏమీ? వారు ఆయనను వదలి ఇతర ఆరాధ్య దైవాలను నియమించుకున్నారా? వారితో అను: "మీ నిదర్శనాన్ని తీసుకురండి." ఇది (ఈ ఖుర్ఆన్) నాతో పాటు ఉన్న వారికి హితబోధ; మరియు నా పూర్వీకులకు కూడా (ఇలాంటి) హితబోధలు (వచ్చాయి). కాని వారిలో చాలామంది సత్యాన్ని గ్రహించలేదు, కావున వారు విముఖులై పోతున్నారు.
25. మరియు మేము, నీకు పూర్వం ఏ ప్రవక్తను పంపినా: "నిశ్చయంగా, నేను (అల్లాహ్) తప్ప మరొక ఆరాధ్యుడు లేడు! కావున మీరు నన్నే (అల్లాహ్ నే) ఆరాధించండి." అని దివ్యజ్ఞానం (వహీ) ఇచ్చిపంపాము.
26. వారంటున్నారు: "అనంత కరుణామయునికి సంతానముంది!" అని. ఆయన సర్వ లోపాలకు అతీతుడు, (అల్లాహ్ సంతానంగా పరిగణించబడే) వారు కేవలం గౌరవనీయులైన (ఆయన) దాసులు మాత్రమే!"[10]
27. వారు ఆయన (అనుమతించక) ముందు మాట్లాడలేరు. మరియు వారు (దైవదూతలు) ఆయన ఆజ్ఞలనే పాటిస్తూ ఉంటారు[11].

---

[10] చూడండి, 19:92.

[11] ఈ ఆయత్ ముష్రికీన్ లు దేవదూతలను ('అ.స.) అల్లాహ్ (సు.తా.) బిడ్డలుగా పరిగణించే విషయాన్ని ఖండిస్తుంది. దేవదూతలు ('అ.స.) అల్లాహ్ (సు.తా.) సృష్టించిన దాసులు మరియు ఆయన ఆజ్ఞలను పాటిస్తూ ఉంటారు.

**28.** ఆయనకు, వారికి ప్రత్యక్షంగా (ముందు) ఉన్నదీ, అంతా తెలుసు. వారు, ఆయన సమ్మతించిన వారికి తప్ప ఇతరుల కొరకు సిఫారసు చేయలేరు[12]. వారు, ఆయన భీతి వలన భయకంపితులై ఉంటారు.

**29.** వారిలో (దేవదూతలలో) ఎవరైనా: "నిశ్చయంగా, ఆయనే కాక, నేను కూడా ఒక ఆరాధ్య దైవాన్ని" అని అంటే, అలాంటి వానికి మేము నరకశిక్ష విధిస్తాము[13]. మేము దుర్మార్గులను ఇదే విధంగా శిక్షిస్తాము.

**30.** ఏమి? ఈ సత్యతిరస్కారులకు తెలియదా (చూడలేదా)? వాస్తవానికి భూమ్యాకాశాలు (ఒకే ఒక్క భౌతికాంశంగా) కలుసుకొని ఉండేవని, అయితే మేమే వాటిని పగుల గొట్టి వేరు

---

[12] చూడండి, 2:255 దీనితో వ్యక్తమయ్యేది ఏమిటంటే ప్రవక్తలు మరియు 'సాలెహీన్ లే గాక దైవదూతలు కూడా, అల్లాహ్ (సు.తా.) అనుమతించిన వారికి మాత్రమే సిఫారసు చేయగలరు. ఇంకా చూడండి, 10:3, 19:87, 20:109, 53:26.

[13] ఇది ఒక ఉదారహణమే. ఇలా సంభవించనవసరం లేదు. అంటే దేవదూతలు ఎన్నడూ అలా చేయరు. ఒకవేళ వారు అలా చేస్తే, వారు ('అలైహిమ్. స.) కూడా శిక్షించబడతారు. ఈ విధమైన ఉదాహరణలకు చూడండి, 43:81 మరియు 39:65.15.

చేశామని?[14]
మరియు మేమే ప్రతి ప్రాణిని నీటి నుండి పుట్టించాము[15]. ఇకనైన వారు విశ్వసించరా?
31. మరియు భూమి వారితో పాటు కదలకుండా ఉండాలని మేము దానిలో స్థిరమైన పర్వతాలను

[14] ఇదే సైంటిస్టులు పలికే Big Bang Theory. ఈ ఆయత్ అవతరింపజేయబడినప్పుడు అరేబియా వాసులకు ఏ విధమైన సైన్సు జ్ఞానం లేదు. ఈ Big Band Theory ఇప్పుడిప్పుడే ఆవిష్కరించబడింది. ఈ ఖుర్ఆన్ ను దైవప్రవక్త ('స'అస) వ్రాయలేదు, ఎందుకంటే అతను నిరక్షరాస్యుడని మక్కా ప్రజలందరికీ తెలుసు. ఆ కాలపు విద్వాంసులకు కూడా ఇలాంటి సైన్సు విషయాల జ్ఞానం ఉండేది కాదు. దీనితో ఈ ఖుర్ఆన్ దివ్యాష్కృతి అని నిరూపించబడుతోంది. దాదాపు వేయి కంటే ఎక్కువ ఆయతులలో ఈ విధమైన సైన్సు విషయాలు పేర్కొనబడ్డాయి. వాటిలో కొన్ని ఇప్పుడిప్పుడే పరిశోధించబడి నిరూపించబడ్డాయి. వాటిలో ఒక ఒక్క ఆవిష్కారం కూడా ఖుర్ఆన్ లో పేర్కొనబడ్డ విషయం తప్పని నిరూపించలేదు. ఇంకా ఎన్నో నిరూపించబడనున్నాయి. ఈ కాలపు Modern Astrophysicists లందరి అభిప్రాయం ఏమిటంటే: ఈ విశ్వమంతా ఒకే ఒక మూల ద్రవ్యం హైడ్రోజన్ పరమాణువు నుండి సృష్టించబడింది. తరువాత ఆ హైడ్రోజన్ పరమాణువులు గురుత్వాకర్షణ శక్తి వల్ల కలుపబడి అనేక పదార్థాల సముదాయం ఏర్పడి, తరువాత అది పగల గొట్టబడటం వల్ల Galaxies, Nebulae and Solar Systems, అంటే నక్షత్ర సముదాయం ఏర్పడింది. ఇదంతా జరగటానికి ఎంతో శక్తి (Energy) కావాలి. కాబట్టి, ఇదంతా చేసే శక్తి గలవాడు, సర్వసృష్టికి ఆధార భూతుడైన అల్లాహ్ (సు.తా.) మాత్రమే. ఇంకా చూడండి 51:47.

[15] ఈ విషయం కూడా ఇప్పటి సైంటిస్టులందరూ అంగీకరిస్తారు. అంటే ప్రతి జీవి నీటి నుండి పుట్టించ బడిందని. జీవకణం (Cell) లోని అత్యధిక భాగం Protoplasm అందులో కూడా అత్యధిక భాగం (దాదాపు 72%) నీరే.

(మేకుల వలే) నాటాము[16]. మరియు వారు (ప్రజలు) మార్గదర్శకత్వం పొందాలని మేము దానిలో విశాలమైన మార్గాలను కూడా ఏర్పాటు చేశాము.

32. మరియు మేము ఆకాశాన్ని సురక్షితమైన కప్పుగా చేశాము[17]. అయినా వారు అందులోని సూచనల (ఆయాత్ ల) నుండి విముఖులవుతున్నారు.

33. మరియు రేయింబవళ్ళను మరియు సూర్యచంద్రులను సృష్టించినవాడు ఆయనే. అవి తమ తమ కక్ష్యలలో తేలియాడుతూ (తిరుగుతూ) ఉన్నాయి.

34. మరియు (ఓ ప్రవక్తా!) నీకు పూర్వం మేము ఏ మానవునికి కూడా శాశ్వత జీవితాన్ని ప్రసాదించలేదు[18]. ఏమీ? ఒకవేళ నీవు మరణిస్తే! వారు మాత్రం శాశ్వతంగా సజీవులుగా (చిరంజీవులుగా) ఉంటారా?[19]

35. ప్రతిప్రాణి మృత్యువును చవి చూస్తుంది మరియు మేము మీ అందరినీ మంచి మరియు చెడు స్థితులకు గురి చేసి, పరీక్షిస్తాము[20]. మరియు మీరందరూ మా వైపునకే మరలింప బడతారు.

36. మరియు ఈ సత్యతిరస్కారులు నిన్ను

---

[16] చూడండి, 16:15.
[17] చూడండి, 13:2.
[18] చూడండి, 3:144.
[19] చూడండి, 39:30.
[20] మీలో ఎవరు కృతజ్ఞులో మరియు ఎవరు సహనం వహించని కృతఘ్నులో చూడటానికి. మంచి స్థితి లో అల్లాహ్(సు.తా.) కు కృతజ్ఞులవటం మరియు దురావస్థలో సహనం వహించటమే విశ్వాసుల లక్షణాలు

చూసినప్పుడల్లా మీతో పరహాసమాడే వైఖరిని మాత్రమే అవలంబిస్తూ (అంటారు)[21]: "ఏమీ? మీ ఆరాధ్యదైవాలను గురించి (నిర్లక్ష్యంగా) మాట్లాడే వ్యక్తి ఇతనేనా?" ఇక వారేమో అనంత కరుణామయుని ప్రస్తావన వచ్చినప్పుడు! వారే సత్యాన్ని తిరస్కరిస్తున్నారు.

**37.** మానవుడు ఆత్రగాడుగా (తొందర పాటు జీవిగా) పుట్టించబడ్డాడు[22]. త్వరలోనే నేను మీకు నా సూచనలు చూపుతాను, కావున నన్ను తొందరపెట్టకండి[23].

**38.** మరియు వారంటున్నారు: "మీరు సత్యవంతులే అయితే ఈ వాగ్దానం (బెదిరింపు) ఎప్పుడు నెరవేరనున్నది[24].

**39.** ఒకవేళ, ఈ సత్యతిరస్కారులు, ఆ సమయాన్ని గురించి తెలుసుకొని ఉంటే ఎంత బాగుండేది! అప్పుడు వారు ఆ అగ్ని నుండి తమ ముఖాలను గానీ, తమ వీపులను గానీ కాపాడుకోలేరు. మరియు వారికెలాంటి సహాయం కూడా లభించదు.

**40.** వాస్తవంగా, అది వారిపై అకస్మాత్తుగా వచ్చిపడి వారిని కలవర పెడుతుంది[25]. వారు దానిని

---

[21] చూడండి, 25:41.
[22] మానవునికి సహనం లేదు, చూడండి 17:11.
[23] చూడండి, 16:1, అంటే తీర్పుదినం రానున్నది.
[24] దీని జవాబుకై చూడండి, 7:187.
[25] తబ్ హతు: perplex, stupify, కలవర పెట్టు, చికాకు పరచు, తెలివితేటలను పోగొట్టు.

నివారించనూ లేరు మరియు వారికెలాంటి వ్యవధి కూడా ఇవ్వబడదు.

41. మరియు (ఓ ముహమ్మద్!) వాస్తవానికి, నీకు పూర్వం కూడా ప్రవక్తలు ఎగతాళి చేయబడ్డారు, కానీ ఆ వెక్కిరించిన వారిని, వారి ఎగతాళియే చుట్టుకున్నది[26].

42. ఇలా అను: "రేయింబవళ్ళు మిమ్మల్ని అనంత కరుణామయుని (శిక్ష) నుండి ఎవడు కాపాడగలడు?" అయినా వారు తమ ప్రభువు స్మరణ నుండి విముఖులవుతున్నారు.

43. లేక! వారిని మా (శిక్ష) నుండి కాపాడటానికి మేము తప్ప వేరే దైవాలు ఎవరైనా ఉన్నారా? వారు (ఆ దైవాలు) తమకు తామే సహాయం చేసుకోలేరు మరియు వారు మా నుండి కాపాడుకోనూ లేరు.

44. అయినా! మేము వారికి మరియు వారి తండ్రితాతలకు చాలా కాలం వరకు సుఖసంతోషాలను ఇస్తూ వచ్చాము. అయితే! వారు చూడటం లేదా! వాస్తవానికి, మేము భూమిని, దాని అన్ని వైపుల నుండి తగ్గిస్తున్నామని?[27] అయినా! వారు ఆధిక్యత వహించ గలరని భావిస్తున్నారా?

---

[26] ఇటువంటి ఆయత్ కు చూడండి, 6:10.

[27] చూడండి, 13:41, అంటే విశ్వాసుల సంఖ్య క్రమక్రమంగా పెరగటం మరియు వారు 'అరబ్ దేశాన్ని ఆక్రమించటం మరియు ముష్రికుల సంఖ్య తగ్గిపోవటం మరియు వారి అధికారంలో నున్న భూమి దినదినానికి తగ్గిపోవటం.

45. (ఓ ముహమ్మద్!) వారితో ఇలా అను: "నేను కేవలం దివ్యజ్ఞానం (వహీ) ఆధారంగానే మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను." కాని చెవిటి వారిని, ఎంత హెచ్చరించినా, వారు పిలుపును వినలేరు కదా!

46. మరియు ఒకవేళ నీ ప్రభువు శిక్ష, కొంత వారికి పడితే వారు: "అయ్యో! మా పాడుగాను! వాస్తవానికి, మేము దుర్మార్గులముగా ఉండేవారం." అని అంటారు.

47. మరియు పునరుత్థాన దినమున మేము సరిగ్గా తూచే త్రాసులను ఏర్పాటు చేస్తాము. కావున ఏ వ్యక్తికి కూడా ఏ మాత్రం అన్యాయం జరుగదు. ఒకవేళ ఆవగింజంత కర్మ ఉన్నా మేము దానిని ముందుకు తెస్తాము. మరియు లెక్క చూడటానికి మేమే చాలు!

48. మరియు వాస్తవానికి మేము, మూసా మరియు హారూన్ లకు ఒక గీటురాయిని మరియు దివ్యజ్యోతిని (తౌరాత్'ను) ప్రసాదించి ఉన్నాము మరియు దైవభీతిగలవారికి ఒక హితబోధను[28]

49. వారి కొరకు ఎవరైతే అగోచరుడైన తమ ప్రభువుకు భయపడతారో![29] మరియు అంతిమ ఘడియను గురించి భీతిపరులై ఉంటారో!

50. మరియు ఈ శుభప్రదమైన జ్ఞాపిక (ఖుర్ఆన్

---

[28] అంటే దివ్యజ్ఞానమే నీతి నిజాయితీలను పరీక్షించే గీటురాయి. కావున అల్లాహ్ (సు.తా.) వరుసగా దివ్యగ్రంథాలను అవతరింపజేశాడు. చూడండి, 2:44 మరియు 2:53.

[29] చూడండి, 2:3.

ను) మేము అవతరింపజేశాము. ఏమీ? మీరు దీనిని నిరాకరిస్తారా?

51. మరియు వాస్తవానికి, మేము ఇంతకు పూర్వం ఇబ్రాహీమ్ కు కూడా మార్గదర్శకత్వం చేశాము మరియు అతనిని గురించి మాకు బాగా తెలుసు[30].

52. అతను తన తండ్రి మరియు తన జాతి ప్రజలతో ఇలా అన్నప్పుడు: "మీరు భక్తితో ఆరాధిస్తున్న ఈ విగ్రహాలు ఏమిటి?"

53. వారన్నారు: "మేము మా తండ్రి తాతలను, వీటినే ఆరాధిస్తూ ఉండగా చూశాము."

54. (ఇబ్రాహీమ్) అన్నాడు: "వాస్తవానికి, మీరు మరియు మీ తండ్రితాతలు స్పష్టంగా మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నారు."

55. వారన్నారు: "ఏమీ? నీవు మా వద్దకు ఏదైనా సత్యాన్ని తెచ్చావా? లేదా నీవు మాతో పరిహాసమాడుతున్నావా?"

56. (ఇబ్రాహీమ్) అన్నాడు: "అలా కాదు! భూమ్యాకాశాల ప్రభువే మీ ప్రభువు! ఆయనే వాటన్నింటినీ సృజించాడు మరియు నేను ఈవిషయం గురించి మీముందు సాక్ష్యమిస్తున్నాను.

57. "మరియు నేను అల్లాహ్ పై ప్రమాణం చేసి చెబుతున్నాను. మీరు వెళ్ళిపోయిన తరువాత

---

[30] ఇబ్రాహీమ్ గాథకు చూడండి, 6:74-79 మరియు 83.

మీ విగ్రహాలకు విరుద్ధంగా తప్పక యుక్తి పన్నుతాను."

**58.** తరువాత అతను ఒక పెద్ద దానిని (విగ్రహాన్ని) తప్ప అన్నింటినీ ముక్కలు ముక్కలుగా చేశాడు; బహుశా వారు దాని వైపునకు మరలుతారని!

**59.** వారన్నారు: "మా ఆరాధ్య దైవాలతో ఈ విధంగా ప్రవర్తించినవాడెవడు? నిశ్చయంగా వాడు దుర్మార్గుడు."

**60.** (కొందరు) ఇలా అన్నారు; "ఇబ్రాహీమ్ అనే యువకుడు, వీటిని గురించి ప్రస్తావిస్తూ ఉండగా మేము విన్నాము."

**61.** (ఇతరులు) అన్నారు: "అయితే, అతనిని ప్రజల కళ్ళ ముందుకు తీసుకురండి; బహుశా వారు సాక్ష్యమిస్తారేమో!"

**62.** (అతనిని తెచ్చిన తరువాత) వారు అడిగారు: "ఓ ఇబ్రాహీమ్! ఏమీ? నీవేనా మా ఆరాధ్య దైవాలతో ఇలా వ్యవహరించిన వాడవు?"

**63.** (ఇబ్రాహీమ్) జవాబిచ్చాడు: "కాదు కాదు! వారిలోని ఈ పెద్దవాడే ఇలా చేశాడు! అవి మాట్లాడగలిగితే వాటినే అడగండి!"

**64.** వారు తమలో తాము సమాలోచనలు చేసుకుంటూ ఇలా అనుకున్నారు: "నిశ్చయంగా స్వయంగా మీరే దుర్మార్గులు!"

**65.** కాని, తరువాత వారి బుద్ధి తలక్రిందులై వారు ఇలా అన్నారు: "వాస్తవానికి, నీకు తెలుసు కదా,

ఇవి మాట్లాడలేవని!"

66. (ఇబ్రాహీమ్) ఇలా అన్నాడు: "అలా అయితే! మీరు అల్లాహ్ ను వదలి, మీకెలాంటి లాభం కానీ నష్టం కానీ చేకూర్చలేని వాటిని ఆరాధిస్తారా?

67. "ధిక్కారం! మీపై మరియు అల్లాహ్ ను వదలి మీరు ఆరాధించే వాటిపై (దైవాలపై)! ఏమీ? మీరు ఏ మాత్రమూ తెలివిని ఉపయోగించరా?"

68. వారన్నారు: "మీరేమైనా చేయ దలుచుకుంటే! ఇతనిని కాల్చి వేయండి, మీ ఆరాధ్య దైవాలకు తోడ్పడండి."

69. మేము (అల్లాహ్) ఆజ్ఞాపించాము: "ఓ అగ్నీ! నీవు ఇబ్రాహీమ్ కొరకు చల్లగా సురక్షితంగా అయిపో!"[31]

70. మరియు వారు ఇబ్రాహీమ్ కు కీడు తలపెట్టగోరారు కాని మేము వారినే నష్టంలో పడవేశాం

71. మరియు మేము అతనిని (ఇబ్రాహీమ్ ను) మరియు లూత్ ను రక్షించి, సర్వజనుల కొరకు

[31] చూడండి, 29:24 మరియు 37:97.

శుభప్రదం చేసిన భూమి వైపునకు పంపాము[32].

**72.** మరియు అతనికి (ఇబ్రాహీమ్) కు ఇస్ హాఖ్ మరియు యఅఖూబ్ లను అదనపు కానుకగా ప్రసాదించాము[33]. మరియు మేము ప్రతి ఒక్కరినీ సద్వర్తనులుగా చేశాము.

**73.** మరియు మేము వారిని నాయకులుగా చేశాము. వారు ప్రజలకు మా ఆజ్ఞ ప్రకారం మార్గదర్శకత్వం చేస్తూ ఉండేవారు. మరియు మేము వారిపై - సత్కార్యాలు చేయాలని, నమాజ్ స్థాపించాలని, విధిదానం (జకాత్) ఇవ్వాలని - దివ్యజ్ఞానం (వహీ) పంపాము. మరియు వారు (కేవలం) మమ్మల్నే ఆరాధించేవారు.

**74.** మరియు (జ్ఞాపకం చేసుకోండి) మేము లూత్ కు[34] వివేకాన్ని మరియు జ్ఞానాన్ని ప్రసాదించాము

---

[32] లూ'త్ ('అ.స.), ఇబ్రాహీమ్ ('అ.స.) యొక్క సోదరుని కుమారులు. అతను ఇస్లాం స్వీకరించి ఇబ్రాహీమ్ ('అ.స.) తో సహా తమ నగరం 'ఊర్ - ఏదైతే Mesopotamia (ఇరాఖ్) లో ఉందో - విడిచి ఫల'స్తీన్ (సిరియా)కు వెళ్ళారు. అల్లాహ్ (సు.తా.) అతనిని కూడా ప్రవక్తగా ఎన్నుకున్నాడు. లూ'త్ ('అ.స.) సోడోమ్ మరియు గొమొర్రాహ్ ('సద్దూమ్, 'అమూరహ్) ప్రాంతంలో నివసించారరు. అవి ఈ నాటి మృత సముద్రం (Dear Sea) దగ్గర ఉండేవి.

[33] మొదటి కుమారుడు ఇస్మా'యీలు ('అ.స.) కావున ఇస్హా'ఖ్ ('అ.స.) 'అదనపు కానుకగా) అని ఇక్కడ పేర్కొనబడ్డారు. '.

[34] లూ'త్ ('అ.స.) గాథ కొరకు చూడండి, 7:80-84; 11:77-83, 15:58-76.

మరియు మేము అతనిని అసహ్యకరమైన పనులు చేస్తున్న వారి నగరం నుండి కాపాడాము. నిశ్చయంగా వారు నీచులు, అవిధేయులు (ఫాసిఖీన్) అయిన ప్రజలు.

75. మరియు మేము అతనిని మా కారుణ్యంలోకి ప్రవేశింప జేసుకున్నాము. నిశ్చయంగా, అతను సద్వర్తనులలోని వాడు.

76. మరియు (జ్ఞాపకం చేసుకోండి) నూహ్[35] అంతకు ముందు, మమ్మల్ని వేడుకొనగా మేము అతని (ప్రార్థనను) అంగీకరించాము. కావున అతనికి మరియు అతనితో బాటు ఉన్నవారికి ఆ మహా విపత్తు నుండి విముక్తి కలిగించాము.

77. మరియు మా సూచనలను అబద్ధాలని నిరాకరించిన వారికి వ్యతిరేకంగా మేము అతనికి సహాయం చేశాము. నిశ్చయంగా, వారు దుష్ట ప్రజలు. కావున వారినందరినీ ముంచి వేశాము.

78. మరియు దావూద్ మరియు సులైమాన్ ఇద్దరు ఒక చేను గురించి తీర్పు చేసిన విషయం (జ్ఞాపకం

---

[35] నూ'హ్ ('అ.స.) గాథ ఖుర్ఆన్ లో ఎన్నోసార్లు వచ్చింది. ముఖ్యంగా చూడండి, 11:25-48.

చేసుకోండి)[36]: "ఒక తెగవారి మేకలు (మరొక తెగవారి చేను) మేశాయి. అప్పుడు వాస్తవానికి, మేము వారి తీర్పునకు సాక్షులుగా ఉన్నాము.

79. అసలు సులైమాన్ కు మేము (వాస్తవ విషయం) తెలియజేశాము. మరియు వారిద్దరికీ మేము వివేకాన్ని మరియు జ్ఞానాన్ని ప్రసాదించాము. మరియు మేము పర్వతాలను మరియు పక్షులను దావూద్ తో బాటు మా స్తోత్రం చేయటానికి లోబరిచాము[37]. మరియు నిశ్చయంగా, మేమే (ప్రతిదీ) చేయగలవారము.

80. మరియు మేము అతనికి, మీ యుద్ధాలలో, మీ రక్షణ కొరకు కవచాలు తయారు చేయడం నేర్పాము. అయితే! (ఇప్పుడైనా) మీరు కృతజ్ఞులవుతారా?

---

[36] ఒక వ్యక్తి మేకలు ఒక రాత్రి మరొక వ్యక్తి పంట పొలాన్ని మేస్తాయి. అతడు, దావూద్ ('అ.స.) దగ్గరకు తీర్పు కొరకు వస్తాడు. అతను ('అ.స.) పంట నష్టానికి సమానమైన విలువ గల మేకలను, పొలం వానికి ఇవ్వాలని తీర్పు ఇస్తారు. ఇది విని అక్కడే ఉన్న అతని ('అ.స.) కుమారులు సులైమాన్ ('అ.స.) అంటారు: 'అలా కాదు! చేను మేకలవానికి ఇవ్వాలి. అతడు సేద్యం చేసి దానిని మేకలు మేయక ముందు ఉన్న స్థితిలోకి పెంచి తీసుకు రావాలి. ఈ కాలమంతా మేకలు చేనువాని దగ్గర ఉండాలి. అతడు వాటి పాలు, ఉన్ని మరియు పిల్లలతో లాభం పొంద వచ్చు. ఎప్పుడైతే చేను మొదటి స్థితిలోకి వస్తుందో అప్పుడు చేనూ, మేకలూ, తమ తమ యజమానులకు తిరిగి ఇవ్వాలి.' ఈ తీర్పు ఎక్కువ ఉచితమైనదై నందుకు, దానిసే అమలు చేస్తారు.

[37] చూడండి, 17:44, 57:1 మరియు 13:13.

**81.** మరియు మేము తీవ్రంగా వీచే గాలిని సులైమాన్ కు (వశపరిచాము). అది అతని ఆజ్ఞతో మేము శుభాలను ప్రసాదించిన (అనుగ్రహించిన) భూమి మీద వీచేది[38]. మరియు నిశ్చయంగా, మాకు ప్రతి విషయం గురించి బాగా తెలుసు.

**82.** మరియు షైతానులలో కొందరు అతని (సులైమాన్) కొరకు (సముద్రంలో) మునిగేవారు మరియు ఇతరపనులు కూడా చేసేవారు మరియు నిశ్చయంగా మేమే వారిని కనిపెట్టుకొని ఉండేవారము.

**83.** మరియు (జ్ఞాపకం చేసుకోండి) అయ్యూబ్ తన ప్రభువును వేడుకున్నప్పుడు (ఇలా అన్నాడు): "నిశ్చయంగా, నన్ను బాధ (వ్యాధి) చుట్టుకున్నది మరియు నీవే కరుణామయు లలో కెల్లా గొప్ప కరుణామయుడవు!"[39]

**84.** అప్పుడు మేము అతని (ప్రార్థనలు) అంగీకరించి, అతని బాధ నుండి అతనికి విముక్తి కలిగించాము. మరియు అతనికి, అతని కుటుంబ వాసులను

---

[38] ఈ భూమి ఆ కాలపు షామ్, అంటే కాలపు ఫల'స్తీన్, జోర్డాన్ మరియు సిరియాలు.

[39] అయ్యూబ్ ('అ.స.) మొదట, సుఖసంతోషాలలో జీవితం గడిపారు. తరువాత అల్లాహ్ (సు.తా.) అతనిని తీవ్రమైన కష్టాలతో, వ్యాధితో పరీక్షించాడు. అతను, ఆ కష్ట కాలంలో కూడా సహనం వహించారు. ఆ తరువాత అల్లాహ్ (సు.తా.) అతనిని అనుగ్రహించి మరల మొదటి కంటే మంచి స్థితికి తెచ్చాడు. చూడండి, 38:44.

తిరిగి ఇవ్వటమే గాక వారితో బాటు ఇంకా అంతమందిని ఎక్కువగా ఇచ్చి, దానిని మా నుండి ఒక ప్రత్యేక కరుణగా మరియు మమ్మల్ని ఆరాధించే వారికి ఒక జ్ఞాపికగా చేశాము.

**85.** మరియు (జ్ఞాపకం చేసుకోండి), ఇస్మాయీల్, ఇద్రీస్ మరియు జుల్కిఫ్ల్[40], వీరందరు కూడా సహన శీలురైన వారే!

**86.** మరియు మేము వారందరినీ మా కారుణ్యంలోకి తీసుకున్నాము. నిశ్చయంగా, వారందరూ సద్వర్తనులు.

**87.** మరియు (జ్ఞాపకం చేసుకోండి) చేపవాడు (యూనుస్)[41] - ఉద్రేకంతో వెళ్ళిపోతూ - మేము అతనిని పట్టుకోలేమని అనుకున్నాడు! కాని ఆ తరువాత, అంధకారాలలో చిక్కుకొని

---

[40] జు'ల్ కిఫ్ల ('అ.స.): ప్రవక్తేనా కాదా అనే విషయం గురించి వ్యాఖ్యాతలలో భేదాభిప్రాయాలు ఉన్నాయి. ఇబ్నె-కసీర్ (ర'హ్మ) అంటారు: అతని పేరు ఇతర ప్రవక్త ('అలైహిమ్ స.) ల పేర్లతో పాటు వచ్చింది కాబట్టి అతను కూడా ప్రవక్తయే!

[41] యూనుస్ ('అ.స.) తన ప్రజల సత్యతిరస్కారాన్ని ఓర్చుకోలేక అల్లాహ్ (సు.తా.) అనుమతించక ముందే వారిని విడిచి పారి పోయి పడవనెక్కారు. అతను చీటీలలో ఓడిపోయి, పడవను మునిగి పోకుండా కాపాడటానికి, సముద్రంలోకి దూకారు. అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞతో అతనిని ఒక పెద్ద చేప మ్రింగింది. అతను ('అ.స.) ఆ చేప కడుపులో తమ ప్రభువు (అల్లాహుతా'లా) ను వేడుకున్నారు. అప్పుడు అల్లాహ్ (సు.తా.) అతనిని తిరిగి ఒడ్డు మీదికి చేర్చాడు. అతను ('అ.స.) తిరిగి వెళ్ళి తన ప్రజలకు హితబోధ చేశారు. వివరాలకు చూడండి, 37:139-148 మరియు 10:98.

పోయినప్పుడు ఇలా మొరపెట్టుకున్నాడు: "వాస్తవానికి నీవు (అల్లాహ్) తప్ప మరొక ఆరాధ్య దేవుడు లేడు నీవు సర్వలోపాలకు అతీతుడవు, నిశ్చయంగా, నేనే అపరాధులలోని వాడను"

**88.** అప్పుడు మేము అతని (ప్రార్థనను) అంగీకరించి, అతనిని ఆ దుఃఖము నుండి విముక్తి కలిగించాము మరియు విశ్వసించిన వారిని మేము ఇదే విధంగా కాపాడుతూ ఉంటాము.

**89.** మరియు (జ్ఞాపకం చేసుకోండి), జకరియ్యా[42] తన ప్రభువును వేడుకున్నప్పుడు ఇలా ప్రార్థించాడు: "ఓ నా ప్రభూ! నన్ను ఒంటరివానిగా (సంతానహీనునిగా) వదలకు. నీవే సర్వశ్రేష్ఠమైన వారసుడవు!"

**90.** అప్పుడు మేము అతని ప్రార్థనను అంగీకరించి అతని కొరకు అతని భార్యను (సంతానానికి) యోగ్యురాలుగా చేసి, అతనికి యహ్యాను ప్రసాదించాము. వాస్తవానికి వారు సత్కార్యాలు చేయటానికి పోటీ పడే వారు. మరియు శ్రద్ధతో మరియు భీతితో మమ్మల్ని ఆరాధించేవారు. మరియు మా సమక్షంలో వినమ్రులై ఉండేవారు.

**91.** మరియు (జ్ఞాపకం చేసుకోండి), తన శీలాన్ని కాపాడుకున్న ఆ మహిళ (మర్యమ్) లో మా

[42] 'జకరియ్యా ('అ.స.) గాథకు చూడండి, 3:37 19:2 మరియు సూరహ్ తా'హా (20).

నుండి ప్రాణం (రూహ్) ఊది, ఆమెను మరియు ఆమె కొడుకును, సర్వలోకాల వారికి ఒక సూచనగా చేశాము[43].

**92.** నిశ్చయంగా, మీ ఈ సమాజం ఒకే ఒక్క సమాజం[44] మరియు కేవలం నేనే మీ ప్రభువును, కావున మీరు నన్ను మాత్రమే ఆరాధించండి.

**93.** కాని వారు (ప్రజలు) తమ ధర్మ విషయంలో తెగలు తెగలుగా చీలిపోయారు. వారందరికీ మా వైపునకే మరలి రావలసి వున్నది.

**94.** సత్కార్యాలు చేసేవాడు విశ్వసించేవాడై ఉంటే, అతని శ్రమ నిరాదరించబడదు మరియు నిశ్చయంగా, మేము దానిని వ్రాసి పెడతాము.

**95.** మరియు మేము నాశనం చేసిన ప్రతి నగరం (వారి)పై, వారు (ఆ నగరవాసులు) మరలి రావటం నిషేధించబడింది.

**96.** ఎంత వరకైతే యాజూజ్ మరియు మాజూజ్ లు వదలి పెట్టబడి ప్రతి మిట్ట నుండి పరుగెడుతూ

---

[43] చూడండి, 15:29, 38:72 మరియు 32:9.

[44] ఉమ్మతున్: అంటే ధర్మం లేక సమాజం. ఇక్కడ ఇస్లాం ధర్మం మరియు సమాజం. దీని వైపునకే ప్రవక్తలందరూ తమ ప్రజలను ఆహ్వానించారు. ప్రవక్తలందరి ధర్మం ఇస్లామే! దైవప్రవక్త ప్రవచనం: 'ప్రవక్తలందరి కుటుంబం ఒక్కటే, మా తండ్రి ఒక్కడు మరియు మా తల్లులు వేరు వేరు. మా అందరి ధర్మం ఒక్కటే, ఇస్లాం.' (ఇబ్నె-కసీ'ర్).

రారో![45]

97. మరియు సత్యవాగ్దానం నెరవేరే సమయం దగ్గర పడినప్పుడు సత్యతిరస్కారుల కళ్ళు

98. విచ్చుకుపోయి: "అయ్యో! మా దౌర్భాగ్యం! వాస్తవానికి మేము దీని నుండి అశ్రద్ధకు గురి అయ్యాము.కాదుకాదు!మేముదుర్మార్గులముగా ఉండేవారము." అని అంటారు.

99. (వారితో ఇంకా ఇలా అనబడుతుంది): "నిశ్చయంగా మీరు మరియు అల్లాహ్ ను వదలి మీరు ఆరాధించేవారూ నరకాగ్నికి ఇంధనమవుతారు! (ఎందుకంటే) మీకు అక్కడికే పోవలసి ఉన్నది[46]

---

[45] చూడండి, 18:94-98. తీర్పుదినం దగ్గరికి వచ్చి 'ఈసా ('అ.స.) తిరిగి భూలోకంలోకి వచ్చినప్పుడు యూ'జూజ్ మరియు మా'జూజ్ లు ప్రపంచంలో ప్రతిచోట వ్యాపించి ఉంటారు. వారి హింసలు మరియు దౌర్జన్యాలకు విశ్వాసులు తాళ లేకపోతారు. చివరకు 'ఈసా ('అ.స.) విశ్వాసులను తీసుకొని 'తూర్ పర్వతం పైకి ఎక్కుతారు. అతను యా'జూజ్ మరియు మా'జూజ్ లను శిక్షించటానికి అల్లాహ్ (సు.తా.)ను ప్రార్థిస్తారు. అప్పుడు వారంతా వధింపబడతారు. వారి శవాల దుర్వాసన అంతటా వ్యాపించి పోతుంది. అప్పుడు అల్లాహ్ (సు.తా.) పక్షులను పంపుతాడు. అవి ఆ శవాలను సముద్రంలోకి విసురుతాయి. ఆ తరువాత ఒక పెద్ద వర్షం కురుస్తుంది. దానితో భూమి శుభ్రపరచబడుతుంది. ('స'హీ'హ్ 'హదీస్'ల ఆధారంగా, ఇబ్నె-కసీ'ర్).

[46] ఒక 'హదీస్' ప్రకారం ఈ ఆయత్ విని ఒక ముష్రికుల నాయకుడు అన్నాడు: 'యూదులు మరియు క్రైస్తవులు ఆరాధించే 'ఉ'జైర్ ('అ.స.) మరియు 'ఈసా ('అ.స.) లు కూడా నరకానికి పోతారా?' దానికి దైవప్రవక్త ('సల'స) అన్నారు: 'అల్లాహ్ (సు.తా.)కు బదులుగా తనను ఆరాధించటాన్ని సమ్మతించిన ప్రతి వ్యక్తి, తనను ఆరాధించిన వారితో పాటు నరకానికి పోతాడు.'

ఒకవేళ ఇవన్నీ ఆరాధ్య దైవాలే అయి వుంటే, ఇవి అందులో (నరకంలో) ప్రవేశించి ఉండేవి కావు కదా! ఇక మీరంతా అందులోనే శాశ్వతంగా ఉంటారు!"

**100.** అందులో వారు (దుఃఖం చేత) మూలుగుతూ ఉంటారు. అందులో వారేమి వినలేరు[47].

**101.** నిశ్చయంగా, ఎవరి కొరకైతే మా తరఫు నుండి మేలు (స్వర్గం) నిర్ణయింపబడివుందో, అలాంటి వారు దాని (నరకం) నుండి దూరంగా ఉంచబడతారు.

**102.** వారు దాని మెల్లని శబ్దం కూడా వినరు. వారు తాము కోరిన వాటిలో శాశ్వతంగా ఉంటారు

**103.** ఆ గొప్ప భీతి కూడా వారికి దుఃఖం కలిగించదు[48] మరియు దైవదూతలు వారిని ఆహ్వానిస్తూ వచ్చి: "మీకు వాగ్దానం చేయబడిన మీ దినం ఇదే!" అని అంటారు.

**104.** (జ్ఞాపకముంచుకోండి)! ఆ రోజు మేము ఆకాశాన్ని, చిట్టాకాగితాలను (ఖాతా గ్రంథాలను) చుట్టినట్టు చుట్టివేస్తాము[49]. మేము ఏ విధంగా సృష్టిని

---

[47] .నరకంలో వారంతా బాధలవల్ల ఏడుస్తూ ఉంటారు వారి రోధనల ధ్వనివల్ల వారందు ఏమీవినలేక పోతారు

[48] ఆ గొప్ప భీతి అంటే ఇస్రాఫీల్ ('అ.స.) యొక్క 'సూర్, లేక స్వర్గ-నరకాల మధ్య 'చావు'ను వధించటం. అంటే స్వర్గానికి మరియు నరకానికి పోయే వారి తీర్పు ముగిసిన తరువాత 'చావు' ఒక గొర్రె ఆకారంలో తెచ్చి జి'బహ్ చేయడం. ఆ తరువాత ఎవ్వరికీ చావు ఉండదు. చూడండి, 19:39.

[49] చూడండి, 39:67.

మొదట ఆరంభించామో! అదే విధంగా దానిని మరల ఉనికిలోకి తెస్తాము. ఇది (మాపై బాధ్యతగా) ఉన్న మా వాగ్దానం మేము దానిని తప్పక పూర్తి చేస్తాము.

**105.** వాస్తవానికి మేము జబూర్ లో- మా హితబోధ తరువాత - నిశ్చయంగా, ఈ భూమికి[50] సద్వర్తునులైన నా దాసులు వారసులవుతారని వ్రాసి ఉన్నాము.

**106.** నిశ్చయంగా ఇందులో భక్తిపరులైన ప్రజలకు సందేశం ఉంది[51].

**107.** మరియు మేము నిన్ను(ఓ ప్రవక్తా!) సర్వలోకాలవారికొరకు కారుణ్యంగా మాత్రమే పంపాం[52]

**108.** (ఓ ముహమ్మద్!) ఇలా అను: "నిశ్చయంగా,

---

[50] ఇక్కడ భూమి అంటే స్వర్గమని అనేక వ్యాఖ్యాతల అభిప్రాయం.

[51] దైవప్రవక్త ము'హమ్మద్ ('స.అస) పై అవతరింపజేయబడిన ఈ ఖుర్ఆన్ సర్వమానవాళి కొరకు అవతరింపజేయబడిన దివ్యగ్రంథం. అల్లాహ్ (సు.తా.) దీనిని తీర్పుదినం వరకు భద్రంగా ఉంచుతానని, అన్నాడు. (చూడండి, 15:9). ఇది రంగు రూపాల, పుట్టుపూర్వోత్తరాల, భేదభావాలు లేకుండా సర్వ మానవులను ఆకర్షిస్తుంది. ఇది మానవుని హేతువాదానికి జవాబిస్తుంది. మరొక విశేషమేమిటంటే 1400 సంవత్సరాలలో ఒక్క అక్షరం కూడా మార్చబడకుండా ఉన్న ఒకే ఒక్క దివ్యగ్రంథం, ఈ ఖుర్ఆన్ మాత్రమే మరియు ఇది అవతరింపజేయబడిన ప్రవక్త ము'హమ్మద్('స'అస) చివరిప్రవక్త. చూడండి 33:40

[52] దైవప్రవక్త ము'హమ్మద్ ('స'అస) సర్వమానవజాతి కొరకు పంపబడిన దైవప్రవక్త చూడండి, 7:158. దైవప్రవక్త ('స'అస) ముష్రికులను శపించలేదు. ('స'హీ'హ్ ముస్లిం, 2006).

నాపై దివ్యజ్ఞానం (వహీ) అవతరింప జేయబడింది. వాస్తవంగా మీ ఆరాధ్య దైవం ఆ అద్వితీయ ఆరాధ్యుడే (అల్లాహ్ యే)! ఇకనైన మీరు అల్లాహ్ కు విధేయులు (ముస్లింలు) అవుతారా?

**109.** ఒకవేళ వారు వెనుదిరిగితే వారితో ఇలా అను: "నేను మీకు అందరికి బహిరంగంగా ప్రకటిస్తున్నాను. మరియు మీతో చేయబడిన వాగ్దానం సమీపంలో ఉందో లేదా బహుదూరం ఉందో నాకు తెలియదు."

**110.** నిశ్చయంగా, ఆయన (అల్లాహ్)కు మీరు బహిరంగంగా వ్యక్త పరిచేది మరియు దాచేది అంతా తెలుసు.

**111.** మరియు బహుశా ఇది (ఈ ఆలస్యం) మీకు పరీక్ష కావచ్చు, లేదా మీకు కొంతకాలం సుఖసంతోషాలు అనుభవించటానికి ఇవ్వబడిన వ్యవధి కావచ్చు, అది నాకు తెలియదు!

**112.** అతను (ముహమ్మద్) ఇలా అన్నాడు: "ఓ నా ప్రభూ! నీవు సత్యంతో తీర్పు చేయి! మరియు మీరు కల్పించే వాటికి (ఆరోపణలకు), ఆ అపార కరుణామయుడైన మా ప్రభువు సహాయమే కోరబడుతుంది!"

# 22. అల్-హజ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఓ మానవులారా! మీ ప్రభువు నందు భయభక్తులు కలిగి ఉండండి! నిశ్చయంగా, ఆ అంతిమ ఘడియ యొక్క భూకంపం ఎంతో భయంకరమైనది.
2. ఆ రోజు ఆవరించినప్పుడు, పాలిచ్చే ప్రతి స్త్రీ తన చంటిబిడ్డను మరచిపోవటాన్ని, గర్భవతి అయిన ప్రతి స్త్రీ, తన గర్భాన్ని కోల్పోవటాన్ని నీవు చూస్తావు. మరియు మానవులందరినీ మత్తులో ఉన్నట్లు నీవు చూస్తావు. కానీ (వాస్తవానికి) వారు త్రాగి (మత్తులో) ఉండరు. కాని అల్లాహ్ శిక్షయే అంత తీవ్రంగా ఉంటుంది.
3. మరియు ప్రజలలో ఒకడుంటాడు, జ్ఞానం లేనిదే, అల్లాహ్ ను గురించి వాదులాడే వాడు మరియు ధిక్కారి అయిన ప్రతి షైతాన్ ను అనుసరించేవాడు.
4. అతడిని (షైతాన్ ను) గురించి వ్రాయబడిందేమిటంటే, వాస్తవానికి ఎవడైతే అతడి వైపునకు మరలుతాడో, వాడిని నిశ్చయంగా, అతడు మార్గభ్రష్టుడిగా చేస్తాడు మరియు వాడికి మండే నరకాగ్ని వైపునకు మార్గదర్శకత్వం చేస్తాడు.
5. ఏ మానవులారా! ఒకవేళ (మరణించిన తరువాత)

---

[*] [అల్-హజ్ అంటే హజ్ యాత్ర]

మరల సజీవులుగా లేపబడటాన్ని గురించి మీకు ఏదైనా సందేహముంటే! (జ్ఞాపకముంచుకోండి) నిశ్చయంగా, మేము మిమ్మల్ని మట్టితో సృష్టించాము[1], తరువాత వీర్యబిందువుతో, ఆ తరువాత నెత్తురు గడ్డతో, ఆ పైన మాంసపు కండతో; అది పూర్తిగా రూపం పొందవచ్చు, లేక పూర్తిగా రూపం పొందక పోవచ్చు. ఇదంతా మేము మీకు (మా శక్తిని తెలుసుకోవటానికి) స్పష్టం చేస్తున్నాము. ఆ తరువాత మేము కోరిన వారిని ఒక నిర్ణీత కాలం వరకు గర్భకోశాలలో ఉంచుతాము. పిదప మిమ్మల్ని శిశువుల రూపంలో బయటికి తీస్తాము. ఆ తరువాత మిమ్మల్ని యవ్వన దశకు చేరనిస్తాము. మీలో ఒకడు (వృద్ధుడు కాకముందే) చనిపోతాడు, మరొకడు నికృష్టమైన వృద్ధాప్యం వరకు చేర్చబడతాడు[2]; అప్పుడతడు, మొదట అంతా తెలిసిన వాడైనా ఏమీ తెలియని వాడిగా అయి పోతాడు. నీవు భూమిని ఫలింపలేని దానిగా చూస్తావు. కాని ఒకవేళ మేము దానిపై నీటిని (వర్షాన్ని) కురిపిస్తే, అది పులకరించి పొంగిపోయి అన్ని రకాల మనోహరమైన వృక్ష కోటిని ఉత్పన్నం చేస్తుంది.

6. ఇదంతా ఎందుకంటే! నిశ్చయంగా, అల్లాహ్!

---

[1] 'మట్టితో సృష్టించాము.' ఇటువంటి ఇతర ఆయతులకు చూడండి, 3:59, 11:61, 18:37, 30:20, 23:12.

[2] చూడండి, 16:70.

ఆయనే సత్యం, మరియు నిశ్చయంగా ఆయన మాత్రమే చచ్చిన వారిని తిరిగి బ్రతికించగలవాడు మరియు నిశ్చయంగా ఆయనే ప్రతిదీ చేయగల సమర్థుడు.

7. మరియు అంతిమ ఘడియ నిశ్చయంగా రానున్నది. అందులో ఎలాంటి సందేహం లేదు మరియు నిశ్చయంగా, అల్లాహ్ గోరీలలో నున్న వారిని మరల బ్రతికించి లేపుతాడు.

8. అయినా మానవులలో - జ్ఞానం లేనిదే మరియు మార్గదర్శకత్వం లేనిదే మరియు ప్రకాశవంతమైన గ్రంథం లేనిదే - అల్లాహ్ ను గురించి వాదులాడే వాడు ఉన్నాడు.

9. (అలాంటి వాడు) గర్వంతో తన మెడను త్రిప్పుకుంటాడు. ఇతరులను అల్లాహ్ మార్గం నుండి తప్పింప జూస్తాడు[3]. వానికి ఈ లోకంలో అవమానముంటుంది. మరియు పునరుత్థాన దినమున అతనికి మేము దహించే అగ్ని శిక్షను రుచి చూపుతాము.

10. (అతనితో): "ఇది నీవు నీ చేతులారా చేసి పంపిన దాని (ఫలితం) మరియు నిశ్చయంగా, అల్లాహ్ తన దాసులకు ఎలాంటి అన్యాయం చేయడు!" (అని అనబడుతుంది).

---

[3] ఇక్కడ ఆ వ్యక్తిని గురించి చెప్పబడింది. ఎవనికైతే అల్లాహ్ (సు.తా.)ను గురించి ఎలాంటి జ్ఞానం లేదో! ఈ విధమైన వివరాలకు చూడండి, 31:7, 63:5 మరియు 17:83.

11. మరియు ప్రజలలో కొందరు అంచున[4] నిలచి (సందేహంతో) అల్లాహ్ ను ఆరాధించేవారున్నారు. (అలాంటివాడు) తనకు లాభం కలిగితే, ఎంతో తృప్తి పొందుతాడు. కాని ఆపదకు గురి అయితే ముఖం త్రిప్పుకొని, ఇహమును మరియు పరమును కూడా కోల్పోతాడు. స్పష్టమైన నష్టమంటే ఇదే!

12. అతడు అల్లాహ్ ను వదలి తనకు నష్టం గానీ, లాభం గానీ చేకూర్చలేని వారిని ప్రార్థిస్తున్నాడు. ఇదే మార్గభ్రష్టత్వంలో చాలా దూరం పోవటం[5].

13. ఎవరి వల్ల లాభం కంటే, నష్టమే ఎక్కువ రానున్నదో వారినే అతడు ప్రార్థిస్తున్నాడు. ఎంత నికృష్టుడైన సంరక్షకుడు మరియు ఎంత నికృష్టుడైన అనుచరుడు (అషీరు).

14. విశ్వసించి సత్కార్యాలు చేసేవారిని, అల్లాహ్ నిశ్చయంగా, క్రింద సెలయేళ్ళు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. నిశ్చయంగా, అల్లాహ్ తాను కోరింది చేస్తాడు.

15. ఎవడైతే-ఇహలోకంలో మరియు పరలోకంలో కూడా-అల్లాహ్, అతనికి (ప్రవక్తకు) సహాయ పడడని భావిస్తాడో! (వాడికి సాధ్యమైతే) వాడిని

---

[4] 'హర్ఫున్: అంచున నిలబడినవాడు. అంటే హృదయపూర్వకంగా పూర్తిగా ఇస్లాంలో చేరనివాడు. ఇస్లాం స్వీకరించిన తరువాత లాభం కనిపిస్తే మంచి ధర్మం అంటాడు, లేకుంటే మంచిది కాదు అంటాడు. కొందరు ఎడారి వాసులు ( బద్దూలు) మొదట ఇస్లాం స్వీకరించినప్పుడు ఈ విధంగానే వ్యవహరించారు.

[5] చూడండి, 14:18.

ఒక త్రాడు సహాయంతో ఆకాశం పైకి పోయి, తరువాత వాటిని (అంటే ప్రవక్తపై అవతరింప జేయబడే వహీ మరియు ఇతర సహాయాలను) త్రెంపి చూడమను, అతడి ఈ యుక్తి అతడి క్రోధావేశాన్ని దూరం చేయగలదేమో![6]

16. మరియు ఈ విధంగా మేము దీనిని (ఈ ఖుర్ఆన్ ను) స్పష్టమైన సందేశాలతో అవతరింప జేశాము. మరియు నిశ్చయంగా, అల్లాహ్ తాను కోరిన వారికి సన్మార్గం చూపుతాడు[7].

17. నిశ్చయంగా, (ఈ ఖుర్ఆన్ ను) విశ్వసించిన వారి మరియు యూదులు, సాబీయులు, క్రైస్తవులు, మజూసీలు[8] మరియు బహుదైవారాధకులు అయిన వారి మధ్య పునరుత్థాన దినమున అల్లాహ్ తప్పక తీర్పు చేస్తాడు. నిశ్చయంగా, అల్లాహ్ ప్రతి దానికి సాక్షిగా ఉంటాడు.

---

[6] పైది ఇమామ్ అష్-షౌకాని (ర'హ్మ) గారి తాత్పర్యం. ఇమామ్ ఇబ్నె-కసీ'ర్ (ర'హ్మ) గారి తాత్పర్యం ఇలా ఉంది: 'ఎవడైతే ఇహలోకంలో మరియు పరలోకంలో కూడా అల్లాహ్, దైవప్రవక్తకు సహాయపడడని భావిస్తాడో! వాడిని (తన ఇంటి) కప్పుకు ఒక త్రాడు వేసి దానితో ఉరి వేసుకొని చూడమను. అతడి ఈ యుక్తి అతడి క్రోధావేశాన్ని దూరం చేయగలదేమో!'

[7] చూడండి, 14:4.

[8] అల్-మజూసు: (Magians / Zoroastrians) అంటే మజూసీలు. వారు Zerdusht అనే ఈరాన్ ప్రవక్తను అనుసరిస్తారు. వారి గ్రంథం పేరు, Zend-Avesta, వీరు రెండు ఆరాధ్య దైవాలున్నాయి అంటారు. ఒకటి చీకటి, రెండోది వెలుగు. వీరు ఈరాన్ లో మరియు ఇండియా పాకిస్తాన్ లలో ఉన్న పార్సీలు. వీరు అగ్నిని పూజిస్తారు. కాని అల్లాహ్ (సు.తా.) సర్వసృష్టికి మూలాధారుడు అని కూడా విశ్వాసిస్తారు.

18. ఏమీ? నీకు తెలియదా? నిశ్చయంగా, ఆకాశాలలో ఉన్నవన్నీ మరియు భూమిలో ఉన్న వన్నీ మరియు సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, పర్వతాలు, సర్వవృక్షరాశి, సర్వజీవరాశి మరియు ప్రజలలో చాలామంది, అల్లాహ్ కు సాష్టాంగం (సజ్దా) చేస్తూ ఉంటారని?[9] మరియు చాలామంది శిక్షకు కూడా గురి అవుతారు మరియు అల్లాహ్ ఎవడినైతే అవమానం పాలు చేస్తాడో అతడికి గౌరవమిప్పించగలవాడు ఎవ్వడూ లేడు నిశ్చయంగా అల్లాహ్ తాను కోరిందే చేస్తాడు.

19. ఆ రెండు విపక్ష తెగల వారు తమ ప్రభువును గురించి వాదులాడారు, కావున వారిలో సత్యతిరస్కారులకు అగ్ని వస్త్రాలు కత్తిరించబడి (కుట్టించబడి) ఉంటాయి, వారి తలల మీద సలసలకాగే నీరు పోయబడు తుంది[10].

20. దానితో వారి కడుపులలో ఉన్నది మరియు వారి చర్మాలు కరిగి పోతాయి.

21. మరియు వారిని (శిక్షించటానికి) ఇనుప గదలు ఉంటాయి.

22. ప్రతిసారి వారు దాని (ఆ నరకం) నుండి దాని బాధ నుండి బయట పడటానికి ప్రయత్నించి

---

[9] చూడండి, 13:15 16:48-49.

[10] కొందరు వ్యాఖ్యాతలు వీరిని, విశ్వాసులు మరియు సత్యతిరస్కారులతో పోల్చారు. ఇతరులు బద్ర్ యుద్ధంలో పోరాడిన విశ్వాసులు మరియు ముష్రికులైన మక్కా ఖురైషులతో పోల్చారు. ఇబ్నె-కసు'ర్ (ర'హ్మ) ఈ రెండు వ్యాఖ్యానాలు సరైనవే అంటారు.

నప్పుడల్లా తిరిగి అందులోకే నెట్టబడతారు. మరియు వారితో: "నరకాగ్నిని చవి చూడండి!" (అని అనబడుతుంది).

23. నిశ్చయంగా, విశ్వసించి సత్కార్యాలు చేసేవారిని అల్లాహ్ క్రింద సెలయేళ్ళు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. అందులో వారికి బంగారం మరియు ముత్యాలతో చేయబడిన కంకణాలు తొడిగింప బడతాయి. అక్కడ వారి కొరకు పట్టు వస్త్రాలు ఉంటాయి[11].

24. ఎందుకంటే వారికి మంచి మాటల వైపునకు మార్గదర్శకత్వం చూపబడింది. మరియు వారు సర్వస్తోత్రాలకు అర్హుడైన (అల్లాహ్) యొక్క మార్గం వైపునకు మార్గదర్శకత్వం పొందారు.

25. నిశ్చయంగా, ఎవరైతే సత్యాన్ని తిరస్కరిస్తూ (ప్రజలను) అల్లాహ్ మార్గం నుండి, మస్జిద్ అల్ హరామ్ నుండి ఆటంకపరుస్తారో - దేనికైతే మేము అందరి కొరకు సమానంగా చేసి ఉన్నామో - వారు అక్కడ నివసించేవారైనా సరే, లేదా బయట నుండి

[11] ఈ ఆటంకపరచే వారు, మక్కా ముష్రికులు. వీరు 6వ హిజ్రీలో దైవప్రవక్త ('స'అస) మరియు అతని అనుచరులను (ర'ది.'అన్హుమ్) మక్కాలో ప్రవేశించకుండా ఆపారు. మరియు వారు హుదైబియా నుండి మరలిపోయారు.

వచ్చిన వారైనా సరే[12]. మరియు ఎవరైనా దులో అపవిత్రత మరియు అన్యాయం చేయగోరుతారో, అలాంటి వారికి మేము బాధాకరమైన శిక్షను రుచి చూపుతాము.

26. మరియు మేము ఇబ్రాహీమ్ కు ఈ గృహం (కఅబహ్) యొక్క స్థలాన్ని నిర్దేశించి (చూపుతూ)[13] అతనితో: "ఎవ్వరినీ నాకు సాటిగా (భాగస్వాములుగా) కల్పించకు, మరియు నా గృహాన్ని, ప్రదక్షిణ (తవాఫ్) చేసేవారి కొరకు నమాజ్ చేసేవారి కొరకు, వంగే (రుకూఉ) మరియు సాష్టాంగం (సజ్దా) చేసేవారి కొరకు,

---

[12] దీనిని ఈ విధంగా చాలా మంది వ్యాఖ్యాతలు వివరించారు: మస్జిద్ అల్ - 'హరామ్ మీద అక్కడ నివసించే వారికి మరియు బయట నుండి వచ్చే వారికి సరిసమానమైన హక్కులున్నాయి. అంటే ఏ ముస్లింకు అయినా ఏ సమయంలో గానీ రాత్రింబవళ్ళు, మస్జిద్ అల్ - 'హరాంలో ప్రవేశించి 'తవాఫ్, నమా'జ్, 'ఉమ్రా మొదలైనవి చేసే హక్కు ఉంది. అతనిని ఎవ్వరూ, తన ప్రార్థనల నుండి ఆపరాదు. ఇక 'హరమ్ హద్దులలో ఉన్న భూమిలో ఇండ్లు కట్టుకున్న వారు తమ ఇండ్ల యజమానులు. కాని మినా, ము'జ్ దలిఫా, 'అరఫాత్ ('హజ్ ప్రాంతారాలు) మాత్రం సర్వముస్లింల కొరకు ఉన్నాయి. వాటిపై ఎవ్వరీ యజమాన్యం లేదు. ఈ విషయంపై ధర్మవేత్తలందరూ ఏకీభవిస్తున్నారు. చూ. 2:125.

[13] నూ'హ్ ('అ.స.) 'తుఫాన్ తరువాత, క'అబహ్ గృహాన్ని నిర్మించిన వారు ఇబ్రాహీమ్ ('అ.స.) మరియు అతని కుమారుడు ఇస్మా'యీల్ ('అ.స.). ఆ తరువాత 40 సంవత్సరాల పిదప మస్జిద్ అల్ - అ'ఖ్సా నిర్మించబడింది. (ముస్నద్ అ'హ్మద్ 5/150, 166, 167 మరియు ముస్లిం, కితాబుల్ మసాజిద్).

పరిశుద్ధంగా ఉంచు[14]" అని అన్నాము.

**27.** మరియు ప్రజలకు హజ్జ్ యాత్రను గురించి ప్రకటించు[15]: "వారు పాదాచారులగా మరియు ప్రతి బలహీనమైన ఒంటె (సవారీ) మీద, విశాల (దూర) ప్రాంతాల నుండి మరియు కనుమల నుండి నీ వైపుకు వస్తారు.

**28.** వారు, తమ కొరకు ఇక్కడ ఉన్న ప్రయోజనాలను అనుభవించటానికి మరియు ఆయన వారికి జీవనోపాధిగా ప్రసాదించిన పశువుల మీద, నిర్ణీత దినాలలో అల్లాహ్ పేరును స్మరించి (జిబహ్ చేయటానికి), కావున దానిని (వాటి మాంసాన్ని) తినండి మరియు లేమికి గురి అయిన నిరుపేదలకు తినిపించండి[16].

---

[14] 'తవాఫ్ మరియు నమా'జ్ కేవలం ఈ కాబాకే ప్రత్యేకించబడ్డాయి. కావున అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞ ప్రకారం కేవలం క'అబహ్ కు మాత్రమే 'తవాఫ్ చేయాలి మరియు కేవలం ఈ క'అబహ్ వైపునకే ముఖం చేసి నమా'జ్ చేయాలి. ఈ క'అబహ్ ను విడిచి ఏ ఇతర దానికి 'తవాఫ్ చేయటం లేక దాని వైపునకు ముఖం చేసి నమా'జ్ చేయటం సత్యతిరస్కారం (కుఫ్ర్) అవుతుంది.

[15] 'హజ్ వివరాలకు చూడండి, 2:196-203.

[16] అయ్యామిమ్ మ'లూమాత్: అంటే జి''బహ్ చేసే దినాలు, అంటే 10వ తేదీ మరియు దాని తరువాత మూడు దినాలు, అంటే 11, 12, 13 జు'ల్-'హజ్ తేదీలు. దాని మూడోవంతు మాంసాన్ని నిరుపేదలకు పంచటం విధి. ఈ 'జిబహ్ ఇస్మాయీల్ ('అ.స.) ను, అంతని తండ్రి ఇబ్రాహీమ్ ('అ.స.) - అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞతో - జి''బహ్ చేసిన సందర్భాన్ని జ్ఞాపకం చేసుకోవటానికే. అంటే అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞలను శిరసావహించటమే ప్రతి ముస్లిం విధి. చూడండి, 37:102-107.

**29.** తరువాత వారు హజ్జ్ ఆచారాలు[17] (తఫస్) మరియు మొక్కుబడులు (నుజుర్) పూర్తి చేసుకొనిన పిదప ఆ ప్రాచీన గృహం (కఅబహ్) యొక్క ప్రదక్షిణ చేయాలి[18]

**30.** ఇదే (హజ్జ్)! మరియు ఎవడైతే అల్లాహ్ విధించిన నిషేధాలను (పవిత్ర నియమానలను) ఆదరిస్తాడో, అది అతని కొరకు, అతని ప్రభువు వద్ద ఎంతో మేలైనది. మరియు మీ కొరకు ఇది వరకు మీకు (నిషిద్ధమని) చెప్ప బడినవి తప్ప[19], ఇతర పశువులన్నీ ధర్మ సమ్మతం చేయబడ్డాయి. ఇక మీరు విగ్రహారాధన వంటి మాలిన్యం నుండి దూరంగా ఉండండి మరియు అబద్ధపు (బూటకపు) మాటల నుండి కూడా దూరంగా ఉండండి.

---

[17] అంటే 10వ జు'ల్-'హజ్ న చివరి షై'తైన్ (జమరతుల్ 'అఖబహ్) కు - ఏదైతే మక్కా వైపు ఉందో - ఏడు రవ్వలు రువ్వి, ఖుర్బానీ చేసి, తలవెంట్రుకలను కత్తిరించుకుంటే, అది త'హ్లీలె అవ్వల్ లేక చిన్న 'హలాల్ అవుతుంది. అంటే ఇ'బ్రాహీమ్ నిషేధాలన్నీ ముగిసిపోతాయి. కాని 'తవాఫ్ ఇఫాదా ('జ్యారహ్) చేసే వరకు భార్యతో సంభోగం చేయడం నిషిద్ధం.

[18] 'తవాఫె 'జ్యారహ్ : ఇది విధి, తప్పక చేయవలసింది. ఇది 'అరఫాత్ నుండి బయలు దేరి 9-10 తేదీల మధ్య రాత్రి ము'జ్ దలిఫాలో గడిపి 10వ తేదీ ఉదయం చివరి షై'తాన్ (జమరతుల్ 'అఖబహ్) కు ఏడు రవ్వలు రువ్వి, 'ఖుర్బానీ ఇచ్చి తలవెంట్రుకలు కత్తిరించుకొని, ఇ'హ్రామ్ విడిచిన తరువాత మక్కాకు పోయి క'అబహ్ గృహం చుట్టూ ఏడు సార్లు ప్రదక్షిణ చేయటం. ఇది 10,11,12 జు'ల్-'హజ్ తేదీలలో పూర్తి చేయాలి. దీని తరువాత భార్యతో సంభోగం చేయవచ్చు. ఇది చివరి 'హలాల్. వివరాలకు చూడండి, 2:196-197.

[19] చూడండి, 5:3.

31. ఏకాగ్రచిత్తంతో (ఏకదైవ సిద్ధాంతంతో)[20] అల్లాహ్ వైపునకే మరలండి. ఆయనకు సాటి (భాగస్వాములను) కల్పించకండి. అల్లాహ్ కు సాటి కల్పించిన వాని గతి ఆకాశం నుండి క్రింద పడిపోయే దాని వంటిదే! దానిని పక్షులైనా ఎత్తుకొని పోవచ్చు, లేదా గాలి అయినా దూర ప్రదేశాలకు ఎగుర గొట్టుకు పోవచ్చు!

32. ఇదే! మరియు ఎవడైతే, అల్లాహ్ నియమించిన చిహ్నాలను[21] గౌరవిస్తాడో, అది నిశ్చయంగా, హృదయాలలో ఉన్న దైవభీతి వల్లనే!

33. ఒక నిర్ణీత కాలం వరకు మీకు వాటిలో (ఈ పశువులలో) లాభాలున్నాయి[22]. ఆ తరువాత వాటి గమ్యస్థానం ప్రాచీన గృహమే (కఅబహ్ యే)!

34. మరియు ప్రతి సమాజానికి మేము ధర్మ ఆచారాలు

---

[20] హునఫా': అంటే ఒకే వైపుకు మొగ్గటం. అంటే ఏకదైవ సిద్ధాంతాన్ని పాటించటం. ఆరాధనలను కేవలం ఆ ఏకైక ఆరాధ్యుడు అల్లాహ్ (సు.తా.) కే ప్రత్యేకించుకోవటం. ఇంకా చూడండి, 2:135.

[21] ష'ఆఇరల్లాహ్: అల్లాహ్ నియమించిన చిహ్నాలు అంటే 'సఫా-మర్వాలు మరియు ఖుర్బానీ పశువులు మొదలైనవి. ఇంకా చూడండి, 5:2.

[22] అంటే ఖుర్బానీ పశువులను, జి''బహ్ చేయనంతవరకు వాటిని వినియోగించుకోవటం ధర్మసమ్మతమే! అంటే ఒకవేళ అది ఒంటె ఉంటే దానిపై ఎక్కి 'హజ్ కు పోవచ్చు. ('స'హీ'హ్ బు'ఖారీ).

(ఖుర్బానీ పద్ధతి)[23] నియమించి ఉన్నాము. మేము వారి జీవనోపాధి కొరకు ప్రసాదించిన పశువులను, వారు (వధించే టప్పుడు) అల్లాహ్ పేరును ఉచ్ఛరించాలి. ఎందుకంటే మీరందరి ఆరాధ్యదైవం ఆ ఏకైక దేవుడు (అల్లాహ్)! కావున మీరు ఆయనకు మాత్రమే విధేయులై (ముస్లింలై) ఉండండి. మరియు వినయ విధేయతలు గలవారికి శుభవార్తనివ్వు.

35. (వారికి) ఎవరి హృదయాలైతే, అల్లాహ్ పేరు ఉచ్ఛరించబడినప్పుడు భయంతో వణికి పోతాయో మరియు ఆపదలలో సహనం వహిస్తారో మరియు నమాజ్ స్థాపిస్తారో మరియు వారికి ప్రసాదించిన జీవనోపాధి నుండి ఇతరులపై ఖర్చు చేస్తారో!

36. ఖుర్బానీ పశువులను[24], మేము మీ కొరకు అల్లాహ్ చిహ్నాలుగా చేశాము; మీకు వాటిలో మేలున్నది. కావున వాటిని (ఖుర్బానీ కొరకు) నిలబెట్టి వాటిపై అల్లాహ్ పేరును ఉచ్ఛరించండి. అవి (ప్రాణం విడిచి) ప్రక్కల మీద పడిపోయిన

[23] అల్-మనాసికు: అంటే, విధేయత లేక ఆరాధన అంటే అల్లాహ్ (సు.తా.) సాన్నిధ్యం పొందటానికి, అల్లాహ్ (సు.తా.) ప్రీతి కొరకు అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞాపించిన ఆచారాలను పూర్తి చేయటం. అల్లాయేతరుల పేరుతో ఖుర్బానీ చేయటం నిషిద్ధం ('హరాం). 'హజ్ ఆచారాలు కూడా మనాసిక్ అనబడతాయి. దీని ఏకవచనం నుసుకున్.

[24] బుద్ నున్, బదనతున్ యొక్క బహువచనం. అంటే బాగా బలసిన పశువు. సాధారణంగా ఈ శబ్దం ఒంటెలకే వాడబడుతుంది. కానీ 'హదీస్'ల ప్రకారం, ఖుర్బానీ కొరకు తేబడిన ఆవులు ఎడ్లు మొదలైన వాటిని సూచిస్తుంది.

తరువాత మీరు వాటిని తినండి[25]. మరియు యాచించని పేదలకు మరియు యాచించే పేదలకు కూడా తినిపించండి. ఈ విధంగా మేము వాటిని మీకు ఉపయుక్తంగా చేశాము, బహుశా మీరు కృతజ్ఞులవు తారేమోనని.

37. వాటి మాంసం గానీ వాటి రక్తం గానీ అల్లాహ్ కు చేరవు! కానీ మీ భయభక్తులే ఆయనకు చేరుతాయి. మీకు సన్మార్గం చూపినందుకు, మీరు అల్లాహ్ ఘనతను కొనియాడటానికి, ఈ విధంగా ఆయన వాటిని మీకు వశపరిచాడు. సజ్జనులకు శుభవార్తను వినిపించు!

38. నిశ్చయంగా, అల్లాహ్ విశ్వసించిన వారిని కాపాడుతాడు. నిశ్చయంగా అల్లాహ్ ఏ విశ్వాస ఘాతకుణ్ణి మరియు కృతఘ్నుణ్ణి ప్రేమించడు.

39. తమపై దాడి చేసిన వారితో యుద్ధం చేయటానికి

---

[25] అంటే వాటి రక్తం పూర్తిగా పారిన తరువాత అవి పూర్తిగా కదలకుండా పడిపోయిన తరువాత వాటిని తినండి. ఎందుకంటే సజీవిగా ఉన్న పశువు మాంసం తినటం నిషిద్ధం, (అబూ దావూద్, తిర్మిజీ'). 'ఖుర్బానీ పశువు మాంసం స్వయంగా తినటం కొందరు ధర్మవేత్తలు వాజిబ్ గా మరికొందరు ముస్తహబ్ గా ఖరారు చేశారు. 'ఖుర్బానీ మాంసాన్ని మూడు భాగాలు చేయాలి. ఒక భాగం స్వంతం మరియు తన కుటుంబం వారికి రెండోది బంధుమిత్రులకు మరియు మూడోది పేదవారి కొరకు, (ముస్లిం, బు'ఖారీ). 'ఖుర్బానీ, 'హజ్ సమయంలోనే గాక, జు'ల్-'హజ్ పండుగ కొరకు కూడా చేయాలి 108:2, అంటే ఎవరు 'హజ్ యాత్రకు పోరో, వారు తమ ఇండ్లలో 10-12వ జు'ల్ 'హజ్ రోజులలో ఖుర్బానీ చేయాలి. ఇది 'ఈద్ నమాజ్ తరువాత చేయాలి, (స'హీహ్ బు'ఖారీ).

అనుమతి ఇవ్వబడుతోంది[26]. ఎందుకంటే, వారు అన్యాయానికి గురి చేయ బడ్డారు. నిశ్చయంగా, అల్లాహ్ వారికి సహాయం చేయగల సమర్థుడు.

**40.** వారికి ఎవరైతే కేవలం: "మా ప్రభువు అల్లాహ్!" అని అన్నందుకు మాత్రమే, అన్యాయంగా తమ ఇండ్ల నుండి తరిమి వేయబడ్డారో! ఒకవేళ అల్లాహ్ ప్రజలను ఒకరి ద్వారా మరొకరిని తొలగిస్తూ ఉండకపోతే[27] క్రైస్తవ సన్యాసుల మఠాలు, చర్చ్ులు, యూదుల ప్రార్థనాలయాలు[28] మరియు మస్జిదులు, ఎక్కడైతే అల్లాహ్ పేరు అత్యధికంగా స్మరించబడుతుందో, అన్నీ ధ్వంసం చేయబడి ఉండేవి[29]. నిశ్చయంగా తనకు తాను సహాయం చేసుకునేవానికి అల్లాహ్ తప్పకుండా సహాయం చేస్తాడు. నిశ్చయంగా, అల్లాహ్ మహాబలవంతుడు, సర్వశక్తిమంతుడు.

---

[26] ఈ ఆయత్ లో, ఖుర్ఆన్ అవతరణలో, మొదటిసారి ఆత్మరక్షణ కొరకు యుద్ధపరిమితి ఇవ్వబడింది. అబ్దుల్లాహ్ ఇబ్నె 'అబ్బాస్ (ర'ది.'అ.) కథనం ప్రకారం ఈ ఆయత్ దైవప్రవక్త (సఅస) మక్కా నుండి మదీనా వలస పోయిన వెంటనే అవతరింపజేయబడింది. మొదటి హిజ్రీ మొదట్లో, దీని తరువాత రెండవ హిజ్రీలో ఆయత్'లు 2:190-193 అవతరింపజేయబడ్డాయి. ఆ తరువాత 2:216, 224 అవతరింపజేయ బడ్డాయి.

[27] ఇటువంటి వాక్యానికి చూడండి, 2:251

[28] యూదుల మాతాచారు (అ'హ్ బార్) లు తమ మత ధర్మాలను ఉపదేశించే స్థలాలు, లేక యూదుల ప్రార్థనాలయాలు (సైనగోజెస్ / Synagogues) అనబడతాయి.

[29] ధర్మస్వాతంత్ర్యం కొరకు ఆయుధాలు ఎత్తుకోవడం అత్యవసరమైన పని. చూడండి, 2:193.

41. వారే! ఒకవేళ మేము వారికి భూమిపై అధికారాన్ని ప్రసాదిస్తే, వారు నమాజ్ స్థాపిస్తారు, విధిదానం (జకాత్) ఇస్తారు మరియు ధర్మమును (మంచిని) ఆదేశిస్తారు మరియు అధర్మము (చెడు) నుండి నిషేధిస్తారు[30]. సకల వ్యవహారాల అంతిమ నిర్ణయం అల్లాహ్ చేతిలోనే వుంది.

42. మరియు (ఓ ముహమ్మద్!) వారు (సత్యతిరస్కారులు) ఒకవేళ నిన్ను అసత్య వాదుడవు అని తిరస్కరిస్తే (ఆశ్చర్యపడకు); వాస్తవానికి, వారికి పూర్వం నూహ్, ఆద్ మరియు సమూద్ జాతుల వారు కూడా (తమ ప్రవక్తలను) అసత్యవాదులని తిరస్కరించారు;

43. మరియు ఇబ్రాహీమ్ జాతివారు మరియు లూత్ జాతివారు;

44. మరియు మద్ యన్ వాసులు కూడాను! అంతేకాదు మూసా కూడా అసత్య వాదుడవని తిరస్కరించబడ్డాడు. కావున నేను సత్యతిరస్కారులకు (మొదట) కొంత వ్యవధినిచ్చి, తరువాత పట్టుకుంటాను. (చూశారా!) నన్ను తిరస్కరించడం వారి కొరకు ఎంత ఘోరమైనదిగా ఉండెనో!

45. (ఈ విధంగా), మేము ఎన్నో పురాలను నాశనం

---

[30] ఈ ఆయత్ లో ఇస్లామీయ రాజ్యం యొక్క మూలసూత్రాలు పేర్కొనబడ్డాయి. 1) నమా'జ్, 2) 'జకాత్, 3) మంచిని ఆదేశించడం లేక ప్రోత్సహించడం, 4) చెడును నిరోధించడం లేక నివారించడం మరియు 5) షరీయత్ ప్రకారం శిక్ష విధించడం మొదలైనవి. ఇటువంటి సూత్రాలు ఇప్పుడు స'ఊదీ 'అరేబియాలోనే అత్యధికంగా పాటించబడుతున్నాయి. కాబట్టి అక్కడ ప్రపంచంలో ఏ దేశంలో లేని శాంతిభద్రతలు ఉన్నాయి. అల్లాహ్ (సు.తా.) దానిని భద్రపరచు గాక!

చేశాము. ఎందుకంటే, వాటి (ప్రజలు) దుర్మార్గులై ఉండిరి. (ఈనాడు) అవి నాశనమై, తమ కప్పుల మీద తలక్రిందులై పడి వున్నాయి. వారి బావులు మరియు వారి దృఢమైన కోటలు కూడా పాడుపడి ఉన్నాయి!

**46.** ఏమీ? వారు భూమిలో ప్రయాణం చేయరా? దానిని, వారి హృదయాలు (మనస్సులు) అర్థం చేసుకోగలగటానికి మరియు వారి చెవులు దానిని వినటానికి? వాస్తవమేమిటంటే వారి కన్నులైతే గ్రుడ్డివి కావు, కాని ఎదలలో ఉన్న హృదయాలే గ్రుడ్డివయి పోయాయి.

**47.** మరియు (ఓ ముహమ్మద్!) వారు నిన్ను శిక్ష కొరకు తొందర పెడుతున్నారు[31]. కాని అల్లాహ్ తన వాగ్దానాన్ని భంగపరచడు. మరియు నిశ్చయంగా, నీ ప్రభువు వద్ద ఒక్క దినం మీ లెక్కల ప్రకారం వేయి సంవత్సరాలకు సమానమైనది[32].

**48.** మరియు దుర్మార్గంలో మునిగివున్న ఎన్నో నగరాలకు నేను వ్యవధినిచ్చాను! తరువాత

---

[31] చూడండి, 6:57, 8:32 మరియు 13:6.

[32] మానవుల 'కాలగణనం' భూమి, సూర్యచంద్రుల సంచారంతో బంధింపబడివుంది. అల్లాహ్ (సు.తా.) కాలానికి పరిమితుడైనవాడు కాడు. ఆయన అంతర్యామి. ఆయనకు మొదలు, ముగింపు అనేవి లేవు. ఏవైతే కాలానికి సంబంధించినవో! ఇంకా చూడండి, 70:4. అక్కడ ఒక దినం ఏబది వేల సంవత్సరాలతో సమానమనబడింది. దీనిని సమర్థించటానికి ఎన్నో 'స'హీ'హ్ హదీస్'లున్నాయి. అల్లాహ్ (సు.తా.) అన్నాడు: 'నేనే కాలాన్ని (అద్దహ్ర్).'

వాటిని (శిక్షించటానికి) పట్టుకున్నాను. (వారి) గమ్యస్థానం నా వైపునకే కదా!"

**49.** (ఓ ముహమ్మద్!) వారితో అను: "ఓ మానవులారా! నేను కేవలం మీకు స్పష్టంగా హెచ్చరిక చేసేవాడను మాత్రమే!"

**50.** కావున ఎవరైతే, విశ్వసించి సత్కార్యాలు చేస్తారో, వారికి క్షమాపణ మరియు గౌరవ ప్రదమైన జీవనోపాధి ఉంటాయి[33].

**51.** కాని ఎవరైతే మా సూచనలను కించపరచటానికి ప్రయత్నిస్తారో అలాంటి వారు తప్పక భగభగ మండే నరకాగ్నివాసులవుతారు.

**52.** మరియు (ఓ ప్రవక్తా!) నీకు పూర్వం మేము పంపిన ఏ సందేశహరుడు గానీ, లేదా ప్రవక్త గానీ (నా సందేశాన్ని ప్రజలకు) అందించగోరినపుడు, షైతాన్ అతని కోరికలను ఆటంక పరచ కుండా ఉండలేదు[34]. కాని షైతాన్ కల్పించిన ఆటంకాలను అల్లాహ్ నిర్మూలించాడు. ఆ తరువాత అల్లాహ్ తన ఆయత్ లను స్థిరపరచాడు[35]. మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, మహావివేచనాపరుడు.

**53.** ఎవరి హృదయాలలో రోగముందో![36] మరియు ఎవరి హృదయాలు కఠినమైనవో, వారికి షైతాన్ కల్పించేవి (సందేహాలు) ఒక పరీక్షగా చేయబడటానికి.

---

[33] చూడండి, 8:4.
[34] చూడండి, 6:112.
[35] చూడండి, 11:1.
[36] చూడండి, 2:10

మరియు నిశ్చయంగా ఈ దుర్మార్గులు విరోధంలో చాలా దూరం వెళ్ళిపోయారు.

**54.** మరియు జ్ఞానమొసంగ బడినవారు ఇది (ఈ ఖుర్ఆన్) నీ ప్రభువు తరఫు నుండి వచ్చిన సత్యమని తెలుసుకొని దానిని విశ్వసించటానికి, వారి హృదయాలు దానికి అంకితం అవటానికి. మరియు నిశ్చయంగా, అల్లాహ్ విశ్వసించే వారికి ఋజుమార్గం వైపునకు మార్గదర్శత్వం[37] చేస్తాడు.

**55.** మరియు సత్యతిరస్కారులు దీనిని (ఈ ఖుర్ఆన్ ను) గురించి - అకస్మాత్తుగా అంతిమ ఘడియ వచ్చే వరకు లేదా ఆ ఏకైక దినపు శిక్ష అవతరించే వరకు - సందేహంలో పడి ఉంటారు[38].

**56.** ఆ రోజు సర్వాధిపత్యం అల్లాహ్ దే[39]. ఆయన వారి మధ్య తీర్పు చేస్తాడు. కావున విశ్వసించి సత్కార్యాలు చేసేవారు పరమానందకరమైన స్వర్గవనాలలో ఉంటారు.

**57.** కాని, ఎవరైతే సత్యతిరస్కారులై, మా సూచనలను అబద్ధాలని తిరస్కరించారో, వారికి అవమానకరమైన శిక్ష ఉంటుంది.

**58.** ఎవరు అల్లాహ్ మార్గంలో తమ ఇండ్లను వదలి

---

[37] అల్-హాది: సేకరించబడిన పదం. Guide, Leader. మార్గదర్శకుడు, సన్మార్గం చూపువాడు. ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి.

[38] యౌమిన్ 'అ'ఖీమ్: అంటే గొడ్డుదినం. అంటే మళ్ళీ రాని ఏకైక దినం, పునరుత్థానం. చూ. 51:41.

[39] చూడండి, 25:26 మరియు 40:16.

(వలస) పోయి, ఆ తరువాత చంపబడతారో లేదా మరణిస్తారో వారికి అల్లాహ్ (పరలోకంలో) శ్రేష్ఠమైన ఉపాధిని ప్రసాదిస్తాడు[40]. నిశ్చయంగా, అల్లాహ్ మాత్రమే ఉత్తమ ఉపాధి ప్రదాత.

**59.** ఆయన వారిని వారు తృప్తిపడే స్థలంలో ప్రవేశింపజేస్తాడు[41]. మరియు నిశ్చయంగా, అల్లాహ్ సర్వజ్ఞుడు, సహనశీలుడు.

**60.** ఇదే (వారి పరిణామం!)[42] ఇక ఎవడైతే తనకు కలిగిన బాధకు సమానంగా మాత్రమే ప్రతీకారం తీసుకున్న[43] తరువాత అతనిపై మరల దౌర్జన్యం జరిగితే! నిశ్చయంగా అల్లాహ్ అతనికి సహాయం చేస్తాడు. నిశ్చయంగా, అల్లాహ్ మన్నించేవాడు, క్షమించేవాడు[44].

**61.** ఇలాగే జరుగుతుంది! నిశ్చయంగా, అల్లాహ్ యే రాత్రిని పగటిలోకి ప్రవేశింపజేసే వాడు మరియు పగటిని రాత్రిలోకి ప్రవేశింప జేసేవాడు మరియు

---

[40] ఎవరైతే అల్లాహ్ (సు.తా.) మార్గంలో వలసపోయి అక్కడ చంపబడతారో వారికి స్వర్గసుఖాలు లభిస్తాయి. ఇంకా చూడండి, 2:218 మరియు 4:95-96.

[41] స్వర్గసుఖాలు ఎలాంటి వంటే వాటిని ఇంత వరకు ఏ కన్నూ చూడలేదు, ఏ చెవీ వినలేదు మరియు ఏ మానవుడు కూడా ఊహించలేడు.

[42] ఏ విశ్వాసులైతే వలసపోయి మరణిస్తారో!

[43] చూడండి, 16:126 శత్రువు నుండి బాధ కలిగిన వానికి తనకు జరిగిన బాధకు సమానంగా ప్రతీకారం తీసుకునే హక్కు ఉంది. ఇలాంటి న్యాయ ప్రతీకారంలో అల్లాహ్ (సు.తా.) కూడా చాలా క్షమించేవాడు.

[44] చూడండి, 2:190-193, ఒకవేళ క్షమిస్తే! అల్లాహ్ (సు.తా.) కూడా చాలా క్షమించేవాడు.

నిశ్చయంగా, అల్లాహ్ సర్వం వినేవాడు, అంతా చూసేవాడు[45].

62. ఇది ఎందుకంటే, నిశ్చయంగా అల్లాహ్! ఆయనే సత్యం![46] మరియు అయనకు బదులుగా వారు ఆరాధించేవన్నీ అసత్యాలే! మరియు నిశ్చయంగా అల్లాహ్ ఆయన మాత్రమే మహోన్నతుడు, మహనీయుడు (గొప్పవాడు).

63. ఏమీ? నీకు తెలియదా? నిశ్చయంగా అల్లాహ్ యే ఆకాశం నుండి వర్షం కురిపించి, దానితో భూమిని పచ్చగా చేస్తాడని? నిశ్చయంగా, అల్లాహ్ సూక్ష్మగ్రాహి, సర్వం తెలిసినవాడు.

64. ఆకాశాలలో ఉన్నది మరియు భూమిలో ఉన్నది అంతా ఆయనకు చెందినదే. మరియు నిశ్చయంగా, అల్లాహ్! ఆయన మాత్రమే స్వయం సమృద్ధుడు, ప్రశంసనీయుడు.

65. ఏమీ? నీకు తెలియదా? నిశ్చయంగా, అల్లాహ్ భూమిలో ఉన్న సమస్తాన్ని మీకు వశపరచాడు. మరియు సముద్రంలో పడవ ఆయన అనుమతితోనే నడుస్తుంది మరియు ఆయనే! తాను అనుమతించే వరకు ఆకాశాన్ని భూమి

---

[45] చూడండి, 3:26-27 కాని అల్లాహ్ (సు.తా.) కోరితే దుర్మార్గులకు ప్రతీకారం కూడా చేయగలడు. అల్లాహ్ (సు.తా.) ప్రతిదీ చేయగల సమర్థుడు.

[46] ఎందుకంటే అల్లాహ్ (సు.తా.) ధర్మమే సత్యధర్మం, ఆయన ఆరాధనయే సత్య ఆరాధన, ఆయన వాగ్దనమే సత్యవాగ్దానం. ఆయన, తన స్నేహితులకు వారి శత్రువులకు విరుద్ధంగా సహాయపడటం కూడా సత్యమే! అల్లాహ్ (సు.తా.) తన ఉనికిలో తన కార్యసాధనలో, తన యోగ్యతలో సత్యవంతుడు.

మీద పడకుండా నిలిపి ఉంచాడు[47]. నిశ్చయంగా, అల్లాహ్ మానవుల పట్ల ఎంతో కనికరుడు, అపార కరుణా ప్రదాత.

**66.** మరియు ఆయనే మీకు జీవితాన్ని ప్రసాదించాడు, తరువాత ఆయనే మిమ్మల్ని మరణింపజేస్తాడు. ఆ తరువాత ఆయనే మిమ్మల్ని మళ్ళీ బ్రతికిస్తాడు. నిశ్చయంగా మానవుడు ఎంతో కృతఘ్నుడు!

**67.** మేము ప్రతి సమాజం వారికి ఒక ఆరాధనా రీతిని నియమించాము[48]. వారు దానినే అనుసరిస్తారు. కావున వారిని ఈ విషయంలో నీతో వాదులాడనివ్వకు. మరియు వారిని నీ ప్రభువు వైపుకు ఆహ్వానించు. నిశ్చయంగా నీవు సరైన మార్గదర్శకత్వంలో ఉన్నావు.

**68.** ఒకవేళ వారు నీతో వాదులాటకు దిగితే, వారితో అను: "మీరు చేసేదంతా అల్లాహ్ కు బాగా తెలుసు[49].

**69.** అల్లాహ్ పునరుత్థాన దినమున, మీరు పరస్పరం కలిగి ఉన్న అభిప్రాయ భేదాల గురించి తీర్పు చేస్తాడు."

**70.** ఏమీ? నీకు తెలియదా? ఆకాశంలో మరియు భూమిలో ఉన్నదంతా అల్లాహ్ కు బాగా తెలుసని! నిశ్చయంగా, ఇదంతా ఒక గ్రంథంలో (వ్రాయబడి)

---

[47] అంటే నక్షత్రాలు మరియు గ్రహాలు పడిపోకుండా మరియు ఒక దానితో ఒకటి ఢీకొనకుండా ఉన్న గురుత్వాకర్షణ శక్తి (Gravitational Force) అల్లాహ్ (సు.తా.) ప్రసాదించినదే.

[48] చూడండి, 5:48.

[49] చూడండి, 10:41.

ఉంది. నిశ్చయంగా ఇదంతా అల్లాహ్ కు చాలా సులభమైనది[50].

71. మరియు వారు అల్లాహ్ ను వదలి ఇతరులను ఆరాధిస్తున్నారు. దాని కొరకు ఆయన ఎలాంటి నిదర్శనాన్ని అవతరింపజేయలేదు మరియు వారికి (సత్యతిరస్కారులకు) దానిని గురించి ఎలాంటి జ్ఞానం లేదు మరియు దుర్మార్గులకు సహాయపడేవాడు ఎవ్వడూ ఉండడు[51]

72. మరియు మా స్పష్టమైన సూచనలు వారికి వినిపించబడినప్పుడు, సత్యతిరస్కారుల ముఖాల మీద తిరస్కారాన్ని నీవు గమనిస్తావు. ఇంకా వారు మా సూచనలను వినిపించే వారిపై దాదాపు విరుచుకు పడబోయే వారు. వారితో అను: "ఏమీ? నేను దీని కంటే ఘోరమైన విషయాన్ని గురించి మీకు తెలుపనా? అది నరకాగ్ని! అల్లాహ్ దానిని సత్యతిరస్కారులకు వాగ్దానం చేసి ఉన్నాడు. మరియు అది ఎంత

---

[50] ప్రతివాడు ఏమి కాబోతున్నాడు అనేది అల్లాహ్ కు తెలుసు కాబట్టి ఆయన సంభవించబోయేదంతా ఒక గ్రంథంలో వ్రాసి పెట్టాడు. ఇదే విధివ్రాత (ఖద్ర్). అంటే అల్లాహ్ (సు.తా.) ఎవరిని కూడా మంచి లేక చెడు మార్గాలను అవలంబించటానికి బలవంతం చేయడు. 'స'హీ'హ్ ముస్లింలో ఉంది: 'అల్లాహ్ భూమ్యాకాశాల సృష్టికి 50 వేల సంవత్సరాలకు ముందు తన సృష్టి యొక్క విధి వ్రాసి పెట్టాడు. అప్పుడు ఆయన విశ్వసామ్రాజ్యాధిపత్య పీఠం ('అర్ష్) నీటిపై ఉండెను.'

[51] అంటే అల్లాహ్ (సు.తా.) ను విడిచి ఇతరులను ఆరాధించాలని, ఎలాంటి దివ్యజ్ఞానం గానీ, - వివేచనా బుద్ధితో ఆలోచిస్తే అర్థమయ్యే - నిదర్శనం గానీ ఈ సత్యతిరస్కారుల దగ్గర ఏదీ లేదు.

అధ్వాన్నమైన గమ్యస్థానం."

73. ఓ మానవులారా! ఒక ఉదాహరణ ఇవ్వబడుతోంది, దానిని శ్రద్ధగా వినండి! నిశ్చయంగా, మీరు అల్లాహ్ ను వదిలి ఎవరినైతే ప్రార్థిస్తున్నారో, వారంతా కలిసి ఒక్క ఈగను కూడా సృష్టించలేరు. మరియు ఒకవేళ, ఆ ఈగ వారి నుండి ఏమైనా లాక్కొని పోయినా, వారు దానిని, దాని (ఆ ఈగ) నుండి విడిపించుకోనూ లేరు[52]. ఎంత బలహీనులు, ఈ అర్థించేవారు మరియు అర్థించబడేవారు.

74. అల్లాహ్ ఘనతను వారు గుర్తించవలసిన విధంగా గుర్తించలేదు. వాస్తవానికి, అల్లాహ్ మహా బలవంతుడు, సర్వ శక్తిమంతుడు.

75. అల్లాహ్ దేవదూతల నుండి మానవుల నుండి తన సందేశహరులను ఎన్నుకుంటాడు. నిశ్చయంగా, అల్లాహ్ సర్వం వినేవాడు, అంతా చూసేవాడు.

76. ఆయనకు, వారికి ప్రత్యక్షంగా ఉన్నది మరియు వారికి పరోక్షంగా ఉన్నది అంతా తెలుసు. మరియు అన్ని వ్యవహారాలు (పరిష్కారానికి) అల్లాహ్ వైపునకే మరలింప బడతాయి.

77. ఓ విశ్వాసులారా! (మీ ప్రభువు సన్నిధిలో)

---

[52] ఇక్కడ మానవులు అల్లాహ్ (సు.తా.)ను వదలి ఎవరినైతే ఆరాధిస్తున్నారో వారు అంటే, మూర్తులు, దర్గాలు, సన్యాసులు, దైవ అవతారులుగా భావించబడే వారు, అల్లాహ్ కుమారులుగా భావించబడేవారు, దైవదూతలు, ప్రవక్తలు మొదలైన వారంతా అని అర్థము.

వంగండి (రుకూఉ చేయండి), సాష్టాంగం (సజ్దా) చేయండి మరియు మీ ప్రభువునే ఆరాధించండి మరియు మంచిపనులు చేయండి, అప్పుడే మీరు సాఫల్యం పొందుతారు.

78. మరియు అల్లాహ్ మార్గంలో పోరాడవలసిన విధంగా ధర్మపోరాటం చేయండి[53]. ఆయన మిమ్మల్ని ఎన్నుకున్నాడు. మరియు ఆయన ధర్మం విషయంలో మీకు ఎలాంటి ఇబ్బంది కలిగించలేదు. ఇది మీ తండ్రి ఇబ్రాహీమ్ మతమే[54]. ఆయన మొదటి నుండి మీకు అల్లాహ్ కు విధేయులు (ముస్లింలు) అని పేరు పెట్టాడు. దీనికై మీ సందేశహరుడు మీకు సాక్షిగా ఉండ టానికి మరియు మీరు ప్రజలకు సాక్షులుగా ఉండటానికి[55]. కావున నమాజ్ స్థాపించండి, విధి దానం (జకాత్) ఇవ్వండి. మరియు అల్లాహ్ తో గట్టి సంబంధం కలిగి ఉండండి, ఆయనే మీ సంరక్షకుడు, ఎంత శ్రేష్ఠమైన సంరక్షకుడు మరియు ఎంత ఉత్తమ సహాయకుడు!

---

[53] అల్-జిహాదు: ధర్మపోరాటం అంటే: 1) అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞలను పాలించటానికి, తన ఆత్మతో, 2) ష'తాన్ రేకెత్తించే ప్రేరణలతో, 3) ఆత్మరక్షణకు మరియు తన ధర్మాన్ని స్వేచ్ఛగా పాటిస్తూ, శాంతితో, దానిని ఇతరులకు బోధిస్తూ ఉంటే, ఆటంక పరిచే వారితో, చేసే ధర్మపోరాటం.

[54] తండ్రి ఇబ్రాహీమ్, అంటే అతను దైవప్రవక్త ము'హమ్మద్ ('స'అస) పూర్వీకుడే కాక, ఏక దైవసిద్ధాంతాన్ని అనుసరించే వారందరి తండ్రి కూడాను.

[55] ఈ సాక్ష్యాలు తీర్పుదినమున జరుగుతాయి. చూడండి, 2:143.

# 23. అల్-మూమినూన్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. వాస్తవానికి విశ్వాసులు సాఫల్యం పొందుతారు;
2. వారే! ఎవరైతే తమ నమాజ్ లో వినమ్రత పాటిస్తారో!
3. మరియు ఎవరైతే వ్యర్థమైన మాటల నుండి దూరంగా ఉంటారో;
4. మరియు ఎవరైతే విధిదానం (జకాత్) సక్రమంగా చెల్లిస్తారో!
5. మరియు ఎవరైతే తమ మర్మాంగాలను కాపాడుకుంటారో -
6. తమ భార్యలతో (అజ్వాజ్ లతో) లేక తమ ఆధీనంలో (కుడిచేతిలో) ఉన్న బానిస స్త్రీలతో తప్ప![1] అలాంటప్పుడు వారు నిశ్చయంగా, నిందార్హులు కారు.

---

[*] [అల్ ము'మినూన్ అంటే దైవవిశ్వాసులు]

[1] ఈ కాలంలో వాస్తవమైన బానిసలు (అంటే యుద్ధంలో పట్టుబడటం వల్ల బానిసలైన వారు) లేరు. ఎందుకంటే ఒక ముస్లింకు మానవులను బానిసలుగా కొనటం, అమ్మటం నిషిద్ధం చేయబడింది. కేవలం ధర్మయుద్ధంలో చేజిక్కిన ఖైదీలే బానిసలు. వారు ఇస్లాం స్వీకరిస్తే వారికి స్వాతంత్ర్యం ఇవ్వాలి. బానిస స్త్రీతో సంతానమైతే వారు వారసత్వంలో హక్కుదారులు. ఈ విధంగా చూస్తే బానిస స్త్రీకి కూడా భార్య హక్కులే ఉంటాయి. కేవలం మహ్ర్ మాత్రమే చెల్లించబడదు. చూడండి, 4:3, 24, 25, 24:32.

7. కాని ఎవరైతే దీనిని మించి కోరుతారో! అలాంటివారే వాస్తవంగా హద్దులను అతిక్రమించినవారు
8. మరియు వారు ఎవరైతే తమ పూచీలను (అమానతులను) మరియు తమ వాగ్దానాలను కాపాడుకుంటారో[2].
9. మరియు వారు ఎవరైతే తమ నమాజ్ లను కాపాడుకుంటారో!
10. అలాంటి వారే (స్వర్గానికి) వారసులు అవుతారు.
11. వారే ఫిరదౌస్ స్వర్గానికి వారసులై, అందులో వారు శాశ్వతంగా ఉంటారు[3].
12. మరియు వాస్తవంగా, మేము మానవుణ్ణి మట్టి యొక్క సారంతో సృష్టించాము[4].
13. తరువాత అతనిని ఇంద్రియ బిందువుగా ఒక కోశంలో భద్రంగా ఉంచాము[5].
14. ఆ తరువాత ఆ ఇంద్రియ బిందువును రక్తపు ముద్దగా (జలగగా) మార్చాము. ఆ పైన ఆ రక్తపు ముద్దను (జలగను) మాంసపు ముద్దగా (జీవాణువుల పిండంగా) మార్చాము, ఆ

---

[2] అమానత్: అంటే మనఃపూర్వకంగా, బాధ్యతతో విధేయతతో, డ్యూటీ చేయటం, రహస్య మాటలను, విషయాలను కాపాడటం. చేసిన వాగ్దానాలను పూర్తి చేయటం మొదలైనవి.

[3] ఫిర్'దౌస్ అనేది స్వర్గాలలో అత్యున్నతమైనది. అక్కడి నుండియే స్వర్గపు నదులు ప్రారంభ మవుతాయి. ('స'హీ'హ్ బు'ఖారీ).

[4] మట్టితో, అంటే మానవుని సృష్టి భూమిలో ఉన్న పదార్థాలతోనే చేయబడింది. ఈ విషయం మనకు ఈనాడు సైన్సు ద్వారా తెలిసింది.

[5] తల్లి గర్భకోశంలో.

జీవాణువుల పిండంలో ఎముకలను ఏర్పరచి, ఆ ఎముకలను మాంసంతో కప్పాము. ఆ తరువాత దానిని మరొక (భిన్న) సృష్టిగా చేశాము. కావున శుభకరుడు (శుభప్రదుడు)[6] అయిన అల్లాహ్ యే అత్యుత్తమ సృష్టికర్త.

15. ఆ తరువాత మీరు నిశ్చయంగా, మరణిస్తారు.

16. అటు పిమ్మట నిశ్చయంగా, మీరు పునరుత్థాన దినమున మరల లేపబడతారు.

17. మరియు వాస్తవానికి మేము మీపై ఏడు మార్గాలను (ఆకాశాలను) సృష్టించాము[7]. మరియు మేము సృష్టి విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యంగా లేము.

18. మరియు మేము ఆకాశం నుండి ఒక పరిమాణంతో వర్షాన్ని (నీటిని) కురిపించాము, పిదప దానిని భూమిలో నిలువజేశాము. మరియు నిశ్చయంగా, దానిని వెనక్కి తీసుకునే శక్తి మాకుంది.

19. తరువాత దాని ద్వారా మేము మీ కొరకు ఖర్జూరపు తోటలను ద్రాక్షతోటలను ఉత్పత్తి చేశాము; అందులో మీకు ఎన్నో ఫలాలు దొరుకుతాయి. మరియు వాటి నుండి మీరు తింటారు

20. మరియు సినాయి కొండ ప్రాంతంలో ఒక వృక్షం పెరుగుతున్నది. అది నూనె ఇస్తుంది మరియు (దాని ఫలం) తినేవారికి రుచికరమైన (కూరగా)

---

[6] చూడండి, 7:54.

[7] చూడండి, 2:29.

ఉపయోగపడుతుంది[8].

21. మరియు నిశ్చయంగా, మీ పశువులలో మీకు ఒక గుణపాఠముంది. మేము వాటి కడుపులలో ఉన్నది (పాలు) మీకు త్రాపుతున్నాము. మరియు వాటిలో మీకు ఇంకా ఎన్నో ఇతర లాభాలు కూడా ఉన్నాయి. మరియు వాటి (మాంసం) మీరు తింటారు.

22. మరియు వాటి మీద మరియు ఓడల మీద మీరు సవారీ చేస్తారు.

23. మరియు వాస్తవానికి మేము నూహ్ ను తన జాతి ప్రజల వద్దకు పంపాము. అతను వారితో అన్నాడు: "నా జాతి ప్రజలారా! అల్లాహ్ నే ఆరాధించండి మీకు ఆయన తప్ప మరొక ఆరాధ్యదేవుడు లేడు! ఏమీ మీరు ఆయన యందు భయభక్తులు కలిగి ఉండరా?"

24. అతని జాతిలోని సత్యతిరస్కారులైన నాయకులు ఇలా అన్నారు: "ఇతను మీ వంటి ఒక సాధారణ మానవుడే తప్ప మరేమీ కాదు! మీపై ఆధిక్యత పొందగోరుతున్నాడు. మరియు అల్లాహ్ తలుచుకుంటే దైవదూతలను పంపి ఉండేవాడు. ఇలాంటి విషయం పూర్వీకులైన మన తాతముత్తాతలలో కూడా జరిగినట్లు మేము వినలేదే!"[9]

25. "ఇతడు కేవలం పిచ్చి పట్టిన మనిషి కావున

---

[8] ఇది 'జైతూన్ వృక్షం.

[9] నూ'హ్ ('అ.స.) గాథ కొరకు చూడండి, 11:25-48.

కొంత కాలం ఇతనిని సహించండి."

**26.** (నూహ్) అన్నాడు: "ఓ నా ప్రభూ! వీరు నన్ను అసత్యపరుడని తిరస్కరిస్తున్నారు. కావున నాకు సహాయం చేయి[10]."

**27.** కావున మేము అతనికి ఈ విధంగా దివ్యజ్ఞానం (వహీ) పంపాము: "మా పర్యవేక్షణలో, మా దివ్యజ్ఞానం (వహీ) ప్రకారం ఒక ఓడను తయారు చెయ్యి. తరువాత మా ఆజ్ఞ వచ్చినప్పుడు మరియు పొయ్యి నుండి నీరు ఉబికినప్పుడు (పొంగినప్పుడు)[11], ఆ నావలో ప్రతిరకపు జంతుజాతి నుండి ఒక్కొక్క జంటను మరియు నీ పరివారపు వారిని ఎక్కించుకో ఎవరిని గురించి అయితే ముందుగానే నిర్ణయం జరిగిందో వారు తప్ప! ఇక దుర్మార్గుల కొరకు నాతో మనవి చేయకు. నిశ్చయంగా, వారు ముంచి వేయబడతారు."

**28.** "ఆ తరువాత నీవు మరియు నీతో ఉన్నవారు నావలోకి ఎక్కిన పిదప ఇలా ప్రార్థించండి: 'సర్వస్తోత్రాలకు అర్హుడు అల్లాహ్ మాత్రమే, ఆయనే మమ్మల్ని దుర్మార్గుల నుండి విమోచనం కలిగించాడు.'

**29.** ఇంకా ఇలా ప్రార్థించు: 'ఓ నా ప్రభూ! నన్ను శుభప్రదమైన గమ్యస్థానంలో దించు. గమ్యస్థానానికి

---

[10] చూడండి, 54:10

[11] ఫారత్తన్నూరు: కొందరు వ్యాఖ్యాతలు దీనిని భూమి ప్రతిభాగం నుండి నీటి ఊటలు ఉబికి రావటం, అని అన్నారు.

చేర్పించే వారిలో నీవే అత్యుత్తముడవు!'"[12]

30. నిశ్చయంగా, ఇందులో (ఈగాథలో) సూచనలున్నాయి. మరియు నిశ్చయంగా, మేము (ప్రజలను) పరీక్షకు గురి చేస్తూ ఉంటాము.

31. వారి తరువాత మేము మరొక తరాన్ని పుట్టించాము[13].

32. మరియు వారి వద్దకు వారి నుండియే, ఒక సందేశహరుణ్ణి పంపినప్పుడు, (అతను): "కేవలం అల్లాహ్ నే ఆరాధించండి. మీకు ఆయన తప్ప మరొక ఆరాధ్య దైవం లేడు. ఏమీ? మీకు దైవభీతి లేదా?" అని అన్నాడు.

33. దానికి, అతని జాతి వారిలోని - సత్యతిరస్కారులైనట్టి వారు, పరలోక సమావేశాన్ని అబద్ధమని నిరాకరించేవారు మరియు ఇహలోక జీవితంలో మేము భాగ్యవంతులుగా చేసినట్టి - నాయకులు ఇలా అన్నారు: "ఇతను మీ వంటి సాధారణ మానవుడే తప్ప మరేమీ కాడు, మీరు తినేదే ఇతనూ తింటున్నాడు మరియు మీరు త్రాగేదే ఇతనూ త్రాగు తున్నాడు.

---

[12] ప్రయాణం మొదలు పెట్టేటప్పుడు ఈ దు'ఆ చేయాలి. దైవప్రవక్త ('స'అస) తమ సవారిపై కూర్చుంటూ ఈ దు'ఆ చదివేవారు: 'అల్లాహు అక్బర్. (3 సార్లు, తరువాత) సుబ 'హానల్లజీ' స'ఖ్ఖరలనా హా'జా' వ మా కున్నా లహూ ముఖ్ రినీన్. వ ఇన్నా ఇలా రబ్బినా లమున్ ఖలిబూన్.' (43:13-14).

[13] ఈ జాతి హూద్ ('అ.స.) యొక్క 'ఆద్ జాతి అని చాలా మంది వ్యాఖ్యాతల అభిప్రాయం.

34. మరియు ఒకవేళ మీరు మీ వంటి ఒక సాధారణ మానవుణ్ణి అనుసరించినట్లయితే! నిశ్చయంగా, మీరు నష్టపడిన వారవుతారు.

35. ఏమీ? మీరు మరణించి మట్టిగా ఎముకలుగా మారిపోయినతరువాతకూడాతిరిగిలేపబడతారని ఇతను మీకు వాగ్దానం చేస్తున్నాడా?

36. అసంభవం! మీకు చేయబడే ఈ వాగ్దానం నెరవేరటం అసంభవం.

37. ఇక మన జీవితం ఈ ప్రాపంచిక జీవితం మాత్రమే! మనం మరణించేది జీవించేది ఇక్కడే! మనం ఏ మాత్రమూ తిరిగి సజీవులుగా లేపబడము!

38. ఇక ఇతను, ఈ వ్యక్తి అల్లాహ్ పేరుతో కేవలం అబద్ధాలు కల్పిస్తున్నాడు మరియు మేము ఇతనిని (ఇతని మాటలను) ఎన్నటికీ విశ్వసించలేము."

39. (ఆ ప్రవక్త) అన్నాడు: "ఓ నా ప్రభూ! వీరు చేసే నిందారోపణల నుండి నన్ను కాపాడు."

40. (అల్లాహ్) ఇలా సెలవిచ్చాడు: "వీరు కొంతకాలంలోనే పశ్చాత్తాప పడతారు."

41. ఆ తరువాత సత్య (వాగ్దాన) ప్రకారం ఒక భయంకరమైన గర్జన (సయ్ హా) వారిని చుట్టు ముట్టింది. మేము వారిని చెత్తా చెదారంగా మార్చి వేశాము. ఇక దుర్మార్గులైన జాతివారు ఈ విధంగానే దూరమై పోతారు (నాశనం చేయబడతారు)!

42. వారి తరువాత ఇతర తరాల వారిని

పుట్టించాము[14].

43. ఏ సమాజం వారు కూడా తమకు (నియమింపబడిన) గడువుకు ముందు కాలేరు. మరియు దాని కి వెనుక కాలేరు[15].

44. ఆ తరువాత మేము మా సందేశహరులను ఒకరి తరువాత ఒకరిని పంపుతూ వచ్చాము. ప్రతిసారి ఒక సమాజం వద్దకు దాని సందేశహరుడు వచ్చినప్పుడు, వారు అతనిని అసత్యుడని తిరస్కరించారు. వారిని ఒకరి తరువాత ఒకరిని నశింపజేస్తూ వచ్చాము. చివరకు వారిని గాథలుగా చేసి వదిలాము. ఇక విశ్వసించని ప్రజలు ఈ విధంగా దూరమై పోవుగాక (నాశనం చేయబడుగాక!)

45. ఆ తరువాత మూసా మరియు అతని సోదరుడు హారూన్ లను మా సూచనలతో మరియు స్పష్టమైన ప్రమాణంతో పంపాము;

46. ఫిర్ఔన్ మరియు అతని నాయకుల వద్దకు. కాని వారు దురహంకారం చూపారు. వారు తమ

[14] వీరు 'సాలెహ్, లూ'త్, మరియు షు'ఐబ్ ('అలైహిమ్. స.)లు కావచ్చు. ఎందుకంటే సూరహ్ అల్-'అరాఫ్ (7) మరియు సూరహ్ హూద్ (11) లలో ఇదే వరుసలో వారి వృత్తాంతం పేర్కొనబడింది.

[15] ఇదేవిధమైన వాక్యానికి చూ, 15:5 మరియు దాని వ్యాఖ్యానం. దీని మరొక తాత్పర్యం ఈ విధంగా కూడా ఉంది: 'ఏ సమాజం కూడా తన నిర్ణీత గడువుకు, ముందు గానీ మరియు వెనక గానీ కాజాలదు.'

అహంభావంలో మునిగి ఉండేవారు.

47. అపుడు వారన్నారు: "ఏమీ? మేము మా వంటి ఈ ఇద్దరు మానవులను విశ్వసించాలా? మరియు ఎవరి జాతి వారైతే మా బానిసలుగా ఉన్నారో!"

48. కావున వారు, ఆ ఇరువురిని అసత్యవాదులని తిరస్కరించి, నాశనం చేయబడిన వారిలో చేరిపోయారు.

49. మరియు వాస్తవానికి మేము మూసాకు గ్రంథాన్ని ప్రసాదించాము, బహుశా వారు మార్గదర్శకత్వం పొందుతారేమోనని!

50. ఇక మర్యమ్ కుమారుణ్ణి మరియు అతని తల్లిని మేము (మా అనుగ్రహపు) సూచనగా చేశాము[16]. మరియు వారిద్దరికి ఉన్నతమైన, ప్రశాంతమైన నీడ, ప్రవహించే సెలయేళ్ళు మరియు చెలమలు గల స్థానంలో ఆశ్రయమిచ్చాము.

51. ఓ సందేశహరులారా! పరిశుద్ధమైన వస్తువులనే

---

[16] ఎందుకంటే మేము (అల్లాహ్): ' 'ఈసాను తండ్రి లేనిదే పుట్టించాము. ఏ విధంగానైతే మేము ఆదమ్ ను తల్లీ-తండ్రి లేనిదే మరియు 'హవ్వాను తల్లి లేనిదే ఆదమ్ నుండి పుట్టించామో!'

తినండి మరియు సత్కార్యాలు చేయండి[17]. నిశ్చయంగా, మీరు చేసేదంతా నాకు బాగా తెలుసు.

52. మరియు నిశ్చయంగా, మీ ఈ సమాజం ఒకే ఒక్క సమాజం మరియు నేనే మీ ప్రభువును, కావున మీరు నా యందే భయభక్తులు కలిగి ఉండండి[18].

53. కానీ వారు తమ (ధర్మం) విషయంలో పరస్పర భేదాభిప్రాయాలు కల్పించుకొని, విభిన్న తెగలుగా చీలిపోయారు[19]. ప్రతివర్గంవారు, తాము అనుసరించేదానితో సంతోషపడుతున్నారు[20]

---

[17] అ'త్తయ్యిబాతు: అంటే పరిశుద్ధ వస్తువులు. కొందరు వ్యాఖ్యాతలు వీటిని 'హలాల్ వస్తువులు అని అన్నారు. రెండూ సరైనవే. ఎందుకంటే ప్రతి పరిశుద్ధ వస్తువు 'హలాలే! అందుకే అల్లాహ్ (సు.తా.) అపరిశుద్ధ వస్తువులను 'హరాం చేశాడు. అ'అమాల్ 'సాలిహ్: సత్కార్యాలు అంటే ఏ కార్యాలైతే ఖుర్ఆన్ మరియు 'స'హీ'హ్ 'హదీస్'ల ప్రకారం ఉంటయో! ఈ రెంటి మధ్య గాఢమైన సంబంధముంది. కావున వీటిని గురించి ప్రవక్తలందరికీ బోధింపబడింది. అందుకే ప్రవక్తలందరూ తాము పని చేసి సంపాదించిన సంపాదన నుండే తినేవారు. చాలామంది ప్రవక్తలు కొంతకాలం గొర్రెల కాపరులుగా పనిచేశారు, (బు'ఖారీ). ప్రవక్తలందరూ పురుషులే!

[18] ఉమ్మతున్: అంటే ఇక్కడ ధర్మం అని అర్థం. ప్రవక్తలందరి ధర్మం ఒక్కటే, 'ఇస్లాం' అంటే అల్లాహ్ (సు.తా.)కు విధేయులై ఉండి, ఆయన తప్ప మరొకరిని ఆరాధించకుండా ఉండటం. ఇటువంటి ఆయత్ కు చూడండి, 21:92.

[19] చూడండి, 21:93.

[20] చూడండి, 22:67. దైవప్రవక్త ('స'అస) అన్నారు: 'యూదులు 71 తెగలుగా మరియు క్రైస్తవులు 72 తెగలుగా చీలిపోయారు. కాని నా సమాజం వారు 73 తెగలుగా చీలిపోతారు.' (ఇబ్నె 'హంబల్, అబూ-దావూద్, తిర్మిజీ' మరియు దారిమీ).

54. కావున వారిని కొంత కాలం వరకు వారి మూఢత్వంలోనే మునిగి ఉండనివ్వు.
55. ఏమీ? మేము వారికి సంపదలు మరియు సంతానం సమృద్ధిగా ఇస్తున్నామంటే!
56. మేమువారికిమేలుచేయటంలోతొందరపడుతున్నామని, వారు భావిస్తున్నారా?[21] అలా కాదు వారు గ్రహించటం లేదు!
57. నిశ్చయంగా, ఎవరైతే, తమ ప్రభువు భయం వల్ల, భీతిపరులై ఉంటారో;
58. మరియు ఎవరైతే, తమ ప్రభువు ఆయాతులను విశ్వసిస్తారో;
59. మరియు ఎవరైతే తమ ప్రభువుకు ఎవ్వరినీ సాటిగా (భాగస్వాములుగా) కల్పించరో;
60. మరియు ఎవరైతే తాము ఇవ్వవలసినది(జకాత్) ఇచ్చేటప్పుడు, నిశ్చయంగా వారు తమ ప్రభువు వైపుకు మరలిపోవలసి ఉన్నదనే భయాన్ని తమ హృదయాలలో ఉంచుకొని ఇస్తారో;
61. ఇలాంటి వారే మంచిపనులు చేయటంలో పోటీ పడేవారు. మరియు వారు వాటిని చేయటానికి అందరి కంటే ముందు ఉండేవారు.
62. మరియు మేము ఏ ప్రాణి పై కూడా దాని శక్తికి మించిన భారం వేయము[22]. మరియు మా వద్ద

---

[21] వాలు అక్షరాలలో (Italics లో) ఉన్న భాగం 55వ ఆయతుకు చెందినది. వాక్యాన్ని అర్థం చేసుకోవటం లో భేదం రాకుండా ఉండటానికి ఇక్కడ చేర్చబడింది.

[22] చూడండి, 2:286 మొదటి వాక్యం.

అంతా వ్రాయబడిన ఒక గ్రంథముంది. అది సత్యాన్ని పలుకుతుంది. మరియు వారికెలాంటి అన్యాయం జరుగదు.

63. అలా కాదు, వారి హృదయాలు దీనిని గురించి అజ్ఞానంలో పడి ఉన్నాయి. ఇంతేగాక వారు చేసే (దుష్ట) కార్యాలు ఎన్నో ఉన్నాయి వారు వాటిని చూస్తునే ఉంటారు[23].

64. చివరకు, వారిలోని ఇహలోక భోగభాగ్యాలలో మునిగి ఉన్న వారిని శిక్షించటానికి మేము పట్టుకున్నప్పుడు, వారు మొరపెట్టుకుంటారు[24].

65. (అప్పుడు వారితో ఇలా అనబడుతుంది): "ఈరోజు మీరు మొరపెట్టుకోకండి! నిశ్చయంగా, మా తరఫు నుండి మీకు ఎలాంటి సహాయం లభించడం జరుగదు.

66. వాస్తవానికి, నా సూచనలు మీకు వినిపించబడినప్పుడు, మీరు మీ మడమల మీద వెనుకకు తిరిగి పోయేవారు.

67. దురహంకారంతో దానిని[25] గురించి వ్యర్థపు ప్రలాపాలలో రాత్రులు గడుపుతూ ఉండేవారు

[23] అంటే 'షిర్క్' కాక వేరే ఇతర పెద్ద పాపాలు.

[24] చూడండి, 17:16.

[25] బిహి: దానిని గురించి అంటే, చాలా మంది వ్యాఖ్యాతలు క'అబహ్ అని అంటారు. అంటే మక్కా. ముష్రిక్ ఖురైషులు తాము క'అబహ్ గృహపు కార్యకర్తలని దురహంకారంతో వ్యవహరిస్తూ ము'హమ్మద్ ('స'అస) పై అవతరింపజేయబడిన ఖుర్ఆన్ ను గురించి వ్యర్థపు మాటలు పలికేవారు. ఇతర వ్యాఖ్యాతలు అంటారు: 'బిహి - అంటే ఖుర్ఆన్. దానిని గురించి వ్యర్థపు మాటలాడుతూ రాత్రులు గడిపేవారు.' చూడండి, 31:6.

68. ఏమీ? వారు ఈ (దైవ) వాక్కును[26] గురించి ఎన్నడూ ఆలోచించలేదా? లేక వారి పూర్వీకులైన, వారి తాతముత్తాతల వద్దకు ఎన్నడూ రానిది, వారి వద్దకు వచ్చిందనా?

69. లేక వారు తమ సందేశహరుణ్ణి ఎరుగరా? అందుకే అతన్ని తిరస్కరిస్తున్నారా?

70. లేక: "అతనికి పిచ్చిపట్టింది!" అని అంటున్నారా? వాస్తవానికి, అతను వారి వద్దకు సత్యాన్ని తెచ్చాడు. కాని చాలామంది సత్యాన్ని అసహ్యించుకుంటున్నారు.

71. మరియు ఒకవేళ సత్యమే[27] వారి కోరికలకు అనుగుణంగా ఉంటే భూమ్యాకాశాలు మరియు వాటిలో ఉన్నదంతా నాశనమై పోయేది. వాస్తవానికి మేము వారి వద్దకు హితబోధను పంపాము[28]. కాని వారు తమ హితబోధ నుండి ముఖం త్రిప్పుకుంటున్నారు.

72. లేక నీవు (ఓ ముహమ్మద్!) వారిని ప్రతిఫలం ఏమైనా అడుగుతున్నావా? నీ ప్రభువు ఇచ్చే ప్రతిఫలమే ఎంతో మేలైనది. ఆయనే అందరి కంటే శ్రేష్ఠుడైన ఉపాధి ప్రదాత.

73. మరియు నిశ్చయంగా, నీవు వారిని ఋజుమార్గం వైపునకు పిలుస్తున్నావు.

74. మరియు నిశ్చయంగా, పరలోకాన్ని నమ్మనివారు (ఋజు)

---

[26] దైవవాక్కు అంటే ఖుర్ఆన్.

[27] అల్-'హఖ్ఖు: అంటే ధర్మం మరియు షరియత్. (ధర్మశాసనం).

[28] అజ-జి'క్ రు: అంటే దివ్యఖుర్ఆన్. చూడండి, 21:110.

మార్గం నుండి వైదొలగిన వారే!

75. ఒకవేళ మేము వారిని కరుణించి, (ఇహలోకంలో వారికున్న) ఆపదను తొలగించినా! వారు తలబిరుసుతనంతో పట్టు విడువకుండా త్రోవ తప్పి, సంచరిస్తూ ఉంటారు.

76. మరియు వాస్తవానికి, మేము వారిని శిక్షకు గురి చేశాము[29].

అయినా వారు తమ ప్రభువు ముందు వంగలేదు మరియు వారు వినమ్రులు కూడా కాలేదు.

77. చివరకు మేము వారి కొరకు కఠిన శిక్షా ద్వారాన్ని తెరిచాము. అప్పుడు వారు నిరాశ చెందిన వారయ్యారు.

78. మరియు ఆయనే, మీకు వినే శక్తినీ, చూసే శక్తినీ మరియు (అర్థం చేసుకోవటానికి) హృదయాలను సృజించినవాడు! అయినా మీరెంత తక్కువగా కృతజ్ఞతలు తెలుపు తున్నారు!

79. మరియు మిమ్మల్ని భూమిపై వ్యాపింప జేసినవాడు ఆయనే. మరియు ఆయన వద్దనే మీరంతా సమావేశ పరచబడతారు.

80. మరియు మీకు జీవితాన్ని ఇచ్చేవాడు మరియు మరణింపజేసేవాడు ఆయనే! మరియు రాత్రింబవళ్ళ మార్పు ఆయన ఆధీనంలోనే ఉంది.

---

[29] ఇక్కడ శిక్ష అంటే బద్ర్ యుద్ధరంగంలో ముష్రికులకు సంభవించిన పరాభవం. లేక దైవ ప్రవక్త ('స'అస) ప్రార్థన వల్ల మక్కా ముష్రిక్ లపై వచ్చిన కరువుకాలం కావచ్చు. (ఇబ్నె-కసీ'ర్).

ఏమీ? మీరిది అర్థం చేసుకోలేరా?

**81.** కాని వారు తమ పూర్వీకులు పలికినట్లే పలుకుతున్నారు.

**82.** వారంటున్నారు: "ఏమీ? మేము మరణించి, మట్టిగా మరియు ఎముకలుగా మారి పోయిన తరువాత కూడా మళ్ళీ సజీవులుగా లేపబడతామా?

**83.** వాస్తవానికి, ఇటువంటి వాగ్దానాలు, మాకూ మరియు మాకు పూర్వం మా తాత ముత్తాతలకు చేయబడినవే! వాస్తవానికి ఇవి కేవలం పూర్వకాలపు కట్టుకథలు మాత్రమే[30]."

**84.** వారిని ఇలా అడుగు: "ఈ భూమి మరియు ఇందులో ఉన్నదంతా ఎవరికి చెందినదో మీకు తెలిస్తే చెప్పండి?"

**85.** వారంటారు: "అల్లాహ్ కే!" వారితో అను: "అయినా మీరు హితోపదేశం స్వీకరించరా?"

**86.** వారిని అడుగు: "సప్తాకాశాల ప్రభువు మరియు సర్వోత్తమ సింహాసనానికి (అర్ష్ కు) ప్రభువు ఎవరు?"[31]

**87.** వారంటారు: "అల్లాహ్ మాత్రమే!" అని. వారితో అను: "అయితే మీరెందుకు ఆయన పట్ల

---

[30] అసా'తీరున్: అంటే పూర్వకాలంలో వ్రాసిపెట్టిన కట్టుకథలు. అంటే పునరుత్థానమని నీవు ('స'అస) అంటున్నది మేము ఎన్నో తరాల నుండి వింటున్న గాథయే! అది ఎప్పుడు రానున్నది? ఇది కేవలం ఒక కట్టు కథ!

[31] చూడండి, 2:29, 7:54 మరియు 9:129.

భయభక్తులు కలిగి ఉండరు?"

88. వారిని ఇలా అడుగు: "మీకు తెలిస్తే చెప్పండి! ప్రతిదానిపై పాలనాధికారం ఎవరి చేతిలో ఉంది? మరియు ప్రతిదానికి శరణమిచ్చేవాడు ఆయనే మరియు ఆయనకు వ్యతిరేకంగా శరణమివ్వగల వాడెవ్వడూ లేనివాడు, ఎవరు?"

89. వారంటారు: "అల్లాహ్ మాత్రమే!" వారితో అను: "అయితే మీరెందుకు మాయాజాలానికి గురవుతున్నారు (మోసగింపబడుతున్నారు)?"

90. అలా కాదు! మేము వారికి సత్యాన్ని అందజేశాం మరియు నిశ్చయంగా వారే అసత్యవాదులు

91. అల్లాహ్ ఎవ్వరినీ కూడా తనకు సంతానంగా చేసుకోలేదు మరియు ఆయనతో పాటు మరొక ఆరాధ్యదేవుడు లేడు. అలా అయితే ప్రతి దేవుడు తన సృష్టితో వేరైపోయేవాడు మరియు వారు ఒకరిపై నొకరు ప్రాబల్యం పొందగోరేవారు. అల్లాహ్! వారు కల్పించే వాటికి అతీతుడు[32].

92. ఆయన అగోచర మరియు గోచర విషయాల జ్ఞానం గలవాడు. వారు సాటి కల్పించే భాగస్వాముల కంటే, ఆయన అత్యున్నతుడు.

93. (ఓ ముహమ్మద్!) ఇలా ప్రార్థించు: "ఓ నా ప్రభూ! ఏ (శిక్ష అయితే) వారికి (అవిశ్వాసులకు) వాగ్దానం చేయబడి ఉన్నదో దానిని నీవు నాకు చూపనున్నచో!

---

[32] చూడండి, 6:100

94. ఓ నా ప్రభూ! నన్ను ఈ దుర్మార్గ ప్రజలలో చేర్చకు[33]."

95. మరియు నిశ్చయంగా, మేము వారికి (అవిశ్వాసులకు) వాగ్దానము చేసింది (శిక్ష) నీకు చూపగల సమర్ధులము.

96. చెడును, మంచితనంతో నివారించు[34]. వారు ఆపాదించే విషయాలు మాకు బాగా తెలుసు.

97. మరియు ఇలా ప్రార్థించు: "ఓ నా ప్రభూ! షైతానులు రేకెత్తించే కలతల నుండి (రక్షణ పొందటానికి) నేను నీ శరణు వేడుకుంటున్నాను.

98. మరియు ఓ నా ప్రభూ! అవి నా వద్దకు రాకుండా ఉండాలని, నేను నీ శరణు వేడుకుంటున్నాను[35]."

99. చివరికి వారిలో ఒకడికి మరణం సమీపించినప్పుడు వాడిలా వేడుకుంటాడు: "ఓ నా ప్రభూ! నన్ను తిరిగి (భూలోకానికి) పంపు:

100. నేను చేయకుండా వచ్చిన సత్కార్యాలు

---

[33] దైవప్రవక్త ('స'అస) ఇలా ప్రార్థించారు: 'ఓ అల్లాహ్ (సు.తా.)! ఒకవేళ నీవు ఈ సమాజాన్ని పరీక్షించ గోరితే లేక శిక్షించగోరితే! అంతకు ముందే నన్ను ఈ ప్రపంచం నుండి లేపుకో!' (తిర్మిజీ', అ'హ్మద్).

[34] చూడండి, 13:22 చివరి వాక్యం మరియు 41:34-35.

[35] కావున ప్రతి కార్యానికి ముందు: 'బిస్మిల్లా హిర్ర'హ్మా నిర్ర'హీమ్' చదవండి అని దైవప్రవక్త ('స'అస) అన్నారు. దీనిని గురించి 'హదీస్'లలో, దు'ఆలు కూడా పేర్కొనబడ్డాయి. (ముస్నద్ అ'హ్మద్ 2/181, అబూ-దావూద్, తిర్మిజీ').

చేయటానికి[36]." అది కాని పని. నిశ్చయంగా అది అతని నోటిమాట మాత్రమే![37] ఇక (ఈ మరణించిన) వారు తిరిగి లేపబడే దినం వరకు వారి ముందు ఒక అడ్డుతెర (బర్'జఖ్) ఉంటుంది[38].

**101.** ఆ తరువాత బాగా ఊదబడిన దినమున వారి మధ్య ఎలాంటి సంబంధాలు ఉండవు. మరియు వారు ఒకరి నొకరు పలుకరించుకోరు కూడా!

**102.** ఇక ఎవరి(సత్కార్యాల) పళ్ళాలు బరువుగా ఉంటాయో అలాంటివారే సాఫల్యం పొందేవారు

**103.** మరియు ఎవరి పళ్ళాలు తేలికగా ఉంటాయో, అలాంటి వారే తమను తాము నష్టానికి గురి చేసుకున్న వారు, వారే నరకంలో శాశ్వతంగా ఉండేవారు.

**104.** అగ్ని వారి ముఖాలను కాల్చి వేస్తుంది[39]. వారి పెదవులు బిగించుకు పోయి, పళ్ళు బయట

---

[36] ఈ దు'ఆ ప్రతి సత్యతిరస్కారి: 1) మరణం ఆసన్నమైనప్పుడు, 2) పునరుత్థానదినమున, అల్లాహ్ (సు.తా.) సమక్షంలో హాజరు చేయబడినప్పుడు మరియు 3) నరకంలోకి త్రోయబడి నప్పుడు చేస్తాడు. కాని సఫలుడు కాడు. ఈ వాక్యం ఖుర్ఆన్ లో అనేక సార్లు వచ్చింది. చూడండి, 63:10-11, 14:44, 7:53, 32:12, 6:27-28, 40:11-12, 35:37 మొదలైనవి.

[37] అది కాని పని, చూడండి, 6:28

[38] ఇహలోక మరియు పరలోక జీవితపు మధ్య కాలాన్ని బర్'జ'ఖ్ అంటారు.

[39] ముఖం ఎందుకు పేర్కొనబడిందంటే మానవ ఉనికికి అన్నింటికంటే ముఖ్యమైన అంశం ముఖమే! నరకాగ్ని మాత్రం శరీరన్నంతా కాల్చుతుంది.

పడతాయి.

**105.** (వారిని అల్లాహ్ ఇలా ప్రశ్నిస్తాడు): "ఏమీ? నా సూచనలు మీకు వినిపించబడ లేదా? అప్పుడు మీరు వాటిని అసత్యాలని తిరస్కరిస్తూ ఉండేవారు కదా?"

**106.** వారిలా అంటారు: "ఓ మా ప్రభూ! మా దురదృష్టం మమ్మల్ని క్రమ్ముకొని ఉండింది. మేము మార్గభ్రష్టులమైన వారిగా ఉండేవారం!

**107.** ఓ మా ప్రభూ! మమ్మల్ని దీని (ఈ నరకం) నుండి బయటకు తీయి. ఒకవేళ మేము మరల (పాపాలు) చేస్తే, మేము నిశ్చయంగా, దుర్మార్గులమే!"

**108.** ఆయన (అల్లాహ్) అంటాడు: "దానిలోనే పరాభవంతో పడి ఉండండి మరియు నాతో మాట్లాడకండి!"

**109.** నిశ్చయంగా, నా దాసులలో కొందరు ఇలా ప్రార్థించే వారున్నారు: "ఓ మా ప్రభూ! మేము విశ్వసించాము, మమ్మల్ని క్షమించు మరియు మమ్మల్ని కరుణించు మరియు కరుణించే వారిలో నీవే అత్యుత్తముడవు!"

**110.** కాని మీరు వారిని పరిహాసానికి గురి చేసేవారు, చివరకు (ఆ పరిహాసమే) మిమ్మల్ని నా ధ్యానం నుండి మరపింప జేసింది; మరియు మీరు వారి మీద నవ్వేవారు (ఎగతాళి చేసేవారు)!

**111.** నిశ్చయంగా, ఈ రోజు నేను వారికి, వారి

సహనానికి తగిన ప్రతిఫలాన్ని ఇచ్చాను. నిశ్చయంగా వారే విజయం పొందినవారు!

**112.** (అల్లాహ్) ఇలా ప్రశ్నిస్తాడు: "మీరు భూమిలో ఎన్ని సంవత్సరాలు గడిపారు?"

**113.** వారిలా జవాబిస్తారు: "మేమక్కడ ఒక్క దినమో లేక దినపు కొంత భాగమో ఉంటిమి. లెక్క పెట్టిన వారిని అడుగు!"[40]

**114.** (అల్లాహ్) అంటాడు: "మీరక్కడ ఉన్నది కొంతకాలం మాత్రమే! ఒకవేళ ఇది మీరు తెలుసుకొని ఉంటే (ఎంత బాగుండేది)!"

**115.** "ఏమీ? వాస్తవానికి మేము మిమ్మల్ని వృథాగానే పుట్టించామని మరియు మీరు మా వైపునకు ఎన్నడూ మరలి రారని భావించారా?"

**116.** కావున (తెలుసుకోండి) అల్లాహ్ అత్యున్నతుడు, నిజమైన విశ్వసార్వభౌముడు[41], ఆయన తప్ప మరొక ఆరాధ్య దేవుడు లేడు. ఆయనే గౌరవప్రదమైన సింహాసనానికి (అర్ష్ కు) ప్రభువు!

**117.** ఇక ఎవడైనా అల్లాహ్ తో పాటు మరొక దైవాన్ని - తన వద్ద దాని కొరకు ఎలాంటి ఆధారం లేకుండానే - ప్రార్థిస్తాడో, నిశ్చయంగా అతని లెక్క అతని ప్రభువు వద్ద ఉంది. నిశ్చయంగా,

---

[40] ఈ లెక్క పెట్టే వారు దైవదూతలు.
[41] చూడండి, 20:114 వ్యాఖ్యానం 2.

సత్యతిరస్కారులు సాఫల్యము పొందలేరు[42].

**118.** కావున నీవు ఇలా ప్రార్థించు: "ఓ నా ప్రభూ! నన్ను క్షమించు, నన్ను కరుణించు, కరుణించేవారిలో నీవే అత్యుత్తముడవు!"

[42] నిజమైన సాఫల్యం, స్వర్గ నివాసమే కాని ఇహలోకంలోని ఆస్తిపాస్తులు, సంతానం హోదాలు, పేరు ప్రతిష్టలు మొదలైనవి కావు.

# 24. అన్-నూర్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఇది ఒక సూరహ్! మేమే దీనిని అవతరింపజేశాము మరియు దీనిని విధిగా జేశాము మరియు బహుశా మీరు గుణపాఠం నేర్చుకుంటారని, మేమిందులో స్పష్టమైన సూచనలను (ఆయాత్ లను) అవతరింపజేశాము.
2. వ్యభిచారిణి మరియు వ్యభిచారుడు, ఈ ఇద్దరిలో ప్రతి ఒక్కరికి నూరేసి కొరడా దెబ్బలు కొట్టండి[1].

---

[*] [అన్-నూర్ అంటే జ్యోతి, కాంతి]

[1] 'మరియు మీ స్త్రీలలో ఎవరైనా వ్యభిచారానికి పాల్పబడితే, వారికి వ్యతిరేకంగా, మీలో నుండి నలుగురి సాక్ష్యం తీసుకోండి. వారు (నలుగురు) సాక్ష్యమిస్తే, వారు మరణించే వరకైనా లేదా వారి కొరకు అల్లాహ్ ఏదైనా మార్గం చూపించే వరకైనా, వారిని ఇండ్లలో నిర్బంధించండి.' అని 4:15లో వచ్చింది. ఇక్కడ: 'వ్యభిచారిణి మరియు వ్యభిచారుడు, ఈ ఇద్దరిలో ప్రతి ఒక్కరికి నూరేసి కొరడా దెబ్బలు కొట్టండి.' అని వచ్చింది. ఈ శిక్ష పెండ్లి కాని వారిది. ఇక పెండ్లి అయిన వారు వ్యభిచారం చేస్తే రాళ్ళు రువ్వి చంపండి. అని ముస్లిం, కితాబ్ అల్ 'హుదూద్, బాబ్'హద్ అ'జ్జానిలో ఉంది. ఇంకా ఎన్నో 'హదీస్'లు మరియు దైవ ప్రవక్త ('స'అస) మరియు 'స'హాబీలు అమలు పరచిన విధానాలు మరియు ముస్లిం సమాజంలోని ఏకాభిప్రాయాలు ఉన్నాయి. వీటిననుసరించి వివాహితులైన స్త్రీపురుషులు వ్యభిచారం చేస్తే వారికి రాళ్ళు రువ్వి చంపే శిక్ష (రజ్మ్) విధించబడుతుంది. కాని, ఈ శిక్ష విధించటానికి, లైంగిక క్రియ జరుగుతూ ఉండగా ప్రత్యక్షంగా కళ్ళారా చూశామని, సత్యవంతులైన నలుగురు వ్యక్తులు అల్లాహ్ పేరుతో ప్రమాణం చేస్తూ సాక్ష్యం ఇవ్వాలి. కేవలం వృత్తాంతానుమేర ప్రమాణం సరిపోదు. చూడండి, 24:4.

మరియు మీకు అల్లాహ్ యందు మరియు అంతిమ దినమునందు విశ్వాసముంటే - అల్లాహ్ విధించిన ధర్మవిషయంలో - వారిద్దరి యెడల మీకు జాలి కలుగకూడదు. మరియు వారిద్దరి శిక్షను, విశ్వాసులలో కొందరు చూడాలి.

3. ఒక వ్యభిచారి, ఒక వ్యభిచారిణిని లేక బహుదైవారాధకురాలయిన (ముష్రిక్) స్త్రీని మాత్రమే వివాహమాడుతాడు; మరియు ఒక వ్యభిచారిణిని, ఒక వ్యభిచారుడో లేక ఒక బహుదైవారాధకుడో మాత్రమే వివాహమాడుతాడు మరియు ఇలాంటి విషయం విశ్వాసుల కొరకు నిషేధించబడింది[2].

4. మరియు ఎవరైనా శీలవతులైన స్త్రీలపై అపనింద మోపిన తరువాత నలుగురు సాక్షులను తీసుకొని రాలేరో, వారికి ఎనబై కొరడా దెబ్బలు కొట్టండి మరియు వారి సాక్ష్యాన్ని ఎన్నటికీ స్వీకరించకండి.

[2] కొందరు 'స'హాబీ (ర'ది. 'అన్హుమ్)లు చరిత్రహీనులైన స్త్రీలతో వివాహమాడటానికి అనుమతి అడిగి నప్పుడు ఈ ఆయత్ అవతరింపజేయబడిందని కొందరు వ్యాఖ్యాతల అభిప్రాయం. ఇక్కడ నికా'హ్: అంటే సాధారణ వివాహం కాదు, లైంగిక సంబంధం. ఒక వ్యభిచారియే ఒక వ్యభిచారిణితో లైంగిక సంబంధం ఉంచుకుంటాడు అని కొందరు అభిప్రాయపడ్డారు. మరొక వ్యాఖ్యానం ఏమిటంటే: ప్రతివాడు తనవంటి వారినే తన సహవాసులుగా ఎన్నుకుంటాడు. ఇది ఇమామ్ అష్-షౌకాని వ్యాఖ్యానం.

అలాంటి వారు పరమ దుష్టులు (ఫాసిఖూన్)[3].
5. కాని అటు పిమ్మట ఎవరైతే పశ్చాత్తాప పడి తమను తాము సవరించుకుంటారో! నిశ్చయంగా, అలాంటి వారి పట్ల అల్లాహ్ క్షమిశీలుడు, అపార కరుణా ప్రదాత.
6. మరియు ఎవరైతే, తమ భార్యల మీద అపనింద మోపి, దానికి తాము స్వయమే తప్ప ఇతరులను సాక్షులుగా తేలేరో, వారు తమంతట తామే నాలుగు సార్లు అల్లాహ్ పై ప్రమాణం చేసి సాక్ష్యమిస్తూ; నిశ్చయంగా, తాను సత్యం పలుకుతున్నాననీ[4];
7. మరియు ఐదవసారి అతడు ఒకవేళ అసత్యం

---

[3] ఇక్కడ వ్యభిచార నిర్ధారణకు నలుగురు సాక్షులను - ఎవరైతే లైంగిక క్రియ జరుగు తున్నప్పుడు కళ్ళారా చూశారో - తేవాలి! అని స్పష్టంగా పేర్కొనబడింది. వృత్తాంతానుమేయ ప్రమాణం సరిపోదు. అంటే అక్కడ దొరికిన ఇతర ప్రమాణాలను బట్టి లైంగిక క్రియ జరిగి ఉండవచ్చు అని, అంచనా వేయడం సరిపోదు. నలుగురు సాక్ష్యులు లైంగిక క్రియ జరుగుతూ ఉండగా కళ్ళారా చూశాము, అని సాక్ష్యమిస్తే ఈ శిక్ష విధించాలి, లేకుంటే అపనింద మోపిన వానికి 80 కొరడా దెబ్బలు కొట్టాలి మరియు వాని సాక్ష్యం ఎన్నటికీ స్వీకరించరాదు. అల్లాహ్ (సు.తా.) దృష్టిలో అసత్య సాక్ష్యమిచ్చిన వాడు పరమదుష్టుడు. మరొక విశేషమేమిటంటే, అప్పులలో, హత్యలలో మరియు ఇతర విషయాలలో ఇద్దరు సాక్షులు చాలు. కానీ, శిక్ష గంభీరమైనది, కాబట్టి వ్యభిచార విషయంలో లైంగిక క్రియ జరిగేటప్పుడు, కళ్ళారా చూసినామని అల్లాహ్ పేరట ప్రమాణం చేసి, నలుగురు సాక్ష్యమిస్తేనే శిక్ష విధించాలి. చూడండి, 24:2.

[4] అంటే ఇక్కడ నాల్గుసార్లు అల్లాహ్ పై ప్రమాణం చేసి అనడం, 4గురు సాక్షులతో సమానం, అని అర్థం

పలుకుతున్నట్లయితే! నిశ్చయంగా, అల్లాహ్ ఆగ్రహం తన మీద విరుచుకు పడుగాక! అనీ అనాలి,

8. ఇక ఆమె (భార్య) శిక్షను తప్పించుకోవటానికి, నాలుగు సార్లు అల్లాహ్ పై ప్రమాణం చేస్తూ; నిశ్చయంగా, అతడు అబద్ధం చెబుతున్నాడనీ;

9. మరియు అయిదవసారి ఒకవేళ అతడు సత్యవంతుడైతే! నిశ్చయంగా, తన మీద అల్లాహ్ ఆగ్రహం విరుచుకు పడుగాక! అనీ అనాలి[5].

10. మరియు మీపై అల్లాహ్ అనుగ్రహం మరియు ఆయన కరుణయే లేకుంటే! (ఆయన మీ శిక్షను త్వరలోనే తెచ్చేవాడు) మరియు నిశ్చయంగా, అల్లాహ్ పశ్చాత్తాపాన్ని స్వీకరించే వాడు, మహా వివేకవంతుడు[6].

---

[5] ఈ విధానం షరీయత్ లో ల'అనున్ అనబడుతుంది. అంటే నిందారోపణను ఖండించటానికి చేసే ప్రమాణం. ఈ విధమైన సాక్ష్యాల తరువాత వారిద్దరి మధ్య విడాకులు జరుగుతాయి. దైవప్రవక్త ('స'అస) కాలంలో ఇటువంటి విషయాలు జరిగినందువల్లనే ఈ ఆత్ లు అవతరింపజేయబడ్డాయి.

[6] ఇక్కడ అల్లాహ్ (సు.తా.) శిక్ష వెంటనే రాకపోవచ్చు. ఎందుకంటే అల్లాహ్ (సు.తా.) అనంత కరుణామయుడు, పశ్చాత్తాపాన్ని అంగీకరించే వాడు మరియు మహా వివేకవంతుడు.

**11.** నిశ్చయంగా, అపనింద మోపేవారు[7], మీలో నుంచేకొందరున్నారు. అది మీకు హానికరమైనదని భావించకండి. వాస్తవానికి అది మీకు మేలైనదే. వారిలో ప్రతి ఒక్కనికి తాను చేసిన పాపానికి తగిన శిక్ష లభిస్తుంది. మరియు వారిలో (ఈ అపనింద మోపటంలో), పెద్ద బాధ్యత వహించిన వానికి ఘోరమైన శిక్ష పడుతుంది.

**12.** విశ్వాసులైన పురుషులు మరియు విశ్వాసులైన స్త్రీలు దానిని వినినప్పుడు, తమను గురించి తాము మంచి తలంపు వహించి: "ఇది స్పష్టమైన అపనిందయే!" అని ఎందుకు అనలేదు?[8]

**13.** మరియు వారు దీనికై నలుగురు సాక్షులను ఎందుకు తీసుకురాలేదు? ఒకవేళ వారు సాక్షులను తీసుకొని రానప్పుడు, అల్లాహ్ వద్ద వారే అసత్యవాదులు.

---

[7] బనూ-ము'స్ 'తలిఖ్ యుద్ధం నుండి 5వ హిజ్రీలో తిరిగి మదీనాకు వస్తున్నప్పుడు దైవప్రవక్త ('స'అస) మరియు 'సహాబీలు (ర'ది.'అన్హుమ్) మదీనాకు కొంత దూరముండగా రాత్రి గడపటానికి ఆగుతారు. ఉదయం వారి ప్రయాణం మొదలు పెట్టినప్పుడు, 'ఆయి'షహ్ (ర.'అన్హా) యొక్క అంబారీ (హోదజ్) ఆమె లోపల ఉన్నారనుకొని - ఒంటె మీద పెట్టి ప్రయాణం మొదలు పెట్టారు. 'ఆయి'షహ్ (ర.'అన్హా) తమ హారం వెతకటానికి వెళ్ళి ఉంటుంది. ఆమె తిరిగి వచ్చే వరకు ఎవ్వరూ లేనిది చూసి అక్కడే కూర్చుంటుంది. అంతలో వెనుక నుండి 'సఫ్వాన్ బిన్-మ'అ'తల్ సులమి (ర'.ది.'అ.) వస్తాడు. అతడి పని, వెనుక ఉండి బిడారం వారు ఏమైనా మరచిపోతే దానిని తీసుకొని రావడమే. 11-20.

[8] 'ఆయి'షహ్ (ర.'అన్హా) ను గురించి లేపిన అపనింద కొరకు చూడండి, 'స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం6 'హదీస్' నెం. 274

14. మరియు ఒకవేళ మీపై అల్లాహ్ అనుగ్రహం మరియు ఆయన కరుణ, ఇహలోకంలో మరియు పరలోకంలో లేకుంటే - మీరు ఏ విషయాలలో పడి పోయారో, వాటి పర్యవసానంగా - మీపై ఘోరమైన శిక్ష పడి ఉండేది.

15. అప్పుడు మీరు దానిని (ఆ అపనిందను) మీ నాలుకలతో వ్యాపింప జేస్తూ పోయారు మరియు మీకు తెలియని దానిని మీ నోళ్ళతో పలుక సాగారు మరియు మీరు దానిని చిన్న విషయంగా భావించారు కాని అల్లాహ్ దగ్గర (దృష్టిలో) అది ఎంతో గొప్ప విషయం (అపరాధం).

16. మరియు మీరు దానిని విన్నప్పుడు: "ఇలాంటి మాట పలకడం మాకు తగదు, (ఓ మా ప్రభూ!) నీవు సర్వలోపాలకు అతీతుడవు ఇది గొప్ప నిందారోపణ!" అని ఎందుకు అనలేదు[9]

17. మీరు విశ్వాసులే అయితే, ఇక మీదట ఎన్నటికీ ఇటువంటి చేష్టలు మరల చేయకూడదని అల్లాహ్ మిమ్మల్ని ఉపదేశిస్తున్నాడు.

18. మరియు అల్లాహ్ మీకు స్పష్టమైన ఆయాత్ లను చూపుతున్నాడు. మరియు అల్లాహ్

---

[9] ఈ మాటలు వ్యాపింపజేసిన వారితో: 'మీరు నలుగురు సాక్షులను ఎందుకు తేలేదు.' అని విశ్వాసులు ఎందుకు ప్రశ్నించలేదు. వారు నలుగురు సాక్షులను తేకుంటే మీరు వారిని అసత్యవాదులని ఎందుకు అనలేదు? ఈ ఆయత్ అవతరింపజేయబడిన తరువాత 'హస్సాన్, మి'స్'తహ్ బిన్-అసా'స'హ్ మరియు 'హమ్నా బిన్త్-జ'హష్ (ర'ది.'అన్హుమ్) లు అపనింద మోపినందుకు శిక్షింపబడ్డారు. (అ'హ్మద్, తిర్మిజీ', అబూ-దావూద్, ఇబ్నె-మాజా).

సర్వజ్ఞుడు, మహా వివేకవంతుడు.

**19.** నిశ్చయంగా, ఎవరైతే విశ్వాసవర్గంలో అశ్లీలత[10] వ్యాపించాలని కోరుతారో, అలాంటి వారికి ఇహలోకంలో మరియు పరలోకంలో కూడా కఠినశిక్ష పడుతుంది[11]. మరియు అల్లాహ్ కు అంతా తెలుసు, కాని మీకు తెలియదు.

**20.** మరియు మీ యెడల అల్లాహ్ అనుగ్రహం మరియు ఆయన కరుణయే లేకుంటే (మీరు నాశనమైపోయేవారు); మరియు నిశ్చయంగా అల్లాహ్ మహాకనికరుడు అపార కరుణాప్రదాత.

**21.** ఓ విశ్వాసులారా! షైతాన్ అడుగు జాడలలో నడవకండి. మరియు ఎవడు షైతాన్ అడుగుజాడలలో నడుస్తాడో! నిశ్చయంగా షైతాన్ అతనిని అశ్లీలమైన మరియు అసభ్యకర మైన పనులు చేయటానికి ప్రోత్సహిస్తాడు మరియు మీ యెడల అల్లాహ్ అనుగ్రహం మరియు ఆయన కరుణయే లేకుంటే, మీలో ఒక్కడూ కూడా నీతిమంతునిగా ఉండలేడు. కాని అల్లాహ్ తాను కోరిన వానిని నీతిమంతునిగా చేస్తాడు. మరియు అల్లాహ్ సర్వం వినేవాడు సర్వజ్ఞుడు.

**22.** మరియు మీలో (అల్లాహ్) అనుగ్రహం మరియు సమృద్ధిగా (సంపదలు) గలవారు, తమ

---

[10] అల్-ఫా'హిషహ్: దుర్నీతి, అశ్లీలత, చెడ్డనడత, నీచకార్యము, అపనింద మొదలైనవి.

[11] అంటే 80 కొరడా దెబ్బలు చూడండి, ఆయత్ 24:4.

బంధువులకు, పేదలకు[12], అల్లాహ్ మార్గంలో వలస (హిజ్రత్) పోయే వారికి, సహాయం చేయమని ప్రతిజ్ఞ చేయరాదు[13]. వారిని మన్నించాలి, (వారి తప్పులను) ఉపేక్షించాలి. ఏమీ? అల్లాహ్ మీ తప్పులను క్షమించాలని మీరు కోరరా? వాస్తవానికి అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

23. నిశ్చయంగా, ఎవరైతే శీలవతులు, అమాయకులు అయిన విశ్వాస స్త్రీలపై అపనిందలు మోపుతారో, వారు ఈ లోకంలోనూ మరియు పరలోకంలోనూ శపించబడతారు (బహిష్కరింప బడతారు) మరియు వారికి ఘోరమైన శిక్ష ఉంటుంది.

24. వారి నాలుకలు, వారి చేతులు మరియు వారి కాళ్ళు - వారు చేస్తూ ఉండిన కర్మలను గురించి - వారికి విరుద్ధంగా సాక్ష్యమిచ్చే రోజు!

25. ఆ రోజు! అల్లాహ్ వారికి, (వారి కర్మలకు) పూర్తి ప్రతిఫలమిస్తాడు. మరియు నిశ్చయంగా, అల్లాహ్!

---

[12] మిస్కీనున్: తన ఆదాయం నిత్యావసరాలకు సరిపోకున్నా ఇతరులను యాచించనివాడు.

[13] 'ఆయి'షహ్ (ర.'అన్హా) పై అపనింద మోపిన విశ్వాసులలో ఒకడు మిస్'తహ్ (ర'.ది.'అ.), అబూ బక్ర్ (ర.'ది.'అ.) యొక్క దగ్గరి బంధువు. అబూ బక్ర్ (ర.'ది.'అ.) అతనికి సహాయం చేసేవారు. 'ఆయి'షహ్ (ర.'ది.'అన్హా) ను అపనింద నుండి విముక్తి కలిగించే ఆయతులు అవతరింపజేయబడిన తరువాత అబూ బక్ర్ (ర.'ది.'అ.) మి'స్'తహ్ (ర'ది.'అ.) కు ఇక ఎలాంటి సహాయం చేయనని ప్రతిజ్ఞ చేస్తారు. అది అల్లాహ్ (సు.తా.)కు నచ్చక ఈ ఆయత్ అవతరింపజేశాడు. అప్పుడు అబూబక్ర్ (ర.'ది.'అ.) తన ప్రతిజ్ఞకు పరిహారం (కఫ్ఫారహ్) చెల్లించి మి'స్'తహ్ (ర'ది.'అ) కు మరల సహాయం చేయసాగారు. (ఇబ్నె-కసీ'ర్, ఫ'త్హ్ అల్-ఖదీర్), చూడండి, 13:22.

ఆయనే పరమ సత్యమని వారు తెలుసుకుంటారు.

26. నికృష్టులైన స్త్రీలు, నికృష్టులైన పురుషులకు మరియు నికృష్టులైన పురుషులు, నికృష్టులైన స్త్రీలకు తగినవారు మరియు నిర్మల స్త్రీలు, నిర్మల పురుషులకు మరియు నిర్మల పురుషులు, నిర్మల స్త్రీలకు తగినవారు. వారు (కపట విశ్వాసులలు) మోపే అపనిందలకు వీరు నిర్దోషులు. వీరికి క్షమాపణ మరియు గౌరవప్రదమైన జీవనోపాధి ఉంటాయి.

27. ఓ విశ్వాసులారా! మీ ఇండ్లు తప్ప, ఇతరుల ఇండ్లలోనికి వారి అనుమతి లేకుండా మరియు ఆ ఇంటి వారికి సలామ్ చేయకుండా ప్రవేశించకండి[14]. ఈ పద్ధతి మీకు అతి ఉత్తమమైనది మీరు ఈ హితోపదేశం జ్ఞాపకం ఉంచుకుంటారని ఆశింపబడుతోంది!

28. మరియు ఒకవేళ మీకు దానిలో (ఆ ఇంటిలో) ఎవ్వరూ కనబడకపోయినా, మీకు అనుమతి ఇవ్వబడనంత వరకు అందులోకి ప్రవేశించకండి. మరియు (అనుమతి ఇవ్వక) మీతో తిరిగి పొమ్మని (ఆ ఇంటివారు) అంటే! తిరిగి వెళ్ళి పోండి. ఇదే మీ కొరకు శ్రేష్ఠమైన పద్ధతి. మరియు మీరు చేసేదంతా

---

[14] దైవప్రవక్త ('స.'అస) ఏ ఇంటికి వెళ్ళినా మొదట సలాం చేసేవారు. తరువాత ప్రవేశించటానికి, ద్వారపు ఒక ప్రక్కకు నిలబడి అనుమతి అడిగేవారు. మూడుసార్లు అనుమతి అడిగిన తరువాత కూడా జవాబు రాకుంటే మరలిపోయే వారు. ('స.'అస). 'ఎవరు?' అని లోపల ఉన్నవారు ప్రశ్నిస్తే బయట ఉన్నవారు తమ పేరు తెలపాలి. ('స.'బుఖా'రీ).

అల్లాహ్ కు బాగా తెలుసు.

29. ఎవ్వరికీ నివాస స్థలం కాకుండా మీకు ప్రయోజనకరమైన వస్తువులున్న ఇండ్లలో ప్రవేశిస్తే, మీపై ఎట్టి దోషం లేదు. మరియు మీరు వ్యక్తపరిచేది మరియు మీరు దాచేది అంతా అల్లాహ్ కు బాగా తెలుసు.

30. విశ్వసించిన పురుషులతో, వారి చూపులను క్రిందికి పెట్టుకోమని మరియు వారి మర్మాంగాలను కాపాడుకోమని చెప్పు[15]. ఇది వారికి ఎంతో శ్రేష్ఠమైనది. నిశ్చయంగా, అల్లాహ్ వారి చేష్టలను బాగా ఎరుగును.

31. మరియు విశ్వసించిన స్త్రీలతో కూడా వారి చూపులను క్రిందికి పెట్టుకోమని మరియు వారి మర్మాంగాలను కాపాడుకోమని చెప్పు. మరియు వారి అలంకరణను ప్రదర్శించవద్దని చెప్పు - (దానంతట అదే) ప్రదర్శనమయ్యేది తప్ప. వారిని, తమ తల మీది దుప్పటిని రొమ్ముల వరకు కప్పుకోమని చెప్పు. వారు తమ అలంకారాన్ని తమ భర్తలకు, తమ తండ్రులకు, తమ భర్తల తండ్రులకు, తమ కుమారులకు, తమ భర్తల కుమారులకు, తమ సోదరులకు,

---

[15] చూడండి, 23:5-6, అంటే పురుషులు తమ చూపులను అదుపులో ఉంచుకోవాలి. చూడదని విషయాల నుండి చూపులను మరల్చుకోవాలి. అంటే పురుషులు అన్య స్త్రీలను చూడటం, ఇతరుల ఆచ్ఛాదనీయ అవయవాలను చూడటం, అసభ్య దృశ్యాలపై చూపును నిలపటం తగదు, అని అర్థం. ఇంకా చూడండి, మత్తయి - (Mathew), 5:27-29.

తమ సోదరుల కుమారులకు, తమ సోదరీమణుల కుమారులకు, తమ (తోటి స్త్రీలకు, తమ బానిస స్త్రీలకు, లేక కామ ఇచ్ఛలేని మగ సేవకులకు, లేక స్త్రీల గుప్తాంగాలను గురించి తెలియని బాలురకు తప్ప. ఇతరుల ముందు ప్రదర్శించకూడదని మరియు కనబడకుండా ఉన్న తమ అలంకారం తెలియబడేటట్లుగా, వారు తమ పాదాలను నేలపై కొడుతూ నడవకూడదని చెప్పు. మరియు ఓ విశ్వాసులారా! మీరందరూ కలసి అల్లాహ్ ను క్షమాపణకై వేడుకుంటే, మీరు సాఫల్యం పొందవచ్చు!

32. మీలోని పెండ్లికాని వారికి మరియు శీలవతులైన మీ బానిస పురుషులు మరియు బానిస స్త్రీలకు వివాహాలు చేయించండి[16]. ఒకవేళ వారు పేదవారయితే, అల్లాహ్ తన అనుగ్రహంతో వారిని సంపన్నులగా చేయవచ్చు! మరియు అల్లాహ్ సర్వవ్యాప్తి, సర్వజ్ఞుడు.

33. ఎవరికైతే, పెండ్లి చేసుకునే శక్తి లేదో వారు, అల్లాహ్ తన అనుగ్రహంతో వారిని ధనవంతులుగా చేసే వరకు శీలశుద్ధతను పాటించాలి[17]. మరియు మీ బానిసలలో ఎవరైనా స్వేచ్ఛాపత్రం

---

[16] అ'యామా, అయ్యిమున్ (ఏ.వ.): అంటే, కన్య, విధవ, విడాకురాలు - మూడు రకాల స్త్రీలు మరియు భార్య లేని పురుషుడు కూడా, దైవప్రవక్త ('స'అస) ప్రవచనం:"ఎవడైతే నా సున్నత్ ను తిరస్కరిస్తాడో వాడు నావాడు కాడు!" ('స'హీ'హ్ బు'ఖారీ - 5063, ముస్లిం - 1023)

[17] ఇలాంటి వారు నఫిల్ ఉపవాసాలు ఉండాలి. దాని వల్ల వారు తమ మనస్సును అదుపులో ఉంచుకోగలరు, ('స'హీ'హ్ బు'ఖారీ).

వ్రాయించుకోగోరితే వారి యందు మీకు మంచితనం కనబడితే, వారికి స్వేచ్ఛా పత్రం వ్రాసి ఇవ్వండి[18]. అల్లాహ్ మీకు ఇచ్చిన ధనం నుండి వారికి కూడా కొంత ఇవ్వండి. మీరు ఇహలోక ప్రయోజనాల నిమిత్తం, మీ బానిస స్త్రీలు శీలవతులుగా ఉండగోరితే వారిని వ్యభిచారానికి బలవంతపెట్టకండి[19], ఎవరైనా వారిని బలవంతపెడితే! నిశ్చయంగా, అల్లాహ్ వారిని (ఆ బానిస స్త్రీలకు) బలాత్కారం తరువాత క్షమించేవాడు, అపార కరుణా ప్రదాత.

34. మరియు వాస్తవానికి, మేము మీ వద్దకు స్పష్టమైన సూచనలను, మీకు పూర్వం గతించిన వారి ఉదాహరణలను మరియు దైవభీతిగలవారికి బోధనలను (ఉపదేశాలను) అవతరింప జేశాము.

---

[18] మీ బానిసలు స్వేచ్ఛగోరి - మీరు వారితో వారి స్వేచ్ఛకొరకు కుదుర్చుకున్న - మీ సొమ్మును కొంతకాలంలో ఇవ్వటానికి ఒప్పుకుంటే! దానిని ఒక పత్రం మీద వ్రాయించుకొని వారికి స్వేచ్ఛనివ్వండి. అంటే ఇస్లాం బానిసత్వాన్ని నిర్మూలించటానికి మొదట నుండియే పాటుపడుతున్నది. చూడండి, 9:60. 'జకాత్ డబ్బును, బానిసల స్వేచ్ఛ కొరకు ఉపయోగించండని ఆజ్ఞ ఉంది.

[19] ఇస్లాంకు పూర్వం, ప్రజలు తమ బానిస స్త్రీలతో వ్యభిచారం చేయించి ఆ సొమ్ము తినేవారు. ఇది ఇస్లాంలో నిషేధించబడింది.

35. అల్లాహ్ ఆకాశాలకూ మరియు భూమికీ జ్యోతి[20].
ఆయన జ్యోతిని, గూటిలోని దీపంలో పోల్చవచ్చు.
ఆ దీపం చుట్టూ గాజు ఉంది. ఆ గాజు ఒక నక్షత్రం
వలే ప్రకాశిస్తున్నది. అదొక పావనమైన జైతూన్
వృక్షం (నూనె) తో వెలిగించబడుతున్నది, అది (ఆ
వృక్షం) తూర్పుకు గానీ, పడమరకు గానీ చెందినది
కాదు. దాని నూనె అగ్ని అంటకున్నా మండుతూనే
ఉంటుంది. వెలుగు మీద వెలుగు! అల్లాహ్ తన
వెలుగు వైపునకు తనకు ఇష్టమైన వారికి
మార్గదర్శకత్వం చేస్తాడు. అల్లాహ్ ఉదాహరణల
ద్వారా ప్రజలకు బోధిస్తాడు. మరియు అల్లాహ్ కు
ప్రతి విషయం గురించి బాగా తెలుసు.
36. అల్లాహ్ ఏ ఇండ్లను (మస్జిదులను) లేపి, వాటిలో
ఆయన నామాన్ని స్మరించమని సెలవిచ్చాడో
అందులో వారు, ఆయన పవిత్రతను ఉదయం
మరియు సాయంత్రం స్తుతిస్తూ ఉంటారు[21].
37. ప్రజలలో కొందరిని - వారి వ్యాపారం గానీ
మరియు క్రయవిక్రయాలు గానీ - అల్లాహ్ స్మరణ
నుండీ, నమాజ్ స్థాపించడం నుండీ మరియు
విధిదానం (జకాత్) ఇవ్వడం నుండీ తప్పించ

---

[20] అన్-నూర్: He, by whose light the obscure in perception sees, and by whose guidance the erring is directed aright. Or the Manifest by whom is every manifestation. The Light, జ్యోతి కాంతికి నిలయమైనవాడు. ఆకాశాలలో మరియు భూమిలో నున్న వారికి మార్గదర్శకత్వం చేయగలవాడు, వెలుగు చూపగలవాడు కేవలం అల్లాహ్ (సు.తా.) మాత్రమే!

[21] చూడండి, 72:18.

లేవు. హృదయాలు మరియు కనుగ్రుడ్లు గిరగిర తిరిగి పోయే, ఆ దినమును గురించి, వారు భయపడుతూ ఉంటారు[22].

38. వారు ఇలా చేయటం, అల్లాహ్ వారికి వారి మంచిపనుల కొరకు ప్రతిఫలమివ్వటానికి; మరియు తన అనుగ్రహాలను వారిపై అధికం చేయటానికి. మరియు అల్లాహ్ తాను కోరిన వారికి లెక్కలేనంత జీవనోపాధిని ప్రసాదిస్తాడు.

39. ఇక సత్యాన్ని తిరస్కరించిన వారి కర్మలను ఎడారిలోని ఎండమావితో పోల్చ వచ్చు. దప్పిక గొన్నవాడు - దానిని నీరుగా భావించి దాని వద్దకు చేరి, చివరికి ఏమీ పొందలేక - అక్కడ అల్లాహ్ ను పొందుతాడు. అప్పుడు ఆయన అతని లెక్కను పూర్తిగా తీర్చుతాడు. మరియు అల్లాహ్ లెక్క తీర్చటంలో అతి శీఘ్రుడు[23].

40. లేక (సత్యతిరస్కారుల పరిస్థితి) చాలా లోతుగల సముద్రంలోని చీకట్లవలే ఉంటుంది. దానిపై ఒక గొప్ప అల క్రమ్ముకొని ఉంటుంది. దానిపై మరొక గొప్ప అల, దానిపై మేఘాలు. చీకట్లు ఒకదానిపై నొకటి క్రమ్ముకొని ఉంటాయి. అపుడు ఎవడైనా తన చేతిని (చూడాలని) చాచితే, వాడు దానిని చూడలేడు. మరియు ఎవనికైతే అల్లాహ్

---

[22] చూడండి, 40:18.

[23] అంటే సత్యతిరస్కారుడు ఎన్ని మంచిపనులు, సత్కార్యాలు చేసినా అవి పరలోకంలో ఎండమావులుగా అదృశ్యమైపోతాయి. అంటే అతనికి వాటి నుండి ఎట్టి పుణ్యఫలితం లభించదు. అతడు నరకంతో చేరిపోతాడు.

వెలుగునివ్వడో, అతనికి ఏ మాత్రం వెలుగు దొరకదు[24].

**41.** ఏమీ? నీకు తెలియదా (చూడటం లేదా)? నిశ్చయంగా, భూమ్యాకాశాలలో ఉన్న సర్వమూ మరియు రెక్కలు విప్పి ఎగిరే పక్షులు సైతం అల్లాహ్ పవిత్రతను కొనియాడుతూ ఉంటాయని? వాస్తవానికి ప్రతిదానికి తన నమాజ్ మరియు స్తోత్రం చేసే పద్ధతి తెలుసు[25]. మరియు అవి చేసేదంతా అల్లాహ్ కు బాగా తెలుసు[26].

**42.** మరియు భూమ్యాకాశాల మీద సర్వాధిపత్యం

---

[24] సత్యతిరస్కారులను సముద్రపు లోతులో చీకట్లలో ఉన్న వాటితో పోల్చబడింది అంటే సత్యతిరస్కారుడు అంధకారంలో మునిగి ఉన్నాడు. అవి వానిని విశ్వాసపు వెలుగులోనికి రానివ్వవను. పరలోకంలో కూడా వాడు నరకపు అంధకారంలో ఉంటాడు. వెలుగు సముద్రపు లోతుతోకి చేరలేదు. ఎందుకంటే వెలుగులో ఇమిడి ఉన్న ఏడు రంగులు ఒకదాని తరువాత ఒకటి, సముద్రపు తలాలలోనికి వెలుగు పోయేటప్పుడు పీల్చుకోబడతాయి. కాబట్టి సముద్రపు లోపటి భాగంలో చీకటి ఉంటుందని సైంటిస్టులు ఇప్పుడిప్పుడే తెలుసుకున్నారు. కాని ఇది దివ్యఖుర్ఆన్ లో 1400 వందల సంవత్సరాల ముందే వ్రాయబడింది.

[25] అంటే ప్రతి దానికి అల్లాహ్ (సు.తా.) యొక్క స్తోత్రం (ప్రార్థన) ఏ విధంగా చేయాలో తెలుసు. భూమ్యాకాశాలలో ఉన్న ప్రతి వస్తువు అల్లాహ్ (సు.తా.) స్తోత్రం చేయడమనేది కూడా అల్లాహ్ (సు.తా.) ఘనతలలో ఒకటి. ఏ విధంగానైతే వాటిని సృష్టించడం కూడా కేవలం ఆయన (సు.తా.) ఘనతలలో ఒకటో! చూడండి, 17:44.

[26] విచక్షణాశక్తి లేని ప్రతివస్తువు కూడా అల్లాహ్ (సు.తా.) స్తోత్రం చేస్తుంది. అలాంటప్పుడు ఈ విచక్షణాశక్తి గల జిన్నాతులు మరియు మానవులు కూడా అల్లాహ్ (సు.తా.) స్తోత్రం చేయకుంటే వారు ఆయన శిక్షకు అర్హులు కాగూడదా?

అల్లాహ్ దే! మరియు అల్లాహ్ వైపునకే (అందరికీ) మరలి పోవలసి ఉంది.

**43.** ఏమీ? నీకు తెలియదా (చూడటం లేదా) ? నిశ్చయంగా, అల్లాహ్ యే మేఘాలను మెల్ల మెల్లగా నడుపుతూ, వాటిని ఒక దానితో ఒకటి కలుపుతాడని, ఆ తరువాత వాటిని ప్రోగు చేస్తాడని! ఆ పిదప వాటి నుండి వర్షాన్ని కురిపించేది నీవు చూస్తున్నావు కదా! మరియు ఆయనే ఆకాశంలో ఉన్న కొండల వంటి (మేఘాల) నుండి వడగండ్ల చల్లని (వర్షాన్ని) తాను కోరిన వారిపై కురిపిస్తాడు. మరియు తాను కోరిన వారిని వాటి నుండి తప్పిస్తాడు. వాటి పిడుగు యొక్క మెరుపు కంటి చూపులను దాదాపు హరించేలా ఉంటుంది.

**44.** అల్లాహ్ యే రేయింబవళ్ళను మార్చుతున్నాడు. నిశ్చయంగా, కన్నులు గలవారికి ఇందులో గుణపాఠముంది.

**45.** మరియు అల్లాహ్ ప్రతి ప్రాణిని నీటి నుండి సృష్టించాడు[27]. వాటిలో కొన్ని తమ కడుపు మీద ప్రాకేవి ఉన్నాయి. మరియు వాటిలో కొన్ని రెండు కాళ్ళ మీద నడిచేవి ఉన్నాయి. మరియు వాటిలో మరికొన్ని నాలుగు (కాళ్ళ) మీద నడిచేవి ఉన్నాయి. అల్లాహ్ తాను కోరిన దానిని సృష్టిస్తాడు. నిశ్చయంగా, అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు.

**46.** వాస్తవంగా! మేము సుస్పష్టమైన సూచనలను

---

[27] అంటే సర్వజీవరాసి, అంటే జీవం ఉండి చలించేది. చూడండి, 21:30.

(ఆయాత్ లను) అవతరింపజేశాము[28]. మరియు అల్లాహ్ తాను కోరిన వానికి ఋజుమార్గం వైపునకు మార్గదర్శకత్వం చేస్తాడు.

47. వారు (కపట విశ్వాసులు) అంటారు: "మేము అల్లాహ్ ను మరియు సందేశహరుణ్ణి విశ్వసించాము మరియు విధేయుల మయ్యాము." కాని దాని తరువాత వారిలో ఒక వర్గం వారు వెను దిరిగి పోతారు. మరియు అలాంటి వారు విశ్వసించిన వారు కారు.

48. మరియు వారి మధ్య తీర్పు చేయటానికి, వారిని అల్లాహ్ మరియు ఆయన సందేశహరుని వద్దకు పిలిచినప్పుడు, వారిలోని ఒక వర్గం వారు ముఖం త్రిప్పుకుంటారు.

49. మరియు ఒకవేళ తీర్పు (సత్యం) వారికి అనుకూలమైనదిగా ఉంటే, వారు వినమ్రతతో దానిని స్వీకరిస్తారు[29].

50. ఏమీ? వారి హృదయాలలో రోగముందా? లేక వారు సందేహంలో పడి పోయారా? లేక అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడు తమకు న్యాయం చేయరని వారికి భయమా? అలా కాదు! అసలు వారే అన్యాయపరులు.

51. కాని వాస్తవానికి ఒకవేళ విశ్వాసులను, వారి మధ్య తీర్పు చేయటానికి అల్లాహ్ మరియు ఆయన సందేశహరుని వద్దకు పిలిచినప్పుడు,

[28] అంటే ఖుర్ఆన్ చూడండి, 6:38.
[29] చూడండి, 4:60-61.

వారి పలుకులు కేవలం ఇలాగే ఉంటాయి: "మేము విన్నాము మరియు విధేయత చూపాము" మరియు ఇలాంటివారే సాఫల్యం పొందేవారు.

**52.** మరియు అల్లాహ్ కు మరియు ఆయన సందేశహరునికి విధేయత చూపేవారు మరియు అల్లాహ్ కు భయపడి, ఆయన యందు భయభక్తులు కలిగి ఉండేవారు, ఇలాంటి వారే సాఫల్యం (విజయం) పొందేవారు.

**53.** మరియు నీవు ఒకవేళ ఆజ్ఞాపిస్తే, అంతా వదలి తప్పక బయలుదేరగలమని వారు (ఆ కపట విశ్వాసులు) అల్లాహ్ పేరుతో గట్టి ప్రమాణాలు చేస్తారు. వారితో అను: "ప్రమాణాలు చేయకండి; మీ విధేయత తెలిసిందే. నిశ్చయంగా మీరు చేసేదంతా అల్లాహ్ కు బాగా తెలుసు!"

**54.** వారితో అను: "అల్లాహ్ కు విధేయులై ఉండండి మరియు సందేశహరుణ్ణి అనుసరించండి. కాని ఒకవేళ మీరు మరలిపోతే, అతనిపై (ప్రవక్తపై) విధించబడినదాని బాధ్యత అతనిది[30]; మరియు మీపై విధించబడినదాని బాధ్యత మీది[31]. మీరు అతనిని (ప్రవక్తను) అనుసరిస్తే మార్గదర్శకత్వం పొందుతారు. మరియు సందేశహరుని బాధ్యత

---

[30] చూడండి అంటే, ద'అవహ్ (తబ్లీగ్) చేయటం - ఇస్లాం వైపుకు ఆహ్వానించటం.

[31] అతని ('స'అస) ఆహ్వానాన్ని అంగీకరించి అల్లాహ్ (సు.తా.) మరియు ఆయన ప్రవక్తలను విశ్వసించటం మరియు వారికి విధేయులవటం.

కేవలం స్పష్టంగా సందేశాన్ని అందజేయటం మాత్రమే[32]."

**55.** మరియు మీలో విశ్వసించి సత్కార్యాలు చేసేవారితో: వారికి పూర్వం వారిని భూమికి ఉత్తరాధికారులుగా చేసినట్లు, వారిని కూడా ఉత్తరాధికారులుగా చేస్తానని; మరియు వారి కొరకు తాను సమ్మతించిన ధర్మాన్ని (ఇస్లాంను) స్థిరపరుస్తానని; మరియు వారి పూర్వపు భయస్థితిని వారి కొరకు శాంతిస్థితిగా మార్చుతానని, అల్లాహ్ వాగ్దానం చేశాడు[33]. (ఇదంతా) వారు నన్నే (అల్లాహ్ నే) ఆరాధించాలని మరియు నాకు ఎవరినీ సాటిగా (భాగస్వాములగా) కల్పించరాదని, మరియు దీని తరువాత కూడా ఎవరైనా సత్యతిరస్కారానికి పాల్పబడితే అలాంటి వారు, వారే అవిధేయులు.

**56.** మరియు మీరు కరుణించబడాలి అంటే నమాజ్ స్థాపించండి, విధిదానం (జకాత్) ఇవ్వండి మరియు సందేశహరునికి విధేయులై ఉండండి!

**57.** సత్యతిరస్కారులు భూమిలో తప్పించుకుంటారని భావించవద్దు. వారి నివాసం నరకాగ్నియే! అది ఎంత అధ్వాన్నమైన గమ్యస్థానం.

**58.** ఓ విశ్వాసులారా! మీ బానిసలు మరియు యుక్తవయస్సుకు చేరని మీ పిల్లలు, మూడు సమయాలలో అనుమతి తీసుకొనే మీ వద్దకు రావాలి. (అవి) ఉదయపు (ఫజ్ర్) నమాజ్ కు

---

[32] చూడండి, 13:40.
[33] చూడండి, 5:3.

ముందు, మధ్యాహ్నం (జుహ్ర్) తరువాత - మీరు మీ వస్త్రాలు విడిచి ఉన్నప్పుడు - మరియు రాత్రి (ఇషా) నమాజ్ తరువాత. ఈ మూడు, మీ కొరకు ఏకాంత (పరదా) సమయాలు. వీటి తరువాత వారు మరియు మీరు ఒకరి వద్దకు మరొకరు వచ్చి పోతూ వుంటే, వారిపై గానీ, మీపై గానీ ఎలాంటి దోషం లేదు. ఈ విధంగా అల్లాహ్ మీకు తన ఆజ్ఞలను విశదీకరిస్తున్నాడు. అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేకవంతుడు.

59. మరియు మీ పిల్లలు యుక్తవయస్సుకు చేరుకున్నప్పుడు; వారి కంటే పెద్దవారు (ముందువారు) అనుమతి తీసుకున్నట్లు వారు కూడా అనుమతి తీసుకోవాలి. ఈ విధంగా అల్లాహ్ మీకు తన ఆజ్ఞలను విశదీకరిస్తున్నాడు. మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేకవంతుడు.

60. మరియు ఋతుస్రావం ఆగిపోయి, వివాహ ఉత్సాహంలేని స్త్రీలు - తమ సౌందర్యం బయట పడకుండా ఉండేటట్లుగా - తమపై వస్త్రాలను (దుప్పట్లను) తీసి వేస్తే, వారిపై దోషం లేదు. కాని వారు అట్లు చేయకుండా ఉండటమే వారికి ఉత్తమమైనది[34]. మరియు అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

61. అంధుని మీద నిందలేదు మరియు కుంటివాని మీద నిందలేదు మరియు రోగి మీద నింద లేదు

[34] చూడండి, 33:59.

మరియు మీ మీద కూడా నిందలేదు: ఒకవేళ మీరు మీ ఇండ్లలో లేదా మీ తండ్రితాతల ఇండ్లలో లేదా మీ తల్లి నాయనమ్మల ఇండ్లలో లేదా మీ సోదరుల ఇండ్లలో లేదా మీ సోదరీమణుల ఇండ్లలో లేదా పినతండ్రుల (తండ్రి సోదరుల) ఇండ్లలో లేదా మీ మేనత్తల (తండ్రిసోదరీమణుల) ఇండ్లలో లేదా మీ మేనమామల (తల్లి సోదరుల) ఇండ్లలో లేదా మీ పిన్నమ్మల (తల్లిసోదరీమణుల) ఇండ్లలో లేదా మీ ఆధీనంలో తాళపు చెవులు ఉన్న వారి ఇండ్లలో లేదా మీ స్నేహితుల ఇండ్లలో తింటే! మీరు అందరితో కలిసి తిన్నా లేదా వేరుగా తిన్నా కూడా మీపై నింద లేదు. అయితే మీరు ఇండ్లలోనికి ప్రవేశించినపుడు, మీరు ఒకరి కొకరు సలాం చేసుకోవాలి. ఇది అల్లాహ్ తరఫు నుండి నిర్ణయించబడిన దీవెన, శుభప్రద మైనది మేలైనది. ఈ విధంగా, అల్లాహ్ - మీరు అర్థం చేసుకుంటారని - తన ఆజ్ఞలను మీకు విశదీకరిస్తున్నాడు.

62. అల్లాహ్ ను ఆయన ప్రవక్తను హృదయపూర్వకంగా విశ్వసించిన వారే నిజమైన విశ్వాసులు మరియు వారు ఏదైనా సామూహిక కార్యం నిమిత్తం అతనితో (దైవప్రవక్తతో) ఉన్నప్పుడు, అతని అనుమతి లేనిదే వెళ్ళిపోకూడదు. నిశ్చయంగా, ఎవరైతే నీతో (ఓ ముహమ్మద్!) అనుమతి అడుగుతారో అలాంటి వారే వాస్తవంగా! అల్లాహ్ ను మరియు ఆయన ప్రవక్తను విశ్వసించిన వారు. కనుక వారు

తమ ఏ పని కొరకైనా అనుమతి అడిగితే, వారిలో నీవు కోరిన వారికి అనుమతినివ్వు. మరియు వారిని క్షమించమని అల్లాహ్ ను ప్రార్థించు. నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

**63.** (ఓ విశ్వాసులారా!) సందేశహరుని పిలుపును మీరు, మీలో ఒకరి నొకరు పిలుచుకునే పిలుపుగా భావించకండి. మీలో ఒకరి చాటున ఒకరు దాక్కుంటూ మెల్లగా జారిపోయేవారి గురించి అల్లాహ్ కు బాగా తెలుసు[35]. దైవప్రవక్త ఆజ్ఞను ఉల్లంఘించేవారు, తాము ఏదైనా ఆపదలో చిక్కుకు పోతారేమోననీ లేదా బాధాకరమైన శిక్షకు గురి చేయబడతారేమోనని భయపడాలి.

**64.** వినండి! నిశ్చయంగా, ఆకాశాలలో మరియు భూమిలో నున్న సమస్తమూ అల్లాహ్ దే! మీ స్థితి ఆయనకు బాగా తెలుసు మరియు అందరూ ఆయన వద్దకు మరలింపబడిన రోజు వారు చేసి వచ్చిన కర్మలన్నీ ఆయన వారికి తెలియజేస్తాడు. మరియు అల్లాహ్ కు ప్రతి దానిని గురించి పూర్తి జ్ఞానముంది.

---

[35] మునాఫిఖులు దైవప్రవక్తతో సమాలోచనలు జరిగేటప్పుడు మెల్లగా జారుకునేవారు.

# 25. అల్-ఫుర్ఖాన్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. సర్వలోకాలకు హెచ్చరిక చేసేదిగా, ఈ గీటురాయిని (ఫుర్ఖాన్'ను) తన దాసునిపై క్రమక్రమంగా అవతరింపజేసిన ఆయన (అల్లాహ్) ఎంతో శుభదాయకుడు![1]

2. భూమ్యాకాశాల విశ్వసామ్రాజ్యాధిపత్యం ఆయనకే చెందుతుంది. ఆయన ఎవ్వరినీ సంతానంగా చేసుకోలేదు[2]. విశ్వసామ్రాజ్యాధిపత్యంలో ఆయనకు భాగస్వాములెవ్వరూ లేరు. మరియు ఆయన ప్రతి దానిని సృష్టించి, దానికొక విధిని

---

[*] [అల్-ఫుర్ఖాన్ అంటే గీటురాయి (ఖుర్ఆన్)]

[1] దీనితో తెలిసేదేమిటంటే ఈ ఖుర్ఆన్ - ఏదైతే దైవప్రవక్త ము'హమ్మద్ ('స'అస)పై అవతరింప జేయ బడిందో - సర్వలోకాల వారికి, అంటే మానవుల కొరకు మరియు జిన్నాతుల కొరకు గూడా మార్గదర్శినిగా అవతరింపజేయబడింది. కావున ము'హమ్మద్ ('స'అస) వారందరికీ సందేశహరుడు. అతను వారందరి కొరకు మార్గదర్శకునిగా పంపబడ్డారు. చూడండి 7:158. దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: "నేను ఎర్ర-నల్ల అందరి వైపుకూ సందేశహరునిగా పంపబడ్డాను కాని పూర్వపు ప్రవక్తలు ('అలైహిమ్ స.) ఒక్క జాతివారి వైపుకు మాత్రమే పంపబడేవారు." ('స'హీ'హ్ బు'ఖారీ).

[2] చూడండి, 17:111.

నిర్ణయించాడు[3].

3. అయినా వారు ఆయనకు బదులుగా ఏమీ సృష్టించలేని మరియు తామే సృష్టింపబడిన వారిని ఆరాధ్యదైవాలుగా చేసుకున్నారు. మరియు వారు తమకు తాము ఎట్టి నష్టం గానీ, లాభం గానీ చేసుకోజాలరు. మరియు వారికి మరణం మీద గానీ, జీవితం మీద గానీ మరియు పునరుత్థాన దినం మీద గానీ, ఎలాంటి అధికారం లేదు.

4. మరియు సత్యతిరస్కారులు ఇలా అంటారు: "ఇది(ఈ ఖుర్ఆన్) కేవలం ఒక బూటక కల్పన; దీనిని ఇతనే కల్పించాడు మరియు ఇతని జాతివారు కొందరు ఇతనికి ఈ పనిలో సహాయ పడ్డారు[4]. కాని వాస్తవానికి వారు అన్యాయానికి మరియు అబద్ధానికి పూనుకున్నారు."

5. మరియు వారింకా ఇలా అంటారు: "ఇవి పూర్వీకుల గాథలు, వాటిని ఇతను వ్రాసు కున్నాడు, ఇవి ఇతనికి ఉదయం మరియు

---

[3] చూడండి, 87:3. అల్లాహ్ (సు.తా.) ప్రతిదాని విధిని, అంటే దాని జీవన విధానం మరియు దాని మరణం, మొదలైనవి అన్నీ మొదటనే వ్రాసి పెట్టి ఉన్నాడు. ఎందుకంటే ఆయనకు గడిచిపోయింది మరియు ముందు జరగనున్నది అంతా తెలుసు.

[4] చూడండి, 16:103. దైవప్రవక్త ('స'అస) ఈ గ్రంథాన్ని, అబూ ఫకీహ్ యసార్, 'అదాస్ మరియు జబర్ మొదలైన యూద విద్వాంసుల నుండి నేర్చుకున్నారని సత్యతిరస్కారులు ఆరోపించారు.

సాయంత్రం చెప్పి వ్రాయించబడుతున్నాయి[5]."

6. వారితో ఇలా అను: "దీనిని (ఈ ఖుర్ఆన్ ను) భూమ్యాకాశాల రహస్యాలు తెలిసిన వాడు అవతరింపజేశాడు. నిశ్చయంగా, ఆయన క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత."

7. మరియు వారిలా అంటారు: "ఇతను ఎటువంటి సందేశహరుడు, (సాధారణ వ్యక్తి వలే) ఇతనూ అన్నం తింటున్నాడు మరియు వీధులలో తిరుగుతున్నాడు? (ఇతను వాస్తవంగానే దైవప్రవక్త అయితే) ఇతనికి తోడుగా హెచ్చరిక చేసేవాడిగా, ఒక దేవదూత ఎందుకు అవతరింపజేయబడలేదు?[6]"

8. లేదా ఇతనికొక నిధి ఎందుకు ఇవ్వబడలేదు? లేదా ఇతనికొక తోట ఎందుకు ఇవ్వబడ లేదు? ఇతను దాని నుండి తినటానికి!" ఆ దుర్మార్గులు

---

[5] సత్యతిరస్కారుల నుండి.

[6] సత్యతిరస్కారులు మొదట ఖుర్ఆన్ ను అసత్యమని తిరస్కరించారు. దానిని పూర్వీకుల కట్టుకథ అన్నారు. ఆ తరువాత దైవప్రవక్త ('స'అస) ను ఒక సాధారణ వ్యక్తి ఎలా దైవప్రవక్త కాగలడు, ఇతడు ఒక మాంత్రికుడు లేదా మంత్రజాలానికి గురి అయినవాడు లేదా ఇతరుల నుండి పూర్వ గాథలను నేర్చుకొని మాకు వినిపిస్తున్నాడు, అన్నారు. వాస్తవమేమిటంటే అతను ('స'అస) నిరక్షరాస్యుడు మరియు ఆయన చెప్పే గాథలు పూర్వ గ్రంథ ప్రజల గాథల కంటే భిన్నంగా ఉన్నాయి. ఎందుకంటే వారి గాథలు, పూర్వ ప్రవక్తలు తెచ్చిన నిజ గ్రంథాల నుండి గాక తరువాత తరాల వారు వ్రాసి పెట్టినవి. వారు తమ గ్రంథాలలో ఎన్నో మార్పులు తెచ్చారు. ఖుర్ఆన్ అయితే అల్లాహ్ తరఫు నుండి వచ్చింది మరియు 1400ల సంవత్సరాలలో దానిలో ఒక్క అక్షరపు మార్పు కూడా రాలేదు. ఈ విషయాన్ని సత్యతిరస్కారులు కూడా ధృవీకరిస్తునారు.

ఇంకా ఇలా అంటారు: "మీరు కేవలం ఒక మంత్రజాలానికి గురి అయిన మానవుణ్ణి అనుసరిస్తున్నారు."

9. (ఓ ప్రవక్తా!) చూడు వారు నిన్ను గురించి ఎటువంటి ఉదాహరణలు ఇస్తున్నారు? వారు మార్గభ్రష్టులై పోయారు, వారు ఋజుమార్గం పొందజాలరు.

10. ఆ శుభదాయకుడు కోరితే నీకు వాటి కంటే ఉత్తమమైన వాటిని ప్రసాదించగలడు - స్వర్గవనాలు - వాటి క్రింద సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి మరియు అక్కడ నీ కొరకు పెద్ద కోటలు కూడా ఉంటాయి.

11. వాస్తవానికి వారు ఆ అంతిమ ఘడియను అబద్ధమని తిరస్కరించారు. మరియు ఆ అంతిమ ఘడియను అబద్ధమని తిరస్కరించే వారి కొరకు మేము జ్వలించే నరకాగ్నిని సిద్ధ పరచి ఉంచాము.

12. అది, దూరం నుండి వారిని చూసినప్పుడు వారు దాని ఆవేశ ధ్వనులను మరియు దాని బుసను వింటారు[7].

13. మరియు దానిలోని ఒక ఇరుకైన స్థలంలో, వారు బంధింపబడి, త్రోయబడినప్పుడు వారక్కడ తమ చావును పిలువడం ప్రారంభిస్తారు[8].

14. వారితో అనబడుతుంది: "ఈ రోజు మీరు ఒక్క చావును పిలువకండి, ఎన్నో చావుల కొరకు

[7] చూడండి, 67:8.
[8] చూడండి, 14:49.

అరవండి!"

15. వారితో అను: "ఏమీ? ఇది మంచిదా, లేతా దైవభీతి గలవారికి వాగ్దానం చేయబడిన శాశ్వతమైన స్వర్గమా? అదే (దైవభీతి గల) వారి ప్రతిఫలం మరియు గమ్యస్థానం.

16. అందులో వారికి వారు కోరింది లభిస్తుంది. వారందు శాశ్వతంగా వుంటారు. ఇది నీ ప్రభువు కర్తవ్యంతో పూర్తి చేయవలసిన వాగ్దానం.

17. మరియు ఆయన (అల్లాహ్) వారిని (సత్యతిరస్కారులను) మరియు అల్లాహ్ కు బదులు గా వారు ఆరాధించేవారిని, అందరినీ, ఆ రోజు సమావేశపరచి వారితో ఇలా అంటాడు: "ఏమీ? మీరేనా నా దాసులను మార్గం తప్పించినవారు? లేక స్వయంగా వారే మార్గభ్రష్టులయ్యారా?"

18. వారంటారు: "ఓ మా ప్రభూ! నీవు సర్వలోపాలకు అతీతుడవు! మేము నిన్ను వదలి ఇతరులను మా సంరక్షకులుగా చేసుకోవటం మాకు తగినది కాదు, కాని నీవు వారికి మరియు వారి తండ్రితాతలకు చాలా సుఖసంతోషాలను ప్రసాదించావు, చివరకు వారు నీ బోధననే మరచి పోయి నాశనానికి గురి అయిన వారయ్యారు."

19. (అప్పుడు అల్లాహ్ అంటాడు): "కాని ఇప్పుడైతే వారు,మీ మాటలను అసత్యాలని తిరస్కరిస్తున్నారు. ఇక మీరు మీ శిక్ష నుండి తప్పించుకోలేరు మరియు ఎలాంటి సహాయమూ పొందలేరు

మరియు మీలో దుర్మార్గానికి పాల్పడిన వానికి మేము ఘోరశిక్ష రుచి చూపుతాము!"

**20.** మరియు (ఓ ముహమ్మద్!) మేము నీకు పూర్వం పంపిన సందేశహరులు అందరూ నిశ్చయంగా, ఆహారం తినేవారే, వీధులలో సంచరించేవారే. మరియు మేము మిమ్మల్ని ఒకరిని మరొకరి కొరకు పరీక్షా సాధనాలుగా చేశాము; ఏమీ? మీరు[9] సహనం వహిస్తారా? మరియు వాస్తవానికి, నీ ప్రభువు సర్వం చూసేవాడు[10].

**21.** మరియు మమ్మల్ని కలుసు కోవలసి ఉందని ఆశించనివారు ఇలా అన్నారు: "దేవదూతలు మా వద్దకు ఎందుకు పంపబడలేదు? లేదా మేము మా ప్రభువును ఎందుకు చూడలేము?" వాస్తవానికి, వారు తమను తాము చాలా గొప్పవారిగా భావించారు మరియు వారు తలబిరుసుతనంలో చాలా మితిమీరి పోయారు[11].

---

[9] మీరు అంటే విశ్వాసులు.

[10] చూడండి, 6:124.

[11] అల్లాహ్ (సు.తా.), అగోచరాన్ని విశ్వసించే విషయంలో మానవులను పరీక్షిస్తున్నాడు. ఒకవేళ వారి ముందుకు దైవదూతలు లేక అల్లాహ్ (సు.తా.) స్వయంగా వచ్చి ప్రతి ఒక్కరితో తనను విశ్వసించండి అని చెప్పితే! ఈ పరీక్ష అవసరమే ఉండేది కాదు. అల్లాహ్ (సు.తా.) మానవుల ఇచ్ఛ ప్రకారం కాక తన ఇష్టప్రకారం ప్రవర్తిస్తాడు.

**22.** ఆ రోజు[12] వారు దేవదూతలను చూస్తారు; ఆ రోజు అపరాధులకు ఎలాంటి శుభవార్తలు ఉండవు మరియు వారు (దేవదూతలు) ఇలా అంటారు: "మీకు శుభవార్తలన్నీ ఖచ్చితంగా నిషేధించబడ్డాయి."

**23.** మరియు మేము, వారు (అవిశ్వాసులు) చేసిన కార్యాల వైపుకు మరలుతాము, తరువాత వాటిని సూక్ష్మకణాల వలే (ధూళి వలే) ఎగురవేస్తాము[13].

**24.** ఆ దినమున స్వర్గానికి అర్హులైన వారు మంచి నివాసంలో మరియు ఉత్తమ విశ్రాంతి స్థలంలో ఉంటారు.

**25.** మరియు (జ్ఞాపకముంచుకోండి) ఆ రోజు ఆకాశం మేఘాలతో సహా బ్రద్దలు చేయ బడుతుంది. మరియు దేవదూతలు వరుసగా దింపబడతారు[14].

**26.** ఆ రోజు వాస్తవమైన విశ్వ సామ్రాజ్యాధిపత్యం కేవలం ఆ అనంత కరుణామయునిదే! సత్యతిరస్కారులకు ఆ దినం ఎంతో కఠినమైనదిగా ఉంటుంది.

**27.** మరియు (జ్ఞాపకముంచుకోండి), ఆ దినమున దుర్మార్గుడు తన చేతులను కొరుక్కుంటూ ఇలా

---

[12] ఆ రోజు అంటే, మరణదినం కానీ లేక పునరుత్థానదినం కానీ కావచ్చు (ఇబ్నె-కసీ'ర్). ఆ రోజు సత్యతిరస్కారుల పరిస్థితికి చూడండి, 8:50. విశ్వాసుల పరిస్థితికి చూడండి, 41:30-32.

[13] హబాఅన్': అంటే చిన్న సందులోనుండి ఇంటిలోకి వచ్చే సూర్య కిరణాలలో కనబడే సూక్ష్మకణాలు. వాటిని చేతితో పట్టుకోవటం అసాధ్యం. సత్యతిరస్కారుల కర్మలు, ఇక్కడ సూక్ష్మకణాలతో పోల్చబడ్డాయి. అవి ఇతర ఆయతులలో ఎండమావులతో, బూడిదతో లేక సున్నని బండతో పోల్చబడ్డాయి. చూడండి, 2:264, 14:18 మరియు 24:39.

[14] చూడండి, 22:10.

అంటాడు: "అయ్యో! నేను సందేశహరుని మార్గం అనుసరిస్తే, ఎంత బాగుండేది!"

28. “అయ్యో! నా దౌర్భాగ్యం! నేను ఫలానా వానిని స్నేహితునిగా చేసుకోకుండా వుంటే ఎంత బాగుండేది[15]!"

29. “వాస్తవానికి అతడే, హితబోధ (ఖుర్ఆన్) నా వద్దకు వచ్చిన తరువాత కూడా, నన్ను దాని నుండి తప్పించాడు!

30. వాస్తవానికి షైతాన్ మానవుని యెడల నమ్మకద్రోహి[16]."

31. అప్పుడు సందేశహరుడు ఇలా అంటాడు: "ఓ నా ప్రభూ! నిశ్చయంగా, నా జాతివారు ఈ ఖుర్ఆన్ ను పూర్తిగా వదలి పెట్టారు[17]." మరియు ఈ విధంగా మేము అపరాధుల నుండి ప్రతి ప్రవక్తకూ శత్రువులను నియమించాం[18] మరియు నీ ప్రభువే, నీకు మార్గదర్శకుడిగా మరియు సహాయకుడిగా చాలు!

32. మరియు సత్యతిరస్కారులు అంటారు: "ఇతని

---

[15] దీనితో వ్యక్తమయ్యేది ఏమిటంటే మంచి వారి సాంగత్యంలో మానవుడు మంచివాడౌతాడు, మరియు దుష్టుల సాంగత్యంలో దుష్టుడౌతాడు. (ముస్లిం).

[16] చూడండి, 15:17 మరియు 14:22

[17] హిజ్'రున్: ఆటంకపరచటం, నిషేధించటం, ఆపటం మొదలైనవి. ముష్రికులు ఖుర్ఆన్ వినిపించే టప్పుడు, గొడవ చేసేవారు ఇదే హిజ్ రున్. ఖుర్ఆన్ ను విశ్వసించకుండటం, దానిని అనుసరించకుండటం, అదినిషేధించినదానినివిడువకకుండటం మొదలైనవి కూడా ఈ అర్థంలోకి వస్తాయి.

[18] ఇలాంటి ఆయత్ కు చూడండి, 6:112.

(ముహమ్మద్) మీద ఈ ఖుర్ఆన్ పూర్తిగా ఒకేసారి ఎందుకు అవతరింప జేయబడలేదు?" మేము (ఈ ఖుర్ఆన్'ను) ఈ విధంగా (భాగాలుగా పంపింది) నీ హృదయాన్ని దృఢపరచడానికి మరియు మేము దీనిని క్రమక్రమంగా అవతరింపజేశాము[19].

**33.** మరియు వారు నీ వద్దకు (నిన్ను వ్యతిరేకించటానికి) ఎలాంటి ఉపమానాన్ని తెచ్చినా! మేము నీకు దానికి సరైన జవాబు మరియు ఉత్తమమైన వ్యాఖ్యానం ఇవ్వకుండా ఉండము[20].

**34.** ఎవరైతే, వారి ముఖాల మీద (బోర్లా పడవేయబడి) లాగుతూ నరకంలో కూడబెట్ట బడతారో, అలాంటి వారు ఎంతో దుస్థితిలో మరియు మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నవారు[21].

**35.** మరియు నిశ్చయంగా, మేము మూసాకు గ్రంథాన్ని ప్రసాదించాము మరియు అతని సోదరుడైన హారూన్ ను అతనికి సహాయకునిగా

---

[19] అల్లాహ్ (సు.తా.) అంటున్నాడు: 'మేము ఈ ఖుర్ఆన్ ను 23 సంవత్సరాలలో క్రమక్రమంగా అవతరింపజేశాము.' ఇంకా చూడండి, 17:106, 73:4.

[20] సత్యతిరస్కారులు దైవప్రవక్త ('స'అస) ను వ్యతిరేకించటానికి, ఎలాంటి ఉపమానాలు తెచ్చినా వాటికి తగిన సమాధానాలు ఇవ్వటానికి మేము క్రమక్రమంగా ఈ ఖుర్ఆన్ ను అవతరింపజేశాము.

[21] అంటే సత్యతిరస్కారుడు ఎన్ని సత్కార్యాలు చేసినా అవి పరలోకంలో ఎండమావులుగా అదృశ్యమై పోతాయి. అంటే అతనికి వాటి నుండి ఎలాంటి పుణ్యఫలితం లభించదు. అతడు నరకంలో చేరిపోతాడు.

చేశాము[22].

**36.** వారిద్దరితో ఇలా అన్నాము: "మీరిద్దరూ మా సూచనలను అసత్యాలని తిరస్కరించిన జాతివారి వద్దకు వెళ్ళండి." తరువాత మేము (ఆ జాతి) వారిని పూర్తిగా నాశనం చేశాము.

**37.** ఇక నూహ్ జాతి వారు: ఎప్పుడైతే వారు ప్రవక్తలను అసత్యవాదులని తిరస్కరించారో, మేము వారిని ముంచి వేసి, సర్వజనులకు వారిని ఒక సూచనగా చేశాము. మరియు దుర్మార్గుల కొరకు మేము వ్యధాభరితమైన శిక్షను సిద్ధ పరిచి ఉంచాము.

**38.** మరియు ఇదే విధంగా ఆద్ మరియు సమూద్ మరియు అర్ రస్స్[23] ప్రజలు మరియు వారి మధ్య ఎన్నో తరాల వారిని[24] (నాశనం చేశాము).

**39.** మరియు వారిలో ప్రతి ఒక్కరినీ మేము దృష్టాంతాలను ఇచ్చి నచ్చజెప్పాము. చివరకు ప్రతి ఒక్కరినీ పూర్తిగానిర్మూలించాము[25].

**40.** మరియు మేము దారుణమైన (రాళ్ళ) వర్షం కురిపించిన (లూత్) నగరం మీద నుండి వాస్తవానికి వారు (అవిశ్వాసులు) ప్రయాణం చేసి

---

[22] చూడండి, 20:29.

[23] రస్సున్: అంటే బావి. ఇమామ్ ఇబ్నె-జరీర్ 'తబరీ: వీరే అ'స్హాబ్ అల్-ఉ'ఖ్దూద్ అని అన్నారు. చూడండి, 85:4 (ఇబ్నె-కసీ'ర్).

[24] ఖర్నున్: అంటే ఒక యుగానికి లేక ఒక తరానికి చెందిన ప్రజలు. ప్రతి ప్రవక్త సమాజాన్ని ఒక ఖర్న్ కు చెందినది అని అనవచ్చు. (ఇబ్నె-కసీ'ర్).

[25] చూడండి, 17:89.

ఉంటారు. ఏమీ? వారు దానిని (దాని స్థితిని) చూడటం లేదా? వాస్తవానికి, వారు తిరిగి బ్రతికించి లేపబడతారని నమ్మలేదు[26].

**41.** (ఓ ముహమ్మద్!) వారు నిన్ను చూసినప్పుడల్లా నిన్ను పరిహాసాలనికి గురి చేస్తూ ఇలా అంటారు: "ఏమీ? ఇతనినేనా, అల్లాహ్ తన సందేశహరునిగా చేసి పంపింది?

**42.** మేము వాటి (మా దేవతల) పట్ల (దృఢవిశ్వాసం మీద) స్థిరంగా ఉండకపోతే, ఇతను మమ్మల్ని మా దేవతల నుండి తప్పించి దూరం చేసేవాడే!" మరియు త్వరలోనే వారు మా శిక్షను చూసినప్పుడు ఎవరు మార్గం తప్పి ఉన్నారో తెలుసుకుంటారు[27].

**43.** (ఓ ముహమ్మద్!) ఎవడు తన మనోవాంఛలను తనకు దైవంగా చేసుకొని ఉన్నాడో, అలాంటి వానిని నీవు చూశావా? నీవు అలాంటి వానికి రక్షకుడవు కాగలవా?

**44.** లేక వారిలోని చాలా మంది వింటారని లేదా అర్థం చేసుకుంటారని నీవు భావిస్తున్నావా? అసలు వారు పశువుల వంటివారు. అలా కాదు! వారు వాటికంటే ఎక్కువ దారితప్పిన వారు.

**45.** ఏమీ? నీవు చూడటం లేదా? నీ ప్రభువు! ఏ విధంగా ఛాయను పొడిగిస్తాడో? ఒకవేళ ఆయన కోరితే, దానిని నిలిపివేసి ఉండేవాడు. కాని మేము

---

[26] చూడండి, 11:82
[27] చూడండి, 21:36.

సూర్యుణ్ణి దానికి మార్గదర్శిగా చేశాము.

**46.** తరువాత మేము దానిని (ఆ నీడను) క్రమక్రమంగా మా వైపునకు లాక్కుంటాము.

**47.** మరియు ఆయన (అల్లాహ్)యే మీ కొరకు రాత్రిని వస్త్రంగానూ(తెరగానూ), నిద్రను విశ్రాంతి స్థితిగానూ మరియు పగటిని తిరిగి బ్రతికించి లేపబడే (జీవనోపాధి) సమయం గానూ చేశాడు.

**48.** మరియు ఆయన (అల్లాహ్) యే తన కారుణ్యానికి ముందు గాలులను శుభవార్తలుగా పంపేవాడు మరియు మేమే ఆకాశం నుండి నిర్మలమైన నీటిని కురిపించే వారము.

**49.** దాని ద్వారా ఒక మృత ప్రదేశానికి ప్రాణం పోయటానికి మరియు దానిని మేము సృష్టించిన ఎన్నో పశువులకు మరియు మానవులకు త్రాగటానికి!

**50.** మరియు వాస్తవానికి, మేము దానిని (నీటిని) వారి మధ్య పంచాము, వారు (మా అనుగ్రహాన్ని) జ్ఞాపకముంచుకోవాలని; కానీ మానవులలో చాలా మంది దీనిని తిరస్కరించి, కృతఘ్నులవుతున్నారు.

**51.** మరియు మేము తలుచుకుంటే, ప్రతి నగరానికొక హెచ్చరిక చేసేవానిని (ప్రవక్తను) పంపి ఉండేవారము.

**52.** కావున నీవు (ఓ ప్రవక్తా!) సత్యతిరస్కారుల అభిప్రాయాన్ని లక్ష్యపెట్టకు మరియు దీని (ఈ ఖుర్ఆన్) సహాయంతో, (వారికి హితబోధ

చేయటానికి) గట్టిగా పాటుపడు.

53. మరియు రెండు సముద్రాలను కలిపి ఉంచిన వాడు ఆయనే! ఒకటేమో రుచికరమైనది, దాహం తీర్చునది, మరొకటేమో ఉప్పగనూ, చేదుగనూ ఉన్నది మరియు ఆయన ఆ రెండింటి మధ్య ఒక అడ్డుతెరను - అవి కలిసి పోకుండా - అవరోధంగా ఏర్పరచాడు[28].

54. మరియు ఆయనే నీటితో మానవుణ్ణి సృష్టించాడు[29]. తరువాత అతనికి తన వంశ బంధుత్వాన్ని మరియు వివాహ బంధుత్వాన్ని ఏర్పరచాడు. మరియు వాస్తవానికి నీ ప్రభువు (ప్రతిదీ చేయగల) సమర్థుడు.

55. మరియు వారు అల్లాహ్ ను వదలి తమకు లాభం గానీ, నష్టం గానీ, చేకూర్చలేని వారిని ఆరాధిస్తున్నారు. మరియు సత్యతిరస్కారుడు తన ప్రభువుకు విరుద్ధంగా, (షైతానుకు తోడుగా) ఉంటాడు.

56. మరియు (ఓ ముహమ్మద్!) మేము నిన్ను ఒక శుభవార్తాహరునిగా మరియు హెచ్చరిక చేసేవానిగా మాత్రమే పంపాము.

57. కావున నీవు వారితో అను: "దీనికై (ఈ ప్రచారానికై) మీతో ఎలాంటి ప్రతిఫలము నడగటం లేదు. కేవలం, తాను కోరిన వ్యక్తియే తన ప్రభువు మార్గాన్ని అవలంబించవచ్చు!"

---

[28] బావుల, నదుల, సరోవరాల మరియు సముద్రాల నీరు.
[29] చూడండి, 21:30 మరియు 24:45.

**58.** కావున ఎన్నడూ మరణించని, ఆ సజీవుని (నిత్యుని) పైననే ఆధారపడి ఉండు మరియు ఆయన స్తోత్రంతో పాటు ఆయన పవిత్రతను కొనియాడు. తన దాసుల పాపాలను ఎరుగుటకు ఆయనే చాలు.

**59.** ఆయనే ఆకాశాలను మరియు భూమిని మరియు వాటి మధ్య ఉన్న సమస్తాన్ని ఆరు దినాలలో (అయ్యామ్'లలో) సృష్టించి, తరువాత తన సింహాసనాన్ని (అర్ష్'ను) అధిష్ఠించాడు[30]. ఆయన అనంత కరుణా మయుడు, ఆయన ఘనతను గురించి ఎరిగిన వాడిని అడుగు.

**60.** మరియు వారితో: "ఆ కరుణామయునికి సాష్టాంగం (సజ్దా) చేయండి." అని అన్నప్పుడల్లా, వారంటారు: "ఆ కరుణామయుడెవడు? మీరు ఆజ్ఞాపించిన వానికి మేము సాష్టాంగం (సజ్దా) చేయాలా?" మరియు అది (నీ పిలుపు) వారి వ్యతిరేకతను మరింత అధికమే చేసింది[31].

---

[30] చూడండి, 7:54, 9:129, 10:9, 13:2.

[31] 'హుదైబియహ్ ఒప్పందాన్ని: 'బిస్మిల్లా హిర్ర'హ్మా నిర్ర'హీమ్' తో, వ్రాయటం మొదలు పెడ్తే దానికి ముష్రిక్ ఖురైషీ రాయబారి అయిన సుహైల్ బిన్ అమ్ర్ మేము ర'హ్మాన్, ర'హీంలను ఎరుగము: 'బి ఇస్మిక అల్లాహుమ్మ.' అని మొదలు పెట్టండన్నారు. (సీరత్ ఇబ్నె 'హిషామ్). చూడండి 17:110, 13:30.

61. ఆకాశంలో నక్షత్రరాసులను (బురూజులను)[32] నిర్మించి, అందులో ఒక (ప్రకాశించే) సూర్యుణ్ణి[33] మరియు వెలుగునిచ్చే (ప్రతిబింబింప జేసే) చంద్రుణ్ణి నియమించిన ఆయన (అల్లాహ్) శుభదాయకుడు.

62. మరియు ఆయనే, రేయింబవళ్ళను ఒకదాని వెంట ఒకటి అనుక్రమంగా వచ్చేటట్లు చేసే వాడు, ఇవన్నీ గమనించ గోరినవారి కొరకు లేదా కృతజ్ఞత చూపగోరినవారి కొరకు ఉన్నాయి.

63. మరియు వారే, అనంత కరుణామయుని దాసులు, ఎవరైతే భూమి మీద నమ్రతతో నడుస్తారో! మరియు మూర్ఖులు వారిని పలుకరించినప్పుడు: "మీకు సలాం!"[34] అని అంటారో!

64. మరియు ఎవరైతే, తమ ప్రభువు సన్నిధిలో సాష్టాంగం (సజ్దా) చేస్తూ మరియు (నమాజ్ లో) నిలబడుతూ రాత్రులు గడుపుతారో!

65. మరియు ఎవరైతే: "ఓ మా ప్రభూ! మా నుండి నరకపు శిక్షను తొలగించు. నిశ్చయంగా, దాని

---

[32] బురూజున్: మొట్టమొదటి వ్యాఖ్యాతలు బురూజున్, అంటే పెద్ద పెద్ద నక్షత్ర సముదాయాలన్నారు. తరువాత కాలపు వ్యాఖ్యాతలు పన్నెండు నక్షత్రరాసులు (సముదాయాలు) - మేషం, వృషభం, మిథునం, కర్కాట్కం, సింహ, కన్య, తుల, వృశ్చిక, ధనస్సు, మకరం, కుంభం, మీనం - అనేవి అన్నారు. (అయ్ సర్ అత్తఫాసీర్) ఇంకా చూడండి, 15:16.

[33] చూడండి, 10:5, ప్రకాశించే సూర్యుడు. సూర్యుని వెలుగును ప్రతిబింపజేసే చంద్రుడు.

[34] చూడండి, 28:55, 43:89.

శిక్ష ఎడతెగని పీడన" అని అంటారో![35]

66. నిశ్చయంగా, అది అతి చెడ్డ ఆశ్రయం మరియు నివాస స్థలం.

67. మరియు ఎవరైతే ఖర్చు చేసేటప్పుడు అనవసర ఖర్చు గానీ లేక లోభత్వం గానీ చేయకుండా, ఈ రెండింటి మధ్య మితంగా ఉంటారో;

68. మరియు ఎవరైతే, అల్లాహ్ తో పాటు ఇతరదైవాలను ఆరాధించరో! మరియు అల్లాహ్ నిషేధించిన ఏప్రాణిని కూడా న్యాయానికి తప్ప చంపరో[36]!

---

[35] వారే అనంతకరుణామయునికి ప్రియులైనవారు ఎవరైతే నమా'జ్ చేస్తారో, విధిదానం ('జకాత్) ఇస్తారో, సత్కార్యాలు చేస్తారో మరియు తమ ప్రభువును రేయింబవళ్ళు నరకపు శిక్ష నుండి తొలగించ మని ప్రార్థిస్తారో! అంటే అల్లాహ్ (సు.తా.) ఆరాధన చేస్తూ ఆయన ఆజ్ఞలను శిరసావహిస్తూ ఉండి కూడా, దానికై గర్వితులు కారో మరియు సదా తమ ప్రభువు శిక్ష నుండి భీతిపరులై ఉంటారో, అలాంటి వారు! ఇంకా చూడండి, 23:60.

[36] న్యాయానికి చంపే పరిస్థితులు మూడు: 1) ఇస్లాం స్వీకరించిన తరువాత మరల సత్యతిరస్కారి అవటం, 2) పెండ్లి అయినవాడు వ్యభిచారం చేయటం, 3) ఎవరినైనా చంపటం.

మరియు వ్యభిచారానికి పాల్పడరో[37]. మరియు ఈవిధంగా చేసేవాడు (అవిధేయుడిగా ప్రవర్తించేవాడు) దాని ఫలితాన్ని తప్పక పొందుతాడు.

**69.** పునరుత్థాన దినం నాడు, అతనికి రెట్టింపు శిక్ష పడుతుంది మరియు అతడు అందులోనే అవమానంతో శాశ్వతంగా పడి ఉంటాడు.

**70.** కాని, ఇక ఎవరైతే (తాము చేసిన పాపాలకు) పశ్చాత్తాప పడి, విశ్వసించి సత్కార్యాలు చేస్తారో! అలాంటి వారి పాపాలను అల్లాహ్ పుణ్యాలుగా మార్చుతాడు[38]. మరియు అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

**71.** మరియు ఎవడైతే, పశ్చాత్తాప పడి సత్కార్యాలు చేస్తాడో! నిశ్చయంగా అలాంటి వాడు హృదయపూర్వకంగా అల్లాహ్ వైపునకు పశ్చాత్తాపంతో మరలుతాడు!

**72.** మరియు ఎవరైతే, అబద్ధమైన సాక్ష్యం ఇవ్వరో! మరియు వ్యర్థమైన పనుల వైపు నుండి పోవటం

---

[37] ఒకడు దైవప్రవక్త ('స'అస)తో ప్రశ్నించాడు: 'అన్నింటి కంటే మహాపాపం ఏమిటీ?' అతను ('స'అస) జవాబిచ్చారు: 'అల్లాహ్ (సు.తా.)కు ఎవరినైనా సాటికల్పించటం (షిర్క్). ఎందుకంటే ఆయనయే నిన్ను సృష్టించాడు.' అతనన్నాడు: 'దాని తరువాత ఏ పాపం పెద్దది?' దైవప్రవక్త ('స'అస) అన్నారు: 'తన సంతానాన్ని జీవనోపాధికి భయపడి చంపటం.' అతడు మళ్ళీ అడిగాడు, ఆ తరువాత అతను జవాబిచ్చారు: 'తన పొరుగువాని భార్యతో వ్యభిచారం చేయటం!' ఆ తరువాత దైవప్రవక్త ('స'అస) అన్నారు: 'ఈ మూడు విషయాలు ఈ ఆయత్ తో విశదీకరించబడుతున్నాయి.' అని ఈ ఆయత్ ను చదివారు. ('స. బు'ఖారీ, ముస్లిం).

[38] చూడండి, 21:30 మరియు 24:45.

జరిగితే, సంస్కారవంతులుగా అక్కడి నుండి దాటిపోతారో[39]!

73. మరియు ఎవరైతే, తమ ప్రభువు సూచనల (ఆయాత్ ల) హితబోధ చేసినపుడు, వారు దానికి చెవిటివారిగా మరియు గ్రుడ్డివారిగా ఉండిపోరో!

74. మరియు ఎవరైతే, ఇలా ప్రార్థిస్తారో: "ఓ మా ప్రభూ! మా సహవాసుల (అజ్వాజ్ ల) మరియు సంతానం ద్వారా మా కన్నులకు చల్లదనం ప్రసాదించు. మరియు మమ్మల్ని దైవభీతి గలవారికి నాయకులుగా (ఇమాములుగా) చేయి."

75. ఇలాంటి వారే తమ సహనశీలతకు ప్రతిఫలంగా (స్వర్గంలో) ఉన్నత స్థానాన్ని పొందేవారు. అక్కడ వారికి గౌరవమైన స్వాగతం మరియు శాంతి లభిస్తాయి.

76. వారందు శాశ్వతంగా ఉంటారు. అది ఎంత మంచి నివాసం మరియు ఎంత మంచి స్థలం.

77. (ఓ ముహమ్మద్! అవిశ్వాసులతో) ఇలా అను: "మీరు ఆయనను ప్రార్థిస్తున్నారు కాబట్టి నా

---

[39] ల'గ్వున్: అంటే ఆ పని దేనికైతే షరీయత్లో ఎలాంటి స్థానం లేదో! ఇటువంటి చేష్టలు మరియు మాటలు జరిగేటప్పుడు, వారు అక్కడి నుండి మెల్లగా దాటిపోతారు.

ప్రభువు మిమ్మల్ని అలక్ష్యం చేయడం లేదు[40]. కాని వాస్తవానికి, ఇప్పుడు మీరు (ఆయనను) తిరస్కరించారు. కావున త్వరలోనే ఆయన శిక్ష మీపై అనివార్యమవుతుంది."

[40] అల్లాహ్ (సు.తా.) యందు భయభక్తులు కలిగివుండి కేవలం ఆయననే ఆరాధించే వారిని ఆయన (సు.తా.) లక్ష్యం చేస్తాడు. అల్లాహ్(సు.తా.)ను తిరస్కరించిన వారికీ మరియు ఆయనకు సాటి కల్పించిన వారికీ నరకశిక్ష తప్పదు.

# 26. అష్-షుఅరా [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. తా - సీన్ - మీమ్[1].
2. ఇవి స్పష్టమైన గ్రంథ సూచనలు (ఆయతులు).
3. (ఓ ముహమ్మద్) వారు విశ్వసించలేదనే బాధతో బహుశా నీవు నీ ప్రాణాలే కోల్పోతావేమో[2]
4. మేము కోరితే ఆకాశం నుండి వారిపై ఒక అద్భుత సంకేతాన్ని (ఆయత్ ను) అవతరింప జేసి, దానికి వారి మెడలను నమ్రతతో వంగి పోయేలా చేసేవారము.
5. మరియు వారి వద్దకు అనంత కరుణామయుడని వద్ద నుండి క్రొత్త సందేశం వచ్చిన ప్పుడల్లా, వారు దాని నుండి విముఖులు కాకుండా ఉండలేదు.
6. వాస్తవానికి, ఇప్పుడు వారు తిరస్కరించారు, కాని త్వరలోనే వారు ఎగతాళి చేస్తూ వచ్చిన దాని యథార్థమేమిటో వారికి తెలిసిపోతుంది[3].
7. ఏమీ? వారు భూమి వైపు చూడలేదా? మేము దానిలో ఎంత పుష్కలంగా శ్రేష్ఠమైన రకరకాల

---

[*] [అష్-షుఅరా అంటే కవులు]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

[2] ఇటువంటి ఆయత్ కు చూడండి, 18:6.

[3] చూడండి, 6:4-5.

(జీవరాసుల్ని)[4] పుట్టించామో?

8. నిశ్చయంగా, ఇందులో ఒక సూచన ఉంది. అయినా వారిలో చాలామంది విశ్వసించడం లేదు.

9. మరియు నిశ్చయంగా, నీ ప్రభువు కేవలం ఆయనే సర్వశక్తిమంతుడు, అపార కరుణా ప్రదాత

10. మరియు నీ ప్రభువు మూసాను ఇలా ఆదేశించిన విషయాన్ని వారికి జ్ఞాపకం చేయించు: "దుర్మార్గులైన జాతి ప్రజల వద్దకు వెళ్ళు[5];

11. ఫిర్ఔన్ జాతివారి వద్దకు. ఏమీ? వారికి దైవభీతి లేదా?"

12. (మూసా) అన్నాడు: "ఓ నా ప్రభూ! వారు నన్ను అసత్యవంతుడవని తిరస్కరిస్తారేమో నని నేను భయపడుతున్నాను[6].

13. నా హృదయం కుంచించుకు పోతోంది మరియు నా నాలుక తడబడుతోంది[7], కావున నీవు హారూన్ వద్దకు కూడా (వహీ) పంపు.

14. మరియు వారి దగ్గర నా మీద ఒక నేరం మోపబడి

---

[4] 'జౌజున్: అంటే ఇక్కడ వివిధరకాలు అని అర్థం.

[5] మూసా ('అ.స.) తన పరివారంతో సహా తిరిగి ఈజిప్టుకు వస్తున్నప్పుడు అతనికి ఒక వెలుగు కనిపిస్తుంది. అతను దాని దగ్గరికి వెళ్ళినప్పుడు ఈ ఆదేశం వస్తుంది.

[6] దీనితో తెలిసేదేమిటంటే సాధారణమానవులవలె దైవప్రవక్తలకు కూడా సహజమైన భయం కలగవచ్చు

[7] దీనికి కారణం అతని నాలుకలో ఉన్న ముడి ('ఉఖ్ దతున్) చూడండి, 20:25-34.

ఉన్నది[8], కావున వారు నన్ను చంపుతారేమోనని భయపడుతున్నాను."

15. (అల్లాహ్) సెలవిచ్చాడు: "అట్లు కానేరదు! మీరిద్దరూ మా సూచనలతో వెళ్ళండి. నిశ్చయంగా, మేము కూడా మీతో పాటు ఉండి సర్వమూ వింటూ ఉంటాము[9].

16. కావున మీరిద్దరూ ఫిరఔన్ వద్దకు వెళ్ళి అనండి: "నిశ్చయంగా, మేము సర్వలోకాల పోషకుని సందేశహరులము.

17. కావున ఇస్రాయీల్ సంతతి వారిని మా వెంట పోనివ్వు[10]."

18. (ఫిర్ఔన్) అన్నాడు: "ఏమీ? మేము నిన్ను బాల్యంలో మాతో పాటు పోషించలేదా? మరియు నీవు నీ వయస్సులోని అనేక సంవత్సరాలు

---

[8] ఇది మూసా ('అ.స.) ఈజిప్టు నుండి వెళ్ళకముందు అనుకోకుండా జరిగిన సంఘటన. ఒక ఫిర్'ఔన్ జాతివాడు, ఒక ఇస్రాయీ'ల్ జాతివానితో కలహిస్తూ ఉండగా - ఇస్రాయీ'లు వానిపిలుపువిని - మూసా ('అ.స.) అతనికిసహాయపడటానికి, ఫిర్'ఔన్ జాతి వానిని ఒక దెబ్బ కొట్టడం వల్ల, అతడు మరణిస్తాడు. ఆ నేరానికి వారు అతనిని చంపగోరుతారు. (వివరాలకు చూడండి, 28:15).

[9] 'మీతోపాటు ఉండి.' అంటే అల్లాహ్ (సు.తా.) నేలపైకి ప్రతి మానవుని దగ్గరికి రాడు. ఆయన జ్ఞానం ప్రతి ఒక్కరితో ఉంటుంది. కాని అల్లాహ్ (సు.తా.) 'అర్ష్ పైననే కూర్చుని ఉంటాడు. అంటే విశ్వంలో జరిగేది ఏది కూడా అల్లాహ్ (సు.తా.)కు తెలియకుండా లేదు.

[10] ఎందుకంటే నీవు నాలుగువందల సంవత్సరాలు వారిని బానిసలుగా చేసి ఉంచావు. ఇప్పుడు వారికి స్వేచ్ఛనివ్వు. నేను వారిని బైతుల్ మఖ్దిస్ వైపునకు తీసుకొని పోతాను.

మాతో పాటు గడిపావు కదా!

19. అయినా నీవు హీనమైన ఆ పని చేశావు, కావున నీవు కృతఘ్నులలోని వాడవు!"[11]

20. (మూసా) అన్నాడు: "నేను పొరపాటుగా ఆ పని చేశాను!

21. ఆ పిదప మీకు భయపడి పారిపోయాను, కాని ఆ తరువాత నా ప్రభువు నాకు వివేకాన్ని ప్రసాదించి, నన్ను సందేశహరులలో చేర్చుకున్నాడు[12].

22. ఇక నీవు నాకు చేసిన ఆ ఉపకారానికి నన్ను ఎత్తి పొడిస్తే! నీవు మాత్రం ఇస్రాయీల్ సంతతి వారినంతా బానిసలుగా చేసుకున్నావు కదా!"[13]

23. (ఫిర్ఆన్) అడిగాడు: "అయితే ఈ సర్వలోకాల ప్రభువు అంటే ఏమిటి?"[14]

24. (మూసా) జవాబిచ్చాడు: "మీరు నమ్మేవారే అయితే! ఆయనే ఆకాశాలకూ మరియు భూమికీ మరియు వాటి మధ్య ఉన్న సమస్తానికీ ప్రభువు!"

25. (ఫిర్ఔన్) తన చుట్టూ ఉన్న వారితో: "ఏమీ? మీరు వింటున్నారా?"[15] అని ప్రశ్నించాడు.

26. (మూసా) అన్నాడు: "ఆయన (అల్లాహ్) మీ

---

[11] చూడండి, 28:4-22, హీనమైన పని అంటే ఒక ఫిర్'ఔన్ జాతి వానిని దెబ్బకొట్టి చంపింది.

[12] చూడండి, 28:15-16.

[13] చూడండి, 28:4-5.

[14] ఫిర్'ఔన్ తన దురహంకారంలో ఈ విధంగా ప్రశ్నిస్తున్నాడు. ఎందుకంటే ఈజిప్టు వాసులందరికీ అతడు, తానే దైవమని చెప్పి, తన ఆరాధ్యం చేయించుకునేవాడు. చూడండి, 28:38.

[15] నేను తప్ప మీకు మరొక ప్రభువు కూడా ఉన్నాడా?

ప్రభువు మరియు మీ పూర్వీకులైన మీ తాతముత్తాతల ప్రభువు కూడానూ!"

27. (ఫిర్ఔన్) అన్నాడు: "మీవద్దకు పంపబడిన మీఈసందేశహరుడు నిశ్చయంగా పిచ్చివాడే"

28. (మూసా) అన్నాడు: "మీరు అర్థం చేసుకోగలిగితే! ఆయనే తూర్పూ పడమరలకూ మరియు వాటి మధ్య ఉన్న సమస్తానికీ ప్రభువు[16]."

29. (ఫిర్ఔన్) అన్నాడు: "నీవు నన్ను కాదని మరెవరినైనా ఆరాధ్య దైవంగా చేసుకుంటే నేను నిన్ను చెరసాలలో ఉన్నవారితో చేర్చుతాను."

30. (మూసా) అన్నాడు: "ఏమీ? నేను నీ వద్దకు ఒక స్పష్టమైన విషయాన్ని (సత్యాన్ని) తీసుకువచ్చిన తరువాత కూడానా?"[17]

31. (ఫిర్ఔన్)అన్నాడు: "నీవు సత్యవంతుడవే అయితే దానిని(ఆ అద్భుతసూచనను) చూపు!"

32. అప్పుడు (మూసా) తన చేతి కర్రను పడవేయగానే, అది ఒకస్పష్టమైనపెద్ద సర్పంగా మారిపోయింది[18].

33. తరువాత అతను (మూసా) తన చేతిని (చంక నుండి) వెలుపలికి తీయగానే, అది చూసేవారి యెదుట తెల్లగా ప్రకాశించసాగింది![19]

34. (ఫిర్ఔన్) తన చుట్టూ ఉన్న నాయకులతో అన్నాడు:

---

[16] చూడండి, 2:115.

[17] చూడండి, 12:1.

[18] జాన్నున్ (27:10, 28:31) అంటే - చిన్న సర్పం. సు' 'అబానున్ (7:107) అంటే - పెద్ద సర్పం. 'హయ్యతున్ (20:20) అంటే - చిన్నదీ కావచ్చు పెద్దదీ కావచ్చు. (ఫ'త్హ్ అల్-ఖదీర్).

[19] చూడండి, 7:107, 20:22, 27:12, 28:38.

"నిశ్చయంగా, ఇతనొక నేర్పు గల మాంత్రికుడు.

35. ఇతను తన మంత్రజాలంతో మిమ్మల్ని మీ దేశం నుండి తరుమ గోరుతున్నాడు, అయితే మీ సలహా ఏమిటి?"[20]

36. వారన్నారు: "అతనిని మరియు అతని సోదరుణ్ణి ఆపి ఉంచు మరియు (మంత్రగాళ్ళను) సమావేశ పరచటానికి అన్ని నగరాలకు వార్తాహరులను పంపు;

37. వారు నీ వద్దకు నేర్పుగల ప్రతి మాంత్రికుణ్ణి తెస్తారు."

38. ఈ విధంగా ఒక నియమిత రోజున ఒక నియమిత ప్రదేశంలో మాంత్రికులంతా సమావేశ పరచబడ్డారు.[21]

39. మరియు ప్రజలతో ఇలా ప్రశ్నించడం జరిగింది: "ఏమీ? మీరంతా సమావేశ మయ్యారా?

40. ఒకవేళ మాంత్రికులు గెలుపొందితే మనమంతా వారిని అనుసరించాలి కదా!"

41. మాంత్రికులు వచ్చిన తరువాత ఫిర్ఔన్ తో అన్నారు: "మేము గెలుపొందితే నిశ్చయంగా మాకు బహుమానముంది కదా?"[22]

42. (ఫిర్ఔన్) అన్నాడు: "అవును! నిశ్చయంగా,

---

[20] చూడండి, 7:109-110)

[21] ఇది అల్లాహ్ (సు.తా.) ఇచ్ఛయే! ప్రజలకు, మూసా ('అ.స.) సత్యుడని మరియు మాంత్రికులు చేసేదంతా బూటక కల్పనలని నిరూపించటానికి. చూడండి, 21:18.

[22] చూడండి, 7:113.

అప్పుడు మీరు నా సన్నిహితులలో చేరుతారు!"
**43.** మూసా వారితో అన్నాడు: "మీరు విసర దలుచుకున్న దానిని విసరండి!"
**44.** అప్పుడు వారు తమ త్రాళ్ళను మరియు తమ కర్రలను విసిరి ఇలా అన్నారు: "ఫిర్'ఔన్ శక్తి సాక్షిగా! నిశ్చయంగా మేమే విజయం పొందుతాము[23]."
**45.** ఆ తరువాత మూసా తన కర్రను పడవేయగా, తక్షణమే అది వారి బూటకపు కల్పనలను మ్రింగి వేసింది[24].
**46.** అప్పుడు ఆ మాంత్రికులు సజ్దాలో పడ్డారు.
**47.** వారన్నారు: "మేము సర్వలోకాల ప్రభువును విశ్వసిస్తున్నాము,
**48.** మూసా మరియు హారూన్ ల ప్రభువును."
**49.** (ఫిర్'ఔన్) అన్నాడు: "నేను మీకు అనుమతి ఇవ్వక ముందే మీరు ఇతనిని విశ్వసించారా?[25] నిశ్చయంగా, ఇతడే మీ గురువు, మీకు జాలవిద్యను నేర్పినవాడు. సరే! ఇప్పుడే మీరు తెలుసుకుంటారు. నేను మీ వ్యతిరేక (ప్రతిపక్ష) దిశల చేతులను మరియు కాళ్ళను నరికిస్తాను మరియు మీరందరినీ సిలువపై ఎక్కిస్తాను[26]."
**50.** (మాంత్రికులు) అన్నారు: "బాధ లేదు! నిశ్చయంగా, మేము మా ప్రభువు వద్దకే కదా మరలి పోయేది.

---

[23] చూడండి, 7:116 మరియు 20:66-67.
[24] చూడండి, 7:117.
[25] చూడండి, 7:123.
[26] చూడండి, 5:33 మరియు 7:124.

51. నిశ్చయంగా, మా ప్రభువు మా పాపాలను క్షమిస్తాడని మేము ఆశిస్తున్నాము, ఎందుకంటే వాస్తవానికి అందరి కంటే ముందుగా విశ్వసించిన వారం మేమే!"

52. మరియు మేము మూసాకు ఈ విధంగా దివ్యజ్ఞానం (వహీ) పంపాము: "నీవు నా దాసులను రాత్రివేళ తీసుకొని వెళ్ళిపో నిశ్చయంగా, మీరు వెంబడించబడతారు[27]."

53. తరువాత ఫిర్ఔన్ అన్ని పట్టణాలకు వార్తాహరులను పంపాడు.

54. (ఇలా ప్రకటన చేయించాడు): "వాస్తవానికి వీరు (ఈ ఇస్రాయీల్ సంతతి వారు) ఒక చిన్న తెగవారు మాత్రమే.

55. మరియు నిశ్చయంగా, వారు మాకు చాలా కోపం తెప్పించారు;

56. మరియు నిశ్చయంగా, మనం ఐకమత్యంతో ఉండి జాగరూకత చూపేవారము."

57. కావున మేము వారిని, తోటల నుండి మరియు చెలమల నుండి వెళ్ళగొట్టాము;

58. మరియు కోశాగారాల నుండి మరియు ఉన్నతమైన స్థానాల నుండి కూడా.

59. ఈ విధంగా! మేము ఇస్రాయీల్ సంతతి వారిని, వాటికి వారసులుగా చేశాము[28].

---

[27] చూడండి, 7:130.
[28] చూడండి, 7:137.

60. అప్పుడు (ఫిర్ఔన్ జాతి) వారు సూర్యోదయ కాలమున (ఇస్రాయీల్ సంతతి) వారిని వెంబడించారు.

61. ఆ ఇరుపక్షాల వారు ఒకరినొకరు ఎదురు పడినప్పుడు, మూసా అనుచరులు అన్నారు: "నిశ్చయంగా మేము చిక్కి పోయాము!"

62. (మూసా అన్నాడు): "అట్లు కానేరదు! నిశ్చయంగా, నా ప్రభువు నాతో ఉన్నాడు. ఆయన నాకు మార్గదర్శకత్వం చేస్తాడు (మార్గము చూపుతాడు)[29]."

63. అప్పుడు మేము మూసాకు: "నీ చేతి కర్రతో సముద్రాన్ని కొట్టు!" అని వహీ ద్వారా తెలిపాము. అప్పుడది హటాత్తుగా చీలిపోయింది, దాని ప్రతిభాగం ఒక మహా పర్వతం మాదిరిగా అయిపోయింది[30].

64. మరియు అక్కడికి మేము రెండవ పక్షం వారిని సమీపింప జేశాము.

65. మరియు మూసాను మరియు అతనితో పాటు ఉన్నవారిని అందరినీ రక్షించాము.

66. ఆ తరువాత మిగతా వారినందరినీ ముంచి వేశాము.

67. నిశ్చయంగా ఇందులో ఒక సూచన ఉంది అయినా వారిలో చాలామంది విశ్వసించటం లేదు

68. మరియు నిశ్చయంగా నీ ప్రభువు కేవలం ఆయనే

---

[29] అంటే అల్లాహ్ (సు.తా.) సహాయం నాతో ఉంది.

[30] చూడండి, 20:77.

సర్వశక్తిసంపన్నుడు, అపార కరుణా ప్రదాత

69. ఇక వారికి ఇబ్రాహీమ్ గాథను వినిపించు.

70. అతను తన తండ్రితో మరియు తన జాతి వారితో: "మీరెవరినిఆరాధిస్తున్నారు?"అనిఅడిగినపుడు;

71. వారన్నారు: "మేము విగ్రహాలను ఆరాధిస్తున్నాము మరియు మేము వాటికే ఎల్లప్పుడు భక్తులమై ఉంటాము."

72. (ఇబ్రాహీమ్) అన్నాడు: "మీరు వీటిని పిలిచినప్పుడు ఇవి మీ మొర ఆలకిస్తాయా?

73. లేదా, మీకేమైనా మేలు చేయగలవా? లేదా హాని చేయగలవా?"

74. వారన్నారు: "అలా కాదు! మేము మా తండ్రితాతలను ఇలా చేస్తూ ఉండగా చూశాము."

75. అతను అన్నాడు: "ఏమీ? మీరు ఎప్పుడైనా ఆలోచించారా? మీరెవరిని ఆరాధిస్తున్నారో?

76. మీరు గానీ మరియు మీ పూర్వీకులైన మీ తాతముత్తాతలు గానీ (ఆలోచించారా)?

77. ఎందుకంటే! నిశ్చయంగా, ఇవన్నీ నా శత్రువులే! కేవలం ఆ సర్వలోకాల ప్రభువు తప్ప!

78. ఆయనే నన్ను సృష్టించాడు. కాబట్టి ఆయనే నాకు మార్గదర్శకత్వం చేస్తాడు.

79. ఆయనే నాకు తినిపించేవాడు మరియు త్రాగించేవాడు.

80. మరియు నేను వ్యాధిగ్రస్తుడనైతే, ఆయనే నాకు స్వస్థత నిచ్చేవాడు.

81. మరియు ఆయనే నన్ను మరణింపజేసేవాడు, తరువాత మళ్ళీ బ్రతికింపజేసేవాడు.

82. మరియు ఆయనే తీర్పుదినమున నా తప్పులను క్షమిస్తాడని నేను ఆశిస్తున్నాను.

83. మరియు ఓ నా ప్రభూ! నాకు వివేకాన్ని ప్రసాదించు మరియు నన్ను సద్వర్తనులలో కలుపు.

84. మరియు తరువాత వచ్చే తరాల వారిలో నాకు మంచి పేరును ప్రసాదించు[31].

85. మరియు సర్వసుఖాల స్వర్గానికి వారసులయ్యేవారిలో నన్ను చేర్చు.

86. మరియు నా తండ్రిని క్షమించు. నిశ్చయంగా, అతడు మార్గభ్రష్టులలోని వాడే![32]

87. మరియు అందరూ తిరిగి బ్రతికింపబడే రోజు నన్ను అవమానం పాల చేయకు.

88. ఏ రోజునైతే ధనసంపత్తులు గానీ, సంతానం గానీ పనికిరావో!

89. కేవలం నిర్మలమైన హృదయంతో అల్లాహ్ సన్నిధిలో హాజరయ్యేవాడు తప్ప!"

90. మరియు (ఆ రోజు) స్వర్గం దైవభీతి గలవారి దగ్గరకు తీసుకు రాబడుతుంది.

91. మరియు నరకం మార్గం తప్పిన వారి ముందు పెట్టబడుతుంది.

92. మరియు వారితో అనబడుతుంది: "మీరు

---

[31] చూడండి, 19:50.

[32] చూడండి, 19:47-48 మరియు 9:114.

ఆరాధించేవారు (ఆ దైవాలు) ఇప్పుడు ఎక్కడున్నారు?

93. అల్లాహ్ ను వదలి (మీరు వాటిని ఆరాధించారు కదా!) ఏమీ? వారు మీకు సహాయం చేయగలరా? లేదా తమకు తామైనా సహాయం చేసుకోగలరా?"[33]

94. అప్పుడు వారు మరియు (వారిని) మార్గం తప్పించిన వారు, అందు (నరకం) లోకి విసిరి వేయబడతారు.

95. మరియు వారితో బాటు ఇబ్లీస్ సైనికులందరూ[34].

96. వారు పరస్పరం వాదించుకుంటూ ఇలా అంటారు:

97. "అల్లాహ్ సాక్షిగా! మేము స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నాము.

98. ఎప్పుడైతే మేము మిమ్మల్ని సర్వలోకాల ప్రభువుతో సమానులుగా చేశామో!

99. మరియు మమ్మల్ని మార్గభ్రష్టులుగా చేసింది కేవలం ఈ అపరాధులే[35].

100. మాకిప్పుడు సిఫారసు చేసేవారు ఎవ్వరూ లేరు.

101. మరియు ఏ ప్రాణ స్నేహితుడు కూడా లేడు.

102. ఒకవేళ మళ్ళీ మరలిపోయే అవకాశం మాకు దొరికి ఉంటే, మేము తప్పకుండా విశ్వసించిన

---

[33] అంటే దేవతలుగా భావించబడిన పుణ్యపురుషులు మరియు విగ్రహాలు లేక మానవుడు ఆరాధించే సంపత్తులు, హోదాలు ఉన్నత స్థానాలు మొదలైనవి. చూడండి, 10:28-29.

[34] చూడండి, 2:24 19:68 మరియు 19:83.

[35] చూడండి, 7:38 33:67-68 మరియు 38:60-61.

వారిలో చేరిపోతాము!"[36]

103. నిశ్చయంగా, ఇందులో ఒక సూచన ఉంది. అయినా వారిలో చాలా మంది విశ్వసించటం లేదు.

104. మరియు నిశ్చయంగా నీ ప్రభువు కేవలం ఆయనే, సర్వశక్తిమంతుడు, అపార కరుణా ప్రదాత

105. నూహ్ జాతి, సందేశహరులను అసత్యవాదులని తిరస్కరించింది.

106. వారి సహోదరుడు నూహ్ వారితో ఇలా అన్నప్పుడు: "ఏమీ? మీకు దైవభీతి లేదా?

107. నిశ్చయంగా, నేను మీ వద్దకు పంపబడిన విశ్వసనీయుడైన సందేశహరుడను.

108. కావున మీరు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి మరియు నన్ను అనుసరించండి.

109. నేను దాని కొరకు మీ నుండి ఎలాంటి ప్రతిఫలాన్ని అడగటం లేదు. నా ప్రతిఫలం కేవలం సర్వలోకాల ప్రభువు వద్దనే ఉన్నది.

110. కావున మీరు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి మరియు నన్ను అనుసరించండి

111. వారన్నారు: "ఏమీ? మేము నిన్ను విశ్వసించాలా? నిన్ను కేవలం అధములైన[37] వారే కదా

---

[36] చూడండి, 6:27-28.

[37] అల్-అర్జ'లూన్: ధనసంపత్తులు లేనివారు. సమాజంలో తక్కువ శ్రేణికి చెందిన వారిగా లెక్కించబడే వారు. లేక అధమమైనవిగా భావించే వృత్తులు చేసేవారు. చూడండి, 11:27.

అనుసరిస్తున్నది?"

**112.** (నూహ్) అన్నాడు: "వారేమి (పనులు) చేస్తూ ఉండేవారో నాకేం తెలుసు?

**113.** వారి లెక్క కేవలం నా ప్రభువు వద్ద ఉంది. మీరిది అర్థం చేసుకుంటే ఎంత బాగుండేది[38].

**114.** మరియు నేను విశ్వసించే వారిని ధిక్కరించే వాడను కాను.

**115.** నేను కేవలం స్పష్టంగా హెచ్చరిక చేసేవాడను మాత్రమే!"

**116.** వారన్నారు:ఓ నూహ్!నీవు దీనిని మానుకోకపోతే నీవు తప్పక రాళ్ళురువ్వి చంప బడతావు

**117.** (నూహ్) అన్నాడు: "ఓ నా ప్రభూ! నా జాతి ప్రజలు నన్ను అసత్యుడవని తిరస్కరిస్తున్నారు.

**118.** కావున నీవే నాకూ మరియు వారికీ మధ్య తీర్పు చేయి. మరియు నన్నూ మరియు నాతో పాటు ఉన్న విశ్వాసులనూ కాపాడు[39]."

**119.** ఆ పిదప మేము అతనిని మరియు అతనితో పాట నిండునావలో ఎక్కి ఉన్న వారినందరినీ కాపాడాము.

---

[38] ఏ మానవుడు కూడా ఇతర మానవుడి హృదయంలో ఏముందో ఎరుగలేడు. కావున ఒకడు: 'నేను విశ్వాసుణ్ణి.' అని పలికి, తన ధర్మానికి విరుద్ధమైన చేష్టలు చేయడో, మాటలు పలుకడో, అట్టివాడు విశ్వాసుడిగానే పరిగణించబడాలి. మానవుని హృదయంలో ఉన్నది కేవలం అల్లాహ్ (సు.తా.) కే తెలుసు. కావున ఏ మానవునికి కూడా, ఇతర మానవుని విశ్వాసం గురించి అతని హృదయంలో ఉన్న ఆలోచనలను గురించి నిర్ణయం తీసుకునే హక్కు లేదు.

[39] చూడండి, 7:89.

**120.** ఆ తరువాత మిగతా వారినందరినీ ముంచి వేశాము[40].

**121.** నిశ్చయంగా ఇందులో ఒక సూచన ఉంది అయినా వారిలో చాలామంది విశ్వసించడం లేదు

**122.** నిశ్చయంగా, నీ ప్రభువు కేవలం ఆయనే, సర్వశక్తిమంతుడు, అపార కరుణా ప్రదాత.

**123.** ఆద్ జాతి, సందేశహరులను అసత్యవాదులని తిరస్కరించింది.

**124.** వారి సహోదరుడు[41] హూద్ వారితో ఇలా అన్నప్పుడు: "ఏమీ? మీకు దైవభీతి లేదా?

**125.** నిశ్చయంగా, నేను మీ వద్దకు పంపబడిన విశ్వసనీయుడైన సందేశహరుడను.

**126.** కావున మీరు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి మరియు నన్ను అనుసరించండి.

**127.** నేను దాని కొరకు మీ నుండి ఎలాంటి ప్రతిఫలాన్ని అడగటం లేదు. నా ప్రతిఫలం కేవలం సర్వలోకాల ప్రభువు వద్దనే ఉన్నది.

**128.** ఏమీ? మీరు కేవలం ఆడంబరానికి ప్రతి ఎత్తైన స్థలం మీద ఒక స్మారకాన్ని నిర్మిస్తారా?

**129.** మరియు మీరు శాశ్వతంగా ఇక్కడే ఉండిపోతారన్నట్లు పెద్దపెద్ద కోటలు కడతారా?

---

[40] నూ'హ్ ('అ.స.) గాథ కొరకు చూడండి, 11:25-48. ముంచి వేయబడిన వారిలో నూ'హ్ ('అ.స.) భార్య మరియు కుమారుడు కూడా ఉన్నారు. ఎందుకంటే వారు సత్యతిరస్కారులు.

[41] సహోదరుడు అంటే జాతి సోదరుడు. అదే జాతికి చెందినవాడు. ఇంకా చూడండి, 7:65.

**130.** మరియు మీరు ఎవరినైనా పట్టుకుంటే, అతి క్రూరులై పట్టుకుంటారా?

**131.** ఇకనైన మీరు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి మరియు నన్ను అనుసరించండి.

**132.** మరియు మీకు తెలిసివున్న (మంచి) వస్తువులను, మీకు విస్తారంగా ఇచ్చిన ఆయన (అల్లాహ్) యందు భయభక్తులు కలిగి ఉండండి.

**133.** ఆయన విస్తారంగా మీకు పశువులను మరియు సంతానాన్ని అనుగ్రహించాడు.

**134.** మరియు తోటలను మరియు చెలమలను.

**135.** నిశ్చయంగా, మీపై ఒక మహాదినమున(పడబోయే) శిక్షకు నేను భయపడుతున్నాను!"

**136.** వారన్నారు: "నీవు ఉపదేశించినా, ఉపదేశించక పోయినా మాకు అంతా సమానమే!

**137.** ఇది మా పూర్వీకుల యొక్క ప్రాచీన ఆచారమే![42]

**138.** మరియు మాకు ఎలాంటి శిక్ష విధించబడదు."

**139.** ఈ విధంగా, వారు అతనిని అసత్యవాదుడని తిరస్కరించారు. కావున మేము వారిని నశింపజేశాము[43]. నిశ్చయంగా ఇందులో ఒక సూచన ఉంది. అయినా వారిలో చాలామంది విశ్వసించటం లేదు.

**140.** నిశ్చయంగా, నీ ప్రభువు కేవలం ఆయనే, సర్వశక్తిమంతుడు, అపార కరుణా ప్రదాత.

---

[42] కాబట్టి మేము దానిని విడువలేము.

[43] 'ఆద్ జాతి ఒక బలవంతమైన సమాజముండేది. చూడండి, 89:8 చూడండి 41:15. అయినా వారు సత్యాన్ని తిరస్కరించి, దౌర్జన్యాలు చేసినందుకు నాశనం చేయబడ్డారు.

141. సమూద్ జాతి, సందేశహరులను అసత్యవాదులని తిరస్కరించింది[44].

142. వారి సహోదరుడు సాలిహ్ వారితో ఇలా అన్నప్పుడు: "ఏమీ? మీకు దైవభీతి లేదా?[45]

143. నిశ్చయంగా, నేను మీ వద్దకు పంపబడిన విశ్వసనీయుడైన సందేశహరుడను.

144. కావున మీరు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి మరియు నన్ను అనుసరించండి.

145. నేను దాని కొరకు మీ నుండి ఎలాంటి ప్రతిఫలాన్ని అడగటం లేదు. నా ప్రతిఫలం కేవలం సర్వలోకాల ప్రభువు వద్దనే ఉన్నది.

146. ఏమీ? మీరిప్పుడు ఇక్కడ ఉన్న స్థితిలోనే సుఖశాంతులలో ఎల్లప్పుడూ వదలి వేయ బడతారని అనుకుంటున్నారా?

147. తోటలలో మరియు చెలమలలో!

148. మరియు ఈ పొలాలలో, మాగిన పండ్లగుత్తులు

---

[44] స'మూద్ జాతి వారి నివాసం స'ఊది 'అరేబియాలో 'హిజ్ర్ అనే ప్రాంతంలో ఉండేది. ఆ ప్రాంతం మదాయిన్ 'సాలిహ్' అని కూడా పిలవబడుతుంది. వారు అరబ్బులు. దైవప్రవక్త ('స'అస) తబూక్ దండయాత్రకు పోయేటప్పుడు, ఈ ప్రాంతం గుండా ప్రయాణం చేశారు. అక్కడి నుండి పోయేటప్పుడు తన ఒంటెను త్వరత్వరగా నడిపిస్తూ, తన అనుచరులతో అల్లాహ్ (సు.తా.) ను క్షమాపణ కోరుతూ త్వరత్వరగా ఈ ప్రాంతం నుండి సాగిపొండన్నారు.

[45] చూడండి, 7:73 మరియు 11:61-68.

గల ఖర్జూరపు చెట్ల మధ్య;[46]

**149.** మరియు మీరు కొండలను తొలిచి ఎంతో నేర్పుతో గృహాలను నిర్మిస్తూ ఉంటారనీ![47]

**150.** అలా కాదు, అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి మరియు నన్ను అనుసరించండి.

**151.** మరియు మితిమీరి ప్రవర్తించే వారి ఆజ్ఞలను అనుసరించకండి.

**152.** ఎవరైతే భూమిలో కల్లోలం రేకెత్తిస్తున్నారో మరియు ఎన్నడూ సంస్కరణను చేపట్టరో!"

**153.** వారన్నారు: "నిశ్చయంగా, నీవు మంత్రజాలంతో వశపరచుకోబడ్డావు!

**154.** నీవు కేవలం మా వంటి ఒక మానవుడవు మాత్రమే! కావున నీవు సత్యవంతుడవే అయితే, ఏదైనా అద్భుత సూచన తీసుకురా!"

**155.** (సాలిహ్) అన్నాడు: "ఇదిగో ఈ ఆడ ఒంటె. ఇది నీరు త్రాగే (దినం) మరియు మీరు నీరు త్రాగే దినం నిర్ణయించబడ్డాయి[48].

**156.** దీనికి హాని కలిగించకండి. అలా చేస్తే ఒక మహాదినపు శిక్ష మిమ్మల్ని పట్టుకుంటుంది."

**157.** కాని వారు దాని వెనుక కాలి మోకాలి పెద్ద నరమును కోసి చంపారు, ఆ తరువాత

---

[46] 'తల్'ఉన్: అంటే క్రొత్తగా పుట్టే ఖర్జూర ఫలం, కొద్దిగా పెద్దదైన తరువాత దానిని బల్'హున్, ఆ తరువాత బస్ రున్, ఆ పిదప ర'త్ బున్, చివరకు తమ రున్. ఈ విధంగా వేర్వేరు స్థితులలో ఖర్జూర ఫలం పిలువబడుతోంది.

[47] చూడండి, 7:74.

[48] ఒంటె వృత్తాంతానికి చూడండి, 7:73-77.

వారు పశ్చాత్తాప పడతూ ఉండిపోయారు[49].

**158.** కావున, వారిని శిక్ష పట్టుకుంది. నిశ్చయంగా, ఇందులో ఒక సూచన ఉంది. అయినా వారిలో చాలా మంది విశ్వసించటం లేదు.

**159.** నిశ్చయంగా, నీ ప్రభువు కేవలం ఆయనే, సర్వశక్తిమంతుడు, అపార కరుణా ప్రదాత.

**160.** లూత్ జాతి, సందేశహరులను అసత్యవాదులని తిరస్కరించింది[50].

**161.** వారి సహోదరుడు లూత్ వారితో ఇలా అన్నప్పుడు: "ఏమీ? మీకు దైవభీతి లేదా?

**162.** నిశ్చయంగా, నేను మీ వద్దకు పంపబడిన విశ్వసనీయుడైన సందేశహరుడను.

**163.** కావున మీరు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి మరియు నన్ను అనుసరించండి.

**164.** నేను దాని కొరకు మీ నుండి ఎలాంటి ప్రతిఫలాన్ని అడగటం లేదు. నా ప్రతిఫలం కేవలం సర్వలోకాల ప్రభువు వద్దనే ఉన్నది.

---

[49] వారు ఆ ఒంటెను చంపిన తరువాత 'సాలి'హ్ ('అ.స.) అన్నారు. మీకు మూడు రోజుల వ్యవధి మాత్రమే ఉంది. నాలుగవ రోజు వారు అల్లాహ్ శిక్ష అవతరించడం చూసి పశ్చాత్తాప పడ్డారు. కాని శిక్ష వచ్చిన తరువాత పడే పశ్చాత్తాపం లాభదాయకం కాజాలదు.

[50] లూ'త్ ('అ.స.) గాథ కొరకు చూడండి, 11:69-83 లూ'త్ ('అ.స.) ఇబ్రాహీమ్ ('అ.స.) యొక్క సోదరుడైన హారాన్ బిన్-ఆ'జర్ కుమారుడు. అతను కూడా ఇబ్రాహీమ ('అ.స.) జీవితకాలంలోనే ప్రవక్తగా ఎన్నుకొనబడి, సోడోమ్ మరియు గొమొర్రెహ్ ప్రాంతాలకు పంపబడ్డారు. అవి జోర్డాన్ లో మృతసముద్రం (Dead Sea), ప్రాంతంలో ఉండేవి.

**165.** (ప్రకృతికి విరుద్ధంగా) సర్వప్రాణులలో కెల్లా మీరే పురుషుల వద్దకు పోతారేమిటీ?

**166.** మీ ప్రభువు, మీ కొరకు సహవాసులు (అజ్వాజ్) గా పుట్టించిన వారిని విడిచి పెడుతున్నారేమిటి? అలా కాదు, మీరు హద్దు మీరి ప్రవర్తించే జాతివారు!"[51]

**167.** (దానికి) వారన్నారు: "ఓ లూత్! ఇక నీవు మానుకోక పోతే నీవు దేశం నుండి బహిష్కరించబడిన వారిలో చేరుతావు!"

**168.** (లూత్) అన్నాడు: "నిశ్చయంగా మీ ఈ చేష్టను అసహ్యించుకునేవారిలో నేనూ ఉన్నాను."

**169.** (ఇలా ప్రార్థించాడు): "ఓ నా ప్రభూ! నన్నూ మరియు నా కుటుంబం వారినీ వీరి చేష్ట నుండి కాపాడు."

**170.** కావున మేము అతనిని మరియు అతని కుటుంబం వారినందరినీ కాపాడాము -

**171.** వెనుక ఉండి పోయిన వారిలో కలసి పోయిన ముసలామె తప్ప![52]

---

[51] మొదటిసారిగా చరిత్రలో స్త్రీలను విడిచి, పురుషులు - పురుషులతో రతిక్రీడ (సంభోగం) వీరే ప్రారంభించారంటారు. ఆ నగరం పేరట, ఆ క్రియ ఈనాటికీ సొడోమి (Sodomy) అనబడుతోంది. ఈ కాలపు పశ్చిమదేశాలలో పరస్పర అంగీకారంతో చేసే సొడోమి, లిస్బనిస్మ (Lesbianism) మరియు స్త్రీ పురుషుల వ్యభిచారాలు చట్టప్రకారం నేరంకావు. ఈ సమాజం ఎటుపోతోంది?

[52] ముసలామె అంటే లూ'త్ ('అ.స.) భార్య. ఆమె సత్యతిరస్కారి. ఆమె అదే ప్రాంతవాసి. చూడండి, 7:83, 11:81, 27:57, 29:32-33 మరియు 66:10.

**172.** ఆ తరువాత, మిగతా వారిని నిర్మూలించాము.

**173.** వారిపై ఒక వర్షాన్ని కురిపించాము. అది (ముందు) హెచ్చరించబడిన వారిపై (కురిపించబడ్డ) అతి భయంకరమైన వర్షం[53].

**174.** నిశ్చయంగా ఇందులో ఒక సూచన ఉంది అయినా వారిలో చాలామంది విశ్వసించడం లేదు

**175.** మరియు నిశ్చయంగా నీ ప్రభువు కేవలం ఆయనే సర్వశక్తిమంతుడు అపారకరుణాప్రదాత

**176.** వన (అయ్ కహ్) వాసులు సందేశహరులను అసత్యవాదులని తిరస్కరించారు[54].

**177.** షుఐబ్ వారితో ఇలా అన్నాడు: "ఏమీ? మీకు దైవభీతి లేదా?[55]

**178.** నిశ్చయంగా, నేను మీ వద్దకు పంపబడిన విశ్వసనీయుడైన సందేశహరుడను.

**179.** కావున మీరు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి మరియు నన్ను అనుసరించండి.

---

[53] చూడండి, 11:82-83.

[54] అ'య్ కహ్ వాసులు అంటే, అడవివాసులు. మద్ యన్ కు కొంత దూరంలో ఉన్న అడవి ప్రాంతం అ'య్ కహ్ అనబడుతుందని కొందరి అభిప్రాయం. మరికొందరి అభిప్రాయం ఇలా ఉంది: అ'య్ కహ్ అంటే ఒక పెద్ద చెట్టు అది మద్ యన్ కు కొంత దూరంలో ఉండింది. దాని వాసులు ఆ చెట్టును ఆరాధించే వారు. షు'ఐబ్ ('అ.స.) మద్ యన్ వాసులు. కావున అతను మద్ యన్ వాసుల సోదరుడు అని పేర్కొనబడ్డారు. చూడండి, 7:85. వారు ఈ రెండు ప్రాంతాలలో ధర్మప్రచారం చేశారు. (ఇబ్నె-కసీ'ర్).

[55] చూడండి 7:85 మరియు షు'ఐబ్ ('అ.స.) గాథ కొరకు చూడండి, 11:84-95.

**180.** నేను దాని కొరకు మీ నుండి ఎలాంటి ప్రతిఫలం అడగటం లేదు. నా ప్రతిఫలం కేవలం సర్వలోకాల ప్రభువు వద్దనే ఉన్నది.

**181.** మీరు (ఇచ్చినపుడు) సరిగ్గా కొలిచి ఇవ్వండి. నష్టపరిచే వారిలో చేరకండి!

**182.** త్రాసుతో సరిసమానంగా తూచండి.

**183.** ప్రజలకు వారి వస్తువులను తగ్గించి ఇవ్వకండి. భూమిలో కల్లోలం రేకెత్తిస్తూ దౌర్జన్యపరులుగా ప్రవర్తించకండి[56].

**184.** మిమ్మల్ని మరియు మీకు పూర్వం గతించిన తరాల వారిని సృష్టించిన ఆయన (అల్లాహ్) యందు భయభక్తులు కలిగి ఉండండి[57]."

**185.** వారన్నారు: "నిశ్చయంగా, నీవు మంత్రజాలంతో వశపరచుకోబడ్డావు!

**186.** నీవు కేవలం మా వంటి ఒక మానవుడవు మాత్రమే! నిశ్చయంగా, మేము నిన్ను అసత్యవాదులలో ఒకనిగా పరిగణిస్తున్నాము!

**187.** నీవు సత్యవంతుడవే అయితే ఆకాశం యొక్క ఒక తునకను మాపై పడవేయి."

**188.** (షుఐబ్) అన్నాడు: "మీరు చేసేది నా ప్రభువుకు బాగా తెలుసు!"

**189.** కాని, వారు అతనిని అసత్యవాదుడని తిరస్కరించారు, కావున వారిపై ఛాయాకృత

---

[56] చూడండి, 7:86.
[57] జిబలతున్: అంటే చాలా మంది లేక పెద్ద వర్గం అని అర్థం.

ఉపద్రవం (మేఘాల శిక్ష) వచ్చి పడింది. నిశ్చయంగా, అదొక భయంకరమైన దినపు శిక్ష![58]

**190.** నిశ్చయంగా ఇందులో ఒక సూచన ఉంది అయినా వారిలో చాలామంది విశ్వసించటం లేదు

**191.** మరియు నిశ్చయంగా, నీ ప్రభువు కేవలం ఆయనే, సర్వశక్తిమంతుడు, అపార కరుణా ప్రదాత[59].

**192.** మరియు నిశ్చయంగా, ఇది సర్వలోకాల ప్రభువు అవతరింపజేసిన (గ్రంథం).

**193.** దీనిని నమ్మదగిన ఆత్మ (రూహుల్ అమీన్)

---

[58] షు'ఐబ్ ('అ.స) తెగవారి మీద మూడు రకాల శిక్షలు వచ్చాయి. 7:91 లో భూకంపం, 11:94 లో భయంకర ధ్వని, మరియు ఇక్కడ మేఘాల, రాళ్ళ వర్షపు శిక్ష అని పేర్కొనబడ్డాయి. అంటే మూడు రకాల శిక్షలు ఒకేసారి వచ్చాయన్నమాట. (ఇబ్నె-కసీ'ర్).

[59] దీనితో ఏడు గాథలు ముగుస్తున్నాయి. అన్నితరాల ప్రజలలో ఒకే విధమైన లక్షణాలు, స్వభావాలు ఉన్నాయి. వారంతా తమ సందేశహరుల సత్యసందేశాన్ని తిరస్కరించి వారిపై దౌర్జన్యాలు చేశారు. తమ తండ్రితాతల ధర్మాలను అవలంబించారు. 'నీ ప్రభువు శిక్షను తీసుకురా,' అని అన్నారు. చివరకు వారిపై శిక్ష అవతరింపజేయబడి నాశనం చేయబడ్డారు. వారి పరలోక శిక్ష నరకమే. ప్రతికాలంలో కూడా చాలా మట్టుకు పేదవారూ, తక్కువ ఆర్థిక, సామాజిక స్థానాలకు చెందిన వారే ప్రవక్తలను మొట్టమొదట అనుసరించారు. అందుకే స్వర్గంలో ఎక్కువగా ఇలాంటి వారే ఉంటారు.

అవతరింపజేశాడు[60];

194. నీ హృదయం మీద, నీవు హెచ్చరిక చేసేవారిలో చేరిపోవాలని;

195. స్పష్టమైన అరబ్బీ భాషలో[61]!

196. నిశ్చయంగా, దీని (ప్రస్తావన) పూర్వ దివ్యగ్రంథాలలో

---

[60] ఏ విధంగానైతే పూర్వపు దైవప్రవక్తల మీద జిబ్రీల్ ('అ.స.) ద్వారా దివ్యజ్ఞానం అవతరింపజేయ బడిందో, అదే విధంగా ము'హమ్మద్ ('స'అస) పైన కూడా ఈ ఖుర్ఆన్ అవతరింప జేయబడింది. అతను నిరక్షరాస్యుడయినా, పూర్వ ప్రవక్తల గాథలు వినిపించటమే ఖుర్ఆన్ దివ్యావతరణకు నిదర్శనం. అర్ రూ'హుల్ అమీన్: నమ్మదగిన ఆత్మ, అంటే జిబ్రీల్ ('అ.స.)'

[61] చూడండి, 14:4 ఇతర 'అరబ్ ప్రవక్తలు ఇస్మా'యీల్, హూద్, 'సాలి'హ్ మరియు షు'ఐబ్ 'అలైహిస్సలామ్ లు. హీబ్రూ మరియు అరమాయిక్ ప్రాచీన 'అరబ్బీ భాషలే! ఇతర దివ్యగ్రంథాలు ఆయా సంఘాల వారి కొరకు అవతరింప జేయబడి ఉండెను. 'అరబ్బీ భాషలో ఉన్న ఈ ఖుర్ఆన్ చివరి దివ్యగ్రంథం మరియు ఆధునిక కాలంలో వచ్చింది. ఇప్పుడు భూగోళమంతా ఒక గ్లోబల్ విల్లేజ్ గా మారిపోయింది, కాబట్టి ఈ ఖుర్ఆన్ సర్వలోకాల వారికి మార్గదర్శనిగా చివరి దివ్యగ్రంథంగా పంపబడింది. చూడండి, 7:158 మరియు 25:1. ఈ ఖుర్ఆన్ 14 వందల సంవత్సరాలు గడిచినా దాని అసలు రూపంలో ఉండి, అందులో ఏ ఒక్క అక్షరపు మార్పు కూడా లేకుండా భద్రపరచబడింది. ఇది అల్లాహ్ (సు.తా.) వాగ్దానం. అల్లాహ్ (సు.తా.) ఇష్టంతో ఇది ఇప్పుడు ప్రపంచంలోని వివిధ భాషలలో అనువాదం చేయబడుతోంది. అల్లాహ్ (సు.తా.) అనుగ్రహంతో సత్యాన్ని అర్థం చేసుకోగలవారు, దీనిని అర్థం చేసుకొని, సత్యధర్మాన్ని (ఇస్లాంను) స్వీకరించి శాశ్వతంగా స్వర్గవాసానికి అర్హులయ్యే మార్గాన్ని అవలంబిస్తున్నారు.

ఉంది[62].

**197.** ఇస్రాయీల్ సంతతి వారిలోని విద్వాంసులు[63] ఈ విషయాన్ని ఒప్పుకోవటం వారికొక సూచనగా సరిపోదా?

**198.** ఒకవేళ మేము దీనిని అరబ్ కాని వానిపై అవతరింపజేసి ఉంటే!

**199.** అతను దానిని వారికి చదివి వినిపించినా, వారు దానిని విశ్వసించేవారు కారు[64].

**200.** ఈవిధంగా మేము దీనిని (తిరస్కారాన్ని) అపరాధుల హృదయాలలోనికి దిగిపోయేలా చేశాం

**201.** కఠినశిక్షను చూడనంత వరకు వారు దీనిని విశ్వసించరు.

**202.** అది వారికి తెలియకుండానే అకస్మాత్తుగా వచ్చి పడుతుంది.

**203.** అప్పుడు వారంటారు: "ఏమీ? మాకు కొంత వ్యవధి ఇవ్వబడుతుందా?[65]

---

[62] ఈ ప్రస్తావన కొరకు చూడండి, 2:42 మరియు ద్వితీయోపదేశ కాండము - (Deuteronomy), 18:15,18 మరియు యోహాను - (John), 14:16.

[63] ఉదాహరణకు: 'అబ్దుల్లాహ్ ఇబ్నె-సల్లాం, కా'బ్ ఇబ్నె మాలిక్ మరియు ఇతర మదీనా యూద విద్వాంసులు ఈ విషయం తెలుసుకొని ఇస్లాం స్వీకరించారు. ఈ రోజు వరకు కూడా ఎంతో మంది యూద మరియు క్రైస్తవ విద్వాంసులు ఈ విషయం తెలుసుకొని ఇస్లాం స్వీకరిస్తున్నారు.

[64] చూడండి, 41:44.

[65] శిక్ష వచ్చిన తరువాత వ్యవధి ఇవ్వబడదు మరియు అప్పుడు చేసే పశ్చాత్తాపం కూడా అంగీకరించ బడదు. చూడండి, 23:85.

204. ఏమీ? మా శిక్ష శీఘ్రంగా రావలెనని వారు కోరుతున్నారా?[66]
205. చూశావా? మేము కొన్ని సంవత్సరాలు వారికి (ఈ జీవితంలో) సుఖసంతోషాలతో గడిపే వ్యవధినిచ్చినా!
206. తరువాత వాగ్దానం చేయబడినది (శిక్ష) వారిపైకి వచ్చినపుడు;
207. వారు అనుభవిస్తూ ఉండిన సుఖసంతోషాలు వారికేమీ పనికిరావు[67].
208. మరియు - హెచ్చరిక చేసేవారిని (ప్రవక్తలను) పంపనిదే - మేము ఏ నగరాన్ని కూడా నాశనం చేయలేదు!
209. హితబోధ నివ్వటానికి; మేము ఎన్నడూ అన్యాయస్థులముగా ప్రవర్తించలేదు[68].
210. మరియు దీనిని (ఈ దివ్యగ్రంథాన్ని) తీసుకొని క్రిందికి దిగిన వారు షైతానులు కారు.
211. మరియు అది వారికి తగినది కాదు; వారది చేయలేరు.
212. వాస్తవానికి, వారు దీనిని వినకుండా దూరంగా ఉంచబడ్డారు.
213. కావున అల్లాహ్ తో పాటు మరొక ఆరాధ్య దైవాన్ని

---

[66] ఈ శిక్ష కోరిన దానికి చూడండి, 6:57 మరియు 8:32.
[67] చూడండి, 2:96.
[68] చూడండి, 6:131, 15:4, 20:134, 17:15, 28:59 అల్లాహ్ (సు.తా.), హెచ్చరిక చేయటానికి ప్రవక్తలను పంపనిదే ఏ సమాజాన్ని కూడా నాశనం చేయలేదు.

వేడుకోకు, అలా చేస్తే నీవు కూడా శిక్షింపబడే వారిలో చేరిపోతావు.

**214.** మరియు నీ దగ్గరి బంధువులను హెచ్చరించు;

**215.** విశ్వాసులలో నిన్ను అనుసరించే వారిపై నీ కనికరపు రెక్కలను చాపు[69].

**216.** ఒకవేళ వారు నీ పట్ల అవిధేయత చూపితే వారితో అను: "మీరు చేసే కార్యాలకు నేను బాధ్యుడను కాను."

**217.** మరియు ఆ సర్వశక్తిమంతుడు, అపార కరుణా ప్రదాత మీద నమ్మకం ఉంచుకో!

**218.** ఆయన నీవు నిలిచినపుడు, నిన్ను చూస్తున్నాడు[70].

**219.** మరియు సాష్టాంగం (సజ్దా) చేసే వారితో నీ రాకపోకడలను కూడా!

**220.** నిశ్చయంగా, ఆయనే సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

**221.** షైతాన్ లు ఎవరిపై దిగుతారో నేను మీకు తెలుపనా?

**222.** వారు అసత్యవాదులైన పాపాత్ములపై దిగుతారు;

**223.** గాలి వార్తలను చెవులలో ఊదుతారు[71]; మరియు వారిలో చాలామంది అసత్యవాదులే!

---

[69] చూడండి, 17:24.

[70] కొందరు వ్యాఖ్యాతలు: "నీవు నమా'జ్ లో నిలిచినప్పుడు." అని అంటారు.

[71] అంటే ఆ సైతానులు తమను వినేవారి చెవులలో వినీవినని బూటకపు మాటలను ఊదుతారు.

**224.** మరియు మార్గభ్రష్టులే కవులను అనుసరిస్తారు[72].

**225.** ఏమీ? నీకు తెలియదా? నిశ్చయంగా వారు (కవులు) తమ కవిత్వంలో ప్రతి విషయాన్ని ఉద్దేశరహితంగా (ప్రశంసిస్తూ) ఉంటారని[73];

**226.** మరియు నిశ్చయంగా, వారు తాము ఆచరించని దానిని చెప్పుకుంటారని;

**227.** కాని, (వారిలో) విశ్వసించి, సత్కార్యాలు చేస్తూ, అల్లాహ్ ను అమితంగా స్మరించే వారూ మరియు - తమకు అన్యాయం జరిగినప్పుడే - ప్రతీకార

---

[72] చూడండి, 36:69. ఆ కాలపు కొందరు 'అరబ్బులు ఈ ఖుర్ఆన్ ను ము'హమ్మద్ ('స.'అస) రచించిన కవితగా అపోహపడ్డారు. అందుకే ఈ ఆయత్ లో కవులను అనుసరించే వారు మార్గభ్రష్టులని అల్లాహ్ (సు.తా.) విశదీకరించాడు. ఈ ఖుర్ఆన్ దివ్యజ్ఞానం (వ'హీ) కాబట్టి ఖుర్ఆన్ లో: "దీని వంటి ఒక్క సూరహ్ నయినా మీరంతా కలసి రచించి తీసుకురండి." అని సవాలు (Challenge) చేయబడింది. కానీ ఇంతవరకు ఎవ్వరు కూడా దానిని పూర్తి చేయలేక పోయారు.

[73] కవులు చాలా మట్టుకు ఊహాగానాలే చేస్తుంటారు. కాబట్టి కవిత్వంలో స్వవిరుద్ధమైన వ్యాఖ్యానాలు ఉంటాయి. వారి వివరణ లక్ష్యం లేనిది, భ్రమింపజేసేది. కాని ఖుర్ఆన్ మానవులను సత్యమార్గం వైపునకు మార్గదర్శకత్వం చేయటానికి అవతరింపజేయబడింది. అల్లాహ్(సు.తా.), మానవుని సృష్టికర్త అవతరింపజేసిన మానవుని యొక్క నిర్దేశక గ్రంథమే (Operation Manual) ఈ ఖుర్ఆన్. ఇది మానవునికి మార్గదర్శిని.

చర్య తీసుకునే వారు తప్పు![74] అన్యాయం చేసేవారు తమ పర్యవసానం ఏమిటో త్వరలో తెలుసుకోగలరు.

[74] ఇక్కడ ఆ కవులకే, కవిత్వం చేసే అనుమతి ఇవ్వబడింది, ఎవరైతే విశ్వసించి సత్కార్యాలు చేస్తారో మరియు అల్లాహ్ (సు.తా.) ను అమితంగా ప్రార్థిస్తారో మరియు ఊహాగానాలు చేయక సత్యాధారంపై కవిత్వం చేస్తారో! ఉదారహరణకు: 'హస్సాన్ బిన్ సా'బిత్ (ర'ది. 'అ.), తన కవిత్వంతో సత్యతిరస్కారుల కవిత్వానికి తగిన జవాబు ఇచ్చేవారు. దైవప్రవక్త ('స'అస) అతనితో ఇలా అనేవారు: 'ఈ సత్యతిరస్కారులకు జవాబివ్వు, జిబ్రీల్ (అ.స.) నీకు తోడ్పడు గాక!' ('స'హీ'హ్ బుఖా'రీ). దీనితో వ్యక్తమయ్యేది ఏమిటంటే సత్యతిరస్కారులకు జవాబివ్వటానికి, సత్యాధారంగా చేసే కవిత్వం మరియు సత్యాన్ని, తౌహీద్ ను మరియు సున్నతును స్థాపించటానికి చేసే కవిత్వం ధర్మసమ్మతమైనదే!

# 27. అన్-నమల్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. తా-సీన్[1]. ఇవి దివ్యఖుర్ఆన్ ఆయతులు మరియు ఇది ఒక స్పష్టమైన గ్రంథము[2].
2. ఇవి విశ్వాసులకు మార్గదర్శకత్వం గానూ మరియు శుభవార్తలు ఇచ్చేవి గానూ ఉన్నాయి.
3. ఎవరైతే నమాజ్ స్థాపిస్తారో మరియు విధిదానం (జకాత్) ఇస్తారో మరియు పరలోక జీవితాన్ని నమ్ముతారో!
4. నిశ్చయంగా, ఎవరైతే పరలోక జీవితాన్ని విశ్వసించరో, వారికి మేము వారి చేష్టను ఆకర్షణీయమైనవిగా చేశాం. అందువల్ల వారు అంధుల వలే దారితప్పి తిరుగుతూ ఉంటారు[3].

---

[*] [అన్-నమల్ అంటే చీమలు]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

[2] ఇటువంటి ఆయత్ కొరకు చూడండి, 12:1.

[3] పరలోక జీవితాన్ని నమ్మని వారు తమ భౌతిక మరియు ఆర్థిక లాభాలకే ప్రాధాన్యత నిస్తారు. కాబట్టి వారికి వారి దుష్ట చేష్టలు ఆకర్షణీయమైనవిగా కనిపిస్తాయి. దానివల్ల వారు మరింత మార్గభ్రష్టత్వంలో పడిపోతారు. జిన్నాతులకు మరియు మానవులకు, సత్యాసత్యాలనూ, మంచిచెడులనూ గుర్తించే విచక్షణా శక్తి ఇవ్వబడింది కాబట్టి వారు తమ కర్మలకు తామే బాధ్యులవుతారు. అల్లాహ్ (సు.తా.) తనను తాను సరిదిద్దుకోవటానికి ప్రయత్నించేవానికే సన్మార్గం చూపుతాడు. మరియు బుద్ధిపూర్వకంగా దుర్మార్గాన్ని అవలంభించేవాడిని, వాడి దుర్మార్గంలో వదలుతాడు. చూడండి, 2:7.

5. ఇలాంటి వారికి చెడ్డ శిక్ష ఉంది. మరియు చివరకు వారే అందరి కంటే ఎక్కువగా నష్టపడేవారు.

6. మరియు (ఓ ముహమ్మద్!) నిశ్చయంగా నీవు ఈ ఖుర్ఆన్ ను మహా వివేకవంతుడు, సర్వజ్ఞుడు అయిన (అల్లాహ్) నుండి పొందుతున్నావు.

7. (జ్ఞాపకం చేసుకోండి!) మూసా తన ఇంటివారితో: "నిశ్చయంగా నాకు ఒక అగ్ని కనిపిస్తోంది[4]. నేను దాని నుండి మీ వద్దకు ఏదైనా వార్తను తీసుకు వస్తాను లేదా మీరు కాచుకోవడానికి మండే కొరివినైనా తీసుకువస్తాను." అని అన్నాడు.

8. కాని అతడు అక్కడికి చేరినప్పుడు ఒక ధ్వని ఇలా వినిపించింది: "ఈ అగ్నిలో ఉన్న వానికీ మరియు దాని పరిసరాలలో ఉన్నవానికీ శుభాలు కలుగుగాక! సర్వలోకాలకు ప్రభువైన అల్లాహ్ సర్వలోపాలకు అతీతుడు."

9. ఓ మూసా! నిశ్చయంగా ఆయన అల్లాహ్ ను నేనే! సర్వశక్తిమంతుడను, మహా వివేకవంతుడను.

10. నీ చేతికర్రను పడవేయి!" అతను దానిని (పడవేసి) చూశాడు. అది పాములాగే కదల సాగింది[5]. అతడు వెనుదిరిగి చూడకుండా పరుగెత్తసాగాడు. (అల్లాహ్ అన్నాడు): "ఓ మూసా!

---

[4] చూడండి, 20:10.
[5] చూడండి, 20:17-21.

భయపడకు[6]. నిశ్చయంగా, నా సన్నిధిలో సందేశహరులకు ఎలాంటి భయం ఉండదు.

11. కాని ఎవడైనా తప్పు చేస్తే తప్ప! ఆ తరువాత అతడు దానికి బదులుగా మంచి పనులు చేస్తే![7] నిశ్చయంగా, నేను క్షమించేవాడను, కరుణా ప్రదాతను.

12. ఇక నీ చేతిని నీ చంకలో (జేబులో) పెట్టి (తీయి), అది ఎలాంటి లోపం లేకుండా తెల్లగా (ప్రకాశిస్తూ) బయటికి వస్తుంది[8]. ఈ తొమ్మిది అద్భుత సూచనలు (ఆయాత్) తీసుకొని నీవు ఫిరఔన్ మరియు అతని జాతివారి వద్దకు వెళ్ళు[9] నిశ్చయంగా వారు అవిధేయులై పోయారు!"

13. కాని వారి ముందుకు మా ప్రత్యక్ష సూచనలు వచ్చినపుడు వారు: "ఇది స్పష్టమైన మాయాజాలమే!" అని అన్నారు[10].

14. మరియు వారి హృదయాలు వాటిని అంగీకరించినా వారు అన్యాయంగా, అహంకారంతో తిరస్కరించారు. ఇక చూడు ఆ దౌర్జన్యపరుల గతి ఏమయి

[6] దీనితో తెలిసేదేమిటంటే ప్రవక్తలకు అగోచరజ్ఞానం ఉండదు. వారు కూడా సాధారణ మానవుల వలే భయపడవచ్చు!

[7] ఒకడు పాపం చేసి, దాని తరువాత హృదయపూర్వకంగా పశ్చాత్తాపపడి క్షమాభిక్ష వేడుకుంటే అల్లాహ్ (సు.తా.) అతనిని క్షమించవచ్చు! బహుశా మూసా ('అ.స.) వల్ల అనుకోకుండా జరిగిన ఫిర్'ఔన్ జాతివాని హత్య గురించి ఈ ఆయత్ చెప్పుతోంది. చూడండి, 28:101.

[8] చూడండి, 7:108.

[9] ఆ తొమ్మిది అద్భుత సంకేతాల కొరకు చూడండి, 17:101.

[10] చూడండి, 10:76.

పోయిందో!

15. మరియు వాస్తవంగా, మేము దావూద్ మరియు సులైమాన్ లకు జ్ఞానాన్ని ప్రసాదించాము[11]. వారిద్దరు అన్నారు: "విశ్వాసులైన తన అనేక దాసులలో, మా ఇద్దరికి ఘనతను ప్రసాదించిన ఆ అల్లాహ్ యే సర్వస్తోత్రములకు అర్హుడు!"

16. మరియు సులైమాన్, దావూద్ కు వారసుడయ్యాడు[12]. మరియు అతను (సులైమాన్) అన్నాడు: "ఓ ప్రజలారా! మాకు పక్షుల భాష నేర్పబడింది. మరియు మాకు ప్రతి వస్తువు ఒసంగబడింది. నిశ్చయంగా, ఇది ఒక స్పష్టమైన (అల్లాహ్) అనుగ్రహమే!"

17. మరియు సులైమాన్ కొరకు జిన్నాతుల[13], మానవుల మరియు పక్షుల సైన్యాలు సమీకరింపబడి ఉండేవి. తరువాత వాటిని తమ తమ స్థానాల ప్రకారం వరుసలలో పెట్టి (బయలు దేరారు)!

18. చివరకు వారు చీమల లోయకు (కనుమకు) చేరుకున్నప్పుడు ఒక చీమ ఇలా అన్నది: "ఓ చీమలారా! మీరు మీ ఇండ్లలోకి ప్రవేశించండి, లేకపోతే సులైమాన్ మరియు అతని సైనికులు - వారికి తెలియకుండానే –

---

[11] జ్ఞానం: అల్లాహ్ (సు.తా.) తన ప్రవక్తలకు ప్రసాదించే గొప్ప బహుమానం.

[12] అంటే ప్రవక్త పదవి యొక్క వారసత్వం. ఎందుకంటే దావూద్ ('అ.స.)కు ఇతర కుమారులుండిరి. కాని వారు ప్రవక్తలు కాలేదు. ప్రవక్త ('అ.స.)లు వదలిపోయిన ధనసంపత్తులు 'సదఖ' అంటే దానాలుగా పరిగణింపబడతాయి. ('స'హీ'హ్ బు'ఖారీ).

[13] ఖుర్ఆన్ అవతరణా క్రమంలో 114:6 లో మొదటిసారి జిన్నాతుల పేరు వచ్చింది.

మిమ్మల్ని నలిపి వేయవచ్చు!"[14]

19. (సులైమాన్) దాని మాటలకు చిరునవ్వు నవ్వి ఇలా అన్నాడు: "ఓ నా ప్రభూ! నీవు నన్ను - నాకూ మరియు నా తల్లిదండ్రులకు చూపిన అనుగ్రహాలకు - కృతజ్ఞత తెలిపే వానిగా[15] మరియు నీకు నచ్చే సత్కార్యాలు చేసేవానిగా, ప్రోత్సాహపరచు. మరియు నన్ను నీ కారుణ్యంతో సద్వర్తనులైన నీ దాసులలో చేర్చుకో!"[16]

20. మరియు (ఒకరోజు) అతను పక్షులను పరిశీలిస్తూ ఇలా అన్నాడు: "ఏమిటీ, నాకు వడ్రంగి పిట్ట (హుద్ హుద్) కనిపించడం లేదే! అది ఎలా అదృశ్యమైపోయింది?

---

[14] దీనితో వ్యక్తమయ్యేది ఏమిటంటే సులైమాన్ ('అ.స.)కు పశుపక్షుల భాషలు అర్థమయ్యేవి. కాని అతనికి అగోచరజ్ఞానం లేదు. అల్లాహ్ (సు.తా.) తప్ప మరెవ్వరికీ అగోచరజ్ఞానం ఉండదు. ఈ విషయం ముందు రాబోయే వడ్రంగి పిట్ట కథ వల్ల తెలుస్తోంది.

[15] చూడండి, 38:31-33.

[16] దీనితో వ్యక్తమయ్యేది ఏమిటంటే సద్వర్తనులైన విశ్వాసులకే స్వర్గం లభిస్తుంది. మరియు ఎవడు కూడా అల్లాహ్ (సు.తా.) అనుగ్రహం లేనిదే స్వర్గంలో ప్రవేశించలేడు. దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'మీరు సన్మార్గం మీద మరియు సత్యం మీద ఉండండి. మరియు జ్ఞాపకముంచుకోండి. ఏ వ్యక్తి కూడా కేవలం తన సత్కార్యాల వల్లనే స్వర్గాన్ని పొందలేడు.' అప్పుడు అనుచరలు (ర'ది.'అన్హుమ్)లు అన్నారు: 'ఓ సందేశహరుడా ('స'అస)! మీరు కూడానా?' అతను జవాబిచ్చారు: 'అవును నేను కూడా!' అల్లాహ్ (సు.తా.) కరుణించే వరకు నేను కూడా స్వర్గంలో ప్రవేశించలేను.' ('స. బు'ఖారీ, నం. 6467, 'స. ముస్లిం 217)

21. నేను దానిని కఠినంగా శిక్షిస్తాను. లేదా దానిని కోసివేస్తాను, అది నాకు సరైన కారణం చూపితేనే తప్ప!"

22. ఆ తరువాత ఎంతో సేపు గడవక ముందే అది వచ్చి ఇలా అన్నది: "నీకు తెలియని విషయమొకటి నేను తెలుసుకొని వచ్చాను. నేను సబాను గురించి ఒక నమ్మకమైన వార్తను నీ కొరకు తెచ్చాను.[17]

23. నిశ్చయంగా, నేను అక్కడ ఒక స్త్రీని చూశాను. ఆమె వారిపై (రాణిగా) పరిపాలన చేస్తుంది. ఆమెకు ప్రతి వస్తువు ఒసంగబడి ఉంది. ఆమె దగ్గర ఒక గొప్ప సింహాసనం ఉంది.

24. మరియు నేను ఆమెను మరియు ఆమె జాతివారిని అల్లాహ్ ను వదలి సూర్యునికి సాష్టాంగం (సజ్దా) చేయటం చూశాను మరియు షైతాన్ వారి కర్మలను, వారికి మంచివిగా తోచేటట్లు చేశాడు. కావున వారిని సన్మార్గం నుండి నిరోధించాడు, కాబట్టి వారు సన్మార్గం పొందలేక పోయారు.

25. అందుకే వారు - ఆకాశాలలోనూ మరియు

---

[17] చూడండి, 34:15. సబా' ఒక ప్రఖ్యాత వ్యక్తి పేరు మీద, ఒక తెగ, ఒక పట్టణం మరియు దేశపు పేరు పెట్టబడింది. అది యమన్ ప్రాంతంలో ఉండేది. అది మ'అరిబే యమన్ అనే పేరుతో కూడా పిలువబడింది. ఆ సమయంలో దాని పాలకురాలు (రాణి) ఒక స్త్రీ. ఆమె పేరు బిల్ఖీస్ అని అంటారు. దాని రాజధాని మ'అరిబ్. వారు సూర్యుణ్ణి పూజించేవారు. (ఫ'త్హ్ అల్-ఖదీర్).

భూమిలోనూ దాని వున్న వాటిని బయటికి తీసేవాడూ మరియు మీరు దాచే వాటినీ మరియు వ్యక్తపరిచే వాటినీ ఎరుగువాడూ అయిన - అల్లాహ్ కు సాష్టాంగం (సజ్దా) చేయటం లేదు.

26. అల్లాహ్! ఆయన తప్ప మరొక ఆరాధ్య దైవం లేడు. ఆయనే సర్వోత్తమ సింహాసనానికి (అర్ష్ కు) ప్రభువు."

27. (సులైమాన్) అన్నాడు: "నీవు సత్యం పలుకుతున్నావో, లేదా అబద్ధాలాడే వారిలో చేరిన వాడవో, మేము ఇప్పుడే చూస్తాము.

28. నా ఈ ఉత్తరం తీసుకొని పో! దీనిని వారి వద్ద పడవేయి, తరువాత వారి నుండి ఒక వైపుకు తొలగిపోయి వారేమి సమాధానమిస్తారో చూడు."

29. (రాణి) అన్నది: "ఓ నా ఆస్థాన నాయకులారా! ఇదిగో నా వైపుకు ఒక విశేషమైన ఉత్తరం పంపబడింది.

30. నిశ్చయంగా, ఇది సులైమాన్ దగ్గర నుండి వచ్చింది. మరియు ఇది: ''అనంత కరుణామయుడు, అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో,' ప్రారంభించబడింది."

31. "(ఇందులో ఇలా వ్రాయబడి ఉంది): 'నా పై ఆధిక్యత చూపకండి. నా సన్నిధిలోకి అల్లాహ్ కు

విధేయులు (ముస్లింలు) అయి రండి[18]' "

32. (రాణి) అన్నది: "ఓ నాయకులారా! ఈ విషయంలో మీరు నాకు సలహా ఇవ్వండి. నేను ఏ విషయంలోనూ, మీరు లేనిదే ఎలాంటి నిర్ణయం తీసుకోనే!"

33. వారిలా జవాబిచ్చారు: "మనం చాలా బలవంతులం. మరియు గొప్ప యుద్ధ నిపుణులం, కాని నిర్ణయం మాత్రం నీదే! కావున, నీవు ఏమి ఆజ్ఞాపించ దలుచుకున్నావో ఆలోచించు!"

34. (రాణి) అన్నది: "రాజులు ఏ దేశంలోనైనా జొరబడినప్పుడు, వారందులో కల్లోలం రేకెత్తిస్తారు మరియు అక్కడి గౌరవనీయులైన ప్రజలను అవమాన పరుస్తారు. వీరు కూడా అదే విధంగా చేయవచ్చు!

35. కావున నేను తప్పక, వారి వద్దకు ఒక కానుకను పంపుతాను. ఆ తరువాత నా దూతలు ఏమి జవాబు తెస్తారో చూస్తాను."

36. (రాయబారులు) సులైమాన్ వద్దకు వచ్చినపుడు, అతను అన్నాడు: "ఏమీ? మీరు నాకు ధనసహాయం చేయదలచారా? అల్లాహ్ నాకు ఇచ్చింది, మీకు

---

[18] సబా' వాసులు అల్లాహ్ (సు.తా.) ను వదిలి సూర్యుణ్ణి పూజించేవారు. (ఆయతులు 24-25) కావున సులైమాన్ ('అ.స.) ఒక ప్రవక్త కాబట్టి వారిని అల్లాహ్ (సు.తా.)కు విధేయులవటానికి ఆహ్వానించారు. (చూడండి, 44:19) ఇదే విధంగా మహా ప్రవక్త ముహమ్మద్ ('స'అస) కూడా ఆయన కాలపు రాజులను ఇస్లాం స్వీకరించటానికి, ఆహ్వానపత్రాలు పంపారు.

ఇచ్చిన దాని కంటే ఎంతో ఉత్తమమైనది, ఇక మీ కానుకతో మీరే సంతోషపడండి!"

37. (సులైమాన్) అన్నాడు): "నీవు వారి వద్దకు తిరిగిపో, మేము వారిపైకి గొప్ప సేనలతో వస్తాము. వారు వాటిని ఎదిరించజాలరు. మేము వారిని పరాభవించి అచ్చటి నుండి వెడల గొడ్తాము. మరియు వారు అవమానితులై ఉండిపోతారు."

38. (తరువాత సులైమాన్) ఇలా అన్నాడు: "ఓ నాయకులారా! వారు అల్లాహ్ కు విధేయులై (ముస్లింలై) రాకముందే, ఆమె సింహాసనాన్ని నా వద్దకు మీలో ఎవరు తేగలరు?"

39. జిన్నాతులలో బలిష్ఠుడైన ఒకడు ఇలా అన్నాడు: "నీవు నీ స్థానం నుండి లేవక ముందే నేను దానిని తీసుకువస్తాను. నిశ్చయంగా నేను ఇలా చేసే బలం గలవాడను, నమ్మదగిన వాడను!"

40. గ్రంథజ్ఞానం గల ఒకతను ఇలా అన్నాడు: "నేను కనురెప్పపాటు కాలంలో దానిని నీ వద్దకు తేగలను!" ఆ తరువాత (సులైమాన్) దానిని వాస్తవంగా తన ముందు పెట్టబడి ఉండటాన్ని చూసి ఇలా అన్నాడు: "ఇది నా ప్రభువు అనుగ్రహం. నేను కృతజ్ఞతలు చూపుదునా లేక కృతఘ్నుడ నవుదునా అని పరీక్షించటానికి ఇలా చేయబడింది. కృతజ్ఞతలు తెలిపేవాడు, నిశ్చయంగా, తన మేలు కొరకే కృతజ్ఞతలు తెలుపుకుంటాడు. కాని ఎవడైనా కృతఘ్నతకు పాల్పడితే, నిశ్చయంగా, నా

ప్రభువు స్వయం సమృద్ధుడు, పరమ దాత[19] (అని తెలుసుకోవాలి)."

**41.** (సులైమాన్) అన్నాడు: "ఆమె గుర్తించ లేకుండా ఆమె సింహాసనపు రూపాన్ని మార్చి వేయండి. మనం చూద్దాం! ఆమె మార్గదర్శకత్వం పొందుతుందా, లేక మార్గదర్శకత్వం పొందని వారిలో చేరి పోతుందా?"

**42.** ఆ తరువాత ఆమె అక్కడికి రాగానే: "ఏమీ? నీ సింహాసనం విధంగానే ఉంటుందా?" అని అడుగ్గా, ఆమె: "నిశ్చయంగా, ఇది దాని మాదిరిగానే ఉంది!"అని అన్నది. మరియు (సులైమాన్ అన్నాడు): "మనకు ఈమె కంటే ముందు (దివ్య) జ్ఞానం ప్రసాదించ బడింది (లభించింది) కావున మనం అల్లాహ్ కు విధేయులం (ముస్లింలం) అయ్యాము!"[20]

**43.** మరియు అల్లాహ్ ను వదలి ఆమె ఆరాధిస్తున్నది, ఆమెను (ఇస్లాం నుండి) తొలగించింది. అందుకే! ఆమె వాస్తవానికి, సత్యతిరస్కారులలో చేరి ఉండేది.

---

[19] అల్-కరీము: Most Bounteous, Generous, Most Noble, Honorable, దాతృత్వుడు, దానశీలుడు, ఔదార్యుడు, ఉదారుడు, పరమదాత, గొప్పవాడు, అత్యంత ఆదరణీయుడు, దివ్యుడు (82:6, 96:3) ఈ శబ్దము అల్లాహ్ (సు.తా.) కే గాక, దివ్య ఖుర్ఆన్ కొరకు గూడా వాడబడింది, అల్-మజీద్ మాదిరిగా. అల్-ఇక్రామ్: కొరకు చూడండి, 55:27,78.

[20] ఇది సులైమాన్ ('అ.స.) వాక్యమని ఇబ్నె-కసీ'ర్ మరియు షౌకాని గారి అభిప్రాయం.

44. ఆమెతో: "రాజగృహంలో ప్రవేశించు!" అని చెప్పగా! ఆమె దానిని చూసి, అదొక నీటి కొలనని భావించి (తన వస్త్రాలను) పైకెత్తగా ఆమె పిక్కలు కనబడ్డాయి. అప్పుడు (సులైమాన్): "ఇది గాజుతో నిర్మించబడిన నున్నని నేల మాత్రమే!" అని అన్నాడు. (రాణి) అన్నది: "ఓ నా ప్రభూ! నాకు నేను అన్యాయం చేసుకున్నాను. మరియు నేను సులైమాన్ తో పాటు సర్వలోకాల ప్రభువైన అల్లాహ్ కు విధేయతను (ఇస్లాంను) స్వీకరిస్తున్నాను."[21]

45. మరియు వాస్తవంగా! మేము సమూద్ జాతివారి వద్దకు వారి సోదరుడైన సాలిహ్ ను: "మీరు అల్లాహ్ నే ఆరాధించండి."[22] అనే (సందేశంతో) పంపాము. కాని వారు రెండు వర్గాలుగా చీలి పోయి పరస్పరం కలహించుకోసాగారు.

46. (సాలిహ్) అన్నాడు: "ఓ నా జాతి ప్రజలారా! మీరు సుస్థితికి ముందు దుస్థితి కొరకు ఎందుకు తొందరపెడుతున్నారు? మీరు అల్లాహ్ ను మీ తప్పులను క్షమించమని ఎందుకు వేడుకోరు? బహుశా మీరు కరుణించబడవచ్చు!"

47. వారన్నారు: "మేము నిన్నూ మరియు నీ అనుచరులను అపశకునపు సూచనలుగా పరిగణిస్తున్నాము!" (సాలిహ్) అన్నాడు: "మీ

---

[21] ఇస్లాం స్వీకరించిన తరువాత బిల్ఖీస్ వివాహం సులైమాన్ ('అ.స.) తో అయిందా లేదా అనే విషయం ఖుర్ఆన్ మరియు 'హదీస్'లలో పేర్కొనబడలేదు.

[22] 'సాలిహ్' ('అ.స.) గాథ కొరకు చూడండి, 7:73.

శకునం అల్లాహ్ వద్ద ఉంది. వాస్తవానికి, మీరు పరీక్షించ బడుతున్నారు!"[23]

**48.** మరియు ఆ నగరంలో తొమ్మిది మంది ఉండేవారు. వారు దేశంలో కల్లోలం రేకెత్తిస్తూ ఉండేవారు. మరియు ఎలాంటి సంస్కరణ చేసేవారు కాదు.

**49.** వారు పరస్పరం ఇలా అనుకున్నారు: "అల్లాహ్ పై ప్రమాణం చేసి ఇలా ప్రతిజ్ఞ చేయండి[24]. మనం అతనిపై మరియు అతనితో పాటు ఉన్న వారిపై రాత్రివేళ దాడి చేద్దాము. తరువాత అతని వారసులతో: 'మీ సంబంధీకులను వధించింది మేము చూడనే లేదు. మేము నిశ్చయంగా, సత్యం పలుకుతున్నాము.' "అని అందాము.

**50.** మరియు ఈ విధంగా, వారు పన్నాగం పన్నారు మరియు మేము కూడా ఒక పన్నాగం పన్నాము. కాని వారికది తెలియదు.

**51.** ఇక చూడండి! వారి పన్నాగపు పర్యవసానం ఏమయిందో! వాస్తవానికి మేము వారిని మరియు వారి వంశం వారినందరినీ సర్వనాశనం చేశాము.

**52.** అవిగో వారి గృహాలు! వారు చేసిన దుర్మార్గాలకు అవి ఎలా పాడుపడి పోయాయో చూడండి. నిశ్చయంగా ఇందులో తెలుసుకునే వారికి గొప్ప సూచన ఉంది.

---

[23] చూడండి, 17:13.

[24] అల్లాహ్ (సు.తా.) పై ప్రమాణం అంటే స'మూద్ జాతివారు అల్లాహ్ (సు.తా.) ను విశ్వసించేవారు. కాని వారు పాటించే మతం వారిని ఏకైక ఆరాధ్యుడైన (అల్లాహుతా'ఆలా) ఆరాధన నుండి తొలగించింది. (చూడండి, 7:73).

53. మరియు విశ్వసించి, దైవభీతి కలిగి ఉన్న వారిని మేము కాపాడాము.

54. మరియు లూత్ ను (జ్ఞాపకం చేసుకోండి)! అతను తన జాతి వారితో ఇలా అన్నప్పుడు: "ఏమీ? మీరు బహిరంగంగా అశ్లీల కార్యాలు చేస్తారా?"[25]

55. "ఏమీ? మీరు స్త్రీలను వదలి పురుషుల వద్దకు, మీ కామ ఇచ్ఛను తీర్చుకోవటానికి పోతారా? వాస్తవానికి, మీరు మూఢ జనులు!"

56. కాని, అతని జాతివారి జవాబు ఈ విధంగా మాత్రమే ఉండింది. వారు అన్నారు: "లూత్ కుటుంబాన్ని మీ పట్టణం నుండి వెళ్ళ గొట్టండి. వాస్తవానికి, వారు తమను తాము చాలా పవిత్రులుగా పరిగణిస్తున్నారు."[26]

57. కావున మేము అతనిని మరియు అతని కుటుంబం వారిని కాపాడాము - అతని భార్య తప్ప - ఆమెను వెనుక ఉండిపోయే వారిలో చేర్చాలని నిర్ణయించాము[27].

58. మరియు వారిపై (రాళ్ళ) వర్షాన్ని కురిపించాము. కాని అది, హెచ్చరించబడిన వారిపై కురిపించబడ్డ ఎంతో ఘోరమైన వర్షం.[28]

59. (ఓ ముహమ్మద్!) ఇలా అను: "సర్వస్తోత్రాలకు

---

[25] లూ'త్ ('అ.స.) గాథ కొరకు చూడండి, 7:80-84, 11:69-83, 26:160-173.

[26] చూడండి, 7:82.

[27] చూడండి, 7:83, 11:81 మరియు 66:10

[28] చూడండి, 26:173.

అర్హుడు అల్లాహ్ మాత్రమే. ఆయన ఎన్నుకొన్న, ఆయన దాసులకు శాంతి కలుగు గాక (సలాం)! ఏమీ? అల్లాహ్ శ్రేష్ఠుడా? లేక వారు ఆయనకు సాటి కల్పించే భాగస్వాములా?"

**60.** ఏమీ? ఆయనే కాడా? ఆకాశాలనూ మరియు భూమినీ సృష్టించినవాడు మరియు మీ కొరకు ఆకాశం నుండి నీటిని కురిపించిన వాడు? దానితో మేము మనోహరమైన తోటలను పుట్టించాము. వాటిలో ఒక్క చెట్టును కూడా మొలిపించటం మీకు సాధ్యమయ్యే పని కాదు కదా? ఏమీ? అల్లాహ్ తో బాటు మరొక దేవుడు ఎవడైనా ఉన్నాడా? అలా కాదు! వారే (ఇతరులను) ఆయనకు సమానులుగా చేసే ప్రజలు!

**61.** ఏమీ? ఆయనే కాడా? భూమిని నివాసస్థలంగా చేసి,[29] దాని మధ్య నదులను ఏర్పరచి, అది కదలకుండా దానిపై పర్వతాలను మేకులుగా నాటినవాడు మరియు రెండు సముద్రాల మధ్య అడ్డుతెరను నిర్మించిన వాడు?[30] ఏమీ? అల్లాహ్ తో పాటు మరొక దేవుడు ఎవడైనా ఉన్నాడా? వాస్తవానికి చాలా మంది ఇది తెలుసుకోలేరు.

**62.** ఏమీ? ఆయనే కాడా? బాధితుడు వేడుకున్నప్పుడు అతడి మొరను ఆలకించి ఆపదను తొలగించేవాడు[31] మరియు భూమిలో మిమ్మల్ని ఉత్తరాధికారులుగా

---

[29] చూడండి, 77:25-26.
[30] చూడండి, 25:53.
[31] చూడండి, 17:67 మరియు 27:53.

చేసిన వాడు?[32] ఏమీ? అల్లాహ్ తో పాటు మరొక దేవుడు ఎవడైనా ఉన్నాడా? మీరు ఆలోచించేది చాలా తక్కువ.

63. ఏమీ? ఆయనే కాడా? నేల మరియు సముద్రాల, అంధకారంలో మీకు మార్గదర్శకత్వం చేసేవాడు మరియు తన కారుణ్యానికి ముందు గాలులను శుభవార్తలతో పంపేవాడు?[33] ఏమీ? అల్లాహ్ తో పాటు మరొక దేవుడు ఎవడైనా ఉన్నాడా? వారు సాటిగా కల్పించే భాగస్వాముల కంటే అల్లాహ్ అత్యున్నతుడు!

64. ఏమీ? ఆయనే కాడా? సృష్టిని తొలిసారి ప్రారంభించి, తరువాత దానిని మరల ఉనికి లోకి తేగలవాడు మరియు మీకు ఆకాశం నుండి మరియు భూమి నుండి జీవనోపాధిని సమకూర్చేవాడు[34]. ఏమీ? అల్లాహ్ తో పాటు మరొక దేవుడు ఎవడైనా ఉన్నాడా? వారితో అను: "మీరు సత్యవంతులే అయితే మీ నిదర్శనాన్ని తీసుకురండి!"

65. వారితో అను: "ఆకాశాలలోను మరియు భూమిలోను ఉన్న అగోచర విషయజ్ఞానం

[32] చూడండి, 2:30.
[33] చూడండి, 7:57
[34] చూడండి, 10:31.

గలవాడు అల్లాహ్ తప్ప మరొకడు లేడు[35]. మరియు వారు తిరిగి ఎప్పుడు లేపబడతారో కూడా వారికి తెలియదు."

**66.** వాస్తవానికి, పరలోక జీవితం గురించి వారి జ్ఞానం శూన్యమే. అలా కాదు! దానిని గురించి వారు సంశయంలో పడి వున్నారు. అలా కాదు! దాని విషయంలో వారు అంధులై పోయారు.

**67.** సత్యతిరస్కారులు అంటారు: "ఏమీ? మేమూ మరియు మా తండ్రితాతలు మట్టిగా మారిపోయిన తరువాత కూడా వాస్తవానికి మరల (సజీవులుగా) వెలికి తీయబడతామా?

**68.** వాస్తవానికి ఇంతకు పూర్వం కూడా మాకు మరియు మా తండ్రితాతలకు ఇదే విధంగా

---

[35] అగోచరజ్ఞానం అల్లాహ్ (సు.తా.) తప్ప మరెవ్వరికీ లేదు. ప్రవక్త ('అలైహిమ్ స.) లకు అల్లాహ్ (సు.తా.) వ'హీ ద్వారా తెలిపిన జ్ఞానం మాత్రమే ఉంటుంది. 'ఆయి'షహ్ (ర.'అన్హా) కథనం: "ఎవడైతే ప్రవక్తకు రేపు కాబోయే విషయాల గురించి జ్ఞానముందని భావిస్తాడో, అతడు అల్లాహ్ (సు.తా.) మీద పెద్ద అపనింద మోపుతున్నాడు. ఎందుకంటే! అల్లాహ్ (సు.తా.) కే అంటున్నాడు: 'భూమ్యాకాశాలలో ఉన్న అగోచర విషయాల జ్ఞానం కేవలం అల్లాహ్ (సు.తా.)కే ఉంది.' " ('స'హీ'హ్ బు'ఖారీ, నం. 4855, 'స'హీ'హ్ ముస్లిం, నం. 287, తిర్మిజీ' నం. 3068) ఖతదా (ర'ది.'అ.) అన్నారు: 'అల్లాహ్ (సు.తా.) నక్షత్రాలను మూడు విషయాల కొరకు పుట్టించాడు: 1) ఆకాశపు అలంకరణ కొరకు, 2) (రాత్రిలో) మార్గదర్శకానికి (దారి తెలుసుకోవటానికి), 3) షైతాన్ లను తరిమి కొట్టడానికి. కాని అల్లాహ్ (సు.తా.) ఆదేశాలను ఎరుగని వారు వాటి ద్వారా అగోచర జ్ఞానం (జ్యోతిష్యం) చెప్పుతామని ఇతరులను మోసగిస్తున్నారు. వారు పలికేవన్నీ మోసపు మాటలే, అబద్ధాలే. (ఇబ్నె-కసీ'ర్).

వాగ్దానం చేయబడింది. ఇవి కేవలం పూర్వకాలపు గాథలు మాత్రమే."

69. వారితో అను: "భూమిలో ప్రయాణం చేసి చూడండి. అపరాధుల గతి ఏమయిందో!"

70. మరియు నీవు వారి గురించి దుఃఖపడకు మరియు వారి కుట్రలకు బాధపడకు.

71. వారంటున్నారు: "మీరు సత్యవంతులే అయితే! ఈ వాగ్దానం ఎప్పుడు పూర్తి కానున్నది?"

72. వారితో అను: "మీరు దేనిని (ఏ శిక్షను) గురించి తొందర పెడుతున్నారో? అందులోని కొంతభాగం బహుశా మీకు సమీపంలోనే ఉండవచ్చు!"[36]

73. "మరియు నిశ్చయంగా, నీ ప్రభువు మానవులపై ఎంతో అనుగ్రహం కలవాడు, కాని వారిలో చాలా మంది కృతజ్ఞతలు చూపరు."

74. మరియు నిశ్చయంగా వారి హృదయాలు ఏమి దాస్తున్నాయో మరియు ఏమి వ్యక్త పరుస్తున్నాయో, నీ ప్రభువుకు బాగా తెలుసు.

75. మరియు ఆకాశంలో మరియు భూమిలో అగోచరంగా ఉన్నది ఏదీ కూడా, స్పష్టమైన ఒక గ్రంథంలో వ్రాయబడకుండా లేదు[37].

76. నిశ్చయంగా, ఈ ఖుర్ఆన్ ఇస్రాయీల్ సంతతి వారు విభేదిస్తూ వున్న పెక్కు విషయాల వాస్తవాన్ని వారికి తెలుపుతున్నది.

---

[36] ఇది బద్ర్ యుద్ధాన్ని సూచిస్తోంది.
[37] దీని అర్థం: లౌ'హె మ'హ్ ఫూజ్.

77. మరియు నిశ్చయంగా, ఇది విశ్వాసులకు మార్గదర్శిని మరియు కారుణ్యం.

78. నిశ్చయంగా, నీ ప్రభువు వారి మధ్య న్యాయంగా తీర్పు చేస్తాడు. ఆయన సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు.

79. కావున నీవు అల్లాహ్'పై ఆధారపడి ఉండు నిశ్చయంగా నీవు స్పష్టమైన సత్యంపై ఉన్నావు

80. నిశ్చయంగా, నీవు మృతులకు వినిపింపజేయలేవు మరియు వీపు త్రిప్పి మరలి పోయే చెవిటివారికి కూడా నీ పిలుపును వినిపింప జేయలేవు[38].

81. మరియు నీవు అంధులను మార్గభ్రష్టత్వం నుండి తొలగించి, వారికి మార్గదర్శకత్వం చేయలేవు. మా సూచనలను (ఆయాత్ లను) విశ్వసించి, అల్లాహ్ కు విధేయులు (ముస్లింలు) అయ్యే వారికి మాత్రమే నీవు (నీ మాటలను) వినిపించగలవు.

82. మరియు వారిని గురించిన (శిక్ష) వాగ్దానం పూర్తికానున్నప్పుడు[39], మేము వారి కొరకు భూమి నుండి ఒక జంతువును బయటికి

---

[38] ఈ ఆయత్ సత్యతిరస్కారులను గురించి చెప్పుతోంది. వారి బుద్ధి సత్యాన్ని గ్రహించకున్నది కావున వారు మృతులుగా పేర్కొనబడ్డారు.

[39] ఎప్పుడైతే మంచిని ఆదేశించేవాడు మరియు చెడు నుండి నిరోధించేవాడు ఎవ్వడూ ఉండడో!

తీస్తాము[40]. అది వారితో నిశ్చయంగా, మానవులు మా సూచలను (ఆయాత్ లను) నమ్మేవారు కాదని చెబుతుంది.

83. మరియు (జ్ఞాపకముంచుకోండి) ఆ రోజు (పునరుత్థాన దినమున) మేము ప్రతి జాతి వారిలో నుండి మా సూచనలను అసత్యాలని తిరస్కరించిన జనసమూహాన్ని సమీకరిస్తాము మరియు వారు (వారి పాపాల ప్రకారం) వివిధ వరుసలలో నిలబెట్ట బడతారు.

84. చివరకు అందరూ వచ్చిన తరువాత వారి (ప్రభువు) వారిని ప్రశ్నిస్తాడు: "ఏమీ? మీరు నా సూచనలను, మీ జ్ఞానంతో గ్రహించకుండానే వాటిని అసత్యాలని తిరస్కరించారా? ఇదిగాక మీరు ఏమి చేస్తూ ఉండేవారు?"

85. మరియు వారు చేసిన దుర్మార్గం వలన వారికి చేయబడిన వాగ్దానం (శిక్ష) పూర్తి అవుతుంది, కావున వారేమీ మాట్లాడలేరు.

86. ఏమీ? వారికి తెలియదా? మేము రాత్రిని వారు విశ్రాంతి పొందటానికి మరియు పగటిని (చూడగలగటానికి)ప్రకాశవంతంగాచేశామని?[41]

---

[40] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'పునరుత్థానదినం అంతవరకు రాదు, ఎంతవరకైతే మీరు పది సంకేతాలు చూడరో!' ఆ పది సంకేతాలలో ఈ జంతువు ఒకటి, ('స'హీ'హ్ ముస్లిం). మరొక 'హదీస్'లో ఉంది: అన్నిటి కంటే మొదటి సంకేతం, సూర్యుడు తూర్పు నుండి గాక పడమర నుండి ఉదయించడం. ('స'హీ'హ్ ముస్లిం)

[41] చూడండి, 10:67 మరియు 40:61.

నిశ్చయంగా, విశ్వసించేవారికి ఇందులో ఎన్నో సూచనలున్నాయి.

**87.** మరియు (జ్ఞాపకముంచుకోండి) బాకా (సూర్) ఊదబడే దినమున - అల్లాహ్ కోరిన వారు తప్ప[42] - ఆకాశాలలోను మరియు భూమిలోను ఉన్నవన్నీ భయంతో కంపించి పోతాయి[43]. మరియు అన్నీ అత్యంత వినమ్రతతో ఆయన ముందు హాజరవుతాయి.

**88.** మరియు నీవు పర్వతాలను చూసి అవి స్థిరంగా ఉన్నాయని అనుకుంటున్నావు. కాని అవి అప్పుడు మేఘాల వలే ఎగురుతూ పోతుంటాయి. ఇది అల్లాహ్ కార్యం! ఆయన ప్రతి కార్యాన్ని నేర్పుతో చేస్తాడు. నిశ్చయంగా మీరు చేసేదంతా ఆయన ఎరుగును[44].

**89.** మంచిపనులు చేసి వచ్చిన వారికి, అంతకంటే మంచి (ప్రతిఫలం) ఉంటుంది. మరియు వారు

---

[42] ఎవరా అల్లాహ్ (సు.తా.) కోరినవారు? ఇమామ్ షౌకాని ప్రకారం: వారు దైవదూతలు, దైవప్రవక్తలు, అమరవీరులు (షుహదా') మరియు విశ్వాసులందరూ!

[43] 'సూర్: బాకా, కొమ్ము, దానిని ఇస్రాఫీల్ ('అ.స.) అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞతో ఊదుతారు. ఇది రెండుసార్లు లేక అంతకంటే ఎక్కువ సార్లు ఊదబడుతుంది. మొదట ఊదబడినప్పుడు సమస్త (జీవరాసులు) భయంతో స్పృహ కోల్పోతారు. రెండవసారి ఊదబడినప్పుడు అందరూ చనిపోతారు. మూడవసారి ఊదబడినప్పుడు అందరూ తమ గోరీల నుండి లేచి వస్తారు. మరికొందరి ప్రకారం నాలుగవసారి బాకా ఊదబడినప్పుడు అందరూ మైదానంలో సమీకరించబడతారు.

[44] చూడండి, 14:48 మరియు 20:105-107.

ఆ దినపు మహా భీతి నుండి సురక్షితంగా ఉంటారు[45].

90. మరియు చెడుపనులు చేసి వచ్చిన వారు నరకాగ్నిలో బోర్లా త్రోయబడతారు. (వారితో అనబడుతుంది): "మీకు ఇవ్వబడే ప్రతిఫలం మీ కర్మలకు భిన్నంగా ఉండగలదా?"

91. (ఓ ముహమ్మద్!) వారితో (ఇలా అను): "నిశ్చయంగా, ఈ (మక్కా) నగరపు ప్రభువునే ఆరాధించాలని నాకు ఆజ్ఞ ఇవ్వబడింది. ఆయనే! దీనిని పవిత్ర క్షేత్రంగా[46] చేశాడు మరియు ప్రతి వస్తువు ఆయనకు చెందినదే! మరియు నేను ఆయనకు విధేయుడనై (ముస్లింనై) ఉండాలని నాకు ఆజ్ఞ ఇవ్వబడింది.

92. మరియు ఈ ఖుర్ఆన్ ను చదివి వినిపించాలని కూడా (ఆజ్ఞ ఇవ్వబడింది). కావున మార్గదర్శకత్వం పొందినవాడు తన మేలుకే, మార్గదర్శకత్వం పొందుతాడు. మరియు మార్గభ్రష్టుడైన వాడితో అను: "నిశ్చయంగా, నేను హెచ్చరిక చేసేవాడను మాత్రమే!"

93. వారితో (ఇంకా) ఇలా అను: "సర్వస్తోత్రాలకు అర్హుడు అల్లాహ్ మాత్రమే! త్వరలోనే ఆయన మీకు తన సూచనలను చూపుతాడు, అప్పుడు

---

[45] చూడండి, 21:103.

[46] చూడండి, 3:96 'హర్రమహ్: అంటే ఈ నగరంలో రక్తప్రసారం (హత్యచేయటం, ఇతరులపై దౌర్జన్యం, అన్యాయం చేయటం, వేటాడటం, చెట్లను నరకటం, ముల్లు కూడా తెంపటం నిషేధించబడింది. ('స'హీ'హ్ బు'ఖారీ).

మీకు తెలుస్తుంది[47]. మరియు మీరు చేస్తున్న కార్యాలను నీ ప్రభువు ఎరుగకుండా లేడు!"

[47] చూడండి, 41:53.

# 28. అల్-ఖసస్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. తా-సీన్-మీమ్[1].
2. ఇవి స్పష్టమైన గ్రంథ సూచనలు (ఆయాత్)[2].
3. విశ్వసించే ప్రజల కొరకు, మేము మూసా మరియు ఫిర్ఔన్ ల యొక్క నిజ వృత్తాంతాన్ని నీకు వినిపిస్తున్నాము.
4. నిశ్చయంగా, ఫిర్ఔన్ భూమి మీద అహంకారంతో ప్రవర్తిస్తూ ఉండేవాడు. మరియు అందులోని ప్రజలను వర్గాలుగా విభజించి, వారిలోని ఒక తెగవారిని నీచపరచి వారి పుత్రులను వధిస్తూ ఉండేవాడు[3] మరియు వారి స్త్రీలను బ్రతకనిచ్చేవాడు. నిశ్చయంగా, అతడు దౌర్జన్యపరులలోని వాడిగా ఉండేవాడు.
5. మరియు భూమి మీద అణచి వేయబడిన వారిని కనికరించాలని మరియు వారిని నాయకులుగా చేయాలని మరియు వారిని వారసులుగా చేయాలని మేము కోరాము[4].

---

[*] [అల్-ఖసస్ అంటే గాథలు, ఇతిహాసములు, వృత్తాంతములు]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

[2] చూడండి, 12:1.

[3] వీరు ఇస్రాయీ'ల్ సంతతివారు. ఫిర్'ఔన్ జాతివారు వీరిని బానిసలుగా చేసి హింసించే వారు.

[4] చూడండి, 7:137.

6. మరియు (ఇస్రాయీల్ సంతతి) వారికి భూమిలో అధికారం ఒసంగాలనీ[5] మరియు ఫిర్ఔన్, హామాన్[6] మరియు వారి సైనికులకు - దేనిని గురించైతే (ఫిర్ఔన్ జాతి) వారు భయపడుతూ ఉండేవారో[7] - అదే వారికి చూపాలని!

7. మేము మూసా తల్లి మనస్సులో ఇలా[8] సూచించాము: "నీవు అతనికి (మూసాకు) పాలు ఇస్తూ ఉండు. కాని అతనికి ప్రమాదమున్నదని, నీవు భావిస్తే అతనిని నదిలో విడిచి పెట్టు[9]. మరియు నీవు భయపడకు మరియు దుఃఖించకు; నిశ్చయంగా మేము అతనిని నీ వద్దకు తిరిగి చేర్చుతాము. మరియు అతనిని (మా) సందేశహరులలో ఒకనిగా చేస్తాము!"

8. తరువాత ఫిర్ఔన్ కుటుంబంవారు[10] - తమకు శత్రువై, దుఃఖకారణుడవటానికి - అతనిని ఎత్తుకున్నారు. నిశ్చయంగా ఫిర్ఔన్, హామాన్ మరియు వారి సైనికులు పాపిష్ఠులు!

9. మరియు ఫిర్ఔన్ భార్య (అతనితో) ఇలా అన్నది:

---

[5] ఇక్కడ అ'ర్దున్, భూమి అంటే కనాన్ (షామ్).

[6] హామాన్, ఫిర్'ఔన్ యొక్క ముఖ్య నాయకుడు. చూడండి, 40:36-37.

[7] అంటే, ఇస్రాయీ'ల్ సంతతివారి ద్వారా తమ నాశనం కావచ్చనే ఏ భయం వల్లనైతే ఫిర్'ఔన్ జాతి వారు ఇస్రాయీ'ల్ సంతతివారి మగసంతానాన్ని హత్య చేస్తూ ఉండేవారో - దానినే వారికి సత్యం చేసి చూపటానికి

[8] వ'హీ: అంటే ఇక్కడ ఆమె మనస్సులో ఆలోచన పుట్టించడం.

[9] చూడండి, 20:39.

[10] అంటే ఫిర్'ఔన్ భార్య. ఇంకా చూడండి, 66:11.

"ఇతను నీకూ మరియు నాకూ కంటి చలువ! ఇతనిని చంపకు, బహుశా ఇతడు మనకు ఉపయోగకారి కావచ్చు![11] లేదా మనం ఇతనిని కుమారునిగా చేసుకోవచ్చు!" కాని వారు (వాస్తవాన్ని) తెలుసుకోలేక పోయారు.

10. మరియు మూసా తల్లి హృదయం తల్లడిల్లిపోయింది. ఆమె విశ్వసించినవారిలో ఉండటానికి మేము, ఆమె హృదయాన్ని దృఢపరచి ఉండకపోతే, ఆమె అతనిని (మూసాను) గురించి అంతా బట్టబయలు చేసి ఉండేది.

11. ఆమె, అతని (మూసా) సోదరితో[12] అన్నది: "అతని వెంట వెళ్ళు." కావున ఆమె దూరం నుండియే అతనిని గమనించసాగింది. కానీ, వారది గ్రహించలేక పోయారు.

12. మరియు మేము అతనిని (ఇతరుల) పాలు త్రాగకుండా మొదటనే నిషేధించి ఉన్నాము. (అతని సోదరి) వారితో అన్నది: "మీ కొరకు అతనిని (పాలిచ్చి) పోషించగల ఒక కుటుంబం వారిని నేను మీకు చూపనా? మరియు వారు అతనిని మంచిగా చూసుకునే వారై ఉంటారు."

13. ఈ విధంగా మేము అతనిని (మూసాను) - అతని

---

[11] వారికి సంతానం లేనందుకు ఆమె అతనిని ('అ.స.ను) కుమారునిగా చేసుకోదలచింది.

[12] మూసా('అ.స.) సోదరీమణి పేరు మర్యమ్ బిన్తె 'ఇమ్రాన్ మరియు 'ఈసా ('అ.స.) తల్లి పేరు కూడా మర్యమ్ బిన్తె 'ఇమ్రాన్.

తల్లి కళ్ళు చల్లబడటానికి, ఆమె దుఃఖించకుండా ఉండటానికి మరియు అల్లాహ్ వాగ్దానం సత్యమైనదని ఆమె తెలుసు కోవటానికి - తిరిగి ఆమె వద్దకు చేర్చాము. కాని వాస్తవానికి చాలామందికి ఇది తెలియదు.

**14.** మరియు అతను (మూసా) యుక్తవయస్సుకు చేరి పరిపూర్ణుడు అయినప్పుడు, మేము అతనికి వివేకాన్ని మరియు జ్ఞానాన్ని ప్రసాదించాము. మరియు ఈ విధంగా, మేము సజ్జనులకు ప్రతిఫలాన్ని ఇస్తూ ఉంటాము[13].

**15.** మరియు (ఒకరోజు) నగరవాసులు ఏమరుపాటులో ఉన్నప్పుడు, అతను నగరంలోకి ప్రవేశించాడు, అతను ఇక్కడ ఇద్దరు వ్యక్తులు పోట్లాడుకోవడం చూశాడు, వారిలో ఒకడు అతని జాతికి చెందినవాడు, మరొకడు విరోధి జాతికి చెందినవాడు. అతని జాతికి చెందిన వాడు, విరోధి జాతివానికి వ్యతిరేకంగా సహాయపడమని అతనిని (మూసాను) అర్థించాడు. మూసా అతడిని ఒక గుద్దుగుద్దాడు. అది అతడిని అంతమొందించింది. (అప్పుడు) అతను (మూసా) అన్నాడు: "ఇది షైతాన్ పనే! నిశ్చయంగా, అతడు శత్రువు

[13] చూడండి, 12:22.

మరియు స్పష్టంగా దారి తప్పించేవాడు."[14]

16. (మూసా) ఇలా ప్రార్థించాడు: "ఓ నా ప్రభూ! నాకు నేను అన్యాయం చేసుకున్నాను. కావున నన్ను క్షమించు!" (అల్లాహ్) అతనిని క్షమించాడు. నిశ్చయంగా, ఆయన క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత[15].

17. (మూసా) అన్నాడు: "ఓ నా ప్రభూ! నీవు నాకు మహోపకారం చేశావు. కావున నేను ఇక ఎన్నటికీ నేరస్తులకు సహాయపడను!"

18. మరుసటి రోజు ఉదయం అతను (మూసా) భయపడుతూ అతని జాగ్రత్తగా (ఇటూ అటూ చూస్తూ) నగరంలోకి వెళ్ళాడు. అప్పుడు అకస్మాత్తుగా అంతకు ముందు రోజు, అతనిని సహాయానికి పిలిచినవాడే, మళ్ళీ సహాయానికై అరవసాగాడు. మూసా వానితో అన్నాడు: "నిశ్చయంగా, నీవు స్పష్టమైన తప్పు దారికి లాగేవాడవు!"[16]

---

[14] దైవప్రవక్త ప్రవచనం: 'తెగలకొరకు, తెగల పేరట కృషిచేసేవాడూ మరియు తెగల కొరకు పోరాడే వాడూ మరియు తెగల కొరకు మరణించేవాడూ మాలోనివాడుకాడు!' (అబూ దావూద్ - 'జుబైర్ ఇబ్నె మత్'ఇమ్ - కథనం ఆధారంగా) దీని భావం అడుగగా అతను ('స'అస) అన్నారు: 'అన్యాయ విషయంలో తమ వారికి సహాయపడటం.'

[15] ఉద్దేశ్యపూర్వకంగా చంపకున్నా, ఒక మానవుని హత్య జరిగింది. దానికి మూసా ('అ.స.) పశ్చాత్తాప పడి క్షమాపణ వేడుకుంటే, అల్లాహ్ (సు.తా.) అతనిని క్షమించాడు.

[16] ఇబ్నె 'అబ్బాస్ మరియు ముఖాతిల్ (ర'ది.'అన్హుమ్) ల కథనం ప్రకారం ఆ ఇస్రాయీ'ల్ వంశీయుడు సత్యతిరస్కారి.

19. ఆ తరువాత అతను తమ ఇద్దరికీ విరోధి అయిన వాడిని గట్టిగా పట్టుకోబోగా, అతడు అరిచాడు: "ఓ మూసా! ఏమీ? నీవు నిన్న ఒక వ్యక్తిని చంపినట్లు నన్ను కూడా చంపదలచు కున్నావా? నీవు ఈ దేశంలో క్రూరునిగా మారి ఉండదలుచుకున్నావా? సద్వర్తనునిగా ఉండ దలుచు కోలేదా?"

20. మరియు ఒక వ్యక్తి నగరపు ఒక వైపు నుండి పరిగెత్తుకుంటూ వచ్చి ఇలా అన్నాడు: ఓ మూసా! నాయకులందరూ కలిసి నిన్ను హత్య చేయాలని సంప్రదింపులు చేస్తున్నారు. కావున నీవు వెళ్ళిపో, నేను నిశ్చయంగా, నీ శ్రేయోభిలాషిని!"

21. అప్పుడతను భయపడుతూ, అతి జాగ్రత్తగా అక్కడి నుండి బయలు దేరాడు. అతను ఇలా ప్రార్థించాడు: "ఓ నా ప్రభూ! నన్ను దుర్మార్గుల నుండి కాపాడు!"

22. ఆ తరువాత మద్ యన్ వైపుకు బయలు దేరుతూ, ఇలా అనుకున్నాడు: "బహుశా, నా ప్రభువు నాకు సరైన మార్గం వైపునకు మార్గదర్శకత్వం చేస్తున్నాడు!"[17]

23. అతను మద్ యన్ లోని ఒక బావి వద్దకు

---

[17] మద్'యన్ అక్కడ నివసించే ప్రజల తెగ పేరు వారు అమోరైట్(Amorite) తెగకు చెందిన 'అరబ్బులు. యూదుల సంతతితో వారికి దగ్గరి సంబంధం ఉండెను. చూడండి, 7:8. ఇబ్రాహీమ్ ('అ.స.) కుమారుడైన ఇస్'హాఖ్('అ.స.) యొక్క కుమారుడగు య'అఖూబ్('అ.స.) మరొక పేరు ఇస్రాయీ'ల్. ఆ పేరుతోనే పిలువబడే అతని పన్నెండుమంది కుమారుల సంతతివారే ఇస్రాయీ'ల్ సంతతివారు (బనీ ఇస్రాయీ'ల్)

చేరుకున్నప్పుడు; అక్కడ చాలామంది ప్రజలు, తమ తమ పశువులకు నీరు త్రాగించటాన్ని మరియు వారికి దూరంగా ఒక ప్రక్కన ఇద్దరు స్త్రీలు తమ పశువులను ఆపుతూ ఉండటాన్ని చూశాడు. (మూసా) ఆ స్త్రీలను అడిగాడు: "మీరిద్దరి చిక్కు ఏమిటి?" వారిద్దరన్నారు: "ఈ పశువుల కాపరులంతా పోయే వరకు మేము (మా పశువులకు) నీరు త్రాపలేము. మరియు మా తండ్రి చాలా వృద్ధుడు"

24. అప్పుడు అతను వారిద్దరి పశువులకు నీరు త్రాపాడు. తరువాత నీడలోకి పోయి ఇలా ప్రార్థించాడు: "ఓ నా ప్రభూ! నీవు నాపై ఏ మేలును అవతరింపజేసినా, నేను దాని ఆవశ్యకత గలవాడనే!"

25. తరువాత ఆ ఇద్దరిలో ఒకామె సిగ్గుపడుతూ మెల్లగా అతని వద్దకు వచ్చి ఇలా అన్నది: "వాస్తవానికి నా తండ్రి - నీవు మా కొరకు (మా పశువులకు) నీరు త్రాపించినందుకు – ప్రతిఫల మివ్వటానికి, నిన్ను పిలుస్తున్నాడు."[18] అతను, అతని వద్దకు పోయి తన వృత్తాంతాన్ని

---

[18] ఆ ఇద్దరు స్త్రీల తండ్రి పేరు ఖుర్ఆన్ పేర్కొనలేదు. ఇమామ్ షౌకాని మరియు ఇతర చాలామంది వ్యాఖ్యాతలు అతని పేరు షు'ఐబ్ ('అ.స.) అని అన్నారు. ఎందుకంటే అతను మద్ యన్ జాతి వారివైపునకే ప్రవక్తగా పంపబడి ఉండెను. కాని ఇబ్నె-కసీ'ర్ అభిప్రాయం వేరుంది. అతను అంటారు: 'షు'ఐబ్ ('అ.స.) మరియు మూసా ('అ.స.) కాలాలలో చాలా గడువు ఉంది. కాబట్టి ఇతను షు'ఐబ్ ('అ.స.) తెగకు చెందిన మరొక వ్యక్తి కావచ్చు.' అల్లాహు ఆలమ్.

వినిపించాడు. అప్పుడతను అన్నాడు: "నీవు ఏ మాత్రం భయపడకు. నీవు దుర్మార్గ ప్రజల నుండి విముక్తి పొందావు."

**26.** వారిద్దరిలో ఒకామె ఇలా అన్నది: "నాన్నా! ఇతనిని పని కొరకు పెట్టుకో. నిశ్చయంగా, ఇలాంటి బలవంతుని మరియు నమ్మదగినవానిని పనికొరకు పెట్టుకోవటం ఎంతో మేలైనది"

**27.** (వారి తండ్రి) అన్నాడు: "నీవు నా వద్ద ఎనిమిది సంవత్సరాలుపనిచేస్తూఉండటానికిఒప్పుకుంటే, నేను నా ఈ ఇద్దరు కుమార్తెలలో ఒకామెను నీకిచ్చి వివాహం చేయగోరు తున్నాను[19]. నీవు ఒకవేళ పది సంవత్సరాలు పూర్తి చేయదలిస్తే అది నీ ఇష్టం! నేను నీకు కష్టం కలిగించ దలచుకోలేదు. అల్లాహ్ కోరితే, నీవు నన్ను సద్వర్తనునిగా పొందుతావు!"

**28.** (మూసా) అన్నాడు: "ఈ విషయం నీకూ మరియు నాకూ మధ్య నిశ్చయమే! ఈ రెండు గడువులలో నేను దేనిని పూర్తి చేసినా, నా పై ఎలాంటి ఒత్తిడి ఉండకూడదు. మరియు మన ఈ

---

[19] మన సాంఘిక సంప్రదాయంలో ఆడబిడ్డ (వధువు) ఇంటివారు తమ బిడ్డ కొరకు వరుని (పెండ్లి కుమారుని) వారితో వివాహసంబంధం గురించి మొదట మాట ప్రారంభించటం అనుచితమైన విషయంగా భావిస్తారు. కాని అల్లాహ్ (సు.తా.) షరీయత్ లో ఇది అనుచితం కాదు. ఒకవేళ సద్వర్తనుడు, సుశీలుడు అయిన వరుడు ఉంటే అతనితో గానీ, లేక అతని కుటుంబంవారితో గానీ, వధువు ఇంటివారు మాట్లాడితే తప్పులేదు. దైవప్రవక్త ('స'అస) మరియు సహాబీల (ర'ది.'అన్హుమ్)లలో కూడా ఈ ఆచారం ఉండెను.

మాటలకు అల్లాహ్ యే సాక్షి!"

29. ఆ తరువాత మూసా తన గడువు[20] పూర్తి చేసి, తన కుటుంబం వారిని తీసుకొని పోతుండగా, తూర్ పర్వతపు దిక్కులో ఒక మంటను చూశాడు. (అప్పుడు) తన ఇంటి వారితో అన్నాడు: "ఆగండి! నేను ఒక మంటను చూశాను, బహుశా! నేను అక్కడి నుండి ఏదైనా మంచి వార్తను తీసుకొని రావచ్చు లేదా ఒక అగ్ని కొరవినైనా! అప్పుడు మీరు దానితో చలి కాచు కోవచ్చు."

30. కాని అతను దాని (అగ్ని) వద్దకు చేరుకున్నప్పుడు[21], ఆ లోయ కుడివైపు ఉన్న ఒక శుభవంతమైన స్థలములో ఉన్న ఒక చెట్టు నుండి: "ఓ మూసా! నిశ్చయంగా, నేనే అల్లాహ్ ను! సర్వలోకాల ప్రభువును." అనే మాటలు వినిపించాయి.

31. (ఇంకా ఇలా వినిపించింది): "నీ చేతికర్రను పడవేయి!" అతను (మూసా) దానిని పాము వలే కదలటం చూసి వెనక్కి మరలి పరుగెత్తాడు, తిరిగి కూడా చూడలేదు. (తరువాత ఇలా సెలవీయ బడింది): "ఓ మూసా, ముందుకు రా, భయపడకు! నిశ్చయంగా, నీవు సురక్షితంగా

---

[20] ఇబ్నె 'అబ్బాస్ (ర'ది.'అ.) కథనం ప్రకారం అతను ఈ గడువు పది సంవత్సరాలు పూర్తి చేశారు. ఎందుకంటే మూసా ('అ.స.) వృద్ధుడైన తన భార్య తండ్రికి సహాయపడగోరారు. చూడండి, 27:7-8.

[21] ఆ మంట వాస్తవానికి అల్లాహ్ (సు.తా.) దివ్యజ్యోతి. చూడండి, 19:52, 20:80.

ఉన్నావు!

**32.** నీ చేతిని నీ చంకలోకి దూర్చుకో, అది ఎలాంటి లోపం లేకుండా ప్రకాశిస్తూ బయటికి వస్తుంది[22]. నీవు భయపడకుండా ఉండటానికి నీ చేతిని నీ ప్రక్కకు అదుముకో! ఈ రెండు, నీవు ఫిర్ఔన్ మరియు అతని నాయకులకు (చూపటానికి) నీ ప్రభువు ప్రసాదించిన నిదర్శనాలు (ఆయాత్). నిశ్చయంగా వారు చాలా దుష్టులయి పోయారు!"

**33.** (మూసా) అన్నాడు: "ఓ నా ప్రభూ! నేను వారి మనిషిని ఒకనిని చంపాను. కావున వారు నన్ను చంపుతారేమోనని భయపడుతున్నాను.

**34.** మరియు నా సోదరుడు హారూన్ మాట్లాడటంలో నా కంటే మంచి వాగ్ధాటి గలవాడు[23]. నన్ను సమర్థించటానికి అతనిని నాకు సహాయకునిగా నాతో పాటు పంపు. వాస్తవానికి వారు నన్ను అసత్యవాదివని తిరస్కరిస్తారేమోనని నేను భయపడుతున్నాను!"

**35.** ఆయన (అల్లాహ్) అన్నాడు: "మేము నీ సోదరుని ద్వారా నీ చేతులను బలపరుస్తాము. మరియు మేము మీ ఇద్దరికీ విశేష శక్తి నొసంగుతాము. వారు మీ ఇద్దరికి ఏ మాత్రం హాని చేయలేరు. మా సూచనల ద్వారా మీరిద్దరూ మరియు మిమ్మల్ని అనుసరించే వారు

[22] చూడండి, 7:108.
[23] చూడండి, 20:27-28 మరియు 26:12-13

గెలుపొందుతారు."[24]

36. ఆ తరువాత మూసా మా స్పష్టమైన సూచనలను తీసుకొని వారి వద్దకు పోగా వారన్నారు: "ఇది కల్పితమైన మాయాజాలం మాత్రమే[25]. ఇలాంటిది పూర్వీకులైన మా తాతముత్తాతల కాలంలో కూడా జరిగినట్లు మేము వినలేదు."[26]

37. ఇక మూసా అన్నాడు: "నా ప్రభువు తరఫు నుండి ఎవడు మార్గదర్శకత్వం తీసుకొని వచ్చాడో మరియు చివరికి ఎవరి పర్యవసానం మంచిదవుతుందో ఆయనకు బాగా తెలుసు[27]. నిశ్చయంగా, దుర్మార్గులు ఎన్నడూ సాఫల్యం పొందలేరు."

38. మరియు ఫిర్ఔన్ అన్నాడు: "ఓ నాయకులారా! నేను తప్ప మీకు మరొక ఆరాధ్య దేవుడు గలడని నాకు తెలియదు[28]. కావున ఓ హామాన్! కాల్చిన మట్టి ఇటుకలతో నాకొక ఎత్తైన గోపురాన్ని నిర్మించు. దానిపై ఎక్కి నేను బహుశా, మూసా దేవుణ్ణి చూడగలనేమో! నిశ్చయంగా, నేను ఇతనిని అసత్యవాదిగా భావిస్తున్నాను."

39. మరియు, అతడు మరియు అతడి సైనికులు

---

[24] ఆ వాక్యం ఖుర్ఆన్ లో ఎన్నోసార్లు వచ్చింది. చూడండి, 5:67, 33:39, 51:21, 40:51-52..

[25] చూడండి, 74:24.

[26] చూడండి, 38:5.

[27] పరలోక సాఫల్యమే నిజమైన సాఫల్యం. సత్యతిరస్కారులు ఇహలోకంలో సాఫల్యం పొందవచ్చు. భూలోకంలో దొరికే సుఖసంతోషాలు తాత్కాలికమైనవే! వాస్తవానికి పరలోక సుఖసంతోషాలే చిరకాలముండేవి.

[28] చూడండి, 79:24.

భూమిపై అన్యాయంగా అహంభావాన్ని ప్రదర్శించారు. మరియు నిశ్చయంగా మాపైపుకు తాము ఎన్నడూ మరలిరారని భావించారు

40. కావున మేము అతనిని మరియు అతని సేనలను పట్టుకొని సముద్రంలోకి విసరివేశాము. ఇక చూడు! దుర్మార్గుల పర్యవసానం ఏమయిందో!

41. మరియు మేము వారిని నరకం వైపునకు పిలిచే నాయకులుగా చేశాము. మరియు పునరుత్థాన దినమున వారికెలాంటి సహాయం దొరకదు.

42. మరియు మేము ఈ లోకంలో కూడా అభిశాపం వారిని వెంటాడేటట్లు చేశాము. మరియు పునరుత్థాన దినమున వారు తృణీకరింప బడేవారిలో చేరుతారు.

43. మరియు వాస్తవానికి - పూర్వతరాల వారిని నాశనం చేసిన తరువాత – మేము మానవులకు జ్ఞానవృద్ధి చేయటానికి మరియు వారికి మార్గదర్శకత్వంగా కారుణ్యంగా ఉండ టానికి, మూసాకు గ్రంథాన్ని ప్రసాదించాము. బహుశా వారు హితబోధ నేర్చుకుంటారని!

44. మరియు (ఓ ముహమ్మద్!) మేము మూసాపై మా ఆదేశం (తౌరాత్) పూర్తిగా అవతరింప జేసినపుడు, నీవు (తూర్ పర్వతపు) కుడి వైపునా లేవు. మరియు నీవు అక్కడ ప్రత్యక్ష సాక్షులలో కూడా లేవు!

45. కాని నిశ్చయంగా, (ఆ తరువాత కూడా) మేము అనేక తరాలను ప్రభవింపజేశాము. వారి మీదుగా

ఒక సుదీర్ఘకాలం గడిచి పోయింది. మా సూచనలను వినిపించటానికి నీవు మద్'యన్ వాసులతో కూడా లేవు, కాని మేము (ఎల్లప్పుడూ) మా సందేశహరులను పంపుతూ వచ్చాము.

46. మరియు మేము (మూసాను) పిలిచినపుడు, నీవు (ఓ ముహమ్మద్!) తూర్ పర్వతం దగ్గర లేవు. కాని నీవు నీ ప్రభువు యొక్క కారుణ్యంతో, నీకు పూర్వం హెచ్చరిక చేసేవాడు రానటు వంటి జాతివారిని హెచ్చరించటానికి - బహుశా వారు హితబోధ నేర్చుకుంటారేమోనని - (పంపబడ్డావు).

47. మరియు వారు తమ చేతులారా, చేసుకొని పంపిన కర్మల ఫలితంగా వారిపై ఆపద వచ్చి పడినపుడు, వారు: "ఓ మా ప్రభూ! నీవు మా వద్దకు ఒక సందేశహరుణ్ణి ఎందుకు పంపలేదు, అలా చేస్తే మేము నీ సూచనలను అనుసరిస్తూ, విశ్వాసులైన వారిలో చేరి ఉండేవారం కదా!" (అని తీర్పు దినమున అనకూడదని).

48. ఆ తర్వాత మా తరఫు నుండి వారి వద్దకు సత్యం వచ్చినపుడు, వారిలా అన్నారు: "మూసాకు ఇవ్వ బడినటువంటిది, ఇతనికి ఎందుకు ఇవ్వబడలేదు!" ఏమీ? దీనికి పూర్వం మూసాకు ఇవ్వబడిన దానిని వారు తిరస్కరించలేదా? వారన్నారు: "రెండూ మాయాజాలాలే! అవి ఒకదాని కొకటి సహాయపడుతున్నాయి." ఇంకా ఇలా అన్నారు: "నిశ్చయంగా, మేము వీటన్నింటినీ తిరస్కరిస్తున్నాము."

49. (ఓ ప్రవక్తా!) వారితో ఇలా అను: "మీరు నిజాయితీపరులే అయితే, అల్లాహ్ దగ్గర నుండి ఈ రెండింటి కంటే ఉత్తమమైన మార్గం చూపే ఒక గ్రంథాన్ని తీసుకురండి. దానిని నేను అనుసరిస్తాను."

50. వారు నీకు ఎలాంటి సమాధానం ఇవ్వకపోతే, వారు కేవలం తమ కోరికలను అనుసరిస్తున్నారని తెలుసుకో! మరియు అల్లాహ్ మార్గదర్శకత్వాన్ని విడిచి కేవలం తన కోరికలను అనుసరించే వాని కంటే ఎక్కువ మార్గభ్రష్టుడు ఎవడు? నిశ్చయంగా అల్లాహ్ దుర్మార్గులకు మార్గదర్శకత్వం చేయడు.

51. మరియు వారు హితబోధ పొందాలని, వాస్తవంగా మేము ఈ వచనాన్ని (ఖుర్ఆన్ ను) క్రమక్రమంగా అందజేశాము.

52. ఎవరికైతే పూర్వం మేము గ్రంథాన్ని ఇచ్చామో వారు దీనిని (ఖుర్ఆన్ ను) విశ్వసిస్తారు[29].

53. మరియు వారికి ఇది వినిపించబడినప్పుడు, వారు ఇలా అంటారు: "మేము దీనిని విశ్వసించాము, నిశ్చయంగా ఇది మా ప్రభువు తరఫు నుండి వచ్చిన సత్యం. నిశ్చయంగా, మేము మొదటి నుండియో అల్లాహ్ కు

---

[29] అంటే యూదులలో 'అబ్దుల్లాహ్ బిన్-సల్లామ్ మరియు 'హబష నుండి వచ్చిన క్రైస్తవులు (ర'.ది.'అన్హుమ్). చూడండి, 26:196-197.

విధేయులమై (ముస్లింలమై) ఉన్నాము."[30]
54. వీరే, తమ సహనానికి ఫలితంగా రెండింతలు

---

[30] ఈ విషయం ఖుర్ఆన్ లో ఎన్నోసార్లు వచ్చింది. దైవప్రవక్తలందరూ ప్రచారం చేసిన ధర్మం ఇస్లాం మాత్రమే. అంటే ఏకైక ఆరాధ్యుడు అల్లాహ్ (సు.తా.) కు తప్ప ఇతరులకు దాస్యం, ఆరాధన చేయరాదని. ప్రతికాలపు వారు తమతమ భాషలలో దానికి వివిధ పేర్లు ఇచ్చారు. అంటే క్రైస్తవధర్మం, యూదధర్మం, మొదలైనవి. కాని వాస్తవానికి ప్రవక్తలందరి ధర్మం ఇస్లాం మాత్రమే. అంటే అల్లాహ్ (సు.తా.) కు విధేయులై కేవలం ఆయనకే దాస్యం, ఆరాధన చేయటం. కాని ఆ ప్రాచీన దివ్యగ్రంథాలు ఆయా ప్రవక్తల ప్రచారానికి ఎన్నో వందల సంవత్సరాల తరువాత లిఖిత రూపంలోకి వచ్చాయి. దాని వల్ల వాటిని లిఖించిన వారు, తమ ప్రవక్తుల వినిపించిన దివ్యసందేశాలను వాటి అసలు అవతరించిన రూపంలో వ్రాయలేక పోయారు. తరువాత తరాల ధర్మవేత్తలు మొదటి వారు వ్రాసిన వాటితో ఏకీభవించక వాటిలో మార్పులు చేస్తూ పోయారు. ఉదాహరణకు: ఈ రోజు ప్రపంచంలో అన్నింటికంటే ఎక్కువ ప్రామాణికమైనదిగా పరిగణించబడే బైబిల్ - ఏదైతే తౌరాత్, 'జబూర్ మరియు ఇంజీల్ గ్రంథా(Old and New Testaments)ల సముదాయమో - అందులో కూడా ఎన్నోసార్లు మార్పులు చేయబడ్డాయి. చివరి మార్పులు గలది, ఈనాటి (Revised) Authorized K.J.V. అందుకే అసలు ఆ ప్రవక్తలు ప్రచారం చేసింది, ఏకైక ఆరాధ్యుడైన అల్లాహ్ (సు.తా.) ఆరాధన. అయినా ఈనాడు వాటిలో మానవులు మార్పులు చేయడం వల్ల, ఆ గ్రంథాలను అనుసరిస్తున్నారు ఏకైక ఆరాధ్యుడైన అల్లాహ్ (సు.తా.) ఆరాధనను వదలి, బహుదైవారాధన, ప్రవక్తల విగ్రహాల ఆరాధన చేస్తున్నారు. కాని ఇస్లాం స్వీకరించిన యూదులు మరియు క్రైస్తవులు సత్యాన్ని తెలుసుకొని: 'మేము మొదటి నుండియే ముస్లింలముగా ఉన్నాము' అని అన్నారు. ఏకైక ఆరాధ్యుడైన అల్లాహ్ (సు.తా.) ఆరాధనయే సత్యధర్మమని, ఇస్లాం ధర్మాన్ని స్వీకరించారు.

ప్రతిఫలమొసంగపడే వారు[31]. వీరే మంచితో చెడును నివారించేవారు. మరియు మేము వారికిచ్చిన జీవనోపాధి నుండి ఖర్చు చేసేవారు.

**55.** మరియు వారు వ్యర్థమైన మాటలు విన్నప్పుడు, ఇలా అంటూ దూరంగా తొలగి పోతారు: "మాకు మాకర్మలు మరియు మీకు మీకర్మలు, మీకు సలాం![32] మాకు మూర్ఖులతో పనిలేదు."

**56.** (ఓ ప్రవక్తా!) నిశ్చయంగా నీవు, నీకు ఇష్టమైన వారికి మార్గదర్శకత్వం చేయలేవు, కాని అల్లాహ్ తాను కోరిన వారికి మార్గదర్శకత్వం చేస్తాడు. మరియు ఆయనకు మార్గదర్శకత్వం పొందే వారెవరో బాగా తెలుసు[33].

**57.** వారు ఇలా అంటారు: "ఒకవేళ నీతో పాటు మేము కూడా ఈ మార్గదర్శకత్వాన్ని అవలంబిస్తే! మేము

---

[31] సహనం వహించటం అంటే, ఇక్కడ దైవప్రవక్తలను మరియు దివ్యగ్రంథాలను విశ్వసించి ఆ విశ్వాసంపై స్థిరంగా ఉండటం. మొదటి దివ్యగ్రంథం మీద స్థిరంగా ఉండి, రెండవ దివ్యగ్రంథం వస్తే దానిని అనుసరించటం. ఇలాంటి వారికి రెండింతలు ప్రతిఫలముంది. రెండింతలు ప్రతిఫలం పొందే ముగ్గురిలో వీరొకరు. ('స.బు'ఖారీ) చూ. 13:22.

[32] ఈ సలాం అభివందనం కాదు. మేము మీవంటి మూర్ఖులతో వాదులాడమని తప్పించుకోవటానికి పలికేది. చూడండి, 25:63, 43:89.

[33] ఈ ఆయత్ దైవప్రవక్త ('స'అస) పినతండ్రి అబూ 'తాలిబ్ మరణించినప్పుడు అవతరింప జేయబడింది. అతని ఆఖరు ఘడియలలో దైవప్రవక్త ('స'అస) అతనితో అన్నారు: "ఇప్పుడైనా: 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అను. దానితో నేను పునరుత్థానదినమున నీ క్షమాపణ కొరకు అల్లాహ్ (సు.తా.) ను వేడుకోగలను." అక్కడున్న ఖురైష్ సర్దారులను చూసి అతను అలా అనలేదు. ('స'హీ'హ్ బు'ఖారీ) ఇంకా చూ. 14:4.

మా భూమి నుండియే పారద్రోలబడతాము."[34]
ఏమీ? మేము వారిని శాంతికి నిలయమైన ఒక పవిత్ర స్థలం (మక్కా) లో స్థిరనివాసము నొసంగి వారికి మా తరఫు నుండి జీవనోపాధిగా అన్ని రకాల ఫలాలను సమకూర్చలేదా? కాని వాస్తవానికి వారిలో చాలా మందికి ఇది తెలియదు[35].

58. మరియు మేము ఎన్నో నగరాలను, జీవన సుఖసంపదలతో ఉప్పొంగిపోతూ ఉండగా, వాటిని నాశనం చేయలేదా! అవిగో వారి నివాసాలు, వారి తరువాత వాటిలో నివసించిన వారు చాలా తక్కువ! మరియు నిశ్చయంగా, మేమే వాటికి వారసులయ్యాము[36].

59. మరియు నీ ప్రభువు నగరాలను ఏ మాత్రమూ నాశనం చేసేవాడు కాదు, ఎంత వరకైతే వాటి ముఖ్యనగరానికి మా సూచన (ఆయాత్) లను వినిపించే సందేశహరులను పంపమో! మేము

---

[34] దీనిని ఈ విధంగా బోధించారు: 1) ఆ కాలపు ఖురైషులు ఇస్లాం స్వీకరిస్తే, వారి తోటి వారు, వారిని మతద్రోహులుగా పరిగణించి వారిని, వారి నగరం మక్కా నుండి పారద్రోలుతారని భయపడ్డారు. 2) అదే విధంగా ఈ కాలంలో కూడా చాలామంది ఇది సత్యధర్మమని తెలిసి కూడా తమ బంధువుల నుండి మరియు తమ సమాజం నుండి విడదీయబడతామని భయపడి సత్యాన్ని అవలంబించరు. కాని రాబోయే పరలోక జీవితపు శాశ్వత సుఖాల ముందు ఈ జీవిత సుఖం అతి స్వల్పమైనదనే సత్యాన్ని వారు అర్థం చేసుకుంటే ఎంత బాగుండేది!

[35] చూడండి, 14:35-41, 21:26, 29:67. 22. ఇబ్రాహీం ('అ.స.) మక్కా కొరకు చేసిన ప్రార్థన.

[36] చూడండి, 15:23.

నగరాలను వాటి ప్రజలు దుర్మార్గులై పోతే తప్ప, నాశనం చేసే వారం కాము[37].

60. మరియు మీకు ఇవ్వబడిన వన్నీ ఈ ప్రాపంచిక జీవితపు సుఖసంతోషాల సామాగ్రి మరియు దాని అలంకరణలు మాత్రమే! కాని అల్లాహ్ వద్ద ఉన్నది దీని కంటే ఎంతో ఉత్తమమైనది మరియు నిత్యమైనది. ఏమీ? మీరిది అర్థం చేసుకోలేరా?[38]

61. ఏమీ? మేము చేసిన మంచి వాగ్దానాన్ని తప్పకుండా పొందేవాడు[39], మేము ఒసంగిన ఈ ప్రాపంచిక సుఖసంతోషాలు పొంది, పునరుత్థాన దినమున మా ముందు (శిక్షకై) హాజరు చేయబడే వాడితో సమానుడు కాగలడా?

62. మరియు (జ్ఞాపకముంచుకోండి!) ఆ రోజు ఆయన (అల్లాహ్) వారిని పిలిచి ఇలా ప్రశ్నిస్తాడు: "మీరు నా భాగస్వాములని నొక్కి చెప్పినవారు

---

[37] సందేశహరులు ఎల్లప్పుడూ పెద్ద నగరాలలోనే పంపబడ్డారు. వారే దాని చుట్టూ ఉన్న చిన్న గ్రామాల వారికి కూడా ప్రచారం చేశారు. కేవలం సత్యతిరస్కారులుగా ఉన్నంత మాత్రాన, ఏ నగరవాసులు కూడా నాశనం చేయబడలేదు. సత్యతిరస్కారంతో బాటు వాటిలోని ప్రజలు దుర్మార్గానికి, విశ్వాసుల పట్ల దౌర్జన్యానికి పాల్పడినప్పుడే అవి నాశనం చేయబడ్డాయి. చూడండి, 11:117, 6:130-132, 28:59.

[38] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'అల్లాహ్ (సు.తా.) సాక్షి! ఈ ప్రాపంచిక జీవితం పరలోక జీవితం ముందు, ఒకడు తన వ్రేలును సముద్రంలో ముంచి బయటికి తీస్తే, దానికి అంటే నీటితో సమానమైనది.' ('స'హీ'హ్ ముస్లిం)

[39] అల్లాహ్ (సు.తా.) మంచి వాగ్దానం చేసిన, సద్వర్తనులైన విశ్వాసులకు: 'ఎలాంటి భయమూ ఉండదు మరియు వారు దుఃఖపడరు కూడా!' చూడండి, 2:38, 62, 112, 262, 274, 277, 3:170, 5:69, 6:48, 7:35, 49, 10:62, 46:13.

(భావించినవారు) ఇప్పుడు ఎక్కడున్నారు?"[40]

63. ఎవరైతే ఆ మాట (శిక్ష) వర్తిస్తుందో, వారిలా విన్నవించుకుంటారు: "ఓ మా ప్రభూ! మేము దారి తప్పించిన వారు వీరే! మేము దారి తప్పిన విధంగానే వీరిని కూడా దారి తప్పించాము. వీరితో మాకెలాంటి సంబంధం లేదని నీ ముందు ప్రకటిస్తున్నాము. అసలు వీరు మమ్మల్ని ఆరాధించనేలేదు."[41]

64. మరియు వారితో ఇలా అనబడుతుంది: "మీరు సాటి కల్పించిన మీ భాగస్వాములను పిలువండి!" అప్పుడు వారు, వారిని (భాగస్వాములను) పిలుస్తారు, కాని వారు, వారికి సమాధానమివ్వరు. మరియు వారు శిక్షను చూసి (అనుకుంటారు): "ఒకవేళ వాస్తవానికి తాము సన్మార్గాన్ని అవలంబించి వుంటే ఎంత బాగుండేది!"[42] అని.

65. మరియు (జ్ఞాపకముంచుకోండి!) ఆయన (అల్లాహ్) వారిని పిలిచిన రోజు ఇలా ప్రశ్నిస్తాడు: "మేము పంపిన సందేశహరులకు మీరు ఏ విధంగా సమాధానమిచ్చారు?"

66. ఆ రోజు వారి సమాధానాలన్నీ (కారణాలన్నీ) అస్పష్టమై పోతాయి మరియు వారు ఒకరితో నొకరు సంప్రదించుకోనూ లేరు.

---

[40] చూడండి, 6:22-23.

[41] అసలు వీరు మమ్మల్ని ఆరాధించనే లేదు. ఈ వాక్యం ఖుర్ఆన్ లో ఎన్నోసార్లు వచ్చింది. చూడండి, 6:49, 19:81, 82, 46:5-6, 10:28, 29:25, 2:166, 167 .

[42] ఇంకా చూడండి, 18:52, 53.

67. కాని ఎవడైతే పశ్చాత్తాప పడి, విశ్వసించి, సత్కార్యాలు చేస్తాడో! అతడు సాఫల్యం పొందే వారిలో చేరగలడని ఆశించవచ్చు!

68. మరియు నీ ప్రభువు తాను కోరిన దానిని సృష్టిస్తాడు మరియు ఎన్నుకుంటాడు. మరియు ఎన్నుకునే హక్కు వారికి ఏ మాత్రం లేదు. అల్లాహ్ సర్వలోపాలకు అతీతుడు, వారు సాటి కల్పించే భాగస్వాముల కంటే మహోన్నతుడు.

69. మరియు వారు తమ హృదయాలలో దాచుకున్నది మరియు బహిర్గతం చేసేది అంతా నీ ప్రభువుకు తెలుసు.

70. మరియు ఆయనే, అల్లాహ్! ఆయన తప్ప మరొక ఆరాధ్య దైవం లేడు! మొదట (ఇహలోకంలో) మరియు చివరకు (పరలోకంలో) స్తుతింపదగినవాడు కేవలం ఆయనే! మరియు విశ్వన్యాయాధిపత్యం ఆయనదే. మీరంతా ఆయన వైపునకే మరలింపబడతారు.

71. వారితో అను: "ఏమీ? మీరు ఆలోచించారా? ఒకవేళ అల్లాహ్ మీపైన పునరుత్థాన దినం వరకు ఎడతెగకుండా రాత్రి ఆవరింపజేస్తే, అల్లాహ్ తప్ప మరే దేవుడైనా, మీకు వెలుగును తేగలడా? అయితే మీరెందుకు వినరు?"

72. ఇంకా ఇలా అను: "ఏమీ? మీరు ఆలోచించారా? ఒకవేళ అల్లాహ్ మీపై పునరుత్థాన దినము వరకు ఎడతెగకుండా పగటిని అవతరింపజేస్తే, అల్లాహ్ తప్ప మరే దేవుడైనా మీకు విశ్రాంతి పొందటానికి రాత్రిని తేగలడా? అయితే, మీరెందుకు చూడలేరు?"

73. ఆయన తన కారుణ్యంతో మీ కొరకు రాత్రిని మరియు పగటిని, విశ్రాంతి పొందటానికి మరియు ఆయన అనుగ్రహాన్ని అన్వేషించటానికి చేశాడు, బహుశా మీరు కృతజ్ఞులౌతారేమో నని[43].

74. మరియు (జ్ఞాపకముంచుకోండి) ఆయన (అల్లాహ్), వారిని ఆ రోజు పిలిచి ఇలా ప్రశ్నిస్తాడు: "మీరు నాకు భాగస్వాములని నొక్కిచెప్పినవారు (భావించినవారు) ఇప్పుడు ఎక్కడున్నారు?"

75. మరియు మేము ప్రతి సమాజం నుండి ఒక సాక్షిని[44] నిలబెట్టి ఇలా అంటాము: "మీ నిదర్శనాన్ని తీసుకురండి!" అప్పుడు వారు సత్యం, నిశ్చయంగా అల్లాహ్ వైపే ఉందని తెలుసుకుంటారు. మరియు వారుకల్పించుకున్నవన్నీ వారినిత్యజించిఉంటాయి.

76. వాస్తవానికి, ఖారూన్, మూసా జాతికి చెందినవాడే. కాని అతడు వారికి వ్యతిరేకంగా తిరుగుబాటు

---

[43] రాత్రి మరియు పగలు ఈ రెండూ అల్లాహ్ (సు.తా.) అనుగ్రహించిన వరాలు. ఒకవేళ రాత్రి లేకుంటే, ప్రజలందరూ ఒకేసారి విశ్రాంతి తీసుకోలేక పోయేవారు. ప్రతి ఒక్కడు తన ఇష్టానుసారం విశ్రాంతి తీసుకుంటే ప్రపంచ కార్యక్రమాలు సరళంగా జరిగేవి కావు. మానవుల జీవితాలు పరస్పర సహాయోగం, వల్లనే సరళంగా జరుగుతున్నాయి. దాని కొరకు రాత్రింబవళ్ళు ఎంతో ఉపయోగకరమైనవి.

[44] ఈ సాక్షులు ప్రవక్త ('అలైహిమ్ స.)లు ప్రతి ప్రవక్త తన కాలపు ప్రజలకు సాక్షిగా ఉంటాడు.

చేశాడు[45]. మరియు మేము అతడికి ఎన్నో నిధులను ఇచ్చి ఉంటిమి. వాటి తాళపు చెవులను బలవంతులైన పది మంది లేదా అంతకంటే ఎక్కువ మంది కూడా ఎంతో కష్టంతో మాత్రమే మోయగలిగే వారు. అతడి జాతి వారు అతనితో అన్నారు: "నీవు విర్రవీగకు, నిశ్చయంగా, అల్లాహ్ విర్రవీగే వారిని ప్రేమించడు!

**77.** మరియు అల్లాహ్ నీకు ఇచ్చిన సంపదతో పరలోక గృహాన్ని పొందటానికి ప్రయత్నించు. మరియు ఇహలోకం నుండి లభించే భాగాన్ని మరచిపోకు. నీకు అల్లాహ్ మేలు చేసినట్లు, నీవు కూడా (ప్రజలకు) మేలు చేయి[46]. భూమిపై కల్లోలం రేకెత్తించటానికి ప్రయత్నించకు. నిశ్చయంగా, అల్లాహ్ కల్లోలం రేకెత్తించేవారిని ప్రేమించడు!"

**78.** అతడు (ఖారూన్) అన్నాడు: "నిశ్చయంగా, ఇది (ఈ ధనం) నాకు నా జ్ఞానం వల్లనే ఇవ్వబడింది!"[47] ఏమీ? అతడికి తెలియదా? నిశ్చయంగా అల్లాహ్ అతడికి ముందు ఎన్నో

---

[45] ఎంత గొప్ప ప్రవక్తను అనుసరించినా, అహంభావం మరియు స్వాభిమానంతో ప్రవర్తించే వారిని అల్లాహ్ (సు.తా.) ప్రేమించడు. ఈ ఉదాహరణ ఇక్కడ మూసా ('అ.స.) జాతికి చెందిన ఖారూన్ అనే గొప్ప ధనవంతుడైన వ్యక్తి విషయంలో ఇవ్వబడింది. ఇంకా చూడండి, 29:39 మరియు 40:24.

[46] ఏ విధంగానైతే నీ ప్రభువుకు నీపై హక్కు ఉందో, అదే విధంగా నీ ఆత్మకు, నీ భార్యాపిల్లలకు, నీ బంధువులకు మరయు నీ అతిథులను మొదలైన వారికి కూడా నీ మీద., నీ ఆదాయం మీద హక్కు ఉంది. కావున ప్రతి ఒక్కనికి వాని హక్కు చెల్లించు.

[47] ఇటువంటి వాక్యానికి చూడండి, 28:78 మరియు 41:50.

తరాల వారిని - అతడి కంటే ఎక్కువ బలం మరియు ఎక్కువ ధనసంపదలు గలవారిని కూడా - నాశనం చేశాడని? మరియు పాపాత్ములు వారి పాపాలను గురించి ప్రశ్నింపబడరు.

79. తరువాత అతడు తన వైభవంతో తన జాతి వారి ఎదుటకు వచ్చాడు. ఇహలోక జీవితపు సుఖాలు కోరేవారు ఇలా అన్నారు: "అయ్యో! మా దౌర్భాగ్యం! ఖారూన్ కు లభించినటు వంటివి (ధనసంపత్తులు) మాకు కూడా లభించి ఉంటే ఎంత బాగుండేది? నిశ్చయంగా అతడు ఎంతో అదృష్టవంతుడు!"

80. కాని జ్ఞానసంపన్నులు అన్నారు: "మీ దౌర్భాగ్యం! అల్లాహ్ ఇచ్చే ప్రతిఫలమే, విశ్వసించి సత్కార్యాలు చేసేవారికి ఎంతో శ్రేష్ఠమైనది. మరియు ఈ మహాభాగ్యం, సహనం వహించే వారికి తప్ప ఇతరులకు లభించదు."[48]

81. ఆ పిదప మేము అతనిని, అతని గృహంతో సహా భూమిలోకి అణగద్రొక్కాము. అతడిని, అల్లాహ్ (శిక్ష) నుండి తప్పించగల, అతడి తెగవారు ఎవ్వరూ లేకపోయారు మరియు అతడు కూడా తనను తాను కాపాడు కోలేకపోయాడు.

82. మరియు నిన్నటి వరకు అతడి (ఖారూన్) వలే

---

[48] 'హదీస్' ఖుద్సీ: అల్లాహ్ (సు.తా.) అంటాడు: 'నేను నా సద్వర్తనులైన దాసుల కొరకు సిద్ధపరచిన వస్తువులు ఎలాంటివంటే, వాటిని ఇంత వరకు ఏ కన్నూ చూడలేదు, ఏ చెవి వినలేదు మరియు ఏ ఆత్మ కూడా ఊహించలేదు!' (బు'ఖారీ, ముస్లిం)

కావలెనని ఎవరైతే కోరుతూ వచ్చారో, వారు ఇప్పుడు ఇలా పలుకసాగారు: "తెలుసుకోండి![49] అల్లాహ్ తన దాసులలో, తాను కోరిన వారికి జీవనోపాధిని విస్తరింపజేస్తాడు[50]. మరియు (తాను కోరిన వారికి) తగ్గిస్తాడు. ఒకవేళ అల్లాహ్ అనుగ్రహమే మాపై లేకుంటే ఆయన మమ్మల్ని కూడా భూమిలోకి అణగద్రొక్కి ఉండేవాడు. తెలుసుకోండి! సత్యతిరస్కారులు ఎన్నడూ సాఫల్యం పొందలేరు!"

**83.** ఆ పరలోక జీవితపు గృహాన్ని మేము భూమిలో పెద్దరికం చూపగోరని వారి కొరకు మరియు కల్లోలం రేకెత్తించని వారి కొరకు ప్రత్యేకిస్తాము. మరియు దైవభీతి గలవారికే (మేలైన) పర్యవసానం ఉంటుంది.

**84.** మంచి పనులు చేసి వచ్చిన వారికి వాటి కంటే

---

[49] వయ్ క అన్న: ఈ శబ్దానికి, Woe unto thee, Oh, Ah, Know అనే అర్థాలిచ్చారు. అంటే, నీ పాడు గాను, అయ్యో, తెలుసుకో మొదలైనవి.

[50] అల్లాహ్ (సు.తా.) ధన సంపత్తులు ప్రసాదించినంత మాత్రాన అల్లాహ్ (సు.తా.) వానితో సంతుష్టుడయ్యాడని మరియు అల్లాహ్ (సు.తా.) వాటిని ఇవ్వని వాని మీద కోపంతో ఉన్నాడని కాదు. శాశ్వత సుఖసంతోషాలు కేవలం విశ్వసించి సత్కార్యాలు చేసే వారికే లభిస్తాయి. భూలోక సుఖసంతోషాలు, పరలోక సుఖసంతోషాల ముందు అతి స్వల్పమైనవి.

ఉత్తమమైన (ప్రతిఫలం) లభిస్తుంది[51]. మరియు చెడ్డపనులు చేసి వచ్చిన వారికి, వారు చేస్తూ ఉండిన చెడ్డపనులకు తగినంత ప్రతిఫలమే ఇవ్వబడుతుంది.

85. (ఓ ముహమ్మద్!) నిశ్చయంగా, ఈ ఖుర్ఆన్ ను నీకు విధిగా చేసినవాడు (అల్లాహ్) తప్పక నిన్ను నీ నిర్ణీత స్థానానికి తిరిగి తెస్తాడు[52]. వారితో ఇలా అను: "ఎవడు మార్గదర్శకత్వంలో ఉన్నాడో మరియు ఎవడు స్పష్టంగా మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నాడో, నా ప్రభువుకు బాగా తెలుసు."

86. మరియు నీకు ఈ గ్రంథం (ఖుర్ఆన్) ఇవ్వబడుతుందని నీవెన్నడూ ఆశించలేదు, ఇది కేవలం నీ ప్రభువు కారుణ్యం వల్లనే లభించింది. కావున నీవు ఎన్నటికీ సత్యతిరస్కారులకు తోడ్పడే వాడవు కావద్దు!

87. మరియు అల్లాహ్ ఆయతులు, నీ పై అవతరింప జేయబడిన తరువాత; వారు (సత్యతిరస్కారులు) వాటి (పఠనం / ప్రచారం) నుండి నిన్ను ఏ మాత్రం తొలగింపనివ్వ రాదు. మరియు (ప్రజలను) నీ ప్రభువు వైపునకు ఆహ్వానించు మరియు నీవు

---

[51] చూడండి, 27:89 ప్రతి మంచిపనికి పదింతలు అధికంగా పుణ్యఫలితం ఇవ్వబడుతుంది. అల్లాహ్ (సు.తా.) కోరితే అంతకంటే ఎక్కువ పుణ్య ఫలితం ఇస్తాడు. కాని ప్రతి చెడ్డ పనికి దానంతశిక్షమాత్రమేవిధించబడుతుంది.పునరుత్థానదినమున ఎవరికీ అన్యాయం జరుగదు. చూడండి, 6:160.

[52] అంటే తప్పక తిరిగి మక్కాకు తెస్తాడు. కావున హిజ్రత్ కు 8 సంవత్సరాల తరువాత దైవప్రవక్త ('స'అస) తిరిగి మక్కాకు విజేయులై వచ్చారు. (ఇబ్నె-'అబ్బాస్ ర'ది.'అ. కథనం, 'స'హీ'హ్ బు'ఖారీ).

బహుదైవారాధకులలో చేరిపోకు.

88. మరియు అల్లాహ్ తో పాటు ఏ ఇతర దైవాన్నీ ఆరాధించకు. ఆయన (అల్లాహ్) తప్ప మరొక ఆరాధ్యదైవం లేడు. కేవలం ఆయన ఉనికి (ముఖం) తప్ప ప్రతిదీ నశిస్తుంది[53]. సర్వన్యాయాధిపత్యం కేవలం ఆయనదే మరియు ఆయన వైపునకే మీరంతా మరలింప బడతారు.

[53] చూడండి, 55:26-27.

# 29. అల్-అంకబూత్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. అలిఫ్-లామ్-మీమ్[1]
2. ఏమీ? ప్రజలు "మేము విశ్వసించాము!" అని అన్నంత మాత్రాన్నే తాము విడిచి పెట్ట బడతారని మరియు తాము పరీక్షింపబడరని భావిస్తున్నారా?[2]
3. మరియు వాస్తవానికి, మేము వారికి పూర్వం గతించిన వారిని కూడా పరీక్షించి ఉన్నాము. కావున నిశ్చయంగా సత్యవంతులు ఎవరో మరియు అసత్యవంతులు ఎవరో అల్లాహ్ వ్యక్త పరుస్తాడు.
4. లేక, చెడుపనులు చేస్తున్నవారు, మా (శిక్ష) నుండి తప్పించుకోగలరని భావిస్తున్నారా? ఎంత చెడ్డ నిర్ణయం వారిది!
5. అల్లాహ్ ను కలుసుకునే కోరిక ఉన్నవాడు, అల్లాహ్ నిర్ణయించిన ఆ సమయం తప్పక రానున్నదని నమ్మాలి. మరియు ఆయన సర్వం

---

[*] [అల్-అంకబూత్ అంటే సాలెపురుగు, సాలీడు]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

[2] మొట్టమొదట విశ్వాసం (ఇస్లాం) స్వీకరించిన 'అమ్మార్ అతని తల్లి-దండ్రులైన సుమయ్యా మరియు యాసర్, 'సుహేబ్ మరియు బిలాల్ మొదలైన వారు (ర'ది.'అన్హుమ్) ఎన్నో తీవ్రమైన పరీక్షలకు గురి చేయ బడ్డారు.

వినేవాడు, సర్వజ్ఞుడు.

6. కావున (అల్లాహ్ మార్గంలో) పాటుపడే వాడు నిశ్చయంగా, తన (మేలు) కొరకే పాటు పడుతున్నాడని (తెలుసుకోవాలి)[3]. నిశ్చయంగా, అల్లాహ్ సర్వలోకాల వారి అక్కర ఏ మాత్రం లేనివాడు.

7. మరియు ఎవరైతే విశ్వసించి సత్కార్యాలు చేస్తారో, నిశ్చయంగా అలాంటి వారి (పూర్వపు) పాపాలను మేము తప్పక తొలగిస్తాము మరియు వారు చేసిన సత్కార్యాలకు ఉత్తమమైన ప్రతిఫలం ఇస్తాము.

8. మరియు మేము మానవునికి తన తల్లిదండ్రులతో మంచిగా వ్యవహరించమని ఆదేశించాము[4]. కాని వారిద్దరూ, నీవు ఎరుగని వానిని నాకు భాగస్వామిగా చేయమని బలవంతపెడితే, నీవు

---

[3] చూడండి, 15:23. జిహాదున్: అంటే - 1) తన సత్యధర్మాన్ని, తన స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను కాపాడు కోవటానికి దానిని అడ్డగించే వారితో; 2) సత్యం మీద మరియు సన్మార్గం మీద ఉండడానికి తన ఆత్మలోని అసత్యం, అధర్మంతో మరియు 3) దుష్టప్రేరణలతో - చేసే పోరాటం.

[4] ఖుర్ఆన్ లో కేవలం ఏకైక ఆరాధ్యుడు అల్లాహ్ (సు.తా.) ఆరాధనే చేయాలనీ మరియు తల్లిదండ్రులతో మంచిగా వ్యవహరించాలని అల్లాహ్ (సు.తా.) ఆదేశిస్తున్నాడు. తమ తల్లిదండ్రులను ఆదరించే వారే అల్లాహ్ (సు.తా.) యొక్క స్థానాన్ని అర్థం చేసుకో గలుగుతారు. చూడండి, 31:14-15.

వారి ఆజ్ఞాపాలన చేయకు[5]. మీరందరూ నా వైపుకే మరలి రావలసి ఉన్నది, అప్పుడు నేను మీకు, మీరు ఏమి చేస్తూ ఉండేవారో తెలుపుతాను.

9. మరియు ఎవరైతే విశ్వసించి సత్కార్యాలు చేస్తూ ఉంటారో, మేము వారిని తప్పక సద్వర్తనులతో చేర్చుతాము.

10. మరియు ప్రజలలో కొందరు (తమ నాలుకలతో): "మేము అల్లాహ్ ను విశ్వసించాము." అని అనే వ్యక్తులున్నారు. కాని వారు అల్లాహ్ మార్గంలో హింసించబడి నప్పుడు, మానవులు పెట్టిన పరీక్షలను అల్లాహ్ యొక్క శిక్షగా భావిస్తారు; మరియు ఒకవేళ నీ ప్రభువు నుండి సహాయం వస్తే వారు (కపట విశ్వాసులు) అంటారు: "నిశ్చయంగా, మేము మీతోనే ఉన్నాము[6]. సర్వలోకాల వారి హృదయాల స్థితి అల్లాహ్ కు తెలియదా ఏమిటి?"

11. మరియు నిశ్చయంగా, అల్లాహ్ విశ్వసించిన వారిని స్పష్టపరుస్తాడు మరియు ఆయన కపట

---

[5] స'అద్ బిన్ అబీ-వఖ్ఖా'స్ (ర'ది.'అ) ఇస్లాం స్వీకరించినప్పుడు అతని తల్లి నీవు ఇస్లాం మరియు ము'హమ్మద్ (సఅస) ను వదలనంత వరకు నేను అన్నపానీయాలను ముట్టను అని మొండిపట్టు పట్టుతుంది. అప్పుడు ఈ ఆయత్ అవతరింపజేయబడుతుంది. ('స.ముస్లిం, తిర్మిజీ')

[6] ఇలాంటి భావమిచ్చే మరొక ఆయత్ కు చూడండి, 4:141.

విశ్వాసులను కూడా స్పష్టపరుస్తాడు[7].

12. మరియు సత్యతిరస్కారులు, విశ్వాసులతో: "మీరు మా మార్గాన్ని అనుసరించండి. మేము మీ పాపాలను భరిస్తాము." అని అంటారు. వాస్తవానికి వారి పాపాలలో నుండి దేనిని కూడా వారు భరించరు. నిశ్చయంగా, వారు అసత్యవాదులు[8].

13. మరియు నిశ్చయంగా, వారు తమ బరువులను మోస్తారు మరియు తమ బరువులతో పాటు ఇతరుల బరువులను కూడా మోస్తారు[9]. మరియు నిశ్చయంగా, వారు పునరుత్థాన దినమున, తమ బూటక కల్పనలను గురించి

---

[7] అంటే అల్లాహ్ (సు.తా.) సుఖదుఃఖాలనిచ్చి విశ్వాసులెవరో మరియు కపట విశ్వాసులెవరో విశదం చేస్తాడు. ఎవరైతే ప్రతి స్థితిలో అల్లాహ్ (సు.తా.) కు కృతజ్ఞులై ఉంటారో వారే నిజమైన విశ్వాసులు. ఇంకా చూడండి, 15:23 మరియు 15:23, ఇది కపట విశ్వాసు(మునాఫిఖు)లను గురించి వచ్చిన మొదటి ఆయత్.

[8] సత్యతిరస్కారులు: 'మీరు మా మార్గాన్ని అనుసరిస్తే మేము మీ పాపాలను భరిస్తాము.' అని అనే మాటలు అబద్ధాలని ఇక్కడ విశదీకరించబడింది. అల్లాహ్ (సు.తా.) అంటున్నాడు: "భారం మోసేవాడు, ఎవరి భారాన్ని మోయడు!" పునరుత్థాన దినమున స్నేహితుడు తన స్నేహితుని స్థితిని అడగడు, 70:10 మరియు దగ్గరి బంధువులు కూడా ఒకరినొకరు అడుగుకోరు, 35:18.

[9] ఇటువంటి ఆయత్ కు చూడండి, 16:25. దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: "ఇతరులను సన్మార్గానికి పిలచిన వారికి, వారు సన్మార్గాన్ని అనుసరిస్తే పునరుత్థానదినం వరకు వారంతా చేసే సత్కార్యాల ఫలితాల పుణ్యం దొరుకుతుంది. దుర్మార్గులకు, పాపకార్యాలకు, దుష్టకార్యాలకు ఆహ్వానించే వారు తమను అనుసరించిన వారి పాపభారాన్ని పునరుత్థాన దినం వరకు భరిస్తారు." ('స'హీ'హ్ బు'ఖారీ).

ప్రశ్నింపబడతారు.

**14.** మరియు వాస్తవానికి, మేము నూహ్ ను అతని జాతివారి వద్దకు పంపాము. అతను వారి మధ్య యాభై తక్కువ వేయి సంవత్సరాల వరకు (వారిని అల్లాహ్ ధర్మం వైపుకు ఆహ్వానిస్తూ) నివసించాడు; చివరకు వారు దుర్మార్గాన్ని విడనాడనందుకు, వారిని తుఫాను పట్టుకున్నది[10].

**15.** తరువాత మేము అతనిని (నూహ్ ను) మరియు నావలో ఎక్కిన వారిని రక్షించి, దానిని సర్వలోకాల వారికి ఒక సూచనగా చేశాము.

**16.** మరియు (జ్ఞాపకం చేసుకోండి!) ఇలాగే ఇబ్రాహీమ్ కూడా తన జాతి వారితో: "కేవలం అల్లాహ్ నే ఆరాధించండి మరియు ఆయన యందు భయభక్తులు కలిగి ఉండండి. మీరు అర్థం చేసుకోగలిగితే, ఇది మీకు ఎంతో మేలైనది."

**17.** "నిశ్చయంగా, మీరు అల్లాహ్ ను వదలి విగ్రహాలను ఆరాధిస్తూ, ఒక అభూత కల్పన చేస్తున్నారు. నిశ్చయంగా, అల్లాహ్ ను వదలి మీరు ఎవరినైతే, ఆరాధిస్తున్నారో, వారికి మీకు జీవనోపాధిని సమకూర్చే యోగ్యత లేదు. కావున మీరు, మీ జీవనోపాధిని అల్లాహ్ నుండియే అపేక్షించండి

---

[10] నూ'హ్ ('అ.స.) గాథ కొరకు చూడండి, 11:25-48 ఇక్కడ ఉద్దేశమేమిటంటే: ఒక ప్రవక్త ('అ.స.) కూడా తాను ప్రేమించేవారిని సన్మార్గానికి తేలేడు. ఇంకా చూడండి, 28:56 నూ'హ్ ('అ.స.) వారికి 950 సంవత్సరాలు ఇస్లాం ధర్మప్రచారం చేశారు. మార్గదర్శకత్వమంతా అల్లాహ్ (సు.తా.) మార్గదర్శకత్వమే. చూడండి, 3:73.

మరియు ఆయననే ఆరాధించండి. మరియు ఆయనకే కృతజ్ఞులై ఉండండి. మీరంతా ఆయన వైపునకే మరలింపబడతారు."

18. "ఒకవేళ మీరు (ఈ సందేశాన్ని) అబద్ధమని తిరస్కరిస్తే, (ఆశ్చర్యమేమీ లేదు) వాస్తవానికి మీకు పూర్వం ఎన్నో సమాజాలు (దివ్యసందేశాలను అబద్ధాలని) తిరస్కరించాయి. మరియు సందేశహరుని బాధ్యత, స్పష్టంగా మీకు సందేశాన్ని అంద జేయటం మాత్రమే!"

19. అల్లాహ్ సృష్టిని ఏ విధంగా ప్రారంభిస్తున్నాడో తరువాత దానిని ఏ విధంగా మరల ఉనికి లోకి తెస్తున్నాడో, వారు గమనించడం లేదా? నిశ్చయంగా, ఇది అల్లాహ్ కు ఎంతో సులభం!

20. వారితో అను: "మీరు భూమిలో సంచారం చేసి చూడండి. ఆయన సృష్టిని ఏ విధంగా ప్రారంభించాడో!"[11] తరువాత అల్లాహ్ యే మరల (రెండవసారి) దానిని ఉనికిలోకి తెస్తున్నాడు! నిశ్చయంగా, అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు!"

21. ఆయన తాను కోరిన వారిని శిక్షిస్తాడు మరియు తాను కోరిన వారిని కరుణిస్తాడు. మరియు ఆయన వైపుకే మీరంతా మరలింపబడతారు.

22. మరియు మీరు భూమిలో గాని, ఆకాశంలో గాని ఆయన నుండి తప్పించుకోజాలరు. మరియు అల్లాహ్ తప్ప మీకు సంరక్షకుడు గానీ మరియు సహాయకుడు గానీ ఎవ్వడూ లేడు.

---

[11] చూడండి, 23:12-14.

23. మరియు ఎవరైతే, అల్లాహ్ సూచనలను మరియు ఆయనతో కాబోయే సమావేశాన్ని తిరస్కరిస్తారో, అలాంటివారు నా కరుణపట్ల నిరాశచెందుతారు[12]. మరియు అలాంటి వారికి బాధాకరమైన శిక్ష పడుతుంది.

24. ఇక అతని (ఇబ్రాహీమ్) జాతివారి జవాబు ఈ విధంగా అనడం తప్ప మరొకటి లేక పోయింది: "ఇతనిని చంపండి లేదా కాల్చి వేయండి" చివరకు అల్లాహ్ అతనిని అగ్ని నుండి రక్షించాడు[13]. నిశ్చయంగా, ఇందులో విశ్వసించే వారికి సూచనలున్నాయి.

25. మరియు (ఇబ్రాహీమ్) ఇలా అన్నాడు: "నిశ్చయంగా, మీరు ప్రాపంచిక జీవితంలో అల్లాహ్ ను వదలి, విగ్రహారాధనను మీ మధ్య ప్రేమకు సాధనంగా చేసుకున్నారు. కాని పునరుత్థాన దినమున మీకు పరస్పరం సంబంధమే లేదంటారు మరియు పరస్పరం శపించుకుంటారు మరియు మీ ఆశ్రయం నరకాగ్నియే మరియు మీకు సహాయపడే వారు ఎవ్వరూ ఉండరు."

26. అప్పుడు లూత్ అతనిని విశ్వసించాడు. (ఇబ్రాహీమ్) ఇలా అన్నాడు: "నేను నా

[12] చూడండి, 8:156.
[13] చూడండి, 21:69.

ప్రభువు వైపునకు వలసపోతాను[14]. నిశ్చయంగా ఆయనే సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు."

**27.** మరియు మేము అతనికి (ఇబ్రాహీమ్ కు) ఇస్ హాఖ్ మరియు యఅఖూబ్ లను ప్రసాదించి, అతని సంతతిలో ప్రవక్త పదవినీ మరియు గ్రంథాన్ని ఉంచి, ప్రపంచంలో అతనికి, అతని ప్రతిఫలాన్ని ఇచ్చాము[15]. మరియు పరలోకంలో అతడు నిశ్చయంగా, సద్వర్తనులతో పాటు ఉంటాడు[16].

---

[14] ఇబ్రాహీమ్ ('అ.స.) తన భార్య సారహ్ మరియు తన సోదరుని కుమారుడు లూ'త్ ('అ.స.)లతో, తమ దేశం కూసీ అంటే - కూఫా ప్రాంతంలోని ఒక నగరం నుండి షామ్ వైపునకు ప్రస్థానం చేశారు. ఎందుకంటే ఆ దేశపు ప్రజలు - వారు ఇస్లాం అనుసరిస్తున్నందుకు - వారిపై దౌర్జన్యాలు చేశారు.

[15] ఈ ప్రతిఫలమేమిటంటే అతను ఇబ్రాహీమ్ ('అ.స.) అబుల్-అంబియా అనబడ్డారు. అంటే ప్రవక్తల మూలపురుషుడు. ఎందుకంటే అతన సంతానం నుండి ఎంతో మంది ప్రవక్తలు వచ్చారు. అతని పెద్ద కుమారుడు, సయ్యిదా హాజర్ పుత్రుడైన ఇస్మాయీ'ల్ ('అ.స.) వంశం నుండి మహాప్రవక్త ము'హమ్మద్ ('స'అస) వచ్చారు. మరియు అతని రెండవ కుమారుడైన ఇ'స్హాఖ్ ('అ.స.) యొక్క కుమారుడైన యా'అఖూబ్ ('అ.స.) నుండి అతని కుమారుడైన యూసుఫ్ ('అ.స.) వచ్చారు. మరియు య'అఖూబ్ ('అ.స.) యొక్క పన్నెండు మంది కుమారుల నుండి ఇంకా ఎంతోమంది ప్రవక్తలు వచ్చారు. దావుద్, సులైమాన్, మూసా మరియు 'ఈసా ('అలైహిమ్. స.) లు అందరూ య'అఖూబ్ ('అ.స.) సంతతి వారే, అంటే ఇబ్రాహీమ్ ('అ.స.) సంతతి వారే. అందుకే యూదులు, క్రైస్తవులు, ముస్లిములే గాక ముష్రికులు కూడా ఇబ్రాహీమ్ ('అ.స.) ను ఆదరిస్తారు. ప్రతి ఒక్కరూ మేము ఇబ్రాహీమ్ ('అ.స.) ధర్మాన్నే ఆచరిస్తున్నాము అంటారు. కాని, వాస్తవానికి అతని ధర్మం, ఏకైక దైవసిద్ధాంతం (ఇస్లాం) మాత్రమే.

[16] చూడండి, 16:122.

28. మరియు (జ్ఞాపకం చేసుకోండి) లూత్ తన జాతి ప్రజలతో ఇలా అన్నప్పుడు: "నిశ్చయంగా, మీరు చాలా హేయమైన పని చేస్తున్నారు. మీకు పూర్వం లోకంలో ఎవ్వడూ ఇలాంటి పని చేయలేదు[17].

29. వాస్తవానికి, మీరు (కామంతో) పురుషుల వద్దకు పోతున్నారు! మరియు దారి కొడు తున్నారు (దోపిడి చేస్తున్నారు)! మరియు మీ సభలలో అసభ్యకరమైన పనులు చేస్తున్నారు!" అతని జాతి వారి జవాబు కేవలం ఇలానే ఉండేది: "నీవు సత్యవంతుడవే అయితే అల్లాహ్ శిక్షను మా పైకి తీసుకురా!"

30. అప్పుడు లూత్ ఇలా ప్రార్థించాడు: "ఓ నా ప్రభూ! దౌర్జన్యపరులపై నాకు విజయం నొసంగు."

31. మరియు మా దూతలు ఇబ్రాహీమ్ వద్దకు శుభవార్త తీసికొని వచ్చినపుడు వారన్నారు: "నిశ్చయంగా, మేము ఈ నగరవాసులను నాశనం చేయబోతున్నాము. ఎందుకంటే వాస్తవానికి దాని ప్రజలు దుర్మార్గులై పోయారు!"

32. (ఇబ్రాహీమ్) అన్నాడు: "వాస్తవానికి, అక్కడ లూత్ కూడా ఉన్నాడు కదా!" వారన్నారు: "అక్కడెవరున్నారో, మాకు బాగా తెలుసు. మేము అతనిని మరియు అతని కుటుంబం వారిని

రక్షిస్తాము - అతని భార్య తప్ప - ఆమె వెనుక

[17] లూ'త్ ('అ.స.) గాథ కొరకు చూడండి, 11:69-83.

ఉండి పోయేవారిలో చేరి పోయింది."[18]

33. ఆ తరువాత మా దూతలు లూత్ వద్దకు రాగా అతను వారి నిమిత్తం చాలా చింతించాడు.[19] మరియు ఇబ్బందిలో పడి పోయాడు. వారిలా అన్నారు: "నీవు భయపడకు మరియు దుఃఖ పడకు! నిశ్చయంగా, మేము నిన్ను మరియు నీ కుటుంబం వారిని రక్షిస్తాము - నీ భార్య తప్ప - ఆమె వెనుక ఉండి పోయేవారిలో చేరిపోయింది!

34. నిశ్చయంగా, మేము ఈ నగరవాసుల మీద ఆకాశం నుండి ఘోర విపత్తు అవతరింప జేయ బోతున్నాము. ఎందుకంటే వారు అవిధేయులయ్యారు!"

35. మరియు వాస్తవానికి, బుద్ధిమంతుల కొరకు మేము దీని ద్వారా ఒక స్పష్టమైన సూచనను వదలి పెట్టాము[20].

36. మరియు మేము మద్'యన్ వాసుల వద్దకు వారి సహోదరుడు షుఐబ్'ను పంపాము[21]. అతను ఇలా అన్నాడు: "నా జాతి ప్రజలారా! కేవలం అల్లాహ్ నే ఆరాధించండి. మరియు అంతిమదినం కొరకు నిరీక్షిస్తూ (భయపడుతూ) ఉండండి

---

[18] చూడండి, 7:83 మరియు 11:81.

[19] చూడండి, 11:77.

[20] సోడోమ్ మరియు గొమొర్రాహ్ (లూ'త్ జాతి వారి) నగరాలు ఉండే చోట్లలో, ఈ రోజు మృత సముద్రం (Dead Sea) ఉంది. దాని పేరు ఇలా ఎందుకు పడిందంటే అందులో గంధకం మరియు పొటాష్ (Sulphur and Potash), అత్యధికంగా ఉండడం వల్ల అందులో ఏ జీవరాసి గానీ వృక్షరాసి గానీ నివసించజాలదు.

[21] షు'ఐబ్ ('అ.స.) గాథకు చూడండి, 11:85-93.

మరియు దౌర్జన్యపరులుగా భూమిలో కల్లోలం రేకెత్తిస్తూ తిరగకండి!"

**37.** కాని వారు అతనిని అసత్యుడని తిరస్కరించారు, ఒక తీవ్రమైన భూకంపం వారిని పట్టు కున్నది, అప్పుడు వారు తమ ఇండ్లలోనే చలనం లేని శవాలుగా మారి పోయారు.

**38.** మరియు వాస్తవంగా, ఆద్ మరియు సమూద్ జాతల వారి (వినాశ) విషయం (మిగిలి పోయిన) వారి నివాస స్థలాల నుండి, మీకు స్పష్టంగా తెలుస్తుంది[22]. వాస్తవానికి, వారు (సత్యాన్ని) గ్రహించే వారు అయినప్పటికీ, షైతాన్ వారి కర్మలను వారికి మంచివిగా కనబడే టట్లు చేశాడు. ఆ తరువాత వారిని (ఋజు) మార్గం నుండి తొలగించాడు.

**39.** ఇక ఖారూన్[23], ఫిర్ఔన్ మరియు హామానులను[24] (కూడా మేము ఇదే విధంగా నాశనం చేశాం). వాస్తవానికి మూసా వారి వద్దకు స్పష్టమైన సూచనలను తీసుకొని వచ్చాడు; కాని వారు భూమిలో అహంభావం చూపారు కావున వారు(మాశిక్షనుండి)తప్పించుకోలేక పోయారు

---

[22] 'ఆద్ జాతి వారి నివాసం - అ'హ్ ఖాఫ్ - యమన్, లోని హ'దరమౌత్ దగ్గర ఉంది. స'మూద్ జాతి వారి నివాసం మదాయన్ 'సాలి'హ్, అనే ప్రాంతంలో మదీనా మునవ్వరా - తబూక్ ల మధ్య స'ఊది 'అరేబియాలో ఉంది. ఇది 'హిజా'జ్ ఉత్తర ప్రాంతంలో ఉంది. చూడండి, 9:7.

[23] ఖారూన్ గాథకు చూడండి, 28:76-82.

[24] హామాన్ గాథకు చూడండి, 28:6.

40. కావున ప్రతి ఒక్కరిని మేము అతని పాపానికి బదులుగా పట్టుకున్నాము. వారిలో కొందరిపైకి మేము తుఫాన్ గాలిని పంపాము[25]. మరికొందరిని ఒక భయంకరమైన గర్జన (సయ్ హ్) చిక్కించుకున్నది[26]. ఇంకా కొందరిని భూమిలోనికి అణగ ద్రొక్కాము[27]. ఇంకా ఇతరులను ముంచి వేశాము[28]. మరియు అల్లాహ్ వారి కెలాంటి అన్యాయం చేయలేదు, కాని వారే తమకు తాము అన్యాయం చేసుకున్నారు.

41. అల్లాహ్ ను వదలి ఇతరులను సంరక్షకులుగా చేసుకున్న వారి ఉపమానాన్ని సాలె పురుగు నిర్మించే ఇంటితో పోల్చవచ్చు. నిశ్చయంగా, అన్నిటి కంటే బలహీనమైన ఇల్లు సాలె పురుగు ఇల్లే! వారిది తెలుసుకుంటే ఎంత బాగుండేది![29]

42. వారు ఆయనను వదిలి దేనిని ప్రార్థిస్తున్నారో, అల్లాహ్ కు బాగా తెలుసు. మరియు ఆయన సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు.

43. మరియు ఈ ఉదాహరణలను మేము ప్రజలకు

[25] 'తుఫాన్ గాలి 'ఆద్ జాతివారిపై వచ్చింది.

[26] ఈ శిక్ష వచ్చిన వారు స'మూద్ జాతివారు.

[27] ఇది ఖారూన్ కు సంభవించిన శిక్ష.

[28] ఇది ఫిర్'ఔన్ మరియు అతని సైనికులకు సంభవించిన శిక్ష.

[29] ఏ విధంగానైతే సాలె పురుగు అల్లిన ఇల్లు బలహీనమైనదో! అదే విధంగా అల్లాహ్ (సు.తా.) ను వదలి ఇతరులను ఆరాధించే వారి ఆరాధన కూడా వ్యర్థమైనదే. ఎందుకంటే వారు (ఆ దేవతలు) తమను ఆరాధించే వారికి ఎలాంటి సహాయం చేయలేరు.

(అర్థం చేసుకోవాలని) ఇస్తున్నాము. మరియు జ్ఞానం గలవారు తప్ప ఇతరులు వీటిని అర్థం చేసుకోలేరు.

**44.** అల్లాహ్ ఆకాశాలను మరియు భూమిని సత్యాధారంగా సృష్టించాడు. నిశ్చయంగా, విశ్వసించే వారికి ఇందులో సూచన ఉంది.

**45.** (ఓ ప్రవక్తా!) నీపై దివ్యజ్ఞానం (వహీ) ద్వారా అవతరింపజేయబడిన గ్రంథాన్ని చదివి వినిపించు మరియు నమాజ్ ను స్థాపించు. నిశ్చయంగా, నమాజ్ అసహ్యకరమైన పనుల నుండి మరియు అధర్మమైన పనుల నుండి నిషేధిస్తుంది. మరియు అల్లాహ్ ధ్యానమే (అన్నిటి కంటే) గొప్పది. మరియు మీరు చేసేదంతా అల్లాహ్ కు బాగా తెలుసు.

**46.** మరియు నీవు గ్రంథ ప్రజలతో - దుర్మార్గాన్ని అవలంబించిన వారితో తప్ప - కేవలం ఉత్తమమైన రీతిలోనే వాదించు[30]. మరియు వారితో ఇలా అను: "మేము మా కొరకు అవతరింప జేయబడిన దానిని మరియు మీ కొరకు అవతరింప జేయబడిన దానిని విశ్వసించాము. మరియు మా ఆరాధ్యదేవుడు మరియు మీ ఆరాధ్యదేవుడు ఒక్కడే (అల్లాహ్) మరియు మేము ఆయనకే విధేయులమై (ముస్లింలమై) ఉన్నాము."

**47.** (ఓ ముహమ్మద్!) ఈ విధంగా మేము నీపై ఈ

---

[30] చూడండి, 16:125.

గ్రంథాన్ని అవతరింప జేశాము. కావున మేము (ఇంతకు పూర్వం) గ్రంథాన్ని ఇచ్చిన వారిలో కొందరు దీనిని విశ్వసిస్తారు[31]. మరియు ఇతర ప్రజలలో నుండి కూడా కొందరు దీనిని విశ్వసిస్తారు[32]. మరియు మా సూచనలను సత్యతిరస్కారులు తప్ప మరెవ్వరూ తిరస్కరించరు[33].

**48.** మరియు (ఓ ముహమ్మద్!) ఇంతకు పూర్వం నీవు ఏ గ్రంథాన్ని కూడా చదువ గలిగే వాడవు కావు మరియు దేనిని కూడా నీ కుడిచేతితో వ్రాయగలిగే వాడవూ కావు[34]. అలా జరిగి వుంటే ఈ అసత్యవాదులు తప్పక అనుమానానికి గురి అయి ఉండేవారు.

**49.** వాస్తవానికి ఇవి, స్పష్టమైన సూచనలు (ఖుర్ఆన్ ఆయాత్), జ్ఞానమివ్వబడిన వారి హృదయాలలో (భద్రంగా) ఉంచబడ్డాయి. మరియు మా సూచనలను (ఆయాత్ లను) దుర్మార్గులు తప్ప మరెవ్వరూ తిరస్కరించరు.

**50.** మరియు వారు ఇలా అంటారు: "ఇతని ప్రభువు తరఫు నుండి ఇతని మీద అద్భుత సంకేతాలు ఎందుకు అవతరింప జేయబడలేదు?" వారితో ఇలా అను: "నిశ్చయంగా, అద్భుత సంకేతాలన్నీ

---

[31] వీరు 'అబ్దుల్లాహ్ బిన్-సలాం మరియు ఇతరులు.
[32] వీరు మక్కా ముష్రికులలో నుండి కొందరు.
[33] జిహాదున్: దీని అర్థానికి చూడండి, 31:32, 40:63, మరియు 41:28.
[34] చూడండి, 7:157, 158.

అల్లాహ్ దగ్గరనే ఉన్నాయి[35]. మరియు నేను కేవలంస్పష్టంగాహెచ్చరికచేసేవాడనుమాత్రమే!"

51. ఏమీ? వాస్తవానికి మేము నీపై అవతరింప జేసిన ఈ గ్రంథం (ఖుర్ఆన్) వారికి వినిపించబడుతోంది కదా! ఇది వారికి చాలదా?[36] నిశ్చయంగా, ఇందులో విశ్వసించే ప్రజలకు కారుణ్యం మరియు హితబోధలున్నాయి.

52. (ఓ ముహమ్మద్!) వారిలో ఇలా అను: "నాకూ మరియు మీకూ మధ్య సాక్షిగా అల్లాహ్ యే చాలు! ఆకాశాలలోనూ మరియు భూమిలోనూ ఉన్న సమస్తమూ ఆయనకు తెలుసు." మరియు ఎవరైతే అసత్యాన్ని విశ్వసించి అల్లాహ్'ను తిరస్కరిస్తారో, అలాంటివారే నష్టపడేవారు

53. మరియు వారు (అవిశ్వాసులు) శిక్షను త్వరగా తీసుకురమ్మని నిన్ను కోరు తున్నారు[37]. మరియు దానికై ఒక గడువు (అల్లాహ్ తరఫు నుండి) నిర్ణయింప బడి ఉండకపోతే! ఆ శిక్ష వారిపై వచ్చి పడి ఉండేది. మరియు నిశ్చయంగా,

---

[35] చూడండి, 6:109.

[36] ఖుర్ఆన్, అల్లాహ్(సు.తా.) అద్భుత సంకేతాలలో ఒకటి. అందుకే ఖుర్ఆన్ లో అల్లాహ్(సు.తా.) దాని వంటి ఒక్క సూరహ్ సైనా రచించి తెమ్మని సత్యతిరస్కారులతో సవాలు చేశాడు. కాని వారు ఈ నాటికీ దానిని పూర్తి చేయలేకపోయారు. ఇంతకంటే మంచి అద్భుత సంకేతం ఇంకేం కావాలి? విశ్వసించని వారు ఎన్ని అద్భుతసంకేతాలు చూసినా విశ్వసించరు. ఉదా: ఫిర్'ఔన్ మరియు అతని జాతివారు.

[37] చూడండి, 8:32.

అది వారికి తెలియకుండానే అకస్మాత్తుగా వచ్చి వారి మీద పడనున్నది!

54. వారు (అవిశ్వాసులు) శిక్షను త్వరగా తీసుకు రమ్మని నిన్ను కోరుతున్నారు మరియు నిశ్చయంగా, నరకాగ్ని సత్యతిరస్కారులను చుట్టుముట్ట నున్నది.

55. ఆ రోజు, శిక్ష వారి పైనుండి మరియు పాదాల క్రింది నుండి వారిని క్రమ్ముకున్నప్పుడు, వారితో ఇలా అనబడుతుంది: "మీరు చేస్తూ ఉండిన కర్మల ఫలితాన్ని చవి చూడండి."

56. ఓ విశ్వసించిన నా దాసులారా! నిశ్చయంగా, నా భూమి ఎంతో విశాలమైనది. కావున మీరు కేవలం నన్నే ఆరాధించండి[38].

57. ప్రతి ప్రాణి చావును చవి చూస్తుంది. ఆ తరువాత మీరందరూ మా వైపునకే మరలింప బడతారు.

58. ఇక ఎవరైతే విశ్వసించి, సత్కార్యాలు చేస్తారో! వారికి మేము స్వర్గంలో గొప్ప భవనాలలో స్థిర నివాసం ఇస్తాము. దాని క్రింద సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడ వారు శాశ్వతంగా ఉంటారు. సత్కార్యాలు చేసిన వారి ప్రతిఫలం ఎంత శ్రేష్ఠమైనది!

---

[38] ఏ స్థలంలోనైతే అల్లాహ్ (సు.తా.) ను ఆరాధించడం కష్టమయిపోతుందో మరియు ఇస్లాం ధర్మం మీద నిలువడం దుర్భరమవుతుందో అలాంటి చోటు నుండి ప్రస్థానం (హిజ్రత్) చేయటానికి అనుమతి ఇవ్వ బడింది. ఉదాహరణకు మొట్టమొదటి ముస్లింలు 'హబషాకు, ప్రస్థానం చేశారు, దాని తరువాత మదీనాకు.

59. (వారికే) ఎవరైతే సహనం వహించి తమ ప్రభువునే నమ్ముకొని ఉంటారో!

60. మరియు (ప్రపంచంలో) ఎన్నో ప్రాణులున్నాయి. అవి తమ జీవనోపాధిని తాము సాధించలేవు! అల్లాహ్ యే వాటికీ మరియు మీకు కూడా జీవనోపాధిని సమకూర్చు తున్నాడు. మరియు ఆయనే సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

61. మరియు ఒకవేళ నీవు వారితో: "ఆకాశాలనూ మరియు భూమినీ సృష్టించి సూర్యచంద్రులను ఉపయుక్తంగా చేసింది ఎవరు?" అని అడిగితే, వారు తప్పక: "అల్లాహ్!" అని అంటారు. అయినా వారు ఎందుకు మోసగింపబడుతున్నారు (సత్యం నుండి మరలింపబడు తున్నారు?)

62. అల్లాహ్ తన దాసులలో, తాను కోరిన వారికి జీవనోపాధిని పుష్కలంగా ప్రసాదిస్తాడు మరియు తాను కోరిన వారికి దానిని మితంగా ఇస్తాడు. నిశ్చయంగా, అల్లాహ్ కు ప్రతి దానిని గురించి బాగా తెలుసు[39].

63. మరియు ఒకవేళ నీవు వారితో: "ఆకాశం నుండి

---

[39] అల్లాహ్ (సు.తా.) ఇహలోకంలో ప్రసాదించే ధనసంపత్తులకు విశ్వాసంతో, సత్కార్యాలతో సంబంధం లేదు. అల్లాహ్ (సు.తా.) ధనసంపత్తులు, హోదాలు ఇచ్చేది లేక పేదవారిగా ఉంచేది కూడా మానవులను పరీక్షించడానికే. ఇహలోక జీవితం అతి స్వల్పమైనది. కానీ శాశ్వతమైన పరలోక జీవితంలో కేవలం విశ్వాసులై సత్కార్యాలు చేసి అల్లాహ్ (సు.తా.) అనుమతితో స్వర్గం పొందిన వారికే ఎడతెగని శాశ్వత సుఖసంతోషాలు ఉంటాయి.

నీటిని కురిపించి, దాని నుండి నిర్జీవంగా ఉన్న భూమికి జీవితాన్ని ఇచ్చింది ఎవరు?" అని అడిగితే, వారు తప్పకుండా: "అల్లాహ్!" అని అంటారు. నీవు ఇలా అను: "సర్వస్తోత్రాలకు అర్హుడు అల్లాహ్ మాత్రమే!" కాని చాలా మంది అర్థం చేసుకోలేరు[40].

64. మరియు ఈ ప్రాపంచిక జీవితం కేవలం వినోద కాలక్షేపం మరియు క్రీడ మాత్రమే. మరియు అసలు పరలోక గృహ జీవితమే వాస్తవమైన జీవితం. ఇది వారు తెలుసుకుంటే ఎంత బాగుండేది!

65. వారు నావలోకి ఎక్కినప్పుడు తమ భక్తిని కేవలం అల్లాహ్ కు మాత్రమే ప్రత్యేకించుకొని ఆయననే ప్రార్థిస్తారు; కాని ఆయన వారిని రక్షించి నేల మీదకు తీసుకు రాగానే ఆయనకు సాటి కల్పించ

---

[40] దీనిని అర్థం చేసుకోవటానికి వారు తమ తెలివిని ఉపయోగించరు. కావున వారు విగ్రహాలను, జిన్నాతులను, చచ్చినవారిని, పుణ్యపురుషులను, దేవదూతలను మొదలైన వాటిని తమ ఆరాధ్య దైవాలుగా చేసుకుంటారు.

సాగుతారు[41].

**66.** ఈ విధంగా మేము వారికి ప్రసాదించిన వాటికి కృతఘ్నులై (ప్రాపంచిక) భోగభాగ్యాలలో మునిగి వుంటారు. (దాని ఫలితం) వారు ముమ్ముందు తెలుసు కుంటారు.

**67.** ఏమీ? వారికి తెలియదా? నిశ్చయంగా మేము హరమ్ ను (మక్కాను) ఒక శాంతి నిలయంగా నెలకొల్పామని![42] మరియు వారి చుట్టుప్రక్కల ఉన్న ప్రజలు వారి నుండి లాక్కో బడుతున్నారని? అయినా వారు అసత్యాన్ని నమ్మి, అల్లాహ్ అనుగ్రహాన్ని తిరస్కరిస్తారా?

**68.** మరియు అల్లాహ్ మీద అబద్ధాలు కల్పించే వాని కంటే, లేక తన వద్దకు సత్యం వచ్చినపుడు దానిని అబద్ధమని తిరస్కరించే వాని కంటే, ఎక్కువ దుర్మార్గుడు ఎవడు? ఏమీ? ఇలాంటి సత్యతిరస్కారులకు నరకమే నివాస స్థలం కాదా?

---

[41] ఇక్రిమ ('ర.ది.'అ) మక్కా విజయం సమయంలో మక్కా విడిచి పారిపోతాడు. అతడు ఒక నావలోకి ఎక్కి పోతూ ఉండగా అది ప్రమాదంలో చిక్కుకుంటుంది. దానిలో ఉన్నవారు పరస్పరం ఇలా చెప్పు కుంటారు: "అల్లాహ్ (సు.తా.) ను వేడుకోండి. ఆయన తప్ప మమ్మల్ని మరెవ్వరూ కాపాడలేరు." అప్పుడు అతడు ఆలోచిస్తాడు: "సముద్రంలో అల్లాహ్ (సు.తా.) తప్ప మరొకరు కాపాడలేకుంటే నేలపై కూడా ఇతరులెవ్వరూ కాపాడలేరు. ఒకవేళ తాను ఇక్కడ నుండి బ్రతికి బయటపడితే దైవప్రవక్త ('స'అస) సన్నిధిలోకి పోయి ఇస్లాం స్వీకరిస్తాను." అని అనుకుంటాడు. అదేవిధంగా జరుగుతుంది. అతడు (ర'ది.'అ.) ఇస్లాం స్వీకరించి ఇస్లాం ప్రచారంలో చాలా పాటుపడ్డాడు. (ఇబ్నె-కసీ'ర్)

[42] చూడండి, 28:57.

69. మరియు ఎవరైతే మా కొరకు హృదయపూర్వకంగా పాటుపడతారో, వారికి మేము మా మార్గాల వైపునకు మార్గదర్శకత్వం చేస్తాము. మరియు నిశ్చయంగా, అల్లాహ్ సజ్జనులకు తోడుగా ఉంటాడు.

# 30. అర్-రోమ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. అలిఫ్-లామ్-మీమ్[1]
2. రోమన్ లు పరాజితులయ్యారు.
3. తమ పొరుగు భూభాగంలోనే! మరియు వారు తమ ఈ పరాజయం తరువాత, తిరిగి విజేతలు కాగలరు[2] -
4. (రాబోయే) కొన్ని[3] సంవత్సరాలలోనే. మొదట అయినా, తరువాత అయినా నిర్ణయాధికారం కేవలం అల్లాహ్ దే మరియు ఆ రోజు విశ్వాసులు సంతోష పడతారు;
5. అల్లాహ్ ప్రసాదించిన సహాయానికి[4]. ఆయన తనకు ఇష్టమైన వారికి సహాయం చేస్తాడు. మరియు ఆయనే సర్వశక్తి మంతుడు, అపార కరుణా ప్రదాత.
6. మరియు (ఇది) అల్లాహ్ చేసిన వాగ్దానం. అల్లాహ్ తన వాగ్దానాన్ని భంగ పరచడు, కానీ వాస్తవానికి

---

[*] [అర్-రోమ్ అంటే రోమన్ సామ్రాజ్యము]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

[2] పొరుగు నేల అంటే షామ్ మరియు ఫలస్తీన్.

[3] బిద్ ఇన్: అంటే, 3 నుండి 10 అని అర్థం.

[4] ఇది దాదాపు ఎనిమిది సంవత్సరాల తరువాత 2 హిజ్రీలో (622 క్రీ.స్తు శకంలో) కాబోయే బద్ర్ యుద్ధం గురించి చెప్పుతోంది.

చాలా మందికి ఇది తెలియదు[5].

7. వారికి ఇహలోక జీవితపు బాహ్యారూపం మాత్రమే తెలుసు మరియు వారు పరలోకాన్ని గురించి ఏమరుపాటులో పడి ఉన్నారు.

8. ఏమీ? వారు తమలో తాము (ఎన్నడూ) ఆలోచించలేదా? ఆకాశాలనూ, భూమినీ మరియు వాటి మధ్య ఉన్నదంతా, అల్లాహ్ సత్యంతో ఒక నిర్ణీత గడువు కొరకు మాత్రమే సృష్టించాడని? అయినా నిశ్చయంగా ప్రజలలో చాలా మంది తమ ప్రభువును దర్శించవలసి వున్న వాస్తవాన్ని తిరస్కరిస్తున్నారు.

9. ఏమీ? వీరు భూమిపై ప్రయాణం చేయలేదా? వీరి పూర్వీకుల గతి ఏమయిందో చూడటానికి? వారు, వీరి కంటే ఎక్కువ బలవంతులుగా ఉండేవారు మరియు వారు భూమిని బాగా దున్నేవారు, సేద్యం చేసేవారు మరియు దానిపై, వీరి కట్టడాల కంటే ఎక్కువ కట్టడాలు కట్టారు[6] మరియు వారి వద్దకు వారి సందేశహరులు, స్పష్టమైన సూచనలు తీసుకొని వచ్చారు. అల్లాహ్ వారి కెలాంటి అన్యాయం చేయలేదు, కాని వారే తమకు తాము అన్యాయం చేసుకున్నారు.

10. చివరకు చెడుకార్యాలు చేసిన వారి ముగింపు

---

[5] ఇది రోమన్ లు తిరిగి విజేతలౌతారన్న వాగ్దానం. అది పూర్త అయింది.

[6] వంకర అక్షరాలలో ఉన్న వాక్యం నోబుల్ ఖుర్ఆన్ లో ఈ విధంగా వ్యాఖ్యానించబడింది: "వారు దానిని వీరి కంటే ఎక్కువ సంఖ్యంలో వసింపజేశారు."

చెడుగానే జరిగింది. ఎందుకంటే, వారు అల్లాహ్ సూచనలను అబద్ధాలని నిరాకరించేవారు. వాటిని గురించి ఎగతాళి చేసేవారు.

11. అల్లాహ్ యే సృష్టి ప్రారంభిస్తాడు, తరువాత దానిని తిరిగి ఉనికిలోకి (పూర్వ స్థితిలోకి) తెస్తాడు. ఆ తరువాత మీరంతా ఆయన వైపునకే మరలింప బడతారు.

12. మరియు ఆ ఘడియ (పునరుత్థానం) ఆసన్నమైన రోజు, అపరాధులందరూ నిరాశ చెందుతారు.

13. మరియు వారు అల్లాహ్ కు భాగస్వాములుగా కల్పించిన వారెవ్వరూ వారి సిఫారసు చేయజాలరు. మరియు వారు కల్పించుకున్న తమ భాగస్వాములను తిరస్కరిస్తారు.

14. మరియు ఆ ఘడియ (పునరుత్థానం) ఆసన్నమైన రోజు, ఆ రోజు వారు (ప్రజలు), వేర్వేరు వర్గాలలో విభజింప బడతారు.

15. అప్పుడు ఎవరైతే, విశ్వసించి, సత్కార్యాలు చేసి ఉంటారో, వారు ఉద్యానవనంలో ఆనందంగా ఉంచబడతారు.

16. మరియు ఎవరైతే సత్యతిరస్కారులై మా సూచనలను మరియు పరలోక సమావేశాన్ని తిరస్కరించారో, అలాంటి వారు శిక్ష కొరకు హాజరు చేయబడతారు[7].

17. కావున, మీరు సాయంత్రము వేళ మరియు

---

[7] చూడండి, 7:147.

ఉదయం పూట అల్లాహ్ పవిత్రతను కొనియాడండి.

**18.** మరియు ఆకాశాలలోనూ మరియు భూమిలోనూ సర్వస్తోత్రాలు ఆయన (అల్లాహ్) కే మరియు సంధ్యాకాలంలోనూ మరియు మధ్యాహ్న కాలంలోనూ (స్తోత్రాలు ఆయనకే)![8]

**19.** ఆయన సజీవిని నిర్జీవి నుండి తీస్తాడు. మరియు నిర్జీవిని సజీవి నుండి తీస్తాడు. మరియు ఆయన భూమి మృతి చెందిన తరువాత దానికి ప్రాణం పోస్తాడు. ఇదే విధంగా మీరు కూడా (గోరీల నుండి) వెలికి తీయబడతారు.

**20.** మరియు ఆయన సూచనలలో ఒకటి మిమ్మల్ని మట్టి నుండి సృష్టించటం[9]. ఆ తరువాత మీరు మానవులుగా (భూమిలో) వ్యాపిస్తున్నారు!

**21.** మరియు ఆయన సూచనలలో; ఆయన మీ కొరకు మీ జాతి నుండియే - మీరు వారి వద్ద సౌఖ్యం పొందటానికి- మీ సహవాసులను(అజ్వాజ్'లను) పుట్టించి, మీ మధ్య ప్రేమను మరియు కారుణ్యాన్ని కలిగించడం. నిశ్చయంగా, ఇందులో ఆలోచించే వారికి ఎన్నో సూచనలున్నాయి.

**22.** మరియు ఆయన సూచనలలో ఆయన ఆకాశాలనూ మరియు భూమినీ సృష్టించడం; మరియు మీ భాషలలో మరియు మీ రంగులలో ఉన్న విభేదాలు

---

[8] ఈ రెండు ఆయతులలో ప్రతి దినపు ఐదు నమా'జుల ప్రస్తావన ఉంది. తుమ్సూన అంటే మగ్రిబ్ మరియు ఇషా నమా'జులు. తు'స్ బి'హూన అంటే ఫజ్ర్ నమా'జు అని అర్థం (ఫ'త్హ్ అల్-ఖదీర్). ఇంకా చూడండి, 11:114, 17:78 20:130.

[9] చూడండి, 3:59, 23:12 మరియు ఇతర చోట్లలో కూడా.

కూడా ఉన్నాయి. నిశ్చయంగా, ఇందులో జ్ఞానులకు ఎన్నో సూచనలున్నాయి.

23. మరియు ఆయన సూచనలలో, మీరు రాత్రిపూట మరియు పగటి పూట, నిద్ర పోవటం మరియు మీరు ఆయన అనుగ్రహాన్ని అన్వేషించడం కూడా ఉన్నాయి. నిశ్చయంగా, ఇందులో శ్రద్ధతో వినేవారికి ఎన్నో సూచనలున్నాయి.

24. మరియు ఆయన సూచనలలో, ఆయన మీకు మెరుపును చూపించి, భయాన్ని మరియు ఆశను కలుగజేయడం[10]; మరియు ఆకాశం నుండి నీటిని కురిపించి దానితో నిర్జీవి అయిన భూమికి ప్రాణం పోయడం కూడా ఉన్నాయి. నిశ్చయంగా, ఇందులో బుద్ధిమంతులకు ఎన్నో సూచనలున్నాయి.

25. మరియు ఆయన సూచనలలో, ఆయన ఆజ్ఞతో భూమ్యాకాశాలు నిలకడ కలిగి ఉండటం[11]. ఆ తరువాత ఆయన మిమ్మల్ని ఒక్క పిలుపు పిలువగానే మీరంతా భూమి నుండి లేచి ఒకేసారి బయటికి రావటం కూడా ఉన్నాయి.

26. మరియు ఆకాశాలలో మరియు భూమిలో ఉన్న సమస్తమూ ఆయనదే. అన్నీ ఆయనకే ఆజ్ఞావర్తనులై ఉంటాయి.

27. మరియు ఆయనే సృష్టి ఆరంభించిన వాడు, ఆ

---

[10] వర్షం కురువవచ్చనే ఆశ. చూడండి, 13:12.
[11] చూడండి, 13:2.

తరువాత దానిని తిరిగి ఉనికిలోకి తెచ్చేవాడు[12]. ఇది ఆయనకు ఎంతో సులభమైనది. భూమ్యాకాశాలలో ఆయన సామ్యమే సర్వోన్నతమైనది[13]. ఆయనే సర్వశక్తిమంతుడు, మహా వివేచనాపరుడు.

**28.** ఆయన, స్వయంగా మీకే చెందిన ఒక ఉపమానాన్ని మీకు తెలుపుతున్నాడు. ఏమీ? మేము మీకు జీవనోపాధిగా సమకూర్చిన దానిలో మీ బానిసలు మీతో పాటు సరిసమానులు గా, భాగస్వాములు కాగలరా? మీరు పరస్పరం ఒకరి పట్ల నొకరు భీతి కలిగి ఉన్నట్లు, వారి పట్ల కూడా భీతి కలిగి ఉంటారా? ఈ విధంగా మేము బుద్ధిమంతులకు మా సూచనలను వివరిస్తూ ఉంటాము[14].

**29.** కాని దుర్మార్గులైనటువంటి వారు, తెలివి లేనిదే, తమ కోరికలను అనుసరిస్తారు. అల్లాహ్ మార్గభ్రష్టత్వంలో వదిలిన వ్యక్తికి

[12] చూడండి, 10:4.
[13] చూడండి, 42:11.
[14] చూడండి, 16:75-76. ఇటువంటి సామెతలకు. మానవులు, తమతోటిమానవులైనబానిసలనుతమతో పాటుసమానులుగా స్వీకరించలేరు. అయితే అల్లాహ్ (సు.తా.) సర్వసృష్టికర్త తాను సృష్టించినదానినితనకుసమానంగాఏవిధంగాస్వీకరించగలడు. ఆయన (సు.తా.) ను వదలి, ఆయన పుట్టించిన వాటిని ఆరాధించటం ఎలా క్షమించగలడు. అందుకే ఆయన ఖుర్ఆన్ లో వ్యక్తం చేశాడు. షిర్క్ (అల్లాహ్ కు సాటి కల్పించడం) అల్లాహ్ (సు.తా.) ఎన్నటికీ క్షమించడు.

మార్గదర్శకత్వం ఎవడు చేయగలడు?[15] మరియు వారికి సహాయపడేవారు ఎవ్వరూ ఉండరు.

**30.** కావున నీవు నీ ముఖాన్ని, ఏకాగ్రచిత్తంతో, సత్యధర్మం (ఇస్లాం) దిశలో స్థిరంగా నిలుపు. అల్లాహ్ మానవులను ఏ స్వభావంతో పుట్టించాడో, ఆ స్వభావం పైననే వారు ఉంటారు[16]. అల్లాహ్ సృష్టి స్వభావాన్ని (ఎవ్వరూ) మార్చలేరు. ఇదే సరైన ధర్మం, కాని చాలా మంది ఇది ఎరుగరు.

**31.** (ఎల్లప్పుడు) మీరు ఆయన వైపునకే పశ్చాత్తాపంతో మరలుతూ ఉండండి. మరియు ఆయన యందు

---

[15] ఎందుకంటే అల్లాహ్ (సు.తా.) తరఫు నుండి వారికే మార్గదర్శకత్వం లభిస్తుంది, ఎవరైతే మార్గదర్శకత్వాన్ని ఆపేక్షిస్తారో! ఇక ఎవరైతే హృదయపూర్వకంగా అల్లాహ్ (సు.తా.) మార్గదర్శకత్వాన్ని ఆపేక్షించరో ఆయన వారిని మార్గభ్రష్టత్వంలో వదలుతాడు. ఇదే సున్నతుల్లాహ్ - అల్లాహ్ (సు.తా.) సంప్రదాయం. ఈ విషయం ఖుర్ఆన్ లో ఎన్నో సార్లు విశదీకరించబడింది. అల్లాహ్ (సు.తా.) మానవులకు మరియు జిన్నాతులకు మంచి చెడుల మధ్య విచక్షణా జ్ఞానాన్నొసంగి; విశ్వసించి, మంచి పనులు చేసేవారికి స్వర్గం మరియు చెడుదారి పట్టేవారికి నరకం, అని వ్యక్తం చేశాడు. మరియు ప్రతి యుగం వారికి, అల్లాహ్ (సు.తా.) ను మాత్రమే ఆరాధించమని మరియు మంచిని చేయమని ఆదేశించటానికి, చెడునుండి నివారించటానికి మార్గదర్శకులుగా ప్రవక్తలను పంపి, వారి వద్దకు దివ్యజ్ఞానం (వ'హీ) పంపుతూ వచ్చాడు. చూడండి, 14:4 మరియు 2:7.

[16] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'ప్రతి వ్యక్తి పుట్టుకతో స్వాభావికంగా అల్లాహ్ (సు.తా.) కు విధేయుడు (ముస్లిం) అయి ఉంటాడు. కానీ ముస్లిమేతరులైన అతని తల్లిదండ్రులు అతనిని యూదుడు, క్రైస్తవుడు, మజూసీ (లేక ఇతర మతస్తుడి) గా చేస్తారు.' ('స'హీ'హ్ బు'ఖారీ మరియు 'స'హీ'హ్ ముస్లిం)

భయభక్తులు కలిగి ఉండండి. మరియు నమాజ్ స్థాపించండి. మరియు ఆయన (అల్లాహ్) కు సాటి (భాగస్వాములు) కల్పించే వారిలో చేరిపోకండి;

32. వారిలో ఎవరైతే, తమ ధర్మాన్ని విభజించి వేర్వేరు తెగలుగా చేసుకున్నారో! ప్రతివర్గం వారు తమ వద్దనున్న దాని (సిద్ధాంతం) తోనే సంతోషపడుతున్నారు[17].

33. మరియు మానవులకు ఆపద వచ్చినపుడు, వారు తమ ప్రభువు వైపునకు పశ్చాత్తాపంతో మరలి ఆయనను వేడుకుంటారు. ఆ తరువాత ఆయన కారుణ్యం నుండి కొంత వారికి రుచి చూపించినప్పుడు, వారిలో కొందరు తమ ప్రభువుకు సాటి (భాగస్వాములను) కల్పించసాగుతారు[18].

34. మేము వారికి ప్రసాదించిన దానికి (అనుగ్రహాలకు) కృతఘ్నత చూపటానికి (వారు అలా చేస్తారు). సరే! మీరు కొంత కాలం సుఖసంతోషాలు అనుభవించండి, త్వరలోనే మీరు (మీ ముగింపును) తెలుసుకుంటారు.

---

[17] అంటే ప్రతి ధర్మం, తెగ లేక వర్గం వారు తాము అనుసరించే దానితోనే సంతుష్టులై ఉంటారు. మరియు వారి వద్ద దానిని సమర్థించే వాదాలు కూడా ఉంటాయి. వాస్తవానికి సత్యం మీద ఒకే ఒక్క ధర్మం, తెగ ఉండగలదు. ఆ ధర్మమే - అల్లాహ్ (సు.తా.) మార్గదర్శకత్వం చేసిన, ప్రవక్తలందరూ మరియు చివరి ప్రవక్త ము'హమ్మద్ ('స'అస') కూడా అనుసరించి, బోధించిన ధర్మం - ఇస్లాం; మహాప్రవక్త ('స'అస) మరియు అతని అనుచరు(ర'ది.'అన్హుమ్)లు అనుసరించిన ధర్మం. ఇంకా చూడండి, 6:159, 21:92-93 మరియు 23:52-53.

[18] చూడండి, 16:54.

**35.** లేక మేము వారిపై ఏదైనా ప్రమాణాన్ని[19] అవతరింప జేశామా, అది వారు ఆయనకు కల్పించే భాగస్వాములను గురించి పలుకటానికి?[20]

**36.** మరియు మేము మానవులకు కారుణ్యపు రుచి చూపించినప్పుడు వారు దానితో చాలా సంతోషపడతారు. కాని వారు తమ చేతులారా చేసుకున్న కర్మల ఫలితంగా[21] వారికేదైనా కీడు కలిగితే నిరాశ చెందుతారు.

**37.** ఏమీ? వారికి తెలియదా? అల్లాహ్ తాను కోరిన వారికి జీవనోపాధిని పుష్కలంగా ఇస్తాడని మరియు (తాను కోరిన వారికి) మితంగా ఇస్తాడని? నిశ్చయంగా, ఇందులో విశ్వసించేవారికి ఎన్నో సూచనలున్నాయి.

**38.** కావున నీవు నీ బంధువుకు అతని హక్కు ఇవ్వు మరియు యాచించని పేదవానికి మరియు బాటసారికి (కూడా)[22]. ఇది అల్లాహ్ ప్రసన్నతను కోరే వారికి ఎంతో ఉత్తమమైనది. మరియు ఇలాంటి వారే సాఫల్యము పొందేవారు.

---

[19] సు'ల్ తానున్: అంటే ఇక్కడ దివ్యజ్ఞానం వహీ అని అర్థం.

[20] చూడండి, 35:40.

[21] చూడండి, 4:79.

[22] చూడండి, 17:26. బంధువులకు, పేదవారికి మరియు బాటసారులకు మీరు ఇచ్చేది వారిపై చేసిన అనుగ్రహం కాదు. మీరు వారి హక్కు చెల్లిస్తున్నారు. పేదవాడైన దగ్గరి బంధువుకు ఇవ్వటం వల్ల రెండింతలు పుణ్యం దొరుకుతుంది. ఒకటి నీవు నీ దగ్గరివానికి ఇచ్చినందుకు, రెండవది పేదవానికి ఇచ్చినందుకు. ('స'హీ'హ్ 'హదీసు').

**39.** మరియు మీరు ప్రజలకు - రిబా[23] (వడ్డీ మీద డబ్బు /కానుకలు) ఇచ్చి దాని ద్వారా వారి సంపద నుండి వృద్ధి పొందాలని - ఇచ్చే ధనం, అల్లాహ్ దృష్టిలో ఏ మాత్రం వృద్ధి పొందదు. మరియు మీరు అల్లాహ్ ప్రసన్నతను పొందే ఉద్దేశంతో ఏదైనా దానం (జకాత్) చేస్తే అలాంటి వారి (సంపద) ఎన్నో రెట్లు అధికమవుతుంది.

**40.** అల్లాహ్ యే మిమ్మల్ని పుట్టించాడు, తరువాత జీవనోపాధినిచ్చాడు. తరువాత ఆయనే మిమ్మల్ని మరణింపజేస్తాడు. ఆ తరువాత మళ్ళీ బ్రతికిస్తాడు. అయితే? మీరు (అల్లాహ్ కు) సాటిగా (భాగస్వాములుగా) కల్పించిన వారిలో, ఎవడైనా వీటిలో నుండి ఏదైనా ఒక్క పనిని చేయగలవాడు ఉన్నాడా![24] ఆయన సర్వలోపాలకు అతీతుడు, మీరు సాటి కల్పించే

---

[23] రిబా': వడ్డీ అనే పదం ఖుర్ఆన్ అవతరణా క్రమంలో ఈ ఆయత్ లో మొదటిసారి వచ్చింది. దాని అర్థం: ఏదైనా ఇచ్చి - ఇచ్చిన దానికంటే - ఎక్కువ తీసుకోవటం. ఇబ్నె 'అబ్బాస్ మరియు చాలామంది ఇతర 'స'హాబీలు ('రది.'అన్హుమ్) ఈ ఆయత్ లో వచ్చిన పదం రిబా' అంటే ఈ విధమైన వ్యాఖ్యానం కూడా ఇచ్చారు: ఒక పేదవాడు ఒక ధనవంతునికి లేక ఒక వ్యక్తి తన రాజుకు, లేక ఒక సేవకుడు తనను పెట్టుకున్న వానికి, తాను ఇచ్చిన దాని కంటే ఎక్కువ తిరిగి వచ్చుననే ఆశతో, ఇచ్చే బహుమానం, అని. ఇచ్చేటప్పుడు, ఎక్కువ తిరిగి వస్తుంది అనే భావన ఉండటం వల్లనే, ఇది నిషిద్ధం చేయబడింది (ఇబ్నె-కసీ'ర్, అయ్ సర్ అత్తఫాసీర్). చూడండి, 3:130 మరియు 2:275-281.

[24] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'ఒక దుష్టుడు మరణిస్తే, కేవలం మానవులే గాక పశుపక్షులు, చెట్లు చేమలు కూడా వాని నుండి శాంతి పొందుతాయి.' 'స'హీ'హ్ బు'ఖారీ, ముస్లిం)

భాగస్వాముల కంటే ఆయన మహోన్నతుడు.

**41.** మానవులు తమ చేజేతులా సంపాదించుకున్న దాని ఫలితంగా భూమిలో మరియు సముద్రంలో కల్లోలం వ్యాపించింది. ఇది వారిలో కొందరు చేసిన దుష్కర్మల ఫలితాన్ని రుచి చూపటానికి, బహుశా ఇలాగైనా వారు (అల్లాహ్ వైపునకు) మరలుతారేమోనని!

**42.** వారితో ఇలా అను: "భూమిలో ప్రయాణం చేసి చూడండి, మీకు పూర్వం గతించిన వారి ముగింపు ఎలా జరిగిందో! వారిలో చాలా మంది బహుదైవారాధకు లుండిరి."

**43.** కావున నీవు నీ ముఖాన్ని సరైన ధర్మం (ఇస్లాం) వైపునకే స్థిరంగా నిలుపు[25] - అల్లాహ్ తరఫు నుండి - ఆ రోజు రాకముందే దేనినైతే ఎవ్వడూ తొలగించలేడో! ఆ రోజు వారు పరస్పరం చెదిరిపోయి వేరవుతారు[26].

**44.** సత్యాన్ని తిరస్కరించినవాడు, తన తిరస్కార ఫలితాన్ని అనుభవిస్తాడు. మరియు సత్కార్యాలు చేసిన వారు, తమ కొరకే (సాఫల్యమార్గాన్ని) తయారు చేసుకుంటారు.

**45.** ఇది ఆయన (అల్లాహ్), తన అనుగ్రహంతో విశ్వసించి సత్కార్యాలు చేసే వారికి ప్రతిఫల

---

[25] అల్లాహ్ (సు.తా.) దృష్టిలో సత్యధర్మం: అంటే అల్లాహ్ (సు.తా.) కు దాస్యం - తనను తాను అల్లాహ్ (సు.తా.) అభీష్టానికి అప్పగించడం (ఇస్లాం) - మాత్రమే. చూడండి, 3:19.

[26] ఒకటి విశ్వాసులది, రెండవది సత్యతిరస్కారులది.

మివ్వటానికి[27]. నిశ్చయంగా, ఆయన సత్యతిరస్కారులను ప్రేమించడు.

**46.** ఇక ఆయన సూచనలలో ఆయన గాలులను శుభవార్తలిచ్చేవిగా పంపి మీకు తన కారుణ్యాన్ని రుచి చూపటం మరియు ఆయన ఆజ్ఞతో ఓడలను నడిపి, మిమ్మల్ని ఆయన అనుగ్రహాన్ని అన్వేషించనివ్వటం కూడా ఉన్నాయి. ఇవన్నీ, బహుశా మీరు కృతజ్ఞతలు చూపుతారేమోనని!

**47.** మరియు వాస్తవానికి మేము నీకు పూర్వం కూడా, సందేశహరులను తమ తమ జాతి వారి వద్దకు పంపాము[28]. వారు, వారి వద్దకు స్పష్టమైన సూచనలను తీసుకొని వచ్చారు. ఆ తరువాత కూడా నేరం చేసిన వారికి తగిన ప్రతీకారం[29] చేశాము. మరియు విశ్వాసులకు సహాయం చేయటం మా కర్తవ్యం.

**48.** అల్లాహ్ యే గాలులను పంపేవాడు, కావున అవి మేఘాలను పైకి ఎత్తుతాయి, ఆ తరువాత ఆయన వాటిని తాను కోరినట్లు ఆకాశంలో వ్యాపింపజేస్తాడు. మరియు వాటిని ముక్కలు ముక్కలుగా చేసి, తరువాత వాటి మధ్య నుండి వర్షాన్ని కురిపిస్తాడు.

---

[27] స్వర్గం పొందటానికి కేవలం విశ్వసించి సత్కార్యాలు చేయటమే సరిపోదు. దానికి అల్లాహ్ (సు.తా.) అనుగ్రహం కూడా ఉండాలి. ఆయనయే సత్కార్యాల ప్రతిఫలాన్ని ఎన్నోరెట్లు అధికం చేసి ఇస్తాడు.

[28] చూడండి, 10:74.

[29] అల్-ముంతఖిమ్ (సేకరించబడిన పదం): Retributor, Avenger of evil, ప్రతీకారం తీర్చుకునే, ప్రతీకారం చేసే, దుష్టులను శిక్షించేవాడు. చూడండి, 32:22.

ఆయన దానిని తన దాసులలో తాను కోరిన వారిపై కురిపించగా వారు సంతోషపడతారు!

**49.** మరియు వాస్తవానికి, అది (వర్షం) కురవక ముందు వారు ఎంతో నిరాశ చెంది ఉండేవారు.

**50.** కావున (ఓ మానవుడా!) అల్లాహ్ కారుణ్య చిహ్నాలను చూడు: ఆయన నిర్జీవంగా ఉన్న భూమిలో ఏ విధంగా ప్రాణం పోస్తాడో! నిశ్చయంగా, ఇదే విధంగా ఆయన (మరణానంతరం) మృతులకు కూడా ప్రాణం పోస్తాడు! మరియు ఆయన ప్రతిదీ చేయగల సమర్థుడు.

**51.** మరియు మేము గాలిని పంపితే, దాని నుండి వారి పంటలను పసుపు పచ్చగా మారి పోవటాన్ని చూసిన తరువాత వారు కృతఘ్నతకు లోనవుతారు (సత్యతిరస్కారు లవుతారు).

**52.** నిశ్చయంగా, నీవు (ఓ ముహమ్మద్!) మృతులకు వినిపించలేవు. మరియు నీవు వెనుదిరిగి పోయే చెవిటివారికి కూడా సందేశాన్ని వినిపించలేవు.

**53.** మరియు నీవు అంధులను, వారి మార్గభ్రష్టత్వం నుండి తప్పించి, వారికి మార్గదర్శకత్వం చేయలేవు. నీవు కేవలం విశ్వసించి, అల్లాహ్ కు విధేయులు (ముస్లింలు) అయిన వారికి మాత్రమే మా సూచనలు వినిపించగలవు[30].

**54.** అల్లాహ్ యే మిమ్మల్ని బలహీన స్థితిలో పుట్టించినవాడు. మళ్ళీ ఆ బలహీన స్థితి

---

[30] ఇటువంటి ఆయత్ లకు చూడండి, 27:80-81.

తరువాత మీకు బలాన్ని ఇచ్చాడు. ఆ బలం తరువాత మళ్ళీ మిమ్మల్ని బలహీనులుగా, ముసలివారిగా చేశాడు. ఆయన తాను కోరింది సృష్టిస్తాడు. మరియు కేవలం ఆయనే సర్వజ్ఞుడు, సర్వసమర్థుడు.

**55.** మరియు ఆ ఘడియ[31] సంభవించిన రోజు, అపరాధులు, ప్రమాణం చేస్తూ: "మేము ఒక ఘడియ సేపు కంటే ఎక్కువ కాలం (ప్రపంచంలో) ఉండలేదు" అని అంటారు. ఇదే విధంగా వారు (ప్రాపంచిక జీవితంలో) భ్రమలో ఉండేవారు[32].

**56.** మరియు జ్ఞానం మరియు విశ్వాసం అనుగ్రహింప బడినవారు ఇలా అంటారు: "వాస్తవానికి అల్లాహ్ మూలగ్రంథం[33] ప్రకారం మీరు పునరుత్థాన దినం వరకు (ఇహలోకం లో) ఉంటిరి. ఇక ఇదే ఆ పునరుత్థాన దినం, కాని నిశ్చయంగా! మీరిది తెలుసు కోలేక పోయారు."

**57.** కనుక ఆ రోజు దుర్మార్గులకు, వారి సాకులు ఏ మాత్రం ప్రయోజనకరం కావు మరియు వారికి తమను తాము సరిదిద్దుకునే అవకాశం కూడా ఇవ్వబడదు.

**58.** మరియు వాస్తవానికి, మేము ఈ ఖుర్ఆన్ లో ప్రజలకు, ప్రతి ఒక్క విషయపు ఉపమానాన్ని

---

[31] ఆ ఘడియ అంటే పునరుత్థాన ఘడియ. అదే ఈ లోకపు అంతిమ ఘడియ.

[32] చూడండి, 17:52.

[33] కితాబిల్లాహి: అంటే అల్లాహ్ వ్రాసి ఉంచిన లౌ'హె మ'హ్ ఫూ''జ్, మూలగ్రంథం.

బోధించాము[34]. అయినా నీవు వారి వద్దకు ఏ అద్భుత సూచన (ఆయత్) తెచ్చినా, వారిలో సత్యతిరస్కారులైన వారు ఇలా అంటారు: "మీరు కేవలం బూటకాలే పలుకు తున్నారు."

**59.** ఈ విధంగా, అల్లాహ్ జ్ఞానహీనుల హృదయాల మీద ముద్ర వేస్తాడు[35].

**60.** కావున నీవు సహనం వహించు! నిశ్చయంగా, అల్లాహ్ వాగ్దానం సత్యం! కావున విశ్వాసహీనులు నిన్ను వ్యాకుల పరచరాదు సుమా!

---

[34] చూడండి, 39:27.
[35] చూడండి, 2:7.

# 31. లుఖ్మాన్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. అలిఫ్-లామ్-మీమ్[1].
2. ఇవి వివేకంతో నిండి ఉన్న గ్రంథ సూచనలు (ఆయాత్)
3. (ఇందులో) సజ్జనులకు[2] మార్గదర్శకత్వమూ మరియు కారుణ్యమూ ఉన్నాయి.
4. (వారికే) ఎవరైతే నమాజ్ ను స్థాపించి విధిదానం (జకాత్) ఇస్తారో[3] మరియు పరలోక జీవితం మీద దృఢమైన నమ్మకం కలిగి ఉంటారో;
5. అలాంటి వారే, తమ ప్రభువు తరఫు నుండి (వచ్చిన) మార్గదర్శకత్వం మీద ఉన్నవారు. మరియు అలాంటి వారే సాఫల్యం పొందేవారు.
6. మరియు మానవులలో కొందరు - జ్ఞానం లేక,

---

[*] [లుఖ్మాన్ – లుఖ్మాన్ అలైహిస్సలామ్]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

[2] ము'హ్ సినీన్, ము'హ్ సిన్ (ఏ.వ.): దీనికి మూడు అర్థాలున్నాయి. 1) ఉపకారం చేసేవాడు; తన తల్లి దండ్రులకు, బంధువులకు, మొదలైనవారికి. 2) సత్కార్యాలు చేసేవాడు మరియు పాపాలనుండి దూరంగా ఉండేవాడు. 3) అల్లాహ్ (సు.తా.) యొక్క ఆరాధన - భక్తి, శ్రద్ధ, దైవభీతి మరియు ఏకాగ్రతతో - చేసేవాడు.

[3] చూడండి, 2:2-4.

వ్యర్థ కాలక్షేపం చేసే మాటలను కొని[4] - ప్రజలను అల్లాహ్ మార్గం నుండి తప్పించే వారున్నారు మరియు వారు దానిని (అల్లాహ్ మార్గాన్ని) పరిహాసం చేస్తుంటారు. అలాంటి వారికి అవమానకరమైన శిక్ష పడుతుంది.

7. అలాంటి వానికి, మా సూచనలు (ఆయాత్) వినిపింప జేసినప్పుడు, అతని రెండు చెవులలో చెవుడు ఉన్నట్లుగా, అతడు వాటిని వినసే లేదన్నట్లుగా, అహంకారంతో మరలిపోతాడు[5]. వానికి అతి బాధాకరమైన శిక్ష పడుతుందనే వార్తను వినిపించు.

8. నిశ్చయంగా, ఎవరైతే విశ్వసించి, సత్కార్యాలు చేస్తారో, వారి కొరకు పరమానందకర మైన స్వర్గ వనాలుంటాయి.

9. వారు, శాశ్వతంగా వాటిలో ఉంటారు. ఇది అల్లాహ్ యొక్క సత్య వాగ్దానం. మరియు ఆయన సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు.

10. మీరు చూస్తున్నారు కదా! ఆయన ఆకాశాలను స్థంభాలు లేకుండానే సృష్టించాడు[6]. మరియు భూమిలో పర్వతాలను నాటాడు, అది మీతో పాటు కదలకుండా ఉండాలని[7]; మరియు దానిలో ప్రతి రకమైన ప్రాణిని నివసింపజేసాడు.

---

[4] అంటే సంగీతం మరియు ఇతర వృథా మాటలలో, విషయాలలో కాలక్షేపం చేయడానికి వాడేవి.

[5] చూడండి, 23:66-67.

[6] చూడండి, 13:2.

[7] చూడండి, 16:15.

మరియు మేము ఆకాశం నుండి నీటిని కురిపించి, దానిలో రకరకాల శ్రేష్ఠమైన (పదార్థాలను)[8] ఉత్పత్తి చేశాము.

**11.** ఇదంతా అల్లాహ్ సృష్టియే! ఇక ఆయన తప్ప ఇతరులు ఏమి సృష్టించారో నాకు చూపండి. అలా కాదు ఈ దుర్మార్గులు స్పష్టంగా మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నారు.

**12.** మరియు నిశ్చయంగా, మేము లుఖ్మాన్ కు వివేకాన్ని ప్రసాదించాము[9], అతను అల్లాహ్ కు కృతజ్ఞుడుగా ఉండాలని. మరియు ఎవడైతే ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతాడో, అతడు నిశ్చయంగా, తన మేలు కొరకే కృతజ్ఞతలు తెలుపుతాడు. మరియు కృతఘ్నతకు పాల్పడిన వాడు, నిశ్చయంగా అల్లాహ్ స్వయం సమృద్ధుడు, సర్వస్తోత్రాలకు అర్హుడని (తెలుసుకోవాలి).

**13.** మరియు (జ్ఞాపకం చేసుకోండి) లుఖ్మాన్ తన కుమారునికి హితబోధ చేస్తూ ఇలా అన్నాడు: "ఓ నా పుత్రుడా! అల్లాహ్ కు సాటి (భాగస్వాములను) కల్పించకు. నిశ్చయంగా, అల్లాహ్ కు భాగస్వాములను కల్పించటం (బహుదైవారాధన) మహా దుర్మార్గము."

[8] 'జౌజిన్: అంటే ప్రతిరకమైన ధాన్యాలు మరియు ఫలాలు, (ము'హమ్మద్ జూనాగఢీ). మరొక అర్థం: రకరకాల జీవరాశి (నోబుల్ ఖుర్ఆన్). రెండూ సరైనవే. ఇంకా చూడండి, 26:7.

[9] లుఖ్మాన్ ('అ.స.): ఒక మహా సత్పురుషుడు. అల్లాహ్ (సు.తా.) అతనికి ('అ.స.) మంచి జ్ఞానం, దూరదృష్టి, దైవభీతి మరియు వివేచనాశక్తిని ప్రసాదించాడు.

14. మరియు (అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు): "మేము మానవునకు తన తల్లిదండ్రుల యెడల మంచితనంతో మెలగటం విధిగా జేశాము. అతని తల్లి అతనిని బలహీనతపై బలహీనతను సహిస్తూ (తన గర్భంలో) భరిస్తుంది మరియు ఆ బిడ్డ చనుపాలు మాన్పించే గడువు రెండు సంవత్సరాలు. నీవు నాకు మరియు నీ తల్లిదండ్రులకు కృతజ్ఞుడవై ఉండు. నీకు నా వైపునకే మరలి రావలసి ఉన్నది."[10]

15. "మరియు ఒకవేళ వారిరువురు - నీవు ఎరగని దానిని - నాకు (అల్లాహ్ కు) భాగస్వామిగా చేర్చమని, నిన్ను బలవంతం చేస్తే, వారి మాటను నీవు ఏ మాత్రం వినకు[11]. మరియు ఇహలోక విషయాలలో ధర్మసమ్మతమైన వాటిలో వారికి తోడుగా ఉండు. మరియు పశ్చాత్తాపంతో నా వైపుకు మరలేవాని మార్గాన్ని అనుసరించు. తరువాత మీరంతా నా వైపునకే మరలి రావలసి ఉన్నది. అప్పుడు నేను మీరు చేసే కర్మలను గురించి మీకు తెలుపు తాను."

16. "ఓ నా కుమారా! ఒకవేళ నీ కర్మ ఆవగింజంత ఉండి, అది ఒక పెద్ద రాతిబండలో గానీ, ఆకాశంలో గానీ లేదా భూమిలో గానీ దాగివున్నా, అల్లాహ్ దానిని తప్పక (వెలుగులోకి) తెస్తాడు. నిశ్చయంగా, అల్లాహ్ ఎంతో సూక్ష్మగ్రాహి, సర్వం తెలిసినవాడు."

---

[10] చూడండి, 17:23-24.
[11] చూడండి, 29:8.

17. “ఓ నా కుమారా! నమాజ్ స్థాపించు మరియు ధర్మాన్ని ఆదేశించు మరియు అధర్మాన్ని నిషేధించు, ఆపదలో సహనం వహించు. నిశ్చయంగా, ఇవి ఎంతో గట్టిగా ఆజ్ఞాపించబడిన విషయాలు."[12]

18. “మరియు నీ చెంపలను గర్వంతో ప్రజల యెదుట ఉబ్బించకు[13]. మరియు భూమిపై అహంకారంతో నడవకు. నిశ్చయంగా, అల్లాహ్ డాంబికాలు చెప్పుకొని, విర్రవీగే వాడంటే ఇష్టపడడు."

19. “మరియు నీ నడకలలో నమ్రత పాటించు[14]. మరియు నీ స్వరాన్ని తగ్గించు. నిశ్చయంగా, స్వరాలలో అన్నిటికంటే కరకైన (వినసొంపుకానిది) గాడిద స్వరమే!"

20. ఏమీ? ఆకాశాలలో మరియు భూమిలో ఉన్న సకల వస్తువులను వాస్తవానికి అల్లాహ్ మీకు ఉపయుక్తంగా చేశాడనీ[15] మరియు ఆయన బహిరంగంగానూ మరియు గోప్యంగానూ తన అనుగ్రహాలను, మీకు ప్రసాదించాడనీ, మీకు తెలియదా? మరియు ప్రజలలో కొందరు ఎలాంటి జ్ఞానం, మార్గదర్శకత్వం మరియు వెలుగు చూపే

---

[12] వంకర అక్షరా (Italics) లలో ఉన్నది నోబుల్ ఖుర్ఆన్ లో ఉన్న తాత్పర్యం.

[13] పైన ఉన్నది ముహమ్మద్ జూనాగఢీ గారి తాత్పర్యం. ఈ వాక్యపు తాత్పర్యం నోబుల్ ఖుర్ఆన్ లో ఇలా ఉంది: "ప్రజలతో ముఖం ప్రక్కకు త్రిప్పుకొని (చిట్లించుకొని) గర్వంతో మాట్లాడకు."

[14] చూడండి, 25:63.

[15] చూడండి, 14:32-33.

స్పష్టమైన గ్రంథం లేనిదే అల్లాహ్ ను గురించి వాదులాడే వారున్నారు!

21. మరియు వారితో: "అల్లాహ్ అవతరింపజేసిన దానిని అనుసరించండి!" అని అన్నప్పుడు, వారు: "కాదు మా తండ్రితాతలు నడిచిన మార్గాన్నే మేము అనుసరిస్తాము." అని అంటారు. ఏమీ? షైతాన్ వారిని భగభగమండే అగ్ని వైపునకు ఆహ్వానిస్తున్నప్పటికీ, (వారు అలాంటి మార్గాన్నే అనుసరిస్తారా)?[16]

22. ఎవడైతే, తన ముఖాన్ని (తనను తాను) అల్లాహ్ కు సమర్పించుకొని[17] సజ్జనుడై ఉంటాడో, అలాంటి వాడు నిస్సందేహంగా దృఢమైన ఆధారాన్ని పట్టుకున్నవాడే! మరియు సకల వ్యవహారాల ముగింపు (తీర్పు) అల్లాహ్ వద్దనే ఉంది.

23. మరియు సత్యాన్ని తిరస్కరించేవాని, తిరస్కారం నిన్ను దుఃఖానికి గురి చేయ కూడదు. వారందరి మరలింపు మా వైపునకే ఉంది; అప్పుడు మేము వారు చేసిన కర్మలను వారికి తెలుపుతాం. నిశ్చయంగా, అల్లాహ్ కు హృదయాలలో ఉన్న విషయాలు సైతం బాగా తెలుసు.

24. మేము వారిని కొంత కాలం సుఖాలను అనుభవించనిస్తాము. ఆ తరువాత మేము వారిని కఠినమైన శిక్ష వైపుకు త్రోస్తాము.

---

[16] చూడండి, 2:14 మరియు 15:17.
[17] చూడండి, 2:112.

25. ఒకవేళ మీరు వారిని: "ఆకాశాలనూ మరియు భూమినీ సృష్టించింది ఎవరు?" అని అడిగితే! వారు నిస్సంకోచంగా అంటారు: "అల్లాహ్!" అని. వారితో అను: "సర్వస్తోత్రాలకు అర్హుడు అల్లాహ్ మాత్రమే!" కాని వారిలో చాలా మందికి ఇది తెలియదు.

26. ఆకాశాలలో మరియు భూమిలో నున్న సమస్తమూ అల్లాహ్ కే చెందుతుంది. నిశ్చయంగా, అల్లాహ్! కేవలం ఆయనే సర్వసంపన్నుడు, సర్వస్తోత్రాలకు అర్హుడు.

27. ఒకవేళ వాస్తవానికి, భూమిలో ఉన్న వృక్షాలన్నీ కలములై ఈ సముద్రం మరియు దానితో పాటు అటువంటి ఏడు సముద్రాల (నీళ్ళంతా) సిరాగా ఉన్నా, అల్లాహ్ మాటలు (సూచనలు వ్రాయటానికి) పూర్తి కావు. నిశ్చయంగా అల్లాహ్ సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు[18].

28. మీ అందరినీ సృష్టించటం మరియు తిరిగి (సజీవులుగా) లేపటం ఆయనకు ఒక మానవుణ్ణి (సృష్టించి, తిరిగి లేపడం వంటిదే). నిశ్చయంగా, అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వ చూసేవాడు.

29. ఏమీ? నీకు తెలియదా (చూడటం లేదా)? నిశ్చయంగా, అల్లాహ్ రాత్రిని పగటిలోనికి ప్రవేశింప జేస్తున్నాడని మరియు పగటిని రాత్రిలోకి ప్రవేశింప

[18] ఇటువంటి ఆయత్ కు చూడండి, 18:109.

జేస్తున్నాడని[19]. మరియు సూర్యుణ్ణి మరియు చంద్రుణ్ణి నియమబద్ధులుగా చేసి ఉంచాడనీ ప్రతి ఒక్కటీ ఒక నిర్ణీత కాలంలో మరియు (పరిధిలో) తిరుగుతూ ఉంటాయనీ![20] మరియు నిశ్చయంగా, మీరు చేసేదంతా అల్లాహ్ ఎరుగునని?

**30.** ఇదంతా ఎందుకంటే! నిశ్చయంగా, అల్లాహ్ కేవలం ఆయనే సత్యం. మరియు ఆయనను వదలి వారు ఆరాధించేవన్నీ అసత్యాలు మరియు నిశ్చయంగా అల్లాహ్! కేవలం ఆయనే మహోన్నతుడు, మహనీయుడు (గొప్పవాడు).

**31.** ఏమీ? నీకు తెలియదా? మీకు కొన్ని సూచనలను తెలుపటానికి, అల్లాహ్ అనుగ్రహంతో, ఓడ సముద్రంలో పయనం చేస్తున్నదనీ? నిశ్చయంగా, ఇందులో సహనం వహించే ప్రతివానికి, కృతజ్ఞునికి, ఎన్నో సూచనలున్నాయి.

**32.** మరియు వారిని సముద్రపు అల, మేఘంగా క్రమ్ముకున్నప్పుడు, వారు పరిపూర్ణ భక్తితో అల్లాహ్ నే వేడుకుంటారు. కాని ఆయన వారిని రక్షించి ఒడ్డుకు చేర్చిన తరువాత వారిలో కొందరు (విశ్వాస-అవిశ్వాసాల) మధ్య ఆగిపోతారు[21]. మరియు మా సూచనలను,

---

[19] అంటే చలికాలంలో రాత్రి పెద్దదై పగలు చిన్నదవటం మరియు వేసవి కాలంలో పగలు పెద్దదయి రాత్రి చిన్నదవటం.

[20] ఈ నిర్ణీతకాలం, పునరుత్థానదినం కావచ్చు లేక అవి తమ పరిధిలో ఒకసారి చుట్టు తిరిగి మరల మొదటి స్థానానికి వచ్చుటకు పట్టే కాలం కావచ్చు!

[21] చూడండి, 17:67 మరియు 29:65.

కేవలం విశ్వాసఘాతకులు, కృతఘ్నులైన వారు మాత్రమే, తిరస్కరిస్తారు.

**33.** ఓ మానవులారా! మీ ప్రభువు నందే భయభక్తులు కలిగి ఉండండి. మరియు ఆ దినానికి భయపడండి, (ఏనాడైతే) తండ్రి తన కుమారునికి నష్టపరిహారం చెల్లించలేడో మరియు ఏ కుమారుడు కూడా తన తండ్రికి ఎలాంటి నష్టపరిహారం చెల్లించలేడో! నిశ్చయంగా, అల్లాహ్ వాగ్దానం సత్యం! కావున ఈ ప్రాపంచిక జీవితం మిమ్మల్ని మోసానికి గురి చేయనివ్వకూడదు. మరియు ఆ వంచకుణ్ణి (షైతానును) మిమ్మల్ని అల్లాహ్ విషయంలో వంచనకు గురి చేయనివ్వకూడదు సుమా!

**34.** నిశ్చయంగా, ఆ (అంతిమ) ఘడియ జ్ఞానం, కేవలం అల్లాహ్ కు మాత్రమే ఉంది. మరియు ఆయనే వర్షం కురిపించేవాడు మరియు గర్భాలలో ఉన్నదాని విషయం తెలిసినవాడు. మరియు తాను రేపు ఏమి సంపాదిస్తాడో, ఏ మానవుడు కూడా ఎరుగడు[22]. మరియు ఏ మానవుడు కూడా తాను ఏ భూభాగంలో మరణిస్తాడో కూడా ఎరుగడు. నిశ్చయంగా, అల్లాహ్ మాత్రమే సర్వజ్ఞుడు, సమస్తం తెలిసినవాడు (ఎరిగినవాడు).

---

[22] పై ఐదు అగోచర విషయాల జ్ఞానం కేవలం అల్లాహ్ కే ఉంది అవి : 1) అంతిమ ఘడియ సమయం, 2) వర్షం వచ్చే సమయం, 3) మాతృగర్భంలో ఉన్నదాని గతి, 4) రేపు సంభవించబోయే విషయం మరియు 5) మానవుని మరణ స్థానం ('స'హీ'హ్ బు'ఖారీ).

# 32. అస్-సజ్దహ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. అలిఫ్-లామ్-మీమ్[1]
2. నిస్సంకోచంగా ఈ గ్రంథం(ఖుర్ఆన్) అవతరణ సర్వలోకల ప్రభువు తరఫు నుండియే ఉంది
3. ఏమీ? వారు (అవిశ్వాసులు): "ఇతనే (ముహమ్మదే) దీనిని కల్పించాడు." అని అంటున్నారా?[2] అలా కాదు! వాస్తవానికి ఇది నీ ప్రభువు తరఫు నుండి వచ్చిన సత్యం. నీకు పూర్వం హెచ్చరించే వారెవ్వరూ రాని జాతి వారికి నీవు హెచ్చరిక చేయటానికి, బహుశా వారు మార్గదర్శకత్వం పొందుతారేమోనని!
4. అల్లాహ్, ఆయనే ఆకాశాలను, భూమిని మరియు వాటి మధ్య ఉన్నదంతా ఆరు దినములలో (అయ్యామ్'లలో)[3] సృష్టించాడు. ఆ తరువాత సింహాసనాన్ని (అర్ష్'ను) అధిష్టించాడు. ఆయన తప్ప మీకు మరొక సంరక్షకుడు గానీ, సిఫారసు చేసేవాడు గానీ ఎవ్వడూ లేడు, అయినా మీరు

---

[*] [అస్-సజ్దహ్ అంటే సజ్దా, సాష్టాంగ ప్రణామం]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

[2] అలాంటప్పుడు వారిని ఇలాంటి గ్రంథాన్ని రచించి తెమ్మను? అనే ప్రశ్నకు చూడండి, 17:88, 52:34. ఇలాంటి 10 సూరాహ్ లనైనా రచించి తెమ్మను? అనే ప్రశ్నకు, 11:13. ఇలాంటి ఒక్క సూరహ్ నైనా రచించి తెమ్మను? అనే ప్రశ్నకు, 2:23, 10:38.

[3] చూడండి, 7:54 వ్యాఖ్యానం 1.

హితబోధ గ్రహించరా?

5. ఆయనే ఆకాశం నుండి భూమి వరకు ప్రతి వ్యవహారాన్ని నడిపిస్తున్నాడు; తరువాత అంతా ఒకే దినమున[4], ఆయన వద్దకు పోయి చేరుతుంది; దాని (ఆ దినపు) పరిమాణం మీ లెక్క ప్రకారం వేయి సంవత్సరాలు.

6. ఆయన (అల్లాహ్) యే అగోచర మరియు గోచర విషయాల జ్ఞానం గలవాడు, సర్వశక్తిమంతుడు, అపార కరుణా ప్రదాత.

7. ఆయన తాను సృష్టించిన ప్రతి దానిని ఉత్తమరీతిలో చేశాడు. మరియు మానవ సృష్టిని మట్టితో ప్రారంభించాడు[5].

8. తరువాత అతని సంతతిని ఒక అధమమైన ద్రవపదార్థపు సారంతో (వీర్యంతో) చేశాడు.

9. ఆ తరువాత. అతనిని యుక్తమైన రూపంలో తీర్చిదిద్ది, అతనిలో తన (నుండి) ప్రాణం (ఆత్మ) ఊదాడు[6]. మరియు మీకు వినేశక్తిని, చూసేశక్తిని

---

[4] అంటే ఇది పునరుత్థానదినం అని, కొందరు వ్యాఖ్యాతలు బోధించారు. అది చాలా కష్టతరమైన దినం కావటం వల్ల వేయి సంవత్సరాల వలే కనిపిస్తుంది. చూడండి, 22:47లో కూడా: "...మరియు నిశ్చయంగా, నీ ప్రభువు వద్ద ఒక్క వద్ద ఒక్క దినం,మీలెక్కలప్రకారంవేయిసంపత్సరాలకుసమానమైనది." అని ఉంది. కాని 70:4లో: "యాభై వేల సంవత్సరాలకు సమానమైన (ప్రమాణం గల) ఒక రోజులో, దేవదూతలు మరియు ఆత్మ (జిబ్రీల్ 'అ.స.) ఆయన (సు.తా.) వద్దకు అధిరోహిస్తారు." అని, ఉంది. అంటే వారు అంత తీవ్రంగా ప్రయాణం చేస్తారన్నమాట.

[5] చూడండి, 23:12.

[6] చూడండి, 15:29, 38:72.

మరియు హృదయాలను (అర్థం చేసుకునే శక్తిని) ఇచ్చాడు. (అయినా) మీరు కృతజ్ఞతలు తెలుపు కునేది చాలా తక్కువ!

10. మరియు వారు (అవిశ్వాసులు) అంటున్నారు: "ఏమీ? మేము నశించి, మట్టిలో కలిసి పోయినా, మేము మళ్ళీ క్రొత్తగా సృష్టించబడతామా?" అది కాదు! వారు తమ ప్రభువుతో కాబోయే సమావేశాన్ని తిరస్కరిస్తున్నారు[7].

11. వారితో ఇలా అను: "మీపై నియమించబడిన మృత్యుదూత మీ ప్రాణం తీస్తాడు. ఆ తరువాత మీరు మీ ప్రభువు వద్దకు మరలింపబడతారు."

12. మరియు (పునరుత్థాన దినమున) ఈ అపరాధులు, తమ ప్రభువు సమక్షంలో, ఏ విధంగా తమ తలలు వంచుకొని నిలబడి ఉంటారో, నీవు చూడగలిగితే! వారు: "ఓ మా ప్రభూ! మేము ఇప్పుడు చూశాము మరియు విన్నాము, కావున మమ్మల్ని తిరిగి (భూలోకానికి) పంపించు. మేము సత్కార్యాలు చేస్తాము, నిశ్చయంగా, మాకు ఇప్పుడు నమ్మకం కలిగింది." అని అంటారు.

13. మరియు మేము కోరినట్లయితే, ప్రతి వ్యక్తికి (ఆత్మకు) దాని మార్గదర్శకత్వం చేసి ఉండేవారము[8]. కాని, నేను: "నిశ్చయంగా జిన్నాతులు మరియు మానవులందరితో

---

[7] చూడండి, 13:5.

[8] చూడండి, 26:4. అల్లాహ్ (సు.తా.) ఎవ్వరినీ సన్మార్గం మీద ఉండటానికి బలవంతం చేయడు కాని మార్గదర్శకత్వం చేస్తాడు. దానిని అనుసరించనివాడు శిక్షకు గురి అవుతాడు.

నరకాన్ని నింపివేస్తాను." అని పలికిన, నా మాట సత్యమయ్యింది[9].

**14.** కావున మీరు మీ యొక్క ఈనాటి సమావేశాన్ని మరచిపోయిన దాని ఫలితాన్ని రుచి చూడండి. నిశ్చయంగా, మేము కూడా మిమ్మల్ని మరచి పోయాము. మరియు మీరు మీ కర్మల ఫలితమైన ఈ శాశ్వత శిక్షను రుచి చూడండి!

**15.** నిశ్చయంగా వారే, మా సూచనలు (ఆయాత్) వారికి బోధించినప్పుడు, వాటిని విశ్వసించి సాష్టాంగంలో (సజ్దాలో) పడిపోతారు మరియు తమ ప్రభువు పవిత్రతను కొనియాడుతారు. మరియు ఆయనను స్తుతిస్తారు మరియు వారెన్నడూ గర్వపడరు.

**16.** వారు (రాత్రులలో) తమ ప్రక్కలను తమ పరుపుల నుండి దూరం చేసి, తమ ప్రభువును భయంతో మరియు ఆశతో వేడుకుంటారు[10] మరియు మేము వారికి ప్రసాదించిన జీవనోపాధి నుండి ఖర్చు చేస్తారు.

**17.** కాని వారికి, వారి కర్మల ఫలితంగా వారి కొరకు (పరలోకంలో) కళ్ళకు చలువనిచ్చే ఎటువంటి సామాగ్రి దాచి పెట్టబడి ఉందో ఏ ప్రాణికీ

---

[9] ఇటువంటి వాక్యాలకు చూడండి, 7:18 మరియు 11:119.
[10] రాత్రులలో లేచి తహజ్జుద్ (నఫిల్) నమాజులు చేస్తారు.

తెలియదు[11].

**18.** ఏమీ? విశ్వాసి అయినవాడు (దైవభీతి లేని) అవిధేయునితో సమానుడా? (కాదు!) వారు సరిసమానులు కాలేరు[12].

**19.** ఎవరైతే విశ్వసించి, సత్కార్యాలు చేస్తారో వారికి వారి కర్మల ఫలితంగా, వారి ఆతిథ్యం కొరకు స్వర్గవనాలలో నివాసాలుంటాయి.

**20.** ఇక ఎవరైతే, విద్రోహ వైఖరి అవలంబిస్తారో, వారి నివాసం నరకాగ్నియే. ప్రతిసారి వారు దాని నుండి బయటపడటానికిప్రయత్నించినప్పుడల్లా,వారందులోకి తిరిగి నెట్టబడతారు. మరియు వారితో ఇలా అనబడుతుంది: "మీరు తిరస్కరిస్తూ ఉండిన నరకాగ్ని శిక్షను చవి చూడండి."

**21.** మరియు ఆ పెద్ద శిక్షకు ముందు మేము (ఇహలోకంలో) వారికి సమీప శిక్షను రుచి చూపుతాము[13]. బహుశా, వారు(పశ్చాత్తాపపడి సత్కార్యాల వైపునకు) మరలి వస్తారేమోనని!

**22.** మరియు తన ప్రభువు సూచన (ఆయాత్) ల ద్వారా హితబోధ చేయబడిన తరువాత కూడా,

---

[11] 'హదీస్' ఖుద్సీ: నేను నా పుణ్యాత్ములైన దాసుల కొరకు స్వర్గంలో సిద్ధపరచి ఉంచిన వాటిని ఇంతవరకు ఏ కన్నూ చూడలేదు, ఏ చెవీ వినలేదు మరియు ఏ మానవుడు కూడా వాటిని గురించి ఆలోచించడు, ('స'హీ'హ్ బు'ఖారీ మరియు 'స.ముస్లిం).

[12] ఇటువంటి ఆయతులకు చూడండి, 45:21, 38:28, 59:20 మొదలైనవి.

[13] చూడండి, 52:47.

వాటి నుండి విముఖుడయ్యే వాని కంటే ఎక్కువ దుర్మార్గుడెవడు? నిశ్చయంగా, మేము అలాంటి అపరాధులకు ప్రతీకారం[14] చేసి తీరుతాము.

23. మరియు వాస్తవంగా, మేము మూసాకు గ్రంథాన్ని ఇచ్చాము. కావున, (ఓ ప్రవక్తా!) నీవు అతనిని (ఇస్రా రాత్రిలో) కలుసుకోబోయే విషయాన్ని గురించి సందేహంలో పడకు[15]. మరియు మేము దానిని (తౌరాత్ ను) ఇస్రాయీల్ సంతతి వారికి మార్గదర్శినిగా చేశాము[16].

24. మరియు మేము (ఇస్రాయీల్ సంతతి) వారిలో నుండి కొందరిని నాయకులుగా చేశాము. వారు, వారికి మా ఆజ్ఞానుసారంగా మార్గదర్శకత్వం చేస్తూ ఉన్నారు - ఎంత వరకైతే వారు సహనం వహించి ఉన్నారో మరియు వారు మా ఆయాత్ (సూచనలను) నమ్ముతూ ఉన్నారో!

25. నిశ్చయంగా, నీ ప్రభువు, పునరుత్థాన దినమున, వారికున్న భేదాభిప్రాయాలను గురించి వారి మధ్య తీర్పు చేస్తాడు[17].

26. ఏమీ? వీరికి పూర్వం అనేక తరాలను నాశనం

---

[14] అల్-ముంతఖిమ్ (సేకరించబడినపదం): ప్రతీకారం తీర్చుకునే, ప్రతీకారం చేసే, దుష్టులను శిక్షించే వాడు. చూడండి, 30:47.

[15] మహాప్రవక్త ('స'అస) మె'అరాజ్ రాత్రిలో మూసా ('అ.స.) ను కలుసుకున్నప్పుడు అతను, దైవప్రవక్త ము'హమ్మద్ ('స'అస)కు, అల్లాహ్ (సు.తా.) ను వేడుకొని, నమా'జ్ ల సంఖ్యను, తగ్గించు కోమని సలహ్ ఇచ్చిన విషయాన్ని ఈ ఆయత్ సూచిస్తుందని వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు.

[16] ఇక్కడ సంబోధన మూసా ('అ.స.) కు కూడా కావచ్చు.

[17] చూడండి, 22:67-69.

చేసిన విషయం వీరికి మార్గదర్శకత్వం కాదా? వీరు, వారి నివాసస్థలాలలో తిరుగుతున్నారు కదా! నిశ్చయంగా ఇందులో ఎన్నో సూచనలున్నాయి. ఏమీ? వీరు వినటం లేదా?

**27.** ఏమీ? వారు చూడటం లేదా? నిశ్చయంగా, మేము ఒక బంజరు భూమి వైపునకు నీళ్ళను (వర్షాన్ని) పంపి దాని నుండి పైరును ఉత్పత్తి చేస్తే, దానిని వారి పశువులు మరియు వారూ తింటున్నారని. ఏమీ? వారిది గమనించటం (చూడటం) లేదా?

**28.** ఇంకా ఇలా అంటున్నారు: "మీరు సత్యవంతులే అయితే, ఆ తీర్పు ఎప్పుడు వస్తుందో చెప్పండి!"[18]

**29.** ఇలాఅను: "ఆతీర్పుదినంనాడు[19] సత్యతిరస్కారులు విశ్వసించ గోరినా, అది వారికి ఏ విధంగానూ పనికిరాదు! మరియు వారికెలాంటి గడువు కూడా ఇవ్వబడదు."

**30.** కావున నీవు వారితో విముఖుడవగు![20] మరియు వేచి ఉండు నిశ్చయంగా, వారు కూడా (ఆ దినం కొరకు) వేచి ఉంటారు.

---

[18] ఇక్కడ తీర్పు అంటే, ఆ తీర్పు దేనినైతే ముష్రిక్ ఖురైషులు తమ మీదికి తెమ్మని దైవప్రవక్త ('స'అస) ను హేళనతో అడిగేవారో. అంటే అల్లాహ్ (సు.తా.) శిక్ష.

[19] ఇక్కడ తీర్పుదినం అంటే పునరుత్థాన దినం.

[20] చూడండి, 6:106.

# 33. అల్-అహ్'జాబ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఓ ప్రవక్తా! అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండు మరియు సత్యతిరస్కారుల మరియు కపట విశ్వాసుల యొక్క అభిప్రాయాన్ని లక్ష్య పెట్టకు. నిశ్చయంగా, అల్లాహ్ సర్వజ్ఞుడు, మహావివేచనాపరుడు.
2. మరియు నీ ప్రభువు తరఫు నుండి నీపై అవతరింప జేయబడిన దివ్యజ్ఞానం (వహీని) మాత్రమే అనుసరించు. నిశ్చయంగా, అల్లాహ్ మీరు చేసేదంతా ఎరుగును.
3. కావున అల్లాహ్ పైననే నమ్మకం ఉంచుకో మరియు కార్యసాధకుడుగా అల్లాహ్ చాలు.
4. అల్లాహ్ ఏ వ్యక్తి ఎదలో కూడా రెండు హృదయాలు పెట్టలేదు. మరియు మీరు మీ భార్యలను 'తల్లులు'

---

[*] [అల్-అహ్'జాబ్ అంటే మిత్రపక్షాలు, కూటమి]

అని పలికి, జిహార్[1] చేసినంతటనే వారిని మీకు తల్లులుగా చేయలేదు. మరియు మీరు దత్త తీసుకొన్న వారిని మీ (కన్న) కుమారులుగా చేయలేదు. ఇవన్నీ మీరు మీ నోటితో పలికే మాటలు మాత్రమే! మరియు అల్లాహ్ సత్యం పలుకుతాడు మరియు ఆయన (ఋజు) మార్గం వైపునకు మార్గదర్శకత్వం చేస్తాడు.

5. వారిని (మీ దత్త పిల్లలను), వారి (వాస్తవ) తండ్రుల పేర్లతోనే కలిపి పిలవండి[2]. అల్లాహ్ దృష్టిలో ఇదే న్యాయమైనది. ఒకవేళ వారి తండ్రులెవరో మీకు తెలియక పోతే, అపుడు వారు మీ ధార్మిక సోదరులు మరియు మీ స్నేహితులు[3]. మీరు ఈ విషయంలో (ఇంత వరకు) చేసిన పొరపాటు గురించి మీకెలాంటి పాపం లేదు, కాని

---

[1] "జిహార్: అంటే భార్యను తల్లిగా ఎంచటం ఏ విధంగానైతే ఒక వక్షంలో రెండు హృదయాలు ఉండవో అదే విధంగా ఒక వ్యక్తికి ఇద్దరు తల్లులు ఉండరు. ఇద్దరు తండ్రులు కూడా ఉండరు. కావున ఇస్లాంకు ముందు, ముష్రికులు తమ భార్యను శిక్షించటానికి :"ఈ నాటి నుండి నేను నిన్ను తల్లిగా భావిస్తున్నాను." అని చెప్పి, ఆమెకు విడాకులివ్వకుండా తన ఇంట్లోనే ఉంచుకొని బాధించేవారు. ఇస్లాం దానిని నిషేధించింది. దత్తకుమారులు, మీ కుమారులు కారు. కాబట్టి వారిని వారి వాస్తవ తండ్రి పేరుతోనే కలిపి పిలవాలి అనే శాసనం కూడా ఇచ్చింది.

[2] అంటే వారు వారి వాస్తవ తండ్రి పేరుతోనే పిలువబడాలి. దానితో వారి నిజ వ్యక్తిత్వం భద్రపరచ బడుతుంది. వారిని మీ నిజ సంతానంగా పరిగణించకండి.

[3] ఒకవేళ దత్తపుత్రుని వాస్తవతండ్రి పేరు తెలియకుంటే, వారు మీ ధార్మిక సోదరులు అట్టి పక్షంలో కూడా వారిని పోషించండి, కాని మీ పుత్రులుగా చేసుకొని, మీ పేరు ఇవ్వకండి.

ఇక ముందు మీరు ఉద్దేశ్యపూర్వకంగా చేస్తే (పాపం) అవుతుంది. మరియు అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

6. విశ్వాసులకు (ముస్లింలకు), దైవప్రవక్త స్వయంగా తమ కంటే కూడా ముఖ్యుడు[4]. మరియు అతని భార్యలు వారికి తల్లులు[5]. అల్లాహ్ గ్రంథం ప్రకారం రక్తసంబంధీకులు - ఇతర విశ్వాసుల మరియు వలస వచ్చిన వారి (ముహాజిరీన్) కంటే - ఒకరి కొకరు ఎక్కువగా పరస్పర సంబంధం (హక్కులు) గలవారు. కాని! మీరు మీ స్నేహితులకు మేలు చేయగోరితే (అది వేరే విషయం)![6] వాస్తవానికి ఇదంతా గ్రంథంలో వ్రాయబడి వుంది.

7. మరియు (జ్ఞాపకముంచుకో) వాస్తవానికి మేము ప్రవక్తలందరి నుండి వాగ్దానం తీసుకున్నాము మరియు నీతో (ఓ ముహమ్మద్), నూహ్ తో,

---

[4] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'నేను, మీకు మీ తండ్రులకంటే, మీ సంతానం కంటే మరియు సర్వమానవుల కంటే ఎక్కువ ప్రీతిపాత్రుడనయ్యేంత వరకు మీరు నిజమైన విశ్వాసులు కాజాలరు!' (బు'ఖారీ ముస్లిం) - అనస్ (ర'ది.'అ.) కథనం.

[5] దైవప్రవక్త ('స'అస) భార్యలు (ర'ది. 'అన్హుమ్ లు) ముస్లింల తల్లుల వంటి వారు. కాబట్టి ఈ ఆయత్ శాసనం ప్రకారం దైవప్రవక్తమరణంతరువాత,వారినిఎవ్వరూవివాహమాడరాదు. ఇంకా చూడండి 8:75. అందులో విశ్వాసుల పరస్పర సహోదరత్వం తెలుపబడింది. మరియు ఈ ఆయత్ లో ఒక విశ్వాసునికి, దైవప్రవక్త ('స'అస) మరియు అతని భార్యలు (ర'ది. 'అన్హుమ్ లు), తల్లిదండ్రుల వంటి వారు అని తెలుపబడింది..

[6] చూడండి, 49:10 మరియు 8:75 దగ్గరి బంధువులు తప్ప ఇతరులు వారసులు కాలేరు.

ఇబ్రాహీమ్ తో, మూసాతో మరియు మర్యమ్ కుమారుడైన ఈసాతో కూడా! మరియు మేము వారందరి నుండి గట్టి వాగ్దానం తీసుకున్నాము[7].

8. ఇది సత్యవంతులను, వారి సత్యాన్ని గురించి ప్రశ్నించడానికి. మరియు ఆయన సత్యతిరస్కారుల కొరకు బాధాకరమైన శిక్షను సిద్ధ పరచి ఉంచాడు[8].

9. ఓ విశ్వాసులారా! అల్లాహ్ మీకు చేసిన అనుగ్రహాన్ని జ్ఞాపకం చేసుకోండి. మీ పైకి సైన్యాలు (దండెత్తి) వచ్చినపుడు, మేము వారి పైకి ఒక తుఫాను గాలిని మరియు మీకు కనబడని సైన్యాలను పంపాము[9]. మరియు అల్లాహ్ మీరు చేసేదంతా చూస్తున్నాడు.

10. వారు (మీ శత్రువులు) మీ మీదకు పై నుండి మరియు క్రింది నుండి (దండెత్తి) వచ్చినపుడు[10] మరియు మీ కళ్ళు (భయంతో) తిరిగిపోయి, మీ గుండెలు గొంతులోనికి వచ్చినపుడు, మీరు అల్లాహ్ ను గురించి పలువిధాలుగా ఊహించసాగారు.

11. అక్కడ (ఆ సమయంలో) విశ్వాసులు పరీక్షించబడ్డారు.

---

[7] చూడండి, 3:81, 42:13.

[8] చూడండి, 5:109 మరియు 7:6.

[9] ఈ సూరహ్ యొక్క 9-27 ఆయతులు కందక యుద్ధం ('గ'జ్వతుల్ అ'హ్జాబ్) గురించి ఉన్నాయి. ఇంకా చూడండి, 3:124-125.

[10] పైనుండి నజ్ద్, ఉత్తర తూర్పు నుండి వచ్చిన 'గ'త్ఫాన్, హవా'జిన్ మరియు ఇతర తెగల వారు; క్రింది నుండి ఖురైషులు; మరియు పడమర దిక్కునుండి ఇతర ముష్రికులు దాడి చేయటానికి వస్తారు.

మరియు దానితో వారు తీవ్రంగా కంపింప జేయబడ్డారు.

12. మరియు ఆ సమయంలో, కపట విశ్వాసులు మరియు తమ హృదయాలలో రోగమున్న వారు: "అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడు మాతో చేసినవాగ్దానాలన్నీ బూటకాలు మాత్రమే!" అని అనసాగారు[11].

13. అపుడు వారిలోని ఒక పక్షం వారు: "ఓ యస్'రిబ్[12] (మదీనా మునవ్వరా) ప్రజలారా! ఇక మీరు వీరిని (శత్రువులను) ఎదిరించలేరు. కనుక వెనుదిరగండి!" అని అన్నారు. మరియు వారిలో మరొక వర్గం వారు ప్రవక్తతో ఈ విధంగా పలుకుతూ (వెనుదిరిగి) పోవటానికి అనుమతి అడగసాగారు: "మా ఇండ్లు భద్రంగా లేవు."[13] కాని వాస్తవానికి అవి భద్రంగానే ఉండెను. వారు కేవలం అక్కడి నుండి పారిపోదలచారు.

14. ఒకవేళ నగరపు చుట్టుప్రక్కల నుండి శత్రువులు లోపలికి దూరి, వారిని విద్రోహ చర్యలకు పాల్పడమని పిలిస్తే, వారు వెంటనే సమ్మతించే వారు, మరియు వారు దాని కోసం ఏ మాత్రం ఆలస్యం చేసేవారు కాదు.

---

[11] ఈ విధమైన సందేశం వచ్చిన వారు దాదాపు డెబ్బై మంది మునాఫిఖులు.

[12] ఆ కాలంలో ఆ ప్రాంతమంతా యస్'రిబ్ అనే పేరుతో పిలువబడేది. ఆ ప్రాంతంలోనే మదీనా మునవ్వరా ఉంది.

[13] అంటే ఒడంబడిక త్రెంపిన బనూఖురైజా తెగవారు దక్షిణ దిక్కునుండి దాడి చేస్తారేమోననే భయం.

15. వాస్తవానికి వారు ఇంతకు ముందు, తాము వెన్ను చూపి పారిపోమని, అల్లాహ్ తో వాగ్దానం చేసి ఉన్నారు. మరియు అల్లాహ్ తో చేసిన వాగ్దానం గురించి తప్పక ప్రశ్నించటం జరుగుతుంది.

16. వారితో ఇలా అను: "ఒకవేళ మీరు మరణం నుండి గానీ, లేదా హత్య నుండి గానీ, పారి పోదలచుకుంటే! ఆ పారిపోవటం మీకు ఏ మాత్రం లాభదాయకం కాదు. అప్పుడు మీరు కేవలం కొంతకాలం మాత్రమే సుఖసంతోషాలు అనుభవిస్తారు!"

17. వారితో ఇంకా ఇలా అను: "ఒకవేళ అల్లాహ్ మీకు కీడు చేయదలిస్తే! లేదా కరుణించదలిస్తే! ఆయన నుండి మిమ్మల్ని తప్పించే వాడెవడు?" మరియు వారు అల్లాహ్ ను వదలి ఇతరుణ్ణి ఎవడినీ సంరక్షకునిగా గానీ లేక సహాయకునిగా గానీ పొందలేరు.

18. వాస్తవానికి మీలో ఎవరు ఇతరులను (యుద్ధం నుండి) ఆటంక పరుస్తూ ఉన్నారో మరియు తమ సోదరులతో: "మా వైపునకు రండి!" అని పలుకుతూ ఉన్నారో, అలాంటి వారందరి గురించి, అల్లాహ్ కు బాగా తెలుసు. మరియు వారు మాత్రం యుద్ధంలో చాలా తక్కువగా పాల్గొనేవారు;

19. (మీకు తోడ్పడే విషయంలో) వారు పరమ లోభులుగా ఉండేవారు. (ఓ ప్రవక్తా!) వారి పైకి ప్రమాదం వచ్చినపుడు వారు (నీ సహాయం కోరుతూ) మరణం ఆసన్నమైన వ్యక్తి కనుగ్రుడ్లు

త్రిప్పే విధంగా నీ వైపుకు తిరిగి చూడటాన్ని, నీవు చూస్తావు. కాని ఆ ప్రమాదం తొలగిపోయిన వెంటనే, వారు లాభాలను పొందే ఉద్దేశంతో, కత్తెర వలే ఆడే నాలుకలతో మీతో బడాయీలు చెప్పుకుంటారు. అలాంటి వారు ఏ మాత్రం విశ్వసించలేదు. కావున, అల్లాహ్ వారి కర్మలను నిరర్థకం చేశాడు. మరియు ఇది అల్లాహ్ కు ఎంతో సులభం.

20. దాడి చేసిన వర్గాలు ఇంకా వెళ్ళి పోలేదు అనే వారు భావిస్తున్నారు. ఒకవేళ ఆ వర్గాలు తిరిగి మళ్ళీ దాడి చేస్తే! ఎడారి వాసులతో (బద్దూలతో)[14] కలిసి నివసించి అక్కడి నుండి మీ వృత్తాంతాలను తెలుసుకుంటే బాగుండేది కదా! అని అనుకుంటారు. ఒకవేళ వారు మీతో పాటు ఉన్నా చాలా తక్కువగా యుద్ధంలో పాల్గొని ఉండేవారు.

21. వాస్తవానికి, అల్లాహ్ యొక్క సందేశహరునిలో మీకు ఒక ఉత్తమమైన ఆదర్శం ఉంది, వారి కొరకు ఎవరైతే అల్లాహ్ మరియు అంతిమ దినాన్ని ఆశిస్తారో మరియు అల్లాహ్ ను అత్యధికంగా స్మరిస్తారో!

22. మరియు విశ్వాసులు, దాడి చేసిన వర్గాల వారిని చూసినపుడు ఇలా పలికారు: "అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడు సత్యం పలికారు." ఇది

---

[14] ఈ పదానికి ఇంకా చూడండి, 9:90, 97, 98, 99, 101, 120, 48:11, 16, 49:14.

వారి విశ్వాసాన్ని మరియు అల్లాహ్ పట్ల వారి విధేయతను మరింత అధికమే చేసింది.

23. విశ్వాసులలో అల్లాహ్ కు తాము చేసిన ఒప్పందం నిజం చేసి చూపినవారు కూడా ఉన్నారు. వారిలో కొందరు తమ శపథాన్ని పూర్తి చేసుకున్న వారున్నారు, మరికొందరు దానిని పూర్తి చేసుకోవటానికి నిరీక్షిస్తున్నారు. మరియు వారు తమ వైఖరిని ఏ మాత్రం మార్చుకోలేదు.

24. అల్లాహ్, సత్యవంతులకు వారి సత్యానికి ప్రతిఫలం నొసంగటానికి మరియు కపట విశ్వాసులకు తాను కోరితే శిక్ష విధించటానికి లేదా వారి పశ్చాత్తాపాన్ని స్వీకరించటానికి ఇలా చేశాడు[15]. నిశ్చయంగా అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

25. మరియు అల్లాహ్ అవిశ్వాసులను వారి క్రోధావేశంతోనే - వారికెలాంటి మేలు లభింప జేయకుండా - వెనుకకు మరలించాడు. యుద్ధరంగంలో విశ్వాసులకు అల్లాహ్ యే (సహాయకునిగా) మిగిలాడు. వాస్తవంగా అల్లాహ్ మహా బలవంతుడు, సర్వశక్తిమంతుడు.

26. మరియు గ్రంథ ప్రజలలో నుండి వారికి (అవిశ్వాసులకు యుద్ధంలో) తోడ్పడిన వారిని ఆయన (అల్లాహ్) వారి కోటల నుండి క్రిందికి తీసుకు

[15] చూడండి, 6:12.

వచ్చాడు[16]. మరియు వారి హృదయాలలో భీతిని ప్రవేశింపజేశాడు. వారిలో కొందరిని మీరు చంపుతున్నారు, మరికొందరిని ఖైదీలుగా చేసుకుంటున్నారు.

27. మరియు ఆయన (అల్లాహ్) వారి భూమికి, వారి ఇండ్లకు మరియు వారి ఆస్తులకు మిమ్మల్ని వారసులుగా చేశాడు[17]. మరియు మీరు ఎన్నడూ అడుగుమోపని భూమికి కూడా, (మిమ్మల్ని వారసులుగా చేశాడు). మరియు వాస్తవంగా అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు.

28. ఓ ప్రవక్తా! నీవు నీ భార్యలతో ఇలా అను: "ఒకవేళ మీరు ప్రాపంచిక జీవితాన్ని మరియు దాని శోభను కోరుతున్నట్లయితే, రండి నేను మీకు తప్పక జీవన సామాగ్రినిచ్చి, మిమ్మల్ని మంచి పద్ధతిలో

---

[16] అంటే యూదులైన బనూ-ఖురై"జా తెగవారు. వారు మొదట శత్రువులకు సహాయపడమని మదీనా ముస్లింలతో ఒప్పందం చేసుకుంటారు. కాని మదీనా నగరం నుండి వెడలగొట్టబడిన బనూ-న'దీర్ తెగవారి మాటలు విని, తమ ఒడంబడికను త్రెంపి శత్రువులకు సహాయపడటానికి పూనుకుంటారు. అందుకే శత్రువులు పారిపోయింది చూసి వారు తమ కోటలలో దాక్కుంటారు. ముస్లింలు వారిని 25 రోజులు ముట్టడించి ఉంచుతారు. చివరకు వారు - తమ విశ్వాసఘాతానికి - శిక్షకు గురి అవుతారు.

[17] కొందరు వ్యాఖ్యాతలు ఇది 6వ హిజ్రీలో జరిగిన 'ఖైబర్ విజయమని అభిప్రాయపడ్డారు. మరి కొందరు రోమ్ మరియు పర్షియాల విజయాలని! (ఫ'త్హ్ అల్-ఖదీర్).

విడిచి పెడతాను."[18]

29. "కాని ఒకవేళ మీరు అల్లాహ్ ను మరియు ఆయన సందేశహరుణ్ణి మరియు పరలోక గృహాన్ని కోరుతున్నట్లయితే, నిశ్చయంగా, అల్లాహ్ మలో సజ్జనులైన వారికి గొప్ప ప్రతిఫలాన్ని సిద్ధపరచి ఉంచాడు."

30. ఓ ప్రవక్త స్త్రీలారా! మీలో ఎవరైనా స్పష్టంగా అనుచితమైన పనికి పాల్పడితే ఆమెకు రెట్టింపు శిక్ష విధించబడుతుంది[19]. మరియు వాస్తవంగా,

---

[18] ఈ విజయాల వల్ల ముస్లింలకు ధన సంపత్తులు దొరకడం వల్ల, వారు మొదటి కంటే ఎంతో అధికంగా సుఖవంతమైన జీవితం గడుపసాగారు. ఇది చూసి దైవప్రవక్త భార్యలు (ర'ది.'అన్హుమ్) కూడా ఆ సంపదలను తమ కొరకు కోరారు. దానికి జవాబుగా ఈ ఆయత్ అవతరింపజేయబడింది. దీనితో అర్థమయ్యేదేమిటంటే, ఎన్నో సంపత్తులు ముస్లింలకు దొరికినా, దైవప్రవక్త ('స'అస) తన స్వంత వినియోగం కొరకు మొదటి వలెనే అతి తక్కువ జీవనోపాధిని ఉంచుకునే వారు. అంతా ముస్లింలకు పంచేవారు. దీని తరువాత ఉమ్మహాతుల్ మోమినీన్ (ర'ది.'అన్హుమ్) లు తమ పట్టు వదలుకున్నారు. ఆ కాలంలో దైవప్రవక్త ('స'అస) వివాహబంధంలో తొమ్మిది మంది భార్య (ర'ది.'అన్హుమ్) లు ఉన్నారు. ఐదుగురు ఖురైషులు 'ఆయిషహ్, 'హ'ఫ్సా, ఉమ్మె - 'హబీబా, 'సౌదా, మరియు ఉమ్మె సల్మా (ర'ది.'అన్హుమ్) మరియు నలుగురు ఇతరులు: 'సఫియ్యా, మైమూనా, 'జైనబ్ మరియు జువేరియా (ర'ది.'అన్హుమ్).

[19] అల్ ఫా'హిషహ్ అంటే ఖుర్ఆన్ లో 'జినా' అంటే వ్యభిచారం, అనే అర్థంలో వాడబడింది. అల్ - లేకుండా ఫా'హిషహ్ అని ఉంటే - ఇక్కడ ఉన్నట్లు - సభ్యతలేని పని, లేక అనుచితమైన పని అనే అర్థంలో వాడ బడింది. పెద్దవారు చేసే చిన్నతప్పు కూడా పెద్దదే. కాబట్టి వారికి రెండింతలు శిక్ష ఉందని బోధింపబడింది.

ఇది అల్లాహ్ కు ఎంతో సులభం.

31. మరియు మీలో ఏ స్త్రీ అయితే అల్లాహ్ కు మరియు ఆయన సందేశహరునికి విధేయురాలై ఉండి సత్కార్యాలు చేస్తుందో, ఆమెకు రెట్టింపు ప్రతిఫలమిస్తాము మరియు ఆమె కొరకు గౌరవప్రదమైన జీవనోపాధిని సిద్ధపరచి ఉంచాము[20].

32. ఓ ప్రవక్త భార్యలారా! మీరు సాధారణ స్త్రీల వంటి వారు కారు. మీరు దైవభీతి గలవారైతే మీరు మెత్తని స్వరంతో మాట్లాడకండి. ఎందుకంటే! దానితో తన హృదయంలో రోగమున్న వానికి దుర్బుద్ధి పుట్టవచ్చు. కావున మీరు స్పష్టంగా, సూటిగానే మాట్లాడండి.

33. మరియు మీరు మీ ఇండ్లలోనే ఉండండి మరియు పూర్వపు అజ్ఞానకాలంలో అలంకరణను ప్రదర్శిస్తూ తిరిగినట్లు తిరగకండి[21]. మరియు నమాజ్ స్థాపించండి మరియు విధిదానం (జకాత్) ఇవ్వండి మరియు అల్లాహ్ కు ఆయన సందేశహరునికి విధేయులై ఉండండి. (ఓ

[20] చూడండి, 8:4.
[21] చూడండి, 5:50.

ప్రవక్త) గృహిణులారా![22] నిశ్చయంగా, అల్లాహ్ మీ నుండి మాలిన్యాన్ని తొలగించి, మిమ్మల్ని పరిశుద్ధులుగా చేయగోరు తున్నాడు.

**34.** మరియు మీ ఇండ్లలో వినిపించబడే అల్లాహ్ ఆయతులను మరియు జ్ఞాన విషయాలను (హదీస్ లను) స్మరిస్తూ ఉండండి. నిశ్చయంగా, అల్లాహ్ అత్యంత సూక్ష్మగ్రాహి, సర్వం తెలిసిన వాడు[23].

**35.** నిశ్చయంగా, ముస్లిం (అల్లాహ్ కు విధేయులైన) పురుషులు మరియు ముస్లిం స్త్రీలు; విశ్వాసులైన (ము'మిన్) పురుషులు మరియు విశ్వాసులైన (ము'మిన్) స్త్రీలు; భక్తిపరులైన పురుషులు మరియు భక్తిపరులైన స్త్రీలు; సత్యవంతులైన పురుషులు మరియు సత్యవంతులైన స్త్రీలు; ఓర్పు గల పురుషులు మరియు ఓర్పు గల స్త్రీలు; వినమ్రత గల పురుషులు మరియు వినమ్రత గల స్త్రీలు; దానశీలురైన పురుషులు మరియు

---

[22] అహ్లల్ - బైత్, శబ్దానికి ఈ విధంగా అర్థాలు ఇవ్వబడ్డాయి. ఈ ఆయత్ లో ఖుర్ఆన్, దైవప్రవక్త ('స'అస) సతీమణు (ర'ది.'అన్హుమ్)లనే సంబోధిస్తోంది. ఖుర్ఆన్ లో ఇతర చోట్లలో కూడా భార్యలను అహ్లల్-బైత్ అని, సంబోధించబడింది. ఉదాహరణకు 11:73. కొందరు 'అలీ, ఫాతిమా, 'హసన్ మరియు 'హుసైన్ (ర'ది.'అన్హుమ్)లను మాత్రమే అహ్లల్-బైత్ గా భావిస్తున్నారు. వాస్తవమేమిటంటే, దైవప్రవక్త సతీమణులూ (ర'ది.'అన్హుమ్), దైవప్రవక్త ('స'అస) సంతానం (ర'ది'అన్హుమ్) మరియు ఈ నలుగురూ (ర'ది'అన్హుమ్), అందరూ అహ్లల్-బైత్ వారే! (ఫ'త్హ్ అల్-ఖదీర్, షౌకానీ)

[23] చూడండి, 6:103.

దానశీలురైన స్త్రీలు; ఉపవాసాలు[24] ఉండే పురుషులు మరియు ఉపవాసాలు ఉండే స్త్రీలు; తమ మర్గాంగాలను కాపాడుకునే పురుషులు మరియు (తమ మర్మాంగాలను) కాపాడుకునే స్త్రీలు[25]; మరియు అల్లాహ్ ను అత్యధికంగా స్మరించే పురుషులు మరియు అల్లాహ్ ను అత్యధికంగా స్మరించే స్త్రీలు; ఇలాంటి వారి కొరకు అల్లాహ్ క్షమాభిక్ష మరియు గొప్ప ప్రతిఫలాన్ని సిద్ధపరచి ఉంచాడు.

36. మరియు అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడు, ఒక విషయంలో నిర్ణయం తీసుకున్న ప్పుడు, విశ్వసించిన పురుషునికిగానీ లేక విశ్వసించిన స్త్రీకిగానీ ఆ విషయంలో మరొక నిర్ణయం తీసుకునే హక్కు లేదు[26]. మరియు ఎవడైతే అల్లాహ్ మరియు ఆయన సందేశహరునికి అవిధేయుడవుతాడో, వాస్తవంగా, అతడు స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నట్లే!

37. మరియు (ఓ ప్రవక్తా జ్ఞాపకం చేసుకో!) అల్లాహ్ అనుగ్రహించిన మరియు నీవు అనుగ్రహించిన

---

[24] 'సౌమున్: కేవలం ఆహార పానీయాలే గాక ఇతర చెడు విషయాల నుండి కూడా దూరంగా ఉండటం. ఇంకా చూడండి, 19:26 అక్కడ ఈ శబ్దం మాట్లాడకుండా ఉండటాన్ని సూచిస్తుంది.

[25] చూడండి, 24:30.

[26] ఈ ఆయత్ ప్రవక్త ('స'అస) మరియు 'జైనబ్ (ర.'అన్హా)ల వివాహం గురించి అవతరింపజేయ బడింది.

వ్యక్తితో నీవు[27]: "నీ భార్యను ఉండనివ్వు (విడిచి పెట్టకు) మరియు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండు." అని అన్నప్పుడు; నీవు అల్లాహ్ బయట పెట్టదలచిన విషయాన్ని, నీ మనస్సులో

---

[27] ముహమ్మద్ ('స'అస) ప్రవక్తగా ఎన్నుకోబడక ముందు 'ఖదీజహ్ (ర.'అన్హా) అతనికి ('స'అస) ఒక బానిసను కానుకగా ఇస్తారు. అతని పేరు 'జైద్ బిన్-'హారిసా. అతడు ఉత్తర అరేబియాకు చెందిన బనూ-కల్బ్ తెగకు చెందిన 'అరబ్బ్. అతడు (ర'ది.'అ.) చిన్నతనంలోనే తెగల మధ్య జరిగే యుద్ధాలలో బందీ అయ్యి అమ్మి వేయబడతారు. అతనిని (ర'ది.'అ.) 'ఖదీజహ్ (ర.'అన్హా) కొని, తరువాత దైవప్రవక్త ('స'అస) కు ఇస్తారు. దైవప్రవక్త ('స'అస) అతనికి స్వేచ్ఛనిస్తారు. ఆ తరువాత అతనిని తమ దత్తకుమారునిగా చేసుకుంటారు. దైవప్రవక్త ('స'అస) పై వ'హీ అవతరించిన తరువాత మొట్టమొదట ఇస్లాం స్వీకరించిన వారిలో ఇతను (ర'ది.'అ.) కూడా ఒకరు. అతని ('ర'ది.'అ.) వివాహం దైవప్రవక్త ('స'అస) తన మేనత్త కుమార్తె 'జైనబ్ బింతె-జ'హష్ (ర.'అన్హా) తో చేయిస్తారు. కాని మొదటి నుండియే ఆమె (ర.'అన్హా)కు ఈ వివాహం నచ్చదు. వారి మధ్య మొదటి రోజు నుండియే కలహాలు ప్రారంభమవుతాయి. 'జైద్ (ర'ది.'అ.) కూడా తన మొదటి భార్య - స్వేచ్ఛ ఇవ్వబడిన బానిస - ఉమ్ము ఆయ్ మన్ (ర. 'అన్హా), అతని కుమారుడు ఉసామహ్ (ర'ది.'అ.) యొక్క తల్లితో సంతోషంగా కాలం గడుపుతూ ఉంటారు. 'జైద్ బిన్ 'హారిస'హ్ మరియు 'జైనబ్ బింతె-జ'హష్ (ర'ది. 'అన్హుమ్)ల మధ్య ఎల్లప్పుడూ కలహాలు జరుగుతూ ఉంటాయి. దానితో 'జైద్ (ర'.ది.'అ.) 5వ హిజ్రీలో 'జైనబ్ బింతె-జ'హష్ (ర.'అన్హా)కు విడాకులు ఇస్తారు. తరువాత దైవప్రవక్త ('స'అస) అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞ ప్రకారం ఆమె (ర.'అన్హా)తో వివాహం చేసుకుంటారు. దత్తపుత్రుడు ఏ మాత్రం స్వంతపుత్రుడు కాజాలడు. కావున అతడు విడిచిన స్త్రీతో వివాహం చేసుకోవచ్చు అనే విషయం కూడా దీనితో స్పష్టమవుతుంది.

దాచి ఉంచావు. నీవు ప్రజలకు భయపడ్డావు, వాస్తవానికి నీవు అల్లాహ్ కు భయపడటమే చాలా ఉత్తమమైనది. జైద్, ఆమెతో తన సంబంధాన్ని తన ఇచ్ఛానుసారంగా త్రెంపుకున్న తరువాతనే, మేము ఆమె వివాహం నీతో జరిపించాము. విశ్వాసులకు తమ దత్తపుత్రుల భార్యలతో పెండ్లి చేసుకోవటంలో - వారు తమ భార్యల నుండి తమ ఇష్టానుసారంగా తమ సంబంధం త్రెంపు కున్నప్పుడు - ఏ విధమైన దోషం లేదు. వాస్తవానికి అల్లాహ్ ఆదేశం తప్పక అమలులోకి రావలసిందే!

38. అల్లాహ్ తన కొరకు ధర్మసమ్మతం చేసిన దానిని ప్రవక్త పూర్తి చేస్తే, అతనిపై ఎలాంటి నింద లేదు. ఇంతకు పూర్వం గతించిన వారి విషయంలో కూడా అల్లాహ్ సంప్రదాయం ఇదే. మరియు అల్లాహ్ ఆజ్ఞ, నిర్దేశింపబడిన (తిరుగులేని) శాసనం;

39. వారికి, ఎవరైతే అల్లాహ్ సందేశాలను అందజేస్తారో మరియు కేవలం ఆయనకే భయపడతారో మరియు అల్లాహ్ కు తప్ప మరెవ్వరికీ భయపడరో! మరియు లెక్క తీసుకోవటానికి కేవలం అల్లాహ్ యే చాలు!

40. (ఓ మానవులారా!) ముహమ్మద్ మీ పురుషుల్లో

ఎవ్వడికీ తండ్రి కాడు[28]. కాని అతను అల్లాహ్ యొక్క సందేశహరుడు మరియు ప్రవక్తలలో చివరివాడు[29]. మరియు వాస్తవానికి అల్లాహ్ యే ప్రతి విషయపు జ్ఞానం గలవాడు.

**41.** ఓ విశ్వాసులారా! అల్లాహ్ ను (ఏకాగ్రతతో) అత్యధికంగా స్మరించండి.

**42.** మరియు ఉదయం మరియు సాయంత్రం ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉండండి.

**43.** ఆయన మీపై ఆశీర్వాదాలు (సలాత్) పంపుతూ

---

[28] అంటే అతను (‘స'అస), ‘జైద్ బిన్-'హారిసా (ర'ది.'అ.) యొక్క తండ్రి కారు. మరియు ఏ ఇతర పురుషుని తండ్రి కూడా కారు. ప్రతివాడు తన నిజతండ్రి పేరుతోనే పిలువబడాలి. దైవప్రవక్త ('స'అస) కు 'ఖదీజహ్ (ర.'అన్హా) నుండి ముగ్గురు కుమారులు: ఖాసిమ్, 'తయ్యిబ్ మరియు 'తాహిర్. మారియా ఖబ్తియా (ర.'అన్హా) నుండి ఇబ్రాహీం. వారంతా బాల్యావస్థలోనే మరణించారు, (ఇబ్నె-కసీ'ర్, ము'హమ్మద్ జూనాగఢీ). కొందరు వ్యాఖ్యాతలు 'ఖదీజహ్ (ర.'అన్హా)కు ఇద్దరు కుమారులే అని అంటారు: ఖాసిమ్ మరియు అబ్దుల్లాహ్. 'తయ్యిబ్, 'తాహిర్ అనేవి అబ్దుల్లాహ్ యొక్క మారు పేర్లు అని వారంటారు.

[29] 'ఖాతమున్: అంటే ముద్ర. ముద్రవేయటం చివరిపని, కావున దైవప్రవక్త ము'హమ్మద్ ('స'అస) తరువాత ఇక ఏ ప్రవక్త కూడా రాడు. కాబట్టి అతను ప్రవక్తల ముద్ర (చివరివాడు), అని సంబోధించ బడ్డారు. కావున అతని తరువాత తనను తాను ప్రవక్తగా పరిగణించేవాడు, అసత్యుడూ, దజ్జాల్ మాత్రమే! చివరికాలంలో దైవప్రవక్త 'ఈసా ('అ.స.) తిరిగి వస్తారు. కానీ అతను ప్రవక్తగా గాక ము'హమ్మద్ ('స'అస) యొక్క ఉమ్మతి (అనుచరునిగా) వస్తారు. ఇదంతా స'హీ'హ్ 'హదీసులలో ఉంది. చాలా మంది ధర్మవేత్తల అభిప్రాయం ఇదే! అతను ('స'అస) చివరి ప్రవక్త కాబట్టి సమస్తలోకాలకు ప్రవక్తగా పంపబడ్డారు. చూడండి, 21:107.

ఉంటాడు మరియు ఆయన దూతలు మిమ్మల్ని అంధకారం నుండి వెలుగులోకి తీసుకు రావటానికి (ఆయనను ప్రార్థిస్తూ ఉంటారు). మరియు ఆయన విశ్వాసుల పట్ల అపార కరుణా ప్రదాత.

**44.** వారు ఆయనను కలుసుకునే రోజున వారికి: "మీకు శాంతి కలుగు గాక (సలాం)!" అనే అభినందనలతో స్వాగతం లభిస్తుంది[30]. మరియు ఆయన వారి కొరకు గౌరవప్రదమైన ప్రతిఫలం సిద్ధపరచి ఉంచాడు.

**45.** ఓ ప్రవక్తా! నిశ్చయంగా మేము, నిన్ను సాక్షిగా, శుభవార్త అందజేసేవానిగా మరియు హెచ్చరిక చేసేవానిగా పంపాము!

**46.** మరియు ఆయన అనుమతితో, అల్లాహ్ వైపునకు పిలిచేవానిగా మరియు ప్రకాశించే దీపంగానూ (చేసి పంపాము)!

**47.** మరియు నిశ్చయంగా, వారి మీద అల్లాహ్ యొక్క గొప్ప అనుగ్రహం ఉందనే శుభవార్తను విశ్వాసులకు ఇవ్వు.

**48.** మరియు నీవు సత్యతిరస్కారుల మరియు కపట విశ్వాసుల మాటలకు లోబడకు మరియు వారి వేధింపులను లక్ష్య పెట్టకు మరియు కేవలం అల్లాహ్ నే నమ్ముకో మరియు కార్యకర్తగా కేవలం అల్లాహ్ యే చాలు!

**49.** ఓ విశ్వాసులారా! మీరు విశ్వాసినులైన స్త్రీలను

---

[30] స్వర్గవాసులు లేక దైవదూతలు దానిలోకి వచ్చేవారికి ఈ విధంగా స్వాగతం చేస్తారు.

వివాహమాడి, తరువాత - మీరు వారిని తాకక పూర్వమే - వారికి విడాకులిచ్చినట్లైతే, మీ కొరకు వేచి వుండే వ్యవధి (ఇద్దత్) పూర్తి చేయమని అడిగే హక్కు మీకు వారిపై లేదు[31] కనుక వారికి పారితోషికం ఇచ్చి, మంచితనంతో వారిని సాగనంపండి[32].

50. ఓ ప్రవక్తా! నిశ్చయంగా, మేము నీకు: నీవు మహ్ర్ చెల్లించిన నీ భార్యలను[33] మరియు అల్లాహ్ ప్రసాదించిన (బానిస) స్త్రీల నుండి నీ

---

[31] వివాహం తరువాత స్త్రీతో సంభోగించి ఉంటే ఆమె వేచిఉండే గడువు ('ఇద్దత్) మూడు రుతుస్రావాలు. చూడండి, 2:228. కాని వివాహం తరువాత సంభోగించక ముందే విడాకులిస్తే ఆమె వేచిఉండక వెంటనే, మరొకనితో వివాహం చేసుకోవచ్చు. ఒకవేళ సంభోగం జరుగకముందే భర్త చనిపోతే 'ఇద్దత్ నాలుగు నెలల మీద పది రోజులు, (ఫత్హ్ అల్-ఖదీర్, ఇబ్నె-కసీ'ర్). నికా'హ్ జరిగిన తరువాతనే 'తలాఖ్, ఇవ్వవలసిన అవసరం ఉంటుంది. నికా'హ్ యే కాకుంటే 'తలాఖ్ ఇవ్వవలసిన అవసరం ఎక్కడ ఉంటుంది! "లా'తలాఖ ఖబ్ ల నికా'హ్." (ఇబ్నె-మాజా): "లా 'తలాఖ లి ఇబ్ని ఆదమ్ ఫీమా లా యమ్ లికు." (అబూ-దావూద్, తిర్మిజీ' మరియు అ'హ్మద్ - 2/189) అంటే పెండ్లి (నికా'హ్) కానిదే 'తలాఖ్ విషయమే రాదు.

[32] అంటే వారి మహ్ర్ నిర్ణయించబడి ఉంటే సగం ఇవ్వండి. లేకపోతే మీకు తోటినది ఇచ్చి మంచివిధంగా సాగనంపండి.

[33] దైవప్రవక్త ('స'అస) కు కొన్ని ప్రత్యేకతలు ఇవ్వబడ్డాయి. ఉదాహరణకు అతని ('స'అస) పై తహజ్జుద్ నమా'జ్ విధిగా చేయబడింది. మరియు సదఖహ్ (దానం) అతని ('స'అస)పై హరాం చేయబడింది. ఇక్కడ ఎవరికైతే అతను ('స'అస) మహ్ర్ చెల్లించారో వారు అతనికి 'హలాల్ గావించ బడ్డారు. వారికి మహ్ర్ ఇంత అని నియమించబడలేదు. ఉదాహరణకు: 'సఫియా మరియు జువేరియా (ర'ది. 'అన్హుమ్)ల మహ్ర్. ఇతరులందరికీ దైవప్రవక్త ('స'అస) మహ్ర్ నగదు చెల్లించారు. కేవలం ఉమ్మె 'హబీబా (ర.'అన్హా) మహ్ర్ నజ్జాషీ (ర'ది.'అ.) చెల్లించారు.

ఆధీనంలోకి వచ్చిన వారిని (స్త్రీలను)[34] మరియు నీతో పాటు వలస వచ్చిన నీ పినతండ్రి (తండ్రి సోదరుల) కుమార్తెలను మరియు నీ మేనత్తల (తండ్రి సోదరీమణుల) కుమార్తెలను మరియు నీ మేనమామల (తల్లిసోదరుల) కుమార్తెలను మరియు నీ పినతల్లుల (తల్లిసోదరీమణుల) కుమార్తెలను; మరియు తనను తాను ప్రవక్తకు సమర్పించుకున్న విశ్వాసిని అయిన స్త్రీని - ఒకవేళ ప్రవక్త ఆమెను వివాహం చేసుకోదలిస్తే ఇతర విశ్వాసుల కొరకు గాక ప్రత్యేకంగా నీ కొరకే - ధర్మసమ్మతం చేశాము. వాస్తవానికి వారి (ఇతర విశ్వాసుల) కొరకు, వారి భార్యల విషయంలో మరియు వారి బానిసల విషయంలో, మేము విధించిన పరిమితులు మాకు బాగా తెలుసు[35]. ఇదంతా మేము నీకు ఏ విధమైన ఇబ్బంది కలుగకుండా ఉండాలని చేశాము. వాస్తవానికి అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

[34] జువేరియా మరియు చివరి భార్య 'సఫియా (ర'ది.'అన్హుమ్) లను ఇద్దరిని అతను ('స'అస) వారి స్వేచ్ఛనే మహ్ర్ గా ప్రసాదించి వివాహమాడారు. రె'హానా మరియు మారియా ఖిబ్తియా (ర'ది.'అన్హుమ్)లు బానిసలుగానే ఉన్నారు. (ము'హమ్మద్ జూనాగఢి).

[35] ఇతర విశ్వాసులు ఒకేసారి నలుగురి కంటే ఎక్కువ మంది భార్యలను కలిగి ఉండరాదు. మరియు వారి నికా'హ్ కొరకు వలీ, సాక్షులు మరియు మహ్ర్ తప్పనిసరిగా ఉండాలి. ఈనాడు బానిసలు లేరు. ఎందుకంటే బానిసలు జిహాద్ లో పట్టుబడిన వారు మాత్రమే. డబ్బిచ్చి బానిసను కొనడం ఇస్లాంలో 'హరామ్. చూడండి, 2:221, 4:3-4 మరియు 19:25.

**51.** నీవు వారిలో (నీ భార్యలలో) నుండి, నీవు కోరిన ఆమెను నీ నుండి కొంత కాలం వేరుగా ఉంచవచ్చు. మరియు నీవు కోరిన ఆమెను నీతోపాటు ఉంచవచ్చు. మరియు నీవు వేరుగా ఉంచిన వారిలో నుండి ఏ స్త్రీనైనా నీవు తిరిగి పిలుచుకోగోరితే, నీపై ఎలాంటి దోషం లేదు. దీనితో వారి కళ్ళకు చల్లదనం కలుగుతుందని, వారు దుఃఖపడరనీ నీవు వారికి ఏమి ఇచ్చినా, వారు సంతోషపడతారని ఆశించవచ్చు! వాస్తవానికి మీ హృదయాలలో ఏముందో అల్లాహ్ కు తెలుసు[36]. మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, శాంత స్వభావుడు (సహన శీలుడు).

**52.** వీరు గాక, ఇతర స్త్రీలు నీకు (వివాహమాడటానికి) ధర్మసమ్మతం కారు[37] వీరికి బదులుగా కూడా మరెవ్వరినీ భార్యలుగా తీసుకునే అనుమతి కూడా నీకు లేదు - వారి సౌందర్యం నీకు ఎంత నచ్చినా - నీ ఆధీనంలో ఉన్న (బానిస) స్త్రీలు

---

[36] 'అయి'షహ్ (ర.'అన్హా) కథనం - దైవప్రవక్త ('స'అస) ఇలా ప్రార్థించేవారు: "ఓ అల్లాహ్! నేను నా మేరకు నా భార్యల మధ్య న్యాయంగా వ్యవహరిస్తున్నాను. ఇక నా వశంలో లేని దాని కొరకు నన్ను బాధ్యునిగా చేయకు! అది కేవలం నీ చేతిలో ఉంది." అంటే హృదయంలో ఉన్న ప్రేమ, అది ఒక భార్యకంటే మరొక భార్య కొరకు అధికంగా ఉండవచ్చు! (ఇబ్నె-'హంబల్).

[37] అప్పుడు దైవప్రవక్త ('స'అస) కు తొమ్మిది మంది సతీమణులు (ర'ది.'అన్హుమ్) ఉండేవారు. ఐదుమంది ఖురైషులు 'ఆయిషహ్, 'హఫ్సా, ఉమ్ము-'హబీబా, 'సౌదా, మరియు ఉమ్ము-సల్మా. నలుగురు ఇతరులు: 'సఫియ్యా, మైమూనా, 'జైనబ్ మరియు జువేరియా. అతను ('స'అస) ఆ తరువాత ఎవ్వరితోనూ వివాహమాడలేదు.

తప్పు![38] వాస్తవానికి అల్లాహ్ ప్రతి విషయాన్ని గమనిస్తున్నాడు.

53. ఓ విశ్వాసులారా! ప్రవక్త యొక్క ఇండ్లలోకి అనుమతి లేకుండా ప్రవేశించకండి. భోజనార్థం (పిలువబడినపుడు)ఆహారంసిద్ధపరిచేసమయం కొరకు వేచి ఉండకండి, కాని మీరు పిలువ బడినప్పుడు తప్పకుండా వెళ్ళండి. అయితే భోజనం చేసిన వెంటనే వెళ్ళిపొండి మరియు సాధారణ సంభాషణలో కాలక్షేపం చేస్తూ కూర్చోకండి. నిశ్చయంగా, దీని వలన ప్రవక్తకు కష్టం కలుగుతుంది; కాని అతను మిమ్మల్ని (పొమ్మనటానికి) సంకోచిస్తాడు. మరియు అల్లాహ్ సత్యం చెప్పటానికి సంకోచించడు (సిగ్గు పడడు)[39]. మరియు మీరు ప్రవక్త భార్యలతో ఏదైనా అడగ వలసి వచ్చినప్పుడు తెరచాటు నుండి అడగండి. ఇది మీ హృదయాలను మరియు వారి హృదయాలను కూడా నిర్మలంగా ఉంచుతుంది. మరియు అల్లాహ్ సందేశహరునికి కష్టం కలిగించటం మీకు తగదు. మరియు అతని తరువాత అతని భార్యలతో మీరు ఎన్నటికీ వివాహం చేసుకోకండి. నిశ్చయంగా ఇది అల్లాహ్

---

[38] బానిస స్త్రీల విషయంలో సంఖ్యాపరిమితి లేదు. వారిని గురించి 4:3, 23:6 మరియు 70:30.

[39] దైవప్రవక్త ('స'అస) 'జైనబ్ (ర.'అన్హా) తో వివాహమాడి ఇచ్చిన వలీమా భోజనం సందర్భంలో ఈ ఆయత్ అవతరింపజేయబడింది. ఆ రోజు కొందరు 'స'హాబీలు భోజనం తరువాత కూర్చొని కాలక్షేపం చేయసాగారు. ('స.బు'ఖారీ).

దృష్టిలో మహా అపరాధం.

**54.** ఒకవేళ మీరు ఏ విషయాన్నైనా వెలిబుచ్చినా లేదా దానిని దాచినా! నిశ్చయంగా, అల్లాహ్ కు మాత్రం ప్రతి విషయం గురించి బాగా తెలుసు.

**55.** వారిపై (ప్రవక్త భార్యలపై) - తమ తండ్రుల, తమ కుమారుల, తమ సోదరుల, తమ సోదరీమణుల కుమారుల, తమ స్త్రీల లేదా తమ బానిస (స్త్రీల) - యెదుట వస్తే ఎలాంటి దోషం లేదు[40]. (ఓ స్త్రీలారా!) మీరు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి. నిశ్చయంగా, అల్లాహ్ ప్రతి దానికి సాక్షి;

**56.** నిశ్చయంగా అల్లాహ్ మరియు ఆయన దూతలు ప్రవక్తపై దరూద్ లు పంపుతూ ఉంటారు. ఓ విశ్వాసులారా! మీరు కూడా అతనిపై దరూద్ లు మరియు మీ హృదయ పూర్వక సలాంలు పంపుతూ ఉండండి[41].

**57.** నిశ్చయంగా ఎవరైతే అల్లాహ్ మరియు ఆయన సందేశహరునికి బాధ కలిగిస్తారో, వారిని అల్లాహ్ ఇహలోకంలో మరియు పరలోకంలో కూడా

---

[40] చూడండి, 24:31 అక్కడ కూడా ఈ శాసనం ఉంది.

[41] అల్లాహ్ (సు.తా.) దైవదూతల ('అలైహిమ్. స.) ముందు దైవప్రవక్త ('స'అస) ను ప్రశంసిస్తాడు. మరియు అతనిపై తన కారుణ్యాలను అవతరింపజేస్తాడు. మరియు దైవదూత ('అలైహిమ్.స.) లు అతని ('స'అస) ఔన్నత్యాలకు ప్రార్థనలు చేస్తారు. సహాబీ (ర'ది.'అన్హుమ్)లు దైవప్రవక్తతో మేము ఏ విధంగా మీపై దురూద్ పంపాలి అని ప్రశ్నించగా, అతను ('స'అస) నమాజ్ లో చదివే దురూద్ ఇబ్రాహీమ్ వివరించారు, ('స.బు'ఖారీ).

శపిస్తాడు (బహిష్కరిస్తాడు) మరియు ఆయన వారికై అవమానకరమైన శిక్షను సిద్ధపరచి ఉంచాడు[42].

**58.** మరియు ఎవరైతే, ఏ తప్పూ చేయని, విశ్వాసులైన పురుషులకు మరియు స్త్రీలకు బాధ కలిగిస్తారో, వాస్తవానికి వారు అపనిందను మరియు స్పష్టమైన పాపభారాన్ని తమ మీద మోపుకున్నట్లే!

**59.** ఓ ప్రవక్తా! నీ భార్యలతో, నీ కుమార్తెలతో మరియు విశ్వాసినులైన స్త్రీలతోనూ తమ దుప్పట్లు ను తమ మీద పూర్తిగా కప్పుకోమని చెప్పు. ఇది వారు గుర్తించబడి బాధింపబడకుండా ఉండటానికి ఎంతో సముచితమైనది[43]. మరియు అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

**60.** ఒకవేళ ఈ కపట విశ్వాసులు మరియు తమ హృదయాలలో రోగం (కలుషితం) ఉన్న వారు మరియు మదీనాలో వదంతులు వ్యాపింప జేసేవారు. తమ (దుశ్చేష్టలను) మానుకోక పోతే,

---

[42] అల్లాహ్ (సు.తా.) ను ఎవ్వరూ బాధించలేరు. ఇక్కడ దీని అర్థం అల్లాహ్ (సు.తా.) కు ఇష్టం లేని పని చేయడం. ఉదా: అల్లాహ్ (సు.తా.)కు సంతానం అంటగట్టడం. అల్లాహ్ (సు.తా.) యొక్క సందేశహరునికి బాధ కలిగించడం అంటే, అతని ('స'అస) పై అసత్యవాదుడు, కవి, మాంత్రికుడు అని అపనిందలు మోపడం. ల'అనతున్: అంటే అల్లాహ్ (సు.తా.) అనుగ్రహాల నుండి బహిష్కరించ, శపించ, నిషేధించ, త్రోసివేయ, దూషించ బడటం అనే అర్థాలున్నాయి. చూడండి, 2:88.

[43] చూడండి, 24:31. శరీరాన్ని పూర్తిగా కప్పుకొని, నెత్తిపై ఉన్న దుప్పటిని ముఖం మీదికి లాగుకొని కప్పుకోమని ఆజ్ఞ ఇవ్వబడింది.

మేము తప్పక నీకు వారిపై ఆధిక్యత నొసంగుతాము. ఆ తరువాత వారు ఈ నగరంలో నీ పొరుగు వారిగా కొన్నాళ్ళ కంటే ఎక్కువ ఉండలేరు.

**61.** వారు శపించబడ్డ (బహిష్కరించబడ్డ) వారు. వారు ఎక్కడ కనబడితే అక్కడ పట్టుకోబడతారు మరియు వారు దారుణంగా చంపబడతారు[44].

**62.** ఇది ఇంతకు పూర్వం గడిచిన వారి విషయంలో జరుగుతున్న అల్లాహ్ సంప్రదాయమే! మరియు అల్లాహ్ సంప్రదాయంలో నీవు ఎలాంటి మార్పును చూడవు[45].

**63.** ప్రజలు నిన్ను అంతిమ ఘడియ (పునరుత్థానం) ను గురించి అడుగు తున్నారు. వారితో ఇలా అను: "దాని జ్ఞానం కేవలం అల్లాహ్ కే ఉంది." మరియు నీకెలా తెలియదు? బహుశా ఆ ఘడియ సమీపంలోనే ఉండవచ్చు![46]

**64.** నిశ్చయంగా, అల్లాహ్ సత్యతిరస్కారులను శపించాడు (బహిష్కరించాడు) మరియు ఆయన వారి కొరకు మండే (నరక) అగ్నిని సిద్ధపరచి ఉంచాడు.

**65.** వారందులో శాశ్వతంగా కలకాలం ఉంటారు. వారు ఎలాంటి సంరక్షకుణ్ణి గానీ సహాయకుణ్ణి గానీ పొందలేరు.

---

[44] చూడండి, 2:191.
[45] చూడండి, 35:42-44.
[46] చూడండి, 7:187.

**66.** వారి ముఖాలు నిప్పులపై బొర్లింప బడిన నాడు; వారు: "అయ్యో! మేము అల్లాహ్ కు విధేయులమై ఉండి, సందేశహరుణ్ణి అనుసరించి ఉంటే ఎంత బాగుండేది?" అని వాపోతారు.

**67.** వారు ఇంకా ఇలా అంటారు: "ఓ మా ప్రభూ! నిశ్చయంగా, మేము మా నాయకులను మరియు మా పెద్దలను అనుసరించాము. కాని, వారే మమ్మల్ని (ఋజు) మార్గం నుండి తప్పించారు."

**68.** "ఓ మా ప్రభూ! వారికి రెట్టింపు శిక్ష విధించు మరియు వారిని పూర్తిగా శపించు (బహిష్కరించు)!"

**69.** ఓ విశ్వాసులారా! మీరు మూసాను బాధించిన వారి వలే అయి పోకండి[47]. తరువాత అల్లాహ్ వారు (కల్పించిన) ఆరోపణ నుండి అతనికి విముక్తి కలిగించాడు. అతను (మూసా), అల్లాహ్ దృష్టిలో ఎంతో ఆదరణీయుడు.

**70.** ఓ విశ్వాసులారా! అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి. మరియు మీరు మాట్లాడినప్పుడు యుక్తమైన మాటనే పలకండి.

**71.** ఆయన మీ కర్మలను సరిదిద్దుతాడు మరియు మీ పాపాలను క్షమిస్తాడు. మరియు ఎవడైతే అల్లాహ్ కు విధేయుడై సందేశహరుని ఆజ్ఞను పాలిస్తాడో! నిశ్చయంగా, అతడే గొప్ప విజయం పొందినవాడు!

---

[47] మూసా ('అ.స.) ను బాధించిన వివరాలకు చూడండి, 2:55, 5:24.

72. నిశ్చయంగా, మేము బాధ్యతను[48] ఆకాశాలకు, భూమికి మరియు పర్వతాలకు సమర్పించగోరాము, కాని అవి దానిని భరించటానికి సమ్మతించలేదు మరియు దానికి భయపడ్డాయి, కాని మానవుడు దానిని తన మీద మోపుకున్నాడు. నిశ్చయంగా అతడు దుర్మార్గుడు, మూఢుడు కూడాను.

73. (దాని ఫలితంగా!) అల్లాహ్ కపట విశ్వాసులయిన పురుషులను మరియు కపట విశ్వాసులయిన స్త్రీలను మరియు అల్లాహ్ కు సాటి కల్పించే పురుషులను మరియు సాటి కల్పించే స్త్రీలను శిక్షిస్తాడు; మరియు విశ్వాసులైన పురుషుల మరియు విశ్వాసులైన స్త్రీల పశ్చాత్తాపాన్ని అంగీకరిస్తాడు. మరియు అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

---

[48] బాధ్యత అంటే, అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞ పాటించడం వల్ల కలిగే పుణ్యఫలాలు మరియు తిరస్కరించడం వల్ల కలిగే కష్టనష్టాలు. శిక్షలకు భయపడి, ఆకాశాలూ, భూమీ మరియు పర్వతాలు, దానిని భరించటానికి సమ్మతించలేదు. కాని మానవుడు తన మూఢత్వం వల్ల ఈ బాధ్యతను తన మీద మోపుకున్నాడు. బాధ్యత అంటే ఖుర్ఆన్ కూడా కావచ్చు!

# 34. సబా [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. సర్వస్తోత్రాలకు అర్హుడు అల్లాహ్ మాత్రమే! ఆకాశాలలో మరియు భూమిలో ఉన్నదంతా ఆయనకే చెందుతుంది. మరియు పరలోకంలో కూడా సర్వస్తోత్రాలకు అర్హుడు ఆయనే![1] మరియు ఆయన మహా వివేకవంతుడు, సర్వం తెలిసినవాడు[2].

2. భూమిలోకి ప్రవేశించేది మరియు దాని నుండి బయటికి వచ్చేది మరియు ఆకాశం నుండి దిగేది మరియు దానిలో పైకి ఎక్కిపోయేది, అంతా ఆయనకు బాగా తెలుసు. మరియు ఆయన అపార కరుణా ప్రదాత, క్షమాశీలుడు.

3. మరియు సత్యతిరస్కారులు ఇలా అంటారు: "అంతిమ ఘడియ (పునరుత్థానం) మాపై ఎన్నడూ రాదు!" వారితో ఇలా అను: "ఎందుకు రాదు! అగోచర విషయజ్ఞానం గల నా ప్రభువు సాక్షిగా! అది తప్పక మీ మీదకు వస్తుంది." ఆకాశాలలో మరియు భూమిలో ఉన్న రవ్వతో (పరమాణువుతో) సమానమైన వస్తువుగానీ,

---

[*] [సబా – సబా, షెబా ఇది ఆ కాలంలోని ఒక ప్రదేశం పేరు]

[1] ఈ స్తోత్రాలు పునరుత్థాన దినమున విశ్వాసులు చేస్తారు. చూడండి, 39:74, 7:43, 35:34.

[2] చూడండి, 6:18.

లేదా దాని కంటే చిన్నది గానీ లేదా దాని కంటే పెద్దది గానీ, ఒక స్పష్టమైన గ్రంథంలో (వ్రాయబడకుండా) ఆయనకు మరుగుగా లేదు.

4. అది (అంతిమ ఘడియ), విశ్వసించి సత్కార్యాలు చేసేవారికి ప్రతిఫలము నివ్వటానికి వస్తుంది. అలాంటివారికి క్షమాపణ మరియు గౌరవప్రదమైన జీవనోపాధి(స్వర్గం) ఉంటాయి[3]

5. మరియు ఎవరైతే మా సూచనలను (ఆయాత్ లను) విఫలం చేయటానికి ప్రయత్నిస్తారో, అలాంటి వారికి అధమమైన, బాధాకరమైన శిక్ష ఉంటుంది.

6. మరియు ఎవరికైతే జ్ఞానం ఇవ్వబడిందో! వారు[4], ఇది నీ ప్రభువు తరఫు నుండి నీపై అవతరింప జేయబడిన సత్యమనీ మరియు అది సర్వశక్తిమంతుడు ప్రశంసనీయుడు (అయిన అల్లాహ్) మార్గం వైపునకే మార్గదర్శకత్వం చేస్తుందనీ గ్రహిస్తారు.

7. మరియు సత్యతిరస్కారులు ఇలా అంటారు: "మీరు (చచ్చి) దుమ్ముగా మారి, చెల్లాచెదురైన తరువాత కూడా! నిశ్చయంగా, మళ్ళీ క్రొత్తగా సృష్టింపబడతారని తెలియజేసే వ్యక్తిని[5] మీకు

---

[3] చూడండి, 8:4.

[4] జ్ఞానమివ్వబడిన వారు అంటే 'స'హా'బా (ర'ది.'అన్హుమ్) లు, విశ్వాసులు మరియు గ్రంథజ్ఞానం గలవారు, అందరూ కావచ్చు!

[5] ఇది సత్యతిరస్కారులు దైవప్రవక్త ('స'అస) గురించి పలుకుతున్నారు.

చూపమంటారా?"

8. "అతను అల్లాహ్ పై అబద్ధం కల్పించాడో లేక! అతనికి పిచ్చిపట్టిందో తెలియటం లేదు!" అలా కాదు, ఎవరైతే పరలోకాన్ని నమ్మరో వారు శిక్షకు గురి అవుతారు. మరియు వారు మార్గభ్రష్టత్వంలో చాలా దూరం వెళ్ళిపోయారు.

9. ఏమిటి? వారు తమకు ముందున్న మరియు తమకు వెనుకనున్న ఆకాశాన్ని మరియు భూమిని చూడటం లేదా? మేము కోరితే, వారిని భూమిలోకి అణగ ద్రొక్కేవారం, లేదా వారిపై ఆకాశం నుండి ఒక ముక్కను పడవేసే వారం. నిశ్చయంగా, ఇందులో పశ్చాత్తాపంతో (అల్లాహ్ వైపునకు) మరలే, ప్రతి దాసుని కొరకు ఒక సూచన ఉంది[6].

10. మరియు వాస్తవంగా, మేము దావూద్ కు మా తరఫు నుండి గొప్ప అనుగ్రహాన్ని ప్రసాదించాము: "ఓ పర్వతాల్లారా! మరియు పక్షులారా! అతనితో కలిసి (మా స్తోత్రాన్ని) ఉచ్చరించండి!"[7] (అని ఆజ్ఞాపించాము). మేము అతని కొరకు ఇనుమును మెత్తదిగా చేశాము.

11. (అతనికి ఇలా ఆదేశమిచ్చాము): "నీవు కవచాలు తయారు చేయి మరియు వాటి వలయాలను (కడియాలను) సరిసమానంగా కూర్చు!" మరియు (ఓ మానవులారా!): "మీరు

[6] చూడండి, 24:31 చివరి వాక్యం.
[7] చూడండి, 21:79.

సత్కార్యాలు చేయండి. నిశ్చయంగా, మీరు చేసేదంతా నేను చూస్తున్నాను."

12. మరియు మేము గాలిని సులైమాన్ కు (వశపరచాము); దాని ఉదయపు గమనం ఒక నెల రోజుల పాటి ప్రయాణాన్ని పూర్తి చేసేది మరియు దాని సాయంకాలపు గమనం ఒక నెల[8] మరియు మేము అతని కొరకు రాగి ఊటను ప్రవహింప జేశాము. మరియు అతని ప్రభువు ఆజ్ఞతో, అతని సన్నిధిలో పని చేసే జిన్నాతులను అతనికి వశపరచాము. మరియు వారిలో మా ఆజ్ఞను ఉల్లంఘించిన వాడికి ప్రజ్వలించే నరకాగ్ని శిక్షను రుచి చూపుతూ ఉండేవారము.

13. వారు (జిన్నాతులు) అతనికి అతను కోరే, పెద్ద పెద్ద కట్టడాలను, ప్రతిమలను, గుంటల వంటి పెద్ద పెద్ద గంగాళాలను, (తమ స్థానము నుండి) కదిలింపలేని కళాయీలను తయారు చేసేవారు. "ఓ దావూద్ వంశీయులారా! మీరు కృతజ్ఞులై పనులు చేస్తూ ఉండండి." మరియు నా దాసులలో కృతజ్ఞతలు తెలిపేవారు చాలా తక్కువ.

14. మేము అతని (సులైమాన్)పై మృత్యువును విధించినప్పుడు, అతని చేతికర్రను తింటూ ఉన్న పురుగు తప్ప, మరెవ్వరూ అతని మరణం

---

[8] చూడండి, 21:81-82.

విషయం, వారికి (జిన్నాతులకు) తెలుపలేదు[9]. ఆ తరువాత అతను పడిపోగా జిన్నాతులు తమకు అగోచర విషయాలు తెలిసి ఉంటే, తాము అవమాన కరమైన ఈ బాధలో పడి ఉండే వారం కాము కదా అని తెలుసుకున్నారు.

15. వాస్తవంగా, సబా వారి కొరకు, వారి నివాస స్థలంలో ఒక సూచన ఉంది[10]. దాని కుడి మరియు ఎడమ ప్రక్కలలో రెండు తోటలు ఉండేవి. (వారితో): "మీ ప్రభువు ప్రసాదించిన ఆహారం తిని ఆయనకు కృతజ్ఞతలు తెలుపండి!" (అని అనబడింది). ఇది చాలా మంచి దేశం మరియు మీ ప్రభువు క్షమాశీలుడు.

16. అయినా వారు విముఖులయ్యారు. కాబట్టి మేము వారి పైకి, కట్టను తెంచి వరదను పంపాము. మరియు వారి రెండు తోటలను చేదైనా ఫలాలిచ్చే చెట్లు, ఝూవుక చెట్లు మరియు కొన్ని మాత్రమే

---

[9] దీనితో తెలిసేది ఏమిటంటే జిన్నాతులకు అగోచర విషయాల జ్ఞానం ఉండదు.

[10] సబా': ఒక జాతి పేరు. బైబిల్ లో వారు షీబా (Sheiba) అనే పేరుతో పిలువబడ్డారు. వారిపై ఒక స్త్రీ రాజ్యాధికారి. అది ఈ నాటి యమన్ లోని 'హ'దరమౌత్ ప్రాంతాలలో ఉండేది. ఆమె సులైమాన్ ('అ.స.) ను కలుసుకొనిన తరువాత ఇస్లాం స్వీకరించింది. అంతకు పూర్వం వారు సూర్యుణ్ణి పుజించేవారు. ఆ రాజ్యపు రాజధాని పేరు మ'ఆరిబ్. వారు డామ్ లు నిర్మించారు. దానివల్ల వారు మంచి పంటలు పండించి సుఖసంతోషాలలో వర్ధిల్లుతూ ఉండేవారు.

రేగు చెట్లు ఉన్న తోటలుగా మార్చాము[11].

**17.** ఇది వారి కృతఘ్నతకు (సత్యతిరస్కారానికి) బదులుగా వారికిచ్చిన ప్రతిఫలం. మరియు ఇలాంటి ప్రతిఫలం మేము కృతఘ్నులకు తప్ప, ఇతరులకు ఇవ్వము.

**18.** మరియు మేము వారి మధ్య మరియు మేము శుభాలు ప్రసాదించిన నగరాల మధ్య, స్పష్టంగా కనిపించే నగరాలను స్థాపించి: "వాటి మధ్య సురక్షితంగా రేయింబవళ్ళు ప్రయాణిస్తూ ఉండండి." (అని అన్నాము).

**19.** కాని వారు: "ఓ మా ప్రభూ! మా ప్రయాణ దూరాలను పొడిగించు." అని వేడుకొని, తమకు తామే అన్యాయం చేసుకున్నారు. కావున మేము వారిని కథలుగా మిగిల్చి, వారిని పూర్తిగా చెల్లా చెదురు చేశాము[12]. నిశ్చయంగా, ఇందులో సహనశీలుడు, కృతజ్ఞుడు అయిన ప్రతీ వ్యక్తికి సూచనలున్నాయి.

**20.** వాస్తవానికి ఇబ్లీస్ (షైతాన్) వారి విషయంలో తాను ఊహించింది సత్యమయిందని నిరూపించాడు. ఎందుకంటే! విశ్వాసులలోని ఒక వర్గం వారు తప్ప,

---

[11] అస్లీ'న్, ఝూవుక చెట్లు (Tamarisk Trees) లేక వాటివంటి చెట్లు. దీని తాత్పర్యమేమిటంటే, వారి అవిశ్వాస వైఖరి మరియు సత్యతిరస్కారం వల్ల, మొదట మంచి ఫలాలనిచ్చే ఆ రెండు తోటలు ఎక్కువగా చేదైన ఫలాలిచ్చే పెద్ద పెద్ద ముండ్లు గల చెట్లుగా మారిపోయాయి. మరియు కొన్ని మాత్రమే మంచి ఫలాలిచ్చే రేగుచెట్లు (Lote-Trees)గా మిగిలి పోయాయి.

[12] మ'ఆరిబ్ డామ్, తెగిన తరువాత అక్కడి ప్రజలు ఇటూ అటూ చెల్లాచెదరై పోయారు.

అందరూ వాడిని అనుసరించారు.

21. మరియు వాడికి (షైతాన్ కు) వారిపై ఎలాంటి అధికారం లేదు[13]. కాని, పరలోకాన్ని విశ్వసించేవాడెవడో (మరియు) దానిని గురించి సంశయంలో పడ్డ వాడెవడో, తెలుసు కోవటానికి మాత్రమే (మేమిలా చేశాము) మరియు నీ ప్రభువు ప్రతి విషయాన్ని కనిపెట్టుకొని ఉంటాడు.

22. వారితో ఇలా అను: "అల్లాహ్ ను వదలి మీరు ఎవరినైతే, (ఆరాధ్యదైవాలుగా) భావిస్తున్నారో, వారిని పిలిచి చూడండి!" ఆకాశాలలో గానీ మరియు భూమిలో గానీ రవ్వ (పరమాణువు) అంత వస్తువుపై కూడా వారికి అధికారం లేదు. మరియు వారికి ఆ రెండింటిలో ఎలాంటి భాగస్వామ్యమూ లేదు. మరియు ఆయనకు వారిలో నుండి ఎవ్వడూ సహాయకుడునూ కాడు[14].

23. మరియు ఆయన దగ్గర ఏ విధమైన సిఫారసు పలికిరాదు, ఆయన అనుమతించిన వాడి (సిఫారసు తప్ప)[15]! చివరకు వారి హృదయాల నుండి భయం తొలగిపోయినప్పుడు వారు (దేవతలు): "మీ ప్రభువు మీతో చెప్పిందేమిటీ?" అని అడుగుతారు. దానికి వారంటారు: "సత్యం మాత్రమే!" మరియు ఆయన మహోన్నతుడు,

[13] చూడండి, 14:22.
[14] చూడండి, 17:56-57.
[15] చూడండి, 10:3, 19:87, 20:109.

మహనీయుడు.

24. వారిని ఇలా అడుగు: "మీకు ఆకాశాల నుండి మరియు భూమి నుండి జీవనోపాధిని సమకూర్చేవాడెవడు?" వారికి తెలుపు: "అల్లాహ్!" అయితే నిశ్చయంగా మేమో లేక మీరో ఎవరో ఒకరు మాత్రమే సన్మార్గంలో ఉన్నాము లేదా స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో ఉన్నాము.

25. ఇంకా ఇలా అను: "మేము చేసిన పాపాలకు మీరు ప్రశ్నించబడరు మరియు మీ కర్మలను గురించి మేమూ ప్రశ్నించబడము."

26. వారితో ఇలా అను: "మన ప్రభువు మనందరినీ (పునరుత్థాన దినమున) ఒకే చోట సమకూర్చుతాడు. తరువాత న్యాయంగా మన మధ్య తీర్పు చేస్తాడు. ఆయనే (సర్వోత్తమమైన) తీర్పు చేసేవాడు[16], సర్వజ్ఞుడు."

27. వారితో ఇలా అను: "మీరు ఆయనకు సాటిగా నిలబెట్టిన భాగస్వాములను నాకు చూపించండి. ఎవరూ లేరు! వాస్తవానికి ఆయన, అల్లాహ్ యే సర్వ శక్తిమంతుడు, మహా వివేకవంతుడు."

28. మరియు (ఓ ముహమ్మద్!) మేము నిన్ను సర్వమానవులకు శుభవార్తనిచ్చే వానిగా మరియు

---

[16] అల్-ఫత్తా'హు: The Decider, The Judge, The Opener of the gates of sustenance and of mercy to His servants. తన దాసులకు జీవనోపాధి మరియు కారుణ్యపు ద్వారాలు తెరిచేవాడు. ఆపద్బాంధవుడు, న్యాయాధిపతి, తీర్పు చేసేవాడు, పరిష్కరించేవాడు.

హెచ్చరిక చేసేవానిగా మాత్రమే పంపాము[17]. కాని వాస్తవానికి చాలా మంది ప్రజలకు ఇది తెలియదు[18].

**29.** మరియు వారు: "మీరు సత్యవంతులే అయితే, ఆ వాగ్దానం ఎప్పుడు నెరవేరనున్నది?" అని అడుగుతున్నారు[19].

**30.** వారితో ఇలా అను: "మీ కొరకు ఒక రోజు వ్యవధి నిర్ణయించబడి ఉంది; మీరు దాని రాకను ఒక్క ఘడియ వెనుకకూ చేయలేరు లేదా (ఒక్క ఘడియ) ముందుకునూ చేయలేరు."[20]

**31.** మరియు సత్యతిరస్కారులైన వారు ఇలా అంటారు: "మేము ఈ ఖుర్ఆన్ ను మరియు దీనికి ముందు వచ్చిన ఏ గ్రంథాన్ని కూడా నమ్మము." ఒకవేళ ఈ దుర్మార్గులను తమ ప్రభువు ఎదుట నిలబెట్టబడినప్పుడు, వారు ఒకరి నొకరు, ఆరోపణలు చేసుకోవటం నీవు చూస్తే (ఎంత బాగుండును)! బలహీన వర్గం వారు దురహంకారులైన తమ నాయకులతో: "మీరే లేకుంటే మేము తప్పక విశ్వాసుల మయ్యేవారం!" అని అంటారు.

---

[17] చూడండి, 7:158, 25:1.
[18] చూడండి, 12:103, 6:116.
[19] చూడండి, 7:187.
[20] చూడండి, 71:4. పైన ఇవ్వడిన తాత్పర్యం నోబుల్ ఖుర్ఆన్ ను అనుసరించి ఉంది. అంటే మీరు ఎవ్వరునూ ఆ నిర్ణీత వ్యవధిని ఒక్క ఘడియ ముందుగానూ తీసుకురాలేరు లేదా దానిని ఒక్క ఘడియ కూడా ఆసల్యమూ చేయలేరు. అది అల్లాహుతా'ఆలా నిర్ణయించిన ఘడియలోనే రానున్నది. దానిని మార్చే శక్తి ఇతరులకు ఎవ్వరికీ లేదు.

**32.** దురహంకారులైన నాయకులు బలహీనులైన వారితో ఇలా అంటారు: "ఏమీ? మీ వద్దకు మార్గదర్శకత్వంవచ్చినప్పుడుమేముమిమ్మల్ని దాని నుండి నిరోధించామా? అలా కాదు, మీరే అపరాధానికి పాల్పడ్డారు!"

**33.** మరియు బలహీనులైన వారు దురహంకారులైన నాయకులతో ఇలా అంటారు: "అలా కాదు! ఇది మీరు రాత్రింబవళ్ళు పన్నిన కుట్ర[21]. మీరు మమ్మల్ని - అల్లాహ్ ను తిరస్కరించి - ఇతరులను ఆయనకు సాటి కల్పించమని ఆజ్ఞాపిస్తూ ఉండేవారు." మరియు వారు శిక్షను చూసినప్పుడు, తమ పశ్చాత్తాపాన్ని దాస్తారు. మరియు మేము సత్యతిరస్కారుల మెడలలో సంకెళ్ళు వేస్తాము[22]. వారు తమ కర్మలకు తగిన ప్రతిఫలం తప్ప మరేదైనా పొందగలరా?

**34.** మరియు మేము హెచ్చరిక చేసే అతనిని (ప్రవక్తను) ఏ నగరానికి పంపినా, దానిలోని ఐశ్వర్యవంతులు: "నిశ్చయంగా, మేము మీ వెంట పంపబడిన సందేశాన్ని తిరస్కరిస్తున్నాము." అని అనకుండా ఉండలేదు[23].

**35.** వారు ఇంకా ఇలా అన్నారు: "మేము (నీ కంటే) ఎక్కువ సంపద మరియు సంతానం

---

[21] చూడండి, 10:21, 35:43, 86:15.

[22] చూడండి, 13:5, 36:8.

[23] మొట్టమొదట కేవలం పేదవారు మరియు దిగువ సామాజిక తరగతులవారుమాత్రమేప్రవక్త('అలైహిస్స.)అనుసరించారు. చూడండి, 26:111, 11:27, 7:75, 17:16.

కలిగి ఉన్నాము. మరియు మేము ఏ మాత్రం శిక్షింపబడము."

36. వారితో అను: "నిశ్చయంగా, నా ప్రభువు తాను కోరిన వారికి జీవనోపాధిని పుష్కలంగా ప్రసాదిస్తాడు, మరియు (తాను కోరిన వారికి) మితంగా ఇస్తాడు. కాని చాలా మందికి ఇది తెలియదు."

37. మరియు మీ సంపద గానీ మరియు మీ సంతానం గానీ మిమ్మల్ని మా దగ్గరికి తేలేవు; కాని విశ్వసించి సత్కార్యాలు చేసేవారు తప్ప! కావున అలాంటి వారికి తాము చేసిన దానికి రెట్టింపు ప్రతిఫలం లభిస్తుంది. మరియు వారు భవనాలలో సురక్షితంగా ఉంటారు.

38. మరియు ఎవరైతే మా సూచనలను భంగపరచటానికి ప్రయత్నిస్తారో, అలాంటి వారు కఠినశిక్షకు హాజరు చేయబడతారు.

39. వారితో అను: "నిశ్చయంగా, నా ప్రభువు తన దాసులలో తాను కోరిన వారికి జీవనోపాధిని పుష్కలంగా ప్రసాదిస్తాడు మరియు (తాను కోరిన) వారికి మితంగా ఇస్తాడు. మరియు మీరు (ఆయన మార్గంలో) ఖర్చు పెట్టేదంతా ఆయన మీకు తిరిగి ఇస్తాడు. మరియు ఆయనే సర్వశ్రేష్ఠుడైన జీవనోపాధి ప్రదాత."

40. మరియు (జ్ఞాపకముంచుకోండి) ఆ రోజు ఆయన వారందరినీ సమీకరించిన తరువాత దేవదూతలతో

ఇలా అడుగుతాడు: "ఏమీ? వీరేనా మిమ్మల్ని ఆరాధిస్తూ ఉండేవారు?"[24]

**41.** వారు (దేవదూతలు) జవాబిస్తారు: "నీవు సర్వలోపాలకు అతీతుడవు! నీవే మా సంరక్షకుడవు, వీరు కారు. వాస్తవానికి, వీరు జిన్నాతులను ఆరాధించేవారు, వీరిలో చాలా మంది,వారిని(జిన్నాతులను)విశ్వసించేవారు."[25]

**42.** (అప్పుడు వారితో ఇట్లనబడుతుంది): "అయితే ఈ రోజు మీరు ఒకరికొకరు లాభం గానీ, నష్టం గానీ చేకూర్చుకోలేరు." మరియు మేము దుర్మార్గులతో: "మీరు తిరస్కరిస్తూ ఉండిన నరకబాధనురుచిచూడండి!"అనిపలుకుతాము.

**43.** మరియు వారికి మా స్పష్టమైన సూచన (ఆయాత్) లను వినిపింప జేసినప్పుడు వారు: "ఈ వ్యక్తి కేవలం మీ తండ్రి తాతలు ఆరాధించే వాటి నుండి మిమ్మల్ని నిరోధిస్తున్నాడు." అని అంటారు. వారింకా ఇలా అంటారు: "ఇది (ఈ ఖుర్ఆన్) కేవలం కల్పించబడిన బూటకం మాత్రమే." మరియు సత్యతిరస్కారులు, సత్యం వారి ముందుకు వచ్చినప్పుడు: "ఇది కేవలం స్పష్టమైన మంత్రజాలం మాత్రమే!"[26] అని అంటారు.

---

[24] చూడండి, 25:17.
[25] చూడండి, 4:117.
[26] చూడండి, 74:24.

44. (ఓ ముహమ్మద్!) మేము, వారికి చదవటానికి ఎలాంటి గ్రంథాలు ఇవ్వలేదు[27]. మరియు మేము వారి వద్దకు నీకు పూర్వం హెచ్చరించే (సందేశహరుణ్ణి) కూడా పంపలేదు.

45. మరియు వారికి పూర్వం గతించిన వారు కూడా (ఇదే విధంగా) తిరస్కరించారు. మేము (పూర్వం) వారికిచ్చిన దానిలో వీరు పదోవంతు కూడా పొందలేదు. అయినా వారు నా సందేశహరులను తిరస్కరించారు. చూశారా! నా శిక్ష ఎంత ఘోరంగా ఉండిందో![28]

46. (ఓ ముహమ్మద్!) వారితో ఇలా అను: "వాస్తవానికి, నేను మీకు ఒక విషయం బోధిస్తాను: 'మీరు అల్లాహ్ కొరకు ఇద్దరిద్దరిగా, ఒక్కొక్కరిగా నిలవండి. తరువాత బాగా ఆలోచించండి!' మీతోపాటు ఉన్న ఈ వ్యక్తికి (ప్రవక్తకు) పిచ్చి పట్టలేదు[29]. అతను కేవలం, మీపై ఒక ఘోరశిక్ష రాకముందే, దానిని గురించి మిమ్మల్ని

[27] చూడండి, 30:35.
[28] చూడండి, 46:26.
[29] చూడండి, 7:184.

హెచ్చరించేవాడు మాత్రమే!"[30]

**47.** ఇలా అను: "నేను మిమ్మల్ని ఏదైనా ప్రతిఫలం అడిగి ఉన్నట్లయితే, దానిని మీరే ఉంచుకోండి[31]. వాస్తవానికి, నా ప్రతిఫలం కేవలం అల్లాహ్ వద్దనే ఉంది. మరియు ఆయనే ప్రతి దానికి సాక్షి!"

**48.** ఇలా అను: "నిశ్చయంగా, నా ప్రభువే సత్యాన్ని (అసత్యానికి విరుద్ధంగా) పంపేవాడు[32]. ఆయనే అగోచర యథార్థాలన్నీ తెలిసి ఉన్నవాడు."

**49.** ఇలా అను: "సత్యం వచ్చేసింది! మరియు అసత్యం (మిథ్యం దేనినీ ఆరంభం చేయజాలదు మరియు దానిని తిరిగి ఉనికిలోకి తేజాలదు."[33]

**50.** ఇలా అను: "ఒకవేళ నేను మార్గభ్రష్టుడనైతే!

---

[30] ఒకరోజు దైవప్రవక్త ('స'అస) 'సఫా గుట్ట మీద ఎక్కి అంటారు: "ఓ ప్రజలారా, వినండి!". ప్రజలందరూ అక్కడికి చేరుకుంటారు. "ఒకవేళ: 'ఉదయమో, సాయంత్రమో, శత్రువు మీపై దాడి చేయనున్నాడు.' అని అంటే మీరు నమ్ముతారా?" వారంటారు: "ఎందుకు నమ్మము." అప్పుడతను ('స'అస) అంటారు: "అయితే వినండి! నేను మిమ్మల్ని ఘోరశిక్ష రాక ముందు విశ్వసించండని హెచ్చరిస్తున్నాను." దానికి అబూ-లహబ్ అంటాడు: "నీ పాడుగాను, దీనికా నీవు మమ్మల్ని ప్రోగుచేసింది?" అప్పుడు అల్లాహ్ (సు.తా.) సూరహ్ అల్-మసద్ (111) అవతరింపజేశాడు. ('స'హీ'హ్ బు'ఖారీ).

[31] చూడండి, 25:57.

[32] చూడండి, 21:18.

[33] ఇక్కడ 'హఖ్ఖ్ అంటే ఖుర్ఆన్, బా'తిల్ అంటే షై'తాన్ - కుఫ్ర్ మరియు షిర్క్. మక్కా విజయం రోజు, దైవప్రవక్త ('స'అస) కాబా గృహంలో ప్రవేశించారు. అందులో అన్ని వైపులా విగ్రహాలు ఉండేవి. అతను తన బాణపు కొనతో విగ్రహాలను కొట్టుతూ ఈ ఆయత్ మరియు 17:81, చదివారు: "వ ఖుల్ జా' అల్ 'హఖ్ఖు వ 'జహఖల్ బా'తిల్," ('స'హీ'హ్ బు'ఖారీ).

నిశ్చయంగా, అది నా స్వంత నాశనానికే! మరియు ఒకవేళ మార్గదర్శకత్వం పొందితే, అది కేవలం నా ప్రభువు నాపై అవతరింపజేసిన దివ్యజ్ఞానం (వహీ) వల్లనే! నిశ్చయంగా, ఆయన సర్వం వినేవాడు, దగ్గరలోనే ఉంటాడు (అతి సన్నిహితుడు)!"[34]

51. మరియు వారు భయకంపితులై ఉండటాన్ని, నీవు చూడగలిగితే (ఎంత బాగుండేది), కాని వారికి తప్పించుకోవటానికి వీలుండదు. మరియు వారు చాలా సమీపం నుండి పట్టుకోబడతారు[35].

52. అప్పుడు (పరలోకంలో) వారంటారు: "మేము (ఇప్పుడు) దానిని (సత్యాన్ని) విశ్వసించాము!" వాస్తవానికి వారు చాలా దూరం నుండి దానిని (విశ్వాసాన్ని) ఎలా పొందగలరు?

53. మరియు వాస్తవానికి వారు దానిని (సత్యాన్ని) ఇంతకు ముందు తిరస్కరించి ఉన్నారు. మరియు వారు తమకు అగోచరమైన విషయానికి దూరం నుండియే నిరసన చూపుతూ ఉండేవారు.

54. మరియు వారికి పూర్వం గడిచిన వారి విధంగానే, వారి మధ్య మరియు వారి కోరికల మధ్య అడ్డు వేయబడుతుంది. నిశ్చయంగా, వారు

---

[34] మీరు చెవిటి లేక అగోచర శక్తిని వేడుకోవడం లేదు. వాస్తవానికి మీకు దగ్గర ఉండి వినగల మరియు మీ ప్రార్థనలను అంగీకరించగల ఆయనను వేడుకుంటున్నారు.

[35] చూడండి, 17:13, 13:5.

సంశయంలో పడవేసే గొప్ప సందేహంలో పడి ఉండేవారు[36].

[36] శిక్షను చూసిన తరువాత విశ్వసించగోరితే, ఆ విశ్వాసం అంగీకరించబడదు. ఖతాదా (రజి.అ.) కథనం: "సందేహాల మరియు సంశయాల నుండి దూరంగా ఉండండి. ఎవడైతే సందేహావస్థలో మరణిస్తాడో! అదే స్థితిలో పునరుత్థరింపబడతాడు. మరియు ఎవడైతే విశ్వాసంతో మరణిస్తాడో ఆ రోజు విశ్వాసంతోనే లేపబడతాడు!" (ఇబ్నె-కసీ'ర్)

# 35. ఫాతిర్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. సర్వస్తోత్రాలకు అర్హుడు అల్లాహ్ మాత్రమే! ఆకాశాలు మరియు భూమి యొక్క సృష్టికి మూలాధారి[1]. ఆయనే దేవదూతలను సందేశాలు అందజేసేవారిగా నియమించాడు. వారు రెండేసి, మూడేసి లేదా నాలుగేసి రెక్కలు గలవారు[2]. ఆయన తన సృష్టిలో తాను కోరిన దానిని అధికం చేస్తాడు. నిశ్చయంగా, అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు.

2. అల్లాహ్ ప్రజల కొరకు ఏ కారుణ్యాన్ని పంపినా దానిని ఆపేవాడు ఎవ్వడూ లేడు. మరియు ఏ (కారుణ్యాన్నైనా) ఆయన ఆపితే, ఆ తరువాత దానిని పంపగలవాడు కూడా ఎవ్వడూ లేడు. మరియు ఆయన సర్వశక్తిమంతుడు, మహా వివేచనాపరుడు.

3. ఓ మానవులారా! అల్లాహ్ మీకు చేసిన అనుగ్రహాలను జ్ఞాపకం చేసుకోండి! ఏమీ?

---

[*] [ఫాతిర్ – శూన్యం నుండి సృష్టించేవాడు]

[1] ఫా'తిర్ చూడండి, 6:14, 12:101.

[2] ఈ దేవదూతలు జిబ్రీల్, మీకాయీ'ల్, ఇస్రాఫీల్ మరియు ఇ'జ్రాయీల్ ('అలైహిమ్. స.) లు. వారికి రెక్కలున్నాయి. మేరాజ్ రాత్రిలో దైవప్రవక్త ('స'అస) జిబ్రీల్ ('అ.స.) కు ఆరు వందల రెక్కలు చూశారు, (బు'ఖారీ, ముస్లిం - ఇబ్నె మస్'ఊద్ (ర'ది. 'అ.) కథనం.

భూమ్యాకాశాల నుండి మీకు జీవనోపాధి సమకూర్చే సృష్టికర్త అల్లాహ్ తప్ప మరొకడు ఉన్నాడా?[3] ఆయన తప్ప మరొక ఆరాధ్య దేవుడు లేడు! అయితే మీరు ఎందుకు మోసగింప (సత్యం నుండి మరలింప) బడుతున్నారు?

4. మరియు (ఓ ప్రవక్తా!) ఒకవేళ వారు నిన్ను అసత్యవాదుడవని తిరస్కరించినా (ఇది క్రొత్త విషయం కాదు), వాస్తవానికి నీకు పూర్వం పంపబడిన సందేశహరులు కూడా తిరస్కరింప బడ్డారు. మరియు వ్యవహారాలన్నీ (తీర్పు కొరకు) చివరకు అల్లాహ్ వద్దకే మరలింపబడతాయి.

5. ఓ మానవులారా! నిశ్చయంగా, అల్లాహ్ వాగ్దానం సత్యం! కావున ఈ ప్రాపంచిక జీవితం మిమ్మల్ని మోసగించరాదు. మరియు ఆ మహా వంచకుణ్ణి (షైతాన్ ను) కూడా మిమ్మల్ని అల్లాహ్ విషయంలో మోసగింపనివ్వకండి[4].

6. నిశ్చయంగా, షైతాన్ మీ శత్రువు, కావున మీరు కూడా వాడిని శత్రువుగానే భావించండి[5]. నిశ్చయంగా వాడు తనఅనుచరులను(భగభగమండేఅగ్నివాసులవటానికే ఆహ్వానిస్తూ ఉంటాడు

7. ఎవరైతే సత్యాన్ని తిరస్కరిస్తారో, వారికి కఠినమైన శిక్ష పడుతుంది. మరియు ఎవరైతే విశ్వసించి,

---

[3] చూడండి, 10:31.
[4] చూడండి, 31:33.
[5] చూడండి, 18:50.

సత్కార్యాలు చేస్తారో, వారికి క్షమాపణ మరియు గొప్ప ప్రతిఫలం (స్వర్గం) కూడా ఉంటాయి.

8. ఏమీ? తన దుష్కార్యాలు తనకు ఆకర్షణీయంగా కనబడేటట్లు చేయబడి నందుకు, ఎవడైతే వాటిని మంచికార్యాలుగా భావిస్తాడో! (అతడు సన్మార్గంలో ఉన్న వాడితో సమానుడు కాగలడా)? నిశ్చయంగా అల్లాహ్ తాను కోరిన వానిని మార్గభ్రష్టత్వంలో వదలుతాడు మరియు తాను కోరిన వానికి మార్గదర్శకత్వం చేస్తాడు. కావున నీవు వారి కొరకు చింతించి నిన్ను నీవు దుఃఖానికి గురి చేసుకోకు. నిశ్చయంగా, వారి కర్మలన్నీ అల్లాహ్ కు బాగా తెలుసు.

9. మరియు అల్లాహ్ యే గాలులను పంపుతాడు. తరువాత అవి మేఘాలను ఎత్తుతాయి. ఆ తరువాత మేము వాటిని మృత ప్రదేశం వైపునకు పంపి, దానితో ఆ నేలను మరణించిన తరువాత తిరిగి బ్రతికిస్తాము. ఇదే విధంగా, (మానవుల) పునరుత్థానం కూడా జరుగుతుంది.

10. గౌరవాన్ని కాంక్షించు వాడు తెలుసు కోవాలి, గౌరవమంతా అల్లాహ్ కే చెందుతుందని! మంచి ప్రవచలన్నీ )[6] ఆయన వైపునకు ఎక్కి పోతాయి. మరియు సత్కర్మ దానిని పైకి ఎత్తుతుంది.

[6] మంచి ప్రవచనాలు అంటే, తస్బీ'హ్, ఖుర్ఆన్ పఠించటం, మంచిని ఆదేశించి, చెడునుండి నిరోధించటం మొదలైనవి.

మరియు ఎవరైతే చెడు కుట్రలు పన్నుతారో![7]
వారికి కఠిన శిక్ష ఉంటుంది. మరియు అలాంటి
వారి కుట్ర, అదే! నశించి పోతుంది.

**11.** మరియు అల్లాహ్ మిమ్మల్ని మట్టితో
సృష్టించాడు[8]. తరువాత ఇంద్రియ బిందువుతో,
ఆ తరువాత మిమ్మల్ని (ఆడ-మగ) జంటలుగా
చేశాడు. మరియు ఏ స్త్రీ కూడా ఆయనకు
తెలియకుండా గర్భం దాల్చజాలదు మరియు
ప్రసవించనూ జాలదు. గ్రంథంలో వ్రాయబడనిదే,
పెరుగుతున్న వాడి వయస్సు పెరగనూ జాలదు
మరియు ఎవని వయస్సు తరగనూ జాలదు.
నిశ్చయంగా, ఇదంతా అల్లాహ్ కు ఎంతో సులభం.

**12.** రెండు సముద్రాలు సరిసమానం కాజాలవు[9].
వాటిలోని ఒకదాని (నీరు) రుచికరమైనది, దాహం
తీర్చేది మరియు త్రాగటానికి మధురమైనది.
రెండోదాని (నీరు) ఉప్పుగానూ, చేదుగానూ
ఉన్నది. అయినా వాటిలో ప్రతి ఒక్క దాని నుండి
మీరు తాజా మాంసం తింటున్నారు మరియు

---

[7] మక్ రున్: అంటే Plot, కుట్ర, కపటోపాయం, తంత్రం, ఎత్తుగడ, రహస్యంగా ఇతరులకు హాని కలిగించటానికి పన్నే పన్నాగం. కుఫ్ర్ మరియు షిర్క్ కూడా మక్ర్. ఎందుకంటే, దాని వల్ల అల్లాహ్ (సు.తా.) మార్గానికి హాని కలుగుతుంది. దైవప్రవక్త ('స'అస) ను చంపడానికి మక్కా ముష్రికులు చేసిన మక్ర్. ఇంకా చూడండి, 10:21, 34:33 మరియు 35:43.

[8] అల్లాహ్ (సు.తా.)తో మరుగైనది ఏదీలేదు. ఇంకా చూడండి, 6:59 భూమి లోపల మరియు తల్లి గర్భంలో ఉండే ప్రతి ఒక్కదాని విషయం అల్లాహ్ (సు.తా.)కు బాగా తెలుసు.

[9] చూడండి, 25:53.

ఆభరణాలు తీసి ధరిస్తున్నారు. మరియు నీవు చూస్తున్నావు, ఓడలు వాటిని చీల్చుతూ పోవటాన్ని; (వాటిలో) మీరు, ఆయన అనుగ్రహాన్ని అన్వేషించటానికి మరియు మీరు ఆయనకు కృతజ్ఞులై ఉండటానికి!

13. ఆయనే రాత్రిని పగటిలోకి ప్రవేశింప జేస్తున్నాడు మరియు పగటిని రాత్రిలోకి ప్రవేశింప జేస్తున్నాడు మరియు సూర్యచంద్రులను నియమబద్ధులుగా చేసి ఉన్నాడు. అవి తమ తమ పరిధిలో, నిర్ణీత వ్యవధిలో తిరుగుతూ ఉన్నాయి. ఆయనే అల్లాహ్! మీ ప్రభువు, విశ్వసామ్రాజ్యాధికారం ఆయనదే! మరియు ఆయనను వదలి మీరు వేడుకునే వారు, ఖర్జూర బీజంపై నున్న పొరకు[10] కూడా యజమానులు కారు.

14. మీరు వారిని వేడుకొన్నప్పటికీ, వారు మీ ప్రార్థనలను వినలేరు, ఒకవేళ విన్నా, వారు మీకు జవాబివ్వలేరు. మరియు పునరుత్థాన దినమున మీరు కల్పించిన దైవత్వపు భాగస్వామ్యాన్ని వారు తిరస్కరిస్తారు[11]. మరియు (సత్యాన్ని) గురించి నీకు ఆ సర్వం తెలిసినవాడు తెలిపినట్లు

[10] ఖి'త్ మీరున్: అంటే ఖర్జూర బీజముపై ఉండే సన్నని పొర. paltry, small, mean, contemptibel, thing. లేకపనికిమాలిన, అల్పమైన, నికృష్టమైన వస్తువు.

[11] చూడండి, 10:28 మరియు 29. వారు అల్లాహ్ (సు.తా.)ను విడిచి, ఆరాధించే విగ్రహాలు, మూర్తులు, దైవదూతలు, జిన్నాతు, షై'తానులు మరియు సద్పురుషులు మొదలైనవన్నీ వారి ఆరాధనను పునరుత్థాన దినమున తిరస్కరిస్తాయి.

మరెవ్వరూ తెలుపజాలరు.

**15.** ఓ మానవులారా![12] అల్లాహ్ అక్కర గలవారు మీరే! వాస్తవానికి అల్లాహ్ స్వయం సమృద్ధుడు, సర్వస్తోత్రాలకు అర్హుడు.

**16.** ఆయన కోరితే మిమ్మల్ని నాశనం చేసి (మీ స్థానంలో) క్రొత్త సృష్టిని తేగలడు[13].

**17.** మరియు అలా చేయటం అల్లాహ్ కు కష్టమైనది కాదు.

**18.** మరియు బరువు మోసేవాడెవ్వడూ మరొకని బరువును మోయడు[14]. మరియు ఒకవేళ బరువు మోసేవాడు, దానిని ఎత్తుకోవడానికి ఎవరినైనా పిలిచినా, దగ్గరి బంధువైనా దాని నుండి కొంతైనా ఎత్తుకోడు. కాని నిశ్చయంగా, నీవు వారినే హెచ్చరించ గలవు ఎవరైతే తమకు అగోచరుడైన తమ ప్రభువుకు భయపడతారో![15] మరియు నమాజ్ ను స్థాపిస్తారో. మరియు ఎవడైతే నీతిమంతుడవుతాడో అతడు తన స్వంత (లాభం) కొరకే నీతిమంతుడవుతాడు. మరియు

---

[12] మానవులారా! అంటే మానవులూ, దైవప్రవక్తలూ, సద్పురుషులూ అందరూ!

[13] చూడండి, 14:19.

[14] చూడండి, 6:164, 17:15, 29:13, 39:7, 53:38 23 కాని ఇతరులనుసన్మార్గంనుండినిరోధించేవాడు,లేకతప్పించేవాడు, తన పాపభారంతో పాటు తాను తప్పించిన వారి పాపభారాలను కూడా భరిస్తాడు.

[15] విశ్వాసంఅంటేఅగోచరుడైనఅల్లాహ్(సు.తా.)నువిశ్వసించటం. ఆయన శక్తి సామర్థ్యాలను గుర్తించి, కేవలం ఆయననే ప్రార్థించటం.

(అందరికీ) అల్లాహ్ వైపునకే మరలి పోవలసి ఉన్నది.

**19.** మరియు గ్రుడ్డివాడు మరియు కళ్ళున్నవాడు సరిసమానులు కాజాలరు;

**20.** మరియు (అదే విధంగా) చీకట్లు (అవిశ్వాసం) మరియు వెలుగు (విశ్వాసం);

**21.** మరియు నీడలు, మరియు ఎండా[16];

**22.** మరియు బ్రతికి ఉన్నవారు మరియు మరణించిన వారు కూడా సరిసమానులు కాజాలరు[17]. నిశ్చయంగా, అల్లాహ్ తాను కోరిన వానికి (హితబోధ) వినేటట్లు చేస్తాడు. కాని నీవు గోరీలలో ఉన్న వారికి వినిపించ జాలవు[18].

**23.** నీవు (ఓ ముహమ్మద్!) కేవలం హెచ్చరిక చేసేవాడవు మాత్రమే[19].

**24.** నిశ్చయంగా, మేము, నిన్ను సత్యం ప్రసాదించి, శుభవార్తనిచ్చేవానిగా మరియు హెచ్చరిక చేసేవానిగా పంపాము. మరియు హెచ్చరిక

---

[16] అంటే స్వర్గనరకాలు.

[17] అంటే విశ్వాసులు మరియు అవిశ్వాసులు.

[18] ఏ విధంగానైతే మరణించి గోరీలలో ఉన్నవారు వినలేరో అదే విధంగా సత్యతిరస్కారం వల్ల, చనిపోయిన హృదయాలకు నీవు హితోపదేశాన్ని, సత్యాన్ని బోధించలేవు.

[19] మరియు మార్గదర్శకత్వం చేయటం అల్లాహ్ (సు.తా.)కే చెందినది. ఎంతవరకైతే ఒకడు, అల్లాహ్ (సు.తా.) అతనికి ప్రసాదించిన విచక్షణాబుద్ధిని ఉపయోగించి సత్యాన్ని అనుసరించటానికి ప్రయత్నించడో! అంతవరకు అల్లాహ్ (సు. తా.) అతనికి సన్మార్గం చూపడు. ఈ విషయం ఖుర్ఆన్ లో ఎన్నోసార్లు వ్యక్తపరచబడింది.

చేసేవాడు వారి మధ్య లేకుండా, ఏ సమాజం కూడా గడచిపోలేదు!

**25.** మరియు ఒకవేళ వీరు నిన్ను అసత్యవాదుడవని తిరస్కరిస్తున్నారంటే (ఆశ్చర్యమేమీ కాదు)! ఎందుకంటే, వీరికి పూర్వం గతించినవారు కూడా (ఇదేవిధంగా తమ ప్రవక్తలను) అసత్యవాదులని తిరస్కరించారు. వారి సందేశహరులు వారి వద్దకు స్పష్టమైన నిదర్శనాలను, శాసనాలను (జబుర్లను)[20] మరియు వెలుగునిచ్చే గ్రంథాన్ని తీసుకొని వచ్చారు[21].

**26.** ఆ తరువాత సత్యతిరస్కారులను నేను (శిక్షకు) గురి చేశాను. (చూశారా) నా శిక్ష ఎంత కఠినమైనదో!

**27.** ఏమీ? నీవు చూడటం లేదా? నిశ్చయంగా, అల్లాహ్ యే ఆకాశం నుండి వర్షం కురిపించేవాడని. తరువాత దాని నుండి మేము రంగురంగుల ఫలాలను ఉత్పత్తి చేస్తామని! మరియు పర్వతాలలో తెల్లని, ఎర్రని వివిధ రంగుల చారలను (కొన్నిటిని) మిక్కిలి నల్లగా కూడా చేస్తామని[22].

---

[20] జు'బురున్: అనే పదానికి, Scriptures, చిన్న చిన్న ముక్కలు లేక గ్రంథాలు, శాసనాలు, శృతులు మరియు కీర్తనలు అనే అర్థాలున్నాయి.

[21] చూడండి, 13:7, మరియు 16:36. ప్రతి సమాజానికి ఒక హెచ్చరిక చేసేవాడు (ప్రవక్త) పంపబడ్డాడు.

[22] ఈ వివిధ రకాల రంగులు అల్లాహ్ (సు.తా.) ప్రసాదించనవే! వాటిని చూసి అల్లాహ్ (సు.తా.) మహత్వాన్ని తెలుసుకుంటే ఎంత బాగుంటుంది.

28. మరియు ఇదే విధంగా మానవుల, ఇతర ప్రాణుల మరియు పశువుల రంగులు కూడా వేర్వేరుగా ఉంటాయి[23]. నిశ్చయంగా, అల్లాహ్ దాసులలో జ్ఞానం గలవారు మాత్రమే ఆయనకు భయపడతారు. నిశ్చయంగా, అల్లాహ్ సర్వశక్తిమంతుడు, క్షమాశీలుడు.

29. నిశ్చయంగా, అల్లాహ్ గ్రంథాన్ని (ఖుర్ఆన్ ను) పారాయణం చేసేవారు మరియు నమాజ్ ను స్థాపించేవారు మరియు తమకు ప్రసాదించబడిన జీవనోపాధి నుండి రహస్యంగా మరియు బహిరంగంగాఖర్చు (దానం) చేసేవారు అందరూ![24] నష్టంలేని వ్యాపారాన్ని అపేక్షించేవారే!

30. ఇదంతా అల్లాహ్ వారి ప్రతిఫలాన్ని పూర్తిగా వారికి ఇవ్వాలనీ మరియు తన అనుగ్రహంతో వారికి మరింత అధికంగా ఇవ్వాలనీ! నిశ్చయంగా ఆయన క్షమాశీలుడు, కృతజ్ఞతలను ఆమోదించేవాడు.

31. మరియు (ఓ ముహమ్మద్!) మేము నీపై అవతరింపజేసిన గ్రంథమే నిజమైనది, దానికి పూర్వం వచ్చిన గ్రంథాలలో (మిగిలి ఉన్న సత్యాన్ని) ధృవపరిచేది. నిశ్చయంగా, అల్లాహ్ తన దాసులను బాగా ఎరిగేవాడు, సర్వదృష్టికర్త.

---

[23] చూడండి, 16:13.

[24] బహిరంగంగా ఖర్చు చేయటం అంటే విధి జకాత్ చెల్లించటం మరియు రహస్యంగా అంటే జకాత్ చెల్లించిన తరువాత అధికంగా దానం చేయటం.

**32.** ఆ తరువాత మేము ఈ గ్రంథానికి, మా దాసులలో నుండి మేము ఎన్నుకున్న వారిని వారసులుగా చేశాము[25]. వారిలో కొందరు తమకు తాము అన్యాయం చేసుకున్న వారున్నారు[26], మరికొందరు మధ్యస్థంగా ఉండేవారున్నారు[27], ఇంకా కొందరు అల్లాహ్ సెలవుతో సత్కార్యాలలో మున్ముందు ఉండే వారూ ఉన్నారు[28]. ఇదే ఆ గొప్ప అనుగ్రహం.

**33.** శాశ్వతమైన స్వర్గవనాలలో వారు ప్రవేశిస్తారు. అందువారు బంగారు కంకణాలు మరియు ముత్యాలతో అలంకరింప బడుతారు. మరియు వారి వస్త్రాలు పట్టుతో చేయబడి ఉంటాయి[29].

---

[25] గ్రంథం అంటే ఖుర్ఆన్, ఎన్నుకున్నవారు అంటే అంటే ము'హమ్మద్ ('స'అస) ను అనుసరించేవారు, ముస్లింలు అని అర్థం. ఇటువంటి ఆయత్ కు చూడండి, 2:143.

[26] ము'హమ్మద్('స'అస)ఉమ్మత్‌లో మూడురకాలవారున్నారు. వీరు మొదటి రకానికి చెందినవారు: తమకు తాము అన్యాయం చేసుకునే వారున్నారు. వీరు కొన్ని విధు(ఫ'రాయద్)లను ఉపేక్షిస్తారు. మరియు కొన్ని 'హరామ్ - నిషిద్ధ విషయాల నుండి దూరంగా ఉండరు, కాబట్టి వీరిని తమకు తాము అన్యాయం చేసుకున్నవారు అన్నారు. వీరు తమకు తాము అన్యాయం చేసుకున్నందుకు ఇతర రెండు రకాల వారి స్థానాలకు చేరలేక పోతారు. చూడండి, 7:46.

[27] వీరు రెండో రకానికి చెందినవారు, మధ్యస్థంగా ఉండేవారు. వీరు కొన్నిసార్లు ముస్త'హబ్ విషయాలను విడిచి పెడతారు. మరియు కొన్ని ము'హర్రమాత్ లను పాటించరు.

[28] వీరు మూడో రకానికి చెందినవారు, మొదట పేర్కొన్న ఇద్దరి కంటే ధర్మం విషయాలలో మున్ముందు ఉండేవారు.

[29] "ఏ పురుషులైతే ఇహలోకంలో పట్టు, బంగారు ధరిస్తారో, వారు పరలోకంలో వాటిని ధరించలేరు." ('స'హీ'హ్ బు'ఖారీ, ముస్లిం) స్వర్గపు వస్త్రాల కొరకు చూడండి, 18:31.

34. మరియు (అప్పుడు) వారు ఇలా అంటారు: "మా నుండి దుఃఖాన్ని తొలగించిన అల్లాహ్ యే సర్వస్తోత్రాలకు అర్హుడు. నిశ్చయంగా, మా ప్రభువు క్షమాశీలుడు, కృతజ్ఞతలను ఆమోదించేవాడు.

35. ఆయనే తన అనుగ్రహంతో మమ్మల్ని శాశ్వతమైన నివాస స్థలంలో దింపాడు. ఇందులో మాకు ఎలాంటి కష్టమూ లేదు మరియు ఇందులో ఎలాంటి అలసట కూడా లేదు."

36. మరియు సత్యతిరస్కారులైన వారి కొరకు నరకాగ్ని ఉంటుంది. అందులో వారు చని పోవాలనీ తీర్పు ఇవ్వబడదు, లేదా వారికి దాని (నరకపు) శిక్ష కూడా తగ్గింపబడదు. ఈ విధంగా, మేము ప్రతి కృతఘ్నునికి (సత్యతిరస్కారునికి) ప్రతీకారం చేస్తాము.

37. మరియు వారు దానిలో (నరకంలో) ఇలా మొరపెట్టుకుంటారు: "ఓ మా ప్రభూ! మమ్మల్ని బయటికి తీయి. మేము పూర్వం చేసిన కార్యాలకు భిన్నంగా సత్కార్యాలు చేస్తాము." (వారికిలా సమాధానం ఇవ్వబడుతుంది): "ఏమీ? గుణపాఠం నేర్చుకోదలచినవాడు గుణపాఠం నేర్చుకోవటానికి, మేము మీకు తగినంత వయస్సును ఇవ్వలేదా? మరియు మీ వద్దకు హెచ్చరిక చేసేవాడు కూడా వచ్చాడు కదా? కావున మీరు (శిక్షను) రుచి చూడండి. ఇక్కడ దుర్మార్గులకు సహాయపడేవాడు ఎవ్వడూ ఉండడు."

38. నిశ్చయంగా, అల్లాహ్ కు ఆకాశాలలో మరియు

భూమిలో ఉన్న అగోచర విషయాలన్నీ తెలుసు. నిశ్చయంగా ఆయనకు హృదయాలలో ఉన్న విషయాలు కూడా బాగా తెలుసు[30].

**39.** ఆయనే మిమ్మల్ని భూమిపై ఉత్తరాధికారులుగా చేసినవాడు. కావున ఎవడు (సత్యాన్ని) తిరస్కరిస్తాడో అతని తిరస్కారం అతనిపైననే పడుతుంది. సత్యతిరస్కారులకు వారి తిరస్కారం వారి ప్రభువు వద్ద కేవలం వారి యెడల అసహ్యాన్నే అధికం చేస్తుంది. మరియు సత్యతిరస్కారులకు వారి తిరస్కారం వారికి నష్టాన్నే అధికం చేస్తుంది[31].

**40.** వారితో ఇలా అను: "అల్లాహ్ ను వదలి మీరు ఆరాధించే ఈ భాగస్వాములను గురించి ఎప్పుడైనా ఆలోచించారా? వారు భూమిలో ఏమి సృష్టించారో నాకు చూపండి? లేదా వారికి ఆకాశాలలో ఏదైనా భాగస్వామ్యం ఉందా? లేదా మేము వారికి ఏదైనా గ్రంథాన్ని ఇచ్చామా? వారు దాని స్పష్టమైన ప్రమాణంపై ఉన్నారని అనటానికి? అది కాదు, అసలు ఈ దుర్మార్గులు పరస్పరం, కేవలం మోసపు మాటలను గురించి వాగ్దానం చేసుకుంటున్నారు."

**41.** నిశ్చయంగా, అల్లాహ్ భూమ్యాకాశాలను తమ స్థానాల నుండి విడి పోకుండా వాటిని నిలిపి

---

[30] అంటే మిమ్మల్ని మరల భూమిలోకి పంపినా మీరు సత్కార్యాలు చేయరని, అల్లాహ్ (సు.తా.)కు బాగా తెలుసు. ఇంకా చూడండి, 6:28.

[31] చూడండి, 2:30.

ఉంచాడు. ఒకవేళ అవి తొలగిపోతే, ఆయన తప్ప
మరెవరైనా వాటిని నిలిపి ఉంచగలరా?[32]
నిశ్చయంగా, ఆయన సహనశీలుడు, క్షమాశీలుడు.

**42.** మరియు, ఒకవేళ హెచ్చరిక చేసేవాడు వారి వద్దకు వస్తే! వారు తప్పక, ఇతర సమాజాల వారి కంటే ఎక్కువగా సన్మార్గం మీద ఉండేవారని అల్లాహ్ సాక్షిగా గట్టి ప్రమాణాలు చేస్తారు[33]. కాని హెచ్చరిక చేసేవాడు, వారి వద్దకు వచ్చినపుడు మాత్రం (అతని రాక) వారి వ్యతిరేకతను తప్ప మరేమీ అధికం చేయలేక పోయింది[34];

**43.** (ఇది) వారు భూమిలో మరింత దురహంకారంతో తిరుగుతూ, దుష్ట పన్నాగాలు పన్నినందుకు[35]. వాస్తవానికి దుష్ట పన్నాగాలు, వాటిని పన్నే వారికే హాని కలిగిస్తాయి. తమ పూర్వీకుల పట్ల అవలంబించ బడిన విధానమే (వారి పట్ల కూడా) అవలంబించ బడాలని వారు నిరీక్షిస్తున్నారా ఏమిటి? కాని నీవు అల్లాహ్ సంప్రదాయంలో

---

[32] భూమ్యాకాశాలను విడిపోకుండా తమస్థానంలో ఉంచినవాడు అల్లాహ్ (సు.తా.) మాత్రమే! చూడండి 19:90-91, 22:65, 30:25, 15:23. అల్లాహ్ తప్ప మరెవ్వరూ వాటిని తమ స్థానాలలో ఉంచలేరు!

[33] "హెచ్చరిక చేసేవాడు వస్తే మేము తప్పక సన్మార్గం మీద ఉంటాము." అని ఈ ముష్రిక్ లు గట్టి ప్రమాణాలు చేశారు. కానీ, అతను వచ్చిన తరువాత అతనిని తిరస్కరించారు. ఇంకా చూడండి, 6:156-157, 37:168-170.

[34] అంటే ము'హమ్మద్ ('స'అస) వచ్చిన తరువాత కూడా అతనిని తిరస్కరించారు.

[35] చూడండి, 10:21 లేక 34:33.

ఎలాంటి మార్పును పొందలేవు మరియు అల్లాహ్ సంప్రదాయంలో నీవు ఎలాంటి అతిక్రమాన్ని చూడలేవు.

**44.** వారు భూమిలో ఎన్నడూ సంచరించలేదా ఏమిటి? వారికి పూర్వం గతించిన వారు వీరి కంటే అత్యంత బలవంతులైనా, వారి పరిణామం ఏమయిందో వారు చూడలేదా? అల్లాహ్ నుండి తప్పించుకో గలిగేది ఆకాశాలలో గానీ మరియు భూమిలో గానీ ఏదీ లేదు. నిశ్చయంగా ఆయన సర్వజ్ఞుడు, సర్వ సమర్థుడు.

**45.** ఒకవేళ అల్లాహ్ మానవులను వారు చేసిన కర్మలకు గానూ పట్టుకోదలిస్తే! (భూమి) మీద ఏ ఒక్క ప్రాణిని కూడా ఆయన వదిలి పెట్టి ఉండేవాడు కాదు! నిజానికి ఆయన వారికి ఒక నియమిత సమయం వరకు గడువునిస్తున్నాడు. కాని వారి గడువు పూర్తయితే; అప్పుడు నిశ్చయంగా, అల్లాహ్ సదా తన దాసులను స్వయంగా చూసుకుంటాడు.

# 36. యా-సీన్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. యా సీన్![1] [2]
2. వివేకంతో నిండి ఉన్న ఖుర్ఆన్ సాక్షిగా!
3. (ఓ ముహమ్మద్!) నిశ్చయంగా, నీవు సందేశహరులలో ఒకడవు[3].
4. (నీవు) ఋజుమార్గంపై ఉన్నావు.
5. ఇది (ఈ ఖుర్ఆన్) సర్వశక్తిమంతుడు ,అపారకరుణాప్రదాత ద్వారానే అవతరింపజేయబడింది[4]
6. ఏ జాతివారి తండ్రి తాతలైతే హెచ్చరిక చేయబడక, నిర్లక్ష్యులై ఉన్నారో, వారిని హెచ్చరించటానికి[5].
7. వాస్తవానికి వారిలో అనేకులను గురించి మా

---

[*] [ఫాతిర్ – శూన్యం నుండి సృష్టించేవాడు]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

[2] యా-సీన్, ఈ రెండు అక్షరాలు కూడా, ఇతర అక్షరాల వలె ముఖత్తఆత్ లలోనివే! కావున వీటి నిజ అర్థం ఎవరికీ తెలియదు. కొందరు దీని అర్థం: 'ఓ మానవుడా!' అని అంటారు. మరికొందరు: 'ఇది దైవప్రవక్తను సంబోధిస్తుంది' అని అంటారు.

[3] మక్కా ముష్రికులు: 'నీవు దైవప్రవక్తవు కావు!' అని ము'హమ్మద్ ('స'అస) తో అనేవారు. చూడండి, 13:43. దానికి జవాబుగా ఈ ఆయత్ అవతరింపజేయబడింది.

[4] చూడండి, 34:50.

[5] చూడండి, 6:131-132.

వాక్కు నిజం కానున్నది, కావున వారు విశ్వసించరు[6].

8. నిశ్చయంగా, మేము వారి మెడలలో పట్టాలు వేశాము[7]. అవి వారి గడ్డాల వరకు వున్నాయి. కావున వారి తలలు నిక్కి వున్నాయి.

9. మరియు మేము వారి ముందు ఒక అడ్డు (తెరను) మరియు వారి వెనుక ఒక అడ్డు (తెర) ను నిలబెట్టాము. మరియు మేము వారిని కప్పి వేశాము అందువల్ల వారు ఏమీ చూడలేరు.

10. మరియు నీవు వారిని హెచ్చరించినా, హెచ్చరించక పోయినా, వారికి సమానమే, వారు విశ్వసించరు!

11. నిశ్చయంగా, ఎవడైతే హితబోధను అనుసరిస్తూ, అగోచరుడైన కరుణామయునికి భయపడతాడో! అతనిని మాత్రమే నీవు హెచ్చరించగలవు. అతనికి క్షమాభిక్ష మరియు మంచి ప్రతిఫలం (స్వర్గం) లభిస్తుందనే శుభవార్తను అందజేయి.

12. నిశ్చయంగా, మేము మృతులను సజీవులుగా చేస్తాము. మరియు మేము వారు చేసి పంపిన మరియు తమ వెనుక విడిచిన చిహ్నాలను కూడా

---

[6] 'నేను జిన్నాతులు మరియు మానవులతో నరకాన్ని నింపుతాను!' (32:13, 38:85).

[7] చూడండి, 13:5 మరియు 34:33.

వ్రాసి పెడుతున్నాము[8]. మరియు ప్రతి విషయాన్ని మేము స్పష్టమైన గ్రంథంలో వ్రాసిపెడుతున్నాము.

13. వారికి సందేశహరులను పంపిన ఆ నగరవాసుల[9] గాథను వినిపించు;

14. మేము వారి వద్దకు ఇద్దరిని పంపగా వారు ఆ ఇద్దరినీ అబద్ధీకులని తిరస్కరించారు. అప్పుడు మేము వారిని మూడవ వానితో బలపరిచాము. అప్పుడు వారు, వారితో: "నిశ్చయంగా, మేము (మీ వద్దకు పంపబడిన) సందేశహరులం" అని అన్నారు.

15. (దానికి ఆ నగరవాసులు) ఇలా అన్నారు: "మీరు కేవలం మా వంటి మానవులే మరియు అనంత కరుణామయుడు మీపై ఏదీ (సందేశాన్నీ)

---

[8] ఎవడైతే ఇస్లాంలో ఒక మంచి పనిని ప్రారంభిస్తాడో అతనికి అతనికి దాని పుణ్యఫలితం లభిస్తుంది. అంతేగాక, అతని తరువాత ఇతరులు దానిపై నడిస్తే - ఆ అనుసరించే, వారి పుణ్యంలో ఎట్టి తగ్గింపు లేకుండా - ఆ పుణ్యం కూడా అతనికి లభిస్తూ ఉంటుంది. ఇక ఒకడు చెడ్డపని ప్రారంభిస్తే అతనికి దాని శిక్ష కాక, దానిపై నడిచే వారందరి పాపాల శిక్ష కూడా విధించబడుతుంది. (స'హీ'హ్ ముస్లిం). ఒక వ్యక్తి మరణించిన తరువాత అతని కర్మలు ఆగిపోతాయి. మూడు విషయాలు తప్ప. 1) జ్ఞానం - దేనినైతే ఇతరులు లాభం పొందుతూ ఉంటారో! 2) పుణ్యాత్ములైన సంతానం - ఎవరైతే చనిపోయిన తల్లిదండ్రుల కొరకు ప్రార్థిస్తూ ఉంటారో! 3) 'సదఖహ్ జారియహ్ - దేనితోనైతే అతడు మరణించిన తరువాత కూడా, ప్రజలు లాభం పొందుతూ ఉంటారో! ('స'హీ'హ్ ముస్లిం).

[9] ఈ నగరం అంటాకియా (Antakya) కావచ్చని కొందరు వ్యాఖ్యాతలన్నారు.

అవతరింపజేయలేదు. మీరు కేవలం అబద్ధాలాడుతున్నారు?"[10]

**16.** (ఆ ప్రవక్తలు) అన్నారు: "మా ప్రభువుకు తెలుసు, నిశ్చయంగా మేము మీ వద్దకు పంపబడిన సందేశహరులము!

**17.** మా బాధ్యత కేవలం మీకు స్పష్టంగా సందేశాన్ని అందజేయటమే!"

**18.** (ఆ నగరవాసులు) అన్నారు; "నిశ్చయంగా, మేము మిమ్మల్ని ఒక దుశ్శకునంగా పరిగణిస్తున్నాము. మీరు దీనిని మానుకోకపోతే మేము మిమ్మల్ని రాళ్ళతో కొట్టి చంపేస్తాము. మరియు మా నుండి మీకు బాధాకరమైన శిక్ష పడుతుంది."

**19.** (ఆ ప్రవక్తలు) అన్నారు: "మీ అపశకునం మీ వెంటనే ఉంది[11]. మీకు చేసే హితబోధను (మీరు అపశకునంగా పరిగణిస్తున్నారా)? అది కాదు, అసలు మీరు మితిమీరిపోయిన ప్రజలు"[12]

**20.** ఆ నగరపు దూర ప్రాంతం నుండి ఒక వ్యక్తి పరిగెత్తుకుంటూ వచ్చి ఇలా అన్నాడు: "ఓ నా జాతి ప్రజలారా! ఈ సందశహరులను అనుసరించండి!

**21.** మీ నుండి ఎలాంటి ప్రతిఫలాన్నీ కోరని వారిని (ఈ సందేశహరులను) అనుసరించండి! వారు సన్మార్గంలో ఉన్నారు.

---

[10] చూడండి, 6:91 మరియు 34:31.
[11] చూడండి, 17:13.
[12] చూడండి, 10:12.

22. “మరియు నన్ను సృష్టించిన ఆయనను నేనెందుకు ఆరాధించకూడదూ? మరియు మీరంతా ఆయన వైపునకే మరలింప బడతారు."

23. ఏమీ? ఆయనను వదలి నేను ఇతరులను ఆరాధ్య దైవాలుగా చేసుకోవాలా? ఒకవేళ ఆ కరుణామయుడు నాకు హాని చేయదలచుకుంటే, వారి సిఫారసు నాకు ఏ మాత్రం ఉపయోగ పడదు మరియు వారు నన్ను కాపాడనూలేరు.

24. అలా చేస్తే నిశ్చయంగా నేను స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడిపోయినవాడిని అవుతాను

25. నిశ్చయంగా, నేను మీ ప్రభువును విశ్వసిస్తున్నాను, కావున మీరు నా మాట వినండి!"

26. (అతనిని వారు చంపిన తరువాత అతనితో) ఇలా అనబడింది: "నీవు స్వర్గంలో ప్రవేశించు." అతడు ఇలా అన్నాడు: "అయ్యో! నా జాతివారికి ఈ విషయం తెలిస్తే ఎంత బాగుండేది!

27. నా ప్రభువు నన్ను క్షమించాడు మరియు నన్ను గౌరవనీయులలోకి ప్రవేశింపజేశాడు!" అనేది

28. మరియు ఆ తరువాత అతని జాతి వారి మీదకు, మేము ఆకాశం నుండి ఏ సైన్యాన్నీ పంపలేదు. అసలు మాకు సైన్యాన్ని పంపే అవసరమే ఉండదు!

29. అది కేవలం ఒక పెద్దధ్వని[13] మాత్రమే! అంతే! వారంతా (ఒకేసారి) అంతం చేయబడ్డారు.

---

[13] 'సయ్'హతున్: ధ్వని, అరుపు, గర్జన లేక శబ్దం. ఇంకా చూడండి, 36:49, 53, 38:15.

30. ఆ దాసుల గతి ఎంత శోచనీయమయినది! వారి వద్దకు ఏ సందేశహరుడు వచ్చినా, వారు అతనిని ఎగతాళి చేయకుండా ఉండలేదు.

31. ఏమీ? వారు చూడలేదా (వారికి తెలియదా)? వారికి ముందు మేము ఎన్నో తరాలను నాశనం చేశామని? నిశ్చయంగా, వారు (వారి పూర్వీకులు) ఎన్నటికీ వారి వద్దకు తిరిగి రాలేదు.

32. కాని వారందరినీ కలిపి ఒకేసారి, మా ముందు హాజరు పరచడం జరుగుతుంది.

33. మరియు వారి కొరకు సూచనగా జీవం లేని ఈ భూమియే ఉంది. మేము దీనికి ప్రాణం పోసి, దీని నుండి ధాన్యం తీస్తాము, దాన్ని వారు తింటారు.

34. మేము దీనిలో ఖర్జూరపు మరియు ద్రాక్ష వనాలను పెంచాము మరియు వాటిలో ఊటలను ప్రవహింపజేశాము.

35. వారు దీని ఫలాలను తినటానికి; మరియు ఇదంతా వారి చేతులు చేసింది కాదు. అయినా వారు కృతజ్ఞతలు తెలుపరా?

36. భూమి నుండి ఉత్పత్తి అయ్యే అన్ని వస్తువులలో, జీవులలో మరియు స్వయాన వారిలో (మానవులలో) ఇంకా వారికి తెలియని వాటిలోనూ (ఆడ-మగ) జతలను సృష్టించిన ఆయన

(అల్లాహ్) లోపాలకు అతీతుడు[14].

**37.** మరియు వారి కొరకు మా సూచనలలో రాత్రి ఒకటి; మేము దానిపై నుండి పగటిని (వెలుగును) తొలగించి నప్పుడు, వారిని చీకటి ఆవరించుకుంటుంది.

**38.** మరియు సూర్యుడు తన నిర్ణీత పరిధిలో, నిర్ణీత కాలంలో పయనిస్తూ ఉంటాడు. ఇది ఆ సర్వశక్తిమంతుని, సర్వజ్ఞుని నియమావళి.

**39.** మరియు చంద్రుని కొరకు మేము దశలను నియమించాము, చివరకు అతడు ఎండిన ఖర్జురపు మట్ట వలే అయిపోతాడు.

**40.** చంద్రుణ్ణి అందుకోవటం సూర్యుడి తరం కాదు. మరియు రాత్రి పగటిని అధిగమించ జాలదు. మరియు అవన్నీ తమ తమ కక్ష్యలలో సంచరిస్తూ ఉంటాయి.

**41.** వారికి మరొక సూచన ఏమిటంటే, నిశ్చయంగా, మేము వారి సంతతిని (నూహ్ యొక్క) నిండు నావ లోనికి ఎక్కించాము.

**42.** మరియు మేము వారు ఎక్కి ప్రయాణం చేయటానికి, ఇటువంటి వాటిని ఎన్నో

---

[14] సృష్టిలో నున్న ప్రతి వస్తువు జతలలో ఉన్నది. అవి జీవులు కానీ, నిర్జీవులు కానీ. జీవరాసులలో మరియు వృక్షరాసులలో ఆడ - మగ; చీకటి - వెలుగులు, చలి - వేడి, విద్యుచ్ఛక్తి మరియు అయస్కాంతాలలో ఉన్న ఆకర్షణా (+) మరియు వికర్షణా (-) శక్తులు, మొదలైనవి. కేవలం అల్లాహ్ (సు.తా.) మాత్రమే ఏకైకుడు.

సృష్టించాము[15].

**43.** మరియు మేము కోరినట్లయితే, వారిని ముంచి వేసే వారము; అప్పుడు వారి కేకలు వినేవాడెవడూ ఉండడు మరియు వారు రక్షింపబడనూ లేరు -

**44.** మేము కరుణిస్తే తప్ప - మరియు మేము కొంత కాలం వరకు వారికి వ్యవధినిస్తే తప్ప!

**45.** మరియు వారితో: "మీరు, మీ ముందున్న దానికీ (ఇహలోక శిక్షకూ) మరియు మీ వెనుక రానున్న దానికీ (పరలోక శిక్షకూ) భీతిపరులై ఉండండి[16], బహుశా మీరు కరుణింప బడవచ్చు!" అని అన్నప్పుడు, (వారు లక్ష్యం చేయటం లేదు).

**46.** మరియు వారి ప్రభువు సూచనలలో నుండి, వారి వద్దకు ఏ సూచన వచ్చినా, వారు దాని నుండి ముఖం త్రిప్పుకోకుండా ఉండలేదు.

**47.** మరియు వారితో: "అల్లాహ్ మీకు ప్రసాదించిన జీవనోపాధి నుండి ఖర్చు చేయండి." అని అన్నప్పుడు, సత్యతిరస్కారులు విశ్వాసులతో అంటారు: "ఏమీ? అల్లాహ్ కోరితే, తానే తినిపించ గలవారికి, మేము తినిపించాలా? మీరు స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నారు."

**48.** వారు ఇంకా ఇలా అంటారు: "మీరు సత్యవంతులే అయితే, ఆ వాగ్దానం (పునరుత్థానం) ఎప్పుడు

---

[15] చూడండి, 16:8.

[16] మా బైన అయ్ దీకుమ్ వ మా 'ఖల్ ఫకుమ్: పైన ఇచ్చిన తాత్పర్యం నోబుల్ ఖుర్ఆన్ ను అనుసరించి ఉంది. ము'హమ్మద్ జూనాగఢీ గారి తాత్పర్యం ఇలా ఉంది: 'మీ వెనుకా ముందు సంభవించే పాపాల నుండి కాపాడుకోండి.'

పూర్తి కానున్నది?"
**49.** వారు నిరీక్షిస్తున్నది కేవలం ఒక పెద్ద ధ్వని[17] కొరకే. మరియు వారు వాదులాడుకుంటూ ఉండగానే, అది వారిని చిక్కించుకుంటుంది.
**50.** వారు ఏ విధమైన వీలునామా కూడా వ్రాయలేరు మరియు తమ కుటుంబం వారి వద్దకు కూడా తిరిగి పోలేరు.
**51.** మరియు (మరొకసారి) బాకా ఊదబడి నప్పుడు, వారంతా గోరీల నుండి (లేచి) తమ ప్రభువు వైపునకు వేగంగా పరిగెత్తుకుంటూ వస్తారు[18].
**52.** వారంటారు: "అయ్యో! మా దౌర్భాగ్యం! మమ్మల్ని మా పడకల నుండి లేపి ఎవరు నిలబెట్టారు?" (వారితో అనబడుతుంది): "ఇదే ఆ కరుణామయుడు చేసిన వాగ్దానం. మరియు అతని సందేశహరులు సత్యమే పలికారు!"
**53.** అది కేవలం ఒక పెద్ద ధ్వని[19] మాత్రమే అయి ఉంటుంది! వెంటనే వారంతా మా ముందు హాజరు

---

[17] అంటే అతస్మాత్తుగా ఊదబడే పునరుత్థానదినపు బాకా (కొమ్ము) ధ్వని, అరుపు, గర్జన లేక శబ్దం. దీనిని మొదటి బాకా లేక నఫ్'ఖతుల్ ఫజ'అ అంటారు. దీని తరువాత రెండవ బాకా ఊదబడుతుంది. దానిని నఫ్'ఖతు 'స్స'అఖ్, అంటారు. అప్పుడు అల్లాహ్ (సు.తా.) తప్ప సర్వజీవరాసులు మరణిస్తారు. ఇంకా చూడండి, 36:29, 53; 38:15.

[18] కొందరు వ్యాఖ్యాతలు దీనిని రెండవ బాకా అని, మరికొందరు దీనిని మూడవ బాకా అంటే నఫ్'ఖతుల్ - బ'అసి 'వన్నుషూర్ అని అంటారు. ఇది ఊదబడగానే గోరీలలోని వారంతా లేచి వస్తారు. (ఇబ్నె-కసీ'ర్)

[19] ఇది పునరుత్థాన దినమున ఇస్రాఫీల్ ('అ.స.) ఊదే బాకా ధ్వని.

చేయబడతారు!

54. ఆ రోజు ఎవ్వరికీ ఎలాంటి అన్యాయం జరుగదు. మరియు మీ కర్మలకు తగినది తప్ప, మరే ప్రతిఫలమివ్వబడదు.

55. నిశ్చయంగా, ఆ రోజు స్వర్గవాసులు సుఖసంతోషాలలో నిమగ్నులై ఉంటారు.

56. వారు మరియు వారి సహవాసులు (అజ్వాజ్), చల్లని నీడలలో, ఆనుడు ఆసనాల మీద హాయిగా కూర్చొని ఉంటారు[20].

57. అందులో వారికి ఫలాలు మరియు వారు కోరే వన్నీ ఉంటాయి.

58. "మీకు శాంతి కలుగుగాక (సలాం)!" అనే పలుకులు అపార కరుణా ప్రదాత అయిన ప్రభువు తరఫు నుండి వస్తాయి[21].

59. ఇంకా (ఇలా అనబడుతుంది): "ఓ అపరాధులారా! ఈనాడు మీరు వేరయి పొండి." (1/8)[22]

60. "ఓ ఆదమ్ సంతతివారలారా: 'షైతానును ఆరాధించకండి' అని నేను మిమ్మల్ని ఆదేశించ లేదా? నిశ్చయంగా, అతడు మీకు బహిరంగ శత్రువు!"[23]

61. "మరియు మీరు నన్నే ఆరాధించండి. ఇదే ఋజుమార్గమనీ!"

---

[20] చూడండి, 4:57, 18:31 మరియు 55:4..
[21] చూడండి, 5:16.
[22] చూడండి, 30:14, 43.
[23] చూడండి, 19:44.

62. "మరియు వాస్తవానికి వాడు (షైతాన్) మీలో పెద్ద సమూహాన్ని దారి తప్పించాడు. ఏమీ? మీకు తెలివి లేక పోయిందా?"

63. "మీకు వాగ్దానం చేయబడిన ఆ నరకం ఇదే!"

64. "మీరు సత్యాన్ని తిరస్కరిస్తూ ఉన్నందుకు, ఈ రోజు దీనిలో ప్రవేశించండి (కాలండి)."

65. ఆ రోజు మేము వారి నోళ్ళ మీద ముద్ర వేస్తాము[24]. మరియు వారేమి అర్జించారో వారి చేతులు మాతో చెబుతాయి మరియు వారి కాళ్ళు మా ముందు సాక్ష్యమిస్తాయి.

66. మరియు మేము కోరినట్లయితే, వారి దృష్టిని నిర్మూలించే వారము, అప్పుడు వారు దారి కొరకు పెనుగులాడే వారు, కాని వారు ఎలా చూడగలిగే వారు?[25]

67. మరియు మేము కోరినట్లయితే, వారిని వారి స్థానంలోనే రూపాన్ని మార్చి ఉంచే వారం, అప్పుడు వారు ముందుకూ పోలేరు మరియు వెనుకకూ మరలలేరు.

68. మరియు మేము ఎవరికి దీర్ఘాయువు నొసంగుతామో, అతని శారీరక రూపాన్ని మార్చుతాము. ఏమీ? వారు ఇది కూడా గ్రహించలేరా?[26]

---

[24] ఎందుకంటే మొదట వారు తాము చేసిన షిర్కును తిరస్కరిస్తారు. చూడండి, 6:23.

[25] చూడండి, 2:20.

[26] చూడండి, 4:28.

**69.** మరియు మేము అతనికి (ముహమ్మద్ కు) కవిత్వం నేర్పలేదు[27]. మరియు అది అతనికి శోభించదు కూడా! ఇది కేవలం ఒక హితోపదేశం మరియు స్పష్టమైన పఠనా గ్రంథం (ఖుర్ఆన్) మాత్రమే[28].

**70.** బ్రతికి వున్న ప్రతివానికి హెచ్చరిక చేయటానికి మరియు సత్యతిరస్కారుల ఎడల మా ఆదేశాన్ని నిరూపించటానికి!

**71.** ఏమీ, వారికి తెలియదా? నిశ్చయంగా, మేము వారికి వారి కొరకు మా చేతులతో పశువులను సృష్టించి, తరువాత వాటిపై వారికి యాజమాన్యం ఇచ్చామని?

**72.** మరియు వాటిని, వారికి స్వాధీనపరిచాము. కావున వాటిలో కొన్నిటిపై వారు స్వారీ చేస్తారు, మరికొన్నిటిని (వాటి మాంసాన్ని) వారు తింటారు.

**73.** మరియు వాటిలో వారికి ఎన్నో ప్రయోజనాలు మరియు పానీయాలు (పాలు) ఉన్నాయి. అయినా, వారెందుకు కృతజ్ఞతలు చూపరు?

**74.** మరియు వారు అల్లాహ్ ను వదలి, ఇతరులను

---

[27] మక్కా ముష్రికులు దైవప్రవక్త ('స'అస) ను వివిధ ఆరోపణలతో పీడించేవారు. వాటిలో ఒకటి ఇతను ('స'అస) కవిత్వం చెబుతున్నాడని. దానికి అల్లాహ్ (సు.తా.) ఇక్కడ జవాబిస్తున్నాడు: ఒకవేళ ఇది కవిత్వం అయితే మీరు దీని వంటి ఒక్క సూరహ్ నైనా రచించి తీసుకురండని. కాని దానిని ఎవ్వరూ ఈ రోజు వరకు పూర్తి చేయలేక పోయారు. ఇంకా చూడండి, 26:224-226.

[28] చూడండి, 15:1

ఆరాధ్య దైవాలుగా చేసుకున్నారు[29]. బహుశా వారివలనతమకుసహాయందొరకుతుందేమోననే ఆశతో!

75. వారు (ఆ దైవాలు), తమకెలాంటి సహాయ చేయలేరు. అయినా! వీరు (సత్యతిరస్కారులు) వారి (ఆ దైవాల) కొరకు సైన్యం మాదిరిగా సర్వసన్నద్ధులై ఉన్నారు[30].

76. కావున (ఓ ముహమ్మద్!) వారి మాటలు నిన్ను బాధింపనివ్వరాదు. వాస్తవానికి! మాకు, వారు దాచేవి మరియు వెలిబుచ్చేవీ అన్నీ బాగా తెలుసు.

77. ఏమీ? మానవుడు ఎరుగడా? నిశ్చయంగా, మేము అతనిని వీర్యబిందువుతో సృష్టించామని? అయినా! అతడు బహిరంగ ప్రత్యర్థిగా తయారయ్యాడు?[31]

78. మరియు అతడు మాకు పోలికలు కల్పిస్తూ తన సృష్టినే మరలిపోయాడు. అతడు ఇలా అంటాడు:

---

[29] అంటే విగ్రహాలు, కల్పితదైవాలు, అవతారాలుగా భావించబడే మానవులు, సాధులు, ,సన్యాసులు, ప్రవక్తలు, షై'తాన్ మరియు దైవదూతలూ లేక ధనసంపత్తులు, బలం, శక్తి, అదృష్టం, శకునం మొదలైనవి. వీటినే వారు దైవాలుగా చేసుకొని ఆరాధిస్తున్నారు.

[30] ఈ ఆయత్ యొక్క మరొక తాత్పర్యం ఈ విధంగా కూడా ఉంది: "వారు (ఆ దైవాలు), వీరికెలాంటి సహాయం చేయలేరు. కాని వారు (ఆ దైవాలు పునరుత్థాన దినమున తమను ఆరాధించిన వారికి) విరుద్ధ భటులుగా హాజరు చేయబడతారు." (ఇబ్నె-కసీ'ర్)

[31] ఇటువంటి ఆయత్ కు చూడండి, 16:4.

"కృశించిపోయిన ఈ ఎముకలను తిరిగి ఎవడు బ్రతికించగలడు?”

**79.** ఇలా అను: "మొదట వాటిని పుట్టించిన ఆయనే, మళ్ళీ వాటిని బ్రతికిస్తాడు. మరియు ఆయనకు, ప్రతి దానిని సృష్టించే జ్ఞానముంది."

**80.** ఆయనే పచ్చని చెట్టు నుండి మీ కొరకు అగ్నిని పుట్టించేవాడు, తరువాత మీరు దాని నుండి మంటను వెలిగించుకుంటారు.

**81.** ఏమీ? ఆకాశాలనూ మరియు భూమినీ సృష్టించగలవాడు, వాటి లాంటి వాటిని మరల సృష్టించలేడా? ఎందుకు చేయలేడు! ఆయనే సర్వసృష్టికర్త, సర్వజ్ఞుడు[32].

**82.** నిశ్చయంగా, ఆయన విధానమేమిటంటే! ఆయన ఏదైనా చేయదలచు కున్నప్పుడు దానితో: "అయిపో!" అని అంటాడు, అంతే! అది అయిపోతుంది.

**83.** ఎందుకంటే! సర్వలోపాలకు అతీతుడైన ఆయన (అల్లాహ్) చేతిలో ప్రతిదానికి సంబంధించిన సర్వాధికారాలు ఉన్నాయి మరియు మీరంతా ఆయన వైపునకే మరలింప బడతారు.

---

[32] చూడండి, 40:57, 46:33 17:99.

# 37. అస్-సాఫ్ఫాత్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. వరుసగా బారులు తీరి నిలుచున్న వారి (దైవదూతల) సాక్షిగా!
2. మేఘాలను నడిపించే వారి (దైవదూతల) సాక్షిగా![1]
3. ఈ ఉపదేశాన్ని (ఖుర్ఆన్ ను, అల్లాహ్ దగ్గరి నుండి మానవులకు) తెచ్చే వారి (దైవదూతల) సాక్షిగా![2]
4. నిశ్చయంగా, మీ ఆరాధ్య దైవం కేవలం ఆయన (అల్లాహ్) ఒక్కడే![3]

---

[*] [అస్-సాఫ్ఫాత్ అంటే పంక్తులు, శ్రేణులు]

[1] ఈ ఆయత్ ఈ విధంగా కూడా వివరించబడింది. 'తరుమగొట్టే వారి సాక్షిగా!'

[2] ఈ ఆయత్: 'ఖుర్ఆన్ పఠించేవాని సాక్షిగా!' అని కూడా వివరించబడింది.

[3] పై మూడు ఆయతులలో దైవదూత ('అ.స.)ల వివిధ కార్యాలు వివరించబడ్డాయి. ప్రతిదీ అల్లాహ్ (సు.తా.) యొక్క సృష్టి మరియు ఆయనకు చెందినదే. కావున ఆయన తాను కోరిన దాని ప్రమాణం చేస్తాడు. కాని మానవులకు అల్లాహ్ (సు. తా.) తప్ప ఇతరుల ప్రమాణం చేయటం నిషిద్ధం ('హరాం) ఎందుకంటే ప్రమాణం తీసుకునే దానిని సాక్షిగా తీసుకోవలసి ఉంటుంది. మానవునికి అల్లాహ్ (సు.తా.) తప్ప మరొక ఉత్తమ సాక్షి లేడు. ఎందుకంటే కేవలం అల్లాహ్ (సు.తా.) యే సర్వసాక్షి.

5. ఆకాశాలు మరియు భూమి మరియు వాటి మధ్యనున్న వాటి ప్రభువు మరియు సూర్యోదయ (తూర్పు) స్థలాలకు ప్రభువు[4].
6. నిశ్చయంగా, మేము భూలోకానికి దగ్గరి ఆకాశాన్ని నక్షత్ర సముదాయాలతో అలంకరించాము;
7. మరియు ధిక్కారి అయిన ప్రతి షైతాన్ నుండి కాపాడటానికి[5];
8. ఇక వారు (షైతాన్ లు), ఉన్నత స్థానాలలో ఉన్న నాయకుల (దైవదూతల) మాటలు వినలేరు మరియు వారు ప్రతి దిక్కు నుండి తరుమ బడుతూ ఉంటారు.
9. (ఎందుకంటే) వారు (షైతాన్ లు) బహిష్కరించ బడ్డారు. మరియు వారికి నిరంతరమైన శిక్ష ఉంది.
10. కాని, ఎవడైనా (ఏ షైతానైనా), దేనినైనా ఎగురవేసుకొని పోతున్నట్లైతే, మండే అగ్నిజ్వాల అతనిని వెంబడిస్తుంది[6].

---

[4] చూడండి, 55:17. అక్కడ రెండు తూర్పులు మరియు రెండు పడమరలు అని ఉంది. అంటే చలికాలం మరియు వేసవి కాలంలో సూర్యోదయం మరియు సూర్యాస్తమయం అయ్యే రెండు చివరలు. వాస్తవానికి సంవత్సరపు ప్రతి రోజున సూర్యుడు ఒక క్రొత్త చోటునుండి ఉదయిస్తాడు మరియు ఒక క్రొత్త చోటులో అస్తమిస్తాడు (ఫ'త్హ్ అల్-ఖదీర్).

[5] చూడండి, 15:17 నక్షత్రాల ఉనికికి మూడు కారణాలున్నాయి. 1) ఆకాశపు అలంకరణ. 2) షైతానులు ఆకాశాలలోకి పోయి దైవదూతల మాటలు వినటానికి ప్రయత్నిస్తే వాటిని తరుమటం. 3) రాత్రి చీకటిలో మానవులకు మార్గదర్శకము చేయటం. ఈ మూడు తప్ప ఇతర ఉపయోగాలు పేర్కొనబడలేదు.

[6] చూడండి, 15:18.

11. అయితే వారిని అడగండి: "ఏమీ? వారు (మానవులు) దృఢమైన సృష్టా! లేక, మేము సృష్టించింది (ఈ సృష్టి దృఢమైనదా?" నిశ్చయంగా, మేము వారిని జిగట మట్టి (తీనిల్లాజిబ్) తో సృష్టించాము.
12. వాస్తవానికి, నీవైతే ఆశ్చర్యపడుతున్నావు, కాని వారు ఎగతాళి చేస్తున్నారు.
13. మరియు వారికి ఉపదేశమిచ్చినపుడు, వారు దానిని స్వీకరించరు.
14. మరియు వారొక సంకేతాన్ని చూసినప్పుడు, దానిని ఎగతాళి చేస్తారు.
15. మరియు వారిలా అంటారు: "ఇది స్పష్టమైన మంత్రజాలం మాత్రమే!"
16. "ఏమిటి? మేము మరణించి మట్టిగా, ఎముకలుగా (అస్తిపంజరంగా) మారిపోయిన తరువాత కూడా మరల సజీవులుగా లేపబడతామా?"
17. "ఏమిటి? మరియు పూర్వీకులైన మా తాతముత్తాతలు కూడానా?"
18. వారితో ఇలా అను: "అవును! అప్పుడు మీరు అధమమైన వారు అవుతారు[7]."
19. నిశ్చయంగా, అది ఒక పెద్ద ధ్వని మాత్రమే (రెండవ బాకా), అప్పుడు వారు (లేచి) చూస్తూ ఉండిపోతారు.

---

[7] చూడండి, 27:87 మరియు 40:60.

20. మరియు వారు ఇలా అంటారు: "అయ్యో! మా దౌర్భాగ్యం! ఇదే ఆ తీర్పుదినం."
21. (అప్పుడు వారితో ఇలా అనబడుతుంది): "మీరు అబద్ధమని తిరస్కరిస్తూ ఉండే న్యాయవిచారణ దినం ఇదే!"[8]
22. (దైవదూతలతో ఇలా అనబడుతుంది): "ఆ దుర్మార్గులను సమావేశపరచండి! మరియు వారి సహవాసులను మరియు వారు ఆరాధిస్తూ ఉన్న వారిని -
23. అల్లాహ్ ను కాదని - తరువాత వారందరికీ ప్రజ్వలించే నరకాగ్ని మార్గాన్ని చూపండి;
24. మరియు వారిని అక్కడ నిలబెట్టండి. వాస్తవానికి వారిని ప్రశ్నించవలసి ఉంది.
25. మీకేమైంది? మీరు పరస్పరం ఎందుకు సహాయం చేసుకోవటం లేదు?'"
26. అలా కాదు! ఆ రోజు వారు తమను తాము అల్లాహ్ కు అప్పగించుకుంటారు.
27. మరియు వారు ఒకరి వైపునకు మరొకరు మరలి ఇలా ప్రశ్నించుకుంటారు.
28. కొందరు అంటారు: "మీరు మా వద్దకు (మమ్మల్ని మోసగించటానికి) మా కుడివైపు నుండి వచ్చేవారు!"[9]

---

[8] చూడండి, 77:13.
[9] అంటే ధర్మం మరియు సత్యం పేరట వచ్చేవారు. అంటే వారు ఆచరించే ధర్మమే సత్యమైనదని!

**29.** ఇతరులు ఇలా జవాబిస్తారు: "అలా కాదు, మీ అంతట మీరే విశ్వసించేవారు కాదు."

**30.** "మాకు మీపై ఎలాంటి అధికారం ఉండేది కాదు. అలా కాదు! మీరే తలబిరుసుతనం చూపేవారు[10]."

**31.** "కావున, ఇప్పుడు మన ప్రభువు వాక్కు మనపై పూర్తి అయ్యింది. నిశ్చయంగా మనమంతా (శిక్షను) రుచి చూడగలము."

**32.** "కావున మేము మిమ్మల్ని తప్పు దారిలో పడవేశాము,
నిశ్చయంగా మేము కూడా మార్గభ్రష్టులమై ఉంటిమి[11]!"

**33.** అప్పుడు నిశ్చయంగా, వారందరూ ఆ రోజు శిక్షలో భాగస్వాములవుతారు.

**34.** నిశ్చయంగా, మేము అపరాధులతో ఇదే విధంగా ప్రవర్తిస్తాము.

**35.** వాస్తవానికి, వారితో: "అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్యదైవం లేడు." అని అన్నప్పుడు, వారు దరహంకారం చూపేవారు.

**36.** మరియు వారు ఇలా అనేవారు: "ఏమిటి? మేము ఒక పిచ్చికవి కొరకు మా ఆరాధ్య దైవాలను

---

[10] ఇలాంటి ఆయత్ లకు చూడండి, 14:21, 40:47-48, 34:31-32, 33:67-68, 7:38-39.

[11] చివరకు వారి నాయకులు ఒప్పుకుంటారు, వారు స్వయంగా తప్పు దారిలో ఉండి, తమ అనుచరులను కూడా తప్పు దారి పట్టించారని! షైతాన్ మాటల కోసం చూడండి, 14:22.

త్యజించాలా?"[12]

37. వాస్తవానికి, అతను (ముహమ్మద్) సత్యాన్ని తీసుకొని వచ్చాడు. మరియు అతను (తనకు పూర్వం వచ్చిన) ప్రవక్తలను సత్యవంతులని ధృవపరచాడు.

38. నిశ్చయంగా, మీరు బాధాకరమైన శిక్షను రుచి చూడగలరు;

39. మరియు మీకు మీరు చేస్తూ ఉండిన కర్మలకు తగిన ఫలితం తప్ప మరేమీ ఇవ్వబడదు.

40. ఎన్నుకోబడిన అల్లాహ్ దాసులకు తప్ప[13].

41. అలాంటి వారి కొరకు వారికి తెలిసి ఉన్న జీవనోపాధి ఉంది[14];

42. అన్ని రకాల ఫలాలు. మరియు వారు ఆదరించబడతారు;

43. పరమ సుఖాలు గల స్వర్గవనాలలో;

44. ఆసనాల మీద ఒకరికొకరు ఎదురెదురుగా కూర్చొని ఉంటారు[15];

45. వారి మధ్య ప్రవహించే చెలమల నుండి, పానీయపు (మధు) పాత్రలు త్రిప్పబడు తుంటాయి;

46. అది తెల్లగా (మెరిసిపోతూ) త్రాగే వారికి ఎంతో

[12] వారు దైవప్రవక్త ('స'అస) ను పిచ్చికవి మరియు దివ్యఖుర్ఆన్ ను కవిత్వము అని హేళన చేసేవారు. చూడండి, 36:69.

[13] వారికి అంటే అల్లాహ్ (సు.తా.) ఎన్నుకొన్న దాసులకు పది రెట్లు పుణ్య ఫలితం లభిస్తుంది. చూడండి, 6:160.

[14] చూడండి, 2:25.

[15] చూడండి, 15:47.

రుచికరమైనదిగా ఉంటుంది;

47. దాని వల్ల వారికి ఎలాంటి బాధా కలుగదు మరియు వారు తమ తెలివినీ పోగొట్టుకోరు.

48. మరియు వారి దగ్గర, శీలవతులైన తమ చూపులను నిగ్రహించుకునే, అందమైన కళ్ళు గల స్త్రీలు ఉంటారు[16].

49. వారు దాచబడిన గ్రుడ్లవలే (కోమలంగా) ఉంటారు[17].

50. అప్పుడు వారు ఒకరి వైపు కొకరు మరలి, పరస్పరం ఇలా ప్రశ్నించుకుంటారు.

51. వారిలో ఒకడంటాడు: "వాస్తవానికి(భూలోకంలో) నాకొక స్నేహితుడు(ఖరీనున్) ఉండేవాడు;

52. అతడు నన్ను ఇలా అడిగేవాడు: ఏమీ? నీవు కూడా (పునరుత్థానం) నిజమేనని నమ్మే వారిలో ఒకడివా?

53. ఏమీ? మనం చనిపోయి మట్టిగా ఎముకలుగా మారి పోయిన తరువాత కూడా నిశ్చయంగా మనకు ప్రతిఫలమనేది ఉంటుందా?"

54. అతడు ఇంకా ఇలా అంటాడు: "ఏమీ? మీరు అతడిని చూడదలచుకున్నారా?"

55. తరువాత అతడు తొంగి చూసి, అతడిని (తన

---

[16] చూడండి, 38:52.

[17] చూడండి, 56:34. ఉష్ట్ర పక్షి (నిప్పుకోడి) తన గ్రుడ్లను భద్రంగా దాచి నందుకు అవి ఎంత సౌందర్యంగా ఉంటాయో స్వర్గపు 'హూర్ లు అలాగే ఉంటారు.

పూర్వ స్నేహితుణ్ణి) భగభగమండే నరకాగ్ని మధ్యలో చూస్తాడు.

56. అతడితో (ఆ స్నేహితునితో), అతడు అంటాడు: "అల్లాహ్ సాక్షిగా! నీవు నన్ను నాశనం చేసి ఉండేవాడివే!

57. ఒకవేళ నా ప్రభువు అనుగ్రహమే లేకున్నట్లయితే! నేను కూడా (నరకానికి) హాజరు చేయ బడిన వారిలో చేరి పోయేవాడిని."

58. (తరువాత ఆ స్వర్గవాసి తన సహచరులతో అంటాడు): "ఏమీ? ఇక మనం మరల చని పోము కదా?

59. మన మొదటి (భూలోక) మరణం తప్ప! మనకు ఇక ఎలాంటి శిక్ష పడదు కదా?"

60. నిశ్చయంగా, ఇదే ఆ గొప్ప సాఫల్యం (విజయం) [18].

61. ఇలాంటి (స్థానం) పొందటానికి పాటుపడే వారు పాటు పడాలి.

62. ఏమీ? ఇలాంటి ఆతిథ్యం మేలైనదా? లేక జముడు

---

[18] అంటే తీర్పు తరువాత స్వర్గవాసులు ఎల్లప్పుడు స్వర్గంలో మరియు నరకవాసులు శాశ్వతంగా నరకంలో ఉంటారు. అప్పుడు మరణాన్ని ఒక గొర్రె ఆకారంలో తెచ్చి స్వర్గనరకాల మధ్య జిబ్ హ చేయడం జరుగుతుంది, ('హదీస్').

ఫలపు[19] ఆతిథ్యమా?

**63.** నిశ్చయంగా, మేము దానిని, దుర్మార్గుల కొరకు ఒక పరీక్షగా చేశాము.

**64.** నిశ్చయంగా, అది నరకపు అడుగు భాగం నుండి మొలిచే ఒక చెట్టు;

**65.** దాని మొగ్గలు షైతానుల తలల వలే ఉంటాయి.

**66.** నిశ్చయంగా, వారు దాని నుంచే తింటారు మరియు దానితోనే తమ కడుపులు నింపు కుంటారు.

**67.** తరువాత నిశ్చయంగా, దాని మీద వారికి త్రాగటానికి సలసల కాగే పానీయం మాత్రమే ఉంటుంది[20].

**68.** ఆ తరువాత నిశ్చయంగా, వారి మరలింపు కేవలం భగభగమండే నరకాగ్ని వైపునకే అవుతుంది.

**69.** నిశ్చయంగా, అప్పుడు వారు తమ తండ్రితాతలు, మార్గభ్రష్టత్వంలో ఉండే వారని కనుగొంటారు!

**70.** మరియు తాము కూడా వారి అడుగు జాడలను అనుసరించటానికి త్వరపడుతూ ఉండే వారమని!

**71.** మరియు వాస్తవానికి వారి పూర్వీకులు కూడా చాలా మంది మార్గభ్రష్టులుగానే ఉండేవారు.

---

[19] అజ్-'జఖ్ఖూము: జముడు చెట్టు ఫలం. ఇది అరబ్ తిహామహ్ ప్రాంతాలలో ఉన్నదేనని కొందరు వ్యాఖ్యాతల అభిప్రాయం. ఇది ఎంతో చేదైన దుర్వాసన గల ఫలం. ఇంకా చూడండి, 17:60, 44:43 మరియు 56:52.

[20] చూడండి, 47:15.

72. మరియు వాస్తవానికి మేము వారి వద్దకు హెచ్చరిక చేయటానికి (సందేశహరులను) పంపి ఉన్నాము.
73. ఇక చూడు! హెచ్చరిక చేయబడిన వారి పర్యవసానం ఎలా ఉండిందో!
74. ఎన్నుకోబడిన అల్లాహ్ దాసులకు తప్ప!
75. మరియు వాస్తవంగా, నూహ్[21] మమ్మల్ని వేడుకున్నాడు. ఎందుకంటే, మేము (ప్రార్థనలకు) ప్రత్యుత్తరమిచ్చే వారిలో సర్వోత్తములము.
76. మరియు మేము అతనిని మరియు అతని కుటుంబం వారిని మహా విపత్తు (జలప్రళయం) నుండి కాపాడాము[22].
77. మరియు అతని సంతతి వారిని మాత్రమే మిగిలి ఉండేటట్లు చేశాము[23].
78. మరియు తరువాత వచ్చే వారిలో అతని కీర్తిని (పేరు ప్రతిష్ఠను) నిలిపాము.

---

[21] నూ'హ్ ('అ.స.) గాథ కోసం చూడండి, 11:25-48.
[22] అహ్లూన్: అంటే అతని కుటుంబం వారే కాక అతనితో బాటు విశ్వసించిన అతని అనుచరులు కూడాను
[23] నూ'హ్ ('అ.స.) భార్య మరియు అతని కుమారుడు విశ్వసించలేదు. కాబట్టి వారు, మునిగి పోయారు. అతని కుమారులలో 'హామ్, సామ్, యాఫస్'లు నావలో ఉన్నారు. 1) సామ్ నుండి 'అరబ్బులు, పర్షియన్లు, యూరోపియన్ లు మరియు యూదులు 2) 'హామ్ సంతతి నుండి సూడాన్, ఇండియా, 'హబషా, ఖిబ్తీలు మరియు బర్ బర్ లు మరియు 3) యాఫస్' సంతతి నుండి తుర్కీలు, ఖజర్, యఅ 'జూజ్ మఅ'జూజ్ మొదలైనవారు పుట్టారని చెబుతారు. (ఫ'త్హ్ అల్-ఖదీర్).

79. సర్వలోకాలలో నూహ్ కు శాంతి కలుగు గాక (సలాం)!
80. నిశ్చయంగా, మేము సజ్జనులకు ఈ విధంగా ప్రతిఫలం ఇస్తూ ఉంటాము.
81. నిశ్చయంగా, అతను మా విశ్వాసులైన దాసులలోని వాడు.
82. తరువాత మేము ఇతరులను ముంచి వేశాము.
83. మరియు నిశ్చయంగా, అతనిని అనుసరించిన వారిలో ఇబ్రాహీమ్ ఒకడు.
84. అతను తన ప్రభువు సాన్నిధ్యానికి నిర్మల హృదయంతో వచ్చి;
85. అతను తన తండ్రి మరియు తన జాతి వారితో ఇలా అన్నాడు: "మీరు దేనిని ఆరాధిస్తున్నారు?
86. ఏమీ? మీరు అల్లాహ్ ను వదలి మిథ్యా (బూటక) దైవాలను (ఆరాధించ) గోరుతున్నారా?
87. అయితే సర్వలోకాల ప్రభువును గురించి మీ అభిప్రాయమేమిటి?"
88. ఆ తరువాత, అతను నక్షత్రాల వైపుకు తన దృష్టి సారించాడు[24];
89. అప్పుడు అతను ఇలా అన్నాడు: "నిశ్చయంగా, నా ఆరోగ్యం బాగులేదు[25]."
90. కావున వారు అతనిని వదలి పెట్టి వెళ్ళిపోయారు.
91. తరువాత అతను మెల్లగా వారి దేవతల (విగ్రహాల)

[24] చూడండి, 6:76-78.
[25] చూడండి, 21:63.

దగ్గరికి వెళ్ళి ఇలా అన్నాడు: "మీరు తినటం లేదేమిటి?"

92. "మీకేమైంది? మీరెందుకు మాట్లాడరు?"

93. తరువాత అతను వాటి వద్దకు వెళ్ళి తన కుడిచేతితో వాటిని పగుల గొట్టాడు[26].

94. అప్పుడు, వారు (ప్రజలు) అతని దగ్గరకు త్వరత్వరగా వచ్చారు.

95. అప్పుడు(ఇబ్రాహీమ్) వారితో అన్నాడు: "ఏమీ? మీరు చెక్కిన వాటినే మీరు ఆరాధిస్తారా?"

96. "వాస్తవానికి, మిమ్మల్ని మరియు మీరు (చెక్కి) చేసిన వాటిని సృష్టించింది అల్లాహ్ యే కదా!"[27]

97. వారు (పరస్పరం ఇలా చెప్పుకున్నారు): "ఇతని కొరకు ఒక (అగ్ని) గుండం నిర్మించి, తరువాత ఇతనిని ఆ భగభగ మండే అగ్నిలో పడవేయండి!"

98. కావున, వారు అతనికి విరుద్ధంగా పన్నాగాలు పన్నారు, కాని మేము వారిని కించపరచాము.

99. మరియు అతను (ఇబ్రాహీమ్) అన్నాడు: "నిశ్చయంగా, నేను నా ప్రభువు (తీసుకొని వెళ్ళే) వైపునకు వెళ్ళిపోతాను. ఆయనే నాకు

---

[26] వివరాలకు చూడండి, 21:58.

[27] సర్వసృష్టికి మూలాధారి అల్లాహ్ (సు.తా.) మాత్రమే! కావున ఆయనను ఆరాధించకుండా మీరు మీ చేతులతో తయారు చేసిన వాటిని ఎందుకు ఆరాధిస్తున్నారు.

మార్గదర్శకత్వం చేస్తాడు."[28]

**100.** (అతను ఇలా ప్రార్థించాడు): "ఓ నా ప్రభూ! నాకు సద్వర్తనుడైన (కుమారుణ్ణి) ప్రసాదించు!"

**101.** కావున మేము అతనికి సహనశీలుడైన కుమారుని శుభవార్త నిచ్చాము[29].

**102.** ఆ బాలుడు అతనికి తోడుగా శ్రమ చేయగల వయస్సుకు చేరుకున్నప్పుడు, అతను (ఇబ్రాహీమ్) అన్నాడు: "ఓ నా కుమారా! వాస్తవానికి నేను నిన్ను బలి (జిబహ్) చేస్తున్నట్లుగా కలలో చూశాను, ఇక నీ సలహా ఏమిటో చెప్పు!" అతను (ఇస్మాయీల్) అన్నాడు: "ఓ నాన్నా! నీకు ఇవ్వబడిన ఆజ్ఞను నెరవేర్చు, అల్లాహ్ కోరితే నీవు నన్ను సహనశీలునిగా పొందగలవు!"

**103.** ఆ తరువాత వారిద్దరూ ఆయన (అల్లాహ్) ఆజ్ఞను నెరవేర్చటానికి సిద్ధపడ్డారు. మరియు అతను (ఇబ్రాహీమ్) అతనిని (ఇస్మాయీల్ ను) నుదుటిపై బోర్లా పరుండ బెట్టాడు.

**104.** మరియు మేము అతనిని పిలుస్తూ ఇలా అన్నాము: "ఓ ఇబ్రాహీమ్!

**105.** వాస్తవంగా, నీవు కలన నిజం చేసి చూపించావు!"

---

[28] ఇబ్రాహీమ్ ('అ.స.) మొదట బాబుల్ అనే నగరంలో ఉండేవారు. అది ఇరాఖ్ లో ఉంది. ఆ తరువాత అతను షామ్ వైపునకు వెళ్ళిపోయారు.

[29] అతను ఇబ్రాహీమ్ ('అ.స.) మొదటి కుమారుడు ఇస్మా'యీల్ ('అ.స.).

నిశ్చయంగా, మేము సజ్జనులకు ఇలాంటి ప్రతిఫలమిస్తాము.

**106.** నిశ్చయంగా, ఇదొక స్పష్టమైన (కఠిన) పరీక్ష.

**107.** మరియు మేము అతనికి (ఇస్మాయీల్ కు) బదులుగా ఒక గొప్ప బలిని పరిహారంగా ఇచ్చాము[30].

**108.** మరియు తరువాత వచ్చే తరాలలో అతని కీర్తిని నిలిపాము.

**109.** "ఇబ్రాహీమ్ కు శాంతి కలుగు గాక (సలాం)!"

**110.** ఈ విధంగా మేము సజ్జనులకు ప్రతిఫలమిస్తాము.

**111.** నిశ్చయంగా, అతను (ఇబ్రాహీమ్) విశ్వసించిన మా దాసులలోని వాడు!

**112.** మరియు మేము అతనికి ఇస్ హాఖ్ యొక్క శుభవార్తను ఇచ్చాము, అతను ఒక సద్వర్తనుడైన ప్రవక్త[31].

**113.** మరియు మేము అతనిని (ఇబ్రాహీమ్ ను)

---

[30] ఈ బలి ఒక గొర్రె. అది ఇస్మా'యీల్ ('అ.స.) కు బదులుగా పంపబడింది. అది బలి చేయబడింది. దీని జ్ఞాపకార్థమే ముస్లింలు ప్రతి సంవత్సరం జు'ల్ 'హజ్ లో బలి (ఖుర్బానీ) ఇస్తారు. వివరాల కోసం చూడండి, 22:27-37 మరియు 2:196-203.

[31] ఒక కుమారుణ్ణి జి'బహ్ చేసిన గాథ తరువాత మరొక కుమారుని, ఇ'స్హాఖ్ ('అ.స.) యొక్క శుభవార్త ఇవ్వబుడుతోంది. దీనితో స్పష్టమయ్యేది ఏమిటంటే జి'బహ్ చేయబడిన కుమారుడు ఇస్మాయీల్ ('అ.స.) మాత్రమే. అప్పుడతను ('అ.స.) ను ఇబ్రాహీమ్ ('అ.స.) యొక్క ఏకైక పుత్రుడు. (చూడండి, ఇబ్నె-కసీ'ర్ మరియు ఫ'తహ్ అల్-ఖదీర్).

మరియు ఇస్ హాఖ్ ను అనుగ్రహించాము. మరియు వారి సంతతిలో కొందరు సజ్జనులుండే వారు. మరికొందరు తమకు తాము స్పష్టంగా అన్యాయం చేసుకున్నవారు కూడా ఉన్నారు[32].

114. మరియు వాస్తవానికి, మేము మూసా మరియు హారూన్ లను అనుగ్రహించాము.

115. మరియు మేము వారిద్దరిని మరియు వారి జాతి వారిని మహా విపత్తు నుండి విముక్తి కలిగించాము.

116. మరియు మేము వారికి సహాయం చేశాము, కాబట్టి వారు విజయం పొందిన వారయ్యారు.

---

[32] అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞతో, ఇ'స్హాఖ్ ('అ.స.) పుట్టక ముందే, ఇబ్రాహీమ్ ('అ.స.) తన రెండవ భార్య హాజర్ మరియు ఆమె కుమారుడు ఇస్మా'యీల్ ('అలైహిమ్ స.) లను మక్కాలో వదిలారు. ఇస్మా'యీల్ ('అ.స.) అక్కడ జుర్హుమ్ అనే 'అరబ్బు తెగ స్త్రీతో వివాహం చేసుకొని అక్కడే నివసిస్తూ 'అరబ్బులలో కలిసిపోయి 'అరబ్బు అయిపోయారు. అతని వంశంలో నుండి కేవలం ము'హమ్మద్ ('స'అస) మాత్రమే ప్రవక్తగా ఎన్నుకోబడ్డారు. ఇక ఇస్హా'ఖ్('అ.స.) కుమారుడు య'అఖూబ్ ('అ.స.) అతని మరొకపేరు ఇస్రాయీ'ల్. అదే పేరుతో అతని కుటుంబం వారు బనీ-ఇస్రాయీ'ల్ అనబడ్డారు. అతనికి 12 మంది కుమారులు. ప్రతి కుమారుని సంతతి నుండి ఒక బనీ-ఇస్రాయీ'ల్ తెగ ఏర్పడింది. యూసుఫ్ ('అ.స.) ఆ పన్నెండు కుమారులలో ఒకరు. బనీ-ఇస్రాయీ'ల్ సంతతిలో నుండి చాలా మంది ప్రవక్తలు వచ్చారు. మూసా మరియు 'ఈసా ('అలైహిమ్ స.) లు కూడా వారి సంతతిలోని వారే! ఈ రెండు ప్రవక్తల సంతతిలో మంచి వారు పుట్టారు. ముష్రికులు కూడా పుట్టారు. కావున కేవలం తండ్రి తాతలు పుణ్యపురుషులు అయినంత మాత్రాన సంతానంలో అందరూ పుణ్యవంతులవటం తప్పనిసరి కాదు!

117. మరియు వారిద్దరికి (మంచి చెడులను) స్పష్టపరిచే గ్రంథాన్ని ప్రసాదించాము[33].

118. మరియు వారిద్దరికి ఋజుమార్గం వైపునకు మార్గదర్శకత్వం చేశాము.

119. మరియు ఆ తరువాత తరాల వారిలో వారిద్దరి గురించి మంచి కీర్తిని నిలిపాము.

120. "మూసా మరియు హారూన్ లకు శాంతి కలుగు గాక (సలాం)!"

121. నిశ్చయంగా, ఈ విధంగా మేము సజ్జనులకు ప్రతిఫలమిస్తాము.

122. నిశ్చయంగా వారిద్దరూ, విశ్వాసులైన మా దాసులలోని వారు.

123. మరియు నిశ్చయంగా, ఇల్యాస్ కూడా మా సందేశహరులలో ఒకడు[34].

124. అతను తన జాతి వారితో ఇలా అన్నప్పుడు: "ఏమీ? మీకు దైవభీతి లేదా?

125. ఏమీ? మీరు బఅల్[35] (అనే విగ్రహాన్ని) ఆరాధిస్తూ సర్వోత్తముడైన సృష్టికర్తను వదలి

---

[33] చూడండి, 5:44.

[34] ఇల్యాస్ (Elijah) ('అ.స.) హారూన్ ('అ.స.) సంతతి చెందిన వారు. అతని నివాసం బఅల్బక్ నగరం. ఇల్యాస్ (ఏలియా) హిబ్రూ (యూదుల) ప్రవక్త. ఇతను ఫలస్తీన్ ఉత్తర భాగంలో అహబ్ మరియు అహాజియా రాజుల కాలంలో ఉన్నారు, (దాదాపు క్రీ.శకానికి 9 సంవత్సరాలకు ముందు) ఇతని తరువాత అల్-యస'అ (Elisha,'అ.స.) ప్రవక్తగా వచ్చారు.

[35] ఇల్యాస్ (Elijah 'అ.స.) కాలపు ముష్రికులు బ'అల్ అనే విగ్రహాన్ని పూజించేవారు.

పెడుతున్నారా?

126. అల్లాహ్ యే మీ ప్రభువు! మరియు మీ పూర్వీకులైన మీ తాతముత్తాతల ప్రభువు కదా?"

127. కాని వారు అతనిని (ఇల్యాస్ ను) అసత్యవాదుడని తిరస్కరించారు, కాబట్టి వారు తప్పకుండా (శిక్ష కొరకు) హాజరు చేయబడతారు.

128. ఎన్నుకోబడిన అల్లాహ్ దాసులు తప్ప!

129. తరువాత వచ్చే తరాలలో అతని కీర్తిని (పేరు ప్రతిష్ఠను) నిలిపాము.

130. "ఇల్ యాసీన్[36] కు శాంతి కలుగు గాక (సలాం)!"

131. నిశ్చయంగా, సజ్జనులకు మేము ఈ విధంగా ప్రతిఫలమిస్తాము.

132. నిశ్చయంగా, అతను విశ్వాసులైన మా దాసులలోని వాడు[37].

133. మరియు నిశ్చయంగా లూత్ కూడా మేము

---

[36] ఇల్-యాసీన్ (Elias), ఇల్యాస్ (Elijah) 'అ.స. పేరు యొక్క మరొక విధమైన ఉచ్చరణ. ఏ విధంగానేతే తూర్-సీనా, యొక్క మరొక పేరు 'తూర్-సీనీన్ ఉందో!

[37] ఖుర్ఆన్ లో ఇతర ప్రవక్తల ప్రస్తావన వచ్చినపుడు, వారిని: 'విశ్వాసులు' అని పేర్కొనబడింది. దీని ద్వారా తెలిసేది ఏమిటంటే, ప్రవక్తల ధర్మం ఏకదైవసిద్ధాంతం-ఇస్లాం. వారు అందరూ విశ్వాసం అంటే అల్లాహ్ (సు.తా.)కు విధేయులై ఉండాలనీ, అల్లాహ్(సు.తా.) తప్ప ఇతరులను ఆరాధించరాదని బోధించారు

పంపిన సందేశహరులలో ఒకడు[38].

**134.** ఎప్పుడైతే మేము అతనిని మరియు అతని కుటుంబం వారినందరిని రక్షించామో -

**135.** ముసలామె (అతని భార్య) తప్ప - ఆమె వెనుక ఉండిపోయే వారిలో చేరిపోయింది.[39]

**136.** ఆ తరువాత మిగతా వారినందరినీ నిర్మూలించాము.

**137.** మరియు వాస్తవానికి, మీరిప్పుడు వారి (శిథిల) ప్రాంతాల మీదుగా ఉదయపు వేళల్లో ప్రయాణిస్తూ ఉంటారు[40];

**138.** మరియు రాత్రులలో కూడా! అయినా మీరు అర్థం చేసుకోలేరా?

**139.** మరియు నిశ్చయంగా, యూనుస్[41] కూడా మేము పంపిన సందేశహరులలోని వాడు.

**140.** అతను నిండు పడవ వైపుకు పరిగెత్తినప్పుడు[42];

**141.** అక్కడ చీటీలలో పాల్గొన్నాడు, కాని ఓడిపోయాడు.

**142.** ఆ పిదప అతనిని ఒక పెద్ద చేప మ్రింగింది;

---

[38] లూ'త్ ('అ.స.) గాథ కొరకు, చూడండి, 7:80-84 మరియు 11:69-83

[39] ఆమె - లూ'త్ ('అ.స.) భార్య - అవిశ్వాసులలో చేరిపోయి వెనుక ఉండి పోయింది. చూడండి, 7:83 మరియు 11:81.

[40] చూడండి, 15:76. మక్కా-సిరియా మార్గంలో ఈ నగరాలు సోడోమ్ మరియు గొమర్రాహ్ లు - ఇప్పటి మృతసముద్రం - ప్రాంతంలో ఉండేవి.

[41] యూనుస్ ('అ.స.) బైబిల్ లో యోనా (Jonah) గా పేర్కొనబడ్డారు.

[42] అబఖ: అంటే, to escape ఒక బానిస తన స్వామిని విడిచి పారిపోవటం. యూనుస్ ('అ.స.) తన స్వామి, అల్లాహ్ (సు.తా.) అనుమతి లేనిదే తన ప్రజలను విడిచి పారిపోయారు.

ఎందుకంటే అతను నిందార్హుడు[43].

143. అప్పుడతను, (అల్లాహ్) పవిత్రతను కొనియాడే వారిలోని వాడు కాకపోయినట్లైతే![44]

144. దాని (చేప) కడుపులో పునరుత్థాన దినం వరకు ఉండి పోయేవాడు.

145. ఆ పిదప మేము అతనిని అనారోగ్య స్థితిలో, ఒక దిగంబర మైదానంలో పడవేశాము.

146. మరియు అతనిపై ఒక ఆనప జాతి తీగను మొలిపించాము[45].

147. మరియు అతనిని ఒక లక్ష లేదా అంతకంటే

---

[43] యూనుస్ ('అ.స.) ఇరాఖ్ ప్రాంతంలో నైనవా (ఇప్పటి మో'సల్) నగరానికి ప్రవక్తగా పంపబడ్డారు. అక్కడి రాజు ఒక లక్ష బనీఇస్రాయీల్ సంతతివారిని బందీలుగా చేసుకున్నాడు. వారి మార్గదర్శకత్వానికి అల్లాహ్ (సు.తా.) యూనుస్ ('అ.స.) ను పంపాడు. కాని వారు అతనిని విశ్వసించలేదు. అతను వారిని అల్లాహ్ (సు.తా.) శిక్ష రానున్నదనీ భయపెట్టారు. ఆ శిక్ష రాకముందే అల్లాహ్ (సు.తా.) అనుమతి లేకుండానే అతను అక్కడి నుండి పారిపోయి నావ ఎక్కారు. నావ బరువుతో మునిగి పోతుండగా, అక్కడ చీటీలు వేశారు. దానిలో అతని పేరు రాగా అతను సముద్రంలోకి దూకారు. అతనిని ఒక పెద్ద చేప మ్రింగింది. చేప కడుపులో అతను అల్లాహ్ (సు.తా.) ను వేడుకున్నారు. అప్పుడతను బయట వేయబడ్డారు. ఇంకా చూడండి, 68:48.

[44] అతని ప్రార్థన కోసం చూడండి, 21:87.

[45] యఖ్'తీనున్: Gourd plant, ఆనపజాతి తీగ. అల్లాహ్ (సు.తా.) యూనుస్ ('అ.స.) ను ఏ చెట్టు చేమ లేని మైదానంలో పడవేసిన తరువాత అతని సహాయానికి ఒక ఆనప తీగను పుట్టించాడు. అదే విధంగా అల్లాహ్ (సు.తా.) కోరితే ఒక అవిశ్వాసిని విశ్వాసిగా మార్చవచ్చు! ఎప్పుడైతే అతడు హృదయపూర్వకంగా వేడుకుంటాడో.

ఎక్కువ మంది (ప్రజల) వద్దకు పంపాము.

148. వారు విశ్వసించారు, కావున మేము ఒక నిర్ణీత కాలం వరకు వారిని సుఖసంతోషాలు అనుభవించనిచ్చాము[46].

149. అయితే వారిని ఇలా అడుగు: "ఏమీ? నీ ప్రభువుకైతే కుమార్తెలు మరియు వారి కొరకు కుమారులా?[47]

150. లేక మేము దేవదూతలను స్త్రీలుగా పుట్టించామా? మరియు వారు దానికి సాక్షులా?"[48]

151. అలా కాదు! నిశ్చయంగా, వారు (ఖురైషులు) తమ బూటకపు నమ్మకాల ఆధారంగా అంటున్నారు:

152. "అల్లాహ్ కు సంతానముంది!" అని మరియు వారు నిశ్చయంగా, అబద్ధాలాడుతున్నారు!

153. ఆయన (అల్లాహ్) కుమార్తెలను - కుమారులకు బదులుగా -ఎన్నుకున్నాడా?[49]

154. మీకేమయింది? మీరెలాంటి నిర్ణయాలు చేస్తున్నారు?

155. ఏమీ? మీరు గ్రహించలేరా?

156. లేక! మీ వద్ద ఏదైనా స్పష్టమైన ప్రమాణం ఉందా?

157. మీరు సత్యవంతులే అయితే మీ గ్రంథాన్ని తీసుకురండి!

---

[46] వారు విశ్వసించిన వివరాల కోసంచూడండి, 10:98.
[47] చూడండి, 16:57-59
[48] వారు దైవదూతలలో స్త్రీలలో ఉండే లక్షణాలు ఏవైనా చూశారా? లేక మేము దేవదూతలను పుట్టించినప్పుడు వారు అక్కడ ఉన్నారా? వారిని స్త్రీలుగా పరిగణించడానికి?
[49] చూడండి, 6:100, 17:40, 53:19-22.

158. మరియు వారు, ఆయన (అల్లాహ్) మరియు జిన్నాతుల మధ్య బంధుత్వం కల్పించారు[50]. కాని వాస్తవానికి జిన్నాతులకు తెలుసు, తాము ఆయన (అల్లాహ్) ముందు (లెక్క కొరకు) హాజరు చేయబడతామని!
159. వారు కల్పించే విషయాలకు అల్లాహ్ అతీతుడు (పరమ పవిత్రుడు)![51]
160. ఎన్నుకోబడిన అల్లాహ్ దాసులు తప్ప!
161. ఇక నిశ్చయంగా, మీరు మరియు మీ ఆరాధ్యదైవాలు (కలిసి);
162. ఎవ్వడిని కూడా, దుష్టకార్యాలు చేయటానికి పురి కొలుపలేరు;
163. భగభగ మండే నరకాగ్నిలో కాలి పోనున్న వాడిని తప్ప!
164. (దైవదూతలు ఇలా అంటారు): "మరియు మాలో ఒక్కడు కూడా తన స్థానం నియమింప బడకుండా లేడు.
165. మరియు నిశ్చయంగా, మేము కూడా (ఆయనను ప్రార్థించటానికి) వరుసలు దీరి నిలుచుంటాము.
166. మరియు నిశ్చయంగా, మేము కూడా ఆయన

---

[50] ముష్రికుల కల్పన ఏమిటంటే అల్లాహ్ (సు.తా.) జిన్నాతులతో వివాహసంబంధం ఏర్పరచు కున్నాడు, దానితో ఆడపిల్లలు పుట్టారు, వారే దైవదూతలు అని, ఇది అసత్యం. జిన్నున్: అంటే మానవ ఇంద్రియాలకు అగోచర ప్రాణి.

[51] చూడండి, 2:32, 6:100.

పవిత్రతను కొనియాడే వారమే![52]

167. మరియు (సత్యతిరస్కారులు) ఇలా అంటూ ఉండేవారు:

168. "ఒకవేళ మా పూర్వీకుల నుండి మాకు ఇలాంటి బోధన లభించి ఉంటే!"

169. "మేము కూడా, అల్లాహ్ యొక్క ఎన్నుకున్న, భక్తులమై ఉండేవారము!"

170. కాని, వారిప్పుడు దీనిని (ఈ ఖుర్ఆన్ ను) తిరస్కరిస్తున్నారు. ఇక త్వరలోనే వారు తెలుసు కుంటారు!

171. మరియు వాస్తవానికి మా దాసులైన, మేము పంపిన సందేశహరుల విషయంలో మా నిర్ణయం జరిగింది;

172. నిశ్చయంగా, వారు సహాయం (విజయం) పొందుతారని!

173. మరియు నిశ్చయంగా, మా సైనికులే తప్పక విజయం పొందుతారని![53]

174. కావున నీవు వారిని (సత్యతిరస్కారులను) కొంతకాలం వదలిపెట్టు.

175. మరియు వారిని చూస్తూ ఉండు. ఇక త్వరలోనే

---

[52] అంటే దైవదూతలు కూడా అల్లాహ్ (సు.తా.) సృష్టించిన ఆయన దాసులు. ఎల్లప్పుడూ వారు కూడా అల్లాహ్(సు.తా.)ను స్తుతిస్తూ ఉంటారు. ఆయన ఆజ్ఞాపాలన చేస్తూ ఉంటారు. ముష్రికులు భావించినట్లు వారు అల్లాహ్ (సు.తా.) కూతుళ్ళు కారు.

[53] చూడండి, 37:179, 58:21.

వారు కూడా (తమ పర్యవసానాన్ని) చూడగలరు!

176. ఏమీ? వారు మా శిక్ష కొరకు తొందర పెడుతున్నారా?

177. కాని, అది వారి ఇంటి ప్రాంగణంలో దిగినప్పుడు, హెచ్చరించబడిన వారికి అది దుర్భరమైన ఉదయం కాగలదు!

178. కావున నీవు ప్రస్తుతానికి వారిని వదలి పెట్టు;

179. మరియు చూస్తూ ఉండు. ఇక త్వరలోనే వారు కూడా (తమ పర్యవసానాన్ని) చూడ గలరు!

180. నీ ప్రభువు సర్వలోపాలకు అతీతుడు; సర్వశక్తిమంతుడైన ప్రభువు,వారి కల్పనలకు అతీతుడు

181. మరియు సందేశహరులందరికీ శాంతి కలుగుగాక (సలాం)!

182. మరియు సర్వస్తోత్రాలకు అర్హుడైన అల్లాహ్ యే సమస్త లోకాలకు ప్రభువు!

# 38. సాద్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. సాద్.[1] మరియు హితబోధతో నిండివున్న ఈ ఖుర్ఆన్ సాక్షిగా!

2. వాస్తవానికి సత్యాన్ని తిరస్కరించినవారు అహంకారంలో మరియు విరోధంలో పడి వున్నారు

3. వారికి పూర్వం గతించిన ఎన్నో తరాలను మేము నాశనం చేశాము. అప్పుడు వారు మొర పెట్టుకోసాగారు, కాని అప్పుడు వారికి దాని నుండి తప్పించుకునే సమయం లేకపోయింది!

4. మరియు వారిని హెచ్చరించేవాడు, తమలో నుంచే రావటం చూసి వారు ఆశ్చర్య పడ్డారు! మరియు సత్యతిరస్కారులు ఇలా అన్నారు: "ఇతడు మాంత్రికుడు, అసత్యవాది."

5. "ఏమీ? ఇతను (ఈ ప్రవక్త) దైవాలందరినీ, ఒకే ఆరాధ్యదైవంగా చేశాడా? నిశ్చయంగా ఇది ఎంతో విచిత్రమైన విషయం!"

6. మరియు వారి నాయకులు ఇలా అనసాగారు: "పదండి! మీరు మీ దైవాల (ఆరాధన) మీద స్థిరంగా ఉండండి." నిశ్చయంగా, ఇందులో

---

[*] [సాద్ – సాద్ అనే అరబీ అక్షరము]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

(మీకు విరుద్ధంగా) ఏదో ఉద్దేశింపబడి ఉంది!

7. "ఇలాంటి విషయాన్ని మేము ఇటీవలి కాలపు మతంలో విని ఉండలేదు. ఇది కేవలం కల్పన మాత్రమే!"

8. "ఏమీ? మా అందరిలోనూ, కేవలం ఇతనిపైననే, ఈ హితబోధ అవతరింప జేయబడిందా?[2] వాస్తవానికి వారు నా హితబోధను గురించి సంశయంలో పడి వున్నారు.[3] అలా కాదు, వారు ఇంకా (నా) శిక్షను రుచి చూడలేదు!

9. లేక వారి దగ్గర సర్వశక్తుడు, సర్వప్రదుడు [4] అయిన నీ ప్రభువు యొక్క కారుణ్య నిధులు ఉన్నాయా?

10. లేక! ఆకాశాలు మరియు భూమి మరియు వాటి మధ్య ఉన్న సమస్తం మీద వారికి సామ్రాజ్యాధిపత్యం ఉందా? అలా అయితే వారిని తమ సాధనాలతో పైకి (ఆకాశలోకి) ఎక్కమను!

11. ఇంతకు ముందు ఓడించబడిన సైన్యాల వలే, ఒక వర్గం వీరిది కూడా ఉంటుంది!

12. వీరికి పూర్వం నూహ్ మరియు ఆద్ (జాతి) వారు మరియు మేకుల ఫిర్ఔన్ జాతుల వారు సత్యాన్ని

---

[2] చూడండి, 43:31-32.

[3] వారు సంశయంలో పడింది ము'హమ్మద్ ('స'అస) అసత్యవాది అని కాదు. అతను బోధించే ధర్మం వారి దైవాలను వదలి, అగోచరుడైన ఏకైక దైవ అల్లాహ్ (సు.తా.)ను ఆరాధించమని చెప్పడం.

[4] అల్-వహ్హాబ్: Bestower. సర్వప్రదుడు, సర్వవర ప్రదాత, పరమదాత. చూడండి, 3:8.

తిరస్కరించారు;

13. మరియు సమూద్ మరియు లూత్ జాతుల వారు మరియు అయ్ కహ్ (మద్ యన్)[5] వాసులు అందరూ ఇలాంటి వర్గాలకు చెందినవారే.

14. ఇక వీరిలో ఏ ఒక్కరూ ప్రవక్తలను అసత్యవాదులని తిరస్కరించకుండా ఉండలేదు, కావున నా శిక్ష అనివార్యమయ్యింది.

15. మరియు వీరందరూ కేవలం ఒక గర్జన (సయ్ హా)[6] కొరకు మాత్రమే ఎదురు చూస్తున్నారు, దానికి ఎలాంటి నిలుపుదల ఉండదు.

16. మరియు వారు: "ఓ మా ప్రభూ! లెక్క దినానికి ముందే మా భాగం మాకు తొందరగా ఇచ్చి వెయ్యి."[7] అని అంటారు.

17. (ఓ ముహమ్మద్!) వారి మాటల యెడల నీవు సహనం వహించు మరియు బలవంతుడైన, మా దాసుడు దావూద్ ను జ్ఞాపకం చేసుకో.[8] నిశ్చయంగా, అతను ఎల్లప్పుడూ పశ్చాత్తాపంతో

---

[5] అయ్ కహ్ వాసుల గాథ కొరకు చూడండి, 26:176.

[6] పునరుత్థాన దినమున ఇస్రాఫీల్ ('అ.స.) ఊదే బాకా ధ్వని, అరుపు, ప్రేలుడు గర్జన లేక శబ్దం. ఇంకా చూడండి, 36:29, 49, 53.

[7] అంటే వారు పునరుత్థాన దినం గురించి పరిహాసం చేస్తూ: 'ఆ దినం రాకముందే మా భాగపు శిక్ష మాకు ఇవ్వు' అని అంటున్నారు. చూడండి, 8:32.

[8] అల్లాహ్ (సు.తా.) కు ప్రియమైనవి దావూద్ ('అ.స.) నమా'జ్ మరియు అతని ఉపవాసం. అతను సగం రాత్రి నిద్రపోయేవారు, లేచి మూడోవంతు రాత్రి నమా'జ్ చేసేవారు. రోజు విడిచి రోజు ఉపవాసం ఉండేవారు. అతను యుద్ధరంగాన్ని విడిచి ఎన్నడూ పారిపోలేదు ('స'హీ'హ్ బు'ఖారీ, ముస్లిం).

(అల్లాహ్ వైపునకు) మరలుతూ ఉండేవాడు.

18. నిశ్చయంగా, మేము పర్వతాలను అతనితో బాటు సాయంత్రం మరియు ఉదయం మా పవిత్రతను కొనియాడుతూ ఉండేటట్లు చేశాము.

19. మరియు పక్షులు కూడా గుమికూడేవి అంతా కలసి ఆయన(అల్లాహ్) వైపుకు మరలేవారు

20. మరియు మేము అతని సామ్రాజ్యాన్ని పటిష్టపరిచాము మరియు మేము అతనికి వివేకాన్ని మరియు తిరుగులేని తీర్పు చేయడంలో, నేర్పరితనాన్ని ప్రసాదించాము.

21. మరియు తగవులాడుకొని వచ్చిన ఆ ఇద్దరి వార్త నీకు చేరిందా?[9] వారు గోడ ఎక్కి అతని ప్రార్థనా గదిలోకి వచ్చారు.

22. వారు దావూద్ వద్దకు వచ్చినపుడు, అతను వారిని చూసి బెదిరి పోయాడు. వారన్నారు: "భయపడకు! మేమిద్దరం ప్రత్యర్థులం, మాలో ఒకడు మరొకనికి అన్యాయం చేశాడు. కావున నీవు మా మధ్య న్యాయంగా తీర్పు చెయ్యి. మరియు నీతి మీరి నడువకు, మాకు సరైన మార్గం వైపునకు మార్గదర్శకత్వం చెయ్యి.

23. వాస్తవానికి, ఇతడు నా సోదరుడు, ఇతని వద్ద తొంబై తొమ్మిది ఆడ గొర్రెలున్నాయి. మరియు నా దగ్గర కేవలం ఒకే ఒక్క ఆడ గొర్రె ఉంది, అయినా ఇతడు అంటున్నాడు: 'దీనిని నాకివ్వు.'

---

[9] చాలామంది వ్యాఖ్యాతల ప్రకారం ఆ ఇద్దరు ప్రత్యర్థులు దైవదూతలు.

మరియు తన మాటల నేర్పులో తనన్ను వశపరచుకుంటున్నాడు."

24. (దావూద్) అన్నాడు: "వాస్తవంగా, నీ ఆడగొర్రెను తన గొర్రెలలో కలుపుకోవటానికి అడిగి, ఇతడు నీపై అన్యాయం చేస్తున్నాడు. మరియు వాస్తవానికి, చాలామంది భాగస్థులు ఒకరికొకరు అన్యాయం చేసుకుంటూ ఉంటారు, విశ్వసించి సత్కార్యాలుచేసేవారుతప్ప!కానిఅటువంటివారు కొందరు మాత్రమే!" వాస్తవానికి మేము అతనిని (దావూద్'ను) పరీక్షిస్తున్నా మని అతను అర్థం చేసుకున్నాడు. కాబట్టి తన ప్రభువును క్షమాపణ వేడుకున్నాడు. మరియు సాష్టాంగం (సజ్దా)లో పడిపోయాడు మరియు పశ్చాత్తాపంతో (అల్లాహ్ వైపుకు) మరలాడు.

25. అప్పుడు మేము అతనిని (ఆ తప్పును) క్షమించాము. మరియు నిశ్చయంగా, మా వద్ద అతనికి సాన్నిహిత్యం మరియు మంచి స్థానం కూడా ఉన్నాయి.

26. (మేము అతనితో ఇలా అన్నాము): "ఓ దావూద్! నిశ్చయంగా,మేమునిన్నుభూమిలోఉత్తరాధికారిగా నియమించాము. కావున నీవు ప్రజల మధ్య న్యాయంగాతీర్పుచెయ్యిమరియునీమనోకాంక్షలను అనుసరించకు, ఎందుకంటే అవి నిన్ను అల్లాహ్ మార్గం నుండి తప్పిస్తాయి." నిశ్చయంగా, ఎవరైతే అల్లాహ్ మార్గం నుండి తప్పిపోతారో, వారికి లెక్క దినమున మరచి పోయిన దాని ఫలితంగా, కఠినమైన

శిక్ష పడుతుంది.

27. మరియు మేము ఈ ఆకాశాన్ని మరియు ఈ భూమిని మరియు వాటి మధ్య ఉన్న దాన్నంతా వృథాగా సృష్టించలేదు! ఇది సత్యాన్ని తిరస్కరించిన వారి భ్రమ మాత్రమే.[10] కావున అట్టి సత్యతిరస్కారులకు నరకాగ్ని బాధ పడనున్నది!

28. ఏమీ? మేము విశ్వసించి, సత్కార్యాలు చేసేవారిని భూమిలో కల్లోలం రేకెత్తించే వారితో సమానులుగా చేస్తామా? లేక మేము దైవభీతిగలవారిని దుష్టులతో సమానులుగా చేస్తామా?[11]

29. (ఓ ముహమ్మద్!) మేము ఎంతో శుభవంతమైన ఈ గ్రంథాన్ని (ఖుర్ఆన్ ను) నీపై అవతరింప జేశాము. ప్రజలు దీని సూచనలను (ఆయాత్ లను) గురించి యోచించాలని మరియు బుద్ధిమంతులుదీనినుండిహితబోధగ్రహించాలని.

30. మరియు మేము దావూద్ కు సులైమాన్ ను ప్రసాదించాము. అతను ఉత్తమ దాసుడు! నిశ్చయంగా, అతను ఎల్లప్పుడు మా వైపునకు

---

[10] చూడండి, 3:191, 10:5.

[11] ఇహలోకంలో కొందరు దుర్మార్గులు ఎన్నో సుఖసంతోషాలను అనుభవిస్తూ ఉండవచ్చు మరియు దైవభీతి గల సద్పురుషులు ఆర్థిక మరియు భౌతిక కష్టాలకు గురి కావచ్చు. దీని అర్థం మేమిటంటే అల్లాహ్ (సు.తా.) దగ్గర ప్రతి దాని లెక్క ది కాబట్టి రాబోయే శాశ్వతమైన పరలోక జీవితంలో ప్రతి వానికి తన కర్మలకు తగిన ప్రతిఫలం దొరుకుతుంది. ఎవ్వరికీ ఎలాంటి అన్యాయం జరుగదు. అల్లాహ్ (సు.తా.) ప్రతి దానికి ఒక గడువు నియమించి ఉన్నాడు.

పశ్చాత్తాపంతో మరలుతూ ఉండేవాడు.

31. ఒకరోజు సాయంకాలం అతని ముందు మేలుజాతి, వడి గల గుర్రాలు ప్రవేశపెట్టబడి నప్పుడు

32. అతను అన్నాడు: "అయ్యో! వాస్తవంగా నేను నా ప్రభువు స్మరణకు బదులుగా ఈ సంపదను (గుర్రాలను) ప్రేమించాను." చివరకు (సూర్యుడు) కనుమరుగై పోయాడు.

33. (అతను ఇంకా ఇలా అన్నాడు): "వాటిని నా వద్దకు తిరిగి తీసుకురండి." తరువాత అతను వాటి పిక్కలను మరియు మెడలను నిమరసాగాడు.[12]

34. మరియు వాస్తవానికి మేము సులైమాన్ ను పరీక్షకు గురి చేశాము మరియు అతని సింహాసనంపై ఒక కళేబరాన్ని[13] పడవేశాము, అప్పుడతను పశ్చాత్తాపంతో మా వైపునకు మరలాడు.

35. అతను ఇలా ప్రార్థించాడు: "ఓ నా ప్రభూ! నన్ను క్షమించు, నా తరువాత మరెవ్వరికీ లభించనటువంటి సామ్రాజ్యాన్ని నాకు ప్రసాదించు. నిశ్చయంగా, నీవే సర్వప్రదుడవు!"

---

[12] ఆయత్ లు 32 మరియు 33 యొక్క ఈ అనువాదం ఇమామ్ ఇబ్నె-జరీర్ 'తబరీ వ్యాఖ్యానాన్ని అనుసరించి ఉంది.

[13] జసదన్: కళేబరం, దీనిని గురించిన వివరాలు ఖుర్ఆన్ మరియు 'హదీస్'లలో లేవు. ఒక బు'ఖారీ (ర'హ్మ) 'హదీస్' ప్రకారం : అది వికలాంగుడిగా పుట్టిన అతన కుమారుని శరీరం. నోబుల్ ఖుర్ఆన్ ఈ శబ్దాన్ని షై'తాన్ అని వివరించింది. అల్లాహు ఆలమ్.

**36.** అప్పుడు మేము గాలిని అతనికి వశ పరచాము. అది అతని ఆజ్ఞానుసారంగా, అతడు కోరిన వైపునకు తగినట్లుగా మెల్లగా వీచేది.[14]

**37.** మరియు షైతానులలో(జిన్నాతులలో) నుండి కూడా రకరకాల కట్టడాలు నిర్మించే వాటినీ మరియు సముద్రంలో మునిగి (ముత్యాలు తీసే) వాటినీ (అతనికి వశపరచి ఉన్నాము).

**38.** మరికొన్ని సంకెళ్ళతో బంధింపబడినవి కూడా ఉండేవి.

**39.** (అల్లాహ్ అతనితో అన్నాడు): "ఇది నీకు మా కానుక, కావున నీవు దీనిని (ఇతరులకు) ఇచ్చినా, లేక నీవే ఉంచుకున్నా, నీతో ఎలాంటి లెక్క తీసుకోబడదు."[15]

**40.** మరియు నిశ్చయంగా, అతనికి మాసాన్నిహిత్యం మరియు ఉత్తమగమ్యస్థానం ఉన్నాయి

**41.** మరియు మా దాసుడు అయ్యూబ్ ను గురించి ప్రస్తావించు; అతను తన ప్రభువుతో ఇలా మొరపెట్టుకున్నాడు: "నిశ్చయంగా షైతాన్ నన్ను ఆపదకు మరియు శిక్షకు గురిచేశాడు."[16]

---

[14] చూడండి, 21:81-82. అక్కడ తీవ్రమైన గాలి వీచినట్లు చెప్పబడింది. ఆ తీవ్రమైన గాలి కూడా అల్లాహ్ (సు.తా.) అనుమతితో సులైమాన్ ('అ.స.) ఇచ్ఛానుసారంగా వీచేది.

[15] సులైమాన్ ('అ.స.) ప్రార్థన ప్రకారం అతనికి ఒక గొప్ప రాజ్యాధికారం మరియు అతని సంపత్తుల నుండి తన ఇష్టం వచ్చిన వారికి ఇవ్వవచ్చని అనుమతి కూడా ఇవ్వబడింది.

[16] అయ్యూబ్ ('అ.స.) యొక్క పరీక్ష కూడా చాలా ప్రసిద్ధమైనది. అతను రోగంతో మరియు ధన, సంతాన నష్టంతో పరీక్షించబడ్డారు. అతనితోబాటు కేవలం అతని భార్య మాత్రమే మిగిలింది.

**42.** (మేము అతనితో అన్నాము): "నీ కాలును నేల మీద కొట్టు. అదిగో చల్ల (నీటి చెలిమ)! నీవు స్నానం చేయటానికి మరియు త్రాగుటకూను."

**43.** మరియు మేము అతని కుటుంబం వారిని మరియు వారితో బాటు, వారి వంటి వారిని మా కరుణతో అతనికి తిరిగి ఇచ్చాము మరియు బుద్ధిమంతులకు ఇది ఒక హితబోధ.[17]

**44.** (అల్లాహ్ అతనితో అన్నాడు): "ఒక పుల్లల కట్టను నీ చేతిలోకి తీసికొని దానితో (నీ భార్యను) కొట్టు మరియు నీ ఒట్టును భంగపరచుకోకు."[18] వాస్తవానికి, మేము అతనిని ఎంతో సహనశీలునిగా పొందాము. అతను ఉత్తమ దాసుడు! నిశ్చయంగా, ఎల్లపుడు మా వైపునకు పశ్చాత్తాపంతో మరలుతూ

---

[17] అల్లాహ్ (సు.తా.) చివరకు అయ్యూబ్ ('అ.స.) ప్రార్థనను అంగీకరించి అతని రోగాన్ని దూరం చేశాడు. మరియు అతను కోల్పోయిన ధనాన్ని, సంతానాన్ని తిరిగి ఇచ్చాడు. అంతేగాక అతనికి రెండింతలు అధికంగా ప్రసాదించాడు.

[18] రోగపీడితుడిగా ఉన్న కాలంలో అయ్యూబ్ ('అ.స.) కోపంతో తన భార్యను - ఆమె తెలియకుండా చేసిన ఒక అపరాధానికి క్రోధితుడై - నూరు కొరడా దెబ్బలు కొడతానని ప్రమాణం చేస్తారు. ఆ ప్రమాణం పూర్తి చేయటానికి అల్లాహ్ (సు.తా.) అతనితో నూరు పుల్లల కట్టతో ఒకసారి నీ భార్యను కొట్టి నీ ప్రమాణం పూర్తి చేసుకో అని ఆదేశిస్తాడు. చూడండి, 5:89. ఈ ఆజ్ఞ కేవలం అయ్యూబ్ ('అ.స.) కొరకేనా, లేక అందరి కొరకా అనే విషయంలో వ్యాఖ్యాతల మధ్య భేదాభిప్రాయాలున్నాయి. కొందరు అంటారు : ఒకవేళ మొదట ప్రమాణం చేసినప్పుడు కఠినంగా శిక్షించదలిచే అభిప్రాయం లేకుంటే ఇలా చేయవచ్చు, (ఫ'త్హ్ అల్-ఖదీర్). ఒక 'హదీస్' ద్వారా తెలుస్తోంది : ఒకసారి దైవప్రవక్త ('స'అస) ఒక బలహీనుడైన వ్యభిచారికి, నూరు కొరడా దెబ్బలకు బదులుగా నూరు పుల్లలున్న చీపురు కట్టతో ఒకేసారి కొట్టి వదిలారు (ముస్నద్ అ'హ్మద్, 5/222, ఇబ్నె మాజా).

ఉండేవాడు.

45. మరియు మా దాసులైన ఇబ్రాహీమ్, ఇస్'హాఖ్ మరియు యఅఖూబ్'లను జ్ఞాపకం చేసుకో! వారు గొప్ప కార్యశీలురు మరియు దూరదృష్టి గలవారు.

46. నిశ్చయంగా, మేము వారిని ఒక విశిష్ట గుణం కారణంగా ఎన్నుకున్నాము, అది వారి పరలోక చింతన.

47. మరియు నిశ్చయంగా, మా దృష్టిలో వారు ఎన్నుకోబడిన ఉత్తమ(పుణ్య)పురుషులలోని వారు!

48. మరియు ఇస్మాయీల్, అల్ యస్అ మరియు జుల్ కిఫ్ల్ [19] ను కూడా జ్ఞాపకం చేసుకో. మరియు వారందరూ ఎన్నుకొనబడిన ఉత్తమ పురుషులలోని వారు.

49. ఇది ఒక ప్రస్తావన. మరియు నిశ్చయంగా! దైవభీతి గలవారికి ఉత్తమ గమ్యస్థానం ఉంది.

50. శాశ్వతమైన స్వర్గవనాలు, వాటి ద్వారాలు వారి కొరకు తెరువబడి ఉంటాయి.

51. అందులో వారు దిండ్లను ఆనుకొని కూర్చొని; అందులో వారు అనేక ఫలాలను మరియు పానీయాలను అడుగుతూ ఉంటారు.

52. మరియు వారి దగ్గర సమవయస్కులు మరియు

---

[19] అల్-యస'అ (Elisha 'అ.స.), ఇల్యాస్ (Elijah, 'అ.స.) తరువాత వచ్చిన ప్రవక్త. యస'అ, 'అరబ్బీ పదం కాదు. జు'ల్-కిఫ్ల్ కొరకు చూడండి, 21:85.

తమ చూపులను వారి కొరకే ప్రత్యేకించుకొనే శీలవతులైన స్త్రీలు ఉంటారు[20].

53. లెక్కదినం కొరకు మీతో (దైవభీతి గలవారితో) చేయబడిన వాగ్దానం ఇదే!

54. నిశ్చయంగా, ఇదే మేమిచ్చే జీవనోపాధి. దానికి తరుగులేదు;

55. ఇదే (విశ్వాసులకు లభించేది). మరియు నిశ్చయంగా, తలబిరుసుతనం గల దుష్టులకు అతి చెడ్డ గమ్యస్థానం ఉంటుంది -

56. నరకం - వారందులో కాలుతారు. ఎంత బాధాకరమైన విరామ (నివాస) స్థలము.

57. ఇదే (దుష్టులకు లభించేది), కావున వారు దాని రుచి చూస్తారు; సలసలకాగే నీరు మరియు చీము.

58. ఇంకా ఇలాంటివే అనేకం ఉంటాయి!

59. "ఇదొక దళం, మీ వైపునకు త్రోయబడుతూ వస్తున్నది. వారికి ఎలాంటి స్వాగతం లేదు! నిశ్చయంగా, వారు నరకాగ్నిలో కాలుతారు."

---

[20] ఇలాంటి వివరణ ఖుర్ఆన్ లో మూడు సార్లు వచ్చింది. ఇక్కడ, 37:48 మరియు 55:56లలో. ఇంకా చూడండి, 4:124, 16:97 మరియు 40:40 9:72 విశ్వసించి సత్కార్యాలు చేసే వారంతా (పురుషులు, స్త్రీలు) స్వర్గవాసులవుతారు. కావున ప్రతి పురుషునికి శీలవతి, విశ్వాసురాలైన తన భార్య స్వర్గంలో సహవాసి ('జౌజ)గా ఉంటుంది. ఇంకా చూడండి, 36:56: 'వారు మరియు వారి సహవాసులు (అ'జ్వాజ్), చల్లని నీడలలో, ఆసనాల మీద ఆనుకొని హాయిగా కూర్చొని ఉంటారు.'

**60.** (సత్యతిరస్కారులు తమను మార్గం తప్పించిన వారితో) అంటారు: "అయితే మీకు కూడా స్వాగతం లేదు కదా! ఈ పర్యవసానాన్ని మా ముందుకు తెచ్చిన వారు మీరే కదా! ఎంత చెడ్డ నివాస స్థలము."

**61.** వారు ఇంకా ఇలా అంటారు: "ఓ మా ప్రభూ! మా యెదుట దీనిని (నరకాన్ని) తెచ్చిన వానికి రెట్టింపు నరకాగ్ని శిక్షను విధించు!" [21]

**62.** ఇంకా వారు ఇలా అంటారు: "మాకేమయింది? మనం చెడ్డవారిగా ఎంచిన వారు ఇక్కడ మనకు కనబడటం లేదేమిటి?

**63.** మనం ఊరికే వారిని ఎగతాళి చేశామా? లేదా వారు మనకు కనుమరుగయ్యారా?"

**64.** నిశ్చయంగా, ఇదే నిజం! నరకవాసులు ఇలాగే వాదులాడుకుంటారు.

**65.** (ఓ ముహమ్మద్!) వారితో ఇలా అను: "వాస్తవానికి నేను హెచ్చరించేవాడను మాత్రమే! అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్య దైవం లేడు! ఆయన అద్వితీయుడు తన సృష్టి మీద సంపూర్ణ అధికారం గలవాడు."[22]

**66.** ఆకాశాలు, భూమి మరియు వాటి మధ్య ఉన్న సమస్తానికి ప్రభువు, సర్వశక్తిమంతుడు,

---

[21] చూడండి, 7:38 మరియు 33:67-68. అక్కడ కూడా ఇలాగే అంటారు.

[22] అల్-వాహిద్-అల్-ఖహ్హార్ : అద్వితీయుడు-ప్రబలుడు, చూడండి, 6:18. వ్యాఖ్యానం 1

క్షమాశీలుడు."

**67.** వారితో అను: "ఇది (ఈ ఖుర్ఆన్) ఒక గొప్ప సందేశం.

**68.** దాని నుండి మీరు విముఖులవు తున్నారు!"

**69.** (ఓ ముహమ్మద్! ఇలా అను): "ఉన్నత స్థానాలలో ఉన్న ముఖ్యుల (దేవదూతల) మధ్య (ఆదమ్ సృష్టి గురించి) ఒకప్పుడు జరిగిన వివాదం గురించి నాకు తెలియదు.[23]

**70.** కాని అది నాకు దివ్యజ్ఞానం (వహీ) ద్వారానే తెలుపబడింది. వాస్తవానికి, నేను స్పష్టంగా హెచ్చరిక చేసేవాణ్ణి మాత్రమే!"

**71.** నీ ప్రభువు దేవదూతలతో ఇలా అన్న మాటను (జ్ఞాపకం చేసుకో): "నేను మట్టితో ఒక మనిషిని సృష్టించబోతున్నాను.[24]

**72.** ఇక ఎప్పుడైతే, నేను అతని సృష్టిని పూర్తి చేసి అతనిలో నా (తరఫు నుండి) ఆత్మను (జీవాన్ని) ఊదుతానో అప్పుడు,[25] మీరు అతని ముందు

---

[23] ఈ వివాదం గురించి చూడండి, 2:30-34. ఆదమ్ ('అ.స.) ను గురించి చూడండి, 7:11-18, 15:26-44, 17:61-65, 18:50, 38:69-85. ఈ ఆయత్ వీటన్నింటి కంటే మొదట అవతరింప జేయబడింది.

[24] బషరున్: అంటే ప్రదర్శన, ఇతరులకు కనిపించగలది.

[25] రూహున్: ఆత్మ (ప్రాణం), దీని యజమాని కేవలం అల్లాహ్ (సు.తా.) మాత్రమే. ఆత్మ అనేది అల్లాహ్ (సు.తా.) తప్ప ఇతరుల ఆధీనంలో లేదు. అది (ఆత్మ) ఊదగానే మానవుడు చలనంలోకి వస్తాడు. మానవునిలో అల్లాహ్ (సు.తా.) ఆత్మను ఊదాడు. ఇది ఎంత గౌరవప్రదమైన విషయం.

సాష్టాంగం (సజ్దా)లో పడిపోండి.[26]

**73.** అప్పుడు దేవదూతలందరూ కలసి అతనికి సజ్దా చేశారు.[27]

**74.** ఒక్క ఇబ్లీస్[28] తప్ప! అతడు గర్వితుడయ్యాడు మరియు సత్యతిరస్కారులలో కలిసి పోయాడు.

**75.** (అల్లాహ్) ఇలా అన్నాడు: "ఓ ఇబ్లీస్! నేను నా రెండు చేతులతో సృష్టించిన వానికి సాష్టాంగం (సజ్దా) చేయకుండా నిన్ను ఆపింది ఏమిటీ? నీవు గర్వితుడవై పోయావా! లేదా నిన్ను, నీవు ఉన్నత శ్రేణికి చెందిన వాడవనుకున్నావా?"

**76.** (ఇబ్లీస్) అన్నాడు: "నేను అతని కంటే శ్రేష్ఠుడను. నీవు నన్ను అగ్నితో సృష్టించావు మరియు అతనిని మట్టితో సృష్టించావు."

**77.** (అల్లాహ్) అన్నాడు: "ఇక ఇక్కడి నుండి వెళ్ళిపో! నిశ్చయంగా నీవు భ్రష్టుడవు.

---

[26] ఈ సజ్దా గౌరవార్థం చేసిందే. అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞను శిరసావహించటానికి. ఇది ఆరాధనగా చేసిన సజ్దా కాదు. దైవప్రవక్త ము'హమ్మద్ ('స'అస) సున్నత్ లో గౌరవార్థం చేసే సజ్దా కూడా హరాం చేయ బడింది. దైవప్రవక్త ('స'అస) ప్రవచనం : 'ఒకవేళ ఇది అనుమతిచబడి ఉంటే నేను స్త్రీకి తన భర్తకు సజ్దా చేసే అనుమతి ఇచ్చేవాడిని.' (తిర్మిజీ', అల్బానీ ప్రమాణీకం).

[27] దైవదూతలందరూ కలసి ఒకేసారి సజ్దా చేశారు.

[28] ఇబ్లీస్ దైవదూత కాడు, అతడు జిన్, అగ్నితో సృష్టించబడ్డాడు. దైవదూత('అ.స.)లు జ్యోతి (నూర్) తో సృష్టించబడ్డారు. ఆదమ్ కు దైవదూతలు సజ్దా చేసినప్పుడు అతడు అక్కడ ఉండి కూడా అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞను శిరసావహించలేదు, కాబట్టి అల్లాహ్ (సు.తా.) అతన్ని శపించాడు (బహిష్కరించాడు).

78. మరియు నిశ్చయంగా, తీర్పుదినం వరకు నీపై నా శాపం (బహిష్కారం) ఉంటుంది."
79. (అప్పుడు ఇబ్లీస్) ఇలా మనవి చేసుకున్నాడు: "ఓ నా ప్రభూ! మృతులు తిరిగి లేపబడే దినం వరకు నాకు వ్యవధినివ్వు!"
80. (అల్లాహ్) సెలవిచ్చాడు: "సరే! నీకు వ్యవధి ఇవ్వబడుతోంది!
81. ఆ నియమిత దినపు ఆ గడువు వచ్చే వరకు."
82. (ఇబ్లీస్) అన్నాడు: "నీ శక్తి సాక్షిగా నేను వారందరినీ తప్పు దారి పట్టిస్తాను;
83. వారిలో నుండి నీవు ఎన్నుకున్న నీ దాసుల్ని తప్ప!"
84. (అల్లాహ్) అన్నాడు: "అయితే సత్యం ఇదే! మరియు నేను సత్యం పలుకుతున్నాను;
85. నీవు మరియు వారిలో నుండి నిన్ను అనుసరించే వారందరితో నేను నరకాన్ని నింపుతాను!"
86. (ఓ ప్రవక్తా!) వారితో అను: "నేను దీని (ఈ సందేశం) కొరకు మీ నుండి, ఎలాంటి ప్రతిఫలాన్ని అడగటం లేదు మరియు నేను వంచకులలోని వాడను కాను.
87. ఇది (ఈ ఖుర్ఆన్) సమస్త లోకాల వారందరికీ కేవలం ఒక జ్ఞాపిక (హితబోధ)!
88. మరియు అచిర కాలంలోనే దీని ఉద్దేశాన్ని (వార్తను) మీరు తప్పక తెలుసుకుంటారు."

# 39. అజ్-జుమర్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఈ గ్రంథ (ఖుర్ఆన్) అవతరణ సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడైన అల్లాహ్ తరఫు నుండి జరిగింది.

2. (ఓ ముహమ్మద్!) నిశ్చయంగా మేము ఈ గ్రంథాన్ని, సత్యంతో నీపై అవతరింపజేశాము. కావున నీవు అల్లాహ్ నే ఆరాధిస్తూ నీ భక్తిని కేవలం ఆయన కొరకే ప్రత్యేకించుకో!

3. వినండి! భక్తి కేవలం అల్లాహ్ కొరకు మాత్రమే ప్రత్యేకించబడింది! ఇక ఆయనను వదలి ఇతరులను సంరక్షకులుగా చేసుకునే వారు (ఇలా అంటారు): "వారు మమ్మల్ని అల్లాహ్ సాన్నిధ్యానికి చేర్చుతారని మాత్రమే మేము వారిని ఆరాధిస్తున్నాము!"[1] నిశ్చయంగా అల్లాహ్ వారిలో ఉన్న భేదాభిప్రాయాలకు

---

[*] [అజ్-జుమర్ అంటే బృందాలు]

[1] సిఫారస్: అల్లాహ్ (సు.తా.) దగ్గర ఎవరి సిఫారసూ చెల్లదు. ఆయన అనుమతించిన వారి సిఫారస్ తప్ప! వారు దైవదూతలు గానీ ప్రవక్తలు గానీ లేక సద్పురుషులు కావచ్చు. కాని ముఖ్య విషయమేమిటంటే, అల్లాహ్ (సు.తా.), తనకు తప్ప ఇతరులకు ఆరాధన / దాస్యం , చేయటాన్ని ఎన్నటికీ క్షమించడు. దైవత్వంలో ఆయనకు భాగస్వాములను కల్పిస్తే, ఆయన (సు.తా.) దానిని ఎన్నటికీ క్షమించడు. అది తప్ప ఇతర ఏ పాపాన్నైనా, తాను కోరిన వారిని క్షమించవచ్చు!

తగినట్లుగా వారి మధ్య తీర్పు చేస్తాడు[2]. నిశ్చయంగా, అల్లాహ్ అసత్యవాదికి, కృతఘ్నునికి మార్గదర్శకత్వం చేయడు[3].

4. ఒకవేళ అల్లాహ్ ఎవరినైనా కుమారునిగా చేసుకోదలిస్తే[4], తన సృష్టిలో తాను కోరిన వానిని ఎన్నుకొని ఉండేవాడు. ఆయన సర్వలోపాలకు అతీతుడు. ఆయన అల్లాహ్! అద్వితీయుడు, తన సృష్టి మీద సంపూర్ణ అధికారం (ప్రాబల్యం) గలవాడు[5].

5. ఆయన ఆకాశాలను మరియు భూమిని సత్యంతో సృష్టించాడు[6]. ఆయన రాత్రిని పగటి మీద చుట్టుతున్నాడు. మరియు పగటిని రాత్రి మీద చుట్టుతున్నాడు[7]. సూర్యుణ్ణి మరియు చంద్రుణ్ణి నియమబద్ధులుగా చేసి ఉంచాడు. వాటిలో ప్రతి ఒక్కటీ ఒక నిర్ణీత కాలంలో (నిర్ణీత పరిధిలో) పయనిస్తూ ఉన్నాయి. వినండి! ఆయన, సర్వశక్తిమంతుడు, క్షమించేవాడు.

6. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి (ఆదమ్) నుండి సృష్టించాడు. తరువాత అతని నుండి అతని జంట

---

[2] అంటే ఆరాధించినవారి మరియు ఆరాధించబడేవారి మధ్య, తీర్పు చేస్తాడు. ఇంకా చూడండి, 34:31-33

[3] చూడండి, 6:22-24

[4] చూడండి, 6:100. అల్లాహ్ (సు.తా.) సంతానపు లోభానికి అతీతుడు. నిరపేక్షాపరుడు.

[5] చూడండి, 6:18 వ్యాఖ్యానం 1.

[6] చూడండి, 10:5.

[7] చూడండి, 7:54

(జౌజ్) ను పుట్టించాడు[8]. మరియు మీ కొరకు ఎనిమిది జతల (ఆడ మగ) పశువులను పుట్టించాడు[9]. ఆయన మిమ్మల్ని మీ తల్లుల గర్భాలలో మూడు చీకటి తెరలలో ఒక రూపం తరువాత మరొక రూపాన్ని ఇచ్చాడు[10]. ఆయనే అల్లాహ్! మీ ప్రభువు. విశ్వాధిపత్యం ఆయనదే. ఆయన తప్ప మరొక ఆరాధ్య దేవుడు లేడు. అలాంటప్పుడు మీరు ఎలా (సత్యం నుండి) తప్పించబడుతున్నారు?

7. ఒకవేళ మీరు సత్యాన్ని తిరస్కరిస్తే నిశ్చయంగా, అల్లాహ్ మీ అక్కరలేని వాడు[11]. మరియు ఆయన తన దాసులు సత్యతిరస్కార వైఖరిని అవలంబించడాన్ని ఇష్ట పడడు. మరియు మీరు కృతజ్ఞులైనట్లయితే ఆయన మీపట్ల ఎంతో సంతోషపడతాడు. మరియు బరువు మోసే వాడు ఎవ్వడూ ఇతరుల బరువును మోయడు[12]. చివరకు మీరందరికీ, మీ ప్రభువు వైపునకే

---

[8] చూడండి, 4:1. 'జౌజ: అంటే, జంట, జత, సహచరి, సహవాసి అనే అర్థాలున్నాయి.

[9] అంటే గొర్రె, మేక, ఆవు మరియు ఒంటె. ఇవ్ ఆడ-మగ కలిసి ఎనిమిది అవుతాయి, వివరాలు 6:143-144 లలో వచ్చాయి.

[10] ఈ తెరలు: 1) తల్లి కడుపు (Abdominal Wall), 2) గర్భాశయం (Uterine Wall), 3) మావిపొర (Amniotic Membrane). ఇంకా చూడండి, 22:5, 23:12-14.

[11] చూడండి, 14:8.

[12] ఈ వాక్యం ఖుర్ఆన్ లో ఐదుసార్లు వచ్చింది. ఇక్కడ మరియు 6:164, 17:15, 35:18, మరియు 53:38. ఇది: 'ఏసు క్రీస్తు, క్రైస్తవులందరి పాపభారాన్ని భరిస్తారు.' అని క్రైస్తవులు అనే సిద్ధాంతాన్ని ఖండిస్తోంది.

మరలవలసి ఉంది! అప్పుడు ఆయన, మీరు ఏమేమి చేస్తూ ఉండేవారో మీకు తెలియ జేస్తాడు. నిశ్చయంగా ఆయనకు హృదయాలలో ఉన్న విషయాలన్నీ బాగా తెలుసు.

**8.** మానవునికి ఏదైనా కష్టం కలిగినప్పుడు అతడు పశ్చాత్తాపంలో తన ప్రభువు వైపునకు మరలి ఆయనను వేడుకుంటాడు. తరువాత ఆయన (అల్లాహ్) అతనికి తన అనుగ్రహాన్ని ప్రసాదించి నప్పుడు, అతడు పూర్వం దేనిని గురించి వేడుకుంటూ ఉండేవాడో దానిని మరచిపోతాడు. మరియు అల్లాహ్ కు సాటి కల్పించి, (ఇతరులను) ఆయన మార్గం నుండి తప్పిస్తాడు[13]. (అలాంటి వానితో) ఇలా అను: "నీవు, నీ సత్యతిరస్కార వైఖరితో కొంత కాలం సంతోషపడు. నిశ్చయంగా, నీవు నరకవాసుల్లోని వాడవవుతావు!"

**9.** ఏమీ? ఎవడైతే శ్రద్ధతో రాత్రిఘడియలలో సాష్టాంగం (సజ్దా) చేస్తూ మరియు నిలిచి (నమాజ్) చేస్తూ, పరలోక(జీవిత)మును గురించి భయపడుతూ, తన ప్రభువు కారుణ్యాన్ని ఆశిస్తూ ఉంటాడో! (అలాంటి వాడు, అలా చేయని వాడితో సమానుడా)? వారినడుగు: "ఏమీ? విజ్ఞానులు మరియు అజ్ఞానులు సరిసమానులు కాగలరా? వాస్తవానికి బుద్ధిమంతులే హితబోధ స్వీకరిస్తారు."

**10.** (ఓ ముహమ్మద్!) అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడని)

---

[13] చూడండి, 2:22.

అను: "ఓ విశ్వసించిన నా దాసులారా! మీ ప్రభువు నందు భయభక్తులు కలిగి ఉండండి. ఎవరైతే ఈ లోకంలో సత్పురుషులై ఉంటారో (వారికి పరలోకంలో) మేలు జరుగుతుంది. మరియు అల్లాహ్ భూమి చాలా విశాలమైనది[14]. నిశ్చయంగా, సహనం వహించిన వారికి లెక్క లేనంత ప్రతిఫలం ఇవ్వబడుతుంది."

11. (ఓ ముహమ్మద్! ఇంకా) ఇలా అను: "నిశ్చయంగా, నేను అల్లాహ్ ను మాత్రమే ఆరాధిస్తూ, నా భక్తిని కేవలం ఆయన కొరకే ప్రత్యేకించుకోవాలని ఆజ్ఞాపించబడ్డాను.

12. మరియు నేను అందరి కంటే ముందు (అల్లాహ్ కు) విధేయుడను (ముస్లిం) అయి ఉండాలి" అని కూడా ఆజ్ఞాపించబడ్డాను.

13. (ఇంకా) ఇలా అను: "ఒకవేళ నేను నా ప్రభువుకు అవిధేయుడనైతే ఆ మహా దినపు శిక్షకు గురి అవుతానని భయపడుతున్నాను."

14. (ఇంకా) ఇలా అను: "నేను కేవలం అల్లాహ్ నే ఆరాధిస్తూ నా భక్తిని (ఆరాధనను) కేవలం ఆయన కొరకే ప్రత్యేకించుకుంటాను;

15. కావున మీరు ఆయనను వదలి మీకు ఇష్టమైన

---

[14] పాపం మరియు సత్యతిరస్కారం నుండి - పుణ్యం, సత్యం మరియు అల్లాహ్ (సు.తా.) వైపునకు - మరలే అవకాశం ఎల్లప్పుడూ ఉంది. ఇదే వాస్తవమైన 'హిజ్రత్' వలసపోవటం. ఇంకా చూడండి, 4:97. ఒక వ్యక్తికి తన నివాసస్థలంలో ఉంటూ ఈమాన్ పై ఉండటం దుర్భరమైతే! అతడు ఇతర చోట్లకు హిజ్రత్ చేసి తన ధర్మాన్ని కాపాడుకోవాలి.

వారిని ఆరాధించండి!" ఇంకా ఇలా అను: "పునరుత్థాన దినమున తమకు తాము మరియు తమ కుటుంబం వారికి నష్టం కలిగించు కున్న వారే నిశ్చయంగా నష్టపడ్డ వారు. వాస్తవానికి అదే స్పష్టమైన నష్టం!"

16. వారిని, వారిపై నుండి అగ్ని జ్వాలలు క్రమ్ముకుంటాయి మరియు వారి క్రింది నుండి (అగ్ని జ్వాలలు) క్రమ్ముకుంటాయి. ఈ విధంగా, అల్లాహ్ తన దాసులను భయపెడుతున్నాడు[15]: "ఓ నా దాసులారా! నా పట్ల మాత్రమే భయభక్తులు కలిగి ఉండండి."

17. మరియు ఎవరైతే కల్పిత దైవాలను (తాగూత్ లను) త్యజించి, వాటిని ఆరాధించకుండా, పశ్చాత్తాపంతో అల్లాహ్ వైపునకు మరలుతారో! వారికి శుభవార్త ఉంది[16] కావున నా దాసులకు ఈ శుభవార్తను ఇవ్వు.

18. ఎవరైతే మాటను శ్రద్ధగా విని, అందులోని ఉత్తమమైన దానిని అనుసరిస్తారో! అలాంటి వారే, అల్లాహ్ మార్గదర్శకత్వం పొందిన వారు మరియు అలాంటి వారే బుద్ధిమంతులు.

19. ఏమీ? ఎవడిని గురించి అయితే ఆయన (అల్లాహ్ తరఫు నుండి) శిక్ష నిర్ణయించబడి ఉందో, వానిని

---

[15] ఇక్కడ అల్లాహ్ (సు.తా.) తన దాసులను మరొకసారి: 'నరకాగ్ని నుండి మిమ్మల్ని మీరు కాపాడు కోండి.' అని హెచ్చరిస్తున్నాడు. ఈ విధమైన హెచ్చరిక ఖుర్ఆన్ లో ఎన్నో సార్లు వచ్చింది. చూ, 74:35-36.

[16] చూడండి, 10:62-64.

నీవు నరకాగ్నిలో నుండి బయటికి తీయగలవా?
20. కాని ఎవరైతే తమ ప్రభువు యెడల భయభక్తులు
కలిగి ఉన్నారో! వారి కొరకు అంతస్తుపై అంతస్తుగా,
కట్టబడిన ఎత్తైన భవనాలు ఉంటాయి. వాటి క్రింద
సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి. ఇది అల్లాహ్
వాగ్దానం. అల్లాహ్ తన వాగ్దానాన్ని ఎన్నడూ
భంగ పరచడు.
21. ఏమీ? నీకు తెలియదా? నిశ్చయంగా, అల్లాహ్
ఆకాశం నుండి నీటిని కురిపించి, తరువాత దానిని
భూమిలో ఊటలుగా ప్రవహింప జేస్తున్నాడని?
ఆ తరువాత దాని వల్ల వివిధ రంగుల వృక్షకోటిని
ఉత్పత్తి చేస్తాడు. ఆ తరువాత అది ఎండిపోయి
నపుడు, నీవు దానిని పసుపు రంగుగా
మారిపోవటాన్ని చూస్తావు. చివరకు ఆయన
దానిని పొట్టుగా మార్చి వేస్తాడు. నిశ్చయంగా
ఇందులో బుద్ధిమంతులకు హితబోధ ఉంది.
22. ఏమీ? ఏ వ్యక్తి హృదయాన్నైతే అల్లాహ్ విధేయత
(ఇస్లాం) కొరకు తెరుస్తాడో, అతడు తన ప్రభువు
చూపిన వెలుగులో నడుస్తూ ఉంటాడో (అలాంటి
వాడు సత్యతిరస్కారితో సమానుడు కాగలడా?)
ఎవరి హృదయాలైతే అల్లాహ్ హితోపదేశం పట్ల
కఠినమై పోయాయో, అలాంటి వారికి వినాశం
ఉంది. అలాంటి వారు స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో
పడి ఉన్నారు!
23. అల్లాహ్ సర్వశ్రేష్ఠమైన బోధనలను ఒక గ్రంథ
రూపంలో అవతరింపజేశాడు. దానిలో ఒకే

రకమైన వాటిని (వచనాలను) మాటిమాటికీ ఎన్నో విధాలుగా (విశదీకరించాడు)[17]. తమ ప్రభువుకు భయపడే వారి శరీరాలు (చర్మాలు) దానితో (ఆ పఠనంతో) గజగజ వణుకుతాయి. కాని తరువాత వారి చర్మాలు మరియు వారి హృదయాలు అల్లాహ్ ధ్యానం వలన మెత్తబడ తాయి. ఇది అల్లాహ్ మార్గదర్శకత్వం. ఆయన దీనితో తాను కోరిన వారికి మార్గదర్శకత్వం చేస్తాడు. మరియు ఏ వ్యక్తిని అల్లాహ్ మార్గభ్రష్టత్వంలో వదలుతాడో, అతనికి మార్గదర్శకుడు ఎవ్వడూ ఉండడు[18].

**24.** ఏమీ? పునరుత్థాన దినవు కఠినమైన శిక్షను తన ముఖంతో కాపాడు కోవలసిన వాడు (స్వర్గంలో ప్రవేశించేవానితో సమానుడా)? మరియు (ఆ రోజు) దుర్మార్గులతో ఇలా అనబడు తుంది: "మీరు సంపాదించిన దానిని రుచి చూడండి."

**25.** వీరికి పూర్వమున్న వారు కూడా (అల్లాహ్ సందేశాలను) అబద్ధాలని తిరస్కరించారు, కాబట్టి వారు ఊహించలేని దిశ నుండి వారిపై శిక్ష వచ్చి పడింది.

**26.** ఈవిధంగా, అల్లాహ్ వారికి ఇహలోక జీవితంలో కూడా అవమానాన్ని రుచి చూపాడు[19]. మరియు

---

[17] చూడండి, 4:82 మరియు 25:32.

[18] చూడండి, 14:4

[19] చూడండి, 16:26.

వారి పరలోక శిక్ష దీని కంటే ఎంతో ఘోరమైనదిగా ఉంటుంది. వారు ఇది గ్రహిస్తే ఎంత బాగుండేది!

**27.** మరియు వాస్తవానికి మేము ఈ ఖుర్ఆన్ లో ప్రజల కొరకు అనేక రకాల దృష్టాంతాలు పేర్కొన్నాము, బహుశా వారు గుణపాఠం నేర్చుకుంటారని;

**28.** అరబ్బీ భాషలో ఉన్న ఈ ఖుర్ఆన్ ను[20], ఏ విధమైన వక్రత లేకుండా అవతరింప జేశాము; బహుశా వారు దైవభీతి కలిగి వుంటారని.

**29.** అల్లాహ్ ఒక దృష్టాంతం ఇస్తున్నాడు: ఒక మానవుడు (బానిస) పరస్పరం విరోధమున్న ఎంతో మంది యజమానులకు చెందినవాడు. మరొక మానవుడు (బానిస) పూర్తిగా ఒకే ఒక్క యజమానికి చెందిన వాడు, వారిద్దరి పరిస్థితి సమానంగా ఉంటుందా?[21] సర్వస్తోత్రాలకు అర్హుడు అల్లాహ్ మాత్రమే! కాని వారిలో చాలా మందికి ఇది తెలియదు.

**30.** (ఓ ముహమ్మద్!) నిశ్చయంగా, (ఒక రోజు) నీవు మరణిస్తావు మరియు నిశ్చయంగా వారు

---

[20] చూడండి, 12:2, 13:37, 14:4 మరియు 41:44.

[21] ఇదే విధంగా ఎంతోమంది దైవాలను ఆరాధించేవాడు, ఒకే అల్లాహ్ (సు.తా.)ను ఆరాధించే వాడితో సమానుడు కాలేడు. బహుదైవారాధకుడు ఎల్లప్పుడు వారి కలహాలలో మునుగి ఉంటాడు.

కూడా మరణిస్తారు[22].

**31.** ఆ తరువాత నిశ్చయంగా, పునరుత్థాన దినమున మీరంతా మీ ప్రభువు సమక్షంలో మీ వివాదాలను విన్నవించుకుంటారు.

**32.** ఇక అల్లాహ్ ను గురించి అసత్యం కల్పించి, సత్యం తనముందుకువచ్చినప్పుడుదానినితిరస్కరించే వాని కంటే పరమ దుర్మార్గుడెవడు? అందుకే! సత్యతిరస్కారులకు కేవలం నరకంలోనే కదా నివాసం ఉండేది?

**33.** మరియు సత్యాన్ని తెచ్చినవాడూ మరియు దానిని హృదయపూర్వకంగా నమ్మిన వాడూ, ఇలాంటి వారే దైవభీతి గలవారు.

**34.** వారికి తమ ప్రభువు వద్ద వారు కోరిందంతా లభిస్తుంది. ఇదే సజ్జనులకు దొరికే ప్రతిఫలం[23]

**35.** దానికి బదులుగా అల్లాహ్, వారు చేసిన ఘోర పాపకార్యాలను రద్దు చేయటానికి మరియు వారు చేస్తూ వచ్చిన మంచి పనులకు అత్యుత్తమ ప్రతిఫలం ఇవ్వటానికి!

---

[22] చూడండి, 3:144 ఇతర మానవుల వలే దైవప్రవక్త ('స'అస) కు కూడా మరణం వచ్చింది. పునరుత్థాన దినం వరకు అతను కూడా బర్'జఖ్ లో ఉంటారు.

[23] ము'హ్సినీన్: దీనికిసజ్జనులు, పుణ్యవంతులు, సత్పురుషులు మొదలైన అర్థాలున్నాయి. దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'మీరు అల్లాహ్ (సు.తా.)ను ఆరాధించేటప్పుడు మీరు ఆయన (సు.తా.)ను చూస్తున్నారని భావించండి. అది సాధ్యం కాకపోతే కనీసం ఆయన (సు.తా.) మిమ్మల్ని చూస్తున్నాడని భావించండి. (అన్ త'అబుదల్లాహ్ క అన్నక తరాహు; ఫ ఇన్ లమ్ తకున్ తరాహు, ఫ ఇన్నహు యరాక'.

**36.** ఏమిటి? అల్లాహ్ తన దాసునికి చాలడా? అయినా వారు ఆయన (అల్లాహ్) ను విడిచి, ఇతరులను గురించి నిన్ను భయపెడుతున్నారు. మరియు అల్లాహ్ మార్గభ్రష్టత్వంలో పడనిచ్చిన వానికి మార్గదర్శకుడు ఎవ్వడూ ఉండడు.

**37.** మరియు అల్లాహ్ మార్గదర్శకత్వం చేసిన వానిని, మార్గభ్రష్టుడు చేయగల వాడెవ్వడూ లేడు! ఏమీ? అల్లాహ్ సర్వశక్తిమంతుడు, ప్రతీకారం చేయగలవాడు కాడా?

**38.** మరియు ఒకవేళ నీవు వారితో: "భూమ్యాకాశాలను సృష్టించింది ఎవరు?" అని అడిగితే, వారు నిశ్చయంగా: "అల్లాహ్!" అని అంటారు[24]. వారిని ఇలా అడుగు: "ఏమీ? మీరు ఆలోచించరా? అల్లాహ్ ను వదలి మీరు ఆరాధించేవి - అల్లాహ్ నాకు కీడు చేయదలచుకుంటే - ఆయన కీడు నుండి, నన్ను తప్పించగలవా? లేక, ఆయన (అల్లాహ్) నన్ను కరుణించ గోరితే ఇవి ఆయన కారుణ్యాన్ని ఆపగలవా?" వారితో ఇంకా ఇలా అను: "నాకు కేవలం అల్లాహ్ చాలు! ఆయన (అల్లాహ్) ను నమ్మేవారు (విశ్వాసులు), కేవలం ఆయన మీదే నమ్మక ముంచుకుంటారు."

**39.** (ఓ ముహమ్మద్!)వారితో ఇలా అను: "ఓ నా జాతిప్రజలారా! మీరు మీఇష్టప్రకారం మీ పని చేస్తూ ఉండండి;నిశ్చయంగా నేనూ నాపని చేస్తూ ఉంటాను తరువాత మీరు తెలుసుకోగలరు.

---

[24] ఇటువంటి వాక్యానికి చూడండి, 31:25.

**40.** (ఇహలోకంలో) ఎవరి మీద అవమానకరమైన శిక్ష వచ్చిపడుతుందో మరియు (పరలోక జీవితంలో) ఎవరి మీద శాశ్వతమైన శిక్ష పడనున్నదో!"

**41.** నిశ్చయంగా, మేము మానవులందరి కొరకు, ఈ గ్రంథాన్ని, సత్యంతో నీపై అవతరింప జేశాము. కావున సన్మార్గంపై నడిచేవాడు తన మేలు కొరకే అలాచేస్తాడు. మరియు నిశ్చయంగా, మార్గభ్రష్టుడైన వాడు తన కీడు కొరకే మార్గభ్రష్టుడవుతాడు. మరియు నీవు వారి కొరకు బాధ్యుడవు కావు[25].

**42.** అల్లాహ్ యే ఆత్మలను (ప్రాణాలను) మరణ కాలమున వశపరచుకునేవాడు మరియు మరణించని వాడి (ఆత్మలను) నిద్రావస్థలో (వశపరచుకునే వాడునూ). తరువాత దేనికైతే మరణం నిర్ణయింప బడుతుందో దానిని ఆపుకొని, మిగతా వారి (ఆత్మలను) ఒక నియమిత కాలం వరకు తిరిగి పంపుతాడు[26]. నిశ్చయంగా ఇందులో ఆలోచించే వారికి గొప్ప సూచనలు (ఆయాత్) ఉన్నాయి.

**43.** ఏమీ? వారు అల్లాహ్ ను వదలి ఇతరులను సిఫారసుదారులుగా చేసుకున్నారా? వారిని ఇలా అడుగు: "ఏమీ? వారికెలాంటి అధికారం లేకున్నా

[25] చూడండి, 17:2.
[26] చూడండి, 6:60-61.

మరియు వారికి బుద్ధి లేకున్నా నా?"[27]

**44.** ఇలా అను: "సిఫారసు కేవలం అల్లాహ్ అధీనంలోనే ఉంది. భూమ్యాకాశాల సామ్రాజ్యాధిపత్యం కేవలం ఆయనకే చెందుతుంది. తరువాత ఆయన వైపునకే మీరంతా మరలింప బడతారు."

**45.** మరియు ఒకవేళ అద్వితీయుడైన అల్లాహ్ ను గురించి ప్రస్తావన జరిగినపుడు, పరలోకాన్ని విశ్వసించని వారి హృదయాలు క్రుంగిపోతాయి. మరియు ఒకవేళ ఆయన తప్ప ఇతరుల ప్రస్తావన జరిగినపుడు వారు సంతోషంతో పొంగిపోతారు!

**46.** ఇలా అను: "ఓ అల్లాహ్! భూమ్యాకాశాల సృష్టికి మూలాధారుడా! అగోచర గోచరాలను ఎరిగినవాడా! నీవే నీ దాసుల మధ్య ఉన్న భేదాభిప్రాయాలను గురించి తీర్పు చేసే వాడవు."

**47.** మరియు ఒకవేళ వాస్తవానికి ఈ దుర్మార్గుల వద్ద భూమిలో ఉన్న సమస్తమూ మరియు దానితో పాటు దానంత (రెట్టింపు) సంపద ఉన్నా పునరుత్థాన దినపు ఘోరశిక్ష నుండి

---

[27] చూడండి, 2:255. అల్లాహ్ (సు.తా.) అనుమతిచ్చిన వాడు తప్ప మరెవ్వరూ సిఫారసు చేయలేరు. ఇంకా చూడండి 20:109, 21:28 లేక 34:23. పునరుత్థాన దినమున అల్లాహ్ (సు.తా.) తన ప్రవక్తలకు సిఫారసు చేయటానికి అనుమతిస్తాడు, అలాంటి వారి కొరకు ఎవరి పశ్చాత్తాపాన్నైతే అల్లాహ్ (సు.తా.) అంగీకరించాడో! చూడండి, 19:87. అల్లాహ్ (సు.తా.) దగ్గర ఎవ్వరి సిఫారసు అవసరం లేదు. ఆయన సర్వజ్ఞుడు. ఆయన తాను కోరినదే చేస్తాడు. అలాంటప్పుడు కేవలం ఆ ఏకైక ప్రభువు, అల్లాహ్ (సు.తా.) ఆరాధననే ఎందుకు చేయకూడదు? అప్పుడు ఎవ్వరి సిఫారసు అవసరముండదు.

తప్పించుకోవటానికి, వారు దానిని పరిహారంగా ఇవ్వగోరుతారు[28]. ఎందుకంటే! అల్లాహ్ తరఫు నుండి వారి ముందు, వారు ఎన్నడూ లెక్కించనిదంతా ప్రత్యక్షమవుతుంది.

**48.** మరియు వారు చేసి వున్న దుష్టకార్యాలన్నీ స్పష్టంగా వారి ముందుకు వస్తాయి. మరియు వారు ఎగతాళి చేస్తూ వచ్చిందే వారిని చుట్టుకుంటుంది.

**49.** ఒకవేళ మానవునికి ఆపద వస్తే అతడు మమ్మల్ని వేడుకుంటాడు. ఆ తరువాత మేము మా దిక్కు నుండి అతనికి అనుగ్రహాన్ని ప్రసాదిస్తే అతడు: "నిశ్చయంగా, ఇది నాకున్న తెలివి వల్ల నాకు ఇవ్వబడింది!"[29] అని అంటాడు. వాస్తవానికి, అది ఒక పరీక్ష, కాని చాలా మంది ఇది తెలుసుకోలేరు.

**50.** వాస్తవానికి, వీరికి పూర్వం గతించిన వారు కూడా ఇలాగే అన్నారు, కాని వారు సంపాదించినదంతా వారికి ఏ విధంగానూ పనికి రాలేదు.

**51.** కావున, వారు చేసిన దుష్కార్యాల ఫలితాలు వారిపై పడ్డాయి. మరియు వారిలోని దుర్మార్గులు తాము చేసిన దుష్కార్యాల ఫలితాలను త్వరలోనే అనుభవించగలరు. మరియు వారు ఏ విధంగానూ తప్పించుకోలేరు.

---

[28] చూడండి, 3:91. కాని అది, స్వీకరించబడదు. దీనికి ఇంకా చూడండి 2:48.

[29] చూడండి, 28:78.

52. ఏమీ? వారికి తెలియదా? నిశ్చయంగా అల్లాహ్ తాను కోరిన వారికి జీవనోపాధిని పుష్కలంగా ప్రసాదిస్తాడని మరియు (తాను కోరిన వారికి) మితంగా ఇస్తాడని? నిశ్చయంగా, ఇందులో విశ్వసించేవారికి ఎన్నో సూచనలు (ఆయాత్) ఉన్నాయి.

53. ఇలా అను: "స్వయంగా మీకు (మీ ఆత్మలకు) మీరే అన్యాయం చేసుకున్న నా దాసులారా! అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి. నిశ్చయంగా, అల్లాహ్ అన్ని పాపాలను క్షమిస్తాడు[30]. నిశ్చయంగా ఆయన! కేవలం ఆయనే క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత."

54. మరియు మీరు పశ్చాత్తాపంతో మీ ప్రభువు వైపునకు మరలండి మరియు మీ పైకి శిక్ష రాకముందే, మీరు ఆయనకు విధేయులు (ముస్లింలు) అయి ఉండండి, తరువాత మీకు ఎలాంటి సహాయం లభించదు[31].

55. మరియు మీకు తెలియకుండానే అకస్మాత్తుగా, మీపైకి శిక్ష రాకముందే మీ ప్రభువు తరఫు నుండి మీకొరకు అవతరింపజేయబడిన శ్రేష్ఠమైన దానిని (ఈ ఖుర్ఆన్ ను) అనుసరించండి[32].

56. లేకపోతే మానవుడు: "నా పాడుగానూ! నేను

---

[30] చూడండి, 6:54 మరియు 4:110..

[31] మరణం ఆసన్నమైనప్పుడు పడే పశ్చాత్తాపం అంగీకరించబడదు. చూడండి, 4:18.

[32] ఈ శిక్ష ఇహలోకంలో వచ్చే ఆపదలు.

అల్లాహ్ విషయంలో ఇంత నిర్లక్ష్యంగా ఉండక పోతే మరియు ఎగతాళి చేసేవారిలో చేరి ఉండకపోతే ఎంత బాగుండేది!" అని పశ్చాత్తాప పడవచ్చు!

57. లేక, ఇలా అనవచ్చు: "ఒకవేళ అల్లాహ్ నాకు సన్మార్గం చూపి వుంటే, నేను కూడా దైవభీతి గలవారిలో చేరిపోయేవాడిని కదా!"[33]

58. లేక శిక్షను చూసి ఇలా అనవచ్చు: "ఒకవేళ నాకు మరల (ఇహలోకానికి) పోయే అవకాశం దొరికి ఉంటే నేను తప్పక సజ్జనులలో చేరి పోయేవాడిని కదా!"[34]

59. (అప్పుడు అతనికి అల్లాహ్ ఇలా సెలవిస్తాడు): "అలా కాదు! వాస్తవానికి నా సూచనలు (ఆయాత్) నీ వద్దకు వచ్చాయి. కాని నీవు వాటిని అబద్ధాలని తిరస్కరించావు. మరియు గర్వానికి లోనయ్యావు మరియు నీవు సత్యతిరస్కారులలో చేరిపోయావు."

60. మరియు పునరుత్థాన దినమున అల్లాహ్ పై అబద్ధాలు పలికిన వారి ముఖాలను నల్లగా మారిపోవటాన్ని నీవు గమనిస్తావు. ఏమీ? ఈ గర్విష్ఠుల నివాసం నరకంలోనే ఉండదా?

61. మరియు అల్లాహ్, భయభక్తులు గలవారిని వారి సాఫల్యానికి బదులుగా వారికి ముక్తిని ప్రసాదిస్తాడు. ఎలాంటి బాధ వారిని ముట్టుకోదు మరియు వారు దుఃఖపడరు కూడా!

62. అల్లాహ్ యే ప్రతి దాని సృష్టికర్త మరియు ఆయనే

---

[33] చూడండి, 6:148.
[34] చూడండి, 2:167, 26:102 మరియు 6:27-28.

ప్రతి దానికి కార్యకర్త[35].

63. ఆకాశాలలో మరియు భూమిలో ఉన్న నిక్షేపాల తాళపు చెవులు ఆయన వద్దనే ఉన్నాయి. మరియు ఎవరైతే అల్లాహ్ సూచనలను (ఆయాత్ లను) తిరస్కరిస్తారో అలాంటి వారు. వారే! నష్టానికి గురి అయ్యే వారు.

64. (ఓ ప్రవక్తా!) ఇలా అను: "ఓ మూర్ఖులారా! ఏమీ? అల్లాహ్ ను వదలి, ఇతరులను ఆరాధించమని, మీరు నన్ను ఆజ్ఞాపిస్తున్నారా?"

65. మరియు వాస్తవానికి! నీకూ మరియు నీకంటే ముందు వచ్చిన (ప్రతి ప్రవక్తకూ) దివ్యజ్ఞానం (వహీ) ద్వారా ఇలా తెలుపబడింది: "ఒకవేళ నీవు బహుదైవారాధన (షిర్క్) చేసినట్లయితే నీ కర్మలన్నీ వ్యర్థమై పోతాయి మరియు నిశ్చయంగా, నీవు నష్టానికి గురి అయిన వారిలో చేరిపోతావు."

66. అలా కాదు! నీవు కేవలం అల్లాహ్ ను మాత్రమే ఆరాధించు మరియు కృతజ్ఞులలో చేరిపో!

67. వారు అల్లాహ్ సామర్థ్యాన్ని గుర్తించ వలసిన విధంగా గుర్తించలేదు; పునరుత్థాన దినమున భూమి అంతా ఆయన పిడికిలిలో ఉంటుంది; మరియు ఆకాశాలన్నీ చుట్టబడి ఆయన కుడిచేతిలో ఉంటాయి[36]. ఆయన సర్వలోపాలకు అతీతుడు మరియు వారు కల్పించే భాగస్వాముల

---

[35] అల్- వకీలు: కార్యకర్త, చూడండి, 3:173 వ్యాఖ్యాత 2.
[36] ఇటువంటి వాక్యం కోసం చూడండి, 21:104.

కంటే అత్యున్నతుడు.

**68.** మరియు బాకా (సూర్) ఊదబడినప్పుడు ఆకాశాలలో మరియు భూమిలో ఉన్న వారందరూ మూర్ఛిల్లి పడిపోతారు అల్లాహ్ కోరిన వారు తప్ప. ఆ తరువాత రెండవసారి (బాకా) ఊదబడుతుంది అప్పుడు వారందరూ లేచి చూడటం ప్రారంభిస్తారు[37].

**69.** మరియు భూమి తన ప్రభువు తేజస్సుతో వెలిగి పోతుంది[38]. మరియు కర్మపత్రం వారి యెదుట ఉంచబడుతుంది[39], ప్రవక్తలు మరియు (ఇతర) సాక్షులు రప్పింపబడతారు[40]. మరియు వారి మధ్య న్యాయంగా తీర్పు చేయబడుతుంది మరియు వారికెట్టి అన్యాయం జరుగదు.

**70.** మరియు ప్రతి వ్యక్తి (ఆత్మ) తాను చేసిన కర్మలకు

---

[37] రెండవసారి ఊదబడే బాకాకై చూడండి, 37:19. అబూ-హురైరహ్ కథనం. దైవప్రవక్త ('స'అస) అన్నారు: "రెండవ బాకా ఊదబడిన తరువాత, నేనే అందరి కంటే ముందు తలెత్తి చూస్తాను. అప్పుడు మూసా ('అ.స.) 'అర్ష్ ను పట్టుకొని ఉంటారు. అతను ('అ.స.) ఆ స్థితిలో మొదటి నుండే ఉన్నారా లేక రెండవ బాకా ఊదబడిన తరువాతనా అనేది, నాకు తెలియదు." ('స'హీ'హ్ బు'ఖారీ పు. 6 'హ. నం 337)

[38] చూడండి, 14:48. "పునరుత్థాన దినమున ఈ భూమి మరొక భూమిగా మార్చబడుతుంది మరియు ఆకాశాలు కూడా." ఇంకా చూడండి 20:105-107.

[39] చూడండి 17:13-14 మరియు 18:49.

[40] చూడండి 6:130, 17:14, 24:24, 36:65 మరియు 41:20 వీటన్నింటిలో మానవుని అవయవాలు, అతనికి వ్యతిరేకంగా సాక్ష్యమిస్తాయని ఉంది. ఇక 4:41 లో ప్రవక్తలందరూ తమ తమ సమాజం వారికి సాక్ష్యులుగా ఉంటారని ఉంది.

పూర్తి ప్రతిఫలం పొందుతాడు[41]. ఎందుకంటే వారు చేస్తున్న దంతా ఆయనకు బాగా తెలుసు.

71. సత్యాన్ని తిరస్కరించిన వారు గుంపులు గుంపులుగా నరకం వైపునకు తోలబడతారు. చివరకు వారు దాని వద్దకు వచ్చినపుడు, దాని ద్వారాలు తెరువబడతాయి మరియు వారితో దాని రక్షకులు ఇలా అంటారు: "ఏమీ? మీలో నుండి, మీ ప్రభువు సూచనలను వినిపించే సందేశహరులు మీ వద్దకు రాలేదా? మరియు వారు మిమ్మల్ని ఈనాటిమీసమావేశాన్ని గురించిహెచ్చరించలేదా?" వారంటారు: "అవును (హెచ్చరించారు)!" కాని (అప్పటికే) సత్యతిరస్కారులపై శిక్షా నిర్ణయం తీసుకోబడి ఉంటుంది[42].

72. వారితో ఇలా అనబడుతుంది: "నరక ద్వారాలలోనికి ప్రవేశించండి, ఇక్కడ మీరు శాశ్వతంగా ఉంటారు. గర్విష్ఠుల నివాస స్థలం ఎంత చెడ్డది!"

73. మరియు తమ ప్రభువు పట్ల భయభక్తులు గలవారు గుంపులు గుంపులుగా స్వర్గం వైపునకు తీసుకొని పోబడతారు. చివరకు వారు దాని దగ్గరికి వచ్చినప్పుడు, దాని ద్వారాలు తెరువ

[41] చూడండి, 99:7-8.
[42] చూడండి, 67:8-10.

బడతాయి[43]. మరియు దాని రక్షకులు వారితో అంటారు: "మీకు శాంతి కలుగు గాక (సలాం)! మీరు మంచిగా ప్రవర్తించారు, కావున ఇందులో శాశ్వతంగా ఉండటానికి ప్రవేశించండి!"

**74.** మరియు వారంటారు: "మాకు చేసిన వాగ్దానాన్ని నిజం చేసి చూపిన అల్లాహ్ యే సర్వస్తోత్రాలకు అర్హుడు మరియు ఆయనే మమ్మల్ని ఈ నేలకు వారసులుగా చేశాడు. స్వర్గంలో మేము కోరిన చోటస్థిరనివాసంఏర్పరచుకోగలము! సత్కార్యాలు చేసేవారి ప్రతిఫలం ఎంత ఉత్తమమైనది!"

**75.** మరియు దైవదూతలను తమ ప్రభువు పవిత్రతను కొనియాడుతూ, ఆయనను స్తుతిస్తూ, ఆయన సింహాసనాన్ని (అర్ష్ ను) అన్ని వైపుల నుండి చుట్టుకొని ఉండటాన్ని నీవు చూస్తావు[44] మరియు వారి (సర్వప్రాణుల) మధ్య న్యాయంగా తీర్పు చేయబడుతుంది మరియు "సర్వస్తోత్రాలకు అర్హుడైన అల్లాహ్ యే సమస్త లోకాలకు ప్రభువు." అని పలుకబడుతుంది.

---

[43] చూడండి, 38:50 స్వర్గానికి ఎనిమిది ద్వారాలున్నాయి. వాటిలో ఒకటి 'రయ్యాన్' దాని గుండా ఉపవాసాలు ఉండే వారు ప్రవేశిస్తారు. ('స'హీ'హ్ బు'ఖారీ, నం. 2257, ముస్లిం నం. 808) ఇతర ద్వారాలకు కూడా పేర్లున్నాయి. బాబ్ అ'స్సలాహ్, బాబ్ అ'స్సదఖహ్, బాబ్ అజ్జిహాద్ మొదలైనవి ('స'హీ'హ్ బు'ఖారీ, 'స'హీ'హ్ ముస్లిం).

[44] చూడండి, 7:54.

# 40. గాఫిర్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. హా-మీమ్[1].
2. ఈ గ్రంథ(ఖుర్ఆన్)అవతరణ సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడైన అల్లాహ్ తరఫు నుండి జరిగింది
3. పాపాలను క్షమించేవాడు[2] మరియు పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడు, శిక్షించటంలో కఠినుడు[3]. ఎంతో ఉదార స్వభావుడు[4]. ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. (అందరి) మరలింపు ఆయన వైపుకే ఉంది!
4. సత్యతిరస్కారులు తప్ప, ఇతరులెవ్వరూ అల్లాహ్ సూచన (ఆయాత్) లను గురించి వాదించరు, కావున భూమిలో వారి గర్వపూరితమైన నడక నిన్ను మోసగింపనివ్వరాదు!

---

[*] [గాఫిర్ – అపరాధములను క్షమించువాడు, దీని మరో పేరు అల్ మూమిన్]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

[2] అల్-'గాఫిర్ : Oft-Forgiving, Most Forgiving. క్షమాగుణ పరిపూర్ణుడు, పాపాలను క్షమించేవాడు, ఎక్కువగా క్షమించేవాడు. ఇంకా చూడండి, అల్-'గఫ్ఫారు: క్షమించేవాడు, 20:82; అల్-'గఫూరు: 2:173.

[3] చూడండి, 8:52, 15:50.

[4] జి'-'త్తౌలు: అంటే Bestorwer of Favors, ఎంతో ఉదారస్వభావుడు, దాతృత్వుడు, ధనసంపత్తులు ప్రసాదించేవాడు, లేక తన దాసులను అనుగ్రహించేవాడు.

5. వారికి పూర్వం గడిచిన నూహ్ జాతి వారూ మరియు వారి పిదప వచ్చిన ఇతర వర్గాల వారు కూడా (తమ ప్రవక్తలను) అసత్యవాదులని తిరస్కరించారు. మరియు ప్రతి సమాజం వారు తమ సందేశహరుణ్ణి నిర్బంధించటానికి ప్రయత్నాలు చేశారు. మరియు అసత్యంతో సత్యాన్ని ఖండించటానికి వాదులాడారు; కావున చివరకు నేను వారిని పట్టు కున్నాను. చూశారా! నా శిక్ష ఎలా ఉండిందో!

6. మరియు ఈ విధంగా సత్యతిరస్కారానికి పాల్పడిన వారిని గురించి: "నిశ్చయంగా వారు నరకవాసులు." అని, అన్న నీ ప్రభువు వాక్కు సత్యమయ్యింది.

7. సింహాసనాన్ని (అర్ష్ ను) మోసేవారు మరియు దాని చుట్టూ ఉండేవారు (దైవదూతలు) తమ ప్రభువు పవిత్రతను కొనియాడుతూ, ఆయనను స్తుతిస్తూ ఉంటారు[5] మరియు ఆయన మీద విశ్వాసం కలిగి ఉంటారు. మరియు విశ్వసించిన వారి కొరకు క్షమాభిక్ష కోరుతూ: "ఓ మా ప్రభూ! నీవు నీ కారుణ్యం మరియు నీ జ్ఞానంతో ప్రతి దానిని ఆవరించి ఉన్నావు. కావున పశ్చాత్తాపంతో నీ వైపునకు మరలి, నీ మార్గాన్ని అనుసరించే వారిని క్షమించు; మరియు వారిని భగభగమండే నరకాగ్ని శిక్ష నుండి కాపాడు!"

8. "ఓ మా ప్రభూ! ఇంకా వారిని, నీవు వాగ్దానం చేసిన, కలకాలముండే స్వర్గవనాలలో ప్రవేశింప

---

[5] చూడండి, 7:54 మరియు 39:75.

జేయి మరియు వారి తండ్రులలో వారి సహవాసులలో (అజ్వాజ్'లలో) మరియు వారి సంతానం లో, సద్వర్తనులైన వారిని కూడా! నిశ్చయంగా నీవే సర్వశక్తిమంతుడవు, మహావివేకవంతుడవు."[6]

9. "మరియు వారిని దుష్కార్యాల నుండి కాపాడు. మరియు ఆ రోజు నీవు ఎవడినైతే దుష్కార్యాల నుండి కాపాడుతావో! వాస్తవంగా వాడిని నీవు కరుణించినట్లే! మరియు అదే ఆ గొప్ప సాఫల్యం (విజయం)."[7]

10. నిశ్చయంగా, (ఆ రోజు) సత్యతిరస్కారులను పిలిచి వారితో: "ఈరోజు మీకు, మీ పట్ల ఎంత అసహ్యం కలుగుతున్నదో! మిమ్మల్ని విశ్వాసం వైపునకు పిలువగా మీరు నిరాకరించి నపుడు, అల్లాహ్ కు మీ పట్ల ఇంత కంటే ఎక్కువ అసహ్యం కలిగేది!" అని అనబడుతుంది.

11. వారు ఇలా అంటారు: "ఓ మా ప్రభూ! నీవు మాకు రెండుసార్లు మరణాన్ని ఇచ్చావు మరియు రెండుసార్లు జీవితాన్ని ఇచ్చావు[8]. ఇప్పుడు

---

[6] చూడండి, 52:21.

[7] పై మూడు ఆయత్'లలో విశ్వాసుల కొరకు రెండు శుభవార్తలు ఉన్నాయి. 1) దైవదూతలు ('అలైహిమ్. స.) వారికై ప్రార్థనలు చేస్తూ ఉంటారు. 2) విశ్వాసుల కుటుంబీకులందరూ స్వర్గంలో ఒకే చోట ఉంటారు.

[8] చూడండి, 2:28 రెండు మరణాలు అంటే మొదటిది మానవుడు ఉనికిలోకి రాకముందు ఉన్న స్థితి. రెండవది భూలోక జీవితంలో మరణించటం. రెండు జీవితాలంటే మొదటిది భూలోక జీవితం, రెండవది పరలోక జీవితం. వ్యాఖ్యాతలందరూ ఈ విశదీకరణతో ఏకీభవిస్తున్నారు.

మేము మా పాపాలను ఒప్పు కుంటున్నాము. కావున ఇప్పుడైనా ఇక్కడి నుండి (నరకం నుండి) బయటపడే మార్గం ఏదైనా ఉందా?"

12. (వారికి ఇలా సమాధానం ఇవ్వబడుతుంది): "దీనికి కారణమేమిటంటే వాస్తవానికి అద్వితీయుడైన అల్లాహ్ ను ప్రార్థించమన్నప్పుడు మీరు తిరస్కరించేవారు మరియు ఆయనకు భాగస్వాములు కల్పించబడినప్పుడు, మీరు విశ్వసించారు! ఇప్పుడు తీర్పు మహోన్నతుడు, మహనీయుడు[9] అయిన అల్లాహ్ చేతిలో ఉంది."[10]

13. ఆయనే మీకు తన అద్భుత సూచనలను చూపించేవాడు మరియు ఆకాశం నుండి మీ కొరకు జీవనోపాధిని అవతరింప జేసేవాడు. కాని, ఆయన వైపునకు పశ్చాత్తాపంతో మరలే వారు తప్ప, ఇతరులు వీటిని గ్రహించలేరు.

14. కావున (ఓ విశ్వాసులారా!) మీరు మీ ధర్మాన్ని (భక్తిని) కేవలం ఆయనకే ప్రత్యేకించుకొని, అల్లాహ్ ను మాత్రమే ప్రార్థించండి. సత్యతిరస్కారులకు

---

[9] చూడండి, 4:34.

[10] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: తీర్పుదినమున స్వర్గానికి అర్హులైన వారు స్వర్గానికి పంపబడతారు. నరకానికి అర్హులైన వారు నరకానికి. ఆ తరువాత అల్లాహ్ (సు.తా.) అంటాడు : 'ఎవని హృదయంలో ఆవగింజంత విశ్వాసం ఉందో అతనిని నరకం నుండి తీయండి.' అప్పుడు వారు తీయబడతారు. వారు కాలినల్లబడిపోయిఉంటారు. వారు జీవనదిలో కి త్రోయబడతారు. వారు నది ఒడ్డున మొగ్గలు అంకురించినట్లు, అంకురించి బయటికి వస్తారు. (అబూ సయీద్ అల్-ఖుద్రీ కథనం; బు'ఖారీ, ముస్లిం, నసాయి', మరియు ఇబ్నె 'హంబల్) ఈ విధంగా కొంతైనా విశ్వాసమున్నవారు క్షమింపబడతారు.

ఇది ఎంత అసహ్యాకరమైనా!

15. ఆయన మహోన్నతమైన స్థానాలు గలవాడు[11], (సర్వాధికార) సింహాసనానికి (అర్ష్ కు) అధిపతి[12], తన దాసులలో తనకు ఇష్టమైనవారిపై, తన ఆజ్ఞ ప్రకారం, తన దివ్యజ్ఞానాన్ని (రూహ్' ను) అవతరింపజేస్తాడు[13], ఆయనతో సమావేశమయ్యే దినమును గురించి హెచ్చరించటానికి.

16. ఆ రోజు వారందరూ బయటికి వస్తారు. వారి ఏ విషయం కూడా అల్లాహ్ నుండి రహస్యంగా ఉండదు. ఆ రోజు విశ్వ సామ్రాజ్యాధికారం ఎవరిది? అద్వితీయుడూ, ప్రబలుడూ[14] అయిన అల్లాహ్ దే!

17. ఆ రోజు ప్రతి ప్రాణికి తాను సంపాదించిన దాని ప్రతిఫలం ఇవ్వబడుతుంది. ఆ రోజు ఎవ్వరికీ అన్యాయం జరుగదు. నిశ్చయంగా, అల్లాహ్ లెక్క తీసుకోవటంలో అతి శీఘ్రుడు.

---

[11] రఫీ'ఉ: Exalted, ఉన్నత స్థానాలు గలవాడు, అర్-రాఫి'ఉ: (సేకరించబడిన పదం) The Exalter, of the believer by prospering him. Exalter of the obedient. విశ్వాసులను ఉన్నత స్థాయిలోకి ఎత్తువాడు, పైకెత్తేవాడు లేక విధేయులను ప్రశంసించువాడు. ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి.

[12] చూడండి, 7:54

[13] అర్-రూ'హు: దివ్యజ్ఞానం, చూడండి, 16:2, 42:52 అక్కడ కూడా రూ'హ్ దివ్యజ్ఞానంగా పేర్కొనబడింది. 19:17 78:38 మరియు 97:4లలో రూ'హ్, జిబ్రయీల్ (అ.స.) ను సూచిస్తోంది.

[14] అల్-ఖహ్హారు: తన సృష్టిపై సంపూర్ణ అధికారం, ఆధిపత్యం గలవాడు, లోబరచుకొనేవాడు, ప్రబలుడు. అల్-ఖాహిరుకు. చూడండి 6:18, 61. అల్ వా'హిద్ కు చూడండి 2:133.

18. మరియు (ఓ ముహమ్మద్!) సమీపంలో రానున్న
దినాన్ని గురించి వారిని హెచ్చరించు. అప్పుడు
గుండెలు గొంతుల వరకు వచ్చి అడ్డుకొని, ఊపిరి
ఆడకుండా చేస్తాయి. (ఆ రోజు) దుర్మార్గులకు
ఆప్తమిత్రుడుగానీ, మాట చెల్లునట్టి సిఫారసు
చేసేవాడుగానీ[15] ఎవ్వడూ ఉండడు
19. ఆయన (అల్లాహ్)కు, చూపులలోని నమ్మకద్రోహం
మరియు హృదయాలలో దాగివున్న రహస్యాలు
అన్నీ తెలుసు.
20. మరియు అల్లాహ్, న్యాయంగా తీర్పు చేస్తాడు.
మరియు వారు ఆయనను (అల్లాహ్ ను) వదలి
ఎవరినైతే ప్రార్థిస్తూ ఉన్నారో, వారు ఎలాంటి తీర్పు
చేయలేరు. నిశ్చయంగా, అల్లాహ్! ఆయన
మాత్రమే సర్వం వినేవాడు, సర్వం చూసేవాడు.
21. ఏమీ? వారు భూమిలో సంచారం చేసి తమకు
ముందు గతించిన వారి ముగింపు ఎలా జరిగిందో
చూడలేదా? వారు, వీరి కంటే ఎక్కువ బలం
గలవారు. మరియు వీరి కంటే ఎక్కువ గుర్తులను
భూమిలో వదిలి పోయారు; కాని అల్లాహ్ వారి
పాపాలకుగానూ వారిని పట్టు కున్నాడు మరియు
అప్పుడు వారిని అల్లాహ్ పట్టునుండి కాపాడేవాడు
ఎవ్వడూ లేక పోయాడు
22. ఇలా ఎందుకు జరిగిందంటే! వారి ప్రవక్తలు వారి
వద్దకు స్పష్టమైన సూచనలు తీసుకొని వచ్చారు!
కాని వారు, వారిని తిరస్కరించారు, కాబట్టి

[15] సిఫారసుకు చూడండి, 10:3.

అల్లాహ్ వారిని శిక్షకు గురి చేశాడు. నిశ్చయంగా, ఆయన మహా బలశాలి, శిక్ష విధించటంలో కఠినుడు.

23. మరియు వాస్తవంగా, మేము మూసాను మా సూచనలతో (ఆయాత్ లతో) మరియు స్పష్టమైన అధికారంతో పంపి ఉన్నాము;

24. ఫిర్ఔన్, హామాన్ మరియు ఖారూన్ ల[16] వద్దకు! కాని వారు: "ఇతను మాంత్రికుడు, అసత్యవాది!" అని అన్నారు.

25. తరువాత అతను మా వద్ద నుండి సత్యాన్ని వారి ముందుకు తీసుకొని రాగా వారన్నారు: "ఇతనిని విశ్వసించే వారందరి పుత్రులను చంపండి మరియు వారి స్త్రీలను బ్రతకనివ్వండి."[17] కాని సత్యతిరస్కారులపన్నాగాలు వ్యర్థమే అవుతాయి.

26. మరియు ఫిర్ఔన్ ఇలా అన్నాడు: "మూసాను చంపే పని నాకు వదలి పెట్టండి; అతనిని తన ప్రభువును పిలుచుకోనివ్వండి. వాస్తవానికి,

[16] ఖారూన్, మొదట మూసా ('అ.స.) ను అనుసరించాడు. తరువాత అవిశ్వాసుడయ్యాడు. వివరాలకు చూడండి, 28:76. హామాన్ కొరకు చూడండి, 28:6, అతడు ఫిర్'ఔన్ సభలో మంత్రిగా ఉండేవాడు

[17] ఫిర్'ఔ'న్, మూసా ('అ.స.) జన్మానికి ముందు కూడా తాను బానిసలుగా చేసి ఉంచిన బనీ-ఇస్రాయీ'ల్ సంతతి వారి మగ సంతానాన్ని పుట్టిన వెంటనే చంపిస్తూ ఉండేవాడు. ఎందుకంటే వారి సంతతిలోని బాలుడు అతని నాశనానికి కారకుడవుతాడని, అతనికి జ్యోతిష్యులు చెప్పి ఉంటారు. ఈసారి మూసా ('అ.స.) మరియు అతని సంతతి వారి మధ్య అవిశ్వాసం, కలహాలు రేకెత్తించే ఉద్దేశ్యంతో వారి పుత్రులను చంపమని ఆజ్ఞాపిస్తాడు. వారు పలికిన మాటలకు చూడండి, 7:129.

నా భయమేమిటంటే, అతను మీ ధర్మాన్ని మార్చవచ్చు, లేదా దేశంలో కల్లోల్లాన్ని రేకెత్తించవచ్చు!"

**27.** మరియు మూసా అన్నాడు: "నిశ్చయంగా, నేను లెక్క తీసుకోబడే రోజును విశ్వసించని ప్రతి దురహంకారి నుండి కాపాడటానికి, నాకూ మరియు మీకూ కూడా ప్రభువైన ఆయన (అల్లాహ్) శరణు వేడుకుంటున్నాను!"[18]

**28.** అప్పుడు తన విశ్వాసాన్ని గుప్తంగా ఉంచిన ఫిర్'ఔన్ కుటుంబపు ఒక వ్యక్తి ఇలా అన్నాడు[19]: "ఏమీ? మీరు, 'అల్లాహ్ యే నా ప్రభువు.' అని అన్నందుకు, ఒక వ్యక్తిని చంపగోరుతున్నారా? వాస్తవానికి, అతను మీ ప్రభువు తరఫు నుండి మీ వద్దకు స్పష్టమైన సూచనలు తీసుకొని వచ్చాడు కదా! మరియు ఒకవేళ అతను అసత్యవాది అయితే, అతని అసత్యం అతని మీదనే పడుతుంది! కాని ఒకవేళ అతను సత్యవంతుడే అయితే, అతను హెచ్చరించే (శిక్ష) మీపై పడవచ్చు కదా! నిశ్చయంగా, అల్లాహ్ మితిమీరే అసత్యవాదికి సన్మార్గం చూపడు!"

---

[18] ఫిర్'ఔన్, మూసా ('అ.స.)ను చంపగోరినప్పుడు అతను ఈ విధంగా ప్రార్థించాడు. దైవప్రవక్త ('స'అస) కూడా తమకు శత్రువుల భయం ఉంటే ఈ దు'ఆ చేసేవారు. ముస్నద్ అ'హ్మద్, 4/415 'ఓ అల్లాహ్ (సు.తా.) మేము నిన్ను వారికి విరుద్ధంగా ఉంచుతున్నాము. మరియు వారి ఆగడాల నుండి నీ రక్షణ కోరుతున్నాము.'

[19] ఇటువంటి గాథకు చూడండి, 36:20-27.

29. ఓ నా జాతి ప్రజలారా! ఈనాడు రాజ్యాధికారం
మీదే; దేశంలో మీరు ప్రాబల్యం వహించి ఉన్నారు,
కాని ఒకవేళ అల్లాహ్ శిక్ష మన మీద వచ్చి పడితే,
అప్పుడు మనకెవడు సహాయం చేయగలడు?"
అప్పుడు ఫిర్'ఔన్ అన్నాడు: "నాకు సముచితమైన
మార్గమే నేను మీకూ చూపుతాను, నేను మీకు
మార్గదర్శకత్వం చేసేది కేవలం సరైన మార్గం
వైపునకే!"[20]
30. మరియు విశ్వసించిన ఆ వ్యక్తి అన్నాడు: "నా
జాతి ప్రజలారా! నిశ్చయంగా పూర్వం అనేక
సంఘాలకు దాపురించిన దినమే మీకూ
దాపురించునేమోనని నేను భయపడుతున్నాను!
31. నూహ్, ఆద్, సమూద్ మరియు వారి తరువాత
వచ్చిన జాతుల వారికి వచ్చినటువంటి (దుర్దినం).
మరియు అల్లాహ్ తన దాసులకు అన్యాయం
చేయగోరడు.
32. మరియు ఓ నా జాతి ప్రజలారా! వాస్తవానికి నేను,
మీరు పరస్పరం పిలుచుకునే, ఆ దినం[21] గురించి
భయపడుతున్నాను."
33. ఆరోజు మీరు వెనుదిరిగి పారిపోవాలనుకుంటారు,
కాని అల్లాహ్ (శిక్ష) నుండి మిమ్మల్ని తప్పించేవాడు
ఎవ్వడూ ఉండడు. మరియు అల్లాహ్
మార్గభ్రష్టత్వంలో వదలిన వాడికి, మార్గదర్శకుడు

[20] ఫిర్'ఔన్ చూపే మార్గం సత్యమైనది కాదు, చూడండి, 11:97.
[21] పునరుత్థాన దినమున స్వర్గవాసులు మరియు నరకవాసులు ఒకరినొకరు పిలుచుకుంటారు, చూడండి, 7:48-49.

ఎవ్వడూ ఉండడు.

**34.** మరియు వాస్తవానికి ఇంతకు పూర్వం యూసుఫ్ మీ వద్దకు స్పష్టమైన ప్రమాణాలు తీసుకొని వచ్చాడు. కాని మీరు అతడు తెచ్చిన వాటిని గురించి సందేహంలో పడ్డారు. చివరకు అతడు మరణించినప్పుడు, మీరన్నారు: "ఇక అల్లాహ్ ఇతని తరువాత ఏ ప్రవక్తనూ పంపడు!"[22] ఈ విధంగా అల్లాహ్ మితిమీరి ప్రవర్తించే వారిని, సందేహంలో పడేవారిని మార్గభ్రష్టత్వంలో వదలుతాడు.

**35.** ఎవరైతే అల్లాహ్ సూచన (ఆయాత్) లను గురించి తమ దగ్గర ఏ ఆధారంలేనిదే వాదిస్తారో, వారు అల్లాహ్ దగ్గర మరియు విశ్వసించిన వారి దగ్గర ఎంతో గర్హనీయులు. ఈ విధంగా అల్లాహ్ దురహంకారీ, నిర్దయుడూ (క్రూరుడు) అయిన ప్రతి వ్యక్తి హృదయం మీద ముద్ర వేస్తాడు.

**36.** మరియు ఫిర్ఔన్ ఇలా అన్నాడు: "ఓ హామాన్! నా కొరకు ఒక ఎత్తైన గోపురాన్ని నిర్మించు, బహుశా (దాని పైకి ఎక్కి) నేను మార్గాలను పొందవచ్చు.

**37.** ఆకాశాలలోనికి పెళ్ళే మార్గాలు! మరియు వాటి ద్వారా నేను మూసా దేవుణ్ణి చూడటానికి.

---

[22] బహుశా ఈజిప్ట్ లో యూసుఫ్ ('అ.స.) తమ తెగవారైన హిక్సోస్ (Hyksos) వారిలోనే ప్రవక్తగా పరిగణించ బడ్డారు. వారు 'అరబ్బులు. హిబ్రూ భాషతో కలిసే భాష మాట్లాడేవారు. ఇతర ప్రజలు అతనిని ప్రవక్తగా ఎంచలేదు.

ఎందుకంటే, నిశ్చయంగా, నేను అతనిని అసత్యవాదిగా భావిస్తున్నాను!" మరియు ఈ విధంగా ఫిరఔన్ కు తన దుష్కార్యాలు మంచివిగా కనబడ్డాయి. మరియు అతడు సన్మార్గం నుండి నిరోధించబడ్డాడు. మరియు ఫిరఔన్ యొక్క ప్రతి పన్నాగం అతనిని నాశనానికి మాత్రమే గురి చేసింది.

**38.** మరియు విశ్వసించిన ఆ వ్యక్తి ఇంకా ఇలా అన్నాడు: "నా జాతి ప్రజలారా! నన్ను అనుసరించండి, నేను మీకు సరైన మార్గం వైపునకు మార్గదర్శకత్వం చేస్తాను.

**39.** నా జాతి ప్రజలారా! నిశ్చయంగా, ఈ ఇహలోక జీవిత సుఖం తాత్కాలికమైనదే మరియు నిశ్చయంగా, పరలోకమే శాశ్వతమైన నివాస స్థలము.

**40.** దుష్కార్యాలు చేసిన వానికి, వాటికి సరిపోయే ప్రతీకారం మాత్రమే లభిస్తుంది. మరియు విశ్వసించి సత్కార్యాలు చేసేవాడు, పురుషుడైనా లేదా స్త్రీ అయినా! అతడు (ఆమె) విశ్వాసి అయితే; అలాంటి వారు స్వర్గంలో ప్రవేశిస్తారు[23].

---

[23] పాపులకు వారి దుష్టకార్యాలకు సరిసమానమైన శిక్షయే ఇవ్వబడుతుంది. విశ్వసించి సత్కార్యాలు చేసేవారు మాత్రమే స్వర్గానికి హక్కుదారులు. విశ్వసించక ఎన్ని సత్కార్యాలు చేసినా అవి వ్యర్థమే అవుతాయి. అదే విధంగా సత్కార్యాలు చేయని విశ్వాసి కూడా కేవలం విశ్వాసం ఆధారంగా స్వర్గానికి హక్కుదారుడు కాజాలడు, సత్కార్యాలు చేసి, అల్లాహ్ (సు. తా.) కరుణిస్తే తప్ప.

అందు వారికి అపరిమితమైన జీవనోపాధి ఇవ్వబడుతుంది[24].

**41.** మరియు నా జాతి ప్రజలారా! ఇది ఎంత విచిత్రమైన విషయం! నేనేమో మిమ్మల్ని ముక్తి వైపునకు పిలుస్తున్నాను. మరియు మీరేమో నన్ను నరకాగ్ని వైపునకు పిలుస్తున్నారు.

**42.** మీరు నన్ను - అల్లాహ్ ను తిరస్కరించి - ఎవరిని గురించైతే నాకు ఎలాంటి జ్ఞానం లేదో! వారిని, ఆయనకు భాగస్వాములుగా కల్పించమని పిలుస్తున్నారు. మరియు నేనేమో మిమ్మల్ని సర్వశక్తిమంతుని, క్షమాశీలుని వైపునకు పిలుస్తున్నాను.

**43.** నిస్సందేహంగా! వాస్తవానికి మీరు దేని వైపునకైతే (ప్రార్థించటానికి) నన్ను పిలుస్తున్నారో! దానికి ఇహలోకంలోను మరియు పరలోకంలోను ప్రార్థనా అర్హత లేదు[25]. మరియు నిశ్చయంగా, మనందరి మరలింపు అల్లాహ్ వైపునకే మరియు నిశ్చయంగా, మితి మీరి ప్రవర్తించే వారే నరకాగ్ని వాసులవుతారు.

**44.** కావున నేను మీతో చెప్పే విషయం ముమ్మందు మీరే తెలుసుకోగలరు. ఇక నా వ్యవహారాన్ని నేను అల్లాహ్ కు అప్పగిస్తున్నాను. నిశ్చయంగా, అల్లాహ్

---

[24] రిజ్ ఖున్: జీవనోపాధి, అంటే కేవలం అన్న పానీయాలే కాక, అన్నీ మంచి వస్తువులు, సుఖసంతోషాలు, తెలివితేటలు మొదలైనవి. ఏవైతే సుఖమయ జీవితానికి అవసరమో!

[25] ఇలాంటి అర్థమిచ్చే వాక్యాల కోసం చూడండి, 46:5, 35:14.

తన దాసులను కనిపెట్టుకొని ఉంటాడు."

45. ఆ తరువాత అల్లాహ్ అతనిని వారు పన్నిన చెడు కుట్ర నుండి కాపాడాడు. మరియు ఫిరఔన్ జనులను దుర్భరమైన శిక్ష చుట్టుకున్నది.

46. ఆ నరకాగ్ని! వారు దాని యెదుటకు ఉదయమూ మరియు సాయంత్రమూ రప్పింప బడుతూ ఉంటారు[26]. మరియు (పునరుత్థాన) దినపు ఘడియ వచ్చినపుడు: "ఫిర్ఔన్ జనులను తీవ్రమైన శిక్షలో పడవేయండి!"[27] అని ఆజ్ఞ ఇవ్వబడుతుంది.

47. ఇక వారు నరకాగ్నిలో పరస్పరం వాదులాడుతున్నప్పుడు, (ఇహలోకంలో) బలహీనులుగా పరిగణింపబడిన వారు, పెద్ద మనుషులుగా (నాయకులుగా) పరిగణింపబడే వారితో ఇలా అంటారు: "వాస్తవానికి, మేము

[26] గోరీలలో ఉన్నవారు ఉదయం మరియు సాయంత్రం దాని ముందు ప్రవేశ పెట్టబడతారు. ఇదే గోరీల శిక్ష, 'అజాబె ఖబ్ర్!' దీనిని గురించి ఎన్నో 'హదీస్' లు ఉన్నాయి. 'ఆయి'షహ్ (ర.'అన్హా) దైవప్రవక్త ('స'అస) తో ప్రశ్నిస్తే అతను ఇలా అన్నారు:'అవును గోరీల శిక్ష తథ్యం.' ('స'హీ'హ్ బు'ఖారీ) మరొక 'హదీస్': మీలో ఎవరైనా మరణిస్తే అతనికి ఉదయం మరియు సాయంత్రం అతన చోటు (స్వర్గంలో లేక నరకంలో అతని స్థానం) చూపబడుతుంది. మరియు అతనితో అనబడుతుంది: 'ఇదే నీ గమ్యస్థానం. పునరుత్థాన దినమున అల్లాహ్ (సు.తా.) నిన్ను ఇక్కడికే పంపుతాడు.' ('స'హీ'హ్ బు'ఖారీ, 'స'హీ'హ్ ముస్లిం). చనిపోయిన తరువాత పునరుత్థానదినం వరకు ఉండే కాలాన్ని బర్'జఖ్ అంటారు.

[27] ఆల-ఫిర్'ఔన్: అంటే, ఫిర్'ఔన్, అతని జాతివారు మరియు అతని అనుచరులందరూ.

మిమ్మల్ని అనుసరిస్తూ ఉండే వారము, కావున మీరిప్పుడు మా నుండి నరకాగ్నిని కొంతసైనా తొలగించగలరా?"

**48.** దురహంకారంలో మునిగి ఉన్నవారు (ఆ పెద్ద మనుషులు) ఇలా అంటారు: "వాస్తవానికి, మనమందరం అందులో (నరకాగ్నిలో) ఉన్నాం. నిశ్చయంగా, అల్లాహ్ తన దాసుల మధ్య వాస్తవమైన తీర్పు చేశాడు!"

**49.** మరియు నరకాగ్నిలో పడివున్న వారు, నరకపు రక్షకులతో: "మా శిక్షను కనీసం ఒక్క రోజు కొరకైనా తగ్గించమని, మీరు మీ ప్రభువును ప్రార్థించండి!" అని అంటారు.

**50.** వారు (రక్షకులు) అంటారు: "ఏమీ? మీ వద్దకు స్పష్టమైన సూచనలు తీసుకొని మీ దైవ ప్రవక్తలు రాలేదా?" అప్పుడు వారంటారు: "అవును (వచ్చారు)!" వారికి ఇలా జవాబివ్వబడు తుంది: "అయితే మీరే ప్రార్థించండి!" కాని సత్యతిరస్కారుల ప్రార్థన నిష్ఫలమే అవుతుంది.

**51.** నిశ్చయంగా, మేము మా ప్రవక్తలకు మరియు విశ్వసించిన వారికి ఇహలోక జీవితంలో మరియు సాక్షులు నిలబడే రోజున కూడా సహాయము నొసంగుతాము[28].

---

[28] పునరుత్థానదినమున దైవదూతలు మరియు దైవప్రవక్త ('అలైహిమ్. స.) లు సాక్ష్యమిస్తారు. కావున పునరుత్థానదినం, సాక్ష్యాల దినం అని కూడా అనబడుతోంది. ఇంకా చూడండి, 39:69.

52. ఆరోజు దుర్మార్గులకు వారి సాకులు ఏ మాత్రం ఉపయోగకరం కావు. వారికి (అల్లాహ్) శాపం (బహిష్కారం) ఉంటుంది[29]. మరియు వారికి అతి దుర్భరమైన నిలయం ఉంటుంది.

53. మరియు వాస్తవంగా మేము మూసాకు మార్గదర్శకత్వం చేశాము. మరియు ఇస్రాయీల్ సంతతి వారిని గ్రంథానికి (తౌరాత్ కు) వారసులుగా చేశాము[30];

54. బుద్ధిమంతులకు మార్గదర్శకత్వంగా మరియు హితోపదేశంగా!

55. కావున నీవు సహనం వహించు! నిశ్చయంగా, అల్లాహ్ వాగ్దానం సత్యం; నీ పాపాలకు క్షమాపణ వేడుకో మరియు సాయంత్రం మరియు ఉదయం నీ ప్రభువు పవిత్రతను కొనియాడు, ఆయనను స్తుతించు.

56. నిశ్చయంగా, ఎవరైతే, తమ దగ్గర, ఎలాంటి ప్రమాణం లేనిదే అల్లాహ్ సూచనలను (ఆయాత్ లను) గురించి వాదులాడుతారో, వారి హృదయాలలో వాస్తవానికి గొప్పతనపు గర్వం నిండి ఉంది. కాని వారు దానిని (గొప్పతనాన్ని) పొందజాలరు. కావున నీవు అల్లాహ్ శరణు వేడుకో. నిశ్చయంగా, ఆయనే సర్వం వినేవాడు, సర్వం చూసేవాడు.

57. వాస్తవానికి, ఆకాశాలను మరియు భూమిని

---

[29] ల'అనతున్: అంటే అల్లాహ్ (సు.తా.) కారుణ్యం నుండి బహిష్కారం.

[30] చూడండి, 5:44.

సృష్టించటం, మానవులను సృష్టించటం కంటే ఎంతో గొప్ప విషయం, కానీ చాలా మంది ప్రజలకు ఇది తెలియదు.

58. మరియు గ్రుడ్డివాడు మరియు చూడగలవాడు సరిసమానులు కాజాలరు మరియు అదే విధంగా! విశ్వసించి సత్కార్యాలు చేసేవారు మరియు దుర్వర్తనులు కూడా (సమానులు కాజాలరు). మీరు అర్థం చేసుకునేది చాలా తక్కువ!

59. నిశ్చయంగా, అంతిమ ఘడియ తప్పక రానున్నది, అందులో ఎలాంటి సందేహం లేదు. అయినా చాలా మంది ప్రజలు విశ్వసించరు.

60. మరియు మీ ప్రభువు ఇలా అన్నాడు: "నన్ను ప్రార్థించండి, నేను మీ ప్రార్థనలను అంగీకరిస్తాను[31]. నిశ్చయంగా, ఎవరైతే నా ప్రార్థనల పట్ల దురహంకారం చూపుతారో, వారు తప్పక అవమానితులై నరకంలో ప్రవేశించగలరు."

61. అల్లాహ్! ఆయనే, మీ కొరకు విశ్రాంతి తీసుకోవటానికి రాత్రిని మరియు (చూడటానికి) ప్రకాశవంతమైన పగటిని నియమించినవాడు[32]. నిశ్చయంగా, అల్లాహ్ ప్రజల పట్ల ఎంతో అనుగ్రహుడు, కాని చాలా మంది ప్రజలు కృతజ్ఞతలు తెలుపరు.

62. ఆయనే అల్లాహ్, మీ ప్రభువు! ప్రతి దానిని

---

[31] 'హదీస్': "అద్దు'ఆఉ హువల్ 'ఇబాదహ్, వ అద్దు'ఆఉ ముఖ్ఖుల్ 'ఇబాదహ్." దు'ఆ అంటే ఇక్కడ చాలా మంది వ్యాఖ్యాతల అభిప్రాయంలో 'ఇబాదహ్ అంటే నమా'జ్. (ముస్నద్ అ'హ్మద్ 4/271) ఇంకా చూడండి, 2:186.

[32] చూడండి, 27:86.

సృష్టించినవాడు. ఆయన తప్ప మరొక ఆరాధ్య దైవం లేడు! అయితే మీరు ఎందుకు మోసగింపబడుతున్నారు (సత్యం నుండి మరలింపబడు తున్నారు)?[33]

**63.** ఇదే విధంగా, అల్లాహ్ సూచనలను (ఆయాత్ లను) తిరస్కరించే వారందరూ మోసగింప బడుతూ ఉంటారు.

**64.** అల్లాహ్ యే! మీ కొరకు భూమిని నివాస స్థలంగా మరియు ఆకాశాన్ని కప్పుగా నియమించిన వాడు మరియు ఆయనే మీకు మంచి రూపాన్నిచ్చి దానిని ఎంతో చక్కగా తీర్చి దిద్దాడు మరియు మీకు మంచి వస్తువులను జీవనోపాధిగా సమకూర్చాడు. ఆయనే అల్లాహ్! మీ పోషకుడు. కావున అల్లాహ్ ఎంతో శుభదాయకుడు, సర్వలోకాలకు ప్రభువు.

**65.** ఆయన సజీవుడు[34]. ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు, కావున మీరు ఆయననే ప్రార్థించండి! మీ ధర్మాన్ని (భక్తిని) కేవలం ఆయన కొరకే ప్రత్యేకించుకోండి. సర్వస్తోత్రాలకు అర్హుడు, సర్వలోకాల పోషకుడైన అల్లాహ్ మాత్రమే.

**66.** ఇలా అను: "నిశ్చయంగా, నా ప్రభువు తరఫు నుండి, నాకు స్పష్టమైన సూచనలు వచ్చిన తరువాతనే, అల్లాహ్ ను వదలి మీరు ఆరాధించేవాటి

---

[33] చూడండి, 5:75, చివరి వాక్యం.
[34] అల్-'హయ్యు: సజీవుడు, నిత్యజీవుడు, చూడండి, 2:255.

ఆరాధన నుండి నేను వారించ బడ్డాను మరియు నేను సర్వలోకాల ప్రభువుకు మాత్రమే విధేయుడను (ముస్లింను) అయి ఉండాలని ఆజ్ఞాపించబడ్డాను."

67. ఆయనే, మిమ్మల్ని మట్టితో సృష్టించాడు[35]. తరువాత వీర్యబిందువుతో, ఆ తరువాత పిండంతో (రక్తముద్దతో), ఆ తరువాత మిమ్మల్ని శిశువు రూపంలో బయటికి తీస్తాడు. ఆ తరువాత మిమ్మల్ని యుక్తవయస్సులో బలం గలవారిగా చేస్తాడు; చివరకు మిమ్మల్ని ముసలివారిగా మార్చుతాడు. మీలో కొందరు దీనికి ముందే చనిపోతారు. మరియు మీరంతా మీ నియమిత కాలం వరకే నివసిస్తారు. బహుశా మీరు అర్థం చేసుకుంటారని (ఇదంతా మీకు వివరించబడుతోంది).

68. జీవితాన్ని ఇచ్చేవాడు మరియు మరణింపజేసేవాడు ఆయనే! ఆయన ఏదైనా చేయాలను కున్నప్పుడు, కేవలం దానితో: "అయిపో!" అని అంటాడు, అంతే అది ఆయిపోతుంది.

69. ఏమీ? నీకు తెలియదా? అల్లాహ్ సూచనలను (ఆయాత్ లను) గురించి వాదులాడేవారు ఏ విధంగా (సత్యం నుండి) తప్పించబడుతున్నారో?

70. ఎవరైతే ఈ గ్రంథాన్ని అసత్యమని తిరస్కరించారో మరియు మేము మా సందేశహరులకు ఇచ్చి పంపిన దానిని (తిరస్కరించారో), వారు తప్పక

---

[35] చూడండి, 3:59, 11:61, 22:5, 30:20. ఈ ఆయత్ లో, 'తురాబ్' తో సృష్టించాడని ఉంది.

త్వరలోనే (తమ పర్యవసానం) తెలుసు కుంటారు;
71. ఎప్పుడైతే వారి మెడలలో సంకెళ్ళు[36] (ఇనుప పట్టీలు) మరియు గొలుసులు వేయబడ తాయో మరియు వారు ఈడ్చబడతారో!
72. సలసలకాగే నీళ్ళలోకి; తరువాత నరకాగ్నిలోకి కాల్చబడటానికి.
73. అప్పుడు వారితో అనబడుతుంది: "మీరు సాటి కల్పించే (భాగస్వాములు) ఇప్పుడు ఎక్కడున్నారు?
74. (ఎవరినైతే) మీరు అల్లాహ్ ను వదలి (ప్రార్థిస్తూ ఉన్నారో)!" వారంటారు: "వారు మమ్మల్ని త్యజించారు! అలా కాదు దీనికి పూర్వం మేము ఎవరినీ ప్రార్థించేవారమే కాదు."[37] ఈ విధంగా అల్లాహ్ సత్యతిరస్కారులను మార్గభ్రష్టత్వంలో వదలుతాడు.
75. (వారితో ఇలా అనబడుతుంది): "ఇదంతా మీరు అన్యాయంగా, భూమిలో విర్రవీగుతూ ఉన్నందుకు మరియు దురభిమానంతో ప్రవర్తించినందుకూ!
76. (కావున ఇప్పుడు) నరక ద్వారాలలో ప్రవేశించండి, అందులో శాశ్వతంగా ఉండటానికి. దురహంకారంతో ప్రవర్తించిన వారి నివాస స్థలం ఎంత దుర్భరమైనది!"
77. కావున (ఓ ప్రవక్తా!) నీవు సహనం వహించు! నిశ్చయంగా, అల్లాహ్ వాగ్దానం సత్యం. మేము

[36] మెడలలో సంకెళ్ళ - కొరకు, చూడండి, 13:5, 34:33 మరియు 36:8.

[37] చూడండి, 6:23.

వారికి చేసిన వాగ్దానాల (శిక్ష) నుండి కొంత నీకు చూపినా! లేదా (దానికి ముందు) నిన్ను మరణింపజేసినా వారందరూ మా వైపునకే కదా మరలింపబడతారు![38]

78. మరియు (ఓ ముహమ్మద్!) వాస్తవానికి మేము నీకు పూర్వం అనేక ప్రవక్తలను పంపాము; వారిలో కొందరి వృత్తాంతం మేము నీకు తెలిపాము; మరికొందరిని గురించి నీకు తెలుపలేదు. మరియు అల్లాహ్ అనుమతి లేనిదే ఏ ప్రవక్త కూడా ఏ అద్భుత క్రియలను (ఆయాత్ లను) స్వయంగా చేయలేడు[39]. కాని అల్లాహ్ ఆజ్ఞ వచ్చినపుడు, న్యాయంగా తీర్పు చేయబడుతుంది. మరియు అప్పుడు అసత్యవాదులు నష్టానికి గురి అవుతారు.

79. అల్లాహ్ మీ కొరకు పశువులను సృష్టించాడు, వాటి మీద మీరు సవారీ చేయటానికి మరియు వాటిలో కొన్నింటిని మీరు తినుటకూను![40]

80. మరియు వాటి వల్ల మీకు ఇతర లాభాలు కూడా ఉన్నాయి, వాటి ద్వారా మీ హృదయాలు కోరిన చోట్లకు పోవటానికి ఉపయోగపడతాయి మరియు వాటి మీద మరియు పడవల మీద మీరు తీసుకు పోబడతారు.

---

[38] చూడండి, 10:46.
[39] చూడండి, 6:109. అద్భుత క్రియలు (ము'అజి'జాత్) కేవలం అల్లాహ్ (సు.తా.) అధీనంలోనే ఉన్నాయి. ఆయన తాను కోరినప్పుడే వాటిని చూపిస్తాడు. పూర్వకాలపు చాలా మంది ప్రవక్తల జాతి ప్రజలు, అద్భుతక్రియలు చూసి కూడా విశ్వసించలేదు.
[40] చూడండి, 6:143-144.

**81.** మరియు (ఈ విధంగా) ఆయన మీకు తన సూచనలను (ఆయాత్ లను) చూపుతున్నాడు. అయితే అల్లాహ్ యొక్క ఏ ఏ సూచనలను (ఆయాత్ లను) మీరు నిరాకరిస్తారు?

**82.** ఏమీ? వీరు భూమిలో సంచరించలేదా? అప్పుడు వీరికి పూర్వం గతించిన వారి గతి ఏమయిందో కనిపించలేదా? వారు వీరి కంటే సంఖ్యాపరంగా అధికులు మరియు వీరి కంటే ఎక్కువ బలవంతులు మరియు భూమిలో (ఎక్కువ) చిహ్నాలు వదలి పోయారు, కాని వారి సంపాదన వారికి ఏ విధంగానూ పనికి రాలేదు.

**83.** ఎందుకంటే! వారి సందేశహరులు వారి వద్దకు స్పష్టమైన సూచనలు తీసుకొని వచ్చినప్పుడు, వారు తమ దగ్గరున్న జ్ఞానానికి గర్వపడ్డారు; కాబట్టి వారు దేనిని గురించి పరిహాసాలాడుతూ ఉన్నారో అదే వారిని చుట్టుకున్నది.

**84.** ఆ తరువాత మా శిక్షను చూసినప్పుడు వారు ఇలా అన్నారు: "మేము అద్వితీయుడైన అల్లాహ్ ను విశ్వసిస్తున్నాము మరియు మేము (అల్లాహ్ కు) సాటి కల్పిస్తూ వచ్చిన భాగస్వాములను తిరస్కరిస్తున్నాము."

**85.** కాని మా శిక్షను చూసిన తర్వాత, వారి విశ్వాసం వారికి ఏ మాత్రం లాభదాయకం కాజాలదు. ఇదే అల్లాహ్ తన దాసుల కొరకు వాస్తవంగా, నియమించిన విధానం (సాంప్రదాయం) మరియు అక్కడ సత్యతిరస్కారులు నష్టానికి గురి అవుతారు.

# 41. ఫుశ్శిలత్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. హా - మీమ్[1].
2. దీని (ఈ ఖుర్ఆన్) అవతరణ అనంత కరుణామయుడు, అపార కరుణా ప్రదాత తరఫు నుండి జరిగింది.
3. ఇదొక గ్రంథం, దీని సూచనలు (ఆయాత్) తెలివి గలవారి కొరకు, అరబ్బీ[2] భాషలో స్పష్టమైన ఉపన్యాసంగా (ఖుర్ఆన్ గా) వివరించబడ్డాయి.
4. (స్వర్గపు) శుభవార్తనిచ్చేదిగా మరియు హెచ్చరించేదిగా; అయినా చాలా మంది దీని పట్ల విముఖత చూపుతున్నారు, కాబట్టి వారు వినటం లేదు.
5. మరియు వారు ఇలా అన్నారు: "నీవు దేనిపైపునకైతే మమ్మల్ని పిలుస్తున్నావో, దాని పట్ల మా హృదయాల మీద తెరలు కప్పబడి ఉన్నాయి; మరియు మా చెవులలో చెవుడు ఉంది మరియు నీకూ మాకూ మధ్య ఒక అడ్డు

[*] [ఫుశ్శిలత్ – స్పష్టంగా వివరించబడిన వచనాలు, దీని మరో పేరు హా మీమ్ అస్'సజ్'దహ్]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

[2] చూడండి, 12:2.

తెర ఉంది[3]; కావున నీవు నీ పని చేయి, మేము మా పని చేస్తాము."

6. (ఓ ప్రవక్తా!) ఇలా అను: "నిశ్చయంగా నేను కూడా మీలాంటి ఒక మానవుణ్ణి మాత్రమే![4] నాకు దివ్యజ్ఞానం (వహీ) ద్వారా ఇలా తెలుపబడింది: 'నిశ్చయంగా, మీ ఆరాధ్య దేవుడు, ఒకే ఒక్క దేవుడు (అల్లాహ్); కావున మీరు నేరుగా ఆయన వైపునకే మరలండి మరియు ఆయననే క్షమాపణకై వేడుకోండి.'" మరియు ఆయన (అల్లాహ్) కు సాటి కల్పించే వారికి వినాశం ఉంది.

7. వారికి, ఎవరైతే విధిదానం (జకాత్) ఇవ్వరో మరియు పరలోకాన్ని తిరస్కరిస్తారో![5]

8. నిశ్చయంగా, ఎవరైతే విశ్వసించి సత్కార్యాలు చేస్తారో వారికి ఎడతెగని ప్రతిఫలం (స్వర్గం) ఉంటుంది.

9. వారితో ఇలా అను: "ఏమీ? మీరు, భూమిని రెండు రోజులలో సృష్టించిన ఆయన (అల్లాహ్)ను తిరస్కరించి, ఇతరులను ఆయనకు సమానులుగా నిలబెడతారా? సర్వలోకాలకు పోషకుడు ఆయనే

[3] చూడండి, 7:46, 6:25.
[4] చూడండి, 6:50.
[5] అ'జ్జకాతు: మదీనాలో 2వ హిజ్రీలో విధిగా నియమించబడింది. కావున ఇక్కడ 'జకాత్ అంటే దానం. మొదట ఉదయం మరియు సాయంత్రం రెండు నమాజులు విధిగా చేయబడి ఉండేవి. హిజ్రత్ కు ఒకటిన్నర సంవత్సరం ముందు మే'రాజ్ లో ఐదు నమా'జ్ లు విధిగా చేయబడ్డాయి. (ఇబ్నె-కసీ'ర్).

కదా?"[6]

10. మరియు ఆయన దానిలో (భూమిలో) దాని పైనుండి స్థిరమైన పర్వతాలను నెలకొలిపాడు[7] మరియు అందులో శుభాలను అనుగ్రహించాడు మరియు అర్థించేవారి కొరకు, వారి అవసరాలకు సరిపోయేటట్లు జీవనోపాధిని సమకూర్చాడు, ఇదంతా నాలుగు రోజులలో పూర్తి చేశాడు.

11. అప్పుడే[8] ఆయన కేవలం పొగగా[9] ఉన్న ఆకాశం వైపునకు తన ధ్యానాన్ని మరల్చి, దానిని మరియు భూమిని ఉద్దేశించి ఇలా అన్నాడు: "మీరిద్దరు (ఉనికిలోకి) రండి మీకు ఇష్టమున్నా, ఇష్టం లేక పోయినా!" అవి రెండూ: "మేమిద్దరమూ విధేయులమై (ఉనికిలోకి) వస్తాము." అని అన్నాయి.

12. కావున ఆయన వాటిని రెండు రోజులలో ఏడు ఆకాశాలుగా నిర్మించాడు, మరియు ప్రతి ఆకాశానికి దాని వ్యవహారాన్ని దివ్యజ్ఞానం (వహీ) ద్వారా నిర్దేశించాడు. మరియు మేము ఈ ప్రపంచపు ఆకాశాన్ని దీపాలతో (నక్షత్రాలతో)

---

[6] సృష్టిని ఆరు రోజులలో సృష్టించాడు. చూడండి, 7:54.

[7] భూమిలో నుండి పర్వతాలను పుట్టించి వాటిని దానిపై నాటాడు, భూమి కదలిపోకుండా.

[8] సు'మ్మ: 'అరబ్బీ భాషలో ఒకే విషయాన్ని బోధించే రెండు వాక్యాలను కలుపుటకు గూడా ఈ శబ్దం సు'మ్మ వాడబడుతోంది. ఇక్కడ వాడబడినట్లు.

[9] దఖానున్: పొగ, ఇది హైడ్రోజన్ గ్యాస్ కావచ్చు. దీని నుండియే ప్రపంచంలోని మూలపదార్థాలు (Elements) అన్నీ రూపొందించబడ్డాయి. చూడండి, 2:29.

అలంకరించాము మరియు దానిని సురక్షితం చేశాము[10]. ఇదే సర్వశక్తిమంతుని, సర్వజ్ఞుని నియామకం.

13. ఇప్పుడు ఒకవేళ వారు విముఖులైతే వారితో ఇలా అను: "ఆద్ మరియు సమూద్ జాతుల వారిపై వచ్చి పడినట్టి గొప్ప పిడుగులాంటి శిక్ష గురించి మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను."[11]

14. ఇక దైవప్రవక్తలు వారి వద్దకు వారి ముందు నుండి మరియు వారి వెనుక నుండి వచ్చి: "మీరు అల్లాహ్ ను తప్ప మరెవ్వరినీ ఆరాధించకండి!" అని అన్నప్పుడు, వారు ఇలా అన్నారు: "మా ప్రభువే గనక కోరితే దేవదూతలను పంపి ఉండేవాడు[12]. కావున మేము మీ ద్వారా పంపబడిన దానిని నిశ్చయంగా, తిరస్కరిస్తున్నాము!"

15. ఇక ఆద్ వారి విషయం: వారు దురహంకారంతో భూమిలో అన్యాయంగా ప్రవర్తించే వారు. మరియు ఇలాఅనేవారు: "బలంలో మమ్మల్ని మించినవాడు ఎవడున్నాడు? ఏమీ? వారికి తెలియదా? నిశ్చయంగా, వారిని సృష్టించిన అల్లాహ్ బలంలో వారి కంటే ఎంతో మించినవాడని? అయినా వారు మా సూచనలను (ఆయాత్ లను) తిరస్కరిస్తూ ఉండేవారు!

---

[10] చూడండి, 15:16-18 మరియు 37:6.

[11] 'ఆద్ జాతివారి గాథకై చూడండి, 7:65-69 మరియు స'మూద్ వారి గాథకై చూడండి, 26:`123-158.

[12] చూడండి, 6:8-9 మరియు 15:7.

16. చివరకు మేము వారికి, ఇహలోక జీవితంలోనే అవమానకరమైన శిక్ష రుచి చూపించాలని, అశుభమైని దినాలలో వారిపై తీవ్రమైన తుఫాను గాలిని పంపాము[13]. మరియు వారి పరలోక శిక్ష దీని కంటే ఎంతో అవమానకరమైనదిగా ఉండబోతుంది. మరియు వారికెలాంటి సహాయం లభించదు.

17. మరియు సమూద్ వారి విషయం: మేము వారికి మార్గదర్శకత్వం చేశాము. కాని వారు మార్గదర్శకత్వానికి బదులు గ్రుడ్డితనాన్నే ఇష్టపడ్డారు. చివరకు వారి(దుష్ట)కర్మలకు ఫలితంగా, వారిపై పిడుగు లాంటి అవమానకరమైన శిక్ష పడింది[14].

18. మరియు మేము వారిలో విశ్వాసులైనవారిని మరియు దైవభీతి గలవారిని రక్షించాము

19. మరియు (జ్ఞాపకముంచుకోండి) అల్లాహ్ యొక్క విరోధులు నరకాగ్ని వైపుకు సమీకరించబడే రోజు, వారు తమ తమ స్థానాలకు పంపబడతారు.

20. చివరకు వారు దానిని (నరకాగ్నిని) చేరుకున్నప్పుడు; వారి చెవులు, వారి కళ్ళు మరియు వారి చర్మాలు వారు చేస్తూ ఉండిన కర్మలను గురించి, వారికి వ్యతిరేకంగా సాక్ష్యమిస్తాయి.

---

[13] తూఫాన్ గాలి వీటిన దినాలు ఆ సత్యతిరస్కారుల కొరకే అశుభమైనవి. కాని ఆ పేరు గల దినాలు అందరి కొరకూ అశుభమైనవని దీని అర్థం కాదు. వివరాలకు చూడండి, 69:6-8.

[14] చూడండి, 69:5.

21. మరియు వారు తమ చర్మాలను (అవయవాలను) అడుగుతారు: "మీరెందుకు మాకు వ్యతిరేకంగా సాక్ష్యమిస్తున్నారు?" అవి ఇలా సమాధానమిస్తాయి: "ప్రతి వస్తువుకు మాట్లాడే శక్తి ప్రసాదించిన అల్లాహ్ యే మమ్మల్ని మాట్లాడింప జేశాడు." మరియు ఆయనే మిమ్మల్ని మొదటిసారి సృష్టించిన వాడు, మరియు ఆయన వైపునకే మీరంతా మరలింపబడతారు[15].

22. మరియు (మీరు దుష్కార్యాలు చేసేటప్పుడు) మీ చెవుల నుండి మీ కండ్ల నుండి మరియు మీ చర్మాల నుండి - మీకు వ్యతిరేకంగా సాక్ష్యం వస్తుందేమోనని - మిమ్మల్ని మీరు దాచుకునే వారు కాదు. అంతేకాదు మీరు చేస్తున్న ఎన్నో కార్యాలు వాస్తవంగా, అల్లాహ్ కు తెలియటం లేదని మీరు భావించేవారు.

23. మరియు మీ ప్రభువు పట్ల మీరు భావించిన ఈ భావనే మిమ్మల్ని నాశనం చేసింది. కావున మీరు నష్టపోయే వారిలో చేరిపోయారు.

24. అప్పుడు వారు సహనం చూపినా, నరకాగ్నియే వారి నివాస స్థానమవుతుంది. ఒకవేళ వారు (తమను తాము సరిదిద్దుకోవటానికి) అవకాశం కొరకు వేడుకున్నా వారికి అవకాశం ఇవ్వబడదు[16]. 7/8

25. మరియు మేము వీరికి స్నేహితులుగా

---

[15] చూడండి, 24:24, 36:65.
[16] చూడండి, 6:27-28 మరియు 32:12.

(షైతానులను) నియమించాము. వారు వీరి ముందూ వెనుకా ఉన్న వాటిని వీరికి ఆకర్షణీయమైన వాటిగా చేశారు. కావున వీరికి పూర్వం గతించిన జిన్నాతుల మరియు మానవుల తరాల విషయంలో జరిగిన శిక్షా నిర్ణయమే, వీరి విషయంలో కూడా జరిగింది. నిశ్చయంగా, వీరే నష్టానికి గురి అయిన వారయ్యారు.

26. మరియు సత్యతిరస్కారులు (పరస్పరం) ఇలా చెప్పుకుంటారు: "ఈ ఖుర్ఆన్ ను వినకండి! మరియు ఇది వినిపించబడినప్పుడు వినబడకుండా విఘ్నం కలిగించండి, బహుశా మీరు ప్రాబల్యం పొంద వచ్చు!"

27. కావున మేము నిశ్చయంగా, ఈ సత్యతిరస్కారులకు కఠినశిక్షను చవి చూపిస్తాము మరియు వారు చేస్తూ ఉండిన దుష్టకార్యాలకు తగిన ఫలితాన్ని నొసంగుతాము.

28. అల్లాహ్ విరోధులకు దొరికే ప్రతిఫలం ఇదే - నరకాగ్ని - అందు వారి శాశ్వత గృహం ఉంటుంది. ఇది మా సూచన (ఆయాత్) లను తిరస్కరిస్తూ వున్న దాని ప్రతిఫలం.

29. అప్పుడా సత్యతిరస్కారులు ఇలా అంటారు: "ఓ మా ప్రభూ! మమ్మల్ని మార్గభ్రష్టులుగా చేసిన ఆ జిన్నాతులను మరియు మానవులను మాకు చూపించు; వారు మరింత పరాభవం పొందటానికి మేము వారిని మా పాదాల క్రింద

పడవేసి త్రొక్కుతాము."[17]

**30.** నిశ్చయంగా, ఎవరైతే: "అల్లాహ్ యే మా ప్రభువు!" అని పలుకుతూ తరువాత దాని పైన నే స్థిరంగా ఉంటారో[18]! వారిపై దేవదూతలు దిగి వచ్చి (ఇలా అంటారు): "మీరు భయ పడకండి మరియు దుఃఖపడకండి, మీకు వాగ్దానం చేయబడిన స్వర్గపు శుభవార్తను వినండి!

**31.** మేము ఇహలోక జీవితంలో మరియు పరలోక జీవితంలో కూడా మీకు సన్నిహితులముగా ఉన్నాము. మరియు మీ కొరకు అందులో మీ మనస్సులు కోరిందంతా ఉంటుంది. మరియు మీరు ఆశించేదంతా దొరుకుతుంది.

**32.** ఇదంతా క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత ప్రసాదించిన ఆతిథ్యము."

**33.** మరియు (ప్రజలను) అల్లాహ్ వైపునకు పిలుస్తూ, సత్కార్యాలు చేస్తూ: "నేను అల్లాహ్ కే విధేయుడను (ముస్లింను)!" అని పలికేవాని మాటకంటే మంచి మాట మరెవరిది?

**34.** మరియు మంచీ మరియు చెడులు సరిసమానం కాజాలవు. (చెడును) మంచితో తొలగించు;

---

[17] చూడండి, 7:38.

[18] ఒక సహాబీ (ర'ది.'అ.) దైవప్రవక్త (సఅస)తో ఇలా ప్రశ్నించాడు: 'నాకు ఇటువంటి మాట చెప్పండి, దానితో మీ తరువాత ఎవ్వరినీ అడిగే అవసరం ఉండగూడదు!' దానికి దైవప్రవక్త('స'అస) అన్నారు: 'ఇలా అను నేను అల్లాహ్ (సు.తా.)ను విశ్వసించాను, తరువాత దాని (విశ్వాసం) పైననే స్థిరంగా ఉన్నాను.' ('స'హీ'హ్ ముస్లిం)

అప్పుడు నీతో విరోధమున్న వాడూ కూడా తప్పక నీ ప్రాణ స్నేహితుడవుతాడు[19].

**35.** మరియు ఇది కేవలం సహనశీలురకు తప్ప ఇతరులకు లభించదు. మరియు ఇది[20] గొప్ప అదృష్టవంతులకు తప్ప ఇతరులకు లభించదు.

**36.** మరియు ఒకవేళ షైతాన్ నుండి నీకు ఏదైనా కలతకలిగినపుడు, నీవు అల్లాహ్ శరణువేడుకో.[21] నిశ్చయంగా ఆయనే సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

**37.** మరియు ఆయన సూచనలలో (ఆయాత్ లలో) రేయింబవళ్ళు మరియు సూర్యచంద్రులున్నాయి. మీరు సూర్యునికి గానీ చంద్రునికి గానీ సాష్టాంగం (సజ్దా) చేయకండి, కాని కేవలం వాటిని సృష్టించిన అల్లాహ్ కు మాత్రమే సాష్టాంగం (సజ్దా) చేయండి - నిజంగానే మీరు ఆయనను ఆరాధించేవారే అయితే.

**38.** ఒకవేళ వారు దురహంకారానికి పాల్పడితే! ఇక నీ ప్రభువు దగ్గరగా ఉన్నవారు (దేవదూతలు) రేయింబవళ్ళు ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉంటారు; మరియు వారెన్నడూ అలసట చూపరు?

---

[19] చూడండి, 13:22. ఎవరైనా మీకు కీడు చేస్తే వానికి మేలు చేయండి. ఎవడైనా మీకు అన్యాయం చేస్తే వాడిని క్షమించండి. ఎవడైనా మీ మీద దౌర్జన్యం చేస్తే సహనం వహించండి. ఈ విధమైన వ్యవహారాలలో మీ శత్రువు కూడా మీ స్నేహితుడవుతాడు.

[20] అంటే స్వర్గనివాసం.

[21] చూడండి, 7:200

39. మరియు ఆయన సూచన (ఆయాత్) లలో ఒకటి: నిశ్చయంగా నీవు భూమిని పాడు నేలగా (ఎండిపోయిన బంజరు నేలగా) చూస్తున్నావు; కాని మేము దానిపై నీటిని (వర్షాన్ని) కురిపించగానే, అది పులకించి, ఉబ్బి పోతుంది. నిశ్చయంగా దీనిని (ఈ భూమిని) బ్రతికించి లేపే ఆయన (అల్లాహ్ యే) మృతులను కూడా బ్రతికించి లేపుతాడు. నిశ్చయంగా, ఆయన ప్రతిదీ చేయగల సమర్థుడు.

40. నిశ్చయంగా, మా సూచనలకు వికృతార్థం అంటగట్టేవారు మాకు కనిపించకుండా ఉండలేరు. అయితే! పునరుత్థాన దినమున నరకాగ్నిలో పడవేయబడేవాడు ఉత్తముడా? లేక శాంతియుతంగా వచ్చేవాడా? మీరు కోరేది మీరు చేయండి. నిశ్చయంగా, మీరు చేసేదంతా ఆయన చూస్తున్నాడు.

41. నిశ్చయంగా, తమ దగ్గరకు హితబోధ వచ్చినపుడు దానిని తిరస్కరించే వారే (నష్టపోయే వారు). మరియు నిశ్చయంగా, ఇది (ఈ ఖుర్ఆన్) చాలా శక్తివంతమైన (గొప్ప) గ్రంథం;

42. అసత్యం దాని (ఖుర్ఆన్) ముందు నుండి గానీ లేదా దాని వెనుక నుండి గానీ దాని పైకి రాజాలదు. అది మహా వివేకవంతుడు, సర్వస్తోత్రాలకు అర్హుడు, అయిన ఆయన (అల్లాహ్) తరఫు నుండి

అవతరింప జేయబడింది[22].

**43.** (ఓ ముహమ్మద్!) వాస్తవానికి, నీకు చెప్పబడిన దానిలో పూర్వం గతించిన ప్రవక్తలకు చెప్పబడనిది ఏదీ లేదు[23]. నిశ్చయంగా, నీ ప్రభువు మాత్రమే క్షమాశీలుడు మరియు బాధాకరమైన శిక్ష విధించేవాడు కూడాను!

**44.** ఒకవేళ మేము ఈ ఖుర్ఆన్ ను అరబ్బేతర భాషలో అవతరింపజేసి ఉండినట్లయితే వారు ఇలా అని ఉండేవారు: "దీని సూచనలు (ఆయాత్) స్పష్టంగా ఎందుకు వివరించబడ లేదు?[24] (గ్రంథమేమో) అరబ్బేతర భాషలో మరియు (సందేశహరుడేమో) అరబ్బు?" వారితో ఇలా అను: "ఇది (ఈ ఖుర్ఆన్) విశ్వసించిన వారికి మార్గదర్శకత్వం మరియు స్వస్థత నొసంగేది.

---

[22] ఈ ఖుర్ఆన్ అన్ని విధాలుగా భద్రపరచబడింది - దాని ముందు నుండి గానీ మరియు వెనుక నుండి గానీ - అంటే అసత్యవాదులు దీని ముందు నుండి వచ్చి ఇందులో దేనినీ తగ్గించలేరు. మరియు దీని వెనుక నుండి వచ్చి దీనిలో దేనినీ అధికం చేయలేరు. అంటే ఇందులో ఏ విధమైన మార్పులు తేలేరు. ఎందుకంటే ఇది మహా వివేకవంతుడు, సర్వస్తోత్రాలకు అర్హుడైన అల్లాహ్ (సు.తా.) తరఫునుండి అవతరింపజేయబడింది. మరియు ఆయనే పునరుత్థానదినం వరకు దీనిని (ఖుర్ఆన్) ను భద్రంగా ఉంచుతాను, అని అన్నాడు. (ఇబ్నె-కసీ'ర్).

[23] చూడండి, 51:52-53. వ్యాఖ్యాతలు దీనిని రెండు విధాలుగా అర్థం చేసుకున్నారు. ఒకటి: పూర్వప్రజలు తమ ప్రవక్త ('అ.స.) లతో ఇతను పిచ్చివాడు, మాంత్రికుడు, అసత్యవాదుడు, వగైరా అన్న మాటలనే ఈ మక్కా ముష్రికులు కూడా మీతో అంటున్నారు. ఈ విధమైన మాటలతో దైవప్రవక్త ఓదార్చబడుతున్నారు.

[24] చూడండి, 13:37 మరియు 14:4.

మరియు విశ్వసించనివారి చెవులకు అవరోధం మరియు వారి కళ్ళకు ఒక గంత. అలాంటి వారి స్థితి ఎంతో దూరం నుండి పిలువబడిన వారి అరుపులాంటిది!"

**45.** వాస్తవానికి మేము మూసాకు గ్రంథాన్ని ప్రసాదించాము, కాని దాని విషయంలో కూడా భేదాభిప్రాయాలు వచ్చాయి. ఒకవేళ నీ ప్రభువు నుండి, మొదటి నుంచే నిర్ణయం తీసుకోబడి ఉండక పోతే[25], వారి మధ్య ఎప్పుడో తీర్పు జరిగి వుండేది. మరియు నిశ్చయంగా, వారు దానిని గురించి ఆందోళన కలిగించే సందేహానికి గురి అయ్యారు.

**46.** ఎవడైతే సత్కార్యం చేస్తాడో అతడు తన (మేలు) కొరకే చేస్తాడు. మరియు దుష్కార్యం చేసేవాడు దాని (ఫలితాన్ని) అనుభవిస్తాడు. మరియు నీ ప్రభువు తన దాసులకు అన్యాయం చేసేవాడు కాడు.

**47.** ఆ (అంతిమ) ఘడియ జ్ఞానం కేవలం ఆయనకే చెందినది[26]. మరియు ఆయనకు తెలియకుండా ఫలాలు పుష్పకోశాల[27] నుండి బయటికి రావు మరియు ఆయనకు తెలియ కుండా ఏ స్త్రీ కూడా గర్భం దాల్చదు మరియు ప్రసవించదు. మరియు

---

[25] అంటే వారికొక గడువు నిర్ణయించబడి ఉంది మరియు వారికి వ్యవధి ఇవ్వబడుతోంది. చూడండి, 35:45.

[26] చూడండి, 7:187 మరియు 79:44.

[27] అక్ మామ్: Sheath, Bud, Calyx, పుష్పకోశం, కవచం, ఒర, పొర, తొడిమ

ఏ దినమునైతే వారిని పిలిచి: "మీరు నాకు సాటి కల్పించే ఆ భాగస్వాములు ఎక్కడున్నారు?" అని అడిగితే, వారు ఇలా జవాబిస్తారు: "మాలో ఎవ్వడు కూడా దీనికి సాక్ష్యం ఇచ్చేవాడు లేడని మేము ఇది వరకే మనవి చేసుకున్నాము!"

48. మరియు వారు ఇంతకు పూర్వం ఆరాధించే వారంతా వారిని త్యజించి ఉంటారు. మరియు తమకు తప్పించుకునే మార్గం లేదని వారు గ్రహిస్తారు[28].

49. మానవుడు మేలు కొరకు ప్రార్థిస్తూ ఎన్నడూ అలసిపోడు. కాని ఒకవేళ అతనికి ఏదైనా ఆపద కలిగితే, అతడు ఆశ వదలి నిరాశ చెందుతాడు[29].

50. మరియు ఒకవేళ మేము అతనికి ఆపద కాలం దాటి పోయిన తర్వాత మా కారుణ్యాన్ని రుచి చూపిస్తే అతడు తప్పకుండా ఇలా అంటాడు: "ఇది నా హక్కే! మరియు పునరుత్థాన దినం వస్తుందని నేను భావించను. మరియు ఒకవేళ నేను నా ప్రభువు వద్దకు మరలింప బడినా! నిశ్చయంగా, నాకు ఆయన దగ్గర మేలే ఉంటుంది." కాని మేము సత్యతిరస్కారులకు వారు చేసిన కర్మలను గురించి వారికి తప్పక తెలుపుతాము మరియు వారికి భయంకరమైన శిక్షను రుచి చూపిస్తాము.

51. మరియు ఒకవేళ మేము మానవుణ్ణి అనుగ్రహిస్తే,

[28] చూడండి, 18:53.
[29] చూడండి, 11:9.

అతడు మా నుండి విముఖుడై ప్రక్కకు మరలిపోతాడు. మరియు ఒకవేళ తనకు ఆపద వస్తే సుదీర్ఘమైన ప్రార్థనలు చేస్తాడు.

**52.** ఇలా అను: "ఏమీ? మీరు ఆలోచించారా? ఒకవేళ ఇది (ఈ ఖుర్ఆన్) అల్లాహ్ తరఫు నుండి వచ్చి ఉండి మీరు దానిని తిరస్కరిస్తే, దానిని వ్యతిరేకించటంలో చాలా దూరం పోయిన వాని కంటే ఎక్కువ మార్గభ్రష్టుడెవడు?"

**53.** ఇక త్వరలోనే మేము వారికి మా సంకేతాలను (ఆయాత్ లను), వారి చుట్టూ ఉన్న ఖగోళంలో[30] మరియు వారియెందును చూపుతాము; చివరకు ఇదే (ఈ ఖుర్ఆనే) సత్యమని వారికి స్పష్టమవుతుంది. ఏమీ? నీ ప్రభువు! నిశ్చయంగా, ఆయనే ప్రతిదానికి సాక్షి, అనే విషయం చాలదా?

**54.** అది కాదు! నిశ్చయంగా, వారు తమ ప్రభువును కలుసుకునే విషయం పట్ల సందేహంలో పడి వున్నారు. జాగ్రత్త! నిశ్చయంగా, ఆయన ప్రతి దానిని ఆవరించి ఉన్నాడు.

---

[30] ఉదాహరణకు సూర్యచంద్రులు, రాత్రింబవళ్ళు, గాలివానలు మొదలైనవి.

# 42. అష్-షురా [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. హా - మీమ్[1].
2. ఐన్ - సీన్ - ఖాఫ్[2],
3. (ఓ ముహమ్మద్!) సర్వశక్తిమంతుడూ, మహావివేకవంతుడూ అయిన అల్లాహ్, ఇదే విధంగా నీకూ మరియు నీ కంటే ముందు వచ్చిన వారికి కూడా దివ్యజ్ఞానం (వహీ) అవతరింప జేశాడు[3].

---

[*] [అష్-షురా అంటే సమాలోచనలు, సంప్రదింపులు]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

[2] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

[3] ఏ విధంగానైతే దైవప్రవక్త ('స'అస)పై దివ్యజ్ఞానం అవతరింపజేయబడిందో, అదే విధంగా అతనికి ముందు వచ్చిన ప్రవక్తలపై కూడా అవతరింపజేయబడింది. దైవప్రవక్త ('స'అస) పై వ'హీ అవతరణను గురించి, ఒక 'స'హాబీ (ర'ది.'అ), దైవప్రవక్త ('స'అస) ను ప్రశ్నించగా ఇలా అన్నారు : "కొన్ని సార్లు అది (వ'హీ) నా దగ్గరకు ఘుంటల శబ్దం వలే వస్తుంది. ఇది చాలా కఠినతరమైనది. అది ఆగిన తరువాత నాకు అంతా కంఠస్థమైపోతుంది. కొన్నిసార్లు దైవదూత ('అ.స.) మానవరూపంలో వచ్చి నాకు చెబుతాడు. అతను చెప్పినదంతా నాకు జ్ఞాపకమైపోతుంది." 'ఆయిషహ్ (ర.'అన్హా) అన్నారు : "నేను విపరీతమైన చలికాలంలో కూడా, వ'హీ అవతరణ ముగిసిన తరువాత, దైవప్రవక్త ('స'అస) ను చెమటలో మునిగి పోవటాన్ని చూశాను. మరియు అతని నుదుటి నుండి చెమట బిందువులు కారటం కూడా చూశాను." ('స'హీ'హ్ బు'ఖారీ).

4. ఆకాశాలలో మరియు భూమిలో ఉన్నదంతా ఆయనకు చెందినదే. ఆయన మహోన్నతుడు, సర్వోత్తముడు.

5. ఆకాశాలు, పైనుండి దాదాపు ప్రేలి పోనున్నాయి. మరియు దేవదూతలు తమ ప్రభువు పవిత్రతను కొనియాడుతూ, ఆయనను స్తుతిస్తూ ఉన్నారు మరియు భూమిలో ఉన్నవారి కొరకు క్షమాపణ కోరుతున్నారు. చూడండి, నిశ్చయంగా అల్లాహ్! ఆయనే క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

6. మరియు ఎవరైతే ఆయనను వదలి ఇతరులను తమ సంరక్షకులుగా చేసుకుంటారో, వారిని అల్లాహ్ కనిపెట్టుకొని ఉన్నాడు. మరియు నీవు వారికి బాధ్యుడవు కావు[4].

7. మరియు ఈ విధంగా మేము నీపై ఈ ఖుర్ఆన్ ను, అరబ్బీ భాషలో, దివ్యజ్ఞానం (వహీ) ద్వారా అవతరింపజేశాము[5]. దానితో నీవు ఉమ్ముల్ ఖురా (మక్కా)[6] మరియు దాని చుట్టుప్రక్కల వారిని హెచ్చరించటానికి మరియు - దానిని గురించి ఎలాంటి సందేహం లేని - ఆ సమావేశ

[4] నీ బాధ్యత కేవలం మా సందేశాన్ని వారికి అందజేయటమే!

[5] చూడండి, 14:4, 13:37, 19:97 ప్రతి ప్రవక్త ('అ.స.) తన కాలపు ప్రజల భాషనే మాట్లాడేవాడు.

[6] ఉమ్ముల్-ఖురా: అంటే అన్ని నగరాల తల్లి. మక్కా యొక్క మరొక పేరు. ఇది అతి ప్రాచీన నగరం. చూడండి 6:92

దినాన్ని గురించి హెచ్చరించేందుకు కూడా[7]. (ఆ రోజు) ఒక వర్గం వారు స్వర్గానికి పోతారు, మరొక వర్గం వారు మండే నరకాగ్నిలోకి పోతారు.

8. మరియు ఒకవేళ అల్లాహ్ కోరితే వారందరినీ ఒకే సమాజంగా చేసి ఉండేవాడు![8] కాని ఆయన తాను కోరిన వారిని తన కరుణకు పాత్రులుగా చేసుకుంటాడు[9]. మరియు దుర్మార్గుల కొరకు, రక్షించేవాడు గానీ సహాయపడేవాడు గానీ ఎవ్వడూ ఉండడు.

9. లేక వారు ఆయనను వదలి ఇతరులను సంరక్షకులుగా చేసుకున్నారా? కానీ అల్లాహ్! కేవలం ఆయనే సంరక్షకుడు మరియు ఆయనే మృతులను బ్రతికించేవాడు మరియు ఆయనే ప్రతిదీ చేయగల సమర్థుడు.

10. మరియు మీరు ఏ విషయాన్ని గురించి భేదాభిప్రాయాలు కలిగి వున్నారో, దాని తీర్పు అల్లాహ్ వద్దనే ఉంది[10]. ఆయనే అల్లాహ్! నా ప్రభువు, నేను ఆయననే నమ్ముకున్నాను మరియు నేను పశ్చాత్తాపంతో ఆయన వైపునకే మరలుతాను.

---

[7] పునరుత్థానదినం: సమావేశదినం ఎందుకు అనబడిందంటే, ఆ రోజు అన్ని తరాలకు చెందిన మానవులు, మంచివారు, చెడ్డవారు, విశ్వాసులు, అవిశ్వాసులు అందరూ సమావేశపరచ బడతారు.

[8] చూడండి, 5:48, 16:93, 10:19.

[9] చూడండి, 14:4 మరియు, 22:16

[10] చూడండి, 5:101.

11. ఆయనే ఆకాశాలు మరియు భూమి యొక్క సృష్టికి మూలాధారి. ఆయన మీలో నుండే మీ కొరకు జంటల్ని మరియు పశువులలో కూడా జంటల్ని చేశాడు[11]. ఈ విధంగా, ఆయన మిమ్మల్ని వ్యాపింప జేస్తున్నాడు. ఆయనకు పోలింది ఏదీ లేదు[12]. మరియు ఆయన సర్వం వినేవాడు, సర్వం చూసేవాడు.

12. ఆకాశాల యొక్క మరియు భూమి యొక్క తాళపు చెవులు ఆయన వద్దనే వున్నాయి. ఆయన తాను కోరిన వానికి జీవనోపాధిని పుష్కలంగా ప్రసాదిస్తాడు మరియు (తాను కోరిన వానికి) దానిని మితంగా ఇస్తాడు. నిశ్చయంగా, ఆయనకు ప్రతిదానిని గురించి బాగా తెలుసు.

13. ఆయన, నూహ్ కు విధించిన (ఇస్లాం) ధర్మాన్నే, మీ కొరకు శాసించాడు; మరియు దానినే (ఓ ముహమ్మద్!) మేము నీకు దివ్యజ్ఞానం (వహీ) ద్వారా అవతరింపజేశాము; మరియు మేము దానినే ఇబ్రాహీమ్, మూసా మరియు ఈసాలకు

[11] చూడండి, 16:72.
[12] ఆయన (సు.తా.) తో పోల్చదగినది విశ్వంలో ఏదీ లేదు. చూడండి, 6:100, 112:4.

కూడా విధిగా చేశాము. ఈ ధర్మాన్నే స్థాపించాలని[13] మరియు దానిని గురించి భేదాభిప్రాయాలకు గురి కాకుండా ఉండాలని. నీవు దాని వైపునకు పిలిచేది బహుదైవారాధకులకు ఎంతో సహింపలేనిదిగా ఉంది. అల్లాహ్ తాను కోరిన వానిని తన వైపునకు ఆకర్షిస్తాడు మరియు పశ్చాత్తాపంతో తన వైపునకు మరలేవానికి మార్గదర్శకత్వం చేస్తాడు[14].

**14.** మరియు వారి వద్దకు (సత్య) జ్ఞానం వచ్చిన తరువాతనే - వారి పరస్పర ద్వేషం వల్ల – వారి మధ్య భేదాభిప్రాయాలు వచ్చాయి. మరియు ఒక నిర్ణీత కాలపు వాగ్దానం నీ ప్రభువు తరఫు నుండి చేయబడి ఉండకపోతే, వారి మధ్య తీర్పు ఎప్పుడో జరిగి ఉండేది[15]. మరియు నిశ్చయంగా, వారి తర్వాత గ్రంథాన్ని వారసత్వంలో పొందిన వారు

---

[13] అద్దీను: ధర్మం అంటే అల్లాహ్ (సు.తా.) ను విశ్వసించి ఆయన అద్వితీయాన్ని నమ్మి, ఆయన ప్రవక్తలను అనుసరించి, ఆయన షరీయత్ పై నడవటం. ప్రవక్తలందరి ధర్మం ఇదే! చూడండి, 2:213. కాని వారి షరీయత్ లలో కొన్ని భేదాలుండవచ్చు. (చూడండి, 5:48) అందుకే దైవప్రవక్త ('స'అస) అన్నారు: 'మేము (ప్రవక్తలం) అంతా సోదరులం. మా అందరి ధర్మం ఒక్కటే ఇస్లాం!' ('స'హీ'హ్ బు'ఖారీ)

[14] అల్లాహ్ (సు.తా.) అతనికే మార్గదర్శకత్వం చేస్తాడు, ఎవడైతే స్వయంగా, అల్లాహ్ (సు.తా.) వైపునకు మరలుతాడో! ఇక ఎవడైతే మార్గభ్రష్టత్వాన్ని ఎన్నుకుంటాడో, ఆయన అతనిని దానిలో వదలుతాడు. అల్లాహ్ (సు.తా.) దృష్టిలో, ఆయనకు విధేయత (ఇస్లాం) మాత్రమే నిజమైన ధర్మం. చూడండి, 3:19, 3:85, 21:92 చూడండి, 23:52.

[15] చూడండి, 10:19.

దానిని (ఇస్లాంను) గురించి గొప్ప సంశయంలో పడి ఉన్నారు.

15. కావున నీవు (ఓ ముహమ్మద్!) దీని (ఈ సత్యధర్మం) వైపునకే వారిని పిలువు. మరియు నీకు ఆజ్ఞాపించబడిన విధంగా దానిపై స్థిరంగా ఉండు. మరియు వారి కోరికలను అనుసరించకు. మరియు వారితో ఇలా అను: "అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్నే నేను విశ్వసించాను. మరియు మీ మధ్య న్యాయం చేయమని నేను ఆజ్ఞాపించబడ్డాను. అల్లాహ్ యే మా ప్రభువు! మరియు మీ ప్రభువు కూడాను, మా కర్మలు మాకూ మరియు మీ కర్మలు మీకూ, మా మధ్య మరియు మీ మధ్య ఎలాంటి వివాదం ఉండనవసరం లేదు. అల్లాహ్ మనందరినీ సమావేశపరుస్తాడు. మరియు ఆయన వైపే (మనందరి) గమ్యస్థానముంది."

16. మరియు అల్లాహ్ సందేశం స్వీకరించిన తర్వాత(స్వీకరించిన వారితో) ఆయనను గురించి ఎవరు వాదిస్తారో, వారి వాదం వారి ప్రభువు సన్నిధిలో నిరర్థకమైనది; మరియు వారిపై ఆయన (అల్లాహ్) ఆగ్రహం విరుచుకు పడుతుంది మరియు వారికి కఠిన శిక్ష పడుతుంది.

17. అల్లాహ్ యే సత్యంతో గ్రంథాన్ని[16] మరియు

[16] గ్రంథం అంటే ఇక్కడ అన్నీ దివ్యగ్రంథాలు.

(న్యాయానికి) త్రాసును[17] అవతరింప జేశాడు. మరి నీవు ఏ విధంగా గ్రహించగలవు. బహుశా తీర్పు ఘడియ సమీపంలోనే ఉండవచ్చు!

**18.** దానిని నమ్మని వారే దాని కొరకు తొందర పెడతారు. మరియు విశ్వసించిన వారు, దానిని గురించి భయపడతారు మరియు అది రావటం నిశ్చయంగా, సత్యమేనని తెలుసు కుంటారు. వినండి! నిశ్చయంగా ఎవరైతే తీర్పు ఘడియను గురించి వాదులాడుతారో, వారు మార్గభ్రష్టత్వం లో చాలా దూరం పోయిన వారే!

**19.** అల్లాహ్ తన దాసుల పట్ల ఎంతో మృదుహృదయుడు; ఆయన తాను కోరిన వారికి జీవనోపాధిని ప్రసాదిస్తాడు. మరియు ఆయన మహా బలవంతుడు, సర్వశక్తి సంపన్నుడు.

**20.** ఎవడు పరలోక ఫలాన్ని కోరుకుంటాడో మేము అతనికి అతని ఫలంలో వృద్ధి కలిగిస్తాము[18]. మరియు ఎవడైతే ఇహలోక ఫలాన్ని కోరుకుంటాడో, మేము అతనికి దాని నొసంగుతాము మరియు అతనికి పరలోక (ప్రతిఫలంలో) ఎలాంటి భాగముండదు[19].

---

[17] త్రాసు ఎందుకు పేర్కొనబడిందంటే, న్యాయంగా తూచటానికి త్రాసు మాత్రమే ఉపయోగపడుతుంది. దీనికై చూడండి,57:25 మరియు 55:7-9.

[18] పుణ్యఫలితంలో ఈ అధికం, అల్లాహ్ (సు.తా.) కోరితే పదిరెట్లు లేక ఏడు వందల రెట్లు లేక ఇంకా ఎక్కువ రెంట్లు కావచ్చు.

[19] ఇటువంటి ఆయత్ కు చూడండి, 17:18.

21. ఏమీ? అల్లాహ్ అనుమతించని ధర్మాన్ని వారి
కొరకు విధించగల, ఆయన భాగస్వాములు
ఎవరైనా వారి దగ్గర ఉన్నారా? ఒకవేళ తీర్పుదినపు
వాగ్దానం ముందే చేయబడి ఉండకపోతే, వారి
మధ్య తీర్పు ఎప్పుడో జరిగి వుండేదే. మరియు
నిశ్చయంగా, ఈ దుర్మార్గులకు బాధాకరమైన
శిక్ష పడుతుంది.

22. ఈ దుర్మార్గులు (పునరుత్థాన దినాన) తాము
చేసిన కర్మల ఫలితాన్ని చూసి భయపడటాన్ని,
నీవు చూస్తావు మరియు అది వారిపై తప్పక
పడుతుంది. మరియు ఎవరైతే విశ్వసించి,
సత్కార్యాలు చేస్తారో, వారు స్వర్గపు పచ్చిక
మైదానాలలో ఉంటారు. వారికి తాము కోరేదంతా
తమ ప్రభువు తరఫు నుండి లభిస్తుంది అదే ఆ
గొప్ప అనుగ్రహం.

23. ఆ (స్వర్గపు) శుభవార్తనే, అల్లాహ్ విశ్వసించి
సత్కార్యాలు చేసే తన దాసులకు తెలియ
జేస్తున్నాడు. (ఓ ప్రవక్తా!) వారితో ఇలా అను:
"నేను దీనికి బదులుగా మీ నుండి బంధుత్వ

ప్రేమ తప్ప వేరే ప్రతిఫలాన్ని కోరడం లేదు!"[20] మరియు ఎవడు మంచిని సంపాదించు కుంటాడో, అతనికి దానిలో మేము మరింత మంచిని పెంచుతాము. నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, కృతజ్ఞతలను ఆమోదించేవాడు.

24. ఏమీ? వారు: "అతను (ముహమ్మద్!) అల్లాహ్ పేరుతో అసత్యాలు కల్పిస్తున్నాడు" అని అంటున్నారా? కాని ఒకవేళ అల్లాహ్ తలచుకుంటే, నీ హృదయం మీద ముద్రవేసే వాడు. మరియు

---

[20] మక్కా ముష్రిక్ ఖురైషులు చాలామంది దైవప్రవక్త ('స'అస) దగ్గరి సంబంధీకులే. ఇక్కడ వారితో: 'స్నేహ, ప్రేమభావాలు చూపకున్నా - తాను, అల్లాహ్ (సు.తా.) ధర్మం ఇస్లాం ను ప్రచారం చేస్తున్నందుకు - కనీసం శత్రుత్వమైనా వహించకండి.' అని చెప్పమని అల్లాహ్ (సు.తా.) దైవప్రవక్త ('స'అస) ను ఆదేశిస్తున్నాడు. మరొక ముఖ్య విషయం ఇక్కడ షియా తెగవారు భిన్నంగా అర్థం చేసుకొని దానిని ప్రచారం చేస్తున్నది: 'ఇక్కడ బంధుత్వ ప్రేమను వారు, 'అలీ, ఫాతిమా, 'హసన్ మరియు 'హుసైన్ ర'ది.'అన్హుమ్ లతో మాత్రమే, ప్రేమతో వ్యవహరించడం, అని అర్థం తీశారు. ఈ సూరహ్ మక్కాలో అవతరింపజేయబడింది. అప్పుడు 'అలీ మరియు ఫాతిమా (ర'ది. 'అన్హుమ్)ల వివాహం కూడా కాలేదు. మరొక విషయమేమిటంటే దైవప్రవక్త ('స'అస) కు నలుగురు కుమార్తెలు, 'జైనబ్, రుఖయ్యా, ఉమ్మె కుల్సూ'మ్, ఫాతిమ మరియు ముగ్గురు కుమారులు, ఖాసిమ్, 'అబ్దుల్లాహ్ మరియు ఇబ్రాహీమ్ (రజి.అన్హుమ్)లు. కుమారులందరూ చిన్న వయస్సులలోనే చనిపోయారు. కాని ఇతర ముగ్గురు కుమార్తెలు (ర'ది.'అన్హుమ్) భర్తా, పిల్లలు గలవారు. వారు కూడా దైవప్రవక్త ('స'అస) యొక్క దగ్గరి సంబంధీకు (ఖురబా) లలోని వారే కదా! వారిలో ఇద్దరు మూడవ 'ఖలీఫా 'ఉస్మాన్ (ర'ది.'అ.) భార్యలు కూడాను. కాని ఈ షియా తెగవారు, వారిని దైవప్రవక్త ('స'అస) దగ్గరి సంబంధీకులలో పరిగణించకపోవడం అతిశయం కాదా!

అల్లాహ్ అసత్యాన్ని రూపుమాపి, తన ఆజ్ఞతో సత్యాన్ని స్థాపిస్తాడు[21]. నిశ్చయంగా ఆయనకు హృదయాలలో ఉన్నదంతా బాగా తెలుసు.

**25.** ఆయనే తన దాసుల పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడు. మరియు పాపాలను మన్నించే వాడు. మరియు మీరు చేసేదంతా ఆయనకు బాగా తెలుసు.

**26.** మరియు ఆయన విశ్వసించి, సత్కార్యాలు చేసేవారి ప్రార్థనలను అంగీకరిస్తాడు మరియు వారిపై తన అనుగ్రహాన్ని మరింత అధికం చేస్తాడు. ఇక సత్యతిరస్కారులు! వారికి కఠిన శిక్ష పడుతుంది.

**27.** మరియు ఒకవేళ అల్లాహ్ తన దాసులందరికీ పుష్కలంగా జీవనోపాధిని ప్రసాదించి ఉంటే, వారు భూమిలో తిరుగుబాటుకు పాల్పడేవారు. కావున ఆయన తన ఇష్టప్రకారం, మితంగా ఇస్తాడు. నిశ్చయంగా, ఆయన తన దాసులను గురించి బాగా ఎరుగును, ఆయన అంతా చూస్తున్నాడు!

**28.** మరియు ఆయనే, వారు నిరాశకులోనై ఉన్నప్పుడు వర్షాన్ని కురిపిస్తాడు మరియు తన కారుణ్యాన్ని వ్యాపింపజేస్తాడు. మరియు ఆయనే సంరక్షకుడు, ప్రశంసనీయుడు.

**29.** మరియు ఆయన సూచనలలో (ఆయాత్ లలో), ఆకాశాలను మరియు భూమిని మరియు వాటిలో వ్యాపింపజేసిన జీవరాసులను సృష్టించటం కూడా

[21] చూడండి, 10:82.

ఉంది. మరియు ఆయన తాను కోరినప్పుడు వాటినన్నింటినీ సమీకరించగల సమర్థుడు.

30. మీపై ఏ ఆపద వచ్చినా, అది మీ చేతులారా మీరు సంపాదించుకున్నదే! మరియు ఆయన (మీ తప్పులను) ఎన్నింటినో క్షమిస్తాడు[22].

31. మరియు మీరు భూమిలో ఆయన నుంచి తప్పించుకోలేరు. మరియు మీకు అల్లాహ్ తప్ప మరొక సంరక్షకుడు గానీ, సహాయకుడు గానీ లేడు!

32. మరియు ఆయన సూచనలలో (ఆయాత్ లలో) సముద్రంలో, కొండల మాదిరిగా పయనించే ఓడలు కూడా వున్నాయి.

33. ఒకవేళ ఆయన కోరితే గాలిని ఆపగలడు. అప్పుడవి దాని (సముద్రపు) వీపు మీద నిలిచి పోతాయి. నిశ్చయంగా, ఇందులో సహనం గలవానికి, కృతజ్ఞునికి ఎన్నో సూచనలున్నాయి.

34. లేదా ఆయన వారి కర్మల ఫలితంగా వారిని (ముంచి) నాశనం చేయవచ్చు, కాని ఆయన ఎన్నింటినో క్షమిస్తాడు కూడాను.

---

[22] చూడండి, 51:52-53. వ్యాఖ్యాతలు దీనిని రెండు విధాలుగా అర్థం చేసుకున్నారు. ఒకటి: పూర్వ ప్రజలు తమ ప్రవక్త ('అలైహిమ్.స.)లతో ఇతను పిచ్చివాడు, మాంత్రికుడు, అసత్యవాదుడు, వగైరా అన్న మాటలనే ఈ మక్కా ముష్రికులు కూడా నీతో అంటున్నారు. ఈ విధంగా దైవప్రవక్త ('స'అస) ఓదార్చబడుతున్నారు. రెండో అర్థం: దైవప్రవక్త ('స'అస) తో ఏకాగ్రచిత్తం, ఏక దైవారాధన, (ఇస్లాం) గురించి చెప్పబడిన మాటలు, ఇంతకు ముందు ప్రవక్తలందరితో చెప్పబడిన మాటలే! (ఫ'త్హ్ అల్-ఖదీర్).

**35.** మరియు మా సూచన (ఆయాత్) లను గురించి వాదులాడేవారు, తమకు తప్పించుకునే చోటు లేదని తెలుసుకుంటారు[23].

**36.** కావున మీకు ఇవ్వబడిందంతా ప్రాపంచిక జీవితపు సుఖసంతోషమే. కనుక అల్లాహ్ వద్దనున్నదే - విశ్వసించి తమ ప్రభువునే నమ్ముకున్న వారి కొరకు - ఉత్తమమైనదీ మరియు శాశ్వతమైనదీను[24].

**37.** మరియు అలాంటి వారు పెద్ద పాపాలు మరియు అశ్లీలమైన పనులకు దూరంగా ఉంటారు మరియు కోపం వచ్చినా క్షమిస్తారు[25],

**38.** మరియు అలాంటివారు తమ ప్రభువు ఆజ్ఞాపాలన చేస్తారు మరియు నమాజ్ స్థాపిస్తారు[26] మరియు తమ వ్యవహారాలను పరస్పర సంప్రదింపుల

---

[23] చూడండి, 40:35.

[24] కావున ఇహలోక జీవిత సుఖసంతోషాలకు ఎక్కువ ప్రాధాన్యత నివ్వకుండా, విశ్వసించి సత్కార్యాలు చేయటంలో పోటీ పడండి.

[25] దైవప్రవక్త('స'అస) తన స్వంతానికి జరిగిన కష్టనష్టాలకూ, హానికీ ఎన్నడూ ప్రతీకారం తీసుకోలేదు.కాని అల్లాహ్ (సు.తా.) యొక్క హద్దులను అతిక్రమించటం అతనికి సహించరాని విషయం, (బు'ఖారీ, ముస్లిం).

[26] నమా'జ్ ను సరిగ్గా, దాని సమయంలో చేయటం విశ్వాసానికి ఆనవాలు.

ద్వారా పరిష్కరించు కుంటారు[27] మరియు మేము వారికి ప్రసాదించిన జీవనోపాధి నుండి ఇతరుల మీద ఖర్చు చేస్తారు;

**39.** మరియు అలాంటి వారు తమపై దౌర్జన్యం జరిగినపుడు దానికి న్యాయప్రతీకారం మాత్రమే చేస్తారు[28].

**40.** మరియు కీడుకు ప్రతీకారం దానంతటి కీడు మాత్రమే. కాని ఎవడైనా క్షమించి సంధి చేసు కుంటే అతని ప్రతిఫలం అల్లాహ్ దగ్గర ఉంది. నిశ్చయంగా, ఆయన దుర్మార్గులంటే ఇష్ట పడడు[29]

**41.** కాని ఎవరైనా తమకు అన్యాయం జరిగినప్పుడు దానికి తగినంత న్యాయప్రతీకారం మాత్రమే తీసుకుంటే అలాంటి వారు నిందార్హులు కారు.

**42.** కాని, వాస్తవానికి ఎవరైతే ప్రజలపై దౌర్జన్యాలు చేస్తారో మరియు భూమిలో అన్యాయంగా ఉపద్రవాలు రేకెత్తిస్తారో అలాంటివారు నిందార్హులు.

---

[27] 'స'హాబా (ర'ది.'అన్హుమ్)లు తమ విషయాలలో పరస్పరం సంప్రదింపులు, సలహాలు చేసుకునే వారు. దైవప్రవక్త ('స'అస) కూడా ముఖ్యమైన విషయాలలో, యుద్ధ సన్నాహాలలో తమ అనుచరు (ర'ది.'అన్హుమ్)లతో సంప్రదింపులు చేసేవారు. ఒక పాలకుడు కూడ తనకు సలహాలివ్వటానికి నిపుణులను నియమించుకోవడం ఎంతో ముఖ్యం. చూడండి, 3:159.

[28] దైవప్రవక్త ('స'అస) ఎన్నడూ, తనకు హాని చేసిన వారితో కూడా ప్రతీకారం తీర్చుకోలేదు. ఉదాహరణకు అతనికి ఆహారంలో విషమిచ్చిన యూదు స్త్రీతో మరియు అతనిపై మంత్రజాలం (చేతబడి) చేసిన లుబైద్ బిన్ 'ఆసిమ్ తో లేక అతనిని చంపగోరిన వారితో గాని ప్రతీకారం తీర్చుకోలేదు.

[29] చూడండి, 2:190.

అలాంటివారికే! బాధాకరమైన శిక్ష గలదు.

**43.** మరియు ఎవడైతే సహనం వహించి క్షమిస్తాడో! నిశ్చయంగా, అది (అల్లాహ్ దృష్టిలో) ఎంతో సహృదయంతో (సాహసంతో) కూడిన పని![30]

**44.** మరియు, ఎవడినైతే అల్లాహ్ మార్గభ్రష్టత్వంలో పడనిస్తాడో! దాని తరువాత వాడికి సంరక్షకుడు, ఎవ్వడూ ఉండడు[31]. మరియు ఈ దుర్మార్గులు శిక్షను చూసినపుడు: "మేము తిరిగి (భూలోకంలోకి) పోయే మార్గమేదైనా ఉందా?" అని అడగటం నీవు చూస్తావు[32].

**45.** మరియు వారిని, దాని (నరకం) ముందుకు తీసుకొని వచ్చినప్పుడు, వారు అవమానంతో కృంగిపోతూ, దొంగచూపులతో దానిని చూడటం నీవు గమనిస్తావు. మరియు విశ్వసించిన వారు ఇలా అంటారు: "నిశ్చయంగా, తమను తాము మరియు తమ సంబంధీకులను (అనుచరులను) నష్టానికి గురిచేసుకున్న వారే, ఈ పునరుత్థానదినమున నష్టపోయేవారు. జాగ్రత్త! నిశ్చయంగా, దుర్మార్గులే శాశ్వతమైన శిక్షకు గురి అవుతారు."

**46.** మరియు అల్లాహ్ తప్ప, ఇతరులెవ్వరూ వారికి రక్షకులుగా గానీ, సహాయకులుగా గానీ ఉండరు. మరియు అల్లాహ్ మార్గభ్రష్టత్వంలో వదిలిన వారికి (దాని నుండి బయటపడే) మార్గమేదీ

---

[30] చూడండి, 41:34-35 మరియు 13:22.

[31] చూడండి, 14:4 చివరి వాక్యం.

[32] చూడండి, 6:27-28.

వుండదు.

**47.** (కావున ఓ మానవులారా మరియు జిన్నాతులారా!) మీరు, తొలగింపబడే అవకాశం లేనటువంటి ఆ దినం అల్లాహ్ తరఫు నుండి రాకముందే, మీ ప్రభువు ఆజ్ఞను శిరసావహించండి. ఆ రోజున మీకు ఎక్కడా ఆశ్రయం లభించదు. మరియు మీకు (మీ పాపాలను) నిరాకరించటానికి కూడా వీలుండదు[33].

**48.** (ఓ ప్రవక్తా!) ఒకవేళ వారు విముఖులైతే మేము నిన్ను వారిపై రక్షకునిగా చేసి పంప లేదు. నీ పని కేవలం (సందేశాన్ని) అందజేయటం మాత్రమే.[34] మరియు మేము మానవునికి మా కారుణ్యాన్ని రుచి చూపిస్తే, దానికి అతడు సంతోషంతో పొంగిపోతాడు. కాని ఒకవేళ వారికి తమ చేతులారా చేసుకున్న దానికి ఫలితంగా, కీడు కలిగినట్లయితే! నిశ్చయంగా, అప్పుడు మానవుడు కృతఘ్నుడవుతాడు!

**49.** భూమ్యాకాశాల సామ్రాజ్యాధికారం అల్లాహ్ దే! ఆయన తాను కోరింది సృష్టిస్తాడు. ఆయన తాను కోరిన వారికి కుమార్తెలను ప్రసాదిస్తాడు మరియు తాను కోరిన వారికి కుమారులను ప్రసాదిస్తుడు.

**50.** లేదా! వారికి కుమారులను మరియు కుమార్తెలను కలిపి ప్రసాదిస్తాడు. మరియు తాను కోరిన వారికి అసలు సంతానమే ఇవ్వడు. నిశ్చయంగా, ఆయన సర్వజ్ఞుడు, అంతా చేయగల సమర్థుడు.

---

[33] చూడండి, 75:10-12

[34] చూడండి, 2:272, 13:40 మరియు.88:21-22

51. మరియు అల్లాహ్ తో మాట్లాడగలిగే శక్తి ఏ మానవునికీ లేదు; కేవలం దివ్యజ్ఞానం (వహీ) ద్వారా లేదా తెర వెనుక నుండి, లేదా ఆయన పంపిన సందేశహరుని ద్వారా, ఆయన అనుమతితో, ఆయన కోరిన (వహీ) అవతరింపజేయబడటం తప్ప![35] నిశ్చయంగా, ఆయన మహోన్నతుడు, మహా వివేకవంతుడు.

52. మరియు ఇదేవిధంగా (ఓ ముహమ్మద్!) మేము మా ఆజ్ఞతో నీ వద్దకు దివ్యజ్ఞానం (రూహ్) అవతరింపజేశాము[36]. (దీనికి ముందు) నీకు గ్రంథమేమిటో మరియు విశ్వాసమేమిటో తెలియదు. కాని మేము దీనిని (ఈ ఖుర్ఆన్ ను) జ్యోతిగా జేసి, దీని ద్వారా మా దాసులలో మేముకోరినవారికి, మార్గదర్శకత్వంచేస్తాము[37]. మరియు నిశ్చయంగా, నీవు (ప్రజలకు)

---

[35] ఈ ఆయత్ లో దివ్యజ్ఞానం (వ'హీ) అవతరింపజేయబడే మూడు విధానాలు పేర్కొనబడ్డాయి: 1) హృదయంలో ఒక విషయం వేయబడటం, లేక స్వప్నంలో వినిపింపజేయబడటం - ఇది అల్లాహ్ (సు.తా.) తరఫు నుండియే ఉందనే దృఢనమ్మకంతో! 2) తెర వెనక నుండి వినిపింపజేయబడటం - ఏ విధంగానైతే మూసా ('అ.స.)కు 'తూర్ పర్వతం మీద వినిపించబడిందో! 3) దైవదూత ('అలైహిమ్ స.) ల ద్వారా అల్లాహ్ (సు.తా.) తన వ'హీని పంపటం. ఏ విధంగానైతే దైవప్రవక్త ('స'అస) దగ్గరకు జిబ్రీల్ ('అ.స.) వ'హీని తీసుకొని వచ్చేవారో! చూడండి, 53:10.

[36] రూ'హున్: ఇక్కడ దివ్యజ్ఞానం(ఖుర్ఆన్) అనే అర్థమిస్తోంది. ఎందుకంటే ఖుర్ఆన్ వల్ల హృదయాలకు 'జీవం' లభిస్తుంది. ఏ విధంగానైతే రూ'హ్ తో మానవునికి జీవం లభిస్తుందో! చూడండి, 16:2, 40:15.

[37] చూడండి, 41:44.

ఋజుమార్గం వైపునకు దారి చూపుతున్నావు.

53. అల్లాహ్ మార్గం![38] భూమ్యాకాశాలలో నున్న ప్రతిదీ ఆయనకే చెందుతుంది. వాస్తవానికి, వ్యవహారాలన్నీ చివరకు (తీర్పు కొరకు) అల్లాహ్ వద్దకే చేరుతాయి.

---

[38] అంటే ఇస్లాం.

# 43. అజ్-జుఖ్రుఫ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. హా - మీమ్[1].
2. స్పష్టమైన ఈ గ్రంథం (ఖుర్ఆన్) సాక్షిగా![2]
3. నిశ్చయంగా, మీరు అర్థం చేసుకోగలగటానికి, మేము దీనిని అరబ్బీ భాషలో ఖుర్ఆన్[3] గా అవతరింపజేశాము.
4. మరియు నిశ్చయంగా, ఇది మా వద్ద నున్న మాతృగ్రంథంలోనిదే![4] అది మహోన్నతమైనది, వివేకంతో నిండి ఉన్నది.
5. ఏమిటి? మీరు మితిమీరి ప్రవర్తిస్తున్నారని, మేము ఈ హితోపదేశాన్ని (ఖుర్ఆన్ ను) మీ నుండి తొలగించాలా?[5]

---

[*] [అజ్-జుఖ్రుఫ్ అంటే అలంకరణలు, బంగారు ఆభరణాలు]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

[2] చూడండి, 12:1.

[3] ఖుర్ఆనున్/ఖుర్ఆనన్: దీని పదార్థాలు సంభాషణ, ప్రసంగం, ఉపన్యాసం, పఠనగ్రంథం, Recitation, Talk, Lecture, Discourse, Sermon, అని ఉన్నాయి. అల్-ఖుర్ఆను అంటే ఈ ఖుర్ఆన్ గ్రంథం. అల్ ఖుర్ఆనుల్-కరీమ్ అంటే The Glorious Quran, ఈ దివ్యఖుర్ఆన్.

[4] ఉమ్ముల్ కితాబ్ : చూడండి, 13:39, 85:22 అంటే లౌ'హె మ'హ్ ఫూ"జ్. మాతృగ్రంథం, సురక్షితమైన ఫలకం, మూలగ్రంథం. అంటే యథాస్థితిలో, భద్రంగా ఉంచబడిన గ్రంథం.

[5] మీరు మితిమీరి ప్రవర్తిస్తున్నారని మేము మీకు హితబోధ చేయటం మానుకుంటామని భావిస్తున్నారా? (ఇబ్నె-కసీ'ర్).

6. మరియు మేము పూర్వం గతించిన వారి వద్దకు ఎంతో మంది ప్రవక్తలను పంపాము.
7. మరియు వారు, తమ వద్దకు వచ్చిన ప్రవక్తలలో ఏ ఒక్కరిని కూడా ఎగతాళి చేయకుండా వదల లేదు.
8. కావున వీరి కంటే ఎంతో బలిష్ఠులైన వారిని మేము పట్టుకొని నాశనం చేశాము[6]. మరియు పూర్వ జాతుల వారి దృష్టాంతాలు ఈ విధంగా గడిచాయి.
9. ఒకవేళ, నీవు వారితో: "భూమ్యాకాశాలను ఎవరు సృష్టించారు?" అని అడిగితే! వారు తప్పక: "వాటిని సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు సృష్టించాడు." అని అంటారు.
10. ఆయనే మీ కొరకు ఈ భూమిని పరుపుగా చేశాడు; మరియు మీరు మీ గమ్యస్థానాలకు చేరుకోవడానికి, అందులో మీ కొరకు త్రోవలు ఏర్పరచాడు[7].
11. మరియు ఆయనే ఆకాశం నుండి తగినంత నీటిని (వర్షాన్ని) కురిపించాడు. తరువాత దాని ద్వారా మేము చచ్చిన నేలను బ్రతికిస్తాము. ఇదే విధంగా మీరు కూడా (బ్రతికింపబడి) బయటికి తీయబడతారు.
12. మరియు ఆయనే అన్ని రకాల జతలను పుట్టించాడు! మరియు ఓడలను మరియు పశువులను మీకు వాహనాలుగా చేశాడు;

---

[6] అంటే వారు మక్కా ముష్రికుల కంటే ఎక్కువ బలవంతులు. ఇంకా చూడండి, 40:82.

[7] చూడండి, 20:53.

13. మీరు వాటి వీపుల మీద ఎక్కటానికి; తరువాత మీరు వాటి మీద కూర్చున్నప్పుడు, మీ ప్రభువు అనుగ్రహాన్ని తలచుకొని ఇలా ప్రార్థించటానికి: "ఆ సర్వలోపాలకు అతీతుడైన ఆయన (అల్లాహ్) వీటిని మాకు వశపరచాడు లేకపోతే ఆ (వశపరచుకునే) సామర్థ్యం మాకు లేదు.
14. మరియు నిశ్చయంగా, మేము మా ప్రభువు వైపునకే మరలిపోవలసి ఉన్నది!"[8]
15. మరియు వారు ఆయన దాసులలో కొందరిని ఆయనలో భాగంగా (భాగస్వాములుగా / సంతానంగా) చేశారు[9]. నిశ్చయంగా, మానవుడు పరమ కృతఘ్నుడు!
16. ఏమిటి? ఆయన తాను సృష్టించిన వాటిలో నుండి తన కొరకు కుమార్తెలను తీసుకొని మీ కొరకు ప్రత్యేకంగా కుమారులను ఉంచాడా?[10]
17. మరియు వారు కరుణామయునికి అంటగట్టేది (ఆడ సంతానమే గనక) వారిలో ఎవడికైనా కలిగిందనే వార్త అందజేయబడినప్పుడు, అతని ముఖం నల్లబడిపోతుంది మరియు అతడు

---

[8] దైవప్రవక్త ('స'అస) తమ వాహనం ఎక్కినప్పుడు: మూడుసార్లు అల్లాహు అక్బర్ తరువాత "సు'హానల్లజీ' స'ఖ్ఖరలనా హా'జా' వమా కున్నా లహూ ముఖ్ రినీన్. వ ఇన్నా ఇలా రబ్బినా లమున్ ఖలిబూన్!" వరకు ఆ ఆయత్ లు (43:13-14) చదివే వారు. ('స. ముస్లిం).

[9] వారు (ముష్రికులు) దైవదూత ('అలైహిమ్ స.) లను అల్లాహ్ (సు.తా.) కుమార్తెలుగా భావించే వారు. ఇక్కడ 'ఇబాదున్ - దాసులు, అంటే దైవదూతలు మరియు జు'జ్ అన్ - అంటే కుమార్తెలు. ఇంకా చూడండి, 6:100.

[10] చూడండి, 16:57-59.

దుఃఖంలో మునిగి పోతాడు!

18. ఏమీ? ఆభరణాల అలంకారంలో పెంచబడి మరియు వివాదంలో తన అభిప్రాయాన్ని స్పష్టంగా వివరించలేని (స్త్రీ సంతానాన్ని అల్లాహ్ కు అంటగట్టుతున్నారా)?

19. మరియు వీరు కరుణామయునికి దాసులైన దేవదూతలను స్త్రీలుగా పరిగణిస్తున్నారా? వీరు! వారు (దేవదూతలు) సృష్టించబడినప్పుడు చూశారా ఏమిటి? వీరి ఆరోపణలు వ్రాసి వుంచబడతాయి. మరియు వీరు దానిని గురించి ప్రశ్నింపబడతారు.

20. మరియు వారు ఇలా అంటారు: "ఒకవేళ ఆ కరుణామయుడు తలచుకుంటే మేము వారిని ఆరాధించేవారం కాదు" దాని వాస్తవ జ్ఞానం వారికి లేదు. వారు కేవలం ఊహాగానాలే చేస్తున్నారు!

21. మేము వారికి ఇంతకు ముందు ఏదైనా గ్రంథాన్ని ఇచ్చి ఉన్నామా ఏమిటి? వారు దానిని ఖచ్చితంగా అనుసరించటానికి?

22. అలా కాదు! వారిలా అంటారు: "వాస్తవానికి మేము, మా తండ్రితాతలను ఇలాంటి సమాజాన్నే (మతాన్నే) అనుసరిస్తుండగా చూశాము. మరియు నిశ్చయంగా మేము కూడా వారి అడుగుజాడల్లోనే వారి మార్గదర్శకత్వంపై ఉన్నాము."

23. మరియు ఇదే విధంగా, నీకు ముందు (ఓ ముహమ్మద్!) మేము హెచ్చరించే వాడిని ఏ పట్టణానికి పంపినా దానిలోని ఐశ్వర్యవంతులు

అనేవారు[11]: "వాస్తవానికి మేము మా తండ్రితాతలను ఇలాంటి సమాజాన్నే (మతాన్నే) అనుసరిస్తూ ఉండగా చూశాము. మరియు నిశ్చయంగా, మేము కూడా వారి అడుగు జాడలనే అనుసరిస్తాము."

24. (వారి ప్రవక్త) ఇలా అనేవాడు: "ఒకవేళ నేను మీ తండ్రితాతలు అనుసరిస్తూ వచ్చిన దాని కంటే ఉత్తమమైన మార్గదర్శకత్వాన్ని మీకోసం తెచ్చినా (మీరు వారినే అనుసరిస్తారా)?" వారిలా జవాబిచ్చేవారు: "నిశ్చయంగా, మీరు దేనితో పంపబడ్డారో దానిని మేము తిరస్కరిస్తున్నాము."

25. కావున మేము వారిపై మా ప్రతీకారాన్ని (శిక్షను) పంపాము. చూశారా! సత్యాన్ని తిరస్కరించిన వారి గతి ఏమయిందో!

26. మరియు (జ్ఞాపకం చేసుకోండి) ఇబ్రాహీమ్ తన తండ్రి మరియు తన జాతివారితో ఇలా అన్నప్పుడు: "నిశ్చయంగా, మీరు పూజించే వారితో నాకు ఎలాంటి సంబంధం లేదు[12].

27. (నేనైతే) నన్ను సృజించిన ఆయన (అల్లాహ్ నే ఆరాధిస్తాను). ఎందుకంటే! నిశ్చయంగా, ఆయనే నాకు మార్గదర్శకత్వం చేయగలడు."

28. మరియు అతను (ఇబ్రాహీమ్) ఈ వచనాన్నే తన తర్వాత తన సంతానం కొరకు విడిచి వెళ్ళాడు[13]. వారు దాని వైపుకు మరలుతారని!

---

[11] చూడండి, 11:116.

[12] ఇబ్రాహీమ్ ('అ.స.) గాథకు చూడండి, 6:74 మరియు 21:51.

[13] చూడండి, 2:132.

**29.** వాస్తవానికి, నేను వారికి మరియు వారి తండ్రితాతలకు ప్రాపంచిక సుఖసంతోషాలను ఇస్తూనే వచ్చాను. చివరకు వారి వద్దకు సత్యం మరియు (దానిని) స్పష్టంగా వివరించే దైవప్రవక్త కూడా వచ్చాడు[14].

**30.** కాని వారి వద్దకు సత్యం (ఈ ఖుర్ఆన్) వచ్చినప్పుడు వారన్నారు: "ఇది కేవలం మంత్రజాలమే[15]. మరియు నిశ్చయంగా, మేము దీనిని తిరస్కరిస్తున్నాము."

**31.** వారు ఇంకా ఇలా అన్నారు: "ఈ ఖుర్ఆన్ ఈ రెండు నగరాలలోని ఒక గొప్ప వ్యక్తిపై ఎందుకు అవతరింప జేయబడలేదు?"[16]

**32.** నీ ప్రభువు కారుణ్యాన్ని పంచిపెట్టేవారు వారేనా ఏమిటి? మేమే వారి జీవనోపాయాలను, ఈ ప్రాపంచిక జీవితంలో వారి మధ్య పంచిపెట్టాము. వారు ఒకరితో నొకరు పని తీసుకో వటానికి[17], వారిలో కొందరికి మరికొందరిపై స్థానాలను పెంచాము. మరియు వారు కూడబెట్టే దాని

---

[14] చూడండి, 21:44.

[15] చూడండి, 74:24.

[16] ఈ రెండు నగరవాసులలో పేరు ప్రఖ్యాతులున్న మక్కాకు చెందిన వలీద్ బిన్ ముగైరా మరియు తాయఫ్ కు చెందిన ఉర్వా బిన్ మసవూద్ సఖఫీ కావచ్చని వ్యాఖ్యాతలంటారు.

[17] అల్లాహ్ (సు.తా.) వ్యవహారాలను సరళంగా నడపటానికి, ప్రజలలో ధనసంపత్తులను, తెలివి జ్ఞానాలను, ఎక్కువ తక్కువగా పంచాడు. దీని వల్ల ప్రతి మానవుడు మరొకని సహాయం మీద ఆధారపడి ఉన్నాడు. ధనవంతుడు పేదవాని మీద, పేదవాడు ధనవంతుని మీద.

(సంపద) కంటే నీ ప్రభువు కారుణ్యమే[18] ఎంతో ఉత్తమమైనది.

**33.** మరియు మానవులందరూ ఒక (దుష్ట) సమాజంగా మారి పోతారన్న భయమే గనక మాకు లేకున్నట్లయితే, మేము ఆ కరుణామయుణ్ణి తిరస్కరించేవారి ఇళ్ళ కప్పులనూ మరియు వాటి పైకి ఎక్కే మెట్లను వెండితో నిర్మించేవారము.

**34.** మరియు వారి ఇండ్ల తలుపులను మరియు వారు ఆనుకొని కూర్చునే పీఠాలను కూడా;

**35.** మరియు బంగారంతో కూడా![19] మరియు ఇవన్నీ ప్రాపంచిక జీవిత సుఖసంతోషాలు మాత్రమే. మరియు దైవభీతి గలవారికి నీ ప్రభువు వద్ద పరలోక జీవిత (సుఖం) ఉంటుంది.

**36.** మరియు ఎవడైతే కరుణామయుని స్మరణ విషయంలో అంధుడిగా ప్రవర్తిస్తాడో అతనిపై మేము ఒక షైతాన్ ను నియమిస్తాము. ఇక వాడు (ఆ షైతాన్) వాని సహచరుడు (ఖరీనున్) అవుతాడు[20].

**37.** మరియు నిశ్చయంగా, వారు(షైతాన్'లు) వారిని (అల్లాహ్) మార్గం నుండి ఆటంక పరుస్తారు.

---

[18] ఈ కారుణ్యం అంటే పరలోక జీవిత సుఖం.

[19] 'జు'ఖ్ రుఫున్: బంగారం. దీని అర్థం ఆభరణాలు లేక అలంకరణ కూడా అవుతుంది. చూడండి, 10:24. దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: "అల్లాహ్ (సు.తా.) దగ్గర ఈ ప్రపంచపు విలువ దోమ రెక్కకు సమానంగా ఉండి ఉన్నా, అల్లాహ్ (సు.తా.) ఏ సత్యతిరస్కారిని గుటికెడు నీళ్ళు కూడా త్రాగనిచ్చేవాడు కాదు." (తిర్మిజీ', ఇబ్నె-మాజహ్).

[20] చూడండి, 41:25.

మరియు వారేమో నిశ్చయంగా, తాము సరైన మార్గదర్శకత్వంలోనే ఉన్నామని భావిస్తారు!

38. చివరకు అతడు మా వద్దకు వచ్చినపుడు (తన వెంట ఉన్న షైతాన్ తో) ఇలా అంటాడు: "అయ్యో! నా దౌర్భాగ్యం! నీకూ నాకూ మధ్య తూర్పుపడమరల[21] మధ్య ఉన్నంత దూరం ఉండి వుంటే ఎంత బాగుండేది! ఎందుకంటే నీవు అతి చెడ్డ సహచరుడివి!"

39. మరియు మీరు దుర్మార్గం చేశారు! కావున, ఈరోజు మీరంతా ఈ శిక్షలో కలిసి ఉండటం మీకు ఏ మాత్రం లాభదాయకం కాదు[22].

40. (ఓ ముహమ్మద్!) నీవు చెవిటి వాడికి వినిపింప జేయగలవా? లేదా గ్రుడ్డివాడికి మార్గం చూపించగలవా? లేక స్పష్టంగా మార్గభ్రష్టత్వంలో ఉన్నవాడికి (మార్గదర్శకత్వం చేయగలవా)?[23]

41. ఒకవేళ వాస్తవానికి, మేము నిన్ను తీసుకొని పోయినా, వారికి మాత్రం తప్పకుండా ప్రతీకారం చేస్తాము.

42. లేదా మేము వారికి వాగ్దానం చేసిన దానిని

---

[21] అల్-మష్ రిఖైన్: ప్రాచీన అరబ్బీ భాషా సంప్రదాయం ప్రకారం కొన్నిసార్లు ఒక శబ్దానికి ద్వివచనం ఇవ్వటం వల్ల దాని అర్థం రెండు విభిన్న వస్తువులను సూచిస్తుంది. ఉదా: ఇక్కడ వ్రాసినట్లు అల్-మష్ రిఖైన్, అంటే తూర్పుపడమరలు; ఖమరైన్, అంటే సూర్యచంద్రులు.

[22] ఈ ఆయత్ కు ఈ విధంగా కూడా తాత్పర్యం ఇవ్వబడింది: 'మరియు మీరు దుర్మార్గం చేశారు, అది ఈ రోజు మీకు ఏ మాత్రం లాభదాయకం కాదు; నిశ్చయంగా, మీరందరు ఈ శిక్షను పంచుకుంటారు.' ఇంకా చూడండి, 14:49.

[23] చూడండి, 35:22.

(శిక్షను) నీకు తప్పక చూపగలము. ఎందుకంటే మాకు వారిపై పూర్తి అధికారముంది.

**43.** కావున నీవు దివ్యజ్ఞానం (వహీ) ద్వారా వచ్చిన సందేశం మీద స్థిరంగా ఉండు. నిశ్చయంగా, నీవు ఋజుమార్గం మీద ఉన్నావు.

**44.** మరియు నిశ్చయంగా, ఇది (ఈ ఖుర్ఆన్) నీకు మరియు నీ జాతి వారికి ఒక హితబోధ. మరియు (దీనిని గురించి) మీరు ప్రశ్నింప బడగలరు[24].

**45.** మరియు (ఓ ముహమ్మద్!) నీకు పూర్వం మేము పంపిన మా ప్రవక్తలను అడుగు: "మేము ఆ కరుణామయుడు తప్ప ఇతర దైవాలను ఆరాధింపబడటానికి నియమించామేమో?"

**46.** మరియు వాస్తవంగా, మేము మూసాను, మా సూచనలతో (ఆయాత్ లతో) ఫిర్ఔన్ మరియు అతని నాయకుల వద్దకు పంపాము. అతను వారితో ఇలా అన్నాడు: "నిశ్చయంగా, నేను సర్వలోకాల ప్రభువు యొక్క సందేశహరుణ్ణి."

**47.** కాని, అతను వారి వద్దకు మా సూచన (ఆయాత్) లను తీసుకొని వచ్చినప్పుడు, వారు వాటిని గురించి పరిహాసాలాడేవారు[25].

**48.** మరియు మేము వారికి చూపిన ప్రతి అద్భుత సూచన (ఆయాత్), దానికి ముందు చూపినటువంటి దాని (అద్భుత సూచన)

---

[24] ప్రవక్త 'అలైహిమ్ స.) లందరూ ప్రశ్నింపబడతారు. చూడండి, 5:109.

[25] చూడండి, 6:109.

కంటే మించినదిగా ఉండేది[26]. మరియు
మేము వారిని శిక్షకు గురి చేశాము. బహుశా,
ఇలాగైనా వారు మరలి వస్తారేమోనని![27]

**49.** మరియు వారు (మూసాతో) ఇలా అన్నారు: "ఓ
మాంత్రికుడా! (నీ ప్రభువు) నీతో చేసిన ఒప్పందం
ప్రకారం నీ ప్రభువును ప్రార్థించు, మేము తప్పక
సన్మార్గులమవుతాము."

**50.** కాని మేము వారిపై నుండి ఆ శిక్షను తొలగించిన
వెంటనే వారు తమ వాగ్దానాన్ని భంగ పరచేవారు.

**51.** మరియు, ఫిర్ఔన్ తన జాతి ప్రజలలో ప్రకటిస్తూ
ఇలా అన్నాడు: "ఓ నా జాతి ప్రజలారా! ఈజిప్టు
(మిస్ర్) యొక్క సామ్రాజ్యాధిపత్యం నాది కాదా?
మరియు ఈ సెలయేళ్ళు నా క్రింద ప్రవహించటం
లేదా? ఇది మీకు కనిపించటం లేదా?

**52.** ఈ తుచ్ఛమైన వాడు మరియు (తన మాటను)
స్పష్టంగా వివరించలేని వాడి (మూసా) కంటే
నేను శ్రేష్ఠుడిని కానా?[28]

**53.** అయితే ఇతనికి బంగారు కంకణాలు ఎందుకు
వేయబడలేదు? లేదా, ఇతనికి తోడుగా ఇతనితో

---

[26] అద్భుత సూచనల కోసం చూడండి, 7:133-135.

[27] అల్లాహ్ (సు.తా.) వైపునకు మరలటం మానవుడు అల్లాహ్ (సు.తా.) ఉనికిని గ్రహించే స్వాభావిక లక్షణం. కాని మానవుడు అల్లాహ్ (సు.తా.) నుండి మరలిపోవటం అతని మానసిక పతనం, ఆధ్యాత్మిక భ్రష్టత్వం. చూడండి, 7:172-173.

[28] మూసా('అ.స.) సరిగ్గా మాట్లాడలేక పోయేవారు. నత్తినత్తిగా మాట్లాడే వారు (Stammer). దానికి చూడండి, 20:27-28.

పాటు దేవదూతలు ఎందుకు రాలేదు?"[29]

**54.** ఈ విధంగా, అతడు (ఫిర్ఔన్) తన జాతి వారిని ప్రేరేపింప జేయటం వలన వారు అతనిని అనుసరించారు. నిశ్చయంగా వారు దుర్జనులు (ఫాసిఖీన్).

**55.** ఈ విధంగా, వారు మమ్మల్ని కోపానికి గురి చేయటం వల్ల మేము వారికి ప్రతీకారం చేశాము. మరియు వారందరినీ ముంచి వేశాము.

**56.** ఇక మేము, వారిని తర్వాత వచ్చే వారి కొరకు ఒక గడిచిన నిదర్శనంగా మరియు ఒక ఉదాహరణగా చేశాము.

**57.** మరియు మర్యమ్ కుమారుడు ఒక ఉదాహరణగా పేర్కొనబడినప్పుడు (ఓ ముహమ్మద్!) నీ జాతి ప్రజలు అతనిని గురించి కేకలు వేస్తారు.

**58.** మరియు అంటారు: "మా దేవుళ్ళు మంచివా లేక అతడా (ఈసానా)?" వారు ఈ విషయం నీ ముందు పెట్టేది కేవలం జగడమాడటానికే. వాస్తవానికి వారు కలహ ప్రియులైన జనులు.

**59.** అతను (ఈసా) కేవలం ఒక దాసుడు మాత్రమే. మేము అతనిని అనుగ్రహిచాము. మరియు మేము అతనిని ఇస్రాయీల్ సంతతి వారికి ఒక

---

[29] ప్రాచీనకాలంలో ఈజిప్టులో బంగారు కంకణాలు, మెడలో బంగారు ఆభరణాలు పెద్దరికాన్ని సూచించేవి. (ఆదికాండము-Genesis, 12:42) అంటే మూ'సా ('అ.స.) అల్లాహ్ (సు.తా.) సందేశహరుడైతే అల్లాహ్ (సు.తా.), అతనికి, అతని గొప్పతనానికి తగినట్లు బంగారు ఆభరణాలు, కంకణాలు, ఎందుకు ప్రసాదించలేదు? ఇదే విధమైన ప్రశ్నలు ముష్రిక్ ఖురైషులు దైవప్రవక్త ('స'అస) ను కూడా అడిగారు.

నిదర్శనంగా చేశాము.

**60.** మరియు మేము కోరితే మీకు బదులుగా, దేవదూతలను భూమిపై ఉత్తరాధికారులుగా చేసే వారము.

**61.** మరియు నిశ్చయంగా, అతని (ఈసా పునరాగమనం) అంతిమ ఘడియ రావటానికి సూచన[30]. కావున మీరు దానిని (ఆ ఘడియను) గురించి సంశయంలో పడకండి. మరియు నన్నే (అల్లాహ్ నే) అనుసరించండి, ఇదే ఋజుమార్గం.

**62.** మరియు షైతాన్ ను, మిమ్మల్ని ఆటంక పరచనివ్వకండి. నిశ్చయంగా, అతడు మీకు బహిరంగ శత్రువు.

**63.** మరియు ఈసా స్పష్టమైన (మా) సూచనలు తీసుకొని వచ్చినప్పుడు ఇలా అన్నాడు: "వాస్తవంగా, నేను మీ వద్దకు వివేకాన్ని తీసుకొని వచ్చాను[31]; మరియు మీరు విభేదాలకు లోనైన కొన్ని విషయాల వాస్తవాన్ని మీకు స్పష్టంగా వివరించటానికి వచ్చాను. కావున మీరు అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగి ఉండండి. మరియు నన్ను అనుసరించండి.

**64.** నిశ్చయంగా, అల్లాహ్ యే నా ప్రభువు మరియు మీ ప్రభువు కూడాను. కావున మీరు ఆయననే

---

[30] చాలామంది వ్యాఖ్యాతల ప్రకారం 'ఈసా ('అ.స.) మరల వచ్చారంటే, పునరుత్థానదినం దగ్గరున్నట్లే! ఇది ఎన్నో 'స'హీ'హ్ 'హదీస్'లలో పేర్కొనబడింది.

[31] వివేకం, అంటే దివ్యజ్ఞానం (వ'హీ).

ఆరాధించండి. ఇదే ఋజుమార్గం."

**65.** అయినా, తరువాత వచ్చిన వర్గాల వారు పరస్పర వర్గ భేదాలకు లోనయ్యారు. కావున దుర్మార్గానికి పాల్పడిన వారికి బాధాకరమైన ఆ దినమున శిక్ష పడుతుంది!

**66.** వారు కేవలం ఆ అంతిమ ఘడియ అకస్మాత్తుగా - తమకు తెలియకుండానే - తమపై వచ్చి పడాలని నిరీక్షిస్తున్నారా ఏమిటి?

**67.** ఆ దినమున దైవభీతిగలవారు తప్ప ఇతర స్నేహితులంతా ఒకరికొకరు శత్రువులవుతారు.

**68.** (విశ్వాసులతో ఇలా అనబడుతుంది): "ఓ నా దాసులారా! ఈనాడు మీకు ఏ భయమూ లేదు మరియు మీరు దుఃఖ పడరు కూడా!

**69.** అలాంటివారు ఎవరైతే మా సూచనలను విశ్వసించారో మరియు ముస్లింలు అయి ఉన్నారో!

**70.** మీరు మరియు మీ సహవాసులు (అజ్వాజ్) సంతోషంగా స్వర్గంలో ప్రవేశించండి."

**71.** వారి మధ్య, బంగారు పళ్ళాలు[32] మరియు కప్పులు త్రిప్పబడతాయి మరియు అందులో మనస్సులు కోరేవి మరియు కళ్ళకు ఇంపుగా ఉండేవి, అన్నీ ఉంటాయి. మరియు మీరందులో శాశ్వతంగా ఉంటారు.

---

[32] 'సి'హా'ఫున్, 'స'హ్'ఫతున్ (ఏ.వ.): Plate, అన్నం తినే పళ్ళెం. అన్నింటి కంటే పెద్ద పళ్ళాన్ని జఫ్ నతున్ అంటారు. దాని తరువాత ఖ'స్'అతున్ దీనిలో పది మంది తినగలుగుతారు. దానిలో సగం ఉండేది 'స'హ్'ఫతున్, దాని కంటే చిన్నది మికీలతున్. (ఫ త్హ్'అల్-ఖదీర్).

72. మరియు మీరు చేస్తూ వున్న కర్మల ఫలితానికి బదులుగా, మీరు ఈ స్వర్గానికి వారసులయ్యారు.
73. మీకు అందులో పండ్లూ ఫలాలు పుష్కలంగా ఉంటాయి, వాటిని మీరు తింటారు.
74. నిశ్చయంగా, అపరాధులు నరకశిక్షలో శాశ్వతంగా ఉంటారు[33].
75. వారి (శిక్ష) ఏ మాత్రం తగ్గించబడదు మరియు వారందులో హతాశులై పడి ఉంటారు.
76. మేము వారికి ఎలాంటి అన్యాయం చేయలేదు, కాని వారే దుర్మార్గులై ఉండిరి[34].
77. మరియు వారిలా మొరపెట్టుకుంటారు: "ఓ నరక పాలకుడా (మాలిక్)! నీ ప్రభువును మమ్మల్ని అంతంచేయమను." అతను అంటాడు: "నిశ్చయంగా మీరిక్కడే (ఇదే విధంగా) పడి ఉంటారు."
78. వాస్తవానికి మేము మీ వద్దకు సత్యాన్ని తీసుకొని వచ్చాము, కాని మీలో చాలామంది సత్యమంటేనే అసహ్యించుకునే వారు.
79. వారు ఏదైనా నిర్ణయం (పన్నాగం) చేస్తున్నారా ఏమిటి? అయితే నిశ్చయంగా మేము కూడా ఒక గట్టి నిర్ణయం (పన్నాగం) చేస్తున్నాము[35].
80. లేదా! మేము వారి రహస్య విషయాలను మరియు వారి గుసగుసలను వినటం లేదని వారనుకుంటున్నారా? అలా కాదు, (వాస్తవానికి)

---

[33] చూడండి, 6:128 చివరి వాక్యం మరియు 40:12/3 వ్యాఖ్యానంలో సూచించిన 'హదీస్'.
[34] అంటే వారే తమకు తాము అన్యాయం చేసుకున్నారు.
[35] చూడండి, 52:42.

మా దూతలు వారి దగ్గర ఉండి, అంతా వ్రాస్తున్నారు.

**81.** వారితో ఇలా అను: "ఒకవేళ ఆ కరుణామయునికి కుమారుడే ఉంటే, అందరి కంటే ముందు నేనే అతనిని ఆరాధించేవాడిని."

**82.** భూమ్యాకాశాలకు ప్రభువు మరియు సింహాసనానికి (అర్ష్ కు) ప్రభువు అయిన ఆయన (అల్లాహ్) వారి కల్పనలకు అతీతుడు[36].

**83.** వారికి వాగ్దానం చేయబడిన ఆ దినాన్ని వారు దర్శించే వరకు, వారిని వారి వాదోపవాదాలలో మరియు వారి క్రీడలలో మునిగి ఉండనీ!

**84.** మరియు ఆయన (అల్లాహ్) మాత్రమే ఆకాశాలలో ఆరాధ్యుడు మరియు భూమిలో కూడా ఆరాధ్యుడు. మరియు ఆయన మహా వివేకవంతుడు, సర్వజ్ఞుడు[37].

**85.** మరియు ఆకాశాలలోను మరియు భూమిలోను మరియు ఆ రెండింటి మధ్యను ఉన్న సమస్తానికీ సామ్రాజ్యాధికారి అయిన ఆయన (అల్లాహ్) శుభదాయకుడు; మరియు అంతిమ ఘడియ జ్ఞానం కేవలం ఆయనకే ఉంది; మరియు ఆయన వైపునకే మీరంతా మరలింపబడతారు

**86.** మరియు వారు ఆయనను వదలి, ఎవరినైతే ప్రార్థిస్తున్నారో, వారికి సిఫారసు చేసే అధికారం లేదు[38]. కేవలం సత్యానికి సాక్ష్యమిచ్చేవారు

---

[36] చూడండి, 6:100.
[37] చూడండి, 6:3.
[38] చూడండి, 10:3.

మరియు (అల్లాహ్ ఒక్కడే! అని) తెలిసి ఉన్నవారు తప్ప!

**87.** మరియు నీవు: "మిమ్మల్ని ఎవరు సృష్టించారు?" అని వారితో అడిగినప్పుడు, వారు నిశ్చయంగా: "అల్లాహ్!" అని అంటారు. అయితే వారు ఎందుకు మోసగింపబడు తున్నారు (సత్యం నుండి మరలింపబడుతున్నారు)?

**88.** "మరియు ఓ నా ప్రభూ! నిశ్చయంగా, ఈ ప్రజలు విశ్వసించరు!" అని పలికే (ప్రవక్త యొక్క) మాట (అల్లాహ్ కు బాగా తెలుసు).

**89.** కావున నీవు (ఓ ముహమ్మద్!) వారిని ఉపేక్షించు. మరియు ఇలా అను: "మీకు సలాం!"[39] ముమ్ముందు వారు తెలుసుకుంటారు.

---

[39] ఇక్కడ కేవలం సలాముస్ ఉంది; అస్సలాము అని లేదు. అంటే - మీదారి మీది మరియు మాదారి మాది, అని అర్థం. మీరు ముమ్ముందు తెలుసుకుంటారు. ఎవరు సన్మార్గం మీద ఉన్నారో! మరియు ఎవరు దుర్మార్గం మీద ఉన్నారో! ఇంకా చూడండి, 25:63, 28:55.

# 44. అద్-దుఖ్ఖాన్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. హా - మీమ్[1].
2. స్పష్టమైన ఈ గ్రంథం (ఖుర్ఆన్) సాక్షిగా![2]
3. నిశ్చయంగా, మేము దీనిని (ఈ ఖుర్ఆన్ ను) శుభప్రదమైన రాత్రిలో అవతరింపజేశాము[3]. నిశ్చయంగా, మేము (ప్రజలను) ఎల్లప్పుడూ హెచ్చరిస్తూ వచ్చాము[4].

---

[*] [అద్-దుఖ్ఖాన్ అంటే స్పష్టమైన పొగ]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

[2] చూడండి, 12:1.

[3] ఖుర్ఆన్ అవతరింపజేయబడిన రాత్రి లైలతుల్ ఖద్ర్ శుభవంతమైన రాత్రి. చూడండి, సూరహ్ అల్-ఖద్ర్ (97) . ఇంకా చూడండి 2:185 ఈ రాత్రి రమ'దాన్ నెల చివరి 10 రోజులలోని బేసి రాత్రులలో ఒకటి అని చాలా మంది వ్యాఖ్యాతల అభిప్రాయం. 1) ఈ రాత్రిలో ఖుర్ఆన్ అవతరింపజేయబడింది. 2) ఈ రాత్రిలోనే దైవదూత (అలైహిమ్ స.)లు మరియు పవిత్ర ఆత్మ (జిబ్రీల్ 'అ.స.) దిగి వస్తారు. 3) ఈ రాత్రిలో, రాబోయే సంవత్సరంలో జరగబోయే విషయాల నిర్ణయం జరుగుతుంది. 4) ఈ రాత్రిలో చేసే ఆరాధన ('ఇబాదహ్) వేయి నెలల (83 సంవత్సరాల 4 నెలల) ఆరాధన కంటే ఉత్తమమైనది. ఈ రాత్రిలోనే ఖుర్ఆన్ ఏడవ ఆకాశంపై ఉన్న లౌ'హె మ'హ్ ఫూ"జ్ నుండి భూలోకపు ఆకాశంపై ఉన్న బైతుల్ 'ఇజ్జహ్ లోకి మొత్తం ఒకేసారి దింపబడింది. ఆ తరువాత 23 సంవత్సరాలలో క్రమక్రమంగా దైవప్రవక్త ('స'అస) మీద అవతరింపజేయబడింది.

[4] ఖుర్ఆన్ అవతరణ ప్రజలకు మంచి చెడును బోధించటానికి జరిగింది.

4. దానిలో (ఆ రాత్రిలో), ప్రతి విషయం వివేకంతో విశదీకరించ బడుతుంది;
5. మా ఆజ్ఞానుసారంగా, నిశ్చయంగా, మేము (సందేశహరులను) పంపుతూ వచ్చాము.
6. నీ ప్రభువు తరఫు నుండి కారుణ్యంగా! నిశ్చయంగా, ఆయనే అంతా వినేవాడు, సర్వజ్ఞుడు.
7. భూమ్యాకాశాలకు మరియు వాటి మధ్య ఉన్న సమస్తానికీ ప్రభువు. మీకు వాస్తవంగా నమ్మకమే ఉంటే!
8. ఆయన తప్ప మరొక ఆరాధ్య దేవుడు లేడు. ఆయనే జీవితాన్ని ప్రసాదించేవాడు మరియు ఆయనే మరణాన్ని ఇచ్చేవాడు. ఆయన మీ ప్రభువు మరియు పూర్వీకులైన మీ తాత ముత్తాతల ప్రభువు[5].
9. అసలు! వారు సందేహంలో పడి ఆటల్లో మునిగి ఉన్నారు (పరిహసిస్తున్నారు).
10. కావున నీవు ఆకాశం నుండి స్పష్టమైన పొగ వచ్చే దినం కొరకు నిరీక్షించు!
11. అది మానవులందరినీ క్రమ్ముకుంటుంది. అదొక బాధాకరమైన శిక్ష.
12. (అప్పుడు వారు ఇలా వేడుకుంటారు): "ఓ మా ప్రభూ! ఈ శిక్షను మా నుండి తొలగించు. నిశ్చయంగా, మేము విశ్వాసుల మవుతాము."

---

[5] చూడండి, 7:158. ఈ ఆయత్ పోలిన ఆయత్.

13. ఇక (అంతిమ ఘడియలో) హితబోధ స్వీకరించటం వారికి ఎలా పనికి రాగలదు? వాస్తవానికి వారి వద్దకు (సత్యాన్ని) స్పష్టంగా తెలియజేసే ప్రవక్త వచ్చి ఉన్నాడు;
14. అప్పుడు వారు అతని నుండి మరలి పోయారు మరియు ఇలా అన్నారు: "ఇతను ఇతరుల నుండి నేర్చుకున్నాడు, ఇతనొక పిచ్చివాడు!"[6]
15. వాస్తవానికి మేము కొంతకాలం వరకు ఈ శిక్షను తొలగిస్తే నిశ్చయంగా, మీరు చేస్తూ వచ్చిందే మళ్ళీ చేస్తారు.
16. మేము శిక్షించటం కోసం గట్టిగా పట్టుకున్న రోజు, మేము నిశ్చయంగా, ప్రతీకారం చేస్తాము.
17. మరియు వాస్తవంగా, వారికి పూర్వం మేము ఫిర్ఔన్ జాతి వారిని పరీక్షకు గురి చేశాము. మరియు వారి వద్దకు గౌరవనీయుడైన ప్రవక్త వచ్చి ఉన్నాడు.
18. (అతను ఇలా అన్నాడు): "అల్లాహ్ దాసులను నాకు అప్పగించు[7]. నేను మీ వద్దకు పంపబడిన నమ్మకస్తుణ్ణయిన సందేశహరుణ్ణి.
19. మరియు మీరు అల్లాహ్ ముందు అహంభావాన్ని (ఔన్నత్యాన్ని) చూపకండి. నిశ్చయంగా, నేను మీ వద్దకు స్పష్టమైన ప్రమాణం తీసుకొని వచ్చాను.

---

[6] చూడండి, 16:103 మరియు 25:4.
[7] 'ఇబాదల్లాహ్: అంటే ఇక్కడ మూసా ('అ.స.) జాతివారైన బనీ ఇస్రాయీ'ల్ తెగవారు.

20. మరియు నిశ్చయంగా, నేను నా ప్రభువు మరియు మీ ప్రభువు (అయిన) అల్లాహ్ యొక్క శరణు పొందాను, - మీరు నన్ను రాళ్ళు రువ్వి చంపకుండా ఉండటానికి.

21. ఒకవేళ మీరు నా మాట నమ్మకపోయినా సరే! నా జోలికి మాత్రం రాకండి!"

22. చివరకు అతను తన ప్రభువున ఇలా ప్రార్థించాడు: "నిశ్చయంగా, ఈ జనులు చాలా అపరాధులు!"

23. (అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు): "నీవు నా దాసులను తీసుకొని రాత్రివేళ బయలు దేరు, నిశ్చయంగా మీరు వెంబడించబడతారు.

24. మరియు సముద్రాన్ని చీల్చి నెమ్మదిగా వెళ్ళిపో[8]. నిశ్చయంగా, ఆ సైనికులు అందులో మునిగిపోతారు!"

25. వారు ఎన్నో తోటలను మరియు చెలమలను వెనుక విడిచి పోయారు;

26. మరియు ఎన్నో పంటపొలాలను మరియు గొప్ప భవనాలను;

27. మరియు వారు అనుభవిస్తూ ఉన్న ఎన్నో సుఖసంతోషాలను కూడా!

28. ఈ విధంగా, (వారి ముగింపు జరిగింది). మరియు మేము వాటికి ఇతర జాతి వారిని వారసులుగా చేశాము.

---

[8] చూడండి, 26:63-66. రహ్వాన్: అంటే ప్రశాంతమైనది లేక తడిలేనిది. జౌహరీ (ర'హ్మా) దీనిని ప్రశాంతంగా చీలిపోయి ఉన్నది, అని వివరించారు.

**29.** కాని, వారి కొరకు ఆకాశం గానీ, భూమి గానీ విలపించలేదు మరియు వారికి ఎలాంటి వ్యవధి కూడా ఇవ్వబడలేదు.

**30.** మరియు వాస్తవంగా! మేము ఇస్రాయీల్ సంతతి వారిని అవమానకరమైన శిక్ష నుండి విముక్తి కలిగించాము -

**31.** ఫిర్ఔన్ నుండి నిశ్చయంగా, అతడు మితిమీరి ప్రవర్తించేవారి, అగ్రగణ్యుడు.

**32.** మరియు వాస్తవానికి మాకు తెలిసి ఉండి కూడా మేము వారిని లోకంలో (ఆ కాలపు) సర్వజనులపై ఎన్నుకున్నాము[9].

**33.** మరియు మేము వారికి అద్భుత సూచనలను (ఆయాత్ లను) ఒసంగి ఉంటిమి. అందులో వారికి స్పష్టమైన పరీక్ష ఉండింది.

**34.** నిశ్చయంగా, వీరు (ఖురైషులు) ఇలా అంటున్నారు:

**35.** "వాస్తవానికి, మాకు ఈ మొదటి మరణం మాత్రమే ఉంది, ఆ తరువాత మేము తిరిగి బ్రతికించబడము.

**36.** మీరు సత్యవంతులే అయితే, మా తాతముత్తాతలను లేపి తీసుకురండి!"[10]

---

[9] ఎందుకంటే ఆ కాలంలో కేవలం బనీ-ఇస్రాయీ'ల్ వారు మాత్రమే ఏకైక ఆరాధ్యుడు అల్లాహ్ (సు.తా.) ను ప్రార్థించేవారు. మిగతా వారంతా బహుదైవారాధకులుగా ఉన్నారు. చూడండి, 15:23.

[10] చూడండి, 43:22-23.

37. వారు మేలైన వారా? లేక తుబ్బ'అ జాతివారు[11] మరియు వారి కంటే పూర్వం వారా? మేము వారందరినీ నాశనం చేశాము. నిశ్చయంగా, వారందరూ అపరాధులే!

38. మేము ఈ ఆకాశాలను మరియు భూమిని మరియు వాటి మధ్యనున్న సమస్తాన్నీ ఆట (కాలక్షేపం) కొరకు సృష్టించలేదు[12].

39. మేము వాటిని ఒక లక్ష్యంతోనే సృష్టించాము, కాని చాలా మందికి ఇది తెలియదు[13].

40. నిశ్చయంగా, తీర్పుదినం వారందరి కొరకు ఒక నిర్ణీత దినం[14].

41. ఆ దినమున ఏ స్నేహితుడు కూడా మరొక స్నేహితునికి ఏ మాత్రం ఉపయోగపడడు. మరియు వారికి ఎలాంటి సహాయమూ లభించదు[15].

42. అల్లాహ్ కరుణించిన వానికి తప్ప! నిశ్చయంగా,

---

[11] తుబ్బ'అ అంటే సబా' ప్రాంతంలో నివసించే 'హిమ్ యార్ తెగకు చెందినవారు. వారి రాజుల బిరుదు తుబ్బ'అ ఏ విధంగానైతే రోమన్ రాజులు సీజర్ అనబడేవారో! వారు చాలా కాలం దక్షిణ 'అరేబియా మీద రాజరికం చేశారు. వారిని, అబిసీనియా వారు (Abyssinians) 4వ క్రీ.శ.లో అంతమొందించారు. చూడండి, 50:14. వారు సత్యతిరస్కారులు.

[12] ఇటువంటి ఆయత్ కోసం చూడండి, 38:27, 23:115-116, 15:85 మరియు 21:16.

[13] చూడండి, 10:5.

[14] చూడండి, 77:13.

[15] చూడండి, 23:101, 70:10. మౌలా: అంటే "దగ్గరి బంధువు" అని కూడా తాత్పర్యమిచ్చారు.

ఆయనే సర్వశక్తిమంతుడు, అపార కరుణా ప్రదాత.

43. నిశ్చయంగా, జఖ్ఖూమ్ వృక్షఫలం;

44. పాపులకు ఆహారంగా ఇవ్వబడుతుంది;

45. మరిగే నూనే (సీసం) వలే[16], అది వారి కడుపులో మరుగుతుంది;

46. సలసల కాగే నీటిలాగా!

47. (ఇలా అనబడుతుంది): "ఇతనిని పట్టుకొని భగభగమండే నరకాగ్ని మధ్యలోకి ఈడ్వండి;

48. ఆ తరువాత అతని నెత్తి మీద సలసల కాగే నీటి శిక్షను పోయండి.

49. దీనిని రుచి చూడు; నిశ్చయంగా, నీవు శక్తిమంతుడివిగా, గౌరవనీయుడివిగా ఉండేవాడివి కదా!"

50. నిశ్చయంగా, ఇదే మీరు సందేహంలో పడి వున్న విషయం!

51. నిశ్చయంగా, దైవభీతి గలవారు శాంతి భద్రతలు గల స్థలంలో ఉంటారు.

52. ఉద్యానవనాలలో మరియు చెలమల మధ్య.

53. వారు, మృదువైన పట్టువస్త్రాలు మరియు బంగారు (జరీ) పట్టువస్త్రాలు ధరించి, ఒకరికొకరు ఎదురెదురుగా కూర్చొని ఉంటారు[17].

54. ఇలా ఉంటుంది వారి స్థితి! మరియు మేము వారిని అందమైన, ప్రకాశవంతమైన కళ్ళు గల

---

[16] అల్-ముహ్ లు: కరిగిన రాగి అని కూడా కొందరు వ్యాఖ్యానించారు.

[17] చూడండి, 18:31 మరియు 35:33

వారితో (హూర్ లతో) వివాహం చేయిస్తాము[18].

**55.** వారక్కడ శాంతియుతంగా ఉంటూ అనేక రకాలైన ఫలాలను అడుగుతుంటారు[19].

**56.** వారక్కడ మరణాన్ని[20] ఎన్నడూ రుచి చూడరు; వారి మొదటి (ఇహలోక) మరణం తప్ప! మరియు ఆయన వారిని భగభగమండే అగ్నిశిక్ష నుండి కాపాడాడు;

**57.** నీ ప్రభువు అనుగ్రహం వల్ల. ఇదే ఆ గొప్ప సాఫల్యం!

**58.** అందుకే నిశ్చయంగా, మేము (ఈ ఖుర్ఆన్ ను) నీ భాషలో సులభం చేశాము. ఇలాగైనా వారు అర్థం చేసుకుంటారని (హితబోధ గ్రహిస్తారని)[21].

**59.** కావున, నీవు నిరీక్షించు! నిశ్చయంగా వారు కూడా నిరీక్షిస్తున్నారు.

---

[18] 'హూరున్: చూడండి, 56:22, 52:20, 55:56, 37:48, 37:52. వారి కళ్ళ నలుపు మరియు తెలుపు ఎంతో అందంగా ఉంటాయి.వారినిచూసినవారువారిఅందానికిముగ్ధులైపోతారు.

[19] చూడండి, 43:73.

[20] 'స'హీ'హ్ 'హదీస్' లో ఉంది: మృత్యువును ఒక గొర్రె ఆకారంలో తెచ్చి స్వర్గనరకాల మధ్య జిబ్హ్ చేస్తారు. మరియు ఈ విధంగా ప్రకటిస్తారు: 'ఓ స్వర్గవాసులారా! ఇక మీకు మృత్యువు లేదు; మీరు కలకాలం స్వర్గంలో ఉంటారు. ఓ నరకవాసులారా! మీకు సదా నరకవాసమే. మీకు మృత్యువు లేదు." (స.'బు'ఖారీ, ముస్లిం.) ఇంకా చూడండి, 19:39, 37:58-59.

[21] చూడండి, 19:97.

# 45. అల్-జాథియహ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. హా - మీమ్[1].
2. ఈ గ్రంథం (ఖుర్ఆన్) అవతరణ సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడైన అల్లాహ్ తరఫు నుండి జరిగింది.
3. నిశ్చయంగా, విశ్వసించేవారి కొరకు, ఆకాశాలలో మరియు భూమిలో అనేక సూచనలు (ఆయాత్) ఉన్నాయి[2].
4. మరియు మీ సృష్టిలోనూ మరియు (భూమిలో) ఆయన వ్యాపింపజేసిన జీవరాసులలోనూ, దృఢవిశ్వాసమున్న వారి కొరకు ఎన్నో సూచనలు (ఆయాత్) ఉన్నాయి[3].
5. మరియు రేయింబవళ్ళ అనుక్రమంలో మరియు అల్లాహ్ ఆకాశం నుండి జీవనోపాధిని (వర్షాన్ని) పంపి, దాని ద్వారా భూమికి దాని మరణం తర్వాత, తిరిగి జీవం పోయటంలో మరియు వాయువుల మారటంలోనూ బుద్ధిమంతులకు ఎన్నో సూచనలు ఉన్నాయి.

---

[*] [అల్-జాథియహ్ అంటే మోకాళ్ళపై కూలబడుట]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

[2] చూడండి, 2:164.

[3] చూడండి, 7:185 మరియు 10:5.

6. ఇవి అల్లాహ్ సూచనలు (ఆయాత్), మేము వీటిని నీకు యథాతథంగా వినిపిస్తున్నాము. ఇక వారు అల్లాహ్ ను మరియు ఆయన సూచనలను (ఆయాత్ లను) కాక మరే సమాచారాన్ని విశ్వసిస్తారు?[4]

7. అపవాదుడు, పాపిష్ఠుడు అయిన ప్రతి వ్యక్తికి తీవ్రమైన వ్యధ గలదు.

8. అతడు తన ముందు పఠించబడే అల్లాహ్ సూచనలను (ఆయాత్ లను) వింటున్నాడు ఆ తరువాత మూర్ఖపు పట్టుతో దురహంకారంతో వాటిని విననట్లు వ్యవహరిస్తున్నాడు. కావున అతనికి బాధాకరమైన శిక్ష పడనున్నదనే వార్తను వినిపించు.

9. మరియు మా సూచన (ఆయాత్) లకు సంబంధించిన విషయం అతనికి తెలిసి నప్పుడు, వాటిని గురించి ఎగతాళి చేస్తాడు. అటువంటి వారందరికీ అవమానకరమైన శిక్ష ఉంది.

10. వారి ముందు నరకముంటుంది. మరియు వారి సంపాదన వారికి ఏ మాత్రం పనికిరాదు మరియు అల్లాహ్ ను వదలి వారు సంరక్షకులుగా చేసుకున్నవారు కూడా వారికి ఏ విధం గానూ ఉపయోగపడరు. మరియు వారికి ఘోరమైన శిక్ష ఉంటుంది.

11. ఇది (ఈ ఖుర్ఆన్) మార్గదర్శకత్వం. మరియు ఎవరైతే తమ ప్రభువు సూచనలను (ఆయాత్

---

[4] చూడండి, 39:23.

లను) తిరస్కరిస్తారో, వారికి అధమమైన, బాధాకరమైన శిక్ష ఉంది[5].

**12.** అల్లాహ్! ఆయనే, సముద్రాన్ని మీకు ఉపయుక్తంగా చేశాడు; దానిలో తన ఆజ్ఞతో ఓడలు పయనించటానికి మరియు మీరు ఆయన అనుగ్రహాన్ని అన్వేషించటానికి మరియు బహుశా మీరు కృతజ్ఞులవుతారని.

**13.** మరియు ఆయన ఆకాశాలలో మరియు భూమిలోనున్న సమస్తాన్ని, తన అనుగ్రహంతో మీకు ఉపయుక్తంగా చేశాడు. నిశ్చయంగా, ఇందులో ఆలోచించే వారికి ఎన్నో సూచనలు (ఆయాత్) ఉన్నాయి.

**14.** (ఓ ప్రవక్తా!) విశ్వసించిన వారితో: "ఒక జాతి వారికి తమ కర్మలకు తగిన ప్రతిఫలమిచ్చే అల్లాహ్ దినాలు[6] వస్తాయని నమ్మనివారిని క్షమించండి." అని చెప్పు[7].

**15.** సత్కార్యం చేసేవాడు తన మేలుకే చేస్తాడు. మరియు దుష్కార్యం చేసేవాడు దాని (ఫలితాన్ని) అనుభవిస్తాడు. చివరకు మీరంతా మీ ప్రభువు వైపునకే మరలింప బడతారు.

---

[5] చూడండి, 34:5.

[6] అయ్యామల్లాహ్: అల్లాహ్ దినాలు, అంటే పునరుత్థాన దినం. చూడండి, 14:5.

[7] ఈ ఆజ్ఞ ప్రవక్తృత్వం ప్రసాదించబడిన మొదటి రోజులలో ఉండేది. అప్పుడు ముస్లింలు, కొంతమంది మాత్రమే ఉండేవారు. మరియు వారిలో చాలామంది సమాజంలో బలహీన వర్గాలకు చెందినవారు. ఎప్పుడైతే ముస్లింలు తమ శత్రువులను ఎదుర్కొనే స్థితికి వచ్చారో వారికి జిహాద్ ఆజ్ఞ ఇవ్వబడింది..

16. మరియు వాస్తవంగా, మేము ఇస్రాయీల్ సంతతి వారికి గ్రంథాన్ని (తౌరాత్ ను), వివేకాన్ని మరియు ప్రవక్త పదవులను ప్రసాదించి ఉన్నాము మరియు వారికి మంచి జీవనోపాధిని ప్రసాదించి ఉన్నాము మరియు వారిని (వారి కాలపు) ప్రజలపై ప్రత్యేకంగా ఆదరించి ఉన్నాము[8]

17. మరియు వారికి ధర్మ విషయంలో స్పష్టమైన నిదర్శనాలు ఇచ్చి ఉన్నాము[9]. వారు తమ పరస్పర ద్వేషాల వల్ల వారికి జ్ఞానం వచ్చిన పిదపనే విభేదాలకు లోనయ్యారు[10]. నిశ్చయంగా, నీ ప్రభువు వారి మధ్య ఉన్న విభేదాలను గురించి పునరుత్థాన దినమున, వారి మధ్య తీర్పు చేస్తాడు.

18. తరువాత (ఓ ముహమ్మద్!) మేము, నిన్ను (మేము) నియమించిన ధర్మ విధానం మీద ఉంటాము. కావున నీవు దానినే అనుసరించు మరియు నీవు జ్ఞానం లేని వారి కోరికలను అనుసరించకు.

19. నిశ్చయంగా వారు, నీకు - అల్లాహ్ కు ప్రతిగా - ఏ మాత్రం ఉపయోగపడలేరు. మరియు నిశ్చయంగా, దుర్మార్గులు ఒకరికొకరు రక్షకులు. మరియు అల్లాహ్ యే దైవభీతిగలవారి సంరక్షకుడు.

20. ఇది (ఈ ఖుర్ఆన్) మానవులకు అంతర్దృష్టి

---

[8] ఆ కాలంలో బనీ-ఇస్రాయీ'ల్ వారు మాత్రమే, ఏకదైవారాధకులుగా ఉండిరి. చూడండి, 2:47.

[9] అల్-అమ్రు: ఇక్కడ చాలా వ్యాఖ్యాతల దృష్టిలో 'ధర్మం' కొరకు వాడబడింది.

[10] చూడండి, 23:53.

(పరిజ్ఞానం) ఇచ్చేదిగానూ మరియు విశ్వసించే జనులకు మార్గదర్శకత్వంగానూ మరియు కారుణ్యంగానూ ఉంది.

**21.** దుష్కార్యాలకు పాల్పడిన వారు, వారి ఇహలోక జీవితంలోనూ మరియు వారి మరణానంతర జీవితంలోనూ - వారినీ మరియు విశ్వసించి సత్కార్యాలు చేసే వారినీ - మేము ఒకే విధంగా పరిగణిస్తామని భావిస్తున్నారా ఏమిటి? వారి నిర్ణయాలు ఎంత చెడ్డవి!

**22.** మరియు అల్లాహ్ ఆకాశాలనూ మరియు భూమినీ సత్యంతో సృష్టించాడు మరియు ప్రతి వ్యక్తికి తన కర్మలకు తగిన ప్రతిఫలమివ్వటానికి మరియు వారికి ఎలాంటి అన్యాయం జరుగదు

**23.** తన మనోవాంఛలను తన దైవంగా చేసుకున్న వానిని నీవు చూశావా? మరియు అతడు జ్ఞానవంతుడు అయినప్పటికీ, అల్లాహ్! అతనిని మార్గభ్రష్టత్వంలో వదిలాడు[11] మరియు అతని చెవుల మీద మరియు అతని హృదయం మీద ముద్ర వేశాడు మరియు అతని కళ్ళ మీద తెరవేశాడు[12]; ఇక అల్లాహ్ తప్ప అతనికి మార్గదర్శకత్వం చేసే వాడెవడున్నాడు? ఇది మీరు గ్రహించలేరా?

**24.** మరియు వారిలా అంటారు: "మా (జీవితం) కేవలం ఈ ప్రాపంచిక జీవితం మాత్రమే! మేము మరణించేది

---

[11] చూడండి, 14:4.

[12] చూడండి, 2:7 మరియు 7:186.

మరియు జీవించేది ఇక్కడే మరియు మమ్మల్ని నశింపజేసేది ఈ కాలచక్రం మాత్రమే!" మరియు వాస్తవానికి, దానిని గురించి వారికి ఎలాంటి జ్ఞానం లేదు. వారు కేవలం ఊహాగానాలే చేస్తున్నారు[13].

**25.** మరియు వారి ముందు స్పష్టమైన మా సూచనలు (ఆయాత్) వినిపించబడినప్పుడు: "మీరు సత్యవంతులే అయితే మా తాతముత్తాతలను (బ్రతికించి) తీసుకురండి!" అని మాత్రమే వాదిస్తారు[14].

**26.** వారిలో ఇలా అను: "అల్లాహ్ యే మీకు జీవితమిచ్చేవాడు తరువాత మరణింప జేసేవాడు, ఆ పిదప పునరుత్థాన దినమున సమావేశ పరిచేవాడూను! ఇందులో ఎలాంటి సందేహం లేదు. అయినా చాలా మంది జనులకు ఇది తెలియదు."

**27.** మరియు ఆకాశాల మరియు భూమి యొక్క సామ్రాజ్యాధిపత్యం కేవలం అల్లాహ్ కే చెందినది. మరియు ఆ ఘడియ ఆసన్నమైననాడు, ఆ దినమున అసత్యవాదులు నష్టానికి గురి అవుతారు.

---

[13] 'హదీస్' ఖుద్సీ, అల్లాహ్(సు.తా.) అంటాడు: "ఆదమ్ కుమారుడు నాకు బాధ కలిగిస్తాడు - కాలాన్ని దూషిస్తాడు - (అంటే కాలం వల్ల తనకు దురవస్థ వచ్చిందంటాడు). వాస్తవానికి కాలం అనేది ఏమీ లేదు. నేనే కాలాన్ని! సర్వాధికారాలు నా చేతిలోనే ఉన్నాయి. రాత్రింబవళ్ళనూ మార్చేవాడను నేనే." ('స.బు'ఖారీ, ముస్లిం.)

[14] చూడండి, 44:36.

**28.** మరియు ప్రతి సమాజం వారిని నీవు మోకరిల్లి[15] ఉండటాన్ని చూస్తావు. ప్రతి జాతి వారిని తమ కర్మపత్రం వైపునకు పిలవడం జరుగుతుంది. (వారితో ఇలా అనబడుతుంది): "ఈ రోజు మీరు చేస్తూ ఉండిన కర్మలకు తగిన ప్రతిఫలం మీకు ఇవ్వబడుతుంది.

**29.** ఇది మేము వ్రాసి పెట్టిన (మీ కర్మ) పత్రం, ఇది మీ గురించి సత్యమే పలుకుతుంది[16]. నిశ్చయంగా, మేము మీరు చేస్తున్న కర్మలన్నింటినీ వ్రాస్తూ ఉండేవారము."

**30.** కావున విశ్వసించి సత్కార్యాలు చేస్తూ ఉండిన వారిని, వారి ప్రభువు తన కారుణ్యంలోకి ప్రవేశింప జేసుకుంటాడు[17]. ఇదే ఆ స్పష్టమైన విజయం.

**31.** మరియు సత్యాన్ని తిరస్కరించిన వారితో (ఇలా అనబడుతుంది): "మీకు మా సూచనలు వినిపించబడలేదా? కాని మీరు దురహంకారంలో పడిపోయారు మరియు అపరాధులై పోయారు."

**32.** మరియు: "నిశ్చయంగా, అల్లాహ్ వాగ్దానం సత్యం మరియు అంతిమ ఘడియను గురించి ఎలాంటి సందేహం లేదు." అని అన్నప్పుడు మీరన్నారు: "ఆ అంతిమ ఘడియ ఏమిటో మాకు తెలియదు. అది కేవలం ఒక ఊహాగానం తప్ప మరేమీ కాదని మేము భావిస్తున్నాము. మేము దానిని ఏ

---

[15] జా'సియతున్: Kneeling down, మోకరిల్లటం, మోకాళ్ళు భూమికి ఆనించి కూర్చోవడం.

[16] చూడండి, 39:69 మరియు 18:49.

[17] అంటే స్వర్గం.

మాత్రం నమ్మే వారము కాము[18]."

**33.** అప్పుడు వారి ముందు వారు చేస్తూ ఉండిన దుష్కార్యాలు, ప్రత్యక్షమవుతాయి. మరియు వారు దేనిని గురించి పరిహాసమాడుతూ ఉన్నారో, అదే వారిని క్రమ్ముకుంటుంది.

**34.** మరియు వారితో ఇలా అనబడుతుంది: "ఈ రోజు మేము మిమ్మల్ని మరచి పోతాము, ఏ విధంగానైతే మీరు మీ సమావేశపు ఈ దినాన్ని మరచిపోయారో! మరియు మీ నివాసం నరకాగ్నియే మరియు మీకు సహాయపడేవారు ఎవ్వరూ ఉండరు."

**35.** ఇది ఎందుకంటే, వాస్తవానికి మీరు అల్లాహ్ సూచనలను (ఆయాత్ లను) పరిహాసంగా తీసుకున్నారు. మరియు ఇహలోక జీవితం మిమ్మల్ని మోసపుచ్చింది. కావున ఈ రోజు వారిని దాని (నరకం) నుండి బయటికి తీయడం జరగదు[19]. మరియు వారికి తమ తప్పులను సరిదిద్దుకునే అవకాశమూ దొరకదు.

**36.** ఇక సర్వస్తోత్రాలకు అర్హుడు అల్లాహ్ మాత్రమే! ఆయనే ఆకాశాలకూ ప్రభువు మరియు భూమికీ ప్రభువు; ఆయనే సర్వలోకాలకు కూడా ప్రభువు!

**37.** ఆకాశాలలో మరియు భూమిలో ఘనత (మహనీయత) ఆయనకే చెందుతుంది. మరియు ఆయనే సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు.

---

[18] అంటే పునరుత్థానదినం, సత్యం.
[19] చూడండి, 6:128 మరియు 43:74.

# 46. అల్-అహ్ఖాఫ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

**1.** హా - మీమ్[1].

**2.** ఈగ్రంథం (ఖుర్ఆన్) అవతరణ సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడైన అల్లాహ్ తరఫు నుండి జరిగింది.

**3.** మేము ఆకాశాలను, భూమిని మరియు వాటి మధ్య ఉన్న సమస్తాన్ని, సత్యంతో ఒక నిర్ణీత కాలం కొరకు మాత్రమే సృష్టించాము[2]. మరియు సత్యాన్ని తిరస్కరించిన వారు తమకు చేయబడిన హెచ్చరిక నుండి విముఖులవుతున్నారు.

**4.** వారితో ఇలా అను: "అల్లాహ్ ను వదలి మీరు ప్రార్థిస్తున్న వాటిని గురించి ఆలోచించారా? అయితే నాకు చూపండి[3] వారు భూమిలో ఏమి సృష్టించారో? లేదా, వారికి ఆకాశాలలో ఏదైనా భాగముందా? మీరు సత్యవంతులే అయితే, దీనికి (ఈ ఖుర్ఆన్ కు) ముందు వచ్చిన ఏదైనా గ్రంథాన్ని లేదా ఏదైనా మిగిలి ఉన్న జ్ఞానాన్ని

---

[*] [అల్-అహ్ఖాఫ్ అంటే ఇసుక మేటల మార్గము]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

[2] చూడండి, 14:48.

[3] రఅ"య్ తుమ్: అంటే చెప్పండి, చూపండి, లేక ఆలోచించారా.

తెచ్చి చూపండి[4]."

5. మరియు అల్లాహ్ ను వదలి పునరుత్థాన దినం వరకు తమ ప్రార్థనలను విని సమాధాన మివ్వలేనటువంటి వారిని ప్రార్థించే వారి కంటే, ఎక్కువ మార్గభ్రష్టులెవరు? మరియు వారు (తమను ప్రార్థించే) వారి ప్రార్థనలను ఎరుగకుండా ఉన్నారు.

6. మరియు మానవులను (పునరుత్థాన దినమున) సమావేశపరచిబడినపుడు, (ఆరాధించ బడిన) వారు! (తమను ఆరాధించిన) వారికి విరోధులై ఉంటారు. మరియు వారి ఆరాధనను తిరస్కరిస్తారు[5].

7. మరియు వారికి మా స్పష్టమైన సూచనలు (ఆయాత్) వినిపించబడినప్పుడు, సత్యతిరస్కారులు

---

[4] అసా'రతిమ్ మిన్ 'ఇల్మిన్: అంటే తెలివితేటలు, బఖియ్యతిమ్-మిన్-'ఇల్మిన్: అంటే పూర్వప్రవక్తల మీద అవతరింపజేయబడిన దివ్యజ్ఞానం వహీ నుండి మిగిలి ఉన్న నిజ దివ్యజ్ఞానం.

[5] ఈ విధమైన ఆయత్ లు ఖుర్ఆన్ లో ఎన్నోసార్లు వచ్చాయి. చూడండి, 10:29, 19:81-82, 29:25, 18:52, 16:86 మొదలైనవి. అల్లాహ్ (సు.తా.)కు సాటి కల్పించి ఆరాధించే దైవాలు రెండు రకాలు. 1) నిర్జీవులు: అవి విగ్రహాలు, చెట్లుచేమలూ, సూర్యచంద్రులూ, అగ్ని మొదలైనవి. పునరుత్థాన దినమున అల్లాహ్ (సు.తా.) వీటికి మాట్లాడే శక్తిని ప్రసాదిస్తాడు. అవి, వారి ఆరాధనను తిరస్కరిస్తాయి. 2) రెండవరకానికి చెందిన వారు ప్రవక్తలు, ఉదాహరణ ఈ'సా, 'ఉజైర్, దైవదూతలు ('అలైహిమ్ స.) మరియు సద్పురుషులు వీరి సమాధానం అల్లాహ్ (సు.తా.) సమక్షంలో - ఖుర్ఆన్ లో పేర్కొనబడిన - 'ఈసా ('అ.స.) సమాధానంలాగానే ఉంటుంది. ఇంతేకాక షైతానులు కూడా వీరి ఆరాధనను నిరాకరిస్తారు. ఉదారహరణకు చూ. ' 28:63.

- సత్యం (ఈ ఖుర్ఆన్) వారి ముందుకు వచ్చినప్పుడు
- ఇలా అంటారు: "ఇది స్పష్టమైన మంత్రజాలమే!"[6]

8. లేదా ఇలా అంటారు: "ఇతనే (ముహమ్మదే) దీనిని కల్పించాడు." వారితో ఇలా అను: "ఒకవేళ నేను దీనిని కల్పించి ఉండినట్లయితే, మీరు నన్ను అల్లాహ్ (శిక్ష) నుండి ఏ మాత్రం కాపాడలేరు. మీరు కల్పించే మాటలు ఆయనకు బాగా తెలుసు. నాకూ మీకూ మధ్య ఆయన (అల్లాహ్) సాక్ష్యమే చాలు! మరియు ఆయన క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత."

9. (ఓ ముహమ్మద్!) వారితో ఇలా అను: "నేను మొట్టమొదటి ప్రవక్తనేమీ కాను. నాకూ మరియు మీకూ ఏమి కానున్నదో నాకు తెలియదు[7]. నేను అనుసరించేది, నాపై అవతరింపజేయబడిన దివ్యజ్ఞానం (వహీ) మాత్రమే. మరియు నేను కేవలం స్పష్టంగా హెచ్చరిక చేసేవాడను మాత్రమే."

10. వారిలో ఇలా అను: "ఇది (ఈ ఖుర్ఆన్) ఒకవేళ అల్లాహ్ తరఫు నుండి వచ్చి ఉండి, మీరు దీనిని తిరస్కరిస్తూ ఉండినట్లయితే (మీ గతి ఏమవుతుందో) మీరు ఆలోచించరా? ఇస్రాయీల్ సంతతికి చెందిన ఒక సాక్షి ఇది (ఈ ఖుర్ఆన్) దాని (తౌరాత్) లాంటి గ్రంథమేనని,

---

[6] అవతరణా క్రమంలో, 74:24లో సిహ్ రున్ అనే పదం మొదటిసారి వచ్చింది.

[7] "అల్లాహ్ (సు.తా.) సాక్షిగా నేను ('స'అస) దైవప్రవక్తను అయినప్పటికీ, మీకూ మరియు నాకూ పునరుత్థానదినమున ఏమి సంభవించనున్నదో నాకు తెలియదు." ('స'బుఖారీ).

సాక్ష్యం ఇచ్చాడు మరియు విశ్వసించాడు కూడా[8]. కాని మీరేమో అహంభావానికి గురి అయ్యారు. నిశ్చయంగా, అల్లాహ్ దుర్మార్గులకు మార్గదర్శకత్వం చేయడు."

11. సత్యతిరస్కారులు, విశ్వాసులను గురించి ఇలా అంటారు: "ఒకవేళ ఇందులో (ఇస్లాంలో) మేలే ఉంటే?, వీరు మా కంటే ముందుగా దాని వైపునకు పోయి ఉండేవారు కాదు!"[9] మరియు వారు దాని (ఖుర్ఆన్) నుండి మార్గదర్శకత్వం పొందలేదు! కాబట్టి వారు: "ఇదొక ప్రాచీన బూటక కల్పనయే!" అని అంటారు.

12. మరియు దీనికి (ఈ గ్రంథానికి) పూర్వం, మూసా గ్రంథం మార్గదర్శినిగా మరియు కారుణ్యంగా వచ్చింది. మరియు ఈ గ్రంథం (ఖుర్ఆన్) దానిని ధృవీకరిస్తూ, అరబ్బీ భాషలో, దుర్మార్గులను హెచ్చరించటానికి మరియు సజ్జనులకు శుభవార్తలు ఇవ్వటానికి వచ్చింది.

13. నిశ్చయంగా, ఎవరైతే: "మా ప్రభువు అల్లాహ్ యే!" అని, తరువాత దానిపై స్థిరంగా ఉంటారో! అలాంటి వారికి ఎలాంటి భయమూ వుండదు

[8] ఈ సాక్షి 'అబ్దుల్లాహ్ బిన్-సల్లామ్ ('ర'ది.'అ.) తౌరాత్ లో దైవప్రవక్త ము'హమ్మద్ ('స'అస) రాబోతున్నాడని పేర్కొనబడిన వాక్యాలకు చూడండి, 2:42.

[9] అంటే మొట్టమొదట ఇస్లాం స్వీకరించిన వారిలోని పేదవారూ మరియు బలహీనవర్గాలకు చెందిన వారూ అయిన బిలాల్, 'అమ్మార్, 'సుహైబ్ మరియు 'ఖబ్బాబ్ మొదలైన వారిని ('ర'ది.'అన్హుమ్ లను) గురించి, మక్కా ముష్రిక్ నాయకులు చెప్పిన మాటలివి.

మరియు వారు దుఃఖపడరు కూడా!

**14.** అలాంటి వారే స్వర్గవాసులవుతారు. తాము చేస్తూ ఉండిన (మంచి) కర్మల ఫలితంగా వారు అందులో శాశ్వతంగా ఉంటారు.

**15.** మరియు మేము మానవునికి తన తల్లిదండ్రుల పట్ల మంచితనంతో మెలగాలని ఆదేశించాము[10]. అతని తల్లి అతనిని ఎంతో బాధతో తన గర్భంలో భరించింది మరియు ఎంతో బాధతో అతనిని కన్నది. మరియు అతనిని గర్భంలో భరించి, అతనిని పాలు విడిపించే వరకు ముప్పై నెలలు అవుతాయి[11]. చివరకు అతడు పెరిగి పెద్దవాడవుతాడు మరియు అతడు నలభై సంవత్సరాల[12] వయస్సుకు చేరి ఇలా

---

[10] చూడండి, 29:8 మరియు 31:14 ఒక 'స'హాబి దైవప్రవక్త ('స'అస) తో ఇలా ప్రశ్నిస్తాడు: 'నా సద్వర్తనకు అందరికంటే ఎక్కువ హక్కుదారులు ఎవరు?' దానికి అతను ('స'అస) ఇలా సమాధానమిస్తారు: 'నీ తల్లి!' అతడు మళ్ళీ అదే ప్రశ్న అడుగుతాడు. దైవప్రవక్త ('స'అస) అంటారు: 'నీ తల్లి!' అతడు మూడోసారి అదేప్రశ్న అడుగుతాడు. అప్పుడు కూడా: 'నీ తల్లి!' అని అంటారు. అతడు నాలుగవసారి అదే ప్రశ్న అడుగగా దైవప్రవక్త ('స'అస) అంటారు: 'నీ తండ్రి!' దీనితో మానవ జీవితంలో తల్లి అందరి కంటే - తండ్రి కంటే కూడా మూడు రెట్లు - అధికంగా ఆదరణకు, సద్వర్తనకు అర్హత గలది, అని తెలుస్తోంది! ('స.ముస్లిం)

[11] పాలిచ్చే గడువు 2:233 మరియు 31:14 లలో రెండు సంవత్సరాలు, అని ఉంది. దీనితో వ్యక్తమయ్యేది ఏమిటంటే - సజీవ శిశువుకు జన్మం ఇవ్వటానికి కనీస గడువు 6 మాసాలు. ఈ విధంగా పాలు విడిపించే మొత్తం కాలం ముప్పై నెలలు.

[12] నలభై సంవత్సరాల వయస్సుకు చేరిన తరువాతనే మానవుడు సంపూర్ణ మానసిక వికాసం పొందుతాడు.

అంటాడు: "ఓ నా ప్రభూ! నీవు, నాకూ మరియు నా తల్లిదండ్రులకూ ప్రసాదించిన అనుగ్రహాలకు నేను మీకు కృతజ్ఞతలు తెలుపుకోవటానికి మరియు నీవు ఇష్టపడే సత్కార్యాలు చేయటానికి నాకు సద్బుద్ధిని ప్రసాదించు మరియు నా సంతానాన్ని కూడా సద్వర్తనులుగా చేయి. నిశ్చయంగా నేను పశ్చాత్తాపంతో నీ వైపునకు మరలుతున్నాను మరియు నిశ్చయంగా, నేను నీకు విధేయులైన (ముస్లింలైన) వారిలో ఒకడిని."[13]

**16.** ఇలాంటి వారి నుండి మేము వారి మంచి కర్మలను స్వీకరిస్తాము[14]. మరియు వారి చెడు కర్మలను ఉపేక్షిస్తాము; వారు స్వర్గవాసులలో చేరుతారు. ఇది వారికిచేయబడినవాగ్దానం,ఒకసత్యవాగ్దానం.

**17.** మరియు ఎవడైనా తన తల్లిదండ్రులతో ఇలా అంటే: "ఛీ పొండి (ఉఫ్)![15] నేను (గోరీ నుండి సజీవిగా) లేపబడతానని మీరు నన్ను బెదిరిస్తున్నారా? మరియు వాస్తవానికి, నాకు ముందు ఎన్నో తరాలు గతించాయి. (కాని తిరిగి లేపబడలేదు కదా)?" మరియు వారిద్దరూ అల్లాహ్ సహాయం కోరుతూ ఇలా అంటారు: "ఓ

---

[13] అవ్'జి'అనీ: అంటే నాకు దైవభీతి మరియు భయభక్తులను ప్రసాదించు. ఒక వయస్సు గడిచిన తరువాత ఈ దు'ఆ (రబ్బి అవ్'జి'అనీ ... (నుండి) ... మినల్ ముస్లిమీన్.), అంటే ఆయత్ చివరి వరకు అత్యధికంగా చేయాలి అని ధర్మవేత్తల అభిప్రాయం.

[14] చూడండి, 29:7.

[15] 'ఉఫిన్': ఛీ పొండి! ఇది అయిష్టతను, ఏవగింపును తెలిపే పదం.

దౌర్భాగ్యుడా! విశ్వసించు! నిశ్చయంగా, అల్లాహ్ వాగ్దానం సత్యం!" అప్పుడు వాడు ఇలా అంటాడు: "ఇవన్నీ కేవలం పాతకాలపు కట్టుకథలు తప్ప మరేమీ కావు."

18. వీరికి పూర్వం గతించిన జిన్నాతుల మరియు మానవ సమాజాలలో, ఇలాంటి వారి మీదనే (అల్లాహ్) వాక్కు (శిక్ష) సత్యమయింది. నిశ్చయంగా, వారే నష్టపడిన వారయ్యారు[16].

19. ప్రతి ఒక్కరికీ వారి వారి కర్మలకు తగిన స్థానాలుంటాయి. మరియు ఇది వారి కర్మలకు తగినట్లుగా పూర్తి ప్రతిఫలమివ్వటానికి మరియు వారికి ఎలాంటి అన్యాయం జరుగదు.

20. మరియు ఆ రోజు సత్యాన్ని తిరస్కరించిన వారిని నరకాగ్ని ముందుకు తెచ్చి, వారితో (ఇలా అనబడుతుంది): "మీరు, మీ ఇహలోక జీవితంలో మీ భోగభాగ్యాలను తరిగించు కున్నారు మరియు వాటిని బాగా అనుభవించారు; కావున మీరు ఏ హక్కూ లేకుండా భూమిలో ప్రదర్శించిన అహంకారానికి మరియు మీరు చేసిన అవిధేయతకు ప్రతిఫలంగా, ఈ రోజు మీకు అవమానకరమైన శిక్ష విధించబడుతుంది."

21. మరియు జ్ఞాపకం చేసుకోండి, ఆద్ జాతి సోదరుడు

---

[16] అల్లాహ్ (సు.తా.) వాక్కుకు చూడండి, 38:85.

(హూద్) ఇసుక దిబ్బలలో[17] ఉన్న తన జాతివారిని హెచ్చరించింది మరియు అలా హెచ్చరించేవారు అతనికి పూర్వం కూడా వచ్చారు మరియు అతని తరువాత కూడా వచ్చారు. (అతను ఇలా అన్నాడు): "మీరు అల్లాహ్ ను తప్ప ఇతరులను ఆరాధించకండి. (అలా చేస్తే) నిశ్చయంగా, ఆ గొప్ప దినమున మీపై పడబోయే, ఆ శిక్షను గురించి నేను భయపడుతున్నాను."

22. వారిలా అన్నారు: "మా దేవతల నుండి మమ్మల్ని దూరం చేయటానికా నీవు వచ్చింది? నీవు సత్యవంతుడవే అయితే నీవు బెదిరించే (ఆ శిక్షను) తీసుకురా!"

23. (హూద్) అన్నాడు: "నిశ్చయంగా, దాని (ఆ శిక్ష) జ్ఞానం కేవలం అల్లాహ్ కే ఉంది. మరియు నేను మాత్రం నాకు ఇచ్చి పంపబడిన సందేశాన్ని మీకు అందజేస్తున్నాను. కాని, నేను మిమ్మల్ని మూఢత్వంలో పడిపోయిన వారిగా చూస్తున్నాను."

24. ఆ తరువాత వారు ఒక దట్టమైన మేఘాన్ని వారి లోయల వైపునకు రావటం చూసి ఇలా అన్నారు:

---

[17] అల్-అ'హ్ ఖాఫు, 'హిఖ్'ఫున్ దీని ఏకవచనం: అంటే పొడువుగా పోయే ఇసుక దిబ్బలు. ఇది హూద్ ('అస) జాతి వారైన 'ఆద్ లు నివసించే ప్రాంతం పేరు. ఇది 'హ'దరమౌత్ (యమన్) ప్రాంతంలో ఉంది. వారు కూడా హద్దు మీరి ప్రవర్తించారు.

"ఈ మేఘం మాకు వర్షం ఇస్తుంది!"[18] (హూద్
అన్నాడు): "కాదు, కాదు! మీరు దేనికి
తొందరపెడుతున్నారో అది (ఆ శిక్ష) ఇదే! ఒక
తుఫాను గాలి, అందులో బాధాకరమైన శిక్ష ఉంది;
25. అది తన ప్రభువు ఆజ్ఞతో ప్రతిదానిని నాశనం
చేస్తుంది." చివరకు వారి నివాసస్థలాలు తప్ప,
అక్కడ ఏమీ కనిపించకుండా పోయాయి. ఈ
విధంగా మేము నేరస్థులకు ప్రతీకారం చేస్తాము.
26. మరియు వాస్తవానికి మేము వారిని దృఢంగా
స్థిరపరచి ఉన్నాము; ఆ విధంగా మేము (ఓ
ఖురైషులారా) మిమ్మల్ని కూడా స్థిరపరచలేదు.
మేము వారికి చెవులను, కన్నులను మరియు
హృదయాలను ఇచ్చాము. కాని వారి చెవులూ,
కళ్ళూ మరియు హృదయాలు వారికి
ఉపయోగపడలేదు; ఎందుకంటే వారు అల్లాహ్
సూచనలను తిరస్కరిస్తూ ఉండేవారు మరియు
వారు దేనిని గురించి పరిహాసం చేస్తూ ఉండేవారో
అదే వారిని చుట్టుకున్నది.

---

[18] 'ఆయి'షహ్ (ర.'అన్హా), దైవప్రవక్త ('స'అస) తో అన్నారు: "ప్రజలు మేఘాలను చూసి సంతోషపడతారు. కానీ మేఘాలను చూసినప్పుడు మీరు ('స'అస) ఆందోళన పడుతారెందుకు?" దానికి అతను ('స'అస) జవాబిచ్చారు: "'ఆయి'షహ్ (ర.'అన్హా) ఈ మేఘాలలో అల్లాహ్ (సు.తా.) శిక్ష లేదనే హామీ ఏమీ లేదు కదా! ఒక జాతి గాలి శిక్షతో నాశనం చేయబడింది కదా! వారు కూడా మేఘాలను చూసి అన్నారు: 'ఈ మేఘాలు మాపై వర్షం కురిపిస్తాయి.' " ('స.బు'ఖారీ, 'స. ముస్లిం) మేఘాలను చూసినప్పుడు దైవప్రవక్త ('స'అస) దు'ఆ చేసేవారు. దీనికి చూడండి, 69:6-8, 7:72, 11:53-56.

27. మరియు వాస్తవానికి, మేము మీ చుట్టుప్రక్కల ఎన్నో నగరాలను నాశనం చేశాము. మరియు బహుశా వారు (సత్యం వైపునకు మరలి వస్తారని, మా సంకేతాలను వారికి ఎన్నో విధాలుగా చూపాము.

28. అల్లాహ్ ను వదలి - తమను ఆయన సాన్నిధ్యానికి తేగలవారని - వారు భావించిన, వారి దేవతలు వారికెందుకు సహాయం చేయవు? అలా కాదు! అవి వారిని త్యజించాయి. ఎందుకంటే అది కేవలం వారి భ్రమ మరియు వారు కల్పించుకున్న బూటక కల్పన మాత్రమే!

29. మరియు (ఓ ముహమ్మద్!) జిన్నాతుల ఒక సమూహాన్ని[19] మేము - ఖుర్ఆన్ వినటానికి - నీ వైపునకు మొగ్గునట్లు చేసినపుడు, వారు అక్కడ చేరిన తరువాత పరస్పరం ఇలా మాట్లాడుకున్నారు: "నిశ్శబ్దంగా వినండి!" అది (ఆ పఠనం) ముగిసిన తరువాత, వారు హెచ్చరిక చేసేవారిగా, తమ జాతి వైపునకు మరలిపోయారు.

30. వారు (జిన్నాతులు) ఇలా అన్నారు: "ఓ మా జాతివారలారా! వాస్తవంగా మేము మూసా తరువాత అవతరింప జేయబడిన ఒక గ్రంథాన్ని

---

[19] నఫరన్: అంటే '3 నుండి 10 వరకు' ఉండే సంఖ్యల సమూహం. ఈ సంఘటన మక్కా - 'తాయఫ్ దారిలో న'ఖ్ల లోయలో సంభవించింది. వివరాలకు చూడండి, 72:1-15. ('స.ముస్లిం, 'స.బు'ఖారీ) ఈ సంఘటన తరువాత జిన్నాతుల రాయబారులు దైవప్రవక్త ('స'అస) దగ్గరికి ఎన్నో సార్లు ఇస్లాం స్వీకరించటానికి, నేర్చుకోవటానికి వచ్చారు. (ఇబ్నె-కసీ'ర్).

విన్నాము. అది దానికి పూర్వం వచ్చిన దానిని (తౌరాత్ ను) ధృవీకరిస్తుంది; సత్యం వైపునకు మరియు ఋజుమార్గం (ఇస్లాం) వైపునకు మార్గదర్శకత్వం చేస్తుంది."[20]

31. "మా జాతి వారలారా! అల్లాహ్ వైపునకు పిలిచేవానిని అనుసరించండి. మరియు ఆయన (అల్లాహ్) ను విశ్వసించండి. ఆయన మీ పాపాలను క్షమిస్తాడు మరియు మిమ్మల్ని బాధాకరమైన శిక్ష నుండి కాపాడుతాడు.

32. మరియు అల్లాహ్ వైపునకు పిలిచే వానిని అనుసరించని వాడు భూమిలో (అల్లాహ్ నుండి) తప్పించుకోలేడు. మరియు ఆతడికి, ఆయన తప్ప మరొక సంరక్షకుడు లేడు. అలాంటి వారు స్పష్టంగా మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నట్లే!"

33. ఏమీ? వారికి తెలియదా? నిశ్చయంగా, ఆకాశాలనూ మరియు భూమినీ సృష్టించినవాడు అల్లాహ్ యే నని మరియు ఆయన వారిని సృష్టించటంలో అలసి పోడని, మరణించినవారిని తిరిగి బ్రతికించగల సామర్థ్యం గలవాడని? అలాకాదు (ఎందుకు కలిగిలేదు)! నిశ్చయంగా, ఆయన ప్రతిదీ చేయగల సమర్థుడు.

34. మరియు సత్యాన్ని తిరస్కరించిన వారిని నరకాగ్ని

[20] ప్రవక్తలందరూ మానవులే! జిన్నాతులలో ప్రవక్తలు వచ్చినట్లు ఖుర్ఆన్ లో, 'స'హీ'హ్ 'హదీస్'లలో లేదు. చూడండి, 16:43, 25:20. ఈ సూరహ్ లోని ఆయత్ లలో దైవప్రవక్త ('స'అస) జిన్నాతులకు కూడా ప్రచారం చేశారని తెలుస్తోంది.

ముందు ప్రవేశపెట్టబడే రోజు వారితో ఇలా ప్రశ్నించడం జరుగుతుంది: "ఏమీ? ఇది సత్యం కాదా?" అని. వారంటారు: "ఎందుకు కాదు! మా ప్రభువు సాక్షిగా (ఇది సత్యమే!)" వారితో అనబడుతుంది: "అయితే, మీరు తిరస్కరిస్తూ వున్న దానికి గానూ ఈ శిక్షను రుచి చూడండి!"

35. కావున నీవు (ఓ ప్రవక్తా!) సహనం వహించు! దృఢ సంకల్పం గల ప్రవక్తలు సహనం వహించినట్లు; మరియు వారి విషయంలో తొందర పడకు. నిశ్చయంగా, వారికి వాగ్దానం చేయబడిన (శిక్షను) వారు చూసిన రోజు; వారు (ఈ ప్రపంచంలో) దినంలోని ఒక ఘడియ కంటే ఎక్కువ కాలం గడపలేదని అనుకుంటారు. (ఇదే మా) సందేశం! అలాంటప్పుడు, దుష్టులు (ఫాసిఖూన్) గాక, ఇతరులు నశింప జేయ బడతారా?

# 47. ముహమ్మద్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఎవరైతే సత్యాన్ని తిరస్కరించి (ఇతరులను) అల్లాహ్ మార్గం నుండి నిరోధించారో, వారి కర్మలను ఆయన (అల్లాహ్) నిష్ఫలం చేశాడు.
2. మరియు ఎవరైతే విశ్వసించి సత్కార్యాలు చేస్తూ - ముహమ్మద్ మీద అవతరింప జేయబడిన దానిని - తమ ప్రభువు తరఫు నుండి వచ్చిన సత్యమని నమ్మారో! వారి పాపాలను ఆయన తుడిచి వేశాడు మరియు వారి స్థితిని బాగు పరిచాడు.
3. ఇలా ఎందుకు జరిగిందంటే! వాస్తవానికి అవిశ్వాసులు అసత్యాన్ని అనుసరించారు మరియు విశ్వసించినవారు తమ ప్రభువు తరఫు నుండి వచ్చిన సత్యాన్ని అనుసరించారు. ఈ విధంగా అల్లాహ్! ప్రజలకు ఉదాహరణల ద్వారా (వారి స్థానం) తెలియజేస్తున్నాడు.
4. కావున మీరు సత్యతిరస్కారులను (యుద్ధంలో)

[*] [ముహమ్మద్ – ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం]

ఎదుర్కొన్నప్పుడు[1], వారిపై ప్రాబల్యం పొందే వరకు, వారి మెడలపై కొట్టండి. ఆ తరువాత వారిని గట్టిగా బంధించండి, (యుద్ధం ముగిసిన) తరువాత వారిని కనికరించి వదలి పెట్టండి[2], లేదా పరిహార ధనం తీసుకొని వదలి పెట్టండి. (మీతో) యుద్ధం చేసేవారు తమ ఆయుధాలను పడవేసే వరకు (వారితో పోరాడండి). ఇది మీరు చేయవలసిన పని. అల్లాహ్ తలుచుకుంటే ఆయన వారికి ప్రతీకారం చేసేవాడు, కాని మిమ్మల్ని ఒకరి ద్వారా మరొకరిని పరీక్షించటానికి (ఆయన ఇలా చేశాడు). మరియు ఎవరైతే అల్లాహ్ మార్గంలో చంపబడ్డారో, అలాంటి వారి కర్మలను ఆయన వ్యర్థం చేయడు.

5. ఆయన వారికి మార్గదర్శకత్వం చేస్తాడు మరియు వారి స్థితిని చక్కబరుస్తాడు.

---

[1] ప్రతి మానవునికి తనకు నచ్చిన ధర్మాన్ని అనుసరించే హక్కు ఉంది. ధర్మ విషయంలో బలవంతం లేదు, చూడండి, 2:256. కావున ఎవరైనా మీ ఇస్లాం ధర్మపాలన కారణంగా మీపై దౌర్జన్యాలు చేస్తే! మీరు ఇస్లాంపై నడవకుండా మీ స్వాతంత్ర్యాన్ని భంగపరిస్తే, వారితో మీ మానప్రాణాల రక్షణ మరియు మీ ఇస్లాం ధర్మ రక్షణకై, వారిని పూర్తిగా అణగద్రొక్కే వరకు, లేదా వారిని ఖైదీలుగా చేసుకునే వరకు, వారితో భయంకరంగా పోరాడమే జిహాద్. వారిపై ప్రాబల్యం వహించిన తరువాత వారిని బంధించండి. యుద్ధం ముగిసిన తరువాత వారిలో మంచితనం చూస్తే వారిని కనికరించి, లేదా పరిహారం తీసుకొని వదలండి. చూడండి, 2:190-191. ఇంకా చూడండి జిహాద్ ను గురించి అవతరింపజేయబడిన మొట్టమొదటి ఆయత్ లకు 22:39-40.

[2] పరిహారధనానికి బదులుగా యుద్ధఖైదీలను పరస్పరం మార్పిడి కూడా చేసుకోవచ్చు.

6. మరియు వారికి తెలియజేసి యున్న, స్వర్గంలోకి వారిని ప్రవేశింపజేస్తాడు.

7. ఓ విశ్వాసులారా! ఒకవేళ మీరు అల్లాహ్ కు (ఆయన మార్గంలో) సహాయపడితే, ఆయన మీకు సహాయం చేస్తాడు మరియు మీ పాదాలను స్థిరపరుస్తాడు[3].

8. ఇకపోతే సత్యాన్ని తిరస్కరించిన వారికి వినాశం తప్పదు. మరియు (అల్లాహ్) వారి కర్మలు వ్యర్థం చేస్తాడు.

9. ఇది ఎందుకంటే వాస్తవానికి, వారు అల్లాహ్ అవతరింపజేసిన దానిని అసహ్యించు కున్నారు. కాబట్టి ఆయన వారి కర్మలను విఫలం చేశాడు[4].

10. ఏమీ? వారు భూమిలో సంచరించి చూడలేదా? వారికి పూర్వం గతించిన వారి పర్యవసానం ఏమయిందో? అల్లాహ్ వారిని నిర్మూలించాడు. మరియు సత్యతిరస్కారులకు అలాంటి గతే పట్టబోతోంది[5].

11. ఇది ఎందుకంటే! నిశ్చయంగా, విశ్వసించిన వారి సంరక్షకుడు అల్లాహ్! మరియు నిశ్చయంగా, సత్యతిరస్కారులకు సంరక్షకుడు ఎవ్వడూ

---

[3] చూడండి, 22:40.

[4] కర్మలంటే ఇక్కడ సత్యతిరస్కారుల సత్కర్మలు విఫలమవుతాయి. విశ్వాసం లేనిదే ఎన్ని పుణ్య కార్యాలు చేసినా అవి విఫలమే అవుతాయి. పరలోకంలో వాటికి ఎలాంటి మంచి ఫలితం దొరకదు. సత్యతిరస్కారుల గమ్యస్థానం నరకమే.

[5] చూడండి, 6:10.

లేదు[6].

**12.** నిశ్చయంగా, అల్లాహ్! విశ్వసించి సత్కార్యాలు చేసేవారిని స్వర్గవనాలలో ప్రవేశింప జేస్తాడు. వాటి క్రింద సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి. మరియు సత్యాన్ని తిరస్కరించి భోగభాగ్యాలలో మునిగి ఉండి పశువుల మాదిరిగా తింటున్న వారి నివాసం నరకాగ్నియే అవుతుంది[7].

**13.** మరియు (ఓ ముహమ్మద్!) నిన్ను బహిష్కరించిన నగరం కంటే బలమైన ఎన్నో నగరాలను మేము నాశనం చేశాము. వారికి సహాయపడే వాడెవ్వడూ లేకపోయాడు[8].

**14.** ఏమీ? తన ప్రభువు తరఫు నుండి వచ్చిన స్పష్టమైన మార్గం మీద ఉన్నవాడు, తమ దుష్కార్యాలను మనోహరమైనవిగా భావించి,

---

[6] ఉ'హుద్ యుద్ధంలో మక్కా ముష్రిక్ లు తమకు కొంత ప్రాబల్యం దొరికినందుకు: 'అ'అలు హుబల్' - హుబల్ కు జై! అంటే! విశ్వాసులు: 'అల్లాహు అ'అలావ అజల్లు' - అల్లాహ్ మహోన్నతుడు, గొప్పస్థానం గలవాడు. అని అన్నారు. మరియు ముష్రికులు: 'లనల్'ఉ'జ్జా వలా 'ఉ'జ్జాలకుమ్' - 'ఉ'జ్జా మాతోపాటు ఉన్నాడు, 'ఉ'జ్జా మీతో లేడు. అని, అంటే! ముస్లింలు: 'అల్లాహు మౌలానా వలా మౌలా లకుమ్' - అల్లాహ్ (సు.తా.) మా సంరక్షకుడు, మీ సంరక్షకుడు ఎవ్వడూ లేడు! అని అన్నారు. ('స.బు'ఖారీ)

[7] సత్యతిరస్కారులకు, తమ ఐహిక జీవితానికే ప్రాధాన్యత నివ్వటం, అంటే కడుపు నింపుకోవటం మరియు లైంగిక అవసరాలను పూర్తి చేసుకోవటమే ప్రధానమైనది. వీరు పరలోక జీవితం గురించి పూర్తిగా అంధకారంలో పడి ఉన్నారు.

[8] ఈ ఆయత్ దైవప్రవక్త ('స'అస) యొక్క మక్కా నుండి మదీనా ప్రస్థానం చేసిన మొదటి రాత్రి అవతరింప జేయబడింది. ('తబరీ - ఇబ్నె- 'అబ్బాస్, కథనం) ఇంకా చూడండి, 6:131.

తమ మనోవాంఛలను అనుసరించే వారితో సమానుడు కాగలడా?

15. భయభక్తులు గలవారికి వాగ్దానం చేయబడిన స్వర్గం యొక్క ఉదాహరణ ఇలా వుంది: అందులో వాసన మరియు రంగు మారని నీటి సెలయేళ్ళు ఉంటాయి మరియు రుచి మారని పాల కాలువలు ఉంటాయి[9] మరియు అందులో త్రాగేవారికి మధురంగా వుండే మద్యపాన కాలువలు ఉంటాయి మరియు అందులో శుద్ధమైన తేనె కాలువలు ఉంటాయి మరియు వారి కొరకు అందులో అన్ని రకాల మంచి ఫలాలు మరియు వారి ప్రభువు నుండి క్షమాపణ కూడా వుంటాయి[10]. ఇలాంటివాడు - నరకాగ్నిలో శాశ్వతంగా ఉండి సలసల కాగే నీటిని[11] త్రాగేందుకు ఇవ్వబడి, దానితో ప్రేగులు కోయబడినట్లు బాధపడేవానితో - సమానుడు కాగలడా?

16. మరియు (ఓ ముహమ్మద్!) వారిలో (కపట విశ్వాసులలో) నీ మాటలను చెవి యొగ్గి వినేవారు కొందరున్నారు[12]. కాని వారు నీ దగ్గర నుండి

---

[9] చూడండి, 37:45-47 మరియు 56:19.

[10] మీరు ఎప్పుడు ప్రార్థించినా జన్నతుల్ ఫిర్ దౌస్ కొరకే ప్రార్థించండి. అది స్వర్గాలలో అన్నింటికంటే ఉత్తమమైనది. దాని నుంచే స్వర్గపు సెలయేర్లు ప్రారంభమవుతాయి. మరియు దాని పైననే అనంతకరుణామయుని సింహాసనం ('అర్ష్) ఉంది.('స. బు'ఖారీ).

[11] చూడండి, 6:70.

[12] చూడండి, 6:25 మరియు 10:42-43.

వెళ్ళిపోయిన తరువాత, జ్ఞానవంతులను ఇలా ప్రశ్నిస్తారు: "అతను చెప్పినదేమిటి?" వీరే! అల్లాహ్ హృదయాల మీద ముద్రవేసిన వారు మరియు వీరే తమ మనోవాంఛలను అనుసరించేవారు[13].

17. మరియు మార్గదర్శకత్వం పొందిన వారికి ఆయన (అల్లాహ్) ఇంకా ఎక్కువగా సన్మార్గం చూపుతాడు మరియు వారి దైవభీతిని వృద్ధి చేస్తాడు.

18. ఏమీ? ఇప్పుడు వారు అంతిమ ఘడియ అకస్మాత్తుగా రావాలని ఎదురు చూస్తున్నారా? వాస్తవానికి, దాని చిహ్నాలు కూడా వచ్చేశాయి[14]. అది వచ్చిపడితే, ఇక వారికి హితోపదేశం స్వీకరించే అవకాశం ఎక్కడ ఉంటుంది?

19. కావున (ఓ ముహమ్మద్!) తెలుసుకో! నిశ్చయంగా, అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్య దేవుడు లేడు. కావున నీ పాపాలకు మరియు విశ్వాస స్త్రీల కొరకు మరియు విశ్వాస పురుషుల కొరకు కూడా

---

[13] చూడండి, 2:7.

[14] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'నా కాలం మరియు పునరుత్థానదినం ఈ రెండు ప్రేళ్ళవలే ఉంటాయి.' అంటూ అతను (సఅస) తన రెండు ప్రేళ్ళను చూపుతూ అన్నారు: 'ఏ విధంగానైతే ఒక ప్రేలు మరొక ప్రేలుతో కొద్ది మాత్రమే పొడవుగా ఉందో, అదే విధంగా పునరుత్థానదినం నా తరువాత కొంత కాలంలోనే రానున్నది.' (సహీహ్ బుఖారీ).

క్షమాపణ వేడుకో![15] మరియు అల్లాహ్ కు మీ కార్యకలాపాలు మరియు మీ (అంతిమ) నివాసం కూడా తెలుసు.

**20.** మరియు విశ్వసించిన వారు ఇలా అంటున్నారు: "(యుద్ధం చేయమని ఆదేశిస్తూ) ఒక సూరహ్ ఎందుకు అవతరింప జేయబడలేదు?"[16] కాని ఇప్పుడు యుద్ధం చేయమని నిర్దేశిస్తూ ఒక సూరహ్ అవతరింప జేయబడితే తమ హృదయాలలో వ్యాధి ఉన్నవారు, మరణం ఆవహించిన వారి వలే నీ వైపునకు చూడటాన్ని, నీవు గమనిస్తావు[17]. కాని అది వారికే మేలైనదై ఉండేది.

**21.** ఆజ్ఞాపాలన చేయటం మరియు మంచి మాటలు పలుకటం. ఒకవేళ (జిహాద్ కొరకు) దృఢమైన నిర్ణయం తీసుకోబడినప్పుడు, వారు అల్లాహ్ విషయంలో సత్యవంతులుగా ఉన్నట్లయితే వారికే మేలు జరిగేది.

**22.** (వారితో ఇలా అను): "ఏమీ? మీరు (అల్లాహ్) ఆజ్ఞాపాలనకు విముఖులై, మరల భూమిలో సంక్షోభం రేకెత్తిస్తూ మీ బంధుత్వాలను

---

[15] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'ప్రజలారా! అల్లాహ్ (సు.తా.) సన్నిధిలో, పశ్చాత్తాపపడుతూ క్షమాపణలు వేడుకుంటూ ఉండండి. నేను కూడా అల్లాహ్ (సు.తా.) సన్నిధిలో ప్రతిరోజు డెబ్బై కంటే ఎక్కువసార్లు పశ్చాత్తాపపడుతూ, క్షమాపణ వేడుకుంటూ ఉంటాను.' ('స. బు'ఖారీ).

[16] ఈ సూరహ్ 22:39 కంటే ముందు అవతరింపజేయబడింది.

[17] చూడండి, 4:77 ఇటువంటి వాక్యానికి.

తెంపుకుంటారా?"

**23.** ఇలాంటి వారినే అల్లాహ్ శపించాడు(బహిష్కరించాడు). వారిని చెవిటి వారిగా చేశాడు మరియు వారి కండ్లను గ్రుడ్డి చేశాడు.

**24.** వారు ఈ ఖుర్ఆన్ ను గురించి యోచించరా? లేదా వారి హృదయాల మీద తాళాలు పడి వున్నాయా?

**25.** మార్గదర్శకత్వం స్పష్టమైన తర్వాత కూడా, ఎవరైతే తమ వీపులు త్రిప్పుకొని మరలి పోయారో! నిశ్చయంగా, షైతాన్ (వారి చేష్టలను) వారికి మంచివిగా చూపాడు మరియు (అల్లాహ్) వారికి వ్యవధినిచ్చాడు.

**26.** ఇది ఎందుకంటే వాస్తవానికి వారు, అల్లాహ్ అవతరింపజేసిన దానిని అసహ్యించుకునే వారితో ఇలా అన్నందుకు: "మేము కొన్ని విషయాలలో మిమ్మల్ని అనుసరిస్తాము." మరియు అల్లాహ్ కు వారి రహస్య సమాలోచనలను గురించి బాగా తెలుసు[18].

**27.** అయితే దేవదూతలు వారి ఆత్మలను వశపరచుకొని, వారి ముఖాల మీద మరియు వీపుల మీద కొడుతూ వారిని తీసుకు వెళ్ళేటప్పుడు వారి పరిస్థితి ఎలా ఉంటుంది?[19]

**28.** ఇది వాస్తవానికి, వారు అల్లాహ్ కు ఆగ్రహం కలిగించే విధానాన్ని అనుసరించి నందుకు

---

[18] చూడండి, 4:81.

[19] చూడండి, 6:93 మరియు 8:50.

మరియు ఆయన సమ్మతించే మార్గాన్ని అసహ్యించుకున్నందుకు! కావున ఆయన వారి కర్మలను వృథా చేశాడు.

**29.** ఏమీ? తమ హృదయాలలో వ్యాధి ఉన్నవారు, అల్లాహ్ వారి ద్వేషాన్ని బయట పెట్టడని భావిస్తున్నారా?[20]

**30.** మరియు మేము తలచుకుంటే, వారిని నీకు చూపేవారం; వారి లక్షణాలను బట్టి నీవు వారిని తెలుసుకోగలవు. మరియు వారు మాట్లాడే రీతిని బట్టి, వారిని నీవు తప్పక తెలుసుకోగలవు. మరియు అల్లాహ్ కు మీ కర్మలు బాగా తెలుసు.

**31.** మరియు నిశ్చయంగా, మీలో ధర్మయుద్ధం చేసేవారెవరో మరియు సహనం వహించే వారెవరో! చూచే వరకు మేము మిమ్మల్ని తప్పక పరీక్షిస్తాము[21]. మరియు మేము మీ ప్రతిజ్ఞావచనాలను కూడా పరీక్షిస్తాము.

**32.** నిశ్చయంగా, మార్గదర్శకత్వం స్పష్టంగా తెలిసిన తర్వాత కూడా, సత్యాన్ని తిరస్కరించి, ప్రజలను అల్లాహ్ మార్గం నుండి నిరోధిస్తూ, ప్రవక్తతో విరోధం కలిగి వున్నవారు[22], అల్లాహ్ కు ఏ మాత్రం నష్టం కలిగించలేరు. కాని ఆయన వారి కర్మలను నిష్ఫలం చేయగలడు.

---

[20] అ'ద్'గానున్: 'ది'గ్ నున్ యొక్క బహువచనం. ద్వేషం, పగ, అసహ్యం, ఏవగింపు.

[21] చూడండి, 3:140.

[22] చూడండి, 8:13 మరియు 2:190.

**33.** ఓ విశ్వసించిన ప్రజలారా! మీరు అల్లాహ్ కు విధేయులై ఉండండి మరియు ప్రవక్తను అనుసరించండి మరియు మీ కర్మలను వ్యర్థం చేసుకోకండి[23].

**34.** నిశ్చయంగా, సత్యాన్ని తిరస్కరిస్తూ ప్రజలను అల్లాహ్ మార్గం నుండి నిరోధిస్తూ వుండి, సత్యతిరస్కారులుగానే మరణించిన వారిని అల్లాహ్ ఎంత మాత్రం క్షమించడు.

**35.** కావున మీరు (ధర్మయుద్ధంలో) ధైర్యాన్ని వీడకండి మరియు సంధి కొరకు అడగకండి మరియు మీరే ప్రాబల్యం వహిస్తారు[24]. మరియు అల్లాహ్ మీకు తోడుగా ఉన్నాడు మరియు ఆయన మీ కర్మలను వృథా కానివ్వడు.

**36.** నిశ్చయంగా, ఈ ప్రాపంచిక జీవితం ఒక ఆట మరియు కాలక్షేపం మాత్రమే. ఒకవేళ మీరు విశ్వసించి దైవభీతి కలిగి ఉన్నట్లయితే, ఆయన మీకు మీ ప్రతిఫలం ఇస్తాడు. మరియు మీ నుండి

---

[23] చూడండి, 53:32 ఎన్ని మంచి పనులు చేసినా అవి అల్లాహ్ (సు.తా.) మరియు ఆయన ప్రవక్త ('స'అస) విధేయతల పరిధి నుండి బయట ఉంటే అవి వ్యర్థమే అవుతాయి.

[24] చూడండి, 3:139 కానీ మీరు మీ శత్రువుల కంటే బలహీనులుగా ఉన్నారనుకుంటే సంధి చేసుకోవచ్చు. దైవప్రవక్త ('స'అస) మక్కా ముష్రికులతో హుదైబియాలో పది సంవత్సరాల సంధి చేసుకున్నారు.

ధనాన్ని కూడా అడగడు[25].

**37.** ఒకవేళ ఆయన దానిని (ధనాన్నే) అడిగితే మరియు దాని కొరకు గట్టి పట్టుపట్టితే, మీరు పిసినారితనం చూపితే, ఆయన మీ ద్వేషాన్ని బయట పెట్టేవాడు.

**38.** ఇదిగో చూడండి! వారు మీరే! అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయండని పిలువబడుతున్న వారు. కాని మీలో కొందరు పిసినారితనం వహిస్తున్నారు. మరియు ఎవడు పిసినారితనం వహిస్తున్నాడో, అతడు నిజానికి తన సొంత విషయంలోనే పిసినారితనం వహిస్తున్నాడు. మరియు అల్లాహ్ స్వయం సమృద్ధుడు మరియు మీరే కొరత గల (పేద) వారు[26] మరియు మీరు విముఖులైతే ఆయన మీకు బదులుగా ఇతర జాతిని మీ స్థానంలో తేగలడు, అప్పుడు వారు మీలాంటి వారై ఉండరు.

---

[25] అల్లాహ్ (సు.తా.) కు మీ ధనం అవసరం లేదు. మదీనా కాలపు మొదటి రోజులలోనే 'జకాత్ విధించబడింది. అది ఇస్లాం ధర్మాన్ని కాపాడుకోవటానికి దాని ప్రచారానికి మరియు ముస్లింల కుశలత కొరకు వారి సౌకర్యాల కొరకు. 'జకాత్ ఒక సంవత్సరం వరకు జమ ఉన్న ధనసంపత్తుల మీద, 2.5% మాత్రమే. సంవత్సరం గడిచిన పిదపనే 'జకాత్ ఇవ్వవలసి ఉంటుంది.

[26] అల్లాహ్ (సు.తా.) మిమ్మల్ని ఖర్చు చేయమని ప్రోత్సహించేది మీ ఆత్మశుద్ధి కొరకు, మీ చుట్టు ప్రక్కలలో ఉండే పేదవారి అత్యావసరాలను పూర్తి చేయటానికి మరియు మీరు మీ శత్రువులపై ఆధిక్యత పొందటానికి.

# 48. అల్ ఫతహ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. (ఓ ప్రవక్తా!) నిశ్చయంగా, మేము నీకు స్పష్టమైన విజయాన్ని ప్రసాదించాము;
2. అల్లాహ్! నీ పూర్వపు మరియు భావికాలపు తప్పులను క్షమించటానికి మరియు నీపై తన అనుగ్రహాన్ని పూర్తిచేయటానికి మరియు నీకు ఋజుమార్గం వైపునకు మార్గదర్శకత్వం చేయటానికి;
3. మరియు అల్లాహ్! నీకు గొప్ప సహకారంతో సహాయపడటానికి.
4. ఆయనే, విశ్వాసుల హృదయాలలో శాంతిని అవతరింపజేశాడు, వారి విశ్వాసంలో మరింత విశ్వాసాన్ని అధికం చేసేందుకు. మరియు ఆకాశాలలోని భూమిలోని సైన్యాలన్నీ అల్లాహ్ అధీనంలోనే ఉన్నాయి. మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేకవంతుడు.
5. విశ్వాసులైన పురుషులను మరియు విశ్వాసులైన స్త్రీలను క్రింద సెలయేళ్ళు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింప జేసేందుకు, అందులో వారు శాశ్వతంగా ఉండేందుకు మరియు వారి పాపాలను తొలగించేందుకూను. మరియు అల్లాహ్ దృష్టిలో

[*] [అల్ ఫతహ్ – నిర్ణయాత్మక విజయం]

ఇది ఒక గొప్ప విజయం.

6. మరియు కపట విశ్వాసులు (మునాఫిఖీన్) అయిన పురుషులను మరియు కపట విశ్వాసులైన స్త్రీలను; మరియు బహుదైవారాధకులైన పురుషులను మరియు బహుదైవారాధకులైన స్త్రీలను; అల్లాహ్ ను గురించి చెడు భావనలు, భావించే వారందరినీ శిక్షించేందుకు. వారిపై చెడు అన్ని వైపుల నుండి ఆవరించి ఉంటుంది. మరియు అల్లాహ్ యొక్క ఆగ్రహం వారిపై విరుచుకు పడుతుంది. మరియు ఆయన వారిని శపించాడు (బహిష్కరించాడు); మరియు వారి కొరకు నరకాన్ని సిద్ధపరచి ఉంచాడు. మరియు అది ఎంత చెడ్డ గమ్యస్థానం!

7. ఆకాశాలలోని మరియు భూమిలోని సైన్యాలన్నీ అల్లాహ్ అధీనంలోనే ఉన్నాయి. మరియు అల్లాహ్ సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు.

8. నిశ్చయంగా, (ఓ ముహమ్మద్!) మేము నిన్ను సాక్షిగా, శుభవార్తలు అందజేసే వానిగా మరియు హెచ్చరించే వానిగా చేసి పంపాము.

9. ఎందుకంటే (ఓ ముస్లింలారా!) మీరు అల్లాహ్ ను మరియు ఆయన ప్రవక్తను విశ్వసించాలనీ మరియు మీరు అతనితో (ప్రవక్తతో) సహకరించాలనీ మరియు అతనిని గౌరవించాలనీ మరియు ఉదయం మరియు సాయంత్రం ఆయన (అల్లాహ్) పవిత్రతను కొనియాడాలనీ!

10. (ఓ ముహమ్మద్!) నిశ్చయంగా, (నీ చేతిలో
చేయి వేసి) నీతో శపథం చేసేవారు, వాస్తవానికి
అల్లాహ్ తో శపథం చేస్తున్నారు[1]. అల్లాహ్ చెయ్యి
వారి చేతుల మీద ఉంది. ఇక ఎవడు (తన
శపథాన్ని) భంగం చేస్తాడో, వాస్తవానికి అతడు
తన నష్టం కొరకే తన శపథాన్ని భంగం చేస్తాడు.
మరియు ఎవడు తన వాగ్దానాన్ని పూర్తి చేస్తాడో,
అల్లాహ్ అతనికి గొప్ప ప్రతిఫలాన్ని ఇస్తాడు.

11. వెనుక ఉండిపోయిన ఎడారి వాసులు (బద్దూలు)[2]
నీతో ఇలా అంటారు: "మా ఆస్తిపాస్తుల మరియు
మా ఆలుబిడ్డల చింత మాకు తీరిక లేకుండా
చేశాయి. కావున మా క్షమాపణకై ప్రార్థించండి!"
వారు తమ హృదయాలలో లేనిది తమ
నాలుకలతో పలుకు తున్నారు. వారితో ఇలా
అను: "ఒకవేళ అల్లాహ్ మీకు నష్టం చేయదలిస్తే,
లేదా లాభం చేయదలిస్తే, ఆయన నుండి
మిమ్మల్ని తప్పించగల శక్తి ఎవరికుంది?
వాస్తవానికి మీరు చేసేదంతా అల్లాహ్ బాగా
ఎరుగును!

12. అలా కాదు! ప్రవక్త మరియు విశ్వాసులు ఎన్నటికీ

---

[1] చూడండి, 4:80.

[2] 'గిఫార్, ముజైనహ్, జుహైనహ్, అష్ జా'అ, అస్ లమ్, దయల్ అనే బద్దూ తెగల వారు, సాకులు చెప్పారు. వారు ఆయుధాలు లేకుండా మక్కా వెళ్ళితే మక్కా ముష్రికులు వారిని చంపవచ్చని భయపడ్డారు. అందుకే దైవప్రవక్త ('స'అస) కు 'హుదైబియహ్ ఒప్పందం చేసుకోవలసి వచ్చింది.

- తమ ఆలుబిడ్డల వద్దకు - తిరిగి రాలేరని మీరు భావించారు; మరియు ఇది (ఈ ఆలోచన) మీ హృదయాలకు చాలా నచ్చింది మరియు మీరు చాలా చెడ్డ తలంపులు చేశారు మరియు మీరు అధోగతికి చెందిన వారు."

13. మరియు అల్లాహ్ ను మరియు ఆయన ప్రవక్తను విశ్వసించని సత్యతిరస్కారుల కొరకు మేము నిశ్చయంగా, భగభగ మండే అగ్ని జ్వాలలను సిద్ధపరచి ఉంచాము.

14. మరియు భూమ్యాకాశాల సామ్రాజ్యాధిపత్యం అల్లాహ్ దే! ఆయన తాను కోరిన వారిని క్షమిస్తాడు మరియు తాను కోరిన వారిని శిక్షిస్తాడు. మరియు అల్లాహ్ సదా క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

15. ఇక మీరు మీ విజయధనాన్ని తీసుకోవటానికి పోయినప్పుడు, వెనుక ఉండిపోయిన వారు ఇలా అంటారు: "మమ్మల్ని కూడా మీ వెంట రానివ్వండి."[3] వారు అల్లాహ్ ఉత్తరువును

[3] ఇక్కడ 'ఖైబర్ యుద్ధ ప్రస్తావన ఉంది. అది 7వ హిజ్రీలో జరిగింది. 'హుదైబియా ఒప్పందం తరువాత సూరహ్ అల్-ఫ'త్హ్ అవతరింపజేయబడింది. అది విని 6వ హిజ్రీలో సాకులు చెప్పి మక్కాకు 'ఉమ్రా కొరకు రానివారు - విజయధనపు ఆశతో - 'ఖైబర్ యుద్ధంలో పాల్గొనటానికి అనుమతి అడుగుతారు. అప్పుడు దైవప్రవక్త ('స'అస), కేవలం 6వ హిజ్రీలో 'ఉమ్రా కొరకు మక్కాకు పోయినవారు మాత్రమే 'ఖైబర్ కు పోవాలని సెలవిస్తారు.

మార్చగోరుతున్నారు[4]. వారితో అను: "మీరు మా వెంట రాజాలరు; మీ గురించి అల్లాహ్ ముందే ఈ విధంగా చెప్పాడు." అప్పుడు వారు ఇలా అంటారు: "అది కాదు! మీరు మా మీద అసూయ పడుతున్నారు." అలా కాదు! వారు వాస్తవాన్ని అర్థం చేసుకోగలిగేది చాలా తక్కువ.

16. వెనుక ఉండి పోయిన ఎడారి వాసులతో (బద్దూలతో) ఇలా అను: "ఇక మీద చాలా కఠినంగా పోరాడే వారికి విరుద్ధంగా (యుద్ధం చేసేందుకు)" మీరు పిలువబడతారు. అప్పుడు (మీరు చనిపోయే వరకూ) వారితో యుద్ధం చేయవలసిన ఉంటుంది లేదా వారు లొంగి పోయే వరకు. ఒకవేళ మీరు ఆజ్ఞాపాలన చేస్తే, అల్లాహ్ మీకు మంచి ప్రతిఫలం ఇస్తాడు. ఒకవేళ మీరు ఇంతకు ముందు మరలి పోయినట్లు, మరలిపోతే ఆయన మీకు అత్యంత బాధాకరమైన శిక్ష విధించగలడు."

17. కాని గ్రుడ్డివానిపై ఎలాంటి నింద లేదు మరియు కుంటివానిపై కూడా ఎలాంటి నింద లేదు మరియు అదే విధంగా వ్యాధిగ్రస్తునిపై కూడా ఎలాంటి నింద లేదు. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తకు విధేయత చూపేవారిని, ఆయన క్రింద సెలయేళ్ళు ప్రవహించే స్వర్గ వనాలలో ప్రవేశింపజేస్తాడు.

---

[4] చూడండి, 8:1.

మరియు వెనుదిరిగిన వానికి ఆయన బాధాకరమైన శిక్ష విధిస్తాడు.

**18.** వాస్తవానికి విశ్వాసులు చెట్టు క్రింద నీతో చేసిన శపథం[5] చూసి అల్లాహ్ సంతోషించాడు; మరియు వారి హృదయాల స్థితి ఆయనకు తెలిసిందే. కావున ఆయన వారి మీద శాంతిని అవతరింప జేశాడు. మరియు బహుమానంగా వారికి సమీప విజయాన్ని ప్రసాదించాడు[6].

**19.** మరియు అందులో వారు చాలా విజయధనాన్ని కూడా పొందుతారు. మరియు అల్లాహ్ సర్వశక్తిమంతుడు, మహా వివేచనాపరుడు.

**20.** మరియు అల్లాహ్ మీకు ఇంకా చాలా విజయధనాల వాగ్దానం చేశాడు. మీరు వాటిని పొందుతారు. కావున మీకు వాటిని త్వరగా ప్రసాదిస్తాడు. మరియు ఆయన ప్రజల చేతులను మీ నుండి ఆపాడు. ఇది విశ్వాసులకు ఒక సూచనగా ఉండేందుకు మరియు ఆయన మీకు ఋజుమార్గం వైపునకు మార్గదర్శకత్వం

---

[5] ఇది 'హుదైబియాలో 6వ హిజ్రీలో 'ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (ర'ది.'అ) మరణవార్త విని, దైవప్రవక్త ('స'అస) చేతిపై ఒక తుమ్మచెట్టు క్రింద 'స'హాబాలు ('రది.'అన్హుమ్) అందరూ, తమ చివరి ప్రాణాల వరకు 'ఉస్మాన్ ('రది.'అ.) మరణపు ప్రతీకారం తీర్చుకోవటానికి పోరాడుతామని, చేసిన ప్రతిజ్ఞ.

[6] ఇది 'ఖైబర్ విజయమని చాలామంది వ్యాఖ్యాతలు అంటారు. కొందరు ఇది 8వ హిజ్రీ మక్కా విజయమని, ఆ తరువాత ముస్లింలకు లభించిన ఇతర విజయాలని అంటారు.

చేసేందుకూను[7].

21. ఇంకా ఇతర (విజయాలు) కూడా! వాటిని మీరింకా సాధించలేదు. వాస్తవానికి, అల్లాహ్ వాటిని ఆవరించి ఉన్నాడు. మరియు అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు.

22. మరియు ఒకవేళ సత్యతిరస్కారులు మీతో యుద్ధానికి దిగివుంటే, వారు తప్పక వెన్ను చూపి పారిపోయేవారు, అప్పుడు వారు ఏ రక్షకుడిని గానీ లేదా సహాయకుడిని గానీ పొందేవారు కాదు[8].

23. ఇది మొదటి నుంచే వస్తూ ఉన్న అల్లాహ్ సంప్రదాయం. నీవు అల్లాహ్ సంప్రదాయంలో ఎలాంటి మార్పును పొందలేవు.

24. మరియు మక్కా లోయలో మీకు వారి మీద ప్రాబల్యం ఇచ్చిన తర్వాత, ఆయనే వారి చేతులను మీపై పడకుండా మరియు మీ చేతులు వారిపై పడకుండా చేశాడు[9]. మరియు

---

[7] ఇది తరువాత జరిగే యుద్ధాలు మరియు వాటిలో దొరికే విజయధనపు ప్రస్తావన.

[8] ఇది హుదైబియా ఒప్పందాన్ని సూచిస్తోంది.

[9] 'హుదైబియా ఒప్పందానికి ముందు దాదాపు 80 మంది ముష్రికులు ఆయుధాలు తీసుకొని దైవప్రవక్త ('స'అస) ను చంపాలని బయలుదేరుతారు. కాని ముస్లింలు వారిని పట్టుకొని ఖైదీలు చేసుకుంటారు. ఒప్పందం జరిగిన తరువాత దైవప్రవక్త ('స'అస) వారిని విడిచి పెట్టారు. (ముస్లిం, నసాయి' - 'తబరీ.)

మీరు చేసేదంతా అల్లాహ్ చూస్తున్నాడు.

**25.** (వాస్తవానికి) సత్యాన్ని తిరస్కరించి, మిమ్మల్ని మస్జిద్ అల్ హరామ్ కు పోకుండా నిరోధించి, బలి (ఖుర్బానీ) జంతువులను వాటిని బలి చేసే స్థలానికి చేరనివ్వకుండా ఆపింది వారే కదా![10] ఒకవేళ వారిలో విశ్వాసులైన పురుషులు మరియు విశ్వాసులైన స్త్రీలు లేకుంటే - ఎవరిని గురించైతే మీకు తెలియదో - వారిని మీరు త్రొక్కివేసి ఉండేవారు. దాని వలన మీరు - మీకు తెలియకుండానే - పాపానికి గురి అయ్యేవారు. అల్లాహ్ తాను కోరిన వారిని తన కారుణ్యంలోనికి తీసుకుంటాడు. ఒకవేళ వారు (విశ్వాసులు) వారి నుండి వేరుగా ఉండి ఉంటే, మేము తప్పక వారిలోని సత్యతిరస్కారులకు బాధాకరమైన శిక్ష విధించి ఉండేవారము.

**26.** సత్యాన్ని తిరస్కరించినవారు, తమ హృదయాలలోని మూఢ అభిమానం వల్ల,

---

[10] అల్-హద్ యః అంటే మక్కాకు 'ఉమ్రా లేక 'హజ్జ్ కొరకు పోయేవారు, అక్కడ బలి ఇచ్చే పశువు. వారు దానిని తమ వెంట తీసుకురావచ్చు లేదా అక్కడే కొనవచ్చు. మ'హిల్లున్: అంటే ఖుర్బానీ (బలి) ఇచ్చే చోటు. ఇది 'హరం సరిహద్దులలోని భాగం ('హుదూద్ అల్-'హరం).

మూర్ఖపు పట్టు వహించినప్పుడు[11], అల్లాహ్! తన సందేశహరుని మీద మరియు విశ్వాసుల మీద, శాంతిని అవతరింప జేశాడు. మరియు వారిలో దైవభీతిని స్థిర పరిచాడు. మరియు వారే

[11] 'హమియ్యతల్ జాహిలియ్యహ్: అంటే ఇక్కడ ముస్లింలను ఎన్నటికీ మక్కాలోకి రానివ్వకూడదు అనే మూర్ఖ హఠము. అంటే ముస్లింలు 'హరంలో ప్రవేశించి, నమా'జ్ చేయటాన్ని మక్కా ముష్రిక్ ఖురైషులు సహించేవారు కాదు. ఎందుకంటే ముస్లింలు అల్లాహ్ (సు.తా.)ను ఆరాధించేవారు. కాని ముష్రిక్ లు తమ విగ్రహాలను ఆరాధించేవారు. ఆ అభిమానం వారు ముస్లింలతో చేసిన సంధిలో వ్యక్తమవుతోంది. అది మొదట ముష్రిక్ లకు అనుకూలమైనదిగా కనిపించినా చివరకు వారికి సహించరానిదిగా మారింది. వారి పతనానికి కారణమయ్యింది. ఆ సంధి వ్రాసేటప్పుడు దైవప్రవక్త ('స'అస), 'అలీ (ర'ది.'అ.)తో మొదట: "బిస్మిల్లా హిర్ర'హ్మా నిర్ర'హీమ్" అని వ్రాయమంటారు. అప్పుడు సంధి చేసుకోవటానికి వచ్చిన సుహైల్ బిన్ 'అమ్ర్ అంటాడు: మేము 'అర్ర'హ్మాన్ అర్ర'హీమ్' ఏమిటో ఎరుగము. మేము వాడే పదం: "బిస్మిక అల్లాహుమ్మ" - 'నీ పేరుతో ఓ అల్లాహ్!' అని వ్రాయి, అంటాడు. దైవప్రవక్త ('స'అస) అలీ (ర'ది.'అ.)ను అలా వ్రాయమని అంటారు. ఆ తరువాత దైవప్రవక్త ('స'అస) అంటారు: 'ము'హమ్మద్ రసూలుల్లాహ్ మరియు మక్కా వాసుల మధ్య ఈ సంధి జరుగున్నది.' అని వ్రాయమంటారు. అలీ (ర'ది.'అ.) ను వెంటనే ఆపుతూ ముష్రిక్ నాయకుడు అంటాడు: 'రసూలుల్లాహ్' అనే పదవి మీదనే కదా మా మధ్య - మీ మధ్య వివాదమున్నది. అలా కాదు: 'ము'హమ్మద్ బిన్ అబ్దుల్లాహ్' అని వ్రాయాలి అంటాడు. దైవప్రవక్త ('స'అస) దానిని కొట్టేసి అలాగే వ్రాయమని అలీ (ర'ది.'అ.)తో అంటారు. దానికి అలీ (ర'ది.'అ.) ఒప్పుకోరు. అప్పుడు దైవప్రవక్త ('స'అస) తమ చేతితోనే దానిని కొట్టేసి, అతడు చెప్పినట్లు వ్రాయమంటారు. అప్పుడు ముస్లింల క్రోధావేశాలకు అంతులేకుండా పోతుంది. కాని అల్లాహ్ (సు.తా.) వారి హృదయాలకు శాంతిని ప్రసాదిస్తాడు. ('స.ముస్లిం, నసాయి', ఇబ్నె 'హంబల్, - తబరీ).

దానికి హక్కుదారులు మరియు అర్హులు కూడాను. మరియు అల్లాహ్ కు ప్రతి విషయం గురించి బాగా తెలుసు.

27. వాస్తవానికి అల్లాహ్ తన ప్రవక్తకు, అతని స్వప్నాన్ని, నిజం చేసి చూపాడు[12]. అల్లాహ్ కోరితే, మీరు తప్పక శాంతియుతంగా, మీ తలలను పూర్తిగా గొరిగించుకొని లేదా తల వెంట్రుకలను కత్తిరించుకొని, మస్జిద్ అల్ హరామ్ లోకి భయపడకుండా ప్రవేశించేవారు. మీకు తెలియనిది ఆయనకు తెలుసు, ఇక ఇదే కాక సమీపంలోనే మీకు మరొక విజయాన్ని కూడా ప్రసాదించ బోతున్నాడు[13].

28. ఆయనే, తన ప్రవక్తను మార్గదర్శకత్వంతో మరియు సత్యధర్మంతో అన్ని ధర్మాలపై అది ఆధిక్యత కలిగి వుండేలా చేసి పంపాడు. మరియు సాక్షిగా అల్లాహ్ యే చాలు[14].

29. ముహమ్మద్ అల్లాహ్ యొక్క సందేశహరుడు. మరియు అతని వెంట ఉన్నవారు, సత్యతిరస్కారుల

---

[12] దైవప్రవక్త ('స'అస) తన సహచరులతో (ర'ది.'అన్హుమ్) సహా ఇ'హ్రామ్ ధరించి 'హరమ్ లో ప్రవేశించినట్లు చూసిన స్వప్నం. అది 7వ హిజ్రీలో పూర్తి అయింది. అప్పుడు వారంతా 'ఉమ్రా చేసారు.

[13] అంటే మక్కా, 'ఖైబర్ మరియు ముస్లింలకు లభించిన ఇతర విజయాలు.

[14] ముస్లింలు, ఇస్లాం ను తూ.చా. తప్పక పాటిస్తే ఈ రోజు కూడా వారు అన్ని ధర్మాలవారి మీద ప్రాబల్యం వహించగలరు. చూడండి, 3:139.

పట్ల కఠినులు మరియు పరస్పరం కరుణామయులు[15]. నీవు వారిని (అల్లాహ్ ముందు) వంగుతూ (రుకూఉ చేస్తూ), సాష్టాంగాలు (సజ్దాలు) చేస్తూ ఉండటం చూస్తున్నావు. వారు అల్లాహ్ అనుగ్రహాన్ని మరియు ప్రసన్నతను అర్థిస్తూ ఉంటారు. వారి ముఖాల మీద సాష్టాంగం (సజ్దా) చేయటం వల్ల వచ్చిన గుర్తులుంటాయి. వారి ఈ ఉపమానం తౌరాత్ లో కూడా ఇవ్వబడుతుంది. మరియు ఇంజీల్ లో వారు ఒక పైరుతో పోల్చబడ్డారు: మొదట (బీజం నుండి) ఒక మొలక అంకురిస్తుంది[16], తరువాత దానిని లావుగా చేస్తాడు. ఆ తరువాత అది తన కాండం మీద నిటారుగా నిలబడి[17] రైతులను ఆనంద పరిచి సత్యతిరస్కారులకు క్రోధావేశాలు కలిగిస్తుంది. విశ్వసించి, సత్కార్యాలు చేసే వారికి క్షమాపణ మరియు గొప్ప ప్రతిఫలాన్ని ప్రసాదిస్తానని అల్లాహ్ వాగ్దానం చేశాడు.

---

[15] చూడండి, 5:54.

[16] ష'త్'అహ్: అంటే బీజాన్ని చీల్చి బయటికి వచ్చే మొదటి అంకురం.

[17] ఇది 'స'హాబా (ర'ది.'అ.)లను సూచిస్తోంది. మొదటి వారు అల్పసంఖ్యలో మరియు బలహీనులుగా ఉంటారు, క్రమక్రమంగా వారి సంఖ్య పెరిగి వారు బలాఢ్యులవుతారు.

# 49. అల్ హుజురాత్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఓ విశ్వాసులారా! మీరు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త అనుమతికి ముందే నిర్ణయాలకు దిగకండి[1]. అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి. నిశ్చయంగా, అల్లాహ్ అంతా వినేవాడు, సర్వజ్ఞుడు.
2. ఓ విశ్వాసులారా! మీ కంఠస్వరాలను, ప్రవక్త కంఠస్వరాని కంటే పెంచకండి మరియు మీరు పరస్పరం ఒకరితో నొకరు విచ్చలవిడిగా మాట్లాడుకునే విధంగా అతనితో మాట్లాడకండి, దాని వల్ల మీకు తెలియకుండానే, మీ కర్మలు వ్యర్థం కావచ్చు!
3. నిశ్చయంగా, ఎవరైతే అల్లాహ్ యొక్క సందేశహరుని సన్నిధిలో తమ కంఠస్వరాలను తగ్గిస్తారో, అలాంటి వారి హృదయాలను అల్లాహ్ భయభక్తుల కొరకు పరీక్షించి ఉన్నాడు. వారికి క్షమాపణ మరియు గొప్ప ప్రతిఫలం ఉంటాయి.

---

[*] [అల్ హుజురాత్ - ఇళ్ళు]

[1] ధర్మం విషయంలో మీ స్వంత నిర్ణయాలకు దిగకండి. అల్లాహ్ (సు.తా.) మరియు దైవప్రవక్త ('స'అస) ఆజ్ఞలనే పాటించండి. అంటే ఖుర్ఆన్ మరియు 'స'హీ'హ్ 'హదీస్'ల ఆదేశాలను మాత్రమే అనుసరించండి. మీ స్వంత భావాలను, నిర్ణయాలను ధర్మంలో చొప్పిస్తే, అది బిద్'అత్ అవుతుంది. చూడండి, 4:65.

4. (ఓ ప్రవక్తా!) నిశ్చయంగా, ఎవరైతే, నిన్ను గృహాల బయట నుండి బిగ్గరగా (అరుస్తూ) పిలుస్తారో, వారిలో చాలా మంది బుద్ధిహీనులే[2].

5. మరియు ఒకవేళ వారు నీవు బయటకు వచ్చే వరకు ఓపిక పట్టి వుంటే, అది వారికే మేలై ఉండేది. మరియు అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

6. ఓ విశ్వాసులారా! ఎవడైనా ఒక అవిధేయుడు (ఫాసిఖ్), మీ వద్దకు ఏదైనా వార్త తెస్తే, మీరు - మీకు తెలియకుండానే జనులకు నష్టం కలిగించి, మీరు చేసిన దానికి పశ్చాత్తాప పడవలసిన స్థితి రాకముందే - నిజానిజాలను విచారించి తెలుసుకోండి[3].

7. మరియు మీ మధ్య అల్లాహ్ యొక్క సందేశహరుడు ఉన్నాడనే విషయాన్ని బాగా గుర్తుంచు కోండి. ఒకవేళ అతన చాలా విషయాలలో మీ మాటనే వింటే మీరే ఆపదలో పడవచ్చు. కానీ అల్లాహ్ మీకు విశ్వాసం పట్ల ప్రేమ కలిగించాడు మరియు దానిని మీ హృదయాలకు ఆకర్షణీయమైనదిగా

---

[2] ఒకరోజు మధ్యాన్నం బనూ-తమీమ్ తెగవారు - మర్యాదలు తెలియని ఎడారివాసు (బద్ధూ)లు - దైవప్రవక్త ('స'అస) ఇంటి ముందుకు వచ్చి పెద్ద కంఠస్వరంతో అతని ('స'అస) పేరు తీసుకొని అరుస్తారు; అప్పుడు ఈ ఆయత్ అవతరింపజేయబడుతుంది. (ముస్నద్ అ'హ్మద్, 3/488, 6/394).

[3] ఒకవేళ దైవప్రవక్త ('స'అస) మీ మాటలు విని మిమ్మల్ని అనుసరిస్తే దానితో మీరే ఎక్కువ కష్టాలలో పడిపోవచ్చు! చూడండి, 23:71.

చేశాడు. మరియు సత్యతిరస్కారాన్ని, అవిధేయతను మరియు దుర్నడతను (ఆజ్ఞోల్లంఘనను) మీకు అసహ్యకరమైనదిగా చేశాడు. అలాంటి వారే సరైన మార్గదర్శకత్వం పొందినవారు.

8. అది అల్లాహ్ తరఫు నుండి వారికి లభించిన అనుగ్రహం మరియు ఉపకారం. మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేకవంతుడు.

9. మరియు ఒకవేళ విశ్వాసులలోని రెండు వర్గాల వారు పరస్పరం కలహించుకుంటే, వారిద్దరి మధ్య సంధి చేయించండి. కాని ఒకవేళ, వారిలోని ఒక వర్గం వారు రెండవ వర్గం వారిపై దౌర్జన్యం చేస్తే, దౌర్జన్యం చేసిన వారు, అల్లాహ్ ఆజ్ఞ వైపునకు మరలే వరకు, వారికి వ్యతిరేకంగా పోరాడండి[4]. తరువాత వారు మరలి వస్తే, వారి మధ్య న్యాయంగా సంధి చేయించండి మరియు నిష్పక్షపాతంగా వ్యవహరించండి. నిశ్చయంగా అల్లాహ్ నిష్పక్షపాతం గా వ్యవహరించే వారిని ప్రేమిస్తాడు.

10. వాస్తవానికి విశ్వాసులు పరస్పరం సహోదరులు, కావున మీ సహోదరుల మధ్య సంధి చేయించండి[5].

---

[4] ఒక ముస్లిం మరొక ముస్లింపై దౌర్జన్యం చేస్తే, ఖుర్ఆన్ మరియు 'హదీస్'ల వెలుగులో వారి మధ్య సంధి చేయించడానికి ప్రయత్నించాలి. దౌర్జన్యం చేసేవాడు దానికి అంగీకరించకపోతే, ముస్లింలు అందరూ కలిసి అతడు అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞను అనుసరించటానికి అంగీకరించే వరకు అతనికి వ్యతిరేకంగా పోరాడాలి.

[5] చూడండి, 9:71.

మరియు మీరు కరుణించబడాలంటే అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి.

11. ఓ విశ్వాసులారా! మీలో ఎవరూ (పురుషులు) ఇతరులెవరినీ ఎగతాళి చేయరాదు. బహుశా వారే (ఎగతాళి చేయబడే వారే) వీరి కంటే శ్రేష్ఠులు కావచ్చు![6] అదే విధంగా స్త్రీలు కూడా ఇతర స్త్రీలను ఎగతాళి చేయరాదు. బహుశా వారే (ఎగతాళి చేయబడే స్త్రీలే) వీరి కంటే శ్రేష్ఠురాండ్రు కావచ్చు! మీరు పరస్పరం ఎత్తి పొడుచుకోకండి మరియు చెడ్డ పేర్లతో పిలుచు కోకండి. విశ్వసించిన తర్వాత ఒకనిని చెడ్డ పేరుతో పిలవటం ఎంతో నీచమైన విషయం మరియు (ఇలా చేసిన పిదప) పశ్చాత్తాప పడకుంటే, అలాంటి వారు చాలా దుర్మార్గులు[7].

12. ఓ విశ్వాసులారా! అతిగా అనుమానించడం నుండి దూరంగా ఉండండి, ఎందుకంటే కొన్ని అనుమానాలే నిశ్చయంగా పాపాలు. మరియు మీరు మీ పరస్పర రహస్యాలను తెలుసు కోవటానికి ప్రయత్నించకండి మరియు చాడీలు చెప్పుకోకండి. మీలో ఎవడైనా చచ్చిన తన సోదరుని మాంసం తినడానికి ఇష్టపడతాడా? మీరు దానిని

---

[6] మీరు ఇతరులను చిన్నవారిగా భావించి వారిని ఎగతాళి చేయకండి. వారిని కించపరచకండి. ఎవడు ఉత్తముడో, ఎవడు అధముడో కేవలం అల్లాహ్ (సు.తా.) కే తెలుసు. దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'ఇతరులను నీచమైనవారుగా, తుచ్ఛమైన వారుగా భావించడం పెద్దపాపాలలో ఒకటి.' (అబూ-దావూద్)

[7] చూడండి, 6:82.

అసహ్యించుకుంటారు కదా! అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగి ఉండండి. నిశ్చయంగా, అల్లాహ్ పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడు, అపార కరుణా ప్రదాత.

13. ఓ మానవులారా! నిశ్చయంగా మేము మిమ్మల్ని ఒక పురుషుడు మరియు ఒక స్త్రీ నుండి పుట్టించాము మరియు మీరు ఒకరినొకరు గుర్తించుకోవటానికి మిమ్మల్ని జాతులుగా మరియు తెగలుగా చేశాము[8]. నిశ్చయంగా, మీలో ఎక్కువ దైవభీతి గలవాడే, అల్లాహ్ దగ్గర ఎక్కువ గౌరవం గలవాడు. నిశ్చయంగా, అల్లాహ్ సర్వజ్ఞుడు, సర్వం తెలిసినవాడు.

14. ఎడారివాసులు (బద్దూలు): "మేము విశ్వసించాము." అని అంటారు. (ఓ ముహమ్మద్!) వారితో ఇలా అను: "మీరు ఇంకా విశ్వసించలేదు కావున: 'మేము విధేయులం (ముస్లింలం) అయ్యాము.' అని అనండి. ఎందుకంటే విశ్వాసం (ఈమాన్) మీ హృదయాలలోకి ఇంకా ప్రవేశించలేదు. ఒకవేళ మీరు అల్లాహ్ యొక్క మరియు ఆయన ప్రవక్త యొక్క ఆజ్ఞాపాలన చేస్తే, ఆయన మీ కర్మలను ఏ మాత్రం వృథా కానివ్వడు. నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత."

---

[8] షు'ఊబున్, ష'అబున్ యొక్క బహువచనం, పెద్ద కుటుంబాన్ని ష'అబ్ అంటారు. దాని తరువాత ఖబీలహ్, 'ఇమారహ్, బ'తన్, ఫ'సీలహ్ మరియు 'అషీరహ్. (ఫ'త్హ్ అల్-ఖదీర్).

15. వాస్తవానికి, ఎవరైతే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను విశ్వసించి, ఆ తరువాత ఏ అనుమానానికి లోను కాకుండా, అల్లాహ్ మార్గంలో, తమ సిరిసంపదలతో మరియు ప్రాణాలతో పోరాడుతారో! అలాంటి వారు, వారే! సత్యవంతులు.

16. వారితో ఇలా అను: "ఏమిటి? మీరు అల్లాహ్ కు మీ ధర్మస్వీకారం గురించి తెలియ జేస్తున్నారా? ఆకాశాలలో మరియు భూమిలో ఉన్నదంతా అల్లాహ్ కు బాగా తెలుసు. మరియు అల్లాహ్ కు ప్రతి విషయం గురించి బాగా తెలుసు."

17. (ఓ ముహమ్మద్!) వారు ఇస్లాంను స్వీకరించి, నీకు ఉపకారం చేసినట్లు వ్యవహరిస్తున్నారు. వారితో ఇలా అను: "మీరు ఇస్లాంను స్వీకరించి నాకు ఎలాంటి ఉపకారం చేయలేదు! వాస్తవానికి, మీరు సత్యవంతులే అయితే! మీకు విశ్వాసం వైపునకు మార్గదర్శకత్వం చేసి, అల్లాహ్ యే మీకు ఉపకారం చేశాడని తెలుసుకోండి."

18. నిశ్చయంగా, అల్లాహ్! ఆకాశాలలో మరియు భూమిలోనున్న అగోచర విషయాలన్నింటినీ ఎరుగును. మరియు మీరు చేసేదంతా అల్లాహ్ చూస్తున్నాడు.

# 50. ఖాఫ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఖాఫ్[1], మరియు దివ్యమైన[2] ఈ ఖుర్ఆన్ సాక్షిగా!
2. అలా కాదు! హెచ్చరిక చేసేవాడు, వారి వద్దకు వారిలో నుంచే వచ్చాడనే విషయం వారికి ఆశ్చర్యం కలిగించింది, కావున సత్యతిరస్కారులు ఇలా అన్నారు[3]: "ఇది ఆశ్చర్యకరమైన విషయం!
3. మేము మరణించి మట్టిగా మారి పోయినా (మరల బ్రతికించ బడతామా)? ఈ విధంగా మరల (సజీవులై) రావటం చాలా అసంభవమైన విషయం!"
4. వాస్తవానికి వారి (శరీరాల)లో నుండి భూమి దేనిని తగ్గిస్తుందో మాకు బాగా తెలుసు[4].

---

[*] [ఖాఫ్ – ఖాఫ్ అరబీ అక్షరము]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

[2] అల్ మజీదు: ఖుర్ఆన్ ను సంబోధించిన సందర్భానికి చూడండి, 85:21. Glorious, Noble, దివ్యమైన, ఉత్కృష్టమైన. అల్లాహు'తాలాను సంబోధించిన సందర్భానికి చూడండి, 11:73, 85:15. మహత్వపూర్ణుడు

[3] చూడండి, 25:7, 20.

[4] పునరుత్థానం అంటే పూర్తిగా దుమ్ము ధూళిగా మారిపోయిన మానవులను తిరిగి మొదటి రూపంలో బ్రతికించి తీసుకురావటం. చూ, 10:4, 21:104, 30:11, 85:13 మొదలైనవి. ఇంకా చూ, 10:34 27:64 30:27.

మరియు మా దగ్గర అంతా ఒక సురక్షితమైన గ్రంథంలో (వ్రాయబడి) ఉంది.

5. కాని వారు, సత్యం వారి వద్దకు వచ్చినపుడు దానిని అసత్యమని తిరస్కరించారు. కాబట్టి వారు ఈ విషయం గురించి కలవరపడుతున్నారు.

6. వారు, తమ మీద ఉన్న ఆకాశం వైపునకు చూడటం లేదా ఏమిటి? మేము దానిని ఏ విధంగా నిర్మించి అలంకరించామో మరియు దానిలో ఎలాంటి చీలికలూ (పగుళ్ళూ) లేవు[5].

7. ఇక భూమిని! మేము దానిని విస్తరింపజేసి, దానిలో స్థిరమైన పర్వతాలను నాటాము. మరియు అందులో అన్ని రకాల మనోహరమైన వృక్షకోటిని ఉత్పత్తి చేశాము[6].

8. (అల్లాహ్) వైపునకు మరలే ప్రతి దాసునికి సూచనగా మరియు బోధనగా!

9. మరియు మేము ఆకాశం నుండి శుభదాయకమైన నీటిని కురిపించి దాని ద్వారా తోటలను ఉత్పత్తి చేశాము మరియు ధాన్యాలను పండించాము.

10. మరియు ఎత్తయిన ఖర్జూరపు చెట్లను పెంచి, వాటికి వరుసలలో పండ్ల గుత్తులను (పుట్టించాము)[7];

11. మా దాసులకు జీవనోపాధిగా మరియు దానితో

---

[5] అంటే ఎలాంటి లోపాలూ లేవు. చూడండి, 67:3-4.

[6] బహీజున్: మనోహరమైన. ఇక్కడ 'జౌజ్ - అంటే జతలు. చూడండి, 22:5.

[7] బాసిఖాతిన్: 'తివాలన్ షాహిఖాతిన్, ఎత్తైన. 'తల్'ఉన్: క్రొత్తగా పుట్టిన ఖర్జూరపు ఫలాలు, న'దీదున్: గుత్తులు.

(ఆ నీటితో) చచ్చిన భూమికి ప్రాణం పోశాము. ఇదే విధంగా (చచ్చిన వారిని) కూడా లేపుతాము.

12. వారికి పూర్వం నూహ్ జాతి వారు, అర్ రస్[8] వాసులు మరియు సమూద్ జాతి వారు కూడా, సత్యాన్ని తిరస్కరించారు.

13. మరియు ఆద్ జాతి వారు, ఫిర్ఔన్ జాతి వారు మరియు లూత్ సహోదరులు కూడా;

14. మరియు అయ్ కహ్ (వన) వాసులు మరియు తుబ్బఅ[9] జాతి వారు కూడాను. ప్రతి ఒక్కరూ తమ ప్రవక్తలను అసత్యులని తిరస్కరించారు, కావున నా బెదరింపు వారి విషయంలో సత్యమయింది.

15. ఏమిటి? మేము మొదటి సృష్టితోనే అలసిపోయామా? అలా కాదు, అసలు వారు కొత్త సృష్టి (పునరుత్థానమును) గురించి సందేహంలో పడి ఉన్నారు[10].

16. మరియు వాస్తవంగా, మేమే మానవుణ్ణి సృష్టించాము మరియు అతని మనస్సులో

---

[8] చూడండి, 25:38 మరియు సూరహ్ అల్-బురూజ్ (85). అర్-రస్ వారు ఎవరనే విషయంలో భేదాభిప్రాయాలు ఉన్నాయి. ఇబ్నె-జరీర్ 'తబరీ (ర'హ్మ) అభిప్రాయంలో వీరే అస్'హాబ్ అల్-ఉఖ్దూద్.

[9] తుబ్బ'అ జాతివారి కొరకు చూడండి, 44:37. అయ్ కహ్ వాసులు (వనవాసులు) అంటే మద్ యన్ వాసులు. చూడండి, 26:176 ఇంకా వివరాలకు చూడండి, 11:84-95.

[10] చూడండి, 30:27 మరియు 36:78-79.

మెదిలే ఊహాలను కూడా మేము ఎరుగుతాము[11]. మరియు మేము అతనికి అతని కంఠ రక్తనాళం కంటే కూడా అతి దగ్గరగా ఉన్నాము.

17. (జ్ఞాపకముంచుకోండి) అతని కుడి మరియు ఎడమ ప్రక్కలలో కూర్చుండి (ప్రతి విషయాన్ని వ్రాసే) ఇద్దరు పర్యవేక్షకులు (దేవదూతలు) అతనిని కలుసుకొన్న తరువాత నుంచి.

18. అతనితో బాటు ఒక పర్యవేక్షకుడైనా సిద్ధంగా లేనిదే - అతడు ఏ మాటనూ పలకలేడు.

19. మరియు మరణ మూర్ఛ వచ్చేది సత్యం. అది, ఇదే! దేని నుండైతే నీవు తప్పించుకో గోరుతూ ఉండేవాడివో!

20. మరియు బాకా (సూర్) ఊదబడుతుంది. ఆ హెచ్చరించబడిన (పునరుత్థాన) దినం అదే!

21. మరియు ప్రతి ఆత్మ (ప్రాణి) ఒక తోలేవాడితో మరొక సాక్ష్యమిచ్చేవాడితో సహా వస్తుంది.

22. (ఇలా అనబడుతుంది): "వాస్తవానికి నీవు (ఈ దినాన్ని గురించి) నిర్లక్ష్యంగా ఉండే వాడివి. కావున ఇపుడు మేము నీ ముందున్న తెరను తొలగించాము. కావున, ఈ రోజు నీ దృష్టి చాలా చురుకుగా ఉంది."

---

[11] హృదయాలలో దాగి ఉన్న విషయాలన్నీ అల్లాహ్ (సు.తా.) కు తెలుసు. దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'అల్లాహ్ (సు.తా.) నా అనుచరుల మనస్సులలో మెదిలే విషయాలను క్షమించాడు అంటే వాటి నిమిత్తం శిక్షించడు. ఎంత వరకైతే వారు వాటిని తమ నోటితో ఉచ్ఛరించరో! లేదా వాటిని ఆచరణలోకి తీసుకురారో!' ('స'హీ'హ్ బు'ఖారీ, ముస్లిం)

23. మరియు అతని సహచరుడు (ఖరీనున్) ఇలా అంటాడు: "ఇదిగో నా దగ్గర సిద్ధంగా ఉన్న (ఇతని కర్మ పత్రం) ఇది!"

24. (ఇలా ఆజ్ఞ వస్తుంది): "మూర్ఖపు పట్టు (హఠము) గల ప్రతి సత్యతిరస్కారుణ్ణి మీరిద్దరు కలసి నరకంలో విసరివేయండి;

25. మంచిని నిషేధించే వాడిని, హద్దులు మీరి ప్రవర్తిస్తూ సందేహాలను వ్యాపింపజేసే వాడిని;

26. అల్లాహ్ కు సాటిగా ఇతర ఆరాధ్య దైవాన్ని కల్పించినవాడు ఇతడే. కావున ఇతనిని మీరిద్దరూ కలిసి ఘోరశిక్షలో పడవేయండి."

27. అతని స్నేహితుడు (ఖరీనున్) ఇలా అంటాడు[12]: "ఓ మా ప్రభూ! నేను ఇతని తలబిరుసు తనాన్ని ప్రోత్సహించలేదు, కాని ఇతడే స్వయంగా, మార్గభ్రష్టత్వంలో చాలా దూరం వెళ్ళి పోయాడు."

28. ఆయన (అల్లాహ్) ఇలా అంటాడు: "మీరు నా దగ్గర వాదులాడకండి మరియు వాస్తవానికి నేను ముందుగానే మీ వద్దకు హెచ్చరికను పంపి ఉన్నాను."

29. నా దగ్గర మాట మార్చటం జరుగదు మరియు నేను నా దాసులకు అన్యాయం చేసే వాడను కాను.

30. ఆ రోజు మేము నరకంతో: "నీవు నిండిపోయావా?" అని ప్రశ్నిస్తాము. మరియు అది: "ఇంకా ఏమైనా

[12] చూడండి, 14:22.

ఉందా ఏమిటి?" అని అడుగుతుంది[13].
31. మరియు స్వర్గం దైవభీతి గలవారి దగ్గరకు తీసుకురాబడుతుంది! అది వారి నుండి ఏ మాత్రం దూరంగా ఉండదు.
32. (వారితో ఇలా అనబడుతుంది): "ఇదే మీకు వాగ్దానం చేయబడినది. మళ్ళీ మళ్ళీ మా వైపుకు మరలే ప్రతివానికి, (మా హద్దును) లక్ష్యపెట్టిన (పాటించిన) వానికి;
33. అగోచరుడైన ఆ కరుణామయునికి భయపడేవానికి మరియు మా వైపునకు పశ్చాత్తాప హృదయంతో మరలేవానికి;
34. ఇందులో (ఈ స్వర్గంలో), శాంతితో ప్రవేశించండి. ఇదే శాశ్వాత జీవిత దినం."
35. అందులో వారికి, వారు కోరేదంతా ఉంటుంది. మరియు మా దగ్గర ఇంకా చాలా ఉంది[14].
36. మరియు మేము, వీరికి పూర్వం ఎన్నో తరాల వారిని నాశనం చేశాము. వారు వీరి కంటే ఎక్కువ శక్తిమంతులు. కాని, (మా శిక్ష పడినప్పుడు) వారు దేశదిమ్మరులై పోయారు. ఏమీ? వారికి తప్పించుకునే మార్గం ఏదైనా దొరికిందా?
37. నిశ్చయంగా, హృదయమున్న వాడికి, శ్రద్ధతో వినేవాడికి మరియు లక్ష్యపెట్టే వాడికి ఇందులో ఒక గుణపాఠముంది.
38. మరియు వాస్తవంగా! మేము ఆకాశాలను

[13] చూడండి, 32:13.
[14] చూడండి, 10:26.

మరియు భూమిని మరియు వాటి మధ్యనున్న
సమస్తాన్ని ఆరు దినములలో (అయ్యామ్ లలో)
సృష్టించాము. కాని మాకు ఎలాంటి అలసట
కలుగలేదు.

39. కావున (ఓ ముహమ్మద్!) వారు పలికే
మాటలకు సహనం వహించు మరియు నీ
ప్రభువు పవిత్రతను కొనియాడు. ఆయన
స్తోత్రాలు చెయ్యి. ప్రతిరోజు సూర్యోదయానికి
ముందు మరియు సూర్యాస్తమయానికి ముందు
కూడా[15];

40. మరియు రాత్రి వేళలో కూడా ఆయన పవిత్రతను
కొనియాడు[16] మరియు సాష్టాంగం (సజ్దా) చేసిన
తరువాత కూడా స్తుతించు[17].

41. మరియు చెవి యొగ్గి విను, చాటింపు చేసేవాడు
అతి దగ్గరి నుంచే పిలిచే రోజున!

42. ఆ రోజు మీరు ఒక భయంకర శబ్దం వినేది సత్యం.
(గోరీలలో నుండి) బయటికి వచ్చే దినం అదే!

43. నిశ్చయంగా, మేమే జీవనమిచ్చే వారం మరియు

---

[15] ఫజ్ర్ మరియు 'అ'స్ర్ నమాజులు చేయండి.

[16] చూ, 17:79 అంటే రాత్రిపూట లేచి తహజ్జుద్ నమా'జ్ చేయండి. మే'రాజ్ కు ముందు ముస్లింలందరికీ ఫజ్ర్ మరియు 'అ'స్ర్ నమాజ్ లు విధించబడి ఉండేవి మరియు దైవప్రవక్త ('స'అస) తహజ్జుద్ చేసేవారు. కానీ మే'రాజ్ తరువాత 5 నమా'జ్ లు అందరి కొరకు విధిగా చేయబడ్డాయి. (ఇబ్నె-కసీ'ర్).

[17] ఫర్'ద్ నమాజుల తరువాత త'స్బీహ్ చేయాలి. అంటే సుబ్'హానల్లాహ్ 33 సార్లు, అల్'హమ్దులిల్లాహ్ 33 సార్లు మరియు అల్లాహు అక్బర్ 34 సార్లు చదవాలి. ('స.బు'ఖారీ, 'స.ముస్లిం)

మేమే మరణింపజేసే వారం మరియు మీ అందరి మరలింపు మా వైపునకే జరుగుతుంది.

44. ఆ రోజు భూమి చీలిపోయి వారందరూ పరుగిడుతూ బయటికి వస్తారు. అదే సమావేశ సమయం. అది మాకెంతో సులభం.

45. వారనేది మాకు బాగా తెలుసు. నీవు వారిని (విశ్వసించమని) బలవంతం చేయలేవు. కావున నా హెచ్చరికకు భయపడే వాడికి మాత్రమే నీవు ఈ ఖుర్ఆన్ ద్వారా హితబోధ చెయ్యి.

# 51. అద్-దారియాత్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. దుమ్ము ఎగురవేసే వాటి (గాలుల) సాక్షిగా!
2. మరియు (నీటి) భారాన్ని మోసే (మేఘాల);
3. మరియు సముద్రంలో సులభంగా తేలియాడే (ఓడల);
4. మరియు (ఆయన) ఆజ్ఞతో (అనుగ్రహాలను) పంచిపెట్టే (దేవదూతల సాక్షిగా)[1];
5. నిశ్చయంగా, మీకు చేయబడ్డ వాగ్దానం సత్యం.
6. మరియు నిశ్చయంగా తీర్పు రానున్నది.
7. మార్గాలతో నిండిన ఆకాశం సాక్షిగా!
8. నిశ్చయంగా, మీరు భేదాభిప్రాయాలలో పడి ఉన్నారు[2].
9. (సత్యం నుండి) మరలింపబడిన వాడే,

---

[*] [అద్-దారియాత్ అంటే గాలి దుమారం]

[1] సాక్షిగా అంటే ఇక్కడ నొక్కి చెప్పడం అన్నట్లు. లేక ఉదాహరణగా ఇవ్వటం. ఏ విధంగానైతే గాలులు, మేఘాలు, నీటపై ఓడలు పయనించటం ఎంత సత్యమో పునరుత్థానం కూడా సత్యం.

[2] మీలో ఏకాభిప్రాయం లేదు. మీలో కొందరు దైవప్రవక్త ('స'అస) ను మాంత్రికుడు, మరి కొందరు కవి, మరికొందరు జ్యోతిషుడు, మరికొందరు అసత్యవాది, అని అంటున్నారు. అంతేకాదు మీలో కొందరు పునరుత్థానదినం రానేరాదని అంటున్నారు. మరికొందరు దానిని గురించి సంశయంలో పడి ఉన్నారు. మీరు అల్లాహ్ (సు.తా.) ను సృష్టికర్త మరియు సర్వపోషకుడని, అంటారు, కాని ఇతరులను కూడా ఆయన (సు.తా.)కు సాటి (భాగస్వాములు) గా నిలబెడతారు. మీలో చిత్తశుద్ధి, ఏకాభిప్రాయం లేవు.

మోసగించబడిన వాడు.
10. ఆధారం లేని అభిప్రాయాలు గలవారే నాశనం చేయబడేవారు!
11. ఎవరైతే నిర్లక్ష్యంలో పడి అశ్రద్ధగా ఉన్నారో!
12. వారు ఇలా అడుగుతున్నారు: "తీర్పుదినం ఎప్పుడు రానున్నది?"
13. ఆ దినమున, వారు అగ్నితో దహింపబడతారు (పరీక్షింపబడతారు).
14. (వారితో ఇలా అనబడుతుంది): "మీ పరీక్షను[3] రుచి చూడండి! మీరు దీని కొరకే తొందర పెట్టేవారు!"
15. నిశ్చయంగా, దైవభీతి గలవారు చెలమలు గల స్వర్గవనాలలో ఉంటారు.
16. తమ ప్రభువు తమకు ప్రసాదించిన వాటితో సంతోషపడుతూ! నిశ్చయంగా వారు అంతకు పూర్వం సజ్జనులై ఉండేవారు.
17. వారు రాత్రివేళలలో చాలా తక్కువగా నిద్రపోయేవారు.
18. మరియు వారు రాత్రి చివరి ఘడియలలో[4]

---

[3] ఫిత్ నతున్: అంటే ఇక్కడ శిక్ష లేక నరకాగ్నిలో కాలడం. చూడండి, 6:128, 40:12, 43:74.

[4] అల్-అస్'హారు: అంటే చివరి మూడోవంతు రాత్రి. అది ప్రార్థన (దు'ఆ)లు అంగీకరించబడే సమయం. దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: మూడోవంతు రాత్రి బాకీ ఉన్నప్పుడు అల్లాహ్ (సు.తా.) భూమికి దగ్గరగా ఉన్న ఆకాశం మీదికి దిగి వస్తాడు మరియు ఇలా అంటాడు: 'ఏమీ? ఎవరైనా ఏదైనా కోరుకునే వారున్నారా? నేను వారి కోరికలను పూర్తి చేస్తాను. ఇలా తెల్లవారే వరకు ప్రశ్నిస్తూ ఉంటాడు.' ('స'హీ'హ్ ముస్లిం) చూడండి, 3:17.

క్షమాపణ వేడుకునే వారు.

19. మరియు వారి సంపదలో యాచించే వారికి మరియు ఆవశ్యకత గలవారికి[5] హక్కు ఉంటుంది.

20. మరియు భూమిలో కూడా నమ్మేవారి కొరకు ఎన్నో నిదర్శనాలు (ఆయాత్) ఉన్నాయి.

21. మరియు స్వయంగా మీలో కూడా ఉన్నాయి. ఏమీ? మీరు చూడలేరా?[6]

22. మరియు ఆకాశంలో మీ జీవనోపాధి మరియు మీకు వాగ్దానం చేయబడినది ఉంది.

23. కావున భూమ్యాకాశాల ప్రభువు సాక్షిగా! నిశ్చయంగా, ఇది సత్యం; ఏ విధంగానైతే మీరు మాట్లాడగలిగేది (సత్యమో)!

24. ఏమీ? ఇబ్రాహీమ్ యొక్క గౌరవనీయులైన అతిథుల గాథ నీకు చేరిందా?[7]

25. వారు అతని వద్దకు వచ్చినపుడు: "మీకు సలాం!" అని అన్నారు. అతను: "మీకూ సలాం!" అని జవాబిచ్చి : "మీరు పరిచయం లేని (కొత్త) వారుగా ఉన్నారు." అని అన్నాడు.

26. తరువాత అతను తన ఇంటిలోకి పోయి బలిసిన (వేయించిన) ఒక ఆవు దూడను తీసుకొని

---

[5] మ'హ్రూమ్ లకు: అంటే ఆవశ్యకత ఉండి కూడా యాచించని వారికి.

[6] చూడండి, 45:4.

[7] ఇబ్రాహీమ్ ('అ.స.) గాథ కోసం చూడండి, 11:69 మరియు 15:51. ఈ ఆయతులు అవతరింప జేయబడే వరకు ఈ గాథ దైవప్రవక్త ('స'అస) కు తెలియదు. కాబట్టి వ'హీ ద్వారా తెలుపబడుతోంది..

వచ్చాడు.
27. దానిని వారి ముందుకు జరిపి: "ఏమీ? మీరెందుకు తినటం లేదు?" అని అడిగాడు.
28. (వారు తినకుండా ఉండటం చూసి), వారి నుండి భయపడ్డాడు[8]. వారన్నారు: "భయపడకు!" మరియు వారు అతనికి జ్ఞానవంతుడైన కుమారుని శుభవార్తనిచ్చారు.
29. అప్పుడతని భార్య అరుస్తూ వారి ముందుకు వచ్చి, తన చేతిని నుదుటి మీద కొట్టు కుంటూ: "నేను ముసలిదాన్ని, గొడ్రాలను కదా!" అని అన్నది.
30. వారన్నారు: "నీ ప్రభువు ఇలాగే అన్నాడు! నిశ్చయంగా, ఆయన మహావివేకవంతుడు, సర్వజ్ఞుడు!"
31. (ఇబ్రాహీమ్) అడిగాడు: "ఓ సందేశహరులారా (ఓ దేవదూతలారా)! అయితే మీరు వచ్చిన కారణమేమిటి?"
32. వారన్నారు: "వాస్తవానికి, మేము నేరస్థులైన జనుల వైపునకు పంపబడ్డాము.
33. వారి మీద (కాల్చబడిన) మట్టి రాళ్ళను కురిపించటం కోసం![9]
34. నీ ప్రభువు తరఫు నుండి గుర్తు వేయబడిన

---

[8] ఇంటికి వచ్చిన అతిథులు ఆహారం తినకపోవడం చూసి, వారు సహృదయంతో రాలేదు! ఏదో, ఆపద నిలబెట్టుటకైతే రాలేదు కదా! అని భయపడ్డాడు.
[9] చూడండి, 11:82.

(రాళ్ళు)[10]; మితిమీరి ప్రవర్తించేవారి కొరకు!"

35. అప్పుడు మేము అందులో ఉన్న విశ్వాసులందరినీ బయటికి తీశాము[11].

36. మేము అందు ఒక్క గృహం తప్ప![12] ఇతర విధేయుల (ముస్లింల)[13] గృహాన్ని చూడలేదు.

37. మరియు బాధాకరమైన శిక్షకు భయపడేవారి

---

[10] ముసవ్వమతున్: అంటే ప్రత్యేకించబడినవి.

[11] వివరాలకు చూడండి, 11:77 మరియు 15:61.

[12] ఆ ఇల్లు లూ'త్ ('అ.స.) యొక్క ఇల్లు. అతని ఇద్దరు కుమార్తెలు మరియు కొంతమంది విశ్వాసులు. అంతా కలసి దాదాపు 13 మంది మాత్రమే ఉంటారు. లూ'త్ ('అ.స.) భార్య వారితో చేరక, సత్యతిరస్కారులలో చేరిపోతుంది.

[13] ఒకరు దైవప్రవక్త ('స'అస) ను ప్రశ్నిస్తారు: 'ఇస్లాం అంటే ఏమిటి?' అతను ('స'అస) అంటారు: '1) లా ఇలాహ ఇల్లల్లాహ్ (షహాదహ్) సాక్ష్యం పలకడం, 2) నమా'జ్ స్థాపించడం, 3) 'జకాత్ ఇవ్వడం, 4) రమజాన్ నెలలో ఉపవాసముండడం మరియు 5) 'హజ్ చేయడం' అని అంటారు, తరువాత 'ఈమాన్ అంటే ఏమిటి?' అని ప్రశ్నిస్తే, అతను ('స'అస) అంటారు: '1) అల్లాహ్ (సు.తా.)ను విశ్వసించడం, 2) ఆయన దూతలను, 3) దివ్యగ్రంథాలను, 4) ప్రవక్తలను, 5) పునరుత్థాన దినాన్ని మరియు 6) ఖద్ర్ (మంచి లేక చెడు ఏది సంభవించినా అల్లాహ్ తరఫునుండేనని) విశ్వసించడం.' అంటే హృదయపూర్వకంగా ఈ విషయాలను నమ్మడమే ఈమాన్. అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞలను మరియు విధులను పాటించడం ఇస్లాం. దీని ప్రకారం ప్రతి మూ'మిన్ ముస్లిం మరియు ప్రతి ముస్లిం మూ'మిన్. (ఫ'త్హ్ అల్-ఖదీర్). ఇక ఎవరైతే మూ'మిన్ మరియు ముస్లింల మధ్య వ్యత్యాసం చూపుతారో, వారు అంటారు: 'ఖుర్ఆన్ లో ఇక్కడ ఒకే రకమైన జనుల కొరకు మూ'మిన్ మరియు ముస్లిం శబ్దాలు వాడబడ్డాయి. కాని వీటి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని బట్టి ప్రతి మూ'మిన్ ముస్లిం అవుతాడు. కాని ప్రతి ముస్లిం మూ'మిన్ అవటం అనివార్యం కాదు.' ఇబ్నె-కసీ'ర్, (ము'హమ్మద్ జులాగఢి పేజీ,1478, మలిక్ ఫహద్ ఖుర్ఆన్ ప్రింటింగ్ కాంప్లెక్సు, మదీన మునవ్వరహ్).

కొరకు, మేము అక్కడ ఒక సూచన (ఆయత్) ను వదలి పెట్టాము[14].

**38.** ఇక మూసా (గాథలో) కూడా (ఒక సూచన వుంది) మేము అతనిని ఫిర్ఔన్ వద్దకు స్పష్టమైన ప్రమాణంతో పంపినపుడు;

**39.** అతడు (ఫిర్ఔన్) తన సభాసదులతో సహా మరలిపోతూ, ఇలా అన్నాడు: "ఇతడు మాంత్రికుడు లేదా పిచ్చివాడు!"

**40.** కావున మేము అతనిని మరియు అతని సైనికులను పట్టుకొని, వారందరినీ సముద్రంలో ముంచి వేశాము మరియు దానికి అతడే నిందితుడు.

**41.** ఇక ఆద్ జాతి వారిలో కూడా (ఒక సూచన వుంది): మేము వారిపై వినాశకరమైన గాలిని పంపినప్పుడు![15]

**42.** అది దేని పైనయితే వీచిందో, దానిని క్షీణింపజేయకుండా వదలలేదు[16].

**43.** మరియు సమూద్ జాతి వారి గాథలో కూడా (ఒక సూచన ఉంది). వారితో: "కొంతకాలం మీరు సుఖసంతోషాలను అనుభవించండి." అని

---

[14] ఆ సూచన (గుర్తు), అంటే మృత సముద్రం.

[15] చూడండి, 7:65.

[16] ఆ గాలి ఎనిమిది రోజులు ఏడు రాత్రులు వీచింది. చూడండి, 69:7.

అన్నాము[17].

**44.** అప్పుడు వారు తమ ప్రభువు ఆజ్ఞను ఉపేక్షించారు. కావున వారు చూస్తూ ఉండగానే ఒక పెద్ద పిడుగు వారి మీద విరుచుకు పడింది[18].

**45.** అప్పుడు వారికి లేచి నిలబడే శక్తి కూడా లేకపోయింది మరియు వారు తమను తాము కూడా కాపాడు కోలేక పోయారు.

**46.** మరియు దీనికి ముందు నూహ్ జాతి వారిని కూడా (నాశనం చేశాము). నిశ్చయంగా, వారు కూడా అవిధేయులు.

**47.** మరియు ఆకాశాన్ని మేము (మా) చేతులతో నిర్మించాము. మరియు నిశ్చయంగా, మేమే దానిని విస్తరింపజేయ గలవారము.

**48.** మరియు భూమిని మేము పరుపుగా చేశాము, మేమే చక్కగా పరిచేవారము!

**49.** మరియు మేము ప్రతిదానిని జంటలుగా

---

[17] వారి కోరిక ప్రకారం వారికి ఒక ఆడఒంటె అల్లాహ్ (సు.తా.) తరఫు నుండి, ఒక అద్భుత సూచనగా పంపబడితే, వారు దానిని చంపుతారు. అప్పుడు వారితో:'ఇక మీరు మూడు రోజులు సుఖసంతోషాలను అనుభవించండి.' అని అనబడింది.

[18] 'సా'ఇఖతున్: అంటే ఒక పెద్ద ధ్వని, గర్జన లేక పిడుగు నుండి వచ్చే ధ్వనిలాంటిది. ఈ ధ్వని ఆకాశంలో నుండి వచ్చింది మరియు భూమిలో భూకంపం కూడా వచ్చింది. చూడండి, 7:73-79.

సృష్టించాము, మీరు గ్రహించాలని[19].

50. కావున మీరు అల్లాహ్ వైపునకు పరుగెత్తండి. నిశ్చయంగా, నేను (ముహమ్మద్) ఆయన తరఫు నుండి మీకు స్పష్టంగా హెచ్చరిక చేసేవాడిని మాత్రమే!

51. మరియు మీరు అల్లాహ్ కు సాటిగా ఇతర దైవాన్ని నిలుపకండి! నిశ్చయంగా, నేను (ముహమ్మద్) ఆయన తరఫు నుండి మీకు స్పష్టంగా హెచ్చరిక చేసేవాడిని మాత్రమే!

52. ఇదే విధంగా, వారికి పూర్వం గడిచిన వారి వద్దకు ఏ ప్రవక్త వచ్చినా వారు: "ఇతను మాంత్రికుడు లేదా పిచ్చివాడు." అని అనకుండా ఉండలేదు.

53. ఏమీ? దీనిని (ఇలా పలుకుటను) వారు ఒకరికొకరు వారసత్వంగా ఇచ్చుకున్నారా? అలా కాదు! అసలు వారు తలబిరుసుతనంతో ప్రవర్తించే జనం!

54. కావున నీవు వారి నుండి మరలిపో, ఇక నీపై ఎలాంటి నింద లేదు.

55. మరియు వారిని ఉపదేశిస్తూ వుండు, నిశ్చయంగా, ఉపదేశం విశ్వాసులకు ప్రయోజనకర మవుతుంది.

---

[19] అంటే ప్రతి దానిని జంటలుగా సృష్టించాము. ఆడ-మగలు, చీకటి-వెలుగులు, సూర్య-చంద్రులు, తీపి-చేదులు, రాత్రింబవళ్ళు, కీడు-మేలు, జీవన్మరణాలు, విశ్వాసం-అవిశ్వాసం, స్వర్గనరకాలు, జిన్నాతులు - మానవులు, మొదలైనవి. వీటన్నింటినీ సృష్టించినవాడు అల్లాహ్ (సు.తా.) ఆయనకు ఎవరూ భాగస్వాములు లేరు. చూడండి, 36:36.

56. మరియు నేను జిన్నాతులను మరియు మానవులను సృష్టించింది, కేవలం వారు నన్ను ఆరాధించటానికే!

57. నేను వారి నుండి ఎలాంటి జీవనోపాధిని కోరటం లేదు మరియు వారు నాకు ఆహారం పెట్టాలని కూడా కోరటం లేదు.

58. నిశ్చయంగా అల్లాహ్! ఆయన మాత్రమే ఉపాధిప్రదాత, మహాబలవంతుడు, స్థయిర్యం గలవాడు[20].

59. కావున నిశ్చయంగా, దుర్మార్గానికి పాల్పడినవారి పాపాలు వారి (పూర్వ) స్నేహితుల పాపాల వంటివే! కావున వారు నా (శిక్ష కొరకు) తొందర పెట్టనవసరం లేదు!

60. కావున సత్యతిరస్కారులకు వినాశం గలదు - వారికి వాగ్దానం చేయబడిన - ఆ దినమున!

---

[20] అర్-రజ్జాఖు: All Provider, The Sustainer. The supplier of the means of subsistence. ఉపాధిప్రదాత, సర్వపోషకుడు, జీవనోపాధిని ప్రసాదించేవాడు. అల్-ఖవియ్యు: Owner of Power, చూడండి, 11:66, 28:26, 42:19. అల్-మతీను: The Strongest, Steadfast, Hard, Firm, స్థైర్యవంతుడు, దృఢమైనవాడు, పటిష్టవంతుడు, నిలకడ స్థోమం గలవాడు, ఇక్కడ ఒకేచోట వచ్చింది. పైవి అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లు.

# 52. అత్-తూర్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. తూర్ పర్వతం సాక్షిగా![1]
2. వ్రాయబడిన గ్రంథం సాక్షిగా!
3. విప్పబడిన చర్మపత్రం మీద.[2]
4. చిరకాల సందర్శనాలయం సాక్షిగా![3]
5. పైకెత్తబడిన కప్పు (అంతరిక్షం) సాక్షిగా![4]
6. ఉప్పొంగే సముద్రం సాక్షిగా![5]
7. నిశ్చయంగా, నీ ప్రభువు శిక్ష సంభవించనున్నది.
8. దానిని తప్పించేవాడు ఎవ్వడు లేడు.

---

[*] [అత్-తూర్ అంటే తూర్ పర్వతము]

[1] ఈ 'తూర్ పర్వతం మీదనే మూసా ('అ.స.) అల్లాహ్ (సు.తా.) తో మాట్లాడారు. దీని మరొక పేరు 'తూర్ సినాయి అని కూడా ఉంది.

[2] రఖ్ఖిన్: Parchment రాతకు అనువయ్యేటట్లు పదును చేసిన గొర్రెతోలు, చర్మపత్రం, చర్మపత్ర రాతప్రతి.

[3] బైతుల్-మ'అమూర్: ఏడవ ఆకాశం మీద ఉన్న ఆలయం. అక్కడ దైవదూతలు అల్లాహ్ (సు.తా.) ఆరాధన చేస్తూ ఉంటారు. ప్రతిరోజు అక్కడికి డెబ్బై వేల దైవదూతలు ఆరాధన కోసం వస్తారు. అయినా వారికి పునరుత్థానదినం వరకూ రెండవ సారి దాని దర్శనం చేసే అవకాశం దొరకదు. మ'అమూర్ అంటే నిండి ఉన్న ప్రదేశం. కాబట్టి కొందరు వ్యాఖ్యాతలు బైతుల్-మ'అమూర్ అంటే మక్కాలోని కాబా అని, కూడా అంటారు. ఎందుకంటే అది కూడా ఎల్లప్పుడు అక్కడికి ఆరాధన కొరకు వచ్చే ప్రజలతో నిండి ఉంటుంది.

[4] చూడండి, 21:32.

[5] చూడండి, 81:6.

9. ఆకాశాలు భయంకరంగా కంపించే రోజు!
10. మరియు పర్వతాలు దారుణంగా చలించినప్పుడు!
11. అప్పుడు, ఆ రోజు అసత్యవాదులకు వినాశం ఉంది.
12. ఎవరైతే వృథా మాటలలో కాలక్షేపం చేస్తూ ఉంటారో!
13. వారు నరకాగ్నిలోకి నెట్టుతూ త్రోయబడే రోజు;
14. (వారితో ఇలా అనబడుతుంది): "మీరు అసత్యమని నిరాకరిస్తూ వుండిన నరకాగ్ని ఇదే!
15. ఏమీ? ఇది మంత్రజాలమా? లేక దీనిని మీరు చూడలేక పోతున్నారా?
16. ఇందులో మీరు కాలుతూ ఉండండి. దానికి మీరు సహనం వహించినా, సహనం వహించక పోయినా అంతా మీకు సమానమే! నిశ్చయంగా, మీ కర్మలకు తగిన ప్రతిఫలమే మీకు ఇవ్వ బడుతున్నది."
17. నిశ్చయంగా, భయభక్తులు గలవారు స్వర్గవనాలలో సుఖసంతోషాలలో ఉంటారు.
18. వారి ప్రభువు వారికి ప్రసాదించిన వాటిని హాయిగా అనుభవిస్తూ ఉంటారు. మరియు వారి ప్రభువు వారిని భగభగ మండే నరకాగ్ని శిక్ష నుండి కాపాడాడు.
19. (వారితో ఇలా అనబడుతుంది): "మీరు చేస్తూ వుండిన కర్మలకు ఫలితంగా హాయిగా తినండి త్రాగండి!"
20. వారు వరుసగా వేయబడిన ఆసనాల మీద, దిండ్లకు ఆనుకొని కూర్చొని ఉంటారు. మరియు

మేము అందమైన పెద్ద పెద్ద కన్నులు గల సుందరీమణులతో[6] వారి వివాహం చేయిస్తాము.

21. మరియు ఎవరైతే విశ్వసిస్తారో మరియు వారి సంతానంవారు విశ్వాసంలో వారిని అనుసరిస్తారో! అలాంటి వారిని వారి సంతానంతో (స్వర్గంలో) కలుపుతాము[7]. మరియు వారి కర్మలలో వారికి ఏ మాత్రం నష్టం కలిగించము. ప్రతి వ్యక్తి తాను సంపాదించిన దానికి తాకట్టుగా ఉంటాడు[8].

22. మరియు మేము వారికి, వారు కోరే ఫలాలను మరియు మాంసాన్ని పుష్కలంగా ప్రసాదిస్తాము.

23. అందులో (ఆ స్వర్గంలో) వారు ఒకరి కొకరు (మధు) పాత్ర మార్చుకుంటూ ఉంటారు; దాన్ని (త్రాగటం) వల్ల వారు వ్యర్థపు మాటలు మాట్లాడరు మరియు పాపాలు చేయరు[9].

24. మరియు దాచబడిన ముత్యాల వంటి బాలురు[10], వారి సేవ కొరకు వారి చుట్టు ప్రక్కలలో తిరుగుతూ ఉంటారు.

---

[6] 'హూరున్: కొరకు చూడండి, 56:22, 55:56, 44:54, 38:52, 37:48.

[7] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'మానవుడు మరణిస్తే అతని కర్మలు ఆగిపోతాయి. కాని మూడు విషయాల పుణ్యఫలితం మరణించిన తరువాత కూడా దొరుకుతూ ఉంటుంది. 1) సదఖహ్ జారియహ్, 2) అతడు వదిలిన జ్ఞానం - దేనితోనైతే ఇతరులు లాభం పొందుతూ ఉంటారో! 3) సద్వర్తనులైన సంతానం - ఎవరైతే అతని కొరకు ప్రార్థిస్తూ ఉంటారో!' ('స. ముస్లిం).

[8] ఇటువంటి ఆయత్ కే చూడండి, 74:38.

[9] చూడండి, 37:47 మరియు 56:19.

[10] చూడండి, 56:17-18.

25. మరియు వారు ఒకరి వైపుకొకరు మరలి పరస్పరం (తమ గతించిన జీవితాలను గురించి) మాట్లాడుకుంటూ ఉంటారు.

26. వారు ఇలా అంటారు: "వాస్తవానికి మనం ఇంతకు పూర్వం మన కుటుంబం వారి మధ్య ఉన్నప్పుడు (అల్లాహ్ శిక్షకు) భయపడుతూ ఉండేవారము.

27. కావున నిశ్చయంగా, అల్లాహ్ మన మీద కనికరం చూపాడు మరియు మమ్ము దహించే గాలుల శిక్ష నుండి కాపాడాడు[11].

28. నిశ్చయంగా, మనం ఇంతకు పూర్వం ఆయననే ప్రార్థిస్తూ ఉండేవారము. నిశ్చయంగా, ఆయన మహోపకారి[12], అపార కరుణా ప్రదాత.

29. కావున (ఓ ప్రవక్తా!) నీవు హితోపదేశం చేస్తూ వుండు. నీ ప్రభువు అనుగ్రహం వల్ల నీవు జ్యోతిష్కుడవు కావు మరియు పిచ్చివాడవూ కావు.

30. లేదా? వారు: "ఇతను ఒక కవి, ఇతని వినాశకాలం కోసం మేము ఎదురు చూస్తున్నాము. అని అంటున్నారా?"[13]

---

[11] సమూమున్: అతి వేడి గల దహించే గాలి. నరకపు పేర్లలో ఇది కూడా ఒకటి.

[12] అల్-బర్రు: Truly Begign to His servancts, Gentle, Kind, Most Subtle, కృపాళువు, మహోపకారి, దయామయుడు. ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి.

[13] రైబున్: అంటే అకస్మాత్తుగా జరిగే సంఘటన. మనూనున్: ఇది మరణపు పేర్లలో ఒకటి. అంటే కాలక్రమంలో సంభవించే ఉపద్రవం లేక దుర్ఘటన.

31. వారితో ఇలా అను: "మీరు ఎదురు చూస్తూ ఉండండి, నిశ్చయంగా, నేను కూడా మీతో పాటు ఎదురు చూస్తూ ఉంటాను!"

32. ఏమీ? వారి బుద్ధులు వారికి ఇవే ఆజ్ఞాపిస్తున్నాయా? లేక వారు తలబిరుసుతనంగల జనులా?[14]

33. ఏమీ? వారు: "ఇతనే, దీనిని (ఈ సందేశాన్ని) కల్పించుకున్నాడు" అని అంటున్నారా? అలా కాదు, వారు అసలు విశ్వసించ దలుచుకోలేదు!

34. వారు సత్యవంతులే అయితే దీని వంటి ఒక వచనాన్ని (రచించి) తెమ్మను[15].

35. వారు ఏ (సృష్టికర్త) లేకుండానే సృష్టింపబడ్డారా? లేక వారే సృష్టికర్తలా?

36. లేక వారు ఆకాశాలను మరియు భూమిని సృష్టించారా? అలా కాదు, అసలు వారికి విశ్వాసం లేదు.

37. వారి దగ్గర నీ ప్రభువు కోశాగారాలు ఏవైనా ఉన్నాయా? లేక వారు వాటికి అధికారులా?

38. వారి దగ్గర నిచ్చెన ఏదైనా ఉందా? దాని పైకెక్కి వారు (దేవదూతల మాటలు) వినటానికి? అలా అయితే! వారిలో ఎవడైతే విన్నాడో, అతనిని స్పష్టమైన నిదర్శనాన్ని తెమ్మను.

39. ఆయన (అల్లాహ్) కు కూతుళ్ళా మరియు మీకేమో కుమారులా?[16]

---

[14] చూడండి, 96:6-7.

[15] చూడండి, 17:88.

[16] చూడండి, 16:57-59.

40. (ఓ ముహమ్మద్!) నీవు వారితో ఏమైనా ప్రతిఫలం అడుగుతున్నావా? వారు ఋణభారంతో అణిగి పోవటానికి?

41. లేక వారి దగ్గర అగోచర విషయపు జ్ఞానముందా? వారు దానిని వ్రాసి పెట్టారా?[17]

42. లేక వారేదైనా పన్నాగం పన్నదలచారా? కాని ఎవరైతే సత్యాన్ని తిరస్కరిస్తారో, వారే పన్నాగానికి గురి అవుతారు[18].

43. లేక వారికి అల్లాహ్ గాకుండా మరొక ఆరాధ్య దేవుడు ఉన్నాడా? వారు కల్పించే భాగస్వాములకు అల్లాహ్ అతీతుడు.

44. ఒకవేళ వారు ఆకాశపు ఒక తునకను రాలి పడటం చూసినా: "ఇవి దట్టమైన మేఘాలు!" అని అనేవారు.

45. కావున వారు తమ (తీర్పు) దినాన్ని దర్శించే వరకు వారిని వదిలి పెట్టు. అప్పుడు వారు భీతితో మూర్ఛపోయి పడి పోతారు.

46. ఆరోజు వారి పన్నాగం వారికి ఏ మాత్రం పనికి రాదు. మరియు వారికి ఎలాంటి సహాయం కూడా లభించదు.

47. మరియు నిశ్చయంగా, దుర్మార్గానికి పాల్పడిన వారికి, ఇదే గాక మరొక శిక్ష కూడా ఉంది[19],

---

[17] చూడండి, 68:47.
[18] చూడండి, 35:43.
[19] ఇటువంటి ఆయత్ కై చూడండి, 32:21.

కాని వారిలో చాలా మందికి అది తెలియదు.

**48.** కావున (ఓ ముహమ్మద్!) నీవు, నీ ప్రభువు ఆజ్ఞ వచ్చే వరకు సహనం వహించు. నిశ్చయంగా, నీవు మా దృష్టిలో ఉన్నావు. మరియు నీవు నిద్ర నుండి లేచినపుడు నీ ప్రభువు పవిత్రతను కొనియాడు, ఆయన స్తోత్రం చెయ్యి.

**49.** మరియు రాత్రి వేళలో కూడా ఆయన పవిత్రతను కొనియాడు[20] మరియు నక్షత్రాలు అస్తమించే వేళలో కూడాను![21]

---

[20] అంటే తహజ్జుద్ నమా'జ్. దైవప్రవక్త ('స'అస) ఎల్లప్పుడూ తహజ్జుద్ నమాజ్ చేసేవారు.

[21] అంటే ఫజ్ర్ నమా'జ్ వేళ చేసే సున్నతులు. దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'ఫజ్ర్ యొక్క రెండు సున్నతులు ఈ లోకం మరియు దానిలో ఉన్నవాటన్నింటికంటే గొప్పవి.' ('స'హీ'హ్ బు'ఖారీ, 'స'హీ'హ్ ముస్లిం).

# 53. అస్-నజమ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. అస్తమించే నక్షత్రం సాక్షిగా![1]
2. మీ సహచరుడు (ముహమ్మద్), మార్గభ్రష్టుడు కాలేదు మరియు తప్పు దారిలోనూ లేడు[2].
3. మరియు అతను తన మనోవాంఛలను అనుసరించి కూడా మాట్లాడడు.
4. అది (అతను పలుకుతున్నది) అతనిపై అవతరింపజేయబడిన దివ్యజ్ఞానం (వహీ) మాత్రమే
5. అది అతనికి మహా బలవంతుడు (జిబ్రీల్) నేర్పాడు.
6. అతను శక్తిసామర్థ్యాలు గలవాడు[3], తన వాస్తవరూపంలో ప్రత్యక్షమయినప్పుడు;
7. అతను ఎత్తైన దిఙ్మండలంలో (దిక్చక్రంలో)

---

[*] [అన్-నజ్మ్ అంటే నక్షత్రము]

[1] 'లేక రాలిపోయే నక్షత్రం ... ' అని కొందరు వ్యాఖ్యాతల అభిప్రాయం.

[2] చూడండి, 7:184. మా'గవా: తప్పు దారిలోనూ లేడు, పెడదారి పట్టలేదు.

[3] శారీరక శక్తి గలవాడు.

కనిపించాడు[4].

8. తరువాత సమీపించాడు, మరింత క్రిందికి దిగి వచ్చాడు.

9. అప్పుడు అతను రెండు ధనస్సుల దూరంలోనో లేక అంతకంటే తక్కువ దూరంలోనో ఉన్నాడు.

10. అప్పుడు అతను (జిబ్రీల్), ఆయన (అల్లాహ్) దాసునిపై అవతరింప జేయవలసిన, దానిని (వహీని) అవతరింపజేశాడు.

11. అతను (ప్రవక్త) చూసిన దానిని, అతని హృదయం అబద్ధమని అనలేదు.

12. అయితే మీరు, అతను (కళ్ళారా) చూసిన దానిని గురించి (అతనితో) వాదులాడుతారా?

13. మరియు వాస్తవానికి అతను (ప్రవక్త) అతనిని (జిబ్రీల్ ను) మరొకసారి (ప్రత్యక్షంగా) అవతరించినప్పుడు చూశాడు.

14. (సప్తాకాశంలో) చివరి హద్దులో నున్న రేగు చెట్టు

---

[4] చూడండి, 81:23. 'స'హీ'హ్ 'హదీస్'ల ప్రకారం దైవప్రవక్త ('స'అస), రెండుసార్లు దైవదూత జిబ్రీల్ ('అ.స.) ను అతని నిజరూపంలో చూశారు. మొదటిసారి ఫ'త్ రతుల్ వ'హీ తరువాత. చూడండి, సూరహ్ అల్ ముద్దస్సి'ర్ (74) మరియు రెండవ సారి మే'రాజ్ రాత్రిలో ఏడవ ఆకాశపు చివరి హద్దులలోనున్న రేగుచెట్టు (సిద్ రతుల్-మున్ తహా) దగ్గర. ఎవరు కూడా ఆ హద్దును దాటిపోలేరు. చూడండి, 53:13-18 ఆయత్ లు.

(సిదరతుల్ మున్తహా) దగ్గర[5].

15. అక్కడికి దగ్గరలోనే జన్నతుల్ మా'వా ఉంది[6].

16. అప్పుడు ఆ సిదరహ్ వృక్షాన్ని కప్పేది కప్పేసినప్పుడు![7]

17. అతని (ప్రవక్త) దృష్టి తప్పిపోనూ లేదు మరియు హద్దుదాటి కూడా పోలేదు.

18. వాస్తవంగా, అతను (ముహమ్మద్) తన ప్రభువు యొక్క గొప్ప గొప్ప సూచనలను (ఆయాత్ లను) చూశాడు[8].

19. మీరు, అల్ లాత్ మరియు అల్ ఉజ్జాను గురించి

---

[5] అంటే మే'రాజ్ రాత్రిలో ఏడవ ఆకాశపు చివరి హద్దులోనున్న రేగుచెట్టు (సిద్ రతుల్ - మున్ తహా) దగ్గర దైవప్రవక్త ('స'అస) జిబ్రీల్ ('అ.స.) ను అతని నిజరూపంలో రెండవసారి చూశారు. ఏ దైవదూత కూడా ఆ 'సిద్ రతుల్ - మున్ తహా కంటే ముందుకు పోలేడు. దైవదూత ('అలైహిమ్.స.) లక అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞలు లభించేది అక్కడే.

[6] దీనిని జన్నతుల్-మఅ'వా అనటానికి కారణం ఇది ఒకప్పటి ఆదమ్ ('అ.స.) యొక్క నివాస స్థలం. ఆత్మలన్నీ అక్కడికే పోయి చేరుతాయని కొందరంటారు. (ఫ'త్హ్ అల్-ఖదీర్.)

[7] మే'రాజ్ రాత్రిలో దైవప్రవక్త ('స'అస) అక్కడికి చేరుకున్నప్పుడు బంగారు పక్షులు దాని చుట్టూ తిరుగుతూ ఉంటాయి. దైవదూతల నీడలు దానిపై పడుతూ ఉంటాయి. అల్లాహ్ (సు. తా.) యొక్క జ్యోతి అక్కడ ఉంటుంది. (ఇబ్నె-కసీ'ర్ మరియు ఇతరులు). అక్కడ దైవప్రవక్త ('స'అస)కు మూడు విషయాలు ప్రసాదించబడ్డాయి. 1) ఐదు పూటల నమా'జ్ లు, 2) సూరహ్ బఖరహ్ చివరి ఆయతులు మరియు 3) షిర్క్ కు దూరంగా ఉంటే ముస్లింలను క్షమిస్తాననే వాగ్దానం. ('స'హీ'హ్ ముస్లిం).

[8] ఆ సూచనలు, జిబ్రీల్ ('అ.స.) ను నిజరూపంలో చూసింది, సిద్రతుల్-మున్ తహాను చూసింది. మరియు ఇతర విషయాలసు చూసింది. అవి 'హదీస్'లలో పేర్కొనబడ్డాయి. వివరాలకు చూడండి, 17:1 మరియు 7:187-188.

ఆలోచించారా?[9]

20. మరియు మూడవదీ చివరిది అయిన మనాత్ ను (గురించి కూడా)?[10]

21. మీ కొరకైతే కుమారులు మరియు ఆయన కొరకు కుమార్తెలా?[11]

22. ఇది అన్యాయమైన విభజన కాదా!

23. ఇవన్నీ మీరు మరియు మీ తండ్రి తాతలు పెట్టిన పేర్లు మాత్రమే, అల్లాహ్ వీటిని గురించి ఎట్టి ప్రమాణం అవతరింప జేయలేదు. వారు, కేవలం తమ ఊహాగానాలను మరియు తమ ఆత్మలు కోరే మనోవాంఛలను మాత్రమేఅనుసరిస్తున్నారు[12]. వాస్తవానికి వారి ప్రభువు తరపు నుండి వారి వద్దకు మార్గదర్శకత్వం కూడా వచ్చి ఉన్నది!

24. ఏమిటి? మానవునికి తాను కోరినదంతా లభిస్తుందా?

---

[9] ర'అయ్ తుమ్: అంటే అసలు అర్థం: 'చూశారా?' అని. కాని ఇక్కడ దాని అర్థం 'ఆలోచించారా?' లేక 'గమనించారా?' ఖుర్ఆన్‌లో ఈపదం ఈఅర్థంలో చాలాసార్లుఉపయోగించబడింది. ఇతర అర్థాలు యోచించు, అనుకొను, భావించు, తలచు, అభిప్రాయపడు, మొదలైనవి.

[10] అంటే వారి శక్తి ఏమిటి? అవి మీకేమైనా మేలు గానీ, కీడు గానీ చేయగలవా? ఏమైనా సృష్టించగలవా? అవి తమకు తామే సహాయం చేసుకోలేవు మరి మీకెలా సహాయం చేయగలవు. ఇక్కడ ఆ కాలపు కేవలం మూడు విగ్రహాల పేర్లే పేర్కొనబడ్డాయి.

[11] ఆడపిల్లలంటే ఆ కాలపు 'అరబ్బులకు ఉన్న అసహ్యానికి చూడండి, 16:57-59, 62.

[12] చూడండి, 12:40.

25. వాస్తవానికి, అంతిమ (పరలోకం) మరియు ప్రథమం (ఇహలోకం) అన్నీ అల్లాహ్ కే చెందినవి.

26. మరియు ఆకాశాలలో ఎందరో దేవదూతలు ఉన్నారు. కాని వారి సిఫారసు ఏ మాత్రం పనికిరాదు; అల్లాహ్ ఎవరి పట్లనైతే ప్రసన్నుడై, తన ఇష్టంతో వారికి అనుమతిస్తేనే తప్ప![13]

27. నిశ్చయంగా, ఎవరైతే పరలోక జీవితాన్ని విశ్వసించరో! వారే దేవదూతలను స్త్రీల పేర్లతో పిలుస్తారు;

28. ఈ విషయం గురించి వారికి ఎలాంటి జ్ఞానం లేదు. వారు కేవలం తమ ఊహలనే అనుసరిస్తున్నారు. కాని వాస్తవానికి, ఊహ సత్యానికి ఏ మాత్రం బదులు కాజాలదు.

29. కావున, మా హితబోధ (ఖుర్ఆన్) నుండి ముఖం త్రిప్పుకొని ఇహలోక జీవితం తప్ప మరేమీ కోరని వ్యక్తిని నీవు పట్టించుకోకు,

30. ఇదే వారి జ్ఞానపరిధి. నిశ్చయంగా, నీ ప్రభువుకు, ఆయన మార్గం నుండి ఎవడు తప్పి పోయాడో తెలుసు మరియు ఎవడు సన్మార్గంలో ఉన్నాడో కూడా ఆయనకు బాగా తెలుసు.

31. మరియు ఆకాశాలలో నున్నది మరియు భూమిలో నున్నది, అంతా అల్లాహ్ కే చెందుతుంది.

---

[13] మనోవాంఛలు అంటే, ఆ దేవతలు తమ కొరకు అల్లాహ్ (సు.తా.) దగ్గర సిఫారసు చేస్తారని భావించటం.

దుష్టులకు వారి కర్మలకు తగిన ప్రతిఫలం ఇవ్వటానికి మరియు సత్కార్యాలు చేసిన వారికి మంచి ప్రతిఫలం ఇవ్వటానికి[14].

**32.** ఎవరైతే చిన్న చిన్న తప్పులు తప్ప, పెద్ద పాపాల నుండి[15] మరియు అసహ్యాకరమైన పనుల నుండి దూరంగా ఉంటారో వారి కొరకు, నిశ్చయంగా, నీ ప్రభువు క్షమాపణ పరిధి చాలా విశాలమైనది. మిమ్మల్ని మట్టి నుండి సృష్టించినప్పటి నుండి మరియు మీ తల్లుల గర్భాలలో పిండాలుగా[16] ఉన్నప్పటి నుండి కూడా, ఆయనకు మీ గురించి బాగా తెలుసు. కావున మీరు మీ పవిత్రతను

---

[14] సత్కార్యాలకు ఎన్నో రెట్లు ప్రతిఫలమివ్వబడుతుంది. కాని పాపాలకు మాత్రం సమాన శిక్షయే విధించ బడుతుంది. చూడండి, 6:160.

[15] పెద్దపాపాల వివరణ విషయంలో విద్వాంసుల మధ్య భేదాభిప్రాయాలున్నాయి. చాలా మంది విద్వాంసుల దృష్టిలో నరకశిక్ష సూచించబడిన పాపాలు పెద్దవి లేక ఖుర్ఆన్ మరియు 'హదీస్'లో గట్టిగా వారించబడినవి కూడా! అలాగే చిన్న పాపాలు మళ్ళీ మళ్ళీ చేయటం కూడా పెద్ద పాపమే. ఫవా'హిషున్, ఫా'హిషతున్ యొక్క బహువచనం. అంటే సిగ్గుమాలిన పనులు ఉదా: 'జినా మరియు లవా'తత్. ఎవరైతే పెద్ద పాపాల నుండి మరియు అసహ్యాకరమైన పనుల నుండి దూరంగా ఉంటారో వారికి క్షమాభిక్ష దొరకవచ్చు అని ఈ ఆయత్ లో చెప్పబడింది.

[16] అజిన్నతున్-జనీనున్‌యొక్కబహువచనంఅంటేతల్లిగర్భంలో ఉండే పిండం. అది ఇతరులకు కనిపించదు. కనుక దాన్ని ఆ విధంగా అంటారు.

గురించి (గొప్పలు) చెప్పుకోకండి[17]. ఎవడు భయభక్తులు గలవాడో ఆయనకు బాగా తెలుసు.

33. నీవు (ఇస్లాం నుండి) మరలి పోయే వాడిని చూశావా?

34. మరియు (అల్లాహ్ మార్గంలో) కొంత మాత్రమే ఇచ్చి, చేయి ఆపుకునేవాడిని?

35. అతని వద్ద అగోచర జ్ఞానముందా? అతడు (స్పష్టంగా) చూడటానికి?

36. లేక, మూసా గ్రంథంలో నున్న విషయాలు అతనికి తెలుపబడలేదా?

37. మరియు తన బాధ్యతను నెరవేర్చిన ఇబ్రాహీమ్ విషయము[18];

38. మరియు (పాపాల) భారం మోసే వాడెవడూ ఇతరుల (పాపాల) భారం మోయడని[19];

39. మరియు మానవునికి తాను చేసిన దాని ఫలితం

---

[17] చూడండి, 4:49.

[18] చూడండి, 2:124.

[19] ఈ ఆయత్ ఖుర్ఆన్ లో ఐదుసార్లు వచ్చింది. 6:164, 17:15, 35:18, 39:7 మరియు ఇక్కడ. ఈ సూరహ్ లో ఖుర్ఆన్ అవతరణలో మొట్ట మొదటిసారి వచ్చింది. ఇది క్రైస్తవుల 'మూలపాపం' అనే సిద్ధాంతాన్ని కూడా ఖండిస్తోంది. రెండవది: 'ఒకని పాపభారాన్ని ఒక ప్రవక్త లేక సన్యాసి భరిస్తాడు' అనే సిద్ధాంతాన్ని కూడా ఖండిస్తోంది. ఉదా: క్రైస్తవుల 'దైవప్రవక్త 'ఈసా ('అస) మానవజాతి పాపాలను భరిస్తాడు.' అనే సిద్ధాంతం.

తప్ప మరొకటి లభించదని[20];

**40.** మరియు నిశ్చయంగా, అతనికి తన కృషి ఫలితమే చూపబడుతుందని;

**41.** అప్పుడు అతనికి తన కృషికి పూర్తి ప్రతిఫలం ఇవ్వబడుతుందని;

**42.** మరియు నిశ్చయంగా, నీ ప్రభువు వద్దనే (ప్రతిదాని) ముగింపు ఉన్నదని;

**43.** మరియు నిశ్చయంగా, ఆయనే నిన్ను నవ్విస్తున్నాడు మరియు ఏడ్పిస్తున్నాడని;

**44.** మరియు నిశ్చయంగా, ఆయనే మరణింపజేసేవాడు మరియు జీవితాన్ని ప్రసాదించేవాడని;

**45.** మరియు నిశ్చయంగా, మగ-ఆడ జంటలను సృష్టించినవాడు ఆయనేనని -

**46.** విసర్జింపబడిన వీర్యబిందువు నుండి.

**47.** మరియు నిశ్చయంగా, దానికి మరొక జీవితాన్ని (పునరుత్థానం) ప్రసాదించడం ఆయన (అల్లాహ్)

---

[20] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'కర్మల ఫలితాలు, వాటి కర్తల ఉద్దేశాలను బట్టి నిర్ణయించ బడతాయి. ప్రతివాడు తాను బుద్ధిపూర్వకంగా చేసిన దాని ఫలితమే పొందుతాడు.' (బు'ఖారీ, ముస్లిం, తిర్మి'జీ, అబూ-దావూద్, నసాయి', ఇబ్నె-మాజా, ఇబ్నె-'హంబల్ మరియు ఇతరులు). ఆమాల్ అంటే కర్మలు - మంచివి గానీ, చెడ్డవి గానీ. చేయడమే గాక పలకడం గూడా లెక్కించబడుతుంది. ఒక పని, చేయటమే గాక, బుద్ధిపూర్వకంగా ఒక పని చేయకుండా ఉండటం కూడా కర్మగానే లెక్కించబడుతుంది. అది మంచిపని గానీ లేక చెడ్డ పని గానీ. అదే విధంగా నమ్మకాలను, విశ్వాసాలను ప్రకటించటం కూడా, అవి మూఢనమ్మకాలు గానీ లేదా సత్య విశ్వాసాలు గానీ లెక్కింపబడతాయి. అంటే మానవుడు చేసే ప్రతి పని, పలికే ప్రతి మాట లెక్కించబడుతుందన్న మాట.

కే చెందినదని;
48. మరియు నిశ్చయంగా, ఆయనే సంపన్నునిగా చేసేవాడు మరియు తృప్తినిచ్చు వాడని;
49. మరియు నిశ్చయంగా ఆయనే అగ్ని[21] నక్షత్రానికి ప్రభువని;
50. మరియు నిశ్చయంగా, ఆయనే తొలి ఆద్ జాతిని నాశనం చేసినవాడని[22];
51. మరియు సమూద్ జాతిని; ఒక్కడూ కూడా లేకుండా రూపుమాపాడని[23].
52. మరియు అంతకు పూర్వం నూహ్ జాతి వారిని. నిశ్చయంగా, వారు పరమ దుర్మార్గులు మరియు తలబిరుసులు.
53. మరియు ఆయనే తలక్రిందులైన నగరాలను నాశనం చేశాడు[24].
54. తరువాత వాటిని క్రమ్ముకొనవలసింది (రాళ్ళ వర్షం) క్రమ్ముకున్నది.
55. అయితే (ఓ మానవుడా!) నీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను గురించి నీవు అనుమానంలో

---

[21] అష్-షి'అరా: Sirius, అగ్ని నక్షత్రం. ఇది ఆకాశంలో దేదీప్యమానంగా వెలుగుతూ ఉంటుంది. ముష్రిక్ 'అరబ్బులు దీన్ని పూజించేవారు.

[22] 'ఆద్ జాతివారి గాథకై చూడండి, 7:65-69 వీరు నూ'హ్ జాతివారి తరువాత నాశనం చేయబడ్డవారు.

[23] స'మూద్ జాతివారి గాథకై చూడండి, 7:73 మరియు 26:141-158.

[24] లూ'త్ ప్రజల నాశనానికై చూడండి, 11:77-83.

పడి ఉంటావు?[25]

56. ఇది వరకు వచ్చిన హెచ్చరిక చేసే వారి వలే ఇతను (ముహమ్మద్) కూడా హెచ్చరిక చేసే వాడు మాత్రమే!

57. రానున్న ఘడియ (పునరుత్థాన దినం) సమీపంలోనే వుంది.

58. అల్లాహ్ తప్ప మరెవ్వరూ దానిని తొలగించలేరు.

59. ఏమీ? మీరు ఈ సుదేశాన్ని చూసి ఆశ్చర్యపడుతున్నారా?

60. మరియు మీరు నవ్వుతున్నారా? మరియు మీకు ఏడ్పు రావటం లేదా?

61. మరియు మీరు నిర్లక్ష్యంలో మునిగి ఉన్నారు[26].

62. కావున! అల్లాహ్ కు సాష్టాంగం (సజ్దా) చేయండి. మరియు (ఆయనను మాత్రమే) ఆరాధించండి![27]

---

[25] చూడండి, 55:13.

[26] లేక: 'ఆటపాటల్లో మునిగి ఉన్నారా?'

[27] ఈ ఆజ్ఞను పాటిస్తూ దైవప్రవక్త ('స'అస) సజ్దా చేశారు. అతనితోబాటు 'స'హాబా(ర'ది.'అన్హుమ్) లు మరియు అక్కడున్న ముష్రికులు కూడా సజ్దా చేశారు.

# 54. అల్ ఖమర్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఆ ఘడియ దగ్గరకు వచ్చింది మరియు చంద్రుడు పూర్తిగా చీలిపోయాడు[1].
2. అయినా (సత్యతిరస్కారులు), అద్భుత సూచనను చూసినా తమ ముఖాలను త్రిప్పు కుంటున్నారు. మరియు: "ఇది ఎప్పటి నుంచో జరుగుతూ వస్తున్న మంత్రజాలమే." అని అంటున్నారు.
3. మరియు వారు దీనిని (ఈ ఖుర్ఆన్ ను) అసత్యమని తిరస్కరించారు. మరియు తమ మనోవాంఛలను అనుసరించారు. మరియు ప్రతి వ్యవహారం ఒక పర్యవసానానికి చేరవలసి ఉంటుంది[2].
4. మరియు వాస్తవానికి, వారి వద్దకు సమాచారాలు వచ్చాయి. అందు వారికి మందలింపులు ఉండేవి.
5. కావలసినంత వివేకమూ ఉండేది. కాని ఆ హెచ్చరికలు వారికి ప్రయోజనకరం కాలేదు.
6. కావున (ఓ ముహమ్మద్!) నీవు వారి నుండి

---

[*] [అల్-ఖమర్ అంటే చంద్రుడు]

[1] ఈ అద్భుత నిదర్శనం, మక్కావాసుల కోరికపై దైవప్రవక్త ('స'అస) చూపించారు. ('స. ముస్లిం)

[2] ప్రతి కార్యానికి పర్యవసానం ఉంది. అంటే మంచికి మంచి ప్రతిఫలం మరియు చెడుకు శిక్ష. ఈ ప్రతిఫలం ఈ లోకంలోనే లభించవచ్చు లేనిచో పరలోకంలో తప్పకుండా లభిస్తుంది.

మరలిపో! పిలిచేవాడు భయంకరమైన ఒక విషయం వైపునకు పిలిచే రోజున;

7. వారి చూపులు క్రిందికి వాలి ఉంటాయి, వారు చెల్లాచెదురైన మిడతల వలే, తమ గోరీల నుండి లేచి బయటికి వస్తారు;

8. వేగంగా పిలిచేవాని వైపునకు! సత్యతిరస్కారులు: "ఇది చాలా కఠినమైన రోజు." అని అంటారు.

9. వారికి పూర్వం నూహ్[3] జాతి వారు (తమ ప్రవక్తను) అసత్యవాదుడని తిరస్కరించి ఉన్నారు, అప్పుడు వారు మా దాసుణ్ణి: "అసత్యవాది!" అని అన్నారు. మరియు : "ఇతడు పిచ్చివాడు" అని అన్నారు. మరియు అతను కసిరికొట్టబడ్డాడు.

10. అప్పుడతను తన ప్రభువును ఇలా ప్రార్థించాడు: "నిశ్చయంగా నేను ఓడిపోయాను కావున నాకు సహాయం చేయి!"

11. అప్పుడు మేము ఆకాశపు ద్వారాలు తెరిచి కుంభవర్షాన్ని కురిపించాము.

12. మరియు భూమి నుండి ఊటలను పొంగింపజేశాము అపుడు నిర్ణీత కార్యానికి గాను నీళ్ళన్నీ కలిసి పోయాయి.

13. మరియు మేము అతనిని (నూహ్ ను) పలకలు మరియు మేకులు గలదాని (ఓడపై) ఎక్కించాము.

14. అది మా కన్నుల ముందు తేలియాడుతూ పోయింది. (తన జాతి వారి చేత) తిరస్కరించబడిన

---

[3] నూ'హ్ గాథ కోసం చూడండి, 11:25-48 మరియు 26:116.

వానికి ప్రతిఫలంగా!

**15.** మరియు వాస్తవానికి మేము దానిని (ఆ ఓడను) ఒక సూచనగా చేసి వదలి పెట్టాము. అయితే, హితబోధ స్వీకరించేవాడు ఎవడైనా ఉన్నాడా?[4]

**16.** చూశారా! నా శిక్ష మరియు నా హెచ్చరికలు ఎలా ఉండెనో?

**17.** మరియు వాస్తవానికి మేము ఈ ఖుర్ఆన్ ను హితబోధ గ్రహించటం కోసం సులభం చేశాము. అయితే హితబోధను స్వీకరించేవాడు ఎవడైనా ఉన్నాడా?

**18.** ఆద్ జాతి సత్యాన్ని తిరస్కరించింది. చూశారా! నా శిక్ష మరియు నా హెచ్చరికలు ఎలా ఉండెనో?

**19.** నిశ్చయంగా, మేము పూర్తిగా దురదృష్టకరమైన (అరిష్టదాయకమైన) ఒక రోజున, తీవ్రమైన ఎడతెగని తుఫాను గాలిని పంపాము[5].

**20.** అది ప్రజలను వేర్లతో పెళ్ళగింపబడిన ఖర్జూరపు చెట్ల వలే పెళ్ళగించి వేసింది[6]

**21.** ఇక చూశారా! నా శిక్ష మరియు నా హెచ్చరికలు

---

[4] ముద్దకిర్: ఈ పదం అసలు రూపం, 'మజ్'తకిర్'. అంటే హితబోధ స్వీకరించేవాడని అర్థం. (ఫత్హ్' అల్-ఖదీర్) చూడండి, 36:41-42.

[5] ఆ 'తుఫాను గాలి ఏడు రాత్రులు మరియు ఎనిమిది పగళ్ళు ఎడతెగకుండా వీచింది. ఆ విధంగా ఆ దినాలు, ఆ సత్య తిరస్కారులకు అశుభకరంగా పరిణమించాయి. అంతేగాని విశ్వాసులకు ఏ దినమూ అశుభం కాదు. ఏ దినాన్ని గూడా ఈ ప్రత్యేక దినం అశుభమైనదని అనటం తప్పు. వారంలోని ఏడు దినాలూ మంచివే.

[6] చూడండి, 69:6-8.

ఎలా ఉండెనో?

22. మరియు వాస్తవానికి మేము ఈ ఖుర్ఆన్ ను హితబోధ గ్రహించటం కోసం సులభం చేశాము, అయితే హితబోధను స్వీకరించేవాడు ఎవడైనా ఉన్నాడా?

23. సమూద్ జాతి హెచ్చరికలను అసత్యాలని తిరస్కరించింది.

24. అప్పుడు వారు ఇలా అన్నారు: "ఏమీ? మాలోని ఒక వ్యక్తిని, ఒంటరివాడిని, మేము అనుసరించాలా? అలా అయితే నిశ్చయంగా, మేము మార్గభ్రష్టులం మరియు పిచ్చివారం అయినట్లే కదా?"

25. "ఏమీ? మా అందరిలో, కేవలం అతని మీదనే (దివ్య) సందేశం పంపబడిందా? అలా కాదు! అసలు అతను అసత్యవాది, డంబాలు పలికేవాడు!"

26. అసత్యవాది, డంబాలు పలికేవాడు! ఎవడో రేపే (త్వరలోనే) వారికి తెలిసిపోతుంది!

27. నిశ్చయంగా, మేము ఆడ ఒంటెను, వారిని పరీక్షించటం కోసం పంపుతున్నాము, కావున (ఓ సాలిహ్!) వారి విషయంలో వేచి ఉండు మరియు సహనం వహించు!

28. మరియు వారి మధ్య నీరు (న్యాయంగా) పంచబడాలని వారికి బోధించు. ప్రతి ఒక్కరూ తమ వంతు వచ్చే రోజునే త్రాగాలని నియమించబడింది[7].

29. ఆ పిదప వారు తమ సహచరుణ్ణి పిలిచారు. వాడు

[7] చూడండి, 26:155 23. ఒక రోజు ఒంటెను నీరు త్రాగనివ్వాలి, రెండవ రోజు ప్రజలు త్రాగాలి.

దాన్ని పట్టుకొని (దాని వెనుక కాలి మోకాలి నరాలు కోసి) చంపాడు[8].

30. అప్పుడు చూశారా! నా శిక్ష మరియు నా హెచ్చరికలు ఎలా ఉండెనో?

31. నిశ్చయంగా, మేము వారి మీదకు ఒక భయంకరమైన శబ్దాన్ని (సయ్ హాను) పంపాము, దాంతో వారు త్రొక్క బడిన పశువుల దొడ్డి కంచె వలే నుగ్గు నుగ్గు అయి పోయారు.

32. మరియు వాస్తవానికి, మేము ఈ ఖుర్ఆన్ ను హితబోధ గ్రహించటానికి సులభం చేశాము. అయితే హితబోధ స్వీకరించేవాడు ఎవడైనా ఉన్నాడా?

33. లూత్ జాతి కూడా హెచ్చరికలను అసత్యాలని తిరస్కరించింది.

34. నిశ్చయంగా, మేము లూత్ ఇంటివారు తప్ప! ఇతరుల మీదికి రాళ్ళు విసిరే తుఫాన్ గాలిని పంపాము. (లూత్ ఇంటి) వారిని మేము వేకువ ఝాముున రక్షించాము[9];

35. మా తరఫు నుండి అనుగ్రహంగా. ఈ విధంగా మేము కృతజ్ఞులకు ప్రతిఫలం ఇస్తాము.

36. మరియు వాస్తవానికి (లూత్ తన జాతి) వారిని

---

[8] చూడండి, 7:77.

[9] ఆలె-లూ'తున్:అంటే అతనితో సహా అతని ఇద్దరు కూతుళ్ళు మరియు కొందరు అతని అనుచరులు. అతని భార్య సత్యతిరస్కారులలో చేరిపోయింది. ఈ గాథ వివరాల కోసం చూడండి, 11:69-83.

మా రాబోయే శిక్షను గురించి హెచ్చరించాడు. కాని వారు మా హెచ్చరికలను సందేహించి (మొండి) వాదనలకు దిగారు!

37. మరియు వాస్తవానికి వారు అతని అతిథులను[10] అతని నుండి బలవంతంగా లాక్కోవాలని అనుకున్నారు. కావున మేము వారి కళ్ళను పోగొట్టాము. (వారితో ఇలా అన్నాము): "ఇప్పుడు నా శిక్షను మరియు నా హెచ్చరికను చవి చూడండి."

38. మరియు వాస్తవానికి, ఉదయపు వేళ శాశ్వతమైన శిక్ష వారి మీద పడింది:

39. "ఇప్పుడు మీరు నా శిక్షను మరియు నా హెచ్చరికలను చవి చూడండి."

40. మరియు వాస్తవానికి, మేము ఈ ఖుర్ఆన్ ను హితబోధ గ్రహించటానికి సులభం చేశాము. అయితే హితబోధ స్వీకరించేవాడు ఎవడైనా ఉన్నాడా?

41. మరియు వాస్తవానికి ఫిర్ఔన్ జాతి వారికి కూడా హెచ్చరికలు వచ్చాయి.

42. వారు మా సూచనలను అన్నిటినీ అబద్ధాలని తిరస్కరించారు, కావున మేము వారిని పట్టుకున్నాము, సర్వశక్తిమంతుడు సర్వసమర్థుడు పట్టుకునే విధంగా!

43. (ఓ ఖురైషులారా!) ఏమీ? మీ సత్యతిరస్కారులు మీకు పూర్వం గడిచినవారి కంటే శ్రేష్ఠులా? లేక

[10] వారు జిబ్రీల్ మీకాయీ'ల్ మరియు ఇస్రాఫీల్ ('అలైహిమ్ స.) లు. చూడండి, 11:77-79.

దివ్యగ్రంథాలలో మీ కొరకు (మా శిక్ష నుండి) ఏదైనా మినహాయింపు వ్రాయబడి ఉందా?

44. లేక వారు: "మాది ఒక శక్తిగల వర్గం, (కావున) మేము ప్రాబల్యం పొందగలం" అని అంటున్నారా?

45. కాని త్వరలోనే ఈ శక్తిగల వర్గం పరాజయం పొందగలదు. మరియు వారు వెన్నుచూపి పారిపోతారు[11].

46. అంతేకాదు! అంతిమ ఘడియయే, వారి వాగ్దాన సమయం మరియు ఆ ఘడియ ఎంతో దారుణమైనది మరియు ఎంతో తీవ్రమైనదీను (చేదైనదీను).

47. నిశ్చయంగా, పాపాత్ములు మార్గభ్రష్టత్వంలో ఉన్నారు మరియు వారు (పరలోకంలో) నరకాగ్నిలో కాలుతారు.

48. ఆ రోజు వారు తమ ముఖాల మీద నరకాగ్ని లోకి ఈడ్చబడతారు; (వారితో): "నరకాగ్ని స్పర్శను చవి చూడండి!" అని అనబడుతుంది[12].

49. నిశ్చయంగా, మేము ప్రతి దానిని ఒక విధివ్రాత (ఖద్ర్) తో సృష్టించాము[13].

---

[11] దైవప్రవక్త ('స'అస) ఈ ఆయత్ ను బద్ర్ యుద్ధ ఆరంభంలో చదివారు.

[12] చూడండి, 33:66 మరియు 25:34.

[13] అహ్లెసున్నత్ వల్-జమా'అత్ విద్వాంసులు ఈ ఆయత్ మరియు ఇటువంటి ఆయత్ ల ఆధారంగా అంటారు. అల్లాహ్ (సు.తా.)కు మానవులను సృష్టించక ముందే వారికి సంబంధించిన అన్ని విషయాల జ్ఞానముంది, కావున ఆయన అందరి 'ఖద్ర్', Destiny, విధి, అంటే విధివ్రాత నియమం లేక అదృష్టం ముందే వ్రాసి పెట్టాడు. (ఇబ్నె-కసీ'ర్).

50. మరియు మా ఆజ్ఞ కేవలం ఒక్కటే చాలు, కనురెప్పపాటుది, (అది అయిపోతుంది)[14] .
51. మరియు వాస్తవానికి, మేము మీ వంటి వారిని, ఎందరినో నాశనం చేశాము. అయితే, హితబోధ స్వీకరించేవాడు ఎవడైనా ఉన్నాడా?
52. మరియు వారు చేసిన ప్రతి విషయం వారి కర్మ గ్రంథాలలో (చిట్టాలలో) వ్రాయబడి ఉంది[15].
53. మరియు ప్రతి చిన్న మరియు ప్రతి పెద్ద విషయం అన్నీ వ్రాయబడి ఉన్నాయి[16].
54. నిశ్చయంగా, దైవభీతి గలవారు స్వర్గవనాలలో సెలయేళ్ళ దగ్గర ఉంటారు.
55. సత్యపీఠం మీద[17], విశ్వసామ్రాట్టు[18], సర్వసమర్థుని సన్నిధిలో.

---

[14] అల్లాహ్ (సు.తా.) ఏదైనా చేయాలనుకుంటే, దానిని: 'అయిపో!' అంటాడు. అంతే అది అయిపోతుంది. చూడండి, 2:117, 3:47, 59, 6:73, 16:40, 19:35, 36:8240:68.

[15] లేక లౌహె మ'హ్-ఫూ"జ్ లో వ్రాయబడి ఉన్నది.

[16] అంటే మానవుల కర్మలూ, మాటలూ, అన్నీ వ్రాయబడి ఉన్నాయి చిన్నవి గానీ పెద్దవి గానీ, మంచివి గానీ చెడ్డవి గానీ!

[17] మఖ్'అది 'సిద్ ఖిన్: గౌరవప్రదమైన స్థానంలో - అంటే స్వర్గం.

[18] చూడండి, 20:114 వ్యాఖ్యానం 3

# 55. అర్-రహ్మాన్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. అనంత కరుణామయుడు (అల్లాహ్)!
2. ఆయనే ఈ ఖుర్ఆన్ ను నేర్పాడు[1].
3. ఆయనే మానవుణ్ణి సృష్టించాడు.
4. ఆయనే అతనికి మాట్లాడటం నేర్పాడు.
5. సూర్యుడు మరియు చంద్రుడు ఒక నియమిత గమనాన్ని (నియమిత పరిధిలో) అనుసరిస్తున్నారు.
6. మరియు నక్షత్రాలు మరియు వృక్షాలు అన్నీ ఆయనకు సాష్టాంగం (సజ్దా) చేస్తూ ఉంటాయి[2].
7. మరియు ఆయనే ఖగోళాన్ని పైకెత్తి ఉంచాడు మరియు ఆయనే త్రాసును నెలకొల్పాడు[3].

---

[*] [అర్-రహ్మాన్ అంటే అనంత కరణా ప్రదాత]

[1] ఇది మక్కా ముష్రికులకు ఇవ్వబడిన జవాబు. ఎందుకంటే వారు, దైవప్రవక్త (సఅస) మీద, ఈ ఖుర్ఆన్ ను అతనికి ఒక మానవుడు నేర్పాడు అనే అపనింద మోపారు. కాని వాస్తవానికి అల్లాహ్ (సు.తా.) దీనిని తన సందేశహరునికి నేర్పాడు మరియు అతను తమ అనుచరులకు (ర'ది.'అన్హుమ్) నేర్పారు. (ఫ'త్హ్ అల్-ఖదీర్).

[2] చూడండి, 22:18.

[3] అంటే ప్రపంచంలో న్యాయాన్ని నెలకొల్పాడు, చూడండి, 57:25, 42:17.

8. తద్వారా మీరు తూకంలో మోసానికి పాల్పడకూడదని![4]
9. మరియు న్యాయంగా తూకం చేయండి మరియు తూకంలో తగ్గించకండి.
10. మరియు ఆయన, భూమిని సకల జీవరాసుల కొరకు ఉంచాడు.
11. అందులో రకరకాల ఫలాలు మరియు పొరలలో (పుష్పకోశాలలో) ఉండే ఖర్జూరపండ్లు ఉన్నాయి
12. మరియు దంట్లపై(పొరలలో చుట్టబడి)[5] ఉన్న ధాన్యం మరియు సుగంధపుష్పాలు కూడా!
13. అయితే మీరిరువురు (మానవులు మరియు జిన్నాతులు) మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?
14. ఆయన మానవుణ్ణి పెంకులాంటి శబ్దమిచ్చే మట్టితో[6] సృష్టించాడు.
15. మరియు జిన్నాతులను అగ్నిజ్వాలలతో సృష్టించాడు[7].
16. అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?

---

[4] అంటే న్యాయానికి విరుద్ధంగా పోకండి, న్యాయాన్ని భంగపరచకండి.

[5] అల్-'అ'స్ఫు: అంటే ఎండిన గడ్డి, గడ్డి పరక, పొట్టు, ఊక, పొర, ధాన్యపు దంట్లు ఎండిపోయిన తరువాత 'అ'స్ఫుగా మారిపోతాయి. దానిని పశువులు తింటాయి.

[6] 'సల్-'సాలిన్: అంటే ఎండిన మట్టి. ఫ'ఖ్ఖారున్: అంటే మంటలో కాలిన మట్టి. ఇంకా చూడండి, 15:26.

[7] చూడండి, 15:27, 6:100 మరియు 37:158.

17. ఆయనే రెండు తూర్పు (దిక్కు)లకు మరియు రెండు పడమర (దిక్కు)లకు ప్రభువు[8].

18. అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?

19. ఆయనే రెండు సముద్రాలను కలుసుకోవటానికి వదలిపెట్టాడు.

20. ఆ రెండింటి మధ్య, అవి అతిక్రమించలేని అడ్డు తెర వుంది[9].

21. అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?

22. ఆ రెండింటి నుండి ముత్యాలు మరియు పగడాలు వస్తాయి.

23. అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?

24. మరియు ఎత్తైన కొండల వలే సముద్రంలో

---

[8] చూడండి, 37:5 మరియు 70:40.

[9] ఈ విషయం ఎన్నో విధాలుగా బోధించబడింది: 1) భూమిపై మంచి నీళ్ళ నదులు, చెరువులు సరస్సులు మొదలైనవి మరియు ఉప్పునీటి సముద్రాలు, అన్నీ భూమి మీదనే ఉన్నా, వాటి రుచులు వేరువేరుగా ఉన్నాయి. 2) ఉప్పునీటి సముద్రాలలో మంచినీటి ప్రవాహాలు ప్రవహిస్తూ ఉంటాయి. కాని అవి కలిసిపోవు. వాటి రుచి, భిన్నంగానే ఉంటుంది. 3) మరికొన్ని చోట్లలో నదుల నీరు సముద్రంలో పోయి కలుస్తుంది. చాలా దూరం వరకు ఒకవైపు సముద్రపు నీళ్ళు ఉప్పగానూ మరొక వైపు నది నీళ్ళు తియ్యగాను ఉంటాయి. ఇంకా చూడండి, 25:53.

పయనించే ఓడలు ఆయనకు చెందినవే![10]

25. అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?

26. దానిపై (భూమిపై) నున్నది ప్రతిదీ నశిస్తుంది.

27. మరియు మిగిలివుండేది, కేవలం మహిమాన్వితుడు[11] మరియు పరమదాత[12] అయిన నీ ప్రభువు ముఖం (ఉనికి) మాత్రమే![13]

28. అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?

29. భూమిలో మరియు ఆకాశాలలో నున్న ప్రతిదీ (తన జీవనోపాధి కొరకు) ఆయననే యాచిస్తుంది. మరియు ప్రతి క్షణం (రోజు) ఆయన ఒక కార్యంలో నిమగ్నుడై ఉంటాడు.

30. అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?

---

[10] చూడండి, 42:32-34.

[11] జు'ల్-జలాల్: Majesty, Possessor of Glory, Greatness మహిమాన్వితుడు, ఘనత, వైభవం, విఖ్యాతి, ప్రతాపం గలవాడు, సార్వభౌముడు.

[12] అల్-ఇక్రామ్: Most Generous, Bountenous, Noble, Honourable పరమదాత, దాతృత్వుడు, ఆదరణీయుడు, మహోపకారి, ఉదారుడు, దివ్యుడు, చూడండి, 55:78. జల్-జలాలి వల్-ఇక్రామ్: మహిమాన్వితుడు మరియు పరమదాత Lord of Majesty and Generosity ఇవి అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లు.

[13] చూడండి, 28:88.

31. భారాలను మోసే మీరిద్దరు![14] త్వరలోనే మేము మీ విషయం నిర్ణయించగలము.
32. అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?
33. ఓ జిన్నాతుల మరియు మానవ జాతి వారలారా! ఒకవేళ మీరు ఆకాశాల మరియు భూమి యొక్క సరిహద్దుల నుండి బయటికి వెళ్ళి పోగలిగితే, వెళ్ళిపోండి! ఆయన (అల్లాహ్) యొక్క సెలవు లేనిదే మీరు వాటి నుండి వెళ్ళి పోలేరు[15].
34. అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?
35. మీ ఇద్దరి పైకి అగ్నిజ్వాలలు మరియు పొగ[16] పంపబడతాయి.
అప్పుడు మీరు ఎదుర్కోలేరు (మిమ్మల్ని మీరు కాపాడుకోలేరు).
36. అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?
37. మరియు ఆకాశం ప్రేలిపోయినప్పుడు అది మండే

---

[14] అస్-స'ఖలాన్: దీని మరొక తాత్పర్యం: 'భూమికి భారమైన మీరిద్దరు!' అని ఇవ్వబడింది. ఈ పదం జిన్నాతులు మరియు మానవుల కోసం వాడబడింది.
[15] అల్లాహ్ (సు.తా.) యొక్క విధివ్రాత నుండి పారిపోగల శక్తి ఎవ్వరికీ లేదు. ఎక్కడికి పారిపోగలరు? అల్లాహ్ (సు.తా.) హద్దులలో లేని చోటు అనేదే లేదు!
[16] ను'హాసున్: దీని మరొక అర్థం కరిగిన రాగి లేక ఇత్తడి.

నూనెగా ఎర్రగా మారిపోతుంది[17].

**38.** అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?

**39.** ఇక, ఆ రోజు ఏ మానవునితో గానీ, లేక ఏ జిన్నాతునితో గానీ అతని పాపాలను గురించి అడగడం జరుగదు[18].

**40.** అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?

**41.** ఈ నేరస్తులు వారి వారి ముఖ చిహ్నాలతోనే గుర్తింపబడతారు. అప్పుడు వారు, వారి ముంగురులు మరియు కాళ్ళు పట్టి లాగబడతారు[19].

**42.** అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?

**43.** ఈ నేరస్తులు అసత్యమని తిరస్కరిస్తూ వుండిన నరకం ఇదే!

**44.** వారి దానిలో(ఆనరకంలో)మరియు సలసలకాగే నీటి మధ్య అటూఇటూ తిరుగుతూ ఉంటారు

**45.** అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?

**46.** మరియు ఎవడైతే తన ప్రభువు సన్నిధిలో హాజరు

---

[17] అద్దిహాను: దీని మరొక అర్థం ఎర్రని చర్మం (పచ్చిది లేదా శుభ్రం చేసింది).

[18] చూడండి, 18:49. వారి నాలుకలు, చేతులు మరియు కాళ్ళు వారికి వ్యతిరేకంగా సాక్ష్యమిస్తాయి. ఇంకా చూడండి, 24:24.

[19] చూడండి, 96:15-16.

కావలసి ఉంటుందనే భయం కలిగి ఉంటాడో, అతనికి రెండు స్వర్గవనాలుంటాయి.

**47.** అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?

**48.** అవి రెండూ అనేక శాఖల (వృక్షాల)తో నిండి ఉంటాయి[20].

**49.** అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?

**50.** ఆ రెండింటిలో రెండు సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి[21].

**51.** అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?

**52.** ఆ రెండింటిలో ప్రతి ఫలం జోడుగా (రెండు రకాలుగా) ఉంటుంది.

**53.** అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?

**54.** వారు జరీ పని అస్తరుగల పట్టు తివాచీల మీద ఆనుకొని కూర్చొని ఉంటారు. మరియు ఆ రెండు స్వర్గవనాల ఫలాలు దగ్గరగా అందుబాటులో ఉంటాయి[22].

**55.** అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే

---

[20] చూడండి, 32:17. స్వర్గంలో ఉన్న భోగభాగ్యాలు ఎవ్వరూ ఊహించలేరు.

[21] ఒక సెలయేరు పేరు తస్ నీమ్, మరొక దాని పేరు సల్ సబీల్.

[22] చూడండి, 18:31.

అనుగ్రహాలను నిరాకరిస్తారు?
56. అందులో తమ దృష్టి ఎల్లప్పుడూ క్రిందికి వంచి ఉంచే నిర్మల కన్యలుంటారు. వారిని ఇంతకు పూర్వం ఏ మానవుడు గానీ, ఏ జిన్నాతు గానీ తాకి ఉండడు[23].
57. అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?
58. వారు కెంపులను (మాణిక్యాలను) మరియు పగడాలను పోలి ఉంటారు.
59. అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?
60. సత్కార్యానికి మంచి ప్రతిఫలం తప్ప మరేమైనా ఉంటుందా?
61. అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?
62. మరియు ఆ రెండే కాక ఇంకా రెండు స్వర్గవనాలుంటాయి.
63. అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?
64. అవి దట్టంగా ముదరు పచ్చగా ఉంటాయి.
65. అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?
66. ఆ రెండు తోటలలో పొంగి ప్రవహించే రెండు చెలమలుంటాయి.
67. అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే

[23] చూడండి, 56:35-36, 38:52.

అనుగ్రహాలను నిరాకరిస్తారు?

68. ఆ రెండింటిలో ఫలాలు, ఖర్జూరాలు మరియు దానిమ్మలు ఉంటాయి.

69. అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?

70. వాటిలో గుణవంతులు, సౌందర్యవతులైన స్త్రీలు ఉంటారు.

71. అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?

72. నిర్మలమైన, శీలవంతులైన స్త్రీలు (హూర్) డేరాలలో ఉంటారు[24].

73. అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?

74. ఆ స్త్రీలను ఇంతకు ముందు ఏ మానవుడు కాని, ఏ జిన్నాతు కాని తాకి ఉండడు.

75. అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?

76. వారు అందమైన తివాచీల మీద ఆకుపచ్చని దిండ్లకు ఆనుకొని కూర్చొని ఉంటారు.

77. అయితే మీరిరువురు మీ ప్రభువు యొక్క ఏ యే

---

[24] చూడండి, 55:56, 52:20, 44:54, 38:52 మరియు 37:48.

అనుగ్రహాలను నిరాకరిస్తారు?[25]

**78.** మహిమాన్వితుడు మరియు పరమదాత[26] అయిన నీ ప్రభువు పేరే సర్వశ్రేష్ఠమైనది[27].

---

[25] ఈ ఆయత్ ఈ సూరహ్ లో 31 సార్లు వచ్చింది. అల్లాహ్ (సు.తా.) ఈ సూరహ్ లో స్వర్గంలో ప్రసాదించబడే అన్ని రకాల సౌకర్యాలను, భోగభాగ్యాలను వివరించిన తరువాత ఈ ప్రశ్న వేశాడు. అంతే కాక నరకశిక్ష తరువాత కూడా ఈ ప్రశ్న వేశాడు. అంటే మీరు దాని నుండి ఎందుకు తప్పించు కోవటానికి ప్రయత్నించరు? అని అర్థం. రెండవది: ఏమిటంటే, జిన్నాతులు కూడా మానవుల వలే బుద్ధి మరియు మంచి చెడును అర్థం చేసుకునే విచక్షణాశక్తి కలిగి ఉన్నారు. కావున వారు కూడా ఏక దైవారాధన చేయటానికి ఆజ్ఞాపించబడ్డారు. సర్వసృష్టిలో కేవలం ఈ రెండురకాల జీవులు మాత్రమే - బుద్ధి మరియు విచక్షణాశక్తి ప్రసాదించబడటం వల్ల - పరీక్షకు గురిచేయబడ్డారు. అందులో నెగ్గిన వారికి స్వర్గం మరియు నెగ్గని వారికి నరకం. మూడవది: అల్లాహ్ (సు.తా.) ప్రసాదించిన సుఖసంతోషాలను అనుభవించటం ముస్త'హాబ్. ఈ ఆయత్ మళ్ళీ మళ్ళీ చెప్పే నాలుగవ ఉద్దేశ్యం: అల్లాహ్ కు అవిధేయులై ఉండటం నుండి ఆపటం. ఎందుకంటే ఆయనే (సు.తా.) ఈ అనుగ్రహాలన్నింటినీ ప్రసాదించాడు. కావున దైవప్రవక్త ('స'అస) దీనికి జవాబుగా అన్నారు: 'ఓ మా ప్రభూ! మేము నీ యొక్క ఏ అనుగ్రహాన్ని కూడా నిరాకరించడం లేదు, సర్వస్తోత్రాలకు అర్హుడవు నీవే!' (తిర్మిజీ' - అల్బానీ ప్రమాణీకం).

[26] చూడండి, 55:27 వ్యాఖ్యానం 2.

[27] తబారక, బరకతున్: అంటే ఎల్లప్పుడు శాశ్వతంగా ఉండే మేలు. ఆయన దగ్గర ఎల్లప్పుడు మేలే ఉంది. కొందరు దీని అర్థం, ఎంతో శుభదాయకమైనది, సర్వశ్రేష్ఠమైనది అని అన్నారు. ఆయన పేరే ఇంత శ్రేష్ఠమైనదైతే ఆయన స్వయంగా ఎంత గొప్పవాడు, మహిమగలవాడు మరియు శుభాలను ప్రసాదించేవాడు కాగలడు!

# 56. అల్-వాఖియహ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఆ అనివార్య సంఘటన సంభవించినపుడు[1],
2. అది సంభవించటంలో ఎలాంటి సందేహం (అసత్యం) లేదు.
3. అది కొందరిని హీనపరుస్తుంది, మరికొందరిని పైకెత్తుతుంది[2].
4. భూమి తీవ్ర కంపనంతో కంపించినపుడు;
5. మరియు పర్వతాలు పొడిగా మార్చబడినపుడు;
6. అప్పుడు వాటి దుమ్ము నలుపైపులా నిండి పోయినపుడు;
7. మరియు మీరు మూడు వర్గాలుగా విభజింపబడతారు.
8. ఇక కుడిపక్షం వారు, ఆ కుడిపక్షము వారు ఎంత (అదృష్టవంతులు)![3]
9. మరికొందరు వామపక్షం వారుంటారు, ఆ

---

[*] [అల్-వాఖియహ్ అంటే జరగబోయే సంఘటన]

[1] అనివార్య సంఘటన అంటే, అంతిమ ఘడియ, పునరుత్థాన దినం.

[2] అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞలను అనుసరించిన వారు పైకెత్తబడతారు. వాటిని తిరస్కరించిన వారు హీన పరచబడతారు.

[3] కుడిపక్షం వారంటే తమ కర్మపత్రాలు కుడిచేతిలో ఇవ్వబడేవారు. అంటే స్వర్గానికి అర్హులైనవారు. చూడండి, 74:39.

వామపక్షపు వారు ఎంత (దౌర్భాగ్యులు)![4]

10. మరియు(ఇహలోకంలో విశ్వాసంలో) ముందు న్నవారు(స్వర్గంలోకూడాముందుంటారు

11. అలాంటి వారు (అల్లాహ్) సాన్నిధ్యాన్ని పొందుతారు.

12. వారు సర్వసుఖాలు గల స్వర్గవనాలలో ఉంటారు.

13. మొదటి తరాల వారిలో నుండి చాలా మంది;

14. మరియు తరువాత తరాల వారిలో నుండి కొంతమంది.

15. (బంగారు) జలతారు అల్లిన ఆసనాల మీద;

16. ఒకరికొకరు ఎదురెదురుగా, వాటి మీద దిండ్లకు ఆనుకొని కూర్చొని ఉంటారు[5].

17. వారి చుట్టుప్రక్కలలో చిరంజీవులైన(నిత్యబాల్యం గల) బాలురు(సేవకులు) తిరుగుతూ ఉంటారు

18. (మధువు) ప్రవహించే చెలమల నుండి నింపిన పాత్రలు, గిన్నెలు మరియు కప్పులతో!

19. దాని వలన వారికి తలనొప్పి గానీ లేక మత్తు గానీ కలుగదు.

20. మరియు వారు కోరే పండ్లు, ఫలాలు ఉంటాయి.

---

[4] వారు (ఎడమ) పక్షంవారు అంటే తమ కర్మపత్రాలు ఎడమ చేతిలో ఇవ్వబడినవారు. అంటే నరకానికి అర్హులైన వారు. చూడండి, 90:19.

[5] చూడండి, 15:47.

21. మరియు వారు ఇష్టపడే పక్షుల మాంసం[6].
22. మరియు అందమైన కన్నులు గల సుందరాంగులు (హూరున్);
23. దాచబడిన ముత్యాల వలే!
24. ఇదంతా వారు చేస్తూ ఉండిన వాటికి (సత్కార్యాలకు) ప్రతిఫలంగా!
25. అందులో వారు వ్యర్థమైన మాటలు గానీ, పాప విషయాలు గానీ వినరు[7].
26. "శాంతి (సలాం) శాంతి (సలాం)!" అనే మాటలు తప్ప![8]
27. మరియు కుడి పక్షం వారు, ఆ కుడి పక్షం వారు ఎంత (అదృష్టవంతులు)!
28. వారు ముళ్ళు లేని సిదర్ వృక్షాల మధ్య ![9]
29. మరియు పండ్ల గెలలతో నిండిన అరటి చెట్లు;
30. మరియు వ్యాపించి ఉన్న నీడలు[10],
31. మరియు ఎల్లప్పుడు ప్రవహించే నీరు;

---

[6] 'నేను నా సద్వర్తనులైన దాసుల కొరకు సిద్ధ పరచి ఉంచిన దాన్ని ఇంతవరకూ ఏ కన్నూ చూడలేదు, ఏ చెవీ వినలేదు ఏ మానవ హృదయము (మనస్సు) కూడా ఊహించలేదు.' (బు'ఖారీ, ముస్లిం, తిర్మిజీ - అబూ హురైరహ్ కథనం, ఇంకా చూడండి, 32:17).

[7] ప్రాపంచిక జీవితంలో పోట్లాటలు, ఏవగింపులు, అసహ్యాలు స్వంత అన్నదమ్ముల మధ్య కూడా తప్పవు. కాని స్వర్గవాసుల మధ్య ఇటువంటి వ్యర్థపు మాటలు ఎన్నడూ జరుగవు.

[8] చూడండి, 19:62.

[9] చూడండి, 53:14.

[10] చూడండి, 4:57.

32. మరియు సమృద్ధిగా ఉన్న పండ్లు, ఫలాలు;
33. ఎడతెగకుండా మరియు అంతం కాకుండా (ఉండే వనాలలో);
34. మరియు ఎత్తైన ఆసనాల మీద (కూర్చొని) ఉంటారు[11].
35. నిశ్చయంగా, మేము వారిని ప్రత్యేక సృష్టిగా సృష్టించాము;
36. మరియు వారిని (నిర్మలమైన) కన్యలుగా చేశాము[12];
37. వారు ప్రేమించేవారు గానూ, సమ వయస్సుగల వారు గానూ (ఉంటారు)[13];
38. కుడిపక్షం వారి కొరకు.
39. అందులో చాలా మంది మొదటి తరాలకు చెందిన వారుంటారు;
40. మరియు తరువాత తరాల వారిలో నుండి చాలా మంది ఉంటారు.
41. ఇక వామ(ఎడమ) పక్షం వారు; ఆ వామపక్షం వారు ఎంత (దౌర్భాగ్యులు)?
42. వారు దహించే నరకాగ్నిలో మరియు సలసలకాగే

---

[11] కొందరు వ్యాఖ్యాతలు: 'ఫురుషిన్' - శబ్దానికి, భార్యలు అని అర్థమిచ్చారు. మరియు 'మర్ ఫూ'అతిన్' అంటే మంచి, పెద్ద స్థానాలు గలవారు అని.

[12] సద్వర్తనులైన స్త్రీలు చనిపోయినప్పుడు ఎంత వృద్ధులుగా ఉన్నా, పునరుత్థాన దినమున యవ్వన కన్యలుగా లేపబడతారు. వారు నిత్యం యవ్వన స్థితిలోనే ఉంటారు.

[13] చూడండి, 38:52 మరియు 78:33.

నీటిలో;

43. మరియు నల్లటి పొగఛాయలో (ఉంటారు).

44. అది చల్లగానూ ఉండదు మరియు ఓదార్చేదిగానూ ఉండదు;

45. నిశ్చయంగా, వారు ఇంతకు ముందు చాలా భోగభాగ్యాలలో పడి ఉండిరి;

46. మరియు వారి మూర్ఖపు పట్టుతో ఘోరమైన పాపాలలో పడి ఉండిరి;

47. మరియు వారు ఇలా అనేవారు: "ఏమీ? మేము మరణించి,
మట్టిగా మరియు ఎముకలుగా మారిపోయిన తరువాత కూడా మరల బ్రతికించి లేపబడతామా?

48. మరియు పూర్వీకులైన మా తాతముత్తాతలు కూడానా?

49. వారితో ఇలా అను: "నిశ్చయంగా, పూర్వీకులు మరియు తరువాత వారు కూడానూ!

50. వారందరూ ఆ నిర్ణీత రోజు, ఆ సమయమున సమావేశ పరచబడతారు.

51. ఇక నిశ్చయంగా, మార్గభ్రష్టులైన ఓ అసత్యవాదులారా!

52. మీరు జఖ్ఖూమ్ చెట్టు (ఫలాల) ను తింటారు[14].

53. దానితో కడుపులు నింపుకుంటారు.

54. తరువాత, దాని మీద సలసల కాగే నీరు త్రాగుతారు.

---

[14] చూడండి, 38:52 మరియు 78:33 .

55. వాస్తవానికి మీరు దానిని దప్పిక గొన్న ఒంటెల వలే త్రాగుతారు.
56. తీర్పుదినం నాడు (ఈ వామపక్షం వారికి లభించే) ఆతిథ్యం ఇదే!
57. మిమ్మల్ని మేమే సృష్టించాము; అయితే మీరెందుకు ఇది సత్యమని నమ్మరు?
58. ఏమీ? మీరెప్పుడైనా, మీరు విసర్జించే వీర్యబిందువును గమనించారా?
59. ఏమీ? మీరా, దానిని సృష్టించేవారు? లేక మేమా దాని సృష్టికర్తలము?
60. మేమే మీకోసం మరణం నిర్ణయించాము మరియు మమ్మల్ని అధిగమించేది ఏదీ లేదు;
61. 61.మీ రూపాలను మార్చివేసి మీరు ఎరుగని(ఇతరరూపంలో) మిమ్మల్ని సృష్టించటం నుండి
62. మరియు వాస్తవానికి మీ మొదటి సృష్టిని గురించి మీరు తెలుసుకున్నారు; అయితే మీరెందుకు గుణపాఠం నేర్చుకోరు?
63. మీరు నాటే, విత్తనాలను గురించి, మీరెప్పుడైనా ఆలోచించారా?
64. మీరా వాటిని పండించేది? లేక మేమా వాటిని పండించే వారము?
65. మేము తలచుకుంటే, దానిని పొట్టుగా మార్చివేయగలము. అప్పుడు మీరు ఆశ్చర్యంలో పడి పోతారు."

66. (మీరు అనేవారు): "నిశ్చయంగా, మేము పాడై
పోయాము!
67. కాదు, కాదు, మేము దరిద్రుల మయ్యాము! అని.
68. ఏమీ? మీరెప్పుడైనా మీరు త్రాగే నీటిని గురించి
ఆలోచించారా?
69. మీరా దానిని మేఘాల నుండి కురిపించే వారు?
లేక మేమా దానిని కురిపించే వారము?
70. మేము తలచుకుంటే దానిని ఎంతో ఉప్పుగా
ఉండేలా చేసేవారము! అయినా మీరెందుకు
కృతజ్ఞతలు చూపరు?
71. మీరు రాజేసే అగ్నిని గమనించారా?
72. దాని వృక్షాన్ని పుట్టించినవారు మీరా? లేక
దానిని ఉత్పత్తి చేసినది మేమా?[15]
73. మేము దానిని (నరకాగ్నిని), గుర్తు చేసేదిగా
మరియు ప్రయాణీకులకు (అవసరం గలవారికి)
ప్రయోజనకారిగా చేశాము[16].
74. కావున సర్వోత్తముడైన నీ ప్రభువు నామాన్ని
స్తుతించు.
75. ఇక నేను నక్షత్రాల స్థానాల (కక్ష్యల) సాక్షిగా
చెబుతున్నాను.
76. మరియు నిశ్చయంగా, మీరు గమనించగలిగితే,

---

[15] అంటే అన్ని రకాల ఇంధనం, బొగ్గు, పెట్రోలు, మొదలైనవి చెట్ల నుంచే వస్తాయని.

[16] 'హదీస్'లో మూడు వస్తువుల నుండి ఎవ్వరినీ ఆపకూడదని ఉంది: అవి నీరు, ఆహారం మరియు అగ్ని, (అబూ-దావూద్, సునన్ ఇబ్నె-మాజా - ఇబ్నె-కసీ'ర్ వ్యాఖ్యానం).

ఈ శపథం ఎంతో గొప్పది!

77. నిశ్చయంగా, ఈ ఖుర్ఆన్ దివ్యమైనది.

78. సురక్షితమైన[17] గ్రంథంలో ఉన్నది.

79. దానిని[18] పరిశుద్ధులు తప్ప మరెవ్వరూ తాకలేరు.

80. ఇది సర్వలోకాల ప్రభువు తరఫు నుండి అవతరింప జేయబడింది.

81. ఏమీ? మీరు ఈ సందేశాన్ని[19] తేలికగా తీసుకుంటున్నారా?

82. మరియు (అల్లాహ్) మీకు ప్రసాదిస్తున్న జీవనోపాధికి (కృతజ్ఞతలు) చూపక, వాస్తవానికి ఆయనను మీరు తిరస్కరిస్తున్నారా?[20]

83. అయితే (చనిపోయేవాడి) ప్రాణం గొంతులోనికి వచ్చినపుడు, మీరెందుకు (ఆపలేరు)?

84. మరియు అప్పుడు మీరు (ఏమీ చేయలేక) చూస్తూ ఉండిపోతారు.

---

[17] అంటే లౌ'హె మ'హ్ ఫూ"జ్ లో

[18] దానిని అంటే లౌ'హె మ'హ్ ఫూ"జ్ మరియు పరిశుద్ధులు అంటే దైవదూత, అని కొందరి అభిప్రాయం. మరికొందరు దానిని - అంటే - ఖుర్ఆన్, అని అంటారు. దానిని ఆకాశం నుండి అవతరింపజేస్తున్న వారు కేవలం దైవదూతలే! సత్యతిరస్కారులు అపోహలు లేపినట్లు, షైతానులు కాదు. ఎందుకంటే వారు దానిని తాకలేరు. చూడండి, 85:21-22.

[19] సందేశమంటే ఇక్కడ ఖుర్ఆన్ అని హదీస్ లో పేర్కొనబడింది.

[20] పైది ఇబ్నె-కసీ'ర్ తాత్పర్యం. ము'హమ్మద్ జునాగఢీ గారి తాత్పర్యం ఈ విధంగా ఉంది: 'మరియు మీరు తిరస్కరిస్తూఉండటమే మీ జీవనోపాధిగా చేసుకుంటున్నారా?'

85. మరియు అప్పుడు మేము అతనికి మీ కంటే చాలా దగ్గరలో ఉంటాము, కాని మీరు చూడ లేక పోతారు[21].

86. ఒకవేళ మీరు ఎవరి అదుపాజ్ఞలో (ఆధీనంలో) లేరనుకుంటే;

87. మీరు సత్యవంతులే అయితే దానిని (ఆ ప్రాణాన్ని) ఎందుకు తిరిగి రప్పించుకోలేరు?

88. కాని అతడు (మరణించేవాడు), (అల్లాహ్) సాన్నిధ్యాన్ని పొందినవాడైతే![22]

89. అతని కొరకు సుఖసంతోషాలు మరియు తృప్తి మరియు పరమానందకరమైన స్వర్గవనం ఉంటాయి.

90. మరియు ఎవడైతే కుడిపక్షం వారికి చెందినవాడో![23]

91. అతనితో: "నీకు శాంతి కలుగుగాక (సలాం)! నీవు కుడిపక్షం వారిలో చేరావు." (అని అనబడుతుంది).

92. మరియు ఎవడైతే, అసత్యవాదులు, మార్గభ్రష్టులైన వారిలో చేరుతాడో![24]

93. అతని ఆతిథ్యానికి సలసల కాగే నీరు ఉంటుంది.

---

[21] ఇక్కడ కొందరు అల్లాహ్ (సు.తా.) తన జ్ఞానంతో మీ దగ్గరలో ఉన్నాడనీ, మరికొందరు ఇక్కడ దాని భావం ప్రాణం తీసే దైవదూతలనీ వ్యాఖ్యానించారు.

[22] సూరహ్ మొదట్లో పేర్కొన్న మూడు రకాల వారిలో వీరు మొదటి రకానికి చెందినవారు.

[23] వీరు రెండవ రకానికి చెందినవారు.

[24] వీరు మూడవ రకానికి చెందినవారు వీరు అస్'హాబ్ మష్అమ అని ఈ సూరహ్ మొదట్లో పేర్కొనబడ్డారు

94. మరియు భగభగమండే నరకాగ్ని ఉంటుంది.
95. నిశ్చయంగా, ఇది రూఢీ అయిన నమ్మదగిన
96. కావున సర్వత్తముడైన నీ ప్రభువు పేరును స్తుతించు[25].

[25] 'హదీస్' లో వచ్చింది: రెండు పదాలు అల్లాహ్ (సు.తా.) కు ఎంతో ప్రియమైనవి. ఉచ్చరించటానికి సులభమైనవి మరియు ప్రతిఫలం రీత్యా బరువైనవి. "సుబ్ హా'నల్లాహి వబి'హమ్ దిహీ, సుబ్ హా'నల్లాహిల్ 'అ"జీమ్!" ('స'హీ'హ్ బు'ఖారీ, 'స'హీ'హ్ ముస్లిం).

# 57. అల్-హదీద్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఆకాశాలలోను మరియు భూమిలోను ఉన్న సమస్తం అల్లాహ్ పవిత్రతను కొనియాడు తుంటాయి[1]. మరియు ఆయనే సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు.
2. ఆకాశాలపై మరియు భూమిపై సామ్రాజ్యాధిపత్యం ఆయనదే. ఆయనే జీవనమిచ్చేవాడు మరియు మరణమిచ్చేవాడు. మరియు ఆయనే ప్రతిదీ చేయగల సమర్థుడు.
3. ఆయనే ప్రథమం మరియు ఆయనే అంతం[2] మరియు ఆయనే ప్రత్యక్షుడు మరియు ఆయనే

---

[*] [అల్-హదీద్ అంటే ఇనుము]

[1] చూడండి, 17:44, 21:79.

[2] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'కాలం, అనేది మానవుని జ్ఞానపరిధికి మించినది, కాని దానిని అల్లాహ్ (సు.తా.) సృష్టించాడు.'

పరోక్షుడు[3]. మరియు ఆయనే ప్రతిదాని గురించి జ్ఞానం గలవాడు.

4. ఆయనే ఆకాశాలను మరియు భూమిని ఆరు దినములలో (అయ్యామ్ లలో) సృష్టించిన వాడు, తరువాత ఆయన సింహాసనాన్ని (అర్ష్ ను) అధిష్టించాడు[4]. భూమిలోకి పోయేది మరియు దాని నుండి బయటికి వచ్చేది మరియు ఆకాశం నుండి దిగేది మరియు దానిలోకి ఎక్కేది అంతా ఆయనకు తెలుసు[5]. మరియు మీరెక్కడున్నా ఆయన మీతో పాటు ఉంటాడు మరియు అల్లాహ్ మీరు చేసేదంతా చూస్తున్నాడు.

---

[3] ప్రతి వస్తువు చివరకు అల్లాహ్ (సు.తా.) వద్దకు మాత్రమే చేరుతుంది. ఎందుకంటే ఆయన (సు.తా.) ప్రతిదానికి మూలం. ఆయన ప్రతిదానికి - మరే ఇతర దానికంటే - తన జ్ఞానపరంగా సమీపంలో ఉన్నాడు. అల్-అవ్వలు: The First, ప్రథముడు, మొట్ట మొదటవాడు, ఆద్యుడు, సర్వసృష్టిరాసుల సృష్టికి పూర్వమే ఉన్నవాడు. అల్-ఆఖరు: The Last, The End. అంతం, కడపటి, చివరికి మిగిలే వాడు, సర్వసృష్టిరాసుల వినాశం తరువాత కూడా ఉండేవాడు. అజ్-'జాహిరు: The Ascendant or Predominant, over all things, The Outward. ప్రత్యకుడు, గోచరుడు, బాహ్యం. అల్-బాతిను: He who knows the secret and hidden things. He who is veiled from the eyes and imaginations of created beings. పరోక్షకుడు, అగోచరుడు, దృష్టికి గోచరించని, గోప్యమైన, మరగైనవాడు. ఇవి అల్లాహ్ (సు. తా.) అత్యుత్తమ పేర్లు.

[4] చూడండి, 7:54, 10:3, 32:4 మొదలైన వాటిలో ఈ వాక్యం ఉంది.

[5] చూడండి, 34:2.

5. ఆకాశాలపై మరియు భూమిపై సామ్రాజ్యాధిపత్యం ఆయనదే మరియు అన్ని వ్యవహారాలు (నిర్ణయానికై) అల్లాహ్ వైపునకే తీసుకుపోబడతాయి.

6. ఆయనే రాత్రిని పగటిలోకి ప్రవేశింపజేస్తాడు[6] మరియు పగటిని రాత్రిలోకి ప్రవేశింప జేస్తాడు. మరియు ఆయనకు హృదయాలలో ఉన్న విషయాలన్నీ బాగా తెలుసు.

7. అల్లాహ్ ను మరియు ఆయన ప్రవక్తను విశ్వసించండి, ఆయన మిమ్మల్ని ఉత్తరాధికారులుగా చేసిన వాటి నుండి (దానంగా) ఖర్చు పెట్టండి[7]. మీలో ఎవరైతే విశ్వసించి తమ ధనాన్ని (దానముగా) ఖర్చు చేస్తారో, వారికి గొప్ప ప్రతిఫలం ఉంటుంది.

8. మరియు మీకేమయింది? మీరు (వాస్తవానికి) విశ్వాసులే అయితే? మీరెందుకు అల్లాహ్ ను విశ్వసించరు? మరియు ప్రవక్త, మిమ్మల్ని మీ ప్రభువును విశ్వసించండని పిలుస్తున్నాడు మరియు వాస్తవానికి మీచేత ప్రమాణం కూడా

---

[6] అంటే కొన్ని దినాలు రాత్రి పెద్దది పగలు చిన్నదిగా ఉంటాయి, మరికొన్ని దినాలు పగలు పెద్దది మరియు రాత్రి చిన్నదిగా ఉంటాయి.

[7] మానవుడు: 'నా సొమ్ము, నా సొమ్ము' అంటాడు. వాస్తవానికి, 1) నీవు తిని త్రాగి ఖర్చు చేసింది, 2) నీవు తొడిగి చించింది మరియు 3) నీవు అల్లాహ్ (సు.తా.) మార్గంలో ఖర్చు చేసింది మాత్రమే నీ సొమ్ము. వీటిని విడిచి మిగతాదంతా ఇతరులదే. (సహీహ్ ముస్లిం; ముస్నద్ అహ్మద్, 4/24)

చేయించు కున్నాడు[8].

9. తన దాసుని (ముహమ్మద్)పై స్పష్టమైన ఆయాత్ (సూచనలు) అవతరింప జేసేవాడు ఆయనే! అతను వాటి ద్వారా మిమ్మల్ని అంధకారం నుండి వెలుతురులోకి తీసుకు రావటానికి. మరియు నిశ్చయంగా, అల్లాహ్ మిమ్మల్ని ఎంతో కనికరించేవాడు, అపార కరుణా ప్రదాత.

10. మరియు మీకేమయింది? మీరెందుకు అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టడం లేదు? ఆకాశాలు మరియు భూమి యొక్క వారసత్వం అల్లాహ్ కే చెందుతుంది[9]. (మక్కా) విజయానికి ముందు (అల్లాహ్ మార్గంలో) ఖర్చు పెట్టిన వారితో మరియు పోరాడిన వారితో, (మక్కా విజయం తరువాత పోరాడిన వారు మరియు ఖర్చుపెట్టినవారు) సమానులు కాజాలరు! అలాంటి వారి స్థానం (విజయం తరువాత అల్లాహ్ మార్గంలో) ఖర్చు పెట్టిన మరియు పోరాడిన వారి కంటే గొప్పది. కాని వారందరికీ అల్లాహ్ ఉత్తమమైన (ప్రతిఫలం)

---

[8] చూడండి, 7:172 అల్లాహ్ (సు.తా.) తన దాసుల చేత ఈ ప్రమాణం చేయించాడు.

[9] చూడండి, 15:23.

వాగ్దానం చేశాడు[10]. మరియు మీరు చేసేదంతా అల్లాహ్ బాగా ఎరుగును.

11. అల్లాహ్ కు ఉత్తమమైన అప్పు ఇచ్చేవాడు ఎవడు? ఆయన దానిని ఎన్నో రెట్లు హెచ్చించి తిరిగి అతనికి ఇస్తాడు[11] మరియు అతనికి శ్రేష్ఠమైన ప్రతిఫలం (స్వర్గం) ఉంటుంది.

12. ఆ దినమున నీవు విశ్వాసులైన పురుషులను మరియు విశ్వాసులైన స్త్రీలను చూస్తే, వారి వెలుగు, వారి ముందు నుండి మరియు వారి కుడి వైపు నుండి పరిగెత్తుతూ ఉంటుంది[12].

---

[10] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: "మీరు నా అనుచరు (ర'ది.'అన్హుమ్)లను ఎవ్వరినీ నిందించకండి. ఎవరిచేతిలో నా ప్రాణముందో ఆయన (సు.తా.) ప్రమాణం - మీలో ఎవడైనా ఉహుద్ పర్వతమంత బంగారాన్ని అల్లాహ్ (సు.తా.) మార్గంలో ఖర్చు చేసినా, అది నా సహచరుడు ('స'హాబి) ఖర్చు చేసిన ఒక్క 'ముద్' లేక సగం 'ముద్'తో సమానం కాజాలదు." ('స'హీ'హ్ బు'ఖారీ, 'స'హీ'హ్ ముస్లిం).

[11] ఇటువంటి వాక్యం కోసం చూడండి, 2:245 అల్లాహ్ (సు.తా.) కు మంచి అప్పు ఇవ్వడం అంటే అల్లాహ్ (సు.తా.) మార్గంలో ఖర్చు చేయటం లేక దానం చేయటం. మానవుడు అల్లాహ్ (సు.తా.) మార్గంలో ఖర్చు చేసేది, అతనికి అల్లాహ్ (సు.తా.) అనుగ్రహించి ప్రసాదించినవే! అయినా అల్లాహ్ (సు.తా.) దానిని అప్పుగా పేర్కొనటం కేవలం ఆయన అనుగ్రహం మరియు కనికరం. అల్లాహ్ (సు.తా.) దానికి అదే విధంగా ప్రతిఫలమొసంగుతాడు, ఏ విధంగానైతే అప్పు తీర్చడం విధిగా చేయబడిందో!

[12] ఈ విషయం పుల్ సిరాత్ పై జరుగుతుంది. ఈ జ్యోతి వారి సత్కార్యాల ఫలితం. దానివల్ల వారు సులభంగా స్వర్గపు త్రోవను ముగించుకుంటారు. ఇబ్నె-కసీ'ర్ లో మరియు ఇబ్నె-జరీర్ లో 'వ బి అయ్ మానిహిమ్' ను ఇలా బోధించారు: 'వారి కుడిచేతులలో వారి కర్మ పత్రాలుంటాయి.'

(వారితో ఇలా అనబడుతుంది): "ఈ రోజు మీకు క్రింద సెలయేర్లు ప్రవహించే స్వర్గవనాల శుభవార్త ఇవ్వబడుతోంది మీరందులో శాశ్వతంగా ఉంటారు! ఇదే ఆ గొప్ప విజయం"[13]

**13.** ఆ రోజు కపట విశ్వాసులైన పురుషులు మరియు కపట విశ్వాసులైన స్త్రీలు విశ్వాసులతో ఇలా అంటారు[14]: "మీరు మా కొరకు కొంచెం వేచి ఉండండి, మేము మీ వెలుగు నుండి కొంచెం తీసుకుంటాము."[15] వారితో ఇలా అనబడుతుంది: "మీరు వెనుకకు మరలి పొండి, తరువాత వెలుగు కొరకు వెదకండి!" అప్పుడు వారి మధ్య ఒక గోడ నిలబెట్టబడుతుంది. దానికి ఒక ద్వారముంటుంది, దాని లోపలి వైపు కారుణ్యముంటుంది[16] మరియు దాని బయట వైపు శిక్ష ఉంటుంది[17].

**14.** (బయటనున్న కపట విశ్వాసులు) ఇలా అరుస్తారు: "ఏమీ? మేము మీతో పాటు ఉండేవాళ్ళం కాదా?" విశ్వాసులు ఇలా జవాబిస్తారు: "ఎందుకు ఉండలేదు? కానీ వాస్తవానికి మిమ్మల్ని మీరు స్వయంగా పరీక్షకు గురి చేసుకున్నారు. మీరు

---

[13] ఈ పలుకులు వారి స్వాగతం కొరకు వేచి ఉండే దైవదూతలు పలుకుతారు.

[14] చూడండి, 29:11.

[15] కపటవిశ్వాసులైన స్త్రీపురుషులు కొంతదూరం విశ్వాసుల వెలుగులో నడిచిన తరువాత, అల్లాహ్ (సు.తా.) వారిపై చీకటిని విధిస్తాడు. అప్పుడు వారు అలా పలుకుతారు.

[16] అంటే స్వర్గం.

[17] అంటే నరకం.

మా (నాశనం కోసం) వేచి ఉన్నారు. మరియు మీరు (పునరుత్థానాన్ని) సందేహిస్తూ ఉన్నారు మరియు మీ తుచ్ఛమైన కోరికలు మిమ్మల్ని మోస పుచ్చాయి. చివరకు అల్లాహ్ నిర్ణయం వచ్చింది. మరియు ఆ మోసగాడు (షైతాన్) మిమ్మల్ని అల్లాహ్ విషయంలో మోసపుచ్చాడు[18].

**15.** కావున ఈ రోజు మీ నుండి ఏ విధమైన పరిహారం తీసుకోబడదు. మరియు సత్యతిరస్కారుల నుండి కూడా తీసుకోబడదు. మీ నివాసం నరకమే, అది మీ ఆశ్రయం[19]. ఎంత చెడ్డ గమ్యస్థానం!"

**16.** ఏమీ? విశ్వాసుల హృదయాలు అల్లాహ్ ప్రస్తావనతో కృంగిపోయి, ఆయన అవతరింప జేసిన సత్యానికి విధేయులయ్యే సమయం ఇంకా రాలేదా? పూర్వ గ్రంథ ప్రజల్లాగా వారు కూడా మారిపోకూడదు. ఎందుకంటే చాలా కాలం గడిచి పోయినందుకు వారి హృదయాలు కఠినమై పోయాయి. మరియు వారిలో చాలా మంది అవిధేయులు (ఫాసిఖూన్) ఉన్నారు[20].

**17.** బాగా తెలుసుకోండి! నిశ్చయంగా అల్లాహ్, భూమి చనిపోయిన తరువాత, దానికి మళ్ళీ జీవం పోస్తాడు. వాస్తవానికి మేము ఈ సూచనలను

---

[18] చూడండి, 31:33.

[19] మౌలా: కార్యకర్త, యజమాని, సంరక్షకుడు, కర్తవ్యాన్ని నిర్వహించేవాడు స్నేహితుడు, సహచరుడు, ఎల్లప్పుడు తోడుగా ఉండేవాడు. ఇక్కడ నరకపు కర్తవ్యం శిక్ష విధించటమే కదా!.

[20] చూడండి, 5:13.

మీకు స్పష్టంగా తెలుపుతున్నాము, బహుశా మీరు అర్థం చేసుకుంటారని.

18. నిశ్చయంగా, విధిదానం (జకాత్) చేసే పురుషులు మరియు విధిదానం చేసే స్త్రీలు మరియు అల్లాహ్ కు మంచి అప్పు ఇచ్చే వారికి, ఆయన దానిని ఎన్నో రెట్లు పెంచి (తిరిగి) ఇస్తాడు[21]. మరియు వారికి గొప్ప ప్రతిఫలం ఉంటుంది.

19. మరియు ఎవరైతే అల్లాహ్ ను మరియు ఆయన ప్రవక్తలను విశ్వసిస్తారో, అలాంటి వారే సత్యసంధులైన (విశ్వాసులు). మరియు వారే తమ ప్రభువు వద్ద అమర వీరులు. వారికి వారి ప్రతిఫలం మరియు జ్యోతి లభిస్తాయి. కాని ఎవరైతే సత్యాన్ని తిరస్కరిస్తారో మరియు మా ఆయతులను అబద్ధాలని అంటారో, అలాంటి వారు తప్పక భగభగ మండే నరకాగ్ని వాసులవుతారు.

20. బాగా తెలుసుకోండి! నిశ్చయంగా, ఇహలోక జీవితం, ఒక ఆట మరియు ఒక వినోదం మరియు ఒక శృంగారం మరియు మీరు పరస్పరం గొప్పలు చెప్పుకోవడం మరియు సంపద మరియు సంతానం విషయంలో ఆధిక్యత పొందటానికి ప్రయత్నించడం

---

[21] ఒకదానికి పదిరెట్లు, ఐదువందల రెట్లు లేక అంతకంటే అధికంగా కూడా ఇస్తాడు. ఈ ఎక్కువ రెట్ల పుణ్యం వారి మాలిన్యరహితం, ఆవశ్యకత మరియు ఖర్చు చేసిన చోటు మరియు కాలాన్ని బట్టి ఉంటాయి. ఏ విధంగానైతే ఇంతకు ముందు పేర్కొనబడిందో ఫత్హ్ మక్కాకు మొదట ఖర్చు చేసిన వారికి, దాని తరువాత ఖర్చుచేసిన వారికంటే ఎక్కువ పుణ్యముందని.

మాత్రమే[22]. దాని దృష్టాంతం ఆ వర్షం వలే ఉంది: దాని (వర్షం) వల్ల పెరిగే పైరు రైతులకు ఆనందం కలిగిస్తుంది[23]. ఆ పిదప అది ఎండిపోయి పసుపు పచ్చగా మారిపోతుంది. ఆ పిదప అది పొట్టుగా మారిపోతుంది. కాని పరలోక జీవితంలో మాత్రం (దుష్టులకు) బాధాకరమైన శిక్ష మరియు (సత్పురుషులకు) అల్లాహ్ నుండి క్షమాపణ మరియు ఆయన ప్రసన్నత ఉంటాయి. కావున ఇహలోక జీవితం కేవలం మోసగించే భోగభాగ్యాలు మాత్రమే.

21. మీ ప్రభువు క్షమాపణ వైపునకు మరియు ఆకాశం మరియు భూమి యొక్క వైశాల్యమంతటి విశాలమైన స్వర్గం వైపునకు పరుగెత్తండి. అది అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తలను విశ్వసించేవారి కొరకు సిద్ధ పరచిబడి ఉంది. ఇది అల్లాహ్ అనుగ్రహం, ఆయన తాను కోరిన వారికి దానిని ప్రసాదిస్తాడు. మరియు అల్లాహ్ అనుగ్రహశాలి, సర్వోత్తముడు.

22. భూమి మీద గానీ లేదా స్వయంగా మీ మీద గానీ విరుచుకు పడే ఏ ఆపద అయినా సరే! మేము దానిని సంభవింప జేయక ముందే గ్రంథంలో వ్రాయబడకుండా లేదు. నిశ్చయంగా, ఇది

---

[22] చూడండి, 38:27 చూడండి 23:115.

[23] అల్-కుఫ్ఫారు: అంటే ఇక్కడ రైతు అనే అర్థంలో వాడబడింది. అంటే దాచేవాడు, రైతు భూమిలో విత్తనాలను దాచుతాడు. అదేవిధంగా సత్యతిరస్కారుల హృదయాలలో అల్లాహ్ (సు. తా.) మరియు అంతిమదినపు తిరస్కారం దాగి ఉంటుంది.

అల్లాహ్ కు ఎంతో సులభం[24].

23. ఇదంతా మీరు పోయిన దానికి నిరాశ చెందకూడదని[25] మరియు మీకు ఇచ్చిన దానికి సంతోషంతో ఉప్పొంగి పోరాదని. మరియు అల్లాహ్ బడాయీలు చెప్పుకునేవారూ, గర్వించే వారూ అంటే ఇష్టపడడు.

24. ఎవరైతే స్వయంగా లోభత్వం చూపుతూ[26] ఇతరులను కూడా లోభత్వానికి పురికొలుపు తారో మరియు ఎవడైతే (సత్యం నుండి) వెనుదిరుగుతాడో, వాడు (తెలుసుకోవాలి) నిశ్చయంగా, అల్లాహ్ స్వయం సమృద్ధుడు, సర్వ స్తోత్రాలకు అర్హుడని!

25. వాస్తవానికి, మేము మా సందేశహరులను స్పష్టమైన సూచలనిచ్చి పంపాము[27]. మరియు వారితో బాటు గ్రంథాన్ని అవతరింపజేశాము. మరియు మానవులు న్యాయశీలురుగా మెలగటానికి త్రాసును కూడా పంపాము

---

[24] అల్లాహ్ (సు.తా.)కు జరిగిందీ, జరగబోయేదీ అన్ని విషయాల జ్ఞానముంది. కాబట్టి ఆయన సృష్టిని ఆరంభించకముందే అంతా ఒక గ్రంథంలో వ్రాసిపెట్టాడు. అదే ఖద్ర్ / తఖ్దీర్. (స.ముస్లిం)

[25] మూమిన్ బాధ కలిగినప్పుడు సహనం వహిస్తాడు మరియు సంతోషంకలిగినప్పుడుఅల్లాహ్ (సు.తా.)కుకృతజ్ఞుడవుతాడు. ఎందుకంటే అతను అది తన శ్రమ కాదు అల్లాహ్ (సు.తా.) యొక్క అనుగ్రహమని నమ్ముతాడు.

[26] అంటే అల్లాహ్ (సు.తా.) మార్గంలో ఖర్చు చేయటంలో లోభత్వం. చూడండి, 4:36-37.

[27] మీ'జాన్: అంటే త్రాసు - ఇక్కడ న్యాయం అని అర్థం.

మరియు ఇనుమును కూడా ప్రసాదించాము. అందులో గొప్ప శక్తి ఉంది, మరియు మానవులకు ఎన్నో ప్రయోజనాలు న్నాయి[28]. మరియు (ఇదంతా) అల్లాహ్ అగోచరుడైన తనకు మరియు తన ప్రవక్తలకు ఎవడు సహాయకుడవుతాడో చూడటానికి చేశాడు. నిశ్చయంగా, అల్లాహ్ మహా బలశాలి, సర్వశక్తిమంతుడు.

26. మరియు వాస్తవంగా మేము నూహ్ ను మరియు ఇబ్రాహీమ్ ను పంపాము. మరియు వారిద్దరి సంతానంలో ప్రవక్త పదవినీ మరియు గ్రంథాన్ని ఉంచాము. కాని వారి సంతతిలో కొందరు మార్గదర్శకత్వం మీద ఉన్నారు, కాని వారిలో చాలామంది అవిధేయులు (ఫాసిఖూన్) ఉన్నారు.

27. ఆ తరువాత చాలా మంది ప్రవక్తలను మేము వారి తరువాత పంపాము. మరియు మర్యమ్ కుమారుడు ఈసాను కూడా పంపాము మరియు అతనికి ఇంజీల్ ను ప్రసాదించాము. మరియు అతనిని అనుసరించేవారి హృదయాలలో మేము

---

[28] ఇనుము వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. ఇది భూమిలో విస్తారంగా దొరుకుతుంది.

జాలిని, కరుణను కలిగించాము, కాని సన్యాసాన్ని[29] వారే స్వయంగా కల్పించుకున్నారు. మేము దానిని వారిపై విధించలేదు, కాని అల్లాహ్ ప్రసన్నతను పొందగోరి వారే దానిని విధించు కున్నారు, కాని వారు దానిని పాటించవలసిన విధంగా నిజాయితీతో పాటించలేదు. కావున వారిలో విశ్వసించిన వారికి వారి ప్రతిఫలాన్ని ప్రసాదించాము. కాని వారిలో చాలా మంది అవిధేయులు (ఫాసిఖూన్) ఉన్నారు.

28. ఓ విశ్వాసులారా! అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి, మరియు ఆయన సందేశహరుణ్ణి విశ్వసించండి, ఆయన (అల్లాహ్) మీకు రెట్టింపు కరుణను ప్రసాదిస్తాడు మరియు వెలుగును ప్రసాదిస్తాడు, మీరు అందులో నడుస్తారు మరియు ఆయన మిమ్మల్ని క్షమిస్తాడు. మరియు అల్లాహ్ ఎంతో క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

29. అల్లాహ్ అనుగ్రహం మీద తమకు ఎలాంటి

---

[29] కఠోరమైన సన్యాసాన్ని వారే (క్రైస్తవులే) తమపై తాము విధించుకున్నారు. వారు ప్రాపంచిక జీవితానికి విలువ ఇవ్వలేదు. దీనిని ఖుర్ఆన్ ఖండిస్తుంది. చూడండి, 2:143. రఅ'ఫతన్ - అంటే జాలి, కనికరం, దయ. రుహ్ బానియ్యహ్ - అంటే త్యాగం, విడిచిపెట్టడం. అంటే ప్రాపంచిక విషయాలను త్యజించటం. అంటే సన్యాసత్వం స్వీకరించటం. ఇది వారే స్వయంగా కల్పించుకున్నారు. అల్లాహ్ (సు.తా.) దీనిని విధించలేదు. వారు అల్లాహ్ (సు.తా.) ను సంతోషపరచాలని దీనిని అవలంబించారు. కాని అల్లాహ్ (సు.తా.) తాను చూపిన మార్గం పై నడిచే వారితోనే సంతోషపడతాడు. దానిలో క్రొత్త విషయాలను పుట్టించి వాటిని అవలంబించే వారితో కాదు.

అధికారం లేదని మరియు నిశ్చయంగా, అనుగ్రహం కేవలం అల్లాహ్ చేతిలో ఉందని మరియు ఆయన తాను కోరిన వారికి దానిని ప్రసాదిస్తాడని, పూర్వ గ్రంథప్రజలు తెలుసుకోవాలి. మరియు అల్లాహ్ అనుగ్రహశాలి, సర్వోత్తముడు.

# 58. అల్-ముజాదిలహ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. వాస్తవానికి, తన భర్తను గురించి నీతో వాదిస్తున్న మరియు అల్లాహ్ తో మొరపెట్టు కుంటున్న ఆ స్త్రీ మాటలు అల్లాహ్ విన్నాడు[1]. అల్లాహ్ మీ ఇద్దరి సంభాషణ వింటున్నాడు. నిశ్చయంగా, అల్లాహ్ సర్వం వినేవాడు, సమస్తం చూసేవాడు.
2. మీలో ఎవరైతే తమ భార్యలను జిహార్ ద్వారా దూరంగా ఉంచుతారో! అలాంటి వారి భార్యలు, వారి తల్లులు[2] కాలేరు. వారిని కన్నవారు మాత్రమే వారి తల్లులు. మరియు నిశ్చయంగా,

---

[*] [అల్-ముజాదిలహ్ అంటే వాదించిన ఆమె]

[1] ఇక్కడ 'ఖౌలహ్ బిన్త్ మాలిక్ బిన్ స' 'అలబహ్ (ర.'అన్హా) ను ఆమె భర్త ఔస్ బిన్ 'సామిత్ (రజి.'అ.) "జిహార్ చేసినందుకు ఆమె మొరపెట్టుకుంటుంది. దానికి అల్లాహ్ (సు.తా.) ఆదేశం వచ్చిన తరువాత, అది నిర్మూలించబడిన విషయం ఈ సూరహ్ యొక్క 1-4వ ఆయతులలో పేర్కొనబడింది. "జిహార్ - అంటే, "నీ వీపు నాకు నా తల్లి వీపు వంటిది" అని తన భార్యను తాకకుండా దూరముండటం. మరియు ఆమెకు విడాకులు కూడా ఇవ్వకుండా ఉండటం. ఆమె దైవప్రవక్త ('స'అస) దగ్గరకు వచ్చి ఈ ఆచారాన్ని గురించి వాదులాడింది. అప్పుడు ఈ ఆయత్ లు అవతరింపజేయబడ్డాయి. (అబూ-దావూద్) ఇంకా చూడండి, 33:4. స్త్రీ తన భర్త నుంచి విడాకులు తీసుకోగోరితే దానికి సంబంధించిన ఆదేశానికి చూడండి, 2:229. దానిని ఖుల్'అ అంటారు.

[2] మీరు "జీహార్ అన్నంత మాత్రాన్నే మీ భార్యలు మీ తల్లులు కారు మిమ్మల్ని కన్నవారే మీ తల్లులు.

వారు అనుచితమైన మరియు అబద్ధమైన మాట పలుకుతున్నారు. మరియు నిశ్చయంగా, అల్లాహ్ మన్నించే వాడు, క్షమాశీలుడు.

3. మరియు ఎవరైతే తమ భార్యలను జిహార్ ద్వారా దూరం చేసి తరువాత తమ మాటను వారు ఉపసంహరించుకోదలిస్తే! వారిద్దరు ఒకరినొకరు తాకక ముందు, ఒక బానిసను విడుదల చేయించాలి[3]. ఈ విధంగా మీకు ఉపదేశమివ్వడుతోంది. మరియు మీరు చేస్తున్నదంతా అల్లాహ్ ఎరుగును.

4. కాని ఎవడైతే ఇలా చేయలేడో, అతడు తన భార్యను తాకక ముందు, రెండు నెలలు వరుసగా ఉపవాసముండాలి. ఇది కూడా చేయలేనివాడు అరవైమంది నిరుపేదలకు భోజనం పెట్టాలి. ఇదంతా మీరు అల్లాహ్ ను మరియు ఆయన ప్రవక్తను దృఢంగా విశ్వసించటానికి. మరియు ఇవి అల్లాహ్ నిర్ణయించిన హద్దులు. మరియు సత్యతిరస్కారులకు బాధాకరమైన శిక్ష పడుతుంది.

5. నిశ్చయంగా, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను వ్యతిరేకించేవారు, తమకు పూర్వం గతించినవారు అవమానింపడినట్లు అవమానింపబడతారు.

---

[3] ఇక్కడ దాని పరిహారం చెప్పబడుతోంది. ఒక బానిస విడుదల చేయించాలి, లేక రెండు నెలల ఎడతెగకుండా ఉపవాసాలుండాలి, లేక 60 మంది పేదలకు, ప్రతివానికి 2 ముద్ లు అంటే 1.25 కిలోగ్రాముల ధాన్యం ఇవ్వాలి లేక కడుపునిండా అన్నం తినిపించాలి. వారందరినీ ఒకే సారి తినిపించనవసరం లేదు. వేర్వేరు సమయాలలో తినిపించవచ్చు. (ఫ'త్హ్ అల్ ఖదీర్)

మరియు వాస్తవానికి మేము స్పష్టమైన సూచనలను (ఆయాత్ లను) అవతరింపజేశాము. మరియు సత్యతిరస్కారులకు అవమానకరమైన శిక్ష పడుతుంది.

6. అల్లాహ్ వారందరిని మరల బ్రతికించి లేపి, వారు చేసిందంతా వారికి తెలిపే రోజున వారు (తాము చేసిందంతా) మరచిపోయి ఉండవచ్చు, కాని అల్లాహ్ అంతా లెక్కపెట్టి ఉంచుతాడు. మరియు అల్లాహ్ యే ప్రతిదానికి సాక్షి.

7. ఏమీ? నీకు తెలియదా? నిశ్చయంగా, ఆకాశాలలో మరియు భూమిలోనున్న సర్వమూ అల్లాహ్ కు తెలుసునని? ఏ ముగ్గురు కలిసి రహస్య సమాలోచనలు చేస్తూ వున్నా ఆయన నాలుగవ వాడిగా ఉంటాడు. మరియు ఏ అయిదుగురు రహస్య సమాలోచనలు చేస్తూ వున్నా ఆయన ఆరవ వాడిగా ఉంటాడు. మరియు అంతకు తక్కువ మందిగానీ లేక అంతకు ఎక్కువ మంది గానీ ఉన్నా ఆయన వారితో తప్పక ఉంటాడు[4]. వారు ఎక్కడ వున్నా సరే! తరువాత ఆయన పునరుత్థాన దినమున వారు చేసిన కర్మలను వారికి తెలుపుతాడు. నిశ్చయంగా, అల్లాహ్ కు ప్రతి విషయం గురించి బాగా తెలుసు.

8. ఏమీ? నీకు తెలియదా (చూడటం లేదా)? రహస్య సమాలోచనల్ని నిషేధించటం జరిగి నప్పటికీ! వారు - నిషేధింపబడిన దానినే - మళ్ళీ చేస్తున్నారని?

---

[4] అంటే అల్లాహ్ (సు.తా.) తన జ్ఞానంతో వారితో ఉంటాడు.

మరియు వారు రహస్యంగా పాపం చేయడం - హద్దులు మీరి ప్రవర్తించడం మరియు ప్రవక్త ఆజ్ఞలను ఉల్లంఘించడం గురించి - సమాలోచనలు చేస్తున్నారని![5] (ఓ ముహమ్మద్!) నీ వద్దకు వచ్చినపుడు, అల్లాహ్ కూడా నీకు సలాం చేయని విధంగా, వారు నీకు సలాం చేస్తూ, తమలో తాము ఇలా అనుకుంటారు:[6] "మేము పలికే మాటలకు, అల్లాహ్ మమ్మల్ని ఎందుకు శిక్షించటం లేదు?" వారికి నరకమే చాలు, వారందులో ప్రవేశిస్తారు. ఎంత ఘోరమైన గమ్యస్థానం!

9. ఓ విశ్వాసులారా! మీరు రహస్య సమాలోచనలు చేస్తే - పాపకార్యాలు, హద్దులు మీరి ప్రవర్తించటం

---

[5] ఈ ఆయత్ మదీనా యొక్క యూదులను మరియు కపటవిశ్వాసులను గురించి పలుకుతుంది. వారు ఉన్నచోట నుండి ముస్లింలు పోతూ ఉంటే, వారు గుసగుసలాడే వారు, దానికి ముస్లింలు, వారు తమను గురించి ఏదైనా దురాలోచనలు చేస్తున్నారేమో! లేక ముస్లింల సైన్యం మీద ఏదైనా శత్రువుల సైన్యం దాడి చేసి వారికి నష్టం కలిగించేదేమో! అని భయపడేవారు, కావున దైవప్రవక్త ('స'అస) ఇట్టి గుసగుసలను నిషేధించారు. అయినా వారు కొంతకాలం తరువాత మళ్ళీ ప్రారంభించారు. ఆ సందర్భం లోనే ఈ ఆయత్ అవతరింపబడింది. చూడండి, 4:114.

[6] అల్లాహ్ (సు.తా.), మిమ్మల్ని పరస్పరం 'అస్సలాము అలైకుమ్ వ ర'హ్మతుల్లాహ్', మీకు శాంతి కలుగుగాక! అని చెప్పుకోండి. అని ఆజ్ఞాపించాడు. కాని యూదులు దైవప్రవక్త ('స'అస)ను చూసినప్పుడు: 'అస్సాము అలైకుమ్' అంటే మీకు చావు వచ్చుగాక! అని అనేవారు. కావున దైవప్రవక్త ('స'అస) అలాంటి వారికి: 'వ అలైకుమ్.' అని జవాబు ఇవ్వండి, అని అన్నారు. అంటే మీరన్నదే మీకు! ('స'హీ'హ్ బు'ఖారీ, 'స'హీ'హ్ ముస్లిం).

మరియు ప్రవక్త ఆజ్ఞలను ఉల్లంఘించటం గురించి కాకుండా - పుణ్యకార్యాలు మరియు దైవభీతికి సంబంధించిన విషయాలను గురించి మాత్రమే (రహస్య సమాలోచనలు) చేయండి. మరియు అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగి ఉండండి. ఆయన సన్నిధిలోనే మీరు సమావేశ పరచబడతారు.

10. నిశ్చయంగా, రహస్య సమాలోచన షైతాన్ చేష్టయే[7]. అది విశ్వాసులకు దుఃఖం కలిగించటానికే! కాని అల్లాహ్ అనుమతి లేనిదే అది వారికి ఏ మాత్రం నష్టం కలిగించ జాలదు[8]. మరియు విశ్వాసులు కేవలం అల్లాహ్ మీదే నమ్మకం ఉంచుకోవాలి.

11. ఓ విశ్వాసులారా! సమావేశాలలో (వచ్చే వారికి) చోటు కల్పించమని మీతో అన్నప్పుడు, మీరు జరిగి, చోటు కల్పిస్తే, అల్లాహ్ మీకు విశాలమైన

---

[7] ఒకవేళ మీరు ముగ్గురు ఒకేచోట ఉంటే, మీరు మీలో ఒకడిని విడిచి మిగతా ఇద్దరు పరస్పరం గుసగుసలాడుకోరాదు! ఎందుకంటే అది, మూడోవాణ్ణి చింతకు గురిచేస్తుంది. ('స'హీ'హ్ ముస్లిం, 'స'హీ'హ్ బు'ఖారీ) అతడు అనుమతిస్తే, మిగతా ఇద్దరు ఏకాంతంలో మాట్లాడుకోవచ్చు!

[8] చూడండి, 14:22.

చోటును ప్రసాదిస్తాడు[9]. మరియు ఒకవేళ మీతో (నమాజ్ లేక జిహాద్ కు) లేవండి అని చెప్పబడితే! మీరు లేవండి. మరియు మీలో విశ్వసించిన వారికి మరియు జ్ఞానం ప్రసాదించబడిన వారికి అల్లాహ్ ఉన్నత స్థానాలను ప్రసాదిస్తాడు[10]. మరియు మీరు చేసేదంతా అల్లాహ్ బాగా ఎరుగును.

12. ఓ విశ్వాసులారా! మీరు ప్రవక్తతో ఏకాంతంలో మాట్లాడదలిస్తే, మాట్లాడబోయే ముందు, ఏదైనా కొంత దానం చేయండి. ఇది మీ కొరకు ఉత్తమమైనది మరియు చాలా శ్రేష్ఠమైనది. కాని (ఒకవేళ దానం చేయటానికి) మీ వద్ద ఏమీ లేకపోతే, నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత అని తెలుసుకోండి.

13. ఏమీ? మీరు (ప్రవక్తతో) ఏకాంత సమాలోచనలకు ముందు దానాలు చేయవలసి ఉన్నదని భయ

---

[9] ఈ సమావేశాలు ధర్మసమావేశాలు జుమ'అహ్ లేక ఇతర సమావేశాలు కావచ్చు! మొదట వచ్చినవారు విడివిడిగా దూరం దూరంగా కూర్చుంటే తరువాత వచ్చే వారికి చోటు దొరుకుతుంది. దైవప్రవక్త ప్రవచనం: 'ఏ వ్యక్తికి కూడా మరొక వ్యక్తిని అతని చోటు నుండి లేపి కూర్చోవటం సభ్యత కాదు. కావున మీరు సమావేశంలో కూర్చున్నప్పుడు దూరం దూరంగా కూర్చోండి.' ('స'హీ'హ్ బు'ఖారీ, 'స'హీ'హ్ ముస్లిం)

[10] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: ఒక భక్తిపరుని ('ఆబిద్)పై ఒక జ్ఞానవంతుని ('ఆలిమ్) యొక్క ఆధిక్యత పూర్ణిమ రాత్రిలో, నక్షత్రాలపై చంద్రునికి ఉండే ఆధిక్యత వంటిది. (ఇబ్నె-'హంబల్, అబూ-దావూద్, తిర్మిజీ', నసాయీ', ఇబ్నె-మాజా. మరియు దారిమీ.

పడుతున్నారా? ఒకవేళ మీరు అలా (దానం) చేయకపోతే అల్లాహ్ మిమ్మల్ని మన్నించాడు, కావు మీరు నమాజ్ ను స్థాపించండి మరియు విధి దానం (జకాత్) ఇవ్వండి. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తకు విధేయులుగా ఉండండి. వాస్తవానికి మీరు చేసేదంతా అల్లాహ్ బాగా ఎరుగును.

14. ఏమీ? అల్లాహ్ ఆగ్రహానికి గురి అయిన జాతి వారి వైపుకు మరలిన వారిని నీవు చూడలేదా? వారు మీతో చేరిన వారు కారు మరియు వారితోను చేరినవారు కారు. వారు బుద్ధిపూర్వకంగా అసత్య ప్రమాణం చేస్తున్నారు.

15. అల్లాహ్ వారి కొరకు కఠిన శిక్షను సిద్ధపరచి ఉంచాడు. నిశ్చయంగా, వారు చేసే పనులన్నీ చాలా చెడ్డవి.

16. వారు తమ ప్రమాణాలను డాలుగా చేసుకొని (ప్రజలను) అల్లాహ్ మార్గం నుండి నిరోధిస్తున్నారు, కావున వారికి అవమాన కరమైన శిక్ష పడుతుంది.

17. అల్లాహ్ (శిక్ష) నుండి కాపాడటానికి, వారి సంపదలు గానీ, వారి సంతానం గానీ వారికి ఏ మాత్రం పనికిరావు. ఇలాంటి వారే నరకాగ్నివాసులు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు.

18. అల్లాహ్ వారందరినీ మరల బ్రతికించి లేపిన రోజు, వారు మీతో ప్రమాణాలు చేసినట్లు ఆయన (అల్లాహ్) ముందు కూడా ప్రమాణాలు చేస్తారు. మరియు దాని వలన వారు మంచి స్థితిలో

ఉన్నారని భావిస్తారు. జాగ్రత్త! నిశ్చయంగా, ఇలాంటి వారే అసత్యవాదులు!

**19.** షైతాన్ వారిపై ప్రాబల్యం పొంది నందు వలన వారిని అల్లాహ్ ధ్యానం నుండి మరపింప జేశాడు. అలాంటి వారు షైతాన్ పక్షానికి చెందిన వారు. జాగ్రత్త! షైతాన్ పక్షానికి చెందినవారు, వారే! నిశ్చయంగా నష్టపోయేవారు.

**20.** నిశ్చయంగా, ఎవరైతే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను వ్యతిరేకిస్తారో! అలాంటి వారే, పరమ నీచులలో చేరిన వారు.

**21.** "నిశ్చయంగా, నేను మరియు నా ప్రవక్తలు మాత్రమే ప్రాబల్యం వహిస్తాము" అని అల్లాహ్ వ్రాసి పెట్టాడు[11]. నిశ్చయంగా, అల్లాహ్ మహాబలశాలి, సర్వశక్తిమంతుడు!

**22.** అల్లాహ్ మరియు పరలోకాన్ని విశ్వసించే జనులలో, అల్లాహ్ మరియు ఆయన సందేశహరుణ్ణి వ్యతిరేకించే వారితో స్నేహం చేసుకునే వారిని నీవు పొందలేవు![12] ఆ వ్యతిరేకించే వారు, తమ తండ్రులైనా లేదా తమ కుమారులైనా లేదా తమ సోదరులైనా లేదా తమ కుటుంబం వారైనా సరే![13] అలాంటి వారి హృదయాలలో ఆయన విశ్వాసాన్ని స్థిరపరచాడు. మరియు వారిని తన వైపు నుండి

[11] లౌహె-మహ్ ఫూజ్ లో వ్రాసిపెట్టబడిన విధివ్రాతలో ఎలాంటి మార్పు జరుగదు. ఇంకా చూడండి, 40:51-52.

[12] చూడండి, 3:28, 9:24 మొదలైనవి.

[13] చూడండి, 8:67.

ఒక ఆత్మశక్తి (రూహ్) ఇచ్చి బలపరిచాడు. మరియు వారిని క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింప జేస్తాడు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు. అల్లాహ్ వారి పట్ల ప్రసన్నుడవుతాడు మరియు వారు ఆయన పట్ల ప్రసన్నులవుతారు. ఇలాంటి వారు అల్లాహ్ పక్షానికి చెందిన వారు. గుర్తుంచుకోండి! నిశ్చయంగా, అల్లాహ్ పక్షం వారే సాఫల్యం పొందేవారు.

# 59. అల్-హష్ర్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఆకాశాలలో నున్న సమస్తమూ మరియు భూమిలో నున్న సమస్తమూ, అల్లాహ్ పవిత్రతను కొనియాడుతుంటాయి మరియు ఆయనే సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు.
2. గ్రంథ ప్రజలలోని సత్యతిరస్కారులను మొదట సమీకరించిన (బనూ నదీర్ తెగ) వారిని, వారి గృహాల నుండి వెళ్ళగొట్టినవాడు ఆయనే[1].

---

[*] [అల్-హష్ర్ అంటే సమీకరణ]

[1] దైవప్రవక్త (స'అస) ప్రస్థానం చేసి మక్కా నుండి మదీనాకు వలస వచ్చినప్పుడు మదీనా చుట్టు ప్రాంతాలలో మూడు యూద తెగలవారు ఉండేవారు. 1) బనూ-ఖైనుఖా'అ, 2) బనూ-న'దీర్ మరియు 3) బనూ-ఖురై"జహ్. దైవప్రవక్త (స'అస) వారందరితో సంధి చేసుకుంటారు. బనూ-ఖైనుఖా'అ తెగవారు తమ దౌర్జన్యాల వల్ల వెడలగొట్టబడతారు. దానికి చూడండి, 59:15 వ్యాఖ్యానం. 2. బనూ-నదీర్' తెగవారు 3వ హిజ్రీలో, ముస్లింలకు ఉ'హుద్ యుద్ధరంగంలో కొంత నష్టం కలిగినందుకు, దైవప్రవక్త (స'అస)తో తమ సంధిని తెంపుకుంటారు. అతనిని చంపటానికి ప్రయత్నిస్తారు. ముష్రిక్ ఖురైషులతో కలిసి ముస్లింలను పూర్తిగా నిర్మూలించాలని పన్నాగాలు పన్నుతారు. అప్పుడు దైవప్రవక్త (స'అస) వారితో: 'మాతో యుద్ధం చేయటానికి సిద్ధపడండి లేక మదీనా విడిచి వెళ్ళిపోండి!' అనే రెండు దారులు చూపుతారు. వారు వెళ్ళి పోవటానికి ఒప్పుకొని, పది రోజుల గడువు కోరుతారు. ఈ మధ్య వారు కపటవిశ్వాసుల నాయకుడైన 'అబ్దుల్లా బిన్ ఉబైతో రహస్యసమాలోచనలు చేస్తారు. అతడు వారితో: 'మీరు యుద్ధం చేస్తే మీకు మేము రెండు వేల యుద్ధవీరులతో సహాయం చేస్తాము. కావున మీ కోటలను వదలి వెళ్ళకండి! ఒకవేళ ముస్లింలు మిమ్మల్ని వెడలగొడితే మేము కూడా మీ వెంట వస్తాము!' అని అంటాడు. అప్పుడు ముస్లింలు వారి కోటలను 21 రోజులు చుట్టుముట్టి ఉంచుతారు. 'అబ్దుల్లా ఇబ్నె ఉబై వారికి సహాయపడ నందుకు, ముస్లింల అనుమతితో తాము తీసుకోగల సామాగ్రి తీసుకొని వెళ్ళిపోతారు.

వారు వెళ్ళిపోతారని మీరు ఏ మాత్రం భావించ లేదు. మరియు అల్లాహ్ నుండి తమను తమ కోటలు తప్పక రక్షిస్తాయని వారు భావించారు! కాని అల్లాహ్ (శిక్ష) వారు ఊహించని వైపు నుండి, వారిపై వచ్చి పడింది. మరియు ఆయన వారి హృదయాలలో భయం కలుగజేశాడు, కావున వారు తమ ఇండ్లను తమ చేతులారా మరియు విశ్వాసుల చేతులతో కూడా, నాశనం చేయించు కున్నారు. కావున ఓ పరిజ్ఞానం (కళ్ళు) గలవారలారా! గుణపాఠం నేర్చుకోండి.

3. మరియు ఒకవేళ అల్లాహ్ వారి విషయంలో దేశ బహిష్కారం వ్రాసి ఉండకపోతే, వారిని ఈ ప్రపంచములోనే శిక్షించి ఉండేవాడు. మరియు వారికి పరలోకంలో నరకాగ్ని శిక్ష పడుతుంది.

4. ఇది ఎందుకంటే, వారు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను వ్యతిరేకించారు. మరియు అల్లాహ్ ను వ్యతిరేకించిన వాడిని శిక్షించటంలో నిశ్చయంగా, అల్లాహ్ చాలా కఠినుడు.

5. (ఓ విశ్వాసులారా!) మీరు ఏ ఖర్జూరపు చెట్లను నరికివేశారో[2] లేక ఏ ఖర్జూరపు చెట్లను వాటి వ్రేళ్ళ మీద నిలబడేలా వదలి పెట్టారో, అంతా అల్లాహ్ ఆజ్ఞతోనే జరిగింది. మరియు ఇదంతా అవిధేయులను అవమానించటానికి జరిగిన విషయం.

---

[2] లీనతున్: ఒక రకపు ఖర్జూరపు చెట్టు. ఏ విధంగానైతే అజ్వా, బర్నీ ఉన్నాయో.

6. మరియు అల్లాహ్ తన ప్రవక్తకు వారి నుండి ఇప్పించిన ఫయ్అ కొరకు, మీరు గుర్రాలను గానీ ఒంటెలను గానీ పరిగెత్తించలేదు[3]. కాని అల్లాహ్ తాను కోరిన వారిపై, తన సందేశహరునికి ఆధిక్యత నొసంగుతాడు. మరియు అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు.

7. అల్లాహ్ తన ప్రవక్తకు ఆ నగరవాసుల నుండి ఇప్పించిన దానిలో (ఫయ్అ లో) అల్లాహ్ కు మరియు ఆయన ప్రవక్తకు మరియు అతని దగ్గరి బంధువులకు మరియు అనాథులకు మరియు పేదలకు మరియు బాటసారులకు హక్కు ఉంది[4]. అది మీలో ధనవంతులైన వారి మధ్యనే తిరగకుండా ఉండటానికి, ఇలా నిర్ణయించబడింది. మరియు ప్రవక్త మీకు ఇచ్చిన దానిని తీసుకోండి మరియు అతను మీకు నిషేధించిన దానికి దూరంగా ఉండండి. అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగి ఉండండి. నిశ్చయంగా, అల్లాహ్ శిక్షించటంలో చాలా కఠినుడు.

8. (దానిలో నుండి కొంతభాగంపై) తమ ఇండ్ల నుండి మరియు తమ ఆస్తిపాస్తుల నుండి వెడలగొట్టబడి

---

[3] శత్రువు యుద్ధానికి ముందే పారిపోయి వదిలే సామగ్రిని ఫయ్'ఉన్ అంటారు. యుద్ధంలో విజయం పొందిన తరువాత దొరికే సామగ్రిని 'గనీమత్ అంటారు. చూడండి, 8:41.

[4] యుద్ధబూటీ / విజయధనం (మాలె 'గనీమత్) నుండి, 1/5వ వంతులో మాత్రమే ఇలాంటి వారికి హక్కు ఉంది. కాని ఫయ్అ' లో పూర్తి ఆదాయాన్ని ఇలాంటి వారిలోనే పంచాలి. ఎందుకంటే ఇక్కడ యుద్ధం చేసి గెలిచిన వారంటూ ఎవరూ లేరు.

వలస వచ్చిన(ముహాజిర్ లకు) పేదవారికి కూడా హక్కు ఉంది. వారు అల్లాహ్ అనుగ్రహాన్ని మరియు ఆయన ప్రసన్నతను కోరుతున్నారు. మరియు వారు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తకు సహాయం చేస్తున్నారు. ఇలాంటి వారు, వీరే సత్యవంతులు[5].

9. మరియు ఎవరైతే - ఈ (వలస వచ్చినవారు) రాకపూర్వమే - విశ్వసించి వలస కేంద్రం (మదీనా) లో నివసిస్తూ ఉండేవారో! వారికి కూడా హక్కు వుంది[6]. వారు తమ వద్దకు వలస వచ్చిన వారిని ప్రేమిస్తారు. మరియు వారు (వలస వచ్చిన) వారికి ఏది ఇవ్వబడినా! దాని అవసరం తమకు ఉన్నట్లు భావించరు. మరియు తమకు అవసరమున్నా వారికి తమ సొంత (అవసరాల) మీద ప్రాధాన్యతనిస్తారు. మరియు ఎవరైతే అత్మలోభం నుండి రక్షింప బడతారో! అలాంటి

---

[5] ఇందులో, ఫయ్అ' యొక్క ఒక భాగాన్ని వలస వచ్చిన వారికి ఇవ్వాలని పేర్కొనబడింది. దానితో పాటు వలస వచ్చిన వారి (ముహాజిర్ ల) గొప్పతనం కూడా వివరించబడింది. వారిని గురించి అల్లాహ్ (సు.తా.) ఇలాంట ఆయత్ అవతరింపజేసిన తరువాత కూడా వారి విశ్వాసాన్ని అనుమానించటం, ఖుర్ఆన్ ను తిరస్కరించటమే!

[6] వీరు - ముహాజిర్ లు మదీనాకు రాకముందే - విశ్వసించిన మదీనా వాసులైన అన్సారులు. ఫయ్అ' ధనం మొదట ముహాజిర్ లకు పంచి పెట్టబడినా, వీరు అసూయపడలేదు.

వారు, వారే! సాఫల్యం పొందేవారు[7].

**10.** మరియు ఎవరైతే వారి తరువాత వచ్చారో! వారికి అందులో హక్కు ఉంది. వారు ఇలా అంటారు: "ఓ మా ప్రభూ! మమ్మల్ని మరియు మాకంటే ముందు విశ్వసించిన మా సోదరులను క్షమించు. మరియు మా హృదయాలలో విశ్వాసుల పట్ల ద్వేషాన్ని కలిగించకు[8]. ఓ మా ప్రభూ! నిశ్చయంగా, నీవు చాలా కనికరించేవాడవు, అపార కరుణా ప్రదాతవు!"

**11.** (ఓ ముహమ్మద్!) కపట విశ్వాసుల గురించి

---

[7] 'మిమ్మల్ని మీరు లోభం నుండి రక్షించుకోండి. ఈ లోభమే పూర్వకాలపు వారిని నాశనం చేసింది. అదే వారిని రక్తపాతానికి గురిచేసింది. మరియు వారు నిషిద్ధ ('హరామ్) వస్తువులను ధర్మసమ్మతం ('హలాల్) చేసుకున్నారు.' ('స'హీ'హ్ ముస్లిం).

[8] వీరు ఫయ్అ'కు హక్కుదారులైన మరొకరకం వారు. వీరు సహాబీల తరువాత తరం వారు మరియు వారి అడుగుజాడలలో నడిచేవారు. వీరిలో తాబ'యీన్ మరియు వారిని అనుసరించిన వారూ మరియు పునరుత్థాన దినం వరకు ఈమాన్ లో ప్రవేశించే వారందరూ ఉన్నారు! ఇమామ్ మాలికి (ర'హ్మ) ఈ ఆయత్ వ్యాఖ్యానంలో అన్నారు: 'రాఫజీ, ఎవరైతే 'స'హాబా (ర'.ది.'అన్హుమ్) లను దూషిస్తారో, వారికి ఫయ్అ' ధనంలో భాగం లేదు. ఎందుకంటే అల్లాహ్ (సు.తా.) 'స'హాబా (ర'.ది.'అన్హుమ్) లను పొగుడు తున్నాడు. మరియు వారేమో స'హాబా (ర.'ది.'అన్హుమ్)లను దూషఇస్తున్నారు.' (ఇబ్నె-కసీ'ర్). 'ఆయి'షహ్(ర.'అన్హా) కథనం: మీరు స'హాబా (ర'.ది'అన్హుమ్) ల కొరకు ఇస్తి'గ్'ఫార్ చేయండని, దైవప్రవక్త ('స'అస) ఆజ్ఞాపించబడ్డారు. కాని మీరు వారిని దూషిస్తున్నారు. నేను మీ ప్రవక్త ('స'అస) ను ఇలా అంటూ ఉండగా విన్నాను: 'ఈ జాతిలోని చివరివారు తమ మొదటి వారిని శపించనంత వరకూ ఈ జాతి నశించదు!' (బ'గవీ ఈ 'హదీస్' ను ఉల్లేఖించారు.

నీకు తెలియదా?[9] వారు గ్రంథ ప్రజలలో సత్యతిరస్కారులైన తమ సోదరులతో, ఇలా అంటారు: "ఒకవేళ మీరు వెళ్ళగొట్ట బడినట్లయితే, మేము కూడా తప్పక మీతోబాటు వెళ్తాము. మరియు మీ విషయంలో మేము ఎవ్వరి మాటా వినము. ఒకవేళ మీతో యుద్ధం జరిగితే, మేము తప్పక మీకు సహాయ పడతాము." మరియు నిశ్చయంగా, వారు అసత్యవాదులు, అల్లాహ్ యే దీనికి సాక్షి!

12. కాని (వాస్తవానికి) వారు (యూదులు) వెడలగొట్టబడితే, వీరు (ఈ కపట విశ్వాసులు) వారి వెంట ఎంతమాత్రం వెళ్ళరు మరియు వారితో యుద్ధం జరిగితే, (ఈ కపట విశ్వాసులు) వారికి ఏ మాత్రం సహాయపడరు[10]. ఒకవేళ వీరు, వారికి (యూదులకు) సహాయపడినా, వారు తప్పక వెన్నుచూపి పారిపోతారు. ఆ తరువాత వారు విజయం (సహాయం) పొందలేరు.

13. వారి హృదయాలలో, అల్లాహ్ భయం కంటే, మీ భయమే ఎక్కువ ఉంది. ఇది ఎందుకంటే! వాస్తవానికి వారు అర్థం చేసుకోలేని జనులు.

---

[9] ఈ ఆయత్ లు (11-14) ముస్లింలు, బనూ-న'దీర్ వారిపైకి దాడి చేయటానికి వెళ్ళక ముందు అవతరింప జేయబడ్డాయి.

[10] ఈ ఆయత్ మునాఫిఖుల బూటక వాగ్దానాలను వివరిస్తోంది. అలాగే జరిగింది. బనూ-న'దీర్ తెగవారిని వారి ఇండ్ల నుండి వెడల గొట్టినప్పుడూ మరియు బనూ-ఖురై"జహ్ తెగవారిని బంధించి నప్పుడూ, ఈ కపట విశ్వాసులు వారికి ఎలాంటి సహాయం చేయలేదు.

**14.** వారందరూ కలిసి కూడా, దృఢమైన కోటలు గల నగరాలలోనో, లేదా గోడల చాటు నుండో తప్ప, మీతో యుద్ధం చేయజాలరు. వారి మధ్య ఒకరి మీద ఒకరికి ఉన్న ద్వేషం, ఎంతో తీవ్రమైనది. వారు కలసి ఉన్నట్లు నీవు భావిస్తావు, కాని వారి హృదయాలు చీలి పోయి ఉన్నాయి. ఇది ఎందుకంటే, వాస్తవానికి వారు బుద్ధిహీనులైన జనులు.

**15.** వీరి దృష్టాంతం సమీపంలోనే గడిచిన వారిని (బనూఖైనుఖాలను) పోలి ఉంది. వారు తమ కార్యాల ఫలితాన్ని చవి చూశారు, మరియు (పరలోకంలో) వారికి బాధాకరమైన శిక్ష ఉంది[11].

**16.** వారి దృష్టాంతం మానవుణ్ణి ప్రేరేపిస్తూ, ఇలా అనే ఆ షైతాన్ వలే ఉంది. అతడు: "సత్యాన్ని తిరస్కరించు." అని అంటాడు. అతడు తిరస్కరించిన తరువాత ఇలా అంటాడు: "నిశ్చయంగా, నాకు నీతో ఏ విధమైన సంబంధం లేదు, నిశ్చయంగా, నేను సర్వలోకాల ప్రభువైన అల్లాహ్ కు భయపడేవాడిని!"[12]

**17.** తరువాత ఆ ఇద్దరి పర్యవసానం, నిశ్చయంగా, ఆ ఇరువురూ నరకాగ్నిలో ఉండటమే! అందు వారు

---

[11] ఈ ఆయత్ 2వ హిజ్రీలో, బద్ర్ యుద్ధం తరువాత మదీనానుండి వెడలగొట్టబడిన బనూ-ఖైనుఖా'అ తెగవారిని ఉద్దేశించిందని కొందరి అభిప్రాయం. మరికొందరి అభిప్రాయం ఇది 2వ హిజ్రీలో మక్కా ముష్రికులతో జరిగిన బద్ర్ యుద్ధానికి సంబంధించినదని, (ఇబ్నె-కసీ'ర్).

[12] చూడండి, 8:48 మరియు 14:22.

శాశ్వతంగా ఉంటారు. మరియు దుర్మార్గులకు లభించే ప్రతిఫలం ఇదే!

18. ఓ విశ్వాసులారా! అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగి ఉండండి. మరియు ప్రతి వ్యక్తి, తాను రేపటి కొరకు ఏమి సమకూర్చుకున్నాడో చూసుకోవాలి మరియు అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగి ఉండండి. నిశ్చయంగా, మీరు చేసేదంతా అల్లాహ్ ఎరుగును!

19. మరియు అల్లాహ్ ను మరచి పోయిన వారి మాదిరిగా మీరూ అయి పోకండి. అందువలన ఆయన వారిని, తమను తాము మరచిపోయేటట్లు చేశాడు. అలాంటి వారు! వారే అవిధేయులు (ఫాసిఖూన్).

20. నరకవాసులు మరియు స్వర్గవాసులు సరిసమానులు కాజాలరు. స్వర్గవాసులు, వారే! విజయం పొందేవారు.

21. ఒకవేళ మేము ఈ ఖుర్ఆన్ ను ఏ పర్వతం పైనైనా అవతరింపజేసి ఉంటే, అల్లాహ్ భయం వల్ల అది అణిగి బ్రద్దలై పోవటాన్ని నీవు చూసి ఉంటావు. మరియు బహుశా ప్రజలు ఆలోచిస్తారని, ఇలాంటి దృష్టాంతాలను మేము వారి ముందు పెడుతున్నాము.

22. ఆయనే, అల్లాహ్! ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు! ఆయనకు అగోచర మరియు

గోచర విషయాలన్నీ తెలుసు[13]. ఆయన అనంత కరుణామయుడు, అపార కరుణా ప్రదాత.

23. ఆయనే, అల్లాహ్! ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయన విశ్వసార్వభౌముడు, పరమ పవిత్రుడు, శాంతికి మూలాధారుడు, శాంతి ప్రదాత, శరణమిచ్చేవాడు, సర్వ శక్తిమంతుడు, నిరంకుశుడు, గొప్పవాడు. వారు కల్పించే భాగస్వాములకు అల్లాహ్ అతీతుడు[14]

24. ఆయనే, అల్లాహ్! విశ్వసృష్టికర్త, ప్రతిదానిని సృజించేవాడు మరియు రూపాలను తీర్చిదిద్దేవాడు.

---

[13] చూడండి, 6:73.

[14] అల్-మలికు: Sovereign, విశ్వసార్వభౌముడు, చక్రవర్తి, విశ్వాధిపతి, సర్వాధికారి, చూడండి, 20:114 వ్యాఖ్యానం 3. అల్-ఖుద్దూసు: All Holy, All Pure, పరమపవిత్రుడు, పరిశుద్ధుడు, పావనుడు, చూడండి, 62:1. అస్-సలాము: Author of Safety and Security, Free from all defects, imperfections, blemish or vices, శాంతికి మూలాధారి, సురక్షితుడు, సర్వదౌర్బల్యాలకు, బలహీనతలకు అతీతుడు. అల్-మూ'మిను: He who Maketh mankind Secure from His punishment. శాంతి ప్రదాత, శాంతిమయుడు, సకల ఆపదలు యాతనల నుండి కాపాడి ప్రశాంతిని ప్రసాదించేవాడు. భద్రత నిచ్చేవాడు. అల్-ముహైమిను: Preserver of Safety, One who determines what is true and false, and He who will faithfully perform to His servants what He has promised them. శరణమిచ్చేవాడు, సంరక్షకుడు, సత్యాసత్యాలను పరిష్కరించే, నిర్ణయించే వాడు, తన సృష్టిని కనిపెట్టుకొని ఉండేవాడు, జాగరూకుడు.

ఆయనకు సర్వశ్రేష్ఠమైన పేర్లున్నాయి[15]. ఆకాశాలలో మరియు భూమిలో ఉన్న సమస్తమూ, ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉంటాయి. మరియు ఆయనే సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు.

[15] అల్-'ఖాలిఖు: The Creator of all things. సృష్టికర్త. చూడండి, 6:103. అల్-బారిఉ':The Maker, ప్రతిదాని నిర్మాత, ఎట్టి పోలిక, సామ్యం లేకుండా ప్రతి దానిని సృజించేవాడు. లేమి నుండి ఉనికి లోకి తెచ్చేవాడు. చూడండి: 2:54 అల్-ము'సవ్విరు: The Fashioner, of all existing things, రూపమిచ్చేవాడు, తాను కోరిన విధంగా తన సృష్టి రూపాన్ని తీర్చిదిద్దేవాడు. 3:6. అల్-'హకీము: All-Wise, Possessing knowledge or Science, Omniscient, మహో వివేకవంతుడు, వివేచనాపరుడు. చూడండి, 2:32. ఇంకా చూడండి, 7:180. ఇవి అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లు.

# 60. అల్-ముమ్తహనహ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఓ విశ్వాసులారా! నాకు శత్రువులైన వారిని మరియు మీకు కూడా శత్రువులైన వారిని - వారి మీద ప్రేమ చూపిస్తూ - వారిని మీ స్నేహితులుగా చేసుకోకండి[1]. మరియు వాస్తవానికి వారు మీ వద్దకు వచ్చిన సత్యాన్ని తిరస్కరించారు. మీ ప్రభువైన అల్లాహ్ ను మీరు విశ్వసించి నందుకు, వారు ప్రవక్తను మరియు మిమ్మల్ని (మీ నగరం నుండి) వెడలగొట్టారు! ఒకవేళ మీరు నా ప్రసన్నత

---

[*] [అల్-ముమ్తహనహ్ అంటే పరీక్షించబడిన ఆమె]

[1] 'హుదైబియా సంధి అయిన కొన్ని రోజుల తరువాత మక్కా ముష్రిక్ లు దానిని ఉల్లంఘిస్తారు. దానికి దైవప్రవక్త ('స'అస) రహస్యంగా యుద్ధసన్నాహాలు ప్రారంభిస్తారు. 'హా'తిబ్ బిన్ అబీ బల్త్'అ (ర.'ది.'అ.) అనే బదరీ 'స'హాబీ ఈ విషయాన్ని ఒక పత్రం మీద వ్రాసి మక్కాకు పోయే ఒక స్త్రీకి ఇస్తాడు. ఈ విషయం దైవప్రవక్త ('స'అస) కు వహీ ద్వారా తెలుస్తుంది. అతను ('స'అస) అలీ, ముఖ్దాద్ మరియు 'జుబైర్ (ర'ది.'అన్హుమ్)లతో: రవ్'దయే'ఖా'ఖ్, దగ్గర ఒక స్త్రీ ఉంది. ఆమె దగ్గర ఒక ఉత్తరం ఉంది. దానిని తీసుకురండి!' అని పంపుతారు. వారు ఆ ఉత్తరాన్ని ఆమె తల వెంట్రుకల నుండి తీయించి తెస్తారు. 'హా'తిబ్ (ర'ది.'అ.) ను ప్రశ్నించగా: 'నేను ఖురైషును కాను. నా భార్యాపిల్లలు మక్కాలో నిస్సహాయులుగా ఉన్నారు. నేను ఖురైషులకు ఈ వార్త ఇస్తే వారు నా భార్యాపిల్లల పట్ల కనికరులుగా ఉంటారని ఇలా చేశాను.' అని అంటాడు. దైవప్రవక్త ('స'అస) అతని సత్యాన్ని తెలుసుకొని అతనిని క్షమిస్తారు. ఆ సందర్భంలో ఈ ఆయత్ అవతరింపజేయబడింది. ('స.'బుఖారీ, 'స.ముస్లిం).

కోరి నా మార్గంలో ధర్మయుద్ధం కొరకు వెళితే (ఈ సత్యతిరస్కారులను మీ స్నేహితులుగా చేసుకోకండి). వారి పట్ల వాత్సల్యం చూపుతూ మీరు వారికి రహస్యంగా సందేశం పంపుతారా! మీరు దాచేది మరియు వెలిబుచ్చేది, నాకు బాగా తెలుసు. మరియు మీలో ఎవడైతే ఇలా చేస్తాడో, అతడు వాస్తవంగా, ఋజుమార్గం నుండి తప్పిపోయినవాడే!

2. ఒకవేళ వారు మీ మీద ప్రాబల్యం వహిస్తే, వారు మీకు విరోధులవుతారు. మరియు కీడుతో మీ వైపుకు తమ చేతులను మరియు తమ నాలుకలను చాపుతారు[2]. మరియు మీరు కూడా సత్యతిరస్కారులై పోవాలని కోరుతారు.

3. మీ బంధువులు గానీ, మీ సంతానం గానీ మీకు ఏ విధంగానూ పనికిరారు[3]. ఆయన పునరుత్థాన దినాన మీ మధ్య తీర్పు చేస్తాడు మరియు అల్లాహ్ మీరు చేసేదంతా చూస్తున్నాడు.

4. వాస్తవానికి ఇబ్రాహీమ్ మరియు అతనితో ఉన్న వారిలో మీ కొరకు ఒక మంచి ఆదర్శం ఉంది. వారు తమ జాతి వారితో ఇలా అన్నప్పుడు: "నిశ్చయంగా, అల్లాహ్ ను వదలి మీరు ఆరాధించే వాటితో మరియు మీతో, మాకు ఎలాంటి సంబంధం లేదు. మేము మిమ్మల్ని త్యజించాము మరియు మీరు అద్వితీయుడైన అల్లాహ్ ను విశ్వసించనంత

---

[2] అంటే తమ చేష్టలతో మరియు మాటలతో మిమ్మల్ని వేధిస్తారు.
[3] చూడండి, 80:34.

వరకు, మాకూ మీకూ మధ్య విరోధం మరియు ద్వేషం ఉంటుంది." ఇక ఇబ్రాహీమ్ తన తండ్రితో: "నేను తప్పక నిన్ను క్షమించమని (నా ప్రభువును) వేడుకుంటాను. ఇది తప్ప, నీ కొరకు అల్లాహ్ నుండి మరేమీ పొందే అధికారం నాకు లేదు." అని మాత్రమే అనగలిగాడు[4]. (అల్లాహ్ తో ఇలా ప్రార్థించాడు): "ఓ నా ప్రభూ! మేము నిన్నే నమ్ముకున్నాము[5] మరియు నీవైపునకే పశ్చాత్తాపం తో మరలుతున్నాము మరియు నీ వైపుకే మా గమ్యస్థానముంది.

5. ఓ మా ప్రభూ! మమ్మల్ని సత్యతిరస్కారుల కొరకు పరీక్షా సాధనంగా చేయకు[6] మరియు ఓ మా ప్రభూ! మమ్మల్ని క్షమించు. నిశ్చయంగా కేవలం, నీవే సర్వశక్తిమంతుడవు, మహా వివేచనాపరుడవు."

---

[4] కాని అతని తండ్రి ముష్రిక్ గా మరణించిన తరువాత ఇబ్రాహీమ్ ('అ.స.) తన తండ్రితో సంబంధం తెంపు కున్నాడు. చూడండి, 9:114 మరియు చూడండి, 195:47-48.

[5] తవక్కల్: అంటే వీలైనంత వరకు ప్రయత్నం చేసి, ఆ తరువాత అల్లాహ్ (సు.తా.) పై నమ్మకం ఉంచుకొని, అల్లాహ్ (సు.తా.) పై ఆధారపడాలి. అలా చేయకుండా అల్లాహ్ (సు.తా.) పైన మాత్రమే ఆధారపడి ఉంటామనడం తగినది కాదు. దైవప్రవక్త ('స'అస) దగ్గరకు ఒక వ్యక్తి వస్తాడు. అతడు తన ఒంటెను బయటవిడిచి లోపలికి వెళ్తాడు. దైవప్రవక్త ('స'అస) అడగ్గా ఇలా అంటాడు: 'నేను ఒంటెను అల్లాహ్ కు అప్పగించి వచ్చాను.' దైవప్రవక్త ('స'అస) అంటారు: 'ఇది తవక్కల్ కాదు. మొదట దానిని కట్టి ఉంచు తరువాత అల్లాహ్ (సు.తా.) పై ఆధారపడు!' (తిర్మిజీ')

[6] ఇటువంటి ఆయత్ కు చూడండి, 10:85.

6. వాస్తవంగా! మీకు - అల్లాహ్ ను మరియు అంతిమ దినాన్ని అపేక్షించేవారికి[7] - వారిలో ఒక మంచి ఆదర్శం ఉంది. మరియు ఎవడైనా దీని నుండి మరలిపోతే! నిశ్చయంగా, అల్లాహ్ నిరపేక్షాపరుడు, సర్వస్తోత్రాలకు అర్హుడు (అని తెలుసుకోవాలి).

7. బహుశా, అల్లాహ్ మీ మధ్య మరియు మీకు విరోధులైన వారి మధ్య ప్రేమ కలిగించవచ్చు. మరియు అల్లాహ్ (ప్రతిదీ చేయగల) సమర్థుడు. మరియు అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

8. ఎవరైతే ధర్మవిషయంలో మీతో యుద్ధం చేయరో మరియు మిమ్మల్ని మీ గృహాల నుండి వెళ్ళగొట్టరో! వారి పట్ల మీరు సత్ప్రవర్తనతో మరియు న్యాయంతో వ్యవహరించటాన్ని అల్లాహ్ నిషేధించలేదు[8]. నిశ్చయంగా, అల్లాహ్ న్యాయవర్తనులను ప్రేమిస్తాడు[9].

---

[7] చూడండి, 33:21.

[8] ఎలాంటి సత్యతిరస్కారులతో సత్ప్రవర్తనతో వ్యవహరించాలో వారి వివరాలు ఇక్కడ ఇవ్వబడ్డాయి. ఒకటి: మీరు కేవలం ముస్లింలు అయినందుకు మీతో శత్రుత్వం వహించి మీతో పోరాడని వారితో, రెండు: మిమ్మల్ని మీ ఇల్లూ వాకిలి విడిచి పొమ్మని బలవంతం చేయని వారితో! మూడు: మీకు విరుద్ధంగా ఇతర సత్యతిరస్కారులకు సహాయపడని వారితో!

[9] దైవప్రవక్త ('స'అస) ను అస్మా బిన్తె అబూ బక్ర్ సిద్దీఖ్ (ర'అన్హా), ముష్రిక్ రాలైన తన తల్లితో ఎలా వ్యవహరించాలని అడిగారు. అతను ('స'అస) ఇలా జవాబిచ్చారు: 'నీ తల్లితో రక్తసంబంధాన్ని ఉంచుకో!' ('స'హీ'హ్ ముస్లిం, 'స'హీ'హ్ బు'ఖారీ) మరొక విషయం ఏమిటంటే బంధువులు కాని సత్యతిరస్కారులతో కూడ న్యాయంగా ప్రవర్తించాలి.

9. కాని, వాస్తవానికి ఎవరైతే, ధర్మ విషయంలో మీతో యుద్ధం చేస్తారో మరియు మిమ్మల్ని మీ ఇండ్ల నుండి వెళ్ళగొడ్తారో మరియు మిమ్మల్ని వెళ్ళగొట్టటంలో పరస్పరం సహకరించు కుంటారో; వారితో స్నేహం చేయటాన్ని అల్లాహ్ మీ కొరకు నిషేధిస్తున్నాడు.
మరియు ఎవరైతే వారితో స్నేహం చేస్తారో, అలాంటి వారు, వారే! దుర్మార్గులు[10].

10. ఓ విశ్వాసులారా! విశ్వసించిన స్త్రీలు, మీ వద్దకు వలస వచ్చినపుడు, వారిని పరీక్షించండి[11]. అల్లాహ్ కు వారి విశ్వాసం గురించి బాగా తెలుసు. వారు వాస్తవంగా విశ్వసించిన వారని మీకు తెలిసినప్పుడు, వారిని సత్యతిరస్కారుల వద్దకు తిరిగి పంపకండి. (ఎందుకంటే) ఆ స్త్రీలు వారికి

---

[10] చూడండి, 5:51.

[11] 6వ హిజ్రీలో జరిగిన 'హుదైబియా ఒప్పందంలో ఏ వ్యక్తి అయినా మక్కా నుండి మదీనాకు వెళ్ళిపోతే ఆ వ్యక్తిని మక్కావారు - తిరిగి ఇవ్వమని అడిగితే - ఇవ్వాలి అనే షర్త్ ఉండింది. కాని అందులో స్త్రీపురుషుల విషయం స్పష్టంగా లేదు. దానిని బట్టి ముస్లిమై మదీనాకు వచ్చిన స్త్రీలను వాపసు ఇవ్వండి అని మక్కా ముష్రిక్ లు కోరగా, ఈ ఆయత్ అవతరింప జేయబడింది. వారు కేవలం ఇస్లాం కొరకే వచ్చారని నిర్ధారణ చేసుకోవాలని ఆజ్ఞ ఉంది. యుక్త వయస్కుడైన పురుషునికి లేక స్త్రీకి తనకు నచ్చిన ధర్మాన్ని అనుసరించే హక్కు ఉంది. ఈ ఆయత్ అవతరించక ముందు చాలా మంది ముస్లింల భర్తలు లేక భార్యలు ముష్రికులుగా ఉండేవారు. ఉదాహరణకు దైవప్రవక్త ('స'అస) బిడ్డ 'జైనబ్ (ర. 'అన్హా) భర్త అబుల్ 'ఆ'స్ బిన్ రబీ'అ, ముష్రిక్ గా ఉండేవారు. అతను బద్ర్ యుద్ధపు కొంత కాలం తరువాత ఇస్లాం స్వీకరించి మదీనాకు వచ్చారు.

(సత్యతిరస్కారులకు) ధర్మసమ్మతమైన (భార్యలు) కారు మరియు వారు కూడా ఆ స్త్రీలకు ధర్మసమ్మతమైన (భర్తలు) కారు. కాని, వారు (సత్యతిరస్కారులు), వారికిచ్చిన (మహ్ర్) మీరు వారికి చెల్లించండి మరియు వారికి వారి మహ్ర్ ఇచ్చిన తరువాత, ఆ స్త్రీలను వివాహమాడితే మీకు ఎలాంటి దోషం లేదు మరియు మీరు కూడా సత్యతిరస్కారులైన స్త్రీలను మీ వివాహబంధంలో ఉంచుకోకండి. (అవిశ్వాసులుగా ఉండి పోదలచిన) మీ భార్యల నుండి మీరు ఇచ్చిన మహర్ అడిగి తీసుకోండి[12]. (అలాగే అవిశ్వాసులను, విశ్వాసులైన తమ) భార్యల నుండి మహ్ర్ అడిగి తీసుకోనివ్వండి[13]. ఇది అల్లాహ్ తీర్మానం. ఆయన ఈ విధంగా మీ మధ్య తీర్పు చేస్తున్నాడు. మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేచనాపరుడు.

11. మరియు ఒకవేళ మీ (విశ్వాసుల) భార్యలలో ఒకామె, మిమ్మల్ని విడిచి సత్యతిరస్కారుల వద్దకు వెళ్ళిపోతే! (ఆ సత్యతిరస్కారులు, మీరు ఆ స్త్రీలకు చెల్లించిన మహ్ర్ మీకు వాపసు ఇవ్వడానికి నిరాకరిస్తే)! ఆ తరువాత మీకు వారితో ప్రతీకారం తీర్చుకునే అవకాశం దొరికితే

[12] 'ఉమర్ (ర'ది.'అ.) గారి ఇద్దరు భార్యలు ముష్రికులు. ఈ ఆయత్ అవతరణ తరువాత అతను వారికి విడాకులిచ్చారు.

[13] ఒక స్త్రీ ఇస్లాం స్వీకరించగానే ఆమె ముష్రిక్ భర్తతో ఆమె వివాహబంధం వెంటనే తెగిపోతుంది. అతడు ఆమె నుండి తన మహ్ర్ వాపసు తీసుకోవచ్చు.

(మీరు వారిపై యుద్ధం చేసి విజయం పొందితే)[14]! దాని (విజయ ధనం) నుండి, ఎవరి భార్యలైతే సత్యతిరస్కారుల వద్దకు పోయారో వారికి - వారు (తమ భార్యలకు) ఇచ్చిన దానికి (మహ్ర్ కు) సమానంగా - చెల్లించండి. మరియు మీరు విశ్వసించిన అల్లాహ్ యందు, భయభక్తులు కలిగి ఉండండి.

12. ఓ ప్రవక్తా! విశ్వసించిన స్త్రీలు ప్రమాణం (బైఅత్) చేయటానికి నీ వద్దకు వచ్చి, తాము ఎవరినీ అల్లాహ్ కు సాటి కల్పించము అని మరియు దొంగతనం చేయము అని మరియు వ్యభిచారం చేయము అని మరియు తమ సంతానాన్ని హత్య చేయము అని మరియు తమ చేతుల మధ్య మరియు తమ కాళ్ళ మధ్య నిందారోపణ కల్పించము అని మరియు ధర్మసమ్మతమైన విషయాలలో నీకు అవిధేయత చూపము అని, ప్రమాణం చేస్తే, వారి నుండి ప్రమాణం (బైఅత్)

[14] 'ఆఖబ్ తుమ్(దీని మరొక వ్యాఖ్యానం): ప్రతీకారం తీసుకునే అవకాశం దొరికితే అంటే ముష్రికుల భార్యలు కూడా ముస్లింలై, ముస్లింల దగ్గరికి వస్తే వారి-ఆ ముస్లిం అయిన స్త్రీల-మహ్ర్ వారి మొదటి ముష్రిక్ భర్తలకు చెల్లించక, దాని నుండి ఏ ముస్లింల భార్యలైతే ముష్రికులై వెళ్ళిపోయారో ఆ పురుషులకు చెల్లించాలి

తీసుకో[15] మరియు వారిని క్షమించమని అల్లాహ్ ను ప్రార్థించు. నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

**13.** ఓ విశ్వాసులారా! అల్లాహ్ ఆగ్రహానికి గురి అయిన జాతి వారిని స్నేహితులుగా చేసు కోకండి[16]. వాస్తవానికి గోరీలలో ఉన్న సత్యతిరస్కారులు, నిరాశ చెందినట్లు వారు కూడా పరలోక జీవితం పట్ల నిరాశ చెంది ఉన్నారు.

---

[15] ఈ విధమైన ప్రమాణం దైవప్రవక్త('స'అస) ఇస్లాం స్వీకరించి, ముష్రికులను వదలి వచ్చే స్త్రీల చేత చేయించేవారు. మరియు 8వ హిజ్రీలో మక్కావిజయం తరువాత కూడా చేయించారు. కానీ శపథం చేయించే టప్పుడు దైవప్రవక్త ఏ స్త్రీని కూడా ముట్టుకోలేదు అంటే చేతిపై చేయి పెట్టి ప్రమాణం చేయించ లేదు, కేవలం వారి నోటితో మాత్రమే ప్రమాణం చేయించారు! ('స'హీ'హ్ బు'ఖారీ - 'ఆయి'షహ్ (ర.'అన్హా) కథనం).

[16] చూడండి, 58.14

# 61. అస్-సఫ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఆకాశాలలోనున్న సమస్తమూ మరియు భూమిలోనున్న సమస్తమూ, అల్లాహ్ పవిత్రతను కొనియాడుతూ ఉంటాయి. మరియు ఆయనే సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు.
2. ఓ విశ్వాసులారా! మీరు చేయని దానిని ఎందుకు పలుకుతున్నారు?[1]
3. మీరు చేయని దానిని పలకటం అల్లాహ్ దృష్టిలో చాలా అసహ్యకరమైన విషయం.
4. నిశ్చయంగా, అల్లాహ్! తన మార్గంలో దృఢమైన కట్టడం వలే బారులు తీరి పోరాడే వారిని ప్రేమిస్తాడు.
5. మరియు మూసా తన జాతివారితో ఇలా అన్న విషయం (జ్ఞాపకం చేసుకోండి): "ఓ నా జాతి ప్రజలారా! వాస్తవానికి, నేను మీ వద్దకు పంపబడిన అల్లాహ్ యొక్క సందేశహరుడనని రూఢిగా తెలిసి కూడా, మీరు నన్ను ఎందుకు బాధిస్తున్నారు?" అయినా వారు వక్రమార్గం అవలంబించినందుకు,

---

[*] [అస్-సఫ్ - శ్రేణులు, బారులు, పంక్తులు]

[1] ఈ ఆయత్ ఉ'హూద్ యుద్ధరంగంలో దైవప్రవక్త ('స'అస) అనుమతి లేనిదే తమ స్థానాలను వదలి విజయధనాన్ని ప్రోగు చేసుకోవటానికి వెళ్ళిన 'స'హాబా (ర.'ది. 'అన్హుమ్) లను గురించి ఉంది.

అల్లాహ్ వారి హృదయాలను వక్రమార్గంలో పడవేశాడు. మరియు అల్లాహ్ దుర్జనులకు (ఫాసిఖీన్ లకు) సన్మార్గం చూపడు.

**6.** మరియు మర్యమ్ కుమారుడు ఈసా[2] (తన జాతివారితో) ఇలా అన్నది (జ్ఞాపకం చేసుకోండి): "ఓ ఇస్రాయీల్ సంతతి వారలారా! నిశ్చయంగా, నేను మీ వద్దకు పంపబడిన అల్లాహ్ యొక్క సందేశహరుణ్ణి, నాకు పూర్వం, వచ్చి ఉన్న తౌరాత్ గ్రంథాన్ని ధృవ పరుస్తున్నాను. మరియు నా తరువాత అహ్మద్[3] అనే సందేశహరుడు రాబోతున్నాడు, అనే శుభవార్తను ఇస్తున్నాను."

---

[2] ఇస్రాయీ'ల్ సంతతివారు ఏ విధంగా మూసా ('అ.స.) ఆదేశాలను ఉల్లంఘించారో! అదే విధంగా వారు 'ఈసా ('అ.స.) ను కూడా తిరస్కరించారు. అలాంటప్పుడు దైవప్రవక్త ము'హమ్మద్ ('స'అస)ను యూదులు తిరస్కరించడం క్రొత్త విషయమేమీ కాదు. వారి చరిత్ర చూస్తే వారు ఎందరో దైవప్రవక్త ('అ.స.)లను తిరస్కరించారు మరియు కొందరిని చంపారు. 'ఈసా ('అ.స.) తౌరాతును ధృవపరిచారు.

[3] 'ఈసా ('అ.స.) తన తరువాత అ'హ్మద్ అనే ప్రవక్త ('స'అస) రానున్నాడు, అనే శుభవార్తను వినిపిస్తున్నారు. అతను ('స'అస) ఇలా అన్నారు: 'నేను నా తండ్రి, ఇబ్రాహీమ్ ('అ.స.) ప్రార్థన (దు'ఆ)ను మరియు 'ఈసా ('అ.స.) సూచన (బషారత్) ను' (అయ్ సర్ అత్తఫాసీర్). 'హమ్ద్ అంటే ప్రశంస (praise, laudation). అ'హ్మద్ అనే పదాన్ని దాని ఫా'ఇల్ రూపంలో తీసుకుంటే అల్లాహుతాలాను అందరికంటే అధికంగా స్తుతించేవాడు మరియు మఫ్'ఊల్ రూపంలో తీసుకుంటే అత్యధికంగా కొనియాడ బడినవాడు, అనే అర్థాలు వస్తాయి. (ఫ'త్హ్ అల్-ఖదీర్).

తరువాత అతను (అహ్మద్)[4] వారి వద్దకు, స్పష్టమైన సూచనలు తీసుకొని వచ్చినపుడు వారు ఇలా అన్నారు: "ఇది కేవలం స్పష్టమైన మంత్రజాలమే!"

7. తనను ఇస్లామ్ వైపునకు పిలిచినప్పుడు అల్లాహ్ మీద అపనిందలు మోపేవాని కంటే పరమదుర్మార్గుడు ఎవడు? మరియు అల్లాహ్ దుర్మార్గులైన ప్రజలకు మార్గదర్శకత్వం చేయడు

8. వారు అల్లాహ్ జ్యోతిని (ఇస్లాంను) తమ నోటితో ఊది, ఆర్పి వేయాలనుకుంటున్నారు. కాని సత్యతిరస్కారులకు ఎంత అసహ్యకరమైనా! అల్లాహ్ తన జ్యోతిని వ్యాపింప జేయాలని నిర్ణయించుకున్నాడు.

9. ఆయనే, తన ప్రవక్తకు మార్గదర్శకత్వాన్ని మరియు సత్యధర్మాన్ని ఇచ్చి పంపి, దానిని సకల ధర్మాలపై ఆధిక్యత వహించే ధర్మంగా చేశాడు[5] - అది బహుదైవారాధకులకు ఎంత అసహ్యకరమైనా!

10. ఓ విశ్వాసులారా! మిమ్మల్ని బాధాకరమైన శిక్ష నుండి కాపాడే వ్యాపారాన్ని మీకు సూచించాలా?[6]

---

[4] హిందూ ధర్మగ్రంథాలలో కూడా అ'హ్మద్'అనే అంతిమఋషి రానున్నాడని ఎన్నోచోట్లలో పేర్కొన బడింది

[5] చూడండి, 3:19.

[6] అంటే విశ్వాసం మరియు అల్లాహ్ (సు.తా.) మార్గంలో జిహాద్. ఎందుకంటే వీటిలో కూడా వ్యాపారంలో దొరికినట్లు లాభం దొరుకుతుంది. అది స్వర్గప్రవేశం. దీని కంటే మంచి లాభం ఇంకేముంటుంది. ఇంకా చూడండి, 9:111.

**11.** (అది), మీరు అల్లాహ్ ను మరియు ఆయన ప్రవక్తను విశ్వసించడం మరియు అల్లాహ్ మార్గంలో మీ సంపదలను మరియు మీ ప్రాణాలను వినియోగించి పోరాడటం. మీరు తెలుసుకుంటే! ఇదే మీకు ఎంతో మేలైనది.

**12.** (ఇలా చేస్తే) ఆయన మీ పాపాలను క్షమిస్తాడు మరియు మిమ్మల్ని క్రింద సెలయేళ్ళు ప్రవహించే స్వర్గవనాలలో[7] ప్రవేశింపజేస్తాడు. మరియు శాశ్వతమైన స్వర్గవనాలలో మంచి గృహాలను ప్రసాదిస్తాడు. అదే ఆ గొప్ప విజయం.

**13.** మరియు మీకు ప్రీతికరమైన, మరొక (అనుగ్రహం) కూడా ఉంది! (అది) అల్లాహ్ సహాయం మరియు శీఘ్ర విజయం. మరియు ఈ శుభవార్తను విశ్వాసులకు తెలుపు[8].

**14.** ఓ విశ్వాసులారా! మర్యమ్ కుమారుడు ఈసా తన శిష్యులకు (హవారియ్యూన్ లకు) ఉపదేశించిన విధంగా, మీరు కూడా అల్లాహ్ కు సహాయకులుగా ఉండండి. (ఆయన వారితో ఇలా అన్నాడు): "అల్లాహ్ మార్గంలో నాకు తోడ్పడేవారు ఎవరు?" ఆ శిష్యులు ఇలా జవాబిచ్చారు: "మేము అల్లాహ్ (మార్గంలో) తోడ్పడే వారము!" అప్పుడు ఇస్రాయీల్ సంతతి వారిలో ఒక వర్గం

---

[7] చూడండి, 38:50.

[8] మీరు అల్లాహ్ (సు.తా.) మార్గంలో పోరాడితే మీకు విజయం లభిస్తుంది. చూడండి, 47:7 మరియు 22:40 ఇంకా చూడండి 3:139.

వారు విశ్వసించారు, మరొక వర్గం వారు తిరస్కరించారు. తరువాత మేము విశ్వసించిన వారికి, వారి శత్రువులకు వ్యతిరేకంగా సహాయం చేశాము, కావున వారు ఆధిక్యతను పొందారు.

# 62. అల్-జుమఅహ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఆకాశాలలో నున్నవి మరియు భూమిలో నున్నవి, సమస్తమూ విశ్వసార్వభౌముడు[1], పరమ పవిత్రుడు, సర్వశక్తిమంతుడు, మహావివేకవంతుడు అయిన అల్లాహ్ పవిత్రతను కొనియాడుతూ ఉంటాయి.

2. ఆయనే ఆ నిరక్ష్యరాస్యులైన[2] వారిలో నుండి ఒక సందేశహరుణ్ణి లేపాడు. అతను వారికి ఆయన సూచనలను (ఆయాత్‌లను) చదివి వినిపిస్తున్నాడు. మరియు వారిని సంస్కరిస్తున్నాడు మరియు వారికి గ్రంథాన్ని మరియు వివేకాన్ని బోధిస్తున్నాడు. మరియు వాస్తవానికి వారు, అంతకు పూర్వం స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడి ఉండేవారు.

3. మరియు ఇంకా వారిలో చేరని ఇతరులకు కూడా (బోధించటానికి). మరియు ఆయన సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు.

---

[*] [అల్-జుమఅహ్ అంటే శుక్రవారము, సమ్మేళన దినము, సమావేశ దినము]

[1] చూడండి, 20:114 వ్యాఖ్యానం 3.

[2] అల్-ఉమ్మియ్యూన: నిరక్షరాస్యులు. అంటే ఆ కాలంలో అరబ్బులలో చాలామందికి చదవటం వ్రాయటం వచ్చేది కాదు. స్వయంగా ప్రవక్త ('స'అస) కూడా నిరక్షరాస్యులే. చూడండి, 7:157-158.

4. ఇది అల్లాహ్ అనుగ్రహం, ఆయన దానిని తాను కోరిన వారికి ప్రసాదిస్తాడు. మరియు అల్లాహ్ అనుగ్రహశాలి, సర్వోత్తముడు.

5. తౌరాత్ బాధ్యత (భారం) మోపబడిన తరువాత దానిపై అమలు చేయలేక పోయిన వారి పోలిక, పుస్తకాల భారాన్ని మోసే ఆ గాడిద వలే ఉంది. (వారు ఆ భారాన్ని భరించారే గానీ, దానిని అర్థం చేసుకోలేక పోయారు). అల్లాహ్ సూచన (ఆయాత్) లను తిరస్కరించినవారి దృష్టాంతము ఎంత చెడ్డది. మరియు అల్లాహ్ దుర్మార్గులకు మార్గదర్శకత్వం చేయడు.

6. వారితో ఇలా అను: "ఓ యూదులారా! నిశ్చయంగా, ఇతర ప్రజల కంటే మీరు మాత్రమే అల్లాహ్ కు ప్రియమైన వారు (స్నేహితులు) అనే భావం మీకుంటే, మీ (వాదంలో) మీరు సత్యవంతులే అయితే మీరు చావును కోరండి[3]

7. కాని వారు తాము చేసి పంపుకున్న కర్మల (ఫలితాల)కు భయపడి దానిని ఏ మాత్రం కోరుకోరు![4] మరియు అల్లాహ్ కు దుర్మార్గులను గురించి బాగా తెలుసు.

8. వారితో ఇలా అను: "వాస్తవానికి ఏ చావు నుండి అయితే మీరు పారిపోతున్నారో! నిశ్చయంగా, అదే మిమ్మల్ని పట్టుకుంటుంది. ఆ తరువాత మీరు, అగోచర మరియు గోచర విషయాలు

---

[3] చూడండి, 5:18 మరియు 2:111.
[4] చూడండి, 2:94.

తెలిసిన ఆయన (అల్లాహ్) వైపునకు మరలింపబడతారు, అప్పుడు ఆయన మీరు చేస్తూ ఉండిన కర్మలను మీకు తెలుపుతాడు."

9. ఓ విశ్వాసులారా! శుక్రవారం (జుముఅహ్) రోజు నమాజ్ కొరకు పిలుపు ఇవ్వబడి నప్పుడు, మీరు మీ వ్యాపారాలను విడిచి అల్లాహ్ స్మరణ వైపునకు పరుగెత్తండి. మీరు తెలుసుకోగలిగితే అది మీకు ఎంతో ఉత్తమమైనది.

10. ఇక నమాజ్ పూర్తి అయిన తరువాత భూమిలో వ్యాపించండి మరియు అల్లాహ్ అనుగ్రహాన్ని అన్వేషించండి మరియు మీరు సాఫల్యం పొందాలంటే అల్లాహ్ ను అత్యధికంగా స్మరిస్తూ ఉండండి!

11. మరియు (ఓ ముహమ్మద్!) వారు వ్యాపారాన్ని గానీ లేదా వినోద క్రీడను గానీ చూసినప్పుడు, నిన్ను నిలబడివున్న స్థితిలోనే వదలిపెట్టి, దాని చుట్టు గుమి గూడుతారు[5]. వారితో ఇలా అను: "వినోద క్రీడల కంటే మరియు వ్యాపారం కంటే, అల్లాహ్ వద్ద ఉన్నదే ఎంతో ఉత్తమమైనది. మరియు అల్లాహ్ యే జీవనోపాధి ప్రసాదించటంలో అత్యుత్తముడు."

---

[5] ఒక జుము'అహ్ రోజున దైవప్రవక్త('స'అస) జుము'అహ్ ఉపన్యాసం(ఖుత్బా) ఇస్తుంటారు. అప్పుడు ఒక వ్యాపార బృందం మదీనాలో ప్రవేశిస్తుంది. అప్పుడు ఖుత్బా వింటున్న వారిలో నుండి చాలామంది ఉపన్యాసాన్ని వదలి, వస్తువులు అయిపోక ముందే త్వరగా కొనుక్కుందాం అనే పేరాశతో వెళ్ళిపోతారు. కేవలం 12 మంది మాత్రమే మస్జిదులో మిగిలి పోతారు. అప్పుడు ఈ ఆయత్ అవతరింప జేయబడింది. చూడండి, 15:23.

# 63. అల్-మునాఫిఖూన్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. (ఓ ప్రవక్తా!) ఈ కపట విశ్వాసులు (మునాఫిఖూన్) నీ వద్దకు వచ్చినపుడు[1], ఇలా అంటారు: "నీవు అల్లాహ్ యొక్క సందేశహరుడవని మేము సాక్ష్యమిస్తున్నాము." మరియు నిశ్చయంగా, నీవు ఆయన సందేశహరుడవని అల్లాహ్ కు తెలుసు మరియు ఈ కపట విశ్వాసులు, నిశ్చయంగా అసత్యవాదులని అల్లాహ్ సాక్ష్యమిస్తున్నాడు.
2. వారు తమ ప్రమాణాలను ఢాలుగా చేసుకున్నారు. ఆ విధంగా వారు (ఇతరులను) అల్లాహ్ మార్గం నుండి నిరోధిస్తున్నారు[2]. నిశ్చయంగా, వారు చేస్తున్న చేష్టలు ఎంతో నీచమైనవి.
3. ఇది నిశ్చయంగా, వారు విశ్వసించిన తరువాత సత్యతిరస్కారులవటం మూలంగానే జరిగింది కావున వారి హృదయాల మీద ముద్ర వేయబడి ఉంది. కనుక వారు ఏమీ అర్థం చేసుకోలేరు.
4. మరియు నీవు గనక వారిని చూస్తే! వారి రూపాలు నీకు ఎంతో అద్భుతమైనవిగా కనిపిస్తాయి.

---

[*] [అల్-మునాఫిఖూన్ అంటే కపటులు]

[1] ఇక్కడ 'అబ్దుల్లాహ్ బిన్ ఉబై మరియు అతని తోటివారిని గురించి చెప్పబడుతోంది.

[2] ఇటువంటి వాక్యానికై చూడండి, 58:16.

మరియు వారు మాట్లాడినప్పుడు, నీవు వారి మాటలను వింటూ ఉండి పోతావు. నిశ్చయంగా, వారు గోడకు ఆనించబడిన మొద్దువలే ఉన్నారు. వారు ప్రతి అరుపును తమకు వ్యతిరేకమైనదిగానే భావిస్తారు. వారు శత్రువులు, కావున వారి పట్ల జాగ్రత్తగా ఉండు. అల్లాహ్ వారిని నాశనం చేయుగాక![3] వారెంత పెడమార్గంలో పడి వున్నారు.

5. మరియు వారితో: "రండి, అల్లాహ్ ప్రవక్త మీ క్షమాపణ కొరకు (అల్లాహ్ ను) ప్రార్థిస్తాడు." అని అన్నప్పుడు, వారు తమ తలలు త్రిప్పుకోవటాన్ని మరియు దురహంకారంతో మరలి పోవటాన్ని నీవు చూస్తావు.

6. (ఓ ప్రవక్తా!) నీవు వారి కొరకు క్షమాపణ కోరినా లేక క్షమాపణ కోరకపోయినా వారి విషయంలో రెండూ సమానమే! (ఎందుకంటే) అల్లాహ్ వారిని ఎంత మాత్రం క్షమించడు. నిశ్చయంగా, అల్లాహ్ అవిధేయులకు మార్గదర్శకత్వం చేయడు[4].

7. వారే (కపట విశ్వాసులే) ఇలా అంటూ ఉండేవారు: "అల్లాహ్ సందేశహరుని వద్దనున్న వారిపై మీరు ఖర్చు చేయకుండా ఉంటే! చివరకు వారే

[3] ఇట్టి వాక్యానికై చూడండి, 9:30.
[4] చూడండి, 9:80.

చెల్లాచెదురై పోతారు[5]." వాస్తవానికి ఆకాశాలలో మరియు భూమిలోనున్న సమస్త కోశాగారాలు అల్లాహ్ కే చెందినవి. కాని ఈ కపట విశ్వాసులు అది గ్రహించలేరు.

8. వారు (కపట విశ్వాసులు) ఇంకా ఇలా అంటున్నారు: "మనం మదీనా నగరానికి తిరిగి వెళ్ళినతరువాత, నిశ్చయంగా గౌరవనీయులమైన (మనం), అక్కడ వున్న తుచ్ఛమైన వారిని తప్పక వెడలగొడదాం." మరియు గౌరవమనేది అల్లాహ్ కు, ఆయన సందేశహరునికి మరియు విశ్వాసులకు మాత్రమే చెందినది, కాని ఈ కపట విశ్వాసులకు అది తెలియదు.

9. ఓ విశ్వాసులారా! మీ సంపదలు, మీ సంతానం

---

[5] దైవప్రవక్త ('స'అస) మదీనా రాకముందు 'అబ్దుల్లాహ్ బిన్ ఉబై మదీనావాసుల నాయకుడయ్యే సూచనలుంటాయి. దైవప్రవక్త ('స'అస) ప్రాబల్యం హెచ్చయి అతని ('స'అస) అనుచరు (ర'ది.'అన్హుమ్)ల సంఖ్య దినదినానికి పెరగటం చూసి, అతడు బాహ్యంగా ముస్లిం అయినా! అతని హృదయంలో దైవప్రవక్త ('స'అస) మరియు ముస్లింల పట్ల ద్వేషం ఉంటుంది. కావున అతడు వారిని ఎత్తిపొడవటానికి ఏ అవకాశం దొరికినా వదిలేవాడు కాదు. బనీ ము'స్'తలిఖ్ 'గజ్ వ నుండి తిరిగి వస్తున్నప్పుడు ఒక అన్సారి మరియు ఒక ముహాజిర్ (ర'ది.'అన్హుమ్)ల మధ్య చిన్న కలహం చెలరేగుతుంది. వారిద్దరు తమ తమ తెగలవారిని పిలుచుకుంటారు. అప్పుడు సమయం చూసి 'అబ్దుల్లాహ్ బిన్ ఉబై అన్సారులతో: 'చూశారా! మీదే తిని ఇప్పుడు మీ మీదికే వస్తున్నారు, ఈ ముహాజిర్ లు! వీరికి పెట్టడం మానేస్తే, మదీనా విడచి పోతారు!' ఈ మాటలు 'జైద్ బిన్-అర్ ఖమ్ (ర'ది.'అ) దైవప్రవక్త ('స'అస) కు తెలుపుతారు. దైవప్రవక్త ('స'అస) విచారించగా, 'అబ్దుల్లాహ్ బిన్ ఉబై తాను అలా అనలేదని నిరాకరిస్తాడు. ఆ సందర్భంలో ఈ సూరహ్ అవతరింపజేయబడింది, ('స'హీ'హ్ బు'ఖారీ).

మిమ్మల్ని అల్లాహ్ స్మరణ నుండి నిర్లక్ష్యంలో పడవేయరాదు సుమా! ఎవరైతే ఇలా నిర్లక్ష్యంలో పడతారో అలాంటివారే నష్టపడేవారు.

10. మరియు మీలో ఎవరికైనా మరణ సమయం సమీపించి: "ఓ నా ప్రభూ! నీవు నాకు మరి కొంత వ్యవధి ఎందుకివ్వలేదు! నేను దానధర్మాలు చేసి సత్పురుషులలో చేరిపోయేవాడిని కదా?" అని పలికే స్థితి రాకముందే, మేము మీకు ప్రసాదించిన జీవనోపాధి నుండి ఖర్చు చేయండి.

11. కాని ఒక వ్యక్తికి (మరణ) సమయం ఆసన్నమైనప్పుడు అల్లాహ్ అతనికి ఏ మాత్రం వ్యవధినివ్వడు. మరియు మీరు చేస్తున్నదంతా అల్లాహ్ బాగా ఎరుగును.

# 64. అత్-తగాబున్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఆకాశాలలో నున్న సమస్తమూ మరియు భూమిలో నున్న సమస్తమూ, అల్లాహ్ పవిత్రతను కొనియాడుతుంటాయి. విశ్వసామ్రాజ్యాధిపత్యం ఆయనదే మరియు సర్వస్తోత్రాలు ఆయనకే. మరియు ఆయనే ప్రతిదీ చేయగల సమర్థుడు.
2. ఆయనే మిమ్మల్ని సృష్టించాడు. మీలో కొందరు సత్యతిరస్కారులున్నారు మరియు మీలో కొందరు విశ్వాసులున్నారు మరియు మీరు చేసేదంతా అల్లాహ్ చూస్తున్నాడు[1].
3. ఆయన ఆకాశాలను మరియు భూమిని సత్యంతో సృష్టించాడు మరియు మిమ్మల్ని ఉత్తమ రూపంలో రూపొందించాడు[2]. మరియు మీ గమ్యస్థానం ఆయన వైపునకే ఉంది.
4. ఆకాశాలలో మరియు భూమిలో ఉన్నదంతా ఆయనకు తెలుసు. మరియు మీరు దాచేది మరియు వెలిబుచ్చేది అంతా ఆయకు బాగా తెలుసు. మరియు అల్లాహ్ కు హృదయాలలో

---

[*] [అత్-తగాబున్ అంటే గెలుపు-ఓటములు]

[1] చూడండి, 67:2.

[2] చూడండి, 82:6-8 మరియు 40:64.

దాగి ఉన్నదంతా తెలుసు.

5. ఇంతకు పూర్వం, సత్యాన్ని తిరస్కరించి, తమ కర్మల దుష్ఫలితాన్ని చవి చూసిన వారి వృత్తాంతం మీకు అందలేదా? మరియు వారికి (పరలోకంలో) బాధాకరమైన శిక్ష ఉంటుంది.

6. దీనికి కారణమేమిటంటే, వాస్తవానికి వారి వద్దకు వారి ప్రవక్తలు, స్పష్టమైన సూచనలు తీసుకొని వచ్చినప్పటికీ, వారు: "ఏమీ? మాకు మానవులు మార్గదర్శకత్వం చేస్తారా[3]?" అని పలుకుతూ సత్యాన్ని తిరస్కరించి మరలి పోయారు. మరియు అల్లాహ్ కూడా వారిని నిర్లక్ష్యం చేశాడు. మరియు అల్లాహ్ స్వయం సమృద్ధుడు, సర్వస్తోత్రాలకు అర్హుడు.

7. సత్యాన్ని తిరస్కరించిన వారు (చనిపోయిన తరువాత) మరల సజీవులుగా లేపబడమని భావిస్తున్నారు. వారితో ఇలా అను: "అది కాదు, నా ప్రభువు సాక్షిగా! మీరు తప్పకుండా

[3] ఏవిధంగానైతే ఈనాడు కూడా బిద్'అత్ చేసేవారు ప్రవక్త('స'అస)ను మానవునిగా భావించటం లేదో!

లేపబడతారు[4]. తరువాత మీరు (ప్రపంచంలో) చేసిందంతా మీకు తెలుపబడుతుంది. మరియు ఇది అల్లాహ్ కు ఎంతో సులభం."

8. కావున మీరు అల్లాహ్ ను మరియు ఆయన ప్రవక్తను మరియు మేము అవతరింపజేసిన జ్యోతిని (ఈ ఖుర్ఆన్ ను) విశ్వసించండి. మరియు మీరు చేసేదంతా అల్లాహ్ బాగా ఎరుగును.

9. (జ్ఞాపకముంచుకోండి) సమావేశపు రోజున ఆయన మీ అందరిని సమావేశపరుస్తాడు[5]. అదే లాభనష్టాల దినం మరియు ఎవడైతే అల్లాహ్ ను విశ్వసించి, సత్కార్యాలు చేస్తాడో, అలాంటి వాని పాపాలను ఆయన తొలగిస్తాడు. మరియు

---

[4] ఖుర్ఆన్ లో మూడుసార్లు అల్లాహ్ (సు.తా.) తన సందేశహరునికి ('స'అస) ఆదేశించాడు: "నీ ప్రభువు సాక్షిగా చెప్పు: 'అల్లాహ్ (సు.తా.) పునరుత్థానం తప్పక తెస్తాడని.' వాటిలో ఇది ఒకటి." చూడండి, 10:53, 34:3 అది మీరు ప్రపంచంలో చేసిన కర్మలకు తగిన ప్రతిఫలమివ్వటానికి. ఎందుకంటే చాలామందికి ఈ లోకంలో వారికి తగిన ప్రతిఫలం దొరకదు. దుర్మార్గులు ఇక్కడ శిక్షింపబడకుండా పోవచ్చు. సన్మార్గులకు వారి మంచిపనులకు పూర్తి ప్రతిఫలం దొరకక పోవచ్చు! కాని వచ్చే జీవితంలో ప్రతి ఒక్కరికి వారి కర్మలకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. వారికి ఎలాంటి అన్యాయం జరుగదు. పునరుత్థరింపజేయటం అల్లాహ్ (సు.తా.)కు ఎంతో సులభమైనది.

[5] చూడండి, 11:103 మరియు 56:49-50 పునరుత్థాన దినం, సమావేశదినం ఎందుకు అనబడిందంటే - ఆ రోజు యుగయుగాల ప్రజలందరు ఒకేసారి బ్రతికించి లేపబడతారు. మరియు ఒకేచోట సమావేశ పరచబడతారు. అది ఒక పెద్ద మైదానం. ప్రతి ఒక్కడు ఎంతో దూరం వరకు చూడగల్గుతాడు.

అతనిని క్రింద సెలయేళ్ళు ప్రవహించే స్వర్గ వనాలలో ప్రవేశింపజేస్తాడు, వారందులో శాశ్వతంగా కలకాలం ఉంటారు. అదే గొప్ప విజయం.

10. మరియు ఎవరైతే సత్యాన్ని తిరస్కరిస్తారో మరియు మా సూచన (ఆయాత్) లను అబద్ధాలని నిరాకరిస్తారో, అలాంటి వారు నరకవాసులవుతారు. అందు వారు శాశ్వతంగా ఉంటారు. మరియు అది ఎంత చెడ్డ గమ్యస్థానం!

11. ఏ ఆపద కూడా, అల్లాహ్ అనుమతి లేనిదే సంభవించదు. మరియు ఎవడైతే అల్లాహ్ ను విశ్వసిస్తాడో, అల్లాహ్ అతని హృదయానికి మార్గదర్శకత్వం చేస్తాడు. మరియు అల్లాహ్ కు ప్రతి విషయం గురించి బాగా తెలుసు.

12. మీరు అల్లాహ్ కు విధేయులై ఉండండి మరియు సందేశహరుణ్ణి అనుసరించండి. ఒకవేళ మీరు మరలిపోతే, (తెలుసుకోండి) వాస్తవానికి మా సందేశహరుని బాధ్యత కేవలం (మా సందేశాన్ని ) మీకు స్పష్టంగా అందజేయటం మాత్రమే!

13. అల్లాహ్! ఆయన తప్ప, మరొక ఆరాధ్యుడు లేడు! మరియు విశ్వాసులు కేవలం అల్లాహ్ మీదే నమ్మకం ఉంచుకోవాలి!

14. ఓ విశ్వాసులారా! నిశ్చయంగా, మీ సహవాసులు (అజ్వాజ్) మరియు మీ సంతానంలో మీ శత్రువులుండవచ్చు! కావున మీరు వారి పట్ల జాగ్రత్త వహించండి. కాని ఒకవేళ మీరు వారి

అపరాధాన్ని మన్నించి వారిని ఉపేక్షించి వారిని క్షమించితే! నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత (అని తెలుసుకోండి).

**15.** నిశ్చయంగా, మీ సంపదలు మరియు మీ సంతానం మీ కొరకు ఒక పరీక్ష మరియు అల్లాహ్! ఆయన దగ్గర గొప్ప ప్రతిఫలం (స్వర్గం) ఉంది[6].

**16.** కావున మీరు మీ శక్తి మేరకు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండి, (ఆయన సూచనలను విని), ఆయనకు విధేయులై ఉండండి మరియు (మీ ధనం నుండి) దానం చేస్తే! అది మీ సొంత మేలుకే. మరియు ఎవరైతే తమ హృదయ లోభత్వం నుండి రక్షణ పొందుతారో, అలాంటి వారే సాఫల్యం పొందేవారు[7].

**17.** ఒకవేళ మీరు అల్లాహ్ కు అప్పుగా మంచి అప్పు ఇస్తే, ఆయన దానిని ఎన్నో రెట్లు పెంచి తిరిగి మీకు ప్రసాదిస్తాడు మరియు మిమ్మల్ని క్షమిస్తాడు. వాస్తవానికి అల్లాహ్ కృతజ్ఞతలను ఆమోదించేవాడు, సహనశీలుడు.

**18.** ఆయన అగోచర మరియు గోచర విషయాలన్నీ బాగా తెలిసినవాడు, అపార శక్తిసంపన్నుడు, మహా వివేకవంతుడు.

---

[6] ఇటువంటి వాక్యానికై చూడండి, 8:28.
[7] ఇట్టి వాక్యానికై చూడండి, 59:9.

# 65. అత్-తలాఖ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

**1.** ఓ ప్రవక్తా! మీరు స్త్రీలకు విడాకులు (తలాఖ్) ఇచ్చేటప్పుడు వారికి, వారి నిర్ణీత గడువు (ఇద్దత్) తో విడాకులివ్వండి. మరియు ఆ గడువును ఖచ్చితంగా లెక్కపెట్టండి[1]. మరియు మీ ప్రభువైన అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగి ఉండండి. వారు బహిరంగంగా అశ్లీల చేష్టలకు పాల్పడితే తప్ప, మీరు వారిని వారి ఇండ్ల నుండి వెడల గొట్టకండి మరియు వారు కూడా స్వయంగా వెళ్ళి పోకూడదు[2]. మరియు ఇవి అల్లాహ్ నిర్ణయించిన హద్దులు. మరియు ఎవడైతే అల్లాహ్ (నిర్ణయించిన) హద్దులను అతిక్రమిస్తాడో వాస్తవానికి వాడు తనకు తానే అన్యాయం

---

[*] [అత్-తలాఖ్ – విడాకులు]

[1] నిర్ణీతగడువుతో అంటే గడువు ప్రారంభం కాగల సమయంలో, నిర్ణీతగడువు లోపల ఆమెతో రాజీపడే అవకాశం ఉండేరీతిలో విడాకులివ్వాలి. ఇబ్నె ఉమర్ ('ర'ది.'అ) తన భార్యకు ఋతుస్రావకాలం (బహిష్టు సమయం)లో విడాకులిస్తే, దైవప్రవక్త ('స'అస) క్రోధితులయ్యారు. స్త్రీలు పరిశుద్ధులుగా ఉన్న కాలంలో వారితో లైంగిక సంబంధం చేయక ముందు విడాకులివ్వాలి అని బోధించారు. ('స. బు'ఖారీ). ఇక్కడ పేర్కొన్న 'హదీస్' ఈ ఆయత్ వెలుగులో ఉంది. ఆ గడువును ఖచ్చితంగా లెక్క పెట్టాలి.

[2] ఇద్దత్ కాలం పూర్తి అయ్యే వరకు స్త్రీలు తమ భర్త ఇంటిలోనే ఉండాలి. భర్త ఆమె అన్న వస్త్రాల ఖర్చులు భరించాలి.

చేసుకున్నట్లు. నీకు తెలియదు, బహుశా! దాని తరువాత అల్లాహ్ ఏదైనా క్రొత్త మార్గం చూపించవచ్చు![3]

2. ఇక వారి నిర్ణీత గడువు ముగిసినప్పుడు, వారిని ధర్మప్రకారంగా (వివాహబంధంలో) ఉంచు కోండి, లేదా ధర్మప్రకారంగా వారిని విడచి పెట్టండి. మరియు మీలో న్యాయవంతులైన ఇద్దరు వ్యక్తులను సాక్షులుగా పెట్టుకోండి. మరియు అల్లాహ్ కొరకు సాక్ష్యం సరిగ్గా ఇవ్వండి. అల్లాహ్ ను మరియు అంతిమ దినమును విశ్వసించే ప్రతి వ్యక్తి కొరకు, ఈ విధమైన ఉపదేశమివ్వ బడుతోంది. మరియు అల్లాహ్ యందు భయభక్తులు గలవానికి, ఆయన

[3] అంటే అల్లాహ్ (సు.తా.) వారి మధ్య మళ్ళీ ప్రేమ కలిగించవచ్చు మరియువారుతిరిగితమవివాహబంధాన్ని స్థిరపరచుకోవచ్చు! అందుకే ఒకసారి విడాకులివ్వడం ప్రోత్సహించబడింది. మరియు చాలా మంది వ్యాఖ్యాతల అభిప్రాయం ప్రకారం - ఈ ఆయత్ వెలుగులో - మూడు విడాకులు ఒకేసారి ఇవ్వడం నిషేధింపబడింది. ఎందుకంటే మొదటి మరియు రెండవ విడాకు తరువాత వివాహాన్ని తిరిగి స్థిరపరచు కోవచ్చు! (ఫ'త్హ్ అల్ ఖదీర్). ఒక స్త్రీకి అంతకు ముందు రెండువిడాకులివ్వబడి ఆ తరువాత మూడవ విడాకులు ఇస్తే! అప్పుడు ఆమె తన భర్త ఇంట్లో ఉండజాలదు. మరియు అలాంటి పరిస్థితిలో, ఆమె మరొక పురుషుణ్ణి వివాహమాడకముందు తిరిగి తన మొదటి భర్తతో వివాహం కూడా చేసుకోజాలదు. ఇది ఫాతిమబిన్తెఖైస్(ర.'అన్హా)కు జరిగిన విషయంతో స్పష్టమవుతుంది. ఆమె భర్త ఆమెకు మూడవసారి విడాకులిచ్చిన తరువాత ఆమె తన భర్త ఇంటి నుండి వెళ్ళిపోవటానికి నిరాకరించింది. అప్పుడావిషయం దైవప్రవక్త ('స'అస) దగ్గరికి వస్తే అతనామెను, తన భర్త ఇల్లు విడవమని ఆజ్ఞాపించారు (అ'హ్మద్, నసాయీ')

ముక్తిమార్గం చూపుతాడు.

3. మరియు ఆయన, అతనికి అతడు ఊహించని దిక్కు నుండి జీనవోపాధిని ప్రసాదిస్తాడు. మరియు అల్లాహ్ మీద నమ్మకం ఉంచుకున్నవానికి ఆయనే చాలు. నిశ్చయంగా, అల్లాహ్ తన పని పూర్తి చేసి తీరుతాడు. వాస్తవానికి, అల్లాహ్ ప్రతిదానికి దాని విధి (ఖద్ర్) నిర్ణయించి ఉన్నాడు.

4. మరియు మీ స్త్రీలు ఋతుస్రావపు వయస్సు గడిచి పోయినవారైతే లేక మీకు దానిని గురించి ఎలాంటి అనుమానం ఉంటే; లేక వారి ఋతుస్రావం ఇంకా ప్రారంభం కాని వారైతే, అలాంటి వారి గడువు మూడు మాసాలు[4]. మరియు గర్భవతులైన స్త్రీల గడువు వారి కాన్పు అయ్యే వరకు[5]. మరియు అల్లాహ్ పట్ల భయభక్తులు గలవానికి ఆయన, అతని వ్యవహారంలో సౌలభ్యం కలిగిస్తాడు.

5. ఇది అల్లాహ్ ఆజ్ఞ, ఆయన దానిని మీపై అవతరింపజేశాడు. మరియు ఎవడైతే అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగి ఉంటాడో, ఆయన అతని పాపాలను తొలగిస్తాడు. మరియు అతని

---

[4] ఋతుస్రావం ప్రారంభం కాని స్త్రీలకు మరియు ఋతుస్రావం ఆగిపోయిన స్త్రీలకు వేచి ఉండే గడువు మూడు నెలలు.

[5] గర్భవతులైన స్త్రీల గడువు - విడాకులివ్వబడినా లేక భర్త మరణించినా - ప్రసవించే వరకు! అలాంటి ప్రసవం విడాకుల తరువాత లేక భర్త మరణించిన రెండవరోజే అయినా సరే! ఈ విషయం 'హదీస్'లలో కూడా ఉంది. (బు.'ఖారీ, ముస్లిం). ఇతర స్త్రీలు భర్త మరణించిన తరువాత నాలుగు మాసాల పది రోజులు వేచి ఉండాలి. 2:234.

ప్రతిఫలాన్ని అధికం చేస్తాడు.

6. (నిర్ణీత గడువు కాలంలో) మీ శక్తి మేరకు, మీరు నివసించే చోటనే, వారిని కూడా నివసించనివ్వండి. మరియు వారిని ఇబ్బందులకు గురి చేయడానికి వారిని బాధించకండి. మరియు వారు గర్భవతులైతే, వారు ప్రసవించే వరకు వారి మీద ఖర్చు పెట్టండి. ఒకవేళ వారు మీ బిడ్డకు పాలుపడుతున్నట్లైతే, వారికి వారి ప్రతిఫలం ఇవ్వండి. దాని కొరకు మీరు ధర్మసమ్మతంగా మీ మధ్య సంప్రదింపులు చేసుకోండి. ఒకవేళ మీకు దాని (పాలిచ్చే) విషయంలో ఇబ్బందులు కలిగితే, (తండ్రి) మరొక స్త్రీతో (బిడ్డకు) పాలిప్పించవచ్చు!

7. సంపన్నుడైన వ్యక్తి తన ఆర్థిక స్తోమత ప్రకారం ఖర్చు పెట్టాలి. మరియు తక్కువ జీవనోపాధి గల వ్యక్తి అల్లాహ్ తనకు ప్రసాదించిన విధంగా ఖర్చుపెట్టాలి. అల్లాహ్ ఏ వ్యక్తిపై కూడా అతనికి ప్రసాదించినదానికంటే మించిన భారం వేయడు[6]. అల్లాహ్ కష్టం తరువాత సుఖం కూడా కలిగిస్తాడు.

8. మరియు ఎన్నో నగరవాసులు, తమ ప్రభువు మరియు ఆయన ప్రవక్తల ఆజ్ఞలను తిరస్కరించారు. అప్పుడు మేము వాటి ప్రజల నుండి కఠినంగా లెక్క తీసుకున్నాము. మరియు వారికి తీవ్రమైన శిక్షను సిద్ధ పరిచాము.

9. కావున వారు తమ వ్యవహారాల దుష్టఫలితాన్ని

[6] చూడండి, 2:233.

రుచి చూశారు[7]. మరియు వారి వ్యవహారాల పర్యవసానం నష్టమే!

**10.** అల్లాహ్ వారి కొరకు కఠినమైన శిక్షను సిద్ధపరచి ఉంచాడు. కావున విశ్వాసులైన బుద్ధిమంతులారా! అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగి ఉండండి. వాస్తవానికి అల్లాహ్ మీ వద్దకు హితబోధను (ఖుర్ఆన్ ను) అవతరింపజేశాడు.

**11.** ఒక ప్రవక్తను కూడా! అతను మీకు స్పష్టమైన అల్లాహ్ సూచనలను (ఆయాత్ లను) వినిపిస్తున్నాడు[8]. అది, విశ్వసించి సత్కార్యాలు చేసేవారిని అంధకారాల నుండి వెలుగు లోనికి తీసుకురావటానికి. మరియు అల్లాహ్ ను విశ్వసించి సత్కార్యాలు చేసేవారిని, ఆయన క్రింద సెలయేళ్ళు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. అక్కడ వారు శాశ్వతంగా కలకాలం ఉంటారు. వాస్తవానికి అల్లాహ్ అలాంటి వ్యక్తి కొరకు ఉత్తమ జీవనోపాధిని ప్రసాదించాడు.

**12.** అల్లాహ్ యే సప్తాకాశాలను మరియు వాటిని పోలిన భూమండలాన్ని సృష్టించి, వాటి మధ్య ఆయన తన ఆదేశాలను అవతరింపజేస్తూ వుంటాడు. నిశ్చయంగా, అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు మరియు వాస్తవానికి అల్లాహ్ తన జ్ఞానంతో ప్రతిదానిని పరివేష్టించి వున్నాడని మీరు

---

[7] చూడండి, 64:5.
[8] ఇక్కడ ప్రవక్త అంటే ముహమ్మద్ ('స'అస).

# 66. అత్-తహ్రీమ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఓ ప్రవక్తా! అల్లాహ్ నీకు ధర్మసమ్మతం చేసిన దానిని నీవు ఎందుకు నిషేధించుకుంటున్నావు?[1] నీవు నీ భార్యల ప్రసన్నతను కోరుతున్నావా? మరియు అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

2. వాస్తవానికి అల్లాహ్ మీ ప్రమాణాల పరిహార పద్ధతి మీకు నిర్దేశించాడు[2]. మరియు అల్లాహ్ యే మీ యజమాని. మరియు ఆయన సర్వజ్ఞుడు, మహా వివేకవంతుడు.

3. మరియు (జ్ఞాపకం చేసుకోండి) ప్రవక్త తన భార్యలలో ఒకామెకు[3] రహస్యంగా ఒక విషయం చెప్పగా ఆమె దానిని (ఆ రహస్యాన్ని) మరొకామెకు[4] చెప్పింది. మరియు అల్లాహ్

---

[*] [అత్తహ్రీమ్ - నిషిద్ధము]

[1] ఈ ఆయత్ ద్వారా విశదయ్యేదేమిటంటే దైవప్రవక్త ('స'అస) కు కూడా అల్లాహ్ (సు.తా.) 'హలాల్ చేసిన దానిని 'హరాం చేసే అధికారం లేదు.

[2] ప్రమాణాలకు పరిహారం ఇచ్చే విధానానికై చూడండి, 5:89. ప్రవక్త('స'అస) కూడా పైఆయత్ అవతరింప జేయబడిన తరువాత అదేవిధంగా పరిహారం ఇచ్చారు.(ఫ'త్హ్ అల్-ఖదీర్) ఇంకా చూడండి 2:224

[3] 'హఫ్సా

[4] 'ఆయి'షహ్

అతనికి (ప్రవక్తకు) ఆ విషయాన్ని తెలియజేశాడు. (వాస్తవానికి) అతను (ప్రవక్త) ఆ విషయాన్ని (మొదటి) ఆమెకు కొంత తెలిపి, మరికొంత తెలుపలేదు. ఇక అతను (ప్రవక్త, మొదటి) ఆమెకు దానిని (రహస్యం బయట పడిన సంగతిని) తెలిపినప్పుడు, ఆమె (ఆశ్చర్యపోతూ) అతనితో ఇలా అడిగింది: "ఇది నీకు ఎవరు తెలిపారు?" అతను జవాబిచ్చాడు: "నాకు ఈ విషయం ఆ సర్వజ్ఞుడు, ఆ సర్వం తెలిసినవాడు తెలిపాడు[5]."

4. (ఆ ఇద్దరు స్త్రీలతో ఇలా అనబడింది): "ఒకవేళ మీరిద్దరూ అల్లాహ్ వైపునకు పశ్చాత్తాపంతో మరలితే (అది మీ మేలుకే) వాస్తవానికి మీ ఇద్దరి హృదయాలు (ఋజుమార్గం నుండి) తొలగిపోయాయి. ఒకవేళ మీరిద్దరు ప్రవక్తకు విరోధంగా పోతే! నిశ్చయంగా, అల్లాహ్ అతని సంరక్షకుడు మరియు జిబ్రీల్ మరియు సత్పురుషులైన విశ్వాసులు అతని (సహాయకులు). మరియు దేవదూతలందరు కూడా అతని సహాయకులని (తెలుసుకోండి)."

5. ఒకవేళ అతను (ముహమ్మద్!) మీ అందరికీ విడాకులిస్తే! అల్లాహ్, మీకు బదులుగా, మీకంటే మంచి భార్యలను, అతనికి (ప్రవక్తకు) ప్రసాదించగలడు!

---

[5] ఖుర్ఆన్ మాత్రమే కాక ఇతర విషయాలు కూడా దైవప్రవక్త ('స'అస) కు దివ్యజ్ఞానం ద్వారా తెలియజేయబడేవి.

వారు మంచి ముస్లింలు, విశ్వాసులు, భక్తిపరులు, పశ్చాత్తాపపడేవారు, (అల్లాహ్ ను) ఆరాధించేవారు, వలస పోయే (ఉపవాసాలు చేసే)[6] వారు అయిన, విధవలు లేదా కన్యలు అయి ఉంటారు![7]

**6.** ఓ విశ్వాసులారా! మీరు మిమ్మల్ని మరియు మీ కుటుంబం వారిని, మానవులు మరియు రాళ్ళు ఇంధనం కాబోయే నరకాగ్ని నుండి కాపాడుకోండి[8]! దానిపై ఎంతో బలిష్ఠులూ, కఠినులూ అయిన దేవదూతలు నియమింపబడి ఉంటారు. వారు అల్లాహ్ ఇచ్చిన ఆజ్ఞను ఉల్లంఘించరు మరియు వారికిచ్చిన ఆజ్ఞలనే నెరవేరుస్తూ ఉంటారు.

**7.** ఓ సత్యతిరస్కారులారా! ఈ రోజు మీరు సాకులు చెప్పకండి. నిశ్చయంగా, మీరు చేస్తూ ఉండిన కర్మలకు, తగిన ప్రతిఫలమే మీకు ఇవ్వబడుతోంది.

**8.** ఓ విశ్వాసులారా! మీరు అల్లాహ్ వైపునకు మనః పూర్వకమైన పశ్చాత్తాపంతో, క్షమాపణ కొరకు

---

[6] సాఇ"హాత్ కై చూడండి, 9:112.

[7] దైవప్రవక్త ('స'అస) భార్య (ర.'అన్హుమ్)లలో కేవలం 'ఆయి'షహ్ (ర.'అన్హా) మాత్రమే కన్య, 'జైనబ్ బిన్తె జహష్ (ర.'అన్హా) విడాకురాలు మరియు మిగతా భార్యలందరూ విధవలు. అతను ఏ భార్యకు కూడా విడాకులివ్వలేదు.

[8] ఇక్కడ విశ్వాసులతో: 'మీరు మీ ఇంటి వారికి ఇస్లాం బోధించండి మరియు సద్వర్తనులుగా ఉండటానికి తగిన శిక్షణ ఇవ్వండి. బిడ్డ ఏడు సంవత్సరాల వాడు అయినప్పుడు నమా'జ్ చేయటానికి ప్రోత్సహించండి. పదిసంవత్సరాల వయస్సులో న'మాజ్ చేయకుంటే శిక్షించండి.'(అబూ దావుద్, తిర్మి'జీ) ఇదేవిధంగా ఉపవాసాల కోసం మరియు మంచిపనుల కోసం ప్రోత్సహించండి.నరకానికై చూడండి, 74:27

మరలితే[9]! మీ ప్రభువు మీ పాపాలను తొలగించి, మిమ్మల్ని క్రింద సెలయేళ్ళు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు; ఆ రోజు అల్లాహ్ తన ప్రవక్తను మరియు అతనితో పాటు విశ్వసించిన వారిని అవమానం పాలు చేయడు. వారి కాంతి, వారి ముందు మరియు వారి కుడి వైపు నుండి ప్రసరిస్తూ ఉంటుంది.[10] వారి ఇలా ప్రార్థిస్తారు: "ఓ మా ప్రభూ! మా కాంతిని మా కొరకు పరిపూర్ణం చేయి మరియు మమ్మల్ని క్షమించు. నిశ్చయంగా, నీవే ప్రతిదీ చేయగల సమర్థుడవు!"

9. ఓ ప్రవక్తా! నీవు సత్యతిరస్కారులతో మరియు కపట విశ్వాసులతో ధర్మయుద్ధం చెయ్యి మరియు వారి విషయంలో కఠినంగా వ్యవహరించు. మరియు వారి ఆశ్రయం నరకమే! అది అతి చెడ్డ గమ్యస్థానం[11]!

10. సత్యతిరస్కారుల విషయంలో అల్లాహ్ నూహ్ భార్య మరియు లూత్ భార్యల ఉదాహరణలను

---

[9] మనఃపూర్వక పశ్చాత్తాపం అంటే : 1) తాము చేసిన పాపాన్ని వదులుకోవాలి. 2) అల్లాహ్ (సు.తా.) ముందు వినమ్రులై పశ్చాత్తాప పడాలి. 3) మరల దానిని చేయకుండా ఉండాలి. 4) ఒకవేళ దాని సంబంధం మానవులతో ఉంటే, ఎవరి హక్కుకు హాని కలిగిందో, అతనితో క్షమాపణ కోరుకోవాలి. కేవలం నోటితో పశ్చాత్తాప పడితే సరిపోదు.

[10] చూడండి, 57:1-123.

[11] చూడండి, 9:73. సత్యతిరస్కారుల మరియు కపటవిశ్వాసుల గమ్యస్థానం నరకమే!

ఇచ్చాడు[12]. ఆ ఇద్దరు స్త్రీలు మా సత్పురుషులైన మా ఇద్దరు దాసుల (వివాహ) బంధంలో ఉండిరి. కాని ఆ ఇద్దరు స్త్రీలు వారిద్దరిని మోసగించారు. కావున వారిద్దరు, ఆ ఇద్దరు స్త్రీల విషయంలో అల్లాహ్ ముందు (పరలోకంలో) ఏ విధంగాను సహాయపడలేరు[13]. మరియు (తీర్పుదినమున) వారితో: "నరకాగ్నిలో ప్రవేశించే వారితో సహా, మీరిద్దరు స్త్రీలు కూడా ప్రవేశించండి!" అని చెప్పబడుతుంది.

11. మరియు అల్లాహ్, విశ్వసించినవారిలో ఫిర్ఔన్ భార్యను ఉదాహరణగా పేర్కొన్నాడు[14]. ఆమె ఇలా అన్న విషయం (జ్ఞాపకం చేసుకోండి): "ఓ నా ప్రభూ! నా కొరకు నీ వద్ద స్వర్గంలో ఒక గృహాన్ని నిర్మించు! మరియు నన్ను, ఫిర్ఔన్ మరియు అతని చేష్టల నుండి కాపాడు మరియు నన్ను ఈ దుర్మార్గ జాతివారి నుండి కాపాడు."

12. మరియు ఇమ్రాన్ కుమార్తె మర్యమ్[15] ను (కూడా ఉదాహరణగా పేర్కొన్నాడు) ఆమె తన శీలాన్ని కాపాడు కున్నది. మరియు మేము ఆమెలోకి మా (తరఫు నుండి) జీవం (ఆత్మ)

---

[12] లూ'త్ ('అ.స.) భార్య విషయానికై చూడండి 7:83 మరియు 11:81. నూ'హ్ ('అ.స.) భార్యను గురించి కేవలం ఇక్కడ మాత్రమే చెప్పబడింది. వీరిద్దరు చెడు నడవడిక, చెడు చరిత్రవారు కారు, కానీ సత్యతిరస్కారులు.

[13] సత్యతిరస్కారులు దగ్గరి బంధువులైనా వారితో సంబంధాలు తెంపుకోవాలి. చూడండి, 11:46.

[14] చూడండి, 28:9.

[15] చూడండి, 3:33.

ఊదాము[16]. మరియు ఆమె తన ప్రభువు సమాచారాలను మరియు ఆయన గ్రంథాలను, సత్యాలని ధృవపరిచింది మరియు ఆమె భక్తిపరులలో చేరిపోయింది[17].

---

[16] చూడండి, 21:91.

[17] స్త్రీలందరిలో 'ఖదీజా బింత్ 'ఖువైలిద్, ఫాతిమా, మర్యం మరియు ఫిర్'ఔన్ భార్య ఆసియహ్ (ర'ది.'అన్హుమ్)లు అతి ఉత్తమమైన వారు. (ముస్నద్ అ'హ్మద్) మరొక 'హదీస్': చాలామంది పురుషులు పరిపూర్ణతకు చేరుకున్నారు. కాని స్త్రీలలో కేవలం ఫిర్ఔన్ భార్య ఆసియహ్ మరియు 'ఇమ్రాన్ కూతురు మర్యం (ర'ది.'అన్హుమ్)లు పరిపూర్ణతకు చేరుకున్నారు. మరియు 'ఆయి'షహ్ (ర.'అన్హా) యొక్క ఔన్నత్యం ఇతర స్త్రీలపై స'రిద్ కు ఇతర ఆహారం పై ఉన్నట్లు ఉంది.('స'హీ'హ్ బు'ఖారీ).

# 67. అల్-ముల్క్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఎవరి చేతిలోనయితే విశ్వసామ్రాజ్యాధిపత్యం ఉందో! ఆయన సర్వశ్రేష్ఠుడు (శుభదాయకుడు) మరియు ఆయన ప్రతిదీ చేయగల సమర్థుడు.
2. ఆయనే! మీలో మంచిపనులు చేసే వారెవరో పరీక్షించటానికి, చావు-బ్రతుకులను సృష్టించాడు[1]. మరియు ఆయన సర్వశక్తిమంతుడు, క్షమాశీలుడు.
3. ఆయనే ఒకదానిపై ఒకటి ఏడు ఆకాశాలను సృష్టించాడు. ఆ అనంత కరుణా మయుని సృష్టిలో నీవు ఎలాంటి లోపాన్నీ చూడలేవు. కావాలంటే మరొకసారి చూడు: "ఏమీ? నీకేమైనా లోపం కనిపిస్తుందా?"
4. ఇంకా, మాటిమాటికీ నీ చూపులు త్రిప్పి చూడు.

---

[*] [అల్-ముల్క్ అంటే మహాసామ్రాజ్యము]

[1] రూహ్: ఒక విచిత్రమైన శక్తి. దాని వాస్తవం అల్లాహ్ (సు.తా.) కు తప్ప మరెవ్వరికీ తెలియదు. దాని సంబంధం ఒక శరీరంతో ఏర్పడినప్పుడు అది సజీవిగా పరిగణించబడుతుంది. దాని సంబంధం తెగిపోయిన శరీరం, మృతదేహంగా (నిర్జీవిగా) పరిగణించబడుతుంది. అల్లాహ్ (సు.తా.) ఈ తాత్కాలిక జీవితాన్నిచ్చి, తరువాత మరణింపజేస్తాడు. ఈ తాత్కాలిక జీవితాన్ని సరైన విధంగా ఎవడు వినియోగిస్తాడనేది ఆయన (సు.తా.) పరీక్షిస్తున్నాడు. ఎవడైతే ఈ తాత్కాలిక జీవితాన్ని విశ్వాసం మరియు అల్లాహ్ (సు.తా.) విధేయత కోసం వినియోగిస్తాడో, వాడు మంచి ప్రతిఫలం పొందుతాడు. అలా చేయని వాడి కొరకు నరకశిక్ష ఉంటుంది.

అది (నీ చూపు) విఫలమై అలిసి సొలిసి తిరిగి నీ వైపుకే వస్తుంది.

5. మరియు వాస్తవంగా, మేము భూమికి దగ్గరగా ఉన్న ఆకాశాన్ని దీపాలతో అలంకరించాము. మరియు వాటిని, షైతాన్ లను తరిమి కొట్టే సాధనాలుగా చేశాము[2]. మరియు వారి కొరకు (షైతానుల కొరకు) మేము భగభగ మండే అగ్నిజ్వాలల శిక్షను సిద్ధపరచి ఉంచాము.

6. మరియు తన ప్రభువును (అల్లాహ్ ను) తిరస్కరించే వారికి నరకశిక్ష ఉంది. అది ఎంత చెడ్డ గమ్యస్థానం.

7. వారు అందులోకి విసిరి వేయ బడినప్పుడు వారు దాని (భయంకరమైన) గర్జనను వింటారు. మరియు అది మరిగి పొంగుతూ ఉంటుంది.

8. అది దాదాపు ఉద్రేకంగా ప్రేలిపోతూ ఉంటుంది. ప్రతిసారి అందులోకి (పాపుల) గుంపు పడవేయబడి నప్పుడు! దాని కాపలాదారులు వారితో: "ఏమీ? మీ వద్దకు ఏ హెచ్చరిక చేసేవాడు రాలేదు?" అని ప్రశ్నిస్తారు.

9. వారంటారు: "ఎందుకు రాలేదు! వాస్తవానికి మా వద్దకు హెచ్చరిక చేసేవాడు వచ్చాడు, కాని మేము అతనిని అసత్యుడవని తిరస్కరించాము మరియు అతనితో ఇలా అన్నాము: 'అల్లాహ్ దేనినీ (ఏ దివ్యజ్ఞానాన్ని) అవతరింప జేయలేదు; మీరు కేవలం ఘోర మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నారు!'"

---

[2] చూడండి, 37:6-10.

10. ఇంకా వారు ఇలా అంటారు: "ఒకవేళ మేము విని ఉంటే లేదా గ్రహించి ఉంటే, మేము మండే అగ్నిజ్వాలలో పడి వుండే వారితో చేరే వారము కాము కదా!"

11. అప్పుడు వారే స్వయంగా తమ పాపాన్ని ఒప్పుకుంటారు. కావున భగభగమండే అగ్నిజ్వాలలు దూరమై పోవుగాక!

12. నిశ్చయంగా, ఎవరైతే అగోచరుడైన తమ ప్రభువుకు భయపడతారో! వారికి క్షమాపణ మరియు గొప్ప ప్రతిఫలం ఉంటాయి.

13. మరియు మీరు మీ మాటలను రహస్యంగా ఉంచినా సరే! లేక వాటిని వెల్లడి చేసినా సరే! నిశ్చయంగా, ఆయనకు హృదయాల స్థితి బాగా తెలుసు.

14. ఏమిటీ? పుట్టించినవాడికే తెలియదా? మరియు ఆయన సూక్ష్మగ్రాహి, సర్వం తెలిసినవాడు!

15. భూమిని మీ అధీనంలో ఉంచినవాడు ఆయనే! కావున మీరు దాని దారులలో తిరగండి. మరియు ఆయన ప్రసాదించిన జీవనోపాధిని తినండి, మరియు మీరు ఆయన వైపునకే సజీవులై మరలి పోవలసి ఉంది.

16. ఏమీ? మీరు నిర్భయంగా ఉన్నారా? ఆకాశాలలో ఉన్నవాడు, మిమ్మల్ని భూమిలోకి అణగద్రొక్కడని, ఎప్పుడైతే అది తీవ్రకంపనాలకు గురి అవుతుందో?

17. లేక ఆకాశాలలో ఉన్నవాడు, మీపైకి రాళ్ళు కురిపించే గాలివాన పంపడని మీరు నిర్భయంగా

ఉన్నారా? నా హెచ్చరిక ఎలాంటిదో అప్పుడు మీరు తెలుసుకోగలరు.

18. మరియు వాస్తవానికి వారికి పూర్వం గతించినవారు కూడా (ప్రవక్తలను) తిరస్కరించారు. నా పట్టు (శిక్ష) ఎంత తీవ్రంగా ఉండిందో (చూశారా)?

19. ఏమీ? వారు తమ ఎగిరే పక్షులు రెక్కలను ఎలా చాపుతూ ముడుచుకుంటూ, ఎగురుతున్నాయో చూడటం లేదా? ఆ అనంత కరుణామయుడు తప్ప మరెవ్వరూ వాటిని అలా నిలిపి ఉంచలేరు కదా! నిశ్చయంగా ఆయన ప్రతి దానినీ చూస్తున్నాడు!

20. ఏమీ? అనంత కరుణామయుడు తప్ప మీకు సేన వలే అడ్డుగా నిలిచి, మీకు సహాయపడ గల వాడెవడైనా ఉన్నాడా? ఈ సత్యతిరస్కారులు కేవలం మోసంలో పడి వున్నారు.

21. ఒకవేళ ఆయన మీ జీవనోపాధిని ఆపి వేస్తే, మీకు జీవనోపాధి ఇచ్చేవాడు ఎవడున్నాడు? అయినా వారు తలబిరుసుతనంలో మునిగి (సత్యానికి) దూరమై పోతున్నారు.

22. ఏమీ? ఎవడైతే తన ముఖం మీద దేవులాడుతూ నడుస్తాడో, అతడు సరైన మార్గం పొందుతాడా[3]? లేక చక్కగా ఋజుమార్గం మీద నడిచేవాడు పొందుతాడా?

23. వారితో ఇలా అను: "ఆయనే మిమ్మల్ని సృజించాడు

[3] చూడండి, 17:97.

మరియు ఆయనే మీకు వినికిడినీ, దృష్టినీ మరియు హృదయాలనూ ఇచ్చాడు. (అయినా) మీరు కృతజ్ఞతలు తెలిపేది చాలా తక్కువ!"

**24.** (ఇంకా) ఇలా అను: "ఆయనే మిమ్మల్ని భూమిలో వ్యాపింపజేశాడు మరియు ఆయన వద్దనే మీరంతా సమావేశ పరచబడతారు."

**25.** మరియు వారు ఇలా అడుగుతున్నారు: "మీరు సత్యవంతులే అయితే, ఈ వాగ్దానం ఎప్పుడు నెరవేరనున్నది?"

**26.** వారితో ఇలా అను: "నిశ్చయంగా, దాని జ్ఞానం కేవలం అల్లాహ్ కే ఉంది[4]. మరియు నేను స్పష్టంగా హెచ్చరిక చేసే వాడిని మాత్రమే!"

**27.** తరువాత వారు దానిని సమీపంలో ఉండటం చూసినప్పుడు, సత్యతిరస్కారుల ముఖాలు దుఃఖంతో నిండి నల్లబడిపోతాయి[5]. మరియు వారితో ఇలా అనబడుతుంది: "మీరు దేనినయితే అడుగుతూ ఉండేవారో అది (ఆ వాగ్దానం) ఇదే!"[6]

**28.** (ఓ ప్రవక్తా!) వారితో ఇలా అను: "ఏమీ? మీరు ఆలోచించరా? ఒకవేళ అల్లాహ్ నన్ను మరియు నా తోటి వారిని నాశనం చేయనూ వచ్చు! లేదా మమ్మల్ని కరుణించనూ వచ్చు. కాని సత్యతిరస్కారులను బాధాకరమైన శిక్ష నుండి ఎవడు రక్షించగలడు?"

---

[4] ఇంకా చూడండి, 7:187.
[5] చూడండి, 3:106.
[6] చూడండి, 38:16 మరియు 8:32 మొదలైనవి.

**29.** వారితో ఇంకా ఇలా అను: "ఆయనే అనంత కరుణామయుడు, మేము ఆయననే విశ్వసించాము మరియు ఆయననే నమ్ముకున్నాము. ఇక ఎవరు స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నారో త్వరలోనే మీరు తెలుసుకోగలరు!"

**30.** వారితో ఇలా అను: "ఏమీ? మీరు ఆలోచించరా? ఒకవేళ మీ బావులలోని నీరు, భూమిలోనికి ఇంకి పోతే, ప్రవహించే ఈ నీటి ఊటలను మీ కొరకు ఎవడు బయటికి తేగలడు?"

# 68. అల్-ఖలమ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. నూన్[1][2], కలం సాక్షిగా! మరియు వారు (దేవదూతలు) వ్రాస్తున్న దాని సాక్షిగా[3]!
2. నీ ప్రభువు అనుగ్రహం వలన నీవు (ఓ ముహమ్మద్) పిచ్చివాడవు కావు!
3. మరియు నిశ్చయంగా, నీకు ఎన్నటికీ తరిగిపోని ప్రతిఫలం ఉంది.
4. మరియు నిశ్చయంగా, నీవు ఉత్తమమైన శీలవంతుడవు[4]!
5. కావున త్వరలోనే నీవు చూడగలవు మరియు

---

[*] [అల్ ఖలమ్ అంటే కలము]

[1] సూరతుల్ బఖరహ్ లోని మొదటి ఆయతు యొక్క ఫుట్‌నోట్ చూడండి.

[2] ఖుర్ఆన్ అవతరణలోఅవతరించిన మొదటి బీజఅక్షరం ఇది 'నూన్,'. ఈ అక్షరం ముఖ'త్త'ఆత్ లోనిది.

[3] అల్-ఖలమ్: చూడండి, 96:3-5. కొందరు: ఇక్కడ ప్రమాణం చేసే కలం, అంటే ఆ మొట్టమొదట సృష్టించబడి, 'విధివ్రాత' వ్రాయమని ఆజ్ఞాపించబడిన కలము, అని చెబుతారు, సునన్ తిర్మి'జీ - అల్బానీ ప్రమాణీకం (త'స్ హీ'హ్).

[4] అంటే అల్లాహ్ (సు.తా.) నీకు ఆదేశించిన మార్గం (ఇస్లాం)లో నీవు ఉన్నావు. దీని మరొక భావం నీవు మొదటి నుండియే ఉత్తమమైన గుణగణాలు గలవాడవు, సత్యసంధుడవు. 'ఆయి'షహ్ (ర.'అన్హా)తో దైవప్రవక్త ('స'అస) యొక్క గుణగణాలు మరియు ప్రవర్తనను గురించి ప్రశ్నించగా ఆమె (ర.'అన్హా) అన్నారు: " 'ఖులుఖుహూ ఖుర్ఆన్" అంటే అతని గుణగణాలు ఖుర్ఆన్ కు ప్రతిరూపాలు, ('స.ముస్లిం).

వారు కూడా చూడగలరు;

6. మీలో ఎవరికి పిచ్చి ఉందో!

7. నిశ్చయంగా, నీ ప్రభువు! ఆయనకు ఎవడు మార్గభ్రష్టుడయ్యాడో తెలుసు మరియు ఎవడు సన్మార్గం మీద ఉన్నాడో కూడా ఆయనకు బాగా తెలుసు!

8. కావున నీవు ఈ అసత్యవాదులను అనుసరించకు.

9. ఒకవేళ నీవు (ధర్మం విషయంలో) మెత్తపడితే వారు కూడా మెత్తపడ గోరుతున్నారు.[5]

10. కావున నీవు ప్రమాణాలు చేసే ప్రతి నీచుడిని అనుసరించకు;

11. చాడీలు చెప్పేవాడిని, ఎత్తి పొడుస్తూ ఉండేవాడిని;

12. మంచిని నిరోధించేవాడిని, హద్దు మీరి ప్రవర్తించే పాపిష్ఠుడిని;

13. నిర్దయుడిని, ఇంతే గాకుండా అపఖ్యాతి గల (నిందార్హుడైన) వాడిని;

14. వాడు ధనవంతుడూ మరియు సంతానభాగ్యంతో తలతూగుతూ ఉన్నవాడు అయినా సరే!

15. ఒకవేళ వాడికి మా సూచనలు (ఆయాత్) వినిపిస్తే, అందుకు వాడు: "ఇవి పూర్వకాలపు కట్టుకథలే!" అని అంటాడు.

16. మేము త్వరలోనే వాడి ముక్కు మీద వాత పెడ్తాము.

---

[5] అంటే నీవు ('స'అస) ధర్మం విషయంలో కొన్ని సవరణలు చేయటానికి ఒప్పుకుంటే, వారు నీతో రాజీపడటానికి సిద్ధంగా ఉన్నారు.

17. నిశ్చయంగా, మేము ఆ తోటవారిని పరీక్షించినట్లుగా వీరిని కూడా పరీక్షిస్తాము. ఎవరైతే తెల్లవారగానే తప్పక దాని పంట కోసుకుందామని ప్రతిజ్ఞ చేసుకున్నారో!
18. మరియు (అల్లాహ్ కోరితే) అనే, మినహాయింపుకు తావు ఇవ్వకుండా!
19. కావున వారు పడుకొని ఉండగానే నీ ప్రభువు తరఫు నుండి దానిపై (ఆ తోటపై) ఒక ఆపద వచ్చి పడింది.
20. దాంతో తెల్లవారే సరికి అది (ఆ తోట) పంట కోసిన పొలం వలే మారి పోయింది.
21. తరువాత ఉదయం లేచి వారు ఒకరితో నొకరు ఇలా చెప్పుకోసాగారు:
22. "మీరు పంటను కోయదలుచుకుంటే ఉదయమే మీ పొలానికి వెళ్ళండి."
23. ఆ తరువాత వారు ఒకరితోనొకరు (ఈ విధంగా) మెల్లగా చెప్పుకుంటూ బయలు దేరారు.
24. "ఈ రోజు ఏ పేదవాడిని కూడా మీ దగ్గరకు రానివ్వకండి!"
25. మరియు వారు (పేదవారిని) దగ్గరకు రానివ్వకూడదని గట్టి నిర్ణయంతో తెల్లవారు ఝామున బయలు దేరారు.
26. వారు దానిని (తోటను) చూసి ఇలా వాపోయారు: "నిశ్చయంగా, మనం దారి తప్పాము!
27. కాదు! కాదు! మనం సర్వం కోల్పోయాము!"
28. వారిలో మధ్యరకానికి చెందినవాడు ఇలా

అన్నాడు: "ఏమీ? నేను మీతో అనలేదా? మీరు ఎందుకు ఆయన (అల్లాహ్) పవిత్రతను కొనియొడరని ('ఇన్ షా అల్లాహ్!' అనరని)[6]?"

29. వారు ఇలా అన్నారు: "మా ప్రభువు సర్వలోపాలకూ అతీతుడు! నిశ్చయంగా, మేమే దుర్మార్గులము!"

30. తరువాత వారు అభిముఖులై ఒకరి నొకరు నిందించుకోసాగారు.

31. వారు ఇలా వాపోయారు: "అయ్యో! మా పాడుగాను! నిశ్చయంగా, మేము తలబిరుసుతనం చూపాము!

32. బహుశా! మన ప్రభువు మనకు దీనికి బదులుగా దీని కంటే శ్రేష్ఠమైన దానిని ప్రసాదించ వచ్చు! నిశ్చయంగా, మనం మన ప్రభువు వైపునకు (పశ్చాత్తాపంతో) మరలుదాము!"

33. ఈ విధంగా ఉంటుంది శిక్ష! మరియు పరలోక శిక్ష దీని కంటే ఘోరంగా ఉంటుంది. వారు ఇది తెలుసుకుంటే ఎంత బాగుండేది!

34. నిశ్చయంగా, దైవభీతి గలవారికి వారి ప్రభువు వద్ద పరమానందకరమైన స్వర్గవనాలు ఉంటాయి.

35. ఏమీ? మేము విధేయులను (ముస్లింలను)

---

[6] కొందరు వ్యాఖ్యాతలు ఇక్కడ తస్బీహ్ అంటే: ఇన్షా 'అల్లాహ్ - అల్లాహ్ కోరితే! అని అనటమని వ్యాఖ్యానించారు.

నేరస్థులతో సమానంగా ఎంచుదుమా[7]?

**36.** మీకేమయింది? మీరు ఏ విధమైన నిర్ణయాలు చేస్తున్నారు?

**37.** మీ వద్ద ఏదయినా (దివ్య) గ్రంథముందా? దాని నుండి మీరు నేర్చుకోవటానికి!

**38.** నిశ్చయంగా, అందులో మీకు, మీరు కోరేదంతా ఉందని?

**39.** లేక, పునరుత్థాన దినం వరకు, మీరు నిర్ణయించుకున్నదే మీకు తప్పక లభిస్తుందని, మేము మీతో చేసిన గట్టి ప్రమాణం ఏదైనా ఉందా?

**40.** వారిలో దీనికి ఎవడు హామీగా ఉన్నాడో అడుగు.

**41.** లేక, వారికి ఎవరైనా (వారు అల్లాహ్ కు కల్పించిన) భాగస్వాములు ఉన్నారా? ఒకవేళ వారు సత్యవంతులే అయితే తమ ఆ భాగస్వాములను తీసుకు రమ్మను.

**42.** (జ్ఞాపకముంచుకోండి) ఏ రోజయితే పిక్క ఎముక తెరిచి వేయబడుతుందో! మరియు వారు సాష్టాంగం (సజ్దా) చేయటానికి పిలువబడతారో, అప్పుడు వారు (కపట విశ్వాసులు), అలా

---

[7] ఖుర్ఆన్ అవతరణాక్రమంలో ముస్లిం పదం ఇక్కడ మొట్టమొదటిసారి వచ్చింది. ముస్లిం అంటే అల్లాహ్ (సు.తా.)కు విధేయుడై, ఆయన (సు.తా.) ఆజ్ఞాపించిన ఏకదైవ సిద్ధాంతంపై ఉండి, ఆరాధనను కేవలం ఆయన (సు.తా.)కే ప్రత్యేకించుకొని, ఆరాధనలో ఎవ్వరినీ కూడా ఆయన (సు.తా.)కు సాటిగా నిలబెట్టకుండా ఉండేవాడు. తనను తాను కేవలం అల్లాహ్ (సు.తా.) దాస్యానికి మాత్రమే అంకితం చేసుకున్నవాడు. దీని మూల పదం సలాం, అంటే శాంతి.

(సజ్దా) చేయలేరు!

43. వారి చూపులు క్రిందికి వాలిపోయి ఉంటాయి, అవమానం వారిని ఆవరించి ఉంటుంది. మరియు వాస్తవానికి వారు నిక్షేపంగా ఉన్నప్పుడు సాష్టాంగం (సజ్దా) చేయటానికి ఆహ్వానించబడితే (తిరస్కరించేవారు)!

44. కావున నన్ను మరియు ఈ సందేశాన్ని అబద్ధమని తిరస్కరించే వారిని వదలండి. వారు గ్రహించని విధంగా మేము వారిని క్రమక్రమంగా (వినాశం వైపునకు) తీసుకొని పోతాము[8].

45. మరియు నేను వారికి కొంత వ్యవధి నిస్తున్నాను. నిశ్చయంగా, నా పన్నాగం చాలా దృఢమైనది[9].

46. లేక, (ఓ ప్రవక్తా!) నీవు వారిని ఏదైనా ప్రతిఫలం ఇవ్వమని అడుగుతున్నావా? వారికి దాని ఋణం భారమవటానికి?

47. లేక, వారి వద్ద ఏదైనా అగోచర జ్ఞానం ఉందా[10]? వారు దానిని వ్రాసి పెట్టడానికి?

48. కావున నీవు నీ ప్రభువు ఆజ్ఞ కొరకు వేచి ఉండు. మరియు నీవు, చేపవాని (యూనుస్) వలే

---

[8] చూడండి, 7:182-183.

[9] కైదున్: పన్నుగడ, పన్నాగం, పథకం, యోజన, వ్యూహం. ఇంకా చూడండి, 10:5.

[10] 'గైబున్: అగోచరం. ఈ పదం ఖుర్ఆన్ అవతరణాక్రమంలో ఇక్కడ మొట్టమొదటిసారి వచ్చింది, ఇంకా చూడండి, 96:6.

వ్యవహరించకు[11]. (గుర్తుకు తెచ్చుకో) అతను దుఃఖంలో ఉన్నప్పుడు (తన ప్రభువును) మొర పెట్టుకున్నాడు.

**49.** అతని ప్రభువు అనుగ్రహమే గనక అతనికి అందక పోయి ఉంటే, అతను అవమానకరమైన స్థితిలో (చేప కడుపులో పడి ఉండేవాడు కాని మేము అతనిని క్షమించాము). కావున అతను చౌట (బంజరు) మైదానంలో విసరి వేయ బడ్డాడు[12].

**50.** చివరకు అతని ప్రభువు అతనిని ఎన్నుకొని సత్పురుషులలో చేర్చాడు.

**51.** మరియు ఆ సత్యతిరస్కారులు, ఈ సందేశాన్ని (ఖుర్ఆన్ ను) విన్నప్పుడు, తమ చూపులతో నీ కాళ్ళు ఊడగొడతారా అన్నట్లు (నిన్ను జారించి

---

[11] యూనుస్ ('అ.స.) యొక్క వివరాల కోసం చూడండి, 21:87 మరియు 37:140.

[12] దీని మరొక తాత్పర్యం ఇలా ఉంది: "ఒకవేళ అతనిపై అతని ప్రభువు (సు.తా.) అనుగ్రహమే గనక లేకుంటే! నిశ్చయంగా, అతను అవమానకరమైన స్థితిలో బంజరు మైదానంలో విసరివేయబడేవాడు." మరొక వ్యాఖ్యానం: "అల్లాహ్ (సు.తా.) అతనికి పశ్చాత్తాపపడే సద్బుద్ధి గనక ఇవ్వకుండా ఉంటే మరియు అతని ప్రార్థన అంగీకరించబడకుండా ఉంటే అతను సముద్రపు అంచున వేయబడకుండా ఉంటే - ఎక్కడైతే అతనికి ఆహారం ఇచ్చాడో మరియు తీగ పెంచాడో - బంజరు భూమిలో విసిరివేయబడి ఉండేవాడు. మరియు అల్లాహ్ (సు.తా.) వద్ద అతని పరిస్థితి అవమానకరమైనదై ఉండేది. కాని అతని ప్రార్థన అంగీకరించబడిన తరువాత అతను అనుగ్రహించబడ్డాడు." ఇంకా చూడండి, 37:143.

పడవేసేటట్లు) నిన్ను చూస్తున్నారు[13]. మరియు వారు నిన్ను (ఓ ముహమ్మద్!): "నిశ్చయంగా ఇతడు పిచ్చివాడు!" అని అంటున్నారు.

52. కాని సర్వలోకాల (వారికి) ఇదొక హితోపదేశం మాత్రమే!

---

[13] ఒకవేళ నీకు అల్లాహ్ (సు.తా.) రక్షణయే గనక లేకుంటా! వారి దిష్టి నీకు తగిలేది. (ఇబ్నె-కసీ'ర్). ఇబ్నె-కసీ'ర్ ఇంకా ఇలా వ్రాసారు. దిష్టి తగలటం మరియు అల్లాహ్ (సు.తా.) అనుమతితో దాని వల్ల నష్టం కలగటం నిజమే. కావున 'హదీస్' లలో దీని నుండి విముక్తి పొందటానికి దు'ఆలు ఇవ్వబడ్డాయి మరియు ఈ సలహాలు కూడా ఇవ్వబడ్డాయి: ఏదైనా మంచి వస్తువును చూస్తే దిష్టి తగలకుండా ఉండటానికి: 'మాషా అల్లాహ్' లేక 'బారకల్లాహ్' అనాలి. ఒకవేళ దిష్టి తగిలితే: దిష్టి పెట్టినవాడు ఒక పాత్రలో స్నానం చేసి ఆ నీటిని దిష్టి తగిలినవాడి మీద పోయాలి. (ఇబ్నె-కసీ'ర్).

# 69. అల్-హాఖ్ఖహ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఆ అనివార్య సంఘటన (పునరుత్థానం)!
2. ఏమిటా అనివార్య సంఘటన?
3. మరియు ఆ అనివార్య సంఘటన, అంటే ఏమిటో నీకేమి తెలుసు?
4. సమూద్ మరియు ఆద్ జాతి వారు అకస్మాత్తుగా విరుచుకుపడే ఆ ఉపద్రవాన్ని అసత్యమని తిరస్కరించారు[1].
5. కావున సమూద్ జాతి వారైతే ఒక భయంకరమైన గర్జన ద్వారా నాశనం చేయబడ్డారు.
6. మరియు ఆద్ జాతి వారేమో అతి తీవ్రమైన తుఫాను గాలి ద్వారా నాశనం చేయబడ్డారు.
7. ఆయన (అల్లాహ్), దానిని వారి మీద ఏడు రాత్రులు మరియు ఎనిమిది పగళ్ళ వరకు ఎడతెగకుండా ఆవరింపజేశాడు[2]. దాని వలన వారు వేళ్ళతో పెళ్ళగించబడిన ఖర్జూరపు బోదెల వలే పాడై పోవటం, నీవు చూస్తావు!
8. అయితే ఇప్పుడు వారిలో ఎవరైనా మిగిలి ఉన్నట్లు

---

[*] [అల్-హాఖ్ఖహ్ అంటే ఖచ్చితమైన వాస్తవము, అనివార్యము]

[1] 'ఆద్ మరియు స'మూద్ జాతుల సమాచారం కొరకు చూడండి, 7:65-79.

[2] చూడండి, 7:78.

నీవు చూస్తున్నావా?

9. ఫిర్ఔన్ మరియు అతనికి పూర్వం గతించిన వారూ మరియు తలక్రిందులు చేయబడిన నగరాల వారూ[3], అందరూ గొప్ప నేరాలకు పాల్పడినవారే.

10. మరియు వారు తమ ప్రభువు పంపిన ప్రవక్తలకు అవిధేయత కనబరచారు, కావున ఆయన వారిని కఠినమైన పట్టుతో పట్టుకున్నాడు.

11. నిశ్చయంగా, ఎప్పుడైతే (నూహ్ తుఫాన్) నీరు హద్దు లేకుండా ఉప్పొంగి పోయిందో! అప్పుడు మేము, మిమ్మల్ని[4] పయనించే (నావలో) ఎక్కించాము.

12. దానిని, మీకొక హితబోధగానూ మరియు జ్ఞాపకముంచుకోగల చెవి, దానిని జ్ఞాపకం ఉంచుకోవటానికి అనువైనదిగా చేశాము.

13. ఇక ఎప్పుడైతే ఒక పెద్ద ధ్వనితో బాకా ఊదబడుతుందో![5]

14. మరియు భూమి మరియు పర్వతాలు పైకి ఎత్తబడి ఒక పెద్ద దెబ్బతో తుత్తునియలుగా చేయబడతాయో!

15. అప్పుడు, ఆ రోజున సంభవించవలసిన ఆ

---

[3] అంటే లూ'త్ ('అ.స.) ప్రజలు. సోడోమ్, గొమొర్రాహ్ వాసులు, చూడండి, 11:69-83.

[4] మిమ్మల్ని అంటే మీ పూర్వీకులను.

[5] అల్-'హాఖ్ఖహ్: ఏ విధంగా సంభవిస్తుందో ఇక్కడ వివరించబడుతోంది. ఇస్రాఫీల్ ('అ.స.) పెద్ద ధ్వనితో బాకా ఊదగానే అది సంభవిస్తుంది.

అనివార్య సంఘటన సంభవిస్తుంది.

**16.** మరియు ఆ రోజున ఆకాశం బ్రద్దలై పోతుంది మరియు దాని వ్యవస్థ సడలి పోతుంది[6].

**17.** మరియు దేవదూతలు దాని (అర్ష్) ప్రక్కలలో ఉంటారు. మరియు నీ ప్రభువు యొక్క సింహాసనాన్ని (అర్ష్ ను), ఆ రోజు ఎనిమిది మంది (దేవదూతలు) ఎత్తుకొని ఉంటారు.

**18.** ఆ రోజు మీరు (తీర్పు కొరకు) హాజరు చేయబడతారు. మీరు దాచిన ఏ రహస్యం కూడా (ఆ రోజు) దాగి ఉండదు[7].

**19.** ఇక ఎవనికైతే తన కర్మపత్రము కుడి చేతిలో ఇవ్వబడుతుందో, అతడు ఇలా అంటాడు: "ఇదిగో నా కర్మపత్రాన్ని తీసుకొని చదవండి!

**20.** నిశ్చయంగా, నా లెక్క నాకు తప్పకుండా లభిస్తుందని నేను భావించేవాడిని!"

**21.** కావున, అతడు సంతోషకరమైన జీవితం గడుపుతాడు.

**22.** అత్యున్నతమైన స్వర్గవనంలో[8].

---

[6] అంటే దీని అర్థం ఇది కావచ్చు. ఆకాశంలోని నక్షత్రాల వ్యవస్థ సడలిపోతుంది. అవి బ్రద్దలై పోయి వాటి మధ్య నున్న గురుత్వాకర్షణ శక్తి నశించిపోతుంది.

[7] అంటే 'హాజరు చేయబడి, ప్రతివాని కర్మపత్రాలు అతని చేతికిచ్చి వాటి ఆధారంగా అతని తీర్పు జరుగుతుంది. ఆ తీర్పు ప్రకారం అతడు తన గమ్యస్థానానికి (స్వర్గం లేక నరకానికి) పంపబడతాడు.

[8] స్వర్గాలలో ఎన్నో దరజాలు ఉన్నాయి. నూరు దరజాలున్నాయని 'హదీస్'లో చెప్పబడింది. దరజా అంటే వర్గం, క్రమం, శ్రేణి, కక్ష్య లేక తరగతి.

23. దాని పండ్లగుత్తులు, సమీపంలో వ్రేలాడుతూ ఉంటాయి.
24. (వారితో ఇలా అనబడుతుంది): "గడిచి పోయిన దినాలలో మీరు చేసి పంపిన కర్మలకు ప్రతిఫలంగా, ఇప్పుడు మీరు హాయిగా తినండి మరియు త్రాగండి!"
25. ఇక ఎవడికైతే, తన కర్మపత్రం ఎడమ చేతికి ఇవ్వబడుతుందో, అతడు ఇలా వాపోతాడు: "అయ్యో! నా పాడుగాను! నా కర్మపత్రం అసలు నాకు ఇవ్వబడకుండా ఉంటే ఎంత బాగుండేది!
26. మరియు నా లెక్క ఏమిటో నాకు తెలియకుంటే ఎంత బాగుండేది!
27. అయ్యో! నా పాడుగాను! అది (ఆ మరణమే) నాకు అంతిమ మరణమై ఉంటే ఎంత బాగుండేది!
28. నా సంపద నాకేమీ పనికి రాలేదు;
29. నా అధికారమంతా అంతమై పోయింది!"
30. (అప్పుడు ఇలా ఆజ్ఞ ఇవ్వబడుతుంది): "అతన్ని పట్టుకోండి మరియు అతని మెడలో సంకెళ్ళు వేయండి[9];
31. తరువాత అతనిని భగభగమండే నరకాగ్నిలో వేయండి.
32. ఆ తరువాత అతనిని డెబ్బై మూరల పొడవు గల గొలుసుతో బంధించండి[10]!"

---

[9] 'గుల్లూహుస్: అతనికి సంకెళ్ళు వేయండి. చూడండి, 13:5, 34:33, 36:8, 40:71.
[10] చూడండి, 14:49.

33. వాస్తవానికి అతడు సర్వోత్తముడైన అల్లాహ్ ను విశ్వసించేవాడు కాదు.
34. మరియు నిరుపేదలకు ఆహారం పెట్టమని ప్రోత్సహించేవాడు కాదు.
35. కావున, ఈనాడు అతనికి ఇక్కడ ఏ స్నేహితుడూ లేడు;
36. మరియు అసహ్యాకరమైన గాయాల కడుగు తప్ప, మరొక ఆహారమూ లేదు!
37. దానిని పాపులు తప్ప మరెవ్వరూ తినరు!
38. కావున, నేను మీరు చూడగలిగే వాటి శపథం చేస్తున్నాను;
39. మరియు మీరు చూడలేనట్టని వాటి (శపథం) కూడా!
40. నిశ్చయంగా, ఇది (ఈ ఖుర్ఆన్) గౌరవనీయుడైన సందేశహరుని (పై అవతరింపజేయ బడిన) వాక్కు.
41. మరియు ఇది ఒక కవి యొక్క వాక్కు కాదు. మీరు విశ్వసించేది చాలా తక్కువ.
42. మరియు ఇది ఏ జ్యోతిష్యుని వాక్కు కూడా కాదు! మీరు గ్రహించేది చాలా తక్కువ.
43. ఇది సర్వలోకాల ప్రభువు తరఫు నుండి అవతరించింది.
44. ఒకవేళ ఇతను (ఈ ప్రవక్త), మా (అల్లాహ్ ను) గురించి ఏదైనా అబద్ధపు మాట కల్పించి ఉంటే!
45. మేము అతని కుడి చేతిని పట్టుకునే వారం.

46. తరువాత అతని (మెడ) రక్తనాళాన్ని కోసేవారం.
47. అప్పుడు మీలో నుండి ఏ ఒక్కడు కూడా అతనిని (మా శిక్ష నుండి) కాపాడ లేకపోయేవాడు
48. మరియు నిశ్చయంగా, ఇది (ఈ ఖుర్ఆన్) దైవభీతి గల వారికొక హితోపదేశం.
49. మరియు నిశ్చయంగా మీలో కొందరు దీనిని (ఈ ఖుర్ఆన్ ను) అసత్యమని అనేవారు ఉన్నారని మాకు బాగా తెలుసు.
50. మరియు నిశ్చయంగా, ఇది (ఈ తిరస్కారం) సత్యతిరస్కారులకు దుఃఖ కారణమవుతుంది.
51. మరియు నిశ్చయంగా, ఇది (ఈ ఖుర్ఆన్) నమ్మదగిన సత్యం.
52. కావున నీవు సర్వోత్తముడైన నీ ప్రభువు పవిత్ర నామాన్ని స్తుతించు.

# 70. అల్-మఆరిజ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ప్రశ్నించేవాడు[1], ఆ అనివార్యమైన శిక్షను గురించి ప్రశ్నించాడు;
2. సత్యతిరస్కారులకు విధించబడే దాని గురించి; దానిని ఎవ్వడూ తొలగించలేడు.
3. అది ఆరోహణ మార్గాలకు యజమానుడైన అల్లాహ్ తరఫు నుండి వస్తుంది[2].
4. యాభై వేల సంవత్సరాలకు సమానమైన (ప్రమాణం గల) ఒక రోజులో[3], దేవదూతలు మరియు ఆత్మ (జిబ్రీల్)[4] ఆయన వద్దకు అధిరోహిస్తారు.

---

[*] [అల్-మఆరిజ్ అంటే మెట్లు, నిచ్చెన]

[1] ఈ ప్రశ్నించే సత్యతిరస్కారి న'దర్ బిన్-'హారిస్' లేదా అబూ-జహల్ కావచ్చని వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. చూడండి, 8:32. అతడు బద్ర్ యుద్ధంలో చంపబడ్డాడు.

[2] చూడండి, 76:3.

[3] చూడండి,22:47 అక్కడ నీ ప్రభువు దృష్టిలో ఒక దినము మీరు లెక్కించే వేయి సంవత్సరాలకు సమానం. ఇంకా చూ, 32:5. అల్లాహ్ (సు.తా.) అనంతుడు, అపారుడు, అంతులేనివాడు, కాలపరిమితికి అతీతుడు. పరలోక జీవితంలో మానవునికి కూడా కాలమనే దానికి ఎలాంటి అర్థం ఉండదు.

[4] రూ'హ్: దీనిని ఇక్కడ కొందరు వ్యాఖ్యాతలు జిబ్రీల్ ('అ.స.) అన్నారు. మరికొందరు మానవుల ఆత్మలన్నారు. చూడండి, 19:17 వ్యాఖ్యానం 1.

5. కావున (ఓ ముహమ్మద్!) నీవు సహనం వహించు, ఉత్తమమైన సహనంతో!
6. వాస్తవానికి, వారు (ప్రజలు) అది (ఆ దినం) దూరంగా ఉందని అనుకుంటున్నారు.
7. కాని మాకది అతి దగ్గరలో కనిపిస్తోంది.
8. ఆ రోజు ఆకాశం మరిగే సీసం వలే (నూనే వలే) అయి పోతుంది.
9. మరియు కొండలు ఏకిన ఉన్ని వలె అయి పోతాయి[5].
10. మరియు ప్రాణ స్నేహితుడు కూడా తన స్నేహితుని (క్షేమాన్ని) అడగడు.
11. వారు ఒకరినొకరు చూసుకుంటూ ఉంటారు. ఆ రోజు అపరాధి తన సంతానాన్ని పరిహారంగా ఇచ్చి అయినా శిక్ష నుండి తప్పించుకోగోరుతాడు;
12. మరియు తన సహవాసిని మరియు తన సోదరుణ్ణి;
13. మరియు తనకు ఆశ్రయమిచ్చిన దగ్గరి బంధువులను;
14. మరియు భూమిలో ఉన్న వారినందరినీ కూడా ఇచ్చి అయినా, తాను విముక్తి పొందాలని కోరుతాడు.
15. కాని అలా కానేరదు! నిశ్చయంగా, ఆ మండే అగ్నిజ్వాల (అతని కొరకు వేచి ఉంటుంది)!

[5] చూడండి, 101:5 ఇటువంటి ఆయత్ కు.

16. అది అతని చర్మాన్ని పూర్తిగా వలచి కాల్చి వేస్తుంది.
17. అది(సత్యం నుండి) వెనుదిరిగి మరియు వెన్నుచూపి పోయేవారిని(అందరినీ) పిలుస్తుంది
18. మరియు (ధనాన్ని) కూడబెట్టి, దానిని దాచేవారిని.
19. నిశ్చయంగా, మానవుడు ఆత్రగాడుగా (తొందరపడేవాడిగా) సృష్టించబడ్డాడు;
20. తనకు కీడు కలిగినప్పుడు వాడు ఆందోళన చెందుతాడు;
21. మరియు తనకు మేలు కలిగినపుడు స్వార్థపరునిగా ప్రవర్తిస్తాడు.
22. నమాజ్ ను ఖచ్చితంగా పాటించేవారు తప్ప!
23. ఎవరైతే తమ నమాజ్ ను సదా నియమంతో పాటిస్తారో;
24. మరియు అలాంటివారు ఎవరైతే తమ సంపదలలో (ఇతరులకు) ఉన్న హక్కును సమ్మతిస్తారో![6]
25. యాచకులకు మరియు లేమికి గురి అయిన వారికి[7];
26. మరియు అలాంటి వారికి, ఎవరైతే తీర్పుదినాన్ని సత్యమని నమ్ముతారో;
27. మరియు ఎవరైతే తమ ప్రభువు శిక్షకు భయపడుతారో!
28. నిశ్చయంగా, వారి ప్రభువు యొక్క ఆ శిక్ష; దాని

---

[6] అంటే 'జకాత్ మరియు ఇతర దానధర్మాలు చేసేవారు.
[7] ఇటువంటి ఆయత్ కై చూడండి, 51:19.

పట్ల ఎవ్వరూ నిర్భయంగా ఉండ లేరు!

29. మరియు ఎవరైతే, తమ మర్మాంగాలను కాపాడుకుంటారో -

30. తమ భార్యలు (అజ్వాజ్), లేదా ధర్మసమ్మతంగా తమ ఆధీనంలో ఉన్న (బానిస) స్త్రీలతో తప్ప[8] - అలాంటప్పుడు వారు నిందార్హులు కారు.

31. కాని ఎవరైతే వీటిని మించి పోగోరుతారో, అలాంటివారే మితిమీరి పోయేవారు.

32. మరియు ఎవరైతే తమ అమానతులను మరియు తమ వాగ్దానాలను కాపాడుకుంటారో;

33. మరియు ఎవరైతే తమ సాక్ష్యాల మీద స్థిరంగా ఉంటారో;

34. మరియు ఎవరైతే తమ నమాజులను కాపాడుకుంటారో;

35. ఇలాంటి వారంతా సగౌరవంగా స్వర్గవనాలలో ఉంటారు.

36. ఈ సత్యతిరస్కారులకు ఏమయ్యింది? వీరెందుకు హడావిడిగా, నీ ముందు ఇటూ అటూ తిరుగుతున్నారు?

37. కుడి ప్రక్క నుండి మరియు ఎడమ ప్రక్క నుండి

[8] ధర్మయుద్ధం (జిహాద్)లో ఖైదీలుగా పట్టుబడ్డవారే బానిసలు, కనుక ఈ కాలంలో, ఇస్లాం నిర్దేశం ప్రకారం, బానిసలు అనబడేవారు అసలు లేరు. ఇంకా చూడండి, 23:5-7, 4:3.

గుంపులుగా[9];

**38.** ఏమీ? వారిలో ప్రతి ఒక్కడూ, తాను పరమ సుఖాలు గల స్వర్గవనంలో ప్రవేశింప జేయబడతానని ఆశిస్తున్నాడా?

**39.** అలా కానేరదు! నిశ్చయంగా, మేము వారిని దేనితో పుట్టించామో వారికి బాగా తెలుసు!

**40.** కావున! నేను తూర్పుల మరియు పడమరల ప్రభువు శపథం చేసి చెబుతున్నాను[10]. నిశ్చయంగా, మేము అలా చేయగల సమర్థులము;

**41.** వారికి బదులుగా వారి కంటే ఉత్తమమైన వారిని వారి స్థానంలో తీసుకురావటానికి; మరియు మమ్మల్ని మించి పోయేవారు ఎవ్వరూ లేరు.

**42.** కావున వారిని - వారితో వాగ్దానం చేయబడిన ఆ దినానికి చేరే వరకు - వ్యర్థపు మాటలలో మరియు విలాస వినోదాల్లో విడిచిపెట్టు.

**43.** ఆ రోజు వారు తమ సమాధుల నుండి లేచి, తమ గమ్యస్థానాలకు చేరుకోవటానికి తొందర పడుతూ

---

[9] దైవప్రవక్త ('స'అస) కాలంలో సత్యతిరస్కారులు అతని సమావేశాలలో వచ్చేవారు. కాని అతని మాటలు విని, వాటిని ఆచరించక ఎగతాళి చేస్తూ గుంపులుగా వెళ్ళి పోయేవారు. మీరు (విశ్వాసులు) కాదు మేమే స్వర్గంలోకి ప్రవేశిస్తాము, అని అనేవారు.

[10] చూడండి, 37:5 మరియు 55:17 తూర్పులూ మరియు పడమరలూ అంటే ఒక సంవత్సరపు కాలంలో ప్రతిరోజు సూర్యుడు ఒక కొత్త స్థానం నుండి ఉదయిస్తాడు మరియు ఒక కొత్త స్థానంలో అస్తమిస్తాడు. మరొక వ్యాఖ్యాన మేమిటంటే భూగోళంలోని విభిన్న భాగాలలో సూర్యుడు వేర్వేరు సమయాలలో వరుసగా ఉదయిస్తూ, అస్తమిస్తూ ఉంటాడు.

వేగంగా బయటికి వస్తారు.

44. వారి చూపులు క్రిందికి వాలి ఉంటాయి, అవమానం వారిని క్రమ్ముకొని ఉంటుంది. అదే వారికి వాగ్దానం చేయబడిన దినం!

# 71. నూహ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. నిశ్చయంగా, మేము నూహ్ ను అతని జాతి వారి వద్దకు: "వారిపై బాధాకరమైన శిక్ష రాకముందే వారిని హెచ్చరించు!" అని (ఆజ్ఞాపించి) పంపాము.
2. అతను వారితో ఇలా అన్నాడు: "ఓ నా జాతి ప్రజలారా! నిశ్చయంగా, నేను మీకు స్పష్టంగా హెచ్చరిక చేయటానికి వచ్చిన వాడిని!
3. కావున మీరు అల్లాహ్ నే ఆరాధించండి మరియు ఆయన యందు భయభక్తులు కలిగి ఉండండి మరియు నన్ను అనుసరించండి.
4. అలా చేస్తే ఆయన మీ పాపాలను క్షమిస్తాడు. మరియు ఒక నియమిత కాలం వరకు మిమ్మల్ని వదలి పెడ్తాడు. నిశ్చయంగా, అల్లాహ్ నిర్ణయించిన కాలం వచ్చినపుడు, దానిని తప్పించడం సాధ్యం కాదు. ఇది మీరు తెలుసుకుంటే ఎంత బాగుండేది!"
5. అతను ఇలా ప్రార్థించాడు: "ఓ నా ప్రభూ! నిశ్చయంగా, నేను నా జాతివారిని రేయింబవళ్ళు పిలిచాను;
6. కాని, నా పిలుపు, వారి పలాయనాన్ని మాత్రమే

[*] [నూహ్ – ప్రవక్త నూహ్ అలైహిస్సలాం]

హెచ్చించింది.

7. మరియు వాస్తవానికి, నేను వారిని, నీ క్షమాభిక్ష వైపునకు పిలిచినప్పుడల్లా, వారు తమ చెవులలో వ్రేళ్ళు దూర్చుకునేవారు మరియు తమ వస్త్రాలను తమ పై కప్పుకునే వారు మరియు వారు మొండి వైఖరి అవలంబిస్తూ దురహంకారంలో మునిగి ఉండేవారు.

8. తరువాత వాస్తవానికి, నేను వారిని ఎలుగెత్తి పిలిచాను.

9. ఆ తరువాత వాస్తవంగా, నేను వారికి బహిరంగంగా చాటి చెప్పాను మరియు ఏకాంతంలో రహస్యంగా పిలిచాను.

10. ఇంకా వారితో ఇలా అన్నాను: 'మీ ప్రభువును క్షమాపణకై వేడుకోండి, నిశ్చయంగా ఆయన ఎంతో క్షమాశీలుడు!

11. ఆయన మీపై ఆకాశం నుండి ధారాళంగా వర్షాన్ని కురిపింపజేస్తాడు[1].

12. మరియు మీకు ధన సంపదలలోను మరియు సంతానంలోను వృద్ధి నొసంగుతాడు మరియు మీ కొరకు తోటలను ఉత్పత్తి చేస్తాడు. మరియు నదులను ప్రవహింపజేస్తాడు.'"

13. మీకేమయింది? మీరు అల్లాహ్ మహత్త్వమును

---

[1] ఈ ఆయత్ ఆధారంగా కొందరు విద్వాంసులు ఈ సూరహ్ ను వర్షం కొరకు చేసే నమా'జ్ లో చదువటం ముస్త'హాబ్ అని అంటారు. ఇటువంటి ఆయత్ కోసం చూడండి, 11:52.

ఎందుకు ఆదరించరు[2]?

14. మరియు వాస్తవానికి ఆయనే మిమ్మల్ని విభిన్న దశలలో సృష్టించాడు[3].

15. ఏమీ? మీరు చూడటం లేదా? అల్లాహ్ ఏడు ఆకాశాలను ఏవిధంగా అంతస్తులలో సృష్టించాడో[4]!

16. మరియు వాటి మధ్య చంద్రుణ్ణి (ప్రతిబింబించే) కాంతిగాను మరియు సూర్యుణ్ణి (వెలిగే) దీపం గాను చేశాడు[5]!

17. మరియు అల్లాహ్ యే మిమ్మల్ని భూమి (మట్టి) నుండి[6] ఉత్పత్తి చేశాడు!

18. తరువాత ఆయన మిమ్మల్ని అందులోకే తీసుకొని పోతాడు మరియు మిమ్మల్ని దాని నుండి (బ్రతికించి) బయటికి తీస్తాడు!

19. మరియు అల్లాహ్ యే మీ కొరకు భూమిని విస్తరింపజేశాడు.

20. మీరు దానిపై నున్న విశాలమైన మార్గాలలో నడవటానికి.

21. నూహ్ ఇంకా ఇలా విన్నవించుకున్నాడు: "ఓ నా ప్రభూ! వాస్తవానికి వారు నా మాటను ధిక్కరించారు. మరియు వాడిని అనుసరించారు,

---

[2] వఖారున్:అంటే మహత్త్వం, ప్రభావం, ప్రతాపం, ఘనత రజా: అంటే లక్ష్యపెట్టు, ఆదరించు, భయపడు.

[3] చూడండి, 22:5, 23:14 మొదలైనవి.

[4] చూడండి, 67:3.

[5] చూడండి, 10:5.

[6] అంటే భూమిలో మూల పదార్థాల నుండి.

ఎవడి సంపద మరియు సంతానం వారికి కేవలం
నష్టం తప్ప మరేమీ అధికం చేయదో!
22. మరియు వారు పెద్ద కుట్ర పన్నారు[7].
23. మరియు వారు ఒకరితోనొకరు ఇలా అనుకున్నారు:
'మీరు మీ ఆరాధ్యదైవాలను విడిచి పెట్టకండి. వద్ద్
మరియు సువాఅ; యగూస్, యఊఖ్ మరియు
నస్ర్ లను విడిచిపెట్టకండి!'
24. మరియు వాస్తవానికి, వారు చాలా మందిని
తప్పు దారిలో పడవేశారు. కావున (ఓ నా
ప్రభూ!): నీవు కూడా ఈ దుర్మార్గులకు కేవలం
వారి మార్గభ్రష్టత్వాన్నే హెచ్చించు!'"
25. వారు తమ పాపాల కారణంగా ముంచివేయబడ్డారు
మరియు నరకాగ్నిలోకి త్రోయబడ్డారు, కావున
వారు అల్లాహ్ తప్ప తమను కాపాడే వారినెవ్వరినీ
పొందలేక పోయారు.
26. మరియు నూహ్ ఇలా ప్రార్థించాడు: "ఓ నా ప్రభూ!
సత్యతిరస్కారులలో ఒక్కరిని కూడా భూమి మీద
వదలకు[8].
27. ఒకవేళ నీవు వారిని వదలి పెడితే, నిశ్చయంగా
వారు నీ దాసులను మార్గభ్రష్టత్వంలో
పడవేస్తారు. మరియు వారు పాపులను
మరియు కృతఘ్నులను మాత్రమే పుట్టిస్తారు.

---

[7] నూహ్ ('అ.స.) ను చంపటానికి కుట్ర పన్నారని కొందరి అభిప్రాయం.

[8] చూడండి, 11:36.

**28.** ఓ మా ప్రభూ! నన్ను, నా తల్లిదండ్రులను మరియు విశ్వాసిగా నా ఇంటిలోనికి ప్రవేశించిన వానిని మరియు విశ్వాసులైన పురుషులను మరియు విశ్వాసులైన స్త్రీలను, అందరినీ క్షమించు. మరియు దుర్మార్గులకు వినాశం తప్ప మరేమీ అధికం చేయకు!"

# 72. అల్-జిన్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. (ఓ ప్రవక్తా!) ఇలా అను: "నాకు ఈ విధంగా దివ్యసందేశం పంపబడింది; నిశ్చయంగా, ఒక జిన్నాతుల సమూహం[1] - దీనిని (ఈ ఖుర్ఆన్ ను) విని - తమ జాతి వారితో ఇలా అన్నారు: 'వాస్తవానికి మేము ఒక అద్భుతమైన పఠనం (ఖుర్ఆన్) విన్నాము!

2. అది సరైన మార్గం వైపునకు మార్గదర్శకత్వం చేస్తుంది. కావున మేము దానిని విశ్వసించాము[2] మరియు మేము మా ప్రభువుకు ఎవ్వడిని కూడా భాగస్వామిగా సాటి కల్పించము.

3. మరియు నిశ్చయంగా, మా ప్రభువు వైభవం ఎంతో ఉన్నతమైనది. ఆయన ఎవ్వడినీ భార్యగా

---

[*] [అల్-జిన్ అంటే జిన్నాతులు]

[1] నఫరున్: అంటే 3 నుండి 10 వరకు ఉండే సంఖ్యల సమూహం. నఖ్ లా లోయలో దైవప్రవక్త ('స'అస) తమ అనుచరు(ర.'ది.'అన్హుమ్)లతో సహా ఫజ్ర్ నమా'జ్ చేస్తుండగా అక్కడి నుండి కొందరు జిన్నాతులు పోతూ వారి ఖుర్ఆన్ విని ప్రభావితులయి విశ్వసిస్తారు. ఈ విషయం 46:29 లో వచ్చింది. జిన్నాతులు ఖుర్ఆన్ విన్నది దైవప్రవక్త ('స'అస) కు తెలియదు. అది వ'హీ ద్వారా తెలుపబడిందని ఇక్కడ పేర్కొనబడింది.

[2] ఖుర్ఆన్ ను వినగానే జిన్నాతులు విశ్వసించారు. కాని మానవులు మాత్రం దానిని మళ్ళీ మళ్ళీ విని కూడా విశ్వసించడం లేదు.

(సాహిబతున్ గా) గానీ, కుమారునిగా గానీ చేసుకోలేదు.

4. మరియు నిశ్చయంగా, మనలోని అవివేకులు, కొందరు అల్లాహ్ విషయంలో దారుణమైన మాటలు పలుకుతున్నారు.

5. మరియు వాస్తవానికి మనం మానవులు గానీ, జిన్నాతులు గానీ అల్లాహ్ ను గురించి అబద్ధం పలకరని భావించేవారము.

6. మరియు వాస్తవానికి, మానవులలో నుండి కొందరు పురుషులు, జిన్నాతులలో నుండి కొందరు పురుషుల శరణు వేడుతూ ఉండేవారు. ఈ విధంగా వారు, వారి (జిన్నాతుల) తలబిరుసుతనం మరింత అధికమే చేసేవారు[3].

7. మరియు వాస్తవానికి, వారు (మానవులు) కూడా మీరు (జిన్నాతులు) భావించినట్లు, అల్లాహ్ ఎవ్వడినీ కూడా సందేశహరునిగా పంపడని భావించారు.

8. మరియు నిశ్చయంగా, మేము ఆకాశాలలో (రహస్యాలను) తొంగి చూడటానికి ప్రయత్నించి నపుడు, మేము దానిని కఠినమైన కావలివారితో

---

[3] చివరి వాక్యానికి కొందరు వ్యాఖ్యాతలు ఈ విధంగా తాత్పర్యం చెప్పారు: "కాని వారు, వారి (మానవుల) పాపాన్ని అవిశ్వాసాన్ని మరింత అధికం చేశారు." ఇస్లాంకు ముందు 'అరబ్బులు తమ ప్రయాణాలలో ఎక్కడైనా ఆగితే, అక్కడి జిన్నాతులతో శరణు కోరేవారు. ఇస్లాం దీనిని నిషేధించింది మరియు కేవలం ఒకే ఒక్క ప్రభువు, అల్లాహ్ (సు.తా.) తో శరణు కోరటాన్ని మాత్రమే విధిగా చేసింది. చూడండి, 15:23.

మరియు
అగ్ని జ్వాలలతో నిండి ఉండటాన్ని చూశాము[4].

9. మరియు వాస్తవానికి పూర్వం అక్కడి మాటలు వినటానికి మేము రహస్యంగా అక్కడ కూర్చునేవారం[5]. కాని ఇప్పుడు ఎవడైనా (రహస్యంగా) వినే ప్రయత్నం చేస్తే, అతడి కొరకు అక్కడ ఒక అగ్నిజ్వాల పొంచి ఉంటుంది[6].

10. మరియు వాస్తవానికి భూమిలో ఉన్న వారికి ఏదైనా కీడు ఉద్దేశింపబడిందా, లేక వారి ప్రభువు వారికి సరైన మార్గం చూపగోరుతున్నాడా అనే విషయం మాకు అర్థం కావడం లేదు.

11. మరియు వాస్తవానికి, మనలో కొందరు సద్వర్తనులున్నారు, మరికొందరు దానికి విరుద్ధంగా ఉన్నారు. వాస్తవానికి మనం విభిన్న మార్గాలను అనుసరిస్తూ వచ్చాము[7].

---

[4] చూడండి, 15:17-18. ఆకాశాలలో దైవదూతలు ('అలైహిమ్.స.), ఇతరులు అక్కడి మాటలు వినకుండా కాపలాకాస్తూ ఉంటారు మరియు ఈ అగ్ని కణాలు (షుహుబున్) ఆకాశాలలోని మాటలు వినటానికి పైకి పోయే జిన్నాతులపై పడతాయి. షుహుబున్ - షిహాబున్ బ.వ.

[5] మరియు ఆకాశాల మాటలు విని జ్యోతిష్కులకు చెప్పేవారము. వాటిలో వారు తమ వైపునుండి నూరు అబద్ధాలు కలిపి చెప్పేవారు.

[6] కాని దైవప్రవక్త ('స'అస) వచ్చిన తరువాత నుండి ఈ పని ఆపబడింది. ఇప్పుడు ఎవడైనా పైకి పోవటానికి ప్రయత్నిస్తే అగ్ని కణం అతనిపై పడుతుంది.

[7] జిన్నాతులలో కూడా వేర్వేరు జాతుల వారు, యూదులు, క్రైస్తవులు, ముస్లింలు మరియు సత్యతిరస్కారులు మొదలైనవారు ఉన్నారు.

12. మరియు నిశ్చయంగా, మేము అల్లాహ్ నుండి భూలోకంలో తప్పించుకోలేము, అని అర్థం చేసుకున్నాము. మరియు పారిపోయి కూడా ఆయన నుండి తప్పించుకోలేము.

13. మరియు నిశ్చయంగా, మేము ఈ మార్గదర్శకత్వాన్ని (ఖుర్ఆన్ ను) విన్నప్పుడు దానిని విశ్వసించాము. కావున ఎవడైనా తన ప్రభువును విశ్వసిస్తాడో అతడికి తన సత్కర్మల ఫలితం లో నష్టాన్ని గురించీ మరియు శిక్షలో హెచ్చింపును గురించీ భయపడే అవసరం ఉండదు.

14. మరియు నిశ్చయంగా, మనలో కొందరు అల్లాహ్ కు విధేయులైన వారు (ముస్లింలు) ఉన్నారు. మరికొందరు నిశ్చయంగా, అన్యాయపరులు[8] (సత్యానికి దూరమైన వారు) ఉన్నారు. కావున ఎవరైతే అల్లాహ్ కు విధేయత (ఇస్లాం) ను అవలంబించారో, అలాంటి వారే సరైన మార్గాన్ని కనుగొన్న వారు!' "

15. మరియు అన్యాయపరులే (సత్యానికి దూరమైనవారు) నరకానికి ఇంధనమయ్యే వారు[9]!

---

[8] ఖాసి'తూన్: ఈ పదానికి - సందర్భాన్ని బట్టి న్యాయవర్తనులు, అన్యాయపరులు అనే రెండు అర్థాలు వస్తాయి. ఈ సందర్భంలో అన్యాయపరులు, లేక సన్మార్గం నుండి లేక సత్యం నుండి విముఖులైనవారు అనే అర్థంలో వాడబడింది.

[9] అంటే జిన్నాతులలో కూడా నరకం మరియు స్వర్గంలోకి పోయేవారున్నారు. సత్యతిరస్కారులు నరకంలోకి మరియు విశ్వాసులు స్వర్గంలోకి పోతారు.

16. ఒకవేళ వారు (సత్యతిరస్కారులు) ఋజుమార్గం మీద స్థిరంగా ఉన్నట్లయితే, మేము వారిపై పుష్కలంగా నీటిని కురిపించే వారము.

17. దాంతో వారిని పరీక్షించటానికి! మరియు ఎవడైతే తన ప్రభువు ధ్యానం నుండి విముఖుడవుతాడో, ఆయన వానిని తీవ్రమైన శిక్షకు గురి చేస్తాడు.

18. మరియు నిశ్చయంగా, మస్జిదులు అల్లాహ్ కొరకే ప్రత్యేకించబడ్డాయి. కావున వాటిలో అల్లాహ్ తో పాటు ఇతరులెవ్వరినీ ప్రార్థించకండి.

19. మరియు నిశ్చయంగా, అల్లాహ్ యొక్క దాసుడు (ముహమ్మద్) ఆయన (అల్లాహ్) ను ప్రార్థించటానికి నిలబడినప్పుడు, వారు (జిన్నాతులు) అతన చుట్టు దట్టంగా (అతని ఖుర్ఆన్ పఠనాన్ని వినటానికి) గుమి గూడుతారు[10].

20. వారితో ఇలా అను: "నిశ్చయంగా నేను నా ప్రభువును మాత్రమే ప్రార్థిస్తాను మరియు

---

[10] దీని మరొక తాత్పర్యంలో: "(మానవులు మరియు జిన్నాతులు) అల్లాహ్ (సు.తా.) దాసుడు (ము'హమ్మద్ 'స'అస, అల్లాహుతా'ఆలాను) ప్రార్థించటానికి నిలబడినపుడు అతని చుట్టు దట్టంగా గుమిగూడి (అల్లాహ్ జ్యోతిని తమ నోట్లతో ఊది ఆర్పివేయగోరతారు)." అని ఉంది. ఈ తాత్పర్యం ఇబ్నె-'అబ్బాస్, ముజాహిద్, సయ్యద్ బిన్-'జుబైర్ మరియు ఇబ్నె-'జైద్ (ర'ది.'అన్హుమ్)లు ఇచ్చారు. ఇబ్నె-జరీర్ (ర'హ్మ) దీనికి ప్రాధాన్యత నిచ్చారు. ఇది ఇబ్నె-కసీ'ర్ (ర'హ్మ) లో పేర్కొనబడింది.

ఆయనకు ఎవ్వరినీ సాటి కల్పించను[11]."

21. వారితో ఇలా అను: "నిశ్చయంగా, మీకు కీడు చేయటం గానీ, లేదా సరైన మార్గం చూపటం గానీ నా వశంలో లేదు."

22. ఇంకా ఇలా అను: "నిశ్చయంగా, నన్ను అల్లాహ్ నుండి ఎవ్వడునూ కాపాడలేడు మరియు నాకు ఆయన తప్ప మరొకరి ఆశ్రయం కూడా లేదు;

23. (నా పని) కేవలం అల్లాహ్ ఉపదేశాన్ని మరియు ఆయన సందేశాన్ని అందజేయటమే!" ఇక ఎవడైతే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త ఆజ్ఞను ఉల్లంఘిస్తాడో! అతడు నిశ్చయంగా, నరకాగ్నికి గురి అవుతాడు; అందులో శాశ్వతంగా కలకాలం ఉంటాడు.

24. చివరకు వారికి వాగ్దానం చేయబడిన దానిని వారు చూసినప్పుడు, ఎవరి సహాయకులు బలహీనులో, మరెవరి వర్గం సంఖ్యాపరంగా తక్కువో వారికి తెలిసి పోతుంది[12].

25. ఇలా అను: "మీకు వాగ్దానం చేయబడినది (శిక్ష) సమీపంలోనే రానున్నదో, లేక దాని కొరకు నా ప్రభువు దీర్ఘకాల వ్యవధి నియమించాడో నాకు తెలియదు."

26. ఆయనే అగోచర జ్ఞానం గలవాడు, కావున ఆయన

---

[11] అలాంటప్పుడు వారితో ఇలా అను: "నేను నా ప్రభువును మాత్రమే ప్రార్థిస్తాను. మరియు ఆయనకు ఎవ్వరినీ సాటి కల్పించను."

[12] ఇటువంటి ఆయత్ కోసం చూడండి, 19:75.

అగోచర విషయాలు ఎవ్వడికీ తెలియ జేయడు.

**27.** తాను కోరి ఎన్నుకొన్న ప్రవక్తకు తప్ప[13] - ఎందుకంటే, ఆయన నిశ్చయంగా, అతని (ఆ ప్రవక్త) ముందు మరియు వెనుక రక్షకభటులను నియమిస్తాడు.

**28.** వారు, (ప్రవక్తలు) తమ ప్రభువు యొక్క సందేశాలను యథాతథంగా అందజేస్తున్నారని పరిశీలించడానికి. మరియు ఆయన వారి అన్ని విషయాలను పరివేష్టించి ఉన్నాడు మరియు ఆయన ప్రతి ఒక్క విషయాన్ని లెక్క పెట్టి ఉంచుతాడు.

---

[13] చూడండి, 3:179.

# 73. అల్-ముజ్జమ్మిల్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఓ దుప్పటి కప్పుకున్నవాడా[1]!
2. రాత్రంతా (నమాజ్ లో) నిలబడు, కొంత భాగాన్ని విడిచి;
3. దాని సగభాగంలో, లేదా దాని కంటే కొంత తక్కువ;
4. లేదా దాని కంటే కొంత ఎక్కువ; మరియు ఖుర్ఆన్ ను ఆగి ఆగి నెమ్మదిగా స్పష్టంగా పఠించు.
5. నిశ్చయంగా, మేము నీ పై భారమైన సందేశాన్ని అవతరింప జేయబోతున్నాము.
6. నిశ్చయంగా, రాత్రివేళ లేవటం (మనస్సును) అదుపులో ఉంచుకోవటానికి ఎంతో ఉపయుక్తమైనది మరియు (అల్లాహ్) ప్రవచనాలను (అర్థం చేసుకోవటానికి) కూడా ఎంతో అనుగణమైనది.
7. వాస్తవానికి, పగటివేళ నీకు చాలా పనులుంటాయి.
8. మరియు నీవు నీ ప్రభువు నామాన్ని స్మరిస్తూ ఉండు. మరియు అత్యంత శ్రద్ధతో ఆయన వైపుకు మరలుతూ ఉండు.
9. ఆయనే తూర్పూ పడమరల స్వామి, ఆయన

---

[*] [అల్-ముజ్జమ్మిల్ అంటే దుప్పటి కప్పుకున్నవాడు]

[1] ఈ సూరహ్ అవతరింపజేయబడినప్పుడు దైవప్రవక్త ('స'అస) దుప్పటి కప్పుకొని పడుకొని ఉంటారు. అతనికి లేచి తహజ్జుద్ నమా'జ్ చేయమని ఆజ్ఞ ఇవ్వబడింది. తహజ్జుద్ అతని కొరకు వాజిబ్ - తప్పనిసరి చేయబడి ఉండెను. (ఇబ్నె-కసీ'ర్).

తప్ప మరొక ఆరాధ్య దైవం లేడు, కావున నీవు ఆయననే కార్యకర్తగా చేసుకో.

10. మరియు వారు పలికే మాటలకు సహనం వహించు మరియు మంచితనంతో వారి నుండి తొలగిపో.

11. మరియు అసత్యవాదులైన ఈ సంపన్నులను, నాకు వదలిపెట్టు[2]. మరియు వారికి కొంత వ్యవధినివ్వు.

12. నిశ్చయంగా, మా వద్ద వారికొరకు సంకెళ్ళు మరియు భగభగమండే నరకాగ్ని ఉన్నాయి.

13. మరియు గొంతులో ఇరుక్కుపోయే ఆహారం మరియు బాధాకరమైన శిక్ష (ఉన్నాయి).

14. ఆ రోజు భూమి మరియు పర్వతాలు కంపించి పోతాయి. మరియు పర్వతాలు ప్రవహించే ఇసుక దిబ్బలుగా మారిపోతాయి[3].

15. మేము ఫిర్ఔన్ వద్దకు సందేశహరుణ్ణి పంపినట్లు, నిశ్చయంగా మీ వద్దకు కూడా ఒక సందేశహరుణ్ణి, మీకు సాక్షిగా ఉండటానికి పంపాము.

16. కాని ఫిర్ఔన్ ఆ సందేశహరునికి అవిధేయత చూపాడు. కావున మేము అతనిని తీవ్రమైన శిక్షకు గురి చేశాము.

17. ఒకవేళ మీరు సత్యాన్ని తిరస్కరిస్తే, బాలురను ముసలివారిగా చేసేటటు వంటి ఆ దినపు శిక్ష

[2] చూడండి, 74:11.

[3] చూడండి, 14:48 మరియు 20:105-107.

నుండి ఎలా తప్పించుకోగలరు[4]?

18. అప్పుడు ఆకాశం బ్రద్దలైపోతుంది. ఆయన యొక్క వాగ్దానం తప్పక నెరవేరి తీరుతుంది.

19. నిశ్చయంగా, ఇదొక ఉపదేశం కావున ఇష్టమైన వాడు తన ప్రభువు వద్దకు పోయే మార్గాన్ని అవలంబించవచ్చు!

20. (ఓ ముహమ్మద్!) నీవు, వాస్తవానికి దాదాపు మూడింట రెండు వంతుల రాత్రి లేక సగం (రాత్రి) లేక మూడింట ఒక భాగం (నమాజ్ లో) నిలుస్తావనేది నీ ప్రభువుకు బాగా తెలుసు. మరియు నీతో పాటు ఉన్న వారిలో కొందరు కూడా! మరియు అల్లాహ్ రేయింబవళ్ళ పరిమాణాలను నిర్ణయిస్తాడు. మీరు ఖచ్చితంగా పూర్తి రాత్రి ప్రార్థించలేరని ఆయనకు తెలుసు. కావున ఆయన మీ వైపునకు (కనికరంతో) మరలాడు. కావున ఖుర్ఆన్ ను, మీరు సులభంగా పఠించగలిగినంతే పఠించండి. మీలో కొందరు వ్యాధిగ్రస్తులు కావచ్చు,

---

[4] పునరుత్థానదినమునఆదమ్ ('అ.స.)తో ఇలా అనబడుతుంది: "నీ సంతానం నుండి నరకం వారిని ఎన్నుకో." అతను ప్రశ్నిస్తాడు: "ఓ అల్లాహ్ (సు.తా.)! ఏ విధంగా?" అల్లాహ్ (సు.తా.) అంటాడు: "ప్రతి వేయి మంది నుండి 999 మందిని, అప్పుడు గర్భవతులైన స్త్రీల పిండాలు పడిపోతాయి మరియు పిల్లలు వృద్ధులై పోతారు." ఈ విషయం విని అనుచరు (ర'ది.'అన్హుమ్)లు చాలా చింతలో పడిపోయారు. అప్పుడు దైవప్రవక్త ('స'అస) అంటారు: "యాజూజ్ మాజూజ్ జాతి వారి నుండి 999 ఉంటారు. మరియు మీలో నుండి ఒకడు; అల్లాహ్ (సు.తా.) కరుణ పై నాకు విశ్వాసముంది. స్వర్గవాసులలో నుండి సగం మంది మీరుంటారు." ('స.బు'ఖారీ)

మరికొందరు అల్లాహ్ అనుగ్రహాన్ని అన్వేషిస్తూ భూమిలో ప్రయాణంలో ఉండవచ్చు. మరికొందరు అల్లాహ్ మార్గంలో ధర్మయుద్ధం చేస్తూ ఉండవచ్చు అని ఆయనకు బాగా తెలుసు. కావున మీకు దానిలో సులభమైనంత దానినే పఠించండి[5]. మరియు నమాజును స్థాపించండి[6], విధిదానం (జకాత్) ఇవ్వండి. మరియు అల్లాహ్ కు మంచి అప్పును, అప్పుగా ఇస్తూ ఉండండి. మరియు మీరు, మీ కొరకు ముందుగా చేసి పంపుకున్న మంచి కార్యాలన్నింటినీ అల్లాహ్ దగ్గర పొందుతారు. అదే చాలా ఉత్తమమైనది. మరియు దాని ప్రతిఫలం చాలా గొప్పది. మరియు మీరు అల్లాహ్ ను క్షమాభిక్ష అర్థిస్తూ ఉండండి. నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

---

[5] అల్లాహ్ (సు.తా.) మిమ్మల్ని కనికరించాడు కావున, తహజ్జుద్ లో మీకు సులభమైనంతనే పఠించండి. రెండు రకాతులైనా సరే. దైవప్రవక్త చాలా మట్టుకు ఎనిమిది రకాతులు చేసేవారు. అతనినే అనుసరించినా ఎంతో మేలు. మీ తహజ్జుద్ నమాజ్ లో వీలైనంత ఖుర్ఆన్ పఠనం చేయండి. నెమ్మదిగా స్పష్టంగా పఠించండి.

[6] అంటే ఐదు సార్లు చేసే ఫ'ర్ద్ నమాజులు. చాలా మంది వ్యాఖ్యాతల అభిప్రాయంలో ఈ ఆయత్ మదీనాలో అవతరింపజేయబడింది.

# 74. అల్-ముదథ్థిర్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఓ దుప్పటిలో చుట్టుకున్నవాడా!
2. లే! ఇక హెచ్చరించు!
3. మరియు మీ ప్రభువు గొప్పతనాన్ని (ఘనతను) కొనియాడు (చాటి చెప్పు)!
4. మరియు నీ వస్త్రాలను పరిశుభ్రంగా ఉంచుకో!
5. మరియు మాలిన్యానికి దూరంగా ఉండు!
6. మరియు ఎక్కువ పొందాలనే ఆశతో ఇవ్వకు (ఉపకారం చేయకు)!
7. మరియు నీ ప్రభువు కొరకు సహనం వహించు!
8. మరియు బాకా (నాఖూర్) ఊదబడినప్పుడు;
9. ఆ దినం చాలా కఠినమైన దినమై ఉంటుంది;
10. సత్యతిరస్కారులకు అది సులభమైన (దినం) కాదు[1].
11. వదలండి! నన్నూ మరియు నేను ఒంటరిగా

---

[*] [అల్-ముదథ్థిర్ అంటే దుప్పటి చుట్టుకున్నవాడు]

[1] అల్-కాఫిరీన్: అంటే సత్యతిరస్కారులు. ఈ పదం ఇక్కడ ఖుర్ఆన్ అవతరణా క్రమంలో మొదటిసారి వచ్చింది. 57:20లో మాత్రం ఈ పదానికి భూమిని దున్నేవాడు అనే అర్థం ఉంది. మిగతా అన్నీ చోట్లలో ఈ పదం సత్యతిరస్కారులనే అర్థంలోనే వాడబడింది.

పుట్టించిన వానినీ[2]!

12. మరియు నేను అతనికి పుష్కలంగా సంపదనిచ్చాను.

13. మరియు అతనికి తోడుగా ఉండే కుమారులను!

14. మరియు అతను కొరకు అతని జీవన సౌకర్యాలను సులభం చేశాను.

15. అయినా నేను అతనికి ఇంకా ఇవ్వాలని అతడు ఆశిస్తూ ఉంటాడు.

16. అలా కాదు! వాస్తవానికి అతడు మా (అల్లాహ్) సూచనల(ఆయాత్ ల) పట్ల విరోధం కలిగి వున్నాడు.

17. నేను త్వరలోనే అతనిని దుర్గమమైన స్థానానికి (శిక్షకు) నెట్టుతాను!

18. వాస్తవానికి, అతడు ఆలోచించాడు మరియు మనస్సులో ప్రణాళిక చేసుకున్నాడు.

19. కావున (అతనిని) తాను ప్రణాళిక చేసుకున్నట్లు నాశనానికి గురి కానివ్వండి!

20. అవును (అతనిని) తాను ప్రణాళిక చేసుకున్నట్లు, నాశనానికి గురి కానివ్వండి!

21. అప్పుడు అతడు ఆలోచించాడు.

22. తరువాత అతడు నుదరు చిట్లించుకున్నాడు మరియు కోపంతో చూశాడు (ముఖం

---

[2] చూడండి, 6:94, 19:80, 95. కొందరు వ్యాఖ్యాతలు ఈ ఆయత్ వలీద్ బిన్ ము'గైరాను ఉద్దేశిస్తోంది అని అభిప్రాయపడ్డారు. అతడు సత్యతిరస్కారం మరియు దురహంకారంలో మితిమీరి పోయాడు. ఈ ఆయత్ ఇటువంటి ప్రతి సత్యతిరస్కారిని సూచిస్తుంది.

మాడ్చుకున్నాడు);
23. తరువాత అతడు వెనుకకు మరలి దురహంకారం చూపాడు[3].
24. అప్పుడు అతడు ఇలా అన్నాడు: "ఇది పూర్వ నుండి వస్తూ వున్న ఒక మంత్రజాలం మాత్రమే!
25. ఇది కేవలం ఒక మానవ హక్కు మాత్రమే
26. త్వరలోనే నేను అతనిని నరకాగ్నిలో కాల్చుతాను.
27. మరియు ఆ నరకాగ్ని అంటే నీవు ఏమనుకుంటున్నావు[4]?
28. అది (ఎవరినీ) మిగల్చదు మరియు వదలి పెట్టదు[5].
29. అది మానవుణ్ణి (అతడి చర్మాన్ని) దహించి వేస్తుంది[6].
30. దానిపై పందొమ్మిది (దేవదూతలు నియమించబడి) ఉన్నారు.
31. మరియు మేము దేవదూతలను మాత్రమే నరకానికి రక్షకులుగా నియమించాము. మరియు

---

[3] చూడండి, 96:6-7.

[4] సఖరున్: నరకానికి ఏడు అంతస్తులు లేక శ్రేణులున్నాయి. 1) జహన్నమ్ (నరకం), 2) ల”జ్జా (ధ్వంసం చేసే అగ్ని), 3) 'హు'త్మ (అణగ/చితకగొట్టే శిక్ష), 4) స'యీర్ (ప్రజ్వలించే అగ్ని), 5) సఖర్ (నరకాగ్ని), 6) జ'హీమ్ (మండే అగ్ని), 7) హావియహ్, ఇది అన్నింటి కంటే క్రింది అంతస్తు, ఇందులో మునాఫిఖులు (కపటవిశ్వాసులు) ఉంటారు. ఏడు ద్వారాలు అంటే ఏడు విధాలైన పాపుల దారులు. చూడండి, 15:44.

[5] అంటే అది నరకవాసులను బ్రతకనివ్వదూ మరియు చావనివ్వదూ, వారి శరీరపు ప్రతి భాగాన్ని కాల్చుతుంది.

[6] చూడండి, 87:12-13.

మేము వారి సంఖ్యను (పందొమ్మిదిని), సత్యతిరస్కారులకు ఒక పరీక్షగా, గ్రంథ ప్రజలకు నమ్మకం కలగటానికి, విశ్వాసుల విశ్వాసాన్ని అధికం చేయటానికి మరియు గ్రంథ ప్రజలు మరియు విశ్వాసులు సందేహంలో పడకుండా ఉండటానికి మరియు తమ హృదయాలలో రోగమున్న వారు మరియు సత్యతిరస్కారులు: "ఈ ఉపమానం ఇవ్వటంలో అల్లాహ్ ఉద్దేశమేమిటి?" అని పలుకటానికి! ఈ విధంగా అల్లాహ్ తాను కోరిన వారిని మార్గభ్రష్టత్వంలో వదలుతాడు. మరియు తాను కోరిన వారికి మార్గదర్శకత్వం చేస్తాడు[7]. మరియు నీ ప్రభూవు సైన్యాలను ఆయన తప్ప మరెవ్వరూ ఎరుగరు. మరియు ఇదంతా మానవునికి ఒక జ్ఞాపిక మాత్రమే.

**32.** అలా కాదు! చంద్రుని సాక్షిగా!

**33.** గడిచిపోయే రాత్రి సాక్షిగా!

**34.** ప్రకాశించే, ఉదయం సాక్షిగా!

**35.** నిశ్చయంగా, ఇది (ఈ నరకాగ్ని ప్రస్తావన) ఒక గొప్ప విషయం.

**36.** మానవునికి ఒక హెచ్చరిక;

**37.** మీలో ముందుకు రావాలని కోరుకునే వానికి లేదా వెనుక ఉండి పోయేవానికి;

**38.** ప్రతి మానవుడు తాను చేసిన కర్మలకు తాకట్టుగా

---

[7] చూడండి, 2:26.

ఉంటాడు.

39. కుడిపక్షం వారు తప్ప!

40. వారు స్వర్గాలలో ఉంటూ ఒకరినొకరు ఇలా ప్రశ్నించుకుంటారు!

41. అపరాధులను గురించి (మరియు వారితో అంటారు):

42. “మిమ్మల్ని ఏ విషయం నరకంలోకి ప్రవేశింపజేసింది?”

43. వారు (నరకవాసులు) ఇలా జవాబిస్తారు: "మేము నమాజ్ చేసే వాళ్ళం కాము.

44. మరియు నిరుపేదలకు ఆహారం పెట్టేవాళ్ళం కాము;

45. మరియు వృథా కాలక్షేపం చేసే వారితో కలిసి వ్యర్థ ప్రలాపాలు (ప్రసంగాలు) చేస్తూ ఉండే వాళ్ళము;

46. మరియు తీర్పుదినాన్ని అబద్ధమని నిరాకరిస్తూ ఉండేవాళ్ళము;

47. చివరకు ఆ అనివార్యమైన ఘడియ మాపై వచ్చి పడింది[8].

48. అప్పుడు సిఫారసు చేసేవారి సిఫారసు వారికి ఏ మాత్రం ఉపయోగపడదు[9].

49. అయితే, వారికేమయింది? ఈ హితోపదేశం నుండి వారెందుకు ముఖం త్రిప్పు కుంటున్నారు.

50. వారి స్థితి బెదిరిన అడవి గాడిదల మాదిరిగా ఉంది;

---

[8] చూడండి, 15:99.

[9] సిఫారసు కొరకు చూడండి, 10:3.

51. సింహం నుండి పారిపోయే (గాడిదల మాదిరిగా)[10]!
52. అలా కాదు! వారిలో ప్రతి ఒక్క వ్యక్తి తనకు విప్పబడిన గ్రంథాలు ఇవ్వబడాలని కోరుతున్నాడు[11].
53. కాదు! కాదు! అసలు వారు పరలోక జీవితం గురించి భయపడటం లేదు.
54. అలా కాదు! నిశ్చయంగా, ఇది ఒక హితోపదేశం.
55. కావున కోరినవాడు దీని నుండి హితబోధ గ్రహించవచ్చు.
56. కాని అల్లాహ్ కోరితే తప్ప! వీరు దీని నుండి హితబోధ గ్రహించలేరు. ఆయనే (అల్లాహ్ యే) భయభక్తులకు అర్హుడు మరియు ఆయనే క్షమించే అర్హత గలవాడు[12].

---

[10] దీనిని వ్యాఖ్యాతలు - సింహం, పులి లేక వేటగాడి నుండి - పారిపోవటం, అని అన్నారు.

[11] విప్పబడిన గ్రంథాలు అంటే: ము'హమ్మద్ ('స'అస), అల్లాహ్ (సు.తా.) యొక్క ప్రవక్త అని వ్రాయబడిన గ్రంథం ప్రతి ఒక్కరికి ఇవ్వబడాలని లేక దైవగ్రంథం ప్రతి ఒక్కరికి ఇవ్వబడాలని. చూడండి, 2:118. వారు ఇలా పలకడం వారి దురహంకారాన్ని సూచిస్తుంది.

[12] చూడండి, 81:28-29 మరియు 14:4.

# 75. అల్-ఖియామహ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. అలా కాదు! నేను పునరుత్థాన దినపు శపథం చేస్తున్నాను.
2. అలా కాదు! నేను తనను తాను నిందించుకునే అంతరాత్మ శపథం చేస్తున్నాను.
3. ఏమిటి? మేము అతని ఎముకలను ప్రోగు చేయలేమని మానవుడు భావిస్తున్నాడా?
4. వాస్తవానికి! మేము అతని వ్రేళ్ళ కొనలను గూడా సరిగ్గా సవరించగల సమర్థులము.
5. అయినా, మానవుడు ఇక మీద కూడా దుష్కార్యాలు చేయగోరుతున్నాడు.
6. అతడు: "అయితే ఈ పునరుత్థాన దినం ఎప్పుడు వస్తుంది?" అని అడుగుతున్నాడు.
7. కళ్ళు మిరుమిట్లుగొన్నప్పుడు;
8. మరియు చంద్రునికి గ్రహణం పట్టినప్పుడు;
9. మరియు సూర్యచంద్రులు కలిపి వేయబడినప్పుడు;
10. మానవుడు ఆ రోజు: "ఎక్కడికి పారి పోవాలి?" అని అంటాడు.
11. అది కాదు! (అతనికి) ఎక్కడా శరణం ఉండదు!
12. ఆ రోజు నీ ప్రభువు వద్దనే ఆశ్రయం ఉంటుంది.

---

[*] [అల్-ఖియామహ్ అంటే ప్రళయము]

13. ఆ రోజు మానవుడికి, తాను చేసి పంపంది మరియు వెనక వదలింది అంతా తెలుప బడుతుంది[1].

14. అలా కాదు! మానవుడు తనకు విరుద్ధంగా, తానే సాక్షి అవుతాడు;

15. మరియు అతడు ఎన్ని సాకులు చెప్పినా సరే![2]

16. నీవు దీనిని (ఈ ఖుర్ఆన్ ను గ్రహించటానికి) నీ నాలుకను త్వరత్వరగా కదిలించకు[3].

17. నిశ్చయంగా, దీనిని సేకరించటం మరియు దీనిని చదివించటం మా బాధ్యతే!

18. కావున మేము దీనిని పఠించినప్పుడు నీవు ఆ పారాయణాన్ని శ్రద్ధగా అనుసరించు.

19. ఇక దాని భావాన్ని అర్థమయ్యేలా చేయటం మా బాధ్యతే[4]!

20. అలా కాదు! వాస్తవానికి మీరు అనిశ్చితమైన (ఇహలోక జీవితం పట్ల) వ్యామోహం పెంచుకుంటున్నారు;

---

[1] చూడండి, 18:49.

[2] చూడండి, 24:24, 36:25 లేక 41:20-22.

[3] జిబ్రీల్ ('అ.స.) ఖుర్ఆన్ అవతరింపజేసేటప్పుడు, దైవప్రవక్త ('స'అస) ఏ పదాన్ని కూడా మరచి పోరాదని త్వరత్వరగా చదివేవారు. అల్లాహుతా'ఆలా త్వరత్వరగా చదువటం నుండి నివారించాడు. ('స.బు'ఖారీ). ఇటువంటి వాక్యానికై చూడండి, 20:114.

[4] దైవప్రవక్త ('స'అస) ఖుర్ఆన్ ను ప్రజలకు అర్థమవటానికి వివరించి చెప్పింది కూడా అల్లాహ్ (సు.తా.) తరఫు నుండి, తనకు తెలుపబడిందే. ఈ వివరణలే 'హదీసులు!

21. మరియుపరలోకజీవితాన్నివదలిపెడుతున్నారు![5]
22. ఆ రోజున కొన్ని ముఖాలు కళకళ లాడుతూ ఉంటాయి;
23. తమ ప్రభువు (అల్లాహ్) వైపునకు చూస్తూ ఉంటాయి[6];
24. మరికొన్ని ముఖాలు ఆ రోజు, కాంతిహీనమై ఉంటాయి[7];
25. నడుమును విరిచే బాధ వారికి కలుగుతుందని భావించి[8].
26. అలా కాదు! ప్రాణం గొంతులోకి వచ్చినపుడు[9];
27. మరియు: "ఎవడైనా ఉన్నాడా? అతనిని (మరణం నుండి) కాపాడటానికి?" అని అనబడుతుంది[10].
28. మరియు అప్పుడతడు వాస్తవానికి తన ఎడబాటు కాలం వచ్చిందని గ్రహిస్తాడు;
29. మరియు ఒక పిక్క మరొక పిక్కతో కలిసిపోతుంది[11].
30. ఆ రోజు నీ ప్రభువు వైపునకే ప్రయాణం ఉంటుంది!
31. కాని అతడు సత్యాన్ని నమ్మలేదు మరియు

---

[5] అంటే పరలోక జీవితాన్ని నమ్మటం లేదు. మీరు మీ జీవితం కేవలం ఈ ఇహలోక జీవితం మాత్రమే అనే భ్రమలో పడి ఉన్నారు. మీరు పునరుత్థరింపబడతారని నమ్మటం లేదు.

[6] ఇవి విశ్వాసుల ముఖాలు.

[7] ఇవి సత్యతిరస్కారుల ముఖాలు.

[8] అంటే వారు నరకంలో వేయబడతారని తెలుసుకొని.

[9] మరణం ఆసన్నమైనప్పుడు.

[10] ఇటువంటి ఆయత్ కోసం చూడండి, 28:71-72.

[11] అంటేఅతడుతానుకష్టాలపాలవుతున్నానని తెలుసుకుంటాడు.

నమాజ్ సలపనూ లేదు[12]!

32. మరియు అతడు (ఈ సందేశాన్ని) అసత్యమన్నాడు మరియు దాని నుండి వెనుదిరిగాడు!

33. ఆ తరువాత నిక్కుతూ నీల్గుతూ తన ఇంటివారి వద్దకు పోయాడు!

34. (ఓ సత్యతిరస్కారుడా!) నీకు నాశనం మీద నాశనం రానున్నది!

35. అవును, నీకు నాశనం మీద నాశనం రానున్నది!

36. ఏమిటీ? మానవుడు తనను విచ్చల విడిగా వదలిపెట్టడం జరుగుతుందని భావిస్తున్నాడా?

37. ఏమీ? అతడు ప్రసరింప జేయబడిన ఒక వీర్యబిందువు కాడా?

38. తరువాత ఒక రక్తకండగా (జలగగా) ఉండేవాడు కాదా? తరువాత ఆయనే (అల్లాహ్ యే) అతనిని సృష్టించి అతని రూపాన్ని తీర్చిదిద్దాడు[13].

39. ఆ తరువాత అతని నుండి స్త్రీ పురుషుల రెండు రకాలను (జాతులను) ఏర్పరచాడు.

40. అలాంటప్పుడు ఆయనకు మరణించిన వారిని మళ్ళీ బ్రతికించే సామర్థ్యం లేదా?

---

[12] చూడండి, 4:17-18.

[13] చూడండి, 87:2 మరియు 91:7.

# 76. అల్-ఇన్సాన్ [*]

అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

1. అనంత కాలచక్రంలో, మానవుడు తాను చెప్పుకోదగిన వస్తువు కాకుండా ఉన్న సమయం గడవలేదా?

2. నిశ్చయంగా, మేము మానవుణ్ణి ఒక మిశ్రమ వీర్యబిందువుతో సృష్టించాము[1]. అతనిని పరీక్షించటానికి, మేము అతనిని వినేవాడిగా, చూసేవాడిగా చేశాము[2].

3. నిశ్చయంగా, మేము అతనికి మార్గం చూపాము. ఇక అతడు కృతజ్ఞుడు కావచ్చు, లేదా కృతఘ్నుడూ కావచ్చు[3]!

4. నిశ్చయంగా, మేము సత్యతిరస్కారుల కొరకు సంకెళ్ళను, మెడలో పట్టాలను మరియు భగభగ మండే నరకాగ్నిని (సఈరాను) సిద్ధపరచి

---

[*] [అల్-ఇన్సాన్ అంటే మానవులు, దీని మరో పేరు అద్-దహ్ర్]

[1] అంటే స్త్రీ పురుషుల మిశ్రమంతో! అంటే పురుషుని రేతస్సు, లేక వీర్యబిందువు, లేక శుక్లం (Sperm), స్త్రీ బీజకణం (Ovum) చూడండి, 86:6-7.

[2] అంటే పరీక్షించటం, చూడండి, 67:2.

[3] ప్రతి మానవుడు తన ఆత్మను వ్యాపారంలో పెడ్తాడు. దానిని నష్టంలో పడవేస్తాడు. లేక లాభంలో ('స. ముస్లిం). నష్టం అంటే నరకం, లాభం అంటే స్వర్గం. ఇంకా చూడండి, 90:10.

ఉంటాము[4].

5. నిశ్చయంగా, పుణ్యాత్ములు కాఫూర్ అనే ఒక చెలమ నుండి ఒక గిన్నెలో తెచ్చిన (పానీయాన్ని) త్రాగుతారు[5].

6. ధారాళంగా పొంగి ప్రవహింప జేయబడే ఊటల నుండి, అల్లాహ్ దాసులు త్రాగుతూ ఉంటారు[6].

7. వారు తమ మొక్కుబడులను పూర్తి చేసుకున్నవారై ఉంటారు[7]. మరియు దాని హాని అన్ని వైపులా క్రమ్ముకొనే, ఆ దినమును గురించి భయపడుతూ ఉంటారు.

8. మరియు అది తమకు ప్రీతికరమైనప్పటికీ వారు నిరుపేదలకు మరియు అనాథలకు మరియు ఖైదీలకు, ఆహారం పెట్టేవారై ఉంటారు[8].

9. వారు (వారితో ఇలా అంటారు): "వాస్తవానికి

---

[4] ఇది అల్లాహ్(సు.తా.) ప్రసాదించిన స్వేచ్ఛను చెడుమార్గంలో వినియోగించటం వల్ల లభించే ప్రతిఫలం. ఇంకా చూడండి, 73:12-13.

[5] చూడండి, 83:25-28.

[6] అంటే అది ఎన్నటికీ తరిగిపోదు.

[7] మొక్కుబడులు కేవలం అల్లాహ్ (సు.తా.) కే చేస్తారు. మరియు వాటిని పూర్తి చేస్తారు. "అల్లాహ్ (సు.తా.) పేరుతో మొక్కుబడి చేసుకుంటే దానిని పూర్తి చేసుకోవాలి." ('స. బు'ఖారీ) చూడండి, 15:23.

[8] దైవప్రవక్త ('స'అస) ఆదేశానుసారం 'స'హాబీలు (ర'ది.'అన్హుమ్) బద్ర్ యుద్ధ ఖైదీలకు మొదట అన్నం పెట్టి , తరువాత తాము తినేవారు, (ఇబ్నె-కసీ'ర్) మన ఆధీనంలో ఉన్న సేవకులతో కూడా మంచిగా వ్యవహరించాలి. దైవప్రవక్త ('స'అస) చివరి ఉపదేశం: "నమా'జ్ ను మరియు మీ సేవకులను ఆదరించండి." (ఇబ్నె-మాజా). ఇంకా చూడండి, 2:177 మరియు 90:14-16.

మేము అల్లాహ్ ప్రసన్నత కొరకే మీకు ఆహారం పెడుతున్నాము. మేము మీ నుండి ఎలాంటి ప్రతిఫలం గానీ, లేదా కృతజ్ఞతలు గానీ ఆశించటం లేదు.

10. నిశ్చయంగా, మేము మా ప్రభువు నుండి వచ్చే ఉగ్రమైన, దుర్భరమైన, ఆ దినానికి భయపడుతున్నాము!

11. కావున అల్లాహ్ వారిని ఆ దినపు కీడు నుండి కాపాడాడు. మరియు వారికి ఉల్లాసాన్ని మరియు ఆనందాన్ని ప్రసాదించాడు.

12. మరియు వారి సహనానికి[9] ప్రతిఫలంగా వారికి స్వర్గాన్ని మరియు పట్టువస్త్రాలను ఇచ్చాడు[10].

13. అందులో, వారు ఎత్తైన పీఠాల మీద దిండ్లకు ఆనుకొని కూర్చొని ఉంటారు. అందులో వారు ఎండ (బాధ) గానీ, చలి తీవ్రతను గానీ చూడరు!

14. మరియు అందులో వారిపై నీడలు పడుతుంటాయి[11]. దాని ఫలాల గుత్తులు వారికి అందుబాటులో ఉంటాయి.

15. మరియు వారి మధ్య వెండి పాత్రలు మరియు గాజుగ్లాసులు త్రిప్ప బడుతూ ఉంటాయి.

16. ఆ గాజు గ్లాసులు స్ఫటికం వలే తెల్లవైన వెండితో

---

[9] 'సబరున్: సహనం, అంటే ధర్మమార్గంలో వచ్చే కష్టాలను భరించటం. అల్లాహ్ (సు.తా.) ఆజ్ఞాపాలన కొరకు తమ సుఖసంతోషాలను మరియు అపేక్షలను త్యాగం చేయటం. అల్లాహ్ (సు.తా.) అవిధేయత నుండి దూరంగా ఉండటం.

[10] చూడండి, 18:31.

[11] చూడండి, 4:57.

చేయబడి ఉంటాయి. అవి నియమబద్ధాం నింపబడి ఉంటాయి.

**17.** మరియు వారికి సొంటి కలిపిన మధుపాత్రలు త్రాగటానికి ఇవ్వబడతాయి[12].

**18.** అది స్వర్గంలోని సల్ సబీల్ అనే పేరు గల ఒక ఊట!

**19.** మరియు వారి మధ్య శాశ్వతంగా, యవ్వనులుగా ఉంటే బాలురు తిరుగుతూ ఉంటారు. మరియు నీవు వారిని చూస్తే, వారిని వెదజల్లిన ముత్యాలుగా భావిస్తావు[13].

**20.** మరియు నీవు అక్కడ (స్వర్గంలో) చూస్తే, ఎక్కడ చూసినా ఆనందమే పొందుతావు. మరియు ఒక మహత్తర సామ్రాజ్య వైభవం కనిపిస్తుంది.

**21.** వారి ఒంటి మీద సన్నని ఆకుపచ్చని శ్రేష్ఠమైన పట్టు వస్త్రాలు మరియు బంగారు జలతారు అల్లిన దుస్తులుంటాయి. మరియు వారికి వెండి కంకణాలు తొడిగించ బడతాయి. మరియు వారి ప్రభువు వారికి నిర్మలమైన పానీయాన్ని త్రాగటానికి ప్రసాదిస్తాడు.

**22.** (వారితో ఇలా అనబడుతుంది): "నిశ్చయంగా, ఇది మీకు ఇవ్వబడే ప్రతిఫలం. ఎందుకంటే, మీ శ్రమ అంగీకరించబడింది."

---

[12] చూడండి, 43:71.

[13] వారు ఎల్లప్పుడూ బాలురుగానే ఉంటారు. వారు వృద్ధులు కారు. వారికి మరణం రాదు. ఇంకా చూడండి, 56:17-18 మరియు 52:24.

**23.** నిశ్చయంగా, మేమే, ఈ ఖుర్ఆన్ ను, నీ పై (ఓ ముహమ్మద్!) క్రమక్రమంగా అవతరింపజేశాము.

**24.** కావున నీవు నీ ప్రభువు యొక్క ఆజ్ఞపై స్థిరంగా ఉండు మరియు వీరిలోని ఏ పాపి యొక్క లేదా సత్యతిరస్కారుని యొక్క మాట గాని వినకు[14].

**25.** మరియు నీ ప్రభువు నామాన్ని ఉదయం మరియు సాయంత్రం స్మరిస్తూ ఉండు[15].

**26.** మరియు రాత్రివేళ ఆయన సన్నిధిలో సాష్టాంగం (సజ్దా) చేస్తూ ఉండు[16] మరియు రాత్రివేళ సుదీర్ఘ కాలం, ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉండు.

**27.** నిశ్చయంగా, వీరు అనిశ్చితమైన ఈ ప్రాపంచిక జీవితం పట్ల మోహితులై వున్నారు. మరియు ముమ్ముందు రానున్న భారమైన దినాని విస్మరిస్తున్నారు[17].

**28.** మేమే వీరిని సృష్టించినవారము మరియు వీరి శరీరాన్ని దృఢ పరిచిన వారము. మరియు మేము కోరినప్పుడు వీరికి బదులుగా వీరి వంటి

---

[14] మక్కా సత్యతిరస్కారులు దైవప్రవక్త ('స'అస)ను: అతని ధర్మప్రచారాన్ని అపమనే వారు. మరియు తమ దేవతలను ఆరాధించమనేవారు. దానికి బదులుగా వారు అతనికి కోరినంత ధనం, అధికారం ఇస్తాం అనేవారు. మరియు అతనికి ఇష్టమైన స్త్రీతో వివాహం చేయిస్తాం అనేవారు. (ఫ'త్హ్ అల్-ఖదీర్).

[15] అంటే అన్ని వేళలలో ఉదయం ఫజ్ర్, సాయంత్రం "జుహ్ర్ మరియు 'అస్ర్ నమా'జులు.

[16] రాత్రివేళలలో మ'గ్ రిబ్, 'ఇషా నమా'జ్ లు మరియు తహజ్జుద్ నమా'జ్ లు.

[17] భారమైన దినం అంటే పునరుత్థాన దినం

వారిని తేగలము.

29. నిశ్చయంగా, ఇదొక హితోపదేశం కావున ఇష్టపడినవాడు తన ప్రభువు వైపునకు పోయే మార్గాన్ని అవలంబించవచ్చు!

30. మరియు అల్లాహ్ కోరక పోతే, మీరు కోరేదీ (జరగదు)! నిశ్చయంగా, అల్లాహ్ సర్వజ్ఞుడు, మహావివేకవంతుడు.

31. ఆయన తాను కోరినవారిని తన కారుణ్యంలోకి తీసుకుంటాడు. మరియు దుర్మార్గుల కొరకు ఆయన బాధాకరమైన శిక్షను సిద్ధపరచి ఉంచాడు.

# 77. అల్-ముర్సలాత్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఒకదాని తరువాత ఒకటి, వరుసగా పంపబడే వాయువుల సాక్షిగా[1]!
2. మరియు తీవ్రమైన వేగతో వీచే వాయువుల సాక్షిగా[2]!
3. మరియు మేఘాలను దూరదూరంగా వ్యాపింపజేసే వాయువుల సాక్షిగా[3]!
4. మరియు మంచి చెడులను విశదపరచే (దైవదూతల) సాక్షిగా[4]!
5. సందేశాలను ప్రవక్తల వద్దకు తెచ్చే (దైవదూత) సాక్షిగా![5]

---

[*] [అల్-ముర్సలాత్ అంటే పంపబడిన]

[1] లేక దేవదూతల, లేక సందేశహరుల సాక్షిగా అని కొందరు వ్యాఖ్యాతల అభిప్రాయం. 'ఉర్ ఫన్ - అంటే దివ్యజ్ఞానం (వ'హీ) లేక షరీయత్ ఆజ్ఞలని కొందరు వ్యాఖ్యాతల అభిప్రాయం.

[2] లేక దేవదూతల సాక్షిగా! ఎవరైతే తీవ్రంగా వీచే గాలులతో సహా పంపబడతారో!

[3] లేక దేవదూతల సాక్షిగా!' ఇబ్నె-కసీ'ర్, 'తబరీ మరియు ఇతర చాలా మంది వ్యాఖ్యాతలు కూడా (ర హ్మ). ఈ మూడు ఆయతులలో గాలుల ప్రస్తావన ఉందనే అభిప్రాయపడ్డారు.

[4] లేక ఖుర్ఆన్ ఆయతుల లేక ప్రవక్తల సాక్షిగా.

[5] లేక అల్లాహ్ (సు.తా.) యొక్క వహీని ప్రజలకు అందజేసే ప్రవక్త ('అలైహిమ్‌స.)లసాక్షిగా!ఇమామ్‌షౌకానిఅభిప్రాయంలో-ముర్సలాత్, 'ఆసిఫాత్‌మరియునాషిరాత్-గాలులనుసంబోధిస్తున్నాయిమరియు ఫారిఖాత్, ముల్ ఖియాత్ - దేవదూతలను. ఈ వ్యాఖ్యానంతో కూడా చాలా మంది వ్యాఖ్యాతలు ఏకీభవిస్తున్నారు.

6. సాకుగా లేక హెచ్చరికగా![6]
7. నిశ్చయంగా, మీకు వాగ్దానం చేయబడినది, జరగవలసి ఉంది.
8. అప్పుడు ఎప్పుడైతే నక్షత్రాలు కాంతి హీనమై పోతాయో!
9. మరియు ఆకాశం చీలిపోతుందో!
10. మరియు పర్వతాలు పొడిగా మారి, చెల్లాచెదురుగా చేయబడతాయో!
11. మరియు ప్రవక్తలు తమ నిర్ణీత సమయంలో సమావేశపరచబడతారో![7]
12. ఏ దినానికి గాను, (ఇవన్నీ) వాయిదా వేయబడ్డాయి?
13. ఆ తీర్పుదినం కొరకా![8]
14. మరియు ఆ తీర్పుదినం అంటే ఏమిటో నీకెలా అర్థం కాగలదు?
15. ఆ రోజు (పునరుత్థాన దినాన్ని) తిరస్కరించే వారికి వినాశముంది!
16. ఏమీ? మేము పూర్వీకులను నాశనం చేయలేదా?
17. తరువాత రాబోయే వారిని కూడా, మేము వారి వెనక పంపుతాము.
18. ఈ విధంగా మేము నేరస్థుల పట్ల వ్యవహరిస్తాము.

---

[6] దీని మరొక తాత్పర్యం:"(మానవులకు) తెలియజేసే ఉద్దేశంతోగానీ లేక హెచ్చరిక చేయటానికి గానీ"

[7] చూడండి, 4:41-42, 5:109, 7:6 లేక 39:69.

[8] యౌముల్ ఫస్ల్: పునరుత్థాన దినం. ఖుర్ఆన్ అవతరరణాక్రమంలో ఇక్కడ మొదటిసారి పేర్కొనబడింది. ఇంకా చూడండి, 37:21, 44:40, 78:17 మరియు 77:38.

19. ఆ రోజు (పునరుత్థానాన్ని) తిరస్కరించే వారికి వినాశముంది!
20. ఏమీ? మేము మిమ్మల్ని తుచ్ఛమైన నీటితో (వీర్యబిందువుతో) సృష్టించలేదా?
21. తరువాత మేము దానిని ఒక భద్రమైన స్థానంలో ఉంచాము.
22. ఒక నిర్ణీత కాలం వరకు.
23. ఈ విధంగా మేము నిర్ణయించాము, ఎందుకంటే మేమే ఉత్తమమైన నిర్ణయాలు తీసుకునే వారము[9].
24. ఆ రోజు (పునరుత్థానాన్ని) తిరస్కరించే వారికి వినాశముంది!
25. ఏమీ? మేము భూమిని ఒక సమీకరించే స్థానంగా చేయలేదా?
26. జీవులకూ మరియు మృతులకూను?
27. మరియు దానిలో ఎత్తైన పర్వతాలను స్థిరంగా నిలుపలేదా? మరియు మీకు త్రాగటానికి మంచి నీటిని ప్రసాదించలేదా?
28. ఆ రోజు (పునరుత్థానాన్ని) తిరస్కరించే వారికి వినాశముంది!
29. (సత్యతిరస్కారులతో ఇలా అనబడుతుంది): "మీరు తిరస్కరిస్తూ వచ్చిన దాని వైపునకు పొండి!"
30. (దాని పొగ) మూడు శాఖలుగా చీలిపోయే నీడ

---

[9] చూడండి, 23:12-14.

వైపునకు పొండి;

31. కాని అది ఏ విధమైన (చల్ల) నీడనూ ఇవ్వదూ మరియు (నరక) జ్వాలల నుండి కూడా కాపాడదు!

32. వాస్తవానికి అది పెద్ద పెద్ద మొద్దు వంటి అగ్నికణాలను విసురుతుంది.

33. వాస్తవానికి ఆ అగ్నికణాలు పసుపు పచ్చని ఒంటెల వలే కనిపిస్తాయి.

34. ఆ రోజు (పునరుత్థానాన్ని) తిరస్కరించే వారికి వినాశముంది!

35. ఆ దినాన వారు మాట్లాడలేరు.

36. మరియు వారికి సాకులు చెప్పుకునే అవకాశం కూడా ఇవ్వబడదు.

37. ఆ రోజు (పునరుత్థానాన్ని) తిరస్కరించే వారికి వినాశముంది!

38. అది తీర్పుదినమై ఉంటుంది! మేము మిమ్మల్ని మరియు మీ పూర్వీకులను సమావేశ పరచి ఉంటాము!

39. కావున మీ వద్ద ఏదైనా పన్నాగముంటే దానిని పన్నండి[10].

40. ఆ రోజు (పునరుత్థానాన్ని) తిరస్కరించే వారికి వినాశముంది!

41. నిశ్చయంగా భయభక్తులు గలవారు (ఆ రోజు చల్లని) నీడలలో చెలమల దగ్గర ఉంటారు.

---

[10] ఇటువంటి సందేశం గల ఆయత్ కోసం చూడండి, 55:33.

42. మరియు వారికి వారు కోరే ఫలాలు లభిస్తాయి.
43. (వారితో ఇలా అనబడుతుంది): "మీరు చేస్తూ ఉండిన కర్మలను ఫలితంగా హాయిగా తినండి, త్రాగండి!"
44. నిశ్చయంగా, మేము సజ్జనులకు ఇలాంటి ప్రతిఫలమే ఇస్తాము.
45. ఆ రోజు (పునరుత్థానాన్ని) తిరస్కరించే వారికి వినాశముంది!
46. (ఓ సత్యతిరస్కారులారా!) మీరు కొంతకాలం తినండి, సుఖాలు అనుభవించండి. నిశ్చయంగా, మీరు నేరస్థులు!
47. ఆ రోజు (పునరుత్థానాన్ని) తిరస్కరించే వారికి వినాశముంది!
48. మరియు వారితో: "(అల్లాహ్ ముందు) వంగండి (రుకూఉ చేయండి)." అని అన్నప్పుడు, వారు వంగలేదు.
49. ఆ రోజు (పునరుత్థానాన్ని) తిరస్కరించే వారికి వినాశముంది![11]
50. దీని (ఈ ఖుర్ఆన్) తరువాత ఇక వారు మరెలాంటి సందేశాన్ని విశ్వసిస్తారు?

---

[11] ఈ ఆయత్ ఈ సూరహ్ లో పదిసార్లు వచ్చింది. ఏ విధంగానైతే: “అయితే మీరిరువురు (మానవులు మరియు జిన్నాతులు) మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?” అనే ఆయతు సూరహ్ అర్-ర'హ్మాన్ (55)లో 31 సార్లు వచ్చిందో! అంటే, పునరుత్థాన దినాన్ని తిరస్కరించే వారికి వినాశం తప్పదనే విషయాన్ని అల్లాహుతా'లా మాటిమాటికి విశదీకరిస్తున్నాడు.

# 78. అస్-నబఅ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఏ విషయాన్ని గురించి వారు (ఒకరినొకరు) ప్రశ్నించుకుంటున్నారు?[1]
2. ఆ మహావార్తను గురించేనా?
3. దేనిని గురించైతే వారు భేదాభిప్రాయాలను కలిగి ఉన్నారో?
4. అది కాదు! వారు త్వరలోనే దానిని తెలుసుకోగలరు.
5. ఎంత మాత్రము కాదు! వారు త్వరలోనే దానిని తెలుసుకోగలరు.
6. ఏమీ? మేము భూమిని పరుపుగా చేయలేదా?
7. మరియు పర్వతాలను మేకులుగా?[2]
8. మరియు మేము మిమ్మల్ని (స్త్రీ-పురుషుల)

---

[*] [అన్-నబఅ అంటే గొప్ప వార్త]

[1] దైవప్రవక్త ('స'అస) పై అవతరింపజేయబడిన ఖుర్ఆన్ ను మరియు అతనిని ప్రవక్తగా అల్లాహ్ (సు.తా.) ఎన్నుకున్న విషయాన్ని నమ్మలేక సత్యతిరస్కారులు ఒకరితో నొకరు ఈ విధంగా ప్రశ్నించుకున్నారు: "ఏమీ? పునరుత్థానం నిజమేనా? ఇతడు వాస్తవంగానే ప్రవక్తనా?" మొదలైనవి. దానిని అల్లాహ్ (సు.తా.) స్వయంగా జవాబిచ్చాడు.

[2] చూడండి, 16:15.

జంటలుగా సృష్టించాము[3].

9. మరియు మేము నిద్రను, మీకు విశ్రాంతి నిచ్చేదిగా చేశాము.

10. మరియు రాత్రిని ఆచ్ఛాదనగా చేశాము.

11. మరియు పగటిని జీవనోపాధి సమయంగా చేశాము.

12. మరియు మేము మీపైన పటిష్టమైన ఏడు (ఆకాశాలను) నిర్మించాము.

13. మరియు (అందులో) ప్రకాశించే దీపాన్ని (సూర్యుణ్ణి) ఉంచాము.

14. మరియు మేఘాల నుండి ధారాపాతంగా వర్షాన్ని కురిపించాము[4].

15. దానితో మేము ధాన్యం మరియు పచ్చికను (చెట్లు చేమలను) పెరిగించటానికి!

16. మరియు దట్టమైన తోటలను.

17. నిశ్చయంగా, తీర్పుదినం ఒక నిర్ణీత సమయం[5].

18. ఆ రోజు బాకా ఊదబడినప్పుడు! అప్పుడు మీరంతా గుంపులు గుంపులుగా లేచి వస్తారు.

19. మరియు ఆకాశం తెరువబడుతుంది, అందులో ద్వారాలు ఏర్పడుతాయి;

---

[3] మానవులలో, జంతువులలో మరియు ఇతర ప్రాణంలేని వస్తువులలో కూడా జంటలున్నాయి. ఉదా: రాత్రింబవళ్ళు, సూర్యచంద్రులు, ఆకాశం-భూమి, నలుపు-తెలుపు మొదలైనవి. ఇంకా చూడండి, 36:36.

[4] ము'అ'సిరాత్: నీటితో నిండి ఉండి ఇంకా కురవని మేఘాలు.

[5] చూడండి, 77:13.

**20.** మరియు పర్వతాలు ఎండమావులుగా అదృశ్యమై పోతాయి[6].

**21.** నిశ్చయంగా, నరకం ఒక మాటు;

**22.** ధిక్కారుల గమ్యస్థానం;

**23.** అందులో వారు యుగాల తరబడి ఉంటారు[7].

**24.** అందులో వారు ఎలాంటి చల్లదనాన్ని గానీ మరియు (చల్లని) పానీయాన్ని గానీ చవి చూడరు

**25.** సలసల కాగే నీరు మరియు చీము లాంటి మురికి (పానీయం)[8]

**26.** (వారి కర్మలకు) తగిన పూర్తి ప్రతిఫలంగా!

**27.** వాస్తవానికి వారు లెక్క తీసుకోబడుతుందని ఆశించలేదు.

**28.** పైగా వారు మా సూచనలను (ఆయాత్ లను) అసత్యాలని తిరస్కరించారు.

**29.** మరియు మేము (వారు చేసిన) ప్రతిదానిని ఒక పుస్తకంలో వ్రాసి పెట్టాము[9].

**30.** కావున మీరు (మీ కర్మల ఫలితాన్ని) చవి చూడండి. ఎందుకంటే, మేము మీకు శిక్ష తప్ప మరేమీ అధికం చేయము[10].

**31.** నిశ్చయంగా, దైవభీతి గలవారికి సాఫల్యం

---

[6] చూడండి, 69:14, 14:48, 101:5, 70:9, 56:6, 20:105, మొదలైనవి.

[7] చూడండి 6:128 మరియు 11:107.

[8] చూడండి, 38:57-58.

[9] చూడండి, 36:12.

[10] చూడండి, 4:56, 17:97.

(స్వర్గం) ఉంది;

32. ఉద్యానవనాలూ, ద్రాక్ష తోటలూ!

33. మరియు ఈడూజోడూ గల (యవ్వన) సుందర కన్యలు;

34. మరియు నిండి పొర్లే (మధు) పాత్ర

35. అందులో (స్వర్గంలో) వారు ఎలాంటి వ్యర్థపు మాటలు గానీ, అసత్యాలు గానీ వినరు.

36. (ఇదంతా) నీ ప్రభువు తరఫు నుండి లభించే ప్రతిఫలం, చాలినంత బహుమానం.

37. భూమ్యాకాశాలు మరియు వాటి మధ్య ఉన్న సమస్తానికీ ప్రభువైన అనంత కరుణామయుని (బహుమానం), ఆయన ముందు మాట్లాడే సాహసం ఎవ్వరికీ లేదు.

38. ఏ రోజునయితే ఆత్మ (జిబ్రీల్)[11] మరియు దేవదూతలు వరుసలలో నిలిచి ఉంటారో! అప్పుడు ఆ అనంత కరుణామయుడు అనుమతించిన వాడు తప్ప, మరెవ్వరూ మాట్లాడలేరు; ఒకవేళ ఎవడైనా మాట్లాడినా అతడు సరైన మాటే మాట్లాడుతాడు[12].

39. అదే అంతిమ సత్యదినం. కావున ఇష్టమున్న వాడు, తన ప్రభువు వైపునకు చేరే మార్గాన్ని అవలంబించాలి![13]

---

[11] చూడండి 16:2 మరియు 97:4

[12] అల్లాహ్ (సు.తా.) దైవదూతలకు మరియు దైవప్రవక్తలకు ('అలైహిమ్ స.) మాట్లాడే అనుమతినిస్తాడు. వారు కేవలం సత్యమే పలుకుతారు. చూడండి, 10:3.

[13] చూడండి, 69:1.

**40.** నిశ్చయంగా, మేము అతని సమీపంలో ఉన్న శిక్షను గురించి మిమ్మల్ని హెచ్చరించాము. ఆ రోజు ప్రతి మనిషి తన చేజేతులా చేసుకొని ముందు పంపుకున్నదంతా ప్రత్యక్షంగా చూసు కుంటాడు[14]. మరియు సత్యతిరస్కారి: "అయ్యో! నా పాడుగాను! నేను మట్టినయి ఉంటే ఎంత బాగుండేది[15]!" అని వాపోతాడు.

---

[14] చూడండి 18:49 చూడండి 75:13
[15] చూడండి, 69:27.

# 79. అస్-నాజిఆత్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. (అవిశ్వాసుల ప్రాణాలను) కఠినంగా లాగి తీసే వారి (దేవదూతల) సాక్షిగా![1]
2. (విశ్వాసుల ప్రాణాలను) నెమ్మదిగా తీసేవారి (దేవదూతల) సాక్షిగా![2]
3. (విశ్వంలో) తేలియాడుతూ పోయే వారి సాక్షిగా![3]
4. మరియు పందెంలో వలే (ఒకరితో నొకరు) పోటీ పడే వారి సాక్షిగా!
5. మరియు (తమ ప్రభువు) ఆజ్ఞానుసారం వ్యవహారాలు నిర్వహించేవారి (దేవదూతల) సాక్షిగా!
6. ఆ రోజు (మొదటి) బాకా ధ్వని భూగోళాన్ని తీవ్రంగా కంపింపజేస్తుంది[4].
7. దాని తరువాత రెండవసారి[5] బాకా ఊదబడుతుంది

---

[*] [అన్-నాజిఆత్ అంటే ప్రాణం వెలికి తీసేవారు]

[1] నా'జి'ఆత్: బలవంతంగా, కఠినంగా లాగి తీయటం. 'గర్ ఖన్: ఈ సూరహ్ లోని 1-5 ఆయతుల తాత్పర్యంలో వ్యాఖ్యాతల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి.

[2] నష్'తన్: ముడివిప్పటం - అంటే నెమ్మదిగా తీయటం.

[3] సబ్'హన్: ఈదుట, తేలుతూ పోవుట.

[4] ఇది మొదటి బాకా ధ్వని. దీనినే నఫ్ ఖయే ఫనా అంటారు. అప్పుడు ప్రతిదీ నశిస్తుంది.

[5] ఈ రెండవ బాకా ధ్వనితో అందరూ బ్రతికి తమ గోరీల నుండి బయటికి లేచి వస్తారు.

(అప్పుడు అందరూ పునరుత్థరింప బడతారు)

8. ఆ రోజు (కొన్ని) హృదయాలు (భయంతో) దడదడలాడుతూ ఉంటాయి.

9. వారి చూపులు క్రిందికి వాలి ఉంటాయి.

10. వారు ఇలా అంటున్నారు: "ఏమీ? మనం మన పూర్వస్థితిలోకి మళ్ళీ తీసుకు రాబడతామా?

11. మనం శిథిలమైన ఎముకలుగా మారి పోయిన తరువాత కూడానా?"

12. వారు (ఇంకా ఇలా) అంటారు: "అయితే ఈ తిరిగి రావటమనేది చాల నష్టదాయకమైనదే!"

13. కాని అది వాస్తవానికి, ఒకే ఒక (తీవ్రమైన) ధ్వని.

14. అప్పుడు వారందరూ, ఒకేసారి లేచి మైదానంలోకి వచ్చి ఉంటారు.

15. ఏమీ? నీకు మూసా వృత్తాంతం అందిందా[6]?

16. అతని ప్రభువు పవిత్ర తువా లోయలో అతనిని పిలిచినప్పుడు[7],

17. (ఇలా అన్నాడు): "ఫిర్ఔన్ వద్దకు వెళ్ళు, నిశ్చయంగా, అతడు ధిక్కారుడయ్యాడు.

18. "ఇక (అతనితో) ఇట్లను: 'ఏమీ? నీవు పాపరహితుడవు అవటానికి ఇష్టపడతావా?

19. మరియు నేను నీకు నీ ప్రభువు వైపునకు మార్గదర్శకత్వం చేస్తాను, మరి నీవు ఆయన పట్ల భీతి కలిగి ఉంటావా?'"

---

[6] మూసా వృత్తాంతానికి చూడండి, 20:9-98.

[7] అల్లాహ్ (సు.తా.) మూసా ('అ.స.)తో మాట్లాడాడు. అతనిని సందేశహరునిగా ఎన్నుకున్నాడు.

20. తరువాత అతను (మూసా) అతడికి (ఫిర్ఔన్ కు) గొప్ప అద్భుత నిదర్శనాన్ని చూపాడు.
21. కాని అతడు (ఫిర్ఔన్) దానిని అబద్ధమని తిరస్కరించాడు మరియు (అతని మాటను) ఉల్లంఘించాడు.
22. ఆ తర్వాత అతడు (ఫిర్ఔన్) వెనక్కి మరలి పోయి, (కుట్రలు) పన్నసాగాడు.
23. పిదప (ప్రజలను) సమావేశపరచి, ఎలుగెత్తి చాటుతూ;
24. ఇలా అన్నాడు: "నేనే మీ యొక్క మహోన్నత ప్రభువును!"[8]
25. కావున అల్లాహ్ అతనిని ఇహపరలోకాల శిక్షకు గురి చేశాడు[9].
26. నిశ్చయంగా, ఇందులో (అల్లాహ్ కు) భయపడే ప్రతి వ్యక్తి కొరకు గుణపాఠముంది.
27. ఏమీ? మిమ్మల్ని సృష్టించడం కఠినమయిన పనా? లేక ఆకాశాన్నా? ఆయనే కదా దానిని నిర్మించింది![10]
28. ఆయన దాని కప్పు (ఎత్తు)ను చాలా పైకి లేపాడు. తరువాత దానిని క్రమపరిచాడు;
29. మరియు ఆయన దాని రాత్రిని చీకటిగా చేశాడు.

---

[8] చూడండి, 28:38 ఫిర్'ఔన్ తనను తాను దేవుడని చెప్పుకున్నాడు మరియు హద్దులు మీరి ప్రవర్తించాడు మరియు సత్యాన్ని ధిక్కరించాడు.
[9] చూడండి, 7:137 అతని ఇహలోక శిక్షకు.
[10] చూడండి, 2:29 మరియు 40:57.

మరియు దాని పగటిని (వెలుగును) బహిర్గతం చేశాడు.

30. మరియు ఆ పిదప భూమిని పరచినట్లు చేశాడు[11].

31. దాని నుండి దాని నీళ్ళను మరియు దాని పచ్చికను బయటికి తీశాడు;

32. మరియు పర్వతాలను (దానిలో) స్థిరంగా నాటాడు;

33. మీకు మరియు మీ పశువులకు జీవన సామగ్రిగా[12]!

34. ఇక ఆ గొప్ప దుర్ఘటన (పునరుత్థాన దినం) వచ్చినప్పుడు;

35. ఆ రోజు మానవుడు తాను చేసిందంతా జ్ఞాపకం చేసుకుంటాడు;

36. మరియు చూసే వారి యెదుటకు, నరకాగ్ని స్పష్టంగా కనబడేటట్లు తేబడుతుంది[13].

37. ఇక ధిక్కారంతో హద్దులు మీరి ప్రవర్తించిన వాడికి;

38. మరియు ఐహిక జీవితానికి ప్రాధాన్యత నిచ్చిన వాడికి;

39. నిశ్చయంగా, నరకాగ్నియే, వాని నివాస స్థానమవుతుంది!

---

[11] ద'హాహున్: అంటే నిప్పుకోడి గ్రుడ్డు ఆకారం అని కొందరు వ్యాఖ్యానించారు. ఈ రోజు సైంటిష్టులు భూమి ఆకారం నిప్పుకోడి గ్రుడ్డు ఆకారంలో ఉందని నిరూపించారు.

[12] చూడండి, 80:24-32.

[13] చూడండి, 26:91.

**40.** మరియు తన ప్రభువు ముందు నిలబడ వలసి వుంటుందన్న భయంతో తన మనస్సును దుష్టవాంఛలకు దూరంగా ఉంచిన వ్యక్తికి;

**41.** నిశ్చయంగా, స్వర్గమే, అతని నివాస స్థానమవుతుంది!

**42.** (ఓ ముహమ్మద్!) వీరు నిన్ను - ఆ ఘడియను గురించి: "అసలు అది ఎప్పుడొస్తుంది?" అని అడుగుతున్నారు.

**43.** దాని గురించి చెప్పడానికి దాంతో నీకేమి సంబంధం?

**44.** దాని వాస్తవ జ్ఞానం నీ ప్రభువుకే ఉంది!

**45.** (ఓ ముహమ్మద్!) నిశ్చయంగా, నీవు దానికి భయపడేవారిని హెచ్చరించేవాడవు మాత్రమే!

**46.** వారు దానిని చూసిన రోజు (తాము ప్రపంచంలో) కేవలం ఒక సాయంత్రమో లేక ఒక ఉదయమో గడిపినట్లు భావిస్తారు[14].

---

[14] మానవుడు చేసే భూమికి చెందిన కాలపరిమాణం పరలోకంలో ఉండదు. ఇంకా చూడండి, 2:259, 17:52, 18:19, 20:103-104, 23:112-113, 30:55. 'అషియ్యతున్: అంటే "జుహ్రా నుండి సూర్యాస్తమయం వరకు మరియు 'దుహా: అంటే సూర్యోదయం నుండి మధ్యాహ్నం వరకు.

# 80. అబస [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. అతను (ప్రవక్త) భృకుటి ముడి వేసుకున్నాడు మరియు ముఖం త్రిప్పుకున్నాడు;
2. ఆ గ్రుడ్డివాడు తన వద్దకు వచ్చాడని!
3. కాని నీకేం తెలుసు? బహుశా అతడు తనను తాను సంస్కరించుకోవచ్చు!
4. 4.లేదా అతడు హితబోధ పొందవచ్చు మరియు ఆ హితబోధ అతనికి ప్రయోజనకరం కావచ్చు!
5. కాని అతడు, ఎవడైతే తనను తాను స్వయం సమృద్ధుడు, అనుకుంటున్నాడో!
6. అతని పట్ల నీవు ఆసక్తి చూపుతున్నావు[1].
7. ఒకవేళ అతడు సంస్కరించుకోక పోతే నీపై బాధ్యత ఏముంది?[2]
8. కాని, ఎవడైతే తనంతట తాను, నీ వద్దకు పరుగెత్తుకుంటూ వచ్చాడో!
9. మరియు (అల్లాహ్ యెడల) భీతిపరుడై ఉన్నాడో!

---

[*] [అబస – నుదురు చిట్లించినవాడు]

[1] ఇక్కడ సూచించబడుతున్నది ఏమిటంటే విధేయులను ఉపేక్షించి, విముఖులయ్యే వారికి బోధన చేయటానికి, ఆసక్తి చూపనవసరం లేదు!

[2] నీ బాధ్యత కేవలం సందేశాన్ని అందజేయటం మాత్రమే. నీవు వారి వెంటపడి బ్రతిమాలనవసరం లేదు.

10. అతనిని నీవు నిర్లక్ష్యం చేస్తున్నావు.
11. అలా కాదు! నిశ్చయంగా, ఇది (ఈ ఖుర్ఆన్) ఒక హితోపదేశం[3].
12. కావున ఇష్టమున్నవారు దీనిని స్వీకరించవచ్చు!
13. ఇది ప్రతిష్ఠాకరమైన పుటలలో (వ్రాయబడి ఉన్నది);
14. మహోన్నతమైనది, పవిత్రమైనది;
15. లేఖకుల (దేవదూతల) చేతులలో;
16. వారు గౌరవనీయులైన సత్పురుషులు (ఆజ్ఞానువర్తనులు).
17. మానవుడు నాశనం గాను! అతడు ఎంత కృతఘ్నుడు![4]
18. ఆయన (అల్లాహ్) దేనితో అతనిని సృష్టించాడు?
19. అతనిని వీర్యబిందువుతో సృష్టించాడు తరువాత అతనిని తగిన విధంగా తీర్చిదిద్దాడు.
20. ఆ తరువాత, అతని మార్గాన్ని అతనికి సులభతరం చేశాడు[5];
21. ఆపైన అతనిని మరణింపజేసి గోరీ లోకి చేర్చాడు;
22. మళ్ళీ ఆయన (అల్లాహ్) కోరినప్పుడు అతనిని తిరిగి బ్రతికించి లేపాడు.
23. అలా కాదు, ఆయన (అల్లాహ్) ఆదేశించిన దానిని

---

[3] చూడండి, 7:172.
[4] ఎట్టి ప్రమాణం లేకుండానే పునరుత్థానాన్ని తిరస్కరించే మానవుడికి ఈ శాపం!
[5] అంటే అతనికి మంచి-చెడుల మార్గాలు స్పష్టంగా తెలుపబడ్డాయి.

(మానవుడు) నెరవేర్చలేదు.

24. ఇక, మానవుడు తన ఆహారాన్ని గమనించాలి!

25. నిశ్చయంగా మేము నీటిని (వర్షాన్ని) ఎంత పుష్కలంగా కురిపించాము.

26. ఆ తరువాత భూమిని (మొలిచే మొక్కలతో) చీల్చాము, ఒక అద్భుతమైన చీల్పుతో!

27. తరువాత దానిలో ధాన్యాన్ని పెంచాము;

28. మరియు ద్రాక్షలను మరియు కూరగాయలను;

29. మరియు ఆలివ్ (జైతూన్) మరియు ఖర్జూరపు చెట్లను;

30. మరియు దట్టమైన తోటలను;

31. మరియు (రకరకాల) పండ్లను మరియు పచ్చికలను;

32. మీకు మరియు మీ పశువులకు జీవన సామగ్రిగా!

33. ఎప్పుడైతే, చెవులను చెవిటిగా చేసే ఆ గొప్ప ధ్వని వస్తుందో!

34. ఆ రోజు, మానవుడు తన సోదరుని నుండి దూరంగా పారిపోతాడు;

35. మరియు తన తల్లి నుండి మరియు తండ్రి నుండి;

36. మరియు తన భార్య (సాహిబతి) నుండి మరియు తన సంతానం నుండి;

37. ఆ రోజు వారిలో ప్రతి మానవునికి తనను గురించి

మాత్రమే చాలినంత చింత ఉంటుంది[6].

**38.** ఆ రోజు కొన్ని ముఖాలు ఆనందంతో ప్రకాశిస్తూ ఉంటాయి;

**39.** అవి చిరునవ్వులతో ఆనందోత్సాహాలతో కళకళలాడుతుంటాయి.

**40.** మరికొన్ని ముఖాలు ఆ రోజు, దుమ్ము కొట్టుకొని (ఎంతో వ్యాకులంతో) నిండి ఉంటాయి.

**41.** అవి నల్లగా మాడిపోయి ఉంటాయి;

**42.** అలాంటి వారు, వారే! సత్యతిరస్కారులైన దుష్టులు.

---

[6] అంటే ప్రతి మానవుడు తన వారిని నిర్లక్ష్యం చేస్తాడు. దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: "పునరుత్థాన దినమున మానవులందరూ నగ్న శరీరులై ఉంటారు మరియు వారి కాళ్ళలో మేజోళ్ళు ఉండవు మరియు వారు ఖత్నా చేయబడకుండా ఉంటారు." అప్పుడు 'ఆయి'షహ్ (ర.'అన్హా): "ఏమీ ఈ విధంగా మర్మాంగాల మీద దృష్టి పడదా?" అని అడుగుతారు. దైవప్రవక్త ('స'అస) దానికి సమాధానంగా ఈ ఆయత్ చదువుతారు. (తిర్మిజీ', నసాయీ').

# 81. అత్-తక్వీర్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. సూర్యుడు (అంధకారంలో) చుట్టి వేయబడి కాంతిహీనుడైనప్పుడు![1]
2. మరియు నక్షత్రాలు (కాంతిని కోల్పోయి) రాలిపోవునప్పుడు!
3. మరియు పర్వతాలు కదిలించబడినప్పుడు![2]
4. మరియు నిండు సూడి ఒంటెలు, నిరపేక్షంగా వదిలివేయబడినప్పుడు!
5. మరియు క్రూరమృగాలన్నీ ఒకచేట సమకూర్చబడినప్పుడు![3]
6. మరియు సముద్రాలు ఉప్పొంగిపోయి నప్పుడు![4]
7. మరియు ఆత్మలు (శరీరాలతో) తిరిగి కలుపబడి నప్పుడు![5]

---

[*] [అత్-తక్వీర్ అంటే చుట్టబడినది]

[1] పునరుత్థానదినమున సూర్యచంద్రులు చుట్టివేయబడతారు. ('స'హీ'హ్ బు'ఖారీ).

[2] పర్వతాలు భూమి నుండి ఊడ బెరికి ఏకిన దూది వలే గాలిలో ఎగురవేయబడతాయి. చూడండి, 20:105-107 మరియు 14:48.

[3] చూడండి, 6:38.

[4] ఈ ఆయత్ కు ఈ విధంగా కూడా తాత్పర్యమివ్వబడింది: "లేక సముద్రాలలో అగ్ని జ్వాలలు చెలరేగినప్పుడు"

[5] దీనిని ఎన్నో విధాలుగా వ్యాఖ్యానించారు: "ఒకే ధర్మం వారు ఒక చోట జమ చేయబడతారు. యూదులందరు ఒకచోట, క్రైస్తవులందరు ఒకచోట మరియు ముస్లింలందరు ఒకచోట."

8. మరియు సజీవంగా పాతి పెట్టబడిన బాలిక ప్రశ్నించబడినప్పుడు:
9. ఏ అపరాధానికి తాను హత్య చేయబడిందని?
10. మరియు కర్మపత్రాలు తెరువబడినప్పుడు![6]
11. మరియు ఆకాశం ఒలిచి వేయబడినప్పుడు!
12. మరియు నరకాగ్ని మండించబడినప్పుడు!
13. మరియు స్వర్గం దగ్గరకు తీసుకురాబడినప్పుడు!
14. ప్రతి ఆత్మ తాను చేసి తెచ్చిన కర్మలను తెలుసుకుంటుంది.
15. అలా కాదు! నేను తొలగిపోయే నక్షత్రాల సాక్షిగా చెబుతున్నాను;
16. (ఏవైతే) వేగంగా తిరుగుతూ కనుమరుగవుతున్నాయో![7]
17. మరియు గడచి పోయే రాత్రి సాక్షిగా!
18. మరియు ప్రకాశించే ఉదయం సాక్షిగా!
19. నిశ్చయంగా, ఇది (ఈ ఖుర్ఆన్) గౌరవనీయుడైన సందేశహరుడు తెచ్చిన వాక్కు![8]

---

[6] కర్మపత్రాలు మరణించిన రోజు మూయబడి, పునరుత్థాన దినమున మరల తెరువబడతాయి. అప్పుడు కరపత్రాలు పుణ్యాత్ములకు కుడిచేతులలో మరియు పాపాత్ములకు ఎడమచేతులలో ఇవ్వ బడతాయి.

[7] అల్ జవారి: నడిచేది, తిరిగేది. అల్ కున్నసి: దాక్కునేది, కనుమరుగయ్యేది.

[8] అంటే జిబ్రీల్ (అ'.స.) తెచ్చిన వాక్కు.

20. అతను (జిబ్రీల్) మహాబలశాలి, సింహాసన (అర్ష్)[9] అధిపతి సన్నిధిలో ఉన్నతస్థానం గలవాడు!
21. అతని ఆజ్ఞలు పాటింపబడతాయి మరియు (అతను) విశ్వసనీయుడు!
22. మరియు (ఓ ప్రజలారా!) మీ సహచరుడు పిచ్చివాడు కాడు![10]
23. మరియు వాస్తవంగా, అతను ఆ సందేశహరుణ్ణి (జిబ్రీల్ ను) ప్రకాశవంతమైన దిఙ్మండలంలో చూశాడు[11].
24. మరియు అతను (ముహమ్మద్) అగోచర జ్ఞానాన్ని ప్రజల నుండి దాచేవాడు కాడు.
25. మరియు ఇది (ఈ ఖుర్ఆన్) శపించ (బహిష్కరించ) బడిన షైతాన్ వాక్కు కాదు.
26. మరి మీరు ఎటు పోతున్నారు?
27. ఇది (ఈ ఖుర్ఆన్) సర్వలోకాలకు ఒక హితోపదేశం.
28. మీలో, ఋజుమార్గంలో నడవ దలచుకున్న ప్రతివాని కొరకు.

---

[9] అల్-'అర్షు: సింహాసనం లేక విశ్వాధికార పీఠం. ఈ పదం అవతరణలో ఇక్కడ మొదటిసారి వచ్చింది. వివరాలకు చూడండి, 7:54.

[10] చూడండి, 7:184 ఈ వాక్యం మక్కావాసులతో చెప్పబడింది. ఇంకా విశదమయ్యే విషయం ఏమిటంటే దైవప్రవక్త ('స'అస) ఒక మానవుడు మరియు అల్లాహ్ (సు.తా.) ఎన్నుకొన్న ప్రవక్త.

[11] చూడండి, 53:5 దైవప్రవక్త ('స'అస) జిబ్రీల్ ('అ.స.) ను రెండుసార్లు అతని నిజరూపంలో చూశారు. మొదటిసారి ఇక్కడ, రెండవసారి మే'రాజ్ రాత్రిలో.

29. మరియు సర్వలోకాల ప్రభువైన అల్లాహ్ తలచనంత వరకు, మీరు తలిచినంత మాత్రాన ఏమీ కాదు[12].

[12] ఇటువంటి మరో ఆయతు కోసం చూడండి, 76:29-30.

# 82. అల్-ఇంఫితార్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఆకాశం చీల్చబడినప్పుడు![1]
2. మరియు నక్షత్రాలు చెదిరి పోయినప్పుడు!
3. మరియుసముద్రాలుపొంగిపొరలిపోయినప్పుడు!
4. మరియు సమాధులు పెళ్ళగింప (తెరువ) బడినప్పుడు!
5. ప్రతి వ్యక్తికి తాను చేసి పంపుకున్నది మరియు వెనుక వదలి పెట్టింది అంతా తెలిసి పోతుంది.
6. ఓ మానవుడా! పరమదాత అయిన నీ ప్రభువును గురించి, ఏ విషయం నిన్ను ఏమరుపాటుకు గురి చేసింది?
7. ఆయనే నిన్ను సృష్టించాడు, తరువాత ఎలాంటి లోపం లేకుండా నిన్ను తీర్చిదిద్దాడు మరియు నిన్ను తగిన ప్రమాణంలో రూపొందించాడు.
8. తాను తలచిన ఆకారంలో నిన్ను మలిచాడు.
9. అలా కాదు! వాస్తవానికి మీరు (పరలోక) తీర్పును అబద్ధమని తిరస్కరిస్తున్నారు!
10. మరియు, నిశ్చయంగా! మిమ్మల్ని కనిపెట్టుకొని ఉండేవారు (దేవదూతలు) ఉన్నారు[2].

---

[*] [అల్-ఇంఫితార్ అంటే చిన్నాభిన్నమయ్యేలా బద్దలు కావడం]
[1] ఇది పునరుత్థాన దినపు సూచన.
[2] చూడండి, 50:17-18.

11. వారు, గౌరవనీయులైన లేఖకులు;
12. మీరు చేసేదంతా తెలుసుకునేవారు!
13. నిశ్చయంగా పుణ్యాత్ములు[3] సుఖసంతోషాలలో తేలియాడుతూ ఉంటారు.
14. మరియు నిశ్చయంగా, దుష్టులు భగభగ మండే నరకాగ్నిలో ఉంటారు[4].
15. తీర్పు దినమున వారు అందులో ప్రవేశిస్తారు.
16. మరియు వారు దాని నుండి ఎంత మాత్రం తప్పించుకోలేరు.
17. మరియు ఆ తీర్పుదినం అంటే ఏమిటో నీకెలా తెలుస్తుంది?
18. అవును మరి! ఆ తీర్పుదినం అంటే ఏమిటో నీకెలా తెలుస్తుంది?
19. ఆ దినమున ఏ మానవునికి కూడా ఇతరునికి ఎలాంటి సహాయం చేసే అధికారం ఉండదు. మరియు ఆ రోజు నిర్ణయాధికారం కేవలం అల్లాహ్ కే ఉంటుంది[5].

---

[3] అబ్ రార్: Pious, ధర్మనిష్ఠాపరులు, దైవభక్తిపరులు, Righteous, ఋజువర్తనులు, ధర్మశీలురు, న్యాయనిష్ఠ గలవారు.

[4] చూడండి, 42:7.

[5] చూడండి, 40:16.

# 83. అల్-ముతఫ్ఫిఫీన్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. కొలతలలో, తూనికలలో తగ్గించి ఇచ్చే వారికి వినాశముంది.
2. వారు ప్రజల నుండి తీసుకునేటప్పుడు పూర్తిగా తీసుకుంటారు.
3. మరియు తాము ప్రజలకు కొలిచిగానీ లేక తూచిగానీ ఇచ్చేటప్పుడు మాత్రం తగ్గించి ఇస్తారు[1]
4. ఏమీ? ఇలాంటి వారు తిరిగి బ్రతికించి లేపబడరని భావిస్తున్నారా?
5. ఒక గొప్ప దినమున!
6. సర్వ లోకాల ప్రభువు సమక్షంలో ప్రజలు అందరూ నిలబడే రోజు[2].
7. అలా కాదు! నిశ్చయంగా, దుష్టుల కర్మపత్రం సిజ్జీనులో ఉంది.

---

[*] [అల్-ముతఫ్ఫిఫీన్ అంటే కొలతలు, తూనికలలో మోసం చేసేవారు]

[1] ఒక 'హదీస్'లో ఇలా ఉంది: "ఏ సమాజం వారైతే కొలతలలో మరియు తూనికలలో తగ్గిస్తారో! వారిపై కరువు మరియు పరిపాలకుల ఆగడాలు విరుచుకుపడతాయి." (ఇబ్నె-మాజా-అల్బానీ దీనిని 'స'హీ'హ్ గా ప్రమాణీకరించారు) ఈ మూడు ఆయతులు అన్ని రకాల మోసాలను ఖండిస్తున్నాయి.

[2] ఇది వారే చేస్తారు, ఎవరైతే పునరుత్థాన దినమున అల్లాహ్ (సు.తా.) ముందు నిలబడవలసి ఉందని నమ్మరో! వారికి అల్లాహ్ (సు.తా.) భయం లేదు, ('స'హీ'హ్ బు'ఖారీ).

8. ఆ సిజ్జీన్ అంటే నీవు ఏమనుకుంటున్నావు?
9. వ్రాసి పెట్టబడిన (చెరగని) గ్రంథం[3].
10. సత్యాన్ని తిరస్కరించే వారికి ఆ రోజు వినాశముంది.
11. వారికే! ఎవరైతే తీర్పుదినాన్ని తిరస్కరిస్తారో!
12. మరియు మితిమీరి ప్రవర్తించే పాపిష్ఠి తప్ప మరెవ్వడూ దానిని (తీర్పుదినాన్ని) తిరస్కరించడు
13. మా సూచనలు (ఆయాత్ లు) అతడికి వినిపించబడినప్పుడు అతడు: "ఇవి పూర్వ కాలపు కట్టుకథలే!" అని అంటాడు.
14. అలా కాదు! వాస్తవానికి వారి హృదయాలకు వారి (దుష్ట) కార్యాల త్రుప్పు పట్టింది[4].
15. అంతేకాదు, ఆ రోజు నిశ్చయంగా, వారు తమ ప్రభువు కారుణ్యం నుండి నిరోధింప బడతారు.
16. తరువాత వారు నిశ్చయంగా, భగభగ మండే నరకాగ్నిలోకి పోతారు.
17. అప్పుడు వారితో: "దేనినైతే మీరు అసత్యమని

---

[3] సిజ్జీన్, అంటే కారాగారం. ఇక్కడ చెరిగిపోకుండా నష్టం కాకుండా వ్రాసి పెట్టబడిన గ్రంథమని అర్థం.

[4] రానా: అంటే పాపాల వల్ల హృదయం మీద ఏర్పడే మచ్చ. 'హదీస్'లో ఇలా ఉంది: "మానవుడు పాపం చేసినపుడు అతని హృదయం మీద ఒక నల్లని మచ్చ ఏర్పడుతుంది. ఒకవేళ అతడు పశ్చాత్తాప పడి ఆ పాపం మరల చేయకుంటే అది దూరమై పోతుంది. ఒకవేళ అతడు పాపం మీద పాపం చేస్తూ ఉంటే ఆ నల్లమచ్చ పెరుగుతుంది. చివరకు అది అతని హృదయం మీద పూర్తిగా క్రమ్ముకొంటుంది. అదే 'రానా' అని పేర్కొనబడినది." (తిర్మిజీ', ఇబ్నె-మాజా, ముస్నద్ అ'హ్మద్).

తిరస్కరిస్తూ వచ్చారో, అది ఇదే!" అని చెప్పబడుతుంది.

18. అలా కాదు! నిశ్చయంగా, ధర్మనిష్ఠాపరుల (పుణ్యాత్ముల) కర్మపత్రం మహోన్నత గ్రంథం (ఇల్లియ్యూన్)లో ఉంది[5].

19. మరి ఆ ఇల్లియ్యూన్ అంటే నీవు ఏమనుకుంటున్నావు?

20. అది వ్రాసిపెట్టబడిన ఒక గ్రంథం.

21. దానికి, (అల్లాహ్ కు) సన్నిహితులైన వారు (దేవదూతలు) సాక్ష్యంగా ఉంటారు[6].

22. నిశ్చయంగా, పుణ్యాత్ములు సుఖసంతోషాలలో ఉంటారు.

23. ఎత్తైన ఆసనాలపై కూర్చొని (స్వర్గదృశ్యాలను) తిలకిస్తూ[7].

24. వారిముఖాలుసుఖసంతోషాలతోకళకళలాడుతూ ఉండటం నీవు చూస్తావు.

25. సీలు చేయబడిన నాణ్యమైన మధువు వారికి

---

[5] 'ఇల్లియ్యూన్, 'ఉలువ్వున్: ఎత్తైన స్థలం. ఇది సిజ్జీన్ కు విరుద్ధ పదం. ఇది ఆకాశాలలో, స్వర్గంలో సిద్ రతుల్ మున్ తహా, లేక 'అర్ష్ దగ్గర ఉన్నచోటు. అక్కడ పుణ్యాత్ముల కరపత్రాలు భద్రపరచబడి ఉంటాయి.

[6] యష్ హదు: అంటే ఇక్కడ పర్యవేక్షిస్తుంటారు. అనే అర్థం కూడా వస్తుంది.

[7] చూడండి, 75:23.

త్రాగటానికి ఇవ్వబడుతుంది[8].

**26.** దాని చివరి చుక్కలోనూ కస్తూరి సువాసన ఉంటుంది. కాబట్టి దానిని పొందటానికి అపేక్షించే వారంతా ప్రయాస పడాలి.

**27.** మరియు దానిలో (ఆ మధువులో) తస్నీమ్ కలుపబడి ఉంటుంది[9].

**28.** అదొక చెలమ, (అల్లాహ్) సాన్నిధ్యం పొందినవారే దాని నుండి త్రాగుతారు[10].

**29.** వాస్తవానికి (ప్రపంచంలో) అపరాధులు విశ్వసించిన వారిని హేళన చేసేవారు.

**30.** మరియు వీరు (విశ్వాసులు), వారి (అవిశ్వాసుల) యెదుట నుండి పోయి నప్పుడు, వారు (అవిశ్వాసులు) పరస్పరం కనుసైగలు చేసుకునేవారు.

**31.** మరియు (అవిశ్వాసులు) తమ ఇంటి వారి దగ్గరికి

---

[8] ర'హీఖున్: స్వచ్ఛమైన, తేటైన, ఉత్తమమైన, మధురమైన పానీయం, అందులో ఎట్టి కల్తీ ఉండదు. మ'ఖ్తూమున్: సీలు చేయబడినది. దాని స్వచ్ఛతకు హామీగా. కొందరు 'ఖితాముని - అంటే సువాసన అంటారు. దాని సువాసన కస్తూరి వలే ఉంటుంది. (ఇబ్నె -కసీ'ర్). 'హదీస్'లో ఉంది: "ఏ విశ్వాసుడైతే, దప్పికగొన్న విశ్వాసునికి నీరు త్రాపుతాడో పునరుత్థాన దినమున అల్లాహ్ (సు.తా.) అతనికి ర'హీఖ్ అల్-మ'ఖ్తూమ్ త్రాపుతాడు మరియు అన్నం పెట్టిన వాడికి స్వర్గపు ఫలాలు తినిపిస్తాడు. మరియు వస్త్రాలు ఇచ్చే వానికి స్వర్గపు వస్త్రాలు ప్రసాదిస్తాడు." (ముస్నద్ అ'హ్మద్, 3/13-14)

[9] తస్నీమున్: ఎత్తైన స్థలం, ఆ పానీయం స్వర్గపు ఎత్తైన ప్రదేశం నుండి చెలమల ద్వారా వస్తుంది.

[10] చూడండి, 76:5-6.

పోయినప్పుడు (విశ్వాసులను గురించి) పరిహాసిస్తూ మరలేవారు.

32. మరియు(విశ్వాసులను) చూసినపుడల్లా: "నిశ్చయంగా వీరు దారి తప్పినవారు!"అని అనేవారు

33. మరియు వారు (అవిశ్వాసులు) వీరి (విశ్వాసుల) మీద కాపలాదారులుగా పంపబడలేదు!

34. కాని ఈరోజు (పునరుత్థానదినం నాడు) విశ్వసించినవారు, సత్యతిరస్కారులను చూసి నవ్వుతారు.

35. ఎత్తైన ఆసనాలపై కూర్చొని (స్వర్గదృశ్యాలను) తిలకిస్తూ (ఇలా అంటారు):

36. "ఇక! ఈ సత్యతిరస్కారులకు, వారి చేష్టలకు తగిన ప్రతిఫలం తప్ప మరేమైనా దొరుకునా?"

# 84. అల్-ఇంషిఖాఖ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఆకాశం బ్రద్దలయి పోయినప్పుడు![1]
2. మరియు అది తన ప్రభువు ఆదేశపాలన చేసింది మరియు అదే దాని విధ్యుక్త ధర్మం[2].
3. మరియు భూమి విస్తరింపజేయబడి (చదునుగా చేయబడి) నప్పుడు;
4. మరియు అది తన లోపల ఉన్నదంతా బయటికి విసరివేసి, ఖాళీ అయినప్పుడు;
5. అది తన ప్రభువు ఆదేశపాలన చేసింది మరియు అదే దాని విధ్యుక్త ధర్మం.
6. ఓ మానవుడా! నిశ్చయంగా, నీవు నీ ప్రభువు వైపునకు, నీ (మంచి-చెడు) కర్మలను తీసు కొని మరలుతున్నావు, ఒక నిశ్చిత మరల్పు. అప్పుడు నీవు నీ (కర్మల ఫలితాన్ని) పొందుతావు
7. అప్పుడు తన కర్మపత్రం కుడిచేతిలో ఇవ్వబడినవాడి నుండి[3];
8. అతని లెక్క అతి తేలికగా తీసుకోబడగలదు.
9. మరియు అతడు సంతోషంగా తన వారి దగ్గరకు

---

[*] [అల్-ఇంషిఖాఖ్ అంటే ఆకాశం బద్దలు కావడం]

[1] అంటే పునరుత్థాన దినము

[2] చూడండి, 20:105-107.

[3] చూడండి, 69:19.

మరలిపోతాడు!

10. ఇక తన కర్మపత్రం వీపు వెనుక నుండి ఇవ్వబడినవాడు[4];

11. అప్పుడతడు తన నాశనాన్నే - కోరుకుంటాడు;

12. మరియు అతడు మండుతున్న నరకాగ్నిలో పడిపోతాడు.

13. వాస్తవానికి, అతడు (ప్రపంచంలో) తన వారి మధ్య సుఖసంతోషాలలో మునిగి ఉండేవాడు[5]

14. వాస్తవానికి, అతడు (మా వైపుకు) మరలిరాడని భావించేవాడు.

15. అలా కాదు! వాస్తవానికి, అతని ప్రభువు అతనిని గమనిస్తూ ఉండేవాడు.

16. కనుక, నేను సంధ్యకాలపు ఎరుపు సాక్షిగా చెబుతున్నాను![6]

17. రాత్రి సాక్షిగా, అది ప్రోగు చేసేవాటి సాక్షిగా!

18. పూర్ణచంద్రుని సాక్షిగా![7]

19. మీరందరూ తప్పనిసరిగా ఒక స్థితి నుండి మరొక స్థితికి క్రమక్రమంగా మారుతూ పోవలసి ఉంటుంది[8].

20. అయితే వీరికేమయింది? వీరు ఎందుకు విశ్వసించరు?

---

[4] చూడండి, 69:25-26.

[5] చూడండి, 75:33.

[6] అష్-షఫఖు: సూర్యాస్తమయం తరువాత ఆకాశంలో కనబడే ఎరుపు, సంధ్యారుణిమ. అది 'ఇషా సమయం మొదలయ్యే వరకు ఉంటుంది.

[7] అత్తసఖ: అంటే పౌర్ణిమనాటి చంద్రుడు.

[8] 'తబఖున్: కఠినత, ఇక్కడ కఠినాలు అంటే ఒక స్థితి నుండి మరొక స్థితికి మారటం.

21. మరియు ఖుర్ఆన్ వీరి ముందు పఠింపబడినప్పుడు వీరెందుకు సాష్టాంగం(సజ్దా) చేయరు?[9]

22. అలా కాదు! ఈ సత్యతిరస్కారులు దీనిని అసత్యమంటున్నారు.

23. మరియు వారు కూడబెట్టేదంతా అల్లాహ్ కు బాగా తెలుసు.

24. కాబట్టి వారికి (పరలోకంలో) లభించే వ్యధాభరితమైన శిక్ష యొక్క వార్తనివ్వు -

25. విశ్వసించి సత్కార్యాలు చేసే వారికి తప్ప-వారికి ఎన్నటికీ అంతం గాని ప్రతిఫలం ఉంటుంది

[9] 'హదీస్'ల ద్వారా దైవప్రవక్త ('స'అస) మరియు 'స'హాబా(ర'ది.'అన్హుమ్)లు, ఇక్కడ సజ్దా చేశారని తెలుస్తుంది.

# 85. అల్-బురూజ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. విస్తారమైన తారాగణం గల ఆకాశం సాక్షిగా![1]
2. వాగ్దానం చేయబడిన (పునరుత్థాన) దినం సాక్షిగా!
3. చూచేదాని (దినం) మరియు చూడబడే దాని (దినం) సాక్షిగా![2]
4. అగ్ని కందకం (ఉఖ్దూద్) వారు నాశనం చేయబడ్డారు[3].
5. ఇంధనంతో తీవ్రంగా మండే అగ్నిని రాజేసేవారు.
6. వారు దాని (ఆ కందకం) అంచుపై కూర్చొని ఉన్నప్పుడు[4];

---

[*] [అల్-బురూజ్ అంటే నక్షత్రమండలము]

[1] చూడండి, 25:61.

[2] ఈ ఆయతు వ్యాఖ్యానంలో భేదాభిప్రాయాలున్నాయి. ఇమామ్ షౌకాని ఒక 'హదీస్' ఆధారంగా అన్నారు: షాహిదున్: అంటే జుము'అహ్ దినం. ఆరోజు విశ్వాసి చేసిన పని, పునరుత్థాన దినమున దానికి సాక్ష్యమిస్తుంది. మష్ హూదున్ : అంటే 9వ జు'ల్ 'హజ్జ్, 'అరఫాత్ దినం. ఏ రోజైతే ముస్లింలు 'హజ్ కొరకు సమావేశమవుతారో! మరొక తాత్పర్యం: "అంతా చేసే ఆయన, అల్లాహుతా'ఆలా సాక్షిగా మరియు ఆయన సాక్షిగా నిలిపేవాని సాక్షిగా!"

[3] పైన పేర్కొన్నట్లు నజ్ రాన్ లోని సత్యతిరస్కారులు, ఆ కాలపు విశ్వాసులను ఒక అగ్ని కందకంలో త్రోసి చంపేవారు.

[4] విశ్వాసులను అగ్నిలో వేసి వారు (సత్యతిరస్కారులు) చూసి ఆనందించేవారు.

7. మరియు తాము విశ్వాసుల పట్ల చేసే ఘోరకార్యాలను (సజీవ దహనాలను) తిలకించేవారు.

8. మరియు వారు విశ్వాసుల పట్ల కసి పెంచుకోవడానికి కారణం - వారు (విశ్వాసులు) సర్వశక్తిమంతుడు, సర్వ స్తోత్రాలకు అర్హుడైన - అల్లాహ్ ను విశ్వసించడం మాత్రమే!

9. ఆయనే! ఎవరికైతే భూమ్యాకాశాల ఆధిపత్యం ఉందో! మరియు అల్లాహ్ యే ప్రతిదానికి సాక్షి

10. ఎవరైతే విశ్వాసులైన పురుషులను మరియు విశ్వాసులైన స్త్రీలను హింసిస్తారో, ఆ తరువాత పశ్చాత్తాపంతో క్షమాపణ కోరరో! నిశ్చయంగా, అలాంటి వారికి నరకశిక్ష ఉంటుంది. మరియు వారికి మండే నరకాగ్ని శిక్ష విధించబడుతుంది.

11. నిశ్చయంగా, విశ్వసించి సత్కార్యాలు చేసే వారి కొరకు క్రింద సెలయేళ్ళు ప్రవహించే స్వర్గవనాలు ఉంటాయి[5]. అదే గొప్ప విజయం.

12. నిశ్చయంగా, నీ ప్రభువు యొక్క పట్టు (శిక్ష) చాలా కఠినమైనది[6].

13. నిశ్చయంగా, ఆయనే (సృష్టిని) ఆరంభించేవాడు మరియు ఆయనే (దానిని) మరల ఉనికి లోకి

---

[5] ఖుర్ఆన్ అవతరణా క్రమంలో స్వర్గవనాలను గురించి ఇక్కడ మొదటి సారి వచ్చింది.

[6] ఆయన మొదట వ్యవధినిస్తాడు. ఇక శిక్షించటానికి పట్టుకొన్నప్పుడు, ఆయన పట్టు నుండి ఎవ్వరూ తప్పించుకోలేరు మరియు ఎవ్వరూ తప్పించజాలరు కూడానూ!

తెచ్చేవాడు.
14. మరియు ఆయన క్షమాశీలుడు, అమిత వాత్సల్యుడు.
15. సింహాసనాన్ని (అర్ష్ ను) అధిష్టించిన వాడు[7], మహత్త్వపూర్ణుడు[8].
16. తాను తలచింది చేయగలవాడు.
17. ఏమీ? సైన్యాల వారి సమాచారం నీకు అందిందా?
18. ఫిర్‌ఔన్ మరియు సమూద్ వారి (సైన్యాల).
19. అలా కాదు, సత్యతిరస్కారులు (సత్యాన్ని) తిరస్కరించుటలో నిమగ్నులై ఉన్నారు.
20. మరియు అల్లాహ్ వారిని వెనుక (ప్రతి దిక్కు) నుండి చుట్టుముట్టి ఉన్నాడు.
21. వాస్తవానికి, ఇది ఒక దివ్యమైన[9] ఖుర్ఆన్.
22. సురక్షితమైన ఫలకం (లౌహె మహ్ ఫూజ్)[10] లో (వ్రాయబడి) ఉన్నది.

---

[7] సింహాసనాధీశుడు, చూడండి, 7:54.
[8] చూడండి, అల్లాహుతా'ఆలాను సంబోధించిన సందర్భానికి, 11:73 అల్-మజీదు: వైభవం గలవాడు, ప్రభావం, ప్రతాపం విశిష్టత, దివ్యుడు, మహిమాన్వితుడు, మహత్త్వపూర్ణుడు. .
[9] చూడండి, ఖుర్ఆన్ సంబోధించిన సందర్భానికి, 50:1.
[10] చూడండి, 13:39 మరియు 43:4. ఉమ్ముల్-కితాబ్, అంటే లౌహె మ'హ్ ఫూ"జ్. సురక్షితమైన ఫలకం, మూలగ్రంథం. అంటే యథాస్థితిలో, భద్రంగా ఉంచబడిన గ్రంథం.

# 86. అత్-తారిఖ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఆకాశం మరియు రాత్రివేళ వచ్చే నక్షత్రం (అత్ తారిఖ్) సాక్షిగా![1]
2. రాత్రి వేళ వచ్చేది (అత్ తారిఖ్) అంటే ఏమిటో నీకు ఎలా తెలుస్తుంది?
3. అదొక అత్యంత ప్రకాశవంతమైన నక్షత్రం.
4. కనిపెట్టుకొని ఉండేవాడు (దేవదూత) లేకుండా ఏ వ్యక్తి కూడా లేడు.
5. కావున మానవుడు తాను దేనితో సృష్టించబడ్డాడో గమనించాలి!
6. అతడు విసర్జించబడే (చిమ్ముకుంటూ వెలువడే) ద్రవపదార్థంతో సృష్టించబడ్డాడు.
7. అది వెన్ను మరియు రొమ్ము ఎముకల మధ్యభాగం నుండి బయటికి వస్తుంది.
8. నిశ్చయంగా, ఆయన (సృష్టికర్త), అతనిని మరల బ్రతికించి తేగల సామర్థ్యం గలవాడు!
9. ఏ రోజయితే రహస్య విషయాల విచారణ జరుగుతుందో!
10. అప్పుడు అతనికి (మానవునికి) ఎలాంటి శక్తి ఉండదు మరియు ఏ సహాయకుడునూ

---

[*] [అత్-తారిఖ్ అంటే ప్రభాత నక్షత్రము]

[1] చూడండి, 13:11 మరియు 82:10-12.

ఉండడు[2].

11. వర్షం కురిపించే ఆకాశం సాక్షిగా![3]

12. (చెట్లు మొలకెత్తేటప్పుడు) చీలి పోయే భూమి సాక్షిగా!

13. నిశ్చయంగా, ఇది (ఈ ఖుర్ఆన్, సత్యాసత్యాలను) వేరు పరచే వాక్కు (గీటురాయి).

14. మరియు ఇది వృథా కాలక్షేపానికి వచ్చినది కాదు.

15. (ఓ ముహమ్మద్!) నిశ్చయంగా, వారు (నీకు విరుద్ధంగా) కుట్రపన్నుతున్నారు[4].

16. మరియు నేను కూడా పన్నాగం పన్నుతున్నాను.

17. కనుక నీవు సత్యతిరస్కారులకు కొంత వ్యవధినివ్వు![5] వారి పట్ల మృదువుగా వ్యవహరించు.

---

[2] అల్లాహ్ (సు.తా.) శిక్ష నుండి తప్పించుకోవటానికి.

[3] అర్-రజ్'ఉ: తిరిగి రావటం, వర్షం కూడా మళ్ళీ మళ్ళీ వస్తుంది కాబట్టి ఈ పేరుతో పిలువబడుతుంది.

[4] చూడండి, 34:33.

[5] చూడండి, 7:182-183.

# 87. అల్ ఆలా [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. అత్యున్నతుడైన నీ ప్రభువు నామాన్ని స్తుతించు!
2. ఆయనే (ప్రతిదానిని) సృష్టించాడు మరియు తగిన ప్రమాణంలో రూపొందించాడు[1].
3. మరియు ఆయనే దాని ప్రకృతి లక్షణాలను నిర్ణయించాడు[2], మరియు మార్గం చూపాడు!
4. మరియు ఆయనే పచ్చికను మొలిపింప జేశాడు.
5. మరల దానిని నల్లని చెత్తాచెదారంగా చేశాడు[3].
6. మేము నీచేత (ఖుర్ఆన్ ను) చదివింప జేస్తాము, తరువాత నీవు (దానిని) మరచిపోవు-
7. అల్లాహ్ కోరింది తప్ప[4]! నిశ్చయంగా, బహిరంగంగా ఉన్నదీ మరియు గోప్యంగా ఉన్నదీ అన్నీ ఆయనకు బాగా తెలుసు.
8. మరియు మేము నీ మార్గాన్ని సులభం చేయడానికి నీకు సౌలభ్యాన్ని కలుగజేస్తాము[5].

---

[*] [అల్ ఆలా - మహోన్నతుడు]

[1] చూడండి, 82:7.

[2] చూడండి, 25:2 మరియు 20:50.

[3] 'గుసా'అన్: ఎండినగడ్డి. అ'హ్వా: నల్లని. అంటే పచ్చగడ్డిని ఎండింపజేసి నల్లని చెత్తాచెదారంగా చేస్తాడు.

[4] అంటే అల్లాహ్ (సు.తా.) రద్దు చేయదలిచిన దానిని మరపింపజేస్తాడు.

[5] వ'హీని జ్ఞాపకముంచుకోవటం మరియు దానిపై నడవటం నీకు సులభం చేస్తాము.

9. కావున నీవు హితోపదేశం చేస్తూ ఉండు; వారికి హితోపదేశం లాభదాయకం కావచ్చు![6]
10. (అల్లాహ్ కు) భయపడే వాడు హితోపదేశాన్ని స్వీకరిస్తాడు.
11. మరియు దౌర్భాగ్యుడు దానికి దూరమై పోతాడు.
12. అలాంటి వాడే ఘోరమైన నరకాగ్నిలో పడి కాలుతాడు.
13. అప్పుడు, అతడు అందులో చావనూ లేడు, బ్రతకనూ లేడు[7].
14. సుశీలతను (పవిత్రతను) పాటించే వాడు తప్పక సాఫల్యం పొందుతాడు.
15. మరియు తన ప్రభువు నామాన్ని స్మరిస్తూ, నమాజ్ చేస్తూ ఉండేవాడు.
16. అలా కాదు! మీరు ఐహిక జీవితానికి ప్రాధాన్యత నిస్తున్నారు;
17. కాని పరలోక జీవితమే మేలైనది మరియు చిరకాలముండేది.
18. నిశ్చయంగా, ఈ విషయం పూర్వగ్రంథాలలో (వ్రాయబడి) ఉంది;
19. ఇబ్రాహీమ్ మరియు మూసాలపై (అవతరింపజేయబడిన) గ్రంథాలలో.

---

[6] నీ పని హితోపదేశం చేయటం మాత్రమే! నీ హితోపదేశం వారికి లాభం కావచ్చు! వారితో దానితో లాభం పొందకున్నా నీ పని కేవలం హితోపదేశం చేయటమే!

[7] చూడండి, 74:28-29.

# 88. అల్-గాషియహ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. హఠాత్తుగా ఆసన్నమయ్యే ఆ విపత్తు (పునరుత్థాన దినపు) సమాచారం నీకు అందిందా?
2. కొన్ని ముఖాలు ఆ రోజు వాలి (క్రుంగి) పోయి ఉంటాయి.
3. (ప్రపంచంలోని వృథా) శ్రమకు, (పరలోకంలో జరిగే) అవమానానికి[1],
4. వారు దహించే అగ్నిలో పడి కాలుతారు.
5. వారికి సలసల కాగే చెలమ నీరు త్రాగటానికి ఇవ్వబడుతుంది.
6. వారికి చేదు ముళ్ళగడ్డ (దరీఅ) తప్ప మరొక ఆహారం ఉండదు.
7. అది వారికి బలమూ నియ్యదు మరియు ఆకలీ తీర్చదు!
8. ఆ రోజున, మరికొన్ని ముఖాలు కళకళలాడుతూ ఉంటాయి;
9. తాము చేసుకున్న సత్కార్యాలకు (ఫలితాలకు) వారు సంతోషపడుతూ ఉంటారు.
10. అత్యున్నతమైన స్వర్గవనంలో.
11. అందులో వారు ఎలాంటి వృథా మాటలు వినరు.

---

[*] [అల్-గాషియహ్ అంటే ఘోరమైన ఆపద]
[1] నా'సిబతున్: శ్రమకు అలసిపోవటం.

12. అందులో ప్రవహించే సెలయేళ్ళు ఉంటాయి;
13. అందులో ఎత్తైన ఆసనాలు ఉంటాయి[2];
14. మరియు పేర్చబడిన (మధు) పాత్రలు;
15. మరియు వరుసలుగా వేయబడిన, దిండ్లు;
16. మరియు పరచబడిన నాణ్యమైన తివాచీలు.
17. ఏమిటీ? వారు ఒంటెల వైపు చూడరా? అవి ఎలా సృష్టించబడ్డాయో?
18. మరియు ఆకాశం వైపుకు (చూడరా)? అది ఎలా పైకి ఎత్తబడి ఉందో?
19. మరియు కొండల వైపుకు చూడరా?అవి ఎలా గట్టిగా నాటబడి ఉన్నాయో?
20. మరియు భూమి వైపుకు (చూడరా)? అది ఎలా విశాలంగా పరచబడి ఉందో?
21. కావున (ఓ ముహమ్మద్!) నీవు హితోపదేశం చేస్తూఉండు,వాస్తవానికినీవుకేవలంహితోపదేశం చేసే వాడవు మాత్రమే!
22. నీవు వారిని (విశ్వసించమని) బలవంతం చేసేవాడవు కావు.
23. ఇక,ఎవడైతేవెనుదిరుగుతాడోమరియుసత్యాన్ని తిరస్కరిస్తాడో!
24. అప్పుడు అతనికి అల్లాహ్ ఘోరశిక్ష విధిస్తాడు.
25. నిశ్చయంగా, మా వైపునకే వారి మరలింపు ఉంది;
26. ఆ తర్వాత నిశ్చయంగా, వారి లెక్క తీసుకునేదీ మేమే!

---

[2] చూడండి, 15:47.

# 89. అల్-ఫజ్ర్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ప్రాంతః కాలం సాక్షిగా![1]
2. పది రాత్రుల సాక్షిగా![2]
3. సరి బేసీల సాక్షిగా!
4. గడచిపోయే రాత్రి సాక్షిగా!
5. వీటిలో బుద్ధిగల వాని కొరకు ఏ ప్రమాణమూ లేదా ఏమిటి?[3]
6. నీ ప్రభువు ఆద్ (జాతి) వారి పట్ల ఎలా వ్యవహరించాడో నీకు తెలియదా?[4]
7. ఎత్తైన స్థంభాల (భవనాలు గల) ఇరమ్ ప్రజల

---

[*] [అల్-ఫజ్ర్ అంటే ఉషోదయము]

[1] అంటే ప్రతి ఉదయం ఒక ప్రత్యేక ఉదయం కాదు.

[2] అంటే జు'ల్-'హజ్ యొక్క మొదటి పదిరాత్రులని చాలా మంది వ్యాఖ్యాతల అభిప్రాయం. వీటి ఘనత 'హదీస్' లలో ఉంది. దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: "జు'ల్-'హజ్జ్ మొదటి పది రోజులలో చేసే సత్కార్యాలు అల్లాహ్ (సు.తా.)కు ఎంతో ఇష్టమైనవి - జిహాద్ కంటే కూడా - మానవుడు అమరగతి నొందిన జిహాద్ తప్ప! ('స'హీ'హ్ బు'ఖారీ).

[3] అంటే వీటన్నిటి ప్రమాణం చేయటం, అల్లాహ్ (సు.తా.)ను విశ్వసించటానికి చాలదా! 'హిజ్ రున్: ఆపటం, కాదనటం, బుద్ధి కూడా మానవుడిని చెడు కర్మల నుండి ఆపుతుంది.

[4] వారి ప్రవక్త హూద్ ('అ.స.) చూడండి, 69:7-10 మరియు 7:65-72.

పట్ల?[5]

8. వారిలాంటి జాతి భూమిలో ఎన్నడూ సృష్టించబడలేదు[6].

9. మరియు లోయలలోని కొండరాళ్ళలో (భవనాలను) తొలిచిన సమూద్ జాతి పట్ల?[7]

10. మరియు మేకులవాడైన ఫిర్ఔన్ పట్ల?[8]

11. వారంతా ఆయా దేశాలలో తలబిరుసుతనంతో ప్రవర్తించారు;

12. మరియు వాటిలో దౌర్జన్యాన్ని రేకెత్తించారు.

13. కాబట్టి నీ ప్రభువు వారిపైకి అనేక రకాల బాధాకరమైన శిక్షలను పంపాడు.

14. వాస్తవానికి, నీ ప్రభువు మాటు వేసి ఉన్నాడు (అంతా కనిపెడ్తూ ఉంటాడు)!

15. అయితే మానవుడు ఎలాంటి వాడంటే: అతని ప్రభువు అతన్ని పరీక్షించటానికి, అతనికి గౌరవ ప్రతిష్టల నిచ్చి అనుగ్రహించినప్పుడు: "నా ప్రభువు నన్ను గౌరవించాడు."

---

[5] ఇరము: ఒక తెగ పేరు. దాని పూర్వోత్తరాలు ఇలా ఉన్నాయి: 'ఆద్ బిన్-'ఔస్ బిన్-ఇరము బిన్ -సామ్ బిన్-నూ'హ్. (ఫత్హ్ అల్-ఖదీర్) వీరిని 'ఆద్‌ఊలా, అని కూడా అంటారు.వీరిని ఎత్తైన స్తంభాల (భవనాల) వారని కూడా అంటారు.

[6] 'ఆద్ జాతివారికి తమ బలసామర్థ్యాల మీద ఎంతో గర్వం ఉండేది. చూడండి, 41:15.

[7] వీరి ప్రవక్త 'సాలిహ్' ('అ.స.). చూడండి, 26:149.

[8] అంటే పెద్ద సైన్యం గలవాడు, లేక ప్రజలను మేకులతో నాటి శిక్షించేవాడు. (ఫత్హ్ అల్-ఖదీర్)

అని అంటాడు[9]

16. కాని, అతన్ని పరీక్షించటానికి, అతని ఉపాధిని తగ్గించినప్పుడు: "నా ప్రభువు నన్ను అవమానించాడు." అని అంటాడు[10].

17. అలా కాదు, వాస్తవానికి మీరు అనాథులను ఆదరించరు[11];

18. మరియు మీరు పేదలకు అన్నం పెట్టే విషయంలో ఒకరినొకరు ప్రోత్సహించుకోరు[12];

19. మరియు వారసత్వపు ఆస్తిని పేరాశతో అంతా మీరే తినేస్తారు.

20. మరియు మీరు ధనవ్యామోహంలో దారుణంగా చిక్కుకు పోయారు![13]

21. అలా కాదు, భూమి, దంచి పిండిపిండిగా

---

[9] అల్లాహ్ (సు.తా.) ధనధాన్యాలు, సౌభాగ్యాలు, ఇచ్చినా పరీక్షించటానికే! మరియు పేదరికానికి గురిచేసినా, అదీ పరీక్షించటానికే!

[10] అల్లాహ్ (సు.తా.) తన సద్వర్తనులైన దాసులకు భోగభాగ్యాలు, ధనధాన్యాలు ప్రసాదించవచ్చు! లేక పేదరికానికి గురిచేసి పరీక్షించవచ్చు. అదే విధంగా సత్యతిరస్కారులకు కూడా ఐశ్వర్యాలివ్వవచ్చు లేక పేదరికంతో పరీక్షించవచ్చు! సద్వర్తనులైన విశ్వాసులు ఐశ్వర్యవంతులుగా ఉంటే అల్లాహ్ (సు.తా.)కు కృతజ్ఞులుగా ఉంటారు. పేదరికానికి గురి అయితే సహనం వహిస్తారు.

[11] దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: "అనాథులతో మంచిగా వ్యవహరించే వారు స్వర్గంలో నాతో పాటు - రెండు ప్రేళ్ళు తోడుగా ఉన్నట్లు - ఉంటారు." (అబూ-దావూద్) కావున అనాథలను పోషించడం, వారితో మంచిగా వ్యవహరించడం ఎంతో పుణ్యకార్యం.

[12] చూడండి, 107:3.

[13] జమ్మన్: కసీ'రన్, చాలా.

చేయబడినపుడు;

22. మరియు నీ ప్రభువు (స్వయంగా) వస్తాడు మరియు దేవదూతలు వరుసలలో వస్తారు[14].

23. ఆ రోజు నరకం (ముందుకు) తీసుకు రాబడుతుంది. ఆ రోజు మానవుడు (తన కర్మలన్నీ) జ్ఞప్తికి తెచ్చుకుంటాడు; కాని ఆ రోజు జ్ఞప్తికి తెచ్చుకోవడం వల్ల అతనికి కలిగే ప్రయోజనమేమిటీ?

24. అతడు: "అయ్యో! నా పాడుగానూ! నా ఈ జీవితం కొరకు నేను (సత్కార్యాలు) చేసి పంపు కొని ఉంటే ఎంత బాగుండేది!" అని వాపోతాడు.

25. అయితే, ఆ రోజు, ఆయన (అల్లాహ్) శిక్షించినట్లు, మరెవ్వడూ శిక్షించలేడు!

26. మరియు ఆయన (అల్లాహ్) బంధించినట్లు, మరెవ్వడూ బంధించలేడు[15].

27. (సన్మార్గునితో ఇలా అనబడుతుంది): "ఓ తృప్తి పొందిన ఆత్మా!

28. నీ ప్రభువు సన్నిధికి మరలి రా! (నీకు లభించే సత్ఫలితానికి) ఆనందిస్తూ మరియు (నీ ప్రభువునకు) ప్రియమైనదానిపై!

29. నీవు (పుణ్యాత్ములైన) నా దాసులలో చేరిపో!

30. మరియు నీవు నా స్వర్గంలో ప్రవేశించు!"

---

[14] ఏడు ఆకాశాల దైవదూతలు ఏడు వరుసలలో నిలబడతారు.
[15] చూడండి, 73:12-13.

# 90. అల్-బలద్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. కాదు, నేను ఈ నగరం (మక్కా) సాక్షిగా (అంటున్నాను)!
2. మరియు నీకు ఈ నగరంలో (మక్కాలో) స్వేచ్ఛ ఉంది[1].
3. మరియు తండ్రి (మూలపురుషుడు) మరియు అతని సంతానం సాక్షిగా!
4. వాస్తవానికి, మేము మానవుణ్ణి శ్రమజీవిగా పుట్టించాము.
5. ఏమిటి? తనను ఎవ్వడూ వశపరచుకో లేడని అతడు భావిస్తున్నాడా?
6. అతడు: "నేను విపరీత ధనాన్ని ఖర్చు పెట్టాను!" అని అంటాడు[2].
7. ఏమిటి? తనను ఎవ్వడూ చూడటం లేదని అతడు భావిస్తున్నాడా?[3]
8. ఏమిటి? మేము అతనికి రెండు కళ్ళు ఇవ్వలేదా?
9. మరియు నాలుకను మరియు రెండు పెదవులను.

---

[*] [అల్-బలద్ అంటే నగరము]

[1] కొందరు: "తండ్రి (మూలపురుషుడు) అంటే ఆదమ్ ('అ.స.) మరియు అతని సంతానం అంటే మానవజాతి." అన్నారు.

[2] లుబదన్: కసీ'ర్, చాలా

[3] అంటే అతడు చేసే వృథా ఖర్చును ఎవ్వరూ చూడటం లేదని భావిస్తున్నాడా? అల్లాహ్ (సు.తా.) అంతా చూస్తున్నాడు.

10. మరియు అతనికి (మంచీ - చెడూ) అనే స్పష్టమైన రెండు మార్గాలను చూపాము[4].

11. కాని అతడు కష్టతరమైన ఊర్ధ్వ గమనానికి సాహసించలేదు![5]

12. మరియు ఆ ఊర్ధ్వగమనం అంటే ఏమిటో నీకు తెలుసా?

13. అది ఒకని మెడను (బానిసత్వం నుండి) విడిపించడం[6].

14. లేదా! (స్వయంగా) ఆకలి గొని[7] ఉన్న రోజు కూడా (ఇతరులకు) అన్నం పెట్టడం.

15. సమీప అనాథునికి గానీ;

16. లేక, దిక్కులేని నిరుపేదకు గానీ![8]

17. మరియు విశ్వసించి, సహనాన్ని బోధించేవారిలో! మరియు కరుణను ఒకరికొకరు బోధించుకునే వారిలో చేరిపోవడం.

18. ఇలాంటి వారే కుడిపక్షం వారు[9].

---

[4] చూడండి, 76:3 అన్-నజ్ దు: అంటే ఎత్తైన స్థలం. అన్-నజ్ దైన్: అంటే రెండు మార్గాలు.

[5] అల్-'అఖబహ్: కొండ శిఖరం (పైకి ఎక్కడం) కొందరు దీనికి కనుమ అనే అర్థం ఇచ్చారు. అంటే రెండు కొండల నడిమి త్రోవ, సందు. కఠినమైన కనుమ అంటే ఒక బానిసను బంధం నుండి విముక్తి చేయించడం, లేక తాను ఆకలితో ఉండి కూడా ఒక అనాథకి అన్నం పెట్టడం.

[6] చూడండి, 2:177.

[7] మస్'గతున్: ఆకలి.

[8] జా-'మత్ రబతున్: మట్టిపై పడి ఉండే పేదవాడు. ఎవడికైతే ఇల్లు ఉండదో!

[9] అతడు విశ్వాసి అయి ఉంటేనే, చేసిన పుణ్యాల ఫలితం దొరుకుతుంది లేకపోతే పరలోకంలో అవి వృథా అయిపోతాయి.

19. ఇక మా సందేశాలను తిరస్కరించిన వారు, ఎడమ పక్షానికి చెందినవారు.
20. వారిని నరకాగ్ని చుట్టుకుంటుంది[10].

[10] ము'అసదతన్': ము'గ్ లఖతున్, అంటే చుట్టుకుంటుంది. చూడండి, 104:6-8.

# 91. అష్-షమ్స్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. సూర్యుని మరియు దాని ఎండ సాక్షిగా![1]
2. దాని వెనుక వచ్చే చంద్రుని సాక్షిగా!
3. ప్రకాశించే పగటి సాక్షిగా!
4. దానిని క్రమ్ముకునే, రాత్రి సాక్షిగా!
5. ఆకాశం మరియు దానిని నిర్మించిన ఆయన (అల్లాహ్) సాక్షిగా!
6. భూమి మరియు దానిని విస్తరింపజేసిన ఆయన సాక్షిగా!
7. మానవ ఆత్మ మరియు దానిని తీర్చిదిద్దిన ఆయన సాక్షిగా![2]
8. ఆ తరువాత ఆయనే దానికి దుష్టతనాన్ని మరియు దైవభీతిని తెలియజేశాడు[3].
9. వాస్తవానికి తన ఆత్మను శుద్ధపరచుకున్నవాడే సఫలుడవుతాడు.
10. మరియు వాస్తవానికి దానిని అణగ ద్రొక్కిన వాడే

---

[*] [అష్-షమ్స్ అంటే సూర్యుడు]

[1] 'దు'హా'హా: సూర్యుని ప్రకాశవంతమైన వెలుగు.

[2] చూడండి, 87:2.

[3] ఫుజూరహ్ వతఖ్వాహ్: అంటే మంచిచెడులు, అనే అర్థం కూడా వస్తుంది. చూడండి, ఇబ్నె-కసీ'ర్.

విఫలుడవుతాడు[4].

11. సమూద్ జాతి తలబిరుసుతనంతో (ప్రవక్తను) అసత్యవాదుడవని తిరస్కరించింది[5];

12. తమలోని పరమ దుష్టుడు (ఆ దుష్కార్యం చేయటానికి) లేచినప్పుడు;

13. అల్లాహ్ సందేశహరుడు (సాలిహ్) వారితో: "ఈ ఆడ ఒంటె అల్లాహ్ కు చెందింది. కాబట్టి దీనిని (నీళ్ళు) త్రాగనివ్వండి!" అని అన్నాడు.

14. అయినా వారు అతని (సాలిహ్) మాటను అబద్ధమని తిరస్కరించారు. మరియు దాని (ఆ ఒంటె) వెనక మోకాలి నరాన్ని కోసి, కుంటిదాన్ని చేసి చంపారు[6]. కాబట్టి వారి ప్రభువు వారి పాపానికి పర్యవసానంగా వారి మీద మహావిపత్తును పంపి వారందరినీ నాశనం చేశాడు.

15. మరియు ఆయన (అల్లాహ్) దాని పర్యవసానాన్ని గురించి భయపడలేదు![7]

---

[4] దస్స: దాచి పెట్టడం, అణగద్రొక్కటం ఎవడైతే తన ఆత్మను అణగద్రొక్కాడో!

[5] 'తు'గ్ యానన్: తలబిరుసుతనం. తలబిరుసుతనంలో వారు తమ ప్రవక్త అబద్ధీకుడని తిరస్కరించారు. స'మూద్ జాతి వారి గాథ కోసం చూడండి, 7:73-79.

[6] దీని తాత్పర్యం ఏమిటంటే ఒక సమాజంలో ఏ ఒక్కడూ గానీ, లేక కొందరు గానీ దుష్టపనులు చేస్తున్నప్పుడు ఇతరులు వారిని ఆపకుండా, దానిని సమ్మతిస్తే, ఆ సమాజం వారంతా దోషులే. వారందరూ శిక్షార్హులే! కాబట్టి వారందరూ నాశనం చేయబడ్డారు.

[7] ఏదైనా ఇతర గొప్ప శక్తి ప్రతీకారం తీసుకుంటుందేమోనన్న భయంఅల్లాహ్(సు.తా.)కులేదు.ఆయనకుసరిసమానమైన, లేక ఆయన కంటే పెద్దశక్తి అనేది ఏదీ లేదు. ఆయన మీద ఎవ్వరూ ప్రతీకారం తీర్చుకోలేరు.

# 92. అల్-లైల్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. క్రమ్ముకునే రాత్రి సాక్షిగా!
2. ప్రకాశించే పగటి సాక్షిగా!
3. మరియు, మగ మరియు ఆడ (జాతులను) సృష్టించిన ఆయన (అల్లాహ్) సాక్షిగా!
4. వాస్తవానికి, మీ ప్రయత్నాలు నానా విధాలుగా ఉన్నాయి[1];
5. కాని ఎవడైతే (దానధర్మాలు) చేస్తూ దైవభీతి కలిగి ఉంటాడో!
6. మరియు మంచిని నమ్ముతాడో![2]
7. అతనికి మేము మేలు కొరకు దానిరి సులభం చేస్తాము[3].
8. కాని ఎవడైతే పిసినారితనం చేస్తూ, నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తాడో![4]
9. మరియు మంచిని అబద్ధమని తిరస్కరిస్తాడో!

---

[*] [అల్-లైల్ అంటే రాత్రి]

[1] చూడండి, 91:8.

[2] వ్యాఖ్యాతల అభిప్రాయంలో ఈ ఆయత్ అబూబక్ర్ 'సిద్దీఖ్ (ర'ది.'అ.) ను గురించి అవతరింపజేయ బడింది. అతను ఆరు మంది బానిసలకు స్వాతంత్ర్యం ఇప్పించారు. వారు తమ ముష్రిక్ నాయకుల విపరీత బాధలకు గురి అయి ఉండిరి. (ఫత్'హ్ అల్-ఖదీర్)

[3] చూడండి, 87:8.

[4] చూడండి, 96:6-7.

10. అతనికి మేము చెడు కొరకు దారిని సులభం చేస్తాము.
11. మరియు అతడు నశించిపోయినప్పుడు, అతని ధనం అతనికి ఎలా ఉపయోగపడుతుంది?
12. నిశ్చయంగా, సన్మార్గం చూపడం మా పని!
13. మరియు నిశ్చయంగా, ఇహపరలోకాల (ఆధిపత్యం) మాకే చెందినది.
14. కాబట్టి నేను మిమ్మల్ని ప్రజ్వలించే నరకాగ్నిని గురించి హెచ్చరించాను.
15. పరమ దౌర్భాగ్యుడు తప్ప, మరెవ్వడూ అందులో కాలడు!
16. ఎవడైతే (సత్యాన్ని) తిరస్కరించి (దాని నుండి) విముఖుడవుతాడో!
17. కాని దైవభీతి గలవాడు దాని నుండి (ఆ నరకాగ్ని నుండి) దూరంగా ఉంచబడతాడు!
18. అతడే! ఎవడైతే, పవిత్రుడవటానికి తన ధనం నుండి (ఇతరులకు) ఇస్తాడో!
19. కాని అది, వారు అతనికి చేసిన ఏ ఉపకారానికి బదులుగా గాక;
20. కేవలం మహోన్నతుడైన తన ప్రభువు ప్రసన్నతను పొందటానికి మాత్రమే అయితే!
21. మరియు అలాంటి వాడే తప్పక సంతోషిస్తాడు[5].

---

[5] మరొక తాత్పర్యం: "మరియు త్వరలోనే అల్లాహ్ (సు.తా.) కూడా (అతనితో) సంతుష్టుడౌతాడు."

# 93. అద్-దుహా [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ప్రకాశవంతమైన ప్రొద్దుటి పూట (పూర్వాహ్ణం) సాక్షిగా!
2. మరియు చీకటి పడ్డ రాత్రి సాక్షిగా![1]
3. (ఓ ముహమ్మద్!) నీ ప్రభువు, నిన్ను త్యజించనూ లేదు మరియు నిన్ను ఉపేక్షించనూ లేదు
4. మరియు రాబోయేకాలం(జీవితం) నీ కొరకు మొదటికాలం(జీవితం) కంటే ఎంతో మేలైనది[2]
5. మరియు త్వరలోనే నీ ప్రభువు నీకు (నీవు కోరేది) ప్రసాదిస్తాడు. దానితో నీవు సంతోష పడతావు.
6. (ఓ ముహమ్మద్!) ఏమీ? నిన్ను అనాథునిగా[3] చూసి, ఆయన (అల్లాహ్) నీకు ఆశ్రయం కల్పించలేదా?
7. మరియు నీకు మార్గం తోచనప్పుడు, ఆయన

---

[*] అద్-దుహా అంటే తొలి ఘడియలు

[1] సజా: సకన, అంటే శాంతి నెలకొలినప్పుడు, అంటే పూర్తిగా చీకటి పడినప్పుడు. అప్పుడు నిశ్శబ్దం మరియు నెమ్మది అయి ఉంటుంది.

[2] అంటే పర లోక జీవితం, ఇహ లోక జీవితం కంటే ఉత్తమమైనది.

[3] దైవప్రవక్త ('స'అస) అనాథునిగా ఉంటే అల్లాహ్ (సు.తా.) అతనికి ఆశ్రయం కల్పించాడు. అతని తండ్రి అతని పుట్టుకకు కొన్ని మాసాల ముందు చనిపోయారు. తల్లి అతను 6 సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు చనిపోయింది.

నీకు మార్గదర్శకత్వం[4]
8. మరియు ఆయన, పేదవానిగా చూసి, నిన్ను సంపన్నుడిగా చేయలేదా?
9. కాబట్టి నీవు అనాథుల పట్ల కఠినంగా ప్రవర్తించకు;
10. మరియు యాచకుణ్ణి కసురుకోకు;
11. మరియు నీ ప్రభువు అనుగ్రహాలను బహిరంగంగా ప్రకటిస్తూ ఉండు[5].

---

[4] ము'హమ్మద్('స'అస)ను ప్రవక్తగా ఎన్నుకొని అతనికి ఖుర్ఆన్ ప్రసాదించి, మార్గదర్శకత్వం చేశాడు

[5] అంటే అల్లాహ్ (సు.తా.) చేసిన అనుగ్రహాలను, ఇతరులతో చెప్పుకో - అది అల్లాహ్ (సు.తా.)కు ఇష్టమైనది - గర్వంతో కాక నమ్రతతో!

# 94. అష్-షర్హ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. (ఓ ముహమ్మద్!) ఏమీ? మేము నీ కొరకు నీ హృదయాన్ని తెరువలేదా?[1]
2. మరియు మేము నీ భారాన్ని నీ పై నుండి దించి వేయలేదా?
3. ఏదైతే నీ వెన్నును విరుస్తూ ఉండిందో?
4. మరియు నీ పేరు ప్రతిష్ఠను పైకెత్తలేదా?[2]
5. నిశ్చయంగా, ఎల్లప్పుడు కష్టంతో పాటు సుఖం కూడా ఉంటుంది;

---

[*] [అష్-షర్హ్ అంటే తెరవడం]

[1] గడచిన సూరహ్ లో 3 కానుకలు పేర్కొనబడ్డాయి. ఈ సూరహ్ లో 3 అనుగ్రహాలు పేర్కొనబడ్డాయి. ఎదను తెరవటం - అంటే సత్యాన్ని గ్రహించటం, జ్ఞాన జ్యోతి పొందడం. చూడండి, 6:125 అంటే మార్గదర్శకత్వాన్ని అర్థం చేసుకొని గ్రహించటం. రెండు సార్లు దైవప్రవక్త ('స'అస) ఎద చీల్చబడిందని స.హదీసుల ద్వారా తెలుస్తుంది. ఒకసారి బాల్యంలో అప్పుడు అతని వయస్సు 4 సంవత్సరాలుంటుంది. అప్పుడు జిబ్రీల్ ('అ.స.) వచ్చి, అతని ఎదను చీల్చి అతని హృదయంలో నున్న షైతానుకు చోటిచ్చే భాగాన్ని తీసి పేస్తారు, ('స.ముస్లిం). రెండవసారి మేరాజ్ కు ముందు జిబ్రీల్ ('అ.స.) అతని ఎదను చీల్చి అతని హృదయాన్ని చీల్చి, బయటికి తీసి, 'జమ్'జమ్ తో దానిని కడిగి పెడ్తారు. దానిని విశ్వాసం (ఈమాన్) మరియు వివేకంతో నింపుతారు. ('స'హీ'హైన్).

[2] అంటే అల్లాహ్ (సు.తా.) పేరు వచ్చినప్పుడల్లా దైవప్రవక్త ('స'అస) పేరు వస్తుంది. ఉదా: అజా'న్ లో, నమా'జ్ లో వగైరా.

6. నిశ్చయంగా, కష్టంతో పాటు సుఖం కూడా ఉంటుంది[3].
7. కావున నీకు తీరిక లభించినప్పుడు ఆరాధనలో నిమగ్నుడవైపో!
8. మరియు నీ ప్రభువు నందే ధ్యానం నిలుపు.

[3] కష్టాల తరువాత దైవప్రవక్త ('స'అస) మరియు 'స'హాబీలు (ర'ది.'అన్హుమ్)లకు సుఖసంతోషాలు ప్రాప్తమయ్యాయి.

# 95. అత్-తీన్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. అంజూరం (అత్తిపండు) మరియు జైతూన్ సాక్షిగా!
2. సీనాయ్ (తూర్) కొండ సాక్షిగా![1]
3. ఈ శాంతి నగరం (మక్కా) సాక్షిగా![2]
4. వాస్తవంగా! మేము మానవుడిని సర్వశ్రేష్ఠమైన ఆకారంలో సృష్టించాము[3].
5. తరువాత మేము అతన్ని దిగజార్చి అధమాతి - అధమమైన స్థితికి మార్చాము.
6. కాని విశ్వసించి, సత్కార్యాలు చేసేవారు తప్ప! ఎందుకంటే అలాంటి వారికి అంతులేని ప్రతిఫలం ఉంది.
7. అయితే (ఓ మానవుడా!) దీని తరువాత కూడా

---

[*] [అత్-తీన్ అంటే అంజూరు, అత్తిపండు, కాయపండు]

[1] చూడండి, 15:23.

[2] ఈ శాంతి నగరం అంటే మక్కా ముకర్రమా చూడండి, 2:126 ఇందులో యుద్ధం చేయటం నిషేధించ బడింది. ఇందులో ప్రవేశించిన వానికి శాంతి, భద్రతలు లభిస్తాయి. కొందరి అభిప్రాయం ప్రకారం ఇది మూడు చోట్లను సూచిస్తుంది. (1) 'తూర్ పర్వతం - మూసా ('అ.స.) ను ప్రవక్తగా ఎన్నుకోబడ్డ స్థలం, (2) బైతుల్ ముఖద్దస్-'ఈసా ('అ.స.) పుట్టి ప్రవక్తగా ఎన్నుకోబడ్డ స్థలం, (3) మక్కా ముకర్రమా - ము'హమ్మద్ ('స'అస) పుట్టి ప్రవక్తగా ఎన్నుకోబడ్డ స్థలం. (ఇబ్నె-కసీ'ర్). మక్కా ప్రస్తావనకు ఇంకా చూడండి 48:24.

[3] చూడండి, 91:7, 97:2 మరియు 75:38

నీవు ఎందుకు ప్రతిఫలదినాన్ని తిరస్కరిస్తున్నావు?

8. ఏమీ? అల్లాహ్ న్యాయాధిపతులలోకెల్లా సర్వోత్తమ న్యాయాధిపతి కాడా?

# 96. అల్-అలఖ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. చదువు! నీ ప్రభువు పేరుతో, ఆయనే (సర్వాన్ని) సృష్టించాడు![1]
2. ఆయనే మానవుణ్ణి రక్తముద్దతో (జీవకణంతో) సృష్టించాడు[2].
3. చదువు! మరియు నీ ప్రభువు పరమదాత.
4. ఆయన కలం ద్వారా నేర్పాడు[3].

---

[*] [అల్-అలఖ్ అంటే రక్తపు గడ్డ, రక్తపు ముద్ద]

[1] దైవప్రవక్త జిబ్రీల్ ('అ.స.) దైవప్రవక్త ము'హమ్మద్ ('స'అస) 'హిరా గుహలో దైవారాధనలో నిమగ్నమై ఉన్నప్పుడు వచ్చి అన్నారు: "చదువు!" అతను అన్నారు : "నాకు చదువురాదు!" అప్పుడు జిబ్రీల్ ('అ.స.) అతనిని గట్టిగా పట్టుకుని గట్టిగా అదిమి అన్నారు: "చదువు!"దైవప్రవక్త ('స'అస) తిరిగి అదే జవాబిచ్చారు. ఈ విధంగా అతను దైవప్రవక్త ('స'అస) ను మూడుసార్లు అదిమారు. వివరాలకు చూడండి, బద'అల్-వ'హీ, 'స'హీ'హ్ బు'ఖారీ, ముస్లిం, తిర్మిజీ', నసాయి'. ఆ తరువాత ఈ మొదటి ఐదు ఆయతులు చదివి వినిపించారు.

[2] అల్-'అలఖతు: అంటే The Clot of Blood, Leech like substance, రక్తముద్ద, షిలగ, జలగ, పిండం, జీవకణం అనే అర్థాలున్నాయి.

[3] ఖలమున్: కలం, అంటే చెక్కటం. మొదట కలమును చెక్కి తయారు చేసేవారు. మానవుని జ్ఞానంలో ఉంది - అతని వెంట వెళ్ళి పోతుంది. నోటితో పలికింది కూడా - దాచి పెట్టటానికి పనికి రాదు. కాని కలంతో వ్రాసి పెట్టింది చెడిపోకుండా భద్రంగా ఉంచితే చాలాకాలం వరకు ఉంటుంది. కలం వల్లనే ప్రాచీన జ్ఞానం భద్రపరచబడింది. కావున అల్లాహ్ (సు.తా.) మొట్టమొదట కలాన్ని సృష్టించి, దానితో పునరుత్థానదినం వరకు సర్వసృష్టి యొక్క విధిని వ్రాయించాడు.

5. మానవుడు ఎరుగని జ్ఞానాన్ని అతనికి బోధించాడు.
6. అలా కాదు! వాస్తవానికి, మానవుడు తలబిరుసుతనంతో ప్రవర్తిస్తాడు.
7. ఎందుకంటే, అతడు తనను తాను నిరపేక్షాపరుడిగా భావిస్తాడు.
8. నిశ్చయంగా నీ ప్రభువు వైపునకే (అందరికీ) మరలి పోవలసి ఉంది.
9. నీవు నిరోధించే వ్యక్తిని చూశావా?[4]
10. నమాజ్ చేసే (అల్లాహ్) దాసుణ్ణి?[5]
11. ఒకవేళ అతను (ముహమ్మద్!) సన్మార్గంపై ఉంటే నీ అభిప్రాయమేమిటి?
12. ఇంకా, దైవభీతిని గురించి ఆదేశిస్తూ ఉంటే?[6]
13. ఒకవేళ (ఆ నిరోధించే)[7] వాడు సత్యాన్ని తిరస్కరించేవాడు మరియు సన్మార్గం నుండి విముఖుడయ్యేవాడైతే?
14. వాస్తవానికి, అల్లాహ్ అంతా చూస్తున్నాడని అతనికి తెలియదా?
15. అలా కాదు! ఒకవేళ అతడు మానుకోకపోతే,

---

[4] ఈ నిరోధించే వ్యక్తి అబూ-జహల్ అని చాలా మంది వ్యాఖ్యాతల అభిప్రాయం.
[5] దాసుడు - ఇక్కడ దైవప్రవక్త ('స'అస).
[6] తఖ్వా: దైవభీతి, భయభక్తి, ఖుర్ఆన్ అవతరణలో ఇక్కడ మొదటి సారి వచ్చింది. ఏకదైవత్వాన్ని దృఢంగా విశ్వసించటం, భక్తిని, ఆరాధనను కేవలం అల్లాహ్ (సు.తా.) కొరకే ప్రత్యేకించుకోవటం మరియు సత్కార్యాలు చేయటం.
[7] ఈ నిరోధించే వ్యక్తి అబూ-జహల్ అని చాలా మంది వ్యాఖ్యాతల అభిప్రాయం.

మేము అతడిని, నుదుటి జుట్టు వెంట్రుకలను పట్టి ఈడుస్తాము[8].

16. అది అబద్ధాలలో, అపరాధాలలో మునిగివున్న నుదురు!

17. అయితే, అతన్ని తన అనుచరులను పిలుచుకోమను!

18. మేము కూడా నరక దూతలను పిలుస్తాము!

19. అలా కాదు! నీవు అతని మాట వినకు మరియు ఆయనే (అల్లాహ్ కే) సాష్టాంగం (సజ్దా) చెయ్యి మరియు ఆయన (అల్లాహ్) సాన్నిధ్యాన్ని పొందటానికి ప్రయత్నించు!

---

[8] చూడండి, 11:56.

# 97. అల్-ఖద్ర్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. నిశ్చయంగా, మేము దీనిని (ఈ ఖుర్ఆన్ ను) ఘనతగల ఆ రాత్రి (అల్ ఖదర్)లో[1] అవతరింపజేశాము[2].
2. మరియు ఆ ఘనత గల రాత్రి అంటే ఏమిటో నీకేం తెలుసు?
3. ఆ ఘనత గల రాత్రి వేయి నెలల కంటే శ్రేష్ఠమైనది[3].
4. ఆ రాత్రిలో దేవదూతలు మరియు ఆత్మ (జిబ్రీల్)[4], తమ ప్రభువు అనుమతితో, ప్రతి

---

[*] [అల్-ఖద్ర్ అంటే విధివ్రాత]

[1] ఈ రాత్రి 'రమదాన్ నెలలోని చివరి 10 రోజులలో బేసి రాత్రులలో ఒకటని, చాలా 'హదీస్'లు ఉన్నాయి. ఈ రాత్రిలో పూర్తి సంవత్సరపు తీర్మానాలు తీసుకోబడతాయి. ఈ రాత్రిలో చాలామంది దైవదూత ('అలైహిమ్) లు దిగుతారు. చూడండి, 2:185.

[2] ఏడవ ఆకాశం పైన ఉండే లౌ'హె మ'హ్ ఫూ"జ్ నుండి మొదటి ఆకాశంలోఉండే బైతుల్ 'ఇ'జ్జహ్ లో దివ్యఖుర్ఆన్ ఖద్ర్ రాత్రిలో అవతరింపజేయబడింది. (ఇబ్నె-కసీ'ర్).

[3] ఈ రాత్రిలో చేసే ఆరాధనల విలువ, వేయి నెలల కంటే ఎక్కువ అంటే 83 సంపత్సరాల మరియు 4 నెలలు.

[4] అర్-రూ'హు: ఖుర్ఆన్ అవతరణా క్రమంలో ఇక్కడ మొదటి సారి వచ్చింది. చూడండి, 19:17 మరియు 78:38 అర్-రూ'హు ఈ మూడుచోట్లలో జిబ్రీల్ ('అ.స.) కొరకు వాడబడింది. ఇంకా చూడండి, 19:17 వ్యాఖ్యానం 1.

వ్యవహారానికి సంబంధించిన) ఆజ్ఞలు తీసుకుని దిగి వస్తారు.

5. ఆ రాత్రిలో తెల్లవారే వరకు శాంతి వర్ధిల్లుతుంది.

# 98. అల్-బయ్యినహ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఎంతవరకైతే స్పష్టమైన నిదర్శనం రాదో! అంత వరకు సత్యతిరస్కారులైన పూర్వగ్రంథ ప్రజలు మరియు బహుదైవారాధకులు (తమ సత్యతిరస్కారాన్ని) మానుకునేవారు కారు![1]

2. అల్లాహ్ తరఫు నుండి వచ్చిన సందేశహరుడు[2], వారికి పవిత్ర గ్రంథ పుటలను వినిపిస్తున్నాడు[3].

3. అందులో సమంజసమైన వ్రాతలు (సత్యోపదేశాలు) ఉన్నాయి[4].

4. మరియు స్పష్టమైన సూచన వచ్చిన తర్వాతనే గ్రంథ ప్రజలు భేదాభిప్రాయలలో పడ్డారు[5].

5. మరియు వారికిచ్చిన ఆదేశం: "వారు అల్లాహ్ నే

---

[*] [అల్-బయ్యినహ్ అంటే స్పష్టమైన నిదర్శనము]

[1] అంటే అల్లాహ్ (సు.తా.) తరఫు నుండి ఒక సందేశహరుడు వచ్చి సరయిన, సమంజసమైన విషయాలు వ్రాయబడిన పరిశుద్ధ పుటలు చదివి విన్పించనంత వరకు వారు మానుకోరు.

[2] ము'హమ్మద్ ('స'అస).

[3] ఖుర్ఆన్.

[4] ధర్మశాసనాలు.

[5] దైవప్రవక్త ('స'అస) రానున్నాడని వారి గ్రంథాలలో వ్రాయబడి ఉంది. ఆ ప్రవక్త ('స'అస) అరబ్బులలో వచ్చాడని గ్రంథప్రజలు అసూయ పడి అతనిని తిరస్కరించారు. చూడండి, 3:19.

ఆరాధించాలని, పూర్తి ఏకాగ్ర చిత్తంతో[6] తమ ధర్మాన్ని (భక్తిని) కేవలం ఆయన కొరకే ప్రత్యేకించుకోవాలని, నమాజ్ ను స్థాపించాలని మరియు జకాత్ ఇవ్వాలని. ఇదే సరైన ధర్మము."

**6.** నిశ్చయంగా, సత్యతిరస్కారులైన గ్రంథప్రజలు మరియు బహుదైవారాధకులు నరకాగ్ని లోకి పోతారు. వారందులో శాశ్వతంగా ఉంటారు. ఇలాంటి వారే,సృష్టిలో అత్యంత నికృష్ట జీవులు[7].

**7.** నిశ్చయంగా, విశ్వసించి సత్కార్యాలు చేసేవారు, వారే సృష్టిలో అత్యంత ఉత్కృష్ట జీవులు.

**8.** వారికి తమ ప్రభువు నుండి లభించే ప్రతిఫలం శాశ్వతమైన స్వర్గవనాలు. వాటిలో క్రింద సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి. వారు, వాటిలో శాశ్వతంగా కలకాలముంటారు. అల్లాహ్ వారితో ప్రసన్నుడవుతాడు[8] మరియు వారు ఆయనతో సంతుష్టులవుతారు. ఇదే తన ప్రభువుకు భయపడే వ్యక్తికి లభించే ప్రతిఫలం.

---

[6] 'హనీఫన్: వాలు, వంగు, మొగ్గు, ఒక వైపునకు మొగ్గటం ఏకాగ్రచిత్తం, ఏకదైవ సిద్ధాంతం. అంటే షిర్క్ నుండి తౌ'హీద్ కు, బహుదైవారాధన నుండి ఏకదైవారాధన వైపునకు మరలటం. ఉదా: ఇబ్రాహీమ్ ('అ.స.) చేసినట్లు ఏకదైవారాధన మరియు సత్యధర్మాన్ని అనుసరించటం.

[7] ఇది అల్లాహ్ (సు.తా.) ప్రవక్త ('అలైహిమ్ స.)లను మరియు ఆయన గ్రంథాలను తిరస్కరించే వారి గతి. వారు అతి అధమమైన జీవులుగా పేర్కొనబడ్డారు.

[8] చూడండి, 9:72.

# 99. అజ్-జల్'జలహ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. భూమి తన అతి తీవ్రమైన (అంతిమ) భూకంపంతో కంపింపజేయబడినప్పుడు![1]
2. మరియు భూమి తన భారాన్నంతా తీసి బయట పడ వేసినప్పుడు![2]
3. మరియు మానవుడు: "దీనికి ఏమయింది?" అని అన్నప్పుడు.
4. ఆ రోజు అది తన సమాచారాలను వివరిస్తుంది[3].
5. ఎందుకంటే, నీ ప్రభువు దానిని ఆదేశించి ఉంటాడు.
6. ఆ రోజు ప్రజలు తమ తమ కర్మలు చూపించబడటానికి వేర్వేరు గుంపులలో వెళ్తారు.
7. అప్పుడు, ప్రతివాడు తాను, రవ్వంత (పరమాణువంత) మంచిని చేసి ఉన్నా, దానిని

---

[*] [అజ్-జల్'జలహ్ అంటే భూకంపము]

[1] ఇది మొదటి సారి బాకా ఊదబడినప్పుడు సంభవిస్తుంది.

[2] ఇది రెండవసారి బాకా ఊదబడినప్పుడు జరుగుతుంది. ఆ రోజు భూమి తనలో పాతబడిన వారినంతా బయట వేస్తుంది. వారంతా సజీవులై లేచి బయటికి వస్తారు.

[3] దాని సమాచారాలు ఇలా ఉంటాయి, దైవప్రవక్త ('స'అస) అన్నారు: "ప్రతివ్యక్తి భూమిపై చేసిన కర్మ లన్నింటికీ, అది సాక్ష్యమిస్తుంది: 'ఈ ఈ వ్యక్తి ఈ ఈ కర్మలు, ఈ ఈ రోజులలో చేసాడని, తెలుపుతుంది.' " (తిర్మి'జీ, ముస్నద్ అ'హ్మద్-2/374).

చూసుకుంటాడు[4].

**8.** మరియు అలాగే, ప్రతివాడు తాను రవ్వంత (పరమాణువంత) చెడును చేసి ఉన్నా, దానిని చూసుకుంటాడు.

---

[4] జ'ర్రతున్: దీనికి వేర్వేరు వ్యాఖ్యానాలు ఇవ్వబడ్డాయి. 1) చీమకంటే చిన్న వస్తువు - షౌకాని. 2) మానవుడు భూమిపై చెయ్యికొట్టి పైకిలేపిన తరువాత దానికి అంటుకునే దుమ్ము. 3) ఒక రంధ్రం నుండి వచ్చే సూర్యకిరణాలలో తేలియాడుతూ కనిపించే ధూళి. 4) పరమాణువు.

# 100. అల్-ఆదియాత్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. వగర్చుతూ పరిగెత్తే గుర్రాల సాక్షిగా![1]
2. తమ ఖురాల తట్టులతో అగ్ని కణాలు లేపేవాటి[2];
3. తెల్లవారుఝామున దాడి చేసేవాటి[3];
4. (మేఘాల వంటి) దుమ్ము లేపుతూ[4];
5. (శత్రువుల) సమూహంలో దూరిపోయే వాటి.
6. నిశ్చయంగా, మానవుడు తన ప్రభువు పట్ల ఎంతో కృతఘ్నుడు[5].
7. మరియు నిశ్చయంగా, దీనికి స్వయంగా అతడే సాక్షి.
8. మరియు నిశ్చయంగా, అతడు సిరిసంపదల వ్యామోహంలో పూర్తిగా మునిగి ఉన్నాడు.
9. ఏమిటి? అతనికి తెలియదా? గోరీలలో ఉన్నదంతా పెళ్ళగించి బయటికి తీయబడినప్పుడు[6]

---

[*] [అల్-ఆదియాత్ అంటే దాడి చేసే గుర్రాలు]

[1] 'దబ్'హన్: వగర్చుతూ.

[2] అల్-మూరియాతు: అగ్నికణాలు లేపే! ఖద్'హున్: ఖురాల తట్టులు.

[3] అల్-ము'గీరాతు: దాడి చేసేవాటి.

[4] అసా'ర: లేపుట, నఖ్'వున్: దుమ్ము.

[5] కనూదున్: అంటే కఫూరున్, కృతఘ్నుడు.

[6] అంటే గోరీలలో ఉన్న శవాలను సజీవులుగా చేసి లేపి సమావేశపరచబడినప్పుడు.

10. మరియు (మానవుల) హృదయాలలోని విషయాలన్నీ వెల్లడి చేయబడినప్పుడు;
11. నిశ్చయంగా, ఆ రోజున వారి ప్రభువు వారిని గురించి అంతా తెలుసుకొని ఉంటాడని!

# 101. అల్-ఖారిఅహ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఆ! అదరగొట్టే మహా ఉపద్రవం![1]
2. ఏమిటా అదరగొట్టే మహా ఉపద్రవం?
3. మరియు ఆ అదరగొట్టే మహా ఉపద్రవం, అంటే ఏమిటో నీకేం తెలుసు?
4. ఆ రోజు మానవులు చెల్లాచెదురైన చిమ్మెటల వలే అయిపోతారు[2].
5. మరియు పర్వతాలు రంగు రంగుల ఏకిన దూది వలే అయి పోతాయి[3].
6. అప్పుడు ఎవడి త్రాసుపళ్ళాలు (సత్కార్యాలతో) బరువుగా ఉంటాయో![4]
7. అతడు (స్వర్గంలో) సుఖవంతమైన జీవితం గడుపుతాడు.

---

[*] [అల్-ఖారిఅహ్ అంటే మహా ఉపద్రవము]

[1] అల్-'ఖారిఅతు: అంటే హృదయాలను అదరగొట్టేది, పునరుత్థాన దినపు పేర్లలో ఒకటి. చూడండి, 14:48, 20:105-107. దాని ఇతర పేర్లు (1) అల్-'హా'ఖ్ఖతు, (2) అత్తామ్మతు, (3) అస్సా'ఖ్ఖతు, (4) అల్-'గాషియతు, (5) అస్సా'అతు (6) అల్-వాఖి'అతు; (7) అల్-ఖారి'అతు.

[2] అల్-ఫరాషు: Moath, Lepidoptira రాత్రులలో తిరిగే చిన్న పురుగు, చిమ్మెట, దీపపు పురుగు.

[3] అల్-'ఇహ్ నున్: రంగురంగుల అల్-మన్ ఫూష్: ఏకిన దూది.

[4] చూడండి, 7:8, 18:105, 21:47 సత్కార్యాల త్రాసు పళ్ళెం బరువైనదిగా ఉంటుంది.

8. మరియు ఎవడి (సత్కార్యాల) త్రాసు పళ్ళాలు తేలికగా ఉంటాయో![5]
9. అతని నివాసం అధః పాతాళమే[6].
10. మరియు అది ఏమిటో నీకేం తెలుసు?
11. అదొక భగభగమండే అగ్ని (గుండం)[7].

---

[5] ఎవరి సత్కార్యాల పళ్ళెం తేలికగా మరియు పాపాల పళ్ళెం బరువుగా ఉంటుందో!.

[6] అల్-హావియహ్: నరకపు ఒక పేరు. ఉమ్మున్: తల్లి, శరణమిచ్చేది.

[7] 'హామియతున్: 'నరకాగ్ని. మానవులు రగిల్చే అగ్ని కంటే నరకాగ్ని డెబ్భై రెట్లు అధికంగా మండుతూ ఉంటుంది, ('స. బు'ఖారీ, 'స. ముస్లిం).

# 102. అత్-తకాథుర్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. (ఇహలోక) పేరాస మిమ్మల్ని ఏమరుపాటులో పడవేసింది[1];
2. మీరు గోరీలలోకి చేరే వరకు[2].
3. అలా కాదు! త్వరలోనే మీరు తెలుసు కుంటారు.
4. మరొకసారి (వినండి)! వాస్తవంగా, మీరు అతి త్వరలోనే తెలుసుకుంటారు[3].
5. ఎంత మాత్రము కాదు! ఒకవేళ మీరు నిశ్చిత జ్ఞానంతో తెలుసుకొని ఉంటే (మీ వైఖరి ఇలా ఉండేది కాదు).
6. నిశ్చయంగా, మీరు భగభగ మండే నరకాగ్నిని చూడగలరు!
7. మళ్ళీ అంటున్నాను! మీరు తప్పక దానిని (నరకాగ్నిని) నిస్సంకోచమైన దృష్టితో చూడగలరు!
8. అప్పుడు, ఆ రోజు మీరు (ఈ జీవితంలో

---

[*] [అత్-తకాథర్ అంటే హద్దుమీరి ప్రోగుచేయు]

[1] అల్ హా (యుల్ హీ): ఏమరుపాటులో వేసింది. తకాసు'రున్: ఎక్కువ పొందాలనే పేరాస అంటే ధనధాన్యాల కొరకు, పిల్లల కొరకు, బలం, ప్రభుత్వం, పేరు ప్రతిష్టల కొరకు చేసే పేరాస.

[2] ఆ పేరాస కోసం ప్రయత్నిస్తూనే మీరు గోరీలలోకి చేరి పోతారు.

[3] ఈ పేరాస మంచిది కాదని.

అనుభవించిన) సౌఖ్యాలను గురించి తప్పక ప్రశ్నించబడతారు![4]

[4] అప్పుడు అల్లాహ్ (సు.తా.) అనుగ్రహాలను ధనసంపత్తులను మంచి కొరకు ఉపయోగించిన వారు స్వర్గవాసులవుతారు. వాటిని దుష్ప్రయోజనాలకు వినియోగించిన వారు నరకాగ్ని పాలవుతారు.

# 103. అల్-అస్ర్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. కాలం సాక్షిగా![1]
2. నిశ్చయంగా మానవుడు నష్టంలో ఉన్నాడు![2]
3. కాని విశ్వసించి, సత్కార్యాలు చేసేవారు మరియు ఒకరికొకరు సత్యాన్ని బోధించుకునే వారు మరియు ఒకరికొకరు సహనాన్ని (స్థైర్యాన్ని) బోధించుకునే వారు తప్ప![3]

---

[*] [అస్-అస్ర్ అంటే కాలము]

[1] అల్లాహ్ (సు.తా.) తాను కోరిన దాని సాక్ష్యం తీసుకుంటాడు. కాని మానవుడు అల్లాహ్ (సు.తా.) తప్ప మరెవ్వరి సాక్ష్యం తీసుకోరాదు.

[2] ఆ మానవుడు ఎవడైతే విశ్వసించడో మరియు సత్కార్యాలు చేయడో తన కాలాన్ని వృథా కాలక్షేపంలో, నిషేధించిన పనులు చేయటంలో పేరాసతో గడుపుతాడో! అలాంటి వాడు పరలోకంలో నరకాగ్నికి ఇంధనం అవుతాడు.

[3] ఇలాంటి నష్టం నుండి తప్పించుకోగలవారు ఎవరంటే: ఒకే ఒక్క ఆరాధ్యుడైన అల్లాహ్ (సు.తా.)ను విశ్వసించి సత్కార్యాలు చేసేవారుమరియుఅల్లాహ్ (సు.తా.) ఆదేశాలనుపాటించేవారు, అల్లాహ్ (సు.తా.) నిషేధించిన వాటి నుండి దూరంగా ఉండేవారు, కష్టకాలంలో సహనం వహించి, సత్య ధర్మ ప్రచారం చేస్తూ ఉండేవారు.

# 104. అల్-హుమజహ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. అపనిందలు మోపే, చాడీలు చెప్పే ప్రతి ఒక్కడికీ వినాశం తప్పదు[1].
2. ఎవడైతే ధనాన్ని కూడబెట్టి, మాటి మాటికి దాన్ని లెక్కబెడుతూ ఉంటాడో![2]
3. తన ధనం, తనను శాశ్వతంగా ఉంచుతుందని అతడు భావిస్తున్నాడు![3]
4. ఎంత మాత్రం కాదు! అతడు (రాబోయే జీవితంలో) తప్పకుండా అణగ ద్రొక్కబడే నరకాగ్నిలో వేయబడతాడు[4].
5. ఆ (అణగద్రొక్కబడే) నరకాగ్ని అంటే ఏమిటో నీకు

---

[*] [అల్-హుమజహ్ అంటే అపనిందలు మోపేవాడు]

[1] హుమ'జహ్ మరియు లుమ'హజ్: కొందరి అభిప్రాయంలో ఒకే అర్థం గలవి. మరి కొందరు వాటి మధ్య భేదం చూపుతారు. హుమ'జహ్ - అంటే ముఖం మీద అపనిందలు చేసేవారు. లుమ'జహ్ - అంటే వీపు వెనుక చాడీలు చెప్పేవారు. మరికొందరు హుమ'జహ్ - అంటే కండ్ల సైగలతో, చేతి సైగలతో దూషించటం మరియు లుమ'జహ్ - అంటే నోటి మాటలతో దూషించటం, అని అంటారు.

[2] అంటే 'జకాతు మరియు 'సదఖాత్ ఇవ్వకుండా ఉంటాడో!

[3] అ'ఖ్ లదహ్: అంటే అది అతనిని మరణించకుండా చేస్తుందని భావిస్తాడు.

[4] అల్-'హు'తమతు: నరకాగ్ని పేర్లలో ఒకటి. చూడండి, 15:43-44. ముక్కలు ముక్కలుగా చేసేది.

తెలుసా?[5]

6. అల్లాహ్, తీవ్రంగా ప్రజ్వలింపజేసిన అగ్ని;
7. అది గుండెల దాకా చేరుకుంటుంది.
8. నిశ్చయంగా, అది వారి మీద క్రమ్ముకొంటుంది[6].
9. పొడుగాటి (అగ్ని) స్థంభాల వలే!

---

[5] ఆ అగ్ని ఎంతో భయంకరమైనది. దాని తీవ్రతను బట్టి మీ బుద్ధి అర్థం చేసుకోజాలదు.

[6] ముఅ"సదతున్: క్రమ్ముకొను. ఆ నరకపు ద్వారాలు మూయబడి ఉంటాయి. ఎవ్వరూ దాని నుండి బయట పడలేరు.

# 105. అల్-ఫీల్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఏమీ? ఏనుగువారి (సైన్యంతో) నీ ప్రభువు ఎలా వ్యవహరించాడో నీకు తెలియదా?
2. ఏమీ? ఆయన వారి కుట్రను భంగం చేయలేదా?[1]
3. మరియు ఆయన వారిపైకి పక్షుల గుంపులను పంపాడు;
4. అవి (ఆ పక్షులు) వారి మీద మట్టితో చేసి కాల్చిన కంకర రాళ్ళను (సిజ్జీల్) విసురుతూ పోయాయి[2];
5. ఆ విధంగా ఆయన వారిని (పశువులు) తిని వేసిన పొట్టుగా మార్చి వేశాడు.

---

[*] [అల్-ఫీల్ అంటే ఏనుగు]

[1] అంటే కాబాను పడగొట్టాలనే వారి కుట్రను భంగం చేయలేదా? అని.

[2] చూడండి, 11:82.

# 106. ఖురైష్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. (అల్లాహ్ రక్షణ మరియు ఆయన కరుణతో) ఖురైషులు (ప్రయాణాలకు) అలవాటు పడ్డారు.
2. (అల్లాహ్ కరుణ మరియు ఆయన రక్షణతో) వారు శీతాకాలపు మరియు వేసవి కాలపు ప్రయాణాలు చేయ గలుగుతున్నారు[1].
3. కావున వారు ఆ ఆలయ (కఅబహ్) ప్రభువు (అల్లాహ్)ను మాత్రమే ఆరాధించాలి![2]
4. వారు ఆకలితో ఉన్నప్పుడు ఆయనే వారికి ఆహారమిచ్చాడు మరియు ఆయనే వారిని భయం (ప్రమాదం) నుండి కాపాడాడు[3].

---

[*] [ఖురైష్ అంటే ఖురైష్ తెగకు చెందిన ప్రజలు]

[1] ఈలాఫున్: ఖురైషుల ముఖ్య వృత్తి వ్యాపారం, వారు సీతాకాలంలో యమన్ కు మరియు వేసవి కాలంలో సిరియాకు వ్యాపారానికి పోయేవారు. వారు కా'బా నిర్వాహకులు కావటం వల్ల వారి వాణిజ్య బృందాలు ఎలాంటి ఆటంకం, అపాయం లేకుండా ప్రయాణం చేయగలిగేవి.

[2] చూడండి, 2:125. అంటే ఒకే ఒక్క ఆరాధ్యుడు అయిన అల్లాహ్ (సు.తా.) వారిని సురక్షితంగా వ్యాపారం చేయనిచ్చినందుకు వారు ఆయనను మాత్రమే ఆరాధించాలి. బహుదైవారాధనను త్యజించాలి.

[3] వారిని ప్రమాదం నుండి కాపాడేవాడు మరియు వారిని పోషించేవాడు కేవలం అల్లాహ్ (సు.తా.) మాత్రమే కానీ - వారు పూజించే నిస్సహాయులైన - విగ్రహాలు గానీ, ఇతర కల్పిత దైవాలుగానీ కావు. గనుక వారు వాటి ఆరాధనను మానుకోవాలి. ఇంకా చూడండి, 2:126.

# 107. అల్-మాఊన్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. తీర్పుదినాన్ని తిరస్కరించే వ్యక్తిని నీవు చూశావా?[1]
2. అతడే అనాథులను కసరి కొట్టేవాడు[2];
3. మరియు పేదవాళ్ళకు అన్నం పెట్టమని ప్రోత్సహించనివాడు.
4. కావున నమాజ్ చేసే, (ఇటువంటి) వారికి వినాశం తప్పదు![3]
5. ఎవరైతే తమ నమాజ్ ల పట్ల అశ్రద్ధ వహిస్తారో![4]
6. ఎవరైతే ప్రదర్శనాబుద్ధితో వ్యవహరిస్తారో (నమాజ్

---

[*] [అల్-మాఊన్ అంటే రోజువారీ అవసరాలు]

[1] ఈ ఆయతు దైవప్రవక్త ('స'అస)ను సంభోదిస్తోంది. దీన్-అంటే పునరుత్థాన (తీర్పు) దినం. చూ, 109:6

[2] ఎందుకంటే అతడు పిసినారి, తీర్పుదినాన్ని విశ్వసించని వాడు మరియు ఇహలోకంలో చేసిన పుణ్యాలకు పరలోకంలో లభించే ప్రతిఫలాన్ని విశ్వసించని వాడు.

[3] అనాథులను కసిరి కొట్టేవారికి, ఆకలిగొన్న పేదలకు అన్నం పెట్టని వారికి, నమా'జ్ చేయని వారికి 'వైల్' అనే నరకమే నివాస స్థల మవుతుంది. ఎందుకంటే వారు కపట విశ్వాసులు, హృదయ పూర్వకంగా కాక ఇతరులకు చూపటానికే నమా'జ్ చేసేవారు.

[4] ఇలాంటి వారు అసలు నమా'జ్ చేయరు. ఒకవేళ చేసినా అశ్రద్ధతో చేస్తారు, నిర్ణీత సమయంలో చేయరు. భయభక్తులతో నమా'జ్ చేయరు. చూడండి, 4:142.

సలుపుతారో)![5]

7. మరియు (ప్రజలకు) సామాన్య ఉపకారం (సహాయం) కూడా నిరాకరిస్తారో![6]

---

[5] అంటే ఇతరులతో ఉన్నప్పుడు వారి మెప్పు పొందటానికి నమా'జ్ చేస్తారు. ఏకాంతంలో ఉంటే నమా'జ్ ను వదలి పెడతారు.

[6] మ'అనున్: అంటే కొద్దిపాటి సామాన్య చిన్న చిన్న సహాయాలు. ఇంట్లో వాడే వస్తువులను ఒకరి కొకరు ఇచ్చుకోవటం. చిన్న చిన్న సహాయాలు చేసుకోవటం.

# 108. అల్-కౌథర్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. (ఓ ముహమ్మద్!) నిశ్చయంగా, మేము నీకు కౌసర్ ప్రసాదించాము[1].
2. కనుక నీవు నీ ప్రభువు కొరకే నమాజ్ చెయ్యి మరియు బలి (ఖుర్బానీ) కూడా (ఆయన కొరకే) ఇవ్వు![2]
3. నిశ్చయంగా నీ శత్రువు, వాడే! పేరు తెగిన వాడిగా (వారసుడూ, పేరూ లేకుండా) అయిపోతాడు[3].

---

[*] [అల్-కౌథర్ అంటే సమృద్ధి]

[1] కౌస'రున్: అంటే అధికం. ఇబ్నె-కసీ'ర్ ఇక్కడ: 'ఖైరున్ కసీ'రున్ - అత్యధికమైన మేలు - అనే అర్థానికి ప్రాధాన్యత నిచ్చారు. 'స'హీ'హ్ 'హదీస్'లో - కౌస'ర్ - అనేది స్వర్గంలో దైవప్రవక్తకు ప్రసాదించబడే ఒక సెలయేరు, అని చెప్పబడింది. మరి కొందరు అదొక సరోవరం అన్నారు. 'ఖైరున్ కసీ'రున్ అనే పదం వీటన్నింటినీ సూచిస్తుందని ఇబ్నె-కసీ'ర్ అంటారు.

[2] నమాజ్ మరియు బలి (ఖుర్బానీ) ఆ ఒకేఒక్క ఆరాధ్యుడు అల్లాహ్ (సు.తా.) కొరకే చేయాలి. న'హ్ర్ - అంటే ఒంటె మెడలో కత్తి పొడిచి దాని రక్తనాళం కోయటం. వేరే పశువులను భూమి మీద పడవేసి వాటి మెడ రక్తనాళాలను కోస్తారు. దీనిని - జిబ్'హ్ - అంటారు. ఇక్కడ న'హ్ర్, బలి (ఖుర్బానీ) అంటే 'హజ్జ్ లేక 'ఈద్-అ'ద్హుహా సందర్భంగా లేక 'సదఖ - దానం - కొరకు చేసే జి'బ్ హ్'లు కూడా.

[3] అబ్'తరు: అంటే వారసుడు లేకుండా పేరు ప్రతిష్ఠలు లేకుండా అయిపోవటం. అతన వెంటనే అతని వంశం అంతమవటం లేక అతని పేరు తీసుకొనేవాడు ఎవ్వడూ లేకపోటం. దైవప్రవక్త ('స'అల) కు మగ సంతానం బ్రతికి లేనందున అతని ('స'అస) విరోధులు అతనిని ('స'అసను) అబ్'తర్ అని ఎత్తి పొడిచే వారు. అప్పుడు అల్లాహ్ (సు.తా.) ఈ ఆయత్ అవతరింపజేశాడు మరియు ఇది నిజమని నిరూపించాడు

# 109. అల్-కాఫిరూన్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఇలా అను: "ఓ సత్యతిరస్కారులారా!
2. మీరు ఆరాధిస్తున్న వాటిని నేను ఆరాధించను;
3. మరియు నేను ఆరాధిస్తున్న ఆయనను (అల్లాహ్ ను) మీరు ఆరాధించేవారు కారు.
4. మరియు మీరు ఆరాధిస్తున్న వాటిని నేను ఆరాధించేవాణ్ణి కాను;
5. మరియు నేను ఆరాధిస్తున్న ఆయనను మీరు ఆరాధించేవారు కారు.
6. మీ ధర్మం మీకూ మరియు నా ధర్మం నాకు!"[1]

---

[*] [అల్-కాఫిరూన్ అంటే అవిశ్వాసులు]

[1] మీరు మీ ధర్మాన్ని వదలటానికి సిద్ధంగా లేనప్పుడు! నేను నా సత్యధర్మాన్ని ఎందుకు వదలాలి? చూడండి, 28:55.

# 110. అస్-నస్ర్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. (ఓ ముహమ్మద్!) ఎప్పుడైతే అల్లాహ్ సహాయం వస్తుందో మరియు విజయం (లభిస్తుందో)!
2. మరియు నీవు ప్రజలను గుంపులు గుంపులుగా అల్లాహ్ధర్మం(ఇస్లాం)లోప్రవేశించడంచూస్తావో![1]
3. అప్పుడు నీవు నీ ప్రభువు స్తోత్రంతో పాటు ఆయన పవిత్రతను కొనియాడు మరియు ఆయన క్షమాభిక్షను అర్థించు. నిశ్చయంగా, ఆయనే పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడు[2].

---

[*] [అన్-నస్ర్ అంటే సహాయం]

[1] చూడండి, 3:19.

[2] అంటే నీ ధర్మ ప్రచారం ముగిసే సమయం వచ్చిందనుకో! కాబట్టి నీవు నీ ప్రభువు పవిత్రతను కొనియాడటంలో మరియు ఆయన స్తోత్రం చేయటంలో మునిగి ఉండు. ప్రతివాడు తన జీవితపు చివరి దినాలలో, వృద్ధాప్యంలో వీలైనంత వరకు ప్రభువు ధ్యానంలో మునిగి ఉండటం ఉత్తమమని, దీని సందేశం.

# 111. అల్-మసద్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. అబూ లహబ్ రెండు చేతులూ నశించుగాక మరియు అతడు కూడా నశించి పోవు గాక![1]
2. అతడి ధనం మరియు అతడి సంపాదన (సంతానం) అతడికి ఏ మాత్రం పనికి రావు!
3. అతడు ప్రజ్వలించే నరకాగ్నిలో కాల్చబడతాడు!
4. మరియు అతడి భార్య కూడా! కట్టెలు మోసే (చాడీలు చెప్పి కలహాలు రేకెత్తించే) స్త్రీ![2]
5. ఆమె మెడలో బాగా పేనిని ఖర్జూరపునార త్రాడు (మసద్) ఉంటుంది[3].

---

[*] [అల్-మసద్ అంటే త్రాడు, దీని మరో పేరు అల్-లహబ్]

[1] చూడండి, 15:23.

[2] ఆమె దైవప్రవక్త ('స'అస) బాటలో ముండ్లు వేసేది. అతనికి విరుద్ధంగా చాడీలు చెప్పేది. చూ15:23

[3] జీదున్: మెడ మసదున్: బాగా పేనిన గట్టి త్రాడు.

# 112. అల్-ఇఖ్లాస్ [*]

అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

1. ఇలా అను: "ఆయనే అల్లాహ్! ఏకైకుడు[1].
2. అల్లాహ్! ఎవరి అక్కరా లేని వాడు[2].
3. ఆయనకు సంతానం లేదు (బిడ్డలను కనడు) మరియు ఆయన కూడా ఎవరి సంతానమూ (ఎవరికీ జన్మించిన వాడునూ) కాడు.
4. మరియు (సర్వలోకాలలో) ఆయనతో పోల్చదగినది ఏదీ లేదు."

---

[*] [అల్-ఇఖ్లాస్ అంటే ఏకత్వము]

[1] అ'హదున్: The One and Alone, ఏకైకుడు.

[2] అ'స్సమదు: Absolute, Eternal, Besought of All, to Whom obedience is rendered. Without whom no affair is accomplished సమస్త వ్యవహారాలు తన మీదనే ఆధారపడి ఉన్నవాడు, నిత్యుడు, శాశ్వితుడు, నిరంతరుడు. అందరూ ఆయనపై ఆధారపడి ఉన్నారు. ఆయనకు ఎవ్వరి అక్కర లేదు. ఆయన నిరుపేక్షాపరుడు. ఇది అల్లాహ్ (సు.తా.) అత్యుత్తమ పేర్లలో ఒకటి.

# 113. అల్-ఫలఖ్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఇలా అను: "నేను ఉదయ కాలపు ప్రభువు అయిన (అల్లాహ్) శరణు వేడుకుంటున్నాను.
2. ఆయన సృష్టించిన ప్రతిదాని కీడు నుండి[1];
3. మరియు చిమ్మచీకటి కీడు నుండి, ఎప్పుడైతే అది క్రమ్ముకుంటుందో![2]
4. మరియు ముడుల మీద మంత్రించి ఊదే వారి కీడు నుండి[3];
5. మరియు అసూయపరుడి కీడు నుండి, ఎప్పుడైతే అతడు అసూయపడతాడో!"[4]

---

[*] [అల్ ఫలఖ్ అంటే ప్రాతఃకాలము]

[1] ఇక్కడ ప్రతి రకపు కీడు నుండి శరణు కోరబడుతోంది. షైతానుల నుండి, నరకం నుండి మరియు మానవునికి హాని కలిగించే ప్రతిదాని నుండి.

[2] ఎందుకంటే చీకటిలోనే హానికరమైన జంతువులు, పాములు, తేళ్ళు బయటికి వస్తాయి. నేరస్థులు రాత్రిలోనే నేరాలు చేస్తారు. ఇక్కడ విధమైన అన్ని కీడుల నుండి శరణు కోరబడుతోంది.

[3] అన్-నఫ్ఫాసా'తి: అంటే ముడుల మీద మంత్రించి ఊదేవారి కీడు నుండి.

[4] 'హాసిదిన్: అసూయపడే వాడి కీడు నుండి కూడా శరణు కోరబడుతోంది.

# 114. అన్-నాస్ [*]

**అనంత కరుణామయుడు అపార కరుణా ప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

1. ఇలా అను: "నేను మానవుల ప్రభువు (అల్లాహ్) ను శరణుకై వేడుకుంటున్నాను![1]
2. మానవుల సార్వభౌముడు![2]
3. మానవుల ఆరాధ్యదైవం (అయిన అల్లాహ్ యొక్క శరణు)!"
4. కలతలు రేకెత్తించి తొలగిపోయేవాని కీడు నుండి;
5. ఎవడైతే మానవుల హృదయాలలో కలతలు రేకెత్తిస్తాడో![3]
6. వాడు జిన్నాతులలోని వాడూ కావచ్చు లేదా

---

[*] [అన్-నాస్ అంటే మానవులు]

[1] రబ్బున్: పర్ వర్ దిగార్ (ఉర్దూ), పోషకుడు, చాలా మట్టుకు తెలుగు అనువాదాలలో ఈ పదానికి ప్రభువు అని అనువాదం చేశారు. మానవుడు తన తల్లి గర్భంలో ఉన్నప్పటి నుండి వానిని సరిదిద్ది పోషిస్తాడు. మరియు అతని అంతిమ ఘడియ వరకు పోషిస్తాడు. కేవలం మానవుడే కాక సమస్త సృష్టికి కూడా పోషకుడు ఆయనే!

[2] ఇటువంటి పోషకుడే వారి సార్వభౌముడు.

[3] అల్-వస్ వాసు: అంటే మెల్లని ధ్వనితో మాట్లాడటం, గుసగుసలాడటం, షై'తాన్ కూడా మానవునికి తెలియకుండానే అతని హృదయంలో చెడ్డ ఆలోచనలు రేకెత్తిస్తాడు, ఇదే వస్ వస. అల్-'ఖన్నాస్: నెమ్మదిగా జారుకునే వాడు, అంటే షై'తాన్.

మానవులలోని వాడూ కావచ్చు![4]

[4] ఈ వస్ వసా - చేసేవారు రెండు రకాల వారు. ఒకరు జిన్నాతులలోని షై'తానులు. అల్లాహ్ (సు.తా.) వాటికి మానవులను, మార్గభ్రష్టత్వం వైపుకు ఆకర్షించే యుక్తిని ఇచ్చాడు. ప్రతి మానవుని వెంట ఒక షై'తాను ఉంటాడు. వాడు అతన్ని మార్గభ్రష్టత్వం వైపుకు ఆకర్షిస్తూ ఉంటాడు. ఈ మాట విని ఒక 'స'హాబీ (ర'ది.'అ.) ఇలా అడిగారు: "ఓ ప్రవక్తా, ('స'అస) ఏమీ? మీతో పాటు కూడా షై'తాన్ ఉన్నాడా?" అతను జవాబిచ్చారు: "అవును! ఉన్నాడు, కాని అల్లాహ్ (సు.తా.) నాకు వాడిపై ఆధిక్యతనిచ్చాడు అందుకని వాటు నాకు విధేయుడిగా ఉంటాడు. వాడు, నాక మేలు తప్ప మరొక విషయాన్ని ప్రోత్సహించడు." ('స'హీ'హ్ ముస్లిం) రెండవ రకమైన షై'తాన్ లు మానవులలో ఉన్నారు. వారు, తాము మంచి ఉపదేశం ఇస్తున్నామని చెబుతూ మానవులను మార్గభ్రష్టత్వం వైపుకు ఆకర్షిస్తూ ఉంటారు. షైతాన్ మానవులనే కాక జిన్నాతులను కూడా మార్గభ్రష్టత్వం వైపుకు ఆకర్షిస్తూ ఉంటాడని మరి కొందరి అభిప్రాయం.

بيان معاني القرآن الكريم باللغة التلغو



المحتوى الإسلامي
The Islamic content

جمعية الربوة
Rabwa Association